
నార్ల వెంకటేశ్వరరావు సమగ్ర సాహిత్యం

(డిసెంబర్ 1, 1908 – 16 ఫిబ్రవరి)

భాగం – 5



1. సంస్కృతి, కళలు - 27 వ్యాసాలు
2. భాష, సాహిత్యాలు – 18 వ్యాసాలు
3. శాస్త్ర విజ్ఞానం - 13 వ్యాసాలు
4. మతం -1 : సాధారణం - 15 వ్యాసాలు
5. మతం – 2: ఉపనిషత్తులు - 24 వ్యాసాలు
6. మతం -3: గీతారహస్యం - 24 వ్యాసాలు
7. సృజనాత్మక సాహిత్యం - 6 కథలు, 2 నవలికలు

విషయ సూచి

1. సంస్కృతి, కళలు

3 భాషా, సాహిత్యాలు

6 : ఉపనిషత్తులు

సంస్కృతి, కళలు

జాతీయ జీవనంలో సంస్కృతం స్థానం

(1955 నవంబరు 11వ తేదీన తిరుపతిలో సంస్కృత విశ్వపరిషత్తు జరిగింది. ఈ సభలను భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సభలో నాటి గవర్నర్ త్రివేది, ముఖ్యమంత్రి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి దేశ వ్యాప్తంగా 1500 మంది సంస్కృత పండితులు ఈ సభలో పాల్గొన్నారు. నాటి దేవాదాయ, ధర్మాదాయ శాఖామంత్రి కల్లూరి చంద్రమౌళిగారు ఆహ్వానసంఘ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఆ సభ అధ్యక్షోపన్యాసంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతదేశానికి ఒక రాజభాష ఉండాలనీ, అందుకు సంస్కృత భాష అన్ని విధాల తగినదనీ వివరించారు. దీనిపై నార్ల వారు స్పందించి ఆంధ్రప్రభ దిన పత్రిక 1955 నవంబరు 12వ తేదీలో సంపాదకీయం రాశారు. అంతటితో ఆగక, పెల్లుబికిన ఉద్వేగంతో, విశేష అవగాహనతో నవంబరు 17 మొదలుకొని 15 సంపాదకీయాలు వరుసగా రాసి తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. ఈ సంపాదకీయాలను గ్రంథ రూపంలో ప్రకటించదలచి, నార్ల వారే మొదటి రెండు సంపాదకీయాలలో పలు నవరణలు స్వయంగా చేశారు. ఈ 1+15 సంపాదకీయాలను యథాతథంగా పునర్ముద్రిస్తున్నాం.) సం.

"సంస్కృతం మృతభాష" - ఇది మా అభిప్రాయం కాదు; "నేషనల్ హెరాల్డ్" కొద్ది రోజుల క్రితం ఒక సంపాదకీయంలో వెల్లడించిన అభిప్రాయం. "హెరాల్డ్ లక్నో నుంచి వెలువడుతున్న పత్రిక; పండిట్ నెహ్రూచే ప్రారంభించబడిన పత్రిక. ఏదో ఒక అనామక పత్రిక సంస్కృతాన్ని మృతభాషగా పరిగణించడం లేదని నొక్కి చెప్పడానికి మాత్రమే "హెరాల్డ్" ఎక్కడిదో, దాన్ని ఎవరు ప్రారంభించారో - బహుశా ఇవి మా పాఠకులలో పెక్కుమందికి తెలిసిన విషయాలైనామేము ప్రత్యేకించి పేర్కొన్నాము.

"హెరాల్డ్" వలెనే సంస్కృతాన్ని మృతభాషగా భావించే పత్రికలు మరికొన్ని లేకపోలేదు; ఇదే నమ్మకం వున్న ప్రముఖులనేకులు లేకపోలేదు కూడా. అయితే, ఆదిలోనే మనవి చేసినట్టు, ఇది మా నమ్మకం మాత్రం కాదు. సంస్కృతం ఒక దృష్టి నుంచి మృతభాషే కాని, మరొక దృష్టి నుంచి అది సజీవభాష. జీవన్మరణాలు ద్వంద్వాలైనా, స్థూలదృష్టికి గోచరించే పరస్పర వైరుధ్యం వాటిలో లేదు. కనుకనే కొందరు సజీవులై వుండికూడా చచ్చిన వారితో సమానంగా వుంటారు; మరికొందరు మృతిచెంది కూడా అమరులై వెలుగుతారు. మొదటి వారు జీవచ్ఛవాలైతే, రెండవ వారు మృత్యుంజయులు. ఏమైనా, సంస్కృతాన్ని మేము మృతభాషగా భావించడానికి కారణం, గౌతమ బుద్ధుని కాలం నాటికే అది ప్రజాభాషగా ప్రచారాన్ని కోల్పోవడమే. అయినా, దాన్ని సజీవభాషగా మేము పరిగణించడం నేటికీ దేశభాషలలోకి అంతర్వాహినిగా అది నిరంతరం ప్రవహిస్తూ, వాటిని శరవేగంతో పాటు పరిపూర్ణత్వాన్ని సంతరించి పెడుతున్నందునే; మాధుర్యంతోపాటు వైవిధ్యాన్ని సమకూర్చుతున్నందునే; సౌకుమార్యంతోపాటు గాంభీర్యాన్ని ప్రసాదిస్తున్నందునే.

దేశభాషలలోకి నిరంతరాయంగా ప్రవహిస్తున్న - ప్రవహించవలసిన - అంతర్వాహినిగా సంస్కృతాన్ని మనం గౌరవించాలి; పూజించాలి. ఈ దృష్టి నుంచి దాన్ని మాత్రమే కాక, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మనకు సంబంధం వున్న అన్ని భాషలను - అవి ప్రాచీనమైనవైనా, ఆధునికమైనవైనా - మనం ఆదరించాలి; గౌరవించాలి. ఏరులు, వాగులు ఎన్నెన్నో చేరనిదే జీవనది ఏర్పడనట్టు, ఎన్నెన్నో ప్రభావాలకు లోనుగానిది

జీవద్భాష కాలేదు. ఒక చిన్న తెగకు, అనాగరికమైన తెగకు, కొద్దిపాటి దీవులకు పరిమితమైన తెగకు - చెందిన ఆంగ్లో-శాక్షన్ భాష నేడు ఖండ ఖండాంతరాలకు వ్యాపించి, ప్రపంచ భాషగా చెల్లుతున్నదంటే, అందుకు కారణం, - అది ప్రపంచ భాష లన్నింటి నుంచి పదజాలాన్ని స్వీకరించి, దాన్ని తన సొంతం చేసుకొన్నది కనుకనే. ప్రాచీన భాషలైన హీబ్రూ, గ్రీక్, లాటిన్ల నుంచే కాకుండా, సమకాలికమైన యూరోపియన్ భాషలు ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్, శ్పానిష్ మొదలైన వాటి నుంచే కాకుండా, భారతీయ భాషల నుంచి కూడా అది ఎన్నెన్నో పదాలను స్వీకరించింది. “ఆత్మ”, “కర్మ”, “బ్రహ్మన్", "పండిట్”, “జగన్నాథ రథం” - ఇలాంటి పదాలను పెక్కింటిని అది సంస్కృతం నుంచి పరిగ్రహించింది.

ఈ వాక్యాన్ని పూర్తి చేస్తూనే, “కర్మ" అనే పదం “కన్ సైజ్ ఆక్సఫర్డ్ డిక్షనరీ” లోకి ఎక్కిందో, లేదో చూద్దామని, దాని పుటలను మేము తిరగవేశాము. “3” అక్షరం కింద మొదటి మాటగా మా కంటబడినట్టిది దక్షిణాఫ్రికా నుంచి ఈ నిఘంటువులో కెక్కిన “భామా” అనే పదం. (దీని అర్థం "హృదయ స్పందన"). మూడవ మాట హీబ్రూకు చెందిన “కాడీష్" (అప్పుని కోల్పోయిన యూదీయుని రోదనం). ఐదవ మాట “కాఫీర్", అరబ్ పదంగా దీని అర్థం మనకు తెలుసు. దక్షిణాఫ్రికాకు చెందిన బంటూ జాతిలో ఒక తెగవారిని కూడా “కాఫిర్” అంటారట. ఆరవమాట “కాగో”, జపానులో వాడే ఒక రకం పల్లకీకి ఇది పేరు. జాపనీస్ పదంగా దీని రూపం “కాంగో". అసలిది చైనాకు చెందిన పద మట. ఎనిమిదవ మాట "కైజర్” (చక్రవర్తి). అసలిది “సీజర్” రూపంలో లాటిన్ పదం. పిమ్మట ఆ ఒక్క పేజీలోనే (648) అరబ్, పర్వన్, మలే, జర్మన్, జాపనీస్, డచ్, ఫ్రెంచి భాషలకు చెందిన ఇతర మాటలతో పాటు సంస్కృతం నుంచి స్వీకరించబడిన “కల్పం”, “కర్మ" వున్నాయి. ఈ విధంగా మొత్తం నిఘంటువును తిరగవేస్తే, అచ్చమైన “ఆంగ్లో-శాట్రన్” పదాలు శతాంశమైనా వుండవేమో!

ఇంత స్వేచ్ఛగా, ఇంత విస్తృతంగా అన్ని భాషల నుంచి తనకు అవసరమైన పదజాలాన్ని స్వీకరించింది కాబట్టే (మేము ఇంతకుముందు కూడా మనవి చేసినట్టు), ఇంగ్లీషు ఈనాడు ప్రపంచ భాషగా చెల్లుతున్నది. ఈ విధంగా పరభాషల నుంచి మాటలను కలుపుకొనకపోతే, కొత్త జ్ఞానాన్ని సంపాదించడానికి కాని, కొత్త భావాలను ప్రకటించడానికి కాని వీలే వుండదు. పెద్ద పెద్ద విషయాల జోలికిపోక, ఒక చిన్న సంగతినే చూడండి. మన "పందికొక్కు" బ్రిటీష్ దీవులలో కనపడదు. ఈ పరిస్థితిలో ఇండియాలో చాలా పెద్ద ఎలుక - పందివలె బలిసివుండే ఎలుక - వుంటుందని చెప్పడానికి “పిగ్-లైక్ ర్యాట్” అనే ఒక కృత్రిమ సమాసాన్ని సృష్టించుకొనడం మంచిదా? లేక, “పందికొక్కు" అనే మాటను సొంతం చేసుకొనడం మంచిదా? రెండవదే ఉత్తమమైన మార్గం కాబట్టి, “తెలుగులో నుంచి” అని తమ నిఘంటువులలో నమోదు చేసి, “పంది కొక్కు” మాటను "బ్యాండీకూట్” రూపంలో ఇంగ్లీషు వారు సొంతం చేసుకున్నారు.

జ్ఞానావధుల పెరుగుదలకు అనుగుణంగా భాషావధులు పెరుగుతూ వుండాలనీ, లేకపోతే భాష పెంపొందబోదు సరిగదా, జాతికి వికాసం వుండదనీ మనవి చేయడం కోసమే ఇంగ్లీషు ప్రసక్తిని ఇంతగా తీసుకువచ్చాము గాని, దానిపై ప్రత్యేక భక్తిశ్రద్ధ లుండడంవల్ల కాదు; లేదా, సంస్కృత భాష పట్ల విచక్షణా రహితమైన భక్తి గౌరవాలున్నవారు ఈ సరికే బహుశా తీర్మానించుకొన్నట్టు “ఆంగ్ల మానసపుత్రుల” మైనందువల్లనూ కాదు. మన దేశ భాషలకు పరిపుష్టి నివ్వడానికేమి, వాటి గౌరవ ప్రతిపత్తులను పెంచడానికేమి వాటిలోకి నిరంతరాయంగా ప్రవహించవలసిన అంతర్వాహినులలో సంస్కృతం ప్రధానమైనదనడంలో మా కెట్టి సందేహం లేదు. భారత రాజ్యాంగం సైతం దేశభాషలను పరిపుష్టం చేయడం కోసం నూతన పదజాలాన్ని సృష్టి చేసుకునే సందర్భంలో

సంస్కృతానికే ప్రాధాన్య మివ్వాలని స్పష్టంగా నిర్దేశించింది. ఐతే, సంస్కృతంపై ప్రేమాభిమానాల కొద్దీ, అన్యభాషలను - ముఖ్యంగా ప్రతి విదేశ భాషనుఅంటరానిదిగా, ముట్టరానిదిగా చూచే చిత్తవృత్తిని మాత్రం మేము హర్షించలేము.

సంకుచితమైన - అసహనంతో కూడిన ఈ చిత్తవృత్తి వల్ల దేశభాషల వికాసమే కాక, జాతీయ పురోభివృద్ధి సయితం కుంటుపడగలదు. ఈ చిత్తవృత్తి మరీ ప్రబలితే, వేదకాలం తర్వాత మానవ విజ్ఞానం లవలేశంగానైనా విస్తరించలేదన్న ఛాందసం వెర్రితలలు వేసే ప్రమాదం వున్నది. సంస్కృతాన్ని నిర్బంధ పఠనీయభాషగా చేయాలని, దాన్నే హిందీ స్థానంలో జాతీయభాషగా చేయడం సర్వోత్తమం కాగలదని, సంస్కృతం పైన దేశభాషలన్నీ - ఇంతేకాదు, ప్రపంచ భాషలన్నీ కూడా - దిగదుడుపుకైనా పనికిరావనీ వాదించేవారిలో మేము పేర్కొన్న ఛాందసం వ్రేళ్ళు తన్నడం ప్రారంభించినట్టే తీర్మానించుకోవచ్చు.

దేశ భాషలలోకి చిరకాలంగా ప్రవేశిస్తున్న - చిరకాలం దనుక ప్రవేశించవలసినఅంతర్వాహినులలో ప్రథమ గణ్యమైనదిగా, విశిష్టమైనదిగా సంస్కృతాన్ని అన్ని విధాల ప్రోత్సహించడం స్వతంత్ర భారతవర్షపు పరమ ధర్మం. ఇందుకోసం తిరుపతిలో ప్రస్తుతం చతుర్థ సమావేశాన్ని జరుపుకొంటున్న సంస్కృత విశ్వపరిషత్తును పోలిన సంస్థలు శాఖోపశాఖలతో దేశమంతటిలోకి విస్తరించాలి. సంస్కృత భాషను గురించి, దానిలోని గ్రంథాలను గురించి పరిశోధనలు జరపడానికి పూనాలోని భండార్కర్ ప్రాచీన విద్యా పరిషత్తు, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య భాషా పరిషత్తు, శాంతినికేతనంలోని విద్యాభవన్ మొదలైనవి ప్రభుత్వాల నుంచే కాక, ప్రజల నుంచి పూర్తి సహాయాన్ని పొందాలి. ప్రతి విశ్వకళాపరిషత్తులోను సంస్కృత భాషకు ఒక పీఠం నెలకొనాలి. సంస్కృత భాషాభ్యసనం చేయగోరే విద్యార్థులకు ప్రతి కాలేజీలోను, హైస్కూలులోను సౌకర్యాలను కలిగించాలి.

సంస్కృత భాషా ప్రచారానికి -నార్ల రచనలు

కళాశాలలను ప్రతి రాష్ట్రంలోను మరికొన్నింటిని నెలకొల్పాలి. ఈ విధంగా సంస్కృత భాషా పోషణకు వీలైనన్ని సదుపాయాలను కల్పించాలే తప్ప, దాన్ని తిరిగి ఒక ప్రజాభాషగా, లేదా, మరింత ఆశకు పోయి, జాతీయభాషగా రూపొందించడానికి ప్రయత్నిస్తే, అది కాలచక్రాన్ని వెనుకకు త్రిప్పడానికి యత్నించడమే కాగలదు. క్రీస్తు శకానికి ఐదారు వందల సంవత్సరాలకు పూర్వమే ప్రజాభాషగా సంస్కృతం తన స్థానాన్ని కోల్పోయింది. అంతకు పూర్వమైనా ప్రజాసామాన్యంలో దాని ప్రచారమెంతో స్పష్టంగా ఎవ్వరికీ తెలియదు. ఇదివరలో ఒక సంపాదకీయంలో మేము మనవి చేసినట్టు, గౌతమబుద్ధుడు యుగధర్మాన్ని పాటించి, భాస, భవభూతి, కాళిదాసాది మహాకవులు కళాధర్మాన్ని పాటించి, ప్రజలతో సంబంధం వున్న విషయాలలో సంస్కృతాన్ని విడిచి పెట్టి, పాళీని, లేదా ప్రాకృతాన్ని శరణం చేసుకున్నారు. ప్రజాభాషగా సంస్కృతం వినియోగానికి రెండున్నర వేల సంవత్సరాల నాడు విరమించబడిన కృషిని ఈనాడు మనం ప్రారంభించి, దానిలో కృతకృత్యులం కాగలమని ఆశించడం నిష్ఫలమైన సాహసమే కాగలదు! (ఆంధ్రప్రభ 12-1-1955)

ఇవి కేవలం పర్యాయపదాలైనట్టు, ఇటీవల కొందరు వీటిని వాడుతున్నారు. ఒకే ధాతువు నుంచి పుట్టిన కారణాన, వీటికి కొంత ధ్వని సామ్యం కలదనుకోండి. అంతమాత్రం చేత ఇవి సమానార్థకాలు కాగలవా? ఆహారం, విహారం, ప్రహారం, సంహారం, పరిహారం : వీటికి ధాతు వొక్కటే. వీటి మధ్య ధ్వని సామ్యం సైతం కొంతవరకు లేకపోలేదు. అందుచేత వీటిని పర్యాయాలుగా ప్రయోగిస్తాననే వ్యక్తిని మూర్ఛుని కింద జమకట్టి, లోకం నవ్వదా?

కాని, చిత్రమేమంటే, సంస్కృతమే సంస్కృతి అయినట్టు కొందరు వాదిస్తున్నారు. సంస్కృత భాషా ప్రచారమే సంస్కృతి పునరుద్ధరణ కాగలదని ఉద్ఘాటిస్తున్నారు. మరింత ముందుకు వెళ్ళి, సంస్కృతాన్ని యావద్భారతానికి అధికార భాషగా, అనుసంధాన భాషగా నిర్ణయించాలని ప్రచారం చేస్తున్నారు. గత శతాబ్ది ప్రారంభంలోనే రాజా రామమోహన రాయ్ ఖండించిన ఈ ప్రచారం ఈనాటికైనా నిలిచిపోకపోవడం మన సంస్కృతి దౌర్భాగ్యం : అంతకు మించి, మన దేశం ఏదో ఒక భాషపై ప్రత్యేకాభిమానం వుండడంలో తప్పు లేదు. అది మృతప్రాయమైవుంటే, దాని పునరుద్ధరణకు దీక్ష వహించడంలోనూ తప్పు లేదు. కాని, ఆ భాషపై మనకున్న ప్రేమ గౌరవాల కొద్దీ, సంస్కృతికి అదే విధానమని చెప్పడం తగదు. భాషా ప్రభావం సంస్కృతిపై విశేషంగానే పడుతుంది. కాని, అంతమాత్రం చేత భాషే సంస్కృతి కాదు. భాషకే కాక, భౌగోళిక, వాతావరణ పరిస్థితులకు సైతం సంస్కృతి స్వరూప స్వభావాల నిర్ణయంలో ఎన్నదగు ప్రాధాన్యం వుంటుంది. ప్రాచీన గ్రీక్ చరిత్ర కొరకు హెరొడోటస్ వ్రాసినట్టు ఈజిప్టు దేశమే "నైల్ నది వరప్రసాదం". మన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఒకానొక సందర్భంలో వివరించినట్టు, అరేబియా సంస్కృతిపై అక్కడి ఎడారుల, అక్కడి ఎండమావుల ప్రభావం వలె, ఇండియా సంస్కృతిపై ఇక్కడి హిమాలయాల, ఇక్కడి మహానదుల ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. హిమాలయాలలో (మన పౌరాణికులు ఊహాకల్పన చేసిన) మన కైలాసం వున్నది. కైలాసనాథుడు హిమవంతునికి సాక్షాత్తు జామాత. దేవ, గంధర్వ, యక్ష, సిద్ధ, సాధ్య, కిన్నర, కింపురుష, విద్యాధరాంగనలకు హిమాలయ ప్రాంతమే క్రీడాస్థలం. అక్కడనే అలకాపురి వున్నది. ఆ కుబేరపురిలో వియోగ భిన్నుడైవున్న తన జీవితేశ్వరికే ప్రవాసభారంతో క్రుంగి కుమిలిపోతున్న యక్షుడు రామగిరి నుంచి "మేఘ సందేశం" పంపించాడు. సింధు, గంగా, యమునలకు జన్మస్థానం హిమాలయాలే. హరప్ప, మొహెంజొదారోలు, ఇంద్రప్రస్థ, పాటలీపుత్రలు, వారణాసి ప్రయాగలు, ఢిల్లీ, ఆగ్రాలు - ఆ నదీ తీరాలలోనో, వాటి లోయలలోనో విలసిల్లిన మన జాతీయ సంస్కృతీ కేంద్రాలు. తక్కిన మన నదులకైనా మన జాతీయ . సంస్కృతి చరిత్రలో ఇంతకంటే తక్కువ స్థానం లేదు. బౌద్ధ శిల్ప కళ మహోన్నత శిఖరాల నందుకొన్నది కృష్ణానదీ పరిసరాలలో. ఆంధ్ర మహాభారత రచనకు "శ్రీకారం" చుట్టబడింది గోదావరి గట్టున; "ఓం తత్సత్" వ్రాయబడింది పెన్నా నది ఒడ్డున. విజయనగర సామ్రాజ్య సంస్థాపన జరిగింది తుంగభద్రతీరాన. తమిళనాడుగుండానే కాక, తమిళ జీవితాలగుండా కూడా కావేరీ తామ్రపర్ణిలు ప్రవహిస్తున్నాయి. హిమాలయాలు మన దేశాన్ని తక్కిన ఆసియా ఖండం నుంచి వేరు చేస్తున్నట్టే, వింధ్యాచలాలు తక్కిన దేశం నుంచి దక్షిణాపథాన్ని విడగొడుతున్నాయి. ఈ నైసర్గిక ప్రతిబంధకాలకు అతీతమైన జాతీయ సంస్కృతిని ఏ విధంగా రూపొందించుకొనడ మనేదే ప్రాచీనకాలం నుంచీ మనల నెదుర్కొంటున్న పెద్ద సవాలు.

మన మనః ప్రవృత్తిపై మన సంస్కృతిపై మన దేశం శీతోష్ణస్థితుల ప్రభావమైనా సామాన్యమైంది కాదు. మనది ఉష్ణోగ్రత గల దేశం కాబట్టే, చంద్రుడు మనకు ముద్దుల మామ; చందనం, పన్నీరు మనకు ప్రీతిపాత్రమైన వస్తువులు. ఛత్ర చామరాలు మనకు రాజలాంఛనాలు. ఈ కారణానే మనకు "చల్లని చూపు", "చల్లని చెయ్యి", "చల్లని ప్రభువు" "నీ కడుపు చల్లగా వుండ" మొదలైన పలుకుబడులేర్పడినాయి. "పరుగెత్తి పాలు త్రాగడం కంటే నిలుచుండి నీళ్ళు త్రాగడం మేలు" అనే సామెత మనకున్నదే ఈ కారణానే. ఇట్టి లోకోక్తి మనకున్న తర్వాత "మందయాన", "గజగమన" మన భాషలో ఉత్తమజాతి స్త్రీకి పర్యాయ పదాలు కావడం అబ్బురమా? అధికోష్ణమే మనలను కొంత వరకు ఆలసులను ఉపేక్షాపరులను చేస్తున్నది : అదే మనలను శాంతస్వభావులను, సహనశీలురను చేస్తున్నది.

ఇన్ని విధాల,ఇంతగా, భౌగోళిక, వాతావరణ పరిస్థితుల ప్రభావం మన సంస్కృతిపై పడుతున్నందున, ఆ పరిస్థితులనే సంస్కృతిగా మనం పరిగణించగలమా? అయినప్పుడు భాషాప్రభావానికి సంస్కృతి కొంతవరకు లోనౌతుంది కాబట్టి భాషకు, సంస్కృతికి భేదమే లేదనడం తగునా? భాషనే సంస్కృతిగా పేర్కొనడం భాషను గురించి, సంస్కృతిని గురించి మన కేమీ తెలియదని చాటుకొనడమే! ఒకరి భాష మరొకరికి పట్టుపడినట్టు, ఒకరి సంస్కృతి మరొకరికి సంక్రమించదు. బ్రిటిష్ వారు దాదాపు రెండు శతాబ్దాలపాటు మన దేశాన్ని పరిపాలించినందున ఇంగ్లీషు భాషతో మనలో పెక్కుమందికి పరిచయమేర్పడింది. కొందరికి దానిలో పాండిత్యం సయితం లభించింది. ఇంత మాత్రంచేత బ్రిటిష్ సంస్కృతి మన వారసత్వమైందా? మన భాషలలో ముఖ్యంగా మన ప్రాచీన భాషలైన సంస్కృతంలోను, పాలీలోను మహాపండితులైన సర్ విలియం జోన్స్, హెచ్.టి. కోల్ బ్రూక్, సర్ చార్లెస్ విల్కిన్స్, జేమ్స్ ప్రిన్సెస్, అలెగ్జాండర్ కన్నింగ్ హామ్, ఫ్రెడ్రిక్ షెగెల్, మోనియర్ విలియమ్స్, ఎఫ్, మాక్స్ ముల్లర్, ఎ.ఎ. మాకొనెల్, ఎ.బి. కీత్, రీస్ డేవిడ్స్, హెర్మన్ ఓల్డెన్ బర్గ్, మారిస్ వింటర్ విట్జ్, నార్మన్ బ్రౌన్, ఎ.ఎల్, బషామ్ ప్రభృతులలో మన సంస్కృతి జీర్ణించిపోయిందా? మరొక విషయం : ఒకే ఇంగ్లీషును మాతృభాషగా కలిగివున్నా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, న్యూజిలెండ్, యునైటెడ్ స్టేట్సు సంస్కృతులలో ఎన్నదగు విభేదాలులేవా? విభిన్న దేశాలలో ఇంగ్లీషు ప్రచారంలో వుండగా, మన దేశంలో విభిన్న భాషలున్నాయి, చిల్లర, మల్లర భాషలను త్రోసివేసినా, ప్రధానమైన దేశభాషలుగా మన రాజ్యాంగం గుర్తించినట్టివే (సంస్కృతం, ఉర్దూల సమేతంగా) పదునాల్గు వరకున్నాయి. వీటిలో నుంచి హిందీ జాతీయ భాషగా (అనుసంధాన భాషగా) ఎన్నుకోబడింది. కాని, బహుళ వ్యాప్తిలోకి వచ్చి, ఆ స్థానాన్ని అది ఆక్రమించుకొనడం కనీసం మరి రెండు, మూడు తరాలవరకు సాధ్యం కాకపోవచ్చు. ఏమైనా, సర్వవ్యాప్తమైన జాతీయభాష ఈనాడు మనకు లేకపోయినా, ఒకే జాతీయ సంస్కృతి ప్రస్తుతం మనకు లేదా?

సంస్కృతి అంటే భాష కాదు సరిగదా, కొందరు సూచిస్తున్నట్టు అదేదో ఆధ్యాత్మిక సంబంధమైందీ కాదు. ఇంతే అయితే, ఆధ్యాత్మిక దృష్టిలేనివారిని సంస్కృతీ విహీనులనవలసివస్తుంది. కమ్యూనిస్టులు నిరీశ్వరవాదులైనంత మాత్రాన మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ ప్రభృతులు సంస్కృతి లేనివారని చెప్పగలమా? కమ్యూనిష్టు దేశాలు సంస్కృతికి అర్హత కోల్పోయినవనగలమా? సంస్కృతిని ఆధ్యాత్మిక ప్రపంచానికి పరిమితం చేయడం భాషకు మారుగా మతానికీ, లేదా, దార్శనికానికి దాన్ని ఒక పర్యాయపదం చేయడమే కాగలదు.

భాషకు భిన్నమైనట్టే మతానికి, దార్శనికానికి సయితం సంస్కృతి భిన్నం. జీవితానికున్న విస్తృతి, దానికున్న వైవిధ్యం, దానిలో ప్రస్ఫుటమౌతూవుండే విలక్షణత్వం సంస్కృతికీ వుంటుంది. అందువల్లనే సంస్కృతిని నిర్వచించడం కష్టం. "కల్చర్" అనే ఇంగ్లీషు మాటకు సమానార్థకమైన దాన్నిగా "సంస్కృతి"ని మనం ప్రయోగిస్తున్నాము. అమరకోశంలో ఈ శబ్దం లేదు. బ్రౌణ్యంలో ఇది కనబడదు. “శబ్ద రత్నాకరం", "శబ్దార్థ చంద్రిక"లను దీనికోసం వెదకడం వృధా శ్రమ. "సూర్యరాయాంధ్ర నిఘంటువు", “వావిళ్ళ నిఘంటువు" "సంస్కృతి" వరకు ఇంకా దేకనే లేదు. తక్కిన మన చిన్న, పెద్ద నిఘంటువులలోకి సయితం "సంస్కృతి" ఎక్కలేదు, అయితే అన్నింటిలోను “సంస్కృతము" కనబడుతుంది. ఈ మాటకు "శబ్ద రత్నాకర" మిచ్చే అర్థం.

విశేష్యంగా “దేశభాష" అన్య విశేషణంగా చక్కగా జేయబడినది : చక్కజేయబడినది : అలంకరించబడినది : వ్యాకరణ శిక్షితమైనది : పక్వము చేయబడినది : శ్రేష్ఠమైనది" అని. ఈ విశేషణాలలో కొన్ని "కల్చర్"కు వర్తిస్తాయి కాబట్టే, "సంస్కృతము" నుంచి సాధించబడిన ఈ కొత్త పదం, “సంస్కృతి" త్వరలోనే సర్వజనామోదం పొంది,

బహుళ వ్యాప్తిలోకి వచ్చింది. మన తెలుగులోనే కాక హిందీ, బెంగాలీ మొదలైన ఇతర దేశ భాషలలో కూడా ఇది ప్రస్తుతం విశేష ప్రచారంలో వున్నది.

"సంస్కృతి" అనే మాట మనకు కొత్తదికాగా, ఆ అర్థంలో "కల్చర్" అనే మాటను ఇంగ్లీషు భాషలో ప్రయోగించడం కూడా ఇటీవలనే ప్రారంభమైంది. ఏ అర్థంలోనూ "కల్చర్"ను ఛాసర్ వాడలేదు; షేక్ స్పియర్ కూడా వాడలేదు; మిల్టన్ వాడలేదు; బైరన్, షెల్లీ కూడా వాడలేదు. ఎన్.బెయిలీ 1736లో ప్రచురించిన తన "ఇంగ్లీషు డిక్షనరీ"లో 'కల్చర్'కు సేద్యాన్ని ప్రధానార్థంగా పేర్కొని, ఉత్తమ వాద్యంతో మానసిక వికాసానికి, దాన్ని పర్యాయపదంగా ప్రయోగించవచ్చునని సూచించాడు. 1755లో నిఘంటువును వెలువరించిన శామ్యూల్ జాన్సన్ కూడా దాదాపు ఇంతే చేశాడు. "కల్చర్" అనే పదాన్ని వాడకపోయినా సంస్కరణాపరుని విలక్షణత్వాల విశదీకరణ, విఖ్యాత వ్యాసకర్తలైన ఎడిసన్, స్టీలే రచనలలో కానవస్తుంది. పద్దెనిమిదవ శతాబ్ది ఉత్తరార్థంలో "వ్యవసాయం మానసిక వికాసం" ఉభయార్థాలలో అక్కడక్కడ చెదురుగా ప్రయోగించాడు. విశేష్యంగా కాక, విశేషణంగా వర్డ్స్‌వర్త్ దాన్ని ప్రయోగించాడు. సంస్కృతి అనే ప్రస్తుతార్థాన్ని "కల్చర్"ను కల్పించిన వారిలో అగ్రగణ్యులైనవారు, అమెరికన్ రచయితలలో ఆర్.డబ్ల్యు. ఎమర్సన్, బ్రిటీషు రచయిత మాత్యూ ఆర్నాల్డ్ ముఖ్యులు. వీరుభయులు గత శతాబ్దానికి చెందినవారే.

ప్రస్తుతం విశేష ప్రచారంలోగల "ఆక్స్ఫర్డ్ డిక్షనరీ" వివరణ ప్రకారం "కల్చర్"కు ఆదిలో గల అర్థం "టిల్లేజ్ " (సేద్యం) అని మాత్రమే. తర్వాత తర్వాత భూమి సేద్యానికే కాక, చేపలు, తేనెటీగలు మొదలైన వాటిని పెంచడానికి కూడా అది ప్రయుక్తమౌతూ వచ్చింది. అటు పిమ్మట పరిశోధనాగారాలలో సూక్ష్మక్రిముల పరిపోషణకు సయితం దాన్నే వాడుతూవచ్చారు. పోతే, "మానసిక వికాసం" అంటూ ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ"లో "కల్చర్"కు పేర్కొంటున్న చిట్టచివరి అర్థం ఇంతకు ముందు నేను వివరించినట్టు మొట్టమొదటసారిగా 1786లో బెయిలీ పేర్కొన్నట్టిది. ఫ్రెంచి ఎకాడమీ వారు తమ నిఘంటువులో "కల్చర్" అనే పదాన్ని లలిత కళల పట్ల, మానసిక వికాసం పట్ల, ఆసక్తి అనే వివరణతో 1762లో ఓంప్రథమంగా ప్రవేశపెట్టారు. ఇంచుమించు మూడు దశాబ్దాల తర్వాత (1798)లో జర్మన్ భాషా పండితుడు అదెలూంగ్ తన సుప్రసిద్ధ నిఘంటువు రెండవ ముద్రణలో "కల్చర్" అనే దాని జర్మన్ రూపంలో "కల్చర్"ను నమోదు చేశారు. ఆయన నిర్ణయం ప్రకారం మనసుతో పాటు శరీరానికి స్వచ్ఛతను, శోభను సమకూర్చేదే సంస్కృతి. దుష్ట ప్రభావం నుంచి, దురాచారం నుంచి మనసును సంస్కరించి వ్యక్తిత్వంతోపాటు అతడికి విజ్ఞానదీప్తిని కూర్చేదే సంస్కృతి. ఈ కార్యక్రమంలో మనసుతో బాటు శరీరాన్ని కూడా పేర్కొనడం ప్రత్యేకించి చూడదగు విశేషం. సంస్కరించినట్లు విశదం. ప్రాచీన కాలపు గ్రీలో శరీర, స్వాస్థ్య, రక్షణను దాని, సౌందర్య పోషణను నిర్లక్ష్యం చేసేవారు కాదు. దేహ దౌర్బల్యం విధిగా మానసిక దౌర్బల్యానికి దారి తీస్తుందని వారి విశ్వాసం. వంపులు తిరిగి, వయ్యారాలను కలిగిన మానవకాయంవారి దృష్టిలో ఒక విశిష్ట కళాఖండమే. ప్రాచీన కాలపు యువనుల వలె జర్మన్లు కూడా శరీరపోషణకు ప్రాధాన్య మిచ్చేవారు!

తక్కిన యూరోపియన్ భాషలలో కూడా ఆదిలో సేద్యానికి పర్యాయపదమైన "కల్చర్"కు కొంచెం వెనక ముందులుగా "సంస్కృతి" అనే నూతనార్థాన్ని కల్పించుకొనడం జరిగింది. ఈ అర్థ విస్తృతి ఎంతో సముచితం. మానవ నాగరికత చరిత్రను "ది స్టోరీ ఆఫ్ సివిలిజేషన్" అనే పేరుతో ప్రతిభావంతంగా వ్రాస్తున్న అమెరికన్ రచయిత, విల్ డూరావ్ వివరణ ప్రకారం ఆదిలో "కల్చర్" వ్యక్తమైంది "అగ్రికల్చర్" రూపంలోనే.

ఇంగ్లీషు నిఘంటువులో నిర్వచనం ప్రకారం "కల్చర్" అంటే కేవలం మానసిక వికాసమని మనం అంగీకరించక పోవచ్చు. కాని, "సంస్కృతి" అనే కొత్త పదాన్ని మనం సృష్టించుకోగా, "కల్చర్" అనే తమ పాత మాటకు ఇంగ్లీషువారు ఒక కొత్త అర్థాన్ని అనతికాలం క్రితమే కల్పించుకొన్నారన్న విషయాన్ని అంగీకరించడానికి మాత్రం ఎట్టి అభ్యంతరం వుండనక్కరలేదు.

మాట కొత్తదైనా, సంస్కృతికి మనం కొత్త కాదు; మనకు సంస్కృతీ కొత్త కాదు, సభ్యత, సంస్కారం, నాగరికత : ఈ మూడు మాటలలో దేనినో ఒక దాన్ని సంస్కృతి స్థానంలో సందర్భోచితంగా ప్రయోగించడం ఇదివరలో మనకు పరిపాటి. కాని సూక్ష్మంగా, పరిశీలిస్తే మాత్రం ఈ మూడింటిలో ఏదీ సంస్కృతి స్వరూప స్వభావాలను సరిగా వ్యక్తీకరించలేదని తెలుస్తుంది. సభ్యతవలె సంస్కృతి కేవలం సభామర్యాద కాదు: నలుగురి మధ్య నడవడిలో నాజూకుతనం, హుందాతనం మాత్రమే కాదు కూడా, సంస్కృతీపరునిలో విధిగా సభ్యత వుంటుంది. కాని సభ్యత తెలిసికూడా సంస్కృతీపరుడు కాకపోవచ్చు, సభ్యత పైపై మెరుగు కావచ్చు; అణువణువున తొణికిసలాడ వలసినట్టిది సంస్కృతి.

పోతే, సంస్కారం అనుభూతార్థ స్మృతిని (కొందరి విశ్వాసం ప్రకారం అది పూర్వజన్మ స్మృతి సయితం కావచ్చు) సూచిస్తుంది, లేదా విద్యాబుద్ధుల వల్ల కలిగివున్న మనఃపరిపాకాన్ని సూచిస్తుంది. అదైనా వ్యక్తిపరంగానే; జాతిపరంగా కాదు. సంస్కృతిలో యిమిడివుండేవి వ్యక్తిగతమైన అనుభూతులే కావు; తరతరాల, యుగయుగాల జాతీయ జీవిత ఫలితార్థ మది.

ఇక, మన నిఘంటుకారులు వివరిస్తున్నట్టు నాణ్యమైనదే నాగరికత కాదు; నగర జీవిత విధానంతోపాటు దాని వైభవ విలాసాలు కూడా నాగరికత కిందికి వస్తాయి. అయితే నాగరికతవలె సంస్కృతి కేవలం నగరాలలోనే ప్రభవించదు; వాటి సరిహద్దులకే అది ప్రధానంగా పరిమితమూ కాదు. నాగరికులలోనే కాక, ఆటవికులలో సయితం సంస్కృతి వుండవచ్చు,.

వాస్తవానికి వారిలోనే నిసర్గమైన, ఉత్తమమైన సంస్కృతి కానవస్తుందని నమ్మేవారు కొంద రున్నారు.

సంస్కృతికి, నాగరికతకు ఇట్టి విభేదాలను మరికొన్నింటిని కూడా చూపించవచ్చు. విద్య లోపిస్తే, సంపత్తి కొరవడితే నాగరికత వృద్ధి చెందలేదు. సంస్కృతికి వాటితో ఈ విధమైన అవినాభావ సంబంధం లేదు. విద్య సంస్కృతికి దోహదం కూర్చగలదనడం నిశ్చయం. ఐతే, అక్షర జ్ఞానాన్ని విద్యగా భావించరాదు; విద్యావంతుడైన ప్రతి వ్యక్తి విధిగా సంస్కృతీపరుడని భ్రమపడరాదు. ఇటీవల వరకు మొత్తం ప్రపంచంలోనే విద్యావ్యాప్తి, విజ్ఞాన ప్రచారం వాగ్రూపంలోనే విశేషంగా జరిగాయి. గౌతమ బుద్ధుడు, సోక్రటీస్, ఏసుక్రీస్తులు పుస్తకాలను రాయలేదు. వాగ్రూపంలోనే తమ ప్రబోధాన్ని వారు కొనసాగించారు. వారి తదనంతరమే వారి శిష్యప్రశిష్యులు వారు చెప్పిన విషయాలను గ్రంథస్థం చేశారు. వేదవేదాంగాలు, రామాదుణ, మహాభారతాలు, గ్రంథస్థమైంది కూడా వాటి కర్తలు వాటిని చెప్పిన వెంటనే కాదు. పెక్కు శతాబ్దాల తరువాత ఈనాడైనా ప్రపంచ ప్రజలలో దాదాపు సగం మంది నిరక్షరాస్యులే! ఈ కారణాన మానవకోటిలో అర్ధ భాగాన్ని సంస్కృతి లేనిదాన్నిగా కొట్టివేయ వచ్చునా? మిగిలిన అర్ధభాగంలో సంస్కృతి తొణికిసలాడుతున్నట్లు తీర్మానించవచ్చునా? అక్షరజ్ఞానం కానివారైనా సంస్కృతీపరులు కావచ్చును; వివిధ భాషలలో, శాస్త్రాలలో పండితులై కూడా సంస్కృతీ విహీనులు కావచ్చు. ఈ

విషయాన్ని గురించి వివరించనవసరం లేదు. అగ్బర్ విద్యాభ్యాసం అక్షరజ్ఞానాన్ని దాటి వెళ్ళలేదు; శివాజీకి సంతకం పెట్టడమైనా తెలియదు; హైదరాలీ నిశానీ పద్దు; రంజిత్ సింగ్ ఓనమాలనైనా దిద్దలేదు. అయినా, వీరిని సంస్కృతీ విహీనులనగలమా? కాగా, సంపత్తికీ సంస్కృతికీ ఎంత తక్కువ సంబంధం వుంటుందో తెలుసుకోవాలంటే, నల్లబజారులో కొల్లలుగా గడించిన ఏ కొత్త భాగ్యవంతుని చూచినా సరిపోతుంది. సభ్యత, సంస్కారం, నాగరికత ఈ మూడింటి కిందికి సంస్కృతి రాదనడం తేలికే. కాని, అదేమిటో చెప్పడం మాత్రం కష్టం. (ఆంధ్రప్రభ 17-11-1955)

2

సంస్కృతి ఏదో చెప్పడం కష్టమైనా, ఏది సంస్కృతి కాదో చెప్పడం సులభమే. అసహనం సంస్కృతి కాదు; అహంకారం సంస్కృతి కాదు; ఆత్మస్తుతి, లేదా పరనింద సంస్కృతి కాదు; ఆర్యులు కాని వారందరిని మ్లేచ్ఛులుగా పరిగణించడం సంస్కృతి కాదు; ప్రాచ్యులు కానివారందరినీ అప్రాచ్యులుగా నిరసించడం సంస్కృతి కాదు. సంస్కృత భాషలో గల సంస్కృతి ఇతర నాగరిక భాషలలో కానరాదనడమైనా సంస్కృతి కాదు. ఇట్టి అసహనం వల్ల, ఇందుకు మూలకందమైన అహంకారంవల్ల, మానవుడు యుక్తాయుక్త పరిజ్ఞానాన్ని కోల్పోతాడు; కొత్త సత్యాల నతడు కానలేడు; కొత్త విలువలను గుర్తించలేడు; కొత్త పరిస్థితుల కారణంగా ప్రభవిస్తుండే కొత్త శక్తులను అర్థం చేసుకోలేడు; అధఃపతితుడయ్యే వరకు అధికుడనని అతడు విర్రవీగుతూనే వుంటాడు; సర్వనాశనమయ్యే వరకు సర్వజ్ఞతను ఆపాదించుకుంటూనే వుంటాడు. ఈ పలుకులు వ్యక్తికే కాక, జాతికి వర్తిస్తాయి. అతి ప్రాచీనకాలంలోనే - గ్రంథస్థమైన చరిత్రకు అందని కాలంలోనే మన దేశమే కాక, మరికొన్ని కూడా నాగరికతకు నిలయాలై, సంస్కృతికి విధానాలై విలసిల్లినవి. గంగాయమునా పరిసరాలకంటే ముందుగానే టిగ్రీస్, యూఫ్రాటెజ్ లోయలు వెలుగులను జిమ్మినవి; కృష్ణ ఒడ్డును మించి ఒకప్పుడు నైల్ నదిగట్టు సిరిసంపత్తులతో తులదూగింది; బంగాళాఖాతం, అరేబియన్ సముద్ర తీరాలకు సాటిగా ఈజిప్షియన్, మెడిటరేనియన్ తీరాలు విభాసించిన సమయమూ వున్నది. కాని, నేడు ఎక్కడున్నది అక్కడియా? ఇప్పుడేది సుమేరియా? ఏమైపోయింది బాబిలోనియా? అసీరియా ఆనవాళ్లు ఎన్ని మిగిలివున్నాయి? మీడ్యా చాలు మూలాలు ఎందరు చెప్పగలరు? ఏ పాటిగా నిలిచింది ఫినీషియా? క్రీట్ ప్రాధాన్యం ఏమైపోయింది? మెంఫిస్ ప్రస్తుత రూపమేమిటి? యాథెన్స్, రోమ్ ల మాటేమిటి? ప్రపంచ పటంలో వీటి పేర్లలో కొన్ని నేటికీ కనబడుతున్నా, ఒకనాడు వీటిలో పరిఢవిల్లిన నాగరికత, పరిమళించిన సంస్కృతి పూర్తిగా మాసిపోయాయి. ఉదాహరణకు, ఫారో రాజుల కాలంనాటి ఈజిప్టు ఈనాటికీ వున్నది; అప్పటి నైల్ నది ఇప్పటికీ అదే ఒండుతో, అదే సుడిగుండాలతో ఉరకలు, పరుగులు పెడుతూనేవున్నది. కాని, నాటి నాగరికతా సంస్కృతుల ప్రవాహాలు మాత్రం ఆ నది ఉభయ తీరాలలోని ఎడారులలో యింకిపోయాయి. పురాతత్త్వ శాస్త్రజ్ఞులు గత శతాబ్దిలో రంగంలో ప్రవేశించే వరకు ఈ కాలపు ఈజిప్షియనులకు తమ పూర్వీకులు సాధించిన నాగరికతా స్వరూపమే తెలియదు; వారిలో పెంపొందిన సంస్కృతి స్వభావమే తెలియదు. పూర్వపు ఫారో రాజులు పూర్వకాలపు వేషభాషలతో వస్తువాహనాలతో, అస్త్రశస్త్రాలతో, ఛత్రచామరాలతో, అన్యరాజలాంఛనాలతో మిగిలివున్నా, వారివలె వారు పోషించిన నాగరికత "మమ్మీ"ల కింద మారిపోయింది. తమ జీవితకాలంలో రామనుభవించిన విభూతీ విఖ్యాతులకు సంకేతాలై కలకాలానికీ నిలవాలన్న దీక్షాసక్తులతో తమ సమాధులకింద వారు నిర్మించుకున్న పిరమిడ్సు పూర్వోన్నత్యంతో మిగిలివున్నా, పూర్వసంస్కృతికి కంకాళాలుగా మాత్రమే. ఆనాటి స్పింక్స్ ఈనాటికీ వున్నది; దాని సింహళాయం బలదర్పాలు తగ్గలేదు; దాని మానవశిరస్సు గాంభీర్యం తొలగలేదు.

అయితే, దాని పెదవులపై కనబడి కనబడని చిరునవ్వు అర్థమేమిటో, లీలామాత్రపు దాని మందహాసం అంతర్యమేమిటో ఈ కాలపు ఈజిప్షియనులకు తెలియకుండా పోయింది. ఒకనాటి అమోన్, రే ఒసిరిన్, సిబు, హోరన్, హ్యథార్, దౌత్ మొదలైన దేవతా విగ్రహాలు అసంఖ్యాకంగా మిగిలినా, వాటి దేవత్వమే లోపించిపోయింది. ప్రజాజీవితం నుంచి వేరైపోయి ఈజిప్టు ప్రాచీన నాగరికతా సంస్కృతులు పిరమిడ్సులో ఘనీభవించాయి, లేదా, మ్యూజియములలో నిద్రపోతున్నాయి, తరలిన విభేదాలతో ఇరాక్, ఇరాన్, సిరియా, లెబనాన్, పాలస్తీనా, బీట్, గ్రీన్, ఇటలీ, దేశాలలో సయితం సరిగా ఇంతే జరిగింది.

ఇందుకు భిన్నమైన పరిణామాన్ని మనం చూడగలిగిన ప్రాచీనదేశాలు ఇండియా, చైనాలు మాత్రమే. ఈ రెండింటి నాగరికతలే, వీటి సంస్కృతులే - మధ్య మధ్య కొంత దుర్బలపడినా - తెంపులేకుండా కొనసాగి వస్తున్నాయి. మన దేశాన్ని చూడండి, ఏనాటిదో వారణాసి, ఈనాటికీ దాన్ని పెక్కు మంది పవిత్ర క్షేత్రంగా భావిస్తున్నారు. ఎన్నటిదో బుద్ధగయ, ఇప్పటికీ అక్కడ పూజా పురస్కారాలు జరుగుతున్నాయి. ఎంత ప్రాచీనమైందో అశోకుని ధర్మచక్రం! అది నేడు నవభారత జాతీయపతాకంపై ప్రభాసిస్తున్నది. ఎన్ని శతాబ్దాలనాడు చిదంబర నటరాజస్వామికి ఒక మహాశిల్పి రూపకల్పన చేశాడో! ఆయన తాండవ నృత్యానికి ప్రకృతం కూడా మన హృదయాలుప్పొంగుతున్నాయి. క్రీస్తుశకం ప్రారంభంనాటివాడు కాడా కనిష్కుడు? ఆయన దుస్తులను పోలినవే పండిట్ జవహర్ లాల్ నెహ్రూ తన జీవితం ఉత్తరార్థంలో ధరించిన చూడేదార్, పైజామా, అచబన్లు. అమరావతి శిల్పాలు శిథిలమైపోయినా, వాటిలోని అప్సరాంగనల కంఠహారాలు భారత నారీలోకం గళసీమను అలంకరిస్తూనే వున్నాయి. అజంతా గుహాలయ చిత్రాలు వన్నెతగ్గినా, వాటిలోని అతిలోక సుందరీమణుల శిరోభూషణాలుగాని, శిరోజాలంకరణ పద్ధతులు గాని మటుమాయం కాలేదు. హరప్ప, మొహెంజొదాగోలు కాలగర్భాన కలిసిపోయినా, అప్పటి రెండెడ్లబండ్ల బొమ్మలను పోలినవాటితోనే ఇప్పటికీ మన పిల్లలు ఆడుకుంటున్నారు; ఆ బండ్లను పోలిన వాటి పైనే మన వ్యవసాయవ్యవస్థ ఆధారపడుతున్నది. అంతకంటె పూర్వకాలానికి చెందిన నిషాద జాతివారు ప్రవేశపెట్టినట్టిది ముఖాన కుంకుమబొట్టు పెట్టుకొనే ఆచారం. ఆరేడు వేల సంవత్సరాల తర్వాత కూడా దాన్ని మనం పాటిస్తూనే వున్నాము. ప్రపంచం మొత్తం మీదనే ఈ విధంగా అవిచ్ఛిన్నమై, అవిభాజ్యమై, అఖండమై జీవనదివలె ప్రవహిస్తూ వస్తున్న మరొక ప్రాచీన సంస్కృతి చైనావారిది మాత్రమే. ఇందుకు కారణమిమై వుంటుంది?

కేంబ్రిడ్జిలో తానభ్యసించినవి వైజ్ఞానిక శాస్త్రాలైనా, పండిట్ జవహర్‌లాల్ కారాగారంలో మననం చేసినట్టివి వివిధదేశ చరిత్రలే. తన ఈ నూతన విశ్వవిద్యాలయంలో ప్రపంచేతిహాసాన్ని తరచి చూచిన కొద్దీ ప్రత్యుత్తరం కోసం ఆయనను తొందర పెట్టిన ప్రశ్నయిది: నాగరికత లెన్నో తలయెత్తి నామరూపాలు లేకుండా పోయాయి: సంస్కృతులెన్నో సుశోభితమై, క్రమక్రమంగా శుష్కించి, హరించి పోయాయి. ఇండియా, చైనాలలో మాత్రమే ఇందుకు భిన్నంగా ఎందుకు జరిగింది? తక్కిన దేశాలలో కొరవడిన శక్తులేవో వీటిలో నిగూఢమై వుండకపోతే "పెరుగుట విరుగుట కొరకే" అన్న సూత్రం వీటి విషయంలో వ్యర్థమై వుంటుందా? ఆ నిగూఢ శక్తులేవో చూచాయగానైనా మనం తెలుసుకోగలమా? లేకపోతే చరిత్ర పఠనానికి ప్రయోజనమేమిటి? జాతీయ జీవనంలో గర్భితమైవున్న శక్తుల స్వరూపాన్ని స్థూలంగానైనా తెలుసుకొనలేకపోతే; మన దేశాన్ని మనం సవ్యంగా అర్థం చేసుకోగలమా? విజ్ఞతతో దానికి సేవ చేయగలమా? దక్షతతో దాని పురోభివృద్ధిని సాధించగలమా? ఈ తపన నుంచి వెలువడినట్టిదే ఆయన రచించిన "డిస్కవరీ ఆఫ్ ఇండియా". ఈ మహాగ్రంథం ద్వారా జవహర్ లాల్ సాక్షాత్కరింప జేసుకొన్న భారతదేశం సహనశీలానికి సాటిలేనట్టిది; అహంకారానికి అపరిచితమైనట్టిది;

కొత్త సత్యాలను కొసరినట్టిది; విజాతీయ ప్రభావాలను వెలివేయనట్టిది; వైరుధ్యాల మధ్య సమన్వయ సాధనకు విధివిరామం లేకుండా కృషి చేసినట్టిది; స్వస్వరూపాన్ని కోల్పోకుండా, స్వధర్మం నుంచి అతిచరించకుండా సమస్తాన్నీ తనలో అంతర్భూతం చేసికొన్నట్టిది. ఇందుకు విరుద్ధమైన సందర్భాలు కొన్ని భారతీయ చరిత్రలో లేకపోలేదు. సరిగా అట్టి తరుణాలలోనే అది నీరసించింది; అప్పుడే దాని జీవితంలో స్తబ్దత ఏర్పడింది; అప్పుడే అది పరాజయ పరాభవాలకు లోనైంది. “డిస్కవరీ ఆఫ్ ఇండియా” చివరికి మనకు చేసే హెచ్చరిక : ఎప్పుడెప్పుడు తక్కిన ప్రపంచానికి, దాని ప్రభావాలకు దూరమై కూపస్థ మండూకంవలె భారతదేశం బ్రతికిందో అప్పుడప్పుడది హీనస్థితిలో పడిపోయిందనీ; ఎప్పుడెప్పుడు తక్కిన ప్రపంచంతో సన్నిహిత సంబంధం పెట్టుకొని, కాలానుగుణమైన పరిణామాలను చెందిందో అప్పుడప్పుడది మహోన్నత శిఖరాల నందుకో గలిగిందనీ, తక్కిన ప్రపంచంతో సన్నిహిత సంబంధం పెట్టుకొనడమంటే, అంధప్రాయంగా దాన్ని అనుకరించడం కాదు; యుక్తాయుక్త విచక్షణ లేకుండా దాని ప్రభావాలన్నింటికి దాసులైపోవడమూ కాదు. ఇంతే జరిగితే, జాతి తన వ్యక్తిత్వాన్ని కోల్పోతుంది; తనదని చెప్పుకోదగు సంస్కృతికి అర్హతనే కోల్పోతుంది. కాబట్టి ప్రతి జాతి (నెహ్రూ చెప్పినట్టు) తన గతంలోకే వేళ్ళుతన్నాలి. కాని, కొమ్మలు రెమ్మలై, చిలవలు పలవలై వెలుపలికి చొచ్చుకు రాకపోతే వెలుగు ముఖాన్ని చూడకపోతే, ఎంత లోతుకు పాతుకుపోయిన వేళ్ళయినా బ్రతకలేవు. బోదెగా, కొమ్మలుగా, రెమ్మలుగా నేలపై కెదిగినప్పుడే, నింగిలోకి ప్రాకినప్పుడే వేళ్ళు చెట్టుకు బలమివ్వడమైనా; మూడుపువ్వులు ఆరుకాయలుగా అది శోభించడమైనా. లేకపోతే మట్టిలోని వేళ్ళు మట్టిలోనే చివికిపోతాయి. అయినా తిరిగి నెహ్రూ పలుకులలో) పువ్వులకు, కాయలకు మురిసిపోతూ, కొందరు వేళ్ళ సంగతి మరచిపోతారు; వేళ్ళు మిగిలితే చాలు, పిచ్చిపూలు పూసినా, కుక్కమూతి పిందెలు కాసినా కొందరు సంతోషిస్తారు.

సంస్కృత భాషోద్ధరణ జరగనిదే భారతీయ సంస్కృతికి భవిష్యత్తు లేదనేవారు కేవలం వేళ్ళను కాపాడాలనేవారే; పైకి కాక, వీరు కిందికి పెరుగుతామంటారు. ముందుకు కాక, వీరు వెనుకకు నడుస్తామంటారు. వీరి ఉద్దేశంలో ఎంత యెత్తుగా మనచుట్టూ గోడలు కట్టుకుంటే అంతగా మన జాతికి బలం; అంతగా మన సంస్కృతికి భద్రత. ఆ గోడలకు పొరపాటుగానైనా తలుపులుండరాదు, కిటికీలన్నవి అసలే పనికిరావు. బయటి వెలుగు మన బ్రతుకుపై పడరాదు. పడితే, మన సంస్కృతి మైలపడిపోతుంది; మన జాతి భ్రష్టమై పోతుంది. బయటి ప్రపంచంతో సంబంధాన్ని తెగగొట్టే గోడలు జెయిళ్ళకే వుంటాయంటే ఆ మాట వారికి నచ్చదు; తలుపులు, కిటికీలు లేకపోవడం గోరీలకే తగునంటే అందుకు కినిసి వీరు శాపనార్థాలు పెడతారు. అసహనం ప్రత్యేకించి వీరి సొత్తు; అహంకారానికి వీరిదే అగ్రతాంబూలం. సంస్కృత భాషను అఖిల భారతానికి అధికారభాషగా, అనుసంధాన భాషగా చేయాలని, ఆ చర్య ద్వారా తప్ప భారతీయ సంస్కృతి పునరుద్ధరణ జరగదని ప్రస్తుతం ఆర్భాటం చేస్తున్నవారి ప్రధాన ప్రేరణలలో మొదటిది అసహనం కాగా, రెండవది అహంకారం!

క్రీస్తుశకం పదవ శతాబ్ది ముగిసేనాటికి భారత జాతి నిర్వీర్యమైపోవడానికి, నిస్తేజంగా మిగలడానికి ఈ అసహనమే ఈ అహంకారమే ముఖ్య కారణాలని ఈ ప్రబుద్ధులకు తెలియదా? తెలిసికూడా చారిత్రక గుణపాఠాలను వీరు నిర్లక్ష్యం చేస్తారా? తోరణమానుని తర్వాత మహమ్మద్ గజ్నీ వరకు, అయిదు శతాబ్దాలకు పైగా, మన దేశంపై విదేశీయ దండయాత్ర ఒక్కటైనా జరగలేదు. ఈ మధ్యకాలంలో సింధు ప్రాంతాన్ని బాగ్దాద్ ఖలీఫాలు ఆక్రమించినా, వారు కైవసం చేసుకున్నట్టిది మొత్తం దేశంలో ఒక చిన్న ప్రాంతం. అదైనా సింధు యెడారి ప్రాంతం. వారి విజయం వల్ల తక్కిన దేశం శాంతిభద్రతలకు భంగం కలగలేదు.

అయినా, విదేశీయులు దండయాత్రలుగాని, వాటి కారణంగా అనివార్యం కాగల అల్లకల్లోలాలుగాని ఎంతమాత్రం లేని ఈ అయిదు శతాబ్దాలలోనే, ముఖ్యంగా వీటి ఉత్తరార్ధంలోనే, వట్టిపోయిన బావివలె భారత జాతీయజీవనం ఎందుకు పరిణమించింది? ఈ కాలంలోనే జాతి మానసికంగానే కాక, నైతికంగానే కాక, శారీరకంగా కూడా ఎందుకు నీరసించింది? ఈ ప్రశ్నలకు సమాధానాన్ని అల్ బెరూని పదకొండవ శతాబ్దిలోనే స్పష్టంగా చెప్పాడు.

క్రీస్తుశకం 973లో జన్మించిన ఈ అరేబియన్ పండితుని ఒక జ్ఞానయోగిగా పేర్కొనవచ్చు. చిన్నతనంలోనే ఈయన సాహిత్య రంగంలోనే కాక, వైజ్ఞానిక శాస్త్రాలలో కూడా కీర్తి ప్రతిష్ఠ నార్జించాడు. యవనదశలోనే తన ప్రాంతపు రాజుకు మంత్రిగా కూడా ఈయన కొంతకాలంపాటు వ్యవహరించాడని ఈయన జీవిత చరిత్ర వివరించాలన్న కోర్కెను నిరోధించుకుని, జ్ఞానార్థిగా ఈయన మహమ్మద్ గజ్నీ సైన్యంతోపాటు పదకొండవ శతాబ్ది ప్రారంభంలో మన దేశానికి వచ్చి, కొన్ని సంవత్సరాలపాటు వివిధ ప్రాంతాలలో పర్యటించి, తనకు తెలియని విషయాలను తెలుసుకొనడానికై విభిన్న పండితుల శుశ్రూషచేసి, స్వదేశానికి తిరిగి వెళ్ళిన తర్వాత అప్పటి మన పతనావస్థ కారణాలను సమీక్ష చేస్తూ వ్రాసిన కొన్ని వాక్యాలను ("అల్ బెరూనీస్ ఇండియా" అనే గ్రంథం నుంచి) ఉదహరిస్తాను;

గజ్నీ దండయాత్రలను భారతీయులు నిరోధించలేకపోవడానికి నాలుగు కారణాలను చెప్పినమీదట, అయిదవదానికి వచ్చి, భారతీయుల ప్రవృత్తిలోని లోపాలను పేర్కొంటే, వారిని అవహేళన చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు అనిపించవచ్చునని, అల్ బెరూనీ హెచ్చరిస్తాడు. ఏమైనా అన్యులకు స్పష్టంగా కనబడుతున్న తమ లోపాలను, అవి తమలో జీతించి పోయిన కారణాన, భారతీయులు కానలేక పోతున్నారని, మౌఢ్యానికి మందు లేదని ఆయన వ్యాఖ్యానిస్తాడు. ఆ తర్వాత ఆయన వ్రాసినదిది : "తమ దేశం తప్ప మరొక దేశం లేదని హిందువుల గట్టి నమ్మకం. తమ జాతిని మించిన జాతి లేదని, తమ రాజులను మించిన రాజులు లేరని తన మతాన్ని మించిన మతం లేదని, తమ శాస్త్రాలను మించిన శాస్త్రాలు లేవని వారి ప్రగాఢ విశ్వాసం. వారు గర్విష్ఠులు, వ్యర్థాడంబర పరులు, దురహంకారులు, చైతన్య రహితులు, తమకు తెలిసినదాన్ని ఇతరులకు చెప్పడం వారి స్వభావానికి విరుద్ధం. తమతోనే మరొక కులానికి చెందిన వారి నుంచి తమకు తెలిసిన విద్యలను గుప్తంగా వుంచడానికి వారు వీలైనన్ని జాగ్రత్తలను పడతారు; విదేశీయుని విషయంలో ఈ జాగ్రత్తలు మరింత కట్టుదిట్టంగా వుంటాయి".

ఈ భావాలనే మరింత విశదీకరిస్తూ, అల్ బెరూని ఈ కింది వాక్యాలను కూడా వ్రాశాడు; "తమకు తప్ప మరెవ్వరికీ శాస్త్రజ్ఞానం లేదనే హిందువుల విశ్వాసం, కూరాసాలోగాని పర్యాలోగాని ఏవైనా శాస్త్రాలున్నాయంటే నిన్ను అజ్ఞానిగా, అనృతవాదిగా తమ అహంకారం కొద్దీ వారు పరిగణిస్తారు."

ఎంత నిష్కర్షగా వ్రాసినా, కేవలం నిందాదృష్టితో అల్ బెరూని వ్రాయలేదనడానికి ఈ కింది పలుకులను తార్కాణంగా చూపించవచ్చు; "ఇతర దేశాలలో పర్యటన చేస్తే ఇతర ప్రజలతో కలిసిమెలిసి తిరిగితే, వారి (హిందువుల) అభిప్రాయాలు తప్పక మారిపోతాయి. ఇప్పటి వారివలె వారి పూర్వీకులు సంకుచిత దృష్టి గలవారు కారు.

వారికి చెందిన ఒక పండితుడు, వరాహమిహిరుడు, బ్రాహ్మణులను గౌరవించాలని చెబుతూ, యవనులు మ్లేచ్ఛులైనా, శాస్త్రజ్ఞానంలో వారు ఇతరులను మించిపోతున్నందున వారినికూడా మన్ననచేయాలని హెచ్చరించాడు."

ఈనాటి సంస్కృత భాషాభిమానులలో కాదు, దురభిమానులలో - ప్రస్ఫుటమౌతున్నది అల్బరూని ఖండించిన అసహనమే. ఆయన నిరసించిన అహంకారమే! దానివల్ల సంస్కృతానికివలె సంస్కృతికి కూడా జరిగేది మేలు కాదు; కత్తీ లేని కీడు మాత్రమే. (ఆంధ్రప్రభ 18-11-1955)

భారతీయ సంస్కృతి పునరుద్ధరణకు సంస్కృత భాషా ప్రచారాన్ని ప్రథమావశ్యకంగా ప్రచారం చేస్తున్నవారు సంస్కృతిని ఒక సౌధంగా భావిస్తున్నట్టున్నారు. "చెల్లాచెదరై పోయినప్పటికీ పాతరాళ్లు రప్పలన్నీ వుండనే వున్నాయి. చిత్రికపట్టి, సాపుచేసుకుంటే, పాత కలపనే తిరిగి వాడుకోవచ్చు. పోతే, కావలసింది ఒక్క సిమ్మెంటు మాత్రం. అదే సంస్కృతం" - ఈ ధోరణిలో ఆలోచిస్తుండబట్టే సంస్కృతి పునరుద్ధరణ, అని వీరు అనగలుగుతున్నారు. కాని, సంస్కృతికి సామ్యం నిర్జీవమైన ఏ శిలా నిర్మాణంతోనో కాదు; సజీవమైన భూరుహంతో, పడిపోయిన కొంపను తిరిగి నిలబెట్టవచ్చు. గాని, కూలిపోయిన చెట్టును, తిరిగి నిలబెట్టడానికి వీలేలేదు. దాని వేళ్లు వుండవచ్చు; దాని మొదలు వుండవచ్చు; కొమ్మలు, రెమ్మలు సయితం మిగిలివుండవచ్చు; అయినా, ఏ సిమ్మెంటూ వాటిని తిరిగి అతకనూ లేదు; ప్రాణం పోసి దాన్ని తిరిగి చెట్టుగా చెయ్యనూ లేదు. తిరిగి ఆ చెట్టు కావాలంటే దాని విత్తనా దానికి నీళ్లు పొయ్యాలి; కొత్త వేళ్లతో, కొత్త మొదలుతో, కొత్త కొమ్మరెమ్మలతో, కొత్త పూబిందెలతో అప్పుడది కొత్త ఫలాలనిస్తుంది. సంస్కృతి కూడా ఇంతే. అదొక నిర్మాణం కాదు. అదొక సృష్టి, శ్రీ సురవరం ప్రతాపరెడ్డి తాము వ్రాసిన ఒక ఉపోద్ఘాతంలో "ఆంధ్రుల కల్చర్" అనే అర్థంలో నారసింహ శతకకర్త గోగులపాటి కూర్మనాథకవి "ఆంధ్రసృష్టి" అనే సమాసాన్ని వాడినట్టు పేర్కొన్నారు.

పోనీ, వాదంకోసం సంస్కృతిని పునరుద్ధరించడం సాధ్యమే అనుకొందాము. అయినప్పుడు సంస్కృత భాషా ప్రచారం ద్వారా వీరు పునరుద్ధరించ గోరుతున్నది ఏ సంస్కృతిని? "ప్రాచీన భారతీయ సంస్కృతిని" అని ఇందుకు ప్రత్యుత్తరం వస్తున్నదనుకోండి. కాని "ప్రాచీనం" అంటే ఎంత ప్రాచీనం? హరప్ప, మొహెంజొదారోల కాలాన్నే "ప్రాచీనం" అన్నప్పుడు వీరు ఉద్దేశిస్తున్నారా? లేక, వేద కాలమునా? బౌద్ధ కాలమునా? మౌర్య కాలమునా? శాతవాహనుల కాలమునా? లేక గుప్తరాజుల కాలమునా? భారతీయ చరిత్రలోని ఈ ప్రాచీన ఘట్టాలలో ఏ రెండింటిలోను, ఒకే విధమైన సంస్కృతి కానరాదు. కాబట్టే, ఈ ప్రశ్నలను మేము వేయవలసి వస్తున్నది. ఫలానా కాలంనాటి సంస్కృతి అని స్పష్టంగా తేల్చి చెప్పనప్పుడు "ప్రాచీన భారత సంస్కృతి పునరుద్ధరణ" అనే మాటలకు అర్థమేలేదు.

తిరుపతిలో ఇటీవల జరిగిన విశ్వసంస్కృత పరిషత్తు మహాసభ సందర్భంలో స్వతంత్ర భారతం పునరుద్ధరించ వలసిన సంస్కృతి ఏ కాలంనాటిదో ఒకరిద్దరు మాత్రం స్పష్టంగా చెప్పారు. వీరి అభిప్రాయం ప్రకారం ఇది వేదం నిర్ణయించిన సంస్కృతి, వేదసంస్కృతి ప్రాచీనమైనదే కాని, దాని కంటే కూడా ప్రాచీనమైనట్టిది సింధునదీ తీరాలలో విలసిల్లిన హరప్ప, మొహెంజొదారోల సంస్కృతి; సుప్రసిద్ధ చరిత్రకారులైన పెక్కుమంది దృష్టిలో వేదసంస్కృతి కంటె హరప్ప, మొహెంజొదారో సంస్కృతే (ఇది ద్రావిడ సంస్కృతిగా పరిగణింప బడుతున్నది) విశిష్టమైంది.

వేద సంస్కృతి ఆవుల మందలను మేపుకుంటూ, ఎక్కడ పచ్చికబయళ్లు వుంటే అక్కడికి సాగిపోయిన వారి సంస్కృతికాగా రాజవీధులతోను, రెండు మూడు అంతస్తుల మేడలతోను, ఈ కాలపు "స్విమ్మింగ్ పూల్స్"తో సరిపోలగల కోనేరులతోను, నేటికీ తెలుగు బస్తీలలో అనేకం నోచుకోని, మురుగునీటి పారుదల సౌకర్యంతోను, సుమేరియనుల కళాకౌశలాన్ని మించిన శిల్పాలతోను, సర్. జాన్ మార్షల్ పలుకులలో ఈనాడు "బాండ్ స్ట్రీట్" (లండన్) లోని నగల దుకాణాలలో తయారౌతున్న వాటితో సరితూగగల వెండి, బంగారు, ఆభరణాలతోను, పిల్లలకు అందమైన ఆటవస్తువులతోను, అన్నింటినీ మించి యోగాభ్యాసంతో కూడిన శైవమతంతోను, మహాసింధు తీరస్థ నగరాలలో వర్ధిల్లిన ద్రవిడ సంస్కృతే ఉత్తమమైంది. ఇంతేకాదు, వేదకాలపు ఆర్యులే నాగరికతను, సంస్కృతిని భారతదేశానికి తెచ్చారనేది "ఇండో-జర్మానిక్" పండితులు కలిగించిన దురభిప్రాయమని, భారతీయ నాగరికత వేదాలకంటె ప్రాచీనమైనదే కాక, నేడు హిందూమతంలో ప్రధానాంశాలుగా పరిగణింపబడుతున్నవెన్నో వేదకాలానికి పూర్వం దేశంలో వర్ధిల్లిన సంఘాలకు చెందినవేనని శ్రీ పణిక్కర్ వ్రాస్తున్నారు.

కాగా, సంస్కృతం, పాళి, బెంగాలి, ఇంగ్లీషు, ఫ్రెంచి మొదలుగా గల పది భాషలలో పండితుడైన శ్రీ సునీతికుమార్ ఛటర్జీ అభిప్రాయం ప్రకారం, భారతీయ సంస్కృతి స్వరూపంపై సంస్కృతం ముద్ర స్పష్టంగా కనబడుతున్నా, దాని స్వభావాన్ని నిర్ణయించడంలో నూటికి 75 వంతుల వరకు కారణభూతమైనట్టివి ఆర్యులకు పూర్వపు లేదా ఆర్యేతరపు జీవిత విధానాలే. కాబట్టి ప్రాచీన సంస్కృతి వేద సంస్కృతి మాత్రమే కాదు; ప్రాచీన సంస్కృతులన్నింటిలో ఉత్తమోత్తమమైంది కూడా అది కాదు.

తిరిగి కేవలం వాదం కోసం వేదకాలం నాటి సంస్కృతే అతి ప్రాచీనమైనదని, అదే సర్వోత్తమమైనదని అంగీకరిద్దాము. కాని, ఆ కాలానికి తిరిగి వెళ్లనిదే ఆ సంస్కృతిని తిరిగి ఎలా సాధించగలము? ఆ సంస్కృతి కావాలంటే, తిరిగి ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు కావాలి. ఆనాటి మత విశ్వాసాలు కావాలి; ఆనాటి ఆచార వ్యవహారాలు కావాలి; ఆనాటి సంప్రదాయాలు కావాలి; ఒక్కమాటలో, ఆనాటి జీవిత విధానం తు.చ. తప్పకుండా తిరిగి కావాలి. ఇది సాధ్యమా? వేదకాలంలో వలె సోమపానం తిరిగి చేయగలమా? పౌండరీక, అశ్వమేథ యాగాలను చేయగలమా? నాణెములకు, ఇతర విధాలైన కరెన్సీకి స్వస్తి చెప్పి, "దీని ధర రెండు ఆవులు", "దాని ధర మూడు ఆవులు" అనే పద్ధతిని ప్రవేశ పెట్టగలమా? బల్లెమునే, గండ్ర గొడ్డలినే ఆయుధాలుగా ఉపయోగించగలమా? గాంధర్వ, రాక్షస వివాహాలను చేసుకోగలమా? వరి, గోధుమ మొదలైన పంటలన్నింటినీ మానివేసి, యవలనే పండించుకొని తినగలమా? ఇవన్నీ చొప్పదంటు ప్రశ్నలని త్రోసివేసే వారికి ఒక్కటే జవాబు. అది - వారికి సంస్కృతి స్వరూపమే తెలియదని, నిత్య జీవితానికి సంబంధించిన స్వల్పాతి స్వల్ప విషయానికి సైతం సంస్కృతితో ఎంతో కొంత సంబంధం వుంటుంది. గ్రేట్ బ్రిటన్లో రుచికరంగా వంట చేసుకొనడం పట్ల శ్రద్ధ తక్కువైపోయినందున, బ్రిటీష్ సంస్కృతి ఆ మేరకు దెబ్బతిన్నట్టే, అని ప్రపంచ ప్రసిద్ధ కవి మిస్టర్ టి.యస్.ఇలియట్ వ్రాశాడు. కాబట్టి, మేము పైన వేసిన ప్రతి ప్రశ్నకు "ఔను" అని సమాధానం చెప్పడానికి సన్నద్ధపడకపోతే, వేద సంస్కృతిని పునరుద్ధరించడం సాధ్యపడదు.

ఇంతకంటే ముఖ్యమైన ప్రశ్నలు - వేద సంస్కృతిని పునరుద్ధరించవలెనని ప్రబోధిస్తున్నవారిని వేయవలసిన ప్రశ్నలు - మరికొన్ని వున్నాయి. శ్రీ విష్ణువుతో పాటు శివుని మీరు మీ దేవాలయాల నుంచి బహిష్కరించనున్నారా? అసలు దేవాలయాలనే లేకుండా చేసుకొని, పుష్పం, ఫలం, పత్రం, తోయాలతో పూజా పునస్కారాలను చేయడం మానుకొని, అగ్ని, వాయు, వరుణ, ఇంద్రాది దేవతలను సంతృప్తి పరచడానికి యజ్ఞ వేదికలను గ్రామ గ్రామాన ప్రతిష్ఠించనున్నారా?

ఈ ప్రశ్నలు వేయడం, వేదకాలం నాటికి శ్రీ విష్ణువు కాని, శివుడు కాని, అవతరించలేదు కనుక. అప్పటికి అగ్ని, వాయు, వరుణ, ఇంద్రాదులే ప్రధాన దేవతలు కనుక; "లింగారాధకుని యజ్ఞవేదిక వద్దకు రానివ్వవద్దు" అంటూ ఋగ్వేదంలో ప్రత్యేకంగా ఆదేశం కలదు కనుక, ఫలపుష్పాదులతో దేవారాధన లేదు కనుక,

వేదాలు అపౌరుషేయాలని, హరప్ప, మొహెంజొదారోల సంస్కృతి వేదాల కంటే ప్రాచీనమైన దనడం సర్వాబద్ధమని, వేద సంస్కృతి యథాతథంగా, నేటికీ నిలిచి వున్నదని వాదించే ఛాందసులకు ఇట్టి ప్రశ్నలను మరెన్నింటిని వేసినా, ఫలితం శూన్యమే కాబట్టి, మరి వీటిని వెయ్యము, కాగా, విజ్ఞులైన వారికి మా మనవి దేశ కాల పాత్రాలను బట్టి సంస్కృతి మారుతుంటుందని; ఆధునిక యుగానికి చెందిన మనం ఆధునికమైన సంస్కృతిని లక్షించాలని; ప్రాచీన సంస్కృతి పునరుద్ధరణ ప్రచారం అర్ధరహితమైందని.

(ఆంధ్రప్రభ 19-11-1955)

భారతీయ సంస్కృతి వికాసానికి సంస్కృత భాష తోడ్పడినదనడం నిర్వివాదం. ఈ విషయాన్ని అంగీకరించక పోవడం సంకుచిత తత్వమే కాగలదు. కాని, సంస్కృత భాషను విడిచి భారతీయ సంస్కృతి లేదనడమేమి భారతీయ సంస్కృతి, సంస్కృత భాష అవిభాజ్యమైనవనడమేమి అర్థం లేని మాటలు. సంస్కృతం ముద్ర భారతీయ సంస్కృతి పై స్పష్టంగా కనబడుతుందని చెప్పిన శ్రీ సునీతికుమార్ ఛటర్జీయే ఆర్యజాతికి చెందిన సంస్కృతంతో పాటు కనీసం మరి మూడు జాతులకు - నిషాద, ద్రావిడ, కిరాత జాతులకు - చెందిన భాషలు ప్రాచీన భారత సంస్కృతిపై తమ ప్రభావాన్ని ప్రసరింపజేశాయని రాశాడు. శ్రీ ఛటర్జీ అభిప్రాయంలో ఆర్యభాష భారతీయ సంస్కృతి స్వరూపాన్ని నిర్ణయించడంలో ప్రాధాన్యాన్ని వహించగా, దాని స్వభావాన్ని నిర్ణయించడంలో నిషాద, ద్రావిడ, కిరాత భాషా సంస్కృతులే అగ్రస్థాన మాక్రమించాయి. భారతీయ సంస్కృతికే కాక, జీవితానికి కూడా - పూర్వకాలంలోనే కాక, నేటికీ కూడా -గ్రామమే ప్రాతిపదిక. వేలాది సంవత్సరాలుగా చెక్కుచెదరకుండా నిలిచిన ఈ ప్రాతిపదికను కూర్చిన ఘనత నిషాదులదే. వారే దేశంలో వరిపంటను ప్రవేశ పెట్టారు. టెంకాయ, గుమ్మడికాయ వారివే. వంకాయ వారిదే. వారే కోళ్ళ పెంపకాన్ని మొదలు పెట్టారు. వారే ఏనుగును మచ్చిక చేశారు; మోటుగానే కావచ్చు గాని, నూలుబట్టల నేత వారు ప్రవేశపెట్టినదే. పసుపు, కుంకుమ, తాంబూలం - వీటికి మన సాంఘిక జీవితంలో నేటికీ ఎట్టి స్థానం కలదో మేము వివరించ నక్కరలేదు. ఈ మూడింటిని ఉపయోగించనారంభించింది వారే. కాగా, మన మత విశ్వాసాలపై సైతం వారి సంస్కృతి ప్రభావం సామాన్యమైంది కాదు. అందంగా బ్రహ్మాండానికి ఓం ప్రథమంగా రూపకల్పన చేసుకొన్నవారు నిషాదులే. పునర్జన్మ సిద్ధాంతానికి (పూర్తిగా కాకపోయినా, దాని ప్రాతిపదికలలో కొన్నింటికి) వారే బాధ్యులట. వేదకాలానంతరం రూపొందిన మన పురాణగాధలలోని మత్స్య, కూర్మ, వరహావతారాలు నిషాదుల మతవిశ్వాసాల నుంచే బహుశా పరిగ్రహించబడినవట. ఛాందసులై నన్ను అంగీకరించినా, అంగీకరించక పోయినా, మానవజాతి శాస్త్రంలో "(ఆంత్రోపాలజీ)" అఖండ ప్రజ్ఞానిధులైనవారు విపుల పరిశోధనలు జరిపిన పిమ్మట చేసిన నిర్ణయాల ప్రకారం, భారతీయ సంస్కృతికి, Hess, నిషాదులు కూర్చినవే అతి ప్రాచీనమైన పునాదులు, అవే చాలా విస్తృతమైన పునాదులు కూడా.

ఈ నిషాదులెవరు? వీరెక్కడ నుంచి వచ్చారు? మానవజాతి శాస్త్రులు వీరిని ఫోటో అసోలాయిడ్స్, లేదా ఆస్ట్రో - ఏషియాటిక్స్ అని పేర్కొంటారు. వీరు మెడిటరేయన్ ముద్ర ప్రాంతం వారట. పాలస్తీనాలో అతి ప్రాచీనకాలంలో కుదురుకొన్న ఒక జాతి నుంచి ఓ వచ్చిన శాఖవారట.

ఈ నిషాదజాతి సంతతివారు ఇండియా మొత్తం మీదనే సిమ్నజాతులలో నేటికీ వున్నారు. హిందూ, మహమ్మదీయ సంఘాలు రెండింటిలోను వీరు మిళితమైపోయారు. వీరి భాష కొంత రూపభేదమొంది మధ్య భారతంలో నివసిస్తున్న కొన్ని అనాది జాతుల వారిలో ఇప్పటికీ ప్రచారంలోనే వున్నది. మెడిటరేనియన్ ప్రాంతం నుంచి, ఇండియాకు చేరిన పిరు నిషాద జాతివారిలో కొందరు బర్మా, ఇండో-చైనా, మలయా, ఇండోనేషియాలకు విస్తరించారు. ఈ దేశాల వారితో మనకు ప్రాచీన కాలం నుంచి కేవలం సాంస్కృతిక సంబంధాలే కాకుండా రక్త సంబంధం కూడా కలదని, ఇండియా నుంచి ఈ దేశాలకు విషాదుల విస్తరణ ద్వారా, ఈ రక్త సంబంధమేర్పడిందని శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

భారతీయ సంస్కృతి స్వభావాన్ని నిర్ణయించడంలో అటు తర్వాత పేర్కొన వలసినవారు ద్రవిడులు. సింధునదీ తీరస్థ మహానగరాలలో వెల్లివిరిసిన సంస్కృతి - వాటిలో పరిఢవిల్లిన నాగరికత - ద్రావిడ జాతి వారిదే కావచ్చునని మానవ జాతి శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. ఆర్యులు "దాసు"లని "దస్యు"లని ఈసడించినవారు ద్రావిడులే కావచ్చు. నిషాదుల వలెనే ఈ ద్రవిడులు కూడా మెడిటరేనియన్ ప్రాంతం నుంచే వలస వచ్చినవారు కావచ్చు. మెడిటరేనియన్ లోని క్రీట్ దీవికి చెందిన వారిని "టెర్మిలై" జాతివారని గ్రీస్ దేశస్థులు పురాతన కాలంలో పిలుస్తుండే వారట. ఆ ప్రాంతంలోనే మరొక జాతి వారికి "ట్రిమ్మెల్" అనే పేరు వుండేదట. ఇట్టి కారణాలను పురస్కరించుకునే ద్రవిడ (తమిళ) జాతి వారు కూడా మెడిటరేనియన్ ప్రాంతం నుంచి వచ్చిన వారేనని మానవజాతి శాస్త్రజ్ఞులు ఊహిస్తున్నారు.

ఎక్కడ నుంచి వలస వచ్చిన వారైనా, లేక అనాదిగా ఇక్కడి వారైనా, భారతీయ సంస్కృతీ వికాసానికి ద్రావిడ జాతివారు కూడా విశేషంగా తోడ్పడినారనడం నిస్సందేహం. ఆర్యులు సింధు నదీతీరానికి చేరేసరికి వారి నాగరికత కంటె వీరిదే ఎంతో ఉన్నత స్థితిలో వున్నది. నగర నిర్మాతలు కాబట్టి, నాగరికత ప్రత్యేకించి వీరి సొత్తు అయింది. అనాగరిక స్థితిలో భారతదేశానికి చేరిన ఆర్యజాతికి నాగరికతలో ప్రథమ పాఠాలను నేర్పినవారు ద్రావిడులంటే, అది సత్యదూరం కాబోదేమో! సమకాలికపు సుమేరియాలో కాని, ఈజిప్టులోకాని, బాబిలోని యాలోకాని, మొహంజొదారోలో విలసిల్లిన నాగరికతతో సరితూగగలిగింది కానరాదని సర్ జాన్ మార్షల్ వ్రాశాడు. అయినప్పుడు ఆర్యులు భారతదేశానికి చేరేసరికి వారి నాగరికత కంటే ఉత్తమమైంది ఇక్కడ వర్ధిల్లుతున్నదని అనుకొనడంలో తప్పేమున్నది? ఇంతే కాక.

తక్కువ నాగరికులైన వారిని జయించిన సందర్భాలు ప్రపంచ చరిత్రలో ఎన్నిలేవు? ఏమైనా, ఆర్యులు భారతదేశం చేరిన తర్వాత వారి సంస్కృతి పూర్వరూపంలో ఎక్కువ కాలం మిగలలేదు. వారి ప్రధాన దేవతలైన అగ్ని, వాయు, వరుణాదులు "డిప్రమోట్" అయిపోయి కేవలం దిక్పాలకులైనారు. సాటిలేనివాడుగా చెల్లిన ఇంద్రుడు కూడా, పూర్వ ప్రతిభను కోల్పోయి, కేవలం స్వర్గాధిపతి అయ్యాడు. అంతకు ముందు దుర్జయుడుగా చెల్లికూడ, తనకేమి ప్రమాదం వచ్చినా, త్రిమూర్తులకు పిటిషనులు పెట్టుకొనవలసిన వాడయినాడు. ఆలమందలపై ఆధారపడిన ఆర్యనాగరికతకు, ఆర్య, అనార్య నాగరికతల సమన్వయ ఫలితంగా రూపొందిన కొత్త భారతీయ నాగరికతకు ఎంత వ్యత్యాసం వున్నదో, వేదాలలోని దేవతలకు పట్టిన దుర్గతి తెలిసినంతగా మరేదీ తెలపదని శ్రీ కె.యం. ఫణిక్కర్ భారతీయ చరిత్రను సమీక్షచేస్తూ తాను వ్రాసిన ప్రతిభాపూర్వక గ్రంథంలో వ్యాఖ్యానించాడు.

భారతీయ సంస్కృతికి ద్రవిడ జాతి సమకూర్చిన దోహదాలను నిన్నటి సంపాదకీయంలోనే కొంతవరకు సూచించాము కాబట్టి, తిరిగి వాటిని గురించి నేడు వివరంగా వ్రాయబోము. కాని, ఆదిలో యోగశాస్త్రం ద్రావిడులదే అని తిరిగి జ్ఞాపకం చేయక తప్పదు. యజ్ఞయాగాదులు ఆర్యులవి కాగా, పూజాపురస్కారాలు ద్రావిడజాతి వారివేనని కూడా చెప్పక తప్పదు. పార్వతీపరమేశ్వరులను, లక్ష్మీనారాయణులను మొట్టమొదటిలో కొలిచిన వారు వారేనని ఎన్నిసార్లయినా సరే నొక్కి చెప్పక తప్పదు. శ్రీ సునీతి కుమార్ ఛటర్జీ అభిప్రాయంలో హిందూ మతంలోని గంభీరాంశాలన్నీ భారతీయ సంస్కృతికి ద్రవిడజాతివారు భక్తి పూర్వకంగా సమర్పించిన కానుకలే. నిజానికి భక్తి యోగమే వారిది; ఆత్మ, పరమాత్మలకు ప్రత్యక్ష సంబంధం సాధ్యమన్న విశ్వాసం వారిలోనే ప్రభవించింది.

పోతే, కిరాతుల సంగతి; వారి సంఖ్య ఆది నుంచీ దేశంలో తక్కువ కాబట్టి, వారు చాల వరకు హిమాలయ పరిసర ప్రాంతాలలో నివసిస్తూ వచ్చారు కాబట్టి, భారతీయ సంస్కృతిపై వారి ప్రభావం పరిమితం. కాని తాంత్రిక శాస్త్రాలు హిందూమతంలో భాగం కావడానికి వారే కారకులు; కాళికారాధనకు కూడా వారే కారకులనడానికి నిదర్శనాలున్నాయి. ఈనాడు నేపాలులోను, అస్సాంలోను వున్న హిందువుల వలె కపిలవస్తు శాక్యజాతికూడా, ఆర్య కిరాత జాతుల సాంకర్యం వల్ల ఏర్పడిందేమోనని, ఇదే నిజమైతే గౌతమ బుద్ధుడు కొంతవరకు తమవాడేనని అనుకోడానికి కిరాతజాతి వారికి అర్హతకలదని శ్రీ ఛటర్జీ సూచిస్తున్నాడు.

ఏమైనా, ఒకటి మాత్రం స్పష్టం; ప్రాచీన భారత సంస్కృతి ఆర్యజాతికి కానీ, ఆర్యభాషకు కాని పరిమితమైంది కాదు. కనీసం నాలుగు భాషా సంస్కృతుల సంపర్కం వల్ల, సమ్మేళనం వల్ల, సమన్వయం వల్ల అది కేవలం నవరూపాన్నే కాక, నవ్యాత్మనే పొందింది; కేవలం విశిష్టతనే కాక, విశ్వరూపాన్ని పొందింది. ఈ సమన్వయ సాధనమే భారత జాతి ప్రత్యేకత. ఇదే భారతీయ సంస్కృతికి నవనవోన్మేషాన్ని కూర్చుతున్నది. ఇదే దాన్ని అమరం చేస్తున్నది.

ఏ దేశాల నుంచి, ఏ జాతుల ద్వారా, ఏ ప్రభావాలు తనపై ప్రసరించి, తన సంస్కృతికి నవరూపాన్ని, నవోత్తేజాన్ని, కలిగిస్తున్నవో, ఆ వివరాలను గూర్చి, భారతజాతికి శ్రద్ధ లేదు; పట్టింపు అసలే లేదు. ఇందువల్లనే కావచ్చు. దేశ చరిత్రను గురించి, దానికి ఆది నుంచీ అంతనిర్లక్ష్యం, అయినా, ఈనాడు, కొందరు "వేదములలోనిదే భారతీయ సంస్కృతి, అని ఉద్ఘాటించడం, దాన్ని పునరుద్ధరించడమే మన ధర్మమనడం ఎంత సంకుచితత్వం! నేటి మన ప్రధాన శత్రువర్గంలో సంకుచితత్వానికి నెహ్రూ ప్రథమ స్థానమిస్తున్నాడంటే అందుకు అబ్బురపడవలెనా? (ఆంధ్రప్రభ 20-11-1955)

"సంస్కృత సంస్కృతి" యే భారతీయ సంస్కృతి: "వేదములు నిర్ణయించిన సంస్కృతి" మన సంస్కృతి - ఈ విధమైన సంకుచితత్వాన్ని ప్రదర్శిస్తున్న వారి వాదాన్ని ఎదుర్కొనడానికే ప్రాచీన భారత సంస్కృతి స్వరూప స్వభావాలను నిర్ణయించడంలో నిషాద, ద్రవిడ, కిరాతజాతుల వారెంతటి ప్రముఖ పాత్ర వహించారో మేము వివరించాము గాని, ఆర్యజాతినేమి, వేద సంస్కృతి నేమి నిరసించడం మా వుద్దేశం కానే కాదు, ఆర్కిటిక్ ప్రాంతం నుంచో, మరి కొందరు భావిస్తున్నట్టు, యూరల్ పర్వతాల దక్షిణ ప్రాంతం నుంచో బయల్దేరి, ఆసియా, యూరప్ ఖండాలలో సువిశాల ప్రాంతాలను జయించిన ఈ ప్రాచీన జాతిని ఈ వీరజాతిని - నిరసిస్తే, అది కూడా సంకుచితతత్వమే కాగలదు.

శక్తిమంతులు కాబట్టే, అప్రతిహతంగా వారి పురోగతి సాగింది; ప్రతిభా సమన్వితులు కాబట్టే, తమ కంటే నాగరికులైన వారిని సయితం వారు పరాభూతులను చేయగలిగారు. స్వస్థలం నుంచి దుర్గమ మార్గాల గుండా అపరిచిత ప్రదేశాలకు వారిని నడిపించిన సాహస గుణంతోపాటు, కొత్త పరిసరాలలో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి వారిని సమాయత్తులను చేసిన ప్రతిభా విశేషం కూడా ప్రధానంగా వారిదైన వేదసంస్కృతిలో ప్రస్ఫుట మౌతున్నది.

అయితే, ప్రాచీన కాలపు ఇతర జాతులలో వలె వేదకాలపు ఆర్యులలో కూడా ధీశక్తి కంటె ఊహాపటిమ అధికంగా కానవస్తుంది; తాత్త్విక దృష్టికంటె, కల్ల, కపట మెరుగని విశ్వాసమే ప్రబలంగా కానవస్తుంది. విశ్వకవి టాగోర్ చెప్పినట్టు, మానవ నాగరికత శుభోదయం జరుగుతున్న సమయంలోనే జీవితంలో గర్భితమై వున్న అనిర్వచనీయ శక్తుల చిద్విలాసాన్ని వేదకాలపు ఆర్యులు గుర్తించ గలిగారు. అయితే, ప్రకృతిని గురించి వారి అభిప్రాయాలు శిశు సహజమైన అమాయికత్వంతో కూడినట్టివి. కనుకనే వారు ప్రకృతిలోని ప్రతి వస్తువుకు, ప్రతి శక్తికి దివ్యత్వ మారోపించారు. అయితే, వారిది సాహసోపేతమైన విశ్వాసం, సంతోష సంభ్రమాలతో కూడిన విశ్వాసం. దేవతలంటే వారికెంత భయాశ్చర్యాలో, అంత భక్తి విశ్వాసాలు కూడా; అందువల్లనే సృష్టి విలాసం వారిని దిగ్భ్రాంతులను చేయక, వారి జీవితాలనే ఉత్తేజపరచింది. బాహ్యజగతులోని పరస్పర వైరుధ్యాలను గురించిన తత్త్వ విచారంలో మునిగి, దాని బరువుకు క్రుంగిపోనిది ఆ విశ్వాసం. అయితే, తాత్త్వికదృష్టి ఎంత కొరవడినా, తమ ప్రతిమల విశ్వాసంలో నుంచే "ఏకమ్ సత్ విప్రాః బహుధావదని" ని పోలిన మహాసత్యాలను కొన్నింటిని వారు సాక్షాత్కరింప జేసుకోగలిగారు.

వేదకాలం గడచి, ఉపనిషత్తుల కాలం వచ్చేసరికి ఆర్యులలో (టాగోరు చెప్పినట్టు) జిజ్ఞాస ప్రబలింది. కేవల విశ్వాసం పై ఆధారపడి, దేన్నీ వారు సత్యంగా స్వీకరించలేదు; ప్రతి దాన్ని గురించి ప్రశ్నలు వేశారు. కాబట్టి ఉపనిషత్తులలో ఉన్నవన్నీ ప్రశ్నలే. వాటిలో ప్రత్యుత్తరాలు లేవని కాదు; ప్రశ్నోత్తరాల రూపంలో ఉపనిషత్తులు కలవనడమే ఇక్కడ గమనించవలసిన విషయం. రవీంద్రుడు వివరించినట్టు, సృష్టి విలాసంపట్ల వేదఋక్కులలోగల ఆశ్చర్య సంభ్రమాలు ఉపనిషత్తులలోనూ వున్నాయి. వాటిలో వలె వీటిలో సయితం కవితా మాధుర్యం తొణికిస లాడుతూ వున్నది. కాని, ఆధ్యాత్మిక తృష్ణ దృక్పథాన్ని మార్చింది. బాహ్యజగత్తును గురించిన అద్భుతభావం కంటె ఆత్మపదార్థాన్ని గురించిన అన్వేషణ ప్రాబల్యం వహించింది. సత్యాన్వేషణ కవితావేశాన్ని కట్టడిచేసి, ఉపనిషత్కారుని అంతర్ముఖుని చేసింది.

పరిణత ప్రజ్ఞానిధికి, శైశవావస్థలోనున్న వానికి ఎంతభేదం వుంటుందో, వేదఋక్కులకు, ఉపనిషత్తులలోని సూత్రాలకు అంతభేదం కలదని రవీంద్రుడన్నాడు. ఉపనిషత్తుల కాలం వచ్చేసరికి ప్రబలిన జిజ్ఞాసకు ఒక ఉదాహరణగా నారదుడు పడిన ఆవేదనను రవీంద్రుడే పేర్కొన్నాడు. "నేను ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం చదువుకున్నాను. వాటి అన్నింటివల్ల నాకు తెలిసింది ఏవో కొన్ని మంత్రాలు, కొన్ని పవిత్ర గ్రంథాలు మాత్రమే. ఆత్మ సంగతి నాకేమీ తెలియదు." అంటూ ఆ ఋషిపుంగవుడు వాపోయాడు. అర్థంకాని ప్రతిదాన్ని, కరతలామలకం కాని ప్రతిదాన్ని ఇది మన శక్తికి మించిన విషయమని విడిచి పుచ్చక, దాన్ని ఒక సవాలుగా యెంచుకునే జ్ఞానతృష్ణనుంచే, ఆర్య ప్రవృత్తి నుంచే "భయాదస్యాగ్నిస్తపతి. భయాత్తపతి సూర్యః, భయాదిన్ద్రశ్చ వాయుశ్చ, మృత్యుర్ధావతి పంచమః" అనే ఉపనిషద్వాణి తర్వాత వెలువడింది.

అయితే ఉపనిషత్తులతోనైనా, అనంత సత్యాలకై సృష్టి రహస్యాలకై, జీవితార్థాలకై మానవుడు సాగిస్తున్న పరిశోధన ఆగిపోలేదు. ఈ పరిశోధన (విశ్వకవి పేర్కొన్నట్టు) భగవద్గీత కాలానికి మరింత ముందుకు సాగింది. అక్కడితోనూ అది నిలిచిపోలేదు. ఇంకా సాగుతున్నది. సాగగలదు. అవిచ్ఛిన్నమైన ఈ పరిశోధన ఫలితంగా, అనంతమైన ఈజిజ్ఞాస పర్యవసానంగా మానవ విజ్ఞాన పరిధులు విస్తరిస్తున్నాయి. మానవ సంఘ పునాదుల వద్ద నుంచీ మారుతున్నది. మానవ జీవితవిధానం క్రొందొత్త రూపాలను ధరిస్తున్నది. ఈ పరిణామాలన్నింటిని బట్టి మానవ సంస్కృతియే - దానిలో ఒక భాగంగా భారతీయ సంస్కృతియే - మారిపోతున్నది. అయినా, "వేదములలోని సంస్కృతి మన సంస్కృతి" అని ఉద్ఘాటించడం ఎంత సంకుచితత్వం;

వేద సంస్కృతి వేదకాలానికి గొప్పది. ఉపనిషత్తుల సంస్కృతి ఉపనిషత్కాలానికి గొప్పది.

ఈ మాటనడం వీటిని కించపరచడం కాదు. ఈ సంస్కృతులలో కొన్ని గొప్ప గుణాలుంటే, నిషాద, ద్రావిడ, కిరాత సంస్కృతులలో మరి కొన్ని విశిష్ట లక్షణాలున్నాయి. విడివిడిగా ఈ సంస్కృతులలో ఏది ఘనమనే విషయమై ఒక వేళ అభిప్రాయభేదాలున్నా, వీటి మధ్య జరిగిన సమన్వయ ఫలితంగా రూపొందిన ప్రాచీన భారత సంస్కృతి వీటి అన్నింటి కంటె గొప్పదనే విషయమై ద్వివిధాభిప్రాయాలకు తావేలేదు. (ఆంధ్రప్రభ 22-11-1955)

ఆర్య అనార్య సంస్కృతుల కంటే భారతీయ సంస్కృతి సమగ్రమైనదని, ప్రశస్తమైనదని అంగీకరిస్తే, ద్రవిడ కజగాన్ని ప్రేరేపించిన మనస్తత్వంవలె, సంస్కృత విశ్వ పరిషత్తు వెనుక దాగివున్న చిత్త వృత్తి సయితం నిరసించదగినదేనని అంగీకరింపక తప్పదు. ఇండియాలో ఒక భాగానికి ద్రవిడ నాయకుడు పరిమితమైన కజగానికి, యావద్భారత దృక్పథమున్న సంస్కృత విశ్వపరిషత్తుకు పోలికే లేనట్టు పైకి కనపడవచ్చుగాని, కజగం నాయకుడు శ్రీరామస్వామి నాయకర్‌ను వలె సంస్కృత పరిషత్తు అధ్యక్షుడు శ్రీ కె.యం. మునీని కార్యోన్ముఖుని చేస్తున్నట్టిది ఒకే శక్తి. అది - జాత్యహంకారం. నాయకర్ అభిమతం తమిళనాడును ద్రవిడస్థాన్ చేయడం కాగా, ముల్టీ లక్ష్యం ఇండియా మొత్తాన్ని ఆర్యావర్తంగా మార్చడం; కాబట్టి ఈ ఉభయులను కూడా భారతీయతకు సమాన విరోధులను గానే పేర్కొనవచ్చు.

నాయకర్ కంటె ముల్డీ ఎక్కువ చదువుకొన్నవాడు; ఎక్కువ తెలివి తేటలున్నవాడు. అందువల్ల తన జాత్యహంకారానికి సంస్కృత భాషోద్ధరణ, భారతీయ సంస్కృతి సముద్ధరణ మొదలైన మేలిముసుగులను ఆయన వేయనూ గలడు; భారతీయతగా దాన్ని లోకానికి చూపనూ గలడు. కాని, ఎంత జాగ్రత్తగా వేసిన మేలిముసుగులైనా అప్పుడప్పుడు తొలిగి పోవడమూ కద్దు; నిజం బయటపడ్డమూ కద్దు.
భారతీయ చరిత్రను, నాగరికతను, సంస్కృతిని కేవలం ఆర్యదృక్పథం నుంచి తప్ప శ్రీ మున్నీ చూడలేదని ఆయన ఆధ్వర్యం క్రింద "ది హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ది ఇండియన్ పీపుల్" అనే పేరుతో వెలువడుతున్న చారిత్రక గ్రంథ సంపుటాలకు ఆయన వ్రాస్తున్న పీఠికలను జాగ్రత్తగా పరిశీలిస్తే తెలుస్తుంది.

వేద కాలాన్ని గురించి తన రెండవ పీఠికలో ఆయన వ్రాసిన వాక్యాలివి :
"అనార్యులతో ఆర్యులకు బ్రహ్మాండమైన సంఘర్షణలు జరిగాయి. దేశంగుండా వారి (ఆర్యుల) విజయయాత్ర కొనసాగుతుండగా జాతులు కలిసి పోయినవి; ఆచారాలలో, విశ్వాసాలలో విభేదాలు సరిచేసుకోబడినాయి. కొత్త సామరస్యం సాధించబడింది. అయితే, ఈ సమన్వయ సాధన తర్వాత కూడా ఆర్యులైనవారు ఆర్యులైనా, లేక

ఆర్యులు దగ్గరకు తీయడాన్నిబట్టి ఆర్యులైన వారైనా - అధికులనే వారు జన్మవల్ల నమ్మకం, వారి ఆచార వ్యవహారాలు, వారి సంప్రదాయాలు మొదలైనవన్నీ, భగవత్ప్రేరితమైనవనే నమ్మకం, భగవత్ప్రేరితమైనవి కాబట్టి, అవన్నీ మార్పుకు అతీతమైనవనే నమ్మకం జాతి మొత్తంలోనే మిగిలింది. సర్వ ప్రపంచాన్ని ఆర్యావర్తంగా మార్చివేయాలన్న (ఆర్యనైజేషన్ ఆఫ్ ది ఎంటైర్ వరల్డ్) ప్రబలకాంక్ష ఉత్తేజకరమైన ఒక మహత్తర శక్తిగా మిగిలింది."

ఆర్య, అనార్య జాతులు సమ్మిళితం కావడం వల్ల భారత జాతి ఆవిర్భవించిందని ఇతరుల నమ్మకం కావచ్చు కాని, శ్రీ ముల్జీ నమ్మకం ప్రకారం జరిగినట్టిది. "ఆర్యనైజేషన్" అనే ఈ మాట పట్ల శ్రీ ముల్జీ కున్నట్టి మోజు దాచుకుందామన్నా దాగనట్టిది. అందువల్ల పెక్కు చోట్ల బహుశా ఆయనకు తెలియకుండానే కూడా అది పడిపోతూ వుంటుంది. చాతుర్వర్ణ్యాన్ని గురించి తన మూడవ పీఠికలో వ్రాస్తూ, "ఆర్యనైజింగ్ నాన్ - ఆర్యన్స్" అని ఆయన అన్నాడు. దానిలోనే మరొకచోట ధర్మశాస్త్రాలను గురించి ప్రస్తావిస్తూ, "ఆర్యనైజేషన్ ఆఫ్ ఇండియా" అన్నాడు. 'ఆర్యన్ కాన్సెప్ట్స్' అనేది ఆయనకు ప్రియమైన ప్రయోగాలలో మరొకటి. ఇండియాకు పర్యాయపదంగా "ఆర్యావర్తం" అని ఆయన తరచు వాడుతూ వుంటాడు. సర్వసమదృష్టి వుండవలసిన మహర్షులను సయితం "ఆర్యన్ ఇంటలెక్ట్యుయెల్స్"గా శ్రీ ముల్జీ పేర్కొన్నాడు.

ఇంతగా ముల్జీని ఆకర్షిస్తున్న - అలరిస్తున్న ఆవేశ పరవశుని చేస్తున్న ఆర్యావర్తం అంటే ఏది? తన అభిప్రాయంగా కాకపోయినా, ప్రాచీన కాలానికి చెందిన భారత ప్రజాభిప్రాయంగా ఆర్యావర్తాన్ని ఆయన వర్ణించక పోలేదు. ధర్మశాస్త్రాలలో నిర్దేశించబడిన వాటికంటె ఆర్యావర్తం సరిహద్దులు బహు విస్తృతమైనవట. ఎక్కడెక్కడ ఆర్యులు వర్ధిల్లుతున్నారో అదెల్ల ఆర్యావర్తమట. దానిపై మ్లేచ్ఛులు దండెత్తితే, ఎక్కువ కాలంపాటు వారు కాలూని నిలవలేరట. భౌగోళికమైన, రాజకీయమైన సరిహద్దులు లేనిదట ఆర్యావర్తం. అటు తర్వాత మెచ్చుకోలుతో ఆయన మేధాతిథి అభిప్రాయాన్ని ఈ క్రింది విధంగా ఉదహరించాడు. "ఉత్తముడైన రాజు మ్లేచ్ఛరాజ్యాన్ని కూడా జయించి, చాతుర్వర్ణ్యాన్ని స్థాపించి, అక్కడి మ్లేచ్ఛులకు ఆర్యావర్తంలో ఛండాలురకున్న స్థానమిచ్చి, ఆ మ్లేచ్ఛరాజ్యాన్ని ఆర్యావర్తం వలెనే యజ్ఞయాగాదులకు తగు పవిత్ర భూమిగా మార్చుతాడు." ఆర్యజాతికి చెందిన జర్మనులు "హెర్రెన్ ఫోల్" అంటూ, హిట్లరు ప్రదర్శించింది. ఇట్టి జాత్యహంకారాన్నే కాదా? నేడు దక్షిణాఫ్రికా ప్రభుత్వం ప్రదర్శిస్తున్నట్టిది ఇట్టి జాత్యహంకారాన్నే కాదా?

దేశకాల పరిస్థితులను బట్టి భావాలు మారుతుంటాయి; విశ్వాసాలు మారుతుంటాయి. కాబట్టి, దేశకాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకోకుండా, ఏ భావాన్నీ, ఏ విశ్వాసాన్నీ, ఖండించరాదని మాకు తెలియకపోదు. మనుస్మృతికి క్రీస్తు శకం తొమ్మిదవ శతాబ్దంలో వ్యాఖ్యానం వ్రాసిన మేధాతిథి అంటే శ్రీ ముల్జీకి విశేష భక్తి గౌరవాలున్నాయి. గొప్ప వ్యక్తిగా, గొప్ప వ్యాఖ్యాన కర్తగా పదే పదే ఆయనను ప్రస్తుతిస్తూ వుంటారు. మేధాతిథి రూపకల్పన చేసుకొన్న ఆర్యావర్తమే

శ్రీ ముల్జీ లక్ష్యం కాకపోతే, ఆయన అభిప్రాయాలను మెచ్చుకోలుతో ఈనాడు ఉదహరించడం దేనికి? ఏమైనా, మేధాతిథి పట్ల వున్న భక్తి గౌరవాలలో వీసంపాటి కూడా గౌతమ బుద్ధునిపై, అశోక చక్రవర్తిపై శ్రీ ముల్జీకి వున్నట్టు తోచదు.

గౌతమ బుద్ధుని గురించి పండిట్ నెహ్రూ అభిప్రాయం ఆయన భారతమాత పుత్రులందరిలో గొప్పవాడనీ, విజ్ఞుడైన వాడని, ప్రతిభావంతుడని, ("దిగ్రేటెస్ట్, వైజెస్ట్, అండ్ బ్రెటెస్ట్ సన్ ఆఫ్ ఇండియా") ఇక శ్రీ ముల్టీ అభిప్రాయం ప్రకారం తక్కిన గొప్పవారిలో ఆయనొకడు మాత్రం పైగా, ఆయన కొత్తగా చెప్పింది ఏదీ లేదు. సాంఖ్యం, యోగం, ఉపనిషత్తులు - వీటి నుంచే ఆయన ఏవో కొన్ని భావాలను స్వీకరించాడు. ఆయన స్థాపించిన కొత్త సిద్ధాంతమూలేదు; మతమూ లేదు; ఆయన కేవల మొక సంఘ సంస్కర్త. పైగా, నాటి భారత ప్రజలపై బౌద్ధం ప్రభావం దాదాపు పూజ్యం! ఒక్క అశోకుని మాత్రం బౌద్ధ సిద్ధాంతాలు ఎక్కువగా కదిలించగలిగినవి. "అశోకుని మరణానంతరం కొద్ది సంవత్సరాలకే పుష్యమిత్రుని రాజ్యంలో దేశం మొత్తం మీదనే పాత సాంస్కృతిక శక్తులు తిరిగి పూర్తిగా వికసించాయి అని కూడా శ్రీము ప్రవచిస్తున్నాడు. దీని తాత్పర్యం భారతీయ సంస్కృతికి, వికాసానికి అశోకుడు కూర్చిన దోహదం ఏమీలేదని కాదా? పుష్యమిత్రుడు స్వామి ద్రోహం చేసి, రాజ్యాధికారాన్ని కైవసం చేసుకొనడం ద్వారా భారతీయ సంస్కృతికి పట్టిన పెద్ద గ్రహణం వీడిపోయిందనే కాదా?

ఇండియాకు ఆసియాఖండంలో గురు పీఠాన్ని సాధించిన బౌద్ధం అంటే శ్రీ ముల్టీకి దాచుకోలేనంతటి కంటగింపు. బౌద్ధంలో గల అంతర్జాతీయ దృష్టి ఇండియాను బలహీనపరచిందని ఆయన వ్రాశాడు. హర్షునికి (ఆయన బౌద్ధాన్ని ప్రోత్సహించబట్టి కాబోలు) లేనిపోని గొప్ప తనం వచ్చిందని, గుప్తరాజుల ముందు ఆయన ఏపాటి వాడని వ్రాశాడు. శ్రీముల్టీ కోరేది "ఆర్యనైజేషన్" అందుకు ఆచార్యుడు మేధాతిథి. ఆయన ఆధ్వర్యం క్రింద స్థాపించవలసినట్టిదీ ఆర్యేతరులను జయించి, చతుర్వర్ణాలను స్థాపించి, మ్లేచ్ఛులను, ఛండాలురకింద అణగదొక్క వలసిన సాంఘిక వ్యవస్థ, అయినప్పుడు శ్రీ ముల్టీ సంస్కృత విశ్వ పరిషత్తుకు ద్రవిడ కజగంతో పోలిక కలదనడం తప్పు కాగలదా? శ్రీ నాయకర్ "ద్రవిడైజేషన్" కోరుతుండగా, శ్రీ ముల్టీ "ఆర్యనైజేషన్" కోరుతున్నాడనటం తప్పుకాగలదా? వీరిద్దరు "ఇండియనై జేషన్"కు సమానంగా శత్రువులనడం తప్పుకాగలదా?

(ఆంధ్రప్రభ 23-11-1955)

వేదాల అపౌరుషేయత్వాన్ని ప్రశ్నించిన వాడు కాబట్టి, మంత్రతంత్రాలను, యజ్ఞయాగాదులను నిరసించినవాడు కాబట్టి, వర్ణవ్యవస్థ పునాదులను బలహీనపరచినవాడు కాబట్టి, జాత్యహంకారం స్థానంలో సర్వమానవ సౌభ్రాత్రాన్ని నెలకొల్పినవాడు కాబట్టి, కారుణ్య సూత్రాన్ని, ప్రేమబంధాన్ని సోదరమానవులకే కాక, సకల జీవకోటికి విస్తరింపజేసినవాడు కాబట్టి, గౌతమబుద్ధుని పట్ల శ్రీ కె.యం. మున్షికి ఏమంత భక్తి గౌరవాలు లేకపోవచ్చు. కాని, ప్రపంచం మొత్తం మీదనే క్రీస్తుశకానికి పూర్వం, ఆరవ శతాబ్దంలో వెల్లివిరిసిన ఒక నవచైతన్య ఫలితంగానే శాక్యసింహు డవతరించాడు. మానవజాతి చరిత్రలోనే ఈ శతాబ్దికొక విశిష్టతవున్నది. ఇండియాలో సిద్ధార్థునితోపాటు, జైనమత సంస్థాపకుడైన, మహావీరుడు ఈ శతాబ్దంలోనే జన్మించాడు. చైనాలో కంఫ్యూషియస్, లోజూ అనే మహాతత్త్వవేత్త లిద్దరు ఈ శతాబ్దంలోనే ఆవిర్భవించారు. పార్సీల మతాన్ని సంస్థాపించిన జొరాస్టర్ పర్షాలో తలయెత్తింది కూడా ఈ శతాబ్దంలోనే. మహామేధావి, తత్త్వవేత్త పైథాగరస్ గ్రీసుకు చెందిన ఒక దీవిలో పరిఢవిల్లింది ఈ శతాబ్దంలోనే. ఇటు చైనా నుంచి, అటు గ్రీసు వరకు ఒకే శతాబ్దంలో లోకోత్తర పురుషులిందరు ప్రభవించడం నిర్నిమిత్తంగా జరుగలేదు. మానవ సభ్యతా వికాసానికీ, సంస్కృతి విలసనానికి ఆదిలో తోడ్పడిన జిజ్ఞాస అప్పటికి తన తీక్షతను కోల్పోయింది; మూఢనమ్మకాలు కుదురుకున్నాయి. జీవితానికి అర్థమే లేకుండా పోయింది;

నిన్నటికి నేడు కేవల మొక ప్రతిధ్వనిగా పరిణమించింది. నేటి కంటె రేపు ఆశావహమై, ఉల్లాసంతో, ఉద్వేగంతో ఉన్నత శిఖరాలకు మానవ జాతిని నడిపించడం మానివేసింది. దట్టమైన చీకటి మానవాంతరంగాలనే క్రమ్మివేసిన కాలమది. ఈ చీకటి దొంతరలను చీల్చడానికి ఒక్క సూర్యుడు కాక, పెక్కుమంది సూర్యులు కావలసివచ్చారు. ఆ యుగావసరాన్ని తీర్చడానికి అద్భుత తేజః పుంజాలతో వెలువడిన వారే అప్పుడు ప్రాచ్య, పాశ్చాత్య ఖండాలలో సమకాలికులై అవతరించిన ఈ మహామహులందరు!

వీరిలో అధిక సంఖ్యాకులపై అత్యధిక ప్రభావాన్ని ప్రసరింపజేసినవాడు నిస్సందేహంగా సిద్ధార్థుడే. ప్రపంచ మతాలలో నేటికీ అధిక విస్తరణ బౌద్ధానికే, బుద్ధుని జీవిత కాలంలో కాకపోవచ్చుగాని, అటు పిమ్మట కొన్ని వందల సంవత్సరాలలోనే అది జపాన్, కొరియాలకు వెళ్లింది. ఇండో-చైనా, ఇండొనీషియాలకు వ్యాపించింది. బర్మా, సింహళాలకు విస్తరించింది. మధ్య ఆసియాకు సయితం చొచ్చుకుపోయింది. తన జన్మస్థానమైన ఇండియాలోనే క్రమంగా అది తన స్థానాన్ని కోల్పోయి వుండవచ్చు. కాని, కనీసం పన్నెండువందల సంవత్సరాలపాటు (క్రీస్తుకు పూర్వం ఆరవ శతాబ్దం మొదలుకొని, క్రీస్తు తరువాత ఆరవ శతాబ్దం వరకు) భారత జాతిని నవచైత్య విలసితం చేసినట్టిది బౌద్ధమే. ఒక ప్రశాంత విప్లవాన్ని, అహింసా ప్రేమలు ప్రాతిపదికగా గల విప్లవాన్ని, మానవతకు పట్టాభిషేకాన్ని చేసే విప్లవాన్ని, అది ప్రారంభించి, జేగీయమానంగా కొనసాగించింది. బౌద్ధం ఒక మతం రూపంలో నేడు మన దేశంలో మిగిలి వుండకపోవచ్చు; కాని, అది కొనసాగించిన విప్లవ ఫలితాలు మన ప్రవృత్తిలో విలీనమయ్యే వున్నాయి. మన జాతీయ జీవనంలో అంతర్వాహినిగా ప్రవహిస్తూనే వున్నాయి; మన సంస్కృతికి ఒక అదృశ్యశక్తిగా రూపురేఖలను దిద్దుతూనే వున్నాయి. కనుకనే గౌతమబుద్ధుని తర్వాత రెండున్నర వేల సంవత్సరాలకు మన దేశంలో తలయెత్తిన మరొక కారుణ్యమూర్తి - అహింసా ధర్మ సంస్థాపకుని గాంధీజీని మనం అర్థం చేసుకోగలిగాము. ఆయనను అనుసరించగలిగాము; ఆయన నాయకత్వాన జాతీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొని, తిరిగి ప్రపంచ ప్రజలలో తలయెత్తుకోగలిగాము. ఇంత చేసి కూడా, ఆయనను మనలోనే ఒకడు పొట్టబెట్టుకున్నాడంటే, అది బౌద్ధునికి సహజమైన, సహన, సౌశీల్య, సౌజన్యాలకు పరాజయం. బౌద్ధునికి విరుద్ధమైన సంకుచితత్వ, మౌఢ్యాలకు విజయం.

నిరీశ్వరవాదమని, వైదిక ధర్మ విరుద్ధమని, వర్ణ వ్యవస్థాఘాతకమని, మనుధర్మ శాస్త్రానికి మేధాతిథి వ్యాఖ్యానాలకు వ్యతిరేకమైనదని, బౌద్ధాన్ని ఎవరెంతగా చులకన చేయడానికి ప్రయత్నించినా, మౌఢ్యంపై అది తీసిన దెబ్బవల్ల మానవతకు, అది చేసిన పట్టాభిషేకం వల్ల భారత జాతి చరిత్రలోనే ఒక మహోజ్జ్వల ఘట్టం ప్రారంభమైనదనడానికి మన తెలుగు గడ్డపైనే తిరుగులేని తార్కాణాలనేకం వున్నాయి. ఇందుకొక తార్కాణం మన అమరావతి; ఇంకొకటి నాగార్జున కొండ; మరొకటి జగ్గయ్యపేట; వేరొకటి ఘంటశాల; ఇవి మాత్రమే కాక, గోలి, భట్టిప్రోలు, చిన్న గంజాం, శాలిహుండాం, రామతీర్థం మొదలైనవెన్నో కూడా బౌద్ధం కూర్చిన నవచైతన్యానికి చెరగని చిహ్నాలుగా మిగిలివున్నాయి. దేశం మొత్తం మీద, చూస్తే బౌద్ధం నిర్మించగలిగిన ఇట్టి కళాక్షేత్రాలు మరెన్నో; సాంచి, సారనాధ్, అజంతా, ఎల్లోరా, బాఘ్, భాహుల్, మధుర, బుద్ధగయ - ఇట్టి కేంద్రాలెన్నింటినో బౌద్ధం కరకురాళ్లను దివ్య సుందర విగ్రహాలుగా మలచి, వాటికి జీవంపోయలేదు? ఎన్నిచోట్ల కటిక కొండలలో గుహాలయాలను తొలచి, అలౌకిక సౌందర్యంతోపాటు, అనుపమ లాలిత్యాన్ని కుప్పపోసినట్టుగా కానవచ్చే మహాద్భుత చిత్రాలతో వాటిని నింపివేయలేదు?

ఇండియా సరిహద్దులకే బౌద్ధ కళాలక్ష్మి పరిమితం కాలేదు కూడా. అది హిమాలయాలను దాటి, చైనా టిబెట్ లకు వెళ్లింది, దుర్గమ సైకత శ్రేణులను దాటి మధ్య ఆసియాకు వెళ్లింది; సేతువును లంఘించి సింహళానికి వెళ్లింది. సముద్రాలను దాటి జపాను వరకు వెళ్లింది. సిగిరియాలో (లంక) అది తొడిగిన లేజిగురు లింకా కాంతులీనుతున్నాయి; అనూరాధపురంలో, (లంక) అది పూచిన పూలింకా వసివాడలేదు; బోరోబుదూర్ (జావా)లో అదికాచిన పండ్లు, నేటికీ తేనెలను చిందుతున్నాయి; మిరాన్లో (టర్కిస్థాన్) అది పెట్టిన ముత్యాల ముగ్గు లింకా, చెరగలేదు. లాసాలో (టిబెట్) అదివేసిన రత్నాల పందిళ్లు ఇప్పటికీ నిలిచివున్నాయి. ఎక్కడెక్కడికి బౌద్ధ ప్రభావం విస్తరించిందో అక్కడక్కడ కళారూపంలో మానవత దివ్యనృత్యం చేసింది. కారుణ్య రూపంలో మానవ సంస్కృతి గంగాభవానిలా పరవళ్లు తొక్కింది.

ఒక కళారంగంలోనే కాక, సాహిత్య రంగంలో కూడా బౌద్ధ ధర్మ ప్రభావం పెల్లుబికింది. అంతకు పూర్వం మనకు నాటకకర్తలు కలరో, లేదో తెలియదు. కాని, మనకు అతి ప్రాచీనమైన నాటకాలుగా మిగిలినవి మాత్రం బౌద్ధమతావలంబి అశ్వఘోషుని రచనలు మాత్రమే. కాగా, హాలుడు సంకలనం చేసిన గాథాసప్తశతి ప్రాకృతకవితా ప్రౌఢిని మనం ఈ సందర్భంలో ఒకసారి స్మరించవలసి వుంటుంది. ఇంతేకాదు, మహా మేధావులుగా, తత్త్వశాస్త్రవేత్తలుగా విశ్వవిఖ్యాతినందిన బౌద్ధాచార్యులు, నాగార్జునుడు, అసంగుడు, వసుబంధు, శీలభద్రుడు, దిజ్నాగుడు, ధర్మకీర్తి ప్రభృతులకు చేయెత్తి నమస్కరించవలసి వుంటుంది. ఇలాగే బౌద్ధ ధర్మం ద్వారా భారతీయ సభ్యతా సంస్కృతులు పొందిన విభవాన్ని గురించి ఎంతైనా చెప్పవచ్చుగాని, మరి చెప్పడం అనవసరం. కాని, ఈ క్రింది విషయాలను మాత్రం భారతీయ సంస్కృతికి సంబంధించిన చర్చలో సర్వదా జ్ఞాపకం పెట్టుకోవలసి వుంటుంది. వర్ణవ్యవస్థ పేరుతో మానవునికి, మానవునికి మధ్య కృత్రిమ విభేదాలను కల్పించలేదు కాబట్టే, బౌద్ధం ఒక నవవిప్లవాన్ని ప్రారంభించ గలిగింది. మానవతకు పట్టాభిషేకం చేయబట్టే, అది మానవ సంస్కృతి వికాసానికి అపూర్వమైన దోహదాన్ని కూర్చింది. ప్రజలకు దూరమైపోయిన సంస్కృతాన్ని కాక, ప్రజాభాషను (ప్రాకృతాన్ని) ప్రచార సాధనంగా చేసుకొన్నందునే అది జాతిని పునరుజ్జీవింపజేయ గలిగింది. ఇట్టి బౌద్ధ ధర్మాన్ని కాని, సర్వతోముఖమైన, సర్వవ్యాప్తమైన దాని ప్రభావాన్ని కాని నిరసించడం భారతీయ సంస్కృతికి మహాపచారాన్ని చేయడమే కాబోదా? (ఆంధ్రప్రభ 24-11-1955)

వేదాలకు వేద ఋషులకు హిందూ ధర్మశాస్త్రాలకు, మను, మేధాతిథులకు భారతీయ సంస్కృతి పరిమితం కాదని నొక్కి చెప్పడానికే గౌతమబుద్ధుని గురించి, ఆయన స్థాపించిన నవధర్మాన్ని గురించి, ప్రత్యేకించి వ్రాయవలసి వచ్చింది. కాని, వేదయుగమని, బౌద్ధయుగమని, గుప్త యుగమని మరేవో యుగాలని భారతీయ సంస్కృతి చరిత్రను పరస్పర సంబంధంలేని విభాగాల క్రింద వి... గొట్టడానికి వీలే లేదు. అవిభాజ్యమైన, అవిచ్ఛిన్నమైన, జీవనదిని పోలింది మన సంస్కృతి. దాని పుట్టుక దేశచరిత్రల దిక్చక్రానికావల. దాని ప్రవాహం ప్రాచీన మధ్య యుగాల గుండా. మనవరకు, మనలో ఛాందసం పెరిగి, మనలో చైతన్యం చచ్చి, మనం రాళ్ల గుట్టలుగా ఇసుక దిబ్బలుగా మారకపోతే భావితరాలకు, అనంతయుగాలకు అది ప్రవహిస్తూనే పోగలదు.

ఈ విషయంలో (ఇంతకు పూర్వమొకసారి సూచింపబడినట్టు) భారతీయ సంస్కృతితో పోల్చదగింది ఒక్క చైనా సంస్కృతి మాత్రమే. ఫరోవారాజుల కాలంలో వున్న ఈజిప్టు ఈనాడు కూడా వున్నది; అప్పటి నైల్ నది ఇప్పుడు కూడ అదే వొందుతో, అవే సుడిగుండాలతో ఉరకలు, పరుగులు పెడుతూనే వున్నది. కాని, నాటి సంస్కృతి ప్రవాహం గాజా, సక్కారా, ఎడారులలో యింకి పోయింది.

పురాతత్త్వ శాస్త్రజ్ఞులు గత శతాబ్దంలో పిరమిడ్సును తెరచి చూచేవరకు వాటిలో గుప్తమైవున్న కళాసంపదను వెలికి తీసేవరకు ఆధునిక యుగపు ఈజిప్షియన్లకు, తమ పూర్వీకులు సాధించిన నాగరికతా స్వరూపమే తెలియదు; వారు పెంపొందించిన సంస్కృతి వైభవమే తెలియదు. అప్పటి పిరమిడ్సు ఇప్పటికీ మిగిలినవి. కాని, పూర్వనాగరికతకు కళంకంగా మాత్రమే ఆనాటి స్పింక్స్ నేటికీ మిగిలింది. కాని, దాని ముఖంలో కనబడీ, కనబడని చిరునవ్వు అర్థమేమిటో ఈనాటి ఫెల్లాహినకు (ఈజిప్షియన్ రైతుకు) దురవగాహమైంది. ఒకనాటి దేవతలు అమోన్, రా, ఓసిరిస్, సెబెక్, హోరుస్, హాథర్, థాత్ మొదలైన వారి ప్రతిమలు అసంఖ్యాకంగా మిగిలినవి. కాని, వారి దైవత్వమే లోపించిపోయింది. ప్రజా జీవితం నుంచి వేరైపోయి, ఈజిప్టు ప్రాచీన నాగరికతా సంస్కృతులు పిరమిడ్స్ లో ఘనీభవించి పోయాయి. లేదా, మ్యూజియములలో నిద్రపోతున్నాయి. సుమేరియా, బాబిలోనియా, అసీరియా గ్రీసు మొదలైన ప్రాచీన దేశాలు పెక్కింటిలో సయితం తరతమ భేదాలతో సరిగా ఇంతే జరిగింది. ఇందుకు భిన్నమైన పరిణామాన్ని మనం చూడగలిగింది ఇండియా, చైనాలలోనే. మన దేశాన్ని చూడండి. ఏనాటిదో వారణాసి! ఈనాటికీ అది మనకు పవిత్ర క్షేత్రం. ఎప్పటిదో బుద్ధగయ! ఇప్పటికీ అక్కడ పూజాపునస్కారాలు జరుగుతున్నాయి; ఎంత ప్రాచీనమైనదో అశోకుని ధర్మచక్రం. అది ఈనాడు మన జాతీయ పతాకపై ప్రభాసిస్తున్నది. ఎన్ని శతాబ్దాల నాటివాడో చిదంబర నటరాజస్వామి! ఆయన తాండవ నృత్యానికి ఇప్పటికీ మన హృదయాలు ప్పొంగుతున్నాయి. క్రీస్తుశకం ప్రారంభంలోని వాడు కాడా, కనిష్కుడు ఆయన ధరించిన దుస్తులను పోలినవే కావా, ఆవాడు మన ప్రధాని నెహ్రూ ధరిస్తున్న “చూడేదార్” “పైజమా” “అచకన్లు? హరప్ప, మొహెంజోదారో పౌరులకంటె ప్రాచీనులుకారా, నిషాద జాతివారు? పెద్దలను సత్కరించడానికి వారు పెట్టిన తిలకాన్నే మనం నేడు మన దేశంలో పర్యటిస్తున్న సోవియట్ వాయకుల నుదుట పెట్టడం లేదా? నాటి నుంచి నేటి వరకు మన గంగా సింధులు, మన కృష్ణా గోదావరులు, మన కావేరీ తామ్రపర్ణులు అఖండంగా ప్రవహిస్తున్నట్టే మన సంస్కృతి సయితం ధారావాహికంగా సాగివస్తూనే వుంది.

అప్పుడప్పుడు మన ఈ సంస్కృతి ప్రవాహం మందగించి వుండవచ్చు; అప్పుడప్పుడు దీని వెంట చెత్త చెదారం కొట్టుకొని వచ్చి వుండవచ్చు; అప్పుడప్పుడిది డొంక తిరుగుళ్లు తిరిగి వుండవచ్చు. అదుపు తప్పి పోయి వుండవచ్చు. అయినా, ప్రవాహమే నిలిచిపోయిన . సమయం లేదు. ఇందుకున్న కారణమొక్కటే; అది - ఎప్పటికప్పుడు ఏవేవో కొత్త కొత్త వాగులు, వంకలు, ఏరులు, నదులు వచ్చి ప్రవాహంలో వచ్చి చేరుతూ వుండడమే. ఈ విధంగా వచ్చి చేరిన ఒక గొప్ప ఉపనదే బౌద్ధం. ఇంత పెద్దది కాకపోయినా, జైన మతం మరొక ఉపనది. ఓ శైవం, వీరవైష్ణవాలు త్రుళ్లింతలాడుతూ వచ్చి పడిన రెండు వాగులు. సిఖీజం, జొరాష్ట్ర నిజం మధ్యలో వచ్చి చేరిన రెండు వంకలు. ప్రవాహాన్ని పశ్చిమాభిముఖంగా మరలించవలెనన్నంత దూకుడుతో వచ్చి, కొత్త నీటితోపాటు, కొత్త వేగాన్ని ప్రవాహానికి కూర్చిన మరి రెండు నదులు ఇస్లాం, క్రైస్తవ మతాలు.

ఇన్ని మతాలనిక్కడ పేర్కొనడం వల్ల భారతీయ సంస్కృతి జీవనదిలోకి ప్రవహించినట్టివి కేవలం వివిధ మతవాహనులేనని భావించరాదు. ఇతర నాగరికతలు, అన్య సంస్కృతులు నేల నాలుగు చెరగుల నుంచి వచ్చి, ప్రత్యక్షంగా యమున వలెనో, అంతర్వాహిని సరస్వతి వలెనో భారతీయ సంస్కృతి గంగా భవానిలో చేరినవి; చేరుతూనే వున్నాయి. ముమ్మాటికీ త్రివేణీ సంగమాన్ని పోలింది మన సంస్కృతి.

అంతర్వాహినిగా త్రివేణీ సంగమంలో చేరే సరస్వతీ పావనోదకాలు ఏ రంగులో వుంటాయో మనకు తెలియదనుకోండి; కాని, మనకు కనబడే గంగానది గోధుమ వర్ణంలో యమునానది నీలవర్ణం కలిసిపోయి ఒకే రంగుతోనే కాక, ఒకే అంతరంగంతో కూడా గంగా యమునలు ముందుకు సాగిపోవడానికి ఎక్కువ సేపు పట్టదు. త్రివేణీ సంగమానికి ఒక క్రోసు దిగువలో ఇవి గంగాజలాలని, ఇవి యమునాతోయాలని ఎవరు చెప్పగలరు? భారతీయ సంస్కృతిలో నుంచి ఇదే విధంగా విదేశ సంస్కృతి ప్రభావాలను విడమర్చడం అసాధ్యం. కాని, ఇండో యూరోపియన్, మెసపిటోమియన్, ఇరానియన్, గ్రీక్, రోమన్, స్కిథియన్, టర్కిష్, పర్య, అరబ్ సంస్కృతులన్నీ ఎప్పుడో ఒకప్పుడు - ఎంతో కొంతగా - మన సంస్కృతిపై తమ ప్రభావాన్ని ప్రసరింపజేసినవనడం నిర్వివాదం.

నిర్వివాదాంశమైనా దీన్ని కొందరు ఛాందసులు గుర్తించకపోవడానికి కారణం ఇతర సంస్కృతుల స్పర్శసోకినదంటే వేదసంస్కృతి మైలపడిపోయినట్టు అంగీకరించడమే కాగలదన్న భయంకావచ్చు. లేదా, స్వర్గం నుంచి శివుని శిరస్సు పైకి గంగానది సరాసరి దిగినట్టు, వేదాల నుంచి మన మధ్యకు భారతీయ సంస్కృతి సరాసరిగా దిగివస్తున్నదన్న తమ వాదానికి విఘాతం కలుగుతుందన్న సంకోచం కావచ్చు. ఈ భయమైనా, ఈ సంకోచమైనా, ఛాందసులకు తగినట్టిదే. విజ్ఞులైన వారు మాత్రం వేద సంస్కృతి సయితం ప్రారంభదశలో నున్నట్టు, అంతిమఘట్టంలో లేదని అంగీకరిస్తారు.

"వ్యక్తికి వలె జాతి కూడా పద్యంతో ప్రారంభించి, గద్యంతో ఆగుతుంది" అని మానవ నాగరికత చరిత్రను ప్రతిభా పూర్వకంగా వ్రాస్తున్న మిస్టర్ విల్ డ్యూరెంట్ సుభాషితం పద్యంతో ప్రారంభమైన వేదాలు గద్యంతో అంతమైనాయి. సింధునదీ తీరానికి చేరినప్పుడు ఆర్యులు వేర్వేరు తెగలుగా వున్నారే తప్ప, వారికి రాజ్యాలు లేవు; రాజులూలేరు. రాజసూయ, అశ్వమేధ, వాజపేయయాగాల ప్రసక్తి బ్రాహ్మణాలలో కలదే కాని, ఋగ్వేదంలో లేనే లేదు. వేదయుగం ప్రారంభంలో బంగారం మాత్రమే ఉపయోగంలో వున్నది. వెండి వాడకంలోకి వచ్చింది ఆ యుగం చివరి దశలలో. ఆ యుగారంభంలో బంగారంతోపాటు రాగి సంగతి కూడా ఆర్యులకు తెలుసు; కాని సీసంతో, తగరంతో వారికి పరిచయం ఆ యుగాంతంలోనే. ఆదిలో వారికి వరి పండించడం తెలియదు; ఎరువు కట్టడం, కాల్వలు త్రవ్వడం కూడా తెలియదు. తర్వాత తర్వాతనే వారు వీటిని నేర్చుకున్నారు. ఋగ్వేదంలో పేర్కొనబడిన వృత్తుల సంఖ్య వేదాంగాల కాలానికి చాలా పెరిగింది. జీవితం పునాదులు ఈ విధంగా పెరిగిన కొద్దీ, లోకజ్ఞానం ఈ విధంగా విస్తరించిన కొలదీ వేదకాల సంస్కృతి సయితం వికాసాన్ని పొందుతూ పోయింది. వికాసమైనా, మార్పే; అదొక మంచి మార్పు. అయినా, మార్పునే అంగీకరించని వారిని గురించి ఏమనగలం? ఋగ్వేద కాలం నుంచి, వేద సంహితల కాలానికి ఎంతో మార్పు జరగబట్టే, భావనా పటిమ స్థానంలో జిజ్ఞాస ప్రబలింది. వేద సంహితల కాలం నుంచి, బుద్ధుని కాలం నాటికి తిరిగి మార్పు జరగబట్టే, జిజ్ఞాస శక్తికి పదును పెట్టడమేమి, తర్క మీమాంసా శాస్త్రాలు పరిఢవిల్లడమేమి, సంభవించింది. ఆధునిక వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనలు యూరప్ లో క్రైస్తవ మత భావాలను ఎంతగా మార్చి, వాటికి నిశితత్వమిచ్చినవో, అంతగానూ బౌద్ధతత్త్వ శాస్త్రాలు వేదమతాన్ని మార్చినవని భారతీయ సంస్కృతిపట్ల విశేష భక్తి గౌరవాలున్న ఇ.బి. హావెల్ వ్రాశాడు. బౌద్ధతత్త్వవేత్తలలో ప్రముఖుడైన నాగార్జునుని గురించి పండిట్ నెహ్రూ అభిప్రాయం "భారతదేశంలో జన్మించిన మహామేధావులలో ఆయనొక"దని. ఆయన మేధాశక్తివలె, ఆయన మానసిక సాహసం మహాశ్చర్య కరమైనదని పండిట్ జీ అన్నాడు. ప్రపంచం మొత్తం మీదనే ఎన్నికకు రాదగు తత్త్వవేత్తలలో నాగార్జునుడొకడని వ్రాసిన "సోవియట్ ఎనాటమీ ఆఫ్ సైన్సెస్" సభ్యుడు ప్రొఫెసర్ ఫ్లెదర్ బాట్ స్కీ అభిప్రాయాన్ని, ఆమోదంతో ఉదహరించాడు. అయితే, ఇక్కడ మనం చేయవలసింది నాగార్జునుని ప్రశంసించడం కాదు. వికాసోన్ముఖంగా జరిగిన ప్రతి మార్పువల్ల భారతీయ సంస్కృతి మరింత విశాలమైందని, విశుద్ధమైందని, విశిష్టమైందని గమనించడం మాత్రమే.

(ఆంధ్రప్రభ 26-11-1955)

9

వైదిక, బౌద్ధ, జైన మతాలను పరస్పర సంబంధం లేనివిగా భావిస్తే భారతీయ చరిత్ర అంతరార్థాన్ని గుర్తించడానికి వీలుండదని మిస్టర్ ఇ.బి. హావెల్ ఎక్కడో వ్రాశాడు. ఈ హెచ్చరిక, మన చరిత్రకంటె కూడా మన సంస్కృతికి మరింతగా వర్తిస్తుంది. మన సంకుచితత్వాన్ని మన సంస్కృతికి ఆరోపించి, ఆర్య సంస్కృతిగానో, వైదిక సంస్కృతిగానో దాన్ని పేర్కొనడం భారతీయతకే ఘోరాపచారం చేయడం. సత్యం బహుముఖమైనదని గుర్తించడం, ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపంలో అది సాక్షాత్కరించవచ్చునని అంగీకరించడం, కొత్త సత్యాలను భక్తితో స్వీకరించి వాటిని తన విశ్వాసాలలోనే కాక తన జీవితంలోనే అంతర్భూతం చేసుకొనడం - ఇదే భారత జాతి ప్రత్యేకత; ఇందువల్లనే భారతీయ సంస్కృతి నిరంతరాయంగా ప్రవహిస్తున్న ఒక మహానది కావడమే కాక, ఎన్ని మహానదులనైనా తన గర్భంలో యిముడ్చుకోగల మహార్ణవమైంది.

"మార్గాలనేకం, గమ్యస్థానం మాత్రమొక్కటి" దీన్ని కేవలమొక ధర్మసూత్రంగానే భారత జాతి పరిగణించలేదు; దీని ప్రకారం తన జీవితాన్ని దిద్దుకొనడానికి అది ప్రయత్నించింది; ప్రయత్నిస్తున్నది. ఈ ప్రయత్నం జరగని సందర్భాలు కొన్ని మన దేశ చరిత్రలో లేకపోలేదు; దీన్ని నిరోధించడాన్నే తమ జీవిత లక్ష్యంగా భావించిన వారు కొందరు మన దేశంలో తలయెత్తక పోలేదు కూడా. కాని, అశోకుని నుంచి, గాంధీజీ వరకు స్థూల దృష్టికి పరస్పర విరుద్ధంగా తోచే మార్గాల చివర ఒకే గమ్య స్థలాన్ని - ఒకే మహోన్నత శిఖరాన్ని - ఒకే నవ ప్రభాతాన్ని - సాక్షాత్కరింప జేసుకొనడానికి ప్రయత్నించిన మహామహుల సంఖ్యే అత్యధిక.

అశోకుని బౌద్ధమతావలంబిగా, వైదిక సంస్కృతికి విరోధిగా, అహింసా ధర్మం వల్ల నేమి, అంతర్జాతీయ దృక్పథం వల్ల నేమి "ఆర్యనైజేషన్ ఆఫ్ ఇండియా"కు అడ్డుగా నిలిచిన వానిగా సంకుచిత దృష్టిగలవారు కొందరు పరిగణించవచ్చు. కాని, బౌద్ధం పై గల భక్తి గౌరవాలు ఆ "దేవానాంప్రియు"ని అన్యమత విద్వేషిని చేయలేదు. దేశంలోనే కాక, విదేశాలలో కూడా ". , బౌద్ధమత ప్రచారాన్ని చేయడానికి ఆయన ప్రయత్నించి వుండవచ్చు. తథాగతుని దివ్య సందేశాన్ని వినిపించడానికి తన సోదరుడు మహేంద్రుని, తన సోదరి సంఘమిత్రను ఆయన సింహళానికి పంపించి వుండవచ్చు. సిరియా, ఈజిప్టు, మాసిడోనియా, ఎపిరస్ రాజాస్థానాలకు ఆయన బౌద్ధాచార్యులను ప్రయాణం చేయించి వుండవచ్చు. అయినా, అన్యమతాల వారిని ఆయన హింసించలేదు. చివరికి వారిని చిన్న చూపు చూచిన పాపాన కూడా పోలేదు. బౌద్ధులకువలె బ్రాహ్మణులకు ఆయన దానాలు విరివిగా చేశాడు. అసలు ఆయన జీవిత విధానమే "మాధ్యమికం". అసహన మేమి, అహంకారమేమి, అన్యమతస్థులను హింసించడ మేమి ఆయన ప్రవృత్తికే విరుద్ధం.

అశోకుని వంశీకులపై తిరుగుబాటు చేసి, హత్యాకాండ ద్వారా మౌర్య సామ్రాజ్యాన్ని హస్తగతం చేసుకొన్న పుష్యమిత్రుడు బౌద్ధ మతస్థులను హింస పెట్టినట్టు కొన్ని బౌద్ధ గ్రంథాలు పేర్కొంటున్నా, సైనిక విద్రోహం ద్వారా అతడు స్థాపించిన సంగవంశం రాజులు అన్యమత సహనం చూపినవారే. సంగవంశం పరిపాలనాకాలంలోనే భార్హుత్ లోని బౌద్ధ గుహాలయం వెలసింది.

అప్పుడే సాంచీలోని రెండవ స్థూపం - బుద్ధునికి ప్రియశిష్యులైన శారిపుత్ర, మౌద్గల్యాయనుల అస్థినిక్షేపం జరిగిన స్తూపం - నిర్మించబడింది. అప్పుడే భాజాలోని బౌద్ధ విహారం పడమటి కనుమలలో మలచబడింది. ఒక చరిత్రకారుడు వ్రాసినట్టు, సంగరాజుల కాలం నుంచి మనకు మిగిలిన శిల్పాలలో హిందూ, జైన మతాలకు సంబంధించిన వాటికంటే బౌద్ధానికి చెందినవే అధికం! ఈ సందర్భంలో గమనించవలసిన మరొక గొప్ప విశేషమిది : భాజాలోనిది బౌద్ధ గుహాలయమైనా, దానిలో ఇంద్ర, సూర్యాది దేవతా విగ్రహాలున్నాయి!

సంగవంశం రాజుల వలె, శాతవాహనులు సయితం పరమత విద్వేషం లేనివారే. వైదిక ధర్మావలంబులై విష్ణుపురాణంలోకి ఎక్కినవారు ఈ ఆంధ్ర రాజులు. అయినా, వీరు బౌద్ధంపై కత్తికట్టలేదు. సాంచీలోని స్థూపాన్ని అభివృద్ధి పరచడానికి వీరి తోడ్పాటు లభించింది. నాగార్జునాచార్యుని ఒక శాతవాహన చక్రవర్తి ఆదరించినట్టు కూడా ప్రతీతి.

విశాల దృష్టికి ఇంతకంటె పేరెన్నికగన్నవారు శాతవాహనుల తర్వాత ఆంధ్రావనిని పరిపాలించిన ఇక్ష్వాకులు. ఈ వంశ సంస్థాపకుడైన మొదటి శాంతమూలకు ఇష్టదైవం స్కంద కార్తికేయుడు. ఈ ఆంధ్ర భూపతి అశ్వమేధాన్నే కాక, వాజపేయాది ఇతర యజ్ఞాలను కూడా చేశాడు. ఈయన తర్వాత రాజ్యానికి వచ్చిన ఇక్ష్వాక రాజులు కూడా వైదిక ధర్మావలంబులే! కాని, ఈ వంశానికి చెందిన రాజపత్నులు మాత్రం బౌద్ధాన్ని ప్రోత్సహించారు. వీరు భక్తితో సమర్పించిన కాన్కల ద్వారా నిర్మించబడినట్టిదే మన నాగార్జున కొండలోని స్థూపం!

భారత చరిత్రలో ఇలాంటి సన్నివేశాలు మరెన్నో, కనిష్కుడు బౌద్ధమతావలంబి. అశోకుని తర్వాత ఆయన ద్వారానే ఇండియాలో బౌద్ధానికి ఎక్కువ ప్రచారం జరిగింది. ఆయనను కొందరు రెండవ అశోకునిగా పేర్కొనడం కద్దు, కావడానికి విజాతీయుడైనా, భారతీయ సంస్కృతి స్వరూపాన్ని హృద్గతం చేసుకున్నవాడు కాబట్టి, తన రాజ్యంలోని అన్యమతస్థులపై ఆయన పగపట్టలేదు. ఆయన నాణెములపై కొందరు హిందూ దేవత లున్నారు. ఆయన వంశీకుల నాణెములపై కూడా హిందూ దేవతలెందరో ఇట్లే వున్నారు.

వైదిక ధర్మాన్ని పునరుద్ధరించిన వారని, హైందవ సంస్కృతి పునరుజ్జీవనకు బాధ్యులైన వారని, భారతీయ చరిత్రలో స్వర్ణయుగాన్ని ప్రవేశపెట్టినవారని ప్రశంసల నందుకునే గుప్తరాజులైనా బౌద్ధాన్ని కాలరాచడానికి ప్రయత్నించలేదు. సారాయ్, మధురలో, అజంతాలో, ఎల్లోరాలో, బాఘ్ లో, బౌద్ధ శిల్ప, చిత్రకళలు హిమవన్నగ శిఖరాల నందుకొన్నది వారి పరిపాలన కాలంలోనే. ప్రపంచ ప్రసిద్ధ నలందా విశ్వవిద్యాలయానికి గుప్తవంశం సహాయం అశేషంగా లభించింది. కనీసం ఆరుగురు గుప్తరాజులు ఆ విశ్వవిద్యాలయాభివృద్ధికి కోరిన ధనమిచ్చారు. గుప్తరాజులలో ఒకరి పేరు “బుద్ధగుప్తు"డనే సంగతిని ఇక్కడ జ్ఞప్తికి తేవడం అసందర్భం కాబోదు.

గుప్తులు హిందువులు కాగా, హర్షవర్ధనుడు బౌద్ధుడు. కాని, ఆయన హిందూ మతాన్ని అణగదొక్కడానికి ఉద్యమించలేదు. ఆయన పోషణ అన్ని మతాలకు లభించింది; ఆయన వితరణను అందరు మతస్థులు పంచుకున్నారు.

మన చరిత్రను ఈ విధంగా సింహావలోకనం చెయ్యాలే కాని, ఇలాంటి సన్నివేశాలు అసంఖ్యాకంగా కనబడతాయి. మేము ఆదిలోనే మనవి చేసినట్టు అశోకుని నుంచి, గాంధీజీ వరకు విశ్వవిశాల దృష్టిగల ప్రభువులేమి, ప్రనాయకులేమి ఎంతమంది మన మధ్య తల యెత్తారో లెక్కలేదు. మన సంస్కృతి విశిష్టతను బట్టే ఇట్టి మహామహు లెందరో మన మధ్య అవతరించారు; ఈ మహా పురుషులందరి వల్లనే భారతీయ సంస్కృతికి వైశిష్ట్య మబ్బింది. అయితే, భారతీయ సంస్కృతిని కేవలం వేదాలకూ, వైదిక కాలానికే పరిమితం చేసే ఛాందసులు ఈ సత్యాన్ని కానలేరు. (ఆంధ్రప్రభ 1-12-1955)

"సత్యం బహుముఖమైనదని గుర్తించడం, ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపంలో అది సాక్షాత్కరించ వచ్చునని అంగీకరించడం, కొత్త సత్యాలను భక్తితో స్వీకరించడం, కొత్త సత్యాలను భక్తితో స్వీకరించి, వాటిని తమ విశ్వాసాలలోనే కాక, తమ జీవితంలో అంతర్భూతం చేసుకొనడం - ఇదే భారత జాతి ప్రత్యేకత" అని నిన్నటి సంపాదకీయంలో మేము వ్రాశాము. సత్యానికి జాతీయ, విజాతీయ భేదమేమీలేదు. కాబట్టి, కొత్త సత్యానికి, అది ఏదేశంలో కనుగొనబడినదైనా, భారతజాతి నివాళి పడుతూ వచ్చింది. దుర్గమమైన హిమాలయ పర్వత శ్రేణి కాని, మహా సముద్రాలు కాని అన్యజాతులతో సంబంధ బాంధవ్యాలు పెట్టుకొనడంలో, వాటినుంచి కొత్త సత్యాలను స్వీకరించడంలో మనకు అడ్డుగా నిలవలేదని మన చరిత్ర వేనోళ్ళ ఘోషిస్తున్నది.

ఆ ఆర్యులవలె, అంతకుపూర్వం దేశంలో ప్రవేశించిన ద్రవిడ నిషాద జాతులవారు సయితం, వేర్వేరు విదేశీయ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారే. ఇక్కడికి చేరుకున్న తర్వాత, తమ స్వస్థలంలోని వారితో నిషాదు లేమి సంబంధం పెట్టుకున్నారో మనకు తెలియదుగాని, సింధు లోయలోని ద్రవిడ జాతివారు మాత్రం తమ స్వస్థలంతో కాకపోయినా, సుమేరియాతో దగ్గరి పొత్తు పెట్టుకొన్నా రనడానికి హరప్పా, మొహెంజొదారోలలో అనేక నిదర్శనాలు కానవచ్చాయి. ఈ రెండు ప్రాచీన నగరాలలో దొరికిన ముద్రలను, తాయెత్తులను పోలినవి సుమేరియన్ నగరాలు కిష్, ఉర్, టెల్-ఆస్మర్లలో లభించాయి. ఒకటి, రెండు కాక, పద్దెనిమిది వరకు ఇవి కన్పించాయి. ఇంతేకాక, మొహెంజొదారోలో సుమెరో-బాబిలోనియన్ లిపిలో ఏమో వ్రాయబడివున్న ఒక మట్టికూజా దొరికింది. వీటినిబట్టి ఆ కాలంలోనే - క్రీస్తుశకానికి ఇంచుమించు మూడువేల సంవత్సరాలకు పూర్వమే - ఈ రెండు ప్రాంతాల మధ్య వర్తక వ్యాపారాలు జరుగుతుండేవని చరిత్రకారులూహిస్తున్నారు. నాటికే సింధు లోయలో నూలుబట్టల నేత వున్నది; నాటికే బంగారం, వెండి, సీసం, రాగి, తగరాలతోపాటు, వీటి మిశ్రమ లోహాల వినియోగం కూడా సింధు లోయలో గొప్ప నాగరికతనభివృద్ధి చేసుకొన్న వారికి తెలుసు. తమకున్న వస్తు సంపత్తితో విదేశాలతో వాణిజ్యాన్ని కొనసాగించి వుండకపోతే, ఆ కాలంలోనే అంతటి గొప్ప నాగరికతను వారు వృద్ధి చేసుకొనగలిగేవారే కాదు!

క్రీస్తుశకానికి రెండు, మూడు వేల సంవత్సరాలకు పూర్వం విదేశాలతో ఇండియా వ్యాపారాన్ని గురించి ప్రత్యక్ష సాక్ష్యం తక్కువైనా, ఆ శకానికి ముందరి సహస్రాబ్దంలో ఈ వ్యాపారం కొనసాగినదనడం నిస్సందేహం. క్రీస్తు శకానికి పూర్వం 975 వ సంవత్సరంలో సోలొమన్ దేవాలయాన్ని అలంకరించడానికి "ఓఫిర్" రేవునుంచి ఏనుగు దంతాన్ని, నెమళ్ళను, కోతులను తీసుకురావలసిందిగా టైర్ రాజు హీరామ్ ఉత్తరువు చేశాడు. ఈ ఉత్తరువులోగల "ఓఫిర్" రేవు (కొందరు ఊహిస్తున్నట్టు) బొంబాయి సమీపంలో ప్రాచీన కాలంలో నున్న ప్రసిద్ధ నౌకా కేంద్రం "సుపార" కాకపోయినా, హీరామ్ రాజు తెమ్మన్న ఏనుగు దంతం, నెమళ్ళు, కోతులు ఇండియాలో లభించేవనడం నిర్వివాదం.

అటు తర్వాత పశ్చిమ ఆసియాతోను, దక్షిణ యూరప్ తోను మన దేశానికి మరింత సన్నిహిత సంబంధ మేర్పడింది. వేదాలలోని దేవతలతో ప్రాచీన కాలపు గ్రీక్ దేవతలకున్న సామ్యాన్ని బట్టి, లేదా, మహాభారత కాలంనాటి భారతీయ సంఘానికి హోమర్ మహాకవి వర్ణించిన గ్రీక్ సంఘంతో గల సామ్యాన్ని బట్టి ఊహించబడుతున్నది కాదు. ఈ సన్నిహిత సంబంధం : ఒకే ఆర్యజాతికి చెందినవారు కావడంవల్ల ఇట్టి సామ్యాలేర్పడి వుండవచ్చు. నమోదైన చరిత్ర ప్రకారం ఇండియా, గ్రీసులకు పరస్పర పరిచయం కనీసం క్రీస్తు శకానికి పూర్వం ఆరవ శతాబ్దం నుంచి, ఆ శతాబ్దంలో పర్షియాను సుప్రసిద్ధ చక్రవర్తి దరియస్ పరిపాలించాడు. అటు మెడిటరేనియన్ తీరం నుంచి, ఇటు సింధు తీరం వరకు ఆయన సామ్రాజ్యం విస్తరించి వుండేది. సింధు ప్రాంతంలో కొంత ఆయన జయించి, సింధు ముఖద్వారం నుంచి, ఎర్ర సముద్రం గుండా స్వదేశానికి తిరిగి రావడానికి వీలున్నదేమో పరిశీలించ వలసిందిగా క్రీస్తు శకానికి పూర్వం 510 వ సంవత్సరంలో దరియస్ ఒక నావికుని నియోగించాడు.

ఈ విధంగా నియోగించబడిన వ్యక్తి నాలుగున్నర యేళ్ళ తర్వాత ఆర్సినోకు (ఇప్పటి సూయజ్ కు) చేరుకోగలిగాడు. తన ప్రయాణానుభవాలను గురించి, ఇతడు వ్రాసిన విషయాలపై ఆధారపడే కావచ్చు, గౌతమ బుద్ధుని మహాపరినిర్వాణానికి ఒక సంవత్సరానికి ముందు (క్రీస్తుకు పూర్వం 484లో) హీరోడోటస్ అనే గ్రీక్ చరిత్రకారుడు నాటి భారత వర్షాన్ని గురించి పెక్కు వివరాలను సరిగా వ్రాయగలిగాడు. ఈ వివరాలిప్పుడు మన కనవసరం. గౌతమ బుద్ధుని కాలం నుంచి కూడా పర్యాతోను (సుతోను, మనకు సంబంధం వుండేదనడం మాత్రమే ముఖ్య విషయం.

అప్పటినుంచీ ఈ రెండు దేశాలతోను ఇండియాకు విరివిగానే వర్తక వ్యాపారాలు జరుగుతుండేవి. అటుతర్వాత ఈ దేశాలతోనే కాక, రోమ్ తో కూడా మనకు మరింత సన్నిహిత సంబంధ మేర్పడింది. అలెగ్జాండర్ దండయాత్రకు, లేదా, ఆయన మరణానంతరం మన సరిహద్దులలో యేర్పడిన గ్రీక్ రాజ్యాలకు పరిమితమైనదే కాదు ఈ సంబంధం. క్రీస్తుశకం ప్రథమ శతాబ్దంలో మలబార్, ఏడెన్స్ మధ్య పదహారు వారాల లోపలనే నౌకాయానం పూర్తి అవుతుండేది. కనిష్క సామ్రాజ్యం పశ్చిమ సరిహద్దుకు, రోమక సామ్రాజ్యం తూర్పు సరిహద్దుకు మధ్య దూరం 600 మైళ్లు మాత్రం. ఆనాడు విలాస వస్తువులకు ఇండియాకు రోమ్ నుంచి బంగారం కాల్వలుకట్టి ప్రవహిస్తున్నదని ప్లినీ ఆవేదన పడ్డాడు. తమ రేవులలో లంగరు వేసివున్న యవన నౌకలను వర్ణిస్తూ ప్రాచీన కాలపు ఒక తమిళకవి పద్యాలు వ్రాశాడు.

పశ్చిమ ఆసియాతోను, దక్షిణ యూరప్ తోను ఇండియాకు ఆ కాలంలో గల సంబంధం కేవలం వర్తక వ్యాపారాలకే పరిమితం కాలేదు. వస్తు వినిమయంతోపాటు భావ వినిమయం కూడా తప్పక జరుగుతుంది. గ్రీక్ తత్త్వశాస్త్రం పై మన ఉపనిషత్తుల, మన బౌద్ధధర్మ సూత్రాల ప్రభావం స్పష్టంగా గోచరిస్తుందని విజ్ఞులైనవారు భావిస్తున్నారు. పైథాగొరస్ ఇండియాకు వచ్చినా, రాకపోయినా, పునర్జన్మకు సంబంధించిన ఆయన అభిప్రాయాలు మననుంచే స్వీకరించబడినట్టు అనుమానిస్తున్నవారున్నారు. సోక్రటీస్ మన దేశం నుంచి ఏథెన్స్ కు వెళ్ళిన బ్రాహ్మణులను కొందరిని కలుసుకొన్నాడన్న మాట నిజమైనా, కాకపోయినా, మాయా సిద్ధాంతాన్ని ఆయన మన వేదాంతం నుంచి స్వీకరించాడని సూచిస్తున్నవారున్నారు.

గ్రీక్ తత్త్వశాస్త్రంపై మన వేదాంత ప్రభావాన్ని గురించి ఒకవేళ అనుమానాలున్నా, పాశ్చాత్య ప్రపంచం గణితశాస్త్రంలోనే కాక, ఇతర వైజ్ఞానికశాస్త్రాలలో కూడా మనకు కొంతవరకు ఋణపడి వున్నదనడం వివాదాస్పదం కాని విషయం. సున్నను కనిపెట్టిందీ మనవారే; స్థానాన్ని బట్టి అంకెకు విలువనిచ్చే పద్ధతిని ప్రవేశపెట్టిందీ మనవారే. సభ్యమానవ చరిత్రలోనే ఇదొక మహత్తర విషయమని ఒక పాశ్చాత్య ప్రముఖుడు (డాట్టిగ్) ఉద్ఘాటించాడు. బీజగణితం "ఆల్జీబ్రా" ప్రపంచానికి ఇండియా వరప్రసాదమే. ఇలాగే కొన్ని ఇతర వైజ్ఞానిక శాస్త్రాల పురోభివృద్ధికి కూడా అది తోడ్పడింది. గ్రీక్ దేశస్థులు తమను కించపరుస్తున్నందుకు ఆగ్రహించి, క్రీస్తుశకం 662 లో ఒక సిరియన్ పండితుడు "ఖగోళ శాస్త్రంలో మీకంటె భారతీయులు అధికులు కారా?" అని ప్రశ్నించాడు. "మీరు వాడుతున్న అంకెలు వారు కనిపెట్టినవి కావా?" అని నిగ్గదీశాడు. "గ్రీక్ భాష మాట్లాడుతున్న కారణానే వైజ్ఞానిక శాస్త్రాల సారాన్ని అందుకోగలిగినట్టు విర్రవీగుతున్న మీరు ఇతరులు సాధించిన విజయాలను జ్ఞాపకం పెట్టుకోవడం మంచిది" అని హెచ్చరించాడు.

కొత్త సత్యాల వినిమయంలో గ్రీసు, రోమ్, పర్వాలనుంచి మనం పొందిన లాభాలున్నవని మరచిపోతే, అది క్షంతవ్యం కాని అహంకారమే కాగలదు. ఖగోళశాస్త్రంలోనే గ్రీసు మననుంచి కొంత నేర్చుకొనగా, మనకు తెలియని కొన్ని విషయాలను రోమ్, అలెగ్జాండ్రియాల నుంచి మనం నేర్చుకొన్నాము. క్రీస్తు శకం ఆరవ శతాబ్దానికి చెందిన వరాహమిహిరుడు ప్రతిపాదించిన ఖగోళ సిద్ధాంత పంచకంలో ఒకటి రోమక సిద్ధాంతం; రెండవది పౌలస్య సిద్ధాంతం. ఈ రెండవది అలెగ్జాండ్రియాకు చెందిన సుప్రసిద్ధ ఖగోళ శాస్త్రజ్ఞుడు పాల్ నుంచి పరిగ్రహించబడినట్టిదని పెద్దలు సూచిస్తున్నారు. ఏమైనా, మన ఖగోళ, గణిత శాస్త్రాలలో గ్రీక్ పదాలు కొన్ని కనిపిస్తాయి. హోరా, కేంద్రం, కోణం; ఇవి గ్రీక్ భాష నుంచి స్వీకరించబడినవే. "దీనారటంకాల తీర్థ మాడించితి" అని మన శ్రీనాథుడు చెప్పుకొన్న గొప్పలోని "దీనారం" కూడా గ్రీక్ లో నుంచి వచ్చిన మాటే!

ఇతర రంగాలలో కూడా రోమ్, గ్రీసుల ప్రభావం మనపై పడింది. గాంధార (ఇండో-గ్రీక్) శిల్పంనుంచే మన అమరావతి బౌద్ధశిల్పం పుట్టుకు రాలేదు గాని, దాని ప్రభావం దీనిపై కొంతవరకు నిశ్చయంగా వున్నది. గాంధార బుద్ధునికి, మధుర బుద్ధునికి సంబంధం లేదనీ, ఒకే సమయంలో ఈ రెండింటిని స్వతంత్రంగా రూపొందించడం జరిగిందనీ చెప్పిన డాక్టర్ ఆనంద కుమారస్వామి సయితం బౌద్ధ శిల్పంపై గాంధార ప్రభావం కొన్ని కొన్ని చోట్ల కానవస్తుందని అంగీకరించాడు.

త్రవ్వితే ఇలాంటి విషయాలు మరెన్నో కలవు గాని, మనం గుర్తించవలసిన ముఖ్యాంశ మొక్కటే; సంకుచితత్వాన్ని మనం చూపకపోబట్టే, కొత్త సత్యాలను, కొత్త విద్యలను ఎవరివద్ద నుంచైనా నేర్చుకొనడానికి సన్నద్ధత ప్రదర్శించబట్టే, మన సంస్కృతి సర్వతోముఖ వికాసం పొందగలిగింది. (ఆంధ్రప్రభ 2-12-1955)

11

"పంచ సిద్ధాంతిక"లో ఒక భాగంగా క్రీస్తుశకం 505 వ సంవత్సరంలో వరాహమిహిరుడు క్రోడీకరించిన "పౌలస్య సిద్ధాంతం" గ్రీకులకు సంబంధించింది కాదనేవారు కొందరున్నారు. కాని, ఆయన గ్రథిత పరచిన "రోమక సిద్ధాంతం"పై గ్రీక్ ప్రభావం లేదనడం సాహసమే కాగలదు. హిప్పార్కస్, టోలమీల ఖగోళ సిద్ధాంతాల ప్రధాన ప్రాతిపదికలే "రోమక సిద్ధాంతం"లో స్పష్టంగా గోచరిస్తున్నాయి. పోతే, మన ఖగోళ, జ్యోతిష శాస్త్రాలలోని "హోర" గ్రీకు పదమని ఎల్లరు అంగీకరిస్తున్నారు. "హోర" అంటే ఒక గంటకాలం. "అవర" అనే ఆంగ్లేయ పదం దీనినుంచి వచ్చిందే. కాలాన్ని గడియలు, విగడియలుగానే కాక, "హోర"ల కింద కూడా విభజించడాన్ని మన పూర్వీకులు ప్రారంభించిన పిమ్మటనే "హోరాశాస్త్రం" అభివృద్ధి చెంది వుండవచ్చు. నిన్నటి సంపాదకీయంలో గల ఈ విషయాల ప్రసక్తిని మేము నేడు తిరిగి తీసుకురావడం, క్రీస్తుశక ప్రారంభం తర్వాత ఏడెనిమిది వందల సంవత్సరాల వరకు ఇతర దేశాలనుంచి, అన్యజాతుల నుంచి తాను స్వీకరించగల ఏ కొత్త సత్యం వున్నా, ఏ నూతన విజ్ఞానం వున్నా, దాన్ని ఆదరంతోనేకాక, ఆతురతతోను, అణకువతోను పరిగ్రహిస్తూ వచ్చిన భారతజాతిలో అటుతర్వాత ఎందువల్లనో అహంకారం బలిసిందని, అసహనం పెరిగిందని, దానితో భారతీయ సంస్కృతి వికాసం కొంతకాలంపాటు నిలిచిపోయిందని చెప్పడానికే.

హూణుడైన మిహిరకులుని క్రీస్తుశకం 528లో రెండవ భానుగుప్త బాలాదిత్యుడు పరాభూతుని చేసిన తర్వాత పదకొండవ శతాబ్దం ప్రారంభంలో మహమ్మద్ ఘజ్నీ దండయాత్రల కాలం వరకు దాదాపు అయిదు శతాబ్దాలపాటు - ఇండియాకు విదేశాల నుంచి ప్రమాదం లేకపోయింది. ఈ మధ్యకాలంలో సింధు రాష్ట్రం పై అరబ్బుల దండయాత్ర జరిగినా, ఇండియా గడ్డపై మొట్టమొదటిసారిగా అక్కడొక మహమ్మదీయ రాజ్యమేర్పడినా, దాని తాకిడి తక్కిన దేశానికి తగలలేదు. శకులు, కుషానులు, హూణులు వరసగా దండెత్తి వచ్చి, దేశాన్ని కల్లోలపరచినప్పటి విషాదానుభవాలను ప్రజలు మరచిపోయారు. తక్కిన ప్రపంచమంటూ కలదని, దానినుంచి దేశ స్వాతంత్ర్యానికి ప్రమాదం సంఘటించవచ్చునని, నిర్నిమేష రక్షణ స్వాతంత్ర్యమూల్యమని - ఈ విషయాలను దాదాపు మరచిపోవడమే జరిగింది. మధ్య ఆసియా ద్వారా చైనాతో సంబంధం తెగిపోయింది. సముద్రమార్గం ద్వారా చైనాతోనే కాక, ఆగ్నేయ ఆసియాతో సయితం పొత్తు దాదాపు లేకుండా పోయింది. సముద్రయానం చేసిన వానిని సంఘ బహిష్కృతుని చేసే మూఢాచారం అంతకు ముందునుంచీ వున్నా, అది ఈ కాలంలో పాటించబడినంత తీవ్రంగా ముందెన్నడు పాటించబడలేదేమో! వర్ణవ్యవస్థ ఘనీభవించింది కూడా ఈ కాలంలోనే. ఏ దృష్టినుంచి చూచినా భారత జాతి క్రీస్తు శకం ఎనిమిది, తొమ్మిది, పది శతాబ్దాలలో కూపస్థ మండూకం వలె బ్రతక నారంభించిందని చెప్పవచ్చు.

పదకొండవ శతాబ్దం ప్రారంభానికి కూపస్థ మండూక ప్రవృత్తి భారతీయులలో కుదురుకుపోయిన దనడానికి అప్పటి పరిస్థితులను స్వయంగా పరిశీలించిన ఒక ఆరబ్ చరిత్రకారుడు - ఆల్ బిరూనీ వ్రాసిన కింది వాక్యమే నిదర్శనం: "తమది తప్ప మరే దేశం లేదని, తమ జాతికి పోలింది మరి లేదని, తమ రాజులకు సాటి రాగలవారు మరి లేరని, తమ మతంతో పోల్చదగింది మరి లేదని, తమ శాస్త్రాలకు సమానమైనవి మరి లేవని హిందువులు భావిస్తారు". నాటి భారతీయులలో సంకుచితత్వ మెంతగా పెరిగిందో - అహంకార మెంతగా బలిసిందో - ఈ వాక్యం స్పష్టపరచడం లేదా? ఈ దుర్గుణాలింతగా ప్రబలడానికి తక్కిన ప్రపంచంతో సంబంధం లేకపోవడమే

కారణమని నిశిత దృష్టిగల ఆల్ బిరూనీ గుర్తించక పోలేదు. అందువల్లనే "విదేశ యాత్రలు చేస్తే, ఇతర జాతులవారి మధ్య మెలిగితే వీరి దృక్పథం త్వరలోనే తప్పక మారగలదు" అని ఆయన వ్రాయగలిగాడు. అంతేకాదు, "వీరి పూర్వీకులంతటి సంకుచిత బుద్ధి కలవారు కారంటూ వరాహమిహురుని ప్రస్తావన తెచ్చి, ఆయన వ్రాసిన ఈ క్రింది. వాక్యాన్ని ఆయన ఉదాహరించాడు : "యువనులు చ్చులే అని, ఇగోళ శాస్త్రాన్ని కనిపెట్టిన ఘనత వారిదే. కనుక వారిని దేవతలవలె పూజిందాలు, కొత్త సత్యాలను తెలుపగలవారి పట్ల, వారు మ్లేచ్చులైనా సరే, భక్తి గౌరవాలను చూపటం పడకండను శ2 ప్రారంభానికి సమసిపోవడమే కాక, అసలు పరాయివారితో శాస్త్ర సాహిత్య చర్చలు చేయడం సయితం తగదన్నంతటి దురహంకారం పెరిగిపోయిండని కూడా ఆల్కనీ విమర్శించాడు.

ఇది దొక్కశుద్ధిలేని వ్యక్తి చేసిన విమర్శ కాదు, భారతదేశంలోను, దాని సంస్కృతితోను అంతగా పరిచయంలేని విదేశీయుని విమర్శ సంగతం కారు. భారతీయ నాగరికత ఆకర్షించినందువల్లనే మహమ్మద్ ఘజ్నీ వెంట ఆల్ బరూనీ ఇండియాకు వచ్చాడు. అక్కడికి చేరిన తర్వాత సంస్కృతం నేర్చుకున్నాడు, పురాణాలను, భగవద్గీతను చదువుకున్నాడు. ఇక్కడికి రాకమునుపే ఆయనకు గణిత, ఖగోళ, భౌగోళిక, పదార్థ విజ్ఞాన, రసాయనిక, ఖనిజాద శాస్త్రాలలో కొంత ప్రవేశం వున్నది. ఇండియా నేర్పగలిగిన సమస్తాన్నీ నేర్చుకొనవలెనన్న దీక్షలోనే ఆయన అక్కడికి వచ్చాడు. కాని, అప్పటికి భారతజాతి తన మనస్సు చుట్టూ కంచుగోడలను పెట్టుకున్నది, విజాతీయులతోపాటు వారి సంస్కృతిని నిరసించడం నేర్చుకొన్నది, తనకు సర్వజ్ఞతను ఆపాదించుకొనడం ప్రారంభించింది.

ఇంతగా సంకుచితత్వం పెరిగినందునే, అహంకారం బలిసినందునే అప్పటిలో భారతజాతిలో చైతన్యం చచ్చింది; దాని ప్రజా ప్రాభవాలు ఉడిగిపోయాయి, దాని సంస్కృతి నిల్వ నీటికింద మారింది; అంతకుపూర్వం వలె విదేశ దండయాత్రలను నిరోధించలేక అధఃపతనమైపోయింది.

క్రీస్తుశకం పదకొండవ శతాబ్దంనాటి భారతదేశ చరిత్ర నేర్పుతున్న ఈ గుణపాఠాన్ని కానలేనివారే ఈనాడు "వేదములలోని సంస్కృతియే మన సంస్కృతి" అంటున్నారు, సంస్కృత భాషనే సంస్కృతిగా పేర్కొంటున్నారు, ఆంగ్లభాషా వ్యామోహం మన కొంప తీస్తున్నదని గగ్గోలు పెడుతున్నారు, పాశ్చాత్య ప్రపంచంతో ఏ విధమైన పొత్తు పెట్టుకోకుండా, తిరిగి వేదకాలానికి నడవకపోతే, మనకు ముందుగతులే లేవని అఘోరిస్తున్నారు.

(ఆంధ్రప్రభ 3-12-1955)

12

వాడికత్తితో ఇండియాపై ఇస్లాం దాడిచేసింది. ఊళ్లనది బీళ్లుగా మార్చింది. పట్టణాలను బూది పోగులతో నింపింది; దేవాలయాలను దోచుకొన్నది; విగ్రహాలను వేయి ప్రక్కలు చేసింది; ఇతర బీభత్సాల నెన్నింటినో కొనసాగించింది. కాని, ప్రపంచ చరిత్ర మొత్తంలోనే ఇందుకు భిన్నంగా వర్తించిన విజేతలెందరున్నారు? అది ప్రాచీనకాలంనాటి సంఘటన కాబట్టి, చరిత్రాంకితం కాలేదు కాబట్టి, ఇదమిత్థంగా చెప్పలేముగాని, మన దేశంపై ఆర్యుల జైత్ర యాత్ర ఇందుకు భిన్నంగా జరిగి వుంటుందా? వారి ప్రవేశం నాటికి సింధులోయ మహోచ్చస్థితిలో నున్న ద్రావిడ నాగరికత ఆకస్మికంగా రూపుమాసి పోవడానికి కారణమేమై వుంటుంది? అగ్ని దగ్ధమైన గ్రామాలు

- హరప్ప, మొహెంజొదారోలకు సమకాలికమైనట్టివి - ఆ లోయలో కానరావడానికి కారణమేమై వుంటుంది? ఇంద్రుని "పురందరు"నిగా వేదాలు పేర్కొంటున్నాయి. అప్పటిలో ఆర్యులకు దేవాధిదేవుడైన పురందరుడు ధ్వసం చేసిన పురాలెవ్వి? విదేహను ఆక్రమించుకొనడానికి ముందు ఆర్యులు దాన్ని దగ్ధపటలం చేసినట్టు శతపథ బ్రాహ్మణంలో లేదా? ఖాండవ దహనం సయితం ఇట్టి చర్యే కాగూడదా? విజేతలై వచ్చిన ఆర్యులు ద్రవిడులను "దస్యు" లంటూ ఈసడించలేదా? "అనాసికులు"గా వారిని కంటగించుకోలేదా? లింగారాధకులను యజ్ఞవాటికల సమీపంలోనైనా పాదం పెట్టనీయరాదని శాసించలేదా?

ఔను - విజేతలుగా, పరదేశంలో ప్రవేశించే వారెవరైనా క్రూరంగా ప్రవర్తిస్తారు. రక్తపాతం గుండానే పురోగమిస్తారు; ఆశ వారిని ముందుకు నడిపిస్తూ వుంటుంది. అపరిచిత పరిసరాలు సహజంగా పుట్టించే భయం వెనక్కులాగుతూ వుంటుంది. ఆ భయాన్ని దాచుకోడానికే వారు శౌర్యాన్ని ప్రదర్శిస్తారు. ఇదే విధంగా మహమ్మదీయులు కూడా ఆదిలో ఇండియాలో క్రౌర్యాన్నే ప్రదర్శించారు. అంతమాత్రం చేత వారిని ప్రత్యేకించి గర్హించ నక్కరలేదు. భారతీయ సంస్కృతి వికాసానికి వారు కూర్చిన దోహదాన్ని కాదననక్కరలేదు.

అంతకు పూర్వమేమి జరిగినా, మొగలు సామ్రాజ్య సంస్థాపన తర్వాత భారతీయ సంస్కృతి తిరిగి చిగురించడానికి ఇస్లాం నిస్సందేహంగా తోడ్పడింది. మొగలు సామ్రాజ్య నిర్మాత బాబర్ మన దేశంపై దండెత్తి వచ్చింది 12,000 మందితో. అంతకు పూర్వం దేశంపై యెత్తి వచ్చిన ముస్లిం రాజులైనా ఇంతకంటె పెద్ద సైన్యాలతో రాలేదు. కాబట్టి ముస్లిం దండయాత్రలతో ఒక కొత్త జాతి భారతీయ జీవనంలో ప్రవేశించినట్టు చెప్పడానికి వీలులేదు; ఒక కొత్త జాతికి చెందిన కొందరు మాత్రం ప్రవేశించారు. వారి ప్రవేశం తర్వాత ఇక్కడి వారెందరో బలాత్కారం పైనో, స్వచ్ఛందంగానో మహమ్మదీయ మతాన్ని స్వీకరించారనుకోండి, ఇలా స్వీకరించి జనాభాలో ముస్లిముల సంఖ్యను పెంచివేశారనుకోండి; కాని, ఈ విధంగా మతాంతరులైన వారందరు అతఃపూర్వపు భారతీయ సంస్కృతికి వారసులనే విషయాన్ని మరచిపోరాదు; ముస్లిం హైందవ సంస్కృతుల మధ్య సమన్వయ సాధన యత్నానికి వీరు ముస్లిం సంఘ సభ్యులు కావడం నిశ్చయంగా బలమిచ్చి వుంటుందని కూడా మరచిపోరాదు. ఆయన పరిపాలన సాగింది కొద్దికాలమైనా మొదటి మొగల్ షాదుషా కాలంలోనే ఈ సమన్వయ ప్రయత్నం ప్రారంభమైంది. హిందూ, ముస్లిం సంస్కృతులకు భిన్నమైనది ఈ ప్రయత్నోద్దేశం కాబట్టి దీనికి బాబర్ "హిందూస్థానీ సంప్రదాయం" అంటూ నామకరణం చేశాడు. కూడా ఈ హిందూస్థానీ సంప్రదాయ ఫలితంగా హిందువులకు, ముస్లిములకు తెలియకుండానే వారుభయుల మతవిశ్వాసాలలో, వారి చిత్ర, శిల్పకళలలో, వారి సంగీత సాహిత్యాలలో, వారి వేష భాషలలో కొంతమార్పు - నిర్లక్ష్యం చేయడానికి వీలులేనంత మార్పు - వచ్చిందని ఘంటాపథంగా చెప్పవచ్చు.

మహమ్మదీయులదైన సూఫీ తత్త్వశాస్త్రానికి ప్రాతిపదికలు కొరానులోనే వున్నా, దానిపై హిందూ, బౌద్ధమతాల ప్రభావం విశేషంగా పడింది. ఇదే విధంగా ఇస్లాం ప్రభావం కొంతవరకు హిందూమతంపై పడకపోలేదు. నామరూపాలు భిన్నమైనవైనా, ఈశ్వరుడు ఒక్కడేనన్న విశ్వాసం హిందువులకు ఉపనిషత్కాలానికే కుదురుకున్నది. అయితే, ఈ ఏకేశ్వర సిద్ధాంతానికి అత్యంత ప్రాధాన్యమిచ్చి "ఏకమేవా ద్వితీయం" అంటూ పునరుద్ఘాటించి, అద్వైతాన్ని ప్రతిష్టాపించినవాడు శ్రీ శంకరాచార్యుడు. దక్షిణాదిని అద్వైతానికింత ప్రత్యేక ప్రాధాన్యం రావడానికి "అల్లా తప్ప మరి దేవుడు లేడు" అని నమ్మే ఇస్లాం ప్రభావం కారణమై వుండవచ్చునని మిస్టర్ ఇ.బి., హావెల్ సూచిస్తున్నాడు. అయితే, అప్పటికే సింధును ముస్లింలు జయించడమైనా జరుగలేదు కాబట్టి,

శ్రీ శంకరాచార్యునిపై ఇస్లాం ప్రభావం, ఎలా పడివుండగలదనే ప్రశ్నకు మిస్టర్ హుమాయూన్ కబీరు చెబుతున్న సమాధానమిది; మహమ్మద్ బిన్ కాసిం సింధు రాష్ట్రాన్ని జయించడానికి పూర్వమే కొందరు అరబ్ వర్తకులు తిరువాన్కూర్ చేరుకున్నారు. కాబట్టి, ఇస్లాం ఓం ప్రథమంగా భారత భూమిపై పాదం పెట్టింది. దక్షిణాపథంలోనే. శాంతియుతంగా అది ఇండియా తీరాలను, ఈ రీతిని చేరుకున్న కొంతకాలానికి మలబార్ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న చేర పెరుమాళు రాజులలో చిట్టచివరివాడు ఇస్లాం మతాన్ని స్వీకరించి, మక్కా యాత్ర కూడా చేసి వచ్చాడు. ఇందుకు తార్కాణం కాలికట్ రాజులకున్న "జామొరిన్" బిరుదమే. ఇప్పటికీ మాపలా మహమ్మదీయులే జామొరినను అభిషేకించాలి. శ్రీ శంకరాచార్యుని జన్మస్థానమైన కాలడి గ్రామాన్ని పరిపాలించిన స్థానికపు ప్రభువు కూడా ఇస్లాం ధర్మ స్వీకారంచేశాడు. కాబట్టి, శ్రీ శంకరాచార్యులకు ఇస్లాం సంగతి ఆనాడే తెలియడానికి వీలున్నది. దాని ప్రభావం ఆయనపై ప్రసరించడానికి వీలున్నది.

శ్రీ శంకరాచార్యుని అద్వైత సిద్ధాంతంలో ఇస్లాముకు పరోక్షంగానైనా ఏ కొంచెమో సంబంధం కలదనడానికి ఆధారమేమీ లేదని ఒక ళ కొట్టి పారవేసినా, ముస్లిముల పరిపాలన కాలంలో తలయెత్తిన రామానంద, కబీర్, నానక్, చైతన్యుడు, మోయిద్దీన్ ప్రభృతులు హిందూ ముస్లిం సంస్కృతుల సమ్మేళన కృషి మనకు కూర్చిన ముక్తాఫలాలను పోలినవారు కారా?

మత విశ్వాసాలపై కంటె చిత్ర, శిల్ప కళలపై (బాబర్ పేర్కొన్న) "హిందుస్థానీ సంప్రదాయ "ప్రభావం" మరింత స్పష్టంగా గోచరిస్తుంది. బౌద్ధ స్థూపాలను, హిందూ దేవాలయాలను ముస్లిములు శిధిలం చేసినా, వాటి శిధిలాలే ముస్లిం వాస్తుశాస్త్రంపై, వారి చిత్రకళపై తమ ముద్రను ఎన్నటికీ చెరగని విధంగా వేసినవని ఇ.బి. హావెల్ వ్రాశాడు. మసీదుల "మినరేట్స్" హిందువుల విజయస్తంభాలకు లేదా ధ్వజస్తంభాలకు ప్రతి రూపాలని హావెల్ అభిప్రాయం. మసీదులలోను విరివిగా కానవచ్చే తోరణాలు ("ఆర్చెస్") బౌద్ధచైత్యాలకు కుడ్యాంతర మందిరాలకు ("నిచీస్") రూపాంతరాలని ఆయన తీర్పు. ఇలాగే ఆయన మరెన్నో సామ్యాలను కాగా, మొగల్ ఆస్థానంలో ఒక కొత్త చిత్రకళా పద్ధతి ఆవిర్భవించిన సంగతి జగద్విదితం. చిత్రకళారంగానికి సంబంధించినంతవరకు హిందూ, ముస్లిం, సంస్కృతుల చూపాడు.

సమ్మేళనం మొగల్ చిత్రాలతో ప్రారంభమై రాజపుత్ర, పహాడీ, కాంగ్రా చిత్రాలతో చరమ స్థాయిని అందుకొన్నది. ఈ చిత్రాలేమి, లాల్ ఖిల్లా, తాజమహల్, ఫతేపూర్ సిక్రీ, బీబీకాము కద్దమా మొదలైన నిర్మాణాలేమి ముస్లిములకో, హిందువులకో చెందినవి కావు. అవి భారతీయ సంస్కృతికి కీర్తి స్తంభాలు; భారత జాతికే వారసత్వాలు.

ఉర్దూ భాష, దానిలో వెలువడిన సాహిత్యం - ఇవి కూడా ఈ రెండు సంస్కృతుల సమ్మేళన ఫలితాలే. నిషాద, ద్రావిడ, ఆర్య సంస్కృతులు ఒకే మూసలో కరిగి, ఒకే నవ్యాకృతిని ధరించినట్టు ముస్లిం, హైందవ సంస్కృతుల సమన్వయం జరగలేదనుకోండి. అయినా, అక్బర్ చక్రవర్తి ఈ సమన్వయ సాధన యత్నానికే కాక, ఆ యత్నంలో మనం పొందగలిగిన విజయ బాహుళ్యానికి కూడా సాక్షీభూతుడని జ్ఞాపకం పెట్టుకోవాలి. భారతీయ సంస్కృతి ఏదో ఒక మతం వారికే చెందినదనుకొనడం దానికి ద్రోహం చేయడమే కాగలదు. కబీర్ అస్తమించినప్పుడు ఆయన శవం మాదంటే మాదని హిందువులు, ముస్లిములు కలహానికి సన్నద్ధపడ్డారట. పోటీలుపడుతూ వారు ఆ శవాన్ని కప్పివున్న దుప్పటిని తొలగించగా, సువాసనలను గుబాళిస్తున్న ఒక పువ్వు కనబడిందట. ఏ ఒక్కరికో చెందక, అందరికీ దివ్య సౌరభాలను పంచి యిచ్చేదే భారతీయ సంస్కృతి. (ఆంధ్రప్రభ 4-12-1955)

13

కిప్లింగ్ వంటి పాశ్చాత్య జాత్యహంకారి “తూర్పు తూర్పే, పడమర పడమరే. అవి రెండూ కలవడం కల్ల" అని ఉద్ఘాటించవచ్చు. వేదాలే మానవ విజ్ఞానసర్వస్వాలని, ఆధ్యాత్మిక సంపత్తిని మనమే గుత్తగొన్నామని, మన సంస్కృతికి సమానమైంది మరెవ్వరికీ లేదని, గడచిన రెండు మూడువందల సంవత్సరాలలో మనపై పడిన పాశ్చాత్య ప్రభావాలన్నింటిని, మరకలు పడిన గోడకు వెల్లవేసినట్టు, మాపుకొనకపోతే పూర్వ వైభవాన్ని మనం తిరిగి సాధించుకొనలేమని మనలోని ఛాందసులు కొందరు వాదించనూ వచ్చు.
కాని, విభిన్నమైన రెండు సంస్కృతులకు పరిచయమేర్పడిన తర్వాత - వాటికి పొత్తుకుదిరిన తర్వాత - ఒకదాని ప్రభావం మరొకదానిపై ప్రసరించకనూ మానదు, ఒక దానికొకటి పరిపుష్టితోపాటు, పరిపూర్ణత్వమివ్వకనూ మానదు.

ప్రాచీనకాలం తర్వాత ఇండియాకు యూరతో తిరిగి సాన్నిహిత్య మేర్పడింది. 1498 మే 27వ తేదీని వాస్కోడిగామా మన మలబార్ తీరాన్ని చేరిన నాటి నుంచి వర్తక వ్యాపారాల ద్వారా లాభార్జన కోసమే కాక, క్రైస్తవ నాగరికతను ప్రచారం చేయాలన్న పట్టుదలతో కూడా మనదేశానికి చేరిన పోర్చుగీస్ వారు అనాగరికులవలె నాడూ ప్రవర్తించారు. నేడూ ప్రవర్తిస్తున్నారు. అటు తర్వాత మన దేశానికి చేరిన పాశ్చాత్యులైనా (డచ్ వారు, ఫ్రెంచివారు, బ్రిటిష్ వారు) పాశ్చాత్య సభ్యతను గురించి హేయాతిహేయమైన అభిప్రాయాన్నే భారతీయులకు కలిగించారని చెప్పక తప్పదు. ఏమైనా, ఆంతరంగికమైన బలహీనతలెన్నో ఏర్పడి వున్నందున మనలనే సైనికులుగా వినియోగించుకొని, మన ధనంతోనే మనకు వేతనాలిచ్చి, బ్రిటిష్ వారు కాలక్రమాన మనలను జయించడమేమి, తమ సామ్రాజ్యాన్ని ఇక్కడ స్థాపించుకొనడమేమి తటస్థించింది. క్రీస్తు శకం పదహారవ శతాబ్దంలో పాశ్చాత్య సంస్కృతితో మనకు తిరిగి పరిచయ మేర్పడినప్పుడు దానిని నిర్లక్ష్య నిరసన భావాలతో మనం చూచాము. బ్రిటిష్ వారు బలపడిన కొద్దీ వారి సామ్రాజ్యం విస్తరించిన కొద్దీ వారి తాకిడికి మన ఆర్థిక, సాంఘిక వ్యవస్థలు శిధిలమైన కొద్దీ, ఆదిలోగల నిర్లక్ష్య, నిరసన భావాలు నిరాశా నిస్పృహల కిందికి మారాయి. క్రీస్తుశకం 19వ శతాబ్దం ప్రారంభం నాటికి భారతీయ సంస్కృతి నీరసపడినంతగా మున్నెన్నడు అది దుర్బలపడలేదనడం అత్యుక్తి కాబోదు.

ఈ శోచనీయ పరిస్థితి నుంచి దేశాన్ని సముద్ధరించినట్టిది ఆంగ్లేయ భాషా ప్రచారమే. ఛాందసులైనవారు, జాతీయ దురభిమానులైనవారు ఈ మాటను ఖండిస్తారనుకోండి; పాశ్చాత్యమానస పుత్రులకే ఇట్టి మాట తగునని దుయ్యబడతారనుకోండి; అయినా, ఇది ముమ్మాటికీ నిజం. పర్షియన్, సంస్కృత భాషలనే విద్యా బోధనకు వినియోగించాలని "కుంఫిణీ" అధికారులలో కొందరు చేసిన ప్రతిపాదనను ప్రతిఘటించి, వాటి స్థానంలో ఆంగ్లేయాన్ని ప్రవేశపెట్టించిన మెకాలేకు భారతీయ సంస్కృతి పట్ల లవలేశంగానైనా, గౌరవ భావం లేదనుకోండి, భారతీయ భాషలనే కాక, భారతీయ విజ్ఞానాన్ని కూడా ఆయన అపహసించాడనుకోండి, ఆంగ్లేయ భాషా ప్రచారం ద్వారా భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతి వ్యాపిస్తుందని ఆయన ఆశించాడనుకోండి. కాని, ఆయన అనుకొన్నదొకటి కాగా, జరిగింది మరొకటి.

"విద్యా వ్యాప్తికి మన పథకాలను అమలు పరచితే, ముప్పది సంవత్సరాల తర్వాత బెంగాల్ లోని కులీన కుటుంబాలలో విగ్రహారాధకుడు మచ్చుకైనా మిగలడు. మతాంతరీకరణకు ప్రయత్నించ కుండానే, మత స్వాతంత్ర్యంలో జోక్యం కలిగించుకోకుండానే, కేవలం మన విజ్ఞానాన్ని వ్యాపింపజేయడం ద్వారా ఈ ఫలితాన్ని సాధించవచ్చు" అని మెకాలే వాదించాడు. కాని, ఆంగ్లేయ భాషా ప్రచారం వల్ల వ్యాప్తి చెందినట్టిది క్రైస్తవ మతం కాదు; ఆధునిక విజ్ఞానం, కనీసం రెండు శతాబ్దాలుగా, భారత జాతి తన మెదడు చుట్టూ కట్టుకున్న మడులను, దడులను ఈ నవ విజ్ఞానం ఒక ప్రక్కకు నెట్టివేసింది. దానితో మూఢనమ్మకాలెన్నో పటాపంచలైనాయి; నిద్రాణమై వున్న జిజ్ఞాస తిరిగి కన్ను తెరిచింది. జ్ఞానతృష్ణ ప్రబలింది, నూతన ప్రపంచమొకటి "ముందుకు సాగిరండి" అంటూ సైగ చేసింది. ఒక్క మాటలో ఆధునిక భారతావతరణ జరిగింది.

ఆధునిక భారతావనికి ఆది పురుషుడు రాజా రామమోహన్ రాయ్. ఆంగ్లేయ భాషా పరిచయంతో మన దేశంలో ప్రారంభమైన మానసిక విప్లవం ఓం ప్రథమంగా వ్యక్తమైంది. ఆయన ద్వారానే, ఇంగ్లీషులోనే కాక, సంస్కృతం, పర్షన్, అరబిక్, బెంగాలీ భాషలలో ఆయన పండితుడు. ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతులతో సమానంగా పరిచయం వున్నవాడు. అందువల్లనే కొత్త పాతలు.

ఆయనలో ఏకమై, ఒక కొత్త పొంగు పొంగింది. ఒక కొత్త దిక్కుకు భారతీయ జీవన స్రవంతిని మార్చింది. సహగమన దురాచారాన్ని రూపుమాపింది ఆయన; స్త్రీ స్వాతంత్ర్యావశ్యకతను ప్రబోధించింది ఆయన; హిందూ ధర్మ శాస్త్రాలను సవరించవలెనని ఆందోళన ప్రారంభించింది ఆయన; పత్రికా స్వాతంత్ర్యంపై నిర్బంధాలను నిరసించింది ఆయన; భూస్వామ్య శాసనాల కాఠిన్యాన్ని విమర్శించింది ఆయన; ఆధునిక విజ్ఞానాన్ని భారతీయులకు అందజేయాలంటే, ఆంగ్ల భాషావ్యాప్తి అత్యవసరమనే వాదాన్ని సమర్థించింది ఆయన; దేశపరిపాలనలో భారతీయులను భాగస్వాములను చేయాలనే విజ్ఞాపనలను ప్రారంభించింది ఆయన; పౌరాణిక మతం నుంచి ఉపనిషత్తుల మతానికి హిందూసంఘాన్ని మరలించడానికి ప్రయత్నించిందీ ఆయనే. ఆయన జాతీయాభిమాని; స్వాతంత్ర్య ప్రియుడు; మానవజాతి ఆయనలో మూర్తీభవించింది. అందువల్లనే ఆయన స్వజాతీయుల పురోభివృద్ధికి, నిరంతరాయంగా కృషి చేయడమే కాక, 1830లో ఇంగ్లండుకు ప్రయాణం చేస్తూ, దారిలో ఒక ఫ్రెంచి ఓడపై ఫ్రాన్సు త్రివర్ణ పతాక కనబడేసరికి, అంతకు పూర్వం జరిగివున్న ఫ్రెంచి ప్రజా విప్లవంపై భక్తి గౌరవాల కొద్దీ, దానికి (ఆ పతాకకు) నమస్కరించాడు; గ్రేట్ బ్రిటన్లో 1833వ సంవత్సరంలో "రిఫారమ్" బిల్లు శాసనమై, అక్కడి సామాన్య ప్రజల పౌరసత్వాలు విస్తృతమైనప్పుడు, తనకేదో మహద్భాగ్యమబ్బినంతగా సంతోషించాడు; అప్పటిలోనే ఆస్ట్రియన్ సైనికులు నేపుల్సు పౌరుల స్వాతంత్రాన్ని హరించగా తన గుండెకే గాయం తగిలినట్టు బాధపడ్డాడు.

"కొత్త పాతల మేలు కలయికకు" మొట్ట మొదటిసారిగా ప్రయత్నం జరిగినప్పుడు, పాళ్లను సరిగా కలపక పోవడం జరగవచ్చు. అవసరమైన దానికంటె ట్టేను కొంచెం ఎక్కువగా చేర్చడం సంభవించవచ్చు. రాజా రామమోహన్ రాయ్ ఇట్టి పొరపాటును కొద్దిగా చేసి వుండవచ్చు; శ్రీ కేశవ చంద్రసేన్ ఈ పొరపాటును మరింతగా చేసినవాడైతే కావచ్చు; కాని, ఆధునిక భారతావతరణకు ఈ ప్రముఖులిద్దరి నాయకత్వాన నడచిన బ్రహ్మ సమాజం ఎంతో దోహదం కూర్చినదనడం నిర్వివాదం. ఈ సమాజంతోపాటుగానే భారతజాతిని జాగరితం చేసిన ఘనతను పంచుకొనవలసినట్టి మతసంస్థలు ఆర్య సమాజం, దివ్య జ్ఞాన సమాజం, శ్రీ రామకృష్ణ మిషన్ మొదలైనవి. ఆర్య సమాజ సంస్థాపకుడైన శ్రీ దయానంద సరస్వతి వలె, స్వామి వివేకానంద సయితం (రాజా రామమోహన్ రాయ్

అడుగు జాడలలో) కొత్త పాతల మేళవింపుకు ప్రయత్నించిన వాడే; హిందూ మతానికి తిరిగి వేదాలనే ప్రాతిపదికగా చేసినా, శ్రీ దయానంద సరస్వతి పురాణాలను ఖండించాడు; విగ్రహారాధనను నిరసించాడు; కులవిభేదాలు పోవాలన్నాడు; బాల్యవివాహాలు తగవన్నాడు; వితంతు వివాహాలను ప్రోత్సహించాడు. ఆధునిక విద్యా వ్యాప్తికి పాటుపడ్డాడు. ఇంతకంటె కూడా ఒక అడుగుముందుకు వెళ్లినవాడు స్వామి వివేకానంద. ఆయన వేదాల ఉపనిషత్తుల విలువ తెలియని వాడుకాదు. అయినా, చికాగోలో జరిగిన ప్రపంచ మత మహాసభావేదికపై నుంచి "ప్రాచ్య ఖండంలో మాకున్న లోటు మతాలు కావు; కూడు, గుడ్డలు, మా ప్రజలు మమ్ము పట్టెడు మెతుకుల కోసం, దేవిరిస్తుండగా మేము వారికి వట్టి చేతులు చూపించవలసి వస్తున్నది. ఆకొన్నవానికి మతం పంచి పెడతామనడం వారిని అవమానించడమే; కడుపు కాలుతున్న వానికి కర్మ సిద్ధాంతాన్ని బోధించడం అతడిని అవమానపరచడమే" అని ఉద్ఘాటించగలిగాడు.

తర్వాత మన దేశంలో జాతీయోద్యమం తలయెత్తినప్పుడు దానికి నాయకత్వం వహించిన వారు సయితం మెకాలే ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణల ద్వారా నవచైతన్య విలసితులైన వారే. అఖిల భారత జాతీయ కాంగ్రెసును స్థాపించినవారు, దాన్ని నిర్వహించినవారు ఆంగ్ల విద్యాధికులే. డబ్లియు.సి. బెనర్జీ, ఫెరోజ్ షా మెహతా, న్యాయపతి సుబ్బారావు పంతులు మొదలైన లాయరులు, రాజా మాధవరావు, ఆర్.సి. దత్తు మొదలైన సర్కారు ఉద్యోగులు. సురేంద్రనాధ బెనర్జీ, గోఖలే, తిలక్ మొదలయిన టీచరులు, జి. సుబ్రహ్మణ్యం అయ్యర్, మోతీలాల్ ఘోషను పోలిన జర్నలిస్టులు; వీరే కాంగ్రెస్ కు ఆదిలో బాసటగా నిలిచినవారు; తర్వాతనైనా గాంధీజీ నాయకత్వాన జాతీయోద్యమం మహోద్ధృతంగా కొనసాగినప్పుడు దానిలోకి వేలాదిగా ఉరికిన వారు స్కూళ్లలోని, కాలేజీలలోని విద్యార్థులే కాని, సంస్కృత విద్యాపీఠాలలోనివారు కారు. ఎవరు అంగీకరించినా, ఎవరు అంగీకరించకపోయినా, నవభారతానికి నాందీ వచనం పలికినట్టిది ఆంగ్ల భాష. ఆంగ్లం మన నెత్తినణచి వేసిందని, సంస్కృతాన్ని నిర్బంధ పఠనీయ భాషగా చేయకపోతే, సంస్కృతికి పునర్వికాసం లేదని చెప్పే వారికి ఆధునిక భారత చరిత్ర తెలియదనడం సాహసం కాబోదు. (ఆంధ్రప్రభ 7-12-1955)

14

ఆంగ్ల భాష ద్వారా పాశ్చాత్య సంస్కృతి ప్రభావం మనపై పడిందని ఛాందస సమ్రాట్టులైనా అంగీకరిస్తారు. అయితే, ఆ ప్రభావం వల్ల మనకు కీడు కంటే మేలే ఎక్కువగా ఎక్కువగా - జరిగిందని మాత్రం వీరు అంగీకరించరు.చాలా పాశ్చాత్య సంస్కృతితో ప్రథమ పరిచయ మేర్పడినప్పుడు దాని వ్యామోహంలో పూర్తిగా పడిపోయి, భారతీయ సంస్కృతిని చీదరించుకొన్న వారు లేకపోలేదు; వేషభాషల వద్ద నుంచి ప్రతి విషయంలోను పాశ్చాత్యులను అనుకరించిన వారు సయితం లేకపోలేదు. కాని, శ్రీ అరవింద యోగి చెప్పినట్టు, విభిన్నమైన రెండు సంస్కృతులకు కొత్తగా సాన్నిహిత్య మేర్పడినప్పుడు, వాటిలో చైతన్యం మందగించి వున్నట్టిది. సృజనాత్మక శక్తి శిధిలమై వున్నట్టిది అన్ని విధాల నీరసపడివున్నట్టిది నవచైతన్యంతో సృజనాత్మక ప్రాగల్భ్యంతో శక్తి విలసితమై వున్నట్టిదాన్ని కొంత వరకు అనుకరించడం తప్పదు. తరతమ విభేదాలతో అన్ని జాతులు ఈ పని చేసినట్టు ప్రపంచ చరిత్ర ఉదోషిస్తున్నది. అసలిట్టి అనుకరణ మానవ స్వభావంలోనే గర్భితమై వున్నదనీ, అది జీవన ధర్మమని శ్రీ అరవింద యోగి వివరిస్తున్నాడు. కాబట్టి, అనుకరణ తప్పుకాదు. అంధప్రాయమైన అనుకరణ తప్పు. అనుకరణతో ప్రారంభించి, అనుకరణతోటే సంతృప్తి చెందడం తప్పు, అన్య సంస్కృతికి అమ్ముడైపోయి, వ్యక్తిత్వాన్ని నశింపజేసుకొనడం తప్పు.

ఇంతే చేస్తే కొత్త సంస్కృతి తాకిడికి పాతది రూపు మాసి పోతుంది. కొత్త సంస్కృతిలోని ఉత్తమాంశాలను కాక, అధమాధమమైన వాటినే స్వీకరించినా ముప్పుతప్పదు. ఇలా కాక, కొత్త దానిలో నుంచి మన సంస్కృతికి అనుగుణమైన సమస్తాన్ని - మన సంస్కృతిలో అంతర్లీనం చేసుకొనడానికి వీలున్న సమస్తాన్ని - తప్పక స్వీకరించాలి. ఇలా స్వీకరించ వలసినవి కొత్త దృక్పథాలు మాత్రమే కావు. కొత్త భావాలు మాత్రమే కావు; కొత్త విజ్ఞానం మాత్రమే కాదు కూడా! మనకు లేని మనకవసరమైన కొత్త సాధనాలతోపాటు, సంస్థలను, వ్యవస్థలను కూడ పరిగ్రహించాలి.

ఆదిలో కొంతకాలం పాశ్చాత్య సంస్కృతి ప్రభావం కొద్దీ పాశ్చాత్యులను అనుకరించడం అంధప్రాయంగా కూడ అనుకరించటం - తటస్థించినా, త్వరలోనే గత శతాబ్దిలోని చతుర్ధ పాదం ప్రారంభమయ్యేసరికే ఈ ఘట్టం సమాప్తి చెందింది.

అటు తర్వాత అప్పటికి నీరసించివున్న, నిస్తేజమైవున్న మన సంస్కృతికి కొత్త జవ సత్వాలను కొత్త ప్రకాశాన్ని కూర్చుకొనడానికే పాశ్చాత్య సంస్కృతిని వినియోగించుకొన నారంభించాము. ఈ కృషి సందర్భంలో పాశ్చాత్య భావాలను, విజ్ఞానాన్నేకాక, కొన్ని పాశ్చాత్య విధానాలను, సాధనాలను కూడ మన సొంతం చేసుకొన్నాము. ఈ రెండవ విభాగానికి చెందినట్టివి (శ్రీ అరవిందయోగి పేర్కొన్నట్టు) సాహిత్య రూపాలలో నవల, చిన్న కథ, విమర్శక వ్యాసం మొదలైనవి; వైజ్ఞానిక రంగంలో రైల్వే, టెలిగ్రాఫ్, టెలిఫోన్, మోటారుకారు, విమానం, రేడియో, ఫ్యాక్టరీలు, లేబరేటరీలు వగైరాలు; రాజకీయ రంగంలో పత్రికలు, సభావేదిక, ప్రజాందోళనకు యితర పద్ధతులు. పాశ్చాత్య సంబంధమైనవని వీటి నన్నింటిని త్రోసి పారవేయాలన్నా, వేదవిహితమైన సకలార్ధ సాధక యజ్ఞ యాగాదులను తిరిగి ప్రారంభించాలన్నా, అది పరమ ఛాందసం కాబోదా? కాని, చిత్రమేమంటే ఇంతటి ఛాందసాన్ని ప్రకటిస్తూ వ్యాసాలు వ్రాస్తున్న వారూ వున్నారు; వాటిని ప్రముఖంగా ప్రచురిస్తున్న వారూ వున్నారు. అధర్వణ వేదాన్ని వినియోగించుకొంటే, హిరోషిమాను భస్మం చేసిన అణ్వస్త్రానికి తాతలవంటి వాటిని తక్కువ శ్రమతో, దమ్మిడీ ఖర్చు లేకుండా మనం తయారు చేసుకోవచ్చుననే సూచన యిటీవల వెటకారంగా జరగలేదు; పాశ్చాత్య సంస్కృతి వ్యామోహంలో పడి గీర్వాణ భాషలో గల వైజ్ఞానిక సంపత్తిని గుర్తించ లేకపోతున్నవారికి కనువిప్పు కోసమే జరిగింది!!

దీనికేమికాని, ఆంగ్ల భాష ద్వారా పాశ్చాత్య సంస్కృత ప్రభావం మనపై విస్తారంగా ప్రసరించబట్టే, తన సంస్కృతికి నవోద్దీపనం సిద్ధించింది. అది నవ చైతన్య విలసితమైంది. అయితే చిరాగతమైన మన సంస్కృతితో ఆధునికమైన పాశ్చాత్య సంస్కృతిని మేళవించడం ద్వారా నూతనమైన, విశిష్టమైన, మహోజ్జ్వలమైన ఒక నవ సంస్కృతిని రూపొందించుకొనడానికి మనం చేస్తున్న కృషి పూర్తి కాలేదు. నిజానికి యిట్టి కృషికి సమాప్తి అంటూ లేదు. నిరంతరాయంగా యిది కొనసాగవలసిందే. అయినా మన కృషి ఇప్పటికే గొప్ప ఫలితాల నిచ్చింది. కాబట్టే మన మధ్య ఒక గాంధి, ఒక టాగోర్ ఉద్భవించారు. గౌతమ బుద్ధుని తర్వాత దాదాపు 2,500 సంవత్సరాల తర్వాత అంతటి వాడైన గాంధీజీ, కాళిదాసు తర్వాత ఇంచుమించు 1,500 సంవత్సరాలకు అంతటి వాడైన టాగోర్ తిరిగి భారతావనిపై అవతరించడం నవభారత సంస్కృతి వైభవ విశేషాల ఫలితంగానే కాదా? గాంధీజీ పై భగవద్గీత ప్రభావమే కాక, బైబిల్ ప్రభావం కూడా వున్నది; ఆయన పారాయణం చేసింది తులసీదాసు రామాయణాన్నే కాదు; రస్కిన్, కార్పెంటర్, టాల్ స్టాయ్ ప్రభృతుల రచనలను కూడా, నిజానికి ఆయనలో అంతర్భూతమైన మహత్తర శక్తులన్నింటిని మొట్ట మొదటిగా వెలికి తెచ్చిన ఘనత ఇండియాది కాదు; దక్షిణాఫ్రికాది. ఇదే విధంగా వాల్మీకి, కాళిదాసుల నుంచే కాక, షెల్లీ, కీట్సుల నుంచి కూడా రవీంద్రుడు ఉత్తేజాన్ని పొందాడు.

దాదాపు రెండు మూడు శతాబ్దాల పాటు జీవచ్ఛవాలుగా మిగిలి పోయిన దేశ భాషా వాఙ్మయాలలో నవచైతన్యం ప్రారంభమైంది కూడా ఆంగ్లభాష ద్వారా పాశ్చాత్య సాహిత్యంతోను, సంస్కృతితోను, మనకు పరిచయ పేర్పడిన పిమ్మటనే ఉదాహరణకు మన తెలుగులో మొట్టమొదటి నవల శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు "రాజశేఖర చరిత్ర" అదే గోల్డుస్మిత్ వ్రాసిన "వికార్ ఆఫ్ వేక్ ఫీల్డు"కు అనువాదం కాదుకాని, నిశ్చయంగా దానికి అనుసరణ. పోతే, మోలియర్, షెరిడాన్, నాటకాలతో శ్రీ గురజాడ అప్పారావుకు పరిచయమే లేకపోతే "కన్యాశుల్కం" దాని ప్రస్తుత రూపంలో వెలువడి వుండేది కాదని కూడా చెప్పవచ్చు.

ఆంగ్లేయ భాష ద్వారానే కాక, ఆంగ్లేయుల ద్వారా కూడా మన సాహిత్యానికి, మన సంస్కృతికి విశేష దోహదం చేకూరిందనే సంగతిని అధర్వణ వేదంలోని మంత్రాల ద్వారా అణ్వస్త్రాలను సమకూర్చుకోవలసిందిగా హెచ్చరిస్తున్నవారు గుర్తింపక పోవచ్చు. కాని, తెలుగు వారికి "లోకల్ రికార్డు"లను సేకరించి పెట్టిన వాడు కర్నల్ మెకంజీ;
తాళపత్ర గ్రంథాలను ముద్రించి యిచ్చినవాడు సి.పి. బ్రౌన్; ఆధునిక పద్ధతులపై తొలి నిఘంటువును సమకూర్చినవాడు మరొక బ్రౌన్, కన్నడిగులకు యిలాగే నిఘంటువు సిద్ధపరచినవాడు కిట్టిల్ : మలయాళీలకు గుండెల్ట్ : బెంగాలీలకు విలియం కేరీ.

ఇంతేకాదు విస్మృతి గర్భంలో పడిపోయిన మన దేశచరిత్రను మన కళాక్షేత్రాలను తిరిగి వెలుగులోనికి తెచ్చినవారు సయితం ఆంగ్లేయులే. ఖరోష్ఠి లిపిని చదివే పద్ధతిని ఆంగ్లేయుడొకడు కనిపెట్టి, అశోకుని శిలాశాసనాలలో గల విషయాలను ప్రచురించకముందు ఆ మౌర్య చక్రవర్తిని మనం మరచి పోయాము. నాణెములను పరిశీలించి, చైనా, సింహళదేశాల సాహిత్యాలలో చెదురుగాగల విషయాలన్నింటినీ సేకరించి అలహాబాద్ కోటలో గల అశోక స్తంభం పై గల ప్రశస్తిని కనిపెట్టి, ఆంగ్లేయులు సముద్ర గుప్తుని చరిత్ర వ్రాయడానికి ముందు ఆ గుప్త చక్రవర్తి కూడా మనకు కనుమరుగై పోయాడు. మహారాష్ట్రుల చరిత్రను ఓంప్రథమంగా వ్రాసినవాడు జేమ్స్ గ్రాంట్ డఫ్; శిఖ్ఖుల చరిత్రను కూర్చినవాడు మౌంట్ స్టూవర్ట్ ఎల్ఫిన్సన్; రాజస్థాన కథావళిని గ్రథితం చేసినవాడు మెడోస్ టెయిలర్. కొన్ని శతాబ్దాలపాటు వాటి వునికి సయితం తెలియకుండా పోయింది. అపుడు సాంచీ స్థూపాన్ని, అజంతా గుహలను కనుగొన్నవారు ఇద్దరు బ్రిటిష్ మిలిటరీ ఆఫీసర్లు. అమరావతి శిల్పాలు సున్నపు బట్టీలలోనికి పోకుండా కాపాడినవాడు గుంటూరు జిల్లా బ్రిటిష్ కలెక్టర్. హరప్ప, మొహంజొదారోలను కనుగొన్నవాడు కాకపోయినా వాటిలో దాగివున్న అయిదువేల సంవత్సరాల నాటి చరిత్రను పూసగ్రుచ్చినట్లు లోకానికి చెప్పినవాడు సర్ జాన్ మార్షల్. నాగార్జున కొండ విషయంలో ఇట్టి సేవ చేసినవాడు ఎ. హెచ్. లాంగ్ హస్ట్. సంస్కృత భాషలో గల మత, సాహిత్య గ్రంథాల సంగతిని ప్రపంచానికి తెల్పినవారు సర్. విలియం జోన్స్, ఛార్లెస్ విల్కిన్స్, మాక్స్ ముల్లర్, మోనియర్ విలియమ్స్, ఎ.ఎ. మాక్డానెల్, ఎ.బి. కీత్, ఎస్. లెవి మొదలైన పాశ్చాత్య ప్రభృతులు. విజాతీయులైనా, ఇంతమంది, ఇంతగా అనుపమ సేవ చేయబట్టే మనకొక ప్రాచీన చరిత్ర కలదని ఒక విశిష్ఠ సంస్కృతి కలదని ఈనాడు మనం చెప్పుకో గలుగుతున్నాం. అయినా, ఆంగ్లేయ భాష మన నెత్తిని అణచిందని, పాశ్చాత్య సంస్కృతితో పొత్తువల్ల మనకు మహాపచారం జరుగుతున్నదని, సంస్కృత భాష తప్ప, వేద సంస్కృతి తప్ప, మనలను సముద్ధరించగల్గింది లేదని వాదిస్తున్న వారిని ఏమన్నా, అది తగినంత తీవ్ర విమర్శ కాగలదా?

(ఆంధ్రప్రభ 8-12-1955)

15

విభిన్న జాతులకు, సంస్కృతులకు, సమన్వయం సాధించవలెనన్న ప్రగాఢ వాంఛతోపాటు, అందుకు తగు ప్రత్యేక శక్తి కూడా ఇండియాకున్న గొప్ప వరప్రసాదమని, భిన్నత్వం నుంచి ఏకత్వాన్ని సాధించడంలో దానికి చాలింది లేదనీ, భారతీయ నాగరికతను క్లుప్తంగా సమీక్ష చేసిన సి.ఇ.ఎం. జోడ్ వ్రాశాడు. పరాయివారి నుంచి తాను ఎరవు తెచ్చుకున్నదాన్ని సొంతం చేసుకొనడంలో అది ఎరువు సొమ్ము అనే సంగతిని మరపించడంలో ఇండియాకు యీడురాగల దేశం మరిలేదని సంస్కృత సాహిత్య చరిత్రను వ్రాసిన ఎ.బి. కీత్ మెచ్చుకున్నాడు. అన్య సంస్కృతుల ప్రభావాలను పెక్కింటిని ఇదివరలో మహాద్భుతంగా తనలో అంతర్లీనం చేసుకో గలిగిన భారతీయ సంస్కృతి పాశ్చాత్య సంస్కృతితో కూడా సమన్వయాన్ని సాధించి నవోత్తేజాన్ని పొందనున్నట్టు" ది వండర్ దట్ వజ్ ఇండియా" అనే ఉద్ధంథాన్ని వ్రాస్తూ, తనను స్నేహ పూర్వకమైన మ్లేచ్ఛునిగా వర్ణించుకొన్న ఎ.ఎల్. భషాం విశ్వసిస్తున్నాడు. విజాతీయ విధానాలు, పద్ధతులు తాత్కాలికంగా దేశంలోకి చొచ్చుకొని వచ్చినా త్వరలో వాటి పై జాతీయత ముద్రను బలంగా వేసి, తన జీవన స్రవంతిలో వాటిని అంతర్భూతం చేసుకొనడం భారతీయ చరిత్రలో పదేపదే జరిగిందని భారతీయ చిత్ర, శిల్ప కళల చరిత్రను వ్రాసిన బెంజమిన్ రౌలండ్ ఉద్ఘాటిస్తున్నాడు.

ఇదే విధంగా విదేశీయ ప్రముఖుల అభిప్రాయాలను మరి పెక్కింటిని ఉదాహరించవచ్చుగాని, మన సంస్కృతికున్న వైశిష్ట్యమేదో, దానికున్న విలక్షణత్వమేదో మనకు తెలియనినాడు పరులెంత చెప్పినా అది ఆకళింపుకురాదు. నదులనేకం; సముద్రమొక్కటి. మార్గాలనేకం. గమ్య స్థానమొక్కటి. నామరూపాలనేకం; పరమేశ్వరుడొక్కడు; పూజలనేకం; ఫలమొక్కటి! ఈ విభిన్న సూక్తులలో గర్భితమైన ఏక సత్యమే భారతీయ సంస్కృతికి మూలం. నదులను మించి నదీ సంగమాలు మనకు పుణ్యక్షేత్రాలైంది ఈ కారణానే. మూడు సముద్రాలేకమయ్యే కన్యాకుమారి అగ్రం మనకు యాత్రాస్థలమైంది. ఈ కారణానే. శివుని మించి, పార్వతిని మించి, అర్ధనారీశ్వరుడు మన పూజలను ఎక్కువగా అందుకొనడం ఈ కారణానే. నరనారాయణులను ఏకసూత్ర నిబద్ధులనుగా మనం చేయగలిగిందీ ఈ కారణానే. ఈ విశిష్ట సంస్కృతిని తనలో మూర్తీభవింప జేసుకొన్నవాడు కాబట్టే, తన ప్రార్థనలతో గాంధీజీ భగవద్గీతకు, బైబిల్ కు, ఖొరానుకు, జెండవెస్టాకు, గురుగ్రంథ సాహెబ్ కు సమాన స్థానమివ్వగలిగాడు; “అహింసా పరమోధర్మః:”, “సత్యమేవ జయతే” అన్న ప్రాచీన ధర్మ సూత్రాలను ఆధునిక యుగానికి - రాజకీయ రంగానికి అనువర్తింపజేసి, అపూర్వమైన ఒక ప్రజా విప్లవాన్ని కొనసాగించి, నవభారత నిర్మాత కాగలిగాడు.

గాంధీజీ వలే నెహ్రూ కూడా భారతీయ సంస్కృతీ స్వరూపాన్ని హృద్గతం చేసుకొన్నవాడే. దాని స్వరూపాన్ని సాక్షాత్కరింప జేసుకొనడానికి ఆయన చేసిన తపస్సుకొక నిదర్శనమే ఆయన రచించిన "డిస్కవరీ ఆఫ్ ఇండియా". సుమేరియన్, అసీరియన్, బాబిలోనియన్, ఈజిప్షియన్, గ్రీక్ సంస్కృతులవలె ఏ యెడారులలోనో యింకిపోకుండా, ఏ కొండలలోనో దాగిపోకుండా, భారతీయ సంస్కృతి, జీవనది వలె నేటికీ అవిచ్ఛిన్నంగా ప్రవహించడానికి కీలకం ఏమై వుంటుందని ఈ గ్రంథంలో ఆయన పదేపదే ప్రశ్నించుకొన్నాడు. దీనికి ప్రత్యుత్తరం కోసం హరప్పా, మొహెంజొదారోల కాలం నుంచి, ఈనాటి వరకు భారతీయ చరిత్రను సంశోధించాడు. ప్రపంచ చరిత్రను కూడా ఇందుకోసం వడపోశాడు. ఈ విపులాన్వేషణ తర్వాత ఆయన చేసుకొన్న తీర్మానం - “భారతావనిలో నిరంతరాయంగా సాగుతున్న క్రొత్త పాతల సమన్వయమే భారతీయ సంస్కృతి అమరత్వానికి ఆధారభూతమని.”

“సంస్కృతం - సంస్కృతి" శీర్షిక క్రింద ఇంతకు ముందు మేము వ్రాసిన పద్నాలుగు సంపాదకీయాలలోనేమి,

నేడు వ్రాస్తున్న చివరిదానిలో నేమి మా మనవి కూడా క్రొత్త పాతల సమన్వయ సాధన ఒక్కటే మన సంస్కృతి వికాసానికి మార్గమని, ఇట్టి సమన్వయాన్నే కోరుతుంటే "సంస్కృత భాషకు భారతీయ సంస్కృతితో అవినాభావ సంబంధం కల" దని, "వేదాలలోనిదే మన సంస్కృతి" అని, వేదాలే మానవ విజ్ఞాన సర్వస్వాలని, వేద ఋక్కుల మాధుర్యాన్ని అనుభవించలేక పోవడం జడత్వానికి చిహ్నమని, ఆంగ్లేయ భాష మన నెత్తిని అణచివేసిందని, పాశ్చాత్య ప్రపంచంతో సంబంధం పెట్టుకొంటే మన సంస్కృతి మైలపడిపోతుందని వాదించడం తగదు. ఈ వాదంలో గర్భితమైన వైఖరి మన సంస్కృతిని పెంపొందించదు. దాన్ని ఏడు నిలువుల లోతున పాతి పెడుతుంది.

ఇదివరలో కూడా వివరించినట్టు, మా ప్రాతికూల్యం, సంస్కృత భాషా పోషణకు కాదు; దాన్ని నిర్బంధ పఠనీయ భాషగా చేసి తీరాలని వాదిస్తున్న వారి సంకుచిత దృక్పథానికే, సంస్కృత భాష మనది; దానిలో గల సాహిత్యం మనది. విజ్ఞానం మనది. సంస్కృతం ద్వారానే కాకపోతే, దేశభాషల ద్వారా దానిలో గల సాహిత్యాన్ని గురించి విజ్ఞానాన్ని గురించి, మనం తెలుసుకొంటూనే వున్నాము.
ఇంకా తెలుసుకోవలసింది వుంటే, దేశభాషలలోకి సంస్కృతం నుంచి మరికొన్ని గ్రంథాలను అనువదించు కోవచ్చు; ఇప్పుడున్న అనువాదాలు సంతృప్తికరమైనవి కాకపోతే, కొత్తవాటి కోసం ప్రయత్నింపనూవచ్చు. ఇట్టి అనువాదాలతోనే సంతృప్తి పడలేనివారు స్వయంగా సంస్కృతం అభ్యసింపవచ్చు. కాని నన్నయ, తిక్కన, ఎఱ్ఱప్రగడల అనువాదాన్ని కళ్లకద్దుకొనేవారిని మీరు వ్యాస భారతాన్ని చదివితేనే తప్ప వీలు లేదని నిర్బంధించడం ఈ కవులను గౌరవించడమూ కాదు; "దేశ భాషలలో తెలుగు లెస్స" గా పేరొందిన మన మాతృభాషను గౌరవించడమూకాదు.

పైగా, ఒక భాషగా సంస్కృతం మృతప్రాయం కాకపోవచ్చుగాని, నెహ్రూ అన్నట్టు, నిత్యవ్యవహార భాషగా అది ఎన్నడో మృతప్రాయమై పోయింది. మౌర్యుల కాలంలో అది రాజభాషకాదు. శాతవాహనుల కాలంలో రాజభాషకాదు. కాకతీయుల కాలంలో కాదు, విజయనగర సామ్రాజ్య కాలంలోనూ కాదు. నిజానికి గౌతమ బుద్ధుని కాలానికే అది ప్రజాభాషకాదు. మౌర్య గుప్త సామ్రాజ్యాలకు మధ్య కాలానికి (ఇంచుమించు ఏడువందల సంవత్సరాలకు) సంబంధించిన శిలాది శాసనాలు దాదాపు 1200 లభించగా వాటిలో పది, పన్నెండు కూడా సంస్కృతంలో లేవు. విజాతీయులెవరో రచించిన చరిత్రలోనిదికాదు ఈ విషయం; సంస్కృత విశ్వపరిషత్ అధ్యక్షులైన శ్రీ కె.ఎం. మున్షీ ఆధ్వర్యాన వెలువడుతున్న చరిత్ర గ్రంథాలలోనిదే. కాగా, క్రీస్తుశకం ఏడెనిమిది శతాబ్దాల తర్వాత సంస్కృతంలో వెలువడిన మహోత్కృష్ట గ్రంథాలేవీ లేవు. ఆ భాషాభివృద్ధివలె, దాని సాహిత్య విజ్ఞానాల అభివృద్ధి కూడా ఏనాడో నిలిచిపోయింది. ఏమైనా, ఎన్నో శతాబ్దాలనాడు మనకు నవోత్తేజాన్ని కల్గించడం మానివేసిన సంస్కృతం ఈనాడు కల్గించగల నవోద్దీపనం ఏమున్నది? అది కొత్తగా గరపగల విజ్ఞాన మేమున్నది? మాతృభాషను, మరొక దేశభాషను, జాతీయ భాషను నేర్చుకొనడంతోపాటు, ఏదైనా ఒక విదేశ భాషను అభ్యసించడం అవసరమని నెహ్రూ ఇటీవలనే చెప్పడం అనాలోచితంగా జరిగివుండదు గదా? మనం విధిగా నేర్చుకొనవలసిన భాషల పట్టిక నుంచి సంస్కృతాన్ని ఆయన పొరపాటున విడిచిపెట్టి వుండడుగదా?

మన ప్రయత్నం పాత సంఘాన్ని తిరిగి నిలబెట్టడం కాదు; పాత కాలానికి వెళ్లడమూ కాదు. నవ సంఘాన్ని మనం కోరుతున్నాము; నవజీవితాన్ని లక్షిస్తున్నాము. ఇందుకు మనకు కావలసింది ఆధునిక విజ్ఞానం. విదేశభాషలలో, ముఖ్యంగా పాశ్చాత్యదేశ భాషలలో ప్రవేశం లేనిదే ఇది మనకు లభించదు. అయినా ఇంగ్లీషును యెత్తివేసి, సంస్కృతాన్ని నిర్బంధ పఠనీయభాషగా బోధించాలని కొందరు సూచిస్తున్నారు. ఈ సూచనను అమలు పరచితే, అది భారతీయ సంస్కృతి వికాసాన్ని నిరోధించగలదు; నవ భారతావతరణకే విఘాతం కలిగించగలదు.

(ఆంధ్రప్రభ 9-12-1955)

బౌద్ధ సంస్కృతి

ప్రకృతిని వశపరచుకుని జీవితం సుఖమయం చేసుకోడానికి ఆధునిక మానవుడు అహోరాత్రులు పాటుబడుతున్నాడు. దానినే ఒక విలక్షణమైన నాగరికతగా భావిస్తున్నాడు.

భౌతికశాస్త్ర పరిజ్ఞానం ద్వారా బాహ్య జీవితం సుఖతరమైనట్టు కనిపిస్తున్నదేగాని ఆధునిక మానవుడు నిజమైన శాంతిని, ఆనందాన్ని అనుభవించ గలుగుతున్నాడా? జీవిత సమస్యలను - వ్యక్తికి సంబంధించినవిగాని, సంఘానికి సంబంధించినవేగాని - తృప్తికరంగా పరిష్కరించుకో గలుగుతున్నాడా?

భౌతికశాస్త్ర విజ్ఞానంపై ఆధారపడిన నాగరికత పెరిగిన కొద్దీ వ్యక్తికీ వ్యక్తికి, దేశానికీ దేశానికి, జాతికీ జాతికి సంఘర్షణ హెచ్చుతున్నది. మానవ హృదయం సంతత సంక్షోభ సంతాపాలకు క్షేత్రమౌతున్నది.

"నాగరిక మానవుడు" నిత్యానిత్య వస్తువివేచనను కోల్పోయి, పారలౌకిక చింతను విడనాడి, భౌతిక వాంఛల పైనే మనస్సును కేంద్రీకరించడం చేత ప్రకృతి వశీకరణలో కృతకృత్యుడై కూడా అతని జీవితంలో అసమగ్రత, అసమత, చంచలతలు కనిపించుతున్నవి.

ఈ వెలితిని కప్పిపుచ్చి, జీవితానికి సమగ్రతను సమకూర్చుకోడానికి "నాగరిక మానవుడు" ఇంతటనైనా ఆధ్యాత్మిక తత్వాన్ని కొంత అలవరచుకొనడం, దేహేంద్రియ సంబంధమైన తృష్ణను కొంతవరకు నిర్జించుకొనడం, నైతిక విలువలను పునరుద్ధరించుకొనడం అవసరం.

మరికొందరు ఈ ధోరణిలో కొన్ని వ్యాసాలను కూడ వ్రాశారు. ప్రజలలో పట్టుదల పెరిగింది. నాగార్జునకొండ శిల్పాలను మద్రాసు చేరవేయాలని వచ్చిన లారీని ప్రజలు నిరోధించారు.

ఈ విధంగా ఆ వ్యాసం మన శిల్పసంపదను కాపాడినందుకు మనం ఆనందించుదాం. ప్రపంచంలో వెలసిన ప్రధాన మతములన్నీ పై ధర్మాన్ని ప్రబోధించినా, ప్రేమ, త్యాగం, కారుణ్యం, వైరాగ్యాలకు విశేష ప్రాధాన్యాన్ని ఇచ్చింది బౌద్ధధర్మం.

మితిలేని వ్యక్తి, జాతిగత విద్వేషాలకు నిలయమై, ప్రచండ హింసాయుతమైన రెండు ప్రపంచ సంగ్రామాలచే మలినమైన ఆధునిక మానవ సంఘానికి సర్వభూత సమహితమూ, కారుణ్య రసపూరితమూ అయిన బౌద్ధ ధర్మ ప్రబోధన అమూల్యమనడానికి సందేహం లేదు.

ఇప్పటికి 2,500 సంవత్సరాల క్రితం భారతభూమిలో ప్రభవించి ఆసియాఖండమంతటికీ వ్యాపించి, బౌద్ధధర్మం నేటికి తక్కిన మతావలంబకులకంటె మానవాళిలో ఎక్కువ మందిని ఆకట్టుకొని వున్నది.

యావద్భారత ఖండాన్ని జయించి సాధించలేని కీర్తిని, ఔన్నత్యాన్ని అశోకచక్రవర్తి బౌద్ధమత వ్యాప్తి చేత తద్ధర్మ సంవర్ధనంచేత శాశ్వతంగా ఆర్జించుకోగలిగాడు.

బర్మా, సయాం, చైనా, జపాన్, కంబోడియా, సింహళం మొదలైన వివిధ దేశాలలో అమరజ్యోతులను వెలిగించిన బౌద్ధధర్మం తన జన్మస్థానమైన భారతదేశంలో వృద్ధిపొందక పోవడానికి కారణం బహుశా దాని ముఖ్య సిద్ధాంతాలను హిందూమతం జీర్ణించుకొని తనవిగా చేసుకొనడం కావచ్చు.

హిందూ, బౌద్ధమత సిద్ధాంతాలలో కొన్ని భేదాలున్నప్పటికీ బుద్ధ భగవానుని హిందువులు అవతారపురుషునిగా పరిగణించడం ఎన్నదగింది.

బౌద్ధ ధర్మావలంబనంపట్ల, బౌద్ధ సంస్కృతి యెడల భారతీయులు శ్రద్ధాళువులు కావడంగాని, బౌద్ధధర్మ పునరుద్ధరణకు ప్రపంచంలోని బౌద్ధ మతావలంబకులు యావన్మందీ భారతదేశంవైపు దృక్కులు సారించడంగానీ హర్షణీయం.

సాంచీలో జరిగిన అంతర్జాతీయ బౌద్ధ సంస్కృతీ మహాసభలో పాల్గొన్న నానాదేశ ప్రతినిధులు ప్రకటించినట్టు బౌద్ధ సంస్కృతీ పునరుజ్జీవనం ద్వారా భారతదేశానికీ, అశేష ఆసియా ఖండానికీ గల బాంధవ్యం మరింత సన్నిహితమూ, సుదృఢమూ కాగలదని ఆశించవచ్చు. (ఆంధ్రప్రభ 2-12-1952) మనకు సంక్రమించిన కళాసంపత్తి అమూల్యమైనది.

కళా సంస్కృతులు

సాంచి, సారనాథ్, అజంతా, అమరావతి, ఎల్లోరా, ఎలిఫెంటా, ఆబూ, ఆగ్రా, కార్లీ, కోణార్క, బాఘ్, భువనేశ్వర్, పూరీ, పాట్నా, నలందా, మార్తాండ, మహాబలిపురం, బేలూర్, బెస నగర్ - ఇట్టి క్షేత్రా లెన్నెన్నో ఒకనాడు కళారంగంలో మన దేశంలో సాధించిన మహా విజయాలను ఈనాటికి వేనోళ్ల చాటుతున్నాయి. ఈ అశేష కళాక్షేత్రాలలో ఏ ఒక్కదాన్ని సృష్టించినప్పటికీ, కళా శిఖరాలను అందుకున్న అన్యదేశాల సరసను ఇండియాకు గౌరవస్థానం లభించివుండేదే!

ఇక భారతీయ సంస్కృతీ విశిష్టతకు పర్షియా మొదలు, ఫిలిప్పీన్స్ వరకు ప్రతి దేశం ఎంతో కొంతవరకు సాక్షీభూతమే. ఈ అన్ని దేశాలపై మన సంస్కృతీ ప్రభావం ప్రసరించింది; ఇవన్నీ కూడా మనకు ఋణపడి వున్నాయి.

మన ఈ కళా విభూతిని, మన ఈ సంస్కృతీ విభవాన్ని పరిరక్షించుకొనవలెనని మనం వాంఛించడం సహజమే. అమూల్య వారసత్వంగా మనకు సంక్రమించిన కళా సంస్కృతీ సంప్రదాయాలను కాపాడు కొనడానికి ఇప్పటికైనా మనం పూనుకొనక పోతే, సున్నము కలకత్తాలో ఇండియా విద్యామంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ హెచ్చరించినట్టు, అవి పూర్తిగా అంతరించిపోగల ప్రమాదం కలదనడం కూడా నిజమే.
అయితే, మన కళా సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకొనగోరే సందర్భంలోనేమి, కళాసంస్కృతీ రంగాలలో పూర్వోన్నతికి తగు మహోచ్చస్థానాన్ని తిరిగి ఆక్రమించుకొనగోరి సందర్భంలోనేమి ఒక మహత్తర సత్యాన్ని మనం

విస్మరించరాదు. కళ దేశకాల పాత్రలకు అతీతమైనది కాదు; సంస్కృతి సంఘ జీవిత ప్రభావీచిక తప్ప తదన్యం కాదు.

గౌతమబుద్ధుడు మన దేశంలో తల యెత్తనే లేదనుకోండి. బౌద్ధమతాన్ని ఆయన ప్రచారం చేయనే లేదనుకోండి. అయితే, సాంచి, సారనాథ్, అజంతా, అమరావతి ఏదీ వుండేది కాదు. "బుద్ధం శరణంగచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి" - ఈ ఆత్మార్పణే కొండలను తొలిపించింది; ఇదే రాళ్ళను పలికించింది; ఇదే రంగులతో నాట్యాన్ని చేయింపించింది.

బౌద్ధానికి ముందు, దాని తర్వాత హిందూ సంఘంలో కులవిభాగాలు లేవనుకోండి; "కుల విద్యకు సాటిలేదు గువ్వలచెన్నా!" అనే విశ్వాసమే లేదనుకోండి. అయితే, కంచి, కోణార్క మధుర, మార్తాండ - ఏదీ వుండేది కాదేమో! కులవిభాగాల కారణంగా, కుల వృత్తుల కారణంగా, తండ్రి శిల్పి అయితే, కొడుకు కూడా శిల్పి. తన నాళాలలోని రక్తంతోపాటు తన అంగుళీయాలలోని శిల్ప చాతురిని కూడా కుమారునికి సంక్రమింపజేయడానికి ప్రతి శిల్పి ప్రయత్నించేవాడు. ఆ ప్రయత్నంలో తాను సాఫల్యాన్ని పొందినప్పుడే తన జన్మసార్థకమైనదని భావించేవాడు.

మొగల్ పాదుషాలు సకల భాగ్యభోగాలలో ఓలలాడ లేదనుకోండి; "భూతలంపై స్వర్గమే వుంటే, అది ఇక్కడున్నది; ఇక్కడున్నది; ఇక్కడున్నది" అని సగర్వంగా చాటుకొనగల విభూతికి వారు నాథులు కాలేదనుకోండి. అయితే, లాల్ ఖిల్లా లేదు; తాజ్ మహల్ లేదు; ఫతెహపూర్ సిక్రీలేదు.

ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా, కళలు ధరించగల స్వరూపాన్ని నిర్ణయించేది అక్కడి - అప్పటి - సాంఘిక వ్యవస్థే; ఆ వ్యవస్థను నడిపే శక్తులే. ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా సంస్కృతీ స్వభావాన్ని నిర్ణయించేవి అక్కడి - అప్పటి - ప్రజా హృదయపరిణతే; ఆ పరిణతికి దోహదం కూర్చే శక్తులే.

ఇప్పుడు పూర్వపు కులవిభేదాలు అంతరిస్తున్నాయి, సాంఘిక వ్యవస్థ మారిపోతున్నది, విశ్వాసాలు సడలిపోతున్నాయి, మనః ప్రవృత్తి పరివర్తనం చెందుతున్నది. గతించి పోయిన కాలంవైపుకు నడవడం కాని, ఒకనాటి కళాసంస్కృతుల రూపాలనే యథాతథంగా పునరుద్ధరించుకొనడం కాని, మనం ప్రయత్నించినా, సానుకూలంకాని కార్యం. వెనుకటి రాజులు ఈనాడు లేరని విలపించక, మన కొత్త సంఘానికి, దాన్ని నడిపిస్తున్న శక్తులకు అనుగుణమైన విధంగా కళాసంస్కృతులను పరిఢవిల్ల జేసుకొనడానికి యత్నిస్తేనే, మనకు తిరిగి పురోభివృద్ధి సాంఘిక వ్యవస్థ నిస్సందేహంగా బలహీనపడుతున్నది. కాని, కొత్తది ఇప్పటికీ ఒక స్థిర . . రూపాన్ని ధరించలేదు. పాత విశ్వాసాలు పలచబడుతున్నవి కాని, కొత్తవి ఇంకను ఘనీభవించలేదు. పాత మనస్తత్వమేమో చెదరిపోతున్నది కాని, కొత్తది నేటికీ కుదురుకోలేదు. ఈ పరిస్థితిలో ముందుదారి నునకు చక్కగా కనబడదు. ఎటు అడుగును ముందుకు వెయ్యాలో తెలియక, తప్పుదారి వెంటపడినా పడవచ్చు. ఏమైనా, అడుగు ముందుకు పడవలసిందే కాని, వెనుకకు కాదు. ఆ పని చేస్తే మనం ఎన్ని చిక్కులతో కూడిన దారివెంట, ఎంతదూరం నడిచినా, చివరికి గమ్యస్థానాన్నే చేరగలము. (ఆంధ్రప్రభ 1-9-1949)

అజంతా చిత్రకళ

చూచిన ఒక దృశ్యాన్ని వర్ణించడం సులభమేమో కాని, జీవించిన ఒక అనుభూతిని వర్ణించడం సులభమా? ఇరుకు కొంప నుంచి కదిలి, ఇరుకు బజార్లవెంట నడిచి, అపారమైన సముద్రపు అంచున నిలిచినప్పుడు మనం పొందే అనుభూతిని వర్ణించడం సులభమా?

మన పరిమిత జీవితాలలోని పరిమిత సమస్యలతో కంటికి నిద్ర దూరమైనప్పుడు తలయెత్తి అనంతాకాశంలోని అనంతకోటి నక్షత్రాలను పరికించినంతనే మనం పొందే అనుభూతిని వర్ణించడం సులభమా ?

భుక్తి కోసం పగలంతా పదరాని పాట్లుపడి, విసిగివేసారి ఇంటికి చేరుతుండగా, నవ్వుతూ కేరుతూ గడపలో కాళ్లకు అడ్డంపడే ముద్దుబిడ్డ నెత్తుకున్నప్పుడు మనం పొందే అనుభూతిని వర్ణించడం సులభమా?

పచ్చని చెట్టుగాని పచ్చిక బయలుగాని చెదురుగా కానవచ్చే బస్తీలో బ్రతుకుతూ, గాలికి తలలు కెరటాల వలె వేచిపడుతుండగా, దిశ్చక్రాన్ని అంటుతున్నట్టు కానవచ్చే పచ్చని వరిచేలను చూచినప్పుడు కలిగే అనుభూతిని వర్ణించడం సులభమా?

హృదయాన్ని ఊపే ఏ అనుభూతినీ - జీవితాన్ని కదిలించే ఏ అనుభూతినీ సులభంగా వర్ణించలేము.
ఇటీవలనే అజంతా, ఎల్లోరాలను చూచివచ్చిన నన్ను ఏమి చూచి వచ్చినావని మిత్రులడిగినప్పుడు నేను వారికి సులభంగా గాని, సవిస్తరంగా గాని సమాధానం చెప్పలేక పోవడానికి నేను ఆ దృశ్యాన్ని చూచి రావడం కాక, ఆ అనుభూతిని జీవించి రావడమే కారణమై వుండాలి.

జల్గామ్ కు దక్షిణంగా 35 మైళ్ల దూరాన, ఔరంగాబాద్ కు ఉత్తరంగా 55 మైళ్ల దూరాన అజంతా గుహలున్నాయి. వాటి పరిసర ప్రాంతాల ప్రకృతి సౌందర్యాన్ని చూస్తే, అజంతా గుహలలోని భారతీయ చిత్రకళ అంతకుముందుగాని, అటు తర్వాతగాని అందుకొన నంతటి మహోన్నత శిఖరాలను అందుకొన గలగడానికి ఒక ముఖ్య కారణం స్పష్టం కాకపోదు.

గుహలను సమిపిస్తుంటే, ఇటుపచ్చని కొండ-అటు పచ్చని కొండ-ఈ రెండు కొండలకు మధ్య వాఘోరానది. గుహలను చేరడానికి ఆ నది అంచువెంట అది రాళ్ల గుట్టల గుండా జలజల ప్రవహిస్తూ పాడుకునే పాటలను వింటూ, మీ కాలి నడక, నా పైన నీలాకాశం. మిమ్ము అలరిస్తూ అడవి పువ్వులు, మిమ్ము ఆవరిస్తూ ఆ పువ్వులు కమ్మని నెత్తావులు. గుహలను చేరే వరకు రెండు, మూడు మెలికలను కాబోలు మీరు తిరుగుతారు. ఏ మెలికలో, అడుగు పెడితే, దానికి అదే ఒక ప్రపంచం .

ఇటుకొండ అటుకొండ ముందుకొండ -వెనకకొండ -పైనకొండ -పక్కనే నది నీలాకాశం - నీలాలనీళ్లు - పచ్చని చెట్లు- కమ్మనితావులు- అదివేరే ప్రపంచం -అదొకస్వాప్నిక జగత్తు- భూలోక స్వర్గం ఈ వాక్యానికి తుది

మొదలు లేనట్టున్నది. అయితే, అజంతా గుహలను సమీపించగానే తుది మొదలులేని జగత్తులోకే నేను ప్రవేశించాను. ఆ దృశ్యాన్ని తలచుకున్నా అంతే జరుగుతున్నది.

మీకు ఇటువుండే కొండ - అటువుండే కొండ - మిమ్ము మెలికలు తిప్పించే కొండ - అన్నీ ఒక్కటే. కొండ చివరి మెలికే వాఘోరానది జన్మస్థానం. నేను కొండ పైకెక్కి చూడలేదుగాని, పైన ఏడు కొలనులున్నాయట. కొలనునుంచి కొలనుకు జాలువారుతూ, 250 అడుగుల ఎత్తు నుంచి పెద్ద ధారగా, వాఘోరానది కొండ దిగువకు దూకుతుంది. దూకిన తర్వాత, కొండ తిరిగిన మలుపులన్నీ తానూ తిరుగుతూ, సమతల ప్రదేశానికి చేరి, కొన్ని వందల మైళ్లు ప్రవహించి, తపతిలో కలుస్తుంది.

వాఘోరా పుట్టినచోటనే వున్నాయి అజంతా గుహలు. వెతుక్కుంటూ వెడితేనేకాని, సాహసించి వెడితేనేకాని - కనబడదు ఆ చోటు. వాఘోరా జన్మస్థానం తెలుసుకోవాలనే కుతూహలంతో ఏ సాహసికుడు ఆదిలో అక్కడికి వెళ్ళాడో! ఇప్పుడు కొండను త్రవ్వి, నది గట్టున రోడ్డు వేశారు. ఆదిలో ఇటుకొండ - అటుకొండ - మధ్యలో నది - నడవడానికి దారైనా వుండేది కాదట; నది మధ్యనుంచే - మరీ విపరీతంగా వర్షాలు కురిస్తేతప్ప నదిలో నీళ్లు మోకాటిలోతైనా వుండవునడవ వలసి వచ్చేదట.

వావోరా పుట్టినచోట కొండ అర్థచంద్రాకారంగా వుంటుంది. దాని ఒక వంపులో అజంతా గుహలుండగా, రెండవ వంపు పైన వలయాకారంలో ఏదో ఒక కట్టడం కనబడుతువుంటుంది. దాన్ని "వ్యూపాయింట్" అంటారు. మధ్యకాలంలో కొన్ని శతాబ్దాల పాటు అజంతా గుహ లన్న మాటే ప్రపంచానికి తెలియకుండా పోయింది. మేజర్ గిల్ అనే బ్రిటిష్ మిలిటరీ ఆఫీసర్ 1819లో వేటకు వెళ్లి, ఒక జంతువును తరుముకుంటూ కొండ పైకి పోగా, ఎదురుగుండా గంజరుట్ల పందునుంచి - ఏదో చెక్కడపు పని అతడి దృష్టిని ఆకర్షించిందట. సాహసించి అతడు కొండదిగి, వాహారానదిని దాటి, తిరిగి కొండపైకి మాత్రికి చూడగా, తనకు అల్లంత దూరంలో చెట్టపందుగా కానవచ్చింది అజంతా గుహలలో పదహారపదాని బోధామని తేలిందట. లోకం మరచిపోయిన అజంతా గుహలను వేడి గల ఏ ప్రదేశం నుంచి తొలిసారిగా చూచినాడో అదే "వ్యూ పాయింట్ వ్యవడి లేక నేను పెల్లదు గాని, చాలామంది "వ్యూ పాయింట్ కు వెళ్లి, అక్కడి నుంచి అజంతా గుహలను ఔద్దాలకి క్షీణడకట్టిన ఘట్టంలో అజంగారహల అస్తిత్వాన్ని సయితం సభ్యలోకం విస్మరించింది. అయితే బందిపోటు దొంగలు మాత్రం వాటి ఉనికిని క్రీస్తుశకం తొమ్మిదవ శతాబ్ది తర్వాత ఎప్పుడో గుర్తించారు. చుట్టుపక్కల ఊర్లను, స్త్రీలను దోచుకుని, ఆ గుహలలో వారు నివసిస్తూ వుండేవారు. వంటలు చేసుకోవడానికి వారు పెట్టుకున్న పొయ్యిల పొగలతోనే పెక్కు గహలలోని కుడ్యచిత్రాలు మసిపూసుకుని పూర్తిగా చెడిపోయాయి. పూర్వపు రోజులలో వాహౌరావడి అంచులు వెంటు ప్రవాహం మధ్యనుంచి అజంతా గుహలకు చేరే చాల ప్రస్తుతం పొగడాలవన్న హలకు దారి తీసేది కాబోలు. అందువల్ల వీటిలోనే బందిపోటు దొంగలు కాపురం పెట్టివుండా, వారికి జలగంగా అందుబాటులో లేకపోవడమే రెండవ గుహలలోని కుడ్య చిత్రాలు నేటికీ అంతగా చెక్కుచెదరకపోవడానికి కారణమైవుండాలి. ప్రలోభపూరితమైనది ఆ మంచం, ఓటలో పారం, వైద్యం, క్రౌర్యం, కృతఘ్నత మొదలైన ఆవగుణాలే అధికంగా కానవస్తాయి. సిలో మానవుని జీవితం దుగరాజనం - మన ప్రపంచాన్ని గురించి బౌద్ధ భిక్షువుల అభిప్రాయ మిదే, మానవ ప్రపంచము పట్ల - మానవునిపట్ల - వారి అభిప్రాయం ఎంత నిరసన పూర్వకమైన తెలియడానికి అజంతా గుహలలో వారు చిత్రించిన కొన్ని కథలే నిదర్శనాలు అందులో ఒకటి:

అడగండా పెడుతున్న ఒక బాటసారి ఒక గుంటలో పడిపోతాడు. అతడి ఏడుపు విని, అతడిపై జాలిగాని, ఒక కోతి అతడిని తన వీపుపై ఎక్కించుకుని ఒడ్డుకు చేర్చుతుంది. తనకు ఆ కోతి చేసిన మేలును అంతలోనే మరిచిపోయి, అతడు దాన్ని పట్టుకుపోబోతాడు. అంతల కోతులన్నీదేరి అతడిని ముట్టడిస్తాయి. భయపడిపోయి, మన్నించమంటూ అతడు ప్రాధేయపడతాడు. ఇకనైనా బుద్ధి కలిగి వుండమని చెప్పి, ఆ కోతులు అతడిని ప్రాణాలతో మానవ ప్రపంచాన్ని గురించి, మానవుని గురించి ఇంత విరసన పూర్వకమైన అభిప్రాయం తమకున్నందువల్ల బౌద్ధ శిల్పులేమి, చిత్రకారు లేమి, అతడి ప్రపంచం నుంచి, అతడి నుంచి పారిపోవడానికి ఒక ప్రత్యేక ప్రపంచంగావున్న వాఘోరానది జన్మస్థానాన్ని తమకళా వైదగ్య ప్రదర్శనానికి స్థావరంగా చేసుకొని వుండాలి.

అయితే, మానవుడు ఎంతటి దుర్గమ ప్రదేశానికి వెళ్లినా, ఎంతటి నిర్జన ప్రదేశంలో దాగొన్నా ప్రపంచం నుంచి ఎంత దూరం పారిపోయినా, ప్రపంచం అతడిని వెన్నాడక మానదు. అతడిలోని అణువణువులో ప్రపంచం వున్నప్పుడు, ప్రపంచం నుంచి తాను పారిపోయినానని అతడనుకొనడం కేవలం భ్రమే! ఈ నిత్యసత్యాన్నే ఈ నగ్నసత్యాన్నే అజంతాలోని చిత్రాలలో ప్రతి ఒక్కటీ చాటుతున్నది. ఏ ప్రపంచంనుంచి ప్రాచీన కాలపు ఈ బౌద్ధ స్థపతులు శిల్పులు, చిత్రకారులు పారిపోయినారో, ఆ ప్రపంచాన్నేవారు తమ నిర్జన ప్రదేశంలో, తమ ఏకాంతవాసంలో, సృష్టించుకున్నారు. అయితే, వారు సృష్టించుకున్న ప్రపంచం వారు పారిపోయిన ప్రపంచం కంటె సుందరమైనది. మధురమైనది, ఉత్కృష్టమైనది, ఉదాత్తమైనది, గంభీరమైనది. దానిలో వారు మానవుని కంటె మర్కటాన్ని ఉత్తమజీవిగా చూపించి వుండవచ్చు. అయినా, అది మానవ ప్రపంచమే.

ఈ విషయాన్నే ఈ క్రింది పలుకులతో జవహర్ లాల్ నెహ్రు వివరించాడు. “అజంతా మనకు ఏదో స్వాప్నిక జగత్తులోకి తీసుకువెడుతుంది. అయినా, అది అతివాస్తవికమైనలోకమే, ఈ కుడ్యచిత్రాలను చిత్రించినవారు బౌద్ధ భిక్షువులు. స్త్రీలకు దూరంగా తొలగండి; వారిని కన్నెత్తి చూడనైనా వద్దు; వారు మిమ్ము ప్రలోభపెడతారు, వారు మిమ్ము పతితుల్ని చేస్తారు - ఇదే వారి గురుదేవుడు వారికి చేసిన బోధ. అయినా, ఇక్కడ అందాలొలుకుతున్న స్త్రీలు అశేషంగా వున్నారు. రాకుమార్తెలు, గాయనీమణులు, నృత్యాంగనలు ఎక్కడ చూసినా స్త్రీలే. కూర్చున్న వారు కొందరు, నిలబడివున్నవారు కొందరు, ముస్తాబుచేసేవారు కొందరు, ఊరేగింపుగా వెళుతున్నవారు కొందరు ఎంతో పేరొందిన వారు ఈ అజంతా స్త్రీలు. సన్యసించిన వారైనా ఈ చిత్రకారులకు ఈ జగన్నాటకం ఎంత చక్కగా తెలుసు! బోధిసత్వుని అలౌకిక సుందర విగ్రహాన్ని, ఆయన అంత గంభీరమూర్తిని చిత్రించిన భక్తి శ్రద్ధలను ఈ జగత్తును చిత్రించుటలో వీరు చూపించారు. అజంతా గుహలు మొత్తం 29. వాటిలో అయిదు బౌద్ధ చైత్యాలైతే, మిగిలినవి బౌద్ధవిహారాలు, మొత్తం 29లో, రెండింటినో, మూడింటినో ప్రారంభించి, పూర్తి చేయకుండానే ఆపివేశారు. ఈ రెండు మూడింటిలో తప్ప మిగిలిన అన్నింటిలోను ప్రతి స్తంభాన్ని, ప్రతి కుడ్యాన్ని, చివరికి కప్పులనైనా విడిచిపెట్టకుండా, చిత్రాలతో నింపివేశారు. కాని, ఈనాడు పదమూడు గుహలలో మాత్రమే చిత్రాలు -కాదు వాటి శిథిలాలు మాత్రం - కానవస్తున్నాయి. చెక్కు చెదరకుండా ఎన్నోకొన్ని చిత్రాలు మిగిలింది ఒకటవ, రెండవ, తొమ్మిదవ, పదవ, పదహారవ, పదిహేడవ గుహలలోనే.

గుహల గోడలకు మట్టి గిలాబాచేసి, దానిపై పలచగా సున్నంపూసి, ఆ పూతపై దానితడి ఆరకముందే చిత్రాలను వేశారు. వాన తేమకు మట్టి గిలాబాపొక్కి అది పొరలు పొరలుగా వూడిపోయినందున కొన్ని చిత్రాలు కాలక్రమాన నశింపు అయిపోయి వుండవచ్చును. కాలగతి వల్ల ఈ విధంగా కొన్ని చిత్రాలుపోగా, గుహలలో అప్పుడు తలదాచుకొన్న బందిపోటు దొంగలు పెట్టిన పొగకు మరికొన్ని మసిపూసుకు పోయాయి. పోతే ఇటీవలి కాలంలో

శాశ్వత కీర్తి సంపాదనకోసం గోళ్లతో బొమ్మలపై తమ పేర్లను కొందరు వ్రాయడం వల్ల మరికొన్ని చిత్రాలు శిథిలమైపోయాయి. కాగా, నేటికీ నిలిచినవి మొత్తంలో నూటికి ఒకవంతో, రెండు వంతులో, కొన్నేళ్లనాడు జాగ్రత్తపడినా, ఇంతకు రెట్టింపు చిత్రాలైనా మిగిలివుండేవేమో! ముప్పయి సంవత్సరాలపాటు ఎంతో శ్రమపడి మేజర్ గిల్ ఎన్నో చిత్రాలను కాపీ చేసుకొనగా, వాటిలో చాలా భాగం 1866లో లండన్లోని "క్రిస్టల్ ప్యాలెస్"లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు దగ్ధమైపోయాయి. ఇలా దగ్ధంకాగా, మిగిలిన వాటికి జాన్ గ్రిఫిల్స్ కాపీలు యెత్తగా, ఆ కాపీలలో సగభాగం సౌత్ కెన్ సింగ్టన్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో బూడిదపాలైనాయి. మేజర్ గిల్ కాపీ చేసిన నాటికి ఇప్పటికంటె కనీసం రెట్టింపు చిత్రాలు వుండివుండాలి. ఇప్పుడు అన్ని చిత్రాలు లేవు సరిగదా, వాటి కాపీలైనా లోకానికి దక్కకుండా పోయినవి.

ఈనాడు మిగిలిన చిత్రాలు మొత్తంలో నూటికి ఒకటి రెండు వంతులు మాత్రమే అయినప్పటికీ, అవే ఒక విశాలప్రపంచాన్ని- దాని ఆశనిరాశలతో, రాగ విరాగాలతో, ప్రేమవిద్వేషాలతో, సంతోష విషాదాలతో కళ్లకు కట్టినట్టు చూపుతున్నాయి. ఇక అన్ని చిత్రాలూ మిగిలివుంటే, అజంతా గుహలను చూడ్డానికి రెండుకళ్లు చాలేవి కావేమో!

అజంతా చిత్రాలలో అధిక భాగం జాతక కథలే. సిద్ధార్థుడుగా జన్మించడానికి పూర్వం గౌతమబుద్ధుడు కొన్ని వందల జన్మలెత్తినాడని బౌద్ధమతస్థుల నమ్మకం. పూర్వజన్మలలో బుద్ధుని జీవితచరిత్రలే జాతకకథలు. ఉత్తమ మానవజన్మలనే కాకుండా పక్షిరాజుగా, గజేంద్రుడుగా, ఎన్నెన్నో జన్మలను ఆయన యెత్తినట్లు జాతక కథలు పేర్కొంటున్నాయి. ఈ వివిధజన్మలలో కొన్నింటికి సంబంధించిన ఘట్టాలను అజంతా చిత్రాలలో చూడవచ్చు. అయితే అజంతా చిత్రాలన్నీ జాతక కథలే కావు. జాతక కథలతో ఎట్టి సంబంధం లేనివి ఎన్నోవున్నాయి. ఇంతే కాదు. వెలితిగా కాస్తచోటు కనబడితే చాలు, దానిలో ఏ ఆకునో, ఏ రెమ్మనో, ఏ పువ్వునో చిత్రించివేశారు. అదీ ఇదీ కాకపోతే, ఆ కళా తపస్వులు తమ కుంచెతో ఇటొక గీతను, అటొక గీతను, గీయడం ద్వారానే సౌందర్య సృష్టి చేశారు.

అజంతా గుహల నిర్మాణం క్రీస్తుశకం ప్రథమ శతాబ్దిలో ప్రారంభమైనట్లు ఏడవ శతాబ్ది మధ్యభాగం నాటికి సమాప్తిచెందినట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఇంచుమించు ఏడు శతాబ్దాలపాటు కొనసాగిన అజంతా గుహల అలంకరణలో చివరి రెండు వందల సంవత్సరాలలో జరిగిన కృషి సర్వోత్తమమైనదని కళాభిజ్ఞులు పలుకుతున్నారు. ఫెర్గుసన్ తీర్పు ప్రకారం పద్నాల్గవ శతాబ్దిలో ఫైజాల్, ఆర్కాన్యాజా ఇటలీలో తలయెత్తడానికి ముందు అజంతా చిత్రాలకు సాటిరాగలిగినవి యూరప్ లో లేవు. గ్రిల్స్ మరొక అడుగు ముందుకు వెళ్లి కనీసం 26 అజంతా చిత్రాలకి సాటిరాగలిగింది యూరలో నున్నవి అంటున్నాడు. అదే మరణం ఆసన్నమైన రాకుమారిని చిత్రించడానికి ఫ్లోరెన్ టైన్ చిత్రకారుడు మరింత రేఖావిన్యాసాన్ని కూడివుండవచ్చు. వెనాసియన్ కళాస్రష్ట మరింత వర్ణవైశిష్ట్యాన్ని కూర్చివుండవచ్చు. కాని, దానిలోని నిరాశను, నిస్పృహను, బాధను, విషాదాన్ని మరింత ప్రతిభావంతంగా చూపించాలని వారికి సాధ్యపడేది కాదని ఆయన అజంతా చిత్రకళ చెబుతున్నాడు. ఇక, రోథెన్ స్టైన్ పలుకులలో "కొండలను తొలిచి, వాటిలో మలచిన ఈ బౌద్ధాలయాలలోని వందలాది స్తంభాలపై కుడ్యాల పై మనం చూడవచ్చు. మహారాజులను, మహారాణులను, మహావీరులను మాత్రమేకాక సమస్త వర్ణాలకు చెందిన అనేక స్త్రీ, పురుషులను ఈ మహానాటకంలో పాత్రధారులను ఉద్యానాలు, రాజసభలు, మహానగరాలు, విశాల పీఠభూములను ఘోరారణ్యాలు ఇంత విభిన్నమైనవి. ఈ మహానాటకంలోని మన స్థలాలలో ఈ విషయాలను

కాదనలేము. విన్ సెంట్ స్మిత్ మాత్రం అజంతా గుహలను అలంకరించినవారు పర్యన్ చిత్రకారులు కావచ్చునని చూచిన పిమ్మట అంటున్నాడు. దానిని మనం పట్టించుకోనక్కరలేదు. అజంతా చిత్రాలలో తొణికిసలాడుతున్న భారతీయ జీవితాన్ని, సంస్కృతిని ఏ విజాతీయ చిత్రకారులు వారెంతటి ప్రజాసాధకులైనా చిత్రించగలిగి వుండేవారు కారు. పోయినవిపోగా, ఇప్పటికి మిగిలివున్న అజంతా చిత్రాలను చూచి, వివిధ భారతీయ జీవితాల్ని గురించి సంస్కృతిని గురించి ఎన్నెన్నో విషయాలు తెలుసుకోవచ్చు. నిజానికి వాటిని మన ప్రాచీన, సాంఘిక, సాంస్కృతిక చరిత్రలుగా యెంచవచ్చు.

ప్రాచీన కాలంలో భారత సాంఘిక వ్యవస్థ ఏ రూపంలో వుండేది? అప్పటి వృత్తులేవి? వ్యాసంగాలేవి? వినోదాలేవి? ఇట్టి ప్రశ్నలకు సమాధానాలు కోరితే అజంతా గుహలకు వెళ్లాలి.
ఒకప్పుడు మనదేశంలో రాణ్మందిరాలు ఏ విధంగా వుండేవి? రాజుల రాణుల వేషభాషలేవి? రాజసభలను ఏ విధంగా తీర్చేవారు? అప్పటి సైనిక బలనిర్మాణం ఏ తీరులో వుండేది నాటి ఆయుధాలేవి? ఇట్టి ప్రశ్నలకు ప్రత్యుత్తరాలను కోరిన, అజంతా గుహలకు వెళ్లాలి. ఇంతేకాదు అక్కడికి వెడితే, మనసు ఎన్నో కోణాల సమేతంగా భారత సాయుధ బలాలను సింహళంపై దండయాత్రకు చేరవేసిన భారతీయ నౌకాదళాన్ని చూడవచ్చు. వీర శివాజి రాజ్యానికై మహాసాగరాలను దాటి వెళ్లాడన్న భారతీయ వణిక్కులను చూడవచ్చు. పర్యన్ రాయబారులకు దర్శనమిస్తున్న భారతీయ మహీపాలకులను చూడవచ్చు. అన్నింటినీ మించి గౌతమ బుద్ధుని కారుణ్య సందేశం కేవలం మానవుని వికాసానికే కాక పశుపక్ష్యాదుల జీవితాన్ని సయితం ఎంత పునీతం చేసిందో, తేజోవంతం చేసిందో చూడవచ్చు. అందువల్ల అజంతా గుహలు యాత్రాస్థలం కావలసింది చిత్రకారులకే కాదు భారతీయ చరిత్రలో, విజ్ఞానంలో, సంస్కృతిలో, భవితవ్యంలో శ్రద్ధాభక్తులు గలవారందరికీ అజంతా చిత్రాలను గురించి నాకొక దురభిప్రాయం వుండేది. ఈ దురభిప్రాయమే అజంతా గుహలను చూడని వారిలో పెక్కుమందికి వుండవచ్చును. ప్రతి స్త్రీని, ప్రతి పురుషుని అర్ధనిమీలిత నేత్రాలతోనే - ఈ ప్రపంచానికి అతీతమైవున్నట్టు గానే అజంతా చిత్రకారులు చిత్రించినారనుకోవడమే ఈ దురభిప్రాయం. అర్ధనిమీలిత నేత్రాలను అధికంగా వారు చిత్రించినారంటే పారమార్థిక చింతనాపరులను వారు అధికంగా చిత్రించి నందువల్లనే. ఇక అన్యులను చిత్రించవలసి వచ్చినప్పుడు ఆయా వ్యక్తుల చిత్తవృత్తికి తగిన నేత్ర భంగిమలనే వారు చిత్రించారు. ఉదాహరణకు - ఆశ్చర్యవిభ్రమాల ప్రకటనలు వికసితపద్మాల కంటె వికసిత నయనాలనే వారు చిత్రించారు. కొన్ని కొన్ని సందర్భాలలో వారి చిత్రకళా పద్ధతులు అత్యంతాధునిక చిత్రకారుల పద్ధతుల కంటె ఆధునికమైనవి. ఆశ్చర్యచకిత మనస్థితి కన్నులకు కట్టినట్టు చూపడానికి ఈ నాటి "కార్టూనిస్ట్" ప్రతి శిరోజం ఒక ఉక్కు తీగవలె నిక్కబొడుచుకున్నట్టు చూపుతాడు. ఈ పద్ధతిని ఏనాడో అజంతా చిత్రకారులు...

> *(1946 ఆగష్టులో నేను అజంతా, ఎల్లోరాల తీర్థయాత్ర చేశాను. తిరిగి వచ్చిన వెంటనే ఈ వ్యాసాన్ని ప్రారంభించాను. ఏ కారణం వల్లనో వ్రాస్తున్న వ్యాసాన్ని ఒక వాక్యం మధ్య ఆపివేయవలసి వచ్చింది. అప్పటిలో తమ "ఆనందవాణి" దీపావళి సంచికలో ప్రచురణకు ఏదో ఒక వ్యాసాన్ని నేనిచ్చి తీరాలని శ్రీ వుప్పులూరి కాళిదాసు పట్టుపట్టగా అసంపూర్తి వ్యాసాన్నే ఆయన కిచ్చాను. తరువాత నేను దాన్ని పూర్తిచేయడం పడనేలేదు. ఐతే, 1967లో అజంతా చిత్రాలపై వెలువడిన ఒక గ్రంథాన్ని సమీక్ష చేస్తూ వానిని గురించి తిరిగి రాశాను. ఆ సమీక్ష ప్రారంభ వాక్యాలను నా పాత వ్యాసానికి ముగింపు వాక్యాలుగా వినియోగించవచ్చు).*

చిత్రకళలో చిత్తశుద్ధి

అధునాతన చిత్రకళ రూపాలనే క్యూబిస్ట్, సర్రియలిస్ట్, యాబ్ స్ట్రాక్ట్ మొదలైన రూపాలను నేను హర్షించలేను. అయినా వాటిలో ఏదో లోపం ఉన్నట్టు భావించను. ఆ లోపం నాలోనే ఉండవచ్చునని అనుకుంటాను. అది చిత్రకళ కానివ్వండి, మరో కళ కానివ్వండి, దానితో సన్నిహితత్వాన్ని పెంచుకోవాలి. అప్పుడుగాని దాని ఆనుపానులు, అందచందాలు మనకు తెలియవు.

మన సంగీత కళనే చూడండి. పది, పదిహేను సంవత్సరాల క్రితం వరకు పాశ్చాత్యులకు అది అయోమయంగా ఉండేది. బహుశా కర్ణకఠోరంగా కూడా ఉండేది. కాని, తరచు విన్న మీదట, దాన్ని విన్నవారు ఎంతగానో దాన్ని మెచ్చుకుంటున్నారు; తిరిగి తిరిగి వినడానికి ఉత్సాహిస్తున్నారు.
కొంతవరకు నా విషయంలో కూడా ఇంతే జరుగుతున్నది. పది, పదిహేనేళ్ళ క్రితం సర్రియలిస్ట్ చిత్రాన్ని లేదా క్యూబిస్ట్ చిత్రాన్ని చూచీచూచిన వెంటనే ముఖం తిప్పివేసుకునే వాడిని. కాని, ఇప్పుడిప్పుడు ఆసక్తితో చూస్తున్నాను, అర్థం చేసుకోడానికి ప్రయత్నం చేస్తున్నాను. కొంతకాలం పోతే నేను వాటిని అభిమానించ ప్రారంభించడం జరిగితే, అందుకు నేను అబ్బురపడను.

ఈ కొత్త చిత్రాలను, అత్యాధునిక చిత్రాలను చూచినప్పుడు ప్రకృతిలో ఇట్టి రూపాలు ఉన్నాయా? ఇట్టి వ్యక్తులున్నారా? అని ప్రశ్నించడం కద్దు. ఈ ప్రశ్నకు సమాధానం కొన్ని ఇతర ప్రశ్నలే. ప్రకృతిలో నాలుగు, ఆరు, పది తలల వారున్నారా? అయితే బ్రహ్మ, కుమారస్వామి, రావణాసురులను నాలుగు, ఆరు, పది తలలతో చిత్రిస్తే, అది మీకు వింతగా ఎందుకు తోచదు? ప్రకృతిలో నాలుగు చేతులవారున్నారా? అయినా, త్రిమూర్తులను, వారి భార్యలను, ఇతర దేవతామూర్తులను నాలుగు చేతులతో చిత్రిస్తే, అవి మీకు విడ్డూరంగా ఎందుకు కనుపించవు? ప్రకృతిలో చకోరపక్షి ఉన్నదా? 'ఫీనిక్స్' ఉన్నదా? 'డ్రేగన్' ఉన్నదా? కల్పవృక్షం ఉన్నదా?

చిత్రకళలో చిత్తశుద్ధి

కామధేనువు ఉన్నదా? స్వర్గ నరకాలు ఉన్నాయా? అయినా చిత్రాలలో, శిల్పాలలో, రచనలలో వాటి ప్రసక్తి మీకు విపరీతంగా ఎందుకు స్ఫురించదు?

ఒకప్పుడు వాటినన్నింటిని ఏవో కొన్ని భావాలకు సంకేతాలుగా మీరు స్వీకరించినారు. రాను రాను వాటిని సహజాలుగానే పరిగణిస్తున్నారు. బ్రహ్మకు నాలుగు తలలేమిటి? అని నాబోటి వారెవరైనా అంటే కోపంతో పైబడి కొట్టగల ప్రమాదం ఈనాడు లేకపోలేదు. పోతే, అత్యాధునిక చిత్రకళారీతులు కొన్ని కొన్ని సందర్భాలలో జుగుప్స కలిగిస్తాయని కొందరనడం కద్దు. ఇది నిజమే కావచ్చు.

కాని, నవరసాలలో బీభత్స, భయానక, రౌద్రాలకు స్థానమిచ్చిన తర్వాత జుగుప్సను ఎందుకు వెలివేయాలి? కొన్ని కొన్ని సందర్భాలలో అది కూడా మనకు ఉపకరించదా? పచ్చి స్వార్థం పట్ల, ఘోరనైచ్యం పట్ల జుగుప్స కొన్ని కొన్ని సందర్భాలలో మనకు ధర్మావేశాన్ని కలిగించదా? ధర్మ పరిరక్షణకు, న్యాయస్థాపనకు మనస్సు ప్రేరేపించదా?

కాగా, ఈ చిత్రానికి అర్థమేమిటి? అనే ప్రశ్న మరోటి ఉన్నది. అయితే, 'సరిగమపదనిస'లకు అర్థమేమిటి? వాటి సమ్మేళనంలోంచి సంగీతం పుడుతున్నపుడు, రంగుల సమ్మేళనం వల్ల చిత్రకళ ఎందుకు పుట్టరాదు?

ఈ విధమైన ప్రశ్నలు ఎదురు ప్రశ్నలు, నాకు నేనే తరచు వేసుకుంటూ ఉంటాను. అందువల్లనే అధునాతన కళారూపాల పట్ల నా వైముఖ్యం క్రమ క్రమంగా తగ్గుతున్నది. మీరు కూడా ఇట్టి ప్రశ్నలు, ఎదురు ప్రశ్నలు వేసుకోవాలి. అప్పుడు మీరు ఇట్టి చిత్రాలను శ్రద్ధతో పరిశీలించటం, వాటి అంతరంగంలో ప్రవేశించడానికి ప్రయత్నించడం ప్రారంభంకావచ్చు.

అయితే నాకు ఓ అనుమానం లేకపోలేదు. అత్యాధునిక చిత్రకళారీతులు విదేశాలలో, ముఖ్యంగా ఫ్రాన్సులో ప్రారంభమైనాయి. వాటిని ప్రారంభించిన చిత్రకారులకు ఏవో కొన్ని బలమైన ప్రేరణలున్నాయి. కొత్త పుంతలను వారు తొక్కడానికి అవే కారణాలు.

ఎదలో నుండి ప్రేరణ వచ్చినప్పుడు చిత్రించే చిత్రంలో, సృష్టించే శిల్పంలో చిత్తశుద్ధి ఉంటుంది. సృజనాత్మక శక్తి ఉంటుంది. అక్కడ పాశ్చాత్య చిత్రకారులకన్న, శిల్పులకున్న ఈ ప్రేరణలు ఏవేనా మనకు వున్నావా? ఉదాహరణకు రెండు ప్రపంచయుద్ధాల తర్వాత పాశ్చాత్య చిత్రకారుల, శిల్పుల వ్యక్తిత్వంలో విశేషంగా మార్పు వచ్చింది. వారిలో ఒకప్పుడుగల ఆశ స్థానాన్ని నిరాశ అక్రమించింది. జిగీష సన్నగిల్లిపోగా, నిస్పృహ ఆవరించింది. బాహ్య జీవితంలో వలె అంతరంగిక జీవితంలో సహితం వారికి ఒక క్రమం, ఒక పద్ధతి, చివరికి ఒక అర్థం కూడా లేనట్టు అనిపించడం ప్రారంభించింది. అందువల్లనే వారి కళలో ఒక క్రమం, ఒక పద్ధతి, చివరికి ఒక అర్థం సహితం సహజంగానే విలుప్తమైనాయి.

మరి మనదేశంలో మన దేశంలోనే కాదు, మొత్తం ఆసియా, ఆఫ్రికాలలో - ఇందులో భిన్నమైన గతిలో చరిత్ర నడవలేదా? కొన్ని శతాబ్దాల దాస్యం తర్వాత, దైన్యం తర్వాత, తిరిగి మనం స్వాతంత్ర్యం సంపాదించుకున్నాము. నవసంఘాన్ని నిర్మించుకొనడానికి ప్రయత్నిస్తున్నాము. అయినా ఈ ఆశాభావాన్ని, ఈ జిగీషను మన కళాకారులు తమ చిత్రాల్లో, శిల్పాల్లో ఎందుకు ప్రతిఫలింప జేయటంలేదు?

స్వాతంత్ర్య సిద్ధివల్ల ఆశించిన సత్ఫలితాలు లభించకపోవడం వల్ల వారు నిరాశకు, నిస్పృహకులోనై ఉన్నారా? లేక లేటెస్ట్ ఫ్యాషన్ కాబట్టి పాశ్చాత్య కళాకారులను అనుకరిస్తున్నారా?

ఇది అకారణమైన సందేహం కాదు. నాకు తెలిసిన ఒకరిద్దరు చిత్రకారులు కొత్త పద్ధతులలో తమకు ఎంత మాత్రం నమ్మకం లేకపోయినా, దాన్ని అనుసరించకపోతే తమ బొమ్మలు అమ్మలేమని ఆ పద్ధతులకు మారిపోతున్నామని చెప్పారు. పైకి చెప్పకపోయినా పెక్కుమంది ఇంతే చేస్తున్నట్లు నాకు తరచు అనిపిస్తున్నది.

నా కంటే కళా రహస్యాలు హెచ్చుగా తెలిసిన కొందరు ప్రముఖులు సహితం ఆత్యాధునిక చిత్రకళ, శిల్పం చాలా వరకు 'డెరివేటివ్' అంటున్నారు. కొద్దిపాటి మార్పులతో, చేర్పులతో నకళ్ళను దించడానికి చెప్పే మరో మాట 'డెరివేటివ్ ఆర్ట్'. ఏమైనా మన చిత్రకారులకి, శిల్పులకు నేను ప్రేమపూర్వకంగా చెప్పగోరుతున్నమాట ఒకటే: మీ లోపలినుంచి ప్రేరణ వస్తే, అధునాతన చిత్రకళారీతులలో అవశ్యం మీ కృషిని కొనసాగించండి. అప్పుడు మీరు పూర్తిగా రాణిస్తారు. కాని, అట్టి ప్రేరణ లేనప్పుడు వాటి జోలికి పోకండి. అందువల్ల మీ సృజనాత్మక శక్తులను మీరు ఘోరాపకారం చేసుకుంటారు.

(తెలుగు పలుకు 1995 నుంచి పునర్ముద్రణ)

నేటి చిత్రకళ

అంతర్జాతీయ విద్యార్థి సేవాసమితి యాజమాన్యాన చెన్నపురంలో జరిగిన ఆగ్నేయ ఆసియా విద్యార్థుల మహాసభ సందర్భంలో ఏర్పాటుచేసిన కళాప్రదర్శనం సమగ్రమైనదని అనలేము. బర్మా, సింహళం, మలయా మొదలైన కొన్ని ముఖ్య ఆగ్నేయ ఆసియా దేశాలకు ఈ ప్రదర్శనలో ప్రాతినిధ్యం అసలు లేదనే చెప్పవచ్చు. ఇండియా, ఇండోనేసియాలకైనా దీనిలో ప్రాతినిధ్యం తగినంతగా లేదు.

ముఖ్యంగా భారతదేశవిభాగం తగు ప్రయత్నం లేకుండా అప్పటికప్పుడు ఏర్పాటు చేయబడినట్టున్నది. అవనీంద్రనాథ్ టాగోర్, నందలాల్ బోస్, దేవీ ప్రసాద్ రాయ్ చౌదరి, ప్రమోద్ కుమార్ ఛటర్జీ, అశిత్ కుమార్ హల్దార్, శారదా ఉకిల్, అబ్దుల్ రహమాన్, రమేంద్రనాధ్ చక్రవర్తి, దామెర్ల రామారావు, అడవి బాపిరాజు మొదలైన ప్రసిద్ధుల చిత్రాలు దీనిలో లేవు. ఇంతే కాదు ఇండోనేసియన్ విభాగంలో జరిగినట్టు, భారతీయ విభాగంలో ప్రాచీన భారతకళా వైభవాన్ని ప్రదర్శించడానికి ఎట్టి ప్రయత్నం జరగలేదుకూడా.

వాటిని ఏమైనా, ఉన్నంతలో ఇండియన్ విభాగానికి, ఇండోనీసియన్ విభాగానికి స్పష్టంగా ఒక విభేదం కానవస్తున్నది. ప్రసిద్ధి నందవలసినవారేగాని, ప్రసిద్ధి నందినవారు తమ చిత్రాలను భారతీయ విభాగానికి పంపించి వుండకపోయినా, రేఖల విన్యాసంలో, రంగుల మేళవింపులలో, మొత్తం చిత్రం పొందికలో మన చిత్రకారుల ప్రావీణ్యం సామాన్యమైనది కాదని విశదమౌతున్నది. “టెక్నిక్”లో ఇంతటి ప్రావీణ్యం ఇండొనీసియన్ చిత్రాలలో కానరాకపోవచ్చు. “పెయింటింగ్స్” అనడంకంటె, 'కలర్ స్కెచెస్' అనడమే ఎక్కువ సమంజసం కావచ్చునేమో కూడా, అయితే, భారతీయ చిత్రాలలో కానరాని ఏదో ఒక జీవచ్ఛక్తి వాటిలో తొణికిసలాడుతున్నది. స్వేచ్ఛకోసం, స్వాతంత్ర్యం కోసం, భవితవ్యం కోసం ఇండోనీసియన్ జాతి నేడు భీషణసమరాన్ని సాగిస్తున్నది. ఈ సమరం సందర్భంలో దాని కష్టాలను కన్నీటిని, దాని బాధలను, త్యాగాలను, దాని పట్టుదలను, పౌరుషాన్ని, దాని ఆశయాలను, ఆవేదనను ప్రతి చిత్రం, దానిలోని ప్రతి రేఖ సువ్యక్తం చేస్తున్నాయి. జాతీయ జీవితంతో ఈ సన్నిహితత్వమే - కాదు, ఈ ఆత్మీయతే - ఇండోనీసియన్ చిత్రాలలో ఉట్టిపడుతున్న జీవచ్ఛక్తికి మూలమైవుండాలి.

ఇక, భారతీయ విభాగంలోని చిత్రాలు - రేఖావిన్యాసం, రంగుల మేళవింపు, మొదలైనవాటిలో అవి ఎంత ప్రశంసార్హమైనా - భారతజాతి హృదయస్పందన లేశమాత్రంగానైనా గోచరించడంలేదు. అవి సుందరమైన చిత్రాలే, కాని, శక్తివంతమైనవి కావు. అవి కంటికి హాయినిగూర్చే చిత్రాలే, కాని, గుండెను ఊపలేవు. వాటిలో ఉత్తమమైనవి మనకు కళా తన్మయత్వాన్ని కలిగించినా కలిగించవచ్చు. కాని, అవి కర్తవ్య ప్రబోధాన్ని చేయలేవు.

అయితే, “కర్తవ్య ప్రబోధం కళల లక్ష్యాలలో ఒకటి కావలెనా?” అని వెంటనే ప్రశ్న ఉదయించకపోదు. దానికి ఎవరైనా వేయగల ఎదురుప్రశ్న “ఏదో సందేశమిచ్చి, సామాన్యజీవితాలకు సయితం ఉన్నతపథాలను నిర్దేశించలేనిది కళకాగలదా?” అని మాత్రమే.

అజంతా చిత్రాల ప్రాశస్త్యానికి కారణం కేవలం వాటి సౌందర్యమే కాదు, అవి చాటే కారుణ్య సందేశం కూడా. బౌద్ధయుగంలో బౌద్ధచిత్రకారులు వాటిని సృష్టించారు. తమ యుగసందేశాన్ని తమ సృష్టిలో వారు చూపించారు. నాటిది బౌద్ధయుగమైతే, నేటిది ప్రజాస్వాతంత్ర్యయుగం, ప్రజా సమరయుగం, అయినప్పుడు, మన ప్రజా స్వాతంత్ర్యకాంక్ష గాని, మన ప్రజా సమరతీవ్రత గాని మన చిత్రకారుల కళాసృష్టిలో ప్రతిబింబితం కాకపోవడం ఒక పెద్ద లోపమే కాదా? గడచిన పాతిక సంవత్సరాలలో మన దేశంలో నడిపిన స్వాతంత్ర్య సమరాలు మన చిత్రకారులను ఉగ్రూతలూగించి, వారి కుంచె గీసే ప్రతిగీతను ఒక స్వాతంత్ర్య గీతాన్ని చేయలేక పోవడానికి బలీయమైన కారణమేమో ఉండితీరాలి. కళాదృష్టికి కళాత్మక జీవితానికి, అంతగా ప్రోత్సాహమివ్వని గాంధీజీ నాయకత్వమే ఇందుకు కారణమా? లేక, బ్రిటిష్ వారి పరిపాలనా ఫలితంగా ప్రతి విద్యావంతునికి, ప్రతి కళాశీలికి ప్రజాబాహుళ్య జీవితంతో సన్నిహిత సంబంధం తగ్గిపోవడమే ఇందుకు కారణమా?

ఏమైనా, జాతీయ జీవితాన్ని ప్రతిబింబించనిది జాతీయజీవితానికి వెలుగుదారులను చూపించనిది - జాతీయకళ కానేరదు. ఈ సత్యాన్ని ప్రతి భారతీయ చిత్రకారుడు ఇకనైనా గుర్తించాలి. (ఆంధ్రప్రభ 19-6-1947)

భారతీయ శిల్పానికి మణి మకుటమైన ఆంధ్ర బౌద్ధుల కళాసృష్టి

స్వతంత్ర భారతదేశంలో కల్లా, అతి శైశవ ప్రాయంలో ఉన్నదైన ఈ ఆంధ్రరాష్ట్రం, సాక్షాత్తూ బుద్ధ భగవానుని పాదచిహ్నాలకు, ఈ నేల, నోచుకోక పోయినా, బౌద్ధ శిల్పం, బౌద్ధ చిత్రకళలు ముఖ్యంగా శిల్పం మహోన్నత స్థాయి నందుకొన్న దేశమై, తక్కిన భారత రాష్ట్రాల కన్నా మిన్నయై వెలసింది. ఆంధ్రులు అశోకునికి చాల పూర్వమే బౌద్ధ మతాన్ని స్వీకరించారు. ప్రొఫెసర్ కె.ఆర్. సుబ్రహ్మణ్యం, విశిష్టంగా రచించిన 'ఆంధ్రలో బౌద్ధ శిథిలాలు' అన్న ప్రత్యేక వ్యాస సంపుటిలో, "ఆంధ్రుల బౌద్ధ స్వీకరణం అశోకుని పూర్వకాలం నాటిదని నిస్సందేహంగా చెప్పవచ్చును" అని నుడివారు.

ఆంధ్రులు అతి ఉద్రేక స్వభావులు, అతి శీఘ్రంగా అతి తీవ్రమైన ఉద్రేకాలకు పాల్పడుతారని ఈ నాటికి కూడా పేరు పడేఉన్నారు. వాళ్ళకు ప్రేమకల్గితే అతి ప్రేమ, ద్వేషం కల్గితే అతి ద్వేషంగా అలవి కాకుండా ఉడోలగంగా ఉంటుంది. కాని మొత్తంమీద చూసుకొంటే, ఆంధ్రుడు, దయా, దాక్షిణ్యం, అపరిమిత మైత్రీ స్వభావం, సహజంగా అతిధి పూజనం కలవాడు. ఒక్కొక్కప్పుడు అతి తిక్కగా, చంచలంగా కనబడ్డాకూడా, స్నేహధర్మం వాళ్ళలో ఉన్నంత మరెచ్చటా ఉండదు. అందుకనే ఏ క్రొత్త అభ్యుదయ భావమైనా, క్రొత్త నూతనాదర్శమైనా, వాళ్ళ నిట్టే అతి స్వాభావికంగా ఆకర్షిస్తుంది. అలాంటి తత్వమున్న మనుష్యులవటం చేతనే, విశ్వమానవ సౌభ్రాత్రాన్ని, జీవకారుణ్యాన్ని, విశ్వప్రేమ ఆదర్శాన్ని, మూఢాచార నిరసనాన్ని మానవుని పరమోత్కృష్ట స్వభావం ఏది ఉందో దాన్ని ప్రేరేపించే, ప్రచార ప్రబోధాలు గల బౌద్ధ ధర్మం వాళ్ళ నిట్టే ఆకర్షించి, బౌద్ధునికి సుస్వాగత మిచ్చేటట్లు చేసి ఉంటుంది. చీల్చుకొంటూ చూపుసారిస్తే ఏమాత్రం భావుకత గలవారైనా, మధ్యయుగాల మసక చీకటుల ఆజానుబాహులు, తప్తకాంచనవర్ణులు, సుందర దీర్ఘకాయులూ అయిన పూర్వాంధ్ర పురుషులు కోటాను కోట్లు బౌద్ధ ఆరామాలకు పోయి, నవనవోన్మేష భక్తికుసుమాలతో పూజలు చేస్తున్న దృశ్యం కన్నులకు కట్టుతుంది. గోదావరి, కృష్ణ వంశధారాది జీవప్రోతస్వినీ పరివృత సస్యశ్యామల ధాత్రీ తలమంతటా కొండలూ, కోనలూ కూడ "బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి (బుద్ధుడే నాకు శరణు, ధర్మమే నాకు శరణు, సంఘమే నాకు శరణు) అన్న గీతాలాపం ప్రతిధ్వనిస్తుంటాయి. ఇది కేవలం నా భావోన్మత్తతకాదు.

భారతీయ శిల్పానికి మణి మకుటమైన ఆంధ్ర బౌద్ధుల కళాసృష్టి దేశమంతటా విరజిమ్మబడినట్లున్న త్రింశత్రయ స్థూపాలు ఈ నా ఊహకు సాక్ష్యం పలుకుతూ నిలుస్తాయి. ఆంధ్రదేశ మంతటా విస్తరించుకొని, ఉత్తరాన శాలిహుండం నుంచి దక్షిణాన చినగంజాం దాకా, తూర్పున ఘంటశాల నుంచి పడమట గుత్తి వరకు విరజిమ్మబడ్డట్లున్న స్తూపాలన్నీ ఇదే చెప్తాయి. మిస్టర్ లాంగ్ హర్ట్స్ చెప్పినట్లు "దక్షిణాన ఉన్న మరే ఇతర దేవాలయాది శిల్ప ప్రతిష్ఠల కన్న కూడా ఈ బౌద్ధస్థలాలు అత్యధిక శిల్ప ప్రావీణ్య విశేషం గలవి."

ఈ పూర్వస్థలాలు మళ్ళీ త్రవ్వి కనుగొని మన దృష్టికి తెచ్చినందుకు, పురాతత్వ పరిశోధక ప్రథమాచార్యులనదగు సివిల్, మిలటరీ, ఉద్యోగులు, పరిశోధకు లెందరికో, ముఖ్యంగా మెకంజీ, ఎల్లియట్, బర్గెస్, సూయెల్, రీ, లాంగ్ హర్ట్స్, రామచంద్రనుల వంటి వైతాళికసములైన పరిశోధకుల కెంతో అచ్చి ఉన్నాము.

ఆంధ్రలో బౌద్ధ శిధిలాలున్న స్థలాల నన్నింటిని చూశానని నేను చెప్పుకోవటం లేదు. కాని అమరావతి, నాగార్జునకొండ, జగ్గయ్యపేట, ఘంటశాల, భట్టిప్రోలులో బౌద్ధ విశేషాలను సందర్శించే భాగ్యం మాత్రం నాకు కల్గింది. వీనిలో కూడా మొదటి రెండూ ప్రపంచ ఖ్యాతి గడించిన స్థలాలు. రెండూ కూడా దక్షిణ దేశపు నదులలో కెల్లా ద్వితీయ స్థానం ఆక్రమించే కృష్ణానదీ తీరాన గుంటూరు మండలంలోనే ఉన్నాయి. ఈనాడు అమరావతి పాడుబడిన పల్లె అయి శతాబ్దాలుగా అక్కడ విలసిల్లిన విశ్వవిద్యాలయ మంటూ ఏదీ లేక పోయినా, నాగార్జున కొండ నిర్జల ప్రదేశంగా మిగిలిపోయి ఒకనాటి ప్రఖ్యాత విద్యా కేంద్రం ఏదీ ఇప్పుడు లేకపోయినా, ఆ ప్రదేశాలను దర్శించిన ఎవరికైనా ఈనాటికీ, కృష్ణానదీ స్వచ్ఛజలాల అలల తళుకులలో మిశ్రమమయి, బౌద్ధధర్మంలోని, శాంతగంభీర అనిర్వచనీయానందాలు పరిసరాల నంతటినీ నింపినట్లు స్ఫురిస్తూనే ఉంటుంది. శిల్పశాస్త్ర నిష్ణాతుడనుగాని సామాన్యుడనగుటచే సాధికారంగా చెప్పలేకపోవచ్చునేమోగాని దేశాటనంలో సర్వ భారతదేశంలోని ప్రతి పెద్ద, చిన్న పూర్వయుగ శిల్ప విశేషాలను పరికించినవాడను కాబట్టి, తత్తవాచికంగా నేను ఈ అభిప్రాయం చెప్పడానికి కూడా సాహసిస్తున్నాను. ఎన్నో శతాబ్దాల కాలగర్భంలో చివికిపోయి, విగ్రహధ్వంసకుల చేతుల్లో విరిగిపోయి, పాడుపడిపోయినా కూడా, ఈ నాటికీ అమరావతి, నాగార్జున కొండలలో లభించిన శిల్పావశేషాలు సునిశిత సౌందర్య మహిమలోగాని ఆధ్యాత్మిక విలాస విశేషంలో గాని, భావగాంభీర్య భంగిమంలోగాని మరివేటికి తీసిపోవని మాత్రం గట్టిగా చెప్పగలను.

అమరావతికి, కేవలం ఆంధ్ర చరిత్రలోనే కాక, భారతీయ, ప్రపంచ బౌద్ధ చరిత్రలలో కూడా విశిష్ఠ స్థానమున్నదన్న విషయం మీరందరెరిగినదే. శాతవాహన రాజధానియైన ధాన్యకటకానికి అరమైలు మాత్రపు దూరంలో ఉన్న ఈ ప్రఖ్యాత నగరం, మహాయాన బౌద్ధ సిద్ధాంతానికి ఆటపట్టయిన కేంద్రస్థానం. కాని అంతకన్నా కూడా అక్కడ ఉన్న మహాస్తూపం వల్లనే ఈ పురం ఇతోధికమైన ప్రఖ్యాతిలోకి వచ్చింది. ఈ స్తూపం ఎత్తు నూరు అడుగులు. భూచక్ర వ్యాసం నూట అరవైరెండు అడుగుల ఏడంగుళాలు (దీనితో పోల్చి చూచుకొంటే, భట్టిప్రోలు స్తూపం నూట నలభై ఎనిమిది అడుగులు ఘంటసాల, నూట ఇరవై రెండడుగులు నాగార్జునకొండలో ముఖ్యస్తూపం నూటారు అడుగులు) “అమరావతి మూల చైత్యం క్రీ.పూ. 200 నాటిది. కొన్ని (రిలీఫ్) రాతిపలక చెక్కడాలు క్రీ.పూ 1,2 శతాబ్దాల నాటివి. బందేకట్టు పలకలు, చుట్టూ రాతి కటకటాలు, పిట్టగోడ క్రీ.శ రెండవ శతాబ్ది నాటివి. అధవా క్రీ.శ. 250 తర్వాత నాటివి మాత్రం కావు” అని డాక్టర్ ఆనందకుమారస్వామి అభిప్రాయపడ్డారు. అమరావతి స్తూపానికి మహదాలంకారమైన ఈ గోడని గురించి జేమ్సు ఫెర్గుసన్ ఇలా అన్నారు. " చారిత్రకంగా బరూత్ స్తూపం చుట్టూ ఉన్న పిట్టగోడ, భారతదేశ శిథిలాలన్నిటిలోకి ప్రముఖమైన దయినప్పటికీ, శిల్ప వైదగ్యంలోగాని,

వైశద్యంలో గాని అమరావతి స్తూపపు పిట్టగోడకు ఎంతమాత్రమూ దీటురాదు. నిజానికి అమరావతిలోని ఈ పిట్టగోడ, భారతదేశంలోని పూర్వ శిల్ప విశేషాలన్నిటిలోకి కూడా గొప్పదని చెప్పవచ్చును. అసలు బరూత్ లోని పిట్టగోడ కిది రెండున్నర రెట్లు పొడవు వుంది. బయటి ప్రాకార వ్యాసం 195 అడుగులు, లోపలి ప్రాకార వ్యాసం 165 అడుగులు ఇదే బర్హూత్ లో ఉన్న దానికి దాదాపు రెండు రెట్లుంది. ఈ రెండు పిట్టగోడల మధ్య, ఉత్సవ మార్గముంది. అంతకు పూర్వపు కట్టడాలలో ఈ మార్గం టోపీ పైనే ఉండేది. ప్రాకారపు గోడ బయటి ఎత్తు 14 అడుగులు. లోతట్టు ఇదే ఇంతకు రెండడుగులు తక్కువ ఉంటోంది. ఇక లోపలి గోడ ఎత్తు ఆరడుగులు మాత్రమే." భారతీయ పూర్వ శిల్పాకళా, సౌందర్య విలాసాలను బైటి ప్రపంచానికి చాటి చెప్పి, ప్రపంచదృష్టిని ఆకర్షింపజేయుటకు బాధ్యులైన వారు ముఖ్యంగా ఈ ఫెర్గ్గసన్ పండితుడు, ఇబి. హావెల్, డాక్టర్ ఎ.కె. కుమారస్వామిగారలే!

అమరావతీ స్తూప తదితర శిల్ప విశేషాలను నేనంతగా చెప్పనక్కరలేదు. ఈ స్తూపం నమూనాను ప్లాస్టర్ లో తయారు చేయించి మిస్టర్ పెర్సీ బ్రౌను, మద్రాసు మ్యూజియంలో నెలకొల్పి వుంచారు. కాని ఒక్క విషయం చెప్పాలనుకొంటాను. ఈ ప్రాకారం ఒక్కటే దాదాపు 17,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగి అంతటా రిలీఫ్ చెక్కడాలతో నిండి వుంది.

ఈ రిలీఫ్ చెక్కడపు చిత్రాలు కూడా, మన దౌర్భాగ్యం చేత ఇప్పటికి చాలా నష్టమయిపోయాయి. 18వ శతాబ్దంలో కర్నల్ మెకంజి అమరావతీ స్తూపాన్ని దర్శించేటప్పటికే ఎన్నో పాలరాతి చెక్కడాలు జీర్ణమయి పోయాయి. అప్పటి పాలకులు 1796లో తమ స్థావరాన్ని అమరావతికి మార్చుకొని అక్కడి పాలరాళ్ళన్నీ త్రవ్వి సున్నపుబట్టీల కెక్కించారు. అమరావతిలోని ధూళి కూడా చరిత్ర సంప్రదాయాలతో నుతికెక్కి ఉంటుంది. అలాంటి మహోత్కృష్ట శిల్పవిశేషాలున్న శిలలు సున్నానికి కూడా లేకుండాపోయాయి. తర్వాత పాపపరిహారార్థం అన్నట్లు అక్కడ అమరేశ్వరాలయం చుట్టూ కొత్త ఊరు కట్టించ ప్రయత్నించారు. ఈ ధ్వంసకాండను భారతీయ శిల్పానికి మణి మకుటమైన ఆంధ్ర బౌద్ధుల కళాసృష్టి తప్పించుకొని కూడా చెదరుగా కొన్ని పాలరాతి చెక్కడాలు దొరికాయి. వాట్లను, లండను, పారిస్, కలకత్తా, మద్రాసు మ్యూజియములకు తరలించారు. ఇప్పుడు అసలు చోట ఏ కొద్దిరాళ్ళు మాత్రమే మిగిలి ఉన్నాయి. 125 దాకా పాలరాతి చెక్కడాలు సర్ వాల్టర్ ఎలియట్ వల్ల లండన్ తరలించబడ్డాయి. వీట్లను అందుకనే "ఎలియట్ మార్బుల్సు" అంటారు. ఎల్గిన్ పాలరాతితోనూ, అసిరియన్ ప్రాచీన ఫలక శిల్పాలతోనూ సరి సమానంగా పోటీపడుతూ లండన్లో ఒకమూల అతి ప్రశాంతమైన ఒక సందులో ప్రాచీన ప్రపంచ శిల్పకళా విశేష సర్వస్వానికి కాణాచియైన ఒక పురావస్తుశాలలో ఈ అమరావతీ శిల్పాలు, తమ లాలిత్యాన్ని, రాజసాన్నీ, శక్తినీ, వేదనా, _క్ష్యాన్ని వెలివర్చుకొంటూ, నేను లండనులో తిరిగినన్నాళ్లు నా కంటబడ్డాయి. ఇంగ్లీషు ఛానల్ దాటి పారిస్ నగరం చేరేటప్పటికి మళ్ళీ "మ్యూజీ గుయ్ మెట్" మందిరంలో మరో మూడో నాలుగో అమరావతి పాలరాతి శిల్ప ఫలకాలు కనబడ్డాయి. ఈ మధ్య కలకత్తా ఇండియన్ మ్యూజియంలో మరో పద్నాల్గింటిని లెక్కపెట్టాను. ఇక మద్రాసు మ్యూజియంలో, అమరావతి శిల్పంలో చిత్ర శిల్ప నిధులు చిన్న, పెద్దా అన్నీ కలుపుకొని దాదాపు మూడువందల పైచిలుకు వున్నాయని నేను వేరే చెప్పనక్కరలేదు. ఆంధ్ర శిల్పుల అమూల్య రత్న సంపదలు ఇన్నిచోట్ల యిలా విరజిమ్మపడ్డాయని నాకు కొంచెం విచారం కల్గినా, వున్న చోట్ల మాత్రం ప్రతి చోటా ఇవి చాలా జాగ్రత్తగా భద్రపరుచబడుతున్నాయని, చక్కగా ప్రతిష్ఠితం చేయబడ్డాయని ఒప్పుకోక తప్పదు. ఒక్కచోట తప్ప! వాటి జన్మ స్థలంలో తప్ప! రెండేళ్ళ క్రితం నేను అమరావతిని రెండవసారి సందర్శించినప్పుడు అక్కడ మిగిలిన కొద్ది పాలరాతి శిల్పఫలకాలను ఒక పాత కొట్టంలో గుట్టగా

పోసి వుంచటం చూశాను. వీటిల్లో ఏ ఒక్క చిన్న రాతిముక్కైనా సరే, దాని అందం చందం చూస్తే ఒక్కొక్కటి ఒక్కొక్క రాజమందిరం కట్టి దాచి వుంచటానికి అర్హతే!

అమరావతిలోని శిల్పం అంతా ఎక్కువగా రిలీఫ్ శిల్పం. అంటే రాతిపలక మీద ఉబ్బెత్తుగా చెక్కిన చిత్రాలు తప్ప పూర్వవిగ్రహ రూపంలో వున్నవి తక్కువ. డాక్టర్ కుమారస్వామి చెప్పినట్లు "ఈ చిత్రాలు మంచి ఉధృతంలో కదులుతున్నట్లు, చైతన్యంతో ఒక్కొక్కప్పుడు, భక్త్యావేశాన్ని రూపిస్తూ మరొకచో, హాస్యజనకంగా వుంటూ, సర్వత్రా చికిలి మెరుంగు నగిషిపని మెరిపిస్తూ, అతి లాలసాయుతంగా వుంటాయి". చిత్రంలోని ప్రతి చిన్న అలంకరణ విశేషంకూడా అత్యాకర్షణీయంగా నిరూపింపబడి, అలంకార చిత్రణంలో విశిష్టాతి విశిష్టాలు కనిపిస్తాయి. నిజానికి అమరావతి శిల్పం ఆంధ్రుల ప్రతిభా సంపత్తి నుండి ఉద్భవించిన మహోత్కృష్ట ఫలం.
"అమరావతి శిల్పాలు భారతీయ శిల్ప పరమావధిని సూచిస్తాయి." అంటూ సాధికారంగా ఫెర్గుసన్ పండితుడు అభిప్రాయం ఇచ్చాడు. హేవెల్ యిలా అన్నాడు. "అమరావతి పాలరాళ్ళ పైని రమణీయమైన చెక్కడాలలో, జంతు జీవన సౌందర్యం, అత్యద్భుత సౌందర్యాన్నాలికించే పరిసరపు నగిషీ పనితో మిళితమై సుందరాతిసుందరంగా కనబడుతుంది. అమరావతి శిల్పాలలో, మానవ రూపం, చిత్ర విచిత్ర భంగిమలలో, సజీవ చైతన్యాన్ని ప్రతిబింబిస్తూ, అత్యంత నైపుణ్యంతోనూ, అతి స్వతంత్ర ప్రజ్ఞతోనూ చెక్కబడింది" అని కూడా ఆయన అన్నాడు. విస్తృత భావ స్వాతంత్ర్యం, ప్రతి చిన్న రేఖా, వంపు, నిమ్నోన్నతాలన్నీ వేనోళ్ళ భావాన్ని చాటే ప్రజ్ఞ, ఇవి ముఖ్యంగా అమరావతీ శిల్పంలోని అపూర్వ లక్షణాలు. అంత కన్నా ముఖ్యంగా గమనించ వలసింది, ఈ శిల్పం ఈ గడ్డ పైన పుట్టిన దేశీయ శిల్పం. అక్కడి ప్రజలలోని అంతః శక్తి వల్ల ఉత్పన్న మయింది. అంతర్వాణి పిలుపుకు జాగృతమయి, ఒక ఆశయ సిద్ధిలో హృదయార్పణ మొనర్చుకొన్నది. గాంధార, గ్రీకు, రోమన్, శిల్ప రీతులకు ఇతః పూర్వం భారతీయ శిల్పాలపై ఏ మాత్రమే ప్రభావం ఉంది ఉన్నా, క్రీ.శ. ప్రారంభ కాలం నాటికి కృష్ణాతీరాన ఈ శిల్పకళ ఉద్భవించే నాటికి వాట్ల ప్రభావం చాలా సన్నగించి పోయింది. "అమరావతీ శిల్పాలు, బారహత్, ఎల్లోరా శిల్పాలలాగే నిజానికి భారత దేశీయ' శిల్పశైలులుగానే గోచరిస్తాయి. మౌర్యశిల్పం, పూర్వసాంప్రదాయ విధానాలు చెడ గొట్టుకోకుండా తెచ్చుకోడానికి తడుము లాడిన కాలాన్ననుసరించి వచ్చినవిగను కొంత మౌర్యశిల్పానికి అనుయాయులవటం కూడా కల్గింది. కొన్ని కథా వస్తువులు, శిల్పాలంకార విశేషాలు, వాయవ్య దిశదైన గాంధార శిల్పాన్నుంచి సన్నగా జాలువారి దిగి రానే వచ్చాయి. కాని ఈ దేశీయ శిల్పం వాట్లను తనలో అంతర్భాగాలుగా జీర్ణింప చేసుకొంది" అని డాక్టర్ మార్షల్ చెప్పిన మాట చాల నిజమైన మాట.

నేను, ఇతరుల నుంచి ఎరువు తెచ్చుకొని, జీర్ణం చేసుకొన్న విషయం చెప్పుకోటానికి సిగ్గుపడే రకం మనిషిని కాకపోయినా, అమరావతిలోని బుద్ధుని విగ్రహం శైలిలో, బాహ్య శిల్ప విధాన ప్రభావాలు స్వల్పాతి స్వల్పమని, పురావస్తు పరిశోధక శ్రేష్ఠులే అభిప్రాయం వెలువర్చారు. "బ్రిటీష్ మ్యూజియంలో అమరావతి శిల్పాలు" అన్న గ్రంథంలో మివత్స డగ్లస్ బారెట్ ఇలా వ్రాశాడు. "అమరావతి విగ్రహాలు, మధ్య కాలపువుగాని, చివరి కాలపువుగాని చూసుకొంటే, మధుర వాట్లతో పోలినవి బహు స్వల్పంగా ఉంటాయి.... నిజానికి అమరావతి విగ్రహాలలోనే ఎక్కువ సహజత్వం ఉట్టిపడుతూంటుంది. ఉత్తరాది విగ్రహాలలోకన్నా వీనిలో అలౌకిక విగ్రహ దేవత్వం చాలా తక్కువ. నిజానికి తలపై ముంగురులు, ఉట్లేషం, ప్రభాచక్రం, ఇవి ఈ శిల్ప మధ్యకాలంలో అతిగా చెక్కబడిన సన్యాసుల విగ్రహాలకు అమర్చి చూచుకో గలిగితే, అమరావతి బుద్ధుని స్వరూపం ఇట్లే గోచరిస్తుంది. ఈ భిక్షుకులకు బోడి తలలున్నాయి. భుజాలు రెంటిని కప్పిన కాషాయాంబరం అతి సహజంగా జీరాడుతుంది."

"అమరావతిలో బుద్ధుని విగ్రహం బ్రహ్మ పదార్థ ధ్యానరతుడయిన వేదాంతి స్వరూపాన్ని కాక, తక్కిన భారతీయ మతాలలో మాదిరిగానే, భక్తితత్పరుడయిన సామాన్య సన్యాసి రూపాన్ని వెలువరిస్తుంది" అనికూడా బారెట్ అంటాడు. ఒకవేళ ఆంధ్ర శిల్పి, మధుర నుంచి బుద్ధుని రూపకల్పన భావాన్నే కాక కొంత చిత్రశైలిని కూడా స్వీకరించాడని మనం ఒప్పుకొన్నా, తన సృష్టిలో, ఆంధ్ర జీవితాన్ని, ఆంధ్ర చైతన్యాన్ని పరిసరాలను ప్రకోపింపజేసి అన్నిటినీ జీర్ణింప జేసుకొన్న నూత్నశిల్ప సృష్టి ఒనర్చాడని నేను అంటాను.

కొన్ని అమరావతి శిల్పాలు ద్రష్టలో గాఢమైన భావచైతన్యం కల్గిస్తాయి. స్వవిషయమే చెప్పుకోవలసివస్తే, మద్రాసు మ్యూజియంలో భద్రపరుచబడిన, నలుగురు భక్తురాండ్ర శిల్పం నన్నెంతో ఉత్తేజపరిచి, నా హృదయాంతరాలనే కదిలించి వేసింది.

మద్రాసు మ్యూజియంలోని మరొక అమరావతి శిల్పం చిత్రంలోని అద్భుత ఘటనా విశేషం చేత నన్నాకర్షించింది. ఆ చిత్రంలో, మదగజం "నలగిరి"ని బుద్ధుడు లొంగదీయటం చిత్రించబడినది. కరుణాసముద్రుడయిన ఆ ప్రభువు మ్రోల ఆ ఏనుగులో కలిగిన అద్భుత ఆ శిల్పఖండం అత్యద్భుతంగా చాటి చెపుతూంటుంది.

పరివర్తనాన్ని ఆంధ్రలో తక్కిన బౌద్ధ కళాక్షేత్రాల విషయానికి మరలే లోపుగా, అమరావతి పాలరాతి శిల్పాల విషయంలో మరికొన్ని మాటలు నివేదించుకొనేందుకు అనుమతి వేడుతున్నాను. అమరావతి శిల్పాలు మొదట్లో పల్చని సున్నపు పూత, పై రంగులు వేయబడి రంగురంగులుగా ఉండి ఉండేవి అని సర్వసామాన్యాభిప్రాయం ఒకటుంది. అదే నిజమయి ఉంటే ఈ పాలరాతి చెక్కడపు చిత్రాలు కూడా, అజంతా, బాగ్ లోని త్రివర్ణ చిత్రాలతో తులతూగుతూ ఉండి ఉండేవి అని మనం నమ్మకంగా చెప్పుకోవచ్చును. "అమరావతిలోని చిత్రకళా వైదగ్యం, విస్తృత సంపదలకు, ప్రపంచంలో ఎక్కడైనా ఏ మాత్రమైనా పోలిక అంటూ ఉంటే, మళ్ళీ అజంతా, బాగ్ చిత్రాలలో మాత్రమే కనబడుతుంది" అని డాక్టర్ బర్గెస్ అన్నాడు. అమరావతి స్తూప గోళం కట్టిన పాలరాళ్ళూ, చుట్టూ ఉత్సవమార్గ ప్రాకారమూ, వాటి నావరించియున్న అలంకరణ చిత్రాలూ సరిగ్గా అర్థం చేసుకోటానికి అజంతా, ఫ్రెస్కో చిత్రాలతో కూడా కలుపుకొని సమన్వయ పరచుకొని పరీక్ష చేసుకొంటేనేగాని, వాట్ల విశిష్టాలే గోచరించవు. అజంతా చిత్రకారులూ, అమరావతీ శిల్పులూ, చిత్రలేఖనం శిల్పం అన్న రెండు విడి కళలలో ప్రతిభ ప్రదర్శించిన ఒకే ఒక శిల్పులేమో అన్న నా ఊహ తొందరపాటైతే మన్నించగోర్తాను.

నాగార్జునకొండ లేక శ్రీపర్వతం, (పూర్వపు పేరు) పాలరాతి చెక్కడాలు కూడా ఇంతటి విశిష్ఠత కలవే. ఈ శ్రీపర్వతం నీడలో పూర్వం విజయపురి అన్న చిన్న పట్టణం ఇక్ష్వాకు వంశీయుల రాజధానిగ విలసిల్లింది. శాతవాహనుల తర్వాత ఇక్ష్వాకులు వేంగీ సామ్రాజ్యం పాలించిననాడు చుట్టూ మూడు పచ్చపచ్చని పర్వతాలు, ఒకవైపు కృష్ణా తరంగిణీ, కలిగి బహు రమణీయంగా ఉండే ఈ శ్రీపర్వతపు కోన మహాయాన బౌద్ధమత స్థావరంగా ఉంటూ అమరావతి తర్వాత అమరావతి అంతటి మహోత్కృష్ట బౌద్ధ విద్యాకేంద్రంగా ఉండేది. ఇక్కడ పరిపాలనలు చేసిన రాజులు ఎక్కువగా హిందువులే అయినా, వాళ్ళ రాణులు ఎక్కువగా బౌద్ధాన్ని అభిమానించేవారు. నాగార్జునకొండలో దొరికిన శిలా శాసనాలను పరికిస్తే బౌద్ధాన్ని అభిమానించిన మహారాణి, ప్రప్రథమురాలు ఛాంతిశ్రీ, రెండవ రాణి అడవి ఛాంతిశ్రీ, మనకు తెలిసిన మూడవ మహారాణి అని తెలుస్తుంది. బౌద్ధాన్నభిమానించిన ఆమె పేరు భులచ్ఛాంతిశ్రీ, ఇక్ష్వాకులకు సంబంధీకురాలు కాకపోయినా, ఉపాసిక బోధిశ్రీ కూడ కాషాయ వస్త్రాలు ధరించిన మహాధనికురాలనీ రాణి వాసపు వారికన్న మిన్న అయిన స్థితిలోనే ఉండేదని

నేననుకొంటాను. ఆమె పుట్టు పూర్వోత్తరాల విషయం చాలా సందేహాలున్నాయి. ఆమె సింహళంలోని గోవా గ్రామంలో పుట్టిందని మహావంశంలో పేర్కొనబడింది. కాని ఈమె ఆంధ్రదేశంలో నాగార్జున కొండ వద్దనే కాక తదితర ప్రదేశాల బౌద్ధారామాలకు కూడా అతి విరాళంగా దానాలు, ధర్మాలు చేసిందని చెప్పటానికి సందేహంలేదు. శ్రీ కె. గోపాలచారి వ్రాసిన ఆంధ్రుల ప్రాచీన చరిత్ర ప్రకారం బోధిసిరి విజయపురి వద్ద రెండు - చైత్యగ్రామాలు కట్టించటానికి సహాయపడింది. (ఒకటి విహారం ప్రక్కనున్న దిగువ ధమ్మగిరివద్దనున్నది, సింహళ పీఠాధిపతులకు చెందినట్లుగానే కట్టబడింది. రెండవది, కులహ విహారం వద్ద కట్టించింది.)

సింహళ విహారంలో బోధివృక్షానికి ప్రాకారం కట్టించింది. ధమ్మగిరిలో ఒక గది కట్టించింది. మహా విహారంలో మంటపస్తంభం కట్టించింది. దేవగిరిలో ప్రార్థనా మందిరం కట్టించింది. పునాసియల్ లో చెరువూ, చుట్టూ వసారా, మంటపమూ కట్టించింది. కంటకశిలలో మహాచైత్యానికి ప్రాగ్ద్వారం వద్ద రాతిమంటపం కట్టించింది. హిరుణాధువలో మూడు ఆరామ గదులు, పాపిలవద్ద ఏడు గదులు, విహురవద్దరాతి మంటపం కట్టించింది. బోధిసిరి వితరణం చవిచూసిన ఈ పేర్లున్న గ్రామాలు స్థలాలు ఏవేవో అని ఇప్పుడు మనం ఆశ్చర్య పడనవసరం లేదు. బౌద్ధ ధర్మంపట్ల ఈ మహాస్త్రీలకు ఇంతటి భక్తి ప్రపత్తులుండేవని, హృదయ పూర్వకంగా తమ ధనకనక వస్తు సర్వస్వాలను, విజయపురివద్ద అసంఖ్యాకులైన చైత్యాలు స్థూపాలు, విహారాలు నిర్మించటానికి వెచ్చించారని తెలిస్తే చాలు. ఇక్ష్వాకుల రాజధాని అయిన ఈ విజయపురి మహావైభవంతో వెలిగిపోయి ఉండాలి. సుదూర దేశాల నుంచి, వర్తక వ్యాపారాలకు కేవలం వణిజులే కాకుండా, బౌద్ధధర్మజిజ్ఞాసులు, విద్యార్థులు, గురువులు కూడా ఎంతోమంది ఇక్కడికి వచ్చేవారు. విజయపురి ప్రపంచ ప్రఖ్యాతి విజ్ఞాన కేంద్రంగా ఇక్ష్వాకుల పూర్వకాలంలోనే పేరు గడించుకొనే ఉండి ఉండాలి. మధ్య మార్గదర్శకుడై “మాధ్యమిక” సిద్ధాంతాన్ని బౌద్ధంలో ప్రవేశ పెట్టిన నాగార్జునాచార్యుడు, మహావేదాంతి, తన చివరి రోజుల్లో చాలాకాలం శ్రీపర్వతం వద్దనే గడిపాడని టిబెటన్ చరిత్రలున్నాయి. కాని విజయపురి చరిత్రవల్ల సమ్మోహితుడనై ముఖ్యవిషయమైన ఆంధ్రా బౌద్ధశిల్ప విషయాలను వదిలి శాఖాచంక్రమణం చేయుట నాకు తగదు.

అయితే అమరావతి పాలరాతి శిల్పాలలాగా, నాగార్జునకొండ శిల్పాలు అంత విస్తృతంగా తరలింపబడిపోలేదు. కాదంటే ఏ నాలుగో అయిదో పారిలో మ్యూజీగయ్ మెట్ లో భద్రపరుపబడి, ఆంధ్రుల బౌద్ధశిల్ప ప్రతిభను జగమంతటికీ చాటుతున్నాయి. నాగార్జునకొండ శిల్పాలన్నిటినీ తవ్వి వేయటం కూడా పూర్తికాలేదని చెప్పటం ఇక్కడ నేను విస్మరించరాదు. ఇంకా తవ్వితే ఇంకా ఎన్నో పురాతన శిల్పాలు, శిథిలాలు, వస్తు విశేషాలు గృహాలు అక్కడ బలపడే అవకాశం చాలా ఉంది. ఈ తవ్వడపు పనికూడా జరుగుతోంది కాని, పురాతత్వ పరిశోధన బుద్ధితోకాక, నాగార్జున సాగర నిర్మాణార్థమై జరుగుతోందని చెప్పటానికి విచారిస్తున్నాను. ఈ ప్రదేశం అంతా నాగార్జున సాగర్ అడుగున మునిగిపోతుంది. ఒక పవిత్ర చారిత్రక పూర్వవైభవ చిహ్న శిథిలం ఇల్లానకినమైన జలప్రణాళికలో జలాంతర్గతమై పోతుందన్నందుకు కూడా, నా మటుకు నేను పెద్దగా ఆక్రోశించను. కారణం ఈ మహానాగార్జున సాగరం, కోటాను కోట్ల ఎకరాల భూమిని పండించి కాటకంతో కుమిలిపోతూన్న దేశాన్ని సుభిక్ష మొనరింపబోతోంది. ఆ మహా బౌద్ధాచార్యులూకూడా, విశాలహృదయంతో ఈ ప్రణాళికను దీవిస్తాడనే నేను తప్పక నమ్ముతున్నాను.

నాగార్జునాచార్యుని కాలంలోనూ తర్వాత కొన్ని శతాబ్దాల వరకూ కూడా, విజయపురి ప్రపంచ విద్యార్థుల విద్యాదాహాన్ని తీర్చే విశ్వవిద్యాలయంగా నిలిచింది. “కాశ్మీర్, గాంధార, చీన, చిలాట, తోసలి, అపరంత, వంగ,

వారణాసి, యవన, పాలూర, దమిళ, తంబపణ్ణి" దేశాలనుంచి విద్యార్థులు తండోపతండాలుగా వేదాంత విద్య నేర్చుకోటానికై వచ్చేవారు. ఇకమీద, పూర్వవైభవానికి ఛాయామాత్రంగా నిలవటంకాక, దాహంతో తపిస్తున్న పరిసర క్షేత్రాలన్నిటికి జలం అందించే జలనిధిగా నిలచి అనేక గృహాలకు ఆనందం చేకూర్చిపెడుతుంది. ఈ గృహాలు ఇప్పుడు దారిద్రంతో అంధమయమై నాగరిక జీవన సౌకర్యాలు లేక కుమిలిపోతున్నాయి. నాగార్జునాచార్యుడు జీవిత ధర్మసందేశాన్ని ఇచ్చాడుగాని శ్మశానవైరాగ్యం బోధించినవాడుకాడు. మానవ మస్తిష్కాలలోని చీకటి గుహల్లోకి వెలుగును ప్రసరింపచేసి, అజ్ఞానాన్ని, వేదనని పారద్రోలటమే అతని ఆశయం. కాబట్టి, దుర్భర దారిద్ర్యమూ కోరుకొన్నదికాక నెత్తిపై రుద్దిన దారిద్ర్యం, జీవితాలను చేరపట్టిస్తుందనీ, సామాన్య జీవిత విజ్ఞానాన్నే అందచేయలేనప్పుడు ఒక ఆత్మవికాసాన్ని అసలు అందచేయలేదని చెప్పేవారిలో నాగార్జునాచార్యుడే ముందు ఉండి తీరుతాడు. అందుకని తప్పకుండా, ఈ కోన, సాగరంగామారి, జీవనదాతగా మారుతుందంటే, అతని ప్రబోధానికి సాంప్రదాయానికి అనుగుణంగా ఉన్న మహత్కార్యమే అని అతని ఆత్మ సంతోషించి తీరుతుందనీ ఏ మాత్రం విచారించదనీ నేను భావిస్తున్నాను.

ఇంతటితో ఈ విషయం వదిలేద్దాం. కాక నేను చెప్పవలసిందేమిటంటే నాగార్జునకొండ త్రవ్వకంలో బైలుపడిన శిల్పవిశేషాలను, ఎక్కడో ఒకచోట జాతీయసంపదగా మాత్రం భద్రపరుచబడతాయని :

ఈ మధ్య భారత ప్రభుత్వం పంపిన ఒక కమిటీవారు, శ్రీపర్వత శిఖరమే ఇల్లాంటి మందిరానికి బాగుంటుందని నిర్ణయించినట్లు వార్త తెలుస్తోంది. నాగార్జునకొండ అడుగునా ప్రక్కలా అంతటా ఏర్పడబోయే నాగార్జునసాగరంలో మునిగిపోయినా, పర్వతాగ్రం మాత్రం నీటి మట్టానికి చాలా పై వుంటుందట. నాకు కూడా ఈ అభిప్రాయం బాగుంది. ఇలాగే చేస్తారని ఆశిస్తున్నాను. కాక ఒకవేళ ఇతర అడ్డంకులు వేటి వల్లనైనా ఇది వీలుగాకపోతే, మరో కొత్త స్థలం నిర్దేశించినా వరూలేదు. ఎందుకంటే అదే మళ్ళీ ఇంకొక నాగార్జునకొండగానే వెలుస్తుంది. కారణం నాగార్జునుని కీర్తి ప్రతిష్టలు, ధర్మసందేశం, అంతగా అక్కడి శిధిలాల ప్రతి చిన్న రాతి ముక్కలోనూ చెక్కడం విశేషంలో అలుముకొని పోయివున్నాయి.

నేను క్రిందటిసారి అక్కడికి వెళ్ళినప్పుడు, నాగార్జునకొండ శిల్పాలలోని ఒక చిత్రం నన్ను దెంతగాడు జరించిందంటారు. ఆ చిత్రంలో కులవస్తు రాజమందిరంలో దుఃఖతరంగం పొర్లుతున్న దృశ్యం కనబడుతుంది. రాకుమారుడు సిద్ధార్థుడు అన్వేషియై మహాభినిష్క్రమణ సెమార్చాడు. పొరధియైన చన్నదీర్తమ మందిరంలో వినిపించాడు - శుచోదన మహారాజు క్రుంగిపోలుతుపెట్టుకొని పింహాసనంపై దాదాపు మూర్ఛపోయిన స్థితిలో ఉన్నాడు. చన్నడు లేకమారదై అతని పాదాల వద్ద మోకరిల్లి ఉన్నాడు. రాజపరిచారకుల మొగాలు విషాదాక్కు వివిధ చాల ప్రతింటూ అతి నిపుణంగ చెక్కబడ్డాయి. అన్నిటినీ మించిన చిత్రవిశేషం రాకుమారుని దిగవిడి వచ్చిన ఆశ్వరాజు కంటకము కంట నీరెట్టి వాపోతుంటుంది. ఒక నిముషమాత్రం సేపు, ఆ రాయి రాయే కన్నీటితో కరిగిపోతుందా అన్న విభ్రమావస్థలో పడేదూడను. నాగార్జునకొండ శిల్ప ప్రభావం అంతటిది. కంటకం వస్తు సమీకరణ మాత్రం కాని చిత్ర విశేష పంపద, బుడిబుడి శోకాల్నిగాక గాఢ వేదనను ప్రేరేపించే సుమనస్కృత చేశానపు చిలుక పలుకులుకాక, ఓబితార్థ ప్రబోధ కలిగి ఈ శిల్పం అతి విశిష్ట శ్రేణికి చెందుతుంది. అక్క మిగిలిన చిన్నరాతి బొమ్మ ముక్క కూడా ఉత్తేజిత శక్తిగలదని, చేతి వేళ్ళు మాత్రమే మిగిలిన ఒక రాతిబొమ్మ ముక్కను చూసి నేను గ్రహించాను. అది చూడగానే బుద్ధ విగ్రహంలోని భద్రబందం అని వాకనిపించింది. ధర్మచక్రాన్ని సాగించిన ఆ చేతి వేళ్ళ మార్ధవం, చక్కదనం, శ్రీ చైతన్యాలను, గుర్తింపలేని వాళ్ళెవరుంటారు?

అమరావతి - నాగార్జునకొండ శిల్పాలు, ఆంధ్రదేశంలో బౌద్ధశిల్పానికి రెండు మహోన్నత జలవటం చేతనే ఇంత విరివిగా వాట్లను గురించి చెప్పుకొచ్చాను. ఇంతకన్న తక్కువ ప్రాముఖ్యంగలవైన, గోలి, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, ఘంటశాల, గుంటుపల్లి, గరికపాడు, శాలిహుండం, రామతీర్థం ఇత్యాది స్థలాలలోని శిధిలాలు కూడా వాటి పద్ధతిని అవి కొన్ని ప్రత్యేకతలు కలవే.

వీటిల్లో కొన్ని స్తూపాలు నాగార్జునకొండ, అమరావతిల కన్న కూడా ప్రాచీనమైనవే. కాని విదేశ ప్రభుత్వోద్యోగుల కళాధ్వంసక స్వభావాల వల్లనూ, స్వార్ధపరత్వాల వల్లనూ ఈ చోటులలో యెక్కువగా శిల్ప విశేషాలు మిగలలేదు. కాని మిగిలిన కొద్ది రాళ్ళమీది చిత్రాలు కొన్ని కూడా, అమరావతి - నాగార్జునకొండ శిల్ప స్వర్ణయుగానికి ప్రాతిపదికలుగానే స్ఫురిస్తాయి. జగ్గయ్యపేటలో పూర్తి శిధిలావస్థలో ఉన్న స్తూప కుడ్య చిత్రశకలాలు కూడా, సౌందర్యలనులుగానే ఉంటాయి. ఈ మధ్య నేనీ ప్రదేశానికి వెళ్ళాను. బొమ్మలన్నీ ముక్కలు ముక్కలై వున్నాయి. మిగిలిన ఒక్క బుద్ధ విగ్రహం మద్రాసు మ్యూజియంలో వుంది. ఇది నిజంగా ప్రత్యేక విశేషమే. కేవలం పాడయిపోకుండా మిగిలిందనే కాదు. తక్కిన శిల్పరీతులకు ఈ విగ్రహ శిల్పానికి కాలంలోనూ, శైలిలోనూ కూడా చాలా అంతరం కనబడుతుంది. విగ్రహం. దిగువ పద్మంలో ఒక శాసనం చెక్కి వుంది. ఈ అక్షరాలు ఆరవ శతాబ్దం నాటి అక్షరాలు. శాసనం సారాంశం : యీ విగ్రహం నాగార్జునాచార్యుని శిష్యుడైన జయప్రభాచార్యుల ఆధ్వర్యంలో నిర్మింపబడిందని. అమరావతి స్తూప ప్రధమ దశాకాలం క్రీ.పూ. 200 నాటికి వెళ్తుంది. తక్కిన శిల్పాలు కూడా ఆ కాలానికే చెందుతాయి. ఇది చాలా తర్వాత కాలం నాటిదని నిర్ణయింపబడింది.

జగ్గయ్యపేట పాలరాతి శిల్పాలలో కల్లా అతి ముఖ్యమైనది, ఒక చక్రవర్తిని చూపించే చెక్కడపు చిత్రం. చక్రవర్తి చుట్టూ రాణి, యువరాజు, మంత్రి, పట్టపుటేనుగు, గుర్రం, చక్రం, అన్న సప్తరత్నాలూ చెక్కబడి ఉంటాయి. ఈ లాంఛనాలు ఇతన్ని మహారాజాధిరాజుగా, చక్రవర్తిగా ప్రకటిస్తాయి. ఈ బొమ్మలో గమనించదగ్గ విషయాలు; చక్రవర్తిమీద నలుచదరపు నాణాలు ఆకాశం నుంచి జల్లబడుతూంటాయి. మానవుల అలంకారాలు వాళ్ళ సుదీర్ఘ స్వరూపాలుగూడా, మరుగుజ్జ రూపాన్ని చెక్కే గాంధారశిల్ప రీతికి చాలా వ్యత్యాసంగా ఉంటాయి. ఈ మార్పే మానవస్వరూపాన్ని అమరావతి శిల్పాలలో అతి అందమైన దేశాంగాలతో తీర్చి దిద్దేందుకు మూలకమయిందనవచ్చు. జగ్గయ్యపేటలో దొరికిన మరొక శిథిల విశేషం పుణ్యశాల. ఒక రెండంతస్తుల ఆరామ స్వరూపం చెక్కబడి ఉంది.

గుంటూరు జిల్లా, రేపల్లె తాలూకాలోని భట్టిప్రోలు గ్రామం నా చిన్ననాడెప్పుడో చూచాను. అందుచేత అక్కడి స్తూపవిషయాలు నాకంతగా జ్ఞాపకంలేవు. కాని కృష్ణాజిల్లా పురావస్తు పరిశోధన సాగించిన అలెగ్జాండరీ గారి వాక్యాలు ఉటంకిస్తాను. “1820 నాటికి భట్టిప్రోలు స్తూపం ఇటుకలు, పాలరాళ్ళు అన్నీకూడా కొల్లగొట్టేశారు. ఇటుకలు పెద్ద సైజున చాలా మంచివై ఉండటం చేత రోడ్ల నిర్మాణంకు వినియోగించారు. పాలరాళ్ళు కృష్ణ కాల్వకు లాకులు కడూ అందులో వాడుకొన్నారు. అయితే ఈ రాళ్ళమీద ఏమన్నా చెక్కడాలుండేవా అని కొంత సందేహం లేకపోలేదు. దీనికన్నా, భట్టిప్రోలు ముందు సందర్శించిన రాబర్టు సూవెల్ వీట్ల మీద చెక్కడాలున్నాయనే అభిప్రాయపడ్డాడు. 1878లో మద్రాసు ప్రభుత్వానికి పంపిన నివేదికలో ఈయన ఇలా తెల్పాడు. “అవి నిజంగా చెక్కడాలున్న రాళ్ళే అన్న విషయం వెల్లటూరు లాకు గోడలలోను, నేల చప్టాకు విరివిగా వాడిన ఆ పాలరాళ్ళను బట్టి తెలుస్తుంది. కొన్నిటి మీద అమరావతి పద్ధతిలో బొమ్మలో చెక్కినట్లున్నాయి. కాని

అంత అందపు చెక్కడాలు కావు" నేను కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తాను. గుంటూరు జిల్లాలో పల్నాడులో దొరికే పాలరాయినే ఈ స్థూపంలో విరివిగా వాడారు. ఈ రాయి సహజంగా అందంగాని, నునుపుగాని, వర్ణవైవిధ్యంగాని కలది కాదు. బండగా, మొద్దుగా ఉంటుంది. ఈనాడు సిమెంటు పరిశ్రమలో దీన్ని వాడుతున్నారు. ఇలాంటి బండరాయిలో జీవంపోసి, సుందరాతి సుందరంగా మలచి, ప్రజాబాహుళ్యానికి అమర సందేశం అందించిన ఆంధ్ర శిల్పుల హస్తకౌశల మెంతదో!

ఇంత బండరాయి కనకనే శిల్ప విశేషానికి తప్ప, శిల్పి చేతిలో మలచబడి బొమ్మ చెక్కబడి ఉంటే తప్ప, పల్నాటి రాతిని, భట్టిప్రోలులో గాని, తదితర స్తూపాలలో గాని స్తూప నిర్మాణంలో వాడి వుండరని, అధమం, ఏ స్వల్ప శిల్ప విశేషమో, పద్మమో, ధర్మచక్రమో, పడగ విప్పిన పామో, బోధి లేక శ్రీపాద వృక్షమో లేకుండా ఉండి ఉండదని నా నమ్మకం. ఏదైతేనేం, భట్టిప్రోలులో స్తూపం ఘంటశాల, నాగార్జునకొండల వాటి మాదిరిగా కాక గట్టి ఇటుక రాళ్ళతో కట్టబడినదైనప్పటికీ, ఈనాడు పూర్తిగా అందుబాటు లేకుండా శిథిలమయి పోయింది. గుడివాడ బౌద్ధ స్తూపానికి కూడా సరిగ్గా ఇదే గతి పట్టినట్టు తోస్తుంది. "బెజవాడ బందరు మధ్య రాజబాట వెయ్యటానికి 1840లో ఒక యిటుకల గుట్ట నేలమట్ట మొనర్చబడింది" ఈ కళా ధ్వంసకత్వాన్ని నిందిస్తూ రీ యిల్లా వ్రాశాడు. "ఈ కట్టడాలన్నీ కూడా రోడ్లు వెయ్యటానికి తదితర నిత్యనిర్మాణాల కోసమని ధ్వంసం చెయ్యబడటం బహుశోచనీయం. ఒక ప్రాచీన నాగరికతకు మహోత్కృష్ట చిహ్నాలైనప్పటికీ కూడా వాటి ప్రాచీనత వాటిని రక్షించలేకపోయింది. ఈ పరిస్థితులలో ధ్వంసకుల చేతిలో పడక మిగిలిన శిథిలాలనే పోగుచేసుకొని కూర్చుకొన ప్రయత్నించవలసి వచ్చింది. చాలా చోట్ల వట్టిగుట్టల్లా కనబడుతున్న ఈ శిథిలాల నుంచే ఆనాటి బౌద్ధశిల్పం వైదణ్యాన్ని మించిన రీతులు, ఆ తర్వాత కాలంలో ఎప్పుడూ కూడా భారతదేశ శిల్ప చరిత్రలోనే కనబడలేదని తెలుసుకోగలిగాము. తర్వాత వచ్చిన ద్రవిడ దేవాలయ శిల్పాలలోవలె కాక, బౌద్ధ ఆలయాలు మహోన్నత శిల్పపు చెక్కడాలు కలిగి ఉండటమేకాక ఆ ఆలయ నిర్మాణమే మహోత్కృష్ట శిల్ప సూత్రాలపై నిర్మితమై ఉండేది".

ఇక్కడ ఇంతగా 'రీ' గారి నుంచి ఉటంకించటానికి ఒక్కటే కారణం ఉంది "దాక్షిణాత్య బౌద్ధ శిల్పాలు కృష్ణా (ఇప్పటి గుంటూరు కూడా) జిల్లాలోని భట్టిప్రోలు, ఘంటశాల, గుడివాడ మొదలైన పురాతన స్తూపాలు" అన్న పేరుతో 1894లో రీ ప్రచురించిన నివేదిక ఈనాడు ఎక్కడా దొరికేటట్టు లేదు. నాకు మాత్రం అదృష్టవశాత్తూ ఒక ప్రతి ఈ మధ్యనే పూనాలో లభించింది. ఇలాంటి ఉద్గ్రంథ భాగాలను విస్తృతంగా ఉటంకించాలన్న కుతూహలాన్ని అణుచుకోటం కొంత కష్టమైనా, ఈ కొద్దివిషయాలు మాత్రమే చెప్పి వదిలేస్తాను. భట్టిప్రోలు వద్ద బౌద్ధ పవిత్రాస్థికలున్న రెండు పాత్రలను రీ సంపాదించగలిగాడు. గుడివాడ దిబ్బ నుంచి, ఒక గుట్ట ప్రశస్తమైన ప్రాచీన నాణాలు సంపాదించగలిగాడు. అక్కడ దొరికిన వాట్లలో ఒక విచిత్రమైన నాణెం కూడా ఉంది. "ఒకటి గ్రీకుదో, రోమ్ దో, తెడ్లపడవ, పై తట్టు అర్ధచంద్రాకారంగా ఉండి రెండు తెరచాప కొయ్యలున్న పడవ బొమ్మ ఉన్న నాణెం" దొరికింది. ఇలాంటి వాట్లను త్రవ్వితీసి వెలవర్చిన 'రీ' గారు మన కృతజ్ఞతాభివందనముల కెంతయూ పాత్రుడు. ఘంటశాలలో పాలరాతి బొమ్మలను తవ్వితీశే అవకాశం కూడా వీరికి కల్గినందుకు విచారించవలసిందే. అది ఎట్లా జరిగిందో కూడా ముందు చెప్తాను.

భట్టిప్రోలు, గుడివాడలలో శిల్ప విశిష్టత లేమన్నా ఉండి ఉన్నాయా అన్నది సందేహాస్పదమైన విషయమే అయినా ఘంటశాల విషయంలో ఈ అనుమానం అక్కరలేదు. ఘంటశాల మచిలీపట్టణానికి పడమరగా పదహారుమైళ్ళ దూరంలో ఉన్న గ్రామం. కొద్ది ఏళ్ళక్రితం నేనీ.

ఊరు చూచినప్పుడు, స్తూప ప్రాకారంలో రాళ్ళు ఇంకా కొన్ని నిలిచి ఉన్నవి చూశాను. వాట్లమీద సునిశితంగా చెక్కిన ధర్మచక్ర చిత్రాలున్నాయి. ఘంటశాల అసలు పేరు కంటకశైలమని చెప్తారు. నిజానికి 'టోలెమి' కూడా దీన్ని "కొంటొకొస్సిల" అని పేర్కొన్నాడు. బుద్ధదేవుని అశ్వరాజమైన "కంటకం' పేర ఇది కట్టబడిందని అనుకొంటున్నారు. కంటక చిత్రం ఉన్న కుడ్యశిల్ప భాగం, ఘంటశాల నుంచి తెచ్చినది మద్రాసు మ్యూజియంలో భద్రపరుపబడి వుంది. ఘంటశాల శిలలు మరికొన్ని పారిలో మ్యూజీగయ్ మెట్ లో వున్నాయి. 1954లో నేను పారిస్ వెళ్ళి నప్పుడు ఈ శిథిలాలు చూశాను. ఒక పాలరాతి చెక్కడంలో మూడంతస్థుల మందిరమూ భక్తులూ చెక్కబడ్డారు. మరొక చెక్కడంలో పుత్రజనన వార్త విని ఆనంద పరవశుడైన శుద్ధాదనుడు చిత్రించబడ్డాడు. మూడవ దానిలో భార్య పుత్రులను విడనాడి బైలుదేరటానికి నిశ్చయించుకొన్న సిద్ధార్థుని బొమ్మ చెక్కి వుంది.

బ్రిటీష్ మ్యూజియం ప్రాచ్యవస్తుశాఖ అసిస్టెంటు కీపర్ అయిన డగ్లస్ బారెట్ గారి అభిప్రాయం ప్రకారం, ఘంటశాల శిల్పాలలో కల్లా ముఖ్యమైన చెక్కడం బోస్టన్లో ఉంది. ఆ రాతి పలకకు రెండువైపులా చిత్రాలు చెక్కి వున్నాయి. "ఒక వైపున అమరావతి రాళ్ళలో మాదిరిదైన ఒక స్తూప సంపూర్ణ చిత్రం చెక్కబడి వుంది. రెండవ వైపు, నిరంజన నదీతీరాన బుద్ధుని విగ్రహం చెక్కబడి వుంది. ఎడమ మూలపైగా స్తంభం ముక్క కనబడుతుంది." రెండు వైపుల చెక్కబడి వుండటమే ఈ శిల ప్రాముఖ్యమా, నాకు తెలియదు. కాని ఘంటశాల వద్ద స్తూపం చాలా పెద్దదై ఉండటమే కాకుండా, ఆంధ్రలో కెల్లా చాలా ప్రముఖమైనదని కూడా నేను నమ్ముతున్నాను. ఘంటశాల శిల్పరీతులు అమరావతీ శిల్పరీతితో తులతూగుతూ ఉంటవి. ఘంటశాలలో దొరికిన బుద్ధ విగ్రహం శిరస్సు, కొన్ని విధాలలో చూస్తే అమరావతీ నాగార్జునకొండ విగ్రహాల కన్నా చాలా శిల్ప విశిష్టత కలదని నా అభిప్రాయము. ఈ ముఖంలో ఎక్కువ ప్రశాంతత ఎక్కువ గాంభీర్యం ద్యోతక మౌతున్నాయి. పెదవుల చిరునవ్వు. రేయి తొలిజామున ఆకాశంలో మిలమిలలాడూ నిశీథాన్ని మరింత రమణీయంగా తోపింప చేసే, నెలవంక రూపంలో వుంటుంది.

ఘంటశాల శిల్పాలు మనకు శాశ్వతంగా కాకుండా పోవటం చాలా విషాదకరమైన విషయం. ఈ పల్లెలో 1890లో పరిశోధన సాగించిన రీ, ముఖ్యస్తూపం పైననే తన దృష్టిని కేంద్రీకరించాడు. ఈ పాడుబడిన దిబ్బనే స్థానికులు "లంజదిబ్బ" అని పిలుస్తారు. ఒక్క ఘంటశాలలోనే కాదు గుడివాడ, భట్టిప్రోలు, చినగంజాం, పెద్ద గంజాం, మరికొన్ని స్థలాల్లో కూడా, ఈ శిథిల ప్రదేశాలను లంజదిబ్బలనీ, బోగమాళ్ళ దిబ్బలనీ పిలవటం శోచనీయమైన విషయమే. ఇలా పిలువబడనిది నా ఎరుకలో ఒక్క అమరావతి స్థూపం మాత్రమే.

స్థానికంగా దానికి దీపాలదిబ్బని పేరుంది. కాని ఈ దీపాల సందర్భం కూడా గౌరవనీయంగా వచ్చినట్లు కనిపించదు. బౌద్ధస్థలాల దిబ్బ లెక్కడెక్కడున్నాయో అక్కడి దిబ్బమీది లంజె దీపంతో సంజ్ఞ చేసేదని కథ చెప్పుకొంటారు. చివరిదశలో బౌద్ధ అనుయాయులు ఎంత హీన స్థితిలోకి దిగజారారో! వజ్రయాన సహజయాన కాలాలలో తాంత్రిక మతాలతో బౌద్ధం దిగజారుటచే ఈ పేరు వచ్చినదని అనుకోవచ్చు. లేదా హైందవమత

తీవ్రవాదులు బౌద్ధారామాలను అణగదొక్కటంలో ఈ చెడ్డ పేరులు కల్పించైనా వుండవచ్చును. నేను ఈ రెండవ అభిప్రాయాన్ని నమ్ముతున్నాను.

కాని అసలు విషయం వదిలి వెళ్తున్నట్టున్నాను. అంటే ఘంటశాల వద్ద, రీ త్రవ్వితీసిన పురావస్తువుల విషయం. ముఖ్య స్థూపం యొక్క వైశాల్యం ఆయన్నాకర్షించింది. అందులోనే ఎక్కువ పరిశోధనలు కావించాడు. అందులో పాలరాతి చెక్కడాలు దొరకలేదు. అస్థినిక్షేప పాత్ర స్థూప పునాదులు మాత్రం బైటపడ్డాయి. అసలిందులో పాలరాతి శిల్పాలు ఉండి ఉండకపోవచ్చును. నిజానికి ఘంటశాల శిల్పాలన్నీ, కోటదిబ్బలో వున్నాయి. రీ ఇది కూడా ఉల్లేఖించే వుంచాడు. ఇదేకాక పొలిమేర దిబ్బ అనే మూడవ దిబ్బ కూడా ఆ ప్రక్కలనే వుంది. కోట దిబ్బ విషయం రీ ఇలా వ్రాశాడు.

దక్షిణాన ఊరిపొలిమేర సమీపంలో ఒక చిన్న చెరువుగట్టు నానుకొని ఒక చిన్న దిబ్బ వుంది. ఇటు నుంచి అటు 70 అడుగుల వ్యాసం వుండి దాదాపు గుండ్రంగా వుంటుంది. ఇటుక రాతి పునాది గోడలు అక్కడక్కడ కనబడతాయి. రబ్బేసంతటా అలముకొని వుంది. ఇది కూడా ఒక స్థూప శిథిలం అయి వుండవచ్చును.

రీగారు ఒక పెద్ద పరిశోధన చెయ్యగల ఆస్కారాన్ని ఇక్కడ చెయిజార్చుకొన్నారు. తర్వాత 1920లో ఒక రైతు పొలం దున్నుకొంటూ, ఈ కోట దిబ్బ అంచున దున్నుతూంటే దాదాపు 60 శిల్పశిలలు బైటపడ్డాయి. ప్రతి ఒక్కటి శాక్యముని జీవితాన్నో, జాతక కథలనో వర్ణించే చెక్కడపు పనితో నిండి ఉంది. ఆ ఊరి పెద్దలు కొందరు నాకు చెప్పిన కథ ప్రకారం, కొన్నాళ్ళు ఈ రాతిఫలకాలు గుట్టగా ఒక చెట్టు క్రింద పడేసి ఉంచారట. పుదుచ్చేరి నుంచి యం.జి. జోలియడూ బ్రెయిల్ గారి ఏజెంటు ఒకడు వచ్చి చూచి గప్ చిప్ గా ఈ రాళ్ళ మొత్తం అంతా 5000 రూపాయలకు కొనుక్కుపోయాడు. ఈ విధంగా ఘంటశాల శిల్పనిధులు శాశ్వతంగా మన చెయ్యి జారిపోయి పారిస్ మ్యూజీగుయ్ మెట్ చేరాయి.

ఆంధ్రలో తక్కిన బౌద్ధస్థలాలను సందర్శించనందువల్ల వాట్లను గురించి స్వంత అభిప్రాయాలను వెల్లడించలేదు. అయితే ఈ మధ్యనే శాలిహుండం వద్ద మళ్ళీ త్రవ్వకపు పరిశోధనలు సాగిస్తున్నారని, వంశధార దక్షిణపు ఒడ్డున శ్రీకాకుళంలో కూడా పురాశిథిల పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పవలసి ఉంటుంది. ఇక్కడ కొన్ని ముఖ్యమైన వస్తువులు దొరికాయని క్రొత్త క్రొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయనీ కూడా తెలిసింది. అనేక స్థలాలలో మట్టి దిబ్బల అడుగున మాటుపడిపోయి ఆంధ్రలో కాషాయవస్త్రం కలాధేయమై వెలసిన నాటి శిల్ప విశేషాలు శిథిల వస్తువులు మగ్గిపోయి వున్నాయనే, నేను విశ్వసిస్తున్నాను.

నేను జన్మచే గాని, సిద్ధాంత స్వీకృతివల్ల గాని బౌద్ధుడను కాను. కాని ఆంధ్రలోని బౌద్ధ శిల్ప కళావిశేషాన్ని చూచి, దేశకాల పాత్రాలకు చివరికి ఆ మతానికి కూడా సంకుచితంకాని, నైసర్గిక భారతీయ శిల్పకళా విశేషానికి, వైదగ్ద్యానికి గర్వపడుతున్నాను. ఒక్క భారతదేశానికే కాక సర్వ ప్రపంచానికి కూడా, ఇది ప్రాచీన దత్తమయిన మహా నిక్షేపమని ఒప్పుకోక తప్పదు. ఈ కళ, జాతి, దేశ, కాల పాత్ర అవధులను అతిక్రమించి విస్తరించింది. క్రైస్తవ శకోదయ కాలంలో కృష్ణానదీ తీరాన ఉద్భవించిన ఈ మహాశిల్పకళ 2000 ఏళ్ళ క్రిందట ఆసియా ఖండంనంతనూ విమోహిత మొనర్చి ఉర్రూతలూగించినట్లుగానే ఈనాటికీ మనని ఆకర్షించి, తన ప్రభావంలో మనలను ముంచెత్తుతుంది.

అమరావతి కేంద్రంగా, ఈ జ్యోతిర్మాల దూరదూరాలకు తన వెలుగును ప్రసరింపచేసింది. సముద్రాలను తరించి, సౌత్ ఈస్ట్ ఏషియా శిల్పులపై తన ప్రభావం ప్రకటించింది. డాక్టర్ రెజినాల్డు లీమే రచించిన "ఆగ్నేయ ఆసియా సంస్కృతి" అన్న గ్రంథంలో ఇలా వ్రాయబడి ఉంది. "అమరావతి శిల్ప ప్రభావం, సింహళం, మధ్య దక్షిణాసియాలలో విస్తరించి దక్షిణాన సుమత్రా వరకూ కూడా వ్యాపించింది.

ఈ మధ్య వెలువడిన "భారతీయ కళా శిల్పం" అన్న గ్రంథంలో కూడా మిస్టర్ బెంజమిన్ రౌలండు ఈ అమరావతీ శిల్ప ప్రభావాన్నే వర్ణించాడు. "ఆంధ్ర సామ్రాజ్య ప్రభావం సాంస్కృతిక, వాణిజ్య, మత, సంబంధ బాంధవ్యాల వల్ల, చాలా విస్తృత భూఖండంలో వ్యాపించింది. అమరావతి శిల్పరీతి సింహళంలో వ్యాపించటమే కాకుండా, రెండు మూడు శతాబ్దాలనాటి బుద్ధ విగ్రహాల ఆంధ్ర శిల్పశైలి, చంపా (నేటి ఇండో చైనా) లో డోంగ్ దువాంగ్, సెలిబీలోని పెంపగా వరకూ కూడా విస్తరించుకొని వచ్చింది. ఈ డోంగ్ దువాంగ్ మండలానికి కూడా అమరావతి పేరుండటము కేవలం కాకతాళీయమే అంటారా?

నిజానికి అమరావతి, నాగార్జునకొండ, సాంస్కృతిక యుగం భారతీయ కళలో ఒక స్వర్ణయుగం. దాని ప్రభ, ఏ ఒక్క కుడ్య శిల్ప శకలం మిగిలి ఉన్నా అది కుల, మత, వర్ణ విచక్షణలు, దురాగతాలు, క్రౌర్యాలు లేక, ద్వేష సంఘర్షణల కతీతమైన ఒక పరమాదర్శయుతమైన సంఘ నిర్మాణానికి మనను ప్రేరేపిస్తూ, ప్రబోధకంగా మిగిలి వుంటుంది.

(బుద్ధ జయంతి మహోత్సవ సంచికలోని ఆంగ్ల వ్యాసానికి తెలుగు అనువాదం)

కాంగ్రా కళలో రాధాకృష్ణులు

మహాభారతంలో శ్రీకృష్ణునితో మనకు తొలి పరిచయం ద్రౌపదీ స్వయంవర సభలోనే. ఆ సభకు ఆయన వెళ్ళింది మత్స్యయంత్రాన్ని కూలద్రోయవలెనన్న తలంపుతో కాదు; పాంచాలిని పెండ్లాడవలెనన్న తలంపుతో అసలే కాదు. కొంతకాలంగా ఒక భయం, ఒక బాధ ఆయనను పీడిస్తున్నాయి. పాండునందనులు తనకు ఆప్తబంధువులు, పరమ మిత్రులు. వారి సహాయంతో తా నెన్నెన్నో ఘనకార్యాలను సాధించాలని యోచన చేస్తున్నాడు. ఇంతలో లాక్షాగృహదహన వార్త తన చెవిని పడింది. ఆ గృహంతోపాటు పాండునందనులు దగ్ధమైపోయారా? లేక ప్రమాదం నుంచి ప్రాణాలతో వారు బయటపడ గలిగారా? ఏదో ఒక విధంగా బయటపడ గలిగివుంటే, కొంతకాలం పాటు ప్రచ్ఛన్న వేషధారులై వారు దేశాటన చేయడం సహజం. తమ బాహుబలం తప్ప అన్యబలం అప్పటిలో వారికి లేదు. శక్తిమంతుడైన ఏ రాజు తోడ్పాటునో వారు సంపాదించుకోవాలి. ఆ తర్వాత గాని తమ వంతు అర్ధరాజ్యాన్ని తమకు పంచి పెట్టవలసిందిగా వారు పట్టు పట్టలేదు. ఈ తోడ్పాటును సంపాదించుకొనడానికి ద్రౌపదీ స్వయంవరం ఒక మహదవకాశం కాదా? విలువిద్యలో అఖండ ప్రజ్ఞావంతుడైన అర్జునుడు మత్స్యయంత్రాన్ని కూలద్రోసి, పాంచాలిని గెలుచుకుంటే పాంచాలాధీశుని వారు తమ పక్షానికి తెచ్చుకున్నట్టే కాగలదు గదా? అయినప్పుడు పాండునందనులు (వారు సజీవులై వుంటే) స్వయంవర సభకు రాకుండా వుంటారా? ఏమైనా, అక్కడికి తాను స్వయంగా వెళ్ళడం మంచిది. సభాస్థలిలో పాండవ సోదరులుంటే - వారు ఏ మారు వేషంలో వున్నా - తాను గుర్తించకపోలేదు. ఈ ఆలోచనతోనే శ్రీకృష్ణుడు ద్రౌపదీ స్వయంవరానికి వెళ్ళాడు. ఇది ఎంత సరైన ఆలోచనో ఆ తర్వాత జరిగిన సంఘటనలు నిరూపించాయి.

అంతకుముందు ఆయన ప్రసక్తిని తీసుకురాని మహాభారతం ద్రౌపదీ స్వయంవర సభలో హఠాత్తుగా శ్రీకృష్ణుని మనకు పరిచయం చేసి, ధర్మ సంస్థాపనార్థం భూతలంపై అవతరించిన శ్రీమహావిష్ణువుగా మనం ఆయనను ఎందుకు సంభావించవలెనో వివరించదు. జరాసంధుని వధ మొదలుకొని, దుర్యోధనుని వధ వరకు శ్రీకృష్ణుడు చేయించిన వన్నీ ధర్మవిరుద్ధమైన కృత్యాలే. ఈ సందర్భాలన్నింటిలో ధర్మసూత్రాలకు కాక, కార్యసాఫల్యానికే, విజయసాధనకే ఆయన ప్రాధాన్య మిచ్చాడు. భూతలంపై ధర్మ సంస్థాపనార్థం జన్మించిన దేవదేవుడే ధర్మసూత్రాలకు ఇంత వ్యతిరేకంగా, లేదా వాటికి ఇంత అతీతంగా, ఇంత 'ఎమోరల్'గా వ్యవహరించడం ఆక్షేపణీయం కాదా?

మన పౌరాణికులను సయితం ఈ సందేహమే బాధించి వుండాలి. అందువల్లనే భారత కృష్ణుని సమర్థనకై వారు మహాభారతానికి అనుబంధంగా "హరివంశం" వ్రాశారు. అది కూడా చాలదన్నట్టు "మహాభాగవతం" వ్రాశారు. ప్రథమ సమావేశంలోనే ఒక రాజనీతిజ్ఞుడుగా మనకు దృగ్గోచరమయ్యే శ్రీకృష్ణుని పుట్టుపూర్వోత్తరాలను గురించి హరివంశం, మహాభాగవతాలు చాలా చాలా చెప్పినా, ధర్మ సమ్మతమైనవిగా ఆయన చర్యలను అవి సమర్థించగలిగినవా? నిష్కర్షగా మాట్లాడితే, "లేదు" అనేదే ఇందుకు సమాధానం.

ఐతే, హరివంశ మేమి, అంతకంటే మిన్నగా భాగవత మేమి, భారత కృష్ణుని స్థానంలో ఒక నూతన వ్యక్తిని సృష్టించగలిగాయి. భారత కృష్ణుని వలె ఈ నూతన కృష్ణుడు రాజబంధువు కాదు గోపబాలకుడు. రాజనీతి చతురుడు కాదు, రాసక్రీడా వినోది. భూతల రాజ్యాల పై దృష్టిగలవాడు, హృదయ సామ్రాజ్యాధిపత్యాన్ని కోరేవాడు. అధికారానికి - దాని అన్ని రూపాలలో - ఈ కొత్త కృష్ణుడు ప్రబల విరోధి. భూసురాధికారాన్ని ఒక ఘట్టంలో ఆయన ధిక్కరిస్తాడు.

సురాధిపత్యాన్ని మరొక ఘట్టంలో తృణీకరిస్తాడు, అధికారానికి అహంకారానికి ప్రజల శత్రువుగా నిలిచి, ప్రజాసామాన్యం ఆశ నిరాశలను, ఆనంద విషాదాలను పంచుకునే ఈ నవ కృష్ణుడే లోక ప్రియుడైనాడు.

తమ హృదయాన్ని హరించిన ఒక వ్యక్తిని గురించి ఎవరికి వారు ఎన్నెన్నో ఊహా కల్పనలు చేసుకొనడం సహజం. ఈ కృష్ణుని విషయంలో అంతే జరిగింది. బలవలు, పలవలుగా ఆయనను గురించిన కథలు, గాథలు అల్లుకుపోయాయి. పురుషోత్తముడుగా కవులు ఆయనను చిత్రించారు; వేణుగోపాలుడుగా గాయకులు ఆయనను కీర్తించారు. జగన్మోహనంగా శిల్పులు ఆయనను ప్రతిష్టించారు; లీలామానుషమూర్తిగా చిత్రకారులు ఆయనను రూపొందించారు, శృంగార నాయకాగ్రేసరుడుగా నాట్యాచార్యులు ఆయనను తీర్చిదిద్దారు, అన్యులు అన్యవిధాలుగా ఆయనను తమ హృదయసీమలో నిలుపుకున్నారు.

ఒక్కొక్క నూతన కావ్యంతో, ఒక్కొక్క నూతన కల్పనతో కృష్ణుని స్వరూప స్వభావాలు తొక్కింతగా మార్పు చెందుతూపోగా, ఆయన జీవితంతో ముడివడి వున్న ఇతర వ్యక్తులలో కొందరికి ప్రాధాన్యం పెరగడం, మరికొందరికి అది తరగడం జరిగింది. ఉదాహరణకు, రుక్మిణీ సత్యభామలనే చూడండి. వారికి భారత, భాగవత పురాణాలలో వున్నంత ప్రాధాన్యం అటు తర్వాత వచ్చిన కావ్యాలలో లేదు. ఈ పట్టపు దేవేరు లిద్దరిని వెనుకకు నెట్టివేసి ఒక గోపిక కావ్య కృష్ణుని హృదయంలో వలె కృష్ణ భక్తుల హృదయాలలో సైతం పీఠం పెట్టింది. ఆమె పేరు రాధ. భారతం పద్దెనిమిది పర్వాలను గాలించినా, దానిలో ఆమె కనబడదు; భాగవతంలో ఆమె లేకపోలేదు

గాని, అనామికగా మాత్రమే. రాసక్రీడ సందర్భంలో కృష్ణుడు ఒక గోపికను ప్రత్యేకించి అభిమానించినట్టు భాగవతం చెబుతుంది. తక్కినవారి కనుబ్రామి, ఆమెను మాత్రమే వెంటబెట్టుకుని ఆయన వనాంతరానికి వెళ్ళినట్టు అది చెబుతుంది. తనపట్ల కృష్ణుడు చూపిన ఈ ప్రత్యేక ప్రేమకు ఆమె గర్విష్టురాలై, “నేను అలసిపోయాను. ఇక్కడి నుండి అడుగు తీసి అడుగు పెట్టలేను. నన్ను వీపు నెక్కించుకొని మోసుకుపోవలసింది” అని పలకగా “సరే” అంటూ వీపు వంచినట్టే వంచి, అంతలోనే కృష్ణుడు మాయమై పోయాడని భాగవతం చెబుతుంది. ఇన్ని విషయాలను చెప్పినా, ఆ గోపిక పేరును మాత్రం అది చెప్పదు. అనామికగా భాగవతం మిగిల్చిన ఈ గోపికే కవుల ఊహా ప్రపంచంలో రాధగా అవతరించింది.

ఈ రాధ తండ్రి వృషభానుడు. తల్లి కమలావతి. భర్త అయనుడు. యశోదకు ఈ అయనుడు తమ్ముడైనందున రాధ శ్రీకృష్ణునికి మేనత్త. వయస్సుకు ఆయన కంటే ఏ కొంచెమో పెద్ద.
సంఘానికి వెరవక, దాని సంప్రదాయాలకు వెరవక, కృష్ణునికి ఆత్మార్పణ చేసిన రాధ, ఆత్మార్పణకే ఒక పరమ సంకేతమై కావ్య ప్రపంచంలో నిలిచింది. కళా జగత్తులో ప్రభాసించింది.

భాగవత రచన క్రీస్తు శకం ఎనిమిదవ శతాబ్దిలో జరిగిందని కొందరు చరిత్రకారుల మతం కాగా, “కాదు, పదవ శతాబ్దిలో” అని మరి కొందరు వాదిస్తారు. దాన్ని ఎనిమిదవ శతాబ్దినాటి రచనగా స్వీకరించినా, ఆ నాటికి రాధ లేదు. అటుతర్వాత ఏ తొమ్మిదవ శతాబ్దిలోనో, పదవ శతాబ్దిలోనో ఆమె అవతరించి, రెండు, మూడు వందల సంవత్సరాల లోపల ఎన్నెన్నో కావ్యాలకు శృంగార నాయిక అయింది. ఇంతేకాదు ఒక నూతన తాత్త్విక సిద్ధాంతానికే ఆమె మూలాధారమైంది. జ్ఞానయోగం సరసను భక్తియోగానికి, కర్మయోగానికి స్థానమిచ్చిన భగవద్గీత “భక్తి”కి పర్యాయపదంగా “ప్రేమను పొరపాటుగానైనా వాడదు. అంతకుపూర్వపు మత గ్రంథాలలోనైనా “ప్రేమ” ప్రసక్తి చాలా చెదురుగా తప్ప కనబడదు. మోక్ష సాధనకు ఒక మార్గంగా నిష్కళంక ప్రేమను, విశ్వవ్యాప్త ప్రేమను ఈనాడు గుర్తిస్తున్నట్లుగా ఒకనాడు హిందూ మత గ్రంథాలు గుర్తించలేదని కాదా దీని తాత్పర్యం? భాగవతం రచన తర్వాతనే, కృష్ణుని పట్ల గోపికల ప్రేమను అది ప్రస్తుతించిన పిమ్మటనే, భక్తి ప్రేమ రూపాన్ని ధరించవచ్చుననే విషయం అంగీకృతమైంది. దీన్ని “రాగానురాగ భక్తి”గా అభివర్ణించారు. దాస్యం, సఖ్యం, వాత్సల్యం, మాధుర్యం ఈ నాలుగు దశల కింద ఈ రాగానురాగ భక్తిని విభజించారు. వాటిలో నాల్గవ దశను పరిపూర్ణతగల దాన్నిగా సంభావించారు. దీన్నే "మధురభక్తి”గా భక్త కవుల రచనల చర్చ సందర్భంలో పేర్కొంటున్నారు.

ఈ 'మధురభక్తి" హిందూ మతానికి, తిరిగి దానిలో వైష్ణవానికి పరిమితం కాదు. అన్యమతాలలో కూడా దీనికి స్థానం ఉన్నది. చైతన్యుని నిర్యాణ కాలం నాటికి క్రైస్తవ మతంలో “కార్మెలైట్ నన్స్" అనే శాఖ నెలకొన్నది. ఈ శాఖకు చెందినవారు తమను గోపికలుగా, ఏసుక్రీస్తును శ్రీకృష్ణునిగా భావించుకుంటారు. ఏ పురుషునీ తేరిపార జూడరాదనేది ఈ శాఖకు చెందినవారు పెట్టుకున్న ఒక కఠిన నియమం.

భక్తి ధరించగల రూపాలలో ప్రేమకు మించింది లేదని ఓంప్రథమంగా చాటిన కవి జయదేవుడు. ఆయన క్రీస్తు శకం పన్నెండవ శతాబ్దిలో వర్ధిల్లాడు. పశ్చిమ బెంగాలకు చెందిన బీర భూమ్ జిల్లాలోని కెందులి గ్రామంలో ఆయన జన్మించాడు. ఆయన తండ్రి భోజదేవుడు, తల్లి రమ. ఆయన బాల్య జీవితాన్ని గురించి అంతగా తెలియదు. కాని, 16 శతాబ్దిలో నాభాదాసు రాసిన “భక్తమాల" కథనం ప్రకారం విద్యాభ్యాసాన్ని పూర్తి

చేసినంతనే ఇల్లు విడిచి, జయదేవుడు దేశాటనకై బయల్దేరాడు. ఆ రోజులలో చేతిలో ఒక ఇత్తడి చెంబు తప్ప మరి ఏమీ ఆయన వెంట ఉంచుకొనేవాడు కాదు. ఒకే చెట్టు కింద రెండు రాత్రులు వరసగా నిద్రిస్తే ఆ స్థలం పట్ల తనకు రాగమోహాలు పుట్టవచ్చునేమో అని ఆయన ఏ ఒక ప్రదేశంలోను ఒక రోజుకు మించి మకాం చేసేవాడు కాదు.

వివిధ క్షేత్రాలను దర్శిస్తూ చివరికి జయదేవుడు పూరీజగన్నాథం చేరాడు. అక్కడ ఒక దక్షిణాది బ్రాహ్మణ కుటుంబీకుని కుమార్తెతో తలవని తలంపుగా ఆయనకు వివాహం జరిగింది. ఆమె పేరు పద్మావతి. ఆదిలో కొంత విముఖంగానే గార్హస్య జీవితాన్ని ప్రారంభించినా, క్రమంగా జయదేవుడు తన పత్నిని ప్రేమించ నారంభించాడు. పోనుపోను అది ప్రగాఢ ప్రేమగా పరిణమించింది.

ఆ నవదంపతులు పూరీజగన్నాథంలోనే ఒక కుటీరాన్ని నిర్మించుకొని, అక్కడ కొన్నాళ్ళపాటు నివసించారు. తన శ్రావ్యకంఠంతో జయదేవుడు పాడగా, పద్మావతి అప్సర వలె నాట్యం చేస్తూ వుండేది. ఆమె సౌందర్యానికి ముగ్ధుడై, ఆమె ప్రేమచే పునీతుడై జయదేవుడు "గీత గోవిందం" రచనను ప్రారంభించాడు. పద లాలిత్యానికి భావ మాధుర్యానికి దాన్ని చాలిన కావ్యం మరి లేనందున అది జయదేవునికి అనతికాలంలోనే అశేష కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించింది.

తర్వాత కొంత కాలానికి పద్మావతీ సమేతంగా జయదేవుడు బృందావనం తీర్థయాత్రకై వెళ్ళాడు. అంబర్ రాజు ఆహ్వానంపై ఆయన అక్కడికి వెళ్ళి, ఆ రాజు అతిథిగా కొన్ని నెలలపాటు ఉన్నాడు. ఆ తర్వాత ఆయన స్వరాష్ట్రానికి తిరిగి వెళ్ళి లక్ష్మణ సేనుని ఆస్థానకవిగా వున్నాడు. ఈ లక్ష్మణ సేనుడు వంగ భూమికి చిట్టచివరి హిందూరాజు. 'పంచరత్నాలు"గా చెల్లిన ఐదుగురు సుప్రసిద్ధ కవులు ఈయన పోషణలో వుండేవారు. వీరిలో అగ్రగణ్యుడు జయదేవుడే. తన కవుల ఘనతను చాటడానికి లక్ష్మణ సేనుడు తన రాజధాని నగరం గౌర్ లో ఒక శిలా శాసనాన్ని చెక్కించాడు.

కొన్ని సంవత్సరాల పాటు ఆస్థానకవిగా జీవితాన్ని గడిపిన మీదట మరి ఈ పదవులు, గౌరవాలు చాలుననుకొని, జయదేవుడు స్వగ్రామానికి మరలి వెళ్ళాడు. వంశపారంపర్యంగా వచ్చిన తమ పురాతన కుటీరంలో తిరిగి ప్రవేశించి, పద్మావతి సర్వోపచారాలను చేస్తుండగా నిరాడంబరంగా జీవించి, చివరికి అక్కడనే ఆయన కన్ను మూశాడు.

"గీత గోవిందం" వినా మరొక కావ్యాన్ని జయదేవుడు వ్రాయలేదు. పన్నెండు సర్గాలున్నా, అది ఏమంత పెద్ద కావ్యం కాదు. అయినా, దాని పదలాలిత్యం, దాని మధుర శైలి, దాని ప్రేమ సందేశం, దాని భక్తి పారవశ్యం దాన్ని ఒక మహాకావ్యాన్ని చేశాయి. భక్తులు కాని వారిని సైతం అలరించగల సాహిత్యపు విలువలు ఆ కావ్యంలో ఉన్నాయి. అయితే, కొందరి దృష్టిలో అది కావ్యం కాదని ఇక్కడ చెప్పాలి. వేర్వేరు పండితులు దాన్ని వేర్వేరు విధాలుగా వర్ణించడం కద్దు. పాశ్చాత్య పండితులనే తీసుకుంటే, సి.లాసెన్ దాన్ని శృంగార రస ప్రధానమైన రూపకంగా భావించాడు; సర్ విలియం జోన్స్ దాన్ని జానపద గాథగా అభివర్ణించాడు; సెల్వన్ లివీ దాన్ని ఓపెరాగా పేర్కొన్నాడు; పిష్చెల్ గేయ నాటకంగా దాన్ని పరిగణించాడు; షాన్ జోడర్ దాన్ని వీధి భాగవతం కింద (దీన్ని బెంగాలీలు "యాత్రా" అంటారు) లెక్కకట్టాడు. ఇంతమందిలో ఒక్క ఎ.బి.కీత్ దానికి కావ్య లక్షణాలు లేకపోలేదన్నాడు.

ఎవరేమన్నా, "గీతగోవిందం" ఒక మహాకావ్యం; అంతరంగంలో ప్రత్యేకతను వలె బాహ్యరూపంలో సైతం ప్రత్యేకతనే అది సంతరించుకోగలిగింది. కీత్ చెప్పినట్టు, దానికున్న పరిపూర్ణత సంస్కృత కావ్యాలలో మరి దేనికీ లేదు. శృంగార నాయికా నాయకులు హావభావ విలాసాలను అది ప్రజ్ఞా పూర్వకంగా చిత్రిస్తున్నది. ప్రేమ విరహాలలోని వివిధావస్థలను, వాటిలోని స్వల్పాతి స్వల్ప ఛాయా భేదాలను అది ప్రతిభా సమన్వితంగా వివరిస్తున్నది. భాషకు, భావానికి మధ్య

అద్వైత స్థితి అది సాధిస్తున్నది. సాహిత్య, సంగీత శిఖరాలపై ఒక సమయంలో అది తన విజయపతాకను ప్రతిష్టాపిస్తున్నది.

జయదేవుని తర్వాత కేరళలో బిల్వ మంగళుడు; వంగ రాష్ట్రంలోనే విద్యాపతి, చండీదాసులు; ఉత్తర హిందూస్థానంలో కృష్ణదాసు, సూరదాసు, పరమానంద దాసు, కుంభకదాసు, కేశవదాసు, గోవిందదాసు, బీహారిలాల్, కాళిదాసు; ఆంధ్ర ప్రాంతంలో క్షేత్రయ్య - ఇట్టి "మధురభక్తి" కవు లెందరో తలయెత్తారు. వీరిలో కొందరు తమ కవిత ద్వారా చిత్రకళకు, మరికొందరు నాట్యకళకు దోహదాన్ని కూర్చారు. ఉదాహరణకు, క్షేత్రయ్య పదాలు కూచిపూడి నాట్య వికాసానికి ఎంతగా తోడ్పడలేదు? సూరదాసు గీతాలు "రాగ-రాగిణి" చిత్రాల ఆవిర్భావానికి ఎంతగా ప్రేరణ కాలేదు?

ఐతే, "మధుర భక్తి" కవితకు వరవడి దిద్దడంలో వలె, చిత్ర నృత్య కళలకు ఆలంబనం కావడంలో సైతం అగ్రస్థానం జయదేవుని "గీత గోవిందం" కావ్యానిదే! మొగల్, రాజపుత్ర, బసోహ్లి, గులేర్ కళారీతుల ప్రభావాలు అంతర్వాహినులు కాగా, భారతీయ చిత్ర కళారంగంలో అత్యద్భుత విజయాన్ని సాధించిన కాంగ్రా కళా రీతికి ప్రాణం పోసినట్టిది కూడా జయదేవుని కావ్యమే.

త్రిగర్త ఒక ప్రాచీన రాజ్యం. మహాభారత కాలంలో దాన్ని సుశర్మ పరిపాలిస్తూ ఉండేవాడు. ఈయన కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవ పక్షం వహించాడు. ప్రాచీన కాలం నాటి త్రిగర్త రాజ్యంలో హిమాలయాలకు సమీపంలో గల ఒక ప్రాంతమే కాంగ్రా. ఈ పేరుతోనే ఒక కోట కూడా ఉన్నది. ఎవరు, ఎప్పుడు దీన్ని నిర్మించారో తెలియదు. "నగర కోట" దీని పాత పేరు. క్రీస్తు శకం 1775లో కాంగ్రా సింహాసనానికి వచ్చిన సంసారా చంద్ రాజ్యం చాల చిన్నది కావచ్చు. మొగల్ సామ్రాజ్యంలో ఒక సుబా (రాష్ట్రంలో పాటిదైనా అది కాకపోవచ్చు. అయినా, మొగల్ పాదుషాలలో అగ్రగణ్యుడైన అక్బర్ తో - డబ్ల్యు. జి. అర్చర్ వివరిస్తున్నట్టు - సంసార్చేందకు అనేక సామ్యాలున్నాయి. ఉభయులు బాల్యంలోనే పట్టాభిషిక్తులైనారు. (అక్బర్ తన పద్నాల్గవ యేట; సంసారాచంద్ తన పదవ యేటనే!) ఉభయులు జనరంజకంగా పరిపాలన సాగించారు. ఉభయులు తమ రాజ్యాల సరిహద్దులను విస్తరింపజేశారు. ఉభయులు సాహిత్య ప్రియులే, కళాపోషకులే, శృంగారపురుషులే. ఉభయులు మతవిశ్వాసాలపట్ల, వాటి విలువలపట్ల శ్రద్ధాసక్తులను చూపినవారే!

ఈ అన్ని విషయాలలో అక్బర్ అంతస్తును సంసారాచంద్ అందుకొని వుండకపోవచ్చు. కాని, చిత్రకారులను చేరదీయడంలో, వారి సృజనాత్మక శక్తులకు ఉద్దీపన కల్పించడంలో మొగల్ చక్రవర్తికి వీసంవాసిగానైనా తీసిపోనివాడే సంసార చంద్.

హంజనామా, అక్బరానామాలతో పాటు రెండు హిందూగ్రంథాలకు -రామాయణం, మహాభారతాలకు- మరింత స్పష్టంగా చెప్పాలంటే, ఆ గ్రంథాలకు పర్వ నా భాషలోకి తాను చేయించిన సంగ్రహాను వాదాలకు - అక్బర్ పాదుషా వర్ణచిత్రాలను వేయించాడు. వీటిని వేస్తూనే ఆయన దర్బార్ కు చెందిన నలుగురు ప్రముఖ చిత్రకారులు — అబ్దుల్ సయ్యద్, మీర్ సయ్యద్ ①లీ, మనోహర్, బసవన్లు - ఒక కొత్త చిత్రకళారీతిని సృష్టించారు.

అక్బర్ వలె సంసార చంద్ కూడా తనకు అభిమాన పాత్రమైన కొన్ని రచనలకు చిత్రపటాలను వేయవలసిందిగా తన ఆస్థానంలోని చిత్రకారులను నియోగించాడు. భాగవతంలో దశమ ఏకాదశ స్కంధాలు, నలదమయంత్యుపాఖ్యానం, జయదేవుని గీత గోవిందం, బీహారీలాల్ గీతాలు-వీటికన్నింటికి చిత్రాలను వేయించడమేకాక, " రాగమాల"ను కూడా ఆయన పూర్తి చేయించాడు. ఆ తర్వాతనే నవచిత్రకళా కేంద్రంగా కాంగ్రా తన పొరుగు రాజ్యమైన గులేరు మించిపోయింది. ఆ తర్వాతనే "గులేకనీతి" అనేది మరుగునపడిపోయి, "కాంగ్రారీతి" ప్రథమస్థానానికి వచ్చింది. తన పోషణక్రింద చిత్రకళ సాధించిన ఈ అత్యద్భుత పురోగమనమే సంసార్ చంద్ కు అమరకీర్తిని కూర్చింది. ఇది లేకపోతే, వివిధకాలాలలో, విభిన్న ప్రాంతాలలో ఏదో ఒక చిన్నరాజ్యాన్ని పాలించిన వేలాది ప్రభువుల పేర్లతోపాటు ఆయనదికూడా ఏ ప్రాంతీయ చరిత్రలోనే ఒక రాజవంశవృక్షంలోనో మాత్రమే మిగిలివుండేది.

ప్రజాప్రాభవాలలో అక్బర్ చిత్రకారులను మించిపోయినవారే సంసార్ చంద్ చిత్రకారులు. అయినా, సంసారా చంద్ ప్రాపకంతో కాంగ్రాకళారీతిని సుప్రతిష్టం చేసిన మహాచిత్రకారులందరి పేర్లు మనకు సరిగా, స్పష్టంగా తెలియవు. కొందరి పేర్లు తెలిసినా వారిలో ఎవరు ఏ చిత్రాన్ని చిత్రించారో తెలియదు. వారివిషయమై ఇతర అస్పష్టతలు కూడా వున్నాయి. ఉదాహరణకు, గీతగోవిందం కావ్యానికి చిత్రాలను కూర్చిన "మాణకూ" నే తీసుకోండి. ఇది ఆడపేరా? లేక మగపేరా? ఈ విషయమై పండితుల మధ్య ఈ నాటికి కూడా తర్జనభర్జనలు పూర్తికాలేదని చెప్పవచ్చు.

సంసారా చంద్ ఆస్థాన చిత్రకారులు అయిదు చిత్రమాలలను పూర్తిచేయగా ఒకేదానిపై - గీతగోవిందం చిత్రమాలలో తొలిదానిపై ఆ చిత్రమాల కర్తృత్వం ప్రసక్తిని తెచ్చే ఒక శ్లోకం వున్నది. సంస్కృతంలో మహాపండితులైనవారే దీనికి టీకా తాత్పర్యాల విషయంలో ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. దీనిలో ముఖ్యంగా రెండుపదాలు- "మాలిని", "మాణకూ" అనేవి- వివాదాస్పదమైనవిగా పరిణమించాయి. శ్లోకం మాలినీ వృత్తంలో వున్నందున, "మాలిని"పదం ఆ ఛందస్సుకు వర్తిస్తుందా? లేక, అది ఒక ప్రదేశనామమా? "మాలిని" అంటే చంపాపురం అని నిఘంటువులు పేర్కొంటున్నాయి. దీన్ని బట్టి ఈ శ్లోకంలో అదిషు వాల్ లో గల ఒక ప్రదేశం పేరు కాదుగదా? మాలినికున్న అన్యార్థాలలో పూలవర్తకురాలు, పూలవర్తకుని భార్య, మాలాకారుని భార్య, దుర్గ, మందాకిని మొదలగు వాటిలోఒకదాన్ని ఇక్కడ చెప్పుకోవలెనా? దీర్ఘంగా కొనసాగిన వాదప్రతివాదాల తర్వాత "మాలిని" అంటే సంసారాచంద్ వంశానికి చెందిన ఒక రాజకాంతగా, "మాణకూ"ను ఆదరించిన కళాపోషకురాలుగా మొత్తంపై తేల్చారు.

ఈపాటి ఏకాభిప్రాయమైనా "మాణకూ" విషయమై పండితుల మధ్య కుదిరినట్టు చెప్పలేము, పి.వి. కాణేను పోలిన మహాపండితుడు "మాణకూ" స్త్రీయే తప్ప, పురుషుడు కావడానికి వీలులేదన్నాడు. ఇదే కార్ల్ ఖండర్ వాలా మతం కూడా. సుప్రసిద్ధ చిత్రకళా విమర్శకుడు ఎన్.సి. మెహతా "మాణకూ" చేత స్త్రీ పురుషావతారాలను

రెండింటిని యెత్తించాడు. డాక్టర్ ఎం.ఎస్. రంధావా వాదం "మాణకూ" పురుషుడే కాని స్త్రీ కాదని, ఈ చర్చలో తిరిగి ప్రవేశించిన డబ్ల్యు. జి. ఆర్చర్ - ఒకప్పుడు తాను సైతం "మాణకూ"ను స్త్రీ జాతిలో చేర్చినా - అప్పుడు రంధావా వాదాన్ని గట్టిగా సమర్థిస్తున్నాడు.

"కాంగ్రా పెయింటింగ్స్ ఆఫ్ ది గీత గోవింద" అనే పేరుతో రంధావా సంపాదకత్వాన కొత్తగా వెలువడిన ప్రథమ శ్రేణి చిత్ర సంకలనానికి ఆర్చర్ వ్రాసిన పీఠికలో ఈ సమర్ధన ఉన్నది. జయదేవుని గురించి, ఆయన కావ్యాన్ని గురించి, ఆ కావ్యం కూర్చిన ప్రేరణతో రూపొందిన చిత్రమాలను గురించి రంధావా వ్రాసిన రెండు ప్రకరణాలు వాద పటిమలో, రచనా కౌశల్యంలో ఆర్చర్ పీఠికతో పోటీపడుతున్నాయి.

"మాణకూ" అసలు రూపం "మాణక్". అది పురుష నామం. స్త్రీ నామమైనప్పుడు "మాణకి" దాని రూపం. ముద్దు పేర్లుగా ఇవి "మాణకూ", "మాణకో" రూపాలను ధరిస్తాయి. ఈ మార్పులు ప్రస్తుతం కూడా పంజాలో జరుగుతున్నాయని రంధావా, ఆర్చర్ వాదం. ఇది సమంజసమైనదిగానే తోస్తున్నది. ఐతే ఇది ఎంతవరకు సర్వామోద కరం కాగలదో ఇంతలోనే చెప్పలేము.

కాంగ్రాకు చెందిన గీతగోవిందం చిత్రమాలపై గల శ్లోకమే అంతకు ముప్పై సంవత్సరాలకు ముందు బసోఫీలో చిత్రించబడిన గీతగోవిందం మాలపై కూడా ఉన్నది. దీన్ని బట్టి ఈ రెండు మాలలను ఒకే మానక్ చిత్రించాడని అనుకోవాలా? ఐతే, వాటి కళారీతిలో ఎన్నదగు విభేదాలు ఎందుకు కానవస్తున్నాయి? ఇందుకు ఆర్చర్ సమాధానం ఆ మాలకు, ఈ మాలకు మధ్యగల మూడు దశాబ్దాలలో మానక్ పాతరీతిని విడిచి, కొత్త దాన్ని చేపట్టి ఉండవచ్చునని. కొత్త పరిశోధనల ద్వారా తెలిసిన కొన్ని వివరాల ప్రకారం బసోహ్లి రీతి నుంచి గులేర్ రీతి ప్రభూతికి ఒక కాశ్మీర్ బ్రాహ్మణ కుటుంబం మూలకారణం. ఈ కుటుంబం పెద్ద పండిట్ సెయు. ఈయనకు మాణక్ జ్యేష్ఠ పుత్రుడు కాగా, నైన్ సుఖ్ రెండవ కుమారుడు. ఈ పండిట్ సెయు క్రీస్తు శకం 1720, 30 సంవత్సరాల ప్రాంతంలో గులేర్ లో స్థిరపడి, రాజా దిలీప్ సింగకు ప్రధాన చిత్రకారుడుగా పనిచేశాడు.

నోళంబ శిల్పాలు

తమ తండ్రి వలె కుమారు లిద్దరు కూడా కొంతకాలం గులేర్ ఆస్థానం పోషణలోనే వున్నారు. తర్వాత మానక్ బసోహ్లికి వెళ్ళాడు. అక్కడ బసోహ్లి రీతిలో గీత గోవిందం చిత్రమాలను పూర్తి చేసిన పిమ్మట గులేరకు తిరిగివచ్చాడు. పిమ్మట అతడు కాంగ్రా సంస్థానం ప్రాపకాన్ని సంపాదించి, తన గీతగోవిందం చిత్రమాలలలో రెండవదాన్ని కాంగ్రా రీతిలో చిత్రించాడని అనుకోవచ్చు.

మాణిక్ ఏయే సంస్థానాలలో ఎప్పుడెప్పుడు పనిచేశాడో నిర్ధారణగా తెలియదుగాని, అతని తమ్ముడు నైన సుఖ్ జమ్మూ సంస్థానం పోషణలో పది, పదిహేను సంవత్సరాలపాటు ఉన్నట్టు గట్టి సాక్ష్యాధారాలు లభించాయి. అయినప్పుడు మాణక్ మాత్రం ఇల్లు కదలలేదని గులేలో తండ్రిని అంటి పెట్టుకుని ఉన్నాడని అనుకోనక్కరలేదు గదా? పైగా, అతని కుమారుడు కుశల్ కూడా ప్రసిద్ధ చిత్రకారుడే. వారిద్దరు తమ చిత్రకళా నైపుణ్య ప్రదర్శనతో వివిధాస్థానాల మెప్పును పొందడానికి ప్రయత్నించే ఉండాలి.

జయదేవుడు కవితతో వర్ణచిత్రాలను సృష్టించగా మాణక్ వర్ణాలతో కవితను చెప్పాడు. కుంచెను పట్టలేకపోయినా, జయదేవు డొక మహాచిత్రకారుడు; పదాల కూర్పు తెలియని వాడైనా మాణక్ ఒక మహాకవి. ప్రాణులు భిన్నమైనా ప్రాణమొకటే; కళలు భిన్నమైనా కళాత్మ సయిత మొకటే. ఈ సత్యాన్నే మరొకసారి మాణక్, జయదేవులు లోకానికి చాటిచెప్పారు.

రాధాకృష్ణులను మాణక్, జయదేవులు నాయికా నాయకులుగా ఎన్నుకొనడం ఒక యాదృచ్ఛిక సంఘటన. వారు యూరప్ కు చెందినవారైతే రాధాకృష్ణులు కాక ఏ రోమియో, జూలియట్ లో వారికి నాయికా నాయకులై ఉండేవారు; మధ్య ప్రాచ్యానికి చెందినవారైతే లైలా మజ్నూలు నాయికా నాయకులై ఉండేవారు; అన్యు లెవరినో కాక, రాధాకృష్ణులనే వారెన్నుకొనడం భారతీయ సంస్కృతిలో వా రిద్దరు సంయోగంలో సృష్టి పరిపూర్ణతకు, వియోగంలో సృష్టి విలయానికి సంకేతాలైనందునే! కృష్ణుడు ఆర్యావర్తానికి, మహాభారత కాలానికి చెందిన ఒక పురుషుడు కాడు; ఇదే విధంగా రాధ కూడా ఏదో ఒక దేశానికి, ఒక కాలానికి చెందిన స్త్రీ కాదు. పరస్పర పరిపూర్ణతకై ఎక్కడ ఎప్పుడు రెండు నారీనర హృదయాలు తపన చెందినా, అక్కడే, అప్పుడే రాధాకృష్ణులు అవతరిస్తారు. వారితో పాటు కవిత అవతరిస్తుంది. కళలు అవతరిస్తాయి, సౌందర్య లావణ్యాలు అవతరిస్తాయి; సత్యం, శివం అవతరిస్తాయి. జయదేవుడు తన మహాకావ్యం ద్వారా, మాణక్ తన చిత్రమాల ద్వారా లోకానికిస్తున్న మహత్తర సందేశమిదే. (ఆంధ్రజ్యోతి 21-8-1966)

నోళంబ శిల్పాలు (గ్రంథ సమీక్ష)

నోళంబ రాజులెవరు? కొద్ది రోజుల క్రితం హిస్టరీ ప్రొఫెసర్ ఎవరైనా నాకు ఈ ప్రశ్న వేసివుంటే నేనైనా నోరు వెళ్లబెట్టి వుండేవాడినే! అయినప్పుడు మీ నుంచి ప్రత్యుత్తరాన్ని కోరి ఈ ప్రశ్న నేను వేస్తున్నట్టు మీరు భావించనక్కరలేదు.

ఒకప్పుడు మనకు నాడు కొక రేడు చొప్పున, వీడు కొక విభుడు చొప్పున, ప్రాంతాని కొక ప్రభువు చొప్పున వుండేవారు. ఎవ డొక దండును కూడగట్టుకో గలిగితే వా డొక దండనాధుడు; ఎవ డొక మండలాన్ని పట్టుకో గలిగితే వాడొక మండలేశ్వరుడు; రెండు మండలాలను చేజిక్కించుకుంటే ఒక రాజు, మూడు, నాల్గింటిని హస్తగతం చేసుకోగలిగితే ఒక మహారాజు.

అయితే ఇది మన దేశానికే ఒక ప్రత్యేకత కాదు. నిజానికి మనదొక దేశం కాదు, ఒక ఖండం. ఇటలీ, జర్మనీలను పోలిన చిన్నిచిన్ని దేశాలలోనే క్రితం శతాబ్దిమధ్య వరకు కూడా "చోటా, బడా" రాజులెందరో తామరతంపరగా వుండేవారు. రైలు, టెలిగ్రాఫ్, టెలిఫోన్, మోటారుకారు, వైర్లెస్, విమానం మొదలైనవి లేని రోజులలో ఒక మహాశక్తిమంతుడెవడైనా దేశాన్ని ఏకఛత్రాధిపత్యం కిందికి తెచ్చినా, సమర్థంగా దాన్ని అమలుపరచడానికి వలసిన సాధన సంపత్తి స్వల్పమైనందున, కేంద్రాధికారం అనతికాలంలోనే సన్నగిలిపోయేది; అంతకు పూర్వమైనా కేవలం నామమాత్రంగానే సామంతులైనవారు తమ సర్వస్వాతంత్ర్యాన్ని తిరిగి ప్రకటించుకునేవారు; తిరిగి యధాపూర్వ పరిస్థితి నెలకొనేది. మనది సువిశాల దేశమైనందున ఈ ప్రాంతీయ రాజ్యాలు మనకు పదుల సంఖ్యలో కాక వందల సంఖ్యలో వుండేవి.

ఈ వందలాది ప్రాంతీయ రాజ్యాలలో నోళంబ రాజ్యమొకటి. దీన్ని "నోళంబవాడి" అనేవారు. క్రీస్తుశకం తొమ్మిది, పది శతాబ్దాలలో మడకసిర తాలూకాలోని అనంతపురం జిల్లా హేమావతి దీనికి రాజధాని కాని, పదకొండవ శతాబ్దంలో బళ్ళారి జిల్లాలోని కంపిలి దీనికి ప్రధాన కేంద్రమైంది. హేమావతిలో వుండగానే (దీన్ని "హెంజేరు", "పెంజేరు" అని కూడా పిలవడం కద) నోళంబ రాజులు ఒక వెలుగు వెలిగారు. ఉచ్ఛ స్థితిలో వుండగా వీరి పాలనలో 32,000 గ్రామాలుండేవి. చాళుక్య, గంగ, పల్లవ, చోళ రాజ్యాలు వీరికి ఇరుగు పొరుగు రాజ్యాలు.

త్రినయన (ముక్కంటి) పల్లవుడు తమ మూలపురుషుడని నోళంబ రాజులు చెప్పుకునేవారు. స్థానికంగా ప్రభువులైనా, సర్వస్వతంత్ర ప్రభువులుగా వీరు చెల్లింది బహు స్వల్ప కాలం మాత్రమే! ఎప్పుడెవరు బలవంతులుగా వుంటే, అప్పుడు వారికి సామంతులుగా వీరు మారిపోతూ వుండేవారు. ఆదిలో గంగ, రాష్ట్రకూట, తూర్పు చాళుక్య మహారాజులకు సమయానుకూలంగా వీరు సామంతులు. సమయానుకూలంగానే వీరు తక్కిన రాజులతో వియ్యమందేవారు, కయ్యానికి దిగేవారు. ఒక గంగ రాజపుత్రిక గర్భాన జన్మించిన నోళంబరాజు, మహేంద్రవర్మ, గంగరాజ్యంలో కొంత భాగాన్ని వశపరచుకున్నారు. ఇతడే మహాబలి కులం వారితో (బాణ వంశం వారితో) తరచు యుద్ధాలుచేసి, పెక్కుసార్లు వారిని పరాభూతులను చేసి, వారి రాజ్యాన్ని స్వాహాచేశాడు. మహాబలి కులంపై ఈ విజయాన్ని పురస్కరించుకొని నోళంబ రాజాస్థాన వందిమాగధులు మహేంద్రవర్మను "మహాబలి కుల విధ్వంసనాయా!" "త్రిభువన ధీరా!" అంటూ స్తోత్రం చేస్తూ వుండేవారు. నోళంబ రాజ్యం ఇతడి పరిపాలన కాలంలో ఒక చెంప సేలం జిల్లాలోని ధర్మపురి వద్ద నుంచి, మరొక చెంప అర్కాట్ జిల్లా ఉత్తరార్ధం వరకు విస్తరించినట్టు చెబుతారు. ఇతడి పరిపాలనా కాలంలోనే నోళంబ రాజ్యం సర్వస్వతంత్ర ప్రతిపత్తిని తాత్కాలికంగా పొందగలిగిందని కూడా చెబుతారు.

ఈ మహేంద్రవర్మ తర్వాత నోళంబ రాజులలో వాసి కెక్కినవాడు వీరమహేంద్రుడు. ఇతడిని రెండవ మహేంద్రుడని కూడా పిలిచేవారు. రాష్ట్రకూట మహారాజు మూడవ కృష్ణుని సామంతుడుగా ఇతడు కంచిపై దండెత్తి, దాన్ని పట్టుకున్నట్టు ప్రతీతి. ఈ రాష్ట్రకూట ప్రభువు కంచి, తంజావూరులను జయించి రామేశ్వరంవద్ద తన విజయస్తంభాన్ని యెత్తించాడు కాబట్టి, ఇతడి దిగ్విజయ యాత్ర సందర్భంలో వీరమహేంద్రుడు కంచిని పట్టుకున్నాడనడం నిజమే కావచ్చు.

మహేంద్ర, వీరమహేంద్రులనుగురించి మాత్రమే నేను చెప్పినందున నోళంబరాజు లందరు వీరిద్దరి వలె బాహు విక్రములని, విజయపరంపరలను సాధించినట్టి వారని అనుకోరాదు. "మహాబలి కుల విధ్వాంసనాయా!" అని కీర్తించబడిన మొదటి మహేంద్రుడే చివరికి గంగరాజు మనుమడైన ఎరియప్పతో జరిగిన పోరులో నేలకొరిగాడు. ఇందువల్ల "మహేంద్రాంతకుడు" అనేది ఎరియప్పకు బిరుదనామమైంది. మరొక నోళంబ రాజు అయ్యప్ప తూర్పు చాళుక్య రాజ్యాధిపతి రెండవ చాళుక్య భీమునిచే యుద్ధంలో సంహరించబడినాడు. చోళ రాజులు హేమావతినే ఒకసారి జయించి, తమ విజయాన్ని లోకానికి చాటడానికి అక్కడి దొడ్డేశ్వరాలయంలో ఒక శాసనాన్ని చెక్కించారు. అది ఈనాటికీ చెక్కు చెదరకుండా వున్నది. ఒకసారి చెక్కిన శిలా శాసనాన్ని చెరిపివేయిస్తే పాపం చుట్టుకోగలదని పూర్వకాలంలో విశ్వసించేవారేమో! ఈ విశ్వాసమే నోళంబరాజుల పరాజయాన్ని చాటే శిలాశాసనం వారి రాజధానిలోనే చెక్కు చెదరకుండా మిగలడానికి మూలమేమో! నోళంబరాజులే కాదు, ఇతరులు సయితం శిలాశాసనాల జోలికి పోయేవారు కాదు. బాదామికి చెందిన చాళుక్య రాజులు తమ

రాజధానిలోనే ఒక పర్వతపార్శ్వంపై తమను యుద్ధంలో ఓడించిన పల్లవరాజు నరసింహవర్మ విజయ శాసనాన్ని తుడిపించివేయలేదు. ఇదే విధంగా కంచికి చెందిన పల్లవులు తమను పరాభూతులను చేసిన పశ్చిమ చాళుక్యరాజు విక్రముడి తొలి శాసనాన్ని తమ కైలాసనాధాలయ కుడ్యం పైనుంచి తుడిపించి వేయలేదు. చారిత్రకాధారాలు అసలే తక్కువైన మనకు శాసనాల పవిత్రతనుగురించిన ఈ విశ్వాసం కొంతవరకు మేలు చేసిందనే చెప్పాలి.

ఏమైనా, నోళంబ రాజుల వంశానుక్రమం కొంతవరకైనా మనకు తెలియడం, వారి విజయాలకు, పరాజయాలకు, వారి దానధర్మాలకు సంబంధించిన శాసనాల కారణంగానే! తమ చరిత్ర చివరిదశలో ఆ వంశం రాజులు పశ్చిమ చాళుక్య, చోళ, హొయసల మహారాజులలో ఎవరికో ఒకరికి సామంతులుగా తమ అస్తిత్వాన్ని కాపాడుకొన్నారు. అయినా, కాలక్రమాన క్షీణదశకు వచ్చి, పన్నెండవ శతాబ్ది తర్వాత వారు కనుమరుగైపోయారు.

రాజులు గతించినా, వారి రాజ్యాలు విలుప్తమైనా, వారి రాజధానులు శిధిలమైపోయినా, వారి పోషణకింద ఏ శాస్త్రమో, ఏ సాహిత్యమో, ఏ సంగీతమో, ఏ శిల్పమో వర్ధిల్లివుంటే, అది మాత్రం శాశ్వతంగా నిలుస్తుంది. ఈ నోళంబరాజవంశం ఇప్పుడు లేదు; వారి రాజ్యాధికారం లేదు; వారి రాజధాని హేమావతి మిగిలివున్నా, కేవలమొక కుగ్రామంగా మాత్రమే! అయినా, అక్కడ నోళంబ శిల్ప సంపద నిలిచే వున్నది.

1937లో మద్రాసు మ్యూజియం తరపున ఆ గ్రామానికి వెళ్లిన శ్రీ సి. శివరామమూర్తి హిందూపురం నుంచి మడకసిర వెళ్లే బస్సులో ప్రయాణంచేసి, దారిలో ఒకచోట దిగిపోయి, అక్కడి నుంచి ఆరు మైళ్లు కాలి నడకనో, రెండెడ్ల బండి పైనో వెళ్లాడట. హేమావతిని చేరడానికి ఇంతకుమించిన ప్రయాణ సౌకర్యాలు ఈనాడైనా లేవేమో! లోకం హేమావతిని మరచిపోయినా శ్రీ శివరామమూర్తి దాన్ని వెదకులాడుతూ, ఎంతో శ్రమకోర్చి, హేమావతికి వెళ్లడం హేమంతోనైనా విలువ కట్టడానికి వీలులేని శిల్ప సంపద అక్కడ నిలిచి వున్నందునే!

నోళంబ రాజులు ప్రథమంగా శైవమతస్థులు. వీరి శైవ మతాచార్యులలో ప్రధానంగా ఎన్నదగువాడు త్రిభువన దేవుడు. ఈయన నలభై సంవత్సరాల పాటు నోళంబ రాజ్యంలో ఒక శైవ పీఠానికి అధిపతిగా వున్నాడట. ఈయన కాలంలో నలభై శివాలయాలు కట్టించడం జరిగిందట. రాజధాని హేమావతిలోనే కాక మొత్తం నోళంబరాజ్యంలోనే వందలాది దేవాలయాలను నిర్మించారు. ఆ నిర్మించడం కూడా అపార శిల్పవైభవంతో! ఈ శిల్ప వైభవానికి ముగ్ధుడైనందునే నోళంబ రాజులను జయించిన చోళరాజు రాజేంద్రుడు నోళంబ దేవాలయాలకు, మండపాలకు చెందిన ఎన్నో స్తంభాలను, గవాక్షాలను స్వరాష్ట్రానికి పట్టించుకువెళ్లాడు. తంజావూరులోని బృహదీశ్వరాలయంలోను, తంజావూరుకు ఏడుమైళ్లలోగల తిరువైయూర్ లోని మరొక దేవాలయంలోను ఈ గవాక్షాలను స్తంభాలను, ఈనాటికి కూడా మనం చూడవచ్చు. ఎక్కడ, ఎవరిపై ఏ విజయాన్ని సాధించినా, తన విజయచిహ్నాలుగా (ఇటీవలి కాలంలో నెపోలియన్ వలె) రాజేంద్రచోళుడు శిల్పకళా ఖండాలను పట్టించుకుపోతూ వుండేవాడు. కళింగరాజ్యం నుంచి అతడు తెచ్చిన గణేష్ విగ్రహం కుంభకోణంలోని నాగేశ్వరస్వామి కోవెలలో వున్నది; తూర్పు చాళుక్య రాజ్యంనుంచి తెచ్చిన నంది విగ్రహం గంగైకొండ చోళపురంలో వున్నది; పాల (వంగ) రాజ్యం నుంచి తెచ్చిన నటేశ్వర విగ్రహం చిదంబరం సమీపంలోగల మేల కదంబూర్లోని శివాలయంలో వున్నది.

శ్రీ శివరామమూర్తి హేమావతికి జరిపింది కూడా ఒక జైత్రయాత్రే! సైనికబలం లేకపోయినా, ఆయనకు ప్రభుత్వాదేశ బలం వున్నది. అందువల్లనే ప్రతికూల పరిస్థితులలో కూడా హేమావతినుంచి కొన్ని ముఖ్య శిల్పాలను మద్రాసు మ్యూజియం కోసం ఆయన సేకరించగలిగాడు. 1937లో ఆయన వెళ్లినప్పుడు అక్కడ కుండపోతగా వర్షం, దాపులో వున్న పంట చెరువు ఏ క్షణంలోనైనా కట్టలను తెంచుకోగల ప్రమాదం. అయినా రెవెన్యూశాఖాధికారుల సహాయంతో, స్థానిక ప్రజల సహకారంతో పెక్కు శిల్పాలను ఆయన మద్రాసుకు తరలించుకు పోగలిగాడు.

మన అనంతపురం జిల్లాకు చెందిన ఈ శిల్ప సంపద మద్రాసుకు దక్కినందుకు విచారించనక్కరలేదేమో! దిక్కూ మొక్కూ లేకుండా ఆ శిల్ప కళాఖండాలను అక్కడనే ఈనాటి వరకు పడివుండనిస్తే వాటిలో ఎన్ని మరింతగా శిథిలావస్థకు వచ్చి వుండేవో!

శ్రీ శివరామమూర్తి దాదాపు మూడు దశాబ్దాల క్రితం హేమావతి వెళ్లినప్పుడు అక్కడి దేవాలయాలలోని విగ్రహాలకు పూజాపురస్కారాలు యథావిధిగా జరుగుతున్నా, దేవాలయాలు మాత్రం శిథిలావస్థలో వున్నవట. గ్రామంలో ఎక్కడ చూచినా, ఏదో ఒక మట్టిదిబ్బలోనుంచి అరమోడ్పు కన్నులతో ఒక సురసుందరి కనిపించిందట; లేదా అరవిచ్చిన మొగ్గలతో ఒక మనోహరలత కనిపించిందట. మట్టి పై పొరలను తొలగిస్తే, అందాలను చిందుతూ ఇక్కడొక స్తంభం, అక్కడొక ద్వారం, వేరొకచోట ఒక గవాక్షం, మరొకచోట ఒక దిక్పాలక ఫలకం! ఈ విధంగా ఒకనాటి ఆ రాజధాని నగరంలో; ఈనాటి ఆ కుగ్రామంలో ఎటు తిరిగినా శిల్పాల రాసులే. ఎటు చూచినా అందాల కుప్పలే!!

ముక్కులు పోయినా, చెవులూడినా, కాలుచేతులు విరిగినా, ఇతర శరీరాంగాలు దెబ్బతిన్నా, నోళంబశిల్పాలు అమూల్యమైనవే! వాటి ప్రతి వంపులో, ప్రతి విరుపులో, ప్రతి మిట్టలో, ప్రతి పల్లంలో సిద్ధహస్తులైన మహాశిల్పుల కళావైదగ్యం ప్రస్ఫుట మౌతూవుంటుంది. నోళంది రాజ్యం చిన్నదైనందునే, వివిధసమయాలలో విభిన్న మహారాజ్యాలకు అది సామంతరాజ్యంగా వున్నందునే పెక్కు శిల్పకళారీతులలో సిద్ధహస్తులు కావడానికి నోళంబ శిల్పులకు మహదవకాశం లభించింది. ఆ రీతులలో దేనినో ఒకదాన్ని అంధప్రాయంగా అనుకరించక, వాటిని సమన్వయం చేసి, ఒక ప్రత్యేక రీతిని, ఒక మౌలిక శైలిని రూపొందించుకొనడానికి వారు ప్రయత్నం చేశారు; దానిలో చాలా వరకు కృతకృత్యులైనారు కూడా. వారిది ప్రధానంగా పల్లవశైలి కావచ్చు, అయితే, దానిలో చాళుక్య, రాష్ట్ర కూట రీతులు ప్రతిభా పూర్వకంగా మేళవించాయి. అమరావతి రీతి సయితం ఒక అంతర్వాహినిగా దాన్ని ప్రభావితం చేసింది.

వాటి ప్రత్యేకతల కారణంగా, వైభవాల కారణంగా నోళంబ శిల్పాలు ఇది వరలోనే ప్రపంచ దృష్టిని విశేషంగా ఆకర్షించవలసింది. అయితే, వాటిలో కొన్నింటిని మద్రాసుకు దాదాపు మూడు దశాబ్దాలనాడే చేర్చిన శ్రీ శివరామమూర్తి ఇప్పటికిగాని తమ నివేదికను ప్రచురించలేదు. ఇతర కార్యకలాపాలను ఈ విలంబనకు కారణంగా ఆయన పేర్కొన్నారుగాని, ప్రథమ దృష్టిలోనే తనను సమ్మోహితులను చేసిన నోళంబ శిల్పాల పై ఇంత కాలంపాటు ఆయన శీతకన్ను వేయడం శోచనీయం! అయితే ఎన్నేళ్లు గడచినా, అవి తన కండ్ల ముందు మెదలుతున్నందువల్లనే కావచ్చు, ఢిల్లీలోని నేషనల్ మ్యూజియం అసిస్టెంట్ డైరెక్టర్ గా ప్రస్తుతం తాను గురుతర బాధ్యతలను వహించవలసి వస్తున్నా, ఇప్పటికైనా ఒక నివేదికను ఆయన ప్రచురించాడు.

శ్రీ శివరామమూర్తి బహుభాషా కోవిదుడు. శిల్ప, చిత్ర, వాస్తుకళా రహస్యాలను ఆకళింపు చేసుకున్నట్టి పండితుడు. విశేషించి దక్షిణ భారత శిల్పరీతుల వివరణలో నిష్ణాత; లిపి పరిణామశాస్త్రంలో నిధి కాబట్టి, ప్రాచీన శాసనాలను చదవడంలో దిట్ట. కలంతో పాటు ఆయన కుంచె పట్టగలడు. భారతీయ శిల్పకళలను గురించి అనేక గ్రంథాలను ఆయన ప్రచురించివున్నాడు. శ్రీ శివరామమూర్తి ఇంతటి పండితుడైనందున, ప్రతిభావంతుడైనందున నోళంబ శిల్పాలనుగురించి ఆయన ప్రచురించినట్టిది కేవల మొక మ్యూజియం రిపోర్టు కాదు; అది కొంతవరకే నివేదిక; మిగిలింది నోళంబ రాజచరిత్ర, నోళంబ శిల్పాలచరిత్ర, తక్కిన ప్రాంతాల శిల్పాలతో వాటి తులనాత్మక పరిశీలన.

తన ప్రస్తుత నివేదిక నోళంబ శిల్పాల వైపుకు కళావిమర్శకుల దృష్టిని మరల్చితే, తాను సంతోషిస్తానని శ్రీ శివరామమూర్తి వ్రాస్తున్నాడు. ఈ లక్ష్యాన్ని అది పూర్తిగా సాధించగలగడంలో సందేహంలేదు. ఇంతేకాదు, హేమావతిలోను, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లోగల ఇతర నోళంబ శిల్ప క్షేత్రాలలోను నిర్లక్ష్య స్థితిలో పడివున్న శిల్పాలన్నింటిని భద్రపరచడానికి కావలసిన తక్షణ చర్యలకు ఇది ప్రేరణను కూర్చగలదని కూడా నమ్ముతున్నాము. ఆంధ్రప్రదేశ్ పురాతత్వ శాస్త్ర శాఖవారు ఈ విషయమై ఇదివరలోనే శ్రద్ధవహించి వుండకపోతే, ఇప్పుడైనా తొందర చూపాలి. ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ నోళంబ శిల్పాలపై సమగ్రమైన ఒక ప్రామాణిక గ్రంథాన్ని వెలువరించడానికి ఉద్యమించాలి.

పాశ్చాత్య శిల్పకళలో వలె వర్తులత్వానికి కాక, రేఖావిన్యాసానికే మన శిల్పకళలో ప్రాధాన్యమిస్తారు. మూర్తి రూపంలో శిల్పాల (Sculpture in the Round) కంటె, ఫలక రూపంలో శిల్పాలు (Sculpture in Relief) మనకు అధిక సంఖ్యలో వుండడానికి రేఖా విన్యాసానికి మనమిచ్చే ప్రాధాన్యమే ముఖ్యకారణం కావచ్చు. మన బౌద్ధశిల్పాలలో నూటికి దాదాపు తొంభైవంతులు శిల్పఫలకాలే! హిందూశిల్పాలలో ఫలకాల నిష్పత్తి ఇంత అధికం కాకపోయినా, వాటిలో కూడా రేఖావిన్యాసానికే ప్రథమ స్థానం. బౌద్ధ శిల్పులు శిలాఫలకంపై ముందు ఒక రేఖాచిత్రాన్ని గీసి, ఆ పిదప దానికి అర్ధవర్తులత్వాన్ని, లేదా చతుర్ధవర్తులత్వాన్ని (High Relief or Low Relief) సిద్ధింప జేస్తుండేవారు. బౌద్ధశిల్పకారుల ఈ శిల్పవిధానాన్ని తెలిపే ఒక ఫలకం నాగార్జునకొండ త్రవ్వకాలలో దొరికింది. సరిగా ఈ పద్ధతినే హిందూశిల్పులు సయితం అనుసరించే వారనడానికి నిదర్శనం నోళంబ శిల్పాలలో సగం మాత్రమే పూర్తిచేయబడిన ఒక శిల్పం రూపంలో కనబడింది. ఈ పద్ధతి స్థూలవివరణ "కథా సరిత్సాగరం"లో వున్నది. ఫలకంపై ముందు "రూపకారుడు" రేఖల ద్వారా శిల్పానికి రూపకల్పన చేస్తాడు. దీనికి పారిభాషిక పదం" సూత్రపాతం" ఆ తర్వాత "చిత్రకారుడు" ఆ రేఖారూపానికి తన ఉలితో వర్తులత్వాన్ని సమకూర్చుతాడు. దీనికి పారిభాషికపదం "ఉత్తంకితం" చేయడం. ఈ విధాన ప్రాబల్యం పూర్తి వర్తులత్వం వున్న మన శిల్పాలలో సయితం సాక్షాత్కరిస్తూ వుంటుంది.

అందువల్లనే వాటిలో "ప్రావాహికగుణం" (Fluidity) విశేషంగా వుంటుంది. ఏ కళకైనా ఈ గుణం లాలిత్య చాంచల్యాలను, సారళ్య తారళ్యాలను సమకూర్చుతుంది. నోళంబ శిల్పాలలో మనలను ముగ్ధులను చేసేది ఈ ప్రావాహికగుణమే!!

స్థాణుత్వం మూర్తీభవించివుండే శిలలో ప్రావాహికగుణాన్ని ఎంత మహిమాన్వితంగా నోళంబి శిల్పులు ప్రవేశపెట్టగలిగారో, శరన్మేఘాల గుండా గగనమార్గాన పయనిస్తున్న విద్యాధర దంపతిని చూస్తే తెలుస్తుంది; ఎవరి ప్రాణాలనో తీయడానికి మహిషారూఢుడై కారుమబ్బుల గుండా వెడుతున్న యముని చూస్తే తెలుస్తుంది;

ఆలింగన చంద్రశేఖరుని చూస్తే తెలుస్తుంది; బాలనటేశుని చూస్తే తెలుస్తుంది. నిజానికి, ఈ గుణం తరతమ భేదాలతో ప్రతి శిల్పంలో నుంచి తొంగిచూస్తూనే వుంటుంది.

దేవతా విగ్రహాలను మలచడంలోనే కాక, పశుపక్ష్యాదులకు, తరులతాగుల్మాదులకు రూపకల్పన చేయడంలో సయితం నోళంబ శిల్పులు తమ ప్రతిభను పూర్తిగా నిరూపించుకున్నారు. వంపువంపులో సొంపులొలికే వారి లతలు మన మనస్సులను ఇట్టే చుట్టివేస్తాయి; అడుగు అడుగులో వయ్యారాలను చూపే వారి హంసలు మన హృదయాలను ఇట్టే దొంగిలిస్తాయి.

నాలుగు కాళ్లను ముడుచుకుని నెమ్మదిగా పరుండివున్నా, లేచి రంకె వేస్తే మాత్రం దిక్కులను ప్రతిధ్వనింప జేయగలిగిన దానివలె వుంటుంది. వారి నంది. యుద్ధరంగంలో ముందుకురుకుతున్న సన్నివేశంలో వందలాది సైనికులను చీల్చిచెండాడబోతున్నదాని వలె వుంటుంది వారి మత్తేభం. యుద్ధ దృశ్యానికి సంబంధించిన వారి శిల్ప ఫలకం ఢీకొంటున్న సుదపుటేనుగులతో, లంఘిస్తున్న అశ్వరాజాలతో, వివిధ శస్త్రాస్త్రాలను ప్రయోగిస్తున్న భట సందోహంతో, తమ చతురంగ బలాలకు నాయకత్వం వహిస్తున్న భూపాలురతో, క్షతగాత్రులై నేలకొరిగిన తర్వాత కూడా కొన ఊపిరితో సైతం పోరును కొనసాగించడానికే ప్రయత్నిస్తున్న వీరాధివీరులతో సంకులంగా సాగుతున్న సమరంలోని మహా సంచలనాన్ని కళ్లకు కట్టినట్టుగా చూపుతున్నది. నోళంబ శిల్పాలను గురించి ప్రచురించిన శ్రీ శివరామమూర్తి నివేదికను చదివిన తర్వాత, దానిలోని చిత్రాలను చూచిన తర్వాత, మద్రాసు మ్యూజియంలోకి మరొకసారి వెళ్లాలనే కాక, హేమావతికి ఒకసారి యాత్ర చేయాలనే ప్రబలాకాంక్ష నామట్టుకు నన్ను తొందర పెడుతున్నది. (ఆంధ్రజ్యోతి 6-6-1965)

మొహెంజొదారో

బుద్ధుడు కేవలం ఇండియాకు, సోక్రటీస్ గ్రీసుకు, ఏసు క్రీస్తు ఇజ్రాయెల్ కు, మహమ్మద్ అరేబియాకు, లీయొనార్డో డా విన్సి ఇటలీకి, షేక్ స్పియర్ ఇంగ్లాండుకు, వాల్టేర్ ఫ్రాన్సుకు, గొధే జర్మనీకి, టాల్ స్టాయ్ రష్యాకు చెందరు. తమ మాతృదేశం ఏదైనా, వీరు ప్రపంచ మహాపురుషులు.

ఇదే విధంగా ప్రపంచ చారిత్రక స్థలాలుగా, కళాక్షేత్రాలుగా, యాత్రాకేంద్రాలుగా పరిగణించ దగినవి కొన్ని వున్నాయి. వాటి కోవకు చెందినదే మొహెంజొదారో.

హరప్పతోపాటు మొహెంజొదారో సింధులోయలో అతిప్రాచీనకాలంలో విలసిల్లిన ఒక మహానగరం. విస్మృతిగర్భంలో పడిపోయిన ఆ రెండు మహానగరాలను 1921 తర్వాత సర్ జాన్ మార్షల్, ఆయన సహచరులు తిరిగి వెలుగులోకి తెచ్చారు. వారి కృషి ఫలితంగా భారతదేశచరిత్ర రెండు వేల సంవత్సరాలకు పైగా వెనుకకు జరిగింది.

హరప్ప, మొహెంజొదారోలు బయటపడ్డానికి ముందు భారతదేశ చరిత్రలో అతి ప్రాచీనమైనది వేదఘట్టమే. ఆ ఘట్టంతోనే, భారతదేశానికి ఆర్యుల రాకతోనే, భారతచరిత్ర, ముఖ్యంగా భారత నాగరికత చరిత్ర, ప్రారంభమైనట్టు అంతకుముందు విశ్వసించేవారు. ఇది సరైన విశ్వాసం కాదని, ఆర్యుల రాకకు కనీసం

రెండువేల సంవత్సరాలకు పూర్వమే ఇక్కడ ఒక గొప్ప నాగరికత పరిఢవిల్లిందని, ఈ నాగరికతకు చెందినవారితో పోల్చినప్పుడు ఆర్యులు అనాగరికులని హరప్ప, మొహెంజొదారోలు నిరూపించాయి.

వాటిలో మొహెంజొదారో ఒక చారిత్రక కేంద్రంగా మరెంత కాలమో మిగలదన్న భయం ఇప్పుడు కలుగుతున్నదట. చవుడు పుట్టి, అక్కడి కట్టడాల గోడలు కూలిపోతున్నవట. వెంటనే చర్య గైకొనకపోతే, మొత్తం కేంద్రానికే ముప్పు వాటిల్లవచ్చునట.

ఈ ప్రమాదం నుంచి మొహెంజొదారోను తప్పించడానికి తనకు తగినంత ఆర్థికస్తోమత లేదని భావిస్తున్న పాకిస్తాన్ ప్రభుత్వం యునెస్కో సహాయాన్ని కొంత కాలంగా అభ్యర్థిస్తున్నదట.

పరిస్థితిని పరిశీలించవలసిందిగా ఇదివరలో కొందరు ప్రత్యేక నిపుణులను పంపిన ఆ ప్రపంచసంస్థ త్వరలో మరి కొందరు ప్రవీణులను పంపించనున్నదట.

కనీసం ఈసారి తన ప్రవీణుల నివేదిక తన చేతికి వచ్చిన తర్వాతనైనా, మొహెంజొదారో పరిరక్షణకు యునెస్కో పెద్దయెత్తున ప్రయత్నం చేయాలి. ఆస్వాన్ ఆనకట్ట కారణంగా నీటిలో మునిగిపోవలసిన అబూ సింబెల్ గుహాలయాల రక్షణ యునెస్కో సహాయంతోనే జరిగింది. అందుకు వెచ్చించినదానిలో ఒక వీసమైనా మొహెంజొదారో సముద్ధరణకు బహుశా సరిపోతుంది.

అయితే, చవుడునుంచి మొహెంజొదారోను కాపాడి అంతటితో సరిపుచ్చరాదు. అక్కడ జరగవలసిన త్రవ్వకాలు పూర్తిగా జరగనే లేదు. మొహెంజొదారో నగరం మధ్య ఒక పెద్ద దిబ్బపై ఒక ప్రాచీన బౌద్ధస్తూపం వున్నది. స్తూపాన్ని కదిలించవలసి వస్తుందన్న సంకోచంతో ఆ దిబ్బను త్రవ్వకుండా ఇదివరలో విడిచిపెట్టారు. ఇప్పుడేమో డబ్బులేదని విడిచి పెడుతున్నారు. ఇదే కాక, మొహెంజొదారోలో త్రవ్వి చూడవలసిన ప్రాంతాలు మరి కొన్ని వున్నాయి. పాక్షికంగానే త్రవ్వకాలు జరిగినా, సమకాలిక ప్రపంచంలో మొహెంజొదారో సాటిలేని మహానగరమని స్పష్టపడింది. త్రవ్వకాలు పూర్తిగా జరిగితే, మరెన్ని విశేషాలైనా బయటపడవచ్చు.

మొహెంజొదారో ఈనాడు పాకిస్తాన్ సరిహద్దులలో వున్నా, పాక్ ప్రభుత్వంతో సమానంగా దాని పరిరక్షణ విషయమై మనం తాపత్రయపడాలి. యునెస్కో ద్వారా మొత్తం ప్రపంచం నుంచి ఈ పరిరక్షణ కృషికి సహాయ సహకారాలను సంపాదించడం విషయమై పాకిస్తాన్ పౌరులతో సమానంగా మనం సయితం సర్వవిధాల ప్రయత్నించాలి. (ఆంధ్రజ్యోతి 29-5-1968)

ఏలేశ్వరం వద్ద శిథిల శిల్ప సంపద

అదొక జనపదం. ఆయుధాలుగా, పరికరాలుగా శిలలను తాను వినియోగించు కొనవచ్చునన్న రహస్యాన్ని గుర్తించక ముందునుంచీ కూడా ఆ గడ్డపై మానవుడు మసలినాడేమో కూడా!

పూర్వ శిలాయుగం, నవ శిలాయుగం, లోహయుగం - వీటినన్నింటిని ఏలేశ్వరం చూచింది. శాతావాహన సామ్రాజ్య నిర్మాణాన్ని, దాని విచ్ఛిత్తిని అది చూచింది. ఇక్ష్వాకులు రాజ్యాధికారానికి రావడం, కాలక్రమాన బలహీనపడి, పతనం చెందడం అది చూచింది. పల్లవుల ప్రాభవం పెరగడం వలె తరగడం కూడా అది చూచింది. విష్ణుకుండినుల వైభవాన్ని, దాని విలుప్తిని అది చూచింది. ప్రాక్పశ్చిమ చాళుక్యుల ఉదయాస్తమానాలను అది చూచింది. కాకతీయ, విజయనగర సామ్రాజ్యాల ప్రతిష్ఠాపనలతోపాటు వాటి పతనాన్ని అది చూచింది. బహమని, ఆసఫ్ జాహీ శకాల ప్రారంభాన్ని, అంతాన్ని అదే చూచింది. క్లుప్తంగా చెప్పాలంటే, మానవనాగరికత చరిత్రే ఏలేశ్వర చరిత్ర.

అయితే, మరెంతో కాలంపాటు మానవనాగరికతకు సాక్షిగా ఏలేశ్వరం మిగలదు. నాగార్జున కొండకు ఎదురుగా, కృష్ణ ఎడమగట్టుపైనున్న ఏలేశ్వరం నాగార్జున సాగర్ ఏర్పడగానే దానిలో కలిసిపోతుంది. ఒక జనపదంగా దాని జీవితం త్వరలో ముగిసిపోనున్నందునే దానికడుపులో దాగివున్న చారిత్రక రహస్యాలను వెలికి తీయడానికి ఆంధ్రప్రదేశ్ పురాతత్వ శాఖ, కేంద్రశాఖ సహాయ సహకారాలతో తొందరపాటును చూపింది.

1955-56 లో కీర్తిశేషుడు డాక్టర్ పి. శ్రీనివాసాచారి ఏలేశ్వరంలో త్రవ్వకాలను ప్రారంభించగా, 60-61 లోను, 62-63 లోను, శ్రీ మహమ్మద్ అబ్దుల్ వహీద్ ఖాన్ వాటిని కొనసాగించారు. అయినా, పని పూర్తికానేలేదు, ఇంకా త్రవ్వవలసిన దిబ్బలెన్నో వున్నాయి; తెలుసుకోవలసిన గుట్టుమట్టు లెన్నో వున్నాయి. తరుణం మించిపోకముందే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయడం ఎంతో ముఖ్యావసరం.

ఇప్పటివరకు జరిగిన త్రవ్వకాల ద్వారా తెలిసిన విశేషాలను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ పురాతత్త్వశాఖ డైరెక్టర్ శ్రీ వహీద్ ఖాన్ ఒక నివేదికను ప్రచురించారు. (A Monograph on Yeleswaram Excavations.) ఆసక్తిని రేకెత్తిస్తున్న అనేక చారిత్రకాంశాలతో కూడిన ఈ నివేదిక వెల 20. రూపాయలు. ఈ ధర కొంత హెచ్చుగా కనబడినా, మంచి కాగితం పై, ఎన్నో చిత్రాలతో, చక్కని ముఖపత్రంతో, అందమైన బైండింగ్ తో వెలువడిన ఈ నివేదికను ఇంతకంటే తక్కువ మొత్తానికి అందించడం సాధ్యం కాదని అంగీకరించాలి.

ఒక ఇరవై రూపాయలే కాదు, రెండు ఇరవై రూపాయలకు హెచ్చించవలసి వచ్చినా, దానికి సంబంధించిన ఎల్ల విషయాలు తెలుసుకోవలసిన కేంద్రం-ఏలేశ్వరం! సింధు లోయలోవలె, గంగ లోయలోవలె, కృష్ణ లోయలో కూడా భారతీయ నాగరికత అవిచ్ఛిన్న మైనదని అది చాటుతున్నది. దాని గతిలో నిమ్నోన్నతాలు లేకపోలేదు. అయినా, అది పూర్తిగా అంతరించిన ఘట్టం ఒక్కటి కూడా లేదు. భారతీయ నాగరికతకు, అబిసీనియన్, బాబిలోనియన్, అసిరియన్, ఈజిప్షియన్, హిట్టైట్, ఫోనీసియన్, పర్షన్, గ్రీక్, రోమన్ మొదలైన ప్రాచీన నాగరికతలకు ప్రధాన భేదమిదే? భారతీయ నాగరికత విశేషించి, ఆంధ్ర సంస్కృతి - పూర్వ శిలాయుగం నుంచి ఆధునిక యుగంవరకు ఎప్పుడు, ఏ విధంగా రూపొందుతూ వచ్చిందో తెలపడంలో ఏలేశ్వరానికి సాటి రాగల కేంద్రాలను వేళ్లమీద లెక్కించ వచ్చునేమో!

వివిధ మతాలకు, విభిన్న సంస్కృతులకు సంగమ స్థానం వంటిది భారతీయ నాగరికత. ఇందు కొక ప్రత్యక్ష సాక్ష్యం ఏలేశ్వరమే! అక్కడి త్రవ్వకాలలో గ్రామ దేవతలు బయల్పడినాయి; బౌద్ధస్తూపాలు, హిందూ దేవాలయాలు బయల్పడినాయి, ఇతర నాణెములతో పాటు ఒక రోమన్ బంగారు నాణెం కూడా బయల్పడింది.

మరొక విశేషాన్ని కూడా ఏలేశ్వరం చాటుతున్నది. నగర పారిశుద్ధ్యాన్ని గురించి ప్రాచీనకాలపు శ్రద్ధాసక్తులకు సంబంధించిన విషయమది. ఈనాడు మన తెలుగు పట్టణాలలో వీధులే మురుగు కాల్వలు, వీధులే మరుగుదొడ్లు. కాని, దాదాపు రెండు వేల సంవత్సరాలనాడు ఏలేశ్వరంలో మురుగునేలలో యింకి పోవడానికి ప్రతి గృహస్థు ప్రత్యేకమైన యేర్పాట్లను చేసుకొన్నట్టు కనబడుతున్నది. ఇంటింటికి మరుగు దొడ్లు వున్నట్టు కూడా కనబడుతున్నది. అంతకంటే ముందు హరప్పా, మొహంజొదారోలలో సయితం నగర పారిశుద్ధ్యం విషయమై పట్టుదల కనబడుతుంది. ఈ విషయంలో నాటినుంచి నేటికి మనం ఎంతగా దిగజారి పోయాము!

ఇట్టి విశేషా లెన్నింటినో శ్రీ వహీద్ ఖాన్ రచన నుంచి మనం తెలుసుకోవచ్చు. కొన్ని ప్రత్యేకాంశాలలో ఇతర ప్రవీణుల ఊహలకంటె ఆయన నిర్ణయాలే సముచితమైనవిగా మాకు లోస్తున్నవి. ఏలేశ్వరంలో ఒక చైత్యం, రెండు స్తూపాలు కానవచ్చాయి. ఈ స్తూపాలు అమరావతి, నాగార్జున కొండలలో నిర్మితమైంది. వాటివలె చక్రాకారంలో కాక, గజపృష్ఠాకారంలో వున్నది. ఈ కారణాన ఇది బౌద్ధచైత్యం కాదని, హిందూ దేవాలయమని కొందరు ప్రవీణులన్నారట.

ఇందుకు తార్కాణంగా చేజర్లలోని కపోతేశ్వరాలయం, నాగార్జున కొండలోని పుష్ప భద్రస్వామి దేవాలయాన్ని వారు పేర్కొన్నారట. పుష్ప భద్రస్వామి దేవాలయం మాట మాకు తెలియదుగాని, కపోతేశ్వరాలయం ఆదిలో బౌద్ధచైత్యమని శ్రీ ఆనంద కుమారస్వామి స్పష్టంగా వ్రాశారు.

నాగార్జున కళాక్షేత్రం

భారతీయ వాస్తు శాస్త్రంలో, చిత్ర శిల్పకళల చరిత్రలో ఆయనను మించిన పండితులు మరి లేరు. అయినప్పుడు కపోతేశ్వరాలయాన్ని నిదర్శనంగా చూపి, బౌద్ధచైత్యాన్ని హిందూ దేవాలయంగా గుర్తించ మనడంలో సామంజస్యం కానరాదు.

ఎంతో నైపుణ్యంతో త్రవ్వకాలను సాగించి, పరిశోధనలు జరిపి, వాటిని గురించి నివేదికలను ప్రచురించడంలో ప్రతిభను చూపుతున్న శ్రీ వహీద్ ఖాన్ ఏలేశ్వరం పై ప్రకటించనున్న తుది నివేదికకై మామట్టుకు మేము ఎంతో ఆసక్తితో, ఆతురతతో ఎదురుచూస్తూ వుంటాము.

ఆంధ్రప్రదేశ్ పురాతత్త్వ శాఖవారు తాము కొనసాగిస్తున్న పరిశోధనలను గురించి అప్పుడప్పుడు కొన్ని ప్రత్యేక నివేదికలను "The Archaeological Bulletin" రూపంలో ప్రచురిస్తున్నారు. వాటిలో రెండవ దాన్ని సిద్ధం చేసినవారు డాక్టర్ పి. శ్రీనివాసాచారి. వారు పురాతత్త్వ శాఖకు డైరెక్టర్ గా వున్నకాలంలో హైదరాబాద్, మహబూబ్ నగర్, మెదక్, నల్గొండ, రాయచూర్ జిల్లాలలో కొన్ని పూర్వశిల, నవశిల, మహాశిల నాగరికతా కేంద్రాలను ఆయన పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలు ఈ నివేదిక ప్రథమ భాగంలో వున్నాయి. ఇక, రెండవ, మూడవ భాగాలలో వేములవాడ, అలంపూర్, వరంగల్లు, నల్గొండలో కానవచ్చిన పురాతన శిల్పాల గురించి మధ్యయుగానికి సంబంధించిన ఇతర శిల్పాలను గురించి వివరాలున్నాయి. వివరణలో పెద్ద విశేషం

లేకపోయినా నివేదిక చివర ముద్రించిన చిత్రాలు ఎంతో ముచ్చట గొల్పుతున్నాయి. ఈ నివేదిక వెల 20 రూపాయలు. (ఆంధ్రజ్యోతి 22-5-1963)

నాగార్జున కళాక్షేత్రం

మాకు తెలుసు - నాగార్జున కళాక్షేత్రాన్ని నీటి మునిగిపోనివ్వడం కంటె, నాగార్జునసాగర్ ప్రాజెక్టునే మానుకొనడం మంచిదని భావించినవారు కొందరున్నారని, ఇంతవరకు వెళ్ళకపోయినా, నాగార్జున క్షేత్రం జలమయమై పోకుండా కాపాడ్డానికి కృష్ణపై కట్టే కొత్త ఆనకట్టను కొంచెం ఎగువనో, కొంచెం దిగువనో ఎందుకు కట్టరాదని అడిగినవారు మరికొందరున్నారని కూడా మాకు తెలుసు. వీరికి చెప్పదగు ప్రత్యుత్తరమేదో ఇదివరలోనే చెప్పబడింది కాబట్టి, ఇప్పుడు తిరిగి ఆ విషయాన్ని ఎత్తుకోవలసిన పనిలేదు. కాగా, ఇప్పుడు చెప్పదగింది వీరిని సయితం సంతోష పెట్టగల కొన్ని ఉత్తమ సూచనలు నాగార్జున కళాక్షేత్ర రక్షణకై కొత్తగా జరిగినవని మాత్రమే.

ఈ సూచనలను చేసినట్టిది భారత ప్రభుత్వం నియమించిన ఒక ప్రవీణుల సంఘం. కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖలో ఒక కార్యదర్శి, పురావస్తు శాఖాధికారి అయిన శ్రీ ఘోష్, బొంబాయిలోని ఆర్ట్స్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీ జె.జె. డీన్, కేంద్ర, ఆంధ్ర పబ్లిక్ వర్క్స్ శాఖలలో ప్రధానోద్యోగులైన శ్రీ జోగేకర్, శ్రీ నరసింహారావు, బౌద్ధమతస్థుడైన ప్రసిద్ధ పత్రికా రచయిత శ్రీ విజయతుంగ -ఈ ఆరుగురు ప్రవీణులతో కూడిన సంఘం నాగార్జున కొండకు వెళ్ళి, వారం రోజులపాటు ఆ ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలించిన పిమ్మట 'అయ్యో, నాగార్జున కళాక్షేత్రం అలమయమై పోతుందా?" అని మరి నిట్టూర్చవలసిన అగత్యం లేని సూచనలను కొన్నింటిని చేసింది, దక్షిణ భారతంలో - యావద్భారతంలోనే అని కూడా చెప్పవచ్చునేమో! బౌద్ధ క్షేత్రాలేమి, వాటికి సంబంధించిన శిల్పకళా సంపదేమి విశేషంగా కానవచ్చింది ఆంధ్రప్రదేశ్ లోనే. ఉత్తరాన సాలిహుండం వద్ద నుంచి, దక్షిణాన చినగంజాం వరకు, తూర్పున ఘంటశాల మొదలు, పడమట గుత్తి వరకు ఎన్నెన్నో బౌద్ధ స్తూపాలు బయటపడినాయి; స్తూపం కనబడిన ప్రతి చోట కాకపోయినా, చాలా చోట్ల బౌద్ధ శిల్పాలు విశేషంగా లభించాయి. అయితే, ఈ శిల్ప సంపదలో అధిక భాగం పరప్రాంతాలకు తరలిపోయింది. అమరావతిలోని మహా చైత్యానికి సంబంధించిన శిల్పాలలో అమరావతిలో మిగిలినవి బహు స్వల్పం; లండనకు, మద్రాసుకు చేరినట్టివి అత్యధికం. బ్రిటిష్ మ్యూజియంలో ఈ కళాఖండాలు 125 ఉన్నాయి; మద్రాసు గవర్నమెంట్ మ్యూజియంలో మూడున్నర వందలకు పైగా ఉన్నాయి. ఈ రెండు చోట్లకే కాక, ప్యారిస్, బాస్టన్, కలకత్తాలకు కూడా మన అమరావతి శిల్పాలు చేరాయి. ఘంటశాలలో దొరికిన కళాఖండాలు దాదాపు పూర్తిగా పారిస్కు వెళ్లిపోయాయి. గోలి గ్రామంలోను, జగ్గయ్యపేటలోను దొరికిన శిల్ప సంపద తక్కువ. కాని, ఆ దొరికిన కొంచెం మద్రాసు మ్యూజియానికి చేరింది. కాగా, ఒక్క నాగార్జున శిల్పావశేషాలు మాత్రమే ఇలా చెల్లాచెదరైపోకుండా, అవి లభించిన చోట ఇప్పటికీ మిగిలి ఉన్నాయి. వీటిని పూర్తిగా ఒకే చోట భద్రపరచుకొనడం మాత్రమే చాలదు; తగు పరిసరాలలో వీటిని భద్రపరచుకోవాలి.

నాగార్జునకొండ శిల్పాలు ఆ కొండ సమీపాన ప్రస్తుతం ఒక వికారపు కట్టడంలో ఉన్నా, అక్కడ చూచినప్పుడు అవి కలిగించగల ఆనందం మరెక్కడ చూచినా కలిగించలేవేమో! కృష్ణానదీతీరాన, ఆ కొండల మధ్య, ప్రకృతియే నిర్మించిన అభేద్య దుర్గంవలె కానవచ్చే ఆ లోయలో ఆ శిల్పాలు మలచబడినాయి. ఆ సుందర పరిసరాల ప్రభావం ఆ శిల్పులపై పడి, వారి ద్వారా మలచిన శిల్పాలకు హత్తుకున్నది. యాత్రికులమై వెళ్ళినప్పటికీ ఆ పరిసరాలు

మనలను ముగ్ధులను చేసాయి. ముగ్గులమైవున్న ఆ స్థితిలో ఆ శిల్పాలను చూచినప్పుడే వాటి పూర్తి సౌందర్యాన్ని మనం సాక్షాత్కరింప జేసుకోగలము; నిజానికి అప్పుడే అవి మనకు రాతి బొమ్మలుగా కాక, సజీవ మూర్తులుగా కనబడతాయి.

కళలకు, అవి ఆవిర్భవించిన పరిసరాలకు ఇంతటి సన్నిహిత సంబంధం కలదు కాబట్టే, నాగార్జున శిల్ప కళాఖండాలను ముమ్మందు మనం భద్రపరచుకోడానికి ఏది ఉత్తమ ప్రదేశం కాగలదన్న ప్రశ్నకు విశేష ప్రాధాన్యం వచ్చింది. ఈ ప్రశ్నకు సమాధానంగా "ఇందుకు తగు ప్రదేశం నాగార్జునకొండే" అని చెప్పినందునే ప్రవీణుల సంఘం సూచనలు ఎంతో ప్రశంసా పాత్రమైనవిగా ఉన్నాయి.

నాగార్జున కొండ వద్ద అయిదు వందల వరకు ఇదివరకే శిల్ప ఖండాలు లభించాయి. 3500 ఎకరాలలో ప్రస్తుతం కొనసాగుతున్న త్రవ్వకాలలో మరికొన్ని లభించాయి; మరెన్నో లభించగల అవకాశం లేకపోలేదు కూడా. ఇంతే కాక, పెక్కు చైత్యాల, విహారాల, రాణ్మందిరాల పునాదులు ఇదివరకే కనబడ్డాయి;

ఇప్పుడు కనబడుతున్నవీ, ముందు కనబడగలవీ మరెన్నో, ఈ శిల్పాల నన్నింటిని నాగార్జున కొండపైనే ఒక మ్యూజియం కట్టి, వాటిలోకి మార్చాలనీ, ఈ కట్టడాల పునాదులను తవ్వి, పాత రాళ్ళతోనే, పాత ప్లానుల ప్రకారమే తిరిగి కొండపైన ముఖ్యమైన కట్టడాలను రెండు, మూడింటినైనా పునర్నిర్మించాలని ప్రవీణుల సంఘం సూచించింది. నాగార్జున సాగర్ లో లోయ మునిగినా, కొండ మునిగినా, కొండతల మాత్రం మునగదు! కాబట్టి కొండపైన మిట్టపల్లాలను సరిచేసి, 150 ఎకరాలలో ఇప్పటి నాగార్జున కళాక్షేత్రానికి ఒక ప్రతిరూపాన్ని సృష్టించాలని ప్రవీణుల సంఘం చెబుతున్నది. త్రవ్వకాల పనినేకాక, కొండ పైన ఈ నిర్మాణాలను సయితం నాగార్జున సాగర్ ఏర్పడేలోపుగా (1960 లోపుగా) పూర్తిచేయాలని చెబుతున్నది. కొండపై వెలిసే ఈ కొత్త క్షేత్రానికి యాత్రికులు వెళ్లడానికి స్టీము లాంచీలను ఏర్పాటు చేయాలని చెబుతున్నది. విశ్రాంతి భవనాలను, ఉద్యానవనాలను ఏర్పాటు చేయాలని చెబుతున్నది. అత్యుత్తమమైన ఈ సూచనలను భారత ప్రభుత్వం ఆమోదించడమేకాక, వీటిని అమలుపరచడానికి వెంటనే ఉత్తరువులను జారీ చేయగలదని ఆశిస్తున్నాము.

ఎంతవరకు అవకాశం కలదో మాకు తెలియదు గాని, అవకాశం ఉంటే మాత్రం నాగార్జున శిల్ప కళాఖండాలను వినియోగించి, కొండపై ఒక స్థూపాన్ని నిర్మించవలెనని మేము సూచించ గోరుతున్నాము. సాంచీస్థూపం ఇప్పటి ఆకృతిలో కాక, శిథిలావస్థలో కనిపెట్టబడింది; చెల్లా చెదరైవున్న శిల్ప శకలాలను తిరిగి చేర్చిన మీదటనే, అక్కడి ప్రపంచ ప్రసిద్ధ ద్వారాలకు, అక్కడి స్తూపానికి పూర్వాకృతి తిరిగి ఏర్పడింది. పాతకాలపు ప్లానునే అనుసరించి, పాత శిల్ప ఫలకాలతో సరిగా పాత స్తూపాన్నే కాక పోయినా, ఇంచుమించుగా అట్టిదాన్ని తిరిగి నాగార్జున కొండపై నిలబెట్టడానికి వీలే లేదా? (ఆంధ్రప్రభ 27-4-1956)

మానవ జీవితం ఒక్క తిండితోనే కడతేరదన్నది ప్రసిద్ధమైన నానుడి. పొట్టకోసం ప్రాకులాట ప్రతి వ్యక్తికీ తప్పనిసరి. పొట్టనిండిన తరువాత మనిషికి కావలసినవి ఎన్నో ఉన్నవి. సౌందర్యం కావాలి; సంగీతం కావాలి; విజ్ఞానం కావాలి; వినోదం కావాలి. ఇవేవీ అల్పమైన, అనుచితమైన కోరికలు కావు. పైపెచ్చు, విజ్ఞులైన వారు వీటిని ఇహపర సాధనాలుగా పేర్కొన్నారు. ఒక జాతి ఔన్నత్యంగాని, నాగరికతగాని ఆ జాతి సౌందర్యానుభూతి,

కళాపాటవం, విజ్ఞానాధిక్యతలబట్టే చెప్పవలసి ఉంటుంది. నాటికి నేటికి, ఏనాటికైనా శాశ్వతంగా నిలిచేవి ఈ కళావిజ్ఞానాలేగాని ధనధాన్య సంపదలు కావు.

తమతమ ప్రజలలోని ఈ కళాపిపాసను, ఈ విజ్ఞాన తృష్ణను తనియజేయడం, అశిక్షితమైన ప్రజాభిరుచిని సంస్కరించి ఉత్తమ సంప్రదాయాన్ని నెలకొల్పడం, వర్తమాన నాగరిక ప్రజాప్రభుత్వాలు నిర్వహిస్తున్నపనే.

ఈ దృష్టితో చూస్తే, బహిరంగ ప్రదేశాలలో జాతీయ నాయకుల విగ్రహ ప్రతిష్ఠాపన విషయమై ఇటీవల మద్రాసు ప్రభుత్వం చేసిన ఉత్తరువు సర్వసమంజసమని చెప్పవచ్చు.

ప్రజాసేవకుగాను తమ సర్వస్వం ధారపోసిన ప్రఖ్యాత దేశనాయకుల, తదితర ప్రసిద్ధ వ్యక్తులపట్ల తమకు గల భక్త్యనురాగాలను ప్రకటించే నిమిత్తం బహిరంగస్థలాలలో వారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రజ లానందించడం సహజం. ముఖ్యంగా ఆంధ్రదేశంలో ప్రధానమైన పట్టణాలన్నిటిలోను, చిన్నచిన్న బస్తీలలో కూడా గాంధి, నెహ్రూ, నేతాజీల విగ్రహాలు వందలకొద్ది వెలసినవి. ఎక్కడో ఒకటి రెండు తప్ప, ఈ విగ్రహాలలో చాలాభాగం సిమెంటు విగ్రహాలే గాని, శిలావిగ్రహాలు కావు.

ఊరూరా, వాడవాడా అసంఖ్యాకంగా వెలిసిఉండే ఈ నాయకుల విగ్రహాలలో నూటికి తొంభై తొమ్మిది, వాటిని నెలకొల్పిన ప్రజల దేశభక్తికే తప్ప, వారి సౌందర్య గ్రహణశక్తికి నిదర్శనాలు కావని చెప్పడం అతిశయోక్తికాదు.

పురాతన కాలం నుంచి శిల్పకళలో పేరుగన్నది భారత దేశం. ఇక, ఆంధ్రుల శిల్పకళా వైభవాన్ని తలపింపజేసే తార్కాణాలు అనేకంగా ఉన్నవి. అటువంటి మహోన్నతమైన, అతి సుకుమారమైన, విశిష్ట కళా సంప్రదాయం కలిగిన ఆంధ్రులు తమ కారాధ్యులైన దేశనాయకుల విగ్రహాలను కళాన్వితంగా, సహజ సుందరంగా, శిల్పచాతుర్యం వుట్టిపడేటట్టుగా నిర్మించుకోలేక పోవడం ప్రశంసనీయం కాదు.

విదేశస్థులెవరైనా మన ఆంధ్ర దేశం. తిలకించేందుకు వచ్చారే అనుకోండి : మన అజంతా, మన అమరావతి, మన నాగార్జున కొండలను వీక్షించారే అనుకోండి : ఆ వెంటనే వారికి మన ప్రధాన నగరాలలో, బహిరంగ వీధులలో ఏ గాంధి, ఏ నెహ్రూ, లేక ఏ నేతాజీ సిమెంటు విగ్రహమో కంటబడిందనుకోండి : నేటి ఆంధ్రజాతి కళాకౌశలాన్ని గురించి, రసగ్రహణ పారీణతను గురించి, సౌందర్య పోషణను గురించి వారికిక వ్యాఖ్యానం అవసరమా?

కాబట్టి, సమున్నత కళా ప్రమాణాలను తృప్తి చేయగల విగ్రహాలను మాత్రమే పురవీధులలోను, బహిరంగ స్థలాలలోను ప్రతిష్ఠించాలని మద్రాసు ప్రభుత్వంవారు చేసిన సూచనల ముఖ్యోద్దేశాన్ని గ్రహించి, ప్రజలు ఇకముందైనా దేశభక్తి పేరిట కళాదేవతకు అపకృతి చేయరని భావిస్తున్నాము. జాతీయ పతాకం విషయంలో కూడా ప్రభుత్వం వారేర్పరచిన నిబంధనలు అనుసరించడం చేత, మన గౌరవాన్ని, మన జాతి గౌరవాన్ని వృద్ధి చేసినవారమౌతాము.

(ఆంధ్రప్రభ 21-6-1954).

అపురూప కళాలయం

విద్యాలయాల వెలుపల ప్రజల విజ్ఞానతృష్ణను తీర్చగల సంస్థలు గ్రంథాలయాలే. వాటితో సమానమైన ప్రాధాన్యం కలిగినవి వస్తుప్రదర్శనశాలలు. వివిధ దేశాలకు, వివిధ కాలాలకు చెందిన చిత్ర విచిత్ర వస్తువులను, కళాఖండాలను ఒక్కచోట చూసే అవకాశాన్ని ఇవి కలిగిస్తాయి. విజ్ఞాన వ్యాప్తికి ఇవి ఎంతైనా దోహదం చేస్తాయి.

ఇండియాలో అతి ప్రాచీనమైన వస్తు ప్రదర్శనశాల కలకత్తాలో 1814లో స్థాపితమైన ఇండియన్ మ్యూజియం. దాని తర్వాత పెద్ద మ్యూజియంగా చెప్పదగింది 1855లో బొంబాయిలో నెలకొన్న విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియం. 1943లో ఢిల్లీలో ఏర్పాటైన నేషనల్ మ్యూజియంకూడా గొప్ప పురావస్తు ప్రదర్శనశాలగా ప్రసిద్ధి కెక్కింది.

ప్రాచీనతలో గాని, వస్తు బాహుళ్యంలో గాని అంత పెద్దది కాకపోవచ్చునేమోగాని, మరెన్నో విధాలుగా ప్రత్యేక విశిష్టతను గడించిన వస్తుప్రదర్శనశాల ఆంధ్రప్రదేశ్ రాజధానిలోని సాలార్‌జంగ్ మ్యూజియం. దాన్ని ప్రారంభించింది 1951లోనే అయినా, ఈ స్వల్పకాలంలో అది పొందిన విశేష ఖ్యాతికి దాని ప్రత్యేకతలే కారణం. సాధారణంగా మ్యూజియమ్ లను స్థాపించడమేమి, నిర్వహించడమేమి ప్రభుత్వాలకు, మునిసిపాలిటీల వంటి సంస్థలకు, వాటిని పోలిన పెద్ద పెద్ద సంస్థలకు మాత్రమే సాధ్యం కాగా, హైదరాబాదు మ్యూజియం ఒకే ఒక వ్యక్తి కృషి ఫలితమని తెలుసుకున్నప్పుడు అమిత ఆశ్చర్యం కలుగుతుంది. దానిలోని వస్తువుల సంఖ్య సుమారు 43 వేలట. వీటిలో భారత దేశంలో వివిధ ప్రాంతాలకు, వివిధ కాలాలకు చెందిన అపురూపశిల్ప, చిత్ర కళాఖండాలు, తదితర వస్తువులేకాక, చైనా, బర్మా, నేపాల్, పర్షియా, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ మొదలైన దేశాలకు చెందినవికూడా ఉన్నాయి.

స్వయంగా తాను వివిధ ప్రాంతాలకు, దేశాలకు వెళ్ళి, ఇతరులను పంపి, తెప్పించి, సేకరించి భద్రపరచడానికి సాలార్‌జంగ్ ఒక జీవిత కాలాన్ని కొన్ని లక్షల ధనాన్ని వెచ్చించారు. ఆయన విజ్ఞాన తృష్ణ అద్భుతావహం.
అమూల్య వస్తువులను సేకరించడం ఒక ఎత్తు; వాటిని భద్రపరచడం, ఆకర్షణీయంగా ప్రజోపయోగార్థం ప్రదర్శించడం మరొక ఎత్తు. ఈ బాధ్యతను ప్రభుత్వం స్వీకరించింది. దాని భవనం పురాతనమైనది కావడంవల్ల నూత్న భవన నిర్మాణానికి ప్రభుత్వం 42 లక్షల రూపాయలు మంజూరు చేసింది. 1963లో నూత్న భవనానికి శంకు స్థాపన శ్రీ జవహర్లాల్ నెహ్రూ చేతి మీదగా జరిగింది. వచ్చే బుధవారంనాడు దాని ప్రారంభోత్సవం రాష్ట్రపతి జాకిర్ హుస్సేన్ చేతిమీదగా జరుగనున్నది.

మ్యూజియంల నిర్వహణ అతిక్లిష్టమైనది. దానికి "మ్యూజియాలజి" పేరిట ఒక ప్రత్యేక శాస్త్రం ఉన్నది. అమెరికా, యూరపులలో ఈ శాస్త్రంలో అధునాతనమైన మార్పు లెన్నో వస్తున్నాయి.

వాటినన్నిటిని పరిశీలించి సాలార్‌జంగ్ మ్యూజియం నిర్వహణను, విస్తరణను కొనసాగించవలసి ఉన్నది. దురదృష్ట వశాత్తు ఈ మ్యూజియం నుంచి ఆ మధ్య 49 అపురూప చిత్రకళా ఖండాలు మటుమాయమై పోయాయి. ఈ విధంగా మన మ్యూజియంలు, దేవాలయాలు, ఇతర చారిత్ర స్థలాలు కడచిన ఒక శతాబ్దంలో ఎన్ని విలువైన కళాఖండాలను కోల్పోయాయో చెప్పలేము. ఇటీవలే బొంబాయి మ్యూజియం నుంచి కొన్ని

వెండివస్తువులు పోవడం దీనికి తాజా నిదర్శనం. ఇటువంటి చౌర్యాలు జరగకుండా రాష్ట్ర ప్రజలకు గర్వకారణమైన ఈ మ్యూజియంను సంరక్షించడం, దాని కీర్తిని ఇనుమడింపజేయడం దాని నిర్వాహకుల విధి.

(ఆంధ్రజ్యోతి 23-7-1968)

నాటకశాల: నాటక చరిత్ర

'కావ్యేషు నాటకం రమ్యం" అనో, "నాటకాన్తం హి సాహిత్యం" అనో, "నాటకాన్తం కవిత్వం" అనో ఒక ప్రాచీన సూత్రంతో వ్యాసాలు ప్రారంభించడం పరిపాటి. నాటకము, ప్రకరణము, భాణము, ప్రహసనము, డిమము, వ్యాయోగము, సమవాకారము, వీథి, అంకము, ఈ హామృగము అని రూపకం దశవిధాలని కాని, శృంగారము, వీరము, కరుణము, అద్భుతము, హాస్యము, భయానకము, బీభత్సము, రౌద్రము అని రసభేదాలు ఎనిమిదని కాని, సాత్త్వికము, ఆంగికము, వాచికము, ఆహార్యము అని విభాగాలు నాలుగని కాని గంభీర చర్చను చేయడం కూడా సంప్రదాయం. ధీరలలిత, ధీరశాంత, ధీరోదాత్త, ధీరోద్ధతులని నాయకుడు చతుర్విధుడని వివరించడమో, స్వీయ, పరకీయ, సామాన్య అని నాయిక త్రివిధ అని విశదీకరించడమో ఒరవడి. పరిపాటికి భిన్నమైనా, సంప్రదాయాన్ని తప్పించడమైనా, ఒరవడికి విరుద్ధమైనా నేను మాత్రం ఇలాంటి గొప్ప గొప్ప విషయాలను ఎత్తుకోబోవడం లేదు. నా సామాన్య బుద్ధికి తోచిన కొన్ని సామాన్య విషయాలను మాత్రం నాకు మనవి చేస్తాను.

గుర్రం లేనిదే రౌతు లేడు. గృహం లేనిదే గృహస్థు లేడు. పురం లేనిదే అంతఃపురం లేదు. జలం లేనిదే జలక్రీడ లేదు. ఇదేవిధంగా రంగస్థలం లేనిదే రూపకం లేదు. ఇది తిరుగులేని సూత్రం; తేట తెల్లమైన సత్యం. అయినా, రంగస్థలం మినహాగానే ఆంధ్రనాటక కళోద్ధరణకై చిరకాలంగా మనం కృషి చేస్తున్నాం.

రంగస్థలం అన్నప్పుడు నేను కేవలం నాటకశాలనే ఉద్దేశించడం లేదు. కూచిపూడి భాగవతులకు, ఇతర భాగవతులకు నాటకశాలలు లేవు. ఏ వీధిలోనో ప్రొద్దుకుంకే వేళకు వేసి, ప్రొద్దు పొడిచేవేళకు పీకి పారవేసే పందిరిలో వీరు తమ నాటకాలను ఆడతారు. అయినా, వీరికి నిశ్చయంగా రంగస్థలం ఉన్నది. నాటకశాలతో నిమిత్తం లేకుండా ఏ వీధిలో కోరితే ఆ వీధిలో నాటకాలను ఆడి చూపగల సౌలభ్యాన్ని కూర్చడమే వీరి రంగస్థలం విశిష్టత.

నాటకశాలతో నిమిత్తం లేని రంగస్థలం ఒకటి మనదేశంలో ఆవిర్భవించడం ఆ శాలలను కట్టించగల నాథుడు లేకపోయినందువల్ల కాదు. గుళ్లు కట్టించినవారు, చలివేంద్రలు పెట్టించినవారు ఎందరెందరో ఉన్నారు. అయినప్పుడు, నాటకశాలల అవసరమే ఏర్పడితే, వాటిని కట్టించడానికి కొందరైనా ముందుకు వచ్చేవారు కాదా? నాటకశాలలు కరవైనందునే వాటితో నిమిత్తం లేని రంగస్థలం రూపొందిందని అనుకోడానికి వీలులేదు. ఇందుకు ఏదో మరొక కారణం ఉండాలి.

మన దేశ చరిత్రను కాస్త సూక్ష్మంగా పరిశీలిస్తే, ఈ మరొక కారణమేదో తెలియనే తెలుస్తుంది. బుద్ధ భగవానుని కాలం నాటికే సంస్కృత భాష ప్రజాసామాన్యానికి దూరమైపోయింది. అందువల్లనే ప్రజాసామాన్యానికి తగిన సందేశం అందించగోరిన బుద్ధ భగవానుడు సంస్కృతం జోలికిపోక, ప్రాకృతంలో తన బోధన చేశాడు. ఆయన

కాలం తర్వాత పెక్కుమంది పెక్కు విధాలుగా సంస్కృతాన్ని ప్రచారం చేయడానికి ప్రయత్నించినా, అది రాజాస్థానాల భాషగానే మిగిలింది. రాజాస్థానాల వెలుపల దానికి మరెక్కడైనా స్థానం వుంటే, అది పండితుల గోష్ఠిలోనే. ఇంతేకాని, చివరికి రాణివాసాలలోనైనా అది ప్రచారంలో ఉండేది కాదనే అనుకోవాలి. పాత్రోచిత భాష విషయమై పట్టుదల చూపిన సంస్కృత నాటకకర్తలు రాజుకు సంస్కృతంతో సంభాషణలు పెట్టి, రాణి మాటలకు ప్రాకృతాన్నే వాడుక చేశారు.

ఏమైతేనేమి సంస్కృత భాష, దానితోపాటు సంస్కృత నాటకం రాజాస్థానానికి పరిమితమై, ప్రజాబాహుళ్యానికి దూరమయ్యేసరికి ప్రజాభాషలలో ప్రజానాటకాలు కావలసివచ్చాయి. మన తెలుగుదేశానికి సంబంధించినంతవరకు ఇట్టి ప్రజా నాటకాలే వీధినాటకాలు.

సాహిత్యరూపాలలో మరేదైనా ప్రజతో సంబంధం లేకుండా వర్ధిల్లగలదేమోగాని, నాటకం మాత్రం ప్రజలకు దూరం కాలేదు. ప్రజలకు దూరమే అయితే, అది కృత్రిమమైపోతుంది; వికృతమైపోతుంది; దుర్బలమైపోతుంది; జీవచ్ఛవమై పోతుంది. ఏపుగా పెరగాలంటే, అందచందాలు ఉట్టిపడాలంటే, ఔననిపించుకోవాలంటే, నాటకం విధిగా ప్రజల మధ్యకు వెళ్ళాలి; వారితో సన్నిహిత సంబంధాన్ని పెట్టుకోవాలి, వారి జీవితంలో అంతర్భాగమైపోవాలి. ఇందుకోసమే మన నాటకం వీధినాటక మైంది.

ఇప్పటిమాట ఏమైనప్పటికీ ఇదివరలో పగలు కాస్త విశ్రాంతి తీసుకోవాలంటే వీధిలోని ఏ మర్రిచెట్టు కిందో, రావిచెట్టు కిందో చేరేవారు. రాత్రిపూట భోజనమైనాక కాస్త కాలు సాగాలంటే వీధిలోకే వెళ్ళేవారు.

తగవు వస్తే వీధికి లాగేవారు; ఆ తగవు తీర్చడానికి వీధిలోనే పంచాయతీ జరిగేది. వీధిలోనే బడి పెట్టి చదువులు చెప్పేవారు; ఆటవిడుపు వస్తే, ఆటలన్నీ వీధిలోనే. పెళ్ళిళ్ళకు వీధిలోనే మేజువాణీ చేసేవారు. హంస లేచిపోగానే శవాన్ని వీధిలోనే పెట్టేవారు. వీధిలోకి వెళ్ళకుండా ఇంటిపట్టునే పొద్దస్తమానం కూర్చునే మగవాడు ముండమోపికింద జమ. మహా అప్రతిష్టాకరమైన పరిస్థితిలో పడిపోవడానికి మన నుడికారం “వీధి ముఖం చూడలేకపోవడం” “నా బ్రతుకు బజారులో పెడతావటరా?” అంటే “నలుగురిలో నన్ను అల్లరి పెడతావా?” అని అర్థం. ఒకప్పుడు మన బ్రతుకే ఇంతగా వీధిలోనే గడిచేది కనుకే, వీధి కొన్ని సందర్భాలలో ప్రజలకే పర్యాయపదమైనందునే. మన నాటకాలు కూడ వీధినాటకా లైనాయి.

ప్రజల మధ్యకు వెళ్ళడానికి మన నాటకం వీధిని రంగస్థలం చేసుకొనగా, ఆ రంగస్థలం మన నాటక స్వరూపాన్ని నిర్ణయించింది. ఆరుబయట, అనేక వేల ప్రజల కోసం నాటకాన్ని వేస్తున్నప్పుడు పాట వినబడినంత స్ఫుటంగా మాట వినబడదు. హస్తముద్రలు, నృత్యాభినయాలు కనబడినంత స్పష్టంగా ముఖంపై హావభావ విలాసాలు కనబడవు. ఇందువల్ల మాటాపలుకూ కంటే ఎక్కువగా ఆటా పాటా కావాలి. అప్పుడైనా ఏ వొక్కరో ఆడినా, పాడినా అవి అంత స్పష్టంగా, స్ఫుటంగా ఉండకపోవచ్చు. ఇందువల్ల ఒకరు పాట ఎత్తుకోగానే తక్కిన వారందరు దాన్నే అందుకోవాలి. ఒకరు ఆట మొదలు పెట్టుకోగానే తక్కిన వారందరు హంగు చెయ్యాలి. వీధి నాటకంలో ఏయే చేష్టలు వికారమైనవి ఈనాటి నాగరికులు అనుకుంటారో, అవన్నీ ఆ రంగస్థలం స్వభావాన్ని బట్టి అవసరమైనట్టివే, అవే లేకపోతే ఆ నాటకం రక్తి కట్టనే కట్టదు. ఒక్క మన విషయంలోనే కాదు; ఎవరి విషయంలోనైనా, ఏ కాలంలోనైనా రంగస్థలానికీ, నాటక స్వరూపానికీ ఈ అవినాభావ సంబంధం

కనబడుతుంది. గ్రీకుల నాటకం ప్రధానం మత సంబంధమైంది. మతం వర్గ విభేదాలకు అతీతమైంది కనుక, గ్రీక్ నాటకం ఏదో ఒక వర్గానికి కాక, మొత్తం సంఘానికి సంబంధించి నట్టిది. ఆబాలగోపాలం నాటకాన్ని చూడాలంటే, అతి విశాల ప్రదేశంలో దాన్ని ప్రదర్శించాలి. ఇంతటి సువిశాల ప్రదేశం ఊరుమధ్య దొరకడం కష్టం. అందువల్ల ఊరుబయట ఏదో ఒక ఏటవాలు కొండ దరిని చూచుకొని, అక్కడ రంగస్థలాన్ని నిర్మించేవారు. కొండ దిగువభాగంలో భగవత్ సంప్రీత్యర్థ్యం ఒక "ఆల్టార్" కట్టేవారు. దాని నలుగడల నట గాయకులకు రంగస్థలాన్ని ఏర్పాటు చేసేవారు. కొండ సులాబీ (స్లోప్) ప్రేక్షకస్థాన మయ్యేది. ప్రేక్షకులు వేలకొలదిగా ఉండేవారు కనుక, అందరికీ కనబడ్డానికి వీలుగా నటులు కాళ్ళకు దిమ్మలు (స్టిల్స్) కట్టుకునేవారు. తాము ముఖంపై ప్రదర్శించే హావభావాలు దూరంగా ఉన్నవారికి కనబడవు కనుక - కనబడినా, లీలామాత్రంగానే కనుక - ఈ చిక్కును తొలగించడానికి రాగ విద్వేషాలు, సంతోష విచారాలు, ప్రేమవియోగాలు మొదలైన భావాలను వ్యక్తీకరించే పెద్ద పెద్ద ఛద్మముఖాలను (మ్యా) తగిలించుకునేవారు. ఎంత గొంతు చించుకున్నా, వేలాది ప్రేక్షకులకు మాట వినబడ్డం కష్టం కనుక, పాటలతోనే నాటకాన్ని నడిపేవారు. అప్పటికీ అందరికీ వినబడని చిక్కు తప్పదని, వంతపాటను ("కోరస్"ను) కథాక్రమాన్ని తెలియజెప్పడానికి వినియోగించేవారు. ప్రాచీన కాలపు గ్రీక్ నాటకాలన్నీ ఈశ్చలస్, సోఫోక్లెస్, యురిపిడిస్, ఆరిస్టోఫేన్స్ మొదలైన మహా నాటక కర్తలు వ్రాసినవన్నీ - ఈ రంగస్థలంపై, ఈ పద్ధతుల ప్రకారం ప్రదర్శించడానికి అనువైనవే. వేరొక రంగస్థలం పై, వేరొక విధంగా ప్రదర్శిస్తే అవి పూర్తిగా రక్తికట్టవు కూడా.

రంగస్థలానికీ, నాటక స్వరూపానికీ అవినాభావ సంబంధం ఉంటుందని చెప్పడానికి మన సంస్కృత నాటకాల నుంచి కూడా తార్కాణాలు చూపించవచ్చు. ఒకప్పుడు మన దేశంలో నాటకాలను కొయ్యబొమ్మలతో ఆడిస్తుండేవారట. ఈ బొమ్మలను పాంచాలికలని అనేవారట.

పుత్తళికలని కూడా వీటికి మరొక పేరు కూడా ఉండేదట. భాసుని నాటకాలన్నీ ఈ పాంచాలికల రంగస్థలం కోసమే వ్రాయబడినవని కొందరు పెద్ద పెద్ద పండితులే చెబుతున్నారు. తర్వాత వచ్చిన సంస్కృత నాటకాలన్నీ ప్రస్తావనతో ప్రారంభం కాగా, భాసుని నాటకాలు స్థాపనలో ప్రారంభమౌతాయి. స్థాపన కొంత విలక్షణమని భాస నాటకాలను తెనిగించినవారిలో ఒకరన్నారు. కాని, పాంచాలికల రంగస్థలం కోసం భాస నాటకాల రచన జరిగిందని గుర్తిస్తే మాత్రం స్థాపనలో విలక్షణ మేమీ కనబడదు. నిజానికి సూత్రధారుడు పాంచాలికల రంగస్థలం కోసం అవతరించినవాడేమో! గంటి భాగవతు లనేవారు ఇటీవలి వరకు మన తెలుగు దేశంలో పాంచాలికలతో నాటకాలను ఆడుతుండేవారట. తమిళనాడులోను, దక్షిణ కెనడాలోను "బొమ్మలాట్టం" పేరుతో ఈ నాటక ప్రదర్శనలు ఈనాటికీ సాగుతున్నాయి. బొమ్మలాట్టంలోని బొమ్మల కాళ్ళు, చేతులు వగైరాలకు దారాలు కట్టి, తెరచాటున నిలిచి ఆ దారాలను నేర్పుగా అల్లల్లాడించడం ద్వారా ఆంగికాభినయం చేయిస్తారు. సూత్రాలను పట్టుకొని బొమ్మలను ఆడించే ఈ సూత్రధారుడే అటుపిమ్మట నాటకసూత్రాన్ని ధరించి, నటబృందాన్ని ఆడించే సూత్రధారుడైనాడని అనుకోవచ్చు గదా?

భాసుని కాలం నాడు కొయ్యబొమ్మలతో నాటకాలు నడవగా, భవభూతికాలం వచ్చేసరికి తోలుబొమ్మలతో నాటకాలు సాగినవట. అప్పుడు వీటిని "ఛాయా నాటకా"లనే వారట. భవభూతి మహావీర చరిత్ర, సుభటుని దూతాంగద, జయదేవుని ప్రసన్న రాఘవం, రాజశేఖరుని బాలరామాయణం - ఇత్యాదులన్నీ తోలుబొమ్మలతో ఆడబడిన నాటకాలే అని పెద్దలు కొందరు చెబుతున్నారు. ఇది నిజమే అయివుండవచ్చు. మన తెలుగుదేశంలో

ఇప్పటికీ తోలుబొమ్మ లాడుతున్న వారు రంగనాథ రామాయణాన్ని ఉపయోగిస్తారు. రంగనాథ రామాయణం కావ్యం కాని, నాటకం కాదు. అయినా, అది తోలుబొమ్మలాటకు చాలా చక్కగా ఉపకరిస్తుంది. దీన్నిబట్టి నాటక లక్షణ సమన్వితమైన కావ్యం ఛాయానాటక రంగంపై రక్తి కట్టగలదనడం స్పష్టం. భవభూతి ఉత్తరరామ చరిత్ర, మహావీర చరిత్ర మొదలైనవాటిలో కూడా నాటకత్వం కంటే కావ్యత్వమే హెచ్చు. అందువల్ల అవి ప్రత్యేకంగా ఛాయానాటక రంగస్థలానికే రచించబడినవని అనుకోవడం తప్పు కానేరదు.

భాస నాటకాల నుంచి, భవభూతి నాటకాలు ఎక్కడెక్కడ భిన్నంగా కానవచ్చినా, అది పాంచాలికల రంగస్థలానికీ, ఛాయానాటక రంగస్థలానికి వున్న భిన్నత్వమే.

ఇంతవరకు నేను మనవి చేసింది. యేమంటే ఒకటి : ప్రజాజీవిత క్రమమే రంగస్థల స్వరూపాన్ని నిర్ణయిస్తుంది. రెండు : రంగస్థలానికీ, నాటక స్వరూపానికి అవినాభావ సంబంధం వుంటుంది. ఈ రెండు విషయాలు సహజంగా మరి రెండు విషయాలకు దారితీస్తాయి. అవి ఏవంటే - ఒకటి : ప్రజాజీవితక్రమం అన్ని కాలాలలో ఒకే విధంగా వుండదు కనక, ఒక కాలపు రంగస్థలం మరొక కాలానికి తగిపోదు. రెండు : రంగస్థలానుగుణంకాని నాటకం మహానాటకం కానేరదు.

ఈ మధ్యకాలంలో ఎన్ని దండయాత్రలు జరిగినా, ఎంత కల్లోలం చెలరేగినా, ఎన్ని రాజ్యాల స్థాపన జరిగినా, మరెన్ని పతనం చెందినా, క్రీస్తుశకం పదమూడవ శతాబ్దం నుంచి ఇంచుమించు 1850 ప్రాంతాల వరకు మన జీవితంలో ఏ పెద్ద మార్పూ లేదు. ఈ ఆరేడు శతాబ్దాలలో మనం ఆస్వాదించిన ఒక కొత్త భావం లేదు; నడిచిన ఒక కొత్త దారి లేదు; కనిపెట్టిన ఒక కొత్త విషయం లేదు. అపాయాన్ని పసికట్టినంతనే తన గుల్లలోకి ముడుచుకుపోయే నత్తవలె మన జాతి తన ఆచారాలలోకి, తన వ్యవహారాలలోకి, తన మడిబట్టలలోకి ముడుచుకుపోయింది.

ఆర్థిక, సాంఘిక, పారిశ్రామికాది వ్యవస్థలలో కూడా వీసమంతైనా మార్పు రాలేదు. ఇందువల్లనే ఈ ఆరేడు శతాబ్దాలలో మన రంగస్థలంలో ఏ విధమైన మార్పూ రాలేదు. వీధిలో పాత పందిళ్లు వేస్తూనే పోయారు; పాత నాటకాలు ఆడుతూనే పోయారు; అవి మనకు ఆనందాన్ని ఇస్తూనే పోయాయి. కాని, పాశ్చాత్య ప్రపంచంతో బలాత్కార సంపర్కం కలిగిన మీదట మనకు మనస్కరించినా, మనస్కరించకపోయినా దాని సభ్యతలోని గుణాలతోపాటు దోషాలను కూడా తెలుసుకొనవలసి వచ్చిన మీదట మనలో కొంత మార్పు ప్రారంభమైంది. మనలో మార్పుకు నూరింతల వేగంతో మన ఆర్థిక, సాంఘికాది వ్యవస్థలు మార్పు చెందాయి. ఇది జరిగేసరికి మన పాత రంగస్థలం, మన పాత నాటకాలు కొంత వెగటు కలిగించ నారంభించాయి. అయితే, వాటి స్థానంలో కొత్త వాటిని ప్రవేశ పెట్టడానికి ప్రయత్నం జరగలేదు. అట్టి ప్రయత్నం చేయవలెనన్న బుద్ధే ఎవ్వరికీ పుట్టలేదు. అంత బాగా వుండడం లేదని అసంతృప్తి చెందుతూకూడా వీధి నాటకాలనే చూస్తూ పోయాము.

ఈ పరిస్థితి 1880 వరకు ఇలాగే వున్నది. ఆ సంవత్సరంలో మన దురదృష్టం కొద్దీ కొన్ని మహారాష్ట్రపు నాటకపు కంపెనీలు మన ప్రాంతాలకు వచ్చాయి. పూనా, సాంగ్లీ కంపెనీలు మద్రాసుకు రాగా, ధార్వాడ కంపెనీ తెలుగు జిల్లాలలో "టూర్" చేసింది. ఏదో ఒక కొత్త దారిని విధిగా తొక్కవలసిన ఘడియలను చేరుకున్న మన రంగస్థలం ఈ కంపెనీల రాకతో వంకరదారి తొక్కింది. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఇంకా మనం సవ్యమైన మార్గానికే రాలేకపోతున్నాము.

మహారాష్ట్రపు నాటకపు కంపెనీలు మన ఇండియావే కావచ్చు; హిందీలో ఆడినా, అవి ఆడిన నాటకాలు మన పౌరాణిక గాథలకు సంబంధించినవే కావచ్చు. అయినా, అవి మనముందు పెట్టిన రంగస్థలం జాతీయమైనది కాదు. దాని దుస్తులు మొఘల్ కత్తు; దాని పాటలు పార్శీ కత్తు : దాని తెరలు వగైరా ఇంగ్లీషు కత్తు; దాని నడక ఏ కత్తూ కాదు : ఇంత సంకరమైన రంగస్థలాన్ని ఊహించడమైనా కష్టం. ఏమైతే నేమి కొత్త రంగస్థలమేదో కావాలని, కొత్త నాటకమేదో కావాలని మనకు తెలియకుండానే కూడా ఒక తీవ్రావేదన పడుతున్న సమయంలో, ఆ కొత్త సాధనకు ఏమి చెయ్యాలో, ఎటు వెళ్లాలో తెలియక సందిగ్ధావస్థలో పడివున్నప్పుడు సాంగ్లీ, ధార్వాడ కంపెనీలు వచ్చాయి. తెచ్చింది సంకరపు సరుకైనా దానితో కళ్లు జిగేలుమనేటట్టు చేశాయి. దానితో మహామేరువు దొరికినట్లే తెలుగుదేశ మంతా ఒక్కసారి ఉద్రూతలూగిపోయింది. అటు బళ్ళారినుంచి ఇటు బరంపురం వరకు ఎందరో కొత్త నాటకకర్తలు వెలిశారు; ఎన్నో కొత్త నాటక సంఘాలు బయల్దేరాయి. ధార్వాడ కంపెనీ కోసం వేయబడిన "పెండాల్"ను పీకివెయ్యకముందే దానిలో ఏవైనా నాటకాలను ఆడించాలనే పట్టుదలతో శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు శ్రీహర్షుని రత్నావళిని, షేక్ స్పియర్ "కామెడీ ఆఫ్ ఎర్రర్స్"ను చకచక తర్జుమా చేశారు. అనువాదాల రూపంలోనో, స్వతంత్రంగానో కొత్త నాటకాలు వచ్చే వరకు ఆగలేక కొందరు హిందీలోనే నాటకాలను ఆడ నారంభించారు. కొత్త రంగస్థలం అంటే, కొత్త నాటకం అంటే చమ్ కీ కోట్లు, మఖమల్ బూట్లు, పార్శీ మట్లు, వైర్ వర్కు మాత్రమే అనుకొని ఈ సరుకు దిగుమతికోసం బొంబాయికి పరుగులు, ఉరుకులు తీశారు. వీణ, తంబుర, మద్దెల, తాళాలు మొదలైనవన్నీ ఒక మూల పారవేసి, హార్మోనియం, తబలాల కోసం ఎగబడ్డారు. రంగు బనియనులకు, సిల్కు మేజోళ్లకు గిరాకీ ఎక్కువైపోయింది. ఈ సరంజామా, ఈ హంగామా కొత్త రంగస్థలం కాదని, ఇది కొత్త నాటకం కాదని ఆ రోజులలో గుర్తించిన మహామహుడొక్కడే. ఆయన మహాకవి శ్రీ గురజాడ అప్పారావు పంతులు. నడచినదారి సరైనది కాకపోయినా, 1880లో ప్రారంభమైన నూతన రంగస్థలోద్యమం, నూతన నాటకోద్యమం ఎవరో కొందరు వ్యక్తులకు సంబంధించినట్టిది కాదు; అది మన జాతికి జాతినే కదిలించింది.

ఇందువల్లనే శ్రీయుతులు కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, వేదం వేంకటరాయశాస్త్రి, ధర్మవరం కృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, తిరుపతి వేంకటకవులు, పానుగంటి లక్ష్మీ నరసింహం, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కాళ్లకూరి నారాయణరావు మొదలైన సుప్రసిద్ధులందరు నాటక రచన విషయమై శ్రద్ధ వహించారు; లేదా, నాటకరచన ద్వారా ప్రసిద్ధులైనారు. ఇంతేకాదు, 1880లో ప్రారంభమైంది ఒక మహోద్యమం కనుకనే శ్రీయుతులు కొండా వెంకటప్పయ్య, కోపల్లె హనుమంతరావు, టంగుటూరి ప్రకాశం, కాశీనాధుని నాగేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, అయ్యదేవర కాళేశ్వరరావు మొదలైన ప్రతిభావంతులందరు తమ యౌవనదశలో రంగు పూసుకుని, రంగస్థల మెక్కడం జరిగింది. ఒక జాతిని జాతినే కదిలించివేసిన ఈ మహోద్యమం సక్రమమైన మార్గాన్నే నడిస్తే, ఏనాడో తెలుగు నాటకానికి ప్రపంచ నాటక వాఙ్మయంలో స్థానం లభించివుండేదేమో! "ప్రపంచ నాటక వాఙ్మయంలో తెలుగు నాటకానికి స్థానం" అంటే, ఇదేమీ పోరాని ఆశకు పోవడం కాదు. ఐర్లెండు మన తెలుగుదేశం కంటే పెద్దదా? నార్వే పెద్దదా? ఈ రెండు దేశాలలోను మన వీధి నాటకాలకు మించిన నాటకాలు 1880వ సంవత్సరానికి పూర్వం లేవు. అయినా, ఈ రెండు దేశాల నాటకాలకు ఈనాడు ప్రపంచ నాటక వాఙ్మయంలో స్థానం వున్నది. ఈ దేశాలలో వలె మన తెలుగు దేశంలో కూడా నడవవలసిన పంథాలో నాటకోద్యమం నడిచి వుంటే, మన తెలుగు నాటకాలకు కూడా ఐరిష్, నార్వేజియన్ నాటకాలకు లభించిన స్థానమే లభించడానికి అభ్యంతరం ఏమి వుండేది?

1883లో ప్రభవించిన వెంటనే మన నాటకోద్యమం వక్రమార్గాన పడిపోవడానికి కారణం ఒక జాతి సంస్కృతి, దాని సంప్రదాయాలకు, దాని ఆర్థిక, సాంఘిక, రాయుడి పందు, ఏదైనా ఒక సమయానికి ఆ వ్యవస్థలు పొందిన

పరిణామాలకు, అప్పటికి ఇతర సాహిత్య విభాగాలు వచ్చిన స్థాయికి, కుప్తంగా చెప్పాలంటే, ఒక జాతి జీవిత క్రమానికి దార స్వరూపం, దాని నాటక స్వరూపం కట్టుపడివుంటాయని గుర్తించక పోవడమే. ఉన్నంత కలిగిన ఒక మహాది - శ్రీ గురజాడ అప్పారావు - ఒక మహాపాట్న - కన్యాశల్యప్రాయం వ్రాశాడు. అయితే, ఆయన ప్రతిభ సంపూర్ణ వికాసం పొందడానికి ఈ వాతావరణం లేకపాణంది. అందువల్లనే ఆయన ఒక్కనాటకంతోనే సరిపుచ్చాడు. ఆ పాటలు కూడా పదేపదే ప్రయోగండా లోపాలు తెందుకు, సవరించుకోవడానికి వీలు లేదు కొంతవరకు నిర్మాణ సౌష్టవం కొరవడినదై పోయింది.

కొత్త రంగస్థలం లేనిదే కొత్త నాటకం లేదని నేను అవడమే కాదు, ప్రపంచ రంగస్థల మంత్రకారుడు,, ప్రపంచ నాటక చరిత్రకారుడు ప్రొఫెసర్ అలర్ డైస్ నికాల్ కూడా ఇదే మాట అంటున్నాడు. "వరల్డ్ డ్రామా అనే మహద్గ్రంథంలో ఆయన ఈ విషయమై చెప్పిన మాటలివి:

> "అన్ని కాలాలకు ఒకే విధమైన నాటక సంభాషణ సరిపడనట్టే, అన్ని కాలాలు ఒకే విధమైన రంగస్థలంతో సంతృప్తి పడలేవు. దాదాపు అన్ని సందర్భాలలోనూ ఏదో ఒక కొత్త రంగస్థలం ఏర్మాణం తర్వాతే, లేదా, వటులకు ప్రేక్షకులకు ఏదో ఒక కొత్త సంబంధం కూర్చబడిన తర్వాతే మహా నాటకకర్తలు తలయెత్తినారవడం కూడా గమనారమైన విషయమే. గ్రీకులకు సంబంధించినంతవరకు డయునిస రంగస్థలం వారి అభిరుచులకు, వారి అవసరాలకు సరిగా తగిపోయినట్టిది. ఈ రంగస్థలం రినైజాన్స్ యుగధర్మానికి ఉపయుక్తమయ్యేదికాదు. గ్రీకు రంగస్థలం ద్వారా గాని ఎలిజబెతన్ రంగస్థలం ద్వారా గాని, ఆడ్సెస్ తన మహానాటకాలను లోకానికి ప్రసాదించగలిగి వుండేవాడు కాదు. ఇందువల్ల ఏదైనా ఒక జాతిలో నాటకరచనా ప్రతిభ పూర్తి వికాసాన్ని పొందుతుంటే అది తన అవసరాలకు సరిపడిన, అంతవరకు పూర్తిగా వినియోగంలోకి రాని, ఒక కొత్త రంగస్థలాన్ని కల్పించుకొన గలిగిందని మనం సర్వసాధారణంగా తీర్మానించుకోవచ్చు. ఇట్టి తీర్మానం దాదాపు ప్రతిసారి సమంజసమైనదే కాగలదు కూడా."

నా మాటలను మీరు పాటించినా, పాటించక పోయినా, ప్రొఫెసర్ ఆల డైస్ నికాల్ మాటలకైనా పిలువనివ్వాలి. విలువ నిచ్చి, మన జీవిత క్రమంతో అవినాభావ సంబంధంగల రంగస్థలాన్ని నిర్మించుకొన లేకపోయినందునే కొత్త నాటకాలకై, మహానాటకాలకై, మనం చేస్తున్న కృషి నేల విడిచిన పాము అయిపోతున్నదని గుర్తించాలి.

1880 నుంచి ఉగాది వరకు మనకు కొత్త రంగస్థలమే ఏర్పడలేదంటే, ఈ మధ్యకాలంలో ఎన్ని నాటకాలు రాలేదు? ఎన్ని రక్తి కట్టలేదు? ఇదంతా ఎలా సాధ్యపడింది?" అని ప్రశ్నించగల వారికి ఒక్కటే నా మనవి. మహానాటకం, బొత్తిగా అసమర్థులైన వారి చేతిలో పడితే తప్ప, తప్పక రక్తికడుతుంది, అయితే, రక్తికట్టే ప్రతి నాటకం మహానాటకం కాదు. ఇంతే అయితే, ప్రపంచం మొత్తంమీద మహా నాటక కర్తలు ఏ పాతికమందో కావడం దేనికి? కొన్ని వందల మందే - కాదు, వేలమందే - అయ్యేవారు.

మన నాటకాలలో చాలా రక్తికట్టినవంటే, అది చాలా వరకు నటుల పస వల్లనేకాని, నాటకాల పసవల్ల కాదు. నిజానికి పస తక్కువ నాటకాలే సమర్థుడైన నటునికి అతని ప్రతిభావికాసానికీ, ప్రాగల్భ్య ప్రదర్శనకు ఎక్కువ అవకాశాలిస్తాయి. ఈ మాట నేనంటే, ఇది మీకు విడ్డూరంగా తోచవచ్చు. ప్రపంచ ప్రసిద్ధ నటశేఖరులలో ఒకడైన స్టానిస్లోవస్కీ - ఈయన మాస్కో ఆర్ట్ థియేటర్ సంస్థాపకు లిద్దరిలో వొకడు ఇదే మాట అన్నాడు. "మహా నటుడే మెలో డ్రామాను జయప్రదం చెయ్యగలడు, సామాన్య నటుడు మెలోడ్రామాలో నెగ్గుకు రాలేడు, దానిలో లేని ఎత్తులను, లోతులను మెలోడ్రామాలో

నటుడైనవాడు ఊహాకల్పన చేసి చూపించాలి; దానిలోని పాత్రలకు లేని జిగిని, పసను అతడే ఇవ్వాలి. ఇది సామాన్య నటులకు దుస్తరం. స్టానిస్లావస్కీ సర్టిఫికెట్ తర్వాత ఈ విషయమై మరి వాదించవలసిన పనిలేదు కనుక, మరో విషయానికి వెడతాను. గడచిన డెబ్బై సంవత్సరాలలో తెలుగులో వచ్చిన నాటకాలలో చాలా భాగం మెలోడ్రామాలే. ఇవి రక్తి కట్టింది మన మహా నటుల ప్రతిభా విశేషాలవల్లనే. శ్రీ ఈమని లక్ష్మణస్వామి, శ్రీ హరిప్రసాదరావు, శ్రీ బళ్ళారి రాఘవ, శ్రీ యడపల్లి సూర్యనారాయణ, శ్రీ వెదురుమూడి శేషగిరిరావు, శ్రీ అల్లూరి రామచంద్రారెడ్డి, శ్రీ ముంజులూరి కృష్ణారావు, శ్రీ దొరస్వామి, శ్రీ పిల్లలమర్రి సుందరరామయ్య, శ్రీ డి.వి.సుబ్బారావు, డాక్టర్ జి.వి. సుబ్బారావు, శ్రీ ఉప్పులూరి సంజీవరావు, శ్రీ పారుపల్లి సుబ్బారావు, శ్రీ స్థానం నరసింహారావు, శ్రీ మాధవపెద్ది వెంకట్రామయ్య - ఇట్టి మహానటు లెందరో పోయిన డెబ్బై సంవత్సరాలలో మన తెలుగు దేశంలో తలయెత్తారు.

ఈ మహానటులకు తగు మహా నాటకాలను కూర్చడమే తటస్థిస్తే, నటనా కౌశలానికి, ప్రతిభకు ఇప్పటికే ఇండియాలో పేరొందిన మన ఆంధ్ర నాటకరంగం ప్రపంచ ప్రఖ్యాతికే వచ్చి వుండేది కాదా?

ఇదివరలో మనకు అవసరాలకు, అభిరుచులకు తగు ఒక కొత్త నాటకరంగం లేదంటే, ఇప్పుడు, అసలు ఏ రంగస్థలమూ లేదు. ఇప్పటి పరిస్థితులను సమీక్ష చేయడం ప్రారంభిస్తే, ఇంతలో తెమలడం జరగదు. అందువల్ల మరి మూడు ముక్కలతో ముగిస్తాను.

ఆంధ్రనాటక కళోద్ధరణ జరగాలంటే, ఇందుకు ఆంధ్ర రంగస్థల నిర్మాణం జరగాలి. ఇందుకు వెంటనే జరపలసిన చర్యలు రెండు, మొదటిది: - ఆంధ్రనాటక పరిణామాలన్నింటిని సమగ్రంగా సమీక్ష చేయగల ఆంధ్రనాటక చరిత్రను వ్రాయించడం. ఇట్టి చరిత్ర ఇప్పుడు మనం ఎక్కడున్నామో తెలుపుతుంది. దీన్ని బట్టి ముందుకు మనం ఎలా సాగాలో కొంతవరకైనా అర్థమౌతుంది. పోతే, రెండవ చర్య: - ఎక్కడో ఒకచోట ఒక నాటకశాలను నిర్మించడం, ఎక్కడో ఒకచోట అనడం దేనికి? బెజవాడలో శంకుస్థాపనచేసి, అంతటితో విడిచిపుచ్చిన రాఘవ కళామందిరాన్ని పూర్తి చేయించవచ్చు. ఒక నాటకశాల నిర్మాణంతోనే ఆంధ్ర రంగస్థల సృష్టి జరగదు గాని, సరైనా దారిలో ఒక అడుగు ముందుకువేయడానికి అది ఊతనిస్తుంది. *(పరిశోధన, ద్వమాస పత్రిక. ఏప్రిల్ 1954)*

ఆంధ్ర నాటక రంగం



రసవత్తర నాటకం, సుశిక్షిత నటబృందం, కళారహస్య విదుడైన ప్రయోక్త, సర్వాంగ సుందరమైన నాట్యమందిరం, రసజ్ఞులైన సభ్యులు ఇన్నింటితో గాని నాటకం రాణించదు.

ఆంధ్రదేశంలో నటులకు లోటులేదు; నాటకసమాజాలు మాత్రం నశించాయి. ఉన్నారు కవులు అనేకంగా; ప్రదర్శనానుకూలమైన నాటిక అరుదుగా గాని కనుపించదు. గిడ్డంగులు, కొష్టాలవంటి నిర్మాణాలే తప్ప పెద్ద పట్టణాల్లో సయితం ప్రత్యేక నాట్యశాలలు లేవు. ఈ పరిస్థితిని సంస్కరించి, నాటకకళనుద్ధరించడానికే సుమారు పాతిక సంవత్సరాలుగా ఆంధ్ర,నాటక కళాపరిషత్తు పాటుబడుతున్నది.

కాని, పరిషత్తు ప్రారంభించబడిన నాటికీ నేటికి ఆంధ్ర నాటకరంగంలో చెప్పదగిన గొప్ప మార్పేదీ జరగలేదనడానికి మొన్న బందరులో సమావేశమైన పరిషత్ వార్షిక సభల అధ్యక్ష, ఆహ్వాన సంఘాధ్యక్షుల ఉపన్యాసాలే నిదర్శనాలు.

నాటకరంగం కంటె ఎన్నో రెట్లు ఎక్కువ పెట్టుబడిని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సంతరించుకొని, జనాకర్షణకు అవసరమైన ఇతర ఉపకరణాలను తోడుచేసుకొని, నాటకాల కంటే కూడా చౌకగా సినిమాలు ప్రదర్శించబడేప్పుడు నాటకరంగం తన విశిష్టతను స్థాపించుకుంటేనే తప్ప సినిమా పోటీకి తాళుకోలేదు.
కళాపరిషత్తులవంటి ఔత్సాహిక ప్రజాసంస్థలు వార్షిక సభలు, ఉపన్యాసాలు, ప్రదర్శనాల ద్వారా ఉన్నత కళాదర్శాలను, ఉత్తమ సంప్రదాయాలను ప్రోత్సహించి, ప్రజాభిరుచిని సంస్కరించడానికి మాత్రమే తోడ్పడగలవని పూర్వానుభవం ఋజువు పరుస్తున్నది.

అందుచేత, నాటకరంగోద్ధరణకు బహుముఖంగా జరగవలసిన నిర్మాణాత్మకమైన కృషి యావత్తు - నాటకశాలల నిర్మాణం, నటులకు శిక్షణాలయం, ఉత్తమ రచనలకు ప్రోత్సాహం మొదలైనవి - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక, పురపాలక సంఘాలు, విశ్వవిద్యాలయాల వంటి సంస్థల సహాయంవల్లనే నిర్వర్తించబడాలి.

భారత ప్రభుత్వం నెలకొల్పిన నాటక అకాడమీ ద్వారా, దానికి అనుబంధంగా ఏర్పడగల ఆంధ్రశాఖ మూలంగా, పరిషత్సహకారంతో ఆంధ్ర నాటకరంగం అచిరకాలంలో పునరుజ్జీవనం కాంచగలదని విశ్వసిస్తున్నాము.
పరిషత్తు అధ్యక్షులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి వక్కాణించినట్టు నాటక కళాభివృద్ధికై లోగడ శ్రీ ఎం.ఆర్. అప్పారావు అధ్యక్షతను నియమించబడిన ప్రత్యేక సంఘం నివేదికను ప్రకటించి, దాని సూచనలను వీలైనంతవరకు అమలు జరపడం ప్రభుత్వం కర్తవ్యం. (ఆంధ్రప్రభ 11-5-1964)

జీవితరంగమే కన్యాశుల్కం

కందుకూరి వీరేశలింగం మహాపురుషుడు కాగా, శ్రీ గిడుగు వెంకటరామమూర్తి మహాపండితుడు కాగా, శ్రీ గురజాడ అప్పారావులో మహాకవి, మహాపురుష లక్షణాలు కొన్ని లేకపోలేదు. వీరేశలింగంగారివలె ఆయన సంఘసేవకే తన జీవితాన్ని అంకితం చేసి వుండక పోవచ్చు. మూఢనమ్మకాలను, మూఢాచారాలను ప్రతిఘటించడానికి అహర్నిశం పనిచేసి వుండకపోవచ్చు. సత్యం కోసం, న్యాయం కోసం సమస్త ప్రపంచాన్ని ధిక్కరించి, ఒంటరిగా నిలిచిన ఘట్టాలు అప్పారావుగారి జీవితంలో తక్కువనడం కూడా నిజం కావచ్చు. అయినా, మహాపురుషులకోవకు చెందిన వాడు కాబట్టే ఆయన "మతం వేరైతేను యేమోయ్? మనసు లొకటై మనుషులుంటే, జాత మన్నది లేచి పెరిగి లోకమున రాణించునోయ్" అంటూ సర్వమానవ సౌభ్రాత్ర

సందేశమివ్వగలిగాడు. 'సొంత లాభం కొంత మానుకు, పొరుగువాడికి తోడుపడవోయ్! దేశమంటే మట్టి కాదోయ్! దేశమంటే మనుషులోయ్!" అంటూ దేశభక్తికి మహోదాత్తమైన నిర్వచన మివ్వగలిగాడు. "మంచి చెడ్డలు మనుజులందున యెంచి చూడగ రెండె కులములు: మంచి యన్నది మాల యైతే మాలనే అగుదున్" అంటూ మానవతకు మచ్చగానున్న కృత్రిమ కులవిభేదాలను నిరసించగలిగాడు. "వెనుక చూసిన కార్యమేమోయ్? మంచి గతమున కొంచెమేనోయ్! మందగించక ముందు అడుగేయ్! వెనుకపడితే వెనకెనోయ్!" అంటూ నవభారతానికి కర్తవ్యబోధ చేయగలిగాడు. ఇంతేకాదు. మహాపురుషుల సరసను నిలవగలవాడు కాబట్టే ఆయనలో "క్రొమ్మెరుంగులు" జిమ్మగల "కొత్తపాతల మేలు కలయిక" కోసం తపన కనపడుతుంది.

పోతే రామమూర్తిగారిని పోలిన ఉద్దండ పండితుడు కాకపోయినా, అప్పారావుగారి పాండితి అల్పమైంది కాదు. ఇంగ్లీషు ఆయనకు కొట్టినపిండి, విద్యార్థి దశలోనే ఆ భాషలో ఆయన వ్రాసిన కొన్ని పద్యాలు సమకాలికుల దృష్టి నాకర్షించి, వారిమన్ననకు పాత్రమైనాయి. అభిజ్ఞాన శాకుంతలాన్ని, ఇతర సంస్కృత నాటకాలను, కావ్యాలను మూలంలోనే విమర్శన దృష్టితో చదువుకొని, వాటికి విలువలు కట్టుకొనగల పాటిది ఆయన సంస్కృత భాషా పాండిత్యం. తెలుగుకు కొత్త వెలుగు గూర్చిన అప్పారావుగారి తెలుగుభాషా పాండిత్యాన్ని గురించి ప్రత్యేకించి చెప్పనక్కర లేదు. తేటమాటలలో నుంచి ఆయన తేనెలు పిండ గలిగాడు. ప్రజల భాషచేత పరభృతాల పంచమస్వరాలను పలికించ గలిగాడు.

అయితే, మహాపురుష లక్షణాలు కొరవడక పోయినా, పాండిత్యలోపం లేకపోయినా, అప్పారావుగారిని సంస్మరించగానే ఆయన మనకు మహాకవి రూపంలోనే సాక్షాత్కరిస్తూ వుంటాడు. ఆయన వ్రాసిన కవిత పట్టుమని పదిపదుల పుటలైనా కాక పోవచ్చు. ఆయన ప్రచురించిన కథలు అయిదు మాత్రమే కావచ్చు. మూడు నాటకాలను ప్రారంభించి, వాటిలో రెండింటిని అసంపూర్ణంగానే ఆయన విడిచిపెట్టి వుండవచ్చు. ఇంగ్లీషులోను, తెనుగులోను ఆయన వ్రాసిన వ్యాసాలన్నింటినీ చేర్చినా, అదొక చిరుపొత్తాన్ని మించకపోవచ్చు. అయినా, ఆయన మహాకవి.
ఎన్ని పుటలను నింపగలిగాడనికాక, ఎన్ని పుట్టకీట్లను కదలించగలిగాడని ఏ కవి విషయంలో నైనా మనం ప్రశ్నించుకోవాలి. ఎన్ని కావ్యాలను పూర్తి చేయగలిగాడనికాక, ఎన్ని గుండెలను ఎంతగా కదిలించ గలిగాడని వితర్కించుకోవాలి. ఈ దృష్టినుంచి చూస్తే, అప్పారావుగారు నిస్సందేహంగా మహాకవి. కొద్దిగానే వ్రాసినా, ఆ వ్రాసినదానిలో కూడా ఎగుడుదిగుడులున్నా అనేక సాహిత్య శాఖలలో విప్లవాత్మకమైన పరివర్తనాలను సాధించిన ఘనత ఆధునిక యుగంలో ముమ్మాటికీ శ్రీ గురజాడ అప్పారావుగారిదే!

పెద్దకళ్ళతో, కుదిరక గల ముక్కుతో, వెడల్పు నుదురుతో, కోలముఖానికి నిండుదనమిచ్చే గుబురు మీసాలతో అప్పారావుగారు తమ ఫోటోలలో అసాధారణ వ్యక్తిగా కనిపిస్తారు గాని, ఆబాల్యంగా ఆయన అర్భకుడు. ముప్పై మూడోయేట ఆయన తూకం 78 పౌనులు మాత్రం. ఎన్నడూ 85 పౌనులను మించి ఆయన తూకం పెరగలేదు. "విపరీతమైన బడలిక, ఆయాసం నాకు బాల్యంనుంచీ వున్నవే" అని ఆయన వ్రాసుకున్నాడు. "ఎప్పుడూ పక్కమీద అలా వాలి, విశ్రాంతి తీసుకోవాలనిపించేది" అని తానై చెప్పుకున్నాడు. జీర్ణకోశానికి, నరాలకు సంబంధించిన రుగ్మతలు చిన్నతనంలో వెంటబడి, ఆయనను పీల్చి పిప్పిచేశాయి. గట్టిగా వీచితే గాలికి ఎగిరిపోయేటంత బక్కపలచగా ఆయన వుండేవాడట. "గాలి వొంటికి తగలకుండా గొడుగును అడ్డం పెట్టు కుంటూ వుంటాను" అని ఆయనొక సందర్భంలో చెప్పినా, గాలికి జడిసి రాత్రిపూట కూడా గొడుగు వేసు కుంటానని తానై బయట పెట్టలేదు. శీతోష్ణస్థితుల కనుగుణంగా ఒకటి రెండు శాలువలు, తలపాగా, కోటూ ధరించడం ఆయనకు

పరిపాటిగా వుండేది. ఏ ఉదకమండలానికో వెడితే, జుబ్బా మీద జుబ్బా, కోటుమీద కోటు తగిలిస్తూ వుండేవారుకూడా. వీరేశలింగంగారి ఆరోగ్యమైనా అంతంతమాత్రమే. కానీ, ఆయన కంటె కూడా అప్పారావుగారే అన్ని విధాలా అర్భకులని చెప్పాలి. అయినా, ఆయనలో ఆలోచనలెన్నో - అగ్నిపర్వతంలో , లావావలె - కళపెళ ఉడుకుతుండేవి. ఇందుకు కారణం ఆయన ప్రేమికుడు కావడమే. కొందరు అధునాతన కవుల వలె ఆయన ప్రేమించింది భవిష్యత్తునుకాదు. తన కాలంలో, తనను పరివేష్ఠించి వున్న జీవితాన్ని, దాని నిత్యనూతన విలాసాలనే ఆయన మనసారా ప్రేమించాడు. కూర్చుంటే లేవలేని, లేస్తే కూర్చోలేని స్థితిలో బ్రతుకును వెళ్ళమార్చు కొనవలసినవాడైనా బ్రతుకు ఆయనకు భారంగా కనబడలేదు. నిస్సారమైందిగానూ తోచలేదు. అడుగడుగున దానిలో కొత్త అందాలే ఆయనకు గోచరించాయి; ఎటుతిరిగినా, కొత్త వెలుగులే పొడగట్టాయి. రోజులు ఆయనకు అర్థరహితంకావు. పరస్పర ప్రతిధ్వనులుకావు; ప్రతి ప్రభాతావాతంతోనూ ఒక కొత్త గీతాన్నో, గేయాన్నో వినిపించే కిన్నరకన్యలవి. ప్రజ ఆయనకు మెదడు లేని గొర్రెలమందకాదు. ఒక్కొక్క వ్యక్తిలో ఒక్కొక్క విశ్వమే ఆయనకు సాక్షాత్కార మౌతుండేది. అందువల్లనే ఆయన "జీవితంలో ఎంత వైవిధ్యం వుంది! ఎంతటి తీవ్రగమనం వుంది! నేటి జీవితం పుష్కలమైన, అనంతమైన గాథలతో నిండి వుంది" అని ఒక లేఖలో వ్రాయగలిగారు; "అయినా, దానిని (బ్రతుకులోని వైవిధ్యాన్ని, దాని గమన తీవ్రతను) మన రచయితలు దర్శించరు" అని ఆయన వాపోవ గలిగాడు.

సరిగా శ్రీ గురజాడ అప్పారావుగారిని అర్థం చేసుకోగల వారికి ఆయన సంఘ సంస్కరణాభిలాషతోనో, వ్యావహారిక భాషావాదంతోనో ప్రేరేపితుడైన కవి కానేవాడు; జీవచ్ఛక్తులచే, వాటి వైవిధ్యంచే, వాటి విద్యుద్గమనంచే, వాటి విలాసాలచే ప్రేరేపించబడిన మహాకవి ఆయన. సంఘసంస్కరణను ఆయన కోరకపోలేదు. అందుకు సారస్వతాన్ని ఒక సాధనంగా చేసుకోవాలని అభిలషించకపోనూ లేదు. కాని ప్రచారసాధనంగా చేయదలచుకున్న రచనలో సయితం తన ఇంద్రజాల మహేంద్రజాల విద్యలన్నింటితోను జగన్మోహన రూపంతో తరలివచ్చి జీవితమే కొలువుతీర్చేది.

అందువల్లనే "కన్యాశుల్కం"లో సంఘ సంస్కరణ ప్రచారం ఎక్కడ జరిగిందన్న ప్రశ్న; అందువల్లనే "కొండుభొట్టీయ" మేమి, "బిల్హణీయ" మేమి సంఘ సంస్కరణోద్యమానికి ఎంతవరకు తోడ్పడగలవన్న సందేహం.

కలం పట్టగానే జీవితం తప్ప అన్యమేదీ కళ్ళకు కట్టేది కాదు గనకనే శ్రీ అప్పారావుగారి "కన్యాశుల్క" నాటకంలో పొందిక తక్కువ. నాటకశిల్పాన్ని గురించి ఆయనకు తెలియని విషయాలు తెలుసుకోదగినవే కావు. అయినా, "కన్యాశుల్కం"లోని ముఖ్యమైనలోపం నాటకశిల్పం తక్కువ కావడమే! దానిలో ఏడు అంకాలున్నాయి; లెక్కలేనన్ని రంగాలున్నాయి; 29 పాత్రలున్నాయి; దాన్ని పూర్తిగా ఆడాలంటే ఒక రాత్రి చాలదేమో! నాటకాంతంలో మిస్టర్ గిరీశం నోట వచ్చేమాట "డామిట్! కథ అడ్డంగా తిరిగింది" మొత్తం నాటకానికే వర్తిస్తుందని చెప్పవచ్చు. నిజానికి తనకు ఎదురుతిరిగి, నాటకం తన చిత్తం వచ్చిన రూపాన్ని తాను ధరించడాన్ని చూడగా కలిగిన అసంతృప్త గిరీశం నోటి ద్వారా అప్పారావుగారిచేత ఈమాట అనిపించిందేమో! ఏమైనా, జీవితాని కుండే చిలువలు, పలవలే "కన్యాశుల్కం"లో వున్నాయి. దానిలోవలె దీనిలో కూడా పొందిక తక్కువ. "కన్యాశుల్కం"లో ఇతర లోపాలుంటే, అవికూడా మానవ జీవితంలో వుండే లోపాలే. కాని, ఎన్ని లోపాలున్నా, జీవితం వలె నిత్యనూతనమై అది మనలను ఆకర్షిస్తుంది; అలరిస్తుంది; అనిర్వచనీయమైన సమ్మోహన శక్తితో మనలను వశవర్తులను చేసుకొంటుంది. దానిలోని పాత్రలు (అవి గిరీశం, వెంకటేశం, అగ్నిహోత్రావధానులు,

బుచ్చమ్మ, మధురవాణివంటి ప్రధాన పాత్రలైనా, లేక పూజారి గవరయ్య, ఈ పోలిశెట్టి, హెడ్ కానిస్టేబుల్ వంటి అప్రధాన పాత్రలైనా) రంగస్థలంలోని పాత్రలుగా ఏ ఘట్టంలోను పొరపాటుగానైనా తోచవు. జీవితరంగంలోని వ్యక్తులుగా అవి మనలను పలకరిస్తాయి. మనతో మాట్లాడతాయి; మనలను కవ్విస్తాయి; నవ్విస్తాయి. సాంఘిక ప్రయోజనాన్ని కోరి వీరేశలింగం పంతులుగారు "అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనము", "విచిత్ర వివాహ ప్రహసనము", "మహాబధిర ప్రహసనము" అంటూ ఎన్నింటినో వ్రాశారు. ప్రహసనాలన్నీ చేరి "కన్యాశుల్కా"నికి కనీసం నాలుగురెట్లు వున్నాయి. అయినా, వాటిలో వచ్చే పాత్రలేవో ఎందరు చెప్పగలరు? శిల్పం తక్కువైనా "కన్యాశుల్క"మే నేటికీ మనకున్న నాటకాలలో ఉత్తమోత్తమమైనదిగా చెల్లడం - జీవితానికున్న చేవ దానికున్నందునే; జీవంతో తొణికిస లాడుతున్న పాత్రలు దానిలో వున్నందునే.

శ్రీ అప్పారావుగారు భాషా పండితులైనా, భాషా పరిణామ శాస్త్రాన్ని పరిశీలించినవారైనా, కేవలం భాషాభిమానమే (శ్రీ గిడుగు రామమూర్తి గారి విషయంలో జరిగినట్టు) ఆయనను వ్యావహారిక భాషావాదిగా చేయలేదు. జీవితంపై ప్రేమ ఆయనను కావ్య వస్తువుకోసం ప్రజల మధ్యకు పంపింది; అదే ఆయనను ప్రజా భాషాభిమానిగా మార్చింది. రచయితను ప్రజలకు దూరం చేసేది కాబట్టే, గ్రాంథిక భాషపై ఆయనకంత మంట. ఆ మంటతోనే 'సంకెళ్ళను ప్రేమించేవారిని దాన్ని (గ్రాంథిక భాషను) ప్రేమించనివ్వండి. కాని నాకు మాత్రం ఏ భాషతో మన సుఖదుఃఖాలను మనం జంకు లేకుండా వ్యక్తపరుస్తామో, ఏ భాషను నేను తల్లి ఒడిలో నేర్చుకున్నానో, ఆ సజీవమైన భాషే కావాలి." అని ఆయన అనగలిగాడు. "నాది ప్రజోద్యమం, ఎవరిని సంతృప్తి పరచడానికి దాన్ని వదులుకోలేను" అని ఉద్ఘాటించగలిగాడు. జీవితాన్ని గురించి చివరిమాట చెప్పడానికి వీలు కానట్టే, జీవితాన్ని ప్రియంగా ప్రేమించి దాన్ని కీర్తించిన అప్పారాయ మహాకవిని గురించి కూడా చివరిమాట చెప్పలేము. కాని, ఒక్కటి మాత్రం నిజం. కన్యాశుల్కం ఈ నాడొక సాంఘిక దురాచారంకాదు. వ్యావహారిక భాషావాదం ప్రజోద్యమంగా మిగలని కాలమొకటి రావచ్చు. అయినా, జీవితంపై మనకు ప్రేమ నిలిచినంత వఱకు అప్పారావుగారి కృతులు చెక్కు చెదరకుండా నిలుస్తాయి.

("పరిశోధన" (11) ద్విమాస పత్రిక - డిశంబరు 1955, జనవరి 1956)

కళాపోషణ

ప్రాచీన భారత శిల్పకళా వైభవాన్ని ప్రస్తుతించే సందర్భంలో పెక్కుమంది ఒక ముఖ్య విషయాన్ని విస్మరించడం కద్దు. అజంతా చిత్రాలేమి, అమరావతి శిల్పాలేమి సమకాలిక కళగా చెల్లిన సమయమొకటి కలదనేదే ఆ ముఖ్య విషయం.

గతించిన ఆ కాలం వారు ఆ కాలపు కళాకారులను ఆహ్వానించారు; ఆదరించారు; ప్రోత్సహించారు; పోషించారు; వీటినన్నింటినీ మించి, గౌరవించారు. అందువల్లనే నాటి శిల్పులు, స్థపతులు, చిత్రకారులు, ఇతర కళాకారులు నేటికి కూడా సమస్త ప్రపంచాన్నీ సమ్మోహితం చేయగలుగుతున్న అపూర్వ కళాఖండాలను సృష్టించగలిగారు. ఉపాధి లేనిదే ఉపజ్ఞ వికసించదు; ప్రోత్సాహం లేనిదే ప్రతిభ పరాకాష్ఠను పొందలేదు. ఈ నగ్నసత్యాన్ని సమకాలిక భారత కళా వైభవాన్ని ప్రస్తుతించుకొనడంతోనే మనం సంతృప్తి చెందవలసి వస్తున్నది. అమరావతి శిల్పులు నేడు లేకపోవచ్చు; కాని, ఆ శిల్ప నైపుణి దేశంలో చచ్చిపోయిందని అనలేము. అజంతా చిత్రకారులు కాలగర్భాన కలిసిపోయి ఉండవచ్చు. కాని, ఆ చిత్రకళా వైదగ్యం దేశం నుంచి మటుమాయమై పోయిందని అనలేము. ఆ ప్రతిభ నేటికీ మిగిలి ఉన్నది. అయితే, దోహదం లేక కృశిస్తున్నది; నశిస్తున్నది.

పోషించగల నాధుడుంటే, అది తిరిగి చిగుర్చుతుంది; కొనలు సాగి, ననలు తొడిగి, దేశాన్నే పూలతోటగా మార్చివేస్తుంది. కళాపోషణకు, నేడు రాజులులేని మాట నిజం. అయితే, పోయినవారు రాజులే కాని, ప్రభుత కాదు, కాబట్టి ప్రభుతను సంక్రమింప జేసుకొన్న ప్రజలే, ప్రజాప్రభుత్వాలే ఇప్పుడిక కళాపోషణ బాధ్యతను వహించాలి.

ఇతర బాధ్యతలు అనేకం తనపై ఉన్నా మన ప్రధాని పండిట్ నెహ్రూ కళాకారుల పోషణ విషయంలో ప్రజాప్రభుత్వాల ఈ విధ్యుక్త ధర్మాన్ని గుర్తు పెట్టుకుని, ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక సందేశాన్ని పంపించడం హర్షణీయం. ప్రభుత్వాలు తాము నిర్మించే పెద్ద పెద్ద భవనాలను అలంకరించడంలో వీలైనంతవరకు భారతీయ చిత్రకారులను వినియోగించాలని ఆయన సూచించాడు. భవనాల నిర్మాణానికి కాగల వ్యయంలో వాటిని శోభాయమానం చేయడానికి కాగల ఖర్చు ఒక వీసమైనాకాదని ఆయన విశదపరిచాడు. బహు పరిమితమైన అట్టి అదనపు ఖర్చుకు సంకోచించరాదని ఆయన హెచ్చరించాడు. ఆయన ఈ సందేశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ ఆచరణలో పెట్టగలవనే విశ్వసిస్తున్నాము.

పాశ్చాత్య దేశాలలో ఏ పెద్ద భవనాన్ని చూచినా, దానిలో కొన్ని చిత్రాలో, శిల్పాలో కనబడతాయి. జెనీవాలో నానాజాతి సమితి భవనంలోని సభామందిరంలో గొప్ప కుడ్యచిత్రాలున్నాయి; అక్కడనే అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రాంగణంలో అద్భుత శిల్పాలున్నాయి. కామన్సు సభా భవనంలో (లండన్) ఒక పెద్ద మ్యూజియంలోవలె చిత్రాలు, శిల్పాలు విశేషంగా ఉన్నాయి. ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన షెల్డోనియన్ థియేటర్ లోను - దీన్ని ప్రత్యేక స్నాతకోత్సవాలకు వినియోగిస్తారు - దానికి చెందిన కొన్ని కళాశాలలలోను అనేక ఉత్తమ చిత్రాలను చూడవచ్చు. రోమ్, పారిస్ నగర వీధులలో నేమి, అక్కడి ఉద్యానవనాలలో నేమి జీవకళ ఉట్టిపడుతున్న శిల్పాలు అసంఖ్యాకం. మన పబ్లిక్ బిల్డింగులు, పార్కులు వగైరాలన్నింటిని కూడా ఇదే విధంగా కళాక్షేత్రాలుగా మార్చుకొనడానికి ఇకనైనా గట్టి ప్రయత్నం జరగాలి.

కేవలం ప్రభుత్వాలే కాక, ప్రజాసంస్థలు కూడా కళాపోషణను తమ విద్యుక్త ధర్మాలలో ముఖ్యమైన దాన్నిగా భావించాలి. ప్రత్యేకించి దేవాలయాలు, చర్చిలు, మసీదులు ఈ విషయంలో తగు శ్రద్ధ వహించాలి. అమరావతి, నాగార్జునకొండ, అజంతా, ఎల్లోరా, ఎలిఫెంటా మొదలైనవన్నీ నేడు శిథిల ప్రదేశాలైనా, ఒకనాడు ఆరాధన మందిరాలే! నిజానికి ఇండియా, ఇండో-చైనా. ఇండోనీసియా మొదలగు ఆసియా దేశాలలోనేమి, గ్రీసు, ఇటలీ మొదలైన పాశ్చాత్య దేశాలలోనేమి శిల్ప, చిత్రకళలు మత సంస్థల ప్రాపులోనే మహోచ్ఛస్థితికి పోగలిగాయి! కలవారుకూడా కళాపోషణ తమ పరమ ధర్మంగా భావించడం అత్యవసరం. లక్ష రూపాయలతో గృహ నిర్మాణాన్ని చేసి, దానిలో నూరు రూపాయలకు ఒక "ఒరిజినల్ పెయింటింగ్" ఖరీదు చేసి పెట్టడానికి వెనుదీసేవారిని ఎందరినో చూస్తాము. తాము తమ గోడలకు తగిలించే చౌకబారు కేలండర్ బొమ్మలు తమ సంస్కార దారిద్ర్యాన్ని లోకానికి వేనోళ్ళ చాటుతాయని వీరికి తోచకపోవడం ఎంతైనా శోచనీయం.

అన్ని సంస్థల నుంచి, అందరు వ్యక్తుల నుంచి మన కళలకు లభించవలసిన పోషణ పూర్తిగా లభించిననాడు మన కళా సంపత్తి ఏవో కొన్ని ప్రాచీన శిథిల ప్రాంతాలకు పరిమితం కాక, వాడవాడకు, వీధి వీధికి - దిష్టి పిడతలను పోలిన సిమ్మెంట్ బొమ్మల రూపంలో కాక . అమరావతి రీతులలోను, అజంతా తీరులలోను వ్యాపిస్తుంది!

(ఆంధ్రప్రభ 28-9-1954)

సంగీతం: సంప్రదాయం

రేడియో, గ్రామఫోన్, సినిమా మొదలైన ఆధునిక యంత్రోపకరణాల ద్వారా సంగీతం దేశం మూలమూలలకూ పాకింది. వారు వీరనే భేదం లేకుండా పండిత పామరజనానికి అంతకూ అందుబాటులోకి వచ్చింది. సంగీత సాధకుల కిప్పుడు వెనుకటి కంటె సంపాదన అధికమైంది. సంగీత సభల ప్రోత్సాహం ఎక్కువైంది.

కాని, వ్యాప్తిలో, ఆర్జనలో ఈ కళకు కలిగిన లాభాన్ని గుణంలో, ప్రాశస్త్యంలో వాటిల్లుతున్న నష్టం కొమ్ముల మీద కొట్టుతున్నది. కళకు ప్రధానమైన ప్రమాణం, సంప్రదాయం, ఔచిత్యం కుంటుపడుతున్నవి. అభిరుచి సన్నగిల్లుతున్నది. సంగీత కళ కిది ఔపకారికమా? దీనిని కళాభ్యుదయ మనవచ్చునా? కళాభిజ్ఞులనేకులకు ప్రస్తుతం ఈ జిజ్ఞాస పొడముతున్నది.

నిన్నా, నేడూ చెన్నపురిలో ప్రారంభమైన సంగీతసభలలో పాల్గొన్న వక్తలందరూ తమ ఉపన్యాసాలలో ఇంచుమించు ఇదే భావాన్ని వెల్లడించి, సంగీతకళకు ప్రస్తుతం కలిగింది వాపే గాని బలుపు కాదన్న అభిప్రాయం వైపుకు మొగ్గినారు.

కళ విషయంలో ప్రజాభిరుచిని సంస్కరించి పదును పెట్టడానికి మ్యూజిక్ అకాడమీ వంటి పరిషత్తులు పూనుకోవాలి. విధి నిషే పూర్వకమైన శాస్త్ర సిద్ధాంతం చేతనేమి, అనుభవ వేద్యమైన ఉత్తమ ప్రదర్శనం చేతనేమి ప్రామాణిక కళా ప్రచారాన్ని ప్రోత్సహించాలి. దేశం అంతటా ఇలాంటి సంస్థలు శాఖోపశాఖలుగా స్థాపితమై, శ్రోతల అభిరుచిని, తరతమ జ్ఞానాన్ని అభివృద్ధి చెందించడమే ఇందుకు ముఖ్య సాధనం.

త్యాగబ్రహ్మ గానసభను ఉపక్రమించిన ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి.వి. రాజమన్నారు, మ్యూజిక్ అకాడమీ, ఫైన్ ఆర్ట్స్ సొసైటీ మహాసభల అధ్యక్షులు శ్రీ కరూర్ చిన్న స్వామి అయ్యర్, పాపనాశం శివన్ అందరూ శాస్త్ర విహిత సంగీత ప్రాశస్త్యాన్ని గురించీ, కర్ణాటక సంప్రదాయ సంరక్షణను గురించి ఏకాభిప్రాయాన్ని వెల్లడించారు. త్యాగరాజ, దీక్షితాది వాగ్గేయకారుల కృతులను యథాతథంగా, ఆనుపూర్వికంగా పాడవలసిందేగాని, వానికి కూర్పులుగాని, మార్పులుగాని ఏమాత్రం కూడదనీ, ఆధునిక పాశ్చాత్య పండితులు కూడా ఈ సంప్రదాయ పోషణం విషయంలో పట్టుదల చూపుతారనీ శ్రీ రాజమన్నారు చేసిన హెచ్చరిక ఎల్లరూ గమనించదగింది.

కర్ణాటక సంగీతానికే గాదు, ఔత్తరాహ సంప్రదాయానికేగాదు, భారతీయ సంగీత కళ కంతటికి ప్రాణప్రదమైన రాగాలాపన విషయంలో కర్ణాటకులు చూపుతున్న ఉపేక్ష కళాభివృద్ధికి తోడుపడదు. ఈ విషయంలో ఔత్తరాహులకంటె దాక్షిణాత్యులే పూర్వ సంప్రదాయానికి వైదొలగినట్టు ఎంచవచ్చు. గాత్ర సాధనలో నేమి, స్వరశుద్ధతలోనేమి, విలంబిత రాగాలాపనలోనేమి మన కర్ణాటక విద్వాంసులు హిందుస్థానీ గవయ్యాల నాదర్శంగా గ్రహించడంలో అపవజ్ఞత ఏ మాత్రం ఉండనక్కరలేదు.

"గమక ప్రధానమైన కర్ణాటక (భారతీయమే అనవచ్చు - సం.) సంగీతానికి పాశ్చాత్య సంగీతానికి అనువైన 'హార్మనీ'ని, 'ఆర్కెస్ట్రా' (వివిధ వాద్య సమ్మేళన) పద్ధతిని జతపరచ యత్నించడం కర్ణాటక సంగీతపు వ్యక్తిత్వాన్ని చంపడమే"నని శ్రీ చిన్నస్వామి అయ్యరు చేసిన సూచనను మేము అంగీకరిస్తున్నాము.

కాని, కర్ణాటక, హిందూస్థానీ సంగీతాలు రెండూ, రెండు ప్రత్యేకమైన, భిన్నమైన కోవలనీ, ఒకదాని నుంచి రెండవది గ్రహించదగింది ఏమీ ఉండదనే మతంతో ఏకీభవించడం అంత సులభం కాదు. ప్రత్యేక సంప్రదాయాలను పోషించమనడం వేరు. కొన్ని శతాబ్దాల క్రితం వరకు ఒకే శాస్త్ర సంప్రదాయానికి కట్టుబడి ఉండి, కాలక్రమాన వేర్వేరుగా వికాసమందిన రెండు శాఖలలో ఒక దానిని విజాతీయమన్నట్టు పరిగణించడం వేరు.

మన (కర్ణాటక) సంగీతం అమూల్య సంపద వంటిది. మెరుగు పెట్టిన ఓటి పాత్రకాదు. శ్రావ్యమైన ఉత్తర దేశపు పాటలకు అలవడిన చెవులు మన సంగీతంలోని అచ్చపు బంగారాన్ని ఆనందించలేకపోవచ్చు. ఇది గొప్ప ప్రమాదమని శ్రీ పాపనాశం శివన్ వెల్లడించిన అభిప్రాయ నిజోద్దేశం మన శ్రోతలలో స్వీయ సంప్రదాయాభిమానాన్ని ప్రోత్సహించడమా, లేక అన్య సంప్రదాయాన్ని ఆక్షేపించడమా?

శ్రావ్యత, మనోహరత, సంగీత కళకు గుణాలేగాని అవగుణాలని భావించవలసిన పనేముంది? అవి లోపించిన చోట వాటిని సమకూర్చుకొనడం వల్లనే ప్రజలను ఆ వ్యామోహంనుంచి మరలించడానికి వీలౌతుంది.

మ్యూజిక్ అకాడమి సభలో శ్రీ భావనగర్ మహారాణి చెప్పినట్టు స్థూలంగా కర్ణాటక, హిందుస్థానీ సంప్రదాయాలు రెంటికీ భేదం లేదు. కాబట్టి ఒకదాని ప్రభావం రెండవదాని మీద వ్యాపించడం సహజమే. త్యాగరాజాదులే అందుకు ప్రబలసాక్ష్యం. అయితే, తమ సంప్రదాయపు వ్యక్తిత్వం చెడకుండా ఇతర పద్ధతులను నిజ సంప్రదాయంతో మేళవించగలవారు అందరూ కారు. అందుకు అధికారం కల ప్రతిభాపూర్ణులే పూనుకోవాలి.
మైక్రోఫోను ఏర్పాటువల్ల మన సంగీత కచేరీలలో పాటకుల గాత్ర మాధుర్యం కొరవడుతున్నదని శ్రీ రాజమన్నారు అన్నమాట వాస్తవం. బృందగానం, వాద్యసంగీతం మొదలైనవాటికే తప్ప, స్వతంత్రమైన గాత్రపాటకు మైక్ ఉపయోగం ఎంత తగ్గితే అంత మంచిది.

నట విట గాయకులను అపాంకేయులుగా నిషేధించిన రోజులు గతించి, నాట్య సంగీతాది కళలకు సంఘంలో సమాదరణ ఏర్పడుతున్నందుకు కళాభిమానులు యావన్మంది సంతోషించ వలసిందే. ఈ అపకర్ష తొలగి, కళ అభ్యున్నతి గాంచడానికి సంగీత కళారాధకులు, పరిషత్సభ్యులు చేస్తున్న కృషి ప్రశంసనీయం.

(ఆంధ్రప్రభ 24-12-1950)

గానకళ

అన్నమయ్య, త్యాగయ్య, క్షేత్రయ్యలవంటి వాగ్గేయకారులను, విఖ్యాత పదకర్తలను కన్నది ఆంధ్రజాతి.

రామామాత్యుడు, సోమనాథుడు, వసంతరాయల బోలిన ప్రసిద్ధ లాక్షణికులకు జన్మభూమి ఆంధ్ర దేశం.

దక్షిణ దేశంలో సంగీత కళ నాదరించి, దాని అభివృద్ధికి విరివిగా సాయపడినవారు సయితం ఆంధ్రనాయక రాజులే.

కర్ణాటక సంగీతంలోని కీర్తనలు, పదాలు, గీతాలు, వర్ణాలు మొదలైనవి నూటికి తొంభై పాళ్ళు తేనెలొలుకు తెలుగు భాష నాశ్రయించినవే.

అయినా, నేటి తెలుగు దేశం సంగీత కళారాధనలో, సాధనలో, ఆదరణలో, అభిరుచిలో దక్షిణ దేశం కంటె ఎంతో వెనుకబడి ఉండడాన్ని కాదనలేము.

తమిళనాడులోవలె గురుశిష్య సంప్రదాయం నిరంతరాయంగా వర్ధిల్లక పోవడంగానీ, విజయనగరం ఆనంద గజపతివంటి ప్రభువుల ఆదరణ లోపించడం గానీ, కారణమేదైనా కొంత కాలంగా సంగీత కళలలో తెలుగువారిది పైచేయి మాత్రం కాదు.

అయినప్పటికి కూడా, తెలుగునాడులో సంగీతకళ ఈ మాత్రంగానైనా మన గలగడానికీ, వేళ్ళపై లెక్కించుకోవలసిన 'ద్వారం నాయుడు' వంటి కళా ప్రపూర్ణులను ఏ ఒకరిద్దరినో చూచుకొని తెలుగుజాతి హర్షించడానికి నేడు సువర్ణోత్సవం జరుపుకుంటున్న కాకినాడ సరస్వతీ గానసభను బోలిన కొలది సంస్థలవల్ల గానకళకు జరిగిన సేవలే కారణమని చెప్పవచ్చు.

1904లో రాజా కొచ్చెర్లకోట వెంకట కృష్ణరావు, శ్రీ కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తి మొదలైన రసజ్ఞులచే స్థాపించబడి, గానకళలో దిగ్దంతులనదగిన దక్షిణోత్తర విద్వత్కాండులను అనేకుల నాకర్షించి, అర్ధశతాబ్దంగా ఆంధ్ర గాయకులెందరినో ప్రోత్సహించిన ఒక కళాపీఠం సువర్ణోత్సవం జరుపుకొనడం కాకినాడ పౌరులకేగాక అఖిలాంధ్ర జాతికీ గర్వకారణమే.
నేడు మొదలు పది రోజులపాటు జరుగనున్న స్వర్ణోత్సవ కార్యక్రమాల్లో ప్రసిద్ధ విద్వాంసుల కచేరీలతో పాటు సంగీత సభలను, ఉపన్యాసాలను కూడా కార్యకర్తలు ఏర్పాటు చేయడం ముదావహం.

తెలుగు దేశంలోని సంగీత విద్వాంసులేగాక, కళాప్రియులు, కళాపోషకులందరూ పై సభా కార్యక్రమంలో పాల్గొని ఆంధ్రదేశంలో గాన కళ పునరుద్ధరణకు తగిన మార్గాలను అన్వేషించి, వాటి సాఫల్యానికి పాటుబడాలి.

మన పొరుగునున్న తమిళనాడులో ఊరూరా సంగీత సభలున్నవి. నెలకు పావలా, అర్ధ, రూపాయ చందాలతో ధనం సేకరించి సంవత్సరం పొడుగునా కచేరీలు ఏర్పాటుచేసి, శ్రోతలను తనియ జేయడంతోపాటు గాయకులను ఆదరించడానికి ఆ సభలెంతో ఉపకరిస్తున్నవి.

ఆంధ్ర దేశంలో పెద్ద పట్టణాలు సయితం గానసభలు లేనివెన్నో కలవు. ఉన్న సభలైనా తక్కువమంది సభ్యులతో, వసూలుకాని చందాలతో, 'అస్తి నాస్తి' అన్న స్థితిలోనే వూగులాడుతున్నవి. అందుచేత బస్తీగా చెప్పదగిన ప్రతి ఊరిలోనూ సంగీత సభలను నెలకొల్పడానికి, సక్రమ పద్ధతులలో వాటిని నడిపించడానికి ప్రణాళికలను తయారు చెయ్యాలి.

వివిధ స్థలాలలో ఉండే సభలన్నిటికీ కేంద్ర సంస్థగా ఒక దానిని ఏర్పరచి, తక్కిన వాటికి కేంద్ర సంస్థతో అనుబంధం కలగజెయ్యాలి.

ఈ కేంద్ర సంస్థనే మద్రాసులోని "మ్యూజిక్ అకాడమీ" వలె అఖిలాంధ్ర సంగీత పరిషత్తుగా నెలకొల్పి ఏటేటా సభలు జరపడం, సదస్సుల నేర్పరచడం, విద్వాంసులను బహూకరించడం, పత్రికలను, పుస్తకాలను ప్రచురించడం, శాస్త్ర చర్చలను కొనసాగించడం మొదలైన విధులను నిర్వర్తింపచెయ్యాలి.

బహుముఖమూ, బాధ్యతాయుతమైన ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి యాభై సంవత్సరాలుగా తెలుగుదేశపు సంగీత కళకు ఘన సేవలను సల్పిన కాకినాడ సరస్వతీ గానసభకంటె అర్హత గల సంస్థను తెలుగు దేశంలో వేలు మడిచి చూపలేము.

అట్టి పరిషత్సంస్థాపనకు సరస్వతీ గానసభ కార్యకర్తలు సంసిద్ధత కనబరచడం అభినందనీయమే. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణంతో 'మద్రాసు మ్యూజిక్ అకాడమీ' కూడా ఆంధ్రులకు మరింత దూరం కావడం చేతనూ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సంగీత కళకింకా సముచిత స్థానం లభించని హేతువు చేతనూ ఆంధ్ర ప్రభుత్వం ఈ పరిషదుద్యమానికి సర్వ విధాలా సహాయపడాలని కోరుతున్నాము. (ఆంధ్రప్రభ 5-2-1954).

భారతీయ నృత్యకళ

నాగరికతకు కళ గీటురాయి, ఏ దేశంలోనైనా నాగరికత ఎంత వరకు వికసించింది వారు, చూడాలంటే, ఆ దేశంలో వర్ధిల్లిన కళలే శరణ్యం. ప్రాచీన నాగరికత గల భారతదేశం ప్రాచీన కాలంలోనే చతుష్షష్టి కళలకు నిలయం కావడం ఆశ్చర్యం కాదు గాని, ఆ ప్రాచీన వైభవాన్ని ఇటీవల విస్మరించడమే శోచనీయం.

కాని, సాంస్కృతిక పునరుజ్జీవనంతో, స్వాతంత్ర్య భానూదయంతో భారతదేశంలో ఈ నృత్యకళ తొలగిపోతున్నది. ప్రజాజీవితంలో భారత జాతీయతను, భారతీయ సంస్కృతిని ప్రతిఫలించ జెయ్యడానికి ఎల్లెడల ప్రయత్నాలు సాగుతున్నాయి, కళోపాసకు లందరు కళల సముద్ధరణ విషయమై పూనిక చూపుతున్నారు, నవయుగానికి వైతాళికు లౌతున్నారు. కాని, వివిధ జాతీయ నాటక, నృత్యకళలకు సంబంధించి నంతవరకు, వాటిని వికసింప జెయ్యడానికి నేటి వరకు జరిగిన కృషి బహం స్వల్పం.

ప్రతిభాశాలురైన కోపాసకులు పూసుకొన్నప్పటికీ, ఈ రంగాలలో ఎక్కువ అభివృద్ధి కనబడక పోవడానికి కారణం - విఖ్యాత నర్తకుడు శ్రీ రామగోపాల్ మొన్న చెప్పినట్టు - దేశం మొత్తంపై సమగ్ర కృషి జరగకపోవడమే. దానిలో సమన్వయం తక్కువ కావడమే.

అన్ని హంగులు కలిగిన నాటక శాలలు పట్టుమని పది, పదిహేనైనా దేశంలో లేవు. ఈ అవశ్యకతను ఈ వరకే అనేక మంది గుర్తించక పోలేదు. కాని, ప్రభుత్వ సహాయ, సహకారాలు మృగ్యం కావడంవల్లనేమి, కార్యభారాన్ని పూర్తిగా నెత్తిని వేసికొని పాటుపడే నాథుడు లేకపోవడంవల్ల నేమి ఈ కొరత తీరలేదు.

ఈ నాటికి ఈ లోటు తీరగల సూచనలు కొంత వరకు కానవస్తున్నాయి. దేశంలో కనీసం మూడు జాతీయ కళామందిరాలైన నెలకొల్పడానికి ఇండియా ప్రభుత్వం సహాయపడగలదని ప్రధాని నెహ్రూ హామీ యిచ్చాడట. ఇంతేకాక, దేశంలో నృత్యకళాభిరుచి కలిగి, తదభ్యసనం చెయ్యగోరేవారి నందరినీ కూర్చి, ఈ కళాపునరుద్ధరణ మహోద్యమానికి కంకణం కడతామని శ్రీ రామగోపాల్ వంటి దీక్షాపరులు ముందుకు వస్తున్నారు కూడా.

అయితే, ముఖ్యమైన మూడు పట్టణాలలో మాత్రమే నాటకశాలలను నిర్మించి ప్రభుత్వం తృప్తి చెందరాదు. ప్రతి పట్టణంలో ఆదర్శ ప్రాయమైన ఒక్కొక్క నాటకశాల సంస్థాపన ఏనాటికైనా దాని లక్ష్యం కావాలి. శ్రీ రామగోపాల్ వంటి ఏ ఒక్క వ్యక్తి పూనుకొన్నందువల్లనో సాగేది కాదు ఈ మహాకార్యం. విఖ్యాతులైన తక్కిన నర్తకులందరు కూడా, ఆయనతో చెయ్యి కలిపి ఈ ఉద్యమాన్ని జయప్రదం చెయ్యాలి.

భారత దేశాన్ని గురించి మన రాయబారులకంటే కూడా మన నృత్య ప్రదర్శనల ద్వారా విదేశాలలో ఎక్కువ ప్రచారం చెయ్యవచ్చునని శ్రీరామగోపాల్ విశ్వాసం. దీన్ని కాదనడానికి వీలులేదు.

రష్యన్ సభ్యత ఘనతను చాటడానికి జార్ చక్రవర్తి విదేశాలలో ఎంత ధనాన్ని విరజిమ్మినా, దాని వల్ల జరగని ప్రచారం ఒక రష్యన్ నర్తకి - పావ్లోవా - నృత్య ప్రదర్శనంవల్ల జరిగింది. ఒక రష్యన్ నటుడు, నాటక ప్రయోక్త - స్టానిస్లోవస్కీ - నాటక ప్రదర్శనాల ద్వారా జరిగింది. ప్రథమ ప్రపంచ మహాసంగ్రామానికి పూర్వం పోలిష్ స్వాతంత్ర్యోద్యమాన్ని గురించి ఆదేశం రాజకీయవేత్త లందరు కలిసి చేసిన ప్రచారం ద్వారా విదేశాలలో లభించిన సానుభూతికంటె ఒక్క పోలిష్ వాగ్గేయకారుడు - పాదుర్ విస్కీ - పియానో కచ్చేరీలవల్ల ఎక్కువ సుహృద్భావం లభ్యమైంది. ఇదే విధంగా నార్వేకు ప్రపంచంలో ఎన్నిక తెచ్చినవి ఇబ్సెన్ నాటకాలే; ఐర్లెండ్ కు ప్రపంచం మన్నన కూర్చింది యేట్స్ కవిత్వమే.

లోకానికి భారతీయ సంస్కృతి విశిష్టతను చాటడానికేగాక, భారత ప్రజాకోటి జీవిత వికాసానికి కూడా మన నృత్యకళాభివృద్ధి దోహదమివ్వగలుగుతుంది. దాస్యానికి దారిద్ర్యం తోడుకాగా, మన ప్రజాబాహుళ్య జీవితం నుంచి ఆనందం విలుప్తమైంది, దానితోపాటు నృత్యం కూడా అదృశ్యమైంది. నృత్యగా నాది కళావినోదాలకు తావులేనట్టిది వెలితి బ్రతుకు. తిరిగి మన ప్రజ నిండుబ్రతుకును బ్రతకాలంటే, ఊరూరు, వాడవాడ ఏ పండగ వచ్చినా, ఏ పబ్బం వచ్చినా, నృత్యగా నాలతో ప్రతిధ్వనించాలి.

ఈ సందర్భంలో ఒక ముఖ్య విషయాన్ని విస్మరించరాదు. బహు కొద్దిమంది నృత్యగానాలలో పాల్గొనగా, హెచ్చుమంది వాటికి ఆనందించడం చాలదు. బహుళ సంఖ్యాకులు వాటిలో స్వయంగా పాల్గొనాలి. మనకు కావలసినవి బృందగానం, సమష్టినృత్యం. ఇందుకు అనుగుణంగా మన నృత్యగాన కళలను అవసరమైతే సవరించుకోవాలి.

జాతీయ ప్రభుత్వ పోషణతో, శ్రీ ఉదయశంకర్, శ్రీ రామగోపాల్, శ్రీ గోపీనాథ్, శ్రీమతి రుక్మిణి అరండేల్ మున్నగువారి కార్యోత్సాహంతో భారతీయ నృత్యకళ పూర్వ వైభవానికి తగిన నూతన వికాసాన్ని పొంది, దేశానికి, ప్రజలకు కొత్త వెలుగులు కూర్చగలదనే నమ్ముతున్నాము. *(ఆంధ్రప్రభ 24-7-1949)*

చలనచిత్ర కళ

భారతీయ చలనచిత్ర స్థితిగతుల పరిశీలనకు శ్రీ యస్.కె. పాటిల్ (బొంబాయి మేయర్) అధ్యక్షుడుగా ఈ మధ్య కేంద్రప్రభుత్వం ఒక విచారణ సంఘాన్ని నియమించింది. ఈ సంఘం మొన్ననే బొంబాయిలో తొలి సమావేశాన్ని జరిపింది.

చలనచిత్రాలు పరిశ్రమగా మన దేశంలో నిస్సందేహంగా ఇటీవల పరిపూర్ణాభివృద్ధి చెందాయి. అమెరికా తర్వాత ప్రస్తుతం ఎక్కువగా చలన చిత్ర నిర్మాణాన్ని సాగిస్తున్నది మన దేశమే. గడచిన పది, పదిహేను సంవత్సరాలలో ఫిల్ముపరిశ్రమ మన జాతీయ పరిశ్రమలలో ప్రధానమైన వాటి సరసకు చేరింది. హీనపక్షం నూరు కోటి రూపాయలైనా ఈ పరిశ్రమపై ఈనాడు పెట్టుబడిగా కలదేమో! వినోదపు పన్ను రూపంలో ఫిల్ముపరిశ్రమ ఒక్క మన మద్రాస్ ప్రభుత్వానికే సాలుకు దాదాపు కోటి రూపాయల ఆదాయాన్ని సమకూర్చుతున్నది.

పరిశ్రమగా మన చలనచిత్రాలు ఇంత త్వరలో ఇంతగా వృద్ధిచెందినా, కళగా ఆనాటి కానాటికి ఒక మెట్టు కిందికి దిగుతున్నవి. ఎంత ఎక్కువగా చలనచిత్ర నిర్మాణం జరిగితే మాత్రమేమి? ఉత్తమ చిత్రాలని వేలుమడిచి లెక్కించుకోదగినవి బహుకొద్ది. దాదాపు పూజ్యమన్నప్పటికీ సత్య విదూరం కాదేమో!

కళలేమి, పరిశ్రమలేమి ప్రజాదరణ వల్ల పెంపొందడం సహజం. మన చలనచిత్రాలకు ప్రజాదరణ లోపం లేదనడానికి పరిశ్రమగా అవి పొందిన విశేషాభివృద్ధే తార్కాణం. అయినా, పరిశ్రమగా అవి చూపిన పురోభివృద్ధిని కళగా చూపించలేక పోవడం శోచనీయమే కాదా?

తక్కిన కళలకు లేని ఒక పెద్ద చిక్కు చలనచిత్రాలకు లేకపోలేదు. ఒక ఫిల్ము పూర్తికావడానికి ఈనాడు నాలుగైదు లక్షల రూపాయలనైనా వెచ్చించాలి. ఇంత వ్యయాన్ని భరించక తప్పనప్పుడు ఏ కొద్ది మంది విద్యావంతులో, కళాభిజ్ఞులో, సంస్కృతీపరులో చిత్రాన్ని హర్షించినా, తమ కృషి సార్థకమైనట్టే చలనచిత్ర నిర్మాతలు సంతృప్తి చెందడానికి వీలులేదు. సామాన్య ప్రజను - సామాన్యాతి సామాన్య ప్రజను - మెప్పించగలిగితేనే, చిత్రంపై పెట్టిన పెట్టుబడి తిరిగి చేతికి రావడమైనా, నాలుగు డబ్బులు మిగలడమైనా.

లాభనష్టాలతో కూడిన ఒక పరిశ్రమగా చలనచిత్ర నిర్మాణం కొనసాగినంత వరకు సామాన్య ప్రజాభిరుచులను దృష్టిలో పెట్టుకొనక తప్పదు. అయితే, ఇదే సమయంలో ఆ సామాన్య ప్రజాభిరుచులను క్రమక్రమంగా ఒక ఉత్తమ స్థాయికి తీసుకువెళ్ళడానికి ప్రయత్నించడం సముచితం. ఇందుకు మారుగా వాటిని మరింత అధమ స్థానానికి కొనిపోవడమే ప్రస్తుతం జరుగుతున్నది.

పుక్కిటి పురాణాలకు ఎక్కువ డబ్బు వస్తుందా? అయితే, పుక్కిటి పురాణాల ఫిల్ములు, కాకమ్మ కథలకు ఎక్కువమంది ఎగబడతారా? అయితే, కాకమ్మకథల ఫిల్ములు, వికట వినోదం ఎక్కువ లాభాలను గడిస్తుందా? అయితే, వికట వినోదపు ఫిల్ములు - ఈ సూత్రమే చలనచిత్ర రంగంలో ఈనాడు తిరుగులేకుండా రాజ్యం చేస్తున్నది.

ఈ శోచనీయ పరిస్థితిని ఏదో ఒక విధంగా చక్కబరచకపోతే, సంస్కృతీ పథం వెంట మన ప్రజ వెనుకకు నడవడమే తటస్థిస్తుంది. అయితే, సంస్కరణాభిలాషతో ప్రభుత్వం లేనిపోని విధినిషేధాలను చేస్తే మాత్రం కళాసంస్కృతుల దృష్ట్యా సత్ఫలితం కలగకపోగా, ఫిల్ము పరిశ్రమే దెబ్బతినవచ్చు.

ఈనాడు దేశపరిపాలన సాగిస్తున్న కాంగ్రెసు వాదులలో పెక్కుమంది లలితకళలకు, వాటి స్వరూపానికి అపరిచితులు : వస్తువు అందచందాలకంటె దాని ఉపయోగానికి ఎక్కువ ప్రాధాన్యమివ్వడం వారి స్వభావంలో ఒక భాగమైపోయింది. సామాన్య మానవుని సామాన్య నీతికి కళలు అతీతమైనవని గ్రహించగలవారు కూడా వారిలో తక్కువ. ఇందువల్లనే కాబోలు, మత సంప్రదాయాలకు భిన్నంగా పోరాదని, మతాచార్యులను నిరసించరాదని, దేవతలను అపహాస్యం చేయరాదని, మద్యపాన దృశ్యాలను చూపరాదని, "సత్యంవద, ధర్మంచర" మొదలైనవి చూచి వ్రాత పుస్తకాల నీతులకు పరిమితం కావాలని, ఏవేవో విధి నిషేధాలను ప్రకటించడం తటస్థిస్తున్నది.

ఈ విధినిషేధాలను తు.చ. తప్పకుండా పరిపాలించాలంటే, అజంతా చిత్రాలను చెరిపి వేయించాలి, సాంచి స్థూపాన్ని పడగొట్టించాలి, ప్రతి శృంగార కావ్యాన్ని తగలబెట్టించాలి.

చలన చిత్రాభివృద్ధి సాధనకు కావలసింది నీతికి ప్రాధాన్య మివ్వడం కాదు, కళకు ప్రాధాన్య మివ్వడం. దీని తాత్పర్యం - అవినీతిని ప్రోత్సహించాలని కాదు. అవినీతికి దోహదమిచ్చేది "కళ" అనే పేరుకైనా తగదు. అయితే, కళను సామాన్యపు నీతికొలబద్దలతో కొలవరాదు. కళకు వేరే నీతి వున్నది. సామాన్యపు నీతి కంటె అది విశాలమైనది, విశిష్టమైనది. సామాన్యపునీతి లక్ష్యం మానవుని సంఘజీవిగా చేయడం, కళానీతి ధ్యేయం మానవునికి పరిపూర్ణత్వం సాధించడం.

ఈ విభేదాన్ని చలనచిత్ర విచారణ సంఘం దృష్టిలో పెట్టుకొనగలరనే విశ్వసిస్తున్నాము. *(ఆంధ్రప్రభ 11-9-1949)*

రేపే ఉగాది!

రేపే ఉగాది. మనతోపాటు చాంద్రమానం వాడుక కలవారందరికి కూడా రేపే నూతన సంవత్సరాది.

ఇంటిల్లిపాదికీ కొత్త బట్టలు. ఇంటి నిండా చుట్టపక్కాలు. కమ్మ కమ్మని పిండివంటలు. కనుల పండువైన అలంకారాలు.

నేటితో పాత చింతలకు స్వస్తి. రేపటి నుంచి కొత్త యోచనల ప్రసక్తి. దుర్ముఖి పీడకలలకు పరిహారం. హేవిళంబి మధురస్వప్నాలకు స్వాగతం.

పేరు ఎంత చెడ్డదైనా, పోతూపోతూ "దుర్ముఖి" మేలే చేసింది - మొత్తం భారతదేశానికేమి, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ కేమి, పదేళ్ళకిందట స్వాతంత్ర్యాన్ని గడించి పెట్టిన కాంగ్రెసును, పదేళ్ళ లోపల సర్వతోముఖ దేశాభివృద్ధిని సాధించిన కాంగ్రెసును - ఒకటి, రెండు రాష్ట్రాల మినహాయింపుతో - కనీసం రాగల అయిదేళ్ళ

వరకైనా సుప్రతిష్ఠితం చేసిన ఘనత దుర్ముఖికే దక్కింది. విశేషించి జాతీయ, అంతర్జాతీయ రంగాల్లో భారతదేశానికి అఖండ యశస్సును చేకూర్చిన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ నాయకత్వాన్ని దేశానికి దక్కించింది కూడా దుర్ముఖే. మరొక యాభై తొమ్మిదేళ్ళ దాకా తిరిగి మన గుమ్మంలో అడుగు పెట్టని దుర్ముఖిని ఇందుకైనా మనం కృతజ్ఞతతో జ్ఞాపకం పెట్టుకోవచ్చు.

దుర్ముఖి చేతుల్లో నుంచి ఇంతటి శుభ పరిస్థితిని హేవిళంబి అందజేసుకున్నా, హేవిళంబిలో తమకు అంతా సుఖంగా, అంతా సంతోషంగా ఉండగలదని ప్రజలు పొంగిపోరాదు. బెల్లం, చింతపండు, వేపపువ్వు కలిసిన ఉగాది నాటి వేప ప్రసాదం వలెనే నూతన సంవత్సరానుభవం కూడా తీపి, పులుపు, చిరుచేదులతో మిళితం కాక తప్పదు.

నేటితో పాతచుట్టమై పోతున్న దుర్ముఖి మనకు చేసిన మరొక మేలు కూడా ఈ సందర్భంలో మనం చెప్పుకోదగిందే. వారం రోజుల క్రితం మార్చి 23వ తేదీని నూతన శకాన్ని, కొత్త పంచాంగాన్ని మనకందించి దుర్ముఖి తెరచాటు అవుతున్నది. అయితే, దుర్ముఖి మన కందజేసిన శకంగాని, పంచాంగంగాని వాస్తవంలో మనకు కొత్తవే కావు. ఇప్పటికి 1,880 సంవత్సరాలుగా శాలివాహన శకం మన దేశంలో పలు ప్రాంతాల్లో వాడుకలో ఉన్నదే. అయితే, విదేశ పరిపాలన ద్వారా క్రీస్తుశకం కూడా మనదేశానికి దిగుమతి అయిన తరువాత శాలివాహన శకానికి వ్యాప్తి తగ్గింది. తిరిగి ఇప్పుడు దాని పునరుద్ధరణ వల్ల దేశం సర్వత్రా ఒకే పంచాగం అమలులో ఉండడం జరుగుతుంది. సార్వత్రిక పంచాంగం అమలులోకి రావడం దేశానికి ఎంతో మేలు.

అవతారం చాలిస్తున్న దుర్ముఖే అంత్యదశలో తానొక మేలుచేసి వేళ్లుతుంటే, కొత్తగా అవతరిస్తున్న హేవిళంబేనా అంత చేతకానిది? కొత్త పంచాంగాన్ని మనకు కట్టబెట్టి దుర్ముఖి దొడ్డి దారిని వెళ్ళిపోతే, హేవిళంబి వాకిట్లో అడుగు పెడుతూనే పంచాంగంకంటె ఎక్కువ విలువైన, దాని కంటె ప్రతిక్షణం, ప్రతివ్యక్తికీ అవసరమైన కొత్త పైసాను మనకు బహూకరిస్తున్నది. దీనికే మన ప్రభుత్వం పెట్టిన పేరు "నయా పైసా". మన ఉగాదికి సరైన ఏప్రిల్ 1వ తేదీకి ఈ 'నయాపైసా' దేశం అంతటా అమల్లోకి వస్తుంది.

నయాపైసాను గురించి చర్చిస్తూ నాణెముల పుట్టు పూర్వోత్తరాలను గురించీ, వివిధ దేశాలలో వాటి చెలామణి రీతులను గురించీ త్రవ్వితే పెద్ద గాథ అవుతుంది. ప్రస్తుతానికి ఒక్కమాట చెప్పితే చాలు. ఇప్పుడు మనదేశంలో వాడుకలో ఉన్న రూపాయ, అణా, పైసలు ఆదినుంచీ ఇక్కడ అమలులో ఉన్నవికానీ, గణితానికి ఇతర ద్రవ్యమానాలకంటె శ్రేష్ఠమైనవి కానీ కాదు. రూపాయకు పదహారణాలు, 64 కాసులు, 192 దమ్మిడీలనే ప్రస్తుత విధానం కంటె రూపాయను పదులకింద విభాగించి, రూపాయకు నూరు పైసాలని నిర్ణయించడమే లెక్కకు అన్ని విధాల సులభమైన పద్ధతి. దీనినే దశాంశ పద్ధతి అనిపిలుస్తున్నారు.

ఈ దశాంశ పద్ధతి ప్రపంచంలో అమెరికా, ఫ్రాన్సు, జర్మనీ, రష్యా, నార్వే, స్వీడన్, ఆస్ట్రియా, హంగరీ, ల్యాటిన్ అమెరికా, జపాన్ మొదలైన ఆధునికాభ్యుదయానికి పేరుపడ్డ అనేక దేశాలలో ఇప్పటికే అమల్లో ఉన్నది. సత్వరాభివృద్ధిని కాంక్షిస్తున్న మనంకూడా దశాంశ పద్ధతిని అనుసరించడం వాంఛనీయం.

కొత్త ద్రవ్యమాన విధానాన్ని ప్రవేశ పెట్టినప్పుడు పాత నాణెములు కూడా చలామణిలో ఉన్నంతవరకు తాత్కాలికంగా కొంత అసౌకర్యం ఏర్పడవచ్చు. కాని, బహుళ ప్రయోజనాలను ఆశించినప్పుడు స్వల్పపు

అసౌకర్యాన్ని లెక్క చేయనక్కరలేదు. శాలివాహన శకంవలెనే, నిజానికి దశాంశ పద్ధతి కూడా మనకు నూతనంకాదు. శతాబ్దాలకు పూర్వం దశాంశ పద్ధతిని, అంకెలతో "సున్నా"ను కనిపెట్టినవారు భారతీయులే. అందుచేత, ఇదేదో ఎరువు సొమ్ము అనుకోవలసిన పనిలేదు. (ఆంధ్రప్రభ 31-3-1957)

దీపావళి

ఎప్పుడు పుట్టిందో, ఎందుకు పుట్టిందో, ఏ విధంగా పుట్టిందో - ఇవి చారిత్రక పరిశోధకుల మధ్య వివాదాంశాలైనా, దీపావళి దివ్యమైన పర్వదినమనడం మాత్రం నిర్వివాదాంశం. "తమసోమా జ్యోతిర్గమయ" అనే ప్రార్థనలో మానవుని నివేదన మాత్రమే కాదు; అతని ఆవేదన, అతని అన్వేషణ, అతని ఆదర్శం, అతని ఆశాభావం; అన్నీ దానిలో గర్భితమై ఉన్నాయి. వీటికి సాటిలేని ప్రతీక - మన దీపావళి మహాపర్వదినం.

తమోగర్భంలో కూడా కాంతి కళికను, నైరాశ్యాంతరంగంలో కూడా ఆశారేఖను, మృత్యుచ్ఛాయల మధ్యలో కూడా నవజీవన వాగ్దానాన్ని చూడగలగడం మానవుని ప్రత్యేకత; అదే అతని వైశిష్ట్యం. అదే అతనిని తక్కిన జీవకోటినుంచి వేరు చేసింది; అదే అతనిని ఆటవిక స్థితి నుంచి తప్పించి, నాగరికతాపథంలో నిత్యయాత్రికుని చేసింది; అదే అతనిలో అందని అందాలకై తొందర పుట్టించింది; అదే అతనిని అంతర్ముఖుని చేసింది; అతనిని బహిర్ముఖుని చేసింది; అదే అతనిని రేపో మాపో సౌర కుటుంబ పరిశోధనకు పంపించబోతున్నది.

మానవుని మానవునిగా చేసిన అసదృశ శక్తులన్నింటికీ అద్భుత సంకేతం కనుకనే, దీపావళి అద్వితీయమైన మహాపర్వదినం. అమావాస్య చీకటులను అది శతకోటి హస్తాలతో చీల్చుతుంది; అశేష ప్రజాకోటి హృదయాలలో అనంత జ్యోతులను వెలిగిస్తుంది; అఖిల మానవకోటికే ఆశా సందేశాన్ని అందజేస్తుంది.

ఇదే రోజున కాకపోవచ్చు గాని, వేరు రోజులలో, ఇదే రూపంలో కాకపోవచ్చుగాని, అన్యరూపాలలో అన్ని దేశాలవారు ఈ దీపావళి పర్వదినాన్ని జరుపుకొంటారు; ఏడాది కొకసారి తమ ఆశలకు కొత్త దీప్తిని, తమ ఆశయాలకు కొత్త బలాన్ని కూర్చుకొంటారు.

ప్రపంచం మొత్తంపైనే ఏదో ఒక రూపంలో ఎంతవరకు ఈ దీపావళి ఒక మహా పర్వదినంగా నిలిచి ఉంటుందో, అంతవరకు మానవాళి ప్రగతిని గురించి కాని, దాని భవిష్యత్తును గురించికాని ఆశలు వదులుకోనక్కరలేదు. సమృద్ధి సరసనే దారిద్ర్యం, స్వాతంత్ర్యం మధ్యనే పారతంత్ర్యం, ప్రజాస్వామ్యం వెన్నంటి నియంతృత్వం, సహజీవన సిద్ధాంతానికి ప్రాణాంతకంగా అంతర్జాతీయ రంగంలో భయవిద్వేషాలు, అన్నింటినీ మించి అణుయుద్ధప్రమాదం : నిరాశా నిస్పృహలను కలిగించే ఈ పరిస్థితుల మధ్య కూడా మానవాళి భవిష్యత్తుకు ఒక నివాళి - మన దీపావళి.

పంటల పండుగ (సంక్రాంతి)

ఏడాది పొడవునా ఎన్ని పాట్లు పడితేనేమి; ఎంతగా రెక్కలు విరుచుకొని కష్టించితేనేమి; ఎంత కనులలో వత్తులు వేసుకొని అప్రమత్తులై అలసిపోతేనేమి! కడపట తన కష్టార్జితం, తన శ్రమఫలం ఇల్లు చేరుకొన్నప్పుడు మనిషిలో ఎంత ఆనందం ఉత్ఫుల్ల మవుతుంది! తోడివారితో పంచుకునే పంటల పండుగే సంక్రాంతి.

ఆ ఆనందాన్ని ఎక్కడి సూర్యుడు! ఎక్కడి నక్షత్ర సంతతి! ఎక్కడి భూమి! ఎక్కడి మానవులు! అయినా వారి జీవితములో ఎంతగా పెనవైచుకొని ఉన్నవి!

ఋతు పరివర్తన కారణం కాగా, ఆ ఋతువులు మన పాడిపంటలకు ... కాగా, అవి మన ... ఆలంబనం కాగా అన్యోన్య సంబంధ బాంధవ్యం అల్లుకొనిపోక వదలగలదా!

"గగనానికి ఇలకు బహుదూర" మన్నమాట కాదనలేము. కాని, అవి ఎంతగా జీవితంలో సన్నిహితులై పోయినవో! అందుకే సూర్యుడు మకరరాశిలో ప్రవేశిస్తే మనకు పండుగ అవుతున్నది.

వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా కల దేశంలో పంటల పండుగలకు పరమ ప్రాముఖ్యం తప్పదు.

అందుకనే ఈ పర్వదినం ఆబాలగోపాలం ఆచరించే ఆంధ్రుల పండుగ.

అది కుటీరం కాని, భవనం కాని, మహోన్నత ప్రాసాదం కాని ముంగిట రంగవల్లులతో కలకలలాడుతుంది; ముగ్గుల మధ్య గొబ్బెమ్మలు కొలువు దీరుటతో మురువు సూపుతుంది; ఆ గొబ్బెమ్మల తలలలో చెరివికొన్న గుమ్మడి పూవులతో ఎమ్మెలు పోతుంది.

రంగురంగుల వలువలతో చెంగుచెంగున గొబ్బితట్టే కన్నెల కన్నెమనసెంత సమ్మోదభరితమో ఊహించగలమా? ఆ సమ్మోదభరాన్ని ప్రక్కనున్న మనం పంచుకొన లేక మనసులు మూసివేసుకొనగలమా?
ఎన్ని నిరాశలు, ఎన్ని నిస్పృహలు, ఎన్ని ఇబ్బందులు, ఎన్ని ఇక్కట్లు - ఏ ఎన్ని ఎదలో మెదులుతున్నా ఈ ఒక్క రోజు వానినలా గాలికి వదలివేసి, నిర్మల మనస్కులమై, వినీతులమై మరొక ఏడు అహోరాత్రులు నడుంవంచి పని చేయడానికి తగిన ఉత్సాహోద్రేకాల నీనాడు మనం మనసులలో పండించుకొనాలి.

మన మదిలో ఆనందం పండించుకొన్నప్పుడే మనం మన బంగరుగడ్డలో రవ్వలు, రత్నాలు పండించు కొనగలం. అలా పండించుకొన్నప్పుడే మన దేశాన్ని సర్వ సౌభాగ్య సంపన్నం చేసుకొనగలం.

ఆనందం క్షణికమే కావచ్చు. కాని అందువల్ల మనలో ఉద్భూతమయ్యే క్రియాశక్తి అపారమన్నది మనం మరచిపోరాదు.

శ్రమఫలం చవిచూచి సంతసించే ఈ రోజున అంతతో ఆగక మరింత శ్రమించి, మరింతగా ఫలసిద్ధినందడం కోసం మనం సమాయత్తులం కావాలి. మన కలిమినే కాదు, మన దేశ సౌభాగ్యాన్నే మనం గాదెలు నింపుకొనడం కోసం దీక్షాకంకణం ధరించాలి.

కష్టే ఫలీ అన్న సూత్రాన్ని సమస్త జీవితరంగాలలోను అనువర్తింపజేసి, కృతార్థులం కాగలరీతిగా కార్యశీలురం కావాలి.
అప్పుడే ఈ సంక్రాంతికి సార్థక్యం. అప్పుడే మన నేటి సంతోషానికి సార్థకత.

వెలుగు, నీడలు

(20 వ, శతాబ్ది ద్వితీయార్ధారంభం) నేడు పాదం పెట్టింది క్రీస్తు శకంలో మరొక సంవత్సరం మాత్రమే కాదు; ఆ శకంలో ఇరవయ్యో శతాబ్ది ఉత్తరార్ధం కూడా నేడు ప్రవేశించింది. ఒక అర్ధ శతాబ్ది ప్రపంచ జీవితంలో ఎంత క్షుద్రమైనదైనా, ఇరవయ్యో శతాబ్ది పూర్వార్ధానికి మానవ చరిత్రలో గల ప్రాధాన్యం మరొక అర్ధశతాబ్దికి దేనికి లేదనడం అన్యతోక్తి కాదు సరిగదా, అత్యుక్తి సయితం కానేరదు.

ఒక వ్యక్తి జీవితంలో అర్ధ శతాబ్ది అధిక భాగం కావచ్చు; అత్యధిక భాగమే కావచ్చు. కాని, ప్రపంచ జీవితంలో అదొక క్షుద్రభాగమే. మొత్తం క్రీస్తు శకంకంటె సభ్య ప్రపంచ చరిత్రే కనీసం మూడు, నాలుగు రెట్లు దీర్ఘమైంది.

ఆటవిక స్థితి నుంచి, అనాగరిక వ్యవస్థ నుంచి బయటపడిన తర్వాత మానవుడు కనిన కలలలో నిన్నటితో ముగిసిన అర్ధ శతాబ్దిలో నిజమైనన్ని ఇంతకు ముందెన్నడు నిజం కాలేదు. మన ప్రాచీనులు కామధేనువును గురించి, కల్పవృక్షాన్ని గురించి కలలుగన్నా, అన్యదేశాలవారు యాంబ్రోజియా, మన్నాలను గురించి కలలుగన్నా, అది కేవలం అన్న పానీయాలకై పడవలసిన నిరంతరాందోళన నుంచి విముక్తికోసమే. ఈ విముక్తిని ఇరవయ్యో శతాబ్ది పూర్వార్ధంలో పూర్ణ పరిణతికి వచ్చిన పారిశ్రామిక విప్లవం మానవాళికి సుసాధ్యం చేసింది.
"తమసోమా జ్యోతిర్గమయ" అనే ప్రార్థనతో భారత తపోవనాలు ఒకప్పుడు ప్రతిధ్వనించి ఉన్నా, "లైట్, మోలైట్" అని ఒక పాశ్చాత్య మహాకవి (గెటీ) తపనపడినా, అది కేవలం ఆధ్యాత్మిక సంబంధమైన వెలుగు కోసమే కాదు. నిశీథిని సర్వదా మానవుని దృష్టిలో మృత్యువుకు చిహ్నమే; తమస్సు దానవత్వానికి ప్రతిరూపమే. ఇందువల్లనే రాత్రిని పగలుగా మార్చవలెనన్న ప్రయత్నం సభ్య పథంపై మానవుడు తొలి అడుగు పెట్టిననాడే ప్రారంభమైంది. ఆ ప్రయత్నం విద్యుచ్ఛక్తిని కనిపెట్టడం ద్వారా గత శతాబ్దిలోనే సఫలీకృతమైనా, ఆ వరప్రసాదం పల్లెపట్టులకు సయితం లభించ నారంభించింది ఇరవయ్యో శతాబ్ది పూర్వార్ధంలోనే భూతలంపై, సముద్రోపరిభాగంపై పయనించడంతో మానవుడు సంతృప్తి చెందలేకపోయాడు. అంతరిక్షంలో కూడా విహరించడానికి ఆరాటం చెందాడు. ఇందు నిమిత్తం వాయు స్తంభనాది దివ్య శక్తులకోసం ప్రాకులాడాడు. రెక్కల గుర్రాలను (మ్యాజిక్ హార్సెస్) గురించి, పుష్పక విమానాలను గురించి ఎన్నెన్నో ఊహాకల్పనలను చేసుకున్నాడు. ఖేచరత్వాన్ని దేవత్వానికి ప్రధాన లక్షణంగానే పరిగణించుకున్నాడు. ఈ ఖేచరత్వం మానవునికి సుసాధ్యమైంది ఇరవయ్యో శతాబ్ది పూర్వార్ధంలోనే దూర శ్రవణ, దివ్య దృష్టి శక్తుల నిమిత్తం మానవుని తపన సయితం ఈనాటిది కాదు. రెండింటిలో కూడా అతడి స్వప్నాలు సత్యాలైంది గడచిన యేబది సంవత్సరాలలోనే. రేడియో దూరశ్రవణాన్ని

సాధ్యంచేసింది. టెలివిజన్ ద్వారా భూత భవిష్యాలకు సంబంధించినంతవరకు కాకపోయినా, వర్తమానానికి సంబంధించినంతవరకు దివ్య దృష్టి లభ్యమైంది. పోతే, రాడార్ వల్ల చంద్ర, అంగారకాది సమీప గ్రహాలకు సందేశాలను పంపించ గల శక్తి లభించింది; పరమాణు విచ్ఛిత్తి వల్ల సూర్యుని వాకిట బంటుగా కట్టివేసుకోగల పాటవం సిద్ధించింది.

పోయిన యాభై యేళ్ళలో వైజ్ఞానిక రంగాన మానవుడు సాధించిన ఇట్టి అశేష విజయాలన్నింటికంటే మహత్తర మైంది మరొకటి కలదు. అది - మహాకవుల గీతాలకు, మత ప్రవక్తల బోధనలకు పరిమితమైన ఒక భావం, ఒక లక్ష్యం, ఒక ఆశ, ఒక ఆవేదన కేవలమొక భావంగానో, లక్ష్యంగానో, ఆశగానో, ఆవేదనగానో మిగలక, చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే సఫలం కాగల పరిణతికి రావడం.

నదీనదాలు, పర్వత పంక్తులు, మహాసముద్రాలు ఎన్నెన్ని అడ్డంగా నిలిచినా, జాతి, మత, కుల, వర్ణ, భాషాది విభేదాలు ఎన్ని అడ్డుగోడలుగా ఉన్నా, ప్రపంచం ఏక కుటుంబమని, మానవులు ఏకోదరులని చెప్పని మహాకవి లేడు; బోధించని మత ప్రవక్తలేడు. అయినా, కష్ట సుఖాలను అన్ని దేశాలు, అందరు ప్రజలు సమానంగా పంచుకొని తీరవలసిన పరిస్థితులుప్పతిల్లింది ఇరవయ్యో శతాబ్ది పూర్వార్ధంలోనే.

ఇంతగా ప్రపంచాన్ని ఏక కుటుంబం చేసిన ఈ కాలంలోనే, ఇంతగా మానవాళిని ఏకోదరులుగా మార్చిన ఈ సమయంలోనే రెండు ప్రపంచ యుద్ధాలు జరిగినవి; మూడవదాని లోహపద ఘట్టనలు అప్పుడే వినవస్తున్నాయి.

ఈ యాభై యేళ్ళలోనే కొండలను పిండిచేసి, రాళ్ళనుంచి రత్నాలను పండించడానికి తోడ్పడగల డైనమైట్ నగరాలకు నగరాలనే పాడుజేయగల "సూపర్ బాంబు"గా మారింది; ఖేచరుల అంతస్థుకు మానవుని , తీసుకుపోవలసిన విమానం "సూపర్ ఫోర్ట్రెస్"గా మారింది. భూమండలానికే కాక, సమీపస్థ గ్రహాలకు సయితం మానవుని రాజుగా చేయగల పరమాణుశక్తి సభ్యతనే నామరూపాలు లేకుండా జేయగల "ఆటంబాంబు"గా పరిణమించింది. ఒక్క మాటలో దేవతల సరసను స్థానాన్ని గడించుకొనగల పాటవాన్ని గడించిన మానవుడు దానవులతో పోటీ పడుతున్నాడు.

అయినా, నిస్పృహ చెందవలసిన పనిలేదేమో! కేవలమొక మహాగ్నిపర్వతం అంచులను నేడు మానవాళి నిలిచివున్నా, 1901 అడుగిడినప్పటి ప్రపంచంకంటె ఈనాటిది ఎన్నో విధాల మెరుగైనదే.

యాభై సంవత్సరాలనాడు ఇదే రోజున సోవియెట్ రష్యా జార్ చక్రవర్తుల ఘోర నిరంకుశత్వం కింద తిన తిండికి, కట్టగుడ్డకు, నిలవ నీడకు ముఖం వాచిపోతూ, దారిద్ర్య దైన్యాలతో క్రుంగిపోతున్న రాజ్యం, అప్పుడు చైనా మంచూ చక్రవర్తుల ఏలుబడికింద ప్రతి పాశ్చాత్య రాజ్యం తాపులను తింటూ, నోరు మెదపడానికి కూడా గుండెలు లేకుండా బ్రతుకుతున్న దేశం. నాడు ఇండియా, బర్మా, సింహళాలు, ఇండొనీసియా, ఫిలప్పీన్లు; బ్రిటీష్, డచ్, అమెరికన్ సామ్రాజ్యాధిపతుల అడుగులకు మడుగు లొత్తుకున్న సీమలు. ఒక్క మాటలో అప్పుడు కేవలం పాశ్చాత్యులదే రాజ్యం. వారిదే భోగం; తక్కినవారిది ఘోర హాస్యపు బ్రతుకు, అతి హేయపు మనుగడ.

నాటివలె ఈనాడు ప్రపంచ ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు పరతంత్రులు కారు; స్వతంత్రులు. మంచికైనా, చెడ్డకైనా తమ బ్రతుకును తామే రూపొందించుకొనడానికి ఈనాడు వారు హక్కుదారులు.

పాశ్చాత్య రాజ్యాలలోనైనా ఎవరో కొందరే పెట్టి పుట్టినవారన్న సిద్ధాంతం ఈనాడు చెల్లడం లేదు. రాజకీయ స్వాతంత్ర్యం చాలదని, సాంఘిక న్యాయం జరిగే తీరాలని పట్టుదల చూపబడుతున్నది. కేపిటలిజం పునాదిగాగల దేశాలలో సయితం ప్రజలందరికీ అన్న వస్త్రాల నివ్వడం, విద్య గరపడం, , వైద్య సౌకర్యాలను కూర్చడం ప్రభుత్వపు కనీస ధర్మంగా గుర్తించబడుతున్నది.

సందేహం లేదు నేడు ఎంతటి మహావిపత్తు సముఖంలో నిలిచి ఉన్నా, 1901 పాదం పెట్టిననాటి ప్రపంచం కంటె ఈనాటిది బహుభంగుల ఉత్తమమైంది. అయితే, నేటి ప్రత్యేక పరిస్థితులను బట్టి ఇప్పుడు ఒక్క తప్పటడుగును వేసినా, సర్వ వినాశనం తప్పదు. జీవనమో, మృత్యువో, స్వర్గమో, నరకమో ఇక నిర్ణయం కావలసిన క్షణాలు అంతకంతకు దగ్గరపడుతున్నందునే ఈనాడు ఆలోచనాశక్తి గల ప్రతివాని హృదయం కొంత తొట్రుపడుతున్నది. రెండు దారులలో దేనినో ఒక దానిని ఈనాడు ప్రపంచం నిర్ణయించుకోవలసి ఉన్నది. ఒకటి చర్చిల్, హిట్లరుల దారి; రెండవది గాంధి, లెనిన్ల దారి.

గత ప్రపంచ యుద్ధంలో చర్చిల్, హిట్లర్లు ప్రత్యర్థులై ఉండవచ్చు, కాని, వారి దృక్పథాల మధ్య వైరుధ్యం తక్కువ. చర్చిల్ ప్రజాస్వామ్యవాది కావచ్చు; హిట్లర్ పచ్చి ఫాసిస్ట్ కావచ్చు. అయినా, చర్చిల్ ప్రజాస్వామ్యం శ్వేతజాతికి పరిమితం. ఆ శ్వేతజాతిలోనైనా ప్రజాస్వామ్యం , రాజకీయ రంగాన్ని దాటి, ఆర్థిక రంగానికి విస్తరించరాదు. ఇందువల్ల చర్చిల్ మనస్తత్త్వం వేసిన వెర్రి తలలు తప్ప హిట్లరిజం అన్యం కాదు.

ఇక, గాంధి, లెనిన్ లక్ష్యమొక్కటే. అది, - సర్వ మానవ సౌభ్రం. అయితే, ఆ లక్ష్య సాధనకై వారి పద్ధతులు పూర్తిగా విరుద్ధం. పద్ధతులు ఎట్టివైనా సరే, లక్ష్య సాధనమాత్రమే ముఖ్యమైందని నమ్మినవాడు లెనిన్. లక్ష్యం ఎంత మహోత్కృష్టమైన దైనా, దుష్ట సాధనలు దుష్ట ఫలితాల నివ్వడం తథ్యమని విశ్వసించినవాడు గాంధీజీ. ప్రపంచ చరిత్రను చూస్తే, మహోదార లక్ష్యాలతో ప్రారంభమై, రోషాలతో, రక్తపాతాలతో, 'రియాక్షన్'తో ముగిసిన రాజకీయ విప్లవాలన్నీ లెనిన్ ను ఖండిస్తున్నట్టు కనబడుతుంది. కాగా, వేల సంవత్సరాలు గడిచిపోయినా ఈనాటికైనా వాటి పటిమను కోల్పోని గౌతమ బుద్ధ, ఏసుక్రీస్తు మొదలుగాగలవారి త్యాగాలన్నీ, గాంధీజీని సమర్థిస్తున్నట్టు కన్పిస్తుంది. అయినప్పుడు ఎవరి అడుగుజాడలలో నడిస్తే ప్రపంచానికి భవిష్యత్తు కలదో వేరే చెప్పవలెనా? *(ఆంధ్రప్రభ 2-1-1951)*

భాషా, సాహిత్యాలు

అభ్యుదయ సాహిత్యం

నవ్యసాహిత్య సృష్టి అనుల్లంఘనీయమనే విశ్వాసం - అవసరమనే ఆవేదన - శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుతో ప్రారంభమైంది. నిజానికి అంతకు కొంచెం పూర్వమే ప్రారంభమైనదేమో కూడా.

కాని, ఆ తరంవారికి పాతపుంతల నుంచి తప్పుకొనడం కష్టమైపోయింది. కొత్తవైపుకు ఎంత అర్రులు జాచినా, పాత వారిని వెనక్కే లాగింది.

పాత పై - ఒక జాతి భాషపై, విజ్ఞానంపై, సంస్కృతిపై - ఆధారపడకుండా, కేవలం శూన్యంలో నుంచి అన్నట్టుగా, కొత్త సాహిత్య నిర్మాణం అసాధ్య విషయం. శ్రీ గురజాడ అప్పారావు పంతులు చెప్పినట్టు "పాత, కొత్తల మేలు కలయికే" నవ్యసాహిత్యం. అయితే, ఈ మేలు కలయిక ప్రధానంగా కానవచ్చేది ఆ తరంవారిలో ఒక్క గురజాడ అప్పారావు పంతులుగారి రచనలలోనే, తక్కినవారి వ్రాతలలో పాత పాలు హెచ్చు; కొత్త పాలు తక్కువ.

కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, వేదం వేంకటరాయశాస్త్రి, తిరుపతి వేంకటకవులు, వేంకట పార్వతీశ్వర కవులు, పానుగంటి లక్ష్మీనరసింహం ప్రభృతులు మార్గదర్శకులైనా, వారి రచనలు పూర్తిగా సంతృప్తి నివ్వనందువల్ల తలయెత్తినవే సాహితీ సమితి, కవితా సమితి, నవ్యసాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలైనా, ఆ సంస్థలలో అంతర్భూతమైన సాహిత్యోద్యమాలైనా.

కాని, కాలక్రమాన కేవలం నవ్యతయే సంతృప్తినివ్వని పరిస్థితి ఏర్పడింది.

చెప్పే రీతి నవ్యమైనదే కావచ్చు; చెప్పే విషయం సైతం నవ్యమైనదే కావచ్చు. కాని, నవ్యత్వాన్ని కేవలం నవ్యత్వం కొరకే ఈనాడు హర్షించలేకున్నారు. నవ్యత్వంతో పాటు మరొక కొత్త గుణాన్ని కూడా సాహిత్యం నుంచి నేడు అభిలషిస్తున్నారు. ఆ కొత్తగుణమే - అభ్యుదయం!

ఉదాహరణకు, శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి "వీరవల్లడు" నవ్యరచనే. కథావస్తువు కొత్తది; కథా చిత్రణ కొత్తది. పాత్ర కల్పనలో, పాత్ర పోషణలో కొత్తదనం కలదు కూడా. ఇక, ఆయన ఉపయోగించిన భాష ఎంత ఉచితమైనదో, అంత ఉత్తమమైనది. మాటమాటలో జాతీయత తొలుకాడుతున్నది; వాక్యం వాక్యంలో మన పల్లె - మన పల్లె ప్రజ - కళ్ళకు కట్టినట్టు ; కానవస్తున్నది. కాని, తాత్కాలికంగా ఎంత అలరించినా, ఈనాడు ప్రతివానికి దానిలో ఏదో కొరత గోచరిస్తున్నది. ఆ కొరత, - దానిలో అభ్యుదయం కొరవడ్డమే.

కుల విభేదాలు హిందూసంఘానికి వేరుపురుగుగా పరిణమించినవని ఈనాడు ప్రతి విజ్ఞుని నమ్మకం. చాతుర్వర్ణాలు అవసరమని నిన్న మొన్నటివరకు ఉద్ఘాటించినా, నేడు గాంధీజీ సైతం కుల విభేదాలు పూర్తిగా తొలగి పోవాలంటున్నాడు. అవి తొలగనంతవరకు హిందూ సంఘానికి శక్తిగాని, ముక్తిగాని లేదంటున్నాడు. కుల విభేదాల వినిర్మూలనం హిందూ . సంఘాభ్యుదయానికి అత్యవసరమని దీని తాత్పర్యం.
కాని, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ రచన కులవిభేదాల పట్ల విరోధభావాన్ని, జుగుప్సను కలిగించడానికి బదులుగా వాటిపట్ల ప్రేమాభిమానాల్ని పురికొల్పుతున్నది.

గుణగణాలను బట్టి కాకుండా కేవలం జన్మవల్లనే ఒకడు భూసురోత్తముడు కావడం, మరొకడు అంటరానివాడు కావడం విపరీతమని ఆ రచన చెప్పడం లేదు సరి గదా, ఆ వైపరీత్యాన్ని సమర్థిస్తున్నది. శ్రీ సత్యనారాయణ విశాల భావాలు గలవారే కావచ్చు. వర్ణ వైషమ్యాలకు ఆయన అతీతుడే కావచ్చు. ఆయన తన కావ్యాలలో ఒకదాన్ని ఒక మిత్రునికి అంకితం చేస్తూ, "వర్ణ వైషమ్యమ్ము వాడిపోయినదయ్య అర్ణవ వైశాల్యమైన నీ ఆత్మలో" అని వ్రాసిన సంగతి కూడా మాకు తెలియకపోదు. కాని, ఆయన "వీరవల్లడు" బ్రాహ్మణ, ఛండాల సంబంధ బాంధవ్యాలపై ఒక మధుర గీతం. "ఔరా! వీరవల్లడు ఎంత ప్రభుభక్తి పరాయణుడు" అనే భావాన్నే అది రేకెత్తిస్తుంది గాని, "నీవు ఎద్దుల తలతాళ్ళు పట్టుకో పరవాలేదులే! ఇంటికి పోయి తలారా స్నానం చేస్తాను" అని తను ఏ బ్రాహ్మణ గృహిణి సేవకై ఎన్ని కష్టాలకైనా పాల్పడ్డాడో ఆమె చేతనే అనిపించుకోవలసిన మహాపాపం అతడేమి చేశాడనే ఆగ్రహాన్ని పాఠకునికి కలిగించలేదు. అందువల్లనే అది నవ్యరచనే అయినా, అభ్యుదయ రచన కాదు; కానేరదు.

"వీరవల్లడు" విషయమై ఇక్కడ మేమింతగా ప్రస్తావించడానికి కారణం అది ఉత్తమమైన నవ్యరచనే అయినప్పటికీ, అభ్యున్నతి మార్గాలకు నిరోధంగా నిలవగల రచనలకు అది ఒక ఉదాహరణ కావడమే.

నేడు మనం సర్వతోముఖాభ్యుదయాన్ని కాంక్షిస్తున్నాం. అందువల్లనే అందుకు దోహదమివ్వగల సాహిత్యాన్ని మనం అభిలషిస్తున్నాం కూడా.

ప్రబంధయుగం మార్గాల నుంచి వైదొలగినందునే కందుకూరి, చిలకమర్తి, పానుగంటి ప్రభృతులు కాలానుగుణమైన సాహిత్యాన్ని సృష్టించగలిగారు; జనవంద్యులైనారు.

అటుతర్వాత వచ్చిన శ్రీయుతులు రాయప్రోలు, విశ్వనాథ, వేదుల, నాయని, నండూరి, కవికొండల, శివశంకరశాస్త్రి, కృష్ణశాస్త్రి ప్రభృతులు తమ ముందుతరం వారి బాటలను నడవనందునే ఆంధ్ర సాహిత్యాన్ని మరొక అంతస్థు పైకి తీసుకుపోగలిగారు.

ఇక, ఇప్పటి వారు తమ పెద్దల నడిచిన దారికి భిన్నమైనదాని వెంట నడవకపోతే, వీరు సాహిత్యానికి చేయగల సేవ - జాతికి చేయగల ఉపకారం - పూజ్యమే.

కొత్త పుంతలను తొక్కమనడమే - నవ్యత్వంతో అభ్యుదయాన్ని మేళవించమనడమే - గత శని, ఆదివారాలలో చెన్నపురిలో జరిగిన ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల మహాసభలో సన్మాన సంఘాధ్యక్షులు శ్రీ గోవిందరాజాచారి గారేమి, మహాసభాధ్యక్షులు శ్రీ రాజమన్నార్ గారేమి, కొందరు ఇతర ఉపన్యాసకులేమి చేసిన హెచ్చరిక. ఈ హెచ్చరికను పాటిస్తేనే ఆంధ్ర సాహిత్యానికి పాటవమైనా, భవితవ్యమైనా!

(ఆంధ్రప్రభ 21-1-1947)

పలుకుబడులు ∞ నుడికారాలు

పలుకుబడులు, నుడికారాలు ఇవే ఏ భాషకైనా అందచందాలను కూర్చేవి; ఏ భాషకైనా - జీవాన్ని పోసేవి.

ఒక జాతి జీవిత పరిసరాలనుంచి, పురాణేతిహాసల నుంచి, సాంఘిక వ్యవస్థ నుంచి, రాజకీయ పరిస్థితుల నుంచి, సంస్కృతి నుంచి, సాహిత్యం నుంచి, సాంప్రదాయాల నుంచి, పలుకుబడులేమి, నుడికారాలేమి ఉద్భవిస్తూ ఉంటాయి.

"ఆసేతు హిమాచలం", "కాశీ నుంచి రామేశ్వరం దాకా" ఇట్టివి మన జాతీయ జీవిత పరిసరాల నుంచి ఏర్పడినట్టివి. "భగీరధయత్నం", "సుగ్రీవాజ్ఞ", "రామబాణం", "నలభీమపాకం" - ఇత్యాది మన పురాణేతిహాసాల నుంచి వచ్చినట్టివి.
"బ్రాహ్మణ వ్యవసాయం", "నియోగిముష్టి", "వైదీకి చాదస్తం", "వెలమబెట్టు", "కమ్మగుట్టు", "భట్రాజు పొగడ్త", "మాలకూడు" - ఇట్టి వెన్నో మన సాంఘిక వ్యవస్థ కారణంగా సకారణంగానో అకారణంగానో ప్రచారమైనట్టివి.

ఇక, "మొగలాయి దర్బార్", "నవాబ్ దర్జా", "తెల్లోడిమాయ" మొదలైనవి ఉత్పన్నం కావడానికి రాజకీయ పరిస్థితులు కారణం. అయితే, ఈ విధంగా ప్రతి ఒక పలుకుబడికీ, ప్రతి నుడికారానికీ వ్యుత్పత్తిని నిర్ణయించలేము. కొన్ని కొన్నింటి విషయంలో వాటి అర్థం అందరికీ తెలిసినా, వాటిని అందరు ఉపయోగించినా,వాటి వ్యుత్పత్తి మాత్రం సరిగా తెలియదు. ఉదాహరణకు "కోటలో పాగా వెయ్యడం" అనే దానికి వ్యుత్పత్తి యేమిటి?

మరికొన్ని కొన్నింటి సందర్భంలో ఆదిలో అర్థం ఒకటైతే, ప్రస్తుతం మరొకటి కావచ్చు. ఉదాహరణకు, ఈనాడు "రామబాణం" అన్నప్పుడు "తిరుగులేని" దని స్ఫురించడానికి బదులు "రామబాణం" అనే మల్లుబట్ట జ్ఞప్తికి రావడం కద్దు.

పలుకుబడులను, నుడికారాలను కేవలం వాటి అర్థాన్ని దృష్టిలో పెట్టుకొనే ఉపయోగిస్తామే గాని, వాటి వ్యుత్పత్తిని పాటించము. వాస్తవానికి వాటిని వాడేటప్పుడు వాటి వ్యుత్పత్తికి మానసికపథంలో లవలేశమైనా స్థానం ఉండదుకూడా.

ఉదాహరణకు, "బ్రాహ్మణ వ్యవసాయం" అనినప్పుడు, సామర్థ్య రహితంగా సాగించబడే ఏదైనా వృత్తి లేదా వ్యాపారం అని మన స్మృతిపథంలో ఉంటుందేగాని, బ్రాహ్మణ సంఘం వుండదు. సరిగా ఇదే ధోరణిలో ఈ నెల 16వ తేదీని "ఆంధ్రప్రభ" తన సంపాదకీయంలో భారత సంస్థానాల విషయమై కామన్సు సభలో బ్రిటీష్ ప్రధాని అట్లే చేసిన ప్రకటనను గురించి ప్రస్తావిస్తూ, అది "కోమటి సాక్ష్యం వలె నున్నది" అని వ్రాసింది. "ఆకున అందకుండా, పోకను పొందకుండా" అనే ఉద్దేశంతో తప్ప, మరెట్టిది, ఎంత మాత్రం లేకుండా జరిగిన ఈ ప్రయోగం మా వైశ్య సోదరులలో కొందరికి ఆగ్రహ కారణం కావడం మాకు ఆశ్చర్యంతో పాటు విచారాన్ని సైతం కలిగిస్తున్నది.

జాతి, మత, కుల, వర్ణ, వర్గ విభేదాలకు అతీతుడై, మానవుడు మానవునిపట్ల మానవునివలె వర్తించగల మాననీయ వ్యవస్థ అవతరించాలనడం మా పరమలక్ష్యం. ఇట్టి విశ్వ మానవ సోదరత్వాన్ని లక్షిస్తున్న మేము ఒక కులాన్ని విమర్శించడానికి యత్నించామని కొందరు ఎలా భావించినారని మా ఆశ్చర్యం; ఇలా భావించడానికి అవకాశమిచ్చినాము కాబోలని మా విచారం.

మన పలుకుబడుల, మన నుడికారాల ప్రయోగం కొందరికి బాధాకరంగా పరిణమిస్తే, వాటి ప్రయోగాన్ని విరమించడమే సంభావ్యం కావచ్చు. కాని, ఆనాడు మన జాను తెనుగు కొంత బిగిని, కొంత జిగిని కోలుపోగలదనడం మాత్రం నిర్వివాదం.

ఇంతేకాదు, ఈ కులంవారు, ఆ కులంవారు ఆ మతంవారు అని లేకుండా, ఈ వర్గంవారు, ఆ వర్గం వారు అని లేకుండా, మన భారతీయ జాతి న్యూనత ఉద్దేశింపబడనిచోట దాన్ని చూడ్డాన్ని విరమించాలి; ఒకవేళ తనపై నిజంగా ఒక విసురు పడినా దాన్ని హర్షించగల హృదయ పరిపక్వతను అలవరచుకోవాలి.

స్కాచ్ వారు పిసినిగొట్టువారని, ఐరిష్ వారు తెలివి తక్కువ వారని, అమెరికనులు కోతలరాయుళ్ళని, ప్రొఫెసర్లు మతిమరపు కలవారని, జడ్జీలు కునికిపాట్లు పడతారని సకారణంగానో, అకారణంగానో ఒక జనవాక్యం ఏర్పడింది. ఈ జనవాక్యం ప్రాతిపదికగా ఎన్నో ఛలోక్తులు, హాస్యోక్తులు ప్రచారమౌతూ ఉంటాయి. వాటిని చూచి వీరు కినుకపడరు సరిగదా, ఆ ఛలోక్తులలో, ఆ హాస్యోక్తులలో కొన్నింటిని తామే స్వయంగా ప్రచారంలోకి తెచ్చినారేమోనని శంకించవలసి వస్తుంది కూడా. ఇది హృదయ పరిపక్వతతో పాటు, హాస్య చతురత (సెన్స్ ఆఫ్ హ్యూమర్) వున్నప్పుడే సాధ్యపడుతుంది.

ఆంధ్రులను ఒక జాతిగా పరిగణించినప్పుడు వారికి వారిలో హాస్య చతురత తక్కువేమోనని అనిపిస్తుంది.

తాము హాస్య ధోరణిలో వ్రాసిన “సత్యరాజా పూర్వదేశయాత్రల"ను పఠించిన పెక్కుమంది తాము కల్పించిన ఆడు మళయాళ రాజ్యానికి మార్గం చెప్పమని తమకు లేఖలను వ్రాసినారని శ్రీ వీరేశలింగం పంతులు తమ “ఆత్మకథ'లో పేర్కొన్నారు.

ఏమైనా “కోమటి సాక్ష్యం” అనే ప్రయోగాన్ని మా వైశ్య సోదరులలో కొందరు బాధాకరమైనదిగా పరిగణిస్తే, అట్టివారికి వైశ్య సంఘంపట్ల మాకు నిరసనగాని, విరోధం గాని లేదని, కేవలం ఒక పలుకుబడిగానే దాన్ని మేము వాడినామని మరొకసారి చెప్పగోరుతున్నాము.

(ఆంధ్రప్రభ 1-8-1947)

సజీవ భాష - 1

ఏళ్ళు, సెలయేళ్ళు ఎన్నెన్నో వచ్చి కలవకపోతే నది ఇంకిపోతుంది. కొత్త రెమ్మలు వెళ్ళకపోతే, కొత్త చిగుళ్ళు తొడగకపోతే, మొక్క గిడసబారిపోతుంది. కొత్త రక్తం పారకపోతే, కొత్త కండ పట్టకపోత, ప్రాణి శుష్కించి పోతుంది.
భాష కూడా ఒక నది; ఒక మొక్క ఒక ప్రాణి. అది నిత్యం ఏళ్ళను, సెలయేళ్ళను తనలో కలుపుకోవాలి; ఎప్పటికప్పుడు కొత్త రెమ్మలు వేయాలి; కొత్త చిగుళ్ళు తొడగాలి; తరచు కొత్త రక్తం దాని నాళాలలో ప్రవహించాలి; కొత్త కండ దాని శరీరానికి పట్టాలి. లేకపోతే, అది క్రమంగా శుషిస్తుంది; నీరసిస్తుంది; నశిస్తుంది.

గ్రీక్, లాటిన్, సంస్కృతం, మొదలైనవి మృతభాషలు కావడానికి కారణ మిదే.

అయినా, కొత్త పదాలను కలుపుకొనడానికి, కొత్త ప్రయోగాలను ఎరువు తెచ్చుకోడానికి కొందరు వైముఖ్యాన్ని - కాదు, ప్రాతికూల్యాన్ని - ప్రదర్శించడం విస్మయకరం కాదా? విమర్శనీయం కాదా?

కాశీలోని నాగరీ ప్రచారిణీ సభ సభ్యులు విజాతీయ పదాలను ప్రయోగించరాదనే ఒక నియమం కలదట. పొరపాటుగానైనా ఈ నియమాన్ని ఉల్లంఘిస్తే ప్రతి విజాతీయ పదప్రయోగానికి ఒక అణా చొప్పున జరిమానా చెల్లించుకోవాలట. ఆ సభ వార్షిక సమావేశంలో మొన్నను ప్రసంగిస్తూ, దాని అధ్యక్షుడు శ్రీ సంపూర్ణానంద అయిదు ఇంగ్లీషు మాటలను వాడినందుకు అయిదణాల జరిమానా చెల్లించుకోవలసి వచ్చిందట.

నాగరీ ప్రచారిణీ సభ వారి సంస్కృత భాషాభిమానం హర్షించదగింది కావచ్చునేమోగాని, వారి భాషా చరిత్రజ్ఞానం అత్యల్పమేమోనని శంకించవలసిన అగత్యం లేదా?

సంస్కృత భాషకు దుర్దినాలు ప్రారంభమైంది అన్యభాష నుంచి పదాలనేమి, ప్రయోగాలనేమి స్వీకరించడాన్ని విరమించిన తర్వాతనే.

సంస్కృతం మహోచ్ఛస్థితిలో నున్నప్పుడు అది పరభాషల నుంచి ఎన్నో పదాలను పరిగ్రహించింది; ఎన్ని ప్రయోగాలను స్వంతం చేసుకున్నది.

ఒక్క ఖగోళశాస్త్రానికి సంబంధించినంత వరకే హోరా, తాచకం, ద్రేక్కాణం, లిప్త, అనపా, సునపా, దురుధరా, కేమద్రుమ, వేశి, కేంద్ర, ఆపోక్లిమ, పనవరా, త్రికోణ, హిబుక, జామిత్ర, దియుత, మేషూరణ ఆదిగాగల పదాలన్నీ గ్రీక్ భాష నుంచి సంస్కృతం ఎరువు తెచ్చుకున్నట్టివే కావా?

ఖగోళశాస్త్రంలో ఒకప్పుడు భారతీయులకంటే గ్రీక్ దేశస్థులు అధిక పరిశోధనలు జరిపి, అధిక పరిజ్ఞానాన్ని సంపాదించారు. మనకు తెలియని విషయాలు మరొకరి నుంచి తెలుసుకొనడం తప్పుకాదనే భావంతో మన ప్రాచీనులు గ్రీక్ దేశస్థులు కనుగొన్న కొత్త విషయాలను మన ఖగోళశాస్త్ర గ్రంథాలలోకి ఎక్కించారు. కొత్త

విషయాలను - ముఖ్యంగా వైజ్ఞానిక శాస్త్ర విషయాలను విశదపరచడానికి కొత్త పారిభాషిక పదజాలం అత్యవసరమైనందున గ్రీక్ పారిభాషిక పదాలనే కొద్ది మార్పులతో స్వంతం చేసుకున్నారు.

భాష ధ్వని ప్రధానం. ఒకరి భాష మరొకరికి కీసరబాసరగా తోచడం ఒక భాష ధ్వనికి పుట్టుక నుంచి అలవాటుపడిన చెవులకు మరొకదాని ధ్వని వింత కావడం వల్లనే.

భాష ధ్వని ప్రధానమైనందున అన్యభాషా పదాలను పరిగ్రహించే సందర్భంలో మాతృక ధ్వనికి అంతభిన్నంగా పోకుండా, దాన్ని మన చెవికి యింపు కాగల విధంగా సవరించుకొనడం విజ్ఞుల లక్షణం.

మన ప్రాచీనులు సరిగా ఈ పద్ధతినే అనుసరించారు. ఉదాహరణకు "హోరన్" అనే గ్రీక్ పదాన్ని వారు "హోరా" అని మార్చుకున్నారు. ("హోరా" అంటే ఘడియలో సగం), "ప్రేమ దూమా" అనే పదాన్ని 'కేమద్రుమ" అని మార్చుకున్నారు. ('కేమదుమ" అష్టదరిద్రాన్ని సూచించే యోగం).

దాదాపు క్రీస్తుశకం పదవ శతాబ్దం వరకు భాషా విషయంలోనే కాకుండా, విజ్ఞాన విషయంలో కూడా ఇట్టి ప్రశంసా పాత్రమైన వైఖరినే మన జాతి ప్రదర్శించింది. అప్పుడది తనకు తెలియని విషయాలను అన్యుల నుంచి భక్తితో నేర్చుకొనేది. తనకు తెలిసిన విషయాలను ఇతరులకు శ్రద్ధతో నేర్పేది. పరుల నుంచి నేర్చుకొనడం తన ఆధిక్యానికి భంగకరమనే భావం వుండేది కాదు; పరులకు నేర్పడం స్వీయోదరణ పోషణకు భంగకరమనే భయం కూడా వుండేది కాదు.

గ్రీక్ దేశస్తుల నుంచి ఖగోళశాస్త్రాన్ని గురించి అనేక విషయాలను నేర్చుకొన్నందున వారిపట్ల భక్తి సూచకంగా మన ప్రాచీన ఖగోళ శాస్త్రజ్ఞుడు వరాహమిహిరుడు తన ఖగోళశాస్త్ర గ్రంథానికి "హోరా శాస్త్రం" అని నామకరణం చేశాడు. నాటకాల ప్రదర్శన సందర్భంలో తెరల వినియోగాన్ని గ్రీక్ దేశస్థుల నుంచే నేర్చుకున్నందున కాబోలు, మన ప్రాచీన నాటకకర్తలు తెరకు "యవనిక" అని పేరు పెట్టారు. (మన ప్రాచీనులు గ్రీక్ దేశస్థులను "యవనులు" అని వ్యవహరించేవారు).

క్రీస్తు శకం పదవ శతాబ్దం ప్రాంతాల ఏ జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల దుష్ట సన్నివేశం వల్ల నైతేనేమి, తనకు తెలియనిది తెలుసుకొనదగనట్టిదేనన్న అహంకారం ప్రబలింది. తనకు తెలసిన విషయాలను గుప్తపరచకపోతే, తమ నోటి దగ్గరి కూడు పడిపోవచ్చుననే స్వార్థబుద్ధి సైతం అప్పుడే హెచ్చిపోయింది.

ఈ సంకుచిత దృష్టిని - ఈ స్వార్థబుద్ధిని - మన జాతి ఏనాడు ప్రదర్శించ నారంభించిందో ఆనాడే దాని పురోగమనం నిలిచిపోయింది; దాని పతనం ప్రారంభమైంది.

ఈ చారిత్రక సత్యాన్ని గుర్తించి వుంటే, నాగరీ ప్రచారిణీ సభ వారు విజాతీయ పదప్రయోగాన్ని నిషేధించి వుండేవారా? వారి నిషేధ ఫలితం సంస్కృతాన్ని మృతప్రాయమైన దాన్నిగా మిగల్చడమే కాగలదు గాని, దాన్ని తిరిగి జీవద్విలసితం చేయడం కాగలదా? *(ఆంధ్రప్రభ 19-5-1948)*

సజీవ భాష

2

నాగరీ ప్రచారిణీ సభలో ప్రసంగిస్తూ, శ్రీ సంపూర్ణానంద్ ఏ యే ఆంగ్లేయ పదాలను ఏయే సందర్భాలలో ప్రయోగించాడో మనకు తెలియదు. కాని, తాను ప్రకటించదలుచుకొన్న భావాన్ని నిర్దిష్టంగా నేమి, నిర్దుష్టంగానేమి స్ఫురింపచేయగల సంస్కృత పదాలు లభించనందున విధిలేక ఆయన ఇంగ్లీషు మాటలను వాడివుండవచ్చు.

కొన్ని భావాలను ప్రకటించడానికి సంస్కృతంలో పదజాలం లభించి వుండకపోవచ్చునని సూచించడం సంస్కృత భాషను కించపరచడం కానేరదు. అది ఉదాత్తమైన భాషే; లలితమైన భాషే; మధురమైన భాషే, తేనె తియ్యదనం, వెన్న మెత్తదనం దానికున్నాయి, కోయిల గొంతుతోపాటు మేఘాల గర్జనను కూడా దానిలో వినవచ్చు. సాగరపు గాంభీర్యంతోపాటు ఇంద్రచాపం వన్నె చిన్నెలను కూడా దానిలో చూడవచ్చు.

అయినప్పటికీ కొన్ని భావాలను - ముఖ్యంగా ఆధునిక భావాలను - సంస్కృతం వెల్లడించలేక పోవచ్చు. అది ఉచ్ఛస్థితిలో నున్నప్పటికంటే ఈనాడు విజ్ఞానరంగం మహావిశాలం. అప్పటికీ, ఇప్పటికీ మధ్యకాలంలో ఎన్ని కొత్త సత్యాలు సంశోధించబడలేదు? ఎన్ని కొత్త విషయాలు కనుగొనబడలేదు? ఎన్ని కొత్త సిద్ధాంతాలు జరగలేదు? నాడు ప్రామాణికాలుగా స్వీకరించబడిన అనేక విషయాలు నేడు కేవలం భ్రమజనితాలుగా భావించబడుతున్నాయి; నాడు అసంభవంగా పరిగణించబడిన అనేక విషయాలు నేడు సంభవాలైనవి కూడా.

మానవుని విజ్ఞానం గడచిన వెయ్యి సంవత్సరాలలో - ముఖ్యంగా గత శతాబ్దత్రయంలో - ఎంతగా విస్తరించిందో, సంస్కృత భాష అంతగా అభివృద్ధి చెందలేదని సంస్కృతమే జాతీయ భాష కావాలని ప్రస్తుతం విపరీతవాదం చేస్తున్నవారైనా అంగీకరించక తప్పదు.

పైగా, నాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ, వాణిజ్య, వ్యావసాయిక, పారిశ్రామికాది వ్యవస్థలు నేడు లేవు. మనువు, పరాశరుడు "స్మృతులు" వ్రాసిన నాటికి, కౌటిల్యుడు "అర్థశాస్త్రం" రాసిన నాటికి, చరకుడు "చరక సంహిత" రాసిన నాటికి, వాత్స్యాయనుడు "కామసూత్రాలు" రాసిన నాటికి, స్కందగుప్తుడు "శిల్పరత్నం" రాసిన నాటికి, వరాహమిహిరుడు "బృహజ్జాతకం" రాసిన నాటికి, భోజుడు "సమరాంగణ సూత్రధార" రాసిన నాటికి ఏయే వ్యవస్థలు కలవో, ఏయే అవధులకు విజ్ఞానం విస్తరించిందో, వాటిని వర్ణించడానికి ఆ గ్రంథకర్తలకు పదజాలం సమృద్ధిగానే లభించింది. అట్టి పదజాలం లభ్యపడక పోయినప్పుడు వారు దాన్ని సృష్టించుకో గలిగారు కూడా.

అయితే, నాటి వ్యవస్థలు మారిపోయాయి; నాటికంటే విజ్ఞాన రంగం ఎంతో విస్తరించింది. ఈ పరిణామం భాషలో రాలేదు. అంచేతనే కొత్త వ్యవస్థలను పాత భాషలో వర్ణించలేకపోవడం; కొత్త భావాలను పాత పదజాలంలో వెల్లడించలేకపోవడం.

ఉదాహరణకు చరకుడు, శుశ్రుతుడు తమ “సంహితలు” రాసినప్పటికంటే ఇప్పుడు శరీర శాస్త్రజ్ఞానం ఎంతో అధికం అయినప్పుడు వారి గ్రంథాలలోని పరిభాషతో ఇప్పటి “మెడికల్ కాలేజీ”లలో “ఎనాటమీ” చెప్పగలడం సాధ్యమా?

మరొక ఉదాహరణ తీసుకోవాలంటే, రామాయణ, మహాభారతాల కాలంలో సైన్యంలో పత్తి, సేనాముఖం, గుల్మం, గణం, వాహిని, పృతన, చమువు, అనీకినీ, అక్షౌహిణీ అనే విభాగాలుండేవి. సైన్యాధ్యక్షులలో రథి, అతిరథుడు, మహారథుడు అనే విభాగాలుండేవి. మేఘ, వాయు, గరుడ, నారాయణ, వరుణ, ఆగ్నేయ, పాశుపత, బ్రహ్మ మొదలైన అస్త్రాలను - నిజమో, కాదో గాని - ప్రయోగిస్తుండే వారట. సూచి, పద్మ, అర్ధచంద్ర మొదలైన వ్యూహాలను ఉపయోగిస్తుండే వారట. నాటి చతురంగబలాలు నేడు లేవు; నాటి ఆయుధాలుగాని, యుద్ధ పద్ధతులుగాని నేడు లేవు. అయినప్పుడు పాత పరిభాషతో ఈనాటి సైన్యాన్నిగాని, యుద్ధాన్నిగాని వర్ణించగలమా?

పైగా, పూర్వం కొన్ని పదాలకున్న ప్రత్యేకార్థాలు నేడు వాటికి లేవు. కౌటిల్యుని “అర్థశాస్త్రం పరిభాష ప్రకారం “సచివుడు” అంటే న్యాయశాఖామంత్రి; “సుమంతుడు” అంటే ఆర్థిక మంత్రి, “అమాత్యుడు” అంటే రివెన్యూ మంత్రి. కాని, ఈనాడు సచివుడు, సుమంతుడు, అమాత్యుడు అనే మూడు పదాలను మంత్రి అనే దానికి కేవలం పర్యాయ పదాలుగా ప్రయోగించడం సంభవిస్తున్నది. కొన్ని పదాలకున్న ప్రత్యేకార్థం కాలక్రమాన ఈ రీతిగా పోవడమే కాకుండా, కొన్ని శబ్దాలకు భిన్నార్థం వచ్చింది కూడా. ఉదాహరణకు కౌటిల్యుని “అర్థశాస్త్రం” ప్రకారం “పండితుడు” అంటే “లెజిస్లేటర్”. ఈ పదాన్ని ఈ అర్థంలో ఈనాడు వాడకం చేయగలమా? వాడకం చేస్తే, అది అపార్థాలకు అవకాశమివ్వదా?

అంచేత ఏ విధంగా చూచినా, ప్రాచీన పదజాలంతో ఆధునిక భావాలన్నింటిని ప్రకటించడం సాధ్యం కాదనడం సుస్పష్టం. కొత్త భావాల ప్రకటనకు కొత్త పదజాలం విధిగా కావాలి. ఇట్టి పదజాలాన్ని ఎప్పటికప్పుడు సమకూర్చుకొన గలిగిందే సజీవభాష.

ప్రపంచభాషలలో నేడు ఇంగ్లీషుకున్న ప్రాధాన్యానికి కారణం - అది ఎప్పటికప్పుడు ఎన్నో కొత్త పదాలను స్వంతం చేసుకొనడమే. గ్రీక్, లాటిన్, ఫ్రెంచి, జర్మన్ మొదలైన యూరోపియన్ భాషలలో నుంచి మాత్రమే కాకుండా మన దేశభాషలలో నుంచి కూడా చాలా మాటలు ఆంగ్లేయ పదకోశాలలోకి ఎక్కిపోయాయి.

తెలుగుమాట “పందికొక్కు” ఇంగ్లీషులోకి వెళ్ళి, “బ్యాండీ కూట్” అయింది. అరవమాట “కట్టిమరం” (చేపల పడవ) ఇంగ్లీషులోకి వెళ్ళి "కెటమరాన్" అయింది. ఇదే విధంగా "పండిట్" “సాహిబ్” “ఇజ్జత్ ” “షికారీ” “జగన్నాథ్ ” “పక్కా” “బంగ్లో మొదలైన పదాలన్నీ మన సంస్కృతం, హిందీ, ఉర్దూ భాషల నుంచి ఇంగ్లీషులోకి పోయినవే.

ఈ విధంగా నిత్యాభివృద్ధి చెందకుండా అచ్చ ఇంగ్లీషుగానే “ఆంగ్లో-శాక్సన్"గానే) అది మిగిలివుంటే, కేవలం ఆటవికుల సంఘానికి అది ఉపయోగపడగలిగేదేమో గాని, ఆధునిక సంఘానికి పనికిమాలినదై వుండేది.

ఇంగ్లీషువలె మన భాషలు కూడా కాలానుగుణంగా అభివృద్ధి చెందితేనే, అవి సజీవభాషలు కావడమైనా; మనం సర్వతోముఖాభివృద్ధి చెందడమైనా, (ఆంధ్రప్రభ 20-5-1948)

సజీవ భాష

3

సంస్కృతం సజీవభాష కాదంటే కొందరికి కష్టం కలగవచ్చు; అది మృతభాష అంటే కోపమే రావచ్చు.

ఏమైనా, అది చిరకాలంగా ప్రచారంలో లేని భాష, ప్రజా జీవితంతో సంబంధంలేని భాష, అంచేత దానికి ఎదుగుబొదుగులున్నా, లేకపోయినా చిక్కులేదు.

కాని, తక్కిన మన దేశభాషలు కాలాన్ని బట్టి - పరిస్థితులను బట్టి - సంతతాభివృద్ధి చెందక తప్పదు. మనం కోరినా, కోరకపోయినా, కాలప్రభావమేమి, పరిస్థితుల ప్రాబల్యమేమి వాటిని యథాతథంగా మననివ్వవు. ఎప్పటికప్పుడు అవి మార్పు చెందవలసిందే; ఎప్పటికప్పుడు అవి ముందుకు నడవవలసిందే. లేకపోతే పని జరగదు; బండి నడవదు; బ్రతుకు వెళ్ళమారదు.

ఉదాహరణగా మన తెలుగునే తీసుకోవచ్చు. అచ్చ తెలుగు అచ్చ తెలుగువారిలోనే నూటికి 99 మందికి వెయ్యికి 999 మందికని చెప్పడమే ఎక్కువ సమంజసం కాగలదేమో! ఈనాడు అర్థం కాదు.
కొత్త కొత్త మాటలు తెలుగులో చేరిపోతుంటే "అయ్యో! మన నుడి ఎంత చెడిపోతున్నది" అని కొందరు గోల పెట్టివుండవచ్చు. అయినా, ఏ భాషతో ఏ మాత్రం సంపర్కం ఏర్పడినా, దాని నుంచి ఏవో కొన్ని మాటలు తెలుగులో చేరక మానలేదు.

ఇది భాషా సాంకర్యమని కొందరు వాదించవచ్చు. కాని, సంకరభాష కానిది సజీవభాష కానేకాదేమో! ఈనాడు ఇంగ్లీషును మించిన సంకరభాష మరి లేదు. అయినా, దాన్ని మించిన సజీవభాషలు ఎన్ని కలవు?

సంస్కృతం తర్వాత మన ఆంధ్రభాషకు అధిక సంపర్కం ఉర్దూ, ఇంగ్లీషు భాషలతో, కొంతకాలం ముస్లింలు, మరి కొంతకాలం బ్రిటీష్ వారు మనలను పరిపాలించడమే ఇందుకు కారణం.

ఈ విజాతీయ పరిపాలకులను మనం ఎంతైనా విద్వేషించి వుండవచ్చు. అయినా, వారు స్థాపించిన వ్యవస్థలలో మన జీవితం గడవడానికి వారి భాషలనుంచి అనేక పదాలను స్వీకరించక తప్పలేదు.

తెలుగులో చేరిన ఉర్దూ, ఇంగ్లీషు మాటలను ఈనాడు వెలివెయ్యాలంటే నిత్యజీవిత వ్యవహారాలు కొనసాగడం సయితం కష్టమైపోవచ్చు. ఉదాహరణకు మన న్యాయస్థానాలను తీసుకుంటే, వాటికి సంబంధించిన పదజాలంలో సగం ఉర్దూ మాటలైతే, మిగిలిన సగం ఇంగ్లీషు మాటలు.

మున్సబు, వకీలు, నాజర్, అమీనా, ఫిర్యాది, ముద్దాయి, దావా, దరఖాస్తు, వాయిదా, పూచీకత్తులు, దస్తావేజులు, నకళ్లు, వకాలనామా మొదలైనవి ఎన్నో ఉర్దూ మాటలైతే, కోర్టు, జడ్జి, మేజస్ట్రేట్ స్టాంపు, ప్లెయింట్, కంప్లెయింట్, ఆన్సరు, లా పాయింటు, లిమిటేషను, క్రాసు, ఆర్గ్యుమెంటు మొదలైనవి ఎన్నో ఇంగ్లీషు మాటలు.

ఇక, వ్యవసాయాన్ని, దానికి సంబంధించిన ప్రభుత్వశాఖలను చూడబోతే, నూటికి 99 మాటలు ఉర్దూ నుంచి వచ్చినవే. నిజానికి 'రైతు" "ఆసామి" అనేవి కూడా ఉర్దూ మాటలే. ఇవికాక, ఈనాం, మొఖానా, జమీ, శిస్తు, మామూళ్లు, జమాబంది, ఫసలీ, పేష్కస్, నజరానా, ఇర్సాలు, ఖజానా, మున్సబు, తహసీల్దారు, సిరస్తాదారు, డఫేదారు, డలాయతు మొదలైన వాటికి అంతే లేదు. చిత్రం ఏమంటే, మనలో పెక్కుమంది అచ్చతెలుగు మాటలని భ్రమపడే "యేతాం", "గడమంచి" అనేవి కూడా ఉర్దూ పదాలే.

మహమ్మదీయులు ప్రవేశపెట్టిన రెవెన్యూ డిపార్ట్మెంట్ ను బ్రిటిష్ వారు దాదాపు యథాతథంగా మిగల్చడమే ఈ శాఖకు సంబంధించినంత వరకు ఇన్ని ఉర్దూ మాటలు ఇప్పటికీ చలామణి కావడానికి కారణమై వుండవచ్చు. కాని, రెవెన్యూ ఇన్ స్పెక్టర్, డిప్యూటీ కలెక్టర్, కలెక్టర్, డి.ఫారం, పెనాల్టీ మొదలైన ఇంగ్లీషు మాటలు కూడా కొన్ని కొత్తగా చేరకపోలేదు.

పైగా, తాలూకా ఆఫీసు, జిల్లా కలెక్టర్ మొదలైన ఉర్దూ, ఇంగ్లీషు మిశ్రమ సమాసాలు కూడా కొన్ని ఏర్పడ్డాయి.

ఇక, వర్తక, వ్యాపారాలను చూడబోతే రోజు, చిట్టా, ఆవర్జా, బేరీజు, రొక్కం, నగదు, లావాదేవి, తరాజు మొదలైనవి ఉర్దూ మాటలైతే, కమీషన్, డిస్కౌంటు, ఇన్‌వాయిస్ వగైరాలన్నీ ఇంగ్లీషు మాటలు.
ఈ విధంగా మన నిత్యజీవితంలో ఏ రంగాన్ని చూడబోయినా, దానిలో కొల్లలుగా ఉర్దూ, ఇంగ్లీషు మాటలే కానవస్తాయి.

ఈ మాటలలో కొన్ని సాంఘిక, ఆర్థిక, రాజకీయాది వ్యవస్థలు మారిపోవడం వల్ల విధిగా మన భాషలో చేరినట్టివి; మరికొన్ని కొత్త భావాలు ప్రచారంలోకి వచ్చినందునో, కొత్త వస్తువులు ఉపయోగంలోకి వచ్చినందునో అనివార్యంగా చేరినట్టివి.

ఉదాహరణకు, మన దేశాన్ని పరిపాలనా సౌలభ్యానికి పరగణా, జిల్లా, తాలూకా, ఫిర్కాల కింద విభజించినవారు ముస్లిములు. ఈ విధానమే చాలావరకు ఇప్పటికీ అమలులో కలదు. అంచేత వారు పెట్టిన పేర్లనే ఇప్పటికీ మనం ఉపయోగిస్తున్నాము.

ఇదేవిధంగా బ్రిటిష్ వారి ప్రభుత్వంలో మనకు లెజిస్లేటివ్ అసెంబ్లీ, కౌన్సిల్, కార్పొరేషన్, మునిసిపాలిటీ, వోటు, ఎలెక్షన్ మొదలైనవన్నీ వచ్చినందున వాటికి ఆ ఇంగ్లీషు మాటలనే మనం వాడక తప్పడం లేదు.

ఇదే విధంగా ముస్లిముల రాకతో బులాకీ, బేసరి, జూకా, పాంజేబు మొదలైన నగలు, అత్తరుదాను, పన్నీరుదాను, పాన్దాను మొదలైన పాత్రికలు, నౌబత్తు, సన్నాయి, తాషా, బాకా, డోలు మొదలైన ఎన్నెన్నో మనకు వాడకంలోకి వచ్చాయి. మనకు అంతకుముందు లేని వీటినన్నింటిని వీటి ఉర్దూ పేర్లతో పిలవక తప్పుతుందా?

ఇదే రీతిని బ్రిటీష్ వారి రాకతో ఉపయోగంలోకి వచ్చిన రైలు, వేగన్, స్టీమర్, కారు, లారీ, బస్సు, రేడియో మొదలైన వాటికి వేరే పేర్లు పెట్టుకోగలమా? పెట్టుకుంటే, "ధూమశకటం, పొగ ఓడ" "నిస్తంత్రీ యంత్రం" మొదలైన అనువాదాల వలె అతి ఘోరమైనవిగా పరిణమించవా?
అంచేత కాలాన్ని బట్టి, పరిస్థితిని బట్టి, కొత్త శబ్దాలను అంతర్భూతం చేసుకొనడం ప్రతి భాష ధర్మం. ఇందుకు వైముఖ్యాన్ని చూపేది మృతభాష కావడానికి ఎంతో కాలం పట్టదు. *(ఆంధ్రప్రభ 21-5-1948)*

సజీవ భాష - 4

ఎప్పటికప్పుడు ఏవో కొన్ని కొత్త మాటలు ప్రతి సజీవభాషలో చేరుతూనే వుంటాయి; ఎప్పటికప్పుడు ఎవరో కొందరు ఈ సహజ పరిణామాన్ని ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తూనే వుంటారు.

"జిల్లా కలెక్టరు" అంటే తెలుగు తగులబడిపోతుందని "మండల కరగ్రాహి" అనే మాటను కల్పించినవారు ఈ తెగకు చెందినవారే.

"రైల్వే" అంటే కొంప మునిగిపోతుందని "అయోమార్గం" అనే మాటను సృష్టించినవారు ఈ కోవకు చెందినవారే. విజ్ఞులమని, పండితులమని భావించుకొనేవారు చేసే ఈ పొరపాటును సామాన్య ప్రజలు చేయరు.

దైనందిన వ్యవహారాలు నడవడానికి ఏదైనా ఒక విజాతీయ పదంతో అవసరం పడితే, దాన్ని సర్వసాధారణంగా యథాతథంగానే వారు స్వీకరిస్తారు.

జిల్లా జడ్జిని "మండల ప్రాడ్వివాకుడు" అనమని కొమ్ములు తిరిగిన పండితుడు చెప్పినా వారు ఒప్పుకోరు; జిల్లా జడ్జిని ఆ పేరుతోనే వ్యవహరిస్తారు.

మార్కెట్టును "వ్యాపార రంగం" అనమని సాక్షాత్తు ఆ బ్రహ్మదేవుడే చెప్పినా, వారు అందుకు సమ్మతించరు; మార్కెట్టును ఆ పేరుతోనే పిలుస్తారు.

ఇట్టి పదాల విషయంలో సామాన్య ప్రజలు ఏదైనా మార్పుకు అంగీకరిస్తే, విజాతీయ శబ్దం పరుషమైనదైతే, దాన్ని సరళం చేసుకొనడం వరకే.

"లాంటర్న్" వారి చెవులకు పరుషం. అంచేత దాన్ని "లాంతరు" అని సరళం చేశారు.
"రోడ్" రోడ్డు కావడం, "బిల్" బిల్లు కావడం, "వోట్" వోటు కావడం ఈ సూత్రం ప్రకారమే. ఈ విధంగా ఒక విజాతీయ పదాన్ని సరళం చేసుకోడానికి వీలుకాకపోతే, దాన్ని ఏదో ఒక విధంగా వారు తెనిగించుకుంటారు.
"డ్రెడ్జర్" నోరు తిరగని మాట. దీన్ని తెనిగించడానికి ఒక పండితుడు ప్రయత్నించివుంటే, బహుశా "భూవిచ్ఛేదక యంత్రం" అనే సమాసం తప్ప అన్యం అతనికి తోచివుండేది కాదు. కాని, విశాఖపట్నం రేవులోని మన కూలీలు "తవ్వోడ" (తవ్వే ఓడ) అని "డ్రెడ్జర్"కు తెలుగు పేరు పెట్టగలిగారు!

"ఫాలింగ్ ప్రైసెస్" అనే ఇంగ్లీషు ప్రయోగాన్ని "క్రమానుగతంగా క్షీణిస్తున్న ధరలు" అని అనువదించడం తప్ప మరొక పద్ధతి పండితులకు చేతకాకపోవచ్చు. కాని, సామాన్య ప్రజలు దీన్ని "దిగుడు ధరలు" అని తెనిగించగలరు.
ప్రజాబాహుళ్యానికీ, వారి జీవితానికి సంబంధించినంత వరకు మనకు అవసరమైన ఏ విజాతీయ పదాన్ని ఏ రూపంలో స్వీకరించ దగుననేది ఒక సమస్య కానే కాదు.
ఈ విషయంలో వారు సర్వసాధారణంగా సర్వోత్తమమైన నిర్ణయాన్నే చేస్తారు. ఒకవేళ వారి నిర్ణయం సముచితమైనది కాకపోయినా, దానికి అప్పీలు లేదు.

కాగా, విద్యార్థి లోకానికో, పత్రికా ప్రపంచానికో, గ్రంథ రచయితల వర్గానికి సంబంధించినంత వరకే గట్టి చిక్కు బ్రతుకునుంచి కాకుండా మెదడు నుంచి ఒకమాట పుట్టినప్పుడు అది నూటికి 99 పాళ్ళు వికారమైనదే అయివుంటుంది.

హార్స్ పవర్ అనే దానికి “గుర్రపు శక్తి", పెనాల్టీ అనేదానికి “ధనదండనం". బ్లాక్ మార్కెట్టు ” అనేదానికి “చీకటి బజారు” ఇందుకు మూడు తార్కాణాలు.

దేశభాషలతోనే ఇకమీదట విద్యాబోధ జరగాలనే నిర్ణయం చేయబడినందున ఈ ప్రమాదం ఇప్పుడు మరింత హెచ్చింది.
ఏది సజీవభాష కాగలదనే ప్రశ్నకు ప్రస్తుతమున్న అధిక ప్రాధాన్యానికి కారణమిదే.*(ఆంధ్రప్రభ 22-5-1948)*

సజీవ భాష - 5

మన సాహితీ సంస్కృతులు ప్రపంచంలోని ఏ దేశం వాటికీ ఎంత మాత్రం తీసిపోవు.
గ్రీసుకు ఒక సోక్రటీస్ వుంటే మనకొక శంకరాచార్య దున్నాడు.
గ్రీసుకు ఒక హోమర్ వుంటే మనకొక వాల్మీకి వున్నాడు.
ఇటలీకి ఒక గెలిలియో వుంటే, మనకొక వరాహమిహిరు దున్నాడు.
బ్రిటన్ కు ఒక షేక్ స్పియర్ వుంటే, మనకొక కాళిదాసు ఉన్నాడు.
బ్రిటనకు ఒక న్యూటన్ వుంటే, మనకొక భాస్కరాచార్యుదున్నాడు.
ఫ్రాన్సుకు ఒక వాల్టేర్ వుంటే, మనకొక చార్వాకు దున్నాడు.
హాలెండ్ కు ఒక రెంబ్రాంట్ వుంటే మనకొక జక్కణాచార్య దున్నాడు.
చైనాకు ఒక క్యూసియస్ వుంటే, మనకొక నాగార్జునాచార్య దున్నాడు.



పర్షియా కొక ఉమర్ ఖయాం వుంటే, మనకొక జగన్నాధ పండితుదున్నాడు. ఈజిప్షియన్ పిరమిడ్స్ ఘనమైనవైతే, మన అజంతా, ఎల్లోరా గుహలు కూడా ఘనమైనవే. పైసాలోని శిఖరం గొప్పదైతే, మన సార్ నాధ్ లోని అశోక స్థంభం కూడా గొప్పదే.మాస్కోలోని క్రిప్లిన్ కు ఢిల్లీలోని మన లాల్ ఖిల్లా సరిసమానమైనదే. సాహితీ సంస్కృతులకు సంబంధించినంత వరకు మనం ఏ దేశానికీ ఎంతమాత్రం తీసిపోక పోయినా, ఈనాడు వైజ్ఞానిక శాస్త్రాలలో అగ్రస్థానం పాశ్చాత్య దేశాలదని అంగీకరించడం మనకు న్యూనత కాదు. ఈ అగ్రస్థానం ముఖ్యంగా గడచిన మూడు, నాలుగు శతాబ్దాలలోనే సిద్ధించి ఉండవచ్చు. ఏమైనా, ఈనాడు వైజ్ఞానిక శాస్త్రాలు చాలావరకు వాటి సొత్తు.

ఇటీవల మన దేశంలో జగదీశ్ చంద్రబోస్, బ్రహ్మచారి, మేఘనాథ్ షా, రామన్ మొదలైన వైజ్ఞానిక శాస్త్రవేత్తలు ఉద్భవించి వుండవచ్చు. వీరు ప్రపంచ ప్రఖ్యాతి నార్జించుకొని వుండవచ్చు. అయినప్పటికీ వైజ్ఞానిక శాస్త్రాలను గురించి పాశ్చాత్య దేశాల నుంచి మనం నేర్చుకొనవలసింది ఎంతో కలదు. ఆధునిక వైజ్ఞానిక శాస్త్రాలు ప్రధానంగా పాశ్చాత్య దేశాలవైనందున, వాటికి సంబంధించిన పారిభాషిక పదాలు చాలావరకు పాశ్చాత్య భాషలకు చెందినవే.

పాశ్చాత్యభాషలు అనేకం. కాని, వైజ్ఞానిక శాస్త్రాలకు చెందిన పారిభాషిక పదాల విషయంలో ఒక పాశ్చాత్య దేశానికీ, మరొక దానికి అంతగా భేదం కానరాదట. సరిగా ఒకేమాట రెండు దేశాలలో చలామణి కాకపోయినా, వాటి ధ్వనిలో సామీప్యం కానవస్తుందట.

దాదాపు ఏకవిధమైన ఈ వైజ్ఞానిక శాస్త్ర పరిభాష పాశ్చాత్య ప్రపంచం మొత్తంపై వైజ్ఞానిక శాస్త్రాభివృద్ధికి అపారమైన దోహదమిచ్చింది. వైజ్ఞానికశాస్త్ర రంగానికి సంబంధించినంత వరకు జాతీయపు సరిహద్దులను చెరిపివేసింది.

ఇంతవరకు మనదేశంలో వైజ్ఞానిక శాస్త్రాల బోధ ఇంగ్లీషులోనే జరిగినందున, వీటికి సంబంధించిన పరిభాష మనకొక ప్రశ్న కాలేదు. కాని, ప్రతి ప్రాంతంలోను ఇకమీదట ప్రాంతీయ భాషలలోనే విద్యాబోధ జరగాలనడంతో ఇది ఒక ప్రధాన సమస్యగానే పరిణమించింది.

ఈ సందర్భంలో కొందరు వైజ్ఞానిక శాస్త్ర పరిభాషను మన దేశ భాషలలోకి అనువదించుకొన దగునని సూచిస్తున్నారు. ఈ అనువాదాన్ని కొనసాగించడానికి హిందీ, బెంగాలీ భాషలలో ప్రయత్నం జరుగుతున్నట్టు వింటున్నాము కూడా, ఈ ప్రయత్నం జయప్రదం కావడం కష్టం. ఏదో ఒక విధంగా దీన్ని ఒక కొలికికి తీసుకురావడం జరిగితే, అందువల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ.

గంధకికామ్లము (సల్ఫ్యూరిక్ యాసిడ్), నత్రికామ్లము (నైట్రిక్ యాసిడ్), ఉదజహరికామ్లము (హైడ్రోక్లోరిక్ యాసిడ్), కర్బన ద్వయామ్లజనితము (కార్బన్ డైయాక్సైడ్), పటాసియనత్రితము (పొటాషియం నైట్రేట్) - ఈ ధోరణిలో తప్ప అనువాదం సాధ్యపడదు. ఈ ఘోరమైన అనువాదం జిహ్వకు పరిశ్రమ కల్పించడానికి తప్ప మరి దేనికైనా ఉపయోగపడగలదా?

పైగా, ఏ ప్రాంతంవారు ఆ ప్రాంతపు పరిభాషలో వైజ్ఞానిక శాస్త్రాలను అభ్యసిస్తే, అన్యప్రాంతాలలో వారు దమ్మిడికైనా చెల్లగలరా? ఉన్నత విద్యకై విదేశాలకు వెళ్ళడం అసంభవమే కాదా?

అంచేత ఏ విధంగా చూచినా, వైజ్ఞానిక శాస్త్ర పరిభాషను అనువదించగోరడం అనుచితం; అది మూర్ఖత్వం కూడా కాగలదనడం కటువుగా తోచవచ్చుగాని, సత్యేతరం మాత్రం కాదు. అన్యభాషా పదాలు మన సాహిత్యంలోనే విశేషంగా ప్రవేశించాయి. ప్రాచీనులలో శ్రీనాధుడంతటివాడు "ఖుసి మీరన్ సురధాణి నిండుకొలువై కూర్చున్న" అని వ్రాశాడు. ఆధునికులలో శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి "పేపరులోన వ్రాసితిని, పెద్దలతోడ వచించితిన్" అని అన్నాడు. వీరిద్దరు వాడిన విజాతీయ పదాల వల్ల వీరి పద్యాలు సొగసు చెడలేదు సరిగదా, వాటికెంతో లబ్జు వచ్చింది. అయినప్పుడు వైజ్ఞానిక శాస్త్ర పరిభాషను అనువదించుకోవాలనే ఆలోచన ఎందుకు రావాలి? ప్రయత్నమెందుకు జరగాలి?

ఈ శాస్త్రాలలో మన పూర్వోన్నత్యాన్ని తిరిగి సాధించాలన్నా, వీటి విషయంలో పాశ్చాత్య దేశాలతో సరిసమానం కావాలన్నా, వాటి పరిభాషను యథాతథంగా స్వీకరించడమే కాకుండా, ప్రాంతీయ, జాతీయ భాషలతోపాటు ఏదో ఒక విదేశీయ భాషను ప్రతి కళాశాల విద్యార్థి - ముఖ్యంగా ప్రతి వైజ్ఞానికశాస్త్ర విద్యార్థి - అభ్యసించి తీరాలి. ఇట్టి చర్య మన దేశమేమి, మన భాషలేమి సర్వతోముఖాభివృద్ధి చెందడానికి అత్యవసరం.

(ఆంధ్రప్రభ 23-5-1948)

బాల సాహిత్యం

మన దేశంలో - ముఖ్యంగా మన భాషలో - పెద్దవారికి పనికివచ్చే పుస్తకాలే పలచ, పలచగా తప్పలేవు. ఇక, మనకున్న పిల్లల పుస్తకాలను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చునేమో?

గిరాకీ లేనందువల్లనే ప్రత్యేకంగా పిల్లలకోసం పుస్తకాలు పుష్కలంగా రావడం లేదేమోనని అనుకోడానికి వీలులేదు. పిల్లల పత్రికల సంఖ్యను బట్టి చూచినా, వాటిలో కొన్నింటి ప్రచారాన్నిబట్టి చూచినా, బాల సాహిత్యం విశేషంగా చలామణి కావడానికి అవకాశ మేర్పడినట్టే కనబడుతున్నది.

కేవలం క్లాసు పుస్తకాలతోనే సరి పెట్టాలని పిల్లలు ఎన్నడూ అనుకోరు. "కాకి ఈక నలుపు" ని చదవమంటే మారాం చేసే పిల్లలే "అనగా అనగా ఒక కాకి..." అని చదువుకోడానికి చెవి కోసుకుంటారు. ఇదివరలో కాకపోయినా, ఇప్పుడిప్పుడు తల్లిదండ్రులు సైతం తమ బిడ్డలు పుస్తకాలను చూచి బెదిరిపోరాదన్నా, వారికి చదువుపై ఆసక్తి కలగాలన్నా, కథా వాఙ్మయమే అందుకు ఉత్తమ సాధనమని గుర్తిస్తున్నారు. కేవలం చదువుపై ఆసక్తిని కలిగించడానికే కాక, భావనా పటిమను పెంపొందించడానికి, ప్రపంచ జ్ఞానాన్ని గరపడానికి కథా వాఙ్మయం విశేషంగా తోడ్పడగలదని కూడా వారు గ్రహిస్తున్నారు.

"కాకి మాట్లాడుతుందా? కోతి తీర్పులు చెబుతుందా? కీలుగుర్రాలు ఉంటాయా? ఖేచరులనే వారెవరు? - ఇట్టి పిచ్చి పిచ్చి ఊహలను చిన్నతనం నుంచీ పిల్లలకు నూరిపోయబట్టే ప్రపంచంలో ఇంతగా మూఢనమ్మకాలు పాతుకుపోయినవి" అని మొదటిలో సోవియెట్ రష్యాలో "కాకమ్మ కథల" పై ("ఫెయిరీ టేల్స్" పై) నిషేధాన్ని విధించారు. కాని, పిల్లలలో రెక్కలు కట్టుకోవలసిన ఊహాశక్తి తమ చర్య ఫలితంగా కుంటుపడుతున్నదని గ్రహించి, త్వరలోనే ఆ నిషేధాన్ని రద్దు చేసుకొనడమే కాక, "కాకమ్మ కథ"లకు ప్రోత్సాహమిచ్చారు. అందువల్లనే ఆ దేశం నుంచి "స్టోన్ ఫ్లవర్"ను పోలిన మహత్తర చలన చిత్రం వచ్చింది.

"పంచతంత్రం", "హితోపదేశం" ఆవిర్భవించిన మన దేశంలో బాలబాలికల లేత మనస్సులను ఆకర్షించగల కథలకు కొరతలేదు. కాని, కేవలం పాత వాటితోనే సంతృప్తి చెందడం చాలదు; కొత్త కొత్త వాటిని సృష్టించాలి; వాటిని ప్రచారంలోకి తీసుకురావాలి.

మనమధ్య వెంటనే ఒక హాన్స్ యాండర్సన్, లేదా, ఒక లూయిస్ కరోల్, గ్రిమ్ సోదరద్వయం తలయెత్తకపోవచ్చు. డెన్మార్క్ బ్రిటన్, జర్మనీలకు చెందిన ఈ బాలవాఙ్మయ బ్రహ్మల అంతస్థుకు పోగలవారికి ఇంతలో మనం నోచుకొనలేక పోయినా, శ్రీ చింతా దీక్షితులుగారి "లీలా సుందరి"ని పోలిన రచనలు రెండు, మూడు తప్ప ప్రశంసాపాత్రమైన బాల సాహిత్యం కొంతవరకైనా వెలువడకపోవడం శోచనీయం.

ఇరవై దాటిన తర్వాత ప్రతి అయిదు సంవత్సరాల వయోభేదం, బుద్ధి పరిపక్వతకు సంబంధించినంత వరకు విశేషమైన అంతరాన్ని చూపించకపోవచ్చు. కాని, ఇరవై లోపల ప్రతి ఐదేళ్ళు - కాదు, ప్రతి రెండేళ్ళ -

వయోభేదం కూడా ఇట్టి అంతరాన్ని విశేషంగా చూపిస్తుంది. ఇందువల్లనే ఏడేళ్ళవానికి రాసిన పుస్తకం ఐదేళ్ళవానికి కొరుకుడు పడదు; తొమ్మిదేళ్ళ వానికి వ్రాసినదాన్ని పదేళ్ళవాడు హర్షించలేడు.

బాలసాహిత్య రంగంలో కృషిచేస్తున్న వారు ఈ ముఖ్యాంశాన్నే దృష్టిలో పెట్టుకొంటున్నట్టు తోచదు. వయస్సుకు, బుద్ధి వికాసానికి సరిపోగల ఇతివృత్తాలను ఎన్నుకొనడం లేదు సరిగదా, వయోభేదాలకు తగు భాషనైనా వాడడం లేదు. పిన్నవారికి ఉద్దేశించబడిన పుస్తకాలలో పెద్దవారికి సైతం నోరు తిరగని ప్రయోగాలు జరగడం కద్దు.

బాలసాహిత్యంలో విషయానికి ఎంత ప్రాధాన్యం కలదో, దాన్ని అందించే తీరుకు అంత ప్రాధాన్యం ఉంది. ఐనా, బాలసాహిత్య ముద్రణలో ఏవో చిత్రాలను ఉపయోగిస్తున్నారు కాని, అవి అన్ని సందర్భాలలోను ఉత్తమమైనవిగా ఉండడం లేదు.

ఈ విషయాలన్నింటి పై మన రాష్ట్ర ప్రభుత్వం వారి దృష్టి కొంతవరకైనా కలదనడానికి వారు తెలుగు భాషాసమితి ద్వారా బాలసాహిత్యంలో ఉత్తమ గ్రంథానికి రెండేళ్ళనాడు ఒక బహుమతి ఏర్పరచడం, నిరుడు చెన్నపురిలో బాలబాలికల నిమిత్తం ప్రత్యేకంగా ఒక గ్రంథాలయాన్ని ప్రారంభించడం నిదర్శనాలు. చెన్నపురిలోని గ్రంథాలయ వార్షికోత్సవం నిన్ననే జరిగింది.

దానికి అధ్యక్షత వహిస్తూ ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలోని ప్రతి వాక్యం సమర్థనీయమైంది. కాని, ప్రజల నుంచి విశేష సహాయాన్ని ఆశించక, ప్రభుత్వమే బాలసాహిత్యం విషయంలో ఇతోధిక శ్రద్ధ వహించాలి. చెన్నపురిలోని గ్రంథాలయాన్ని, పోలిన దాన్ని ప్రతి జిల్లా కేంద్రంలోనూ స్థాపించాలి. ప్రతి సంవత్సరం బాలసాహిత్యానికి ఒక బహుమతిని ఇవ్వాలి. *(ఆంధ్రప్రభ 2-12-1951)*

తెలుగులో చట్టాలు

రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలన్నీ పూర్తిగా తెలుగులో జరగడానికి ముఖ్యమైన అవరోధం ఇంగ్లీషులో ఉన్న శాసనాలు తెలుగులోనికి ఇంకా రాకపోవడం. ఈ అనువాద కార్యక్రమం పూర్తి అయితేనేకాని, తెలుగు పూర్తిగా అధికారభాష అయినట్టుకాదు. మన శాసనాలు ఇంగ్లీషులో వందలాది వున్నాయి. వాటినన్నిటిని తెలుగు చేయించడానికి చాలాకాలం పడుతుంది. అంతవరకు వేచి వుండాలనడం సబబుకాదు. ముఖ్యమైన వాటినైనా త్వరత్వరగా తర్జుమా చేయించి ఉపయోగించడం మొదలు పెట్టాలి.

ఈ తర్జుమా కార్యక్రమం దగ్గిరే అసలు చిక్కంతా వస్తుంది. ఈ సమస్యలన్నిటిని వివరిస్తూ ఈ అనువాద వ్యవహారాన్ని చూస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ పి.వి.నరసింహారావు మొన్న అసెంబ్లీకి ఒక శ్వేతపత్రాన్ని సమర్పించారు. ఆయన దానిలో చేసిన సూచనలు స్థూలంగా బాగానే వున్నాయి. కాని, వాటిని ఆచరణలో పెట్టడంలోనే చిక్కులన్నీ.

ఇంగ్లీషు నుంచి తెలుగుకు, ముఖ్యంగా శాసనాలను, నిబంధనలను అనువాదం చేసేటప్పుడు ఇంగ్లీషు మూలానికి తెలుగు అనువాదం యథాతథంగా ఉండాలి. ఇంగ్లీషుకు సరియైన తెలుగుమాట పడాలి. ఆ మాట సరళంగా వుండాలి. సులభంగా వాడుకలోనికి రాదగినదిగా వుండాలి. ప్రజలకు అర్థమయ్యేదిగా ఉండాలి. ఇంకా ఇటువంటి సూత్రాలెన్నిటినో పాటించాలి. కాని, ఆచరణలో ఈ సూత్రాలు ఏ రూపం పొందుతున్నాయి? ఇప్పటివరకు ప్రభుత్వం నిపుణుల సంఘాలను, అనువాదకులను నియమించి చేయించిన అనువాదాలు చూస్తుంటే పూర్తిగా అసంతృప్తి కలుగుతున్నది. కొన్ని అనువాదాలలో భాష తెలుగా, పైశాచీ భాషా, అసలు భాషా అనిపించే విధంగా వున్నది. కర్ణ కఠోరంగా ఉండడం అటుంచి, తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషులలో ఎంత పండితుడైనా వాడికి కూడా అర్థంకాని రీతిలో వున్నది. ఇక , సామాన్యుల సంగతి చెప్పనక్కరలేదు.

దీనికి ముఖ్యకారణం హిందీ పదాలను యథాతథంగా తెలుగులోనికి దిగుమతి చేయడం. కేంద్ర అధికారభాషా సంఘంలో సభ్యులైన శ్రీ నరసింహారావు ఆ సంఘం సిఫారసు లన్నిటికి తలవూపడం వల్ల ఈ చిక్కు వచ్చినట్టు కనిపిస్తుంది. ఆ హిందీ మాటలైనా సహజమైనవి కావు. చిరకాలంగా హిందీ ప్రాంతంలో వాడుకలో ఉన్న పార్సీ, ఉర్దూ, ఆరబిక్ భాషా పదాలను విసర్జించి వాటి స్థానంలో సంస్కృతపదాలను కృతకంగా సృష్టించడం జరిగింది. అది హిందీ వారికే అర్థం కాని భాష. దాన్ని ఇతర ప్రాంతాల వారిమీద రుద్దడం ఏమి న్యాయం? హిందీవారు వారి తిప్పలేవో వారు పడతారు. అన్ని ప్రాంతాలలోను ఒకే పదజాలం వుండాలనే నెపంతో హిందీ కృతక పదాలను తెలుగు మీద రుద్దడం ఎందుకు? దీనివల్ల తెలుగు భాష కానీ కావడం లేదా?

హిందీవారి పదబంధాలను యథాతథంగా స్వీకరిస్తే కొన్ని విపరీతార్థాలు కూడా తెలుగులో సంభవిస్తా యనడానికి ఒక ఉదాహరణ: రేడియో స్టేషన్ డైరెక్టర్ అనే మాటకు హిందీ వారు "వితంతు కార్యాలయాధ్యక్షు"డని వాడుతున్నారట. దీన్ని తెలుగులోకి దింపితే మనం హర్షించగలమా?

ఇంగ్లీషు మాటలకు సంస్కృత పదాల అనువాదాలను తెలుగులోకి తీసుకురావడానికి ఇప్పుడు జరుగుతున్న ప్రయత్నం కొత్తదికాదు. ఇదివరలో తెలుగు పండితులు పెక్కుమంది చేసినదే వీరేశలింగంగారు కొన్ని ఇట్టి కొత్త ప్రయోగాలను చేశారు. రైల్వేను ఆయన అయోమార్గం అన్నారు. పోలీసును రక్షకభటుడన్నారు. కలెక్టరును మండల కరగ్రాహి అని, డిస్ట్రిక్టు మేజిస్ట్రేటును మండల దండనాథుడని అన్నారు. ఈ మాటలేవీ వాడుకలోకి రాలేదు. ఆయనతోనే పోయాయి.

ఇంచుమించుగా ఇటువంటి పదాలను, ఇంతకంటే వికారంగా వుండేవాటిని హిందీ ద్వారా తెలుగులోకి తీసుకురావడానికి మన ప్రభుత్వం యత్నిస్తుంది. పోనీ, ఇంగ్లీషు పూర్తిగా నివారించ గలిగిందా అంటే అదీ లేదు. అవసరమైన చోట్ల ఇంగ్లీషు మాటలను ఉపయోగించవచ్చుననే సూత్రాన్నిబట్టి కొన్ని ఇంగ్లీషు పదాలను యథాతథంగా ఉంచింది. చివరికి ఏదీ కాని ఒక కృతక భాష తయారైంది. ఆ మధ్య పత్రికలలో ప్రచురితమైన అదనపు భూమిశిస్తు చెల్లింపుకు సంబంధించిన ఫారం నమూనాలో ఈ విషయం విదితమైంది.

ఏ భాష అయినా ప్రజల నిత్య వ్యవహారావసరాలను బట్టే అభివృద్ధి అవుతుంది. ప్రజల అవసరాలలో నుంచి పుట్టిన మాటలే సరియైనవి. వాటికి వేరే ప్రమాణం అక్కరలేదు. వ్యవహారమే వాటికి ప్రమాణం. విశాఖపట్టణం హార్బరు నిర్మాణ సమయంలో డ్రెడ్జరును మొదటిసారిగా అక్కడి కూలీలు చూశారట. దానికి వారు "తవ్వోడ" అని పేరు

పెట్టారు. అంతకంటే మంచి మాటను ఏ పండితుడు సృష్టించలేదు. దాన్నే మన ప్రభుత్వానువాదకుల వంటి వారికి అప్పగిస్తే ఏ "భూవిచ్ఛేదక యంత్ర"మనో అని వుందురు.

ఈ విధంగా ప్రజల వ్యవహారంలో కొత్త మాటలు పుట్టడమే కాదు, ఇతర భాషల నుంచి అవసరార్థం ఎన్నో పదాలు తెలుగులో చేరి తెలుగు అయిపోయాయి. మన దేశానికి మొదటగా వచ్చిన యూరపియన్లు పోర్చుగీసువారు. వారి భాష నుంచి ఎన్నో పదాలు తెలుగులోకి వచ్చాయి. సముద్రపు ఒడ్డుకు "కోస్తా" అనే మాట వారిదే. మనం తాళం చెవి అనే దాని మూలం "చావి" అనే పోర్చుగీసు మాట. ఇక ఇంగ్లీషు నుంచి, ఉర్దూ, పార్సీల నుంచి వచ్చిన మాటలకు లెక్కలేదు. ఇంగ్లీషు నుంచి వచ్చినవేవో మనకు తెలిసినవే. వీటిలో అనేక పదాలు ప్రజల నిత్య వ్యవహారంలోనికి వెళ్ళాయి. అదే విధంగా ఉర్దూ, పార్సీ శబ్దాలనేకం వాడుకలో వున్నాయి. సర్కారు, శిస్తు, కిస్తీ, ఫసలీ, అర్జీ, మాసూలు, జిల్లా, తాలూకా, ఫిర్కా మునసబు ఇంకా ఎన్నో. ఆఖరికి రైతు అనే పదం సైతం ఉర్దూ నుంచి వచ్చినదే. ఈ మాటలకు అర్థాలను ఏ రైతుకు చెప్పనక్కరలేదు.

వీటిని యథాతథంగా ఉపయోగించడం మానివేసి, హిందీలో నుంచి కొత్త మాటలను తీసుకోవడం కంటే తెలివి తక్కువలేదు. హిందీవారు వాడుకలోవున్న వాటిని వదలిపెట్టి సంస్కృతజన్యమైన పదాలను తీసుకోవడమే వివేకహీనం కాగా, వారిని చూచి మనం వాతలు పెట్టుకోవడం ఇంకా వివేకహీనం కాగలదు.

అయినప్పటికీ, ఈ అనువాద వ్యవహారాలను చూస్తున్న మంత్రి శ్రీ నరసింహరావుకు హిందీ మాటలపట్ల మోజు ఎందుకు కలిగిందో అర్థం కావడం లేదు. కొత్తగా ఏ మాటను సృష్టించినా అది మొదట అసహజంగా కనిపిస్తుందని, కాలక్రమాన అదే అలవాటై పోతుందని ఆయన అంటున్నారు. ఇది కొంతవరకు నిజమే కావచ్చు కాని, ప్రభుత్వానువాదాలలో ఉపయుక్త మవుతున్న భాషను ఈ విధంగా సమర్థించబూనడం అన్యాయం. ఉదాహరణకు భూమిశిస్తు అనేమాట వుండగా "భూరాజస్వము" అని ఎందుకు వాడవలసి వచ్చింది? ఈ మాటను ప్రజలకు అలవాటు చేయడానికి ఎన్ని దశాబ్దాల కాలం కావాలి? అలాగే "ఫారం" అనేమాట వుండగా "ప్రరూపము" అనేమాట ఎందుకు తీసుకువచ్చారు?

శాసనాల భాష సామాన్య ప్రజల కోసం ఉద్దేశించింది కాదని, న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయస్థాన వ్యవహారాలు తెలిసినవారి కోసమని, వారు ఈ పరిభాషను కష్టపడి నేర్చుకోవలసిందే నన్నది మంత్రిగారి వాదాలలో ఒకటని తెలుస్తుంది. ఇంతకంటే అర్థంలేని వాదం మరొకటి మాకు కనిపించడం లేదు. శాసనాలు కొద్దిమంది న్యాయవేత్తలు మాత్రమే ఉపయోగించే వైనప్పుడు వాటిని ఇంగ్లీషులోనే యథాతథంగా వుంచక ఇంత ధనం, కాలం, శ్రమ వెచ్చించి తెలుగు చేయించడం దేనికి? అసలు తెలుగును అధికార భాషగా చేయడం దేనికి? ప్రజల భాషను వినియోగిస్తున్నామని గొప్పలు చెప్పుకొనడానికా? ప్రభుత్వం ఈనాడు సమర్థిస్తున్న అనువాద భాష ప్రజల భాషా?

ఒకందుకు మాత్రం సంతోషం. వివిధ శాసనాల అనువాదాలను నికరం చేసే ముందు వాటిని విషయజ్ఞులు చర్చించడం మంచిదని ప్రభుత్వం భావిస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఇది జరగడం ఎంతైనా అవసరం.

సాహిత్యంలో అశ్లీలం

సాహిత్యంలో అశ్లీలం వుండవచ్చునా? ఇది చిరకాలంగా విమర్శకులను, ప్రభుత్వాలను కూడా వేధిస్తున్న ప్రశ్న. దీనికి సమాధానం చెప్పడానికి ముందు ఏది అశ్లీలం, ఏది కాదు అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఈ పని చేయవలసింది సహృదయులైన పాఠకులు, విమర్శకులే కాని ప్రభుత్వాధికారులు కారు; న్యాయస్థానాలు కూడా కావు.

సుప్రసిద్ధుడైన బెంగాలీ కవి, నవలా రచయిత, విమర్శకుడు బుద్ధదేవ్ బోసు రచించిన "రాత్ భారే బృష్టి" అనే నవల అశ్లీలమైనదని ఇటీవల కలకత్తాలో అడిషనల్ చీఫ్ ప్రెసిడెన్సీ మేజిస్ట్రేట్ నిర్ణయించి రచయితకు రెండు వందల రూపాయల జరిమానా, లేకపోతే ఒక నెల జైలు శిక్ష విధించారు. ఈ వార్త సాహిత్య ప్రియులకు నిజంగా ఆందోళనకరమైనది.

ఈ సందర్భంలో ముఖ్యంగా జ్ఞాపకం వచ్చే సంఘటనలు రెండు వున్నాయి. ఒకటి జేమ్స్ జాయిస్ నవల "యులిసెస్'పై నిషేధం. అది 1922లో వెలువడినప్పుడు దాని కాపీలను న్యూయార్క్ పోస్టల్ శాఖవారు దహనం చేశారు. 1923లో దాని రెండవ ఎడిషన్ ప్రతులను స్వాధీనం చేసుకున్నారు.

మరొక సంఘటన డి. హెచ్. లారెన్స్ నవల "లేడీ ఛాటర్ లీస్ లవర్"కు సంబంధించినట్టిది. దాన్ని కూడా బ్రిటీష్ ప్రభుత్వం మొదట నిషేధించింది. ఈ రెండు సందర్భాలలోను కూడా సుప్రసిద్ధులైన బ్రిటీష్ రచయితలనేకులు జాయిస్, లారెన్ల నవలలు అశ్లీలమైనవి కావని. వాటిని నిషేధించడం అన్యాయమని తీవ్రంగా ఆక్షేపణలు చేస్తూ ప్రకటనలు చేశారు.

"యులిసెస్" పై అమెరికాలో నిషేధం 1933 వరకు తొలగిపోలేదు. "లేడీ ఛాటర్ లీస్ లవర్"పై 1960 వరకు నిషేధం కొనసాగింది. 1959లో అశ్లీల ప్రచురణల చట్టానికి జరిగిన సవరణలను ఆధారం చేసుకుని పెన్ గ్విన్ సంస్థ లారెన్స్ నవల కేసులో గెలిచింది.

దురదృష్టవశాత్తు ఇండియాలో అశ్లీలంగా వున్నవనే పేరుతో కొన్ని నిజమైన సాహిత్యపు విలువలు కలిగిన గ్రంథాలపై నిఘం కొనసాగుతున్నది. శ్రీ బుద్ధదేవ్ బోసు రచనపై నిషేధం కూడా ఈ కోవకు చెందినదేనని పలువురు ప్రఖ్యాత బెంగాలీ రచయితలు అభిప్రాయపడుతున్నారు.

అశ్లీలం పేరుతో నిషేధించవలసి వస్తే కోణార్క దేవాలయాన్ని పడగొట్టి, బంగాళాఖాతంలోనికి త్రోసివేయాలి. ఖజురాహో శిల్పాలను ధ్వంసం చేయాలి, లేదా విదేశాల వారికి అమ్ముకోవాలి. దక్షిణాదిన గల పెక్కు ప్రసిద్ధ దేవాలయాలను నేలమట్టం చేయాలి. మనకు వారసత్వంగా వచ్చిన చిత్రకళా ఖండాలలో పెక్కింటిని భూగర్భంలో పాతి పెట్టాలి.

ఇంతేకాదు, అశ్లీలంగా వున్నవనే కారణాన మన ప్రబంధాలను, పురాణాలను దహనం చేయాలి. ఒకప్పుడు కొన్ని ప్రబంధాలను ముద్రించినందుకుగాను వావిళ్ళవారిపై కేసు పెట్టడం జరిగింది కూడా. ఈ విధంగా కేసులు

పెడుతూపోతే పూర్వపు సంస్కృత సాహిత్యంలో గాని, ప్రాంతీయ వాఙ్మయాలలోగాని మనకు మిగిలేది చాలా తక్కువ. ఉదాహరణకు జయదేవుని "గీతగోవిందం" వంటి సుందరకావ్యం కూడా అశ్లీలకావ్యమనే నిందను తప్పించుకొనలేకపోవచ్చు.

బుద్ధదేవ్ బోసు నవల విషయమై యు.ఎన్.ఐ. వార్తాసంస్థ ప్రముఖ రచయితలతో చేసిన ఇంటర్వ్యూలలో ఒక్క తారాశంకర్ బెనర్జీ మాత్రమే భిన్నాభిప్రాయం వెలిబుచ్చారు. రచయిత ఏదిపడితే అది వ్రాయకూడదని, అసభ్య శృంగారాన్ని వర్ణించే రచనను నిషేధించే హక్కు ప్రభుత్వానికి వున్నదని ఆయన అంటున్నారు.

నిజమే కాని, సాహిత్యంలో ఏది అసభ్యమో, ఏదో కాదో నిర్ణయించవలసింది పండితులు, విమర్శకులే కాని, ప్రభుత్వాలు మాత్రం కావు, కారాదు.

నిజమైన సాహిత్యానికి నిషిద్ధమైనదేదీ లేదు. మొత్తం మానవజీవితమే దానికి ఇతివృత్తం. వీరం, కరుణంతోపాటు భయానకం, బీభత్సం, రౌద్రం సాహిత్యంలో ఆదరణీయాలని ప్రాచీన సంస్కృతాలంకారికులు అంగీకరించారు. క్రైస్తవనీతిలో ఏమోగాని, హైందవ ధర్మం ప్రకారం సాహిత్యంలో శృంగారం నిషిద్ధం కానే కాదు. రచయిత పాతకులలో కేవలం పాశవిక ప్రవృత్తిని రెచ్చగొట్టడానికే శృంగారవర్ణన చేశాడా, లేక ఒక ఉదాత్త ప్రయోజనాన్ని ఆశించి, మానవ మనస్తత్వవిశ్లేషణ కోసం చేశాడా అన్నది చూడాలి. ముఖ్యంగా బుద్ధదేవ్ బోసువంటి అగ్రశ్రేణి రచయితలు కేవలం అసభ్యతను అసభ్యత కోసమే వర్ణిస్తారని విశ్వసించడం కష్టం. అట్టి రచయితలపట్ల ఉదార దృష్టితో నిబంధనలను వర్తింపజేయకపోతే సాహిత్యానికి తీరని అపచారం జరుగుతుంది.

(ఆంధ్రజ్యోతి 24-12-1970)

అధికార భాషా సమస్య

ప్రజా జీవితంలో పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఉత్పన్నమౌతున్న సమస్యలు కొన్ని కాగా, ప్రభుత్వాలు కల్పిస్తున్నవి కొన్ని. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలలో ఒక తీవ్ర సమస్య అయికూర్చున్న వాటిలో అధికార భాషను గురించిన దొకటి. దానికి కారణం కేంద్ర ప్రభుత్వపు విధానాలేనని చెప్పక తప్పదు.

హిందీని అధికార భాషగా చేయాలని రాజ్యాంగం నిర్దేశించినప్పటికి ఈ సమస్యను దూరదృష్టితో, రాజనీతిజ్ఞతతో పరిగణించిన జవహర్ లాల్ నెహ్రూ నాన్ హిందీ ప్రాంతాల వారికి కొన్ని హామీలిచ్చారు. వాటిలో ముఖ్యమైనది - నాన్ హిందీ ప్రాంతాలవారు కోరే వరకు ఇంగ్లీషు కూడా అధికార భాషగా కొనసాగవలెనన్న దొకటి.

ఈ హామీని సిద్ధాంత రీత్యా కేంద్ర ప్రభుత్వం ఆమోదించినప్పటికి, ఇంగ్లీషును క్రమక్రమంగా తొలగించి, దాని స్థానంలో హిందీని ప్రవేశ పెట్టడానికి కొన్ని ప్రయత్నాలు చేయడంతో నాన్ హిందీ ప్రాంతాల వారిలో అనుమానాలు ప్రబలమయ్యాయి. కేంద్ర ప్రభుత్వపు విధానాలు హిందీ భాష వారికి అదనపు ప్రయోజనాలను చేకూర్చేవిగా, ఉద్యోగాల విషయంలో నాన్-హిందీ భాషల వారికి అన్యాయం చేసేవిగా ఉన్నవనే అభిప్రాయం కలిగింది. తమిళనాడులో హిందీ వ్యతిరేకత ఈనాడు హెచ్చుగా ప్రదర్శితమవుతున్నా, ఇతరమైన నాన్ హిందీ రాష్ట్రాలలో కూడా ఈ వ్యతిరేకత కొద్దిగానో, హెచ్చుగానో లేకపోలేదు. అనవసరంగా, వట్టి పుణ్యానికి ఈ వ్యతిరేకతను

రెచ్చగొట్టిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. కోయంబత్తూరులో మొన్న జరిగిన నాన్-హిందీ రాష్ట్రాల సదస్సులో ప్రసంగిస్తూ, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ కోకా సుబ్బారావు అధికార భాషా సమస్యను గురించి సాకల్యంగా వివరించారు. ఆయన కొన్ని చక్కని సూచనలు కూడా చేశారు. ముఖ్యంగా నెహ్రూ హామీలను పూర్తిగా పాటించడం అవసరమని ఆయన చేసిన సూచన అవశ్యం గమనించదగింది. హిందీని ఏకైక అధికారభాషగా అంగీకరించడానికి ఈనాడు మొత్తం దేశం సిద్ధంగా లేదు. అందుచేత ఇంగ్లీషును కొనసాగించవలసిందే. నాన్ హిందీ రాష్ట్రాలన్నీ కోరే వరకు కొనసాగించవలసిందే. అవసరమైతే పదిహేనేళ్ళ తరవాత ఆ రాష్ట్రాలలో ప్రజావాక్య సేకరణ చేయడం మంచిది. ఆ . అప్పటికి కూడా ఇంగ్లీషు కొనసాగాలనే భావం వెల్లడి అయితే, ఇంగ్లీషును కొనసాగించి మరొక పదేళ్ళ తర్వాత మరొకసారి రిఫరెండం జరపాలి. ఇది శ్రీ కోకా సూచన. ప్రజాభీష్టానికి విరుద్ధంగా హిందీని రుద్దరాదన్నదే ఇందులో ముఖ్యాంశం. హిందీవాదుల వొత్తిడికి లోబడి, లేదా పార్లమెంటులో అధిక సంఖ్యాబలాన్ని చూచుకుని ఇంగ్లీషును తొలగించడం జరిగితే, దానివల్ల ప్రయోజనం ఉండదు. పైగా ఈనాడు జరుగుతున్న వాటికంటె అవాంఛనీయ పరిణామాలు తప్పవు. దేశ విచ్చిత్తికే అది దారితీస్తుంది. ఇదే విధంగా హైకోర్టులలో, సుప్రీంకోర్టులో, ఉన్నత విద్యాదశలో ఇంగ్లీషును కొనసాగించక తప్పదని శ్రీ సుబ్బారావు చేసిన సూచన కూడా సముచితమైనది.

ప్రాంతీయ భాష, హిందీ, ఇంగ్లీషుల మధ్య ముక్కోణపు పోటీలో ఇంగ్లీషును దేశం నుంచి తరిమివేయడం జరిగితే అది జాతి జీవితానికే గొడ్డలి పెట్టుకాగలదని మాజీ ప్రధాన న్యాయమూర్తి చేసిన హెచ్చరిక సయితం అవశ్యం గమనించదగింది. ప్రాంతీయ భాషలలో విద్యాబోధన జరగడం, వాటిని ఆధునికావసరాలకు తగినట్టుగా అభివృద్ధి కావించుకోవడం అవసరమే. ఇందుకు కృషి నిరంతరాయంగా జరగవలసిందే కాని, స్వభాషాభిమానం ఇంగ్లీషు ద్వేషానికి కారణం కారాదు. మొత్తం ప్రపంచ భాషలలోనే ఇంగ్లీషు అగ్రస్థానాన్ని అలంకరిస్తూ అభివృద్ధి చెందిన భాష; ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక వాఙ్మయం అనంతంగా ఉత్పత్తి అవుతున్న భాష; ఎప్పటికప్పుడు మారిపోతున్న ప్రపంచాన్ని అవగాహన చేసుకొనడానికి భారతీయులకు ఉపకరించగల ఏకైకభాష. అది మనకు చారిత్రక కారణాల వల్ల సంక్రమించింది. ఎవరికీ మాతృభాష కానప్పటికి అది దాదాపుగా భారతీయ భాషలలో ఒకటిగా చెల్లుతున్నది. స్వభాషాభిమానంతో దాన్ని మనం నిర్లక్ష్యం చేస్తే లేదా కొందరు కోరుతున్నట్టు దేశంనుంచి దాన్ని బహిష్కరిస్తే అంతకంటె అనాలోచిత చర్య మరొకటి వుండదు. దానివల్ల ఇంగ్లీషుకు జరిగే అపకారం లేకపోగా, మన ప్రాంతీయ భాషలకే అపకారం జరుగుతుంది. రాజకీయంగా విచ్ఛిన్నకర ధోరణులకు దారితీసే ప్రమాదాన్ని అటుంచి సాంస్కృతికంగా మన జాతి అభివృద్ధి కుంటుపడే ప్రమాదం కూడా వున్నది. ఈ దృష్టి నుంచి కూడా నేడు కొనసాగుతున్న అధికార భాషా వివాదాన్ని మనం పరిగణించవలసి వున్నది.

తెలుగు వాణికి జేజేలు

(ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ స్థాపన)

అశేషాంధ్రావనిలోని అరవైమంది మహాకవులు, పండిత ప్రకాండులు, విద్యాసాగరులు, విమర్శకాగ్రేసరుల సమక్షంలో, ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ శుభాశీస్సులతో నిన్న హైదరాబాద్ లో జరిగిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ స్థాపన ఆంధ్ర సాహిత్య మహోజ్వల భవిష్యత్తుకే సూచన.
వ్యాస, వాల్మీకి, కాళిదాసుల కోవకుచెందిన అమరకవి రవీంద్రుని జన్మదినోత్సవంనాడే ఆంధ్ర సాహితీపరుల నోము పంటగా ఆంధ్ర సాహిత్య అకాడమీ జన్మదాల్చడం కూడా, నిన్నటి సభలో అకాడమీ అధ్యక్షుడు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి నుడివినట్టు శుభోదర్కం.

నాలుళ్ళ కిందట ఆంధ్రరాష్ట్రావతరణం, సుమారు ఏడాది క్రితం ఆంధ్రప్రదేశ్ నిర్మాణాల తరవాత నేటికి స్ఫూర్తికాంచిన ఆంధ్రుల చిరకాలాశయాలలో ఆంధ్ర సాహిత్య అకాడమీ సంస్థాపన పేర్కొనదగింది. వాస్తవంలో, భాషా ప్రాతిపదికపై వాంఛించబడిన ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కానీ, ఆంధ్ర సాహిత్య అకాడమీ సంస్థాపనతోనే సార్థకం కాంచగలవు.

"ప్రాచీనాంధ్ర వాజ్మయాన్ని పరికించినా, అద్యతనాంధ్ర సాహిత్య రీతులను గమనించినా భారతీయ భాషలలో దేనికీ తెలుగువాణి తీసిపోదు. అయితే, భారత దేశంలోని తక్కిన భాషలతోపాటు ఆంధ్రసాహిత్యం కూడా గతించిన వెయ్యి సంవత్సరాలలో నిమ్నోన్నతాలను, అభ్యుదయ క్షీణ దశలను చవిచూచింది. ఆధునికాంధ్ర సాహిత్యం వివిధ శాఖలలో నవనవోన్మేషంగా వృద్ధి చెందుతున్నా, కేవలం ప్రజాదరణ పైనే ఆధారపడవలసిన హేతువుచే ప్రస్తుత దేశ పరిస్థితులలో సాహితీపరులకు కనకాభిషేకాలు లేకున్న మానె, కడుపులు నిండడమే దుర్ఘట మౌతున్నది. మూడేళ్ళ క్రితం ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అధ్యక్షులుగా ఏర్పడిన అఖిలభారత సాహిత్య అకాడమీచేనేమి, నిన్న హైదరాబాద్ లో డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ చే ప్రారంభించబడిన ఆంధ్రసాహిత్య అకాడమీ ఫలితంగానేమి పై పరిస్థితులు చక్కబడి, సాహిత్యారాధకులకు తగు ప్రోత్సాహం లభించగలదని ఆశిస్తున్నాము.

ఆంధ్ర వాగ్జీవకుల చిరకాల సంచిత తపఃఫలంగా ఏర్పడిన ఆంధ్ర సాహిత్య అకాడమీ కొనసాగించి వలసిన నిర్దిష్ట కార్యక్రమాలు కార్యకర్తలచే క్రమంగా విశదం కాగలవు. ఆంధ్ర రచయితలు - ప్రాచీనులే కాని, ఆధునికులేకాని ఏ వర్గానికి చెందిన వారిలోనైనా,. ప్రజా ప్రాభవాలు కలవారిని సముచితంగా సత్కరించవచ్చు. వర్ధిష్ణువులకు తగు ప్రోత్సాహం కల్పించవచ్చు. సాహిత్యారాధనలో నిమగ్నమైన సంస్థలకు చేయూత నివ్వవచ్చు. ప్రజాభిరుచులను సంస్కరించవచ్చు. సాహిత్య ప్రమాణాలను సమున్నతంగా చెయ్యడానికి, సృజనాత్మక రచనలను ప్రోత్సహించడానికి తోడ్పడవచ్చు.

పై కార్యక్రమం ద్వారా ఆంధ్ర సంస్కృతీ సభ్యతలకు సాహిత్య అకాడమీ కాణాచి కాగలదు. నిద్రితాంధ్ర జాతిని ప్రబుద్ధం చేయగలదు. *(ఆంధ్రప్రభ 9-8-1957)*

ప్రభుత్వ భాష

భాషారాష్ట్రాలను కోరడంలో ఒక ప్రధానోద్దేశం - ప్రజలకు తెలిసిన భాషలో ప్రభుత్వం కొనసాగాలనడం. మనది ప్రజాస్వామ్య వ్యవస్థ. ఈ వ్యవస్థలో శాసనసభలకు శాసన నిర్మాణాధికార మిచ్చేవారు ప్రజలే; ప్రభుత్వానికి పరిపాలనాధికారాన్ని ప్రసాదించేవారు సయితం ప్రజలే. ఇట్టి పరిస్థితిలో ప్రజలకు తెలియని భాషలో పరిపాలన కొనసాగించేది ప్రజా ప్రభుత్వమన్న పేరుకైనా తగదు.

ప్రజలకు అర్థంకాని భాషలో శాసనసభలలో చర్చలు జరిగినా, అట్టి భాషలో ప్రభుత్వం కొనసాగినా, ఎన్నికల సమయంలో తమకు చేసిన వాగ్దానాలను తమ ప్రతినిధులు ఎంత వరకు పాలిస్తున్నారో ప్రజలు సరిగా నిర్ణయించుకొనలేరు సరిగదా, అందువల్ల ప్రజాస్వామ్య సూత్రాలలో ఒకదానికి విఘాతం కలుగుతుంది. తన సోదర పౌరులలో అత్యధిక సంఖ్యాకులకు తనపట్ల విశ్వాసం వున్న పక్షంలో తాను రాష్ట్రపతి పదవిని సయితం పొందడానికి ప్రతి భారతీయునికి హక్కు వున్నది. తనకు తెలియని ఏదో ఒక భాషలో శాసన సభలో చర్చలు జరిగినా, ప్రభుత్వ వ్యవహారాలు కొనసాగినా, ప్రజామోదం పై ఎంతటి పదవినైనా పొందడానికి తనకున్న ఈ హక్కును ప్రతి పౌరుడు వినియోగించు కొనగలగడం దాదాపు అసాధ్యమౌతుంది. అన్యభాషలలో ప్రవేశానికీ, కార్యదక్షతకు సంబంధ మేమీ లేదు. తెలుగు తప్ప మరొక భాష తెలియనివారిలో ప్రజ్ఞావంతు లెంతమంది లేరు? వ్యవహార దక్షులెంతమంది లేరు? “ఇంగ్లీషు మీకు రాదు కాబట్టి ప్రభుత్వ నాయకత్వానికి మీరు తగ”రని వారికి చెబితే - వాగ్రూపంలో కాకపోయినా, కార్యరూపంలో ప్రస్తుతం ఈ విధంగా చెప్పడమే మొత్తంపై జరుగుతున్నది - అది ప్రజాస్వామ్య సిద్ధాంతాలలో ఒక దానికి విఘాతం కలిగించడమే కాదా?

మన దేశంలో ప్రధానమైన భాషలు పన్నెండు వున్నందున, కేంద్ర, రాష్ట్రీయ ప్రభుత్వాలన్నీ ఒకే భాషలో కొనసాగడానికి వీలులేదనుకోండి. కాని, ప్రతి ప్రాంతీయ ప్రభుత్వం ఆ ప్రాంతం భాషలోనే జరగడం ముఖ్యావసరం. ఇందుకు కాకపోతే నిజానికి భాషా రాష్ట్రాలను కోరడం దేనికి? వాటిని సాధించుకొనడం దేనికి? ఒక్క బొంబాయిని మినహాయిస్తే, తక్కినవన్నీ ప్రస్తుతం ఏకభాష రాష్ట్రాలే కాబట్టి, వాటి ప్రభుత్వాలను ఆయా రాష్ట్రీయ భాషలలో నడపడానికి తగు చర్యలను గైకొనడంలో మరి విలంబన తగదు.

ఈ దృష్టితోనే మద్రాసు ప్రభుత్వం వారు తమిళాన్ని ప్రభుత్వ భాషగా ప్రకటించడానికి వెంటనే ఒక బిల్లును ప్రవేశ పెట్టబోతున్నారని ఆ ప్రభుత్వం ఆర్థిక మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం నిన్న ఒక సభలో ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సాధ్యమైనంత త్వరలో ఇట్టి శాసనాన్ని చేయించగలదని ఆశిస్తున్నాము.

ఆంధ్ర ప్రదేశ్ లో - ముఖ్యంగా తెలంగాణాలో - ఉర్దూ మాతృభాష గలవారు కొందరున్నమాట నిజమే. అయితే, వారైనా తెలుగుకు పూర్తిగా అపరిచితులని మేము అనుకోము. తెలుగు వ్రాయడం, చదవడం తెలియక పోయినా, తెలుగు మాట్లాడితే వారిలో అత్యధిక సంఖ్యాకులు అర్థం చేసుకోగలరు. అందువల్ల తెలుగును ప్రభుత్వ భాషగా ప్రకటించడంవల్ల వారికి కలగగలహాని వుండదు.

(ఆంధ్రప్రభ 22-12-1956)

రాజ భాష

అఖిలభారత రాష్ట్ర భాషా ప్రచార సమ్మేళనానికి అధ్యక్షత వహించిన శ్రీ గోవిందదాసు తీవ్ర ధోరణివల్ల హిందీకి ఉపకారం కంటె అపకారమే ఎక్కువగా జరగవచ్చు. జయపూర్ లో జరుగుతున్న ఈ సంస్థ సప్తమ సమావేశంలో ప్రసంగిస్తూ, "రాజభాషగా హిందీ నేడు ఆక్రమించుకొన్న సింహాసనంపై నుంచి దాన్ని దింపగల శక్తి ఈ ప్రపంచం మొత్తం పైనేలే" దని శ్రీ గోవిందదాసు ఉద్ఘాటించారు. ఎవరినో సవాల్ చేస్తున్న ఈ ధోరణిలో ఈయన ప్రసంగించ వలసిన అవసర మేమిటో తెలియదు. హిందీని రాజభాషగా భారత రాజ్యాంగం గుర్తించింది. ఇంగ్లీషు స్థానంలో దాన్ని రాజభాషగా ప్రవేశపెట్టడానికి ఒక గడువును కూడా నిర్ణయించి, ఆ గడువును కొంత పెంచడం అవసరం కావచ్చునన్న అభిప్రాయం హిందీ మాతృభాష కాని వారిలో పెక్కుమందికి లేకపోలేదు. అయితే, వారైనా నవభారత రాజ్యాంగం హిందీకి కల్పించిన ప్రత్యేక ప్రతిపత్తిని కాదనడం లేదు.

హిందీ పుష్టిగల భాష కాదు. తక్కిన దేశభాషలు ఇప్పటి రూపంలో కనీసం వెయ్యేళ్ళనుంచైనా వున్నాయి. హిందీ మాత్రం - ఇప్పటి దాని రూపంలో - నూరేళ్ళనాడు లేదనే చెప్పవచ్చు. ఇంకను శైశవావస్థలో నున్నందునే అది సమగ్రంగా అభివృద్ధి చెందలేదు; సర్వాంగ పుష్టిని సంపాదించుకోలేదు. ఇంతే కాదు. గడచిన నాలుగైదు దశాబ్దాలలో బెంగాలీ, మరాఠీ, తెలుగు, తమిళం, కన్నడం మొదలైన భాషలు సాధించగలిగిన పురోగతి సయితం హిందీలో కానరాదు. ఆధునిక సాహిత్యం (అనువాదాల రూపంలో తప్ప) హిందీలో బహు స్వల్పం.

అయినా, హిందీని రాజభాషగా గుర్తించడం భారత పౌరులు 37 కోట్ల మందిలో పధ్నాలుగు కోట్ల మందికి - అది మాతృభాష కాబట్టి; కనీసం మరొక ఆరుకోట్ల మందికి అది సులభంగా అర్థం కాగలదు కాబట్టి. ఈ విధంగా సంఖ్యా బలం హిందీ కున్నమాట నిజమే! కాని రాజకీయ రంగంలో, విశేషించి ప్రజాస్వామ్య రాజకీయ రంగంలో, సంఖ్యా బలానికున్న ప్రాధాన్యాన్ని భాషా రంగానికి, సాహిత్య రంగానికి యథాతథంగా విస్తరింపజేయా లనుకొనడం కంటే ప్రమాదభరితమైన విషయం వుండబోదు. ఎవరి భాషపైన వారికి విశేషాభిమానం వుంటుంది. మరొక భాషను తమపై బలవంతంగా రుద్దడానికి ప్రయత్నం జరుగుతున్నదనే అనుమాన మేర్పడితే, ఆ ప్రయత్నాన్ని నిరోధించడానికి ప్రాణా లొడ్డి పోరాడవలెనన్న పట్టుదలలు వస్తాయి కూడా.

శ్రీ గోవిందదాసును పోలిన హిందీ అభిమానులు ఈ ప్రమాదాన్ని గుర్తించక పోవడం శోచనీయం. రాజభాషగా హిందీని ప్రవేశ పెట్టడంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్నందుకు నిరసనగా దేశం మొత్తం మీద ఆందోళన జరపాలని ఆయన జయపూర్ సభలో హెచ్చరించాడు. "దేశం" అంటే "హిందీ దేశం" అనే ఆయన తాత్పర్యమా? ఈ ప్రశ్న వేయడానికి కారణం లేకపోలేదు. హిందీ వ్యాప్తిని గురించి హిందీ వారికున్న తొందరపాటు తక్కిన భాషలవారికి ఎందుకుంటుంది? ఈ పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వాన్ని నిరసించడానికి హిందీ వారు జరపగోరే ఆందోళనలో వా రెందుకు చేరతారు?

నిజానికి హిందీ విషయమై కేంద్ర ప్రభుత్వం విజ్ఞతతో, దూరదృష్టితో వ్యవహరిస్తున్నది. తమ మాతృభాష కాని దాన్ని రాజభాషగా భారత పౌరులలో అత్యధిక సంఖ్యాకులు - మొత్తం 37 కోట్లలో 23 కోట్ల మంది - అంగీకరించడమే గొప్ప విశేషం. ఇది భారత జాతీయతకు ఘన విజయం. అయితే, రాజభాషగా హిందీని

తక్కినవారు ఆమోదించారు గదా అని, వెంటనే దాన్ని స్థానంలో నిలపడానికి ప్రయత్నిస్తే, విపరిణామాలు తప్పవు. నెమ్మది నెమ్మదిగానే, ఎవ్వరికీ అసౌకర్యం లేకుండానే హిందీని దేశం మొత్తం మీద ప్రభుత్వ వ్యవహారాలకు వినియోగించాలి. సముచితమైన ఈ విధానాన్నే భారత ప్రభుత్వం అనుసరిస్తున్నది. పైగా, రాజభాషగా గుర్తించబడిన హిందీని కేవలం తమ భాషగా హిందీవారు భావించుకొనడానికి వీలులేదు. అది ప్రస్తుతం యావద్భారత భాష; అందువల్ల యావద్భారత ప్రజల భాష. దాన్ని అభివృద్ధిపరచడంలో, దాన్ని వ్యాపింప జేయడంలో అందరికీ సమాన బాధ్యత వున్నది. హిందీ ఇకముందు ఏవిధంగా పరిణామం చెందాలి? అవకతవకలతో కూడిన దాని వ్యాకరణాన్ని ఏవిధంగా సంస్కరించాలి? ఏవిధమైన పారిభాషిక పదాలను దానిలో సృష్టించుకోవాలి? ఇతర భాషల నుంచి ఏయే పదాలను దానిలోకి తీసుకోవాలి?
ఇలాంటి అనేక ప్రశ్నలను చర్చించి, నిర్ణయాలకు రావడంలో హిందీవారికంటె కూడా ఇతరులే హెచ్చుగా ప్రాధాన్యం వహించవలసి వున్నది. అందువల్ల హిందీవారు ఇదేదో తమకు మాత్రమే సంబంధించిన విషయమని భావించడమేమి, ఆవేశాలను ప్రదర్శించడ మేమి అవివేకమే కాగలదు. *(ఆంధ్రప్రభ 20-10-1956)*

ప్రాచ్యలిఖిత వాఙ్మయం

ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణంతో ఆంధ్రుల కళా, సాహిత్య సంపదలు ఇతోధికంగా పెంపొంద గలవని ఆశించడం సహజం.

ఆంధ్ర చరిత్ర, ఆంధ్ర సంస్కృతి, ఆంధ్ర భాషలకు సంబంధించిన అమూల్య వాఙ్మయం (ముద్రిత, అముద్రితాలు చేరి అనేక వేల గ్రంథాలు) మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో నిక్షిప్తమై వున్నది.
కర్నల్ మెకంజీ, ఛార్లెస్ ఫిలిప్సు బ్రౌన్, ఇలియట్ మొదలైన పాశ్చాత్య పండితులచే సంగ్రహించబడి, లోకల్ రికార్డ్స్ అని వ్యవహరించబడే పుస్తకాలన్నీ ఆంధ్ర ప్రాంతానికి చెందినవే. కేవలం తెనుగు దేశచరిత్రకు, తెనుగు సాహిత్యానికి సంబంధించినవేగాక, తెనుగు లిపిలోని సంస్కృత గ్రంథాలు వేలకు వేలు ఈ భాండాగారంలో మూలుగుతున్నవి.

తెనుగు దేశం నాలుగు మూలలు పనిపెట్టుకు తిరిగి, పాత పుస్తకాలనేకం సేకరించి, భాండాగారం అభివృద్ధికి పాటుబడిన వారిలో తెనుగువారైన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగార్లు అగ్రగణ్యులు.

కేవలం ఈ తెనుగు గ్రంథాలు యావత్తు ఆంధ్ర రాష్ట్రానికి చెందడం మాత్రమేగాక, తెనుగు దేశం నుంచి సేకరించబడిన సంస్కృతం, పర్షియన్, అరబిక్, ఉర్దూ గ్రంథాలు సయితం ఆంధ్ర రాష్ట్రానికి సంక్రమించాలి.

తెనుగు లిపిలో వున్న సంస్కృత పుస్తకాలను నకలు చేయడానికి తెనుగు లిపి సంప్రదాయ పరిజ్ఞానం, సంస్కృత భాషా పాండిత్యం రెండూ కలిగి వుండడం అవసరం. ఈ పుస్తకాలు తెనుగువారికి అందుబాటులో వున్నప్పుడే స్ఖాలిత్యాలు లేకుండా వీటి నకళ్ళు తయారు చేయడం సుసాధ్యం.

ఉత్కళ రాష్ట్రం ప్రత్యేకించబడినప్పుడు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలోని ఒరియా పుస్తకాలు, ఓఢ్రలిపిలోని సంస్కృత గ్రంథాలు ఉత్కళ రాష్ట్రానికి అప్పజెప్పబడినవి. అదే విధంగా ఆంధ్రులకు, ఆంధ్ర దేశానికి సంబంధించిన గ్రంథ సముదాయం యావత్తు ఇప్పుడు ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడం అవసరం.

మద్రాసు, ఆంధ్రరాష్ట్రాల ఆస్తిపాస్తుల విభజనలో ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారం కూడా చేరి వుండడం చేత ఆంధ్ర ప్రభుత్వం సాధ్యమైనంత త్వరలో తమ వాటాకు చెందవలసిన పుస్తకాలను సేకరించి, భద్రపరచు కోడానికి శ్రద్ధ వహించాలి. యుద్ధకాలంలో ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారాంలోని మొత్తం పుస్తకాలు ఆరేడు సంవత్సరాలు తిరుపతిలోనే భద్రపరచబడినవి. అందుచేత తెనుగువారి వాటాకు రాగల పుస్తకాలను పెట్టుకోడానికి వెంటనే ఆంధ్రదేశంలో తగిన తావు లేదన్న ఆక్షేపణ రానక్కరలేదు.
తిరుపతిలో ఇదివరకే ప్రాచ్య పరిశోధనాలయం వుండడమేగాక, అచిరకాలంలో అది విశ్వవిద్యాలయపీఠం కాబోవడం చేత కూడా ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారాన్ని అక్కడ నెలకొల్పడం సమంజసం. *(ఆంధ్రప్రభ 17-4-1954).*

ఉత్తమ కృషి

(ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ)

ఉత్తమ కృషిని కొనసాగించడం చాలదు; దాన్ని లోకానికి తెలియజేస్తూ వుండాలి. ఈ రెండవ విషయంలో ఆంధ్రప్రదేశ్ అకాడమీ తన కర్తవ్యాన్ని పూర్తిగా పరిపాలించడం లేదనే చెప్పాలి. అవతరించింది అయిదేళ్ళనాడే. నిజానికి అయిదేళ్ళు కూడా పూర్తికాలేదు అయినా, ఈ స్వల్పకాలంలోనే కనీసం పది ప్రామాణిక గ్రంథాలను అకాడమీ ప్రచురించగలిగింది. వీటిలో నాల్గింటికి అకాడమీ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి హైదరాబాద్ లో నిన్ననే ఆవిష్కరణోత్సవం జరిపారు.

అకాడమీ నిన్న ప్రచురించిన "నన్నెచోడుని పదప్రయోగ కోశము" ఈ కోవకు చెందిన గ్రంథాలలో రెండవది. "నన్నయ పదప్రయోగ కోశము" వలె ఇది కూడా పరిశోధకులకు, నిఘంటుకారులకు ఎంతగానో తోడ్పడగల ప్రచురణ.

ప్రస్తుతపు మన తెలుగు నిఘంటువుల నిర్మాణం శాస్త్రీయ పద్ధతులపై జరగలేదు. ఒక భాషలోని ప్రధాన గ్రంథాలన్నింటికి "కన్కార్డెన్స్"లను (పదప్రయోగ కోశాలను) సిద్ధపరచిన పిమ్మటనే శాస్త్రీయ పద్ధతులపై ఉత్తమ నిఘంటు నిర్మాణం సాధ్యం కాగలదు. ఇంతకు ముందు మన ఆంధ్రభాషలో ఈ కృషి జరగనేలేదు. అందువల్లనే మన తెలుగు నిఘంటువుల సంపుటాల సంఖ్య ఇటీవల ఎంతగా పెరుగుతూ వచ్చినా, వాటి ప్రాశస్త్యం మాత్రం కొంచెంగానైనా పెరగలేదు. సందేహాలను తీర్చడానికి బదులు వాటిని పెంచడానికే ప్రస్తుతపు మన నిఘంటువులు పనికి వస్తున్నాయి. ఆభరణ విశేషమని, భక్ష్య విశేషమని, వృక్ష విశేషమని, ఇంతే తప్ప వాటిలో పెక్కు పదాలకు వివరణ కానరాదు సరిగదా, ఏ పదం ఎప్పుడు ఏ అర్థంలో వాడుకలోకి వచ్చిందో, తర్వాత దాని అర్థం మారి వుంటే ఎప్పుడు మారిందో, ఎలా మారిందో, దాని నానార్థాలలో ఏది ప్రసిద్ధమైనదో, ఏది తద్భిన్నమైనదో : ఇట్టి వివరణ వాటిలో మచ్చుకైనా కానరాదు.

నన్నయ కాలం నుంచి, ఈ కాలంవరకు వివిధ యుగాలకు చెందిన సుప్రసిద్ధ గ్రంథాలన్నింటికి పదప్రయోగ కోశాలను సిద్ధపరచిన పిమ్మట నిర్మించబడిన నిఘంటువులు కానందునే "అమ్మ" అనే మాటను నన్నయకాలంలో కేవలం గౌరవ వాచకంగానే వాడేవారని, "తల్లి"కి పర్యాయ పదంగా దాన్ని వినియోగించే వారు కాదని మన ప్రస్తుత నిఘంటువులేవీ తెలపడం లేదు. ఇదేవిధంగా ఆ కాలంలో "సాని" అనే పదాన్ని కూడా కేవలం గౌరవవాచకంగానే ప్రయోగించే వారని, ధ్వనిగానైనా దానిలో నింద వుండేది కాదని అవి తెలపడం లేదు. అకాడమీ "నన్నయ పదప్రయోగ కోశము"ను ప్రచురించగానే ఇట్టి విశేషాలు మరెన్నో కూడా మొట్టమొదటి సారిగా వెల్లడైనాయి. ఆ కోశం ఆధారంగా మన యూనివర్శిటీలలో కొందరు విద్యార్థులు అప్పుడే పరిశోధనలను ప్రారంభించారు కూడా.

ఇట్టి పదప్రయోగ కోశాలను ఏ పుస్తక వ్యాపార సంస్థ ప్రచురించదు. ఇది వ్యయభారంతో కూడిన పని. పైగా పరిశోధనలలో ప్రత్యేక శ్రద్ధాసక్తులున్న ఏ కొద్దిమందినో మినహాయిస్తే, మిగిలినవారు ఈ కోశాలను కొనరు.

ఇది అది, ఆమె, అతడు, ఇక్కడ, అక్కడ మొదలైన పదాలను నన్నయ ఎన్నిసార్లు ప్రయోగించాడో నమోదు చేయడం పిచ్చిపనిగా కొందరికి తోచవచ్చు కూడా. కాని, ఒక కవి, లేదా, రచయిత, ఏయే మాటలను ఎన్నిసార్లు, ఎక్కడెక్కడ వాడినాడో నమోదుచేసి, లెక్క కట్టడంవల్ల ఇతర ప్రయోజనాలతోపాటు. ఏ కవి ఏ మాట లంటే ఎక్కువ మోజుపడేవాడో, ఆయన పదజాలం మొత్తం ఎంతో స్పష్టంగా తెలుస్తుంది. షేక్ స్పియర్, మిల్టన్, షెల్లీ, కీట్స్, బైరన్ ప్రభృతుల రచనలకు కన్కార్డెన్లను సిద్ధపరచిన పిమ్మటనే ఆంగ్లేయ కవులందరిలో పదజాలం పై ఎక్కువ అధికారం వున్నవాడు షేక్ స్పియర్ అని, ఆ తర్వాత స్థానం మిల్టన్ కు దక్కిందని రుజువైంది. కన్కార్డెన్ల కున్న ఈ బహుళ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నన్నయ, నన్నెచోడ పదప్రయోగ కోశాలను వెలువరించిన వెంటనే తిక్కన, శ్రీనాథ పదప్రయోగ కోశాలను ప్రచురణకు ఏర్పాటులను చేసింది; క్రమంగా అందరు ముఖ్య కవుల రచనలకు కూడా కన్‌కార్డెన్స్ లను సిద్ధం చేయించ నున్నది.

శాస్త్రీయ పద్ధతులపై సమగ్రమైన నిఘంటు నిర్మాణానికి కన్ కార్డెన్స్ లను సిద్ధపరచడం మాత్రమే చాలదు. భాష కేవలం సాహిత్యం సరిహద్దులకే పరిమితం కాదు; అది జీవితమంత విస్తృతమైంది. అందువల్ల గ్రంథాలకెక్కినా, ఎక్కకపోయినా, భాషలోని పలుకుబడులను, నుడికారాలను పూర్తిగా సేకరించాలి; వృత్తి పదకోశాలకు కూడా సిద్ధంచేయాలి. ఈ రెండు రంగాలలో కూడా అకాడమీ ఈసరికే ఎన్నదగు కృషిని చేసింది. పదిహేనువేలకు పైగా నుడికారాలను సేకరించి, "పదబంధ పారిజాతము" అనే పేరుతో రెండు పెద్ద సంపుటాలను అది ప్రచురించింది. వ్యవసాయానికి సంబంధించిన పదజాలాన్ని (ప్రాంతీయ విభేదాల సమేతంగా) సేకరించి, "మాండలిక వృత్తి పదకోశము - వ్యవసాయం" అనే పేరుతో నిన్ననే తొలి సంపుటాన్ని వెలువరించింది. చేనేతకు సంబంధించిన వృత్తి పదాలను రెండవ సంపుటంగా సేకరించడానికి ఏర్పాటులను చేసింది.

అంతేకాక, తెలుగులోని క్రియాపదాలన్నింటిని క్రోడీకరించి "ఆంధ్రక్రియా స్వరూప మణిదీపిక" అనే పేరుతో ఒక పెద్ద సంపుటాన్ని నిన్ననే ఆంధ్ర భాషాభిమానులకు అకాడమీ అందజేసింది. బహుముఖాలుగా జరుగుతున్న ఈ కృషి అంతిమ లక్ష్యం సంబంధించినంతవరకు "సుప్రీంకోర్టు"గా చెల్లగల ఒక బృహత్తర నిఘంటువును శాస్త్రీయ పద్ధతులపై నిర్మించడమే. ఇంతటి మహత్తర లక్ష్యాన్ని మన అకాడమీ పెట్టుకొనడం ఆధునిక ప్రపంచంలో అతి ప్రసిద్ధమైన ఫ్రెంచి ఎకాడెమీ అడుగుజాడలలో నడవవలెనన్న దీక్షతోనే డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారి

ప్రతిభావంతమైన నాయకత్వాన ఇంత త్వరలో ఇంతగా పురోగమించిన మన అకాడమీ ముమ్ముందు మరింత ఉత్తమ కృషిని కొనసాగించి, బహుశా మరి అయిదారు సంవత్సరాల లోపలనే తాను సంకల్పిస్తున్న బృహత్తర నిఘంటు నిర్మాణానికి "శ్రీకారం" చుట్టగలదని విశ్వసిస్తున్నాము.

ఆధునిక రచన

రచన ఎవరికోసం? ఆధునిక రచన ప్రయోజనం ఏమిటి? అన్న ప్రశ్నలకు సమాధానమిస్తూ, "పూర్వం పండితుల కోసం పండితులు వ్రాసేవారు. ఈనాడు రచన సామాన్య జనులను దృష్టిలో పెట్టుకుని జరగవలసి వుంది," అని శ్రీ బెజవాడ గోపాలరెడ్డి అన్న మాటలు చాలా అర్థవంతమైనవి.
"ఆధునిక రచనలో గ్రాంథిక, వ్యావహారిక భాషలస్థానం" గురించి మొన్న మద్రాసులో సాహిత్య అకాడమీ ఏర్పాటు చేసిన గోష్ఠిలో ప్రసంగిస్తూ శ్రీ గోపాలరెడ్డి పై మాటలన్నారు. స్వయంగా రచయిత, అందులో గ్రాంథికభాషా రచయిత అయిన శ్రీ గోపాలరెడ్డిపై మాటలనడంతో వాటికి మరింత విలువ ఏర్పడుతున్నది.

వ్యావహారిక భాషను ఈనాడు కొత్తగా సమర్థించవలసిన అవసరం లేనిమాట నిజమే. గ్రాంథిక, వ్యావహారిక వాదుల మధ్య పోరాటం ముగిసి చాలా కాలం గడిచింది. ఈనాడు కనీసం మన గద్య రచయితలలో పెక్కుమంది వాడుక భాషలోనే రచన చేస్తున్నారు. పత్రికలలో అధికభాగం వాడుకభాషనే అభిమానిస్తున్నవి. సినిమాలలో, రేడియోలో, ఆధునిక నాటకాలలో ఈ భాషే వాడుకలో వున్నది.

అయితే, ఊరందరిది ఒక దారి కాగా, తెలుగు విశ్వవిద్యాలయాలది మాత్రం మరొక దారి. వాటిలో నన్నయ్యనాటి కావ్యభాషకే అగ్రపీఠం; చిన్నయ్యనాటి గ్రాంథికశైలికే పెద్ద పీట. భావి రచయితలైన విద్యార్థులు ఈ భాషను నేర్చుకొని, పాఠశాలలనుంచి, కళాశాలల నుంచి బయటికి రాగానే, దానికి తిలోదకాలివ్వక తప్పడం లేదు.

మన పూర్వ సాహిత్యానికి విద్యా ప్రణాళికలో వుండవలసిన ప్రాధాన్యాన్ని మేము కాదనడం లేదు. అయితే, అది భాషా స్వరూపాన్ని, పూర్వుల ప్రతిభా విశేషాలను, వారు సాధించిన కావ్య సౌందర్యాన్ని తెలుసుకొనడం వరకే పరిమితమై వుండాలి. రచనకు మన పూర్వులు ఆపాదించిన ప్రయోజనం వేరు, ఇప్పటి అవసరాలు వేరు. ఇది ప్రజాస్వామ్య యుగం. ప్రతి పౌరుడు అక్షరాస్యుడే కాదు, విద్యావంతుడు కూడా కావలసిన అవసరం ఏర్పడింది. కనుక భాష, దానితోపాటు రచనా ప్రయోజనంకూడా కావలసిన అవసరం ఏర్పడింది. కనుక భాష, దానితోపాటు రచనా ప్రయోజనం కూడా మారక తప్పదు. ఈనాడు కేవలం కావ్య రసాస్వాదనమే రచన ప్రయోజనం కాజాలదు. విజ్ఞానశాస్త్రాలు అమితంగా పెరిగిపోతున్నవి. ప్రపంచంలో ఏ మూల ఏ సంఘటన, ఏ పరిణామం జరిగినా, తెలుసుకోవలసిన అవసరం సామాన్య మానవునికి కలుగుతున్నది. దేశంలో పారిశ్రామిక విప్లవం ప్రారంభమై, ప్రతి పౌరుడిని సమీపిస్తున్నది. ఈ స్థితిలో ఇంకా గ్రాంథికంలో వ్రాయాలా, వాడుక భాషలో వ్రాయాలా అనికాదు మనం ఆలోచించవలసినది. కొత్తగా అక్షరాస్యు లవుతున్నవారికి, కొత్తగా వివిధ వైజ్ఞానిక విషయాలను నేర్చుకొన గోరుతున్నవారికి సన్నిహితమైన, సుబోధకమైన భాషలో వ్రాయాలనడం నిర్వివాదాంశం కనుక అది ఒక సమస్య కాదు; కాగూడదు.

అంతకంటె, ఈ భాషను మరింతగా అభివృద్ధి చేయడం ఎలాగన్నదే ఆలోచించవలసిన విషయం. ఇప్పటి తెలుగు భాష గ్రాంథిక శైలిలో వున్నా, వ్యవహార శైలిలో వున్నా ఎక్కువగా కవులు, పండితులు, సాహితీపరుల చేతులలో రూపొందిన భాష. ఈనాటి అవసరాలకు ఈ భాష చాలదు. అనేక సాంకేతిక విషయాలను, ఆధునికమైన ఆలోచనలను సులభగ్రాహ్యంగా వ్యక్తం చేయడానికి ప్రస్తుత భాష చాలడం లేదు. ఇది కేవలం సాహితీపరుల చేతులనుంచి ఇతర విధాల రచనలను, ముఖ్యంగా వైజ్ఞానిక రచనలను చేసేవారి చేతులకు మారాలి. దాని పరిధి మరింత విస్తృతం కావాలి.

ఇంగ్లీషు ఈనాడు ప్రపంచంలో అగ్రభాషగా చెల్లుతుండడానికి ఒక కారణం దానిలోని ఈ విస్తృతి శీలమే. అది కేవలం సాహిత్య భాషగా వున్న రోజులు లేకపోలేదు. అయితే పారిశ్రామిక విప్లవం ప్రారంభమైన నాటినుంచి అది క్రమంగా పెరిగింది. ఇతర భాషలనుంచి స్వేచ్ఛగా పదాలను స్వీకరించి తన సంప్రదాయాలకు అనుగుణంగా వాటిని మార్చుకుని విస్తరించింది. భారత దేశంతో దాని కేర్పడిన సంబంధం మూలంగా భారతీయ భాషల నుంచి సయితం ఎన్నో పదాలను సంగ్రహించింది.

ఒకప్పుడు సంస్కృతం తెలుగు భాషకు ఎంతగానో తోడ్పడింది. సంస్కృత సంపర్కంవల్ల తెలుగు అతిసుందరభాషగా రూపొందింది. ఇప్పుడే కాదు, ఎప్పటికీ సంస్కృతం అవసరం మనకు తీరేది కాదు. కాని సంస్కృతం మన ప్రయోజనాలకు చాలనప్పుడు, ఇతర భాషల తోడ్పాటును, పరభాషా పదజాలాన్ని, స్వీకరించడానికి మనం సంకోచించరాదు. వాటి సహాయంతో తెలుగును ఆధునికం చేయడానికి వెనుకాడరాదు.

ఈ మహత్తర కృషి చేయవలసిన బాధ్యత మన రచయితల మీద, సాహిత్య అకాడమీలమీద, ఇతర సాంస్కృతిక సంస్థల పైన వున్నది; అంతకంటె ప్రధానంగా విశ్వవిద్యాలయాలపై వున్నది. వాడుక భాషను అవి ఆమోదించి, భాషా వికాసానికి, విస్తృతికి దోహదం చేయాలి. అయితే శ్రీ గోపాలరెడ్డి హెచ్చరించినట్టు, భాషను ప్రజలకు సన్నిహితంగా తీసుకువచ్చే ప్రయత్నంలో, భాష అశ్లీలమై పోకుండా, దాని సౌందర్యం, సంప్రదాయం చెడకుండా చూడాలి. ఈ బాధ్యత సయితం విశ్వవిద్యాలయాలపైనే వున్నది.

నిఖిల భారత వంగ సాహిత్య సమ్మేళనం

భారత సాహిత్య మహావనంలో బంగారు పంట పండించుకున్న భాగ్యవంతురాలు వంగభూమి. ప్రాచీన తత్త్వవిచారంతో అర్వాచీన ప్రణయ తన్మయతను రంగరించుకున్న పుణ్యాత్మురాలు వంగ సరస్వతి.

అనంత విశ్వ విజ్ఞాన పారావారంలో తేలిపోయినా, తమ దీవికి అమూల్య రత్నరాశులను కొని వచ్చేందుకేనని మఱచిపోని వారు వంగపుత్రులు,

వంగభూమి అనగానే మనకు అపరంజి ఆవ చేలు తోచవచ్చు; వంగ కవిత్వ మనగానే చక్కగా అలంకరించుకొని గవాక్షం దరిని నిలిచి రాకుమారుడు మన వీధికి రాగలడని నిరీక్షిస్తున్న వరపర్ణిని కనులకు కట్టవచ్చు; వంగ

సంగీత మనగానే పగిలి పోయిన గుండెలలో రగిలి రగిలి కుమిలిపోతున్న కుంపటి మిణుగురులు మన మనఃపథంలో తోచవచ్చు. వంగ నవల అనగానే నిర్వేదం జితించిన నిర్మలలూ, నిరంజనలూ జ్ఞాపకంరావచ్చు.

కాని అంతేకాదు వంగ సమగ్ర చిత్రం. అదొక వేయి రేకుల తామరపూవు. రేకు రేకునా రెపరెపలాడుతుండే రకరకాల గుండెల గుబగుబలందులో వినవస్తూ ఉంటాయి.

విద్యాపతులే కాదు; జయదేవులూ అక్కడ జన్మించిన వారే. తాంత్రికులే కాదు; గోస్వాములూ అక్కడ వారే, మహాకాళినే కాదు; మధుర భక్తినీ ఉపాసించినవారు వారు; ఉద్గీథలనే కాదు; ఉల్కా గీతాలనూ కుటిపించినారు వారు. ప్రేమనే కాదు; పచ్చి కసినీ క్రుమ్మరించినవారు వారు.

"నా దివ్వెలో నూనె అయిపోయినది ప్రభూ" అని నిట్టూర్చే నెలతలేకాదు; నిప్పుల కంఠంతో జనగణ బాధాశత సహస్ర విపంచికను పలికించే పడతులూ వారి కవితా కాంతకు చిరపరిచితులే. తేనె సోనల తెగద్రావి ఝుంకారం చేసే తుమ్మెదలే కాదు; వెన్నుకంటిన కడుపు తన్నుతుండగా గోలుమని గొంతు విప్పే గండుసింగములూ అక్కడ కలవు.

కాబట్టే వంగభూమి ఈ నవయుగంలో కూడా రామకృష్ణ పరమహంస, వివేకానందులనే కాక, రామమోహన్ రాయ్, కేశవచంద్రులనూ కన్నది. మైకేల్ మధుసూదన దత్తునే కాక, ఈశ్వరచంద్ర విద్యాసాగరులనూ ఒడిలో ఎత్తుకున్నది. శరచ్చంద్రునే కాక, నజురల్ ఇస్లాం, మాణిక్ వందోపాధ్యాయులనూ చంక నెత్తుకొన్నది.

చరిత్రహీనులనే కాక, అనంత క్షుధార్తులనే కాక, మానవ జీవన 'క్రందసి'నే మార్మోగించినది వంగకంఠం. ఆనంద మఠాలనే కాదు... శ్రీకాంతలనే కాదు... ఇతి కథలనూ ఇంపుగా వినిపించినది వంగభారతి. దుర్గేశనందినులనే కాదు; పథేర్ పాంచాలులనూ ప్రత్యక్షం చేసినది వంగభారతి.

భారతం నలుగడలనూ నవ్య వర్ణరంజితం చేసిన రవీంద్రుడు సామగానంతో సరికొత్త పశ్చిమ సంగీతం మేళవించి, మానవ భావ సమన్వయ గీతాన్ని ఆలపించినది వంగభూమినందే.

వంగ నవలకే కాక, భారతనవలకే నాందీ వాచకం పలికిన భాగ్యం వంగమాతదే.

భారత సామాజిక దృక్పథంలోనే కొత్త కోణాలకు రూపులు దిద్దిన మహోద్యమాలు ఆమెనుంచే ప్రక్కలకు ప్రాకినవి. రాజకీయాల రావిడినీ, పూజాదినాల పోవిడినీ, రాజకుమార్తెల రంగులనూ, రిక్షావాలాల రివాజులనూ కలగలపి రాసిపోసిన రతనాలను బజారున నిలిపి, కోకొండని అమ్మిన గొప్పదనం ఆమెది.

ముఖ్యంగా వంగసాహిత్య సంస్కృతి వికాసోద్యమాల ప్రభావం మన తెనుగునాటి పై వీరేశలింగం, గురజాడల కాలం నుండే నివాళు లెత్తినది.

మన సువర్ణయుగంలోనే నిత్య నూతన సుమాల పరిమళంతో అనుస్యూతలమై వంగసౌరభం మన ముకుపుటాలకు సోకుతూనే ఉన్నది.

"ప్రేమాలసు లీ వనిన్ జొరననర్హు" లని మన మన్నది వారి పల్లవికి అనుపల్లవిగానే. ఆ భావకవిత్వ కాలంలో పలికిన పలురకాల ఎడదకిన్నెరలు వంశీయుల తంబురా శ్రుతికి అనుగుణమైనవే.

వంగభాషతో మన సాన్నిహిత్యం ఈనాటిదీ, ఆనాటిదీ కాదు; ఓ కాలం నాటిది. అసలు వారి భాషలో ఉన్న పదాల పుట్టు పూర్వోత్తరాలను పరిశోధించిన సునీతికుమార్ ఛటర్జీ అన్నట్టు వారు సంస్కృతం నుండి మాత్రమే కాదు దాక్షిణాత్య భాషలనుండీ సంచులు సంచులు నుడినాణెములను నించికొని పోయినవారు.
త్రిలింగ కళింగ వంగములకున్న రాకపోకలు, లావాదేవీలు నిన్న, మొన్నటివి కావు అవి ఎన్నడూ ఆగక నేటివీ, రేపటివీ కూడా అవుతున్నది.

- మిగత భారతభాషలతో పోల్చిచూస్తే వంగభాష నుండే మనం ఎక్కువగా అనువదించు కున్నామేమో!

- ఈ సామరస్యం సాన్నిహిత్యం మఱింత అన్యోన్యంగా నెలకొనడానికి వారి నిఖిలభారత వంగ సాహిత్య సమ్మేళనం మన నడుమ సదస్సు నేర్పఱచడం ఆస్కారం కావచ్చు.

- సాహిత్య ప్రభావాలు కేవలం గ్రంథాల ద్వారానే కాదు, చర్చల ద్వారానూ, సమ్మేళనాల ద్వారానూ కూడ గట్టిపడగలవు.
- సాహిత్య మెంత వైయక్తిక విశిష్ట సృష్టి అయినప్పటికీ పరిషత్తులు దాని కదలికకు పనికి వచ్చినంతగా మరేవీ పనికిరావు.

నిఖిల భారత వంగ సాహిత్య సమ్మేళనం ముప్ఫై ఏళ్ళనాడు రవీంద్రుని ఆధ్వర్యం క్రింద ఏర్పడినది. భారతభాషలలోనే అది తొలి సాహిత్య పరిషత్తు కావచ్చు. ఆ నాటినుండి అనుదినం సాహిత్య సేవనం చేస్తున్నది. టాగూరువంటి మహాకవులే కాక, పి.సి.రాయి వంటి విజ్ఞాన ఖనులూ, ప్రమథబాద తర్క భూషణలవంటి ఉద్దండ పండితులూ ఈ పరిషత్తు సభాపతులై కార్యక్రమం నడిపించినారు. వీరు పరిసర భాషా ప్రాంతాలలో సభలు జరుపుకొనడం కూడ అనూచానమైన ఆచారంగా నెలకొల్పుకున్నారు. అసలిది ప్రవాసుల పరిషత్తుగానే మొదట ఆరంభమైనది. వంగంలోకి ఉత్కృష్ట గ్రంథాల అనువాదాలే కాదు, శాస్త్రీయ పద పదార్థకోశములే కాదు, చాల పనులు వీరు సంబాళించుకుంటూ వస్తున్నారు.

నేడూ రేపూ ఈ సాహిత్య సమ్మేళనం మదరాసులో సమావేశమవుతున్నది. వీరితో ప్రత్యక్ష పరిచయం మనకు కలుగుతున్నది. అది మఱంత మన భావ బాంధవ్యాన్ని బలపరచగలదని ఆశించడంలో వైచిత్రి ఏమీ లేదు.

- ఒక్కమాటు వీరి పరిషత్తు చరిత్రను ఆకళించుకుంటే ఆత్మగతంగా మనం కొన్ని అనుకోవలసి వస్తుంది.

- అప్పటి కప్పుడు, అక్కడి కక్కడ, ఆయా కొందటికోసం తప్పితే అఖిలాంధ్ర సాహిత్య పరిషత్తు మనకు ఏర్పడనే లేదు కదా!

- సాహిత్యాన్ని, కళలనూ, సాంస్కృతిక ఉద్యమాలనూ కరగిపోసి కంచు కాగడా పట్టగల సదస్సొకటి మన కింకా ఏర్పడవలసే ఉన్నది కదా!

మన పాటలు మనం వినిపించుకోవడమే గాని, ప్రక్కనున్న భాషలవారికి మన గొంతునిచ్చి, మన ప్రత్యేకతలను చెప్పుకొని, వారినుంచి తీసుకోవడమే కాక, వారి కివ్వగలది మనకున్నదని నిరూపించుకోనేలేదు గదా!

బెంగాలీ నుండి వేలకొలది మనం తెనుగు చేసుకున్నామే. వారికి తెలివిడి చేసిన మన కావ్యా లెన్ని ఉన్నవి? ఒకటి రెండు -కాకుంటే, మూడు నాల్గు - పద్యాల మాట కాదు. ఏ ఆంధ్ర కావ్యాలు వంగ భాషాంతరీకరణం పొందినవని చూపగలం?
వారి నటీపూజలను మనమనుకరించాము గాని, మన నాట్యచ్ఛాయలను వారికి చూపగలిగి నామా?
ఉప్పర మెరిసిపోయేటట్టు ఉపన్యసించడంతో ఆగిపోవడం తప్పితే, అఖిలాంధ్ర సంస్కృతి ప్రాభవాలను సుదూర దేశాల మాట అటుంచి, ఇరుగు పొరుగు నేలలకైనా రవాణా చేయగలిగినామా?

అంతెందుకు? మనలో మాటగా ఆంధ్రు లందటినీ ఒకచో చేర్చి సాహిత్య మేళం జరిగించు కొనగల ఏకైక ప్రతినిధి అయిన పరిషత్తునే నెలకొల్పుకొనలేని వారం అటూ ఇటూ ఏమి సరఫరా చేయగలం?

ఈ సమయంలో మదరాసులో నడుస్తున్న నిఖిల భారత వంగ సాహిత్య సమ్మేళనం మనలో ఒక వినూత్న కార్యదీక్షను కూడా కల్పించగలదని ఆశిస్తూ ఈ సభలు జయప్రదంగా జరగగలవని విశ్వసిస్తున్నాము.
సోదర వంగరచయితలకూ, కళాకారులకూ మా హృదయ పూర్వక స్వాగతం అర్పిస్తున్నాం.

(ఆంధ్రప్రభ.1-1-1956)

(ఆంధ్రప్రభ తెలుగు, కన్నడ భాషలకు ఏకలిపి తెలుగు, కన్నడ భాషలకు ఒకే లిపిని రూపొందించుకొనదగునని కన్నడ సాహిత్య పరిషత్తు మొన్న బళ్ళారిలో చేసిన తీర్మానం ఎంతైనా సముచితమైంది.)

ఆ తీర్మానమే వివరిస్తున్నట్టు, తెలుగు, కన్నడ లిపులకు దగ్గరి పోలిక లున్నాయి. నాగరిలిపితో బెంగాలీ, గుజరాతీ, మరాఠీ లిపులకున్న పోలికలకంటె ఇవి చాలా దగ్గరైనవని చెప్పవచ్చు నేమో కూడా! కన్నడ లిపిలో వ్రాయబడినదాన్ని, ఆ భాషతో పరిచయం లేకపోయినా, నూటికి 90 వంతులకు పైగానే తెలుగువారు తేలికగా చదువగలరు. తెలుగు లిపిలో వ్రాయబడిన దాన్ని సయితం కన్నడిగులు ఇంత సులభంగానూ చదువగలరనే అనుకోవచ్చు. ఒకే భాషా కుటుంబానికి (ద్రావిడ భాషా కుటుంబానికి) చెందినవైనా, తెలుగు, కన్నడ లిపుల నుంచి తమిళం, మలయాళం లిపులు పూర్తిగా భిన్నమైనవి. ఈ భిన్నత్వం తమిళలిపి విషయంలో కంటె మలయాళం విషయంలో మరింత హెచ్చు. మలయాళం అక్షరాలు ఆకృతిలో కొంతవరకు తమిళం అక్షరాలను పోలి వుంటాయి. అయినా, మలయాళంలో తెలుగు, కన్నడ లిపులలోవలె అక్షరాల సంఖ్య అధికం. అందువల్ల తమిళంలో వలె మలయాళంలో "కాంతి" అని వ్రాసి, "గాంధి"గా చదువుకోనక్కరలేదు. తెలుగు, కన్నడ భాషలపై వలె మలయాళంపై సంస్కృత భాషా ప్రభావం అత్యధికం. ఆకృతిలో తమిళ లిపిని పోలినా, ఇతర విధాల తెలుగు, కన్నడ లిపులకు మలయాళం సామ్యాన్ని కలిగి వుండడానికి సంస్కృత భాషకు దానిపై గల ప్రభావ ప్రాబల్యమే కారణం కావచ్చు.

ఏమైనా, ఒకటి మాత్రం కాదనరాని విషయం. నాగరిలిపివలె, తెలుగు, కన్నడం, మలయాళం లిపులుకూడా సమగ్రమైనట్టివి. ఆ లిపుల ద్వారా సూచించడానికి వీలులేని ధ్వని దాదాపు లేనేలేదు. ఉచ్చారణ ప్రకారం వ్రాత; వ్రాత ప్రకారమే ఉచ్చారణ - ఇదే ఈ లిపుల విశిష్టత. ఈ దృష్టి నుంచి చూస్తే లాటిన్ లిపిలో ఒక క్రమం కనబడదు. ఆ లిపిని ఉపయోగించే ఇంగ్లీషులో "పి-యు-టి" "పుట్" అయితే, "బి-యు-టి-" "బట్" అవుతుంది. ఫ్రెంచిలో "లూ సేనీ" అనే వర్ణక్రమం వ్రాసి, దాన్ని "లూజాన్" అని ఉచ్చరిస్తారు.

తెలుగు, కన్నడ భాషలకు ఏకలిపి ముఖ్యంగా ఇంగ్లీషుకు సంబంధించినంతవరకు రోమన్ లిపి పెక్కు లోపాలతో కూడిందన్న కారణానే, దాని సంస్కరణకు తన జీవితకాలంలో బెర్నార్డ్ షా ఆందోళన జరపడమేకాక, ఆ సంస్కరణను సాధించడానికే తన ఆస్తిలో అధిక భాగాన్ని వినియోగించాలని తన మరణ శాసనంలో వ్రాసి వెళ్ళాడు.

రోమన్ లిపి సమగ్రమైంది కాదు కాబట్టి, మన దేశ భాషలకు దాన్ని వినియోగించుకోవాలన్న సూచన ఆమోద యోగ్యమైంది కాదు. చైనా వారికున్న "చిత్రలిపి"ని నేర్చుకొనడానికి జీవిత కాలంలో అధికభాగం పడుతుంది కాబట్టి, వారు తమ లిపి స్థానంలో రోమన్ లిపిని ప్రవేశ పెట్టుకొనడం సముచితమే కావచ్చు. మన దేశ భాషలకు సంబంధించినంతవరకు మనకు ఏక లిపి అవసరమనుకుంటే, నాగరి లిపే అత్యుత్తమమైంది.

ఈ సంస్కరణ వెంటనే జరగదగునని ప్రెసిడెంట్ ప్రసాద్ ప్రభృతులు కొందరు హెచ్చరిస్తున్నా, ఇందుకు తగు వాతావరణం ప్రస్తుతం దేశంలో లేదు. అందువల్ల ఈ విస్తృత సంస్కరణ జరిగేలోగా తెలుగు, కన్నడ భాషలకు ఏక లిపిని రూపొందించుకొనడం వాంఛనీయమే కాగలదు. కన్నడ సాహిత్య సమ్మేళన తీర్మానం వివరిస్తున్నట్టు, ఏక లిపివల్ల తెలుగు, కన్నడ భాషలకు పెక్కు లాభాలు వుండగలవు. గ్రంథ ప్రచురణకు మాత్రమే ఈ లాభాలు పరిమితం కానక్కరలేదు కూడా.

ఒకనాడు తెలుగు, కన్నడ సాహిత్యాలకు ఎంతో సన్నిహిత సంబంధం వుండేది. ఒక దాని ప్రభావం మరొక దానిపై విశేషంగా పడుతూ ఉండేది. క్రీస్తు శకం పదవ శతాబ్దానికి చెందిన పంప, పొన్న, రన్న, నాగవర్మ మొదలైన కవులు వేంగి మండలంవారు. తమ జైన మతానికి ఆంధ్రలో లేని రాజాదరణం కర్ణాటకంలో లభిస్తున్నదని అక్కడికి వలసవెళ్ళి, కన్నడ భాషలో వారు అనేక ఉద్ధంథాలు వ్రాశారు. ఇదే విధంగా తనకు వైదికమతం పట్ల విశేషంగా వున్న అభిమానాన్ని పురస్కరించుకొని, కర్ణాటక ప్రాంతం నుంచి నారాయణభట్టు రాజమహేంద్రవరం చేరి, మహాభారతాన్ని తెనిగించడంలో నన్నయభట్టుకు సహాయం చేశాడు. ఒక ప్రాంతం కవులు మరొక ప్రాంతానికి ఈ రీతిగా వలస వెళ్ళడం ద్వారా తెలుగు, కన్నడ సాహిత్యాలకు సమానంగా దోహద మొనగూడింది, పంపభారతం చాయలు కొన్ని నన్నయ రచనలో కనబడగా, నన్నయ పోకడలు కొన్ని శ్రీ కృష్ణదేవరాయల కాలంలో వ్యాస భారతాన్ని కన్నడీకరించిన తిమ్మణ్ణ రచనలో కానవస్తాయి. నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, శ్రీనాథుడు మున్నగు ఆంధ్ర కవుల కవితలో కన్నడ శబ్దాల సంఖ్య అల్పమైంది కాదు. "భీమఖండము"లో శ్రీనాథుడు "నా కవిత్వంబు నిజము కర్ణాట భాష" అనే వరకు వెళ్ళాడు! ఇదివరలోవలె ఇకముందు కూడా తెలుగు, కన్నడ భాషలు,

సాహిత్యాలు పరస్పర మైత్రివల్ల పూర్తిగా లాభాన్ని పొందడానికి ఏకలిపి ఎంతైనా తోడ్పడుతుంది. ఈ విషయమై కన్నడ సాహిత్య పరిషత్తు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీతోను, ఆంధ్రప్రభుత్వంతోను ఉత్తర ప్రత్యుత్తరాలను జరప బోతున్న దట. అవి సత్ఫలమివ్వగలవనే విశ్వసిస్తున్నాము. (ఆంధ్రప్రభ 24-1-1958)

సాహిత్యం విలువలు

బోనెక్కడం లేడి ఛాటర్ లీకి కొత్త కాదు; ఒక్కొక్క సారి నిర్దోషిగా, ఒక్కొక్కప్పుడు దోషిగా తీర్పును పొందడం కూడా ఈమెకు కొత్తకాదు.

"ఎవరు ఈ లేడీ ఛాటలీ" అని "ఆంధ్రజ్యోతి" పాఠకులు కొందరు ప్రశ్నించవచ్చు. ఈమె బ్రతుకు చాలా గట్టిదే! 1930 చాయలలో డి. హెచ్. లారెన్స్ మస్తిష్కంలో ఈమె జన్మించింది. ఆయన అమరలేఖిని ఈమెను అమరజీవి చేసింది.

ఒక వరంతో పాటు ఒక శాపంకూడా కొందరి విషయంలో తప్పదు. ఈ వర్గానికి చెందిందే లేడీ ఛాటలీ. జన్మతోనే "జారిణి"గా ఈమె నిందపాలైంది. అట్టి నిందకు పాలైన నాయికలు సారస్వత ప్రపంచంలో మరెందరో లేక పోలేదు. కాని, లేడీ ఛాటలీ పడిన పడుతున్న అల్లరి మాత్రం ప్రపంచ సారస్వత చరిత్రలోనే అపూర్వం.

సారస్వతంలోనైనా, జీవితంలోనైనా పెక్కు వివాదాలకు మూలం ఒకే పదానికి విభిన్న వ్యక్తులు చేసే విభిన్న నిర్వచనాలే! ఉదాహరణకు "జారిణి" అనే పదాన్ని మీరు ఏ విధంగా నిర్వచిస్తారు? "ఏక పత్నీవ్రత కానిది జారిణి" అంటారా? అయితే, ద్రౌపది పతివ్రతగా ఏ విధంగా చెల్లగలుగుతున్నది?

తేలికగా తెమలడానికి వీలులేని ఈ చర్చలోకి మరి వెళ్ళక, డి. హెచ్. లారెన్స్ నవల విషయమై పూర్వాపరాలను సంగ్రహంగా మనవి చేస్తాము. ఇరవయ్యో శతాబ్దిలో థామస్ హార్డీ తర్వాత అంత గొప్ప ఇంగ్లీషు నవలాకారుడుగా మన్నన లందుతున్న డి. హెచ్. లారెన్స్ కొన్ని ప్రగాఢ విశ్వాసాలున్న వ్యక్తి. పారిశ్రామిక నాగరికత మానవుని జీవితాన్ని అసహజం చేస్తున్నదనడం ఈ విశ్వాసాలలో మొట్టమొదటిది. ఆధునిక యుగంలో మానవుడు మేధను పెంచుకొని, మానసిక జీవితానికి దైహిక జీవితాన్ని బలి పెడుతున్నాడనేది రెండవది. మానవునిలోని కామప్రవృత్తి సృష్టికి మూలాధారశక్తులలో ప్రప్రథమమైనది కాబట్టి, దాన్ని అసహ్యించుకొనడం కాని, దాన్ని అణచివేసుకొనడం కాని ప్రకృతి ధర్మాలకు వ్యతిరేకంగా వెళ్ళడమనేది మూడవది. సాంఘిక విధినిషేధాలేవైనా, విషయవాంఛా పరితృప్తి లేనిది పవిత్ర వివాహబంధం కాదనేది నాల్గవది. వివాహ బంధం అన్ని సందర్భాలలోను అవిచ్ఛేద్యమైనది కాకపోయినా విశృంఖల వర్తన అతి హేయమైనదనడం అయిదవది. ఇదే విధంగా డి. హెచ్. లారెన్స్ కు మరి కొన్ని గట్టినమ్మకాలుండేవి.

"కళ కళకోసం" అనే రచయితలకోవకు చెందినవాడు కాదు, డి. హెచ్. లారెన్స్; ఆయన దృష్టిలో "కళ సందేశం కోసం." ఈ కారణాన ఆయన విశ్వాసాలు ప్రస్ఫుటమయ్యేవి. ఆయన గొప్ప రచయిత కాబట్టి, ఆయన రచనలలో సందేశం ముందుకు త్రోసుకువచ్చి, కళను వెనుకకు నెట్టివేసేదికాదు; "కళాత్మక సందేశాలు"గా ఆయన రచనలను అభివర్ణించవచ్చు. అయితే, తక్కిన మహారచయితల గ్రంథాలన్నీ ఒకే స్థాయిలో లేనట్టు, ఆయన రచనలలోను కొన్ని నిమ్నోన్నతాలు కనబడతాయి. ఆయన రచనలలో "లేడీ ఛాటలీస్ లవర్" ఉత్తమమైంది. కాదు; కాని, దాన్ని అన్నింటికంటె నాసిరచనగా త్రోసిపారవేయడానికి కూడా వీలులేదు. 'సన్స్ అండ్ లవర్స్" ఆయన నవలలలో అగ్రస్థానాన్ని వహించగా "లేడీ ఛాటర్ లీస్ లవర్" మూడవ లేదా, నాల్గవస్థానాన్ని ఆక్రమిస్తుంది.

అయినా, జారత్వాన్ని అది సమర్థిస్తున్నదని, అశ్లీల పదాలు కొన్ని దానిలో కలవని లారెన్స్ ప్రచురణకర్త దాన్ని ముద్రించడానికి భయపడ్డాడు. అందువల్ల సమగ్ర రూపంలో దాని ముద్రణ బ్రిటన్లో జరగలేదు;
విదేశాలలో మాత్రమే జరిగింది. ఎన్నో కొట్టి వేతలతో కూడిన పాఠాన్ని మాత్రమే బ్రిటన్లో ప్రచురించారు. ఇంత మాత్రంచే పూర్తిపాఠం బ్రిటన్లో ప్రచారం కాకపోలేదు. దాన్ని చదవ గోరిన కొని చదువుతూనే వుండే వారు.

బ్రిటన్ లోనే కాక, యునైటెడ్ స్టేట్సులో కూడా "లేడీ ఛాటర్ లీస్ లవర్" పూర్తి పాఠం ప్రచురణపై ఆంక్ష విధించారు. అక్కడ కూడా అది రహస్యంగానే ప్రచారమౌతూ వచ్చింది. అయితే, ముందు అమెరికాలో, తర్వాత బ్రిటన్లో "లేడీ ఛాటలీస్ లవర్" పూర్తి పాఠం ప్రచురణకు కొందరు ఈ మధ్యనే సన్నద్ధం కావడం, వారిపై కేసులు నడపడం జరిగింది. ఈ రెండు దేశాలలో కూడా లేడీ ఛాటలీ నిర్దోషి" అని చివరికి తీర్పు వచ్చింది. కాని, మొన్న బొంబాయిలో అడిషనల్ చీఫ్ ప్రెసిడెన్సీ మేజస్ట్రేట్ ఈమెను "దోషి"గా నిర్ణయించారు. 'లేడీ ఛాటర్ లీ" విషయమై ఏకాభిప్రాయం బహుశా ఎన్నటికీ వ్యక్తం కాదనడానికి ఈ బొంబాయి తీర్పు నిదర్శనం.

శ్లీలా శ్లీలాలు నిత్యవినీతులు; వీటి మధ్యజీవితంలోనే హద్దులను గీయడం కష్టంకాగా, సాహిత్యంలో ఇది దాదాపు అసాధ్యం. "లేడీ ఛాటర్ లీస్ లవర్'నే తీసుకుంటే, దాన్ని మించిన నీతిబోధక గ్రంథం లేదని కొందరి నమ్మకం; దాన్ని మించి అవినీతికరమైనది లేదని కొందరి అభిప్రాయం. ఏమైనా, ఒకటి మాత్రం నిశ్చయం: "లేడీ ఛాటలీస్ లవర్'ను అశ్లీల గ్రంథంగా కొట్టివేస్తే, మన పురాణాలలో, ప్రబంధాలలో నూటికి 99 వంతుల విషయంలో అదే పని చేయవలసి వస్తుంది. అశ్లీల సాహిత్యానికి సంబంధించిన మన చట్టం ప్రస్తుతం ఏరూపంలో కలదో మేము పరిశీలించలేదు; ఈ మధ్యనే బ్రిటన్లో సవరణ పొందిన చట్టాన్ని ఇది ఎంతవరకు పోలివున్నదో లేక ఎంత వరకు భిన్నంగా కలదో మేము చెప్పలేము. దానికి ఇది భిన్నంగా వుంటే మాత్రం వెంటనే సవరించడం అత్యవసరం. సాహిత్యం విషయంలో నీతి, అవినీతులను గురించి, క్షీలా శ్లోలాలను గురించి ప్రపంచం మొత్తం పైనే పూర్వపు ఛాందసాభిప్రాయాలు మారిపోతున్నాయి.

"లేడీ ఛాటర్ లీస్ లవర్" సాహిత్య విలువలున్న ఉత్తమ గ్రంథమని, అది అశ్లీల రచన కాదని ఈ మధ్యనే బ్రిటన్లో నడిచిన కేసులో ఎందరో సుప్రసిద్ధ రచయితలు, పత్రికా సంపాదకులు తమ నిశ్చితాభిప్రాయాన్ని వెల్లడించారు. సాహిత్య విషయాలకు సంబంధించినంత వరకు మా దృష్టిలో సుప్రీం కోర్టు జడ్జీలు ఈ రచయితలు, ఈ సంపాదకులే.

వార్నింగ్

భాషగా సంస్కృతం ఉత్తమమైనదే; ఉత్తమోత్తమమైనదని దాన్ని ప్రశంసించడానికి సయితం మేము సంకోచించము. యూరప్ ఖండానికి ప్రాచీన భాషలైన గ్రీక్ కంటె, లాటిన్ కంటె సంస్కృతం లలితమైనదని, మధురమైనదని, గంభీరమైనదని, వాటిలో లేని ఎన్నో సొగసులు దీనిలో కానవస్తాయని పాశ్చాత్య భాషా పండితులలోనే కొందరు అభిప్రాయపడినారన్న సంగతి మాకు తెలుసు.

ఉత్తరాది భాషలలోనే కాదు, దక్షిణాది భాషలైన తెలుగు, కన్నడం, తమిళం, మళయాళీలలోనైనా కవిగా, రచయితగా రాణించాలంటే, సంస్కృత భాషా పరిజ్ఞానం ఎంతో కొంత కావాలి. ఈ నాలుగు దక్షిణాది భాషల వికాసానికి - ఇవేవైనా - సంస్కృతం ఎంతగానో తోడ్పడింది. తమిళులలో కొందరు సంస్కృత పదాలను తమ భాషనుంచి వెలివేయడానికై చేస్తున్న ప్రయత్నం వివేక రహితమైంది.
కవిగా, రచయితగా రాణించడానికే కాక, భారతీయ చరిత్రను గురించి పరిశోధనలు జరపవలెనన్నా, విధిగా సంస్కృత భాషా పరిజ్ఞానం కావాలి. ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్ నిన్న కలకత్తాలో అఖిల భారత సంస్కృత సమ్మేళనంలో ప్రారంభోపన్యాసాన్ని చేస్తూ వెల్లడించిన అభిప్రాయంతో - "వేలాది సంవత్సరాల చరిత్రగతిలో రూపొందిన భారతీయ జీవనం, భారతీయ తాత్విక దృష్టి సాంఘికాచారాల పుట్టు పూర్వోత్తరాలు, మత సంప్రదాయాలు, భారతీయ సంస్కృతి వికాసం మొదలైనవన్నీ సంస్కృత భాషలోనే లభించ గలవు; తక్కిన భాషలలో అవి అంతగా లభించవు" అనే అభిప్రాయంతో - మేము పూర్తిగా ఏకీభవించలేము. దీనితో పూర్తిగా ఏకీభవిస్తే, ప్రెసిడెంట్ ప్రసాద్ చేస్తున్నట్టుగా "సంస్కృత భాషా సాహిత్యాల చరిత్రను భారతీయ సామాజిక వ్యవస్థ చరిత్రగా, మన ఆలోచనా సంపదల చరిత్రగా స్వీకరించవలసి" వస్తుంది.

ఒక జాతిగా మన వ్యక్తిత్వానికి రూపురేఖలను దిద్దడంలో సంస్కృత భాషా ప్రభావం ఘనమైనదే. కాని, ఈ విషయంలో తక్కిన భాషల ప్రభావం త్రోసివేయదగింది కాదు. సంస్కృతంలో సమానంగా కాకపోయినా, కొంచెం తక్కువగా ద్రవిడ భాషలేమి, పర్శ్యన్, ఆరబిక్, ఉర్దూ, ఇంగ్లీషు భాషలేమి మన జాతీయ వ్యక్తిత్వంపై తమ ముద్రను వేశాయి. ఆధునిక భరతవర్షాన్నే తీసుకుంటే, దానిపై ఇంగ్లీషు ప్రభావంలో శతాంశంగానైనా సంస్కృత ప్రభావం లేదనడం అతిశయోక్తికాదు.

ఏమైనా, సంస్కృత భాషాధ్యయనానికి అవకాశాలను పూర్తిగా కల్పించవలసిందే; దాని ప్రచారాన్ని లక్షించ వలసిందే. కాని, దాన్ని ప్రతి విద్యార్థి నిర్బంధంగానే నేర్చుకొనవలసిన భాషగా చేయగోరడం మాత్రం అవివేకం కాగలదు. కాగా, సంస్కృత భాషా ప్రచారాన్ని ఒక సాధనంగా చేసుకొని, పూర్వపు సాంఘిక వ్యవస్థను, వెనుకటి జీవిత విధానాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నించడం నవభారతం పట్ల మహాపచారమే కాగలదు.

సంస్కృత భాషా ప్రచారానికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్న కొందరు ప్రబుద్ధులు కేవలం ఆ భాషోద్ధరణనుకాక, గత సాంఘిక వ్యవస్థను, జీవిత విధానాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నా రనడానికి నిదర్శనాలనేకం. కేంద్ర ప్రభుత్వం ఆ మధ్య నియమించిన " శాట్ కమిషన్" తన నివేదికలో "సంస్కృతం ఒక భాష మాత్రమే కాదు; అది

ఒక జీవిత విధానం" అని వ్రాసింది. సంస్కృత ప్రచారం మరుగున పూర్వ జీవిత విధాన పునరుద్ధరణ యత్నం కలదనడానికి ఈ వాక్య మొక్కటేచాలు.

నవ భారతంలో నవ సంఘాన్ని నిర్మించడానికై కృషి చేస్తున్నవా రందరు ఈ వాక్యాన్ని ఒక "వార్నింగ్"గా తీసుకోవాలి. సంస్కృత భాషా ప్రచారం పేరుతో కొందరు పునరుద్దరించ గోరుతున్న ఈ పూర్వ జీవిత విధానం కుల విభేదాలను కల్పించినట్టిది, అస్పృశ్యతను సృష్టించినట్టిది, సాంఘిక వ్యవస్థలో సమానత్వానికి తావులేకుండా చేసినట్టిది, న్యాయశాస్త్రంలో కూడా సమతా సూత్రాన్ని తూర్పార బట్టి, హత్యానేరానికి సయితం ఒకనికి దేశ బహిష్కృతిని, మరొకనికి చిల్లర దొంగతనానికి కూడా హస్తచ్ఛేదాన్ని శిక్షలుగా నిర్ణయించినట్టిది; సంఘంలోని వారందరికి సమానవకాశాలను కల్పించనట్టిది; ఒక్కమాటలో, నేటి భారత రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలన్నింటికి పూర్తిగా విరుద్ధమైనట్టిది.

అయినా, సంస్కృత భాషాప్రచారం పేరుతో పాత సంఘాన్ని పునరుద్ధరించడానికే కాక, అప్పటి అంధ విశ్వాసాలకు, మూఢాచారాలకు ప్రాణ ప్రతిష్ఠ చేయడానికి ప్రస్తుతం కొంత కుట్ర జరుగుతున్నది. "తస్మాత్ జాగ్రత్త, జాగ్రత్త"

ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ

వ్యక్తులు కానివ్వండి, సంస్థలు కానివ్వండి, విమర్శను ఆహ్వానించాలి. అది ప్రతికూల విమర్శ కావచ్చు; పదజాలంలో తీవ్రతగల విమర్శే కావచ్చు. అయినా, రాగవిద్వేష రహితంగా జరిగినదైతే, దాన్ని తప్పక ఆహ్వానించాలి. విమర్శ పట్ల అసహన ప్రదర్శనం అహంకారం బలిసిపోతున్న దనడానికి తార్కాణం; ఆత్మ సంశోధన శక్తి సన్నగిలుతున్నదనడానికి నిదర్శనం; అభివృద్ధి లక్షణాలు క్షీణిస్తున్నవనడానికి సాక్షీభూతం.

అయితే, విమర్శ రాగ విద్వేష రహితమో, సహితమో నిర్ణయించడం సులభం కాదు. అనుకూల విమర్శవస్తే, అది రాగ ప్రేరితమైనదని అన్య లనవచ్చు; ప్రతికూల విమర్శ జరిగితే, అది విద్వేషభరితమైనదని మనం అనవచ్చు. ఉద్దేశాలను విశ్లేషించి, దురుద్దేశాలను - అంటగట్టడం కంటె తేలికైన పని మరిలేదు. మంచి పనికి, చెడ్డ పనికి ఏదో ఒక ఉద్దేశాన్ని వెతకడమే ప్రపంచంలోని అనర్థాలలో పెక్కింటికి మూలం.

అయితే, యథార్థాన్ని తెలుసుకొనకుండానో, తెలిసిన దాన్ని కప్పిపుచ్చుతూనో విమర్శ జరిగితే మాత్రం దాని ఉద్దేశాన్ని వెంటనే శంకించవలసి వస్తుంది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విషయమై ఇటీవల వచ్చిన - వస్తున్న - విమర్శలలో అనేకం సరిగా ఈ వర్గానికి చెందినవే!

ఈ విమర్శలు చేస్తున్న వారిలో కొందరికి అకాడమీ స్వరూప స్వభావాలైనా తెలిసినట్టు తోచదు. కనీసం వాటిని తెలుసుకొనవలెనన్న ప్రయత్నమైనా వారిలో కానరాదు. అందువల్లనే అకాడమీని "పునర్వ్యవస్థీకరించడంలో" రాష్ట్ర ప్రభుత్వం అవకతవకగా వ్యవహరించిందని, అపహాస్యం పాలైందని ఏమేమో చిత్తం వచ్చినట్టు వ్రాస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సంపూర్ణ స్వపరిపాలనాధికారంతో కూడిన సంస్థ. సంస్థాపన వరకే దాని విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించింది. అవతరించిన మరుక్షణం నుంచి ఆ సంస్థ నిర్వహణతో -

దాని కార్యకలాపాలతో - ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం ఏమీ లేదు. పరోక్షంగా దానికున్న సంబంధమైనా, జనరల్ కౌన్సిల్ సభ్యులు మొత్తం 60 మందిలో ఇరవైనలుగురిని మాత్రం నామినేట్ చేయడం వరకే, ఈ నామినేషన్ అధికారమైనా రాష్ట్ర ప్రభుత్వానికి శాశ్వతంగా వుండనక్కరలేదు. తన నిబంధనావళిని కోరితే సవరించుకొనగల హక్కు అకాడమీకి వున్నది. మూడింట రెండు వంతుల మెజారిటీతో ప్రభుత్వ పక్షం నుంచి నామినేషన్లు జరగరాదనే తీర్మానాన్ని అకాడమీ జనరల్ కౌన్సిల్ ఎప్పుడు కోరితే అప్పుడే చేసుకోవచ్చు. ఈ హక్కును అకాడమీ వినియోగించుకోవచ్చు; వినియోగించుకొనకపోవచ్చు. అది దీన్ని వినియోగించుకొంటే ప్రస్తుతం సాలుకు యాభై వేల చొప్పున ప్రభుత్వం అకాడమీకిస్తున్న గ్రాంటును అది యివ్వవచ్చు; యివ్వకపోవచ్చు. ఇవి ప్రస్తుతాంశాలు కావు; ప్రస్తుతాంశ మిది: అకాడమీని వ్యవస్థీకరించింది రాష్ట్ర ప్రభుత్వమే; కాని, దాని పునర్వ్యవస్థీకరణతో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు. అకాడమీ - మేము ఇంతకుముందే మనవి చేసినట్టు సంపూర్ణ స్వపరిపాలనాధికారంతో కూడిన సంస్థ.

జనరల్ కౌన్సిల్ సభ్యులలో ఇరవై నలుగురిని ప్రభుత్వం నామినేట్ చేసినా, ఆ కౌన్సిల్ సభ్యుల మొత్తం సంఖ్య 60 అని ఈ సందర్భంలో మరచిపోరాదు.

నామినేటెడ్ సభ్యులు 24 మంది పోగా, మిగిలిన 36 మందిలో ఇరవైనల్గురు అకాడమీ గుర్తించిన సాహిత్య సంస్థలు ఎన్నుకొని పంపించే ప్రతినిధులు; ఆర్గురు మన మూడు విశ్వవిద్యాలయాలు - ఒక్కొక్కటి ఇద్దరిద్దరు చొప్పున - పంపించేవారు; ఇద్దరు సంగీత నాటకకళ అకాడమీ నుంచి వచ్చేవారు; మరొక ఇద్దరు లలితకళ అకాడమీ ప్రతినిధులు; పోతే మిగిలిన వారిద్దరిలో ఒకరు విద్యాశాఖ ప్రతినిధి కాగా, మరొకరు ఆర్థికశాఖ ప్రతినిధి. దీన్ని బట్టి, ప్రభుత్వానికి జనరల్ కౌన్సిల్ లో కొందరు సభ్యులను నామినేట్ చేసే అధికారం వున్నా, ఆ నామినేషన్ అధికారం మైనారిటీ సభ్యులకు మాత్రమే వర్తిస్తుందని, అందుమూలంగా అకాడమీ స్వరూప స్వభావాలను ప్రభుత్వం తన చిత్తానుసారంగా రూపొందించలేదని స్పష్టమే!

ఇక, తన కార్యవర్గాన్ని ఎన్నుకొనడంలో అకాడమీకి పూర్తి స్వేచ్ఛ వున్నది. కార్యక్రమాన్ని నిర్ణయించుకొనడంలో కూడా సర్వ స్వాతంత్ర్యం దానిదే. ఈ పరిస్థితులలో సాహిత్య అకాడమీని ప్రభుత్వం నడుపుతున్న సంస్థగా పేర్కొనడం తగునా? దాన్ని అది "పునర్వ్యవస్థీకరించిన" దనడం తగునా?

ప్రభుత్వం పై విమర్శ జరిగితే, తాను చేయవలసిన నామినేషన్లను అది సరిగా చేయలేదన్నంత వరకే జరగాలి. కాని, ఈ విషయంలో ఏ ప్రభుత్వమైనా అందరికీ సంతృప్తికరంగా - ఎవరో కొందరిని అసంతృప్తి పరచకుండా - వ్యవహరించ గలదా? నామినేషన్‌కు సంబంధించిన స్థానాలు 24 మాత్రం; కాని, నామినేషన్ కు అర్హులైన వారు కనీసం 240 మంది. అయినప్పుడు ఏయిరవై నలుగురిని నామినేట్ చేసినా, "వారి మాటేమిటి? వీరి మాటేమిటి?" అనే విమర్శను సులభంగానే చేయవచ్చు గదా?

పైగా, ఈ విధమైనా విమర్శ చేస్తున్న వారికి మరొక ముఖ్య విషయం బహుశా తెలియదు. అకాడమీ జనరల్ సభ్యత్వమైనా, దాని కార్యవర్గ సభ్యత్వమైనా; ప్రధానంగా ఆ సంస్థ పరిపాలనకు సంబంధించినదే! ఆ సభ్యత్వం కవితకు కిరీటం కాదు; పాండితికి పట్టాభిషేకం కాదు. కవులను, పండితులను గౌరవించడానికి అకాడమీ చేయగలపని (విదేశాల అకాడమీలు చేసినట్టు) "ఫెలోస్"గా కొందరిని ఎన్ను కొనడం. ఇందుకు అకాడమీ నియమావళిలో అవకాశం వున్నది. అయితే, అఖిలభారత సాహిత్య అకాడమీ వలె, మన రాష్ట్ర సంస్థ కూడా ఇట్టి

గౌరవాన్ని కవి, పండితులకు చేయడాన్ని ఇంకా ప్రారంభించలేదు. అందువల్ల "వారు జనరల్ కౌన్సిల్ లో లేరేమి? వీరు లేరేమి?" అని కొందరు ప్రసిద్ధ కవి, సండితుల పేర్లను పేర్కొంటూ ప్రశ్నించడం కాదు, ఈ విమర్శకులు చేయవలసిన పని. "ఫెలోస్"ను ఎన్నుకొనడం ఇంకా ఎందుకు ప్రారంభించలేదనే వీరు అడగాలి. అయితే, ఆ ప్రశ్నవేయడానికి వీరికి అకాడమీ నిజంగా చేయగల గౌరవ మేదో కూడా తెలియదు గదా? అకాడమీ నియమావళిని ఒకసారి కంటితో చూచిన పాపానైనా వీరు పోలేదు గదా?

ఈ విధమైన అజ్ఞానం వల్లనే ఇప్పుడు అకాడమీ, జనరల్ కౌన్సిల్ లోను, దాని కార్యవర్గంలోను సభ్యులైన వారు పెద్ద గౌరవాన్ని సులభంగా దక్కించుకొన్నారని, ఇతర విధాల కూడా ఏదో బాముకొంటున్నారని దురభిప్రాయపడుతున్నారు. ఏడాది కొకసారి సమావేశం కావడం, కార్యక్రమాన్ని ఆమోదించడం తప్ప జనరల్ కౌన్సిల్ సభ్యులు వొరగ వేసుకొంటున్నది ఏమీ లేదు. గడువు మూడు సంవత్సరాలలో మూడుసార్లు జనరల్ కౌన్సిల్ సమావేశం కాగా, ఒక్క సమావేశానికైనా హాజరు కాని సభ్యులు కొందరున్నారు. అట్టి వారిని తిరిగి నామినేట్ చేసి వుండకపోతే, అది కూడా ప్రభుత్వం చేసిన పెద్ద తప్పిదమే కాబోలు!

కాగా, కార్యవర్గ సభ్యులైన వారు బాముకొన్నది అసలే ఏమీ కనబడదు. అకాడమీ తరపున ఏ నిఘంటువుకు, లేదా, ఏ సంకలనకు సంపాదకత్వభారం వహించినా, కార్యవర్గ సభ్యులు ఏ విధమైన ప్రతిఫలాన్ని తీసుకొనరాదన్న నిర్ణయాన్ని తమకుతామై వారు చేసుకొన్నారు. రెండు ఉత్తమ గ్రంథాలకు ప్రతి సంవత్సరం - ఒక్కొక్కదానికి రెండు వేల చొప్పున - ప్రభుత్వం అకాడమీ ద్వారా యిచ్చే బహుమతులలో దేనికీ కార్యవర్గ సభ్యులు పోటీ చేయరాదని తమపై తామే స్వచ్ఛందంగా వారు ఆంక్ష విధించుకొన్నారు. దీనిలో శక్తివంచన లేకుండా అకాడమీ ద్వారా సాహిత్య సేవ చేయాలన్న ఉబలాటం కనబడుతున్నదా? లేక ఏదో త్రవ్వి తలకెత్తుకోవాలన్న తాపత్రయం కనబడుతున్నదా? తిరిగి "పునర్వ్యవస్థీకరణ" ప్రసక్తిని తెచ్చి చెప్పవలసిన మాట మరొకటి వున్నది. రాష్ట్రంలోని ప్రధాన సాహిత్య సంఘాలన్నీ కలసి, తమ ఉమ్మడి సంస్థగా నడుపుకొన్నప్పుడే అకాడమీకి సార్థక్యం. అందువల్లనే తాను గుర్తించగల సాహిత్య సంఘాల అర్హత లెట్టివో అకాడమీ ప్రత్యేకమైన ఒక ఉప సంఘం ద్వారా నిర్ణయించింది. ఆ నిర్ణయాలను చాలా ముందుగా అన్ని పత్రికలలో ప్రచురించింది. అందుపై తనకు వచ్చిన అభ్యర్థన పత్రాలను పరిశీలించడానికి మరొక ఉప సంఘాన్ని నియమించింది. దాని ఏకగ్రీవ సూచనల ప్రకారమే కొన్ని సంఘాలను గుర్తించి, తమ ప్రతినిధులను ఎన్నుకొని పంపించవలసిందిగా వాటిని కోరింది. ఎన్నిక ద్వారా భర్తీ కావలసిన 24 స్థానాలకు గాను 24 సాహిత్య సంఘాల నుంచి అర్జీలు రానందున కొన్ని పెద్ద పెద్ద సంఘాలను ఇద్దరిద్దరు చొప్పున ప్రతినిధులను పంపించవలసిందిగా కోరినట్టున్నది. ఇంతచేసిన పిమ్మట కూడా "ఈ ప్రతినిధు లెవరో? వీరి పేరైనా మేము వినలేదే?" అంటే అందుకు ప్రభుత్వం జవాబు చెప్పగలదా? విద్యామంత్రి జవాబు చెప్పగలడా?

గడచిన మూడేళ్ళలో సాహిత్య అకాడమీ ఏమీ పని చేయలేదన్నట్టు మరొక విమర్శ ఈ సందర్భంలో వినవస్తున్నది. సన్మాన సభలు జరపడమే, శాలువాలు కప్పడమే, సంభావన లివ్వడమే "పని" అయితే, అకాడమీ ఏమీ పనిచేయలేదనడం ముమ్మాటికీ నిజం! కాని, దాదాపు పదివేల తెలుగు సామెతలను సేకరించడం, పదిహేనువేల నుడికారాలను సంపుటీకరించడం, నన్నయ పదసూచిని ప్రచురణకు సిద్ధపరచడం; నన్నయ సమకాలీనుల పదసూచిని సిద్ధపరచడానికి ఏర్పాట్లు చేయడం, వృత్తి పదకోశాన్ని ప్రచురించే బృహత్తర పథకంలో ఒక భాగంగా వ్యవసాయానికి సంబంధించిన పదాలను ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి మండలం నుంచి సేకరంచి, వాటి ముద్రణను

దాదాపు పూర్తి చేయించడం, ఆంధ్ర సాహిత్యంలోని ముఖ్య గ్రంథసంచయానికి పదసూచిని సిద్ధపరచడం ద్వారా, ఏ మాటను ఏ కాలంలో ఎవరు ఏ అర్థంలో వాడినారో తెలపగల నిఘంటువును - తెలుగు భాషకు "సుప్రీంకోర్టు" కాగల నిఘంటువును - ఎప్పటికైనా వెలువరించ వలెనన్న మహదాశయంతో అందుకు ఇప్పటినుంచీ పునాదులు వేయడం అయితే, ఈ మూడేళ్ళలో అకాడమీ చాలా పని చేసింది.

అకాడమీ చేయవలసింది సాధారణ ప్రచురణ సంస్థలు చేయగల పనినే తాను చేయడం కాదు; తమకు ఆర్థిక స్తోమత లేదని, స్తోమతవున్నా, తమకు గిట్టుబాటు కాదని ఏ కార్యభారాన్ని అవి వహించవో, అట్టి భారాన్నే అది వహించాలి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రస్తుతం సరిగా ఇదే పని చేస్తున్నది. నిజానికి అది చేస్తున్న పని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫ్రెంచి అకాడమీ చేస్తున్నట్టి పని; ఇంకా తగినసమయం రాలేదని అఖిల భారత సాహిత్య అకాడమీ వాయిదా వేస్తున్న పని! ఇంత స్వల్పకాలంలో ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్ణయించుకొని, దానిలో కొంత భాగాన్ని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అప్పుడే చేయగలిగినదంటే, ఆ గౌరవం, ఆ ఘనత దాని అధ్యక్షులైన శ్రీ బెజవాడ గోపాలరెడ్డిది; దాని ఉపాధ్యక్షులైన శ్రీ విశ్వనాథ సత్యనారాయణది;

దాని ప్రధాన కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావుది. ఇట్టి సంస్థలతో సంబంధం పెట్టు కొనడంవల్ల నలుగురిచేత నాలుగు అక్షతలను వేయించుకొనడం తప్ప తమకు వొరిగేది ఏమీ లేదని వీరికి తెలుసు. అయినా, ఎంతో ఆసక్తితో, పట్టుదలతో, చిత్తశుద్ధితో, త్యాగనిరతితో పనిచేసి వీరు అకాడమీని వృద్ధికి తెచ్చారు. ఆ సంస్థ యోగక్షేమాల దృష్ట్యా, దాని పురోభివృద్ధి దృష్ట్యా దానిలో సభ్యులైన కొందరికి అప్రియమైన నిర్ణయాలను చేయడంలో సయితం వీరు వెనుదీయలేదు. కలకాలానికీ నిలిచే పనిని చేసి చూపించాలన్న దీక్ష లేకపోతే, చౌకబారు మెప్పునే వీరు కోరివుంటే, ఎన్నడో - ఎంతగానో వీరు దాన్ని పొందివుండేవారు. వీరి కృషి ఫలితాలను సమకాలికులు పూర్తిగా హర్షించినా, హర్షించకపోయినా, భావితరాల వారు మాత్రం ఫ్రెంచి అకాడమీ ప్రారంభ దశలలో దానికి గట్టి పునాదులను వేసిన వారికి ఫ్రెంచి వారిచ్చే గౌరవాన్నే వీరికిస్తారు, ఇది ముమ్మాటికీ తథ్యం!

ఇంత వ్రాసిన పిదప మరొక్క మాటను కూడా చెప్పకుండా మేము దీన్ని ముగించలేము. అకాడమీని సంస్థాపించడంలో, దాన్ని అఖిల భారత సంస్థకు అనుగుణంగా రూపొందించడంలో, దాని నిర్వహణలో ఏ విధమైన జోక్యాన్ని కలిగించుకొనకుండానే అది తన గురుతర కార్యభారాన్ని వహించడంలో, పూర్తి సహాయం చేయడంలో విద్యామంత్రి శ్రీ ఎస్.బి.పి. పట్టాభిరామారావు ఎంతో దూరదృష్టితోనే కాక, ఉదాత్తంగా వ్యవహరించారు. మరింత ఆలస్యం జరగనీయకుండా త్వరలోనే లలిత కళా అకాడమీని కూడా సంస్థాపించి, తాను ప్రారంభించిన ఈ మహోద్యమానికి ఆయన సమగ్రతను సాధించగలరని ఆశిస్తున్నాము.

శాస్త్ర విజ్ఞానం

శాస్త్ర విజ్ఞాన పరమావధి

"శాస్త్ర విజ్ఞానాలు కేవలం సత్యాన్వేషణకే నిర్దేశింపబడలేదు. ఇవి ప్రజానీక అభ్యుదయానికి ఉపకరించడానికి తగినట్టివి."

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ న్యూఢిల్లీలో ఇండియన్ సైన్సు కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఆ సభను ప్రారంభం చేస్తూ అన్నమాట లివి.

శాస్త్ర విజ్ఞానాల పరమావధి ఏమిటని ఈనాడు తర్కించ నవసరం లేదు. కాని ఆధునిక శాస్త్ర పరిశోధనలన్నీ మానవ హింసకు, నాశనానికి ఉపకరించడం చేత, సత్యాన్వేషణనే ధర్మంగా పెట్టుకున్న శాస్త్రజ్ఞుల విధి ఎటువంటిదో, శాస్త్ర విజ్ఞానాల ప్రయోజనా లెటువంటివో పండిట్ నెహ్రూ ఈ ఉపన్యాసంలో వ్యక్తం చేశాడు.

"స్త్రీగాని, పురుషుడుగాని క్షుద్బాధకులోనై అలమటిస్తున్న సమయంలో వారికి కావలసింది కడుపు నిండే తిండి. దేశంలోని క్షుధార్తులకు తిండి, విద్య, ఆరోగ్యాది సౌకర్యాలు, జీవితానికి అత్యవసరమైన సౌకర్యాలు లభించేటట్లు చూడడం వారి విధివిహితం. విజ్ఞానవేత్తలు దేశంలోని 40 కోట్ల ప్రజానీకాన్ని దృష్టిలో ఉంచుకొనే పరిశోధనలు సాగించాలి" అని పండిట్ జవహర్ లాల్ చెప్పిన అంశం శాస్త్రజ్ఞులు, పరిశోధకులు గమనించి ఆచరణలో బెట్టవలసి నట్టిది. శాస్త్ర పరిశోధనలతో ఉత్పత్తి ఏవిధంగా ఎక్కువవుతుందో నిర్ణయించవచ్చు. ఉత్పత్తి ఎక్కువైనప్పుడు ప్రజలకు కావలసిన సంపత్తి ఏర్పడేమాట తథ్యం. కాని నూత్న పరిశోధన మార్గాలను ప్రతి వ్యక్తి స్వీయ ప్రయోజనాల కుపయోగించుకోడం ఎలా సాధ్యమవుతుందనేది ముఖ్యం. ఆ విషయంలోనే ప్రభుత్వ సహాయం కావలసి ఉంటుంది. శాస్త్ర పరిశోధనలకు ప్రభుత్వం చర్య తీసుకోవలెనని వేచివుండకుండా ఆ కార్యనిర్వహణకు శాస్త్రజ్ఞులు, ఆ సంస్థలు పూనుకోవాలని పండిట్ నెహ్రూ చెప్పింది యుక్తంగా ఉంది. కాని ఆ పరిశోధనల ఫలితాలు ప్రజానీకానికి అందుబాటులో ఉండే విధాన్ని ఆలోచించడం మాత్రం ప్రభుత్వ ధర్మం.

ప్రపంచమంతటా ఇంకా యుద్ధ ప్రజ్వలన మాటలు వినవస్తున్న సమయంలో బ్రిటన్, అమెరికా, కెనడా, ఫ్రాన్సు దేశాల నుంచి వచ్చిన శాస్త్రజ్ఞులకు పండిట్ నెహ్రూ ప్రపంచ శాంతి అభ్యుదయాలకై జరిగే కృషి సందర్భంలో భారతదేశం సంపూర్ణ సహకారం నెరపగలదని వాగ్దానం చేశాడు. . మరొక యుద్ధమే సంభవిస్తే, అది ఇతఃపూర్వం జరిగిన సంగ్రామాలన్నింటికన్నా భీషణంగా ఉండగలదని, అట్టి విషమ పరిణామాలతో గూడిన సంగ్రామంలో భారతదేశం పాల్గొనబోదని ఆయన హెచ్చరించాడు.

గత ద్వితీయ మహా సంగ్రామంలో ప్రళయం బాంబుతో ఏర్పడ్డ విధ్వంసం చూచింతరువాత ఏ శాస్త్రజ్ఞుడైనా శాస్త్ర పరిశోధనలను విధ్వంసనకు ఉపయోగింప గోరడని భావింపవచ్చు. పండిట్ నెహ్రూ చెప్పినట్లు శాస్త్ర పరిశోధనలు చేసే పురుషులుగాని, స్త్రీలుగాని తాము శాస్త్ర పరిశోధనలను విధ్వంసక కృత్యాలకు వినియోగించడానికి తోడ్పడబోవడం లేదని స్పష్టం చేయాలి.

హిరోషిమా నాశనానికి తోడ్పడ్డ పరమాణుశక్తి పారిశ్రామికాభివృద్ధికి కూడా తోడ్పడుతుందనే శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఇంతవరకు ఆ ఆలోచనలు జరుగుతున్నవేమో చెప్పలేం. కాని ఆ శక్తి రహస్యం మిత్రరాజ్యాల మధ్య విభేదాలకు మాత్రం కారణమైంది. అది శాంతమార్గాల ప్రజాభ్యుదయానికి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడేటట్టు చేయగల్గితే ప్రతి దేశం సంతృప్తితో సంతుష్టితో ఉండగలదనే ఆలోచన గలగడం లేదు. భారతదేశం ఈ పరమాణు శక్తిని గురించి పరిశోధనలు చేసి దానివలన అభివృద్ధిని సాధ్యమైనంతవరకు పొందవలెననే సంకల్పం ఉన్నట్లు పండిట్ నెహ్రూ స్పష్టం చేశాడు. ఇందుకు ప్రపంచంలోని ఇతర రాజ్యాలు కూడా తోడ్పడితే శాంతి సుస్థాపితమవుతుంది. ప్రపంచమంతా కూడా శాంతి మార్గాలలో నడుస్తుందని కూడా చెప్పవచ్చు. పరమాణుశక్తి రహస్యం ఇంకొకరు తెలుసుకోరాదనే భావమే ప్రబలమైతే శాంతి దూరమైపోతుంది. శాస్త్ర పరిశోధనల మూలాన దేశానికి అరిష్టం జరగకుండా చూడవలసిన బాధ్యత శాస్త్రజ్ఞుల పై నున్నదనే అంశాన్ని ఈ మహాసభకు వచ్చిన పాశ్చాత్య శాస్త్రజ్ఞులు గ్రహించి, తమ దేశాలలోని ప్రభుత్వాలు అట్టి పద్ధతుల నవలంబించేటట్టు చేయగల్గితే సత్యాన్వేషణ పరమార్థం కూడా ఫలించినట్టవుతుంది. *(ఆంధ్రప్రభ 5-1-1947)*

నేటి మానవుడు

ప్రాణాలను నిలుపుకొనడానికి ప్రకృతితో నిత్యసమరం జరపవలసిన అగత్యం మానవునికి ఈనాడు లేదు.

ఆధునిక వ్యావసాయిక పద్ధతులేమి, పారిశ్రామిక సాధనలేమి, అన్యవిధాల ప్రకృతిపై సాధించబడిన విజయాలేమి, సమస్త జీవితావశ్యక వస్తువుల సమృద్ధిని మానవునికి కూర్చి పెట్టినవనే చెప్పవచ్చు. అయినా, అన్నవస్త్రాల నిమిత్తం వన్యమృగాల మాంసం కోసం, చర్మం కోసం విల్లంబులతో వేటను వృత్తిగా చేసుకొన్న నాటికంటే ఈనాడు మానవునికి అధిక శాంతి, సౌఖ్యాలు కానరావడం లేదు.
ఇందుకు కారణం ఒక్కటే.

ప్రకృతిని జయించగలిగిన మానవుడు తన ప్రవృత్తిని తానే జయించుకొనలేక పోయాడు. నేడు ప్రపంచంలో దారిద్ర్యం కానరావలసిన అవసరం లేదు కాని, మానవకోటిలో అత్యధిక భాగానికి నేడు దుర్భర దారిద్ర్య బాధ తప్పడం లేదు.

నేడు ప్రపంచంలో భోగభాగ్యాల స్వార్థాలు, స్పర్థలు కానరావలసిన అగత్యం సైతం లేదు. కాని, నేడు మానవ జాతిలో వీటికే అధిక ప్రాబల్యం.

ఈ వైపరీత్యం నుంచి విముక్తి లేదా? - ఇదే ఈనాడు ప్రతి విజ్ఞుని కలత పెడుతున్న ఆలోచన. నిన్న, మొన్నటి వరకు వైజ్ఞానిక శాస్త్రవేత్తలు ప్రకృతి రహస్యాలను అన్వేషించడంతోనే సంతృప్తి చెందారు. సత్యాన్వేషణ ఒక్కటే తమ కర్తవ్యమని భావించారు. ఆ సత్యాలు మానవుని యోగ క్షేమాలకు ఎంతవరకు వినియోగించగలవనే విషయాన్ని గురించి ఎంత మాత్రం శ్రద్ధ చూపలేదు.

నిన్న మొన్నటి వరకు తత్త్వవేత్తలు ఆర్థిక, సాంఘిక, రాజకీయ, పారిశ్రామిక, ఆధ్యాత్మికాది సూత్రాలను పరిశోధించడంతోనే ప్రతిపాదించడంతోనే - సంతృప్తి చెందారు. . తమ పరిశోధనలను మానవజాతి పురోభివృద్ధికి వర్తింపచేయడం విషయమై వారు ఎంతమాత్రం శ్రద్ధ వహించలేదు.

నేటి ప్రపంచ పరిస్థితులకు - నేడు మానవుని దుస్థితికి - తమ ఈ అశ్రద్ధే ఒక ముఖ్యకారణమని ఈనాటికి వారు గుర్తించారు. ఒక పీడ కల నుంచి మేల్కొంటున్నట్టు, ఇప్పుడిప్పుడే వారు కళ్ళు నులుముకుంటూ, భయ, సంభ్రమ, విస్మయ, విషాదాలతో ప్రపంచాన్ని చూస్తున్నారు. శాస్త్రవేత్తలేమి, తత్త్వవేత్తలేమి కొత్తగా ప్రదర్శిస్తున్న ఈ వైఖరికి ఒక తార్కాణమే - వారణాసిలో ప్రొఫెసర్ మహేంద్రనాధ సర్కార్ అధ్యక్షతన నిన్న ప్రారంభమైన తత్త్వవేత్తల మహాసభ.

ఈ మహాసభలో ప్రొఫెసర్ సర్కార్ చేసిన అధ్యక్షోపన్యాసంలో నేమి, డాక్టర్ రాధాకృష్ణన్ చేసిన స్వాగతోపన్యాసంలో నేమి, ప్రతి పంక్తిలో - ప్రతి పదంలో - ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల పట్ల ఆవేదన కానవస్తుంది.

ఐతే, వారి ప్రసంగాలలో ఈ ప్రస్తుత పరిస్థితులను గురించిన ఆవేదనతోపాటు భవిష్యత్తును గురించిన ఆశాభావం కూడా ద్యోతకం కాకపోవడం లేదు.

నేటి ఈ అసంతృప్తి నుంచే, ఈ అశాంతి నుంచే, ఈ బాధ నుంచే, ఈ పరితాపం నుంచే ఒక కొత్త సంఘం ఉద్భవించగలదని వారు ఆశిస్తున్నారు. మానవ జగత్తులో నేడు శాంతి, సౌఖ్యాలు లేకపోవడానికి ముఖ్య కారణం మానవుని అంతరంగంలో శాంతి, సంతృప్తులు లేకపోవడమే.
ఈ శాంతి, సంతృప్తుల సాధనకు ఏదో స్వర్గధామం పైకి దృష్టిని నిగుడ్చి లాభం లేదు. ఈ లోకంలోనే దాన్ని కల్పించుకొనలేని వారు మరెక్కడను దాన్ని అనుభవించలేరు. ఇక్కడే - ఇప్పుడే... మానవుడు స్వర్గాన్ని నిర్మించుకొన వలెనంటే, ప్రస్తుతపు ఆర్థిక, సాంఘిక, రాజకీయ, పారిశ్రామికాది వ్యవస్థలను పునాదులనుంచి తిరిగి కొత్తగా కట్టుకొనవలసిందే! ముందు మానవుడు మానవుడుగా బ్రతక నేర్చితేనే, దేవతామూర్తి కాగల ప్రయత్నాన్ని అతడు ప్రారంభించడమైనా, దానిలో కృతకృత్యుడు కావడమైనా! *(ఆంధ్రప్రభ 25-12-1947)*

త్రివిక్రముడు

అహో! ఇదెంతటి గొప్ప వార్త! ఎంతటి అద్భుత వార్త!! అప్పుడే రెండు, మూడు రోజులుగా ఈ వార్తతో ప్రపంచం మారుమ్రోగిపోతున్నా, మాస్కో మౌనం కారణంగా "నిజమా?" అనే శంక కొంత పీడిస్తూ వచ్చింది కాని, మరి ఊహాగానం చేయనక్కరలేదు; అభిజ్ఞవర్గాల కథనాలపై ఆధారపడనక్కరలేదు. మానవుడు రోదసీలో నిన్న పాదం పెట్టినట్టు ఇంతకు కొంచెం ముందే అధికారయుతంగా మాస్కో నుంచి ప్రకటన వెలువడింది! యాత్రను ముగించుకొని, భూమండలానికి అతడు దిగి వస్తున్నట్టుగా కొన్ని నిమిషాల క్రితమే మరొక వార్త చేరింది. ఈ సంపాదకీయ రచన ముగిసే లోపలనే జయప్రదంగా అతడు యాత్రను పూర్తిచేసిన శుభవార్త అందవచ్చు కూడా!

రోదసి లోనికి తొలి మానవుని పంపించడం (ఆదిలో వచ్చిన వార్తలు సూచించినట్టు) మొన్న కాక, నిన్న జరిగింది. కొంచెం ముందుగానో, కొంచెం వెనుకగానో ఇట్టి వార్త వస్తుందని కొంతకాలంగా ప్రపంచం ఉత్సుకతతో - ఉత్సాహంతో - ఎదురు చూస్తుంది. రోదసి యాత్ర ప్రాణాపాయకరమైనది కాదన్న విషయం కూడా ఇదివరలోనే స్పష్టంగా నిరూపితమైంది. కోరితే, ఈ ప్రయోగం - ఈ ప్రయాణం - ఇంతకుముందే సాధ్యపడి ఉండేది. కాని, నిరపాయకరంగా ఇది జరగాలన్న పట్టుదలతో అన్ని పరిశోధనలను సమగ్రంగా కొనసాగిస్తూ నిన్నటి వరకు సోవియట్ యూనియన్ ఆగింది. (మేము ఆశించినట్టుగా, మానవుని తొలి రోదసీ యాత్ర జయప్రదంగా ముగిసినట్టు ఇప్పుడే వార్త అందింది).

రోదసిలో మానవుడు ప్రప్రథమంగా పాదం పెట్టడం - ఇదెంతటి మహత్తర విజయం! ఎంతటి మహిమాన్విత సంఘటన!! నరు డెంత! 'అనంత విశ్వంతో పోల్చినప్పుడు సూక్ష్మాతి సూక్ష్మ ధూళిరేణువును కోటికోట్లతో విభజించగా వచ్చిన దానిలో అతడు కోటికోట్ల వంతు కూడా అయినా, అతడు విశ్వాంతరాళాల రహస్యాలను ఛేదించడానికి ప్రయత్నించడం, సృష్ట్యాదిగా భూగోళంలో తనను బందీగా చేసివేస్తున్న గురుత్వాకర్షణను జయించి, రోదసీ గర్భంలో విజేతగా ప్రవేశించడం - తలచుకొంటేనే హృదయాన్ని పులకింపజేసే మహత్తర విషయమిది!

ఎన్ని రంగాలలో ఎంతగా పురోభివృద్ధిని సాధించినా, నిన్నటి వరకు మానవుడు వామనుడే! ఇకమీదట అతడు త్రివిక్రముడు! “ఇంతింతై, వటుడింతయై, మరియు దానింతై, నభోవీథిపై నంతై, తోయద మండలాగ్రమున కల్లంతై, ప్రభారాశిపై నంతై, చంద్రునికంతయై, ధ్రువునిపై నంతై, మహర్వాటిపై నంతై...” అన్నట్టుగా అతడిక మీదట ముల్లోకాలకే కాక, ఎన్ని లోకాలకైనా విస్తరించగలడు. సౌర కుటుంబాధిపత్యం అతడికి ఇక మీదట అందుబాటులో గల విషయం. సౌరమండలం సరిహద్దులను సైతం దాటి, పాలవెల్లిలోనే అతడు పాగా వేయగలడేమో! పాలవెల్లి పరిధిని సైతం అధిగమించి వెళ్ళగలడేమో!!

ఈ అనంత విశ్వంలో ఆధునిక మానవుని పురోగమనావకాశాలు నిజంగా అనంతమైనవే! కాని... కాని... విజ్ఞానాభివృద్ధికి తగు వివేకాన్ని అతడు ప్రదర్శించినప్పుడు కదా, అతడి పురోగమనం సవ్యంగా కొనసాగడం? ఈనాడు తన ఈ ప్రపంచాన్ని చక్కబెట్టుకొనలేకపోతున్న మానవుడు అన్య ప్రపంచాలకు వెళ్ళి ఏమి వెలగబెట్టగలడు? మొత్తం మానవాళినే స్వరూపనాశం చేసి, మానవ విజ్ఞానాన్ని, కళలను, సంస్కృతిని, సభ్యతను భూస్థాపితం చేసివేయగల అణ్వస్త్రాల నిర్మాణంలో నేడు ఎంత పోటీ జరగడం లేదు? అణ్వస్త్రాలతో పాటు విషక్రిములు, విషవాయువులు, మృత్యుకిరణాలు, మున్నగువాటిని సమకూర్చుకొనడానికై ఎంతగా పట్టుదలలు కానరావడం లేదు? అయినా, ఈ మారణాయుధాల నిర్మాణ నిషేధానికై ఎన్నేళ్లుగా చర్చలు జరుగుతున్నా నేటికీ అవి ఒక కొలికికి రాలేదు. ఈ పరిస్థితిలో “రేపు” అనేది మానవునికి లేకపోవచ్చుగదా?

అటు స్వర్గం, ఇటు పాతాళం; అటు విశ్వవిశ్వేశ్వరత్వం, ఇటు స్వరూప నాశం; అటు జీవన్మరణ రహస్య ఛేదనం, ఇటు కాలగర్భంలో విలీనం! మానవుడు అటు వెళ్ళి, త్రివిక్రముడౌతాడో, ఇటు వెళ్ళి తెళ్ళిపోతాడో!!

(ఆంధ్రజ్యోతి 13-4-1961)

రోదసిపై విజయం

ఒక నూరేళ్ళ తర్వాత ప్రపంచ చరిత్రకారుడు వెనుదిరిగి చూచినప్పుడు అతనికి 1957-67 దశాబ్దిలోని యుద్ధాలుగాని, క్షామాలుగాని, ఇతర సంక్షోభాలు గాని ముఖ్య సంఘటనలుగా తోచవు. వాటిని నిర్లక్ష్యం చేసి, ఈ దశాబ్దిని అతడు రోదసిపై మానవుని విజయానికి నాందిగా అభివర్ణిస్తాడు.

పదేళ్ళ క్రితం - 1957 అక్టోబర్ 4వ తేదీని - సోవియెట్ యూనియన్ తన మొదటి స్పూట్నిక్ ను ప్రయోగించింది. భూమ్యాకర్షణ శక్తి పై అది మానవుని ప్రప్రథమ విజయం. అంతకుపూర్వం కాలికి ఒక సంకెలవలె భూమ్యాకర్షణ శక్తి మానవుని ఈ పృథ్వికి కట్టివేసింది. ఆ సంకెలను మొట్టమొదటిసారిగా ఆనాడు అతడు తెంచివేసుకోగలిగాడు.

నాటికి అది ఘనవిజయమైనా, ఈ పదేళ్ళలోని అన్య విజయాలతో పోల్చినప్పుడు అది సామాన్యమైనదే. ఆ తొలి స్పూట్నిక్ గంటన్నర మాత్రమే భూప్రదక్షిణాలను చేసింది. పైగా, దాని గరిష్ఠ కక్ష్య 560 మైళ్ళు మాత్రమే కాగా, ఈ నాడు మానవుడు ప్రయోగించిన ఒక రోదసీ నౌక సూర్యమండలం చుట్టు ఒక కృత్రిమోపగ్రహంగా పరిభ్రమిస్తున్నది. ఈ మధ్యకాలంలో మానవుడు స్వయంగా రోదసిలో పాదం పెట్టాడు. రోదసీ నౌకను విడిచి, శూన్యం (స్పేస్) లోకి వచ్చి, దానిలో విహరించాడు. ఇంతేకాదు, చంద్రమండలం లోనికి రోదసీ నౌకలను ప్రవేశపెట్టాడు. మనకు కనపడని చంద్రగోళం అవతలి సగం ఫొటోలను తీశాడు; దాని ఉపరితలాన్ని గురించి, దాని శీతోష్ణ పరిస్థితులను గురించి అనేక నూతనాంశాలను తెలుసుకొనగలిగాడు. ఈ విజయాలను రష్యా, అమెరికాలు సాధించినా, మానవ విజయాలుగానే వీటిని పరిగణించాలి.

మానవుని రోదసీయాత్రల చరిత్రలో రెండవ దశాబ్ది ప్రారంభమైనంతనే (ఇది సరిగా ఒక పక్షం క్రితం ప్రారంభమైంది). శుక్ర గ్రహంలో రోదసీ నౌక నిన్న ప్రవేశించింది. చంద్రమండలం భూమికి ఉపగ్రహం కాగా, భూగోళం వలె శుక్రగోళం కూడా సూర్యునికి ఉపగ్రహం. పైగా, భూమండలానికి, శుక్రమండలానికి ఇతర సామ్యాలు అనేకం ఉన్నాయి. ఈ రెండు మండలాలను ఖగోళ శాస్త్రజ్ఞులు అక్కచెల్లెళ్ళతో పోల్చడం కద్దు. భూగోళం కంటే శుక్రగోళం కొద్దిగా చిన్నది. దీని వ్యాస రేఖ కంటే దానిది నూటికి మూడువంతులు మాత్రమే తక్కువ. దీనికంటే అది దాదాపుగా 23 వంతులు మాత్రమే తేలిక. తక్కిన కొన్ని ఉపగ్రహాలు మరీ చిన్నవైనందున ఏ వాయువూ వాటిని ఒక పొరవలె ఆవరించి యుండలేదు. శుక్రగ్రహం, భూమండలం వలె, ఉదజని (హైడ్రోజన్) సమేతంగా అన్ని వాయువులను, అవి శూన్యంలోకి చెదరిపోకుండా, నిలపుకోగలుగుతున్నది.

ఈ సామ్యాల కారణంగా భూమండలంపై వలె శుక్ర గ్రహంలో కూడా జీవకోటి ఉన్నదని భావించవచ్చునా? ఇందుకు అవకాశాలు తక్కువనే ఖగోళ శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. వాతావరణంలో విశేషంగా ప్రాణవాయువు (ఆక్సిజన్) లేనిదే జీవకోటి ఆవిర్భవించడానికి, ఆవిర్భవించిన తర్వాత జీవించడానికి వీలులేదు. ఇప్పటివరకు జరిగిన పరిశోధనల ప్రకారం శుక్రగ్రహం వాతావరణంలో ప్రాణవాయువు దాదాపు నామమాత్రం కాగా, దానిలో బొగ్గుపులుసు గాలి (కార్బన్ డయాక్సయిడ్) కొన్నివేల రెట్లు అధికం. ఇట్టి వాతావరణంలో వృక్షకోటి సమేతంగా ఇతర జీవకోటి ఆవిర్భవించడానికి అవకాశం లేదు. శుక్రగోళంలో నీరు వుంటే, అది కేవలం ఆవిరి రూపంలోనే ఉండవచ్చు.

ఇదివరకటి పరిశోధనల ప్రకారం శుక్ర గ్రహంలో ఉష్ణోగ్రత 80 సెంటీ గ్రేడ్ డిగ్రీల నుంచి 130 డిగ్రీల వరకు విస్తరిస్తూ ఉంటుంది. శుక్రగ్రహంలో నిన్న దిగిన సోవియట్ రోదసీ నౌక పంపించిన తొలి భోగట్టా ప్రకారం ఈ అంచనాలు తప్పు. అక్కడి కనీసపు టెంపరేచర్ 40 సెంటీ గ్రేడ్ డిగ్రీలు కాగా, గరిష్ఠపు టెంపరేచర్ 280 డిగ్రీలు. అయినప్పుడు శుక్ర గ్రహంలో జీవకోటి - భూమండలంపై గల జీవకోటిని పోలినట్టిది - ఆవిర్భవించడానికి, పరిఢవిల్లడానికి అవకాశం లేదనే తీర్మానించుకోవాలి.

ఖగోళశాస్త్రజ్ఞుల సిద్ధాంతాల ప్రకారం భూమండల వాతావరణంలో ప్రాణవాయువు హెచ్చుగాను, బొగ్గుపులుసు గాలి అత్యల్పంగాను ఉండడానికి ముఖ్య కారణం ఇక్కడ వృక్షసంతతి విశేషంగా ఉండడమే! వృక్షసంతతిని శుక్ర గ్రహంలో పెట్టగలిగితే కొన్ని కోట్ల సంవత్సరాల తర్వాత అది భూమండలంవలె మానవవాసయోగ్యమైన గోళం కాగలదా? ఇది వెర్రివూహవలె తోచవచ్చు గాని, రోదసీయానం ఒకనాడు పెక్కుమంది తీర్పు ప్రకారం కేవలం వెర్రివూహ మాత్రమే కాదా?

మానవునికి, తక్కిన జీవకోటికి ఒకే ఒక ప్రధాన భేదం ఉన్నది. మానవునికి "కాన్ చుయెల్ థింకింగ్" సాధ్యం. సూత్రాలను చేయగల, సిద్ధాంతాలను రూపొందించగల, సత్యాలను కనుగొనగల, ఒక సత్యం నుంచి మరొక దానికి పురోగమించగల తన మేధాపటిమతోనే మానవుడు నేడు ప్రకృతిరహస్యాలను తెలుసుకొంటున్నాడు; రేపు సృష్టి మూలాన్నే అతడు తెలుసుకోవచ్చు.

కాలం గడచినకొద్దీ వైజ్ఞానిక శాస్త్రాలలో మానవుని పురోభివృద్ధి గమనవేగం హెచ్చుతున్నది. ఆధునిక వైజ్ఞానిక శాస్త్రాలు తలయెత్తి, పూర్తిగా మూడు వందల సంవత్సరాలైనా కాలేదు. ఈ కొద్ది వ్యవధిలోని మొదటి రెండువందల సంవత్సరాలలో మానవుడు కనుగొన్న వైజ్ఞానిక రహస్యాలు, అతడు సాధించిన సాంకేతిక విజయాలు చివరి వంద సంవత్సరాలలోని వాటితో పోల్చినప్పుడు బహుస్వల్పం. తన సాంఘిక, రాజకీయ జీవితాన్ని, తన మానసిక జీవితాన్ని, తన "ఎమోషనల్" జీవితాన్ని, ఒక్క మాటలో తన బహిరంతర జీవితాన్ని మరింత సక్రమపద్ధతులపై, మరింత హేతుబద్ధంగా, మరికొంచెం ఉదాత్తంగా మానవుడు నడుపుకొన్న పక్షంలో, యుద్ధాన్ని ప్రపంచంనుంచి అతడు నిషేధించ గలిగిన పక్షంలో, అణు విజ్ఞానాన్ని ఆత్మహత్యకోసం అతడు వినియోగించని పక్షంలో, చంద్ర, శుక్ర గ్రహాల పైనే కాక, సౌరమండలంలోని ఇతర గ్రహాలకు సయితం అతడు స్వయంగా వెళ్లిరాగలరోజు త్వరలోనే వస్తుంది; ఆ గోళాలలో కనీసం కొన్నింటిలోనైనా వృక్ష సంతతిని, ఇతర జీవకోటిని, అతడు ప్రవేశ పెట్టగల రోజు వస్తుంది; సౌరమండలాధి పత్యాన్ని అతడు సాధించగల రోజు వస్తుంది; సృష్టిమూలాన్ని ఆకళింపుచేసుకొని, అతడు ప్రతిసృష్టి చేయగల రోజు సయితం వస్తుంది.

మానవుడు కలకాలంగా ఊర్ధ్వముఖుడే! అయితే, అజ్ఞానదశలో అతడు ఊర్ధ్వ దిశలో హిందువుగా స్వర్గాన్ని, బౌద్ధుడుగా తుషితలోకాన్ని, గ్రీక్ గా ఈ లిజియన్ ఫీల్డ్ ను, నార్స్ జాతివాడుగా వాలాలను, క్రైస్తవుడుగా హెవెనను, ఇతర మతస్థుడుగా ఇతర లోకాలను చూచాడు. కాని, ఈనాడు వైజ్ఞానిక శాస్త్రవేత్తగా, సాంకేతిక విద్యా ప్రవీణుడుగా అతడు ఊర్ధ్వముఖుడై చూస్తున్నది కాలానికి, అవధికి అతీతమై నిత్యం విస్తరిస్తున్న విశ్వగోళాన్ని ("ది ఎక్స్ పెండింగ్ యూనివర్స్"). తన భూగోళాన్ని విడిచి, తన సమీపంలో గల ఇతర గోళాలలో మానవుడు

ప్రవేశించడం మరి రెండు, మూడేళ్ళలోనే జరగవచ్చు. ఈ సాహసిక యాత్ర మానవజీవితానికే చరితార్థతను కూర్చబోతున్నది. *(ఆంధ్రజ్యోతి 20-10-1967)*

నవమతం, నూతనవేదం కావాలి

మానవుడు కొన్ని లక్షల సంవత్సరాలుగా భూమండలంపై నివసిస్తున్నాడు. అన్ని లక్షల సంవత్సరాలలోను అతడు సాధించిన వైజ్ఞానిక ప్రగతి ఒక యెత్తు, కడచిన నూరు, నూటయాభై సంవత్సరాలలో అతడు సాధించగలిగింది మరొక యెత్తు.
ముఖ్యంగా ఈ శతాబ్దంలో మానవవిజ్ఞానం అమితవేగంతో, అత్యాశ్చర్యకరంగా పెరిగిపోతున్నది. అందులోను, ప్రపంచ ప్రసిద్ధ ఖగోళశాస్త్రవేత్తలలో ఒకడైన హార్లో షేప్లీ ఇటీవల ఒక వ్యాసంలో పేర్కొన్నట్టు, మానవ విజ్ఞానం రెండు విభిన్న దిశలలో విభ్రాంతికరంగా పురోగమిస్తున్నది. ఒకటి - రాత్రి పూట తలయెత్తి, కనులు విప్పి చూస్తే కనబడే అనంత విశ్వానికి సంబంధించిన విజ్ఞానం.

రెండవది - స్థూలదృష్టితోగాని, యంత్ర పరికరాల సహాయంతోగాని ఏ విధంగాను చూడడానికి వీలులేని పరమాణు ప్రపంచానికి సంబంధించిన విజ్ఞానం.

ఒకటి అతి స్థూలజగత్తుకు, రెండవది అతి సూక్ష్మజగత్తుకు సంబంధించినట్టిది. ఈ రెండు దిశలలోను మానవుడు ముఖ్యంగా ఈ ఇరవయ్యో శతాబ్దిలో కనుగొన్న రహస్యాలు ఎట్టి అత్యద్భుత పరిణామాలను సాధ్యం చేయనున్నవో ఊహించడమైనా కష్టం.

17 నెలల క్రిందట అమెరికన్ రోదసీ యాత్రికుడు రిచర్డ్ గోర్డన్ తన జెమినీ - 11 రోదసీనౌక నుంచి తీసిన కొన్ని ఛాయాచిత్రాల ద్వారా నక్షత్రాలెలా ఉద్భవించినవనే విషయం తెలియవచ్చునని శాస్త్రజ్ఞులు తలపోస్తున్నట్టు నిన్నటి ఒక వార్త సూచిస్తున్నది. “ఓరియన్” నక్షత్ర మండలం మనకు 45 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నది. దాన్ని 12 కోట్ల కాంతి సంవత్సరాల వ్యాసం గల ఒక “ధూళి మేఘం" ఆవరించివున్నట్టు రిచర్డ్ గోర్డన్ తీసిన ఫోటోలు చూపుతున్నాయట. వేర్వేరు స్థలాలలో ఆ “ధూళిమేఘం” చిక్కదనాన్ని బట్టి ఒక కొత్త నక్షత్రం ప్రభవించడానికి అది ముడి పదార్థంగా అనిపిస్తున్నదని, దీన్నిబట్టి నక్షత్రగోళాలు ఏ విధంగా ఆవిర్భవించాయో తెలియరావచ్చునని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

ఇట్టి విశ్వరహస్యాలు ఎంత త్వరలో మనకు కరతలామలకాలు కాగలవో చెప్పలేము. కాని, ఇప్పటికి తెలియవచ్చిన విషయాలనుబట్టి కూడా మనం కొన్ని శతాబ్దాలుగా పెంచుకొన్న అనేక మూఢవిశ్వాసాలు పటాపంచలు అయిపోతున్నాయి. భూమి, దానిపై జీవరాశి, దానిలో మన స్థానం, మనపై మన పరిసరాల ప్రభావం, మన సౌరమండలం, దానిలోని గ్రహాలు, ఉపగ్రహాలు మొదలైన అనేకానేక విషయాల గురించి తరతరాలుగా, యుగయుగాలుగా మనం పెంచుకొన్న పెక్కు అజ్ఞానభావాలు, అంధవిశ్వాసాలు సదలి పోతున్నాయి.

ఇంతే కాదు. మన వైజ్ఞానిక పురోగతిలో ఒక్కొక్క నూత్న విషయం ఆవిష్కృతమౌతున్న కొద్దీ మొన్నటి శాస్త్రవేత్తలు చేసిన సిద్ధాంతాలను నిన్నటి వారు. నిన్నటివారి, పరిశోధనా ఫలితాలను నేటివారు ఖండించివేస్తున్నారు. దీన్ని నిజానికి ఖండన మండనలదృష్టితో చూడరాదు; మానవ విజ్ఞాన పురోగతిగా భావించాలి.

ఉదాహరణకు, కాంతికంటె వేగంతో (సెకండుకు ఒక లక్ష ఏనభై ఆరువేల మైళ్ళు) ఏదీ ప్రయాణం చేయలేదని మహామేధావి ఐన్ స్టీన్ విశ్వసించాడు. ఒకటి, ఒకటి కలిస్తే రెండు అన్నట్టు, తిరుగులేని శాస్త్రీయ సత్యాలలో దీన్ని ఒకటిగా మనం పరిగణిస్తూ వచ్చాము.

అయితే, కొలంబియా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ జెరాల్డ్ ఫేస్ బర్గ్ ప్రతిపాదించిన ఒక నూత్న సిద్ధాంతాన్ని బట్టి కాంతికంటె వేగంగా, ఆ మాటకు వస్తే "పరిమితి లేని" వేగంతో (ఇనిట్ స్పీడ్ తో) పయనించే పరమాణు కణాలు (పార్టికిల్స్) ఉండవచ్చునట. వాటిని ఆయన “టాక్యాన్స్” అని పేరు పెట్టాడు.

కొంత కాలం క్రితంవరకు జీవరాశి భూగోళానికే పరిమితమని శాస్త్రజ్ఞులు నమ్మేవారు. కాని, ఇప్పు డేమో “బహుశా” అనే సంశయానికి తావు లేదని అంటున్నారు. విశ్వంలో కోటానుకోట్ల నక్షత్రాలున్నాయి, సూర్యుని కున్నట్లే వాటికి కూడా గ్రహాలున్నాయి. ఒక్కొక్క నక్షత్రం చుట్టూ ఒక్కొక్క గ్రహంలో జీవరాశి ఉన్నా, మన భూమిని పోలిన గ్రహాలు, ఏదో ఒక రూపంలో జీవరాశి కలిగిన గ్రహాలు, కొన్ని కోట్లు ఉండడానికి వీలున్నది.

ఇంతే కాదు, మన భూమిపై జీవరాశి ప్రాణవాయువు (ఆక్సిజన్) ఆధారంగా ఆవిర్భవించింది. బహుశా ఇతర గ్రహాలలో తద్భిన్నమైన మూలద్రవ్యాల ఆధారంతో పరిణామం చెందిన జీవరాసు లున్నాయేమో! మన భూమిపై జీవరాశిలో మానవుడు ఎన్నదగు పరిణామం చెందినవాడుగా కనబడుతున్నాడు.
సుదూర గ్రహాలలో ఇంతకంటె ఉత్తమ పరిణామం చెందిన జీవులున్నారేమో! వారి నాగరికత మనదానికంటె మరింతగా పరిణతి చెందినది కావచ్చునేమో! వీటిని కేవలం ఊహాగానాలుగా త్రోసివేయడానికి వీలు లేదని ఈ నాటి శాస్త్రజ్ఞులు ఉద్ఘాటిస్తున్నారు.

చంద్రగోళానికి మానవుడు చేరడానికి ప్రస్తుతం సన్నాహాలు జరుగుతున్నాయి. ఇది మరి రెండు, మూడేళ్ళలోనే సాధ్యం కావచ్చు కూడా.అది సాధ్యమైతే, సౌరకుటుంబంలోని ఇతర గ్రహాలకు ప్రయాణాలు సయితం త్వరలోనే సాధ్యం కావచ్చు.

చంద్రుడు మనకు అతి సమీపంలో ఉన్న గోళం. అక్కడికి వెళ్ళిరావడం అయిదారు రోజుల పని. ఇతర గ్రహాలకు చేరడం సాధ్యమైతే, అది కొన్ని నెలల పని. కాని, విశ్వాంతరాళంలో కొన్ని కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో గల గోళాలను చేరడం మానవసాధ్యం కాకపోవచ్చు. కనీసం ఇది ఈనాడు శాస్త్రవేత్తలు వెలిబుచ్చుతున్న నిరాశ. కాని, ఫేస్ బెర్గ్ సిద్ధాంతం ప్రకారం “టాక్యాన్స్” పరమాణుకణాలు నిజంగా ఉంటే, అవి కాంతికంటె వేగంగా పోగలిగితే, వాటి శక్తిని వినియోగించుకొని రోదసీనౌకలను అనంతవేగంతో నడపగలిగితే, దూరగోళాలను చేరడం సాధ్యమేమో! ఈ ఆశను ఫేస్ బర్గ్ స్వయంగా వెల్లడించాడు. అణుకేంద్రంలో ఉన్నవని డాక్టర్ ఫేస్ బర్గ్ చెబుతున్న “టాక్యాన్స్” కణాలు నిజంగా ఉన్నవా, లేవా అని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. వాటిని కనుగొనడానికి చేసిన ప్రయత్నాలు ఇంతవరకు ఫలించలేదు. కాని, 1920 ప్రాంతాలలో పి.ఎ.ఎమ్. డిరాక్ అనే

శాస్త్రజ్ఞుడు కేవలం గణితశాస్త్ర సహాయంతో ఊహించిన "పోజిట్రాన్" మొదలైన విలక్షణ అణుకణాలు (యాంటీ మేటర్) నిజంగా ఉన్నవని అటుపిమ్మట శాస్త్రవేత్తల పరిశోధనలలో తేలింది. ఇదే విధంగా, కాంతికంటె వేగంగా పయనించే "టాక్యాన్స్" కణాలను కూడా శాస్త్రవేత్తలు నెమ్మదిగా కనిపెట్టడం సంభవమేమో!

ఏమైనా, నిన్న మొన్నటి వరకు శాశ్వత సత్యాలుగా వైజ్ఞానిక శాస్త్రవేత్తలు స్వయంగా గుర్తించిన సిద్ధాంతాలు సయితం నూతన పరిశోధనల ఫలితంగా పూర్వపక్షమై పోతున్నాయి. అయినప్పుడు, కొన్ని వందల యేళ్ళనాటి, వేల యేళ్ళనాటి మన వేదాలపై, పురాణాల పై, ధర్మశాస్త్రాలపై, త్రిపిటకాలపై, బైబిల్ పై, ఖోరాన్ పై ఆధారపడిన మన విశ్వాసాలు, సిద్ధాంతాలు పూర్వపక్షం కావడంలో ఆశ్చర్యం లేదు.

జగత్తు పరిణామశీలమైనది. దీనికి స్థిరత్వం లేదు. అణువునుంచి బ్రహ్మాండం వరకు సమస్తం - సతతం - పరిణామం చెందుతున్నది. ఒకే ఒక ఎలెక్ట్రా తో కూడిన హైడ్రోజన్ అణువునుంచి అతి సంకీర్ణమైన స్థూల జగత్తు యావత్తు పరిణామం చెందింది. ఒకే ఒక జీవకణం కలిగిన ప్రాణినుంచి మానవునితోసహా సర్వ జీవరాశి రూపొందింది. ఈ పరిణామం ఇంకా అనంతముఖాలుగా, అశేషరూపాలలో కొనసాగుతూనే ఉన్నది.

అయినప్పుడు, కొన్ని వేల సంవత్సరాల నాటి విశ్వాసాలను శాశ్వత సత్యాలుగా పట్టుకొని ప్రాకులాడ్డం అవివేకం కాదా? మనపూర్వులు తమ పరిమిత విజ్ఞానం ఆధారంగా తమ విశ్వాసాలను సృజించుకున్నారు. వాటిని ఈనాటి వైజ్ఞానిక శాస్త్రాలు అజ్ఞాన జనితాలుగా నిరూపించాయి. అందువల్ల, ఆ పాతవిశ్వాసాలను ఒక పక్కకునెట్టి, ఈనాటి శాస్త్రీయ విజ్ఞానానికి తగు కొత్త విశ్వాసాలను మనం సృజించుకోవాలి. కేవలం తాను, తన భూమి సర్వసృష్టికి కేంద్రమన్న విశ్వాసాన్ని విడనాడి,ఒక నూతన దృక్పథాన్ని మానవుడు పెంపొందించుకోవాలి. వైజ్ఞానిక శాస్త్రాల విస్తరణ పై ఆధారపడిన నవ మతాన్ని, నూతన వేదాన్ని సృష్టించుకొని, వాటితోపాటు తాను సయితం పురోగమించాలి. *(ఆంధ్రజ్యోతి 8-2-1968)*

విజ్ఞానశాస్త్ర యుగం

మతం మత్తు మందు వంటిదే. అందువల్లనే, ఇదివరకు వివిధ దేశాలు మతానికే ప్రాధాన్య మిచ్చేవి. కేవలం మతం ప్రాతిపదికగానే ఆయా దేశాలు తమ విధానాలను రూపొందించుకునేవి. అయితే, ఇందువల్ల అభివృద్ధి కుంటుపడుతుందని పాశ్చాత్య దేశాలు చాలా కాలం క్రిందటనే గ్రహించాయి. మత మౌఢ్యంవల్ల వెనుకబడినతనమే మిగులుతుందని అవి తెలుసుకున్నాయి . అందుచేతనే, అవి మూఢ నమ్మకాలను విడనాడి, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలను ఆలంబనంగా తీసుకుని ఆధునికమైన జీవిత విధానాన్ని అవలంబించాయి. విజ్ఞాన, సాంకేతిక శాస్త్ర రంగాలను పాశ్చాత్యులు విపరీతంగా అభివృద్ధి చేసి, తమ దేశాలను ఆధునిక పద్ధతులపై తీర్చిదిద్దుకున్నారు. కాగా, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రరంగాల ప్రాధాన్యాన్ని ఆసియా దేశాలు మొన్న మొన్నటి వరకు గుర్తించలేకపోయాయి. ఆసియా దేశాలలో ఒక్క జపాన్ మాత్రం 1868లో భూస్వామ్య వ్యవస్థకు, దానికి సంబంధించిన ఛాందసత్వానికి స్వస్తి చెప్పి, కేవలం పాశ్చాత్యులను అనుకరించి, విజ్ఞాన, రంగాలలో పురోగమించింది. అందువల్లనే, ఆసియాలో నేడు జపాన్ పాశ్చాత్య పద్ధతులపై ఆధునికంగా అభివృద్ధి చెందింది. మిగతా ఆసియా దేశాల పరిస్థితికి, జపాన్ పరిస్థితికి వ్యత్యాసం ఉన్నది. జపాన్ వలస దేశంకాదు. అది తనకాళ్ళ పై తాను నిలబడి అభివృద్ధి చెందగలిగింది. మిగిలిన ఆసియా దేశాలు ఏదో ఒక పాశ్చాత్య దేశం పలుకుబడిలో

ఉండిపోయాయి. మొన్న "కా స్టేషియా" సభలో ప్రధాని ఇందిరా గాంధి అన్నట్టు పారతంత్ర్యం వల్ల ఆసియా దేశాలు విజ్ఞానశాస్త్ర రంగంలో పురోగతిని సాధించలేకపోయాయి.

ఈ లోపాన్ని సవరించడడానికి సాగుతున్న కృషిలో భాగమే ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న "కా స్టేషియా" సభ. ఆసియా దేశాల అభివృద్ధికి విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలను ఎలా వినియోగించవచ్చునో మార్గాలను అన్వేషించడం ఈ మహాసభ లక్ష్యం. విజ్ఞాన శాస్త్ర విశేషాలను, విజయాలను గురించి ప్రచారం చేయడం, విజ్ఞానశాస్త్ర బోధకులకు శిక్షణ నివ్వడం, శాస్త్రవేత్తల ప్రతిపత్తిని పెంచడం మొదలైన విషయాలను గురించి ఈ మహా సభ చర్చిస్తుంది.అస్వతంత్రమైన ఆసియా దేశాలలో తొలిగా స్వాతంత్ర్యం పొంది, విజ్ఞాన సాంకేతిక శాస్త్ర రంగాలలో పురోగతిని సాధిస్తున్న భారత దేశంలో ఈ మహాసభ జరగడం అత్యంత సముచితంగా ఉన్నది.

ఒక ప్రక్క పాశ్చాత్య ప్రపంచం విజ్ఞాన శాస్త్ర రంగంలో అనుక్షణం పురోగమిస్తుండగా, ప్రాచ్య ప్రపంచం ఆ రంగాన్ని నిర్లక్ష్యం చేసి వెనుకబడి ఉండలేదు. ఆసియా దేశాలు పరస్పర సహకారంతో విజ్ఞానశాస్త్ర రంగంలో అభ్యున్నతిని సాధించాలి. ముఖ్యంగా పాతబడిన నేటి విద్యా బోధనా వ్యవస్థలో విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలకు విశేష ప్రాధాన్య మివ్వడం అవసరం. ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న సభ ఆసియా దేశాల దృష్టిని ఈ సమస్యల పైకి మరలించగలిగిన ఈ మేరకే దానికి సార్థక్యం. *(ఆంధ్రజ్యోతి 12-8-1963)*

నిత్యాన్వేషి మానవుడు

ఇదే ఆ అద్భుత కడచిన శనివారం సాయంత్రం నుంచి ఈ శుక్రవారం రాత్రి వరకు
యావత్ప్రపంచం దృష్టిని ఆకర్షించింది ఒకే ఒక్క అద్భుత సంఘటన.

ముగ్గురు అమెరికన్ గగన వీరులు భూమి గురుత్వాకర్షణ శక్తిని ఛేదించుకుని చంద్ర మండలం దిశగా సుదీర్ఘ ప్రయాణం చేయడం, తిరిగి చంద్రుని ఆకర్షణ శక్తి నుంచి విడివడి భూమివైపు పయనించి భూ వాతావరణంలో ప్రవేశించడం, పసిఫిక్ మహా సముద్రంలో నిర్దిష్ట ప్రదేశంలో దిగడం సంఘటన.

ఈ వ్యాసం వ్రాస్తున్న సమయానికి ఈ మహా సంఘటన ఇంకా పూర్తికాలేదు కాని, అది జయప్రదంగా, సురక్షితంగా ముగియవలెననే యావత్ప్రపంచం కోరుకుంటున్నది.

ఇతః పూర్వం జరిగిన ప్రయోగాలకు, దీనికి ముఖ్యమైన తేడా ఒక్కటే. ఇదివరలో కొన్ని రోదసీ నౌకలు తమంతట తాము చంద్ర మండలానికి వెళ్లాయి. ఇప్పుడు అపోలో-8 రోదసీ నౌకలో మనుష్యులు ఈ సాహస కార్యాన్ని నిర్వర్తించారు. స్వయంగా కళ్లారా చంద్రలోక దృశ్యాన్ని తిలకించారు.

ఇంతకు మించి వారు భూమికి తీసుకు వచ్చే కొత్త వైజ్ఞానిక విశేషాలు అంతగా లేవని కొందరు శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఒక విధంగా ఇది నిజమే కావచ్చు. చంద్రమండలాన్ని గురించిన అనేక విషయాలు ఇదివరకే మానవులకు కరతలామలకాలైనాయి.

మానవుడు జంతుదశ నుంచి పరిణామం చెంది, తలెత్తి ఆకాశం వైపు, దాని విచిత్రాల వైపు చూడడం నేర్చినప్పటి నుంచి చంద్రుని గురించి అతడు ఆలోచిస్తూనే ఉన్నాడు. చంద్రుని గురించి ఆదిమ మానవులు ఎన్నో ఊహలు చేశారు. చంద్రుడొక దేవత అని భావించి, ఆ ఊహ చుట్టూ ఎన్నో రమణీయ కథలు కల్పన చేశారు.

కాని, మానవ జిజ్ఞాసను ఆ కథలు సంతృప్తి పరచలేదు. తత్త్వాన్వేషణ దృష్టితో వారు పరిశీలన ప్రారంభించారు. చంద్రునికి స్వయం ప్రకాశం లేదని, సూర్యకాంతి ప్రతిఫలిస్తేనే దానికి కాంతి అని, మరెన్నో ప్రాథమిక విషయాలను వారు అతి ప్రాచీన కాలంలోనే కనుగొన్నారు. గ్రీకు తత్త్వవేత్త డెమొక్రిటస్ క్రీస్తు పూర్వం 450 లోనే చంద్రుడు కొండలు, లోయలతో నిండిన గోళమని ప్రతిపాదించాడు. క్రీస్తుకు మూడు వందల ఏళ్ళకు పూర్వమే అరిస్టార్కస్ భూమికి, చంద్రునికి మధ్య దూరాన్ని లెక్కవేశాడు. వరాహమిహిరుడు, ఆర్యభట్టు మొదలైన హిందూ ఖగోళ శాస్త్రవేత్తలు కూడా చంద్రుడు, సూర్యుడు, భూమి, గ్రహాలు, నక్షత్రాల గురించి శాస్త్రీయమైన మహత్తర సిద్ధాంతాలు చేశారు. సూర్యుని చుట్టూ భూమి, తదితర గ్రహాలు తిరుగుతున్నాయని ఆ నాటికే వారికి తెలుసు. అయితే, గ్రీకు శాస్త్రజ్ఞుడు టోలెమీ భూమిచుట్టూ ఇతర గ్రహాలు తిరుగుతున్నాయనే ప్రాచీన మూఢ విశ్వాసాన్ని పునరుద్ధరించడంతో సుమారు 15 వందల ఏళ్ళపాటు ఖగోళశాస్త్ర పురోగమనం స్తంభించి పోయింది.

ఆ తర్వాత పోలిష్ ఖగోళవేత్త కోపర్నికస్ సూర్యుని చుట్టూ గ్రహాలన్నీ తిరుగుతున్నవనే సిద్ధాంతాన్ని తిరిగి ప్రతిపాదించడంతో ఖగోళశాస్త్రం తిరిగి పురోగమనం ప్రారంభించింది. గెలీలియో మొదటిసారిగా 1609లో తన టెలిస్కోపును చంద్రునివైపు త్రిప్పడంతో ఆధునిక ఖగోళ శాస్త్రానికి పునాదులు పడ్డాయి.

అప్పటి నుంచి మూడున్నర శతాబ్దాలు గడిచాయి. టెలిస్కోప్లు అంతకంతకు పెద్దవైనాయి. గణితశాస్త్రం ఎంతో అభివృద్ధి చెందింది.
ఈనాడు మన ఊహకు అందనంతటి దూరాలలో ఉన్న అనేక బ్రహ్మాండ గోళాల రహస్యాలను సయితం శాస్త్రవేత్తలు ఛేదిస్తున్నారు. కేవలం మనకు రెండున్నర లక్షల మైళ్ల దూరంలో ఉన్న చంద్రుని గురించిన రహస్యాలు ఒక లెక్కా? భూగోళం మ్యాపును తయారుచేసినంత వివరంగా చంద్రుని పటం తయారుచేశారు. చంద్రునిలోని ఎన్నో కొండలకు, "సముద్రాలకు", లోయలకు, బిలాలకు పేర్లు పెట్టారు.

చంద్రుడు భూమి చుట్టూ తిరిగే ఉపగ్రహమని, దాని పదార్థ పరిమాణం భూమిలో ఎనభైయవ వంతు అని, దాని వ్యాసం 2160 మైళ్ళు అని ఈనాడు మనకు తెలుసు. భూమికి, దానికి మధ్య దూరం 226 వేల మైళ్ళ నుంచి 252 వేల మైళ్ళకు మారుతుందని తెలుసు.

చంద్రగోళం నివాసయోగ్యం కాదని ఏనాడో కనుగొన్నారు. మానవుడుగాని, మరి ఏ ప్రాణులుగాని జీవించడానికి అవసరమైన పరిస్థితులు అక్కడ లేవు. దాని గురుత్వాకర్షణ శక్తి భూమి గురుత్వాకర్షణ శక్తిలో ఆరవ వంతు ఉంటుంది. అందుచేత అక్కడ వాతావరణం లేదు. గాలిలేదు నీరు అసలే లేదు. గాలి లేదు కనుక అదొక నిశ్శబ్ద, నిర్జీవ ప్రపంచం.

వాతావరణం లేదు కనుక సూర్యుని కిరణాలు చంద్రునిపై యథాతథంగా ప్రసరిస్తాయి. అక్కడ పగటి వేడిమి ప్లస్ 212 ఫారెన్ హీట్ డిగ్రీలు. రాత్రి శైత్యం మైనస్ 250 డిగ్రీలు దుర్భరమైన ఈ ఉష్ణ, శైతల్య వైపరీత్యాలలో

మానవుడు జీవించలేడని వేరే చెప్పనక్కరలేదు. అక్కడ ఇంచుమించుగా పదిహేను రోజులపాటు ఒకే దీర్ఘ యామిని. గురుత్వాకర్షణ శక్తి తక్కువ కనుక మనిషి భూమి మీద నడిచినట్టు నడవలేడు.

ఇన్ని విచిత్ర పరిస్థితులున్న ప్రపంచం కనుక, మానవుడు దాన్ని వాసయోగ్యంగా చేయడం, అక్కడ వలసలను స్థాపించడం ఎన్నటికి సాధ్యం కాకపోవచ్చు. మానవులు అక్కడే నివసించగోరితే భూమి నుంచి అపారంగా ప్రాణవాయువును తీసుకువెళ్ళాలి; నీటిని, ఆహారాన్ని తీసుకువెళ్లాలి. నిరంతరం రక్షణ కవచాలు తొడుక్కుని బ్రతకాలి.

ఆ విధంగా చంద్రుడిని వాసయోగ్యంగా చేయడానికి కాగల వ్యయంతో భూలోకాన్నే మరింత వాసయోగ్యం చేసుకోవచ్చు. ఇప్పటికీ భూమిమీద నిర్జన ప్రదేశాలు అశేషంగా ఉన్నాయి. అందుచేత చంద్రగోళాన్ని "కాలనైజ్" చేయాలన్న తలపు ప్రస్తుత ఖగోళ పరిశోధనలకు ప్రేరణ కానక్కరలేదు.

కాని, మానవుడు సాహసి; జిజ్ఞాసువు; నిరంతరాన్వేషి. జంతువులకు శరీర ధర్మాలను మించిన జీవితంలేదు. మానవుడు మనోజీవి. అతని ఆలోచనలు బ్రహ్మాండ గోళంవలెనే అనంతమైనవి.

ఏదో శక్తి అతడిని జంతుదశ నుంచి ముందుకు నెట్టింది. నిప్పుచేయడం కని పెట్టాడు. వ్యవసాయం ద్వారా ఆహారోత్పత్తి చేయడం కనుగొన్నాడు. నగరాలను నిర్మించాడు. నాగరికతను కల్పించాడు. తన అనుభూతులను వ్యక్తం చేయడానికి కవిత్వం, సంగీతం, చిత్రలేఖనం వంటి కళలను నేర్చాడు. తనలోనికి, తన వెలుపలకు దృష్టిని సారించాడు. ఈ చెట్లు, చేమలు, కొండలు, నదులు, సముద్రాలు, గ్రహాలు, తారకలు ఏమిటి? ఇవి ఎక్కడి నుంచి వచ్చాయి? ప్రాణం అంటే ఏమిటి? అది ఎలా ఉద్భవించింది?
ఇలాగ అనంతమైన ప్రశ్నలు తన్నుతాను వేసుకుని సమాధానాల కోసం యుగయుగాలుగా అన్వేషిస్తున్నాడు. అనేక ప్రశ్నలకు సమాధానాలు లభించినట్టే తోస్తున్నది. అయినా, అతనికి తృప్తి లేదు. ఆ సమాధానాలనుంచి కొత్త సందేహాలు పుట్టుకు వస్తున్నాయి. తిరిగి వాటికి సమాధానాలను అన్వేషిస్తున్నాడు. అసలు మూలతత్త్వాన్ని కనుగొనాలని ఆరాటపడుతున్నాడు. అట్టి ఆరాటం ఫలితమే నేడు శాఖోపశాఖలుగా పెరిగిపోతున్న ఆధునిక విజ్ఞానం. ఈనాడు మానవులు అతి శక్తివంతమైన రాకెట్లు నిర్మించినా, రోదసీ నౌకలు నిర్మించినా, చంద్రునిలో దిగడానికి ప్రయత్నాలు చేస్తున్నా, ఇంకా దూరదూరాలలో ఉన్న గ్రహాలకు రాకెట్లు పంపి పరిశోధనలు సాగిస్తున్నా ఈ అంతులేని విజ్ఞానపిపాసే కారణం.

నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి. రామన్ వంటి శాస్త్రవేత్తలు ఈ కృషిని ఈసడించడం కూడా చూస్తున్నాము. కోట్ల కొలది ధనాన్ని, అంతులేని మానవ శ్రమను వెచ్చించి, ఖగోళ పరిశోధన చేయడం శుష్కాడంబరంగా వారు భావిస్తున్నారు. అందుచేతనే శ్రీ రామన్ మొన్నటి అపోలో ప్రయోగాన్ని హర్షించలేదట.

కాని, ఎవరెలా భావించినా విజ్ఞానశాస్త్రం పురోగమిస్తున్నది. దానికిక అవరోధాలు లేవు. శ్రీ రామన్ కాంతిని గురించి వినూత్న రహస్యాలను కనిపెట్టడానికి ఏ శక్తి ప్రోత్సహించిందో అదే శక్తి ఇతరులను విశ్వాంతరాళ పరిశోధనలకు ప్రోద్బలిస్తున్నది. ఈ పురోగతికి అవరోధం కలిగితే మానవుని దౌర్బల్యం వల్లనే కలుగుతుంది. మానవుడు విశ్వాన్ని జయిస్తున్నా, తన్ను తాను జయించుకోలేక పోతున్నాడు; తన్ను తాను సంయమించుకోలేక పోతున్నాడు. ఆ సంయమనాన్ని అతడు నేర్చిననాడు నేటి వైజ్ఞానిక పురోగతి మానవ కళ్యాణదాయకమే కాగలదు.

మానవ విజయం

"ఆనాడు జీవించి ఉంటే..."

ఈ తలంపుతో ఎందరు, ఎన్ని సార్లు, ఎంతగా నిట్టూర్చలేదు?

సుమేరియన్లు అక్షరాలకు తొలిరూపం దిద్దినప్పుడు బాబిలోనియన్లు ఒక దానికంటె మహోన్నతంగా మరొక జిగూరత్ ను నిర్మించినప్పుడు వేద ఋషులు యజ్ఞవాటికలలో ఋక్కులను రచించినప్పుడు హామురాబీ ప్రథమ ధర్మశాస్త్రాన్ని ప్రకటించినప్పుడు రామ్ సెస్ ది గ్రేట్ గుహాలయాలను ఆబూషింబెల్ లో తొలిపించినప్పుడు మహమ్మద్ మక్కాలో విజయప్రవేశం చేసినప్పుడు కృష్ణదేవరాయలు "భువన విజయం"లో నిండు పేరోలగం ఉన్నప్పుడు షాజహాన్ తాజ్ మహల్ ను నిర్మించినప్పుడు కొత్త సముద్ర మార్గాలను, కొత్త ఖండాలను కనిపెట్టినప్పుడు గాంధీజీ ఉప్పు సత్యాగ్రహానికై సబర్మతి నుంచి దండికి ప్రయాణమైనప్పుడు గౌతమ బుద్ధుడు ధర్మచక్ర ప్రవర్తనను ప్రారంభించినప్పుడు సోక్రటీస్ ఏథెన్స్ వీథులలో యువక బృందంతో తత్త్వచర్చలు కొనసాగించినప్పుడు క్యాసియస్ నాగరిక జీవిత సూత్రాలను విప్పిచెప్పినప్పుడు దేరియస్ చక్రవర్తి పరిపాలనలో పర్యా ప్రభ వెలిగిపోయినప్పుడు అలెగ్జాండర్ మూడు ఖండాలలో దిగ్విజయ యాత్రలను జరిపించినప్పుడు అశోక చక్రవర్తి శాంతి, కారుణ్య సందేశాలను ప్రపంచానికి చాటినప్పుడు ఏసుక్రీస్తు పర్వతాగ్రంపై నిలిచి ధర్మ బోధ చేసినప్పుడు అజంతా గుహాలయాలలో చిత్రకారులు అలౌకిక సౌందర్య జగత్తును సృష్టించినప్పుడు కొలంబస్, వాస్కోడిగామా, డ్రేక్ ప్రభృతులు వాషింగ్టన్, జెఫ్ఫర్సన్ ప్రభృతులు ఫిలడల్ఫియాలోని "లిబర్టీ హాల్"లో అమెరికా సర్వ స్వాతంత్ర్య ప్రకటన పత్రంపై సంతకాలు చేసినప్పుడు ప్యారిస్ పౌరులు "స్వాతంత్ర్యం","సమానత్వం", సౌభ్రాత్రం" నినాదాలతో బ్యాస్టిల్ ని నేలమట్టం చేసినప్పుడు ఫారడే విద్యుచ్ఛక్తిని కనిపెట్టినప్పుడు లెనిన్ "ప్రపంచాన్ని కుదిపివేసిన పదకొండు రోజుల" విప్లవనాయకుడుగా కెప్స్ లో పాదం పెట్టినప్పుడు ఇట్టి అనేకానేక చరిత్రాత్మక సన్నివేశాలలో తాము జీవించి ఉండలేదని ఎందరు ఎన్నిసార్లు ఎంతగా నిట్టూర్చలేదు? ఈ సన్నివేశాలలో తమకు ప్రత్యేకాభిమానపాత్రమైన దాన్ని తలుచుకుని, ఆనాడు జీవించి వున్న వారిదే అదృష్టమని ఎంతగా నిట్టూర్చలేదు?

కాని నేడు - క్రీస్తు శకం 1969 జులై 21వ తేదీని జీవించి ఉన్న మనం ఖండఖండాలలో, దేశదేశాలలో జీవించి ఉన్న మనం ఎవ్వరినీ చూచి అసూయపడ నక్కరలేదు!

కడచిన కాలానికి చెందినవారెవ్వరో అదృష్టవంతులని, మనం కాదని నిట్టూర్చనక్కరలేదు.

మానవ చరిత్రలోనే అపూర్వమైన ఒక సంఘటన జరిగిన ఈనాడు జీవించి ఉన్న మన అదృష్టమే అదృష్టం!!

తన ఈ మహాదృష్టాన్ని గుర్తించలేని వాడు మనలో ఎవడైనా ఉంటే, అతడు మూర్ఖులకు శిఖామణి, ఆలోచించడానికి అతడు మెదడు లేనివాడు; ఉప్పొంగిపోవడానికి హృదయం లేనివాడు;

తన ముక్కు కొసను దాటి చూడ్డానికి కళ్ళు సయితం లేనివాడు!

1970 లోపల చంద్రలోకంలో నరుని ప్రవేశపెట్టడం అమెరికా జాతీయలక్ష్యం కావాలని

1961లో నిర్దేశించిన ప్రెసిడెంట్ కెనెడీ నాడు జీవించి ఉంటే, ఎంతగా పొంగిపోయి ఉండేవారో!

ఈ గొప్ప రోజును తాను చూడలేనన్న అనుమానం ఏ కోశానో కొద్దిగా ఉన్నందునే కావచ్చు, -

"చంద్రలోకంలో మానవుడు పాదం పెట్టిన నాడు ఆ సంఘటనను చూడగల మహద్భాగ్యం నాకు అబ్బగలదో, లేదో?" అని ఆయన అన్నారట. "ఈ లోకం నుంచి కాకపోతే మరొక లోకంనుంచైనా నేను దాన్ని తప్పక చూస్తా"నన్న విశ్వాసాన్ని ఆయన ప్రకటించారట.

మరొకలోకం నుంచి నేటి మహాద్భుత సంఘటనను తిలకించడం ఎంతవరకు సాధ్యమో సందేహమే! అయినప్పుడు ఈనాడు ఈ మహద్భాగ్యం అబ్బిన మనం కెనెడీ కంటె ఎంత అదృష్టవంతులమో!!

చంద్రలోకానికి యాత్ర విషయమై కలకనిన వారిలో కెనెడీ మొదటివాడు కాదు, చివరి వాడు కూడా కాదు. కొన్ని వేల సంవత్సరాలుగా మానవుడు ఈ తీయని కల కంటున్నాడు. చిట్టి చేతులను పైకెత్తి "చందమామ రావె! జాబిల్లి రావే!!" అని అల్లిబిల్లి పాటలను పాడే ప్రతి పిల్లవాడు ఒక చంద్రలోక యాత్రాకాంక్షి! శైశవానికి సహజమైన అజ్ఞానావస్థవల్ల చంద్రుడు తనవద్దకు రావాలని కోరినా, జ్ఞానోదయమైనంతనే చంద్రుడు తన వద్దకు రాడని, తానే చంద్రుని వద్దకు వెళ్లాలని మానవుడు గుర్తిస్తాడు. అయితే, ఇంతకు ముందు యుగాలలో చంద్రగోళయాత్రాకాంక్ష కేవలం ఒక కలగానే మిగిలిపోయింది. వైజ్ఞానిక శాస్త్రాలలో, సాంకేతిక శాస్త్రాలలో మానవుడు కడచిన రెండు, మూడు శతాబ్దాలలో - ముఖ్యంగా కడచిన అర్ధశతాబ్దిలో - సాధించిన అద్భుత పురోగతి ఫలితంగా వేలాదిసంవత్సరాల ఈ కల ఈనాడు నిజమైంది.

అయితే ఇది కేవలం వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాలకి విజయం కాదు. అసాధ్యం అనేదాన్ని గుర్తించని మానవాత్మకు ("స్పిరిట్ ఆఫ్ మ్యాన్") ఇది విజయం. అసాధ్యానికి అర్రులు జాచడం మానవ ప్రవృత్తిలో ఒక భాగమై ఉండకపోతే, అతడు తక్కిన జంతువులలో ఒక జంతువుగా మిగిలి ఉండేవాడు; తనకు సన్నిహిత జ్ఞాతులైన వానరాలలో ఒక వానరంగానే మిగిలి ఉండేవాడు!!

ఈ మాటను మతవాదులు ఒప్పుకొనరుగాని, ఇది మతానికి కూడా ఒక ఘనవిజయం. అన్ని మతాలు ఊర్ధ్వలోకాలపై దృష్టి నిల్పడం మానవుని పరమధర్మమని ప్రతిపాదిస్తున్నట్టివే! అవి ప్రోత్సహించిన ఊర్ధ్వదృష్ట మానవుడు ఈనాడు చంద్రలోకంలో పాదం పెట్టడానికి ఒక ప్రధాన ప్రేరణ అయింది.

మతానికి, వైజ్ఞానిక సాంకేతిక శాస్త్రాలకు ప్రధాన భేదమిది; చచ్చినతర్వాతగాని మీరు ఊర్ధ్వలోకాలను చేరలేరని మతం చెబుతుంది; చావనక్కర లేకుండానే మీరు ఊర్ధ్వలోకాలను చేరగలరని చెప్పడంతో సరిపుచ్చక, తమ మాటను వైజ్ఞానిక సాంకేతిక శాస్త్రాలు నిజంచేసి చూపించాయి!!

చంద్రగోళంపై కాలూనడం మానవుని ఊర్ధ్వయాత్రలో ప్రథమ ఘట్టం మాత్రమే! త్వరలోనే అతడు రోదసీగర్భంలోకి మరింతగా చొచ్చుకు వెడతాడు; తన పతాకను శుక్ర, కుజాది గ్రహాలపై ప్రతిష్ఠాపన చేస్తాడు; సౌర మండలాధిపత్యాన్ని సాధిస్తాడు!!

ఈ జైత్రయాత్రలో ఒక ముఖ్య భాగంగా మానవుడు ఈ అనంత విశ్వగోళ స్వరూప స్వభావాలను అవగతం చేసుకొనవచ్చు; జీవం ఏవిధంగా ఆవిర్భవించిందో ఆకళింపు చేసుకోవచ్చు; "టైమ్, స్పేస్"ల రహస్యాలను అర్థం చేసుకోవచ్చు.

నిస్సందేహంగా ఈనాడు మానవుడు తన చరిత్రలో ఒక అపూర్వాధ్యాయానికి శ్రీకారం చుడుతున్నాడు. దీన్ని సాధ్యంచేసిన అమెరికా వైజ్ఞానిక సాంకేతిక శాస్త్రవేత్తలకే కాక, ఆ శాస్త్రాల వికాసానికై యుగయుగాలలో కృషిచేసిన ప్రతి మేధావికి మనం తలవంచి చేయెత్తి - నమస్కరించాలి.

ఈనాడు జీవించి ఉండడమే ఒక గొప్ప అదృష్టంగా పొంగిపోతున్న మనకు ఈ మహద్భాగ్యాన్ని కల్పించింది. యుగయుగాలకు చెందిన ఆ మేధావులే! *(ఆంధ్రజ్యోతి 22-7-1969)*

పురాణ పురుషులు (అపోలో 13)

మొత్తం ప్రపంచమే ఊపిరి బిగబట్టి గంటలను లెక్కిస్తున్నది; సర్వ మానవాళి అన్యధ్యాస లేకుండా గడియారం వంక రెప్పవేయకుండా చూస్తున్నది. “శుక్రవారం ఎప్పుడు వస్తుంది, ఎప్పుడు వస్తుంది?" అనే తహతహ సర్వేసర్వత్రా వ్యక్తమౌతున్నది. రెండుసార్లు జయప్రదంగా చంద్రమండలానికి వెళ్ళివచ్చిన తర్వాత మూడవ ప్రయాణం మరింత జయప్రదంగా జరుగుతుందని ఆశించగా, అపోలో - 13 ఎన్నెన్నో చిక్కులలో పడిపోయింది. చంద్రమండలంపై దిగే ప్రయత్నాన్ని విరమించి, భూతలానికి తిరిగి రావలసిన దుస్థితి దానికి ఏర్పడింది. సురక్షితంగా అది తిరుగు ప్రయాణాన్ని ముగించగలదా అనే భయసందేహాలు ప్రస్తుతం మనను కలవరపరుస్తున్నాయి. మానవ విజ్ఞాన పరిధిని పెంచడానికి, చంద్రమండలపై మానవాధిపత్యాన్ని స్థాపించడానికి సాహసోపేతంగా రోదసీగర్భంలోనికి లక్షల మైళ్ళు పయనించి వెళ్ళిన ముగ్గురు యాత్రికులకు ఏమి ప్రమాదం వాటిల్లగలదో అని మన హృదయాలు తల్లడిల్లుతున్నాయి.

అపోలో నిర్మాతలు తీసుకోదగు అన్ని జాగ్రత్తలను తీసుకొన్నారు. రోదసీనౌకలో ఒక "ఫ్యూయెల్ సెల్" చెడిపోతే, అనుకొనడానికి రెండవ దాన్ని, అది కూడా చెడిపోతే, తిరిగి ఆదుకొనడానికి మూడవదాన్ని వారు అమర్చినారట. కాని, మూడు “సెల్స్" ఒకే సమయంలో చెడిపోవడమనే విడ్డూరం జరిగింది. అందువల్లనే ప్రస్తుత ప్రమాద పరిస్థితిలో రోదసీయాత్రికులు పడిపోయారు! “బొందితో మరొక లోకానికి వెళ్ళడానికి ప్రయత్నం చేస్తే మరేమి జరుగుతుంది?" అని కొందరు ఛాందసులు ఈ సందర్భంలో అనవచ్చు. పదమూడు అశుభ సంఖ్య. అయినా, 'అపోలో - 13' అని కొత్త రోదసీనౌకకు అశుభనామకరణం చేస్తే, మరేమి జరుగుతుందని అనవచ్చు. మరింత ముందుకు వెళ్ళి "వేరే లగ్నం దొరకనట్టు పదమూడు గంటల పదమూడవ నిమిషంలో (మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత పదమూడవ నిమిషంలో) రోదసీ నౌకను ప్రయోగించితే మరేమి జరగగలదని అనవచ్చు.

ఈ ఛాందసుల మాటలను పాటిస్తే, రోదసీ యాత్రలకే పూర్తిగా స్వస్తి చెప్పవలసివస్తుంది. అందువల్ల వారిని, వారి మాటలను నిర్లక్ష్యం చేసి, ప్రమాద స్థితిలో పడిన రోదసీ యాత్రికులను రక్షించడానికి చేతనైన సమస్తాన్ని ఇప్పుడు చేయాలి. “ఆక్సిజన్" తగినంతగా లేకపోవడం ప్రస్తుతం వీరిని యెదుర్కొంటున్న పెద్ద ప్రమాదం. దాన్ని ఏదో ఒక విధంగా అధిగమిస్తే, వాయుమండలంలో పునఃప్రవేశ సందర్భంలో పుట్టే వేడిమి రెండవ ప్రమాదం. అది కూడా తప్పితే, రోదసీ నౌక దిగవలసిన పసిఫిక్ ప్రాంతంలో చెలరేగుతున్న తుఫాను మూడవ ప్రమాదం. ఈ మూడింటిలో మొదటి రెండు ప్రమాదాల నివారణకు భూతలంపై ఉన్నవారు చేయగలిగింది స్వల్పం కావచ్చు.

కాగా, మూడవదాన్ని నివారించడానికి సాధ్యమైన సమస్తాన్నీ చేయాలి. ఈ సందర్భంలో సహకరించడానికి కొన్ని సోవియెట్ నౌకలు రోదసీనౌక దిగగల ప్రాంతానికి వెళ్ళడం హర్షించదగు విషయం.

ప్రమాదం వచ్చినప్పుడే ఎవరి ధీరోదాత్తతేపాటిదో తెలుస్తుంది. అతి ఘోర ప్రమాదంలో చిక్కుకొన్నా, అపోలో 13లోని ముగ్గురు రోదసీ యాత్రికులు ఎంతో ధైర్యంగా, నిశ్చలంగా, మహోదాత్తంగా సంచరిస్తున్నారు. తమ ప్రవర్తన ద్వారా వీరు సమస్త మానవాళి గౌరవాన్ని సంపాదించుకొన గలుగుతున్నారు. ఇంతేకాదు, మృత్యుసన్నిధిలోనైనా మానవుడు పరాజయాన్ని గుర్తించబోడని వీరు నిరూపిస్తున్నారు. పురాణాలలోని వీరుల, శూరుల గాథలు ఎంతవరకు నిజమో మనకు తెలియదు. ఈ వీరులు, శూరులు మాత్రం నిజమైన పురాణపురుషులు! వీరికి చేయెత్తి నమస్కరిస్తూ, ప్రస్తుత ప్రమాదం నుంచి వీరు సురక్షితంగా బయటపడాలని మనం మనసారా కోరుకోవాలి. ప్రస్తుత వైఫల్యాన్ని పాటించక, త్వరలోనే చంద్రమండల యాత్రకు వీరు తిరిగి బయల్దేరి, దాన్ని జయప్రదంగా పూర్తి చేయాలని కూడా మనం మనసారా కోరుకోవాలి. ప్రమాదాలను నిర్లక్ష్యం చేస్తేనే, మానవునికి పురోగతి! మృత్యువును ధిక్కరిస్తేనే మానవునికి అమృతత్వం!!*(ఆంధ్రజ్యోతి 17-4-1970)*

వైజ్ఞానిక పరిశోధనలు

ఈనాడు విజ్ఞానశాస్త్రం అద్భుతావహంగా పురోగమిస్తున్నది. ఒక దిశగా కాదు, బహుముఖాలుగా అది వికసిస్తున్నది.

ఒకనాడు దుర్గమారణ్యాలలో నివసించే అనేక జంతువులలో ఒక జంతువుగా, మృగప్రాయుడుగా, ఆటవికుడుగా తన మనుగడ ప్రారంభించిన మానవుడు ఈనాడు దూరగ్రహాలను చేరడానికి తగిన సాధనాలను నిర్మిస్తున్నాడు. ఇప్పటికి మూడుసార్లు మానవులు చంద్రగోళంపై దిగి ఎన్నో మహత్తర కార్యాలు నిర్వర్తించి భూతలానికి తిరిగివచ్చారు. నేడు మరొకసారి చంద్రయాత్రకు ఉపక్రమిస్తున్నారు. ఈనాడు మానవులు సాధిస్తున్న అనేక వైజ్ఞానిక విజయాలలో ఇది ఒకటి మాత్రమే.

ఐతే ఈ వైజ్ఞానిక పరిశోధనలు, విజయాలు మానవ కల్యాణానికి దారితీస్తున్నవా? వినాశానికి దారితీస్తున్నవా? ఒక్కొక్క వైజ్ఞానిక విజయాన్ని గురించి వింటున్న ప్రతిసారి ఎవరికైనా ఈ ప్రశ్న రావడం, కలవర పెట్టడం సహజం.

సామాన్యులనే కాదు, నేటి మహత్తర వైజ్ఞానిక విజయాలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కారకులవుతున్న శాస్త్రవేత్తలను కూడా ఈ ప్రశ్న కలవరపెడుతుంది. ఉదాహరణకు డాక్టర్ జాన్ జిమాన్ అనే బ్రిటీష్ శాస్త్రవేత్త యునెస్కో సంస్థ పత్రికలో రాస్తూ శాస్త్రజ్ఞులు నేడు కొనసాగిస్తున్న పరిశోధనలు మానవ కల్యాణానికి కాక, తద్విరుద్ధ ప్రయోజనాలకు ఉపయోగ పడుతున్నవని విమర్శించాడు. శాస్త్రజ్ఞులు తమ పరిశోధనలను కేవలం శాస్త్రీయ దృష్టితోనే కాక, నైతిక దృక్పథం నుంచి కూడా చూడడం నేర్చుకోవాలని, మానవ సమాజానికి అపకారకంగా పరిణమించగల పరిశోధనలను వారు కట్టి పెట్టాలని ఆయన సూచిస్తున్నాడు.

వైజ్ఞానిక పరిశోధనల ఫలితాలు దుర్వినియోగ మవుతున్న మాట నిజమే, కాని, ఇందుకు కేవలం శాస్త్రజ్ఞులనే నిందించడం తగునా? శాస్త్రజ్ఞులలో అధిక సంఖ్యాకులు సత్యాన్వేషణలో భాగంగానే తమ పరిశోధనలను కొనసాగిస్తారు. వాటి నీత్యవినీతులతో వారు ఎక్కువగా ప్రమేయం పెట్టుకొనక పోవచ్చుగాని, బుద్ధిపూర్వకంగా, వాటి దుర్వినియోగాన్ని వారు ప్రోత్సహించరు.

దీనికి మహామేధావి ఐన్‌స్టయిన్ ఈ శతాబ్ది తొలి సంవత్సరాలలో ప్రతిపాదించిన ఒకానొక సిద్ధాంతాన్నే ఉదాహరణగా తీసుకోవచ్చు. శక్తికి, ద్రవ్యానికి గల అవినాభావ సంబంధాన్ని నిరూపించిన ఆయన గణిత సూత్రాలు ద్వితీయ ప్రపంచ యుద్ధకాలంలో అణ్వస్త్ర నిర్మాణానికి మార్గం చూపించాయి. అయితే అంతమాత్రాన ఐన్‌స్టయిన్ నైతికౌన్నత్యాన్నిగాని, ఆయన పరిశోధనా కృషి విలువగాని ఎవరైనా శంకించగలరా?

అణ్వస్త నిర్మాణానికి, తద్వారా మానవ వినాశానికి దారితీసిన భౌతికశాస్త్ర పరిశోధనలే అణువులో దాగిన మహాశక్తిని మానవ కల్యాణానికి వినియోగించడానికి కూడ తోడ్పడతాయి, తోడ్పడుతున్నాయి. అందుచేత దోషం ఆయా వైజ్ఞానిక పరిశోధనలది కాదు, వాటిని దుర్వినియోగం చేస్తున్నవారిది.

ఇట్టివే ఎన్ని ఉదాహరణలనైనా పేర్కొనవచ్చు. హిట్లర్ ఒకనాడు శత్రుసంహారకాండ నిమిత్తం తన శాస్త్రజ్ఞులను నిర్బంధించి రాకెట్లను నిర్మింపజేశాడు. అదే రాకెట్ శాస్త్రం నేడు మానవుని చంద్రలోకానికి తీసుకువెడుతున్నది. భూమి కక్ష్య చుట్టూ పరిభ్రమించి కృత్రిమోపగ్రహ ప్రయోగాలను సాధ్యం చేయడం ద్వారా అదే రాకెట్ నిర్మాణ నైపుణ్యం నేడు వాతావరణ పరిశీలనకు, కమ్యూనికేషన్లకు తోడ్పడుతున్నది. కాని అవే రాకెట్లు, అవే కృత్రిమోపగ్రహాలు మానవ వినాశానికి కూడా ఉపయోగపడవచ్చు.

డాక్టర్ ఖొరానా వంటి జీవరసాయనిక శాస్త్రజ్ఞులు "జీన్స్" అనబడే వారసత్వపు కణాలను కృతిమంగా సృష్టించడానికి యత్నిస్తున్నారు. ఈ ప్రక్రియ మానవులకు పూర్తిగా లభించినప్పుడు చిరకాలంగా చికిత్సకు లొంగని కొన్ని వ్యాధులను కుదర్చడం సాధ్యమవుతుంది. కోరితే మహా మేధావులను, బలశాలురను తయారుచేయడం కూడా సాధ్యం కాగలదట. అయితే,అదే ప్రక్రియ హిట్లర్ వంటి నియంతల చేతిలో పడితే ఎంత ఘోర పరిణామాలకు దారితీయగలదో వేరే చెప్పనవసరం లేదు. అంతమాత్రాన నేటి జీవరసాయనిక శాస్త్ర పురోగతికి స్వస్తి చెప్పవలె ననడం భావ్యం కాగలదా?

అంతదూరం పోనవసరం లేదు. నేటి పారిశ్రామిక నాగరికత మానవునికి ఎన్నో వినూత్న సౌకర్యాలను సమకూర్చింది. అతని జీవితాన్ని ఎంతో సుఖమయం చేసింది కాని, అదే పారిశ్రామిక నాగరికత అతని వినాశానికి కారణం కాగల ప్రమాదం పొడచూపుతున్నది.

దూరాన్ని జయించడానికి ఉపయోగపడుతున్న మోటారుకార్లవల్ల, బ్రహ్మాండమైన జెట్ విమానాలవల్ల వాతావరణం కలుషితమైపోతున్నది. అధికాహారోత్పత్తి సాధించడానికి ఉపయోగపడుతున్న క్రిమిసంహార కౌషధాల వల్ల నదీజలాలు కలుషితా లవుతున్నవి. మరికొద్ది సంవత్సరాలలోనే భూమి మానవ నివాసయోగ్యం కాని పరిస్థితు లేర్పడగలవని శాస్త్రజ్ఞులు భయపెడుతున్నారు. ఐతే, ఇందుకు విరుగుడుకనిపెట్టడం కూడా

శాస్త్రజ్ఞుల చేతిలోనే ఉన్నది. ఇందుకు వారిని ప్రోత్సహించవలెనే కాని, అసలు పారిశ్రామిక నాగరికతనే నిందించడం సముచితం కాగలదా?

శాస్త్రజ్ఞులు నైతిక దృక్పథాన్ని అలవరచుకొనాలని డాక్టర్ జిమాన్ సూచిస్తున్నాడు గాని, ఈ సూచన శాస్త్రజ్ఞులకు కాదు. వారి పరిశోధనా ఫలితాలను దుర్వినియోగం చేస్తున్న రాజకీయవేత్తలకు చేయాలి. పెన్సిల్ చెక్కుకునే చాకుతోనే తోటివాడిని గాయపరచవచ్చు. అందుచేత దోషం సైన్సులో లేదు; వైజ్ఞానిక పరిశోధనలలో లేదు. అవి నిత్యవినీతులకు అతీతమైనవి. వాటిని నీతికో, అవినీతికో ఉపయోగించుకునే సమాజం పైన దాని ప్రతినిధులైన రాజకీయవేత్తల పైన వాటి మంచిచెడుల బాధ్యత ఉన్నది. మరొక విధంగా భావించడం మానవ పురోగమనానికి స్వస్తి చెప్పడం కాగలదు. (ఆంధ్రజ్యోతి 27-7-1971)

అనంత యాత్ర, అఖండ యాత్ర

కడచిన రెండు, మూడు రోజులలో తలయెత్తి ఆకాశంవైపు చూచివుంటే, చంద్రమండలం మరింత ప్రీతిపాత్రమైనదిగా మీకు కనబడి ఉండాలి. ఆ క్షణంలో అది మీకు పరగోళం కాదు, మృత గోళం కాదు, మీ తోటి మానవులున్న గోళం, మేఘమండలాన్ని దాటి, వాయు మండలాన్ని దాటి, గురుత్వాకర్షణ మండలాన్ని దాటి, ఐదవసారి తోటి మానవులు సంచరిస్తున్న గోళం. బహుశా మరొక శతాబ్దంలోగా మానవునికి ఒక వలస కేంద్రమో, కనీసం ఒక వైజ్ఞానిక శాస్త్ర పరిశోధన కేంద్రమో కాగల గోళం.

ఇట్టి భావపరంపర మధ్య చంద్రమండలం నుంచి దృష్టిని మరల్చడం మీకు కష్టమై ఉండాలి. మీలో కనీసం కొందరికైనా "ఇప్పుడు అక్కడున్న ముగ్గురిలో నేనొకడిని కానుగదా!" అని విచారం కలిగివుండాలి. తిరిగి అంతలోనే "నేను కాకపోతే మాత్రమేమి? నా తోటి మానవులు అక్కడున్నారు!" అనే సంతృప్తితో మనస్సు పొంగిపోయి ఉండాలి.

ఇది చంద్రగోళానికి మానవుని ఐదవ యాత్ర కావచ్చు. అయినా, ఈనాటికి కూడా ఇది ప్రమాదరహితమైన యాత్రకాదు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఎంతగా వాటిని తీసుకున్నా, ఊహించని చిక్కులు ఏవో కొన్ని కలగవచ్చు. ప్రస్తుత యాత్ర సందర్భంలో ఇంతే జరిగింది. ఐతే, అవి సర్దుబాటు చేసుకోగల చిక్కులు కావడం మనం సంతోషించదగు విషయం.

ఇట్టి చిక్కులు ఇక మీదట ఏవీ కలగరాదని, చంద్రమండల యాత్రికులు సురక్షితంగా భూమండలానికి తిరిగి రావాలని ప్రస్తుతం మనం మనసారా కోరుకొంటున్నాము. ఇంతేకాదు, వారు తమవెంట తీసుకురానున్న చంద్రశిలలు సృష్టి నిర్మాణ రహస్యాలకు సంబంధించినంతవరకు మానవ పరిజ్ఞానాన్ని పెంచడానికి తోడ్పడాలని కోరుకొంటున్నాము.

సృష్టి రహస్యాలను తెలుసుకొనడం మానవసాధ్యం కాదని నమ్మేవారు పెక్కుమంది లేకపోలేదు. సృష్టి రహస్యాలను ఈ మత గ్రంథమో, ఆ మత గ్రంథమో పూర్వకాలంలోనే వివరించినట్లు నమ్మేవారు మరింతమంది

లేకపోలేదు. ఇట్టి ఛాందసులే వైజ్ఞానిక శాస్త్రవేత్తలను యుగయుగాలుగా పరిహసించారు, హింసించారు. వారి కారణంగానే వైజ్ఞానిక శాస్త్ర పురోగతికి ఎప్పటికప్పుడు కొన్ని విఘాతాలు కలుగుతూ వచ్చాయి.

అన్నట్టు, ఇట్టివారే "ఈ భూతలం మీద దారిద్ర్య సమస్యలు లేవా? వాటిని పరిష్కరించక అన్యగోళాలకు యాత్రలు దేనికి? ఇందుకు లేనిపోని వ్యయప్రయాసలు దేనికి?" అని ప్రశ్నిస్తున్నారు కాని, చిత్రమేమంటే, "దేశాల మధ్య వైషమ్యాలు దేనికి? సాయుధబలాలు దేనికి? యుద్ధాలు దేనికి?" అని వారు ప్రశ్నించరు. తమ మత విశ్వాసాలను చెదరగొట్టగలవన్న భయంవల్ల కాబోలు, అన్యగోళ యాత్రల వద్దకు వచ్చేసరికే వీరికి ప్రపంచంలోని దారిద్ర్యం సంగతి, దైన్యం సంగతి చప్పున జ్ఞాపకానికి వస్తాయి.

వారికి తెలియకపోవచ్చుగాని, తెలిసినవారు అంగీకరించకపోవచ్చుగాని, వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనల ఫలితంగానే మానవ సంపద వందల రెట్లు, వేల రెట్లు పెరిగింది. దాని కారణంగానే వ్యాధులు తగ్గిపోయినాయి, ఆయుఃప్రమాణం పెరిగింది.

"ఇదే సమయంలో వైజ్ఞానిక శాస్త్రాల కారణంగా మారణాయుధాల శక్తి పెరగలేదా? అణ్వస్త్రాల నిర్మాణం జరగలేదా?" అని ఈ ఛాందసులు ప్రశ్నించవచ్చు. నిజమే, ఇది కూడా జరిగింది. అయితే ఇందుకు నిందించవలసింది వైజ్ఞానిక శాస్త్రాలను కాదు, మన స్వార్థాలనే, మన సంకుచితత్వాలనే, మన మౌఢ్యాలనే.

ఛాందసు లేమన్నా, చంద్రగోళ యాత్ర మానవుని సత్యాన్వేషణ యాత్రలో ఒక భాగం మాత్రమే. ఆ యాత్ర చంద్రగోళంతో ఆగదు. ఇతర గోళాలకు విస్తరిస్తుంది. ఏ నాటికో ఒకనాటికి విశ్వగర్భంలో ఎక్కడనో ఇతర గోళాలలోగల ప్రాణికోటితో సయోధ్యవరకు ఈ యాత్ర కొనసాగుతుంది. ఇది అంతటితోనైనా ఆగని అనంతయాత్ర, అఖండయాత్ర! *(ఆంధ్రజ్యోతి 25-4-1972)*

పరమాణు యుగంలో మానవుడు

“మానవుడు పక్షివలె ఆకసంలో ఎగరగలుగుతున్నాడు. చేపవలె నీటిలో ఈదగలుగుతున్నాడు. భూమి మీద బ్రతకడానికి మాత్రం చేతకాకుండా ఉన్నాడు' అని ఒక ప్రసిద్ధ రచయిత అన్నమాట నేటి మానవ సంఘానికి చక్కగా అన్వయిస్తుంది.

ప్రకృతిని వశపరచుకోడానికి, జీవితాన్ని సుఖతరం చేసుకోడానికి విజ్ఞానశాస్త్రం ఆధునిక మానవుడికి అపరిమిత శక్తిని ప్రసాదించింది. ఈనాటికి వైజ్ఞానిక మానవుని పరిశోధనలలో కట్టకడపటిదేగాక, అత్యంత ప్రధానమైనది పరమాణుశక్తి ప్రయోగ రహస్యం.

ఈ పరమాణుశక్తి సృష్టి, సంహార కార్యాలు రెంటికి సమర్థమైంది. దీని సాయంతో కొండలను పిండి కొట్టవచ్చు. మహానదుల గతులను మార్చివేయవచ్చు. భూరి నిర్మాణాలను సులభంగా నిర్మించవచ్చు. వివిధోత్పత్తిని వృద్ధిపరచి సర్వసమృద్ధిని సాధించవచ్చు.

కాని, ఇదే పరమాణుశక్తిని యాటంబాంబు రూపంలో ప్రయోగించి ప్రాణికోటిని నిముషంలో కడతేర్చవచ్చు. మహా పట్టణాలను క్షణంలో నేలమట్టం చెయ్యవచ్చు. రుద్రుని ఫాల నేత్రంతోవలె ప్రపంచాన్నే భస్మీపటలం చెయ్యవచ్చు.

ఇందుచేతనే ఈనాడు ప్రపంచ యుద్ధం సంభవిస్తే అణ్వస్త్ర ప్రయోగానంతరం ప్రపంచంలో ఇక దక్కుదల ఏమిటని మానవ కోటి తహతహ లాడిపోవడం. వచ్చే యుద్ధం యాటంబాంబులతో, ఆపై యుద్ధం విల్లంబులతో జరగవచ్చని, బుద్ధివిభవం గల ఒక శాస్త్రవేత్త ప్రవచించాడు.

అధునాతన మానవ సంఘానికి పరమాణుశక్తి వరప్రసాదం కావడమో, కఠోరశాపంగా పరిణమించడమో మానవుడు దానిని వినియోగించుకోవడం మీద ఆధారపడి ఉంటుంది.

అందుకు వలసిన సదసద్వివేచన, శమదమ సంపత్తి, సార్వజనిక దృష్టి ఆధునిక మానవుడు ఎంతవరకు అలవరుచుకో గలిగినాడన్నదే నేడు దూరదృష్టిగల విజ్ఞులందరను బాధించుతున్న సమస్య.

ఈ సమస్య సర్వకాలానికీ, సమస్త మానవకోటికి సంబంధించినదే అయినా, స్థూలంగా పాశ్చాత్య ప్రపంచం ఒక దృక్పథంతోటి, ప్రాచ్యలోకం, విశేషించి భారత జాతి అనాదిగా మరొక దృక్పథంతోటి ఈ సమస్యను అవలోకిస్తూ వచ్చినవి.
తన్ను తాను జయించనిదే మానవుడు ప్రపంచాన్ని జయించలేడని భారతీయుడు భావిస్తాడు. భారతీయుడు తన దృష్టిని అంతర్గతం చేస్తాడు. ఇంద్రియ నిగ్రహానికి, ఆత్మశక్తికి ప్రాధాన్య మిస్తాడు. తరతమ భేదంతో పాశ్చాత్యుడు దీనికి ఆవలిదరి.

ఈ రెండు దృక్పథాలను, సమన్వయపరచి విశ్వమానవ కళ్యాణాన్ని, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని సాధించ డానికి, ప్రపంచ వలయితంగా శాంతి, సౌఖ్యాలను పెంపొందించడానికి, వివిధ దేశాలలో ప్రాజ్ఞులైనవారు కృషి చేస్తున్నారు.

ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల సమావేశాన్ని ఉపక్రమిస్తూ, ఇండియా అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఈ లక్ష్యసాధనకుగానే అమూల్యమైన సూచనలు కొన్నిటిని కావించాడు. మానవచరిత్ర రచనకు జాతి, దేశం అవధులుగా ఉండరాదని, విశ్వవ్యాప్తంగా చరిత్ర రచన కొనసాగాలని, బాహ్య ప్రకృతికి, దానికి సంబంధించిన మానవ విజయాలకుగాక, మానవుని మానసిక, ఆత్మశక్తులకు ప్రాముఖ్య మివ్వబడాలని, విశ్వవిద్యాలయాలు ఈ విలువలను పాటించి, సామాన్య మానవ జీవితంతో సన్నిహితత్వం సాధించాలని ఉద్బోధించారు.

ఏ దేశపు నాగరికతగాని, ఏ జాతి సంస్కృతిగాని ఈ లక్ష్యసాధన మీదనే ఆధారపడక తప్పదు ఈ కాబట్టి, విజ్ఞానాన్ని ప్రసరింపజేయడమే విధిగా గల విశ్వవిద్యాలయాలు ఈ విషయమై జిజ్ఞాసను ప్రేరేపించడం, ఇందుకు కృషి జరపడం వాంఛనీయం. *(ఆంధ్రప్రభ 23-12-1951)*

ఎవరెస్ట్



రూపాయ, అణా, పైసలు తప్ప బ్రతుకులో మరి ఎట్టి విలువలు లేని వారికి ఎవరెస్టు ఎక్కడానికి జరిగిన ప్రతి ప్రయత్నం తిని కూర్చోలేక లేనిపోని పని కల్పించుకొనడమే, హాయిగా బ్రతకలేక లేనిపోని ముప్పు కొనితెచ్చుకొనడమే! పది ప్రయత్నాలు విఫలమైన తర్వాత, పదకొండవ సారి తిరిగి ప్రయత్నించి, ఎట్టకేలకు శిఖరాన్ని అందుకోగలిగామని సంతోషించడం వారి దృష్టిలో కేవలం వెర్రితనమే!!

ఘోర తపస్సు చేసి భగీరథుడు చివరికి తన లక్ష్యాన్ని సాధించాడంటే, అదొక అందం, చందం. ఆయన తపస్సు ఫలితంగా గంగావతరణం జరిగింది. కాగా, ఎవరెస్ట్ శిఖరాన్ని అందుకొనడానికి జరిగిన "భగీరథయత్నం" ఫలిత మేమిటి? సర్ జాన్ హంట్ నాయకత్వాన వెళ్ళిన జట్టులోని వారిద్దరు - టెన్ సింగ్ నార్కీ, సర్ ఎడ్మండ్ హిల్లరీలు - శిఖరం పైకి వెళ్ళి దానిపై నాలుగు పతాకాలను ప్రతిష్ఠించి, కొన్ని నిమిషాల లోపలనే అక్కడి నుంచి హుటాహుటిగా దిగిరావడం - ఇంతేకాదా? రూపాయ, అణా, పైసలలో తప్ప బ్రతుకుకు విలువను కట్టలేనివారి దృష్టిలో ఎవరెస్ట్ శిఖరాధిరోహణ ఒక విశేషం కాకపోవచ్చుగాని, వీరి మనఃప్రవృత్తి ప్రాబల్యం వహించివుంటే, నరుడు నేటికీ వానరుని స్థితిలోనే మిగిలి ఉండేవాడు.

ఆ పొలిమేరకు ఆవల ఏమున్నది? ఆ కొండకొనపై ఏమున్నది? ఆ నది అద్దరిని ఏమున్నది? తిని కూర్చోలేక ఈ విధంగా మధన పడ్డాడు కాబట్టే, మానవుడు పురోగామి కాగలిగాడు. చేప ఈదగలుగుతున్నది, నే నెందుకు ఈదలేను? పక్షి ఎగర గలుగుతున్నది, నే నెందుకు ఎగరలేను? తిని కూర్చోలేక ఈ విధమైన తపన చెందాడు కాబట్టే, మానవుడు నాగరికుడు కాగలిగాడు.

పగలు తర్వాత రాత్రి, రాత్రి తర్వాత పగలు ఎందుకు వస్తున్నది? చంద్రునికి వృద్ధియా లెందువల్ల? చెట్టుపై నుంచి పండు నేల మీదికే ఎందుకు రాలాలి, ఆకాశంలోకి ఎందుకు ఎగసిపోరాదు? గిన్నెపై సిబ్బెని కదిలిస్తున్న ఆవిరి యంత్రాల చక్రాలను కదలించలేదా? తిని కూర్చోలేక కొందరు వేసుకొన్న ఇట్టి ప్రశ్నలే మన వైజ్ఞానిక శాస్త్రాలన్నింటికి మూలం. తిని కూర్చోవడమే కాదనుకొన్నవాడే మానవజాతిని ముందుకు నడిపించాడు. తిని కూర్చోవడం జంతులక్షణమని నమ్మినవాడే మానవజాతి వికాసాన్ని సాధించాడు. అయోమయమైన ప్రతిదీ మానవుని బుద్ధికి ఒక సవాలు; అసాధ్యమైనది ప్రతిదీ మానవుని ధీరోదాత్తతకు ఒక సవాలు. అగాధాలు అతడిని ఎల్లప్పుడు గొంతెత్తి పిలుస్తాయి; సుదూరాలు అతడిని చేయెత్తి ఆహ్వానిస్తాయి; ఔన్నత్యాలు అతడిని నిత్యం "ఛాలెంజి" చేస్తాయి. ఆ పిలుపును విన్నప్పుడే; ఆ ఆహ్వానాన్ని అంగీకరించినప్పుడే, ఆ "ఛాలెంజికి" వెనుదీయనప్పుడే అతడు సృష్టిలో తన ప్రత్యేక స్థానానికి నిజంగా అర్హుడౌతాడు.

ఇట్టి పిలుపే, ఇట్టి ఆహ్వానమే, ఇట్టి "ఛాలెంజే" ప్రపంచంలోని పర్వతాలన్నింటికంటే ఉన్నతోన్నతమైన ఎవరెస్ట్ హిమశిఖరం నుంచి మానవునికి చిరకాలంగా వస్తుంది. దానికి అతడు బధిరుడు కాలేకపోయినాడు కనకనే, పది ప్రయత్నాలు విఫలమైనా, పదకొండవసారి ప్రయత్నించి, అతడు ఎవరెస్ట్ శిఖరంపై తన పతాకను ప్రతిష్ఠాపన చేశాడు.

ఈ విజయం దాన్ని సాధించిన కొందరిది మాత్రమే కాదు; ఇది పరాజయాన్ని గుర్తించని మానవతకే విజయం! అందువల్లనే హంట్, టెన్ సింగ్, హిల్లరీలకు జరుగుతున్న అఖండ సన్మానాలకు ఆ ముగ్గురికంటే మిన్నగా బ్రతుకు విలువలు రూపాయ, అణా, పైసలకు పరిమితం కావని భావించే ప్రతివ్యక్తి పొంగిపోతున్నాడు.

(ఆంధ్రప్రభ 1-7-1953).

మతం - 1

వేదాంతం

నేను స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా ఉన్నదున్నట్లుగా మాట్లాడాలని మీరు ఆశిస్తున్నట్టు భావిస్తాను. బహుశా నేను మొరటుగా కూడ మాట్లాడాలని మీరు వాంఛిస్తున్నారు కనుక సూటిగా చెపుతున్నాను. మీరు హేతువాదులుగా వుండాలని వాంఛిస్తే మట్టుకు మీరు చెయ్యాల్సిన మొట్టమొదటి పనేమిటంటే మీ పాత పురాణాల్ని, మీ పాతకాలపు తత్త్వ శాస్త్రాలను, మీ పాత సాంఘిక ధర్మ శాస్త్రాలను ఇంకా తదితరమయిన ఆ పాత చెత్త చెదారాన్ని విసిరి దూరంగా పారెయ్యండి. ఎందుకంటే అవి భావనలో ప్రాథమిక దశకు చెందినవి. అంతర్గత భావనలో ఆహేతుకమైనవి, పర్యవసాన నిర్ణయంలో ఘోరమైనవి, కలిగించే ఆశలు మోసపూరితమైనవి కావడం వల్లనే నేను ఇలాగ అంటున్నాను.

ఇంక తర్వాత మీరు చేయవలసింది ఏమిటంటే దేవుని పైకెత్తేసి మనిషిని కుంచించే ప్రతి దాని ఎడల, అలాగే మన ఈ యదార్థ ప్రపంచంలో అణిగి మణిగి విధేయతా బుద్ధితో బానిసవలె ఉన్నందుకు ఛాయాస్వర్గంలో శాశ్వత ఆనందాన్ని వాగ్దానం చేసే ప్రతి దాని ఎడల మళ్ళీ మళ్ళీ చూడకుండా మొహం పూర్తిగా తిప్పేసుకోవాలి.

మీలో అత్యధికులు హిందువులుగా జన్మించిన వారైయుండుటచేత నేను మరింత నిర్దిష్టంగా వేదాంతం పేర చెల్లేది ఏదైతే ఉన్నదో దాన్నంతటినీ తక్షణమే త్రోసిపుచ్చేయమనీ చెపుతాను. ఆ వేదాంత సిద్ధాంతంలో ఆవగింజంత అపరోక్షానుభవ సత్యం ఉండటాన్ని నేను కాదననుగాని మొత్తంమీద చూస్తే పెడదారి పట్టించి యజమానుల చేతుల్లో కీలుబొమ్మలుగా తయారు చేసేందుకు ఉద్దిష్టమయిన పరమ అర్థరహిత సిద్ధాంతం అది.

నేనే ఏమైనా దుడుకుగా, దాదాపు ఉన్మత్తుడైనట్లుగా మాట్లాడుతున్నాననుకొంటున్నారా? నేను అలా లేనని సవినయంగా మనవి చేస్తున్నాను. నాకు నేనుగా ఆలోచించుకోవటం ఆరంభించినప్పటి నుంచి వేదాంతం అంటే అసహ్యించుకొన్నాను. దానిలోని ఇతర లోపాలమాట అటుంచి అసలు అదేమిటో స్పష్టంగా నిర్వచించి చెప్పగలిగినవారు ఎవరూ లేరు. వేదాంత సిద్ధాంతంలో శాఖోపశాఖలు చాల ఉన్నాయి. ఉపశాఖలమాట వదిలేద్దాం. శంకరుడు, రామానుజుడు, మధ్వుడు, వల్లభుడు, నింబార్కుడు, చైతన్యుడు, ప్రవచించిన వేదాంత సిద్ధాంతాలలోని ప్రధాన శాఖలనే గమనికలోకి తీసికొని మాట్లాడుదాం. ఈ ఆరుగురు వేరు, వేరు గొంతుకలతో మాట్లాడటం లేదా? ఒకరికొకరు విరుద్ధంగా మాట్లాడటంలేదా? ఇక నవీనకాలంమాట కొస్తే, రాజా రామమోహన్ రాయ్ చెప్పిన వేదాంతం, కేశవ చంద్రసేన్ చెప్పిన వేదాంతం ఒకటేనా? అట్లాగే వివేకానందుని వేదాంతం, రాధాకృష్ణునిది ఒకటేనా? ఇంకా మాట్లాడితే - పోనీ వీరందరిలో ఏ ఒక్కరి వేదాంతం అయినా వారు చెప్పుకొన్న సొంత భాష్యం ప్రకారం పూర్వాపర విరోధం లేకుండా, సుసంగతంగా ఉన్నాయంటారా?

వేదసారమే వేదాంతం అని గొప్పలు చెప్పుకోవటం నాకు తెలుసు. ఇలా చెప్పుకొనేవారు ఒక విషయం మర్చిపోతున్నారు.

'వేదం' అన్నది యూదుల ధర్మశాస్త్రమయిన 'తాల్మూడు' (Talmud) లాగా, లేక మహమ్మదీయుల , 'కొరాను' లాగా ఒకే ఒక గ్రంథం కాదనీ - కనీసం బైబిలులాగ నయినా పాత, క్రొత్త నిబంధనలు కలిగిన రెండు పుస్తకాలయినా కాదు. వేదం అన్నది 4 ప్రధాన గ్రంథాలుగా ఉన్నది. అందులో మళ్ళా ప్రతి గ్రంథంలో బ్రహ్మణాలనీ, అరణ్యకాలనీ, ఉపనిషత్తులనీ ఉన్నవి. వీటన్నిటిని కలుపుకొంటే ఇదొక పెద్ద గ్రంథరాశి. దాదాపు పర్వతమే. దీన్ని ఆదిమకాలానికి చెందిన పురోహితవర్గం కూర్చిన సాహిత్యం అని చక్కగా చెప్పుకోవచ్చు.

ఇంక ప్రధానమయిన వేదా లేమిటో సంగ్రహంగా తెలుసుకొందాం. వేదాలు నాలుగు. అవి రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం. అందులో రుగ్వేదం పురాతనం. కడపటిది అధర్వణవేదం. ఈ చివరి వేదానికి చాలా కాలం వరకు వేద ప్రతిపత్తి నిరాకరింపబడింది. బహు ప్రాచీనమైనది కావటంవల్ల ఉన్నతమైనదిగా భావించబడిన రుగ్వేదం పరదేశస్తులను చంపి, యిళ్ళూ, ఊళ్ళూ కూల్చి దోపిడీ చేసి దేశాల్ని జయించే ఆయుధోపజీవులైన జాతి మత గ్రంథము. అందుచేత సహజంగానే వారి దేవాది దేవుడు యుద్ధ ప్రభువైన ఇంద్రుడు. ఆ ఇంద్రుడు గండభేరుండంవలె త్రాగి, అతి భయంకరమైన వజ్రాయుధం (పురాతన వస్తుశాస్త్రజ్ఞుల ప్రకారం అది విల్లంబు లేక బాణం, రంధ్రం కలిగిన గొడ్డలి వంటిది) చేపట్టినవాడు.
అతడు రాబోయే తరంలోని క్రొత్తగా పుట్టబోయే బిడ్డలు ఎక్కడ ఆ యుద్ధపు దండయాత్రలలో దోచుకొనే తన ఆర్యులను నాశనం చేస్తారోనని గర్భిణి స్త్రీలను సైతం నిస్సంకోచంగా చంపేవాడు.

సామవేదం రుగ్వేదం కన్నా భిన్నమయినా వేదంగా పిలవబడుతున్నప్పటికీ ఆర్.సి. దత్ మాటల్లో చెప్పాలంటే ఒకానొక ప్రత్యేక ప్రయోజనాన్ని ఉద్దేశించి రుగ్వేద సూక్తులను కొన్నింటిని సంగీత బద్ధం చేసిన ప్రయత్నమే సామవేదం.

మూడవది యజుర్వేదం. అది కృష్ణ యజుర్వేదమని, శుక్ల యజుర్వేదమని రెండు విధాలుగా మళ్లా దత్ మాటల్లో చెప్పాలంటే వాటిలోని విషయంలోను కూర్పులోనూ భేదం స్వల్పం. యజ్ఞ మంత్రాలతోను, ఆ మంత్రాలకు ఛాందసపు వివరణలతోను, వానికి సంబంధించిన యజ్ఞ వర్ణనతోనూ అధికంగా కూడి ఉంటుంది. వేదాలన్నింటిలోకీ కడపటిది, యిటీవలిది అధర్వణ వేదం. దాన్ని నేను పిశాచశాస్త్రం అంటాను. పవిత్ర విషయాలను ద్వారా నేను దుర్వినోదం పొందుతున్నానని అభిప్రాయం మీరు ఏర్పరచుకోవద్దు. ఇదిగో ఈ వేదాల్ని గురించి రాధాకృష్ణుడంతటి పండితుడు చెప్పేది వినండి : "ప్రకృతి నడిచే క్రమంతోను, మానవ జీవితంతోను పలువిధాల జోక్యం కలిగిఉన్నట్టు భావించబడుతున్న అసంఖ్యాకమైన దెయ్యాలతోనూ, భూతాలతోనూ విశ్వాసాన్ని ఈ అధర్వణమతం ప్రతిబింబిస్తుంది. వేదాలకి పూర్వం దెయ్యాలు, భూతాల ఆరాధనతో ఉండే మతం బలాన్నీ, వైదిక విశ్వాసాలతో నిందించటం.

అది సమన్వయం చెందడాన్నీ, అధర్వణం ప్రబలంగా తార్కాణిస్తుంది. రుగ్వేదంలోని దేవతలు ఎంతో స్నేహపాత్రంగా ఉంటే, అధర్వణంలోని దేవతలు మాత్రం మానవాళికి కష్టాల్ని, వ్యాధుల్ని కలిగించే భయంకరమైన రాక్షస శక్తుల్ని ప్రదర్శిస్తాయి. ఆ భయంకర శక్తుల్ని ప్రసన్నం చేసుకోవడానికి స్తుతి పాఠాలు, మాంత్రిక కర్మకాండా అందులో ఉంటాయి. ఐహిక ప్రయోజనం సాధించేందుకు మంత్రతంత్రాలు అందులో ఉంటాయి.

బ్రాహ్మణాలూ, అరణ్యకాలనుగూర్చి నేనిక్కడ చెప్పదలుచుకోలేదు. ఇక ఉపనిషత్తుల గురించి చెపుతాను : ఉపనిషత్ సిద్ధాంతం అంటూ మీరు తరచు వింటూవుంటారు. ఎమర్సన్, షోఫెన్ హోయర్ (Schophenhauer) ఇంకా ఇతర పాశ్చాత్య ఆలోచనాపరుల్ని ఈ ఉపనిషత్ సిద్ధాంతం ఎంతో ప్రభావితం చేసిందనికూడా వింటూ ఉంటారు. కాని అవసరం కోసం చక్కగా మరిచిపోయే విషయం ఏమిటంటే, ఉపనిషత్తులు అనేకమనీ, అందులో కొన్ని పెద్దవీ, కొన్ని చిన్నవీ, మరికొన్ని వ్యర్థమైనవి. వాటిని వివిధ రచయితలు దూర దూరమైన వివిధ కాలాల్లో రచించారు. మధ్యయుగంలో భారతీయ ముస్లించేత రచించబడిన "అల్లాహో ఉపనిషత్" అన్నదొకటుందని వినడం మీలో కొందరికి ఆశ్చర్యమే కలగవచ్చు. మనం మాత్రం ఎందుకు వెనుకబడాలా అని భారతీయ క్రైస్తవుడొకడు "క్రీస్తోపనిషత్" ఇటీవలి కాలంలో తయారు చేశాడు. సరే ఇంతకూ మీ దృష్టికి తేదల్చుకున్న విషయం ఏమిటంటే ఈ ఉపనిషత్తులలో ఏకీకృతమైన తత్త్వసిద్ధాంతమంటూ అసలు ఏమీ లేదని మాత్రమే. నీతిబోధ విషయంలో ఉపనిషత్తులు మరీ ఘోరం అనిపిస్తాయి. ఎందుకంటే తల్లిదండ్రుల్ని హత్య చేయడం మొదలుకొని సర్వమైన నేరాల్నీ అవి సమర్థిస్తాయి. మన వేదాల్ని, ఉపనిషత్తులను అధ్యయనం చేయడానికి దాదాపు జీవితాన్ని వెచ్చించిన "ఆర్థర్" బర్రీడేల్ కీత్ (Arthur Barriedale Keith) అనే పాశ్చాత్య పండితుడొకడున్నారు. ఈ విషయంలో ఆయన ఇలా అన్నారు:

"మేధావి దృక్కోణం నుంచి చూస్తే కన్పించే లోపాలకన్నా నైతిక దృష్టితో చూస్తే కన్పించే లోపాలు ఉపనిషత్ వ్యవస్థలో మరింత స్పష్టంగా కన్పిస్తాయి. వస్తుయదార్థ్యం పారమార్థిక స్వభావాన్ని గూర్చిన ప్రశ్నల విషయంలో నిర్దిష్టతని సాధించడం అసంభవమని నిస్సందేహంగా చెప్పవచ్చు. కాని కొన్ని నైతిక సూత్రాలను రూపొందించి వాటిని ఎంతో కొంత సహేతుకం అనిపించే ఒకానొక విశ్వనిర్మాణం సిద్ధాంతంతో సమన్వితమై సుసంగతంగా ఉండేటట్లు చేయడం తేలికైనపని. ఉపనిషత్తుల లోపం ఏమిటంటే పారమార్థిక స్థాయిలో నీతికి విలువ, అర్థమూ లేకుండా చేశాయి. 'సత్యం, శివం, సుందరం' అన్నవి విశ్వం అస్తిత్వంలో సారభూతమైన భాగాలుగా వివరించడానికి సమగ్రమైన ఏ తత్త్వ సిద్ధాంతమైనా ప్రయత్నించవలసి ఉంటుందని ఎంచడం సమంజసంగా ఉంటుంది. ఉపనిషత్తులవలె శివ, సుందరాలు అర్థరహితమైన వేళాకోళాలుగా తేల్చివేసే, ఏ తత్త్వ వ్యవస్థ అయినా సిద్ధాంత పునాది లోపభూయిష్టమనీ బహు దుర్బలమనీ నిర్ణయించుకోవచ్చును."

నిజానికి పరమజ్ఞాని ఏ తప్పూ చేయజాలడని కొన్ని ప్రధాన ఉపనిషత్తుల ఉపదేశం. పరమ జ్ఞానికి రెండు ఆలోచనలు రావు. నేను తప్పుచేశాననిగానీ, లేక నేను ఒప్పుచేశాననిగానీ భావనే కలగదు. ఆ రెంటినీ అతడు అధిగమించగలడు. కర్మ, అకర్మ రెండూ అతడిని బాధించవు - అని బృహదారణ్యకోపనిషత్తు చెపుతోంది.

అదే ఉపనిషత్తు మరో సందర్భంలో "అగ్ని యింధనాన్ని దహిస్తుంది. అదేవిధంగా జ్ఞాని తను చేసిన దుష్కర్మలను నిశ్శేషంగా దగ్ధం చేసుకొని శుద్ధుడు, సనాతనుడు, శాశ్వితుడై మిగులుతాడు."

ఈ విషయంలో ఛాందోగ్యోపనిషత్తుకూడా బృహదారణ్యకంతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నది. కౌషీతకోపనిషత్ మరొక అడుగు ముందుకు వేసింది. చౌర్యం చేత గానీ, మాతృహత్య చేతగానీ, పితృహత్య చేతగానీ మరే కర్మచేతగానీ జ్ఞాని తాను పొందవలసిన లోకాన్ని కోల్పోడు. దుష్కృత్యం చేసిన తర్వాత జ్ఞాని ముఖవర్ణం తాను చేసిన నేరం చేత మారదు."

ఇంతకీ దీని అర్థం ఏమిటి? నీవు జ్ఞానివని విశ్వసించి చాటుకోగలిగితే సరదాగా దొంగతనం చెయ్యవచ్చు. శిక్షాపాత్రుడివి కాకుండా హత్య చెయ్యవచ్చు. ఉపనిషద్విచారధార పరమోత్కృష్టాన్ని గురించి గొప్పగా చెప్పేముందు ఈ విషయాన్ని గుర్తుంచుకోవడం మాత్రం అవసరం.

గట్టిగా మాట్లాడితే భగవద్గీత వైదిక సాహిత్యంలో భాగం కానే కాదు. అది ఇటీవల కాలంలో జరిగిన తాజా 'ఫోర్జరీ'. అన్నింటినీ భరించే మహాభారతంలో దీన్ని చేర్చారు. కాని తిలక్, అరవిందుడు, గాంధీలతో సహా పలువురు దాన్ని హిందూ తత్త్వ సంగ్రహంగా పరిగణిస్తారు. కాని నిజానికి భగవద్గీత ఒక పెద్ద కలగూరగంప. అందులో వస్తు మహత్యవాదం (Fetishism) మొదలు జడప్రకృతికి మానవ గుణాల్ని ఆపాదించే తత్వం (Anthropomorphism) వరకు గల సర్వవిశ్వాసాలూ, సాంఖ్య, బౌద్ధతత్వాలూ, యోగసాధన, నీతిశాస్త్రం, ఆహారశాస్త్రం, వర్ణాశ్రమ తత్త్వం, సృష్టివర్ణన ఇంకా అనేక ఇతరాలు కలిసిపోయిన కలగూరగంప. అంచేత అది ఎవరికి కావలిసిన అర్థం వారికిస్తుంది. దాని ముఖ్యోపదేశాన్ని గురించి, దాని తత్త్వ సిద్ధాంతాన్ని గురించి ఏ ఇద్దరు భాష్యకర్తలకీ ఏకీభావం లేనేలేదు. భగవద్గీత పట్ల ఎంతగానో మెచ్చుకొనే సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు కూడా “భగవద్గీతను తాత్విక గ్రంథం అనేకంటే లక్షణమైన మత కావ్యం” అన్నారు. అయినప్పటికీ గీత తత్త్వ సిద్ధాంతాన్ని గురించి ఎంతో గ్రంథరాశి ఏర్పడింది.
కావున మిత్రులారా! వేదాంతం అనే పేర చెల్లుబాటు అవుతున్నదేదో అది వ్యవస్థీకరించిన తత్వశాస్త్రమూ కాదు, అందులో నిజమూలేదు. నేను ముందు చెప్పినట్లుగా ఇది జనాన్ని పెడదారిన పట్టించడానికి, వారిని తొక్కిపెట్టడానికి, వారిని దోపిడీ చెయ్యడానికి ఉద్దేశించబడింది. ఇటీవలి కాలంలో ఈ వేదాంత సిద్ధాంతాన్ని పునరుద్ధరించిన వారెవరో మీకు తెలుసా? హెన్రీ థామస్ కోల్ బ్రూక్ అనే అతను దాన్ని పునరుద్ధరించాడు. నిరంజన్ ధర్ ఇటీవల వ్రాసిన “వేదాంతమూ-వంగదేశ పునర్వికాసమూ” (Vedanta and Bengal Renaissance) అనే.

ఈ గ్రంథంలో కోల్ బ్రూక్ ని గూర్చి ఈ వివరాలిచ్చారు. 1783లో కోల్ బ్రూక్ ఈస్టిండియా కంపెనీలో ఉద్యోగిగా చేరాడు. కాని అతని పరిపాలనా దక్షతకన్న అతని మేథాశక్తి ఇంకా గొప్పది. అతడు 1800 సంవత్స నాటికే లక్షణమైన సంస్కృత పండితుడుగా పేరుపొందాడు. వేదాధ్యయన కేంద్రమయిన కాశీకి దగ్గరలో ఉన్న పండితుడుగా పేరుపొందాడు. కాశీకి దగ్గరలో ఉన్న “ఘజిపూర్”కు అతడు ఉద్యోగరీత్యా బదిలీ కావడంతో, వైదిక సాహిత్యంతో సాన్నిహిత్యం కావడానికి గొప్ప అవకాశం కల్గింది. ఫోర్ట్ విలియం కాలేజీ గ్రంథాలయంలో వైదిక తాళపత్ర ప్రతులను గొప్పగా సేకరించి పెట్టి వేదాధ్యయనంలో ప్రత్యేక పరిశోధన చేశాడు. 1805 సంవత్స నాటికి 'వేదాలపై వ్యాసం' లేక 'హిందువుల పవిత్ర రచనలపై వ్యాసం' అనే పేరుతో 'ఆసియా పరిశోధనలు' (Asiatic Researches) లో ప్రచురించాడు. వేదాలుగానీ, అంతకన్న వేదాంతం గానీ భారతదేశం నిజమైన సంప్రదాయాన్ని తెలుపుతున్నాయని. సంప్రదాయంకన్నా ఇతరంగా ఇపుడు మనకు కానవచ్చేవి తర్వాత వచ్చిన పురాణాల యుగంలో అసలు సంప్రదాయంలో చేరిన 'కల్మషం మాత్రమే'నని ఆయన ప్రకటించాడు.

భవిష్యత్ లో జరగవలసిన భారతదేశ పునర్జీవనానికి ఈ అధికారిక సాంప్రదాయమే నమూనాగా గ్రహించ బడాలని ఆయన సిద్ధాంతీకరించారు. ఈ సంప్రదాయానికి భిన్నమైన విప్లవ భావాలు భారతదేశంలో ప్రశక్తం కారాదని ఈ సిద్ధాంతం సూచన. ప్రజా ప్రయోజనాలకు, ఆశలకు బాగా ఉపకరించే సుసంపన్నమైన భారతీయ భౌతికవాద వారసత్వ సంపదను కోల్ బ్రూక్ పూర్తిగా త్రోసి పుచ్చాడని యీ సందర్భంలో చెప్పుకోవలసి ఉంది.

ఈ వారసత్వ సంపద ఏమిటో అతనెరుగక అతడు అలా చెయ్యలేదు. తెలిసే చేశాడు. దాన్ని తన వ్యాసంలో ప్రస్తావ వశంగా పేర్కొన్నాడు. అందులో దాన్ని గురించి సంగ్రహంగా రాశాడు. భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వ సంపదను ఆకాశానికి ఎత్తటానికి గాను బుద్ధిపూర్వకంగానే దాన్ని ప్రాధాన్యాన్ని తగ్గించి చెప్పాడు.

కోల్ బ్రూక్ చేసిన ఈ అపభాష్యానికి మరో ప్రసిద్ధుడైన భారతీయ విజ్ఞాన పరిశోధకుని నుండి వత్తాసు లభించింది. అతడు భారతదేశానికి గొప్ప స్నేహితుడని పేరుపొందిన మాక్స్ ముల్లర్. మాక్స్ ముల్లర్ కోల్ బ్రూక్ చేసిన పరిశోధనలను ఎంతగానో మెచ్చుకొని భారతీయ విజ్ఞానానికి, భారతదేశంలో బ్రిటిష్ ప్రయోజనాలకు అతడు చేసిన సేవకు గుర్తింపుగా ఇంగ్లండులో అతని విగ్రహప్రతిష్ట జరగాలని వాంఛించాడు.

భారతీయ తత్త్వశాస్త్రంలో వేదాంతశాఖే అత్యున్నతమైన శాఖగా నిరూపించడం చేత కోల్ బ్రూక్, మాక్స్ ముల్లర్లు భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదుల ప్రయోజనాలను సమర్థవంతంగా బలపరచిన వారయ్యారు. భారతదేశానికి "సెక్రటరీ ఆఫ్ స్టేట్" అయిన లార్డ్ డెర్బీ ఈ విషయాన్ని చక్కగా గుర్తించాడు.
"అనేక సైనికదళాల వల్ల జరుగని సేవ ఆంగ్లేయుల భారత ప్రభుత్వానికి కోల్ బ్రూక్స్, మాక్స్ ముల్లర్లు చేశారు" అని డెర్బీ ప్రభువు అననే అన్నాడు.

ఈనాటికీ కూడ ఆ అనేక సైనిక దళాలుకన్న ఎక్కువ విలువైన సేవను ఆ వేదాంత తత్వం ఇప్పటి భారతదేశ పరిపాలక వర్గాలకు ఇంకా చేస్తూనే ఉంది. ఆ సైన్యంలోని అక్షోహిణీపతులూ, అతిరధ మహారధులూ (Field Marshals, generals) ఎవరంటే కుక్క గొడుగుల్లాగా పుట్టుకొస్తున్న నేటి బాబాలు, భగవాన్లూ, గురువులూ, పరమహంసలూ. ఆ సైన్యాధిపతుల్నీ, ఆ సైన్యాన్ని ఓడించాలంటే వేదాంత తత్త్వంగా చెల్లుబాటవుతున్న విషపూరితమైన భావనా వ్యవస్థను చీపురుతో చిమ్మి చరిత్ర చెత్తకుండలో పారవెయ్యాల్సి ఉంటుంది.

(ఈ వ్యాసాన్ని 1977 జూన్లో భారతీయ హేతువాద సంఘం హైదరాబాద్ శాఖ వారి ఆధ్వర్యంలో జరిగిన 'జంటనగరాల హేతువాద సభల'లో చదివారు. ఆగష్టు 1977 చార్వాక పత్రికలో ప్రచురణ జరిగింది.)

మత విశ్వాసాలు

నేడు "ఆంధ్రప్రభ" కార్యాలయానికి హిందూపురం నుంచి రెండు లేఖలు చేరినవి. వీటిలో మొదటిదిది:

ఆర్యా,
మీ పత్రికలో (17-5-47) కీచ్ మెర్వీ సంస్థానములకు చెందిన 800 మంది మహమ్మదీయులు తమ మతమును మార్చుకొని హిందూ మతములో ప్రవేశించినారని ప్రకటించినారు. ఈ వార్త సత్యమేనా? అట్లనడానికి మీరు నిదర్శనము లివ్వగలరా? మీకు వార్త పంపినవారెవ్వరు? హిందూ మతములోనికి ప్రవేశించిన కొందరి చిరునామాలు ఇచ్చెదరా? ఈ ప్రశ్నలకు ఉత్తరములు మఱియు వారు అట్లు మతమును మార్చుకొనుటకు కారణములను తెలుపవలెను. ఇవి మా ఈ క్రింది చిరునామమునకు కాని, లేక మీ పత్రికలోనైనను ప్రచురించిన కృతజ్ఞులము.

ఇట్లు

వైస్ ప్రెసిడెంట్

కాగా, రెండవ లేఖ ఇంగ్లీషులో ఉన్నది. దానిలోని ముఖ్య భాగాలివి :
ది యంగ్ ముస్లిం ప్యూపిల్స్ అసోసియేషన్, హిందూపురం.
"మీరు పొరపడ్డారని నేను అనుకుంటున్నాను. వీరు హిందూమతంలో నుంచి ముస్లిం మతంలోకి మార్చబడినారు గాని, ముస్లిం మతంలోనుంచి హిందూమతంలోకి కాదని నా అభిప్రాయం. "... ఈసారి పొరపడితే, మీ మాటలను దిగమింగి, ఇక ముందు ఎన్నడూ ఇట్టి పొరపాటు చెయ్యవద్దు. ఇస్లాం మీ మతాల వంటిది కాదు."
ఈ లేఖను వ్రాసింది ఒక విద్యార్థి. ఈయన వ్రాసిన ఇంగ్లీషు చాలా వన్నెచిన్నెలతో బహుముచ్చటగా ఉన్నది. అనువాదంలో దాని సొగసులను తీసుకురావడం మాకేకాదు; ఎవ్వరికీ సాధ్యం కాదు.

"ఆంధ్రప్రభ" జాతీయ పత్రిక. దానికి ఏ మతంతోను ఎట్టి సంబంధం లేదు. దాని నిర్వాహకులకు ఏవైనా మత విశ్వాసాలుంటే, అవి వారి వ్యక్తిగత జీవితానికి సంబంధించినట్టివే. మతాంతరీకరణ విషయమై ఒక వార్తను "ఆంధ్రప్రభ' ప్రకటించడం అది కూడా ఒక వార్త కాబట్టే గాని, తమకు చెందని ఒక మతం నుంచి తనదైన ఒక మతంలోకి పరివర్తనం జరిగిందని కాదు.

ఈ మతాంతరీకరణ వార్తను "అసోసియేటెడ్ ప్రెస్ ఆఫ్ ఇండియా" పంపించింది. దీన్ని "ఆంధ్రప్రభ' ఒక్కటే కాకుండా, మద్రాసు పత్రికలలో మేము గమనించినంత వరకు "హిందూ" కూడా ప్రకటించింది. వార్తను అనువదించడంలో గాని, ప్రకటించడంలో గాని ఎట్టి పొరపాటు జరగలేదు.
కాని, హిందూపురం నుంచి లేఖలు వ్రాసిన వారిద్దరు కూడా ఇది తప్పక తప్పు వార్త అయి ఉంటుందని ఖచ్చితంగా వ్రాస్తున్నారు. ఇలా వీరు వ్రాయడానికి కారణం తప్పు అయి ఉండకతప్పదని వీరు అనుకోవడమే, తమ ఈ ఊహపై ఆధారపడే ఈ లేఖలకు మే మింతగా ప్రాముఖ్యమివ్వడం వీటిలో స్పష్టంగా ప్రతిఫలిస్తున్న చిత్త వృత్తియే. భారత రాజకీయ రంగంలో నేడు కానవస్తున్న మహానర్థదాయక పరిణామాలలో నూటికి 99 వంతులకు కారణం కావడమే.

మానవుని ప్రవృత్తి చిత్రమైనట్టిది. ఇందుకు దానిలో గర్భితమై ఉన్న ద్వంద్వమే కారణం. ఒక క్షణంలో అది రాక్షస స్వరూపం ధరించగలదు; మరు క్షణంలోనే దేవత్వాన్ని ద్యోతకం చేయగలదు కూడా. అంతే కాదు, ఒకే క్షణంలోనే దేవత్వ, రాక్షసత్వాల మధ్య జీవించగలదు కూడా.

మానవుని ప్రవృత్తిలో గర్భితమై ఉన్న రాక్షసత్వాన్ని దేవత్వంతో జయించమని ఉద్బోధించిందే - ఉదోషించేదే - ఉత్సహింపజేసేదే - మతం. ఇందుకు ఒక్కొక్క మతం ఒక్కొక్క దారిని చూపుతుంది. ఉదాహరణకు : ఇస్లాం చూపించే దారి కారుణ్యం; హిందూ మతం చూపించేదారి సర్వ చరాచర కోటితో ఆత్మీయత.

మతాల లక్ష్యం ఇంత ఉన్నతమైనదైనప్పుడు మత విశ్వాసాల ప్రాబల్యం మానవుల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంచాలి; వారిని సన్నిహితులను చెయ్యాలి.

కాని, నేడు మనకు కానవస్తున్నది మతం పేరిట విద్వేషాలను రగల్చడమే; కల్లోలాలను ప్రోత్సహించడమే; రక్తపాతాన్ని కొనసాగించడమే.

ఇది అన్ని మతాలవారుకూడా సిగ్గిలవలసిన విషయమనడంలో అత్యుక్తి కలదా!

ఇది ఇస్లాం కానివ్వండి; హిందూ మతం కానివ్వండి; ఏదైనా గాని, దాన్ని ఏవో కొన్ని రాజకీయ ప్రయోజనాల సంపాదనకు సాధనంగా చేసుకొనడం మతాన్ని గౌరవించడం కాదు; దాన్ని అవమానించడమే; అపహసించడమే.

మతానికి, మత విశ్వాసాలకు కల్పించబడిన వికృతరూపమే నవకాళీ నరకం, బీహార్ బడబానలం, పంజాబ్ ప్రళయాగ్ని గుండం మొదలైనవన్నీ,.

పేర్లు భిన్నమైనవి కావచ్చు; దారులు వేర్వేరు కావచ్చు. కాని, అన్ని మతాల లక్ష్య మొక్కటే. అది మానవునిలోని పశుత్వాన్ని చంపి, అతనిని దేవతామూర్తిగా చెయ్యడమే. దేవతలు ఎక్కడో ఏ స్వర్గంలోనో లేరు; మనలోనే ఉన్నారు. పశుత్వాన్ని చంపుకున్నప్పుడు మనమే దేవతలం;
స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం, సమానత్వం వెలసినప్పుడు, ప్రేమానురాగాలు రాజ్యం చేసినప్పుడు, శాంతి, సంతృప్తి సౌఖ్యాలు తాండవ మాడినప్పుడు ఇదే స్వర్గలోకం.

ఈ సత్యాన్ని బోధించడానికే అక్బర్ పాదుషా యత్నించాడు; ఫకీరైన కబీరుకూడా యత్నించాడు; దరిద్ర నారాయణునికి ప్రతినిధినని చెప్పుకొంటున్న గాంధీజీ సయితం నేడు ఇదే యత్నం చేస్తున్నాడు. ఈ యత్నం కృతకృత్యమైనంత మేరకే మనం హిందువులమైనా, మహమ్మదీయులమైనా, క్రైస్తవులమైనా, పారశీకులమైనా, మనకు శాంతి సౌఖ్యాలైనా, ముక్తి మోక్షాలైనా. (ఆంధ్రప్రభ 21-5-1947)

మతం, సంస్కృతి

ప్రపంచ చరిత్రను సింహావలోకనం చేస్తే, మతం పేరిట జరిగిన హత్యాకాండ - మతం పేరిట సాగిన రక్తపాతం మతం పేరిట ప్రదర్శించబడిన రాక్షసత్వం - ఇంతంత కాదని స్పష్టపడుతుంది.

ఏ మతాన్ని చూడబోయినా, అది పరాత్పరుని ప్రేమమయునిగా వర్ణించేదే, కరుణాపయోనిధిగా అభినుతించేదే.

అయినా, ఆ ప్రేమమయుని పేరిట, ఆ కరుణాపయోనిధి పేరిట ఆయన భక్త కోటికి చెందినవారు ఒకరి నొకరు కంటగించుకొనడం, ఒకరిపై మరొకరు క్రౌర్యాన్ని ప్రదర్శించడం, ఒకరికుత్తుక నొకరు ఉత్తరించ గోరడం - ఇది ఏ విధంగా సంభవమో మహాశ్చర్యం!

మత సూత్రాల ప్రాతిపదికలను చూడబోతే, మానవుని మానవునికి సన్నిహితుని చేయడం దాని పరమావధిగా గోచరిస్తుంది; మత బోధనల సారాంశాన్ని గమనిస్తే, మానవుని దేవతామూర్తిగా చేయడమే దాని ఏకైక లక్ష్యంగా కానవస్తుంది. అయినా, ప్రపంచ చరిత్రను పరికిస్తే, మానవుని మానవుని నుంచి వేరుచేయడానికి మతాలు

కారణమైనంతగా, మానవుని కేవలం కిరాతకునిగా చేయడానికి మతాలు కారణమైనంతగా, మరేదీ కారణం కాలేదు. ఇది మహాశ్చర్యమే కాక, అత్యంత శోచనీయం కాదా?

వికాసాన్ని కోరేవారు, ప్రగతిని కాంక్షించేవారు, జగత్కళ్యాణాన్ని లక్షించేవారు ఆర్థిక, సాంఘిక, రాజకీయాది వ్యవస్థలతో మత విశ్వాసాలకు ప్రసక్తి కూడదనడం ఎంతైనా సమర్థనీయ మనడానికి ప్రపంచ చరిత్ర పుటలను మించి సాక్ష్యాధారాలు కావాలా?

మానవుని మానవుని నుంచి వేరుచేయడానికి మతం తోడ్పడుతుండగా, మానవునికి మానవునితో సన్నిహితత్వాన్ని కూర్చడానికి సంస్కృతి దోహద మిస్తున్నదని కూడా ప్రపంచ చరిత్ర పుటలే ఉద్ఘాటిస్తున్నాయి.

మతం కంటే సంస్కృతి విశాలం, ఉదాత్తం, మహిమాన్వితం.
హిందూమతం, బౌద్ధమతం, జైనమతం, ఇస్లాం, క్రైస్తవమతం - ఇన్నింటి నిగ్గు భారతీయ సంస్కృతిలో లేదా, ఈజిప్షియన్, బాబిలోనియన్, గ్రీక్, రోమన్, పర్షన్, చైనీస్ మొదలుగాగల వివిధ నాగరికతల ప్రభావం భారతీయ సంస్కృతిలో గర్భితమై లేదా?
అయినప్పుడు భారత సమైక్యతకు భారతీయ సంస్కృతి ప్రాతిపదిక కావలెనా? లేక, ఏదో ఒక మతం ప్రాతిపదిక కావలెనా?
హిందువుల సంస్థగా తిరిగి రాజకీయ రంగంలో ప్రవేశించడానికి హిందూమహాసభ చేసుకున్న తీర్మానం దృష్ట్యా ప్రతి భారతీయ పౌరుడు నేడు ఈ ప్రశ్నను వేసుకొనక తప్పదు గదా?

ఈ తీర్మాన సందర్భంలో ఇండియాలో ఉద్భవించిన ఏ మతానికి చెందినవారైనా హిందువులేనని నిర్వచించడం జరిగింది. ఏదైనా మతం ప్రాశస్త్యం అది ఉద్భవించిన ప్రాంతంపై ఆధారపడి ఉంటుందా? అయితే, బౌద్ధమతం ఇండియాలో ఉద్భవించినదైనందున టిబెట్, బర్మా, సింహళం, చైనా, జపాను మొదలైనవన్నీ దాన్ని కంటగించుకోవలసిందేనా? ఈ దేశాలలో ఉద్భవించినట్టిది కాకపోయినా, వాటి సంస్కృతిని వికసింపజేయడానికి బౌద్ధమతం తోడ్పడలేదా?

సంస్కృతి వికాసానికి తోడ్పడినంతవరకే మతం దాని విశిష్టతను కాపాడు కొనడమైనా, తన మనుగడను సార్థకం చేసుకొనడమైనా, ఈ పరిమితికి లోబడక, ఆర్థిక, సాంఘికాది వ్యవస్థలతో ప్రసక్తి పెట్టుకున్నంతనే మతం కలుషితమైపోవడమే కాకుండా, తాను సృష్టించిన ప్రతి దాన్ని కలుషితం చేస్తుంది.

ఈ చిరసత్యాన్ని, ఈ నిత్య సత్యాన్ని - హిందూ మహాసభ కాని, రాష్ట్రీయ స్వయం సేవక సంఘం కాని గుర్తించడం లేదు.

"ప్రమాదకర సంస్థ" అనే శీర్షిక కింద మేము మొన్న వ్రాసిన సంపాదకీయానికి ప్రత్యుత్తరంగా మాకు నేడు చేరిన అయిదు లేఖలలోను "సెక్యులర్ స్టేట్" స్థాపనపట్ల ఆర్.యస్.యస్. ప్రాతికూల్యం వహించడం లేదని పేర్కొనబడింది. ఈ సంగతేమి, భారత జాతీయ పతాకను ఆర్.యస్.యస్. గౌరవించగలదని వారి ద్వారా మేము వినగలగడమేమి సంతోషకర విషయాలే. కాని, ఈ సంస్థ సూచిస్తున్నట్టు భారతీయ సంస్కృతి కేవలం హిందూ

మతానికి పరిమితమైనట్టిదా? భారతీయ సంస్కృతిని ఏదో ఒక మతానికి పరిమితం చేయడంకంటె స్వతంత్ర భారతానికి ఘోర ప్రమాదాన్ని ఊహించగలమా?

“మాది రాజకీయ పక్షం కాదు. హిందూ సంస్కృతి పునర్వికాస సాధనే మా లక్ష్యం” అని ఆర్.యస్.యస్. నాయకులు పేర్కొంటున్నారు. సంస్కృతి జోలికి పోనిపక్షంలో ఆర్.యస్.యస్. రాజకీయపక్షం కావడమైనా సహించదగు విషయం కావచ్చుగాని, భారతీయ సంస్కృతీవాహిని వైశాల్యాన్ని తగ్గించి, దాన్ని వక్రమార్గానికి మళ్ళించ గోరడం కేవలం దుస్సహంకాదా?
భారతీయ సంస్కృతికి విషతుల్యమయ్యే ఏ సంస్థనైనా సహించడం వెయ్యి సంవత్సరాలనాడు భారత జాతి పతనానికి మూలమైన దుష్టశక్తులను సహించడమే.

ముస్లింలీగ్, లీగ్ నేషనల్ గార్డ్స్, హిందూ మహాసభ, ఆర్.యస్.యస్. మొదలైన వాటిపట్ల మా ప్రతికూలభావానికి కారణ మిదే. మతం విషయమై, సంస్కృతి విషయమై మా విశ్వాసాలలో భాగస్వాములు కాని వారితో వాదించడం వృథాశ్రమ. అందువల్ల ఈ విషయాన్ని మేము తిరిగి తరచబోము.

(ఆంధ్రప్రభ 28-12-1947)

ఇది మౌఢ్యమే కాదా?

కొందరు దేవాలయాలలో పూజలు చేయవచ్చు; మరికొందరు మసీదులలో నమాజ్ చేయవచ్చు; వేరొక కొందరు చర్చిలలో ప్రార్థనలు చేయవచ్చు: ఇంకొక కొందరు గురుద్వారాలలో గురుగ్రంథ సాహెబ్ ను పఠించవచ్చు. కాగా, కొందరు నిరీశ్వరవాదులైనా కావచ్చు. అయినా మన ఇండియా, మనం పుట్టేదీ, గిట్టేదీ ఈ గడ్డ పైనే, పుట్టడానికీ, మధ్యకాలంలో మనకు కూడు పెట్టవలసిందీ, గుడ్డ నివ్వవలసిందీ ఈ గడ్డే! దీని బాగే మన బాగు; దీని ఓగే మన ఓగు! ఈ విషయాన్ని గుర్తించడమే జాతీయత; ఇందుకు అనుగుణంగా నడచుకొనడమే దేశభక్తి. స్వీయమతాభిమానికి జాతీయత విరుద్ధమైంది కాదు, పరమత విద్వేషాన్ని వర్జించాలని మాత్రమే జాతీయత కోరుతుంది. స్వీయసంఘ వికాసాభిలాషకు దేశభక్తి ప్రతిబంధకం కాదు; సమష్టి క్షేమానికి స్వీయ సంఘాభివృద్ధిని ఆనుషంగికం చేసుకొనాలని మాత్రమే దేశభక్తి నిర్దేశిస్తుంది. ఒక చిన్న లక్ష్యాన్ని పెద్ద లక్ష్యానికి ఆనుషంగికం చేయడం -ఇదే నిజానికి మానవసభ్యతకు పునాది.

సృష్ట్యాదిలో (పరిణామ సిద్ధాంతం ప్రకారం వానరజాతినుంచి మానవజాతి చీలిపోవడం ప్రారంభమైనప్పటిలో) ఏ వ్యక్తికి ఆ వ్యక్తి తన పొట్ట నింపుకొనడమే, తన ప్రాణాలను కాపాడుకొనడమే ప్రధానంగా పరిగణించేవాడు. దీని నుంచి పైమెట్టు- వ్యక్తులు కుటుంబాలుగా ఏర్పడ్డం, ఆ పైమెట్టు- కొన్ని కుటుంబాలు చేరి, ఒక తెగ కావడం, దానికి పైమెట్టు- తెగలు సంఘాలు కావడం, అంతకంటె పైమెట్టు-సంఘాలు జాతులుగా పరిణమించడం.

అయితే, సభ్యమానవుని చరమలక్ష్యం కేవలం జాతీయతే కాదు, కారాదు. ఇంకొక మెట్టు పైకి వెళ్లి, అంతర్జాతీయతను ఆతడు అందుకోవాలి.

అంతర్జాతీయతకు పైమెట్టు ఏది కాగలదనే ప్రశ్న ప్రస్తుతం అనవసరం. ఆ మెట్టుపైకి ఎక్కిన తర్వాత ఆ విషయాన్ని నిర్ణయించుకోవచ్చు.

జాతీయత నుంచి పైమెట్టుకు మానవుడు ఎగబ్రాకలేక పోతున్నందునే ప్రపంచ యుద్ధాలు సంఘటిస్తున్నాయి. మన మతమౌఢ్యమే ముస్లిం లీగ్ సృష్టికి కారణమైంది. ఇదే హిందూ మహాసభ స్థాపనకు దారితీసింది. ఇదే అకాలీదళ్ అవతరణకు మూలమైంది. పరదాస్యం నుంచి విముక్తి సాధనలో.

విలంబన తప్పక పోవడానికి, ఆ విముక్తి సందర్భంలో దేశవిభజన, అన్నింటినీ మించి, గాంధిహత్య జరగడానికి ఒకే ఒక హేతువు తిరిగి మత మౌఢ్యమే!

ఈ మౌఢ్యాన్ని ఎట్టకేలకు గుర్తించినందువల్లనే, హిందూ మహాసభ తన కార్యప్రణాళిక నుంచి రాజకీయాలను తొలగించుకొనడానికి నిర్ణయించుకొన్నది. కొన్ని రోజులుగా సిమ్లాలో సమావేశ మౌతున్న అకాలీదళ్ కార్యవర్గం మాత్రమే కాకుండా, నేడు మద్రాసులో సమావేశం ప్రారంభించిన ముస్లింలీగ్ సయితం ఈ పాటి విజ్ఞతను ప్రదర్శించ గలదనే ఆశించవచ్చునా? *(ఆంధ్రప్రభ 11-3-1948)*

కుంటి సాకులు

"మనది మతాల ప్రసక్తి లేని సెక్యులర్ రాజ్యం. హిందూ ధర్మశాస్త్ర సంస్కరణకు మన ప్రభుత్వం ఉద్యమించడం ఈ సెక్యుల రాజ్య లక్ష్యానికే పూర్తిగా విరుద్ధం."

"మన ఎన్నికల ప్రణాళికలో సంఘసంస్కరణను మనం ప్రత్యేకించి పేర్కొనలేదు. అందువల్ల ప్రజల సమ్మతిని విస్పష్టంగా పొందనిదే హిందూ ధర్మశాస్త్ర సంస్కరణకు పూనుకోరాదు."

"హిందూ సాంఘిక వ్యవస్థ - విశేషించి, సమష్టికుటుంబ పద్ధతి - సర్వోత్కృష్టమైనది. దాన్ని సంస్కరించ గోరడమే మహాపరాధం."

డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారి సమేతంగా, హిందూ ధర్మశాస్త్ర క్రోడీకరణ బిల్లును ఇండియన్ యూనియన్ పార్లమెంటులో ప్రతిఘటిస్తున్న పెద్దలు నిన్న, మొన్న పేర్కొన్న ప్రధానమైన అభ్యంతరాలివే.

సెక్యులర్ రాజ్యం "నీవు ఈ దేవుని ఆరాధించు, ఆ దేవుని ఆరాధించ వద్దు" అని చెప్పరాదు. "దైవారాధన ఈ పద్ధతిలోనే జరగాలి, మరొక పద్ధతి తగదు" అని శాసించరాదు. అంతే కాని, సంఘ సంస్కరణతో సయితం ప్రసక్తి పెట్టుకొనరాదనడం భావ్యమా?

సంఘసంస్కరణతో సెక్యులర్ రాజ్యానికి ఎంతమాత్రం నిమిత్తమే కూడదని ఈనాడు వాదిస్తున్న వారే అస్పృశ్యతా నిర్మూలనను ఎందుకు సమర్థించారు? అంటరానివారికి దేవాలయ ప్రవేశార్హతను ఎందుకు కల్పించారు? అస్పృశ్యత హిందూమతంలో ఒక భాగం కాదనడం వీరి నమ్మకం కావచ్చు. కాని, అది హిందూమతంలో ఒక భాగమని, ఒక ప్రధాన భాగమని, వీరు నేడు ఏకరవు పెడుతున్న కొన్ని స్మృతులే ఘోషిస్తున్నవి కదా? అస్పృశ్యత తమ మతంలో ఒక భాగమని హిందువులలో పెక్కుమంది ఈనాటికీ ధృఢంగా విశ్వసిస్తున్నారు గదా?

పోతే, ఇప్పుడు ఈ సెక్యులర్ రాజ్యం వాదాన్ని లేవనెత్తిన పెద్దలే మద్యనిషేధాన్ని ఎందుకు సమర్థించారు? మద్యం దేవతల పానీయమని (సోమరసమని), అది దేవతలకు అత్యంత ప్రీతికరమైనదని హిందువుల దృష్టిలో అపౌరుషేయాన్ని వేదాలు వేనోళ్ల ఉగ్గడిస్తున్నవి కదా? శాక్తేయులైన వారిలో కొందరికి సురలేనిదే దేవతాపూజ జరగదుకదా? అయినప్పుడు మద్యపాననిషేధాన్ని ప్రవేశ పెట్టడం మతస్వాతంత్ర్యానికి భంగం కలిగించడం తప్ప అన్యం కాగలదా?

పోతే, కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికలో పేర్కొనడం జరగలేదు కనుక, హిందూధర్మశాస్త్ర సంస్కరణకు ఇప్పటి పార్లమెంటుకు హక్కు లేదనడం కూడా పరిశీలనకు నిలవలేని వాదమే కొన్ని తరాలవరకు - బహుశా కొన్ని శతాబ్దాలవరకే - మన జీవితక్రమాన్ని నూతన రాజ్యం విధానాన్ని రూపొందించడం ద్వారా, మన ఇప్పటి పార్లమెంటే (రాజ్యాంగ పరిషత్తు రూపంతో, నిర్ణయించివేసింది. ఇట్టి సర్వసత్తాక సంస్థకు సంఘసంస్కరణకు హక్కు లేదనడం పాడగలరా?

ఇక, హిందూ సాంఘిక వ్యవస్థ సర్వోత్కృష్టమైన దనడం, దాన్ని సంస్కరించడానికి యత్నించడం మహాపచారం కాగలదనడం అర్థంలేని మాట. ఈ ధోరణిలో మాట్లాడుతున్న వారు రాజు రామమోహన్ రాయ్ ని నిరసిస్తున్నారనే చెప్పవచ్చు. దయానంద సరస్వతిని నిందిస్తున్నారనే చెప్పవచ్చు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌ను ధిక్ అంటున్నారనే చెప్పవచ్చు. వీరేశలింన్ని తెగవాడుతున్నారనే చెప్పవచ్చు. హరవిలాస్ శారదాను తూలనాడుతున్నారనే చెప్పవచ్చు. చివరికి గాంధీనే ధర్మభ్రష్టునిగా భావిస్తున్నారని చెప్పవచ్చు.

ఈనాటి హిందూ సాంఘిక వ్యవస్థలోని క్రౌర్యానికి, కర్కశత్వానికి ఒక ఉదాహరణే చాలు అది - అంటరాని తనం. పార్లమెంటులో హిందూధర్మ శాస్త్ర సంస్కరణను ప్రతిఘటిస్తున్న వారు సయితం అంటరానితనాన్ని బహుశా సమర్థించబోరు. కాని, హిందూ సమష్టికుటుంబం వైశిష్ట్యాన్ని గురించి, హిందూ సాంఘిక వ్యవస్థలోని సోషలిజాన్ని గురించి వీరు కేవలం కవిత్వాన్నే చెబుతున్నారు. వీరికి మేము కొన్ని ప్రశ్నలు వేయగోరుతున్నాము.

ఏ దేశచరిత్రను పరికించినా, సమష్టికుటుంబ పద్ధతి ఫ్యూడల్ వ్యవస్థకు ప్రాతిపదికగానున్నట్టు కానరాదా? మీరు ఏ దేశ చరిత్రను చదవలేదా? లేక, ప్రజాస్వామ్యంపట్ల పైకి భక్తి శ్రద్ధలను ప్రదర్శిస్తూ, ఫ్యూడల్ వ్యవస్థనే నిలపాలని మీరు ఉద్దేశిస్తున్నారా? కొందరికి చదువును, మరికొందరికి ఊడిగాన్ని, వేరొక కొందరికి కుక్కకంటే హీనమైన బ్రతుకును ప్రజాస్వామ్యం పేరుతో మీరు స్థిరపరచగోరుతున్నారా?

జీవితరంగాలలో కొన్నింటిలోనే ముందడుగు వేసి, మిగిలినవాటిలో అంగుళమైనా ముందుకు సాగలేని అపరిపక్వ మనఃప్రవృత్తే ఇప్పటి ప్రతిఘటనకు కారణం. దీన్ని కప్పిపుచ్చుకొనడానికి గొప్పగా ధ్వనించే ఏయే సాకులను వెదికినా, అవి సారంలేని కుంటిసాకులే. *(ఆంధ్రప్రభ 15-12-1949)*

ఏది దేవాలయం?

దేవాలయానికి దేవత్వం అక్కడ ప్రతిష్ఠించిన శిలావిగ్రహం ద్వారా రాదు, దానికి జరిగే ధూపదీప నైవేద్యాల ద్వారా కూడా రాదు. దేవాలయం నిజంగా దేవునికి ఆలయం కావడం మానవుని దేవతల మార్గం వెంట నడిపించడానికి అది తోడ్పడినప్పుడే. ఇట్టి తోడ్పాటు ఒకనాడు దేవాలయం ద్వారా లభించేది. అప్పుడది దేవాలయమే కాక, విద్యాలయం కూడా. దాని మండపాలు వేదవేదాంగోపనిషత్తుల నిరంతరాధ్యయనంతో ప్రతిధ్వనించేవి.

అప్పుడది దేవాలయమే కాక, కళాలయం కూడా. దాని ప్రాకారాలేమి, గోపురాలేమి, కుడ్యాలేమి శిల్ప, చిత్ర సుశోభితాలై, సామాన్య పౌరుల జీవితాలను కళాశోభితం చేయడమే కాకుండా, శిల్పాచార్యులకు, చిత్రకారులకు తమ ప్రాగల్భ్య ప్రదర్శనానికి మహదవకాశాన్ని కల్పించేవి. అప్పుడది దేవాలయమే కాక, నాట్యాలయం కూడా. అనుదినం సాయం సంధ్యాసమయంలో అక్కడ భరతనాట్య ప్రదర్శన జరుగుతుండేది.

అప్పుడది దేవాలయమే కాక, గానాలయం కూడా. మంగళతూర్యాలతో అక్కడి చీకటి విచ్చుకునేది, అక్కడి నాగసరం మున్నగు వాయిద్యాలు పౌరులకు మేలుకొలుపులు పాడేవి, అక్కడి భజనలు, సంకీర్తనలు మొదలైనవి పామరుని బ్రతుకును సయితం గాన మధురిమం చేసేవి.

అప్పుడది దేవాలయమే కాక, వైద్యాలయం కూడా. పూజారులే సర్వసాధారణంగా వైద్యులై వుండేవారు. ప్రతిఫలాన్ని కాంక్షించి కాక, ప్రజాసేవను లక్షించి, వ్యాధి నివారణకు వారు పాటుపడుతూ వుండేవారు.

అప్పుడది దేవాలయమే కాక, "కర్మాలయం" కూడా. కంసాలి, కంచరి, కమ్మరి, కుమ్మరి మొదలైన కర్మకారులకు అది పని కల్పిస్తుండేది. దైవ సేవకు పంచపాత్ర, ఉద్ధరణి, శరకోపం, జేగంట, ఛత్రచామరాలు మొదలుకొని, గరుడ, నందీశ్వరాది వాహనాల వరకు, రజత, సువర్ణాది దివ్యాలంకరణ సమకూర్చడమనే పేరుతో సమస్త కర్మకారుల సంపూర్ణ వికాసాభ్యుదయాలకు ఉపకరించేది.

అప్పుడది దేవాలయమే కాక, "వినోదాలయం" కూడా. ఊరేగింపులు, ఉత్సవాలు, సంతర్పణలు, సమారాధనలు, భగవత్కథలు, ఇతర కాలక్షేపాలు, తీర్థాలు, తిరునాళ్లు, మొదలైన వాటిని పరంపరగా కల్పించి, దైనందిన సాధక బాధకాలను విస్మరింపజేసి, ప్రజానీకం జీవితాన్ని ఆనందపులకితం చేసేది.

అప్పుడది దేవాలయమే కాక,"రక్షణాలయం"కూడా. శత్రు,చోరభయాలు కలిగినప్పుడు ప్రజలు దాని ప్రాకారాల లోపల చేరి, ప్రాణరక్షణ చేసుకొనేవారు. ఇందుకొక తార్కాణమే "ఇంటికంటె గుడిపదిల" మనే లోకోక్తి.

ఇంత దేనికి? ఒకప్పుడు దేవాలయం హిందూసంఘ జీవితానికి కేంద్రం. ఊరుమధ్యనే కాక, బ్రతుకుమధ్యలో అది నిలిచివుండేది. కాని ఈనాడో?

అది బ్రతుకు మధ్యనుంచి దాని చివరికి ఇప్పుడు కదిలింది. పది మంది కడుపు కొట్టి, వారి బ్రతుకు బుగ్గిచేసి మూటకట్టిన పాపము సొమ్ములో ఇప్పుడది కొంత భాగాన్ని పంచుకొంటున్నది. ఇట్టి ఘోరదుస్థితిలో పడినందునే ఒకనాడు బౌద్ధస్థూపాలు, విహారాలు "లంజ దిబ్బలు"గా మారాయి.

ఈ విషాద పరిణామం నుంచి దేవాలయాలను కాపాడాలనే సదుద్దేశంతో మద్రాసు ప్రభుత్వం దేవాలయ, ధర్మాదాయ సంస్థల చట్టానికి సంస్కరణ తల పెట్టేసరికి ధార్మిక విషయాలలో ఇది జోక్యమని, ప్రాథమిక స్వత్వాలకు ఇది భంగకరమని, మతపవిత్రతకు ఇది కళంకమని, రాజ్యాంగ విధానానికి ఇది విరుద్ధమని ఎందుకు కొందరు ఆందోళన ప్రారంభించారో దురూహ్యం. దేవాలయం తిరిగి సాంఘిక జీవితానికి కేంద్రం కావాలని మేము కోరబోము; కాగలదన్న ఆశ సయితం మాకు లేదు. కాని, అట్టి ప్రయత్నం ప్రారంభం కాగా దేవాలయాల పై భక్తి ప్రపత్తులున్న వారు దాన్ని ఆహ్వానించడానికి బదులు నిరసించడం దేనికి? దేవుని పేరు చెప్పి, తమ పొట్టలు నింపుకొనడానికి ప్రతిబంధకం కలగబోతున్నదనేనా? తాము చేస్తున్న పాపాలకు తేలికగా "చెల్లుచీటి" దొరికే అవకాశం పోగలదనా? యుక్తాయుక్తాలను, ధర్మాధర్మాలను కానలేనంతగా మూఢాచారాలు తమపై ప్రాబల్యం వహించడం వల్లనా? *(ఆంధ్రప్రభ 16-2-1949)*

హిందూ సంఘ సంస్కరణ

రాజకీయ సంస్థలు సాంఘిక విషయాలలో ఎంతమాత్రం జోక్యం పెట్టుకోరాదట. ఇది జగద్గురు శంకరాచార్యుల సూక్తి! ఇదే రాష్ట్రపతి భోగరాజు పట్టాభి సీతారామయ్య సుభాషితం.

జగద్గురువుల సంగతి ముందు కొంత పరామర్శించి, ఆ తర్వాత రాష్ట్రపతివద్దకు రావచ్చు. శంకరాచార్య పీఠాలు మొత్తం నాలుగు కాబోలు వున్నాయి. ఈ నాల్గింటి అధిపతులు జగద్గురువులే. జగతి ఒక్కటే కాగా, జగద్గురువులు నలుగురు కావడం వింత కాదా? వీరు నలుగురైనా, వీరందరు చేరి, జగత్తు మొత్తానికి గురువులైతే, అదొక అందం, చందం. కాని, వీరి "ధర్మ సామ్రాజ్యం" సరిహద్దులు ఇండియాకు పరిమితం. ఇండియాలోనైనా హిందూమతానికి పరిమితం. హిందూమతంలో తిరిగి అద్వైతవాదులకు పరిమితం. అద్వైతవాదులలో కూడా పాతకాలపు పరమఛాందసాన్ని పట్టుకుని ప్రాకులాడుతున్న వారికి పరిమితం. ఈ జగద్గురువుల "ధర్మసామ్రాజ్యం" ఇంత పరిమితమైనది కాగా, వీరి "దృక్పథ సామ్రాజ్య" వైశాల్యం దీనిలో శతసహస్రాంశమైనా కాదు.

ఈ 'జగద్గురువులే" రాజా రామమోహన్ రాయ్, దయానంద సరస్వతి, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం మొదలైనవారినందరినీ నిరసించారు.

ఖర్మం చాలక వీరి మాట చెల్లివుంటే, సముద్రయానం నేటికీ దూష్యమై వుండేది; సహగమనం నేటికీ సాగుతుండేది; వితంతువివాహాలు నేటికీ వర్జ్యనీయమై వుండేవి; బాల్యవివాహాలు నేటికీ సదాచారమై వుండేవి; స్త్రీలకు విద్యగరపితే, వారు విటులకు లేఖలను వ్రాయగలరన్న నీచవాదం జరుగుతుండేది; లెక్కలేనన్ని ఇతర అంధవిశ్వాసాలకు, దురాచారాలకు మన సంఘం క్రీడా రంగంగా నిలిచివుండేది.

జగద్గురువులను వారి జానెడు, బెత్తెడు జగత్తులోనే విడిచి పుచ్చి, సంఘం ముందడుగు వేసినందునే ఈనాడు దేశం ఈ పాటిగానైనా వున్నది. అయినా, "తగుదుమమ్మా" అంటూ ఈ జగద్గురువులే ఈ నాడు మనకు సంఘసంస్కరణ తగునో, తగదో చెప్పడానికి సాహసిస్తున్నారు. రాజకీయసంస్థ సాంఘిక విషయాలలో జోక్యంకలిగించుకొనడం తగదని జగద్గురు శంకరాచార్యులలో ఒకరు ప్రవచించడంలో అబ్బురం లేదు. కాని, రాష్ట్రపతి పట్టాభిసీతారామయ్య సయితం సరిగా ఇదే వాదాన్ని చేయడం ఆశ్చర్యకరం. జాతీయజీవితాన్ని సాంఘిక, ఆర్థిక, రాజకీయ, పారిశ్రామికాది రంగాల కింద విభజించడం సాధ్యమా? సాంఘికంగా పతనమైన జాతి రాజకీయంగా స్వాతంత్ర్యాన్ని నిలుపుకొనగలదా?

పారిశ్రామిక వ్యవస్థ స్వరూపాన్ని ఆర్థిక విధానాలు నిర్ణయించవా? కేవలం వ్యవహార సౌలభ్యం కోసం సాంఘిక, ఆర్థిక, రాజకీయ, పారిశ్రామికాది రంగాలని భావించుకొనడమే కాని, జీవితం ఎల్లలులేని ఏకసంద్రం కాదా?

పైగా, ఆయన ఏ రాజకీయసంస్థ సాంఘిక వ్యవహారాలలో జోక్యం కలిగించుకొనరాదని పేర్కొంటున్నాడో, అది ఇండియన్ యూనియన్ పార్లమెంట్. భారత రాజ్యాంగ పరిషత్తు రూపంలో ఈ తరానికే కాక, ముందు తరాలకు కూడా జాతీయజీవిత స్వరూపాన్ని నిర్దేశించడంలో ప్రస్తుతం ఆ సంస్థ నిమగ్నమై వున్నది. అయినా,

జాతీయజీవితంలో కేవలమొక భాగమైనప్పుడు దాన్ని "సావెరన్" ("సర్వసత్తాక") సంస్థ అనడం దేనికి? కేవలం అలంకారార్థమా? కాంగ్రెసు నాయకులలో ఒక్క డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్య మాత్రమే కాకుండా మరికొందరు ప్రముఖులు కూడా సాంఘిక, రాజకీయ రంగాలను వేరుచేయాలనే వాదిస్తున్నారు. ఇది అత్యంత శోచనీయం. "సాంఘిక విషయాలలో జోక్యం పెట్టుకోము" అనే ధర్మపన్నాలు పలికి, సంఘాభివృద్ధిని - తద్వారా జాతీయవికాసాన్ని - అరికడుతున్నారని నిన్న మొన్నటివరకు, బ్రిటిష్ వారిని విమర్శించినవారే నేడు బ్రిటిష్ విధాన సమర్థకులు కావడం శోచనీయం కాక మరేమిటి? (మార్చి 8, 1949)

2

ఏ సంఘం న్యాయసూత్రాలైనా ఎల్లకాలం ఏకవిధంగా వుండవు. ఒకప్పుడు ఏనాడోకాదు, పద్దెనిమిదవ శతాబ్దంలోనే, బ్రిటిన్లో ఫోర్జరి చేస్తే ఉరిశిక్ష, గొర్రెలను దొంగలించినా ఉరిశిక్ష, ఒకప్పుడు, ఏనాడోకాదు; ఒక శతాబ్ది క్రితం వరకు, ఇండియాలోని కొన్ని ప్రాంతాలను చేను పై దొంగతనం చేస్తే శిరచ్ఛేదం.

నాడు ఇవన్నీ కూడా న్యాయసూత్రాలే. కాని, నేటికి ఇవి న్యాయ సూత్రాలు కాగలవా? దేశ కాల పరిస్థితులతో పాటు న్యాయశాస్త్రాలు సయితం మారాలి. ఈ సత్యాన్ని ఈనాడు హిందూ సంఘనాయకులమని చెప్పుకొంటున్న కొందరు గట్టిగా కాదనవచ్చు. కాని, ఇతఃపూర్వపు నాయకులు ఇట్టి "బుద్ధిజాడ్య జనితోన్మాదం" ప్రదర్శించలేదు. పరాశరస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి, మనుస్మృతి, గౌతమ ధర్మసూత్రాలు, ఆపస్తంభ సూత్రాలు మొదలైనవి మన కెన్ని లేవు? వీటి సంఖ్య నూటికి పై మాట కాదా? కలకాలానికీ ఒకే స్మృతి సరిపోతే, ఇన్ని రూపొందడం జరిగేదా?

ఇదివరలో నూరుసార్లకు పైగా హిందూధర్మస్మృతులు మార్పు చెందినప్పుడు అవి మరొక సారి ఎందుకు మారరాదు? నిజానికి ఈ మార్పువిషయంలో ఇప్పటికే కొన్ని శతాబ్దాల విలంబన జరగలేదా?

పైగా, ఇదివరలో కంటె ఈనాడు ఇది మనకు ముఖ్యావశ్యకత కాదా? ఇది వరలో ప్రాంతాని కొక రాజ్యం, రాజ్యాని కొక న్యాయశాస్త్రం. ఇంతే కాదు, సంఘాని కొక శాస్త్రం; కులాని కొక తప్పు; శాఖకొక ఆచారం. ఇంతేకాక, ఒకే నేరానికి విభిన్న వ్యక్తులకు విభిన్న శిక్షలు కూడా.

ఈ న్యాయసూత్రాలన్నింటిని ఈనాడు మనం పరిపాటిస్తున్నామా? వీటినన్నింటిని పరిపాటించనప్పుడు వీటిలో కొన్నింటి విషయమై పట్టుదల భావ్యమా? పైగా, ఒక్కొక్క మతంవారి కొక న్యాయసూత్రం కారణంగా న్యాయాన్యాయనిర్ణయంలో పెక్కు చిక్కులు రావడం లేదా?

వివిధ మతాలవారి న్యాయసూత్రావళిని సమైక్యం చేయడం ప్రస్తుతానికి అసంభవ విషయం. అయినప్పుడు, కనీసం హిందూసంఘానికైనా ఏక న్యాయ సూత్రావళి పరమావశ్యకత కాదా? ఇంతైనా జరగకపోతే, జాతీయ సమైక్యత మన లక్ష్యమని చెప్పుకొనడం శుష్కప్రియం కాబోదా?

హిందూ ధర్మశాస్త్ర క్రోడీకరణ జరప గోరుతున్న వారు పాత న్యాయ సూత్రాలలో ఘోరాన్యాయమైనవిగా పరిణమించిన వాటిని కొంతవరకు సంస్కరించడం వినా, చెల్లాచెదురుగా వున్న న్యాయాసూత్రాలను ఒక

క్రమానికి తెచ్చి పరస్పర వైరుధ్యాలున్న చోట వాటిని సవరించడం వినా, అన్యాన్ని లక్షించడం లేదు. అయినా, ఈ పాటికే కొంప మునిగిపోతున్నట్టు కొందరు ఎందుకు గగ్గోలు చేస్తున్నారో దురూహ్యం.

ఈ గగ్గోలు చేస్తున్నవారు కేవలం ఛాందసులైతే, “మతిలేనివారి మితిలేని గోల” అని పోనీ సరిపెట్టుకోవచ్చు. కాని, కొందరు కాంగ్రెస్ ప్రముఖులే ఈ ప్రతికూలాందోళనలో చేరుతున్నారు. ఇట్టివారు ఒక ప్రశ్నకు జవాబు చెప్పకతప్పదు. ఇదివరలో హరిజనులకు దేవాలయ ప్రవేశమివ్వడానికి శాసనాలు జరగడాన్ని వీ రెందుకు సమర్థించారు? అది గాంధీ అభిమతమనేనా? కేవలం గాంధి మెప్పుకోసమే ఆనాడు హిందూ ధర్మశాస్త్ర సవరణకు సమ్మతించిన వారే ఈనాడు అందుకు ప్రాతికూల్యాన్ని ప్రదర్శిస్తుంటే, వారి చిత్తశుద్ధిని - వారినైతిక బలాన్ని - శంకించక తప్పదుగదా?

(ఆంధ్రప్రభ 9-3-1949)

3

“జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి” అని కీర్తించిన హిందూ సంఘమే “నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి” అనే అధోగతికి వచ్చింది ఇటీవలి కొన్ని శతాబ్దాలలోనే. కొంచెం జిజ్ఞాసతో భారతదేశ చరిత్రను చదివితే, స్త్రీజనపతనంతో పాటుగానే మన జాతీయపతనం కూడా ప్రారంభమైనట్టు స్పష్టంగా కనబడుతుంది.

హిందూసంఘం ఇటీవలి శతాబ్దాలలో స్త్రీజనానికి చేసిన ఘోరాన్యాయాలను కొన్నింటిని కొంతవరకు సవరించడాన్ని మాత్రమే హిందూధర్మశాస్త్ర క్రోడీకరణ బిల్లు లక్షిస్తున్నది. దాంపత్యం దుర్భరమై పోతే, స్త్రీ విడాకులు కోరవచ్చు; సవతి పోరుకు ఆమె నిరాకరించవచ్చు; ఆస్తిపాస్తుల విషయంలో కొన్ని హక్కులను ఆమె పొందవచ్చు - ఇంతకుమించి హిందూసంఘంలో డాక్టర్ అంబేద్కర్ బిల్లు తీసుకురాగల మార్పు లేమీ లేవు. అయినా, ఏదో మహావిప్లవమే జరగనున్నట్టు ఛాందసులు ఆక్రోశపడుతుండగా, కాంగ్రెసు నాయకులలోనే కొందరు వారికంటె మిన్నగా విలపిస్తున్నారు.

హిందూసంఘ పునరుజ్జీవనానికి ఈనాడు నిజంగా కావలసింది ఒక మహావిప్లవమే. మన పాత శంకరాచార్యులు, వారి శిష్యకోటి సమేతంగా పోవాలి; సంఘంపైకి వెల్లువగా పారి, దానిలోని కశ్మలాన్ని కడిగి పారవేయ గల వరదలను పోలిన కొత్త శంకరాచార్యులు, ప్రతీపశక్తులను చెండాడగల శంకరాచార్యులు, సత్యసంశోధనలలోను, ధర్మసంస్థాపనలోను విశ్రమించబోని శంకరాచార్యులు రావాలి.

అట్టి శంకరాచార్యులు ఎప్పుడు వస్తారో, అసలు వస్తారో, లేదో తెలియదు. ఈ లోపున హిందూసంఘ క్షేమాభిలాషు లందరి కర్తవ్యం డాక్టర్ అంబేద్కర్ కృషిని సమర్థించడమే! (ఆంధ్రప్రభ 10-3-1949)

యుగ ధర్మం

నానార్థాలున్న మాటలలో "ధర్మ" మొకటి. "శబ్దరత్నాకరము" వివరణ ప్రకారం ధర్మమంటే "పుణ్యము, న్యాయము, సామ్యము, స్వభావము, ఆచారము, అహింస, వేదోక్తవిధి, ఉపనిషత్తు, విల్లు," "శబ్దార్థచంద్రిక" ఇవి కాక, "యజ్ఞము, సత్కార్యము, నీతి" అని మరి మూడు అర్థాలను కూడా పేర్కొంటున్నది. మరొక నిఘంటువును చూస్తే, దానిలో మరికొన్ని అర్థాలు కనబడతాయనే అనుకోవచ్చు. ఏ నిఘంటువు పేర్కొనని అనేక అర్థాలలో ఈ పదాన్ని మనం నిత్యవ్యవహారంలో వినియోగించడం కద్దు కూడా. ఉదాహరణకు "దానం" అనే అర్థంతో దీన్ని మనం వాడతాము ("దానధర్మాలు") వేదోక్తమైనా, కాకపోయినా "విధి" ("డ్యూటి") అర్థంలో కూడా దీన్ని మనం వాడతాము. "వర్ణాశ్రమధర్మా" లన్నచోట దీని అర్థం మరొకటి. ఇలాగే సందర్భం మారినప్పుడు, సమాసం మారినప్పుడు, దీనికి విభిన్నార్థాలు వస్తుంటాయి.

నానార్థాలు ఇంతగా వున్న ఈ పదప్రయోగం ఎక్కడ జరిగినా, ఏ అర్థంలో, ఏ ఉద్దేశంతో దీని ఏ ప్రయోగం జరిగిందని వెంటనే ప్రశ్నించుకోవలసి వుంటుంది. రాజకీయవేదిక పై ఈ ప్రయోగం జరిగితే, ఈ పరిశీలనను మరింత క్షుణ్ణంగా చేయవలసివుంటుంది. రాజాజీ ఇటీవల ఏ ప్రసంగం చేసినా, దానిలో ఎక్కడో ఒకచోట "ధర్మం" ప్రసక్తి వస్తున్నది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు మొదలైన మన ప్రాచీన గ్రంథాల ప్రసక్తితో జోడించి, ఆయన ఈ మాటను, తరచు ప్రయోగిస్తున్నందున "సనాతన ధర్మం" అనే అర్థంలోనే దీన్ని ఆయన వాడుతున్నాడని అనుకోవాలి. పోతే, శ్రీ కె.యం. ముఖర్జీ ఎక్కడ "ధర్మం" ఊసెత్తినా, ప్రధానంగా ఆయన "వర్ణాశ్రమధర్మా"లనే మనస్సులో పెట్టుకొంటున్నాడని తీర్మానించుకోవచ్చు. పోతే, జవహర్ లాల్ నెహ్రూ "యుగ ధర్మం" అనే అర్థంలో తప్ప ఈ మాటను సాధారణంగా ప్రయోగించడు.

రాజా రామమోహన్ రాయ్ ని "భారతావనిలో జన్మించిన తొలి అధునాతన మనీషి"గా ఒక రెవరో అభివర్ణించారు. నెహ్రూ ఆ శ్రేణిలో ద్వితీయుడని ఘంటాపథంగా చెప్పవచ్చు. స్వీయచరిత్రలో ఒకచోట తాను ఇటు ప్రాచ్య ప్రపంచానికి కాని, అటు పాశ్చాత్య ప్రపంచానికి కాని పూర్తిగా చెందనని, ఆ రెండు ప్రపంచాలలో కూడా తాను సమానంగా ప్రవాసినని ఆయన వ్రాసుకొన్నాడు. కాని, ప్రాచ్య, పాశ్చాత్య ప్రపంచాలు రెండు విభిన్న, లేదా విరుద్ధ ప్రపంచాలుగా ఈనాడు మిగిలిలేవు. ఆ రెండింటిలో విశేషమైన మార్పులు విస్తృతంగానే కాక, శీఘ్రగతిని జరుగుతున్నాయి.

విమానం, సినిమా, రేడియో, టెలివిజన్, రాకెట్, ఒక్కమాటలో - టెక్నాలజీ- ఈ పరివర్తనాన్ని సాధిస్తున్నది. కడచిన మూడు శతాబ్దాలలో మారినంతగా ప్రపంచం అంతకు ముందెన్నడు మారలేదు. గతించిన అర్ధశతాబ్దిలో మారినంతగా అతఃపూర్వపు మూడు శతాబ్దాలలో మారలేదు. ఈ మార్పు కారణంగా ప్రాచ్య, పాశ్చాత్య విభేదాలకు అతీతమైన ఒక కొత్త సంస్కృతి అద్భుతంగా, అతివేగంగా రూపొందుతున్నది. ఒక కొత్త ప్రపంచమే ఆవిర్భవిస్తున్నది. ఈ కొత్త ప్రపంచానికి నాయకమణులుగా పేర్కొనదగువారిలో నెహ్రూస్థానం మొదటి రెండు, మూడింటిలోనే. అందువల్ల ప్రాచ్య, పాశ్చాత్య ప్రపంచాలు రెండింటిలోనే ఆయన సమానంగా ప్రవాసి కాదు; ఆ రెండింటి మధ్య ఒక సువర్ణ సేతువు నిర్మాత.

నేడు నూతనయుగానికి తగు నూతన ప్రపంచాన్ని రూపొందించడానికి యత్నిస్తున్న మహనీయులలో ఒకడు కనుకనే నిన్న న్యూఢిల్లీలో ఒక విద్యార్థుల సభలో ప్రసంగిస్తూ, యుగం మారిందని, యుగ ధర్మం మారిందని, ఇందుకు తగినట్టు యువకులందరు మారాలని ఆయన ఉద్బోధించాడు. సనాతన ధర్మాలు సనాతనకాలానికే కాని ఈ కాలానికి తగవు; వర్ణాశ్రమధర్మాలు త్వరగా లుప్తమైపోతున్న - లుప్తం కావలసిన -సంఘానికే కాని, మనం లక్షిస్తున్న నూతన సాంఘిక వ్యవస్థకు తగవు. పోతే, ఇప్పుడు కావలసింది మానవ సమత, మానవ స్వేచ్ఛ - ఒక్క మాటలో - మానవత ప్రాతిపదికగా గల నవధర్మం.

యువకులైనవారు యుగధర్మాన్ని పాటించకపోతే, అది దెబ్బ తినదు, తామే దెబ్బ తింటారు. అప్రతిహతంగా సాగిపోవడమే యుగధర్మ లక్షణం. దాన్ని అనుసరిస్తేనే వికాసం; దాన్ని వ్యతిరేకిస్తే వినాశం. వ్యక్తి విషయం లోనైనా జాతి విషయంలోనైనా ఇది "రెండు రెళ్లు నాల్గు"ను పోలిన స్థిరసత్యం. *(ఆంధ్రప్రభ 11-11-1960)*

ఒక మతంగా అమానుషత్వం

అమానుషత్వం నీచమైనదని, నింద్యమైనదని మీరు భావిస్తున్నారా? అయితే, మీరు ప్రతీపశక్తులకు ప్రతినిధులే! నవ సమాజ నిర్మాణ యత్న నిరోధకులే!

ఇవి వ్యంగ్యంగా వ్రాస్తున్న వాక్యాలు కావు. వీటిలో వెటకారం లేదు. కమ్యూనిస్టు చైనా నాయకులు సరిగా ఈ సూత్రాలనే ప్రతిపాదిస్తున్నారు. మానవత బూర్జువా మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందని వారి ప్రగాఢ విశ్వాసం. కారుణ్యం హృదయ దౌర్బల్యానికి చిహ్నమని వారి పరమ సిద్ధాంతం. మానవ సౌభ్రాత్ర లక్ష్యం మార్క్సిజానికి విరుద్ధమైనదని వారి ప్రధాన ప్రబోధం.

ఇంతటి విపరీత సిద్ధాంతాన్ని కమ్యూనిస్టు చైనా నాయకులు ప్రతిపాదిస్తున్నారా? ఇవి వారి పట్ల క్రోధమాత్సర్యాలతో వేసే నిందలు కావా?- ఈ సందేహాలు మీకు రానక్కర లేదు. సోవియట్ రష్యాకు, మావో చైనాకు మధ్య ప్రస్తుతం చెలరేగుతున్న సిద్ధాంత విభేదాలకు ప్రాతిపదిక “మానవత తగునా? తగదా?" అనేదే.

కొత్తగా వెలువడిన ఒక సోవియెట్ తాత్త్విక పాఠ్య గ్రంథం "మూర్తీభవించిన మానవతే కమ్యూనిజం" అని ప్రతిపాదించింది. సోవియెట్ పార్టీ నూతన కార్యక్రమం “కమ్యూనిజానికి కారుణ్యం పర్యాయపదం" అని ఉద్ఘోషించింది. కృశ్చేవ్ “మనం ఏమి చేసినా, చెందినా అది మానవుని కోసమే, అతని బాగుకోసమే” అని ఉద్ఘాటించాడు. సోవియెట్ నాయకులు ప్రపంచలోని అన్ని దేశాలు పూర్తిగా ఆయుధాలను విసర్జించడం మానవతకు పట్టాభిషేకం చేయడం కాగలదని వాదిస్తున్నారు. శాంతియుత సహజీవనం అంతర్జాతీయ రంగంలో అనుసరించదగు ఉత్తమోత్తమ కమ్యూనిస్టు విధానం కాగలదని వారు హెచ్చరిస్తున్నారు.

సోవియెట్ నాయకులు కారుణ్యాన్ని, మానవతను, సహజీవనాన్ని ఈ విధంగా ప్రస్తుతించడం కమ్యూనిజం మూల సూత్రాలకే ద్రోహంచేయడమని మావో సిద్ధాంతీకరిస్తున్నాడు. ఆయన ఈ సిద్ధాంతాన్ని ఆయన సహచరులు బలపరుస్తున్నారు.

అస్పష్టత లేకుండా, ద్వంద్వార్థాలు లేకుండా ఈ విషయాన్ని కమ్యూనిస్టు చైనా అధినేతలు తెగవేసి చెబుతున్నారు, కుండ బ్రద్దలు గొట్టినట్టు చెబుతున్నారు, ఎలుగెత్తి చాటుతున్నారు. క్రితం అక్టోబర్లో చైనీస్ దార్శనిక, సాంఘికశాస్త్ర పీఠాల సంయుక్త సమావేశం జరిగినప్పుడు చౌయాంగ్ ప్రసంగిస్తూ, మానవతను నల్లమందుతో పోల్చాడు. సహజీవనం అంటే చెట్టువలె,చేమవలె పుట్టి, పెరిగి, చావడమే అని పేర్కొన్నాడు. ప్రపంచశాంతిని కోరడం వర్గకలహానికి తిలోదకాలివ్వడమే అని హెచ్చరించాడు.

ఒకనాడు (14-16 శతాబ్దాల మధ్య ఇటలీలో పునరుజ్జీవనోద్యమం పరిఢవిల్లిన కాలం నుంచి, 19 శతాబ్దిమధ్య కాలంవరకు) మానవతావాదం ప్రగతిశీలంతో కూడిన సిద్ధాంతమైనా, అటుతర్వాత అది ప్రతీపశక్తిగా మారిందట. బూర్జువా లక్ష్యమైన మానవతకు పరస్పర వైరుధ్యం కలదట. బూర్జువా మానవత వ్యక్తికి ప్రాధాన్య మివ్వగా, కమ్యూనిస్టు మానవత సమష్టికి పట్టాభిషేకం చేస్తుందట. మానవ వ్యక్తిత్వం, మానవ స్వాతంత్ర్యం, మానవ సౌభ్రాత్రం, మానవ సౌఖ్యం:

ఇవే మానవ జీవితానికి పరమ లక్ష్యాలనడం బూర్జువాలకే తగునట! శాస్త్రీయమైన కమ్యూనిజం ఈ సంకుచిత లక్ష్యాలకు అందని విప్లవకరమైన పురోగతిని సాధిస్తుందట. వ్యక్తిత్వానికి, వ్యక్తి స్వాతంత్ర్యానికి, వ్యక్తిగత సౌఖ్యానికి ప్రాధాన్యమివ్వడం బుద్ధుడు, క్రీస్తు మొదలైన మతప్రవక్తలకే చెల్లునట.

మార్క్స్, ఎంగెల్స్ లు ఆదిలో మానవతవైపు కొంత మొగ్గినా, వర్గకలహమే చరిత్రకు మూల కందమని గుర్తించిన పిదప వారు మానవతను బూర్జువా మౌఢ్యంగా త్రోసిపుచ్చినారట. కమ్యూనిజంతో మానవతకు ముడిపెట్టడం ద్వారా కృశ్చేవ్ మార్క్స్ పట్ల, ఎంగెల్స్ పట్ల మహాద్రోహాన్ని చేస్తున్నాడట.

కృశ్చేవ్ తో విరోధం వచ్చిన తర్వాత ఇప్పుడు కొత్తగా మావో, ఆయన సహచరులు ఏ సిద్ధాంతాలను ప్రతిపాదించడం లేదు. ఆదినుంచీ కూడా వారి విశ్వాసాలివే! ఆదరణ, ఆప్యాయత, దయ, కరుణ: ఇవి విప్లవకారుడు వర్జించవలసిన దుర్గుణాలని మావో చైనాలో మొదటినుంచీ ప్రచారం కొనసాగిస్తున్నారు. వీటిని "వారమ్ ఫీలింగిజం" అని అక్కడ నిరసిస్తున్నారు. క్రౌర్య కాఠిన్యాలను పెంచడానికి, మానవతను కూకటి వేళ్ళతో పెకలించి వేయడానికి, గుండెను రాయి చేయడానికి మరణదండనను అమలు జరపడాన్ని ఆబాల గోపాలం విధిగా చూడాలని తాము శాసించినామని, ఇది సత్ఫలితాలనిచ్చిందని కమ్యూనిస్టు చైనా మంత్రి బాహాటంగా, ప్రగల్భంగా చెప్పుకొన్నాడు. మానవతకు స్వస్తి చెప్పడం కోసమే మావో చైనాలో కుటుంబ జీవితాన్ని భగ్నం చేస్తున్నారు. భార్యా భర్తలు అన్ని వేళలలో కలుసుకోరాదు. అందుకు పక్షానికి ఒకసారి మాత్రం వారికి అనుమతినిస్తారు. పిల్లలు తల్లిదండ్రుల వద్ద వుండడానికి వీలులేదు. వారిని వేరు చేయకపోతే, కుటుంబం మధ్య "వారమ్ ఫీలింగిజం" పెరుగుతుంది. భార్యాభర్తలు, అన్నదమ్ములు, అక్క చెల్లెండ్రు, తల్లిబిడ్డలు ఒకరి పై ఒకరు గూఢచారులుగా పనిచేయాలి. లేకపోతే కమ్యూనిస్టు విప్లవ సాఫల్యానికి విఘాతం కలుగుతుంది.

ఈ విధంగా మానవతను నిర్మూలిస్తున్న, ఈ రీతిగా అమానుషత్వాన్ని పెంచుతున్న మావో చైనా ప్రభావం ఎవరెవరి పై విశేషంగా ప్రసరిస్తున్నదో వారు కిరాతకులవలె, భస్మాసురులవలె, నరరూప రాక్షసులవలె ప్రవర్తించడం అబ్బురమా? తమ విప్లవసాధనకు ఎంతటి నీచ కృత్యాలైనా, నికృష్ట చర్యలైనా సమర్థనీయ మని వారు భావిస్తారు. "రాజ్యాధికారం అనే మొక్క తుపాకి గొట్టంనుంచి పెరుగుతుంది" అని మావో ప్రవచించినందున, ఆయన వాక్కును వేదంగా భావించేవారు ఎంతటి దౌర్జన్యానికైనా, దౌష్ట్యానికైనా, దుర్మార్గానికైనా వెనుదీయరు. *(ఆంధ్రప్రభ 18-6-1961)*

దేవీపూజ

అన్ని దేశాలలోను, అన్ని కాలాలలోను మానవుడు శక్తిని ఉపాసిస్తూనే వున్నాడు. ఇందుకోసం అతడు సంకేతాలను పెట్టుకొంటున్నాడు. మనదేశంలో మనవారు అందుకు పెట్టుకొన్న సంకేతం - దేవి.
తక్కిన జీవకోటినుంచి వేరై, మానవుడు మానవుడుగా రూపొందింది సంకేతాలను పెట్టుకొనగల ప్రజ్ఞాప్రాభవాల కారణాంగానే. నిజానికి, మానవభాషే సంకేతాల సముదాయం. ప్రతి అక్షరం ఒక సంకేతం, ప్రతి పదమొక సంకేతం. సంకేతం లేనిదే భావవ్యక్తీకరణ లేదు.

అయితే, భాషద్వారా కూడా తాను సరిగా వ్యక్తీకరించలేని భావాలు మానవునిలో స్పందిస్తూవుంటాయి. వాటిని వెల్లడించడానికి సంకేతాలను తిరిగి ఆశ్రయిస్తాడు. ప్రపంచ ప్రసిద్ధ తత్త్వవేత్త వైటెడ్ పేర్కొన్నట్టు, భాషేతర సంకేతాలలో భావంకంటే ధ్వని హెచ్చు, వ్యక్తీకరణకంటె స్ఫురణ అధికం. "పదాల శక్తికి మించిన అనుభూతుల పరిపుష్టికి సంకేతాలు వినియోగపడతాయి".

భాష వ్యక్తీకరించగల భావాలకు సయితం స్పష్టరూప మివ్వడానికి, వాటికి పరిపుష్టి కూర్చడానికి భాషతో పాటు మానవుడు కొన్ని సంకేతాలను వినియోగించడం కద్దు. "నమస్కారం" అనడంతో అతడికి తృప్తి లేదు; చేతులను జోడించాలి. "ఔరా!" అనడం చాలదు; ముక్కు పై వేలు వేసుకోవాలి. "ఛీ" అంటే సరిపోదు; పళ్లు పటపట నూరాలి. "సకల సౌభాగ్యరస్తు!" అనడంతో దీవన పూర్తికాదు, అక్షతలను చల్లాలి.

సంకేతాలను ఇంతగా ప్రేమిస్తాడు కనుకనే, ఇంతగా వాటి పై ఆధారపడతాడు కనుకనే, తాను ఉపాసించే శక్తికి సయితం మానవుడు కొన్ని సంకేతాలను పెట్టుకొన్నాడు. "దేవి"కి ఆరాధిస్తున్నందువల్లనే.

"శక్తి" పర్యాయపదం కావడం దేవీ రూపంలో శక్తిని కలదానితో మానవునికి తృప్తి లేదు; అందుకే అతడు కలలు కనడం. నిలిచిన చోట మానవునికి శాంతి లేదు; అందుకే అతడు విశ్వాంతరాళం పై తన దృష్టిని కేంద్రీకరించడం. వ్యక్తతతో మానవునికి సంతుష్టిలేదు; అందుకే అతడు అవ్యక్తానికై నిరంతరాన్వేషణ చేయడం. ఎప్పటికప్పుడు తాను పొందలేని దానికై, తాను చేరలేనిదానికై, తనకు అవ్యక్తంగానున్న దానికై మానవుడు పడే తపన తానల్పుడనన్న భావాన్ని అతడికి కలిగిస్తుంది. తన ల్పత్వంపై విజయానికి మానవాతీతశక్తులను అతడు ఆకాంక్షిస్తాడు. శక్తిని మానవుడు ఉపాసించడానికి మూలమిదే.

అనాదికాలంగా శక్తిని ఉపాసిస్తున్నందునే మానవుడు క్రమానుగతంగా తన పరిసరాల పై విజయాన్ని సాధించగలిగాడు. చివరికి భూమండలం సయితం, దాని గురుత్వాకర్షణ సయితం తనను భూతలం పై బందీగా నిలపలేని స్థితికి ఈనాడతడు వచ్చాడు. ముందు చంద్రమండలం పై, తర్వాత తక్కిన ఉపగ్రహాలపై అతడు తన విజయపతాకను ప్రతిష్టాపన చేయడానికి మరెంతోకాలం పట్టదు. అజ్ఞానానికి, అహంకారానికి లోనై, అణ్వస్త్రాలతో ఆత్మవిధ్వంసన చేసుకొననిపక్షంలో సూర్యకుటుంబానికే అనతికాలంలో మానవుడు అధినాథుడు కాగలడు. జర పై, మృతి పై అతడు విజయాన్ని సాధించగల రోజు వచ్చినా రావచ్చు. శక్తికి సంకేతంగా దేవిని ఆరాధించవలసింది కేవలం నవరాత్రులలోనే కాదు, నిరంతరాయంగా! ఆమె ఆరాధన కొనసాగవలసింది పుష్పం, ఫలం, పత్రం, తోయంతో మాత్రమే కాదు; టెస్ట్యూబ్, టెలిస్కోప్, మైక్రోస్కోప్, సైక్లోట్రాన్ మొదలైనవాటితో కూడా. ఆమెకు

మొక్కవలసింది “నాకు ముక్తి” అనికాదు, “నాకు మోక్షం” అని కాదు! “నా అల్పత్వాన్ని అధిగమించగల శక్తి నాకు ప్రసాదించవలసింది" అని మాత్రమే !!

అయితే, కేవలం మొక్కుబడులవల్ల మానవునికి అపారశక్తులు లభ్యంకావు. తన అల్పత్వాన్ని అధిగమించడానికి అతడు అవిద్యను పారదోలాలి; అజ్ఞానాన్ని నిర్మూలించాలి; అహంకారాన్ని చంపుకోవాలి; స్వార్థానికి కాక, లోకకళ్యాణానికి ప్రాధాన్యమివ్వాలి. శాస్త్రపరిశోధనలను మరింత విస్తృతంగా కొనసాగించాలి; ప్రకృతి రహస్యాలను మరింతగా తెలుసుకోవాలి; పరిసరాల పై ఆధిపత్యాన్ని మరింతగా సుస్థాపితంచేసుకోవాలి; అన్యగోళాల పై పాదం పెట్టాలి; సౌరమండలాన్ని దాటిపోవాలి; పాలవెల్లిలో పాన్పు పెట్టాలి; జరామరణాలను జయించాలి. అప్పుడే నిజంగా శక్తిని ఉపాసించినట్టు! అప్పుడే అతడు నిజంగా దేవినుంచి తాను పొందదగు వరాలను పొందినట్టు !!

(ఆంధ్రప్రభ 27-10-1963)

స్వార్థచింత

“నాకు ముక్తి, నాకు మోక్షం" ఇది స్వార్థచింత కాదా? ఈ ప్రశ్న వేసినంతనే పాపపుమాటలు వినరాదని పెక్కుమంది చెవులు మూసుకోగలరని మాకు తెలుసు. కాని సంప్రదాయసిద్ధమైన ధోరణిలో కాక, స్వతంత్రంగా ఆలోచించ గలిగితే ఒక వ్యక్తి తనకు ముక్తి కావాలని, తనకు మోక్షం కావాలని కోరుకొనడం స్వార్థచింత ధరించే అనేక ఛద్మ రూపాలలో ఒకటి మాత్రమే అని స్పష్టపడుతుంది.

తనకు ధనధాన్యాలు కావాలని, వస్తువాహనాలు కావాలని, ఇతర భోగ భాగ్యాలు కావాలని, లేదా తనకు పదవి కావాలని, ప్రాబల్యం కావాలని, ప్రఖ్యాతిలను కోరేవ్యక్తి పరలోకంలో సుఖపడగోరుతున్నాడు. అది ఇహలోకమైనా, పరలోకమైనా ఉభయులకు కావలసినవి తమ సుఖాలే!

పరలోకంలో సుఖాలను కాంక్షించే వ్యక్తి ఇహలోకంలోనే వాటిని కోరేవారిని చులకనగా చూస్తే ఇహలోకసుఖాలు పరిమితమైనవనే, అశాశ్వతమైనవనే. ఇక్కడనే అనంతసుఖాలు తనకు లభిస్తే, వాటిని ఇక్కడనే భోగించడానికి అతడికి బహుశా అభ్యంతరం వుండదు.

ముక్తిని, మోక్షాన్ని కోరడం స్వర్గలోకంలో సుఖాలను కోరడం కాదని ఆత్మ వెళ్లి పరమాత్మలో లీనం కావాలని కోరుకోడమే అని కొందరు చెప్పవచ్చు. కాని పరమాత్మలో లీనం కావాలని కోరుకొనడమైనా ఆత్మోద్ధరణను, ఆత్మానందాన్ని కోరుకొనడమే కాదా?

ఇది విడ్డూరమైన మాటగా పెక్కుమందికి తోచినా, తనకు ముక్తి మోక్షాలు లభించాలని తపన చెందేవానికంటె తన బిడ్డలు పైకి రావాలని కోరుకొనే తండ్రి అధిక గౌరవపాత్రుడు. కారణం-అతడు కోరుకొనేది తన బిడ్డల బాగునే కాని, తన బాగును కాదు. వారి బాగుకై తన బాగును బలిపెట్టడానికి సయితం అతడు సంకోచించడు.

ఏమైనా, వ్యక్తి కోరవలసింది తనకు ముక్తి మోక్షాలు లభించాలని కాదు; తన సంఘానికి, తన జాతికి, మొత్తం మానవాళికే ముక్తిమోక్షాలు సిద్ధించాలని. సరిగా ఇదే హెచ్చరికను నిన్న లక్నోలో ఉత్తరప్రదేశ్ ఆర్యసమాజం

వజోత్సవసభలో ప్రసంగిస్తూ, జవహర్ లాల్ చేశాడు. ప్రతి వ్యక్తి తన ముక్తి మోక్షాలను సాధించుకొనడానికి కృషి జరపడమే ఉత్తమోత్తమ ధర్మదీక్ష కాగలదని ఉద్బోధించాడు.

'ధర్మం" అనే మాటకు "మతం" అనే అర్థం వున్నా, మతంకంటె "ధర్మం" విపులమైనదని, విశిష్టమైనదని నెహ్రూ తన లక్నో ప్రసంగంలో వివరించాడు కూడా. మతం అనే అర్థంలో ధర్మం ఏ హిందూధర్మానికో, బౌద్ధ ధర్మానికో పరిమితం కావచ్చు. "యుగధర్మం" అన్నప్పుడు మాత్రం ఆయామతవిశ్వాసాలను అనుసరించే వారి అవధులను దాటి, అది విశ్వవ్యాప్తమౌతుంది. అందువల్ల మతధర్మంకంటె కూడా యుగధర్మమే ఉన్నతమైనదని, ఉదాత్తమైనదని నెహ్రూ చెప్పిన మాటను అత్యధిక సంఖ్యాకులు హర్షించలేక పోవచ్చుగాని, విజ్ఞులదృష్టిలో అదే పరమసత్యం.

ధర్మాన్ని సంస్థాపించడానికి, అధర్మాన్ని వినాశంచేయడానికి భగవంతుడు యుగయుగంలో అవతరిస్తాడో, లేదో తెలియదుగాని, కాలాన్ని బట్టి ధర్మం మారుతుందని, ఏ కాలానికి చెందినవారు ఆ కాలానికి సంబంధించిన ధర్మాన్ని (తమ యుగధర్మాన్ని) పాటించడానికి, దాన్ని పరిపోషించడానికి దీక్ష వహించాలని నెహ్రూ లక్నోలో చెప్పిన మాటలు సయితం మననం చేసుకోదగినవే.

ఎవరికి వారు తమ యుగ ధర్మాన్ని గుర్తించి, గౌరవించి, శ్రద్ధాసక్తులతో దాన్ని పాటిస్తే, యుగాని కొకసారి చొప్పున తన వైకుంఠాన్ని వదలి, మహీతలం పై జన్మించవలసిన అవసరం విష్ణుమూర్తికి కలగదు.

బౌద్ధమత గ్రంథాలు అవలోకితేశ్వరుని గురించి ప్రస్తావిస్తూ "ఈ అనంత విశ్వంలో చిట్టచివరి అణువుకు నిర్వాణం లభించేవరకు నాకు నిర్వాణం వలదు" అని ఆయన పలికినట్టు వివరిస్తున్నాయి. అవలోకితేశ్వరుని ఈ మహోదాత్త వైఖరిని పూర్తిగా అవలంబించలేకపోయినా, తన ముక్తి మోక్షాలకోసం కాక, సంఘోన్నతికై, సమాజోద్ధరణకై, ప్రతివ్యక్తి కొంతవరకైనా కృషిచేయాలి. అప్పుడే తన యుగధర్మాన్ని పాటించగలుగుతాడు, అప్పుడే అతని జన్మసార్థక మౌతుంది.

(ఆంధ్రప్రభ 15-5-1963)

మత కలహాలు



ఇది గాంధి శతజయంతి సంవత్సరం. మరి వారం పది రోజులలో దేశ వ్యాప్తంగానే కాక, ప్రపంచవ్యాప్తంగా గాంధి శతజయంతి మహా సంరంభంతో జరుగుతున్నది. హింసావిద్వేషాలతో కల్లోలభూయిష్టమైన మానవాళికి ప్రేమ సందేశాన్ని అందించిన ఈ మహితాత్ముని ఆనాడు దేశదేశాలవారు గౌరవభావంతో సంస్మరించనున్నారు.

ఈ సమయంలో భారతదేశంలో, ముఖ్యంగా ఆయన పుట్టి పెరిగిన గుజరాత్ లో, అందులోను ఆయన రెండు దశాబ్దాలపాటు నివసించి తన అహింసా సందేశాన్ని ప్రపంచానికి చాటిన అహమ్మదాబాదులో హింసాకాండ విశృంఖలంగా చెలరేగడం ఎంత దారుణం, ఎంత విషాదకరం! అహమ్మదాబాదులో, బరోడాలో, గుజరాత్ లోని ఇతర పట్టణాలలో కడచిన అయిదారు రోజులుగా జరిగినవి సాధారణ కలహాలు కావు. అవి మతవిభేదాలను పురస్కరించుకొని ఉత్పన్నమైనట్టివి. అవి ఏదో పెద్ద కారణాన్ని పురస్కరించుకొన్నట్టివైనా కావు; అతి స్వల్పసంఘటన కారణంగా ప్రారంభమైనట్టివి.

చూస్తుండగానే అవి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ప్రాకడం, దోపిడులు, గృహదహనాలు, హత్యలు సయితం యధేచ్ఛగా జరిగిపోవడం సయితం విషాదం కలిగిస్తున్నది. అధికారుల అంచనాల ప్రకారం 94 మంది మరణించారు. కాని, 200 మంది వరకు మరణించి వుండవచ్చునని అనధికారవర్గాల లెక్కలు తెలుపుతున్నాయి. పరిస్థితిని అదుపుచేయడం పోలీసులకు కూడా శక్యం కాకపోవడంతో సైన్యాన్ని పిలిపించవలసి వచ్చింది. హోంమంత్రి చవాన్ చెప్పినట్టు, దేశాన్ని బాహ్య శత్రువుల ప్రమాదం నుంచి కాపాడ్డానికి ఆయత్తమై ఉండవలసిన సైన్యాన్ని దేశంలోనే జాతీయసమైక్యానికి శత్రువులైన వారిని అణచి వేయడానికి ఉపయోగంచవలసిన అగత్యంకలగడం విచారకర వైపరీత్యం కాదా?

మతాలు వేరైనా మానవులందరు ఒక్కటేనన్న మహాదర్శాన్ని గాంధి తన జీవితకాలంలో ప్రబోధించడమే కాక, దానికి అనుగుణంగా తన జీవితాన్ని తీర్చిదిద్దుకొనడమే కాక, దానికోసం తన ప్రాణాన్ని సయితం బలిదానం చేశాడు. ఆధునిక కాలంలో తన జీవితం ద్వారా, తన మృత్యువుద్వారా ఈ మహోన్నతాదర్శాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు మన దేశీయుడైనందుకు, మన మధ్య జీవించినందుకు మనం ఎంతో గర్వించవలసివుంది. అయినా, ఆయన మనదేశంలో జన్మించలేదన్నట్టు, ఆయన దివ్యవాణిని మనం వినలేదన్నట్టు, ఆయన.

ఏ మత సామరస్యపు ఆదర్శం కోసం తన ప్రాణాలను పరిత్యజించాడో అది మనకు తెలియనే తెలియదన్నట్టు, మనం ప్రవర్తించడంకంటె ఘోరాపచారం మరొకటి వుండగలదా? గాంధి ప్రాణబలిదానం చేసి 21 సంవత్సరాలు దాటినా, నేటికీ మత కలహాలు అక్కడక్కడ జరుగుతూనే వున్నాయి. పెద్ద కారణం అక్కరలేదు. స్వల్పసంఘటనలు సయితం విస్తృత సంఘర్షణలకు దారితీస్తున్నాయి. సంఘర్షణలను మొగ్గలోనే త్రుంచివేయక జాప్యం చేయడంలో అధికారుల బాధ్యత కొంత వుండవచ్చు. కాని, ఇది కేవలం ప్రభుత్వాల బాధ్యతమాత్రమే అని చెప్పలేము. వివిధ రాజకీయ పక్షాల, ఇతర ప్రజాహిత సంస్థల బాధ్యత కూడా ఇందులో వున్నది. మతసామరస్య పరిరక్షణకు రాజకీయవిభేదాలకు ఏమీ సంబంధం లేదు. ఏ పార్టీ రాజకీయ విధానాలు ఎట్టివైనా, ఏ పార్టీ అధికారంలో వున్నా, లేదా ఏది ప్రతిపక్షంగా వున్నా, మతసామరస్య ఏ రక్షణ, దానిద్వారా శాంతిభద్రతల రక్షణ మన పవిత్ర కర్తవ్యంగా మనం భావించుకోవాలి. రాజకీయాలకు అతీతంగా ఆ కర్తవ్యాన్ని మనం నిర్వర్తించాలి. దీన్ని నిర్వర్తించడంలో మన అలసత్వమే, వైఫల్యమే దేశంలో తరచుగా చెలరేగుతున్న మతకలహాలకు ముఖ్యకారణం. సత్వర శాంతి సంస్థాపనకోసం, మత సామరస్య సాధనకోసం మురార్జీ దేశాయి, ఇందులాల్ యాజ్ఞిక్ నిరశనదీక్షలు జరుపుతున్నారు. రాజకీయోద్దేశాలతో చేసే నిరాహారదీక్షలు ఖండించ దగినవే. అవి వాటిని చేసేవారి సంకుచిత బుద్ధికి, స్వార్థాపేక్షకు సాధనాలు కాగా, సమాజం సమష్టి శ్రేయస్సు కోసంచేసే నిరశనదీక్షలు, అవి చేస్తున్నవారి హృదయవేదనకు తార్కాణాలు. వారి ఆవేదనను అందరు గౌరవించాలి. వారు నిరశనదీక్షలు చేయవలసిన

అవసరం కలిగించిన వారు అందుకు సిగ్గుపడి, నిరశనదీక్షల విరమణకు దోహదకరంగా తమ ప్రవర్తనను చక్కదిద్దు కోవాలి. గుజరాత్ లో ఆ విధంగా జరగగలదనే ఆశిస్తున్నాము.

ఏది ధర్మం?

ఈతి బాధల నివారణకు, యుద్ధప్రమాద నిరోధానికి విజయవాడ, కనకదుర్గ గుడి ధర్మకర్తలు 50వేల ఖర్చుతో కోటి కుంకుమార్చన, మనోరుద్ర, శతచండి యాగాలను తలపెట్టిన సందర్భంలో, అదే సమయంలో పెనుతుపానుతో ఒరిస్సా అతలాకుతలమైన సందర్భాన్ని పురస్కరించుకుని స్పందించి రాసినది:

అర్చనలు చేస్తే అరిష్టాలు తొలగిపోగలవని కొందరు విశ్వసించవచ్చు; యాగాలు చేస్తే, యజ్ఞాలు చేస్తే యుద్ధాలైనా నిలిచిపోగలవని వారు విశ్వసించవచ్చు. ఇవి మతసంబంధమైన విశ్వాసాలు. మతం విషయంలో, మతసంబంధమైన విశ్వాసాల విషయంలో హేతుదృష్టికి తావు లేదు; తర్కానికి తావులేదు.

"మంత్రాలకు చింతకాయలు రాలతాయా?" అనే సామెత ఈనాడు పుట్టింది కాదు. ఇంగ్లీషు చదువుకొని, "సైన్సులు" చదువుకొని, కొందరు నిందిస్తున్నట్టు, మనం "చెడిపోక" ముందే ఆ సామెత పుట్టింది. అయినా, దానిలోని నిజాన్ని గుర్తించడానికి మతవిశ్వాసాలు అడ్డుగా నిలుస్తూనే వుంటాయి.

ఈ విశ్వాసాల ప్రాబల్యంకొద్దీ ఈతిబాధలనుండి ఇతరేతర బాధలనుంచి మన దేశాన్ని కాపాడ్డానికి కొందరెవరైనా ప్రయత్నం చేస్తే, అందుకు అడ్డు చెప్పడం తగదుగాని, వారి ప్రయత్నం - విజయవాడలో జరగనున్నట్టు - అరలక్ష రూపాయల ఖర్చును తప్పనిసరిచేస్తే మాత్రం మౌనం వహించడం భావ్యం కాదు.

"ఆంధ్రజ్యోతి"లో నిన్న వెలువడిన ఒక వార్త ప్రకారం, ఈతిబాధల నివారణకు, యుద్ధప్రమాద నిరోధానికి శ్రీ దుర్గామల్లేశ్వర దేవాలయం ధర్మకర్తలు అరలక్ష రూపాయల ఖర్చుతో డిసెంబర్ మూడవ తేదీనుంచి, 21వ తేదీ వరకు "కోటి కుంకుమార్చన, మహారుద్ర, శతచండి యాగాలను" జరిపించ బోతున్నారు.

మన ఇరుగు పొరుగు రాష్ట్రమైన ఒరిస్సాలో కనివిని యెరుగని తుపాను దెబ్బవల్ల అతిఘోరమైన కష్టనష్టాలకు లోనై అలమటిస్తున్న వారు లక్షలాదిగా ఇప్పుడున్నారు. పాక్ సైనిక నియంతల దారుణ దౌష్ట్యాల కారణంగా మన దేశానికి, మన రాష్ట్రానికి కూడా కట్టుగుడ్డలతో పారిపోయి వచ్చినవారు మరెందరో ఇప్పుడున్నారు. వీరందరికి తిండి కావాలి, బట్టలు కావాలి, తలదాచుకోడానికి ఆధారం కావాలి, మందు మాకులు కావాలి, ఇతర సహాయాలు అనేకం కావాలి. వ్యక్తులేమి, సంస్థలేమి ఈ లక్షలాది ప్రజల సముద్ధరణకై శక్తివంచనలేని కృషిచేయవలసిన ప్రస్తుత సన్నివేశంలో అర్చనలకు, యాగాలకు అరలక్ష రూపాయలను ఖర్చు చేయబూనడం అనాలోచితచర్య కాబోదా?

తమ దేవాదాయనిధులనుంచి ఈ అరలక్షకు తోడుగా మరొక అరలక్షను భక్తులనుంచి విరాళాల క్రింద సేకరించి, ఒరిస్సా తుపానుబాధితుల సహాయార్థమో, బంగ్లాదేశ్ కాందిశీకులు సహాయార్థమో పంపిస్తే, తాము నమ్ముకొంటున్న దైవమే తమను హర్షించడం జరగదా, ఆశీర్వదించడం జరగదా?

స్వయంసహాయం చేసుకోగల వారికే దైవసహాయం లభిస్తుందనే సూక్తిని ఆస్తికదృష్టిగలవారు ఆమోదించకపోవచ్చు. కాని, వారైనా అన్యులకు సహాయం చేసేవారికే, ఆపదలో ఉన్నవారిని ఆదుకొన్నవారికే దైవసహాయం లభిస్తుందనే సూక్తిని బహుశా కాదనలేరు.

అయినప్పుడు, విజయవాడలో అర్చనలకై, యాగాలకై, తలపెట్టిన ఖర్చు తగునా? ఇప్పుడు కావలసింది "కోటి కుంకుమార్చన" కాదు; జీవితం కుంటువడిన ఒరిస్సా తుపాను బాధితులకు తృణమో, పణమో సహాయం చేయడం ద్వారా "ప్రేమార్చన"! ఇప్పుడు కావలసింది "రుద్రయాగం" కాదు; బంగ్లాదేశ్ కాందిశీకుల కన్నీటిని తుడవడం రూపంలో "కారుణ్యయాగం!!"

విజయవాడ దేవాలయ ధర్మకర్తలు మేము వ్రాస్తున్న ఈ విషయాలను నిర్లక్ష్యం చేయబోరని ఆశించవచ్చునా? ఇంగ్లీషు చదువుకొని, "సైన్సు"లు చదువుకొని "చెడిపోయినవారు" ఇంతకంటె మరేమి వ్రాస్తారని మా హితవును త్రోసిపుచ్చబోరని విశ్వసించవచ్చునా? వారు వ్యయపరచదలచిన అరలక్ష రూపాయలను ఒరిస్సా తుపాను బాధితుల నిధికి, లేదా బంగ్లా కాందిశీకుల నిధికి జమకట్టగలరని అనుకోవచ్చునా?

కేవలం ఈ దేవాలయ ధర్మకర్తలకే కాక, తక్కినవారందరికి ప్రస్తుత సందర్భంలో ఇదే న్యాయం, ఇదే ధర్మం. ఎవరైనా ఇప్పుడు జరపవలసింది - మేము ఇంతకు ముందే వివరించినట్టు - ప్రేమార్చనే, కారుణ్యయాగమే. ఇప్పుడే కాదు, ఎప్పుడైనా ఇవే మనిషిని పెంచగలవు, మహీతలాన్నే స్వర్గంగా మార్చగలవు.

(ఆంధ్రప్రభ 26-11-1971)

హిందూ ఈథాస్ (గ్రంథ సమీక్ష)

ఎన్నడో కాదు, 1947లో రష్యా పేదదేశం, దుర్బలదేశం, వెనుకబడిన దేశం. అదే ఈనాడు యునైటెడ్ స్టేట్స్ తర్వాత ప్రపంచం మొత్తం మీదనే అగ్రరాజ్యం.
అది అమెరికా, రష్యాల తర్వాత అగ్రరాజ్యంగా చెల్లుతున్నది.
ఎన్నడో కాదు, 1944లో రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఘోరపరాజయాన్ని చెంది, పూర్తిగా చితికిపోయింది. అదే ఈనాడు పశ్చిమ యూరప్ లో ప్రప్రథమంగా ఎన్నదగు రాజ్యం.

ఎన్నడోకాదు, 1945లో రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీవలె జపాన్ ఘోర పరాజయం చెందిన దేశం. అదే ఈనాడు ఆసియా మొత్తంలోనే అతి శ్రీమంతమైన దేశం.

ఎన్నడోకాదు, 1949లోనే చైనాలో పాత ప్రభుత్వం పోయి, కొత్తది వచ్చింది. అయినా, ఇంతలోనే అది అమెరికా, రష్యాల తర్వాత అగ్రరాజ్యంగా చెల్లుతున్నది.

పోనీ, అంతకుముందు మనం బ్రిటిష్ దాస్యంలో ఉన్నా, 1947 నుంచి మనది స్వతంత్ర రాజ్యం. ఈ మధ్యనే మన స్వాతంత్ర్య రజతోత్సవాన్ని జరుపుకున్నాము కూడా, మనదేశంలో ఈనాటికి కూడా నూటికి 40 వంతులకు పైగా

ఎందుకు కటిక దారిద్ర్యంలో ఉన్నారు? ఈనాటికి కూడా మనలో నూటికి బహుశా 70 వంతుల మంది ఎందుకు నిరక్షరాస్యులుగా ఉన్నారు? ఈనాటికి కూడా రోగాలు, రొష్టులు మనకు ఎందుకు హెచ్చుగా ఉన్నాయి? ఇంతకంటె కూడా ముఖ్యంగా ఈనాటికి కూడా నైతికంగా మనకు వెన్నెముక లేదేమి?

ఈ ప్రశ్నలకు సమాధానాన్ని వెతకవలసింది మన మెజారిటీ సంఘం - హిందూ సంఘం స్వరూపంలోనే, స్వభావంలోనే, సభ్యతలోనే, సంస్కృతిలోనే వీటి సమష్టి ప్రభావంగా చెప్పదగు "ఈథాస్" లోనే.

ఈ "హిందూ ఈథాస్"ను నిశితంగా పరిశీలించి, దీనిలో ఎక్కడ, ఏయే లోపాలున్నవో, ఈ లోపాలు హిందూ సంఘాన్ని ఎన్నివిధాల, ఎంతగా క్రుంగదీస్తున్నవో వివరిస్తూ సుభయూ దాస్ గుప్త "హిందూ ఈథాస్ అండ్ ది ఛాలెంజ్ ఆఫ్ ఛేంజ్" అనే పుస్తకాన్ని వ్రాశాడు. ఇది "మినర్వా అసోసియేట్స్" ప్రచురణ. (1-బి, లేక్ ప్లేస్, కలకత్తా-29, వెల 36 రూపాయలు)

ఈ పుస్తకం మన పండితులలో కొందరికి నచ్చదు. మన పౌరాణికులు, హరిదాసులు, మన పూజారులు, పురోహితులు, మన స్వాములు, మన పీఠాధిపతులు, వారికి సాష్టాంగ నమస్కారాలు చేస్తున్న మంత్రులు - వారికి ఇది కోపాన్ని తెప్పిస్తుంది. బహుశా వెర్రి గొంగిర్లు పుట్టిస్తుందికూడా. వీరిలో కొందరు అప్పుడే పళ్లు కొరుకుతున్నారు. పిడికిలి బిగిస్తున్నారు. నోరు పారవేసుకుంటున్నారు.

ఇది ఎంత పసగల పుస్తకమో తెలుసుకొనడానికి ఇదొక్కటే ప్రబల నిదర్శనం. ఇది ఆధునిక దృష్టితో కూడిన రచన; అప్రియ సత్యాలను పలకడానికి వెనుదీయని గ్రంథం; మార్పును కోరేవారు, ప్రగతిని కాంక్షించే వారు, ప్రస్తుతపు దుర్బల స్థితిలో, దౌర్భాగ్య స్థితిలో మనదేశం మిగలరాదని తాపత్రయపడేవారు తప్పక చదివి, చర్చించవలసిన పుస్తకం.

- "నిజమే, నీ గతచరిత్ర మహోజ్వలమైనది. కాని మీకు భవిష్యత్తు ఉన్నదా?" అని ఇది ప్రశ్నిస్తున్నది.
- "కడచిన వెయ్యి సంవత్సరాలలో ఎన్నెన్నో యుద్ధాలలో మీరు ఎందుకు ఓడిపోయారు?" అని ఇది ప్రశ్నిస్తున్నది.
- "కడచిన అయిదారు శతాబ్దాలలో యూరప్ ఎంతో ముందుకు వెళ్ళగా మీరు వెనుకనే ఎందుకు పడివున్నారు?" అని ఇది ప్రశ్నిస్తున్నది.
-

ఇందుకు కారణాలుగా అది పేర్కొంటున్న వాటిలో మొదటిది మార్పు అంటే బెదురు, రెండవది పూర్తిగా నమ్మకం ఉన్నా, లేకపోయినా పూర్వాచారాల అనుసరణ; మూడవది కులాన్ని గురించి, కులగౌరవ ప్రతిష్ఠలను గురించి పట్టుదల; నాల్గవది దృష్టిదోషం, అంటుదోషం మొదలైన వాటిని గురించి మూఢభయం; అయిదవది స్వచ్ఛందంగా నిర్ణయాలను తీసుకొనడం పట్ల వైముఖ్యం; ఆరవది ఒకరిపట్ల మరొకరికి నమ్మకం లేకపోవడం; ఏడవది తమ కూపమే లోకం అనుకోవడం; ఎనిమిదవది తమ గతాన్ని గురించిన గర్వం; తొమ్మిదవది భవిష్యత్తును గురించిన ఆందోళనతో జ్యోతిష్కులను, స్వాములను ఆశ్రయించడం; పదవది "ఈ ప్రపంచం మాయ", "దారాసుతులు కాళ్ళబంధాలు", "వెళ్ళిపోయేవేళ పూచికపుల్లయినా వెంటరాదు" అంటూ వేదాంతాన్ని

వల్లిస్తూ, నాలుగు డబ్బులు మూట కట్టడానికి ఎంతకైనా సిద్ధం కావడం; పదకొండవది అహింసను, కారుణ్యాన్ని పరమ ధర్మాలుగా చాటుతూ, సోదర మానవులను ఆర్థికంగా దోచుకొనడం, సాంఘికంగా హింసపెట్టడం.

ఇదేవిధంగా శ్రీ దాస్ గుప్త మరెన్నో విషయాలను పేర్కొంటున్నాడు. ఎంతో పరిశోధనచేసి, ఆయన తన పుస్తకాన్ని వ్రాశాడు. శాస్త్ర దృష్టితో వ్రాశాడు, నిర్భీకంగా వ్రాశాడు. ఎవరికి ఎంత కోపం వచ్చినా, ఎంత బాధ కలిగినా, ఒకటి మాత్రం నిశ్చయం. మన చిత్తవృత్తి లేకపోతే, మనకు మారాలి, మన ఆచార వ్యవహారాలు మారాలి, మన సంఘమే మా ప్రగతిలేదు, భవిష్యత్తులేదు. మార్పు మనకు ఒక సవాలు. దీన్ని ఎదుర్కొనలేకపోతే, మన *(ఆంధ్రజ్యోతి 30-10-1972.) సంఘం, మన దేశం ఇప్పటివలె నీళ్లు కారుతూనే ఉంటుంది.* దుష్టగ్రహాలు

అష్టగ్రహకూటమట, అందువల్ల ప్రపంచానికి ఘోరారిష్టాలు తప్పవట, జల ప్రళయమే రావచ్చునట, ప్రపంచాన్నే అది తుడిచి పెట్టవచ్చునట! ఇట్టి పరమ మూఢ విశ్వాసాలతో భయవిహ్వలులౌతున్న వారి ప్రపంచం నిజంగానే సర్వనాశమైపోతే, అంతకంటే వాంఛించదగు శుభపరిణామాన్ని మామట్టుకు మేము ఊహించలేము!!

వైజ్ఞానిక శాస్త్రాలు ఎంతగా పురోగమిస్తేనేమి? ఎన్నెన్ని సృష్టి రహస్యాలను సభ్యమానవుడు ఛేధిస్తేనేమి? చంద్రమండలయాత్రకై సన్నాహాలు సాగుతుంటే మాత్రమేమి? అంగారక గ్రహంలో అడుగు పెట్టడం సుసాధ్యమైన సమయం ఆసన్నమైతే మాత్రమేమి? పాతపంచాంగాలనే ప్రామాణిక శాస్త్రాలుగా పరిగణించే వారున్నారు; మంత్రాలతో చింతకాయలు రాలగలవని విశ్వసించేవారున్నారు. వారే అష్టగ్రహ శాంతులను చేయిస్తున్నారు. ముప్పొద్దుల కడుపునిండుగా కూటికైనా నోచుకొనని ఈ పేదదేశంలో ఎంతో డబ్బును హోమగుండాలలో మసి చేస్తున్నారు. ఇందువల్ల అష్టగ్రహశాంతి జరిగినా జరగకపోయినా, ప్రజామౌఢ్యాల పరిపోషణనే వృత్తిగా చేసుకొన్న దుష్టగ్రహశాంతి జరగడం మాత్రం ముమ్మాటికీ నిజం!

దీన్ని నిశిత విమర్శగా భావిస్తుంటే, “కాదు” అని మా మనవి. గాంధిని పోలిన మహాపురుషుడు "జ్యోతిషం ఒక శాస్త్రమైతే, అది సందేహించదు ప్రాధాన్యంతో కూడిన శాస్త్ర" మని ఉద్ఘాటించాడు. “అంతటి గొప్ప గ్రహాలకు మనవంటి అల్పజీవుల పై విశేషమైన ఆసక్తిదేనికి?” అని జవహర్లాల్ ఎగతాళితో కూడిన ఒక ప్రశ్న వేశాడు. అయినా, విద్యావేత్తగా, విజ్ఞానవంతుడుగా (మన దౌర్భాగ్యం వల్ల) చెల్లుతున్న శ్రీ సంపూర్ణానంద్ అష్టగ్రహకూటం వల్ల ప్రపంచానికి ఘోరారిష్టాలు విస్తృతంగా వాటిల్లనున్నవనే వారిని బలపరచడానికి ముందుకువస్తున్నాడు!

అయినప్పుడు మనకు వేధశాలలు దేనికి? ఖగోళశాస్త్ర పరిశోధనలు దేనికి? ఇతర వైజ్ఞానికశాస్త్ర పరిజ్ఞానం దేనికి? ఇక “సైన్సు” పుస్తకాలన్నిటిని చించి పారవేయవచ్చు; నేషనల్ లాబొరేటరీలన్నింటికి నిప్పు పెట్టవచ్చు; మంత్ర మహిమతో బొందితోనే కైలాసానికి వెళ్ళవచ్చు.

ఏమైనా, రేపు ఫిబ్రవరి 5వ తేదీన (ఖగోళ శాస్త్రజ్ఞులు చేస్తున్న ప్రకటనల ప్రకారం) సంపూర్ణ సూర్యగ్రహణాన్ని మించిన పెద్దవిడ్డూరం జరగబోవడం లేదు. కాని, రాహుకేతువులు రాక్షసులని, వారు సూర్యచంద్రులకు తాత్కాలికంగా కలిగించే ప్రమాదాలే గ్రహణాలని నమ్మేవారికి ఎవరేమి చెప్పినా ప్రయోజనం పూజ్యమే!

అష్టగ్రహకూటం దుష్టఫలితాల మాట అటుండగా, ఖగోళ శాస్త్రజ్ఞులు కొందరు పేర్కొంటున్నట్టు, ఫిబ్రవరి 5వ తేదీని ఎనిమిది గ్రహాలు ఒకచోట సమావేశం కాబోవడం లేదు. ఆనాడు రెండే రెండు గ్రహాలు సూర్యచంద్రులకు కొంత చేరువగా వస్తాయి; మరి మూడు ఆ రాశితో వుంటాయి. ఇంతేకాక, మన జ్యోతిశ్శాస్త్రం గ్రహాలుగా పేర్కొంటున్నవన్నీ గ్రహాలు కావు ఉదాహరణకు, రవి ఒక గ్రహం కాదు; అది నక్షత్రం. భూమి, కుజుడు, అంగారకాది గ్రహాలవరి చంద్రమండలం గ్రహం కాదు, ఉపగ్రహం మాత్రమే. ఇంతటితోనైనా సరిపోలేదు. మన పంచాంగకర్తలు సృష్టించిన గ్రహాలలో కొన్ని ఎంతటి దూరదర్శిని యంత్రసాధనాలకైనా అందనం ఊహాజనిత గోళాలు. కొత్త ఖగోళశాస్త్రం దారి ఒకటికాగా, పాతపంచాంగం నమ్మకాల దారి మరొకటి!

పోనీ, పాత పంచాంగాన్ని నమ్మేవారందరు ఒకే విధమైన ఫలితాలను చెబుతున్నారా అంటే, అదీలేదు. ఎందరు పంచాంగకర్తలుంటే, ఎందరు జ్యోతిశ్శాస్త్రవేత్తలుంటే, అన్ని విభిన్నాభిప్రాయాలు వినవస్తున్నాయి. ఇదెంత హాస్యాస్పద విషయమో తెలియజెప్పడానికే "టైమ్స్ ఆఫ్ ఇండియా" పత్రిక నిన్న తన సంపాదకీయంలో ఉదహరించినట్టు - పంచాంగకర్తలు ఎనిమిది దుష్ట గ్రహాలను సృష్టిస్తే, తాను పద్దెనిమిది శుభగ్రహాలను సృష్టించగలనని ఖగోళశాస్త్రంలో మహాపండితుడు, సింహళం ఖగోళశాస్త్రజ్ఞుల సంఘానికి ప్రెసిండెంట్ ఆర్దర్ సి. క్లార్క్ అన్నాడు!

ఈ విషయాలన్నింటికి మేము వ్రాయడం ఆగ్రహంతో కాదు, ఆవేదనతో. ఆవేశంతో కాదు, అన్యదేశాలవారు మనలను చూచి నవ్వవచ్చునన్న సిగ్గుతో, బాధతో! కాకమ్మ కథలనే ఇంకా మనం నమ్మితే, పుక్కిటి పురాణాలనే ఇంకా మనం శాస్త్ర గ్రంథాలుగా పరిగణిస్తే, ఎప్పటికైనా మన ఇండియానుంచి ఒక “లూనిక్” గ్రహాంతరయానానికి బయల్దేరగలదా? ఎన్నటికైనా మన ఇండియాకు చెందిన ఒక గగారిన్, లేదా ఒక టిటోవ్ రోదసీగర్భంలో భారతీయ శేముషీ పతాకను ప్రతిష్ఠిపించగలడా? *(ఆంధ్రజ్యోతి 1 - 30 -1962)*

మతం - 2:

ఉపనిషత్తులు ఉపక్రమణిక

ఉపనిషత్తులకు “వేదాంత” మని నామాంతరం. సామాన్యార్ధంలో వేదాల చివరి భాగాలని అర్థం. ఇంకో అర్ధంలో జ్ఞానం అత్యున్నత దశ అని. ఇంకా అర్థాన్ని కొనసాగిస్తే జ్ఞానం . అంత్యదశ అని. అనేక సంవత్సరాల అధ్యయన ఫలితంగా నేను మూడవదే సరియైనది, సత్యమైనదిగా రూఢిపరచుకున్నాను. భారతదేశంలో జ్ఞానం పెరుగుదలకు ఉపనిషత్తులే ఒక అంతాన్ని నిర్దేశించాయి. హిందూమత ప్రామాణిక గ్రంథాలుగా చలామణి అవుతున్న బ్రహ్మసూత్రాలు, యోగసూత్రాలు, భగవద్గీత వంటి రచనలకు అవి దారితీసినా, అందులో ఉన్నదంతా ప్రాథమిక ఉపనిషద్భావాల శకలాలే. తరువాత భారతీయ వేదాంతం మీద వచ్చిన రచనలు, కూర్పులు, చేర్పులు తత్త్వశాస్త్రంగా ముద్రవేసుకున్నప్పటికీ, అవి ప్రధానంగా ఉపనిషత్తుల మీద పూర్తిగా ఆధారపడ్డవే. వాటి ప్రాధాన్యతే అట్టిది. మరి వాటికి నేను కొంత చేరిస్తే? - పూర్తిగా నిరుపయోగం కదా.

ఇది పూర్తిగా తుడిచి వేయవలసిన ఖండన కాదు. ఉపనిషత్తులలో అక్కడక్కడా మినుకు మినుకుమనే సత్యాల్ని మినహాయిస్తే, అవి మానవుడి గురించి, అతని జీవితాన్ని గురించి, అతడి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గురించిగాని చెప్పిందేమీలేదు. అక్కడక్కడా సూటిగా ఉన్న ఉపమా రూపకాలంకారాలు కవిత్వం తప్ప, ఉపనిషత్తులలో భావం గాఢమైనదీకాదు, పైగా రహస్యమాజ్ఞానం. దానికోసం నటన తప్ప ఉపనిషత్తుల్లో జ్ఞానబోధ మాత్రం మృగ్యం. ఆనాటి ప్రాథమిక గ్రామీణ సామాజిక, ఆర్థిక స్థితి గతులు, చిన్న చిన్న రాచరికాలు, రాజాస్థానాలు, దురహంకార పూరితులైన పురోహిత వర్గం, వారి వంచనలు ఉపనిషత్తుల్లో మనకు కోకొల్లలుగా దర్శన మిస్తాయి. వీటికితోడు నామ మాత్రంగా ఆనాటి జీవన విధానం గురించి ‘లోహయుగా’రంభ ప్రాథమిక దశల్లోని ప్రాథమిక భావనలు మనకు దర్శన మిస్తాయి.

అంతేగాక మనలను దిగ్భ్రాంత పరచే నీచమైన పదజాలంతో కూడిన సమాచారం కూడా ఉపనిషత్తుల్లో ఉంది. భౌతిక శరీరాన్ని, పంచేంద్రియాలను, మనస్సును, అనుభవ జ్ఞానాన్ని, చివరకు ఈ ప్రపంచాన్ని కూడా ఉపనిషత్తులు తీవ్ర పదజాలంతో నిరసించాయి. స్త్రీలపై అసభ్యమైన, అధమాధమమైన పదజాలాన్ని వాడాయి. ఉపనిషత్తులు స్వప్నాలు లేని నిద్ర (సుషుప్తి) ను పొగిడాయి, అంతకన్నా మృత్యువును (మోక్షాన్ని) కీర్తించాయి. అంతకంటె ఎవరైతే 'పురుషు'ణ్ణి (పరమాత్మను) గురించి జ్ఞానాన్ని పొందామని చెప్పుకుంటారో వారికి హత్యలు చేయడానికి అనుమతి నిచ్చాయి. అహేతుకమైన, అసంగతమైన, పరస్పర విరుద్ధమైన భావాలతో అనంత సాగరమంత అజ్ఞానంలో అణువంత జ్ఞానం మాత్రమే ఉపనిషత్తుల్లో ఉంది.

ఉపనిషత్తులమీద నా భావాలను అక్షరబద్ధం చేయడానికి అనేక సంవత్సరాలు వెనుక ముందాడాను. నేను ఏవైతే సత్యాలుగా నిర్ధారించుకొని ఇన్ని సంవత్సరాలకు వాటిని బయట పెట్టదలచుకున్నానో వాటినెవరు చెవిన పెడతారు? నేను అతి తీవ్రమైన, హింసాయుతమైన నిందారోపణలకు గురౌతానా? కాని ఇప్పుడు నేను నా జీవన సంధ్యా సమయానికి దగ్గరగా ఉన్నానని తలుస్తున్నాను. హేతుబద్ధత, సత్యతత్పరత, బుద్ధి స్థిరత నా మీద ప్రభావం చూపి నా అంతరంగ సత్యాన్ని బయల్పరచడానికి తొందరపెట్టాయి. తత్ఫలితంగానే నేను “ఉపనిషత్తుల మీద

వ్యాసం"తో మీ ముందున్నాను. దీన్ని ఆక్షేపిస్తారా? ఆక్షేపించండి. నన్ను నిందిస్తారా? తప్పకుండా, కాని ముందుగా దీనిని చదవండి:

చివరగా నన్ను ఈ రచనకు ప్రేరేపించిన బుద్ధిహీనులైన ఉపనిషద్భక్తుల పేర్లను బయల్పరచకపోయినా వారి ద్వారా పరోక్షంగా ఈ రచనకు నేను పొందిన ఉత్సాహ ప్రోత్సాహాలకు వారికి కృతజ్ఞతలు తెలుపడం నా విధి.

ఉపనిషద్వ్యాసాలు : తృణ కర్షకులు

ప్రప్రథమంగా ఉపనిషత్తంటే ఏమిటి? తోకకు తోక, తోకకు తోక, తోకకు తోక అని. ఇది చులకన చేయడమా? కాదు, కానే కాదు. ఇది పూర్తిగా బాధ్యతతోను సత్యంతోను చేస్తున్న వ్యాఖ్యే. ఏ వేద పండితుడైనా నీకు తెలిపేదేమంటే బ్రాహ్మణమంటే వేదాలకు వ్యాఖ్యానమనే. అరణ్యకాలంటే మళ్ళీ బ్రాహ్మణాలకు వ్యాఖ్యానమనే, చివరిగా ఉపనిషత్తంటే మళ్ళీ అరణ్య కాలకు అర్థ వివరణనే. ఒక్క ఈశావాశ్యోపనిషత్తు మినహాయిస్తే అంతా అదే మూస, అదే పద్ధతి. కనుకనే ఉపనిషత్తంటే తోకకు తోక, తోకకు తోక, తోకకు తోకనే.

మృతప్రాయమైన ఈ వేదవాఙ్మయం స్థూల పూరక లక్షణమే ఇది. ఒకే శకానికి గాని, ఒక ప్రాంతానికి గాని, ఒకే రచయితదని గాని, ఒక ప్రత్యేక సాంఘిక వ్యవస్థకు గాని చెందదని చెప్పడానికి ఒక విస్పష్ట నిదర్శనంగా ఉంది. క్రీ.పూ. 15వ శతాబ్దంలో ఆర్యుల దండయాత్రలలో సప్తసింధు ప్రాంతంలో ఉద్భవించిన ఈ స్థితి మరో వేయి సంవత్సరాలలో గంగా తీరమైదాన ప్రాంతాల్లోని పురోహిత రాజవర్గాల్లో వ్యాపించడంతో ముగిసింది. ఈ సహస్రాబ్ద కాలంలో సాంఘిక వ్యవస్థ స్వరూపంలో, ఆర్థిక స్థితిగతుల్లో, ఉత్పత్తి, పంపిణీ, వినియోగ వినిమయాల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. వీటికి తోడు ప్రాపంచిక దృష్టిలో కూడా. ఈ మార్పులన్నీ క్రమంగా వేదాలనుండి బ్రాహ్మణాలకు, వాటి నుండి అరణ్యకాలకు, మళ్ళీ వాటినుండి ఉపనిషత్తులకు ప్రసరించాయి. ఆనాటి సమాజం దాసులు, దస్యులు, ఇతర విధాలైన తెగలకు మాత్రమే ప్రతికూలంగా లేదు. నిరంతరం యుద్ధం, జగడాలతోనే నిండి ఉంది.

ఆ సమాజంలో హతుడు కావడమో, హంతకుడు కావడమో రెండే పద్ధతులు. క్రమంగా ఈ స్థితి భిన్నమైన ప్రపంచానికి దారితీసింది. ప్రతికూల తెగలన్నీ ఓడించి తరిమివేయ బడ్డాయి. రక్షణ కోసం దేవతలను ప్రార్థించే అవసరం లేకుండా పోయింది. క్రమంగా శాంతి భద్రతలు నెలకొన్నాయి. క్రొత్త, క్రొత్త ఆరామాలు, ఆవాసాలు నిర్మించబడ్డాయి. ఇంద్రాది యుద్ధ దేవతల స్థానాన్ని నిర్గుణ బ్రహ్మ ఆక్రమించాడు. అప్పటిదాకా ఉన్న యుద్ధభూమి క్రమంగా క్రొత్త భావనలు, విశ్వాసాలు, పిడివాదాలు, నమ్మకాలు, సిద్ధాంతాలు ప్రతిపాదించే వారి యుద్ధ భూమిగా మారింది. ఇది క్రమంగా వచ్చిన మార్పే కాని హఠాత్తుగా ఊడిపడింది కాదు. ఒక్కొక్క దశ రెండో దశలో అగోచరంగా లీనమౌతూ వచ్చింది. అందువల్లనే ఉపనిషత్తుల కొన్ని ప్రాథమిక భావనలు మనకు ముందుగా ఋగ్వేదంలోనే దర్శనమిస్తాయి.

వివరంగా చెప్పాలంటే ఋగ్వేదారంభానికి ఆనాటి యోధుడే ఆద్యుడు. అతడే పురోహితుడుగా కూడా వ్యవహరించాడు. తరువాతే రాజ పురోహితులు వ్యవస్థితమయ్యారు. రాజు - పురోహితుల రాజీ ఫలితంగానే

ఉపనిషత్తులావిర్భవించాయి. ఉపనిషత్కాలానికి రాజే ఆరంభకుడైనా దానిని తీర్చిదిద్దిన వాడు పురోహితుడే. అతడే దానికి కర్త, యజమాని, భగవంతుడు.

ఋగ్వేద నేపథ్యం అంతా రణరంగ రక్తసిక్తమే. దాన్ని పరిశీలిస్తే గంద్రగొద్దళ్ళ, ఖడ్గాల ఝళిపింపులు, దూసుకు వచ్చే బాణాల బరిసెల విసురు ధ్వనులూ వినవస్తాయి. ఈ స్థితికి పూర్తి వ్యతిరేకంగా ఉపనిషత్ నేపథ్యం గోవుల అంబా రవాలు, వాటి డెక్కల ధ్వనులతో నిండివుంటుంది. ప్రసిద్ధ ఆంగ్లకవి డబ్ల్యు. బి. ఈట్స్ తనకు ఉపనిషత్తులతో ఉన్న పరిచయం స్వల్పమైనప్పటికీ తన నిశిత పరిశీలన ద్వారా ఉపనిషత్కారులందరినీ "తృణ కర్షకులు"గా నిర్ణయిస్తూ తేట తెల్లం చేశాడు.' ఉపనిషత్కాలపు మునులకు, రుషులకు ఇది సరియైన వర్ణనే. వారు విరాగులు కారు, వివాహితులు. కొందరు బహుభార్యాలోలురు. వారు బహు కుటుంబీకులు. మంచి ఆహారాన్ని, సోమరసాన్ని (మద్యం) ఇష్టపడేవారు. పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవించిన వారు. ఎప్పుడైతే పురోహితపరంగా వచ్చే వారి ఆదాయం యజ్ఞ యాగాదుల్లో బలుల పేరిట వెచ్చించవలసి వచ్చిందో, క్రమంగా ఆదాయం తగ్గడంతో యజ్ఞ యాగాదుల పట్ల, బలుల పట్ల వారి వైముఖ్యం హెచ్చింది. అంతటితో వారు గ్రామాలను ఖాళీ చేసి అరణ్యాల నాక్రమించ సాగారు. అప్పటికి ఇనుప పనిముట్లు ఇంకా కొఱతగానే ఉన్నప్పటికీ వారు అగ్ని ద్వారా అరణ్యాలను దహించి ఆ తరువాత వాటి నాక్రమించారు. దుర్గమమైన, ఆదిమమైన అరణ్యాల నాక్రమించడానికి వాటిని సాగుభూములుగా మలచడానికి వారికి విపరీతమైన పెట్టుబడి, శ్రామికశక్తి కావాల్సి వచ్చింది. కానీ వారు చాలా సులభంగా ఇంచుమించు వెంబడే వాటిని గడ్డిని పెంచే క్షేత్రాలుగా మార్చారు. ఆ గడ్డినే గ్రాసంగా ఉపయోగించి గణనీయమైన సంఖ్యలో ఆలమందలను పెంచారు. ఆనాడు తపోవనాలుగా పిలువబడ్డవన్నీ నిజానికి అరణ్యాలనాక్రమించి మలచబడ్డ గోశాలలే. ఈ విధమైన ఊహ చాలా కాలం నుండి నేను కలిగి ఉన్నప్పటికీ ఈ ఊహను కేవలం ఈట్స్ మాత్రమే కాక ప్రసిద్ధ జర్మనీ పండితుడు ఎరిక్ ఫ్రావాల్నర్ కూడా బలపరుస్తూ తన భారతీయ తత్వ శాస్త్రంలో ఈ విధంగా వ్రాశాడు.

> *ఉపనిషత్తులే విధంగా ఆవిర్భవించాయి అనే విషయాన్ని తెలుసుకొనగోరితే అందులోని సారాంశమే మనకు ఒక మంచి భావనను అందిస్తుంది. ఉపనిషత్తుల్లో అల్లిన వర్ణనలు, అందులో గుదిగుచ్చిన కథలు, వాటిలో అనివార్యంగా చొప్పించిన సిద్ధాంతాలు, ఆ కాలపు జీవన చిత్రణే నిదర్శనం. ప్రత్యేకించి ఆనాటి బ్రాహ్మణ వర్గాల జీవితం, వారి చుట్టు ఉన్న బాహ్య పరిస్థితులు, మేధోపరమైన వారి అవసరాలు చాలా బాగా చిత్రీకరించబడ్డాయి. అది పూర్తిగా గ్రామీణ జీవితం. చర్యలు, ప్రతి చర్యలు - అన్నీ గ్రామీణ జీవనానికి ప్రతిబింబాలే. పశుగణం ప్రధాన సంపదగా ఎంచబడ్డది. పశుగణాభి వృద్ధితోనే వారి సౌభాగ్యమూ ముడి పడ్డది. రాజాస్థానాలుగా పిలువబడ్డ, ఆనాటి విధేయులైన రాజులు ఏనాడూ తమ పరిధుల నతిక్రమించలేదు. ఈ చిత్రణ బౌద్ధ పిటకాల్లో వర్ణించిన నగర జీవన చిత్రణకు పూర్తి విరుద్ధంగా మన నేత్రాల ముందు గోచర మౌతుంది.*

తరువాత మనం యాజ్ఞవల్క్యుని గమనించినట్లయితే ప్రాథమిక ఉపనిషత్కాలానికి అతడు పశుగణాభివృద్ధి కొరకు, క్షీరోత్పత్తి కొరకు ఏర్పాటు గావించబడ్డ పెద్ద గోశాలకు అధిపతిగా దర్శనమిస్తాడు. గోవు, గో యజమాని ఒక విడదీయరాని బంధంగా పెనవేసుకొని ఉపనిషత్తుల్లోను, వాటి భావనల్లోను మనకు దర్శనమిస్తాయి.

విద్యార్థులే పశుకాపరులు

ఆదిమ సమాజంలోని ఆలోచన ఆదిమ ఆర్థిక వ్యవస్థ మీద ఆధారపడటం వలన తప్పనిసరిగా ఆదిమంగానే ఉంటుంది. ప్రపంచంలోని ప్రధాన మతాలన్నీ ఆదిమ సమాజం నుండి ఉద్భవించాయి. కనుకనే అన్ని మతాల రచనలు తప్పనిసరిగా 'ఆదిమ' ముద్రను కలిగి ఉంటాయి. ఇది మత దూషణకాదు. నిష్ఠురమైన బహిరంగ సత్యం. మాక్స్ ముల్లర్ను సందేహ వాదిగానో, పాషండుడిగానో ఎవ్వరూ అనుమానించ నక్కరలేదు. అతడు పవిత్ర క్రైస్తవ మతాచరణవాది. తన జీవితంలో ఎక్కువభాగం ప్రపంచ మతాల అధ్యయనంలోనే గడిపాడు. భాషోత్పత్తి శాస్త్రాన్ని, తులనాత్మక పురాణ వాఙ్మయాన్ని అధ్యయనం చేసినా అవి ఆయనకు ఉపాంశాలే. ఆయన 'ప్రాచ్య పవిత్ర గ్రంథాలను' (The Sacred Books of the East) ఎడిట్ చేశాడు. వాటి ప్రచురణ చాలా భారీ ప్రణాళికే. అవి పూర్తయ్యే సరికి యాభై భారీ సంపుటాలుగా తేలాయి. ఈనాటికీ ప్రాచ్యమతాలు అధ్యయనం చేసే ఏ విద్యార్థికైనా అవి ఆధారాలే. 1876లో ఆ సంపుటాలకు ముందుమాట రాస్తూ మాక్స్ ముల్లర్ ఆ పవిత్ర గ్రంథాలను "గత కాలపు శిలలు"గా వర్ణించాడు. ఆయన దృష్టిలో అవి "ఈ భూగోళ చరిత్రలోని కొన్ని చీకటి పుటలపై కొంత వెలుగు ప్రసరించినప్పటికీ, అవి శిలాజరూపం పొందిన మొక్కలు, శిధిలమైన కంకాళాలు మాత్రమే." ఏది ఏమైనప్పటికీ మాక్స్ ముల్లర్ వాటిలో చెడునేగాక, కొంత మంచిని కూడా చూచాడు. ఈ క్రింది ఉల్లేఖన దానిని గూర్చి పూర్తి చిత్రణనిస్తుంది.

"నిజం నేను ఒప్పుకుంటున్నాను. చాల సంవత్సరాలు అవి నాకు సమస్యగానే ఉన్నాయి. అవును, ఇంకా ఇప్పటికి కూడా, ప్రాచ్య పవిత్ర గ్రంథాలు చాలా వరకు నేటికీ వర్తమాన కాలికంగా, స్వాభావికంగా, సులభంగా, సత్యసుందరాలుగా ఉంటూనే మరోవైపు అర్థరహితంగా, కృత్రిమంగా, బుద్ధిహీనంగా, అంతకన్నా వికారంగా తిరోగమన కారకాలుగా ఉంటాయి[3]".

ఇంకా మాక్స్ ముల్లర్ ఆ ప్రాచీన ప్రమాణ గ్రంథాలను ఎవరైతే ప్రచురించారో, అలా ప్రచురించడంలో వారు మోసంతో అణచివేసిన భావాలు ఎంత అనాగరికంగా, నీచంగా, ఆశ్చర్యజనకంగా ఉంటాయో చెబుతూ
"మనం వారి వివేకాన్ని మాత్రమేకాదు అవివేకాన్ని కూడా తెలుసుకోవాలి. మనకు ఏ మాత్రం పరిచయం లేని స్వర్గం వంటి ఊహల అంచులకు వారి దృక్కులు ఎలా ప్రసరించాయో మాత్రమే గాక వారి ఆలోచనలు ఎలాంటి శిథిలతత్వ మార్గాలు, చీకటి బిలాలు, పాపపంకిల మార్గాల గుండా కూడా పయనించాయో, అనంతత్వాన్ని గురించి వారు చేసిన ఆలోచనలలో వారి మేధ ఏ మేరకు ఎగుడుదిగుడులను చవిచూసిందో దానికి మనం ఏమాత్రం ల చెందవలసిన అవసరంలేదు[4]."

ఏమైనప్పటికీ, ఆదిమజాతుల ఆలోచనా పరిధి వారి తెగలను దాటి బయటకు వెళ్ళలేదు. వారు ప్రపంచాన్నో, విశ్వాన్ని గురించి ఊహిస్తున్నారంటే, వారి మనస్సుల్లో ఉండే ఆ ప్రపంచం, ఆ విశ్వం ఆ తెగవరకే పరిమితం. అంతకుమించి మనమేమైనా ఊహిస్తే వారి మనస్సును, దాని శక్తిని గురించి అధికంగా అంచనా వేసినట్లే. ఈ ఊహను, అంచనాను బహుశః ఈ వ్యాసాల చివర నేను రుజువు చేయగలనని ఆశిస్తున్నా. ఇంతకీ నేను చెప్పొచ్చేదేమంటే, ఉపనిషత్తులు వాటి తలపుల్లోను, ప్రాయికంగా భావనల్లోనూ ఆదిమమైనవి, ఆసాంతం అసంబద్ధమైనవి. ఆ విధంగా ఉపనిషత్కారులంతా విద్యను వ్యాపారంగా మార్చిన సిగ్గుమాలిన వాణిజ్యవేత్తలే.

పెద్ద సంఖ్యలోగల ఆలమందలను తగినంతమంది పశుకాపరులు లేకుండా ఎవరూ పోషించలేరు. ఉపనిషత్కాలంలోను, వాటికి ముందున్న అరణ్యకాల కాలంలోను భారతదేశ జనాభా చాలా పలుచగా ఉండేది. బహుశః పదిమిలియన్ల కంటే కొంచెం తగ్గవచ్చు. అందులో ఆర్యులనబడేవారు ఒక మిలియను ఉండవచ్చు. ఏ పరిస్థితులలోను ఆనాటి శ్రామిక వర్గాలవారు ఏ (రాజు-పురోహితవర్గం మినహా మిగిలినవారు) అంతటి సంఖ్యలో పశుకాపరులకు వేతనమిచ్చి నియమించడం సులభసాధ్యంకాదు. బహుశా అసాధ్యమేమో. అందువలనే ఋషులు వారి పశుశాలలనే విద్యాలయాలుగా మార్చి వీలైనంతమంది ఎక్కువ విద్యార్థులను చేర్చుకొనడం మంచిదని భావించారు. వారికి భోజనాది వసతి సదుపాయాలు సమకూర్చి ప్రతిఫలంగా వారి పశువులను మేపుకురావడం, పాలుతీయడం, పెరుగు, వెన్న, నెయ్యివంటి క్షీరోత్పత్తులను తయారు చేయడం, వంటకు కావలసినపుల్లలు ఏరుకురావడం, యజ్ఞయాగాది నిత్య నైమిత్తికాలకు కావలసిన సమిధలు సమకూర్చడం వంటి కార్యక్రమాలకు నియోగించేవారు. ఇంకా కొన్ని సందర్భాలలో వారు గురువు పనుపున భిక్షాటన చేసేవారు. విద్యాబోధనకు నియమిత కాలమంటూలేదు. అంతా దైవాధీనంగాను, ఉపేక్షభావంతోను ఉండేది. పేరుకే విద్యాబోధనగాని, నిజానికది కట్టుబానిసత్వం.

విద్యార్థుల నుండి వీలైనంత ఎక్కువ సేవలు పొందడానికి వారిని సాధ్యమైనంత ఎక్కువకాలం విద్యాలయాలనబడే పశుశాలల్లో ఉంచేవారు. విద్యాబోధనకు సాధారణంగా పండ్రెండు సంవత్సరాల కనీస కాలపరిమితి ఉండేది. ఒకానొక ఉపనిషత్తులో ఇంద్రుడు తన గురువైన ప్రజాపతిని 101 సంవత్సరాలు సేవించినట్లు చెప్పబడ్డది. ఇంద్రుడు, ప్రజాపతి విద్యాపాత్రలుగా చెప్పుకున్నా, పై వ్యాఖ్య ప్రధానంగా తీసుకొన్నప్పటికీ, దాని తాలూకు సత్యమేమంటే విద్యాబోధనగా పిలువబడుతున్న ఆ కాలం పండ్రెండు సంవత్సరాలకు పైబడుతుందనే. ఉదాహరణకు ఉపకోసలుడు తన గురువైన సత్యకామ జాబాలిని కేవలం యజ్ఞయాగాదులకు కావలసిన సమిధలు సేకరిస్తూ పండ్రెండు సంవత్సరాలు కనీసం ఒక్క పాఠమైనా నేర్వకుండా శుశ్రూషచేశాడు. ఆ తరువాత కూడా అతడు జబ్బుపడి ఆహారం తీసుకోవడానికి నిరాకరించడంతోనూ, అతని తరపున గురుపత్ని వకాల్తా పుచ్చుకొని వాదించడంతోనూ మాత్రమే అతడికి విద్య బోధించబడ్డది.

అధ్యయన కాలాన్ని ఎలా పొడిగించినప్పటికీ చివరకు నేర్చిన విద్య అంటూ ఏమీ ఉండేది కాదు. అంటే మానసిక సంస్కృతి, పరిణతి ఏమాత్రం సిద్ధించేవికావు. కేవలం పాత గ్రంథాలను, తత్సంబంధమైన సాహిత్యాన్ని వల్లెవేయడం; నిత్య యజ్ఞయాగాది కర్మకాండలకు కావలసిన విధులు నెరవేర్చడం, కులపతి, జ్యేష్ఠ విద్యార్థుల మధ్య జరిగే ప్రశ్నోత్తరాలతోనే గడిచేది. ఉపనిషత్తుల్లోని ఆ ప్రశ్నోత్తర సంభాషణలే మనకు ఈ సత్యాన్ని చెబుతాయి.

ఆ పాఠ్యగ్రంథాలు ఉన్నట్లయితే పాఠ్య ప్రణాళిక ముగించడానికి తప్పనిసరిగా చాలా తక్కువ సమయం తీసుకునేది. కొంతమంది ఇంటి వద్దనే విద్య నేర్వడానికి అవకాశం ఉండేది. కానీ, అలాచేస్తే కట్టుబానిసలను పొందడానికి అవరోధం కదా! అందువలననే పుస్తకాలు వ్రాయడం లిపి తెలిసినప్పటికీ నిషేధించబడ్డది. తరువాతి కాలంలో ఆ విధానం వల్ల జాతికి వాటిల్లిన నష్టం భయంకరమైనది. ఈ విధానంవల్ల ప్రజల్లోని అధిక సంఖ్యాకులు పూర్తి నిరక్షరాస్యులుగా ఉంచబడటమే గాక, కేవలం కొంతమందిని విద్యనేర్చిన 'కంప్యూటర్లు'గా మలచింది. విధమైన విద్యావిధానం కేవలం జ్ఞాపకశక్తి మీద ఆధారపడి స్వేచ్ఛాయుతమైన, నిర్భీకమైన స్వతంత్ర యోచనను పణంగా పెట్టింది. స్వతంత్రాలోచనను, జిజ్ఞాసను అణచివేసింది. నిజానికి స్వతంత్రాలోచన శపించబడ్డది.

ఆ పశుశాలలు విద్యాలయాలుగా నడిచి వాటి స్థాపకులైన ఋషులకు లాభం చేకూర్చినా, కొన్ని సందర్భాలలో నిత్యజీవితంలో కొన్ని సామాజిక అవరోధాల్ని ఎదుర్కొనవలసి వచ్చింది. యౌవనులైన విద్యార్థులను మిగిలిన సమాజానికి దూరంగా ఉంచి అరణ్యాలనాక్రమించే పనిలో నియోగించడంలో తరచు గురుపత్ని, శిష్యుల మధ్య అక్రమ సంబంధాలకు దారితీసింది. ఛాందోగ్యం గురువు శయ్యను మలినపరచకుండా ఉండటంలో ఎవరికి వారే నిగ్రహాన్ని పాటించాలని పేర్కొన్నది. (ద్యూ సేన్ అనువాదం. పదవకాండ) మనుస్మృతి గురుపత్నితో శయ్యాగతుడైన విద్యార్థి మాంస భక్షకుడుగానో, కోరలుగల మృగంగానో, తత్సంబంధమైన జంతువుగానో పునర్జన్మిస్తాడని హెచ్చరించింది.

నాకు సంబంధించినంతవరకు పురోహిత వర్గాలు సృష్టించిన గ్రంథాలు, ప్రత్యేకించి ఉపనిషత్తులు తిరోగమన కారకాలే. కేవలం అవి తప్పుడు భావాలు ప్రచారం చేసినందుకేగాదు. ఉపనిషత్కారులు విద్యను వాణిజ్యంగా మార్చిన విచక్షణారహితులైన దోపిడీ గాండ్రు కూడా! అరణ్యాల నాక్రమించడం ద్వారా ఏర్పర్చబడ్డ ఆ పాఠశాలలు వాటి వెనుకనున్న భయంకర వాస్తవాల్ని, వాటి స్థాపకుల అసలు ఉద్దేశ్యాల్ని మరుగుపరచి ప్రాచీన భారతంలో ఆదర్శ విద్యాలయాలుగా అభివర్ణించబడిన ఆ గురుకులాలు మనకండ్లకు వాస్తవానికి గంతలు కట్టాయి.

పురోహితవర్గ తాత్త్వికులు

ఉపనిషత్కారులు జన్మతః పురోహితులు, పెరిగింది పురోహితులుగా, వృత్తి రీత్యా పురోహితులే. పురోహితులుగా వారి లోభం, దురాశ, దోపిడీతనం, గర్వం, అహంకారం మన సహనం సరిహద్దులను మించింది. వారి నైతిక విలువలు అధమాధమ స్థాయికి చెందినవి. నేను వెల్లడిస్తున్న ఈ అభిప్రాయం పక్షపాత వైఖరి కానీ, ఆధార రహితమైన ఫిర్యాదుకానీ ఏమాత్రం కాదు. నాకు మద్దతుగా వివిధ దేశాలకు చెందిన పండిత ప్రకాండులను నేను సాక్ష్యంగా చూపగలను. వారిలో మొదటగా ప్రఖ్యాతిగాంచిన ఫ్రెంచ్ ఇండాలజిస్ట్, సిల్వైన్ లెవీ ఈ విధంగా సాక్ష్యమిస్తున్నాడు :

"బ్రాహ్మణాలకంటే మిక్కిలి క్రూరమైన జడవేదాంతాన్ని ఊహించడం కష్టం. తరువాయి ఉపయోగించిన భావజాలమంతా క్రమంగా సంస్కరించబడి నైతికత అనే ముసుగుతొడగబడిందే. కాని వాస్తవానికి ఆ నాగరికత భావజాలం వెనుక.... ఆ పద్ధతులలో మనకు నైతికతకు చోటే దొరకదు[5]!"

లెవీ బ్రాహ్మణాల కాలంనాటి పురోహిత వర్గాన్ని గురించి పలుకుతున్నప్పటికీ, వారి సంతతైన ఉపనిషత్సమయంలోని పురోహితవర్గం వారి కంటే మెరుగేంకాదు. కొన్ని సందర్భాలలో వారికంటే అధములు కూడా. ఇప్పుడు నా రెండవ సాక్షి అమెరికాకు చెందిన ఇ.డబ్ల్యు. హాప్ కిన్స్. పవిత్రమైనదిగా, లౌకికమైనదిగా ఎంచబడుతున్న ప్రాచీన భారతంపై, దాని సాహిత్యంపై లెవీకంటే తక్కువ ప్రామాణికుడేంకాదు. ఆయన సాక్ష్యపీఠం నుండి సప్రమాణికంగా ఈ విధంగా చెబుతున్నాడు :

"యజ్ఞయాగాది క్రతువులకు చెల్లించవలసిన రుసుము విషయానికొస్తే వాటి నియమ నిబంధనలను ఏమాత్రం సిగ్గులేకుండా చాలా ఖండితంగా నిర్ణయించారు. వాటిని రూపొందించినవారు యజ్ఞయాగాదులు రుసుము చెల్లిస్తేనే నిర్వహించేవారు. చెల్లించే రుసుములో విలువైన వస్త్రాలు, గోవులు, అశ్వాలు, సువర్ణం ఉండేవి. ఏది ఎప్పుడు, ఎలా సమర్పించుకోవాలో చాలా జాగ్రత్తగా నిర్దేశించబడ్డది. అగ్నినుండి పుట్టి పరిశుద్ధమైనదిగా ఎంచబడిన సువర్ణం శాశ్వత విలువను బట్టి పేరాశతో ప్రత్యేకంగా అపేక్షించబడ్డది. వారి అత్యాశ ఎంత దూరం పోయిందంటే ఎవరైతే వేయి గోవులు సమర్పించు కుంటారో వారికి స్వర్గంలో సర్వసుఖాలు సమకూరుతాయని ప్రకటించారు పురోహితులు. ఆ విధంగా ప్రకటించడానికి ముందే దేవతలు ఒకరినొకరు బహుమతులతో ఎలా సంభావించుకుంటారో తాము చెప్పే కథలలో చిత్ర విచిత్రాలుగా వర్ణించి చెప్పారు.[6]"

నేను సాక్ష్యపీఠంమీద నిలుపుతున్న మూడవ సాక్షి విశ్వ విఖ్యాతి గాంచిన జర్మన్ సామాజిక శాస్త్రజ్ఞుడు మాక్స్ వెబర్. ఈయన ప్రపంచ ప్రధాన మతాలను సరికొత్త దృక్కోణం నుంచి గాఢమైన అధ్యయనం చేసి నూతన పథ నిర్దేశికుడైనాడు. ఆయన తన సాక్ష్యాన్ని ఈ విధంగా వినిపిస్తున్నాడు:

"బ్రాహ్మణులు రుసుముగాకాక దక్షిణలుగా మాత్రమే అంగీకరించేవారు. ఆ విధంగా వారి సేవలకు ప్రతిఫలంగానైనా దక్షిణలు సమర్పించుకొనడం ఒక మతవిధిగా రూపొందింది. దక్షిణ లేకుండా యజ్ఞం చేయడం మంత్రానికి వ్యతిరేకమైన దుష్ఫలితాన్ని కలుగజేస్తుంది. పురోహితునికి అతని మంత్రశక్తి ద్వారా దక్షిణలు తిరస్కరిస్తూ శపించడం ద్వారానూ, ఉద్దేశ్య పూర్వకంగా క్రతువులో దోషాలాచరించడం ద్వారానూ క్రూరంగా ప్రతీకారం తీర్చుకొనడానికవకాశం కల్పిస్తూ యజ్ఞం చేయించే యజమానుడికి దురదృష్టాన్ని కొనితేవచ్చు. ప్రతీకార మొనర్చడం ఒక పద్ధతిగా రూపొందించబడ్డది. దక్షిణల కనీస పరిమితి ముందుగా నిర్ణయించబడి

బ్రాహ్మణుల మధ్య పోటీ నివారించబడ్డది. కొన్ని పరిస్థితులలో పురోహితుడు ముందుగానే తను కోరుకున్న పరిమాణంలో దక్షిణలు స్వీకరించడానికి అవకాశం కల్పించబడ్డది. వారి అప్రతిహతమైన మంత్రశక్తి ఆ విధంగా బ్రాహ్మణాలలో అనుమతించబడ్డది - వెబర్ మాటల్లో - 'అది అవధులులేని అత్యాశ, మనం ఒకసారి గోదె ఫాలోని చర్చి గర్భం అనే అంశాన్ని మననం చేసుకుంటే బ్రాహ్మణుడికీ దానికి ఏమాత్రం తేడాలేదనే విషయాన్ని గుర్తిస్తాము. మత కర్మకాండలలో ఏ విధమైన దోషానికైనా చాలా తేలిక మార్గంలో పాపపరిహారం చేసుకోవచ్చు. కేవలం అది మత ప్రాధాన్యతే కదా!

బ్రాహ్మణుల విశేష ఆర్థిక సామాజికాధికారాలు ఇతర పురోహిత వర్గాలనెన్నడూ దాటిపోలేదు. చివరికి బ్రాహ్మణుల పురీషానికి కూడా మతపరమైన భవిష్యదర్థం చెప్పబడ్డది. బ్రాహ్మణ హింసా ద్వేషాలు నిషేధించబడ్డాయి. ఇతర విధాలైన విషయాలతోపాటు ఏ న్యాయాధికారి బ్రాహ్మణుడికి వ్యతిరేకంగా, అబ్రాహ్మణుడికి అనుకూలంగా తీర్పునివ్వరాదు. బ్రాహ్మణుడి కివ్వవలసిన గౌరవం, లేదా అతని . కోరిక మేరకు అతను పొందవలసిన గౌరవం రాజుకిచ్చే గౌరవంకంటే అధికంగా ఎంచారు."[7]

నేను ఇంకా చాలా సాక్ష్యాలు పిలువగలను. కాని నా ఉద్వేగాన్ని అణచుకొని ఇక కేవలం రెండు సాక్ష్యాలను మాత్రమే చూపుతున్నాను. వారిలో ఒకరు ఆర్థర్ బెర్రిడేల్ కీత్ - ఎడింబరో విశ్వవిద్యాలయ సంస్కృతాచార్యులు. ఆయన తన విషయ పరిజ్ఞానం మీద కల గాఢమైన అభినివేశంతో గొంతెత్తి ఇలా చాటుతున్నారు.

"పురోహితవర్గపు కూరధర్మానికి చివరి సాక్ష్యంగా స్త్రీకి వారు కల్పించిన స్థానాన్ని ఉదహరించవచ్చు. భారతదేశంలో స్త్రీ ప్రతి మతంలోను బాధించ బడినప్పటికీ బ్రాహ్మణాల కాలంలో బ్రాహ్మణులు చూచినంత నీచంగా మాత్రం కాదు. భార్యను పురుషుడి అర్ధాంగిగా పేర్కొన్నారు. యదార్ధమే కానీ, ఎందుకంటే కేవలం ఆమె లేకుండా పురుషుడు తన మరణానంతరం పిండప్రదానాలు చేయడానికి తన సంతతిని పొందలేడు కనుక, తన వంశాన్ని వృద్ధిచేసుకోలేడు కనుక .... పురుషునితో పోలిస్తే స్త్రీ ఎప్పుడూ అధమురాలే. యజ్ఞయాగాదుల్లోను స్త్రీకిచ్చేది అధమ స్థానమే. ఆచార కర్మకాండలలో ఆమె అపరిశుద్ధగా ఎంచబడి ఆమె వస్త్రధారణలో కానెపోసి కట్టుకోవాలని నిర్దేశించారు. సంతానోత్పత్తికి తగనివారు గాను, తమను తాము నిగ్రహించుకోలేని వారుగానూ వారు వారసత్వంగా దేవతలచేత శపించబడ్డారు. చాలామంది స్త్రీ సమూహం ఉన్నప్పటికీ వారిలో చిన్న బాలుడుంటే, వాడే వారిని ముందుకు తీసుకుపోగలడు. స్త్రీలు దుష్టుడైన పురుషునికంటే అధములు. వారి స్థాయి ముఖ్యంగా ఆడశిశువు జన్మించినప్పుడు జరిపే ఉత్సవంలో ఆ శిశువును తండ్రివద్దకు కొనివచ్చే సందర్భంలో ప్రత్యేకించి గమనించాలి.[8]"

నా చివరి సాక్షి రిచర్డ్ గార్బే. ఇంతకు ముందు సాక్షులకంటే నిక్కచ్చిగా, సత్యమైన ఆగ్రహంతో, నిష్ఠురంగా ఆయన పలుకుతున్న పలుకులివి :

> *"పురోహితవర్గం భారతదేశంలో సాగించిన అధికారం అదే సమయంలో ఇతర దేశాల పురోహిత చరిత్రలను పరిశీలిస్తే ఎక్కడా కనరాదు. పురోహిత పాలన దేశాన్ని సర్వనాశనం చేసిందంటే అది ఏ మాత్రం అతిశయోక్తికాదు - ప్రాచీన భారతం ఆదిమ దశల్లో కూడా ఋగ్వేదంలోని సూక్తాలు మనకు వెల్లడించేదేమంటే పురోహితవర్గం దేవతల ప్రీత్యర్థం అంటూ అనేక యజ్ఞయాగాది క్రతువులను ఎంతో చొరవతో నిర్వహిస్తూ అందుకు ప్రతిఫలంగా ఎంతో గౌరవం, సంపదలు, కీర్తి ప్రతిష్టలు ఆర్జించారు.*

మరొకసారి ప్రాచీన భారతీయ చరిత్రను పరిశీలిస్తే ఈనాటికి భారతీయులకు పీడకలగా ఉన్న పురోహితవర్గ స్వార్ధానికి ప్రతీకగా జనించిన భారతీయ వర్ణవ్యవస్థ ప్రాథమిక దశను గమనించగలం మనం."

తనది ఆధారరహితమైన వాదన కాదని చెప్పడానికి గార్బే బ్రాహ్మణాలు, సూత్రాల నుండి ప్రత్యేకించి కల్పసూత్రాలు, గృహ్య సూత్రాలు నుండి ఉదాహరణలిస్తూ తన వాదాన్ని రూఢిపరుస్తున్నాడు.

"ఈ సూత్రాల్లో బ్రాహ్మణులు తాము పొందవలసిన గౌరవాన్ని చాలా నిక్కచ్చిగా వెల్లడించారు. చాలా అధ్యాయాల ప్రారంభంలో వారు తమను తాము ఈ భూమి మీద మానవదేహంతో సంచరిస్తున్న దేవతలు (భూసురులు)గా అభివర్ణించుకున్నారు.
దేవతా స్వరూపాలు రెండు విధాలు. నిజ దేవతలు, వేదాలనుచ్చరించే బ్రాహ్మణులు. బ్రాహ్మణులు అన్ని దైవభావాలకు ప్రాతినిధ్యం వహించారు. నిజానికతడు దేవతలకు అధి దేవత. బహుశః పురోహితవర్గం చరిత్రలో ఈ విధంగా ప్రకటించుకొన్న ఏకైక సందర్భం ఇదేనేమో!".

పురోహితవర్గం అత్యాశ, వారి తీరని దురాశ, దోపిడీతనం గురించి చెబుతూ గార్బే తనను తాను నిగ్రహించుకొని ఎలుగెత్తి ఉద్ఘోషిస్తూ:

"ఒకానొక క్రతువుకు పదివేల గోవులు రుసుముగా నిర్ణయించారు. ఇంకొక దానికి వందవేల గోవులు, తరువాత వచ్చినవారు అవే క్రతువులకు 240 వేల గోవుల నాశించారు. పురోహిత వర్గ పేరాశకు ఇది చరమాంకం కాదు సూటిగా ప్రొఫెసర్ వెబర్ మాటల్లో - ఆ గ్రంథాల్లో స్వేచ్ఛగా బయల్పడే భావాలివే - యజ్ఞ యాగాది కర్మకాండలు మనకు నిస్సారంగా, విసువుగా కనపడినా వాటికి అత్యంత చారిత్రక ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే అవి బ్రాహ్మణుల దుర్నీతిని తేటతెల్లం చేస్తున్నాయి. వారి కామవాంఛ ఎంత దూరం పోయిందంటే వ్యభిచారాన్ని ఆచార బద్ధంచేసి ఒకానొక యజ్ఞ సందర్భంలో బ్రాహ్మణులు తప్ప ఇతరుల భార్యలతో మరెవ్వరూ సంభోగించరాదని, ఆ యజ్ఞం పవిత్రమైనదని ప్రకటించారు. ఆ యజ్ఞం సందర్భంలో ఎవరైనా ఆ విధంగా ఇంద్రియ నిగ్రహం పాటించడంలో విఫలమైతే అతడు వరుణ మిత్రాది దేవతలకు పెరుగు సమర్పించడం ద్వారా ఆ దోషాన్నుండి విముక్తుడౌతాడు."[9]

గార్బే పురోహితవర్గ స్వార్థాన్ని, వారి దురాశ దుర్నీతులను పూర్తిగా ఖండించినప్పటికీ వారి మేధాశక్తికి వివశుడైనవాడే. "తమ వినూత్న భావాలతో తమ దేశాన్ని, ప్రపంచాన్ని, సంపద్వంతం చేసినందుకు వారు క్షమార్హులే" నంటాడు గార్బే. బహుశః గార్బే మనస్సులో ఉపనిషత్ ప్రభావం ఉండి ఉండవచ్చు. వాదనకోసం ఉపనిషద్భావనలు అత్యంత విలువైనా చింతనా ధోరణి కలవని క్షణకాలం నేనంగీకరించినా, తమకంటే ముందే ప్రబలిన భావాలను అవేమైన సరిదిద్ద గలిగాయా? అవి ఆనాటి రాచరికాలకు బాధ్యులుగా ఏనాడైనా ఉన్నాయా? ఆనాటి పురోహిత వర్గం వాటిని తమస్వార్థ ప్రయోజనాలకు వాడుకోకుండా ఉందా? నా వ్యాసం తరువాయి భాగంలో ప్రధానమైన ఈ ప్రశ్నలకు సమాధాన మివ్వడానికి ప్రయత్నం చేస్తాను.

పట్టువదలని జన్యువులు

జన్యువుల ప్రభావం ఒక తరం నుండి ఇంకో తరానికి పట్టుదలగా సంక్రమిస్తూనే ఉంటుంది. ఇది జీవితంలో సాహిత్యమంత సత్యం. బ్రాహ్మణాల పిలకలైన ఉపనిషత్తులు వాటి ఆవిర్భావానికి సంబంధించిన కొన్ని దుష్ట చిహ్నాలను ప్రదర్శిస్తాయి. ఆ దుష్ట చిహ్నాలు ప్రాచీన ఉపనిషత్తులైన బృహదారణ్యక, ఛాందోగ్య, కౌషీతకీలలో మనకు మిక్కుటంగా దర్శనమిస్తాయి.

ఆర్.డి. రనడే అంత నిష్ఠురంగా బ్రాహ్మణాలను అధిక్షేపించిన వేద పండితుడెవడూ కానరాడు. అధర్వవేద బ్రాహ్మణాల గురించి రనడే సాధారణాభిప్రాయమేమంటే "అవి మనలోని శ్రద్ధను కార్యకారణ బుద్ధిని హరించివేసి క్షుద్రవిద్య, మంత్రవిద్య అనే మరుభూముల్లో పడవేశాయి[10]. " ఇదే అవి మన మనసులమీద వేసిన ముద్ర. నవ్య వేదాంతులు కూడా దీనిని హద్దూపద్దులేని విమర్శగానో, అనుచిత వ్యాఖ్యగానో కొట్టివేయలేక పోయారు.
మనకు తరతరాలనుండి సంక్రమించే జన్యువుల ప్రభావం మూలంగానే ఈ రక్తం పీల్చే మహమ్మారి మనకు సంక్రమించి ఉపనిషత్తుల మీద తన ప్రభావాన్ని ప్రసరించినప్పటికీ, కొందరు వేదాంతులు ఆ విషయాలను సమర్థించడం చూసిన రనడే ఇలా అన్నాడు.

“తాత్త్విక ప్రభావం అమితంగా ఉన్న ఆ కాలంలోనే కొన్ని క్రింది స్థాయికి చెందిన సంప్రదాయాలు ఉపనిషదాలోచనా క్రమంలో, ముఖ్యంగా బృహదారణ్యక, కౌషీతకీలలో కొన్ని లోపాలుగా ఎంచినా మనం వాటి నుదహరించక తప్పదు. బృహదారణ్యకాన్ని పఠించినట్లయితే (ఆరవ అధ్యాయం, నాల్గవ బ్రాహ్మణం) భార్యను వశీకరణ చేసుకొనడానికి, భార్యా జారుణ్ణి నాశనం చేయడానికి, కావలసిన సంతానాన్ని పొందడానికి తిరిగి కౌషీతకీ ఉపనిషత్తు (రెండవ అధ్యాయం)లో మంత్ర విద్య ద్వారా అపారమైన సంపద పొందడానికి, స్త్రీ, పురుషులను వశీకరణ చేసుకొనడానికి, సంతానం అకాల మరణాన్ని నిరోధించడానికి చివరగా 'దైవ పరిమార' అనే భాగంలో మంత్రోచ్చాటన ద్వారా తన చుట్టూ ఉన్న శత్రువులను నిశ్శేషంగా పరిమార్చడానికి, అలాగే ఆయా ప్రక్రియలకు చెందిన మంత్రాలను విశేషంగా పేర్కొనడం జరిగింది. ఇవి ఆనాటి తాత్త్విక స్థాయిని తగ్గించి మార్మికతను ప్రోదిచేసే కొన్ని కళంక భావాలు మాత్రమే. వీటిని ఉపనిషదాలోచనా క్రమంలో అలంకారాలుగానో, అతిశయోక్తులు గానో, అందమైన చంద్రబింబంపై మచ్చలుగానో కాక, అవి ఆ ఆలోచనా క్రమం తాత్త్విక స్థాయిని పెంచేవిగా ఉంటే బాగుండేది.”[11]

అలంకారాలు విపరీతంగా వాడటం వేదాంతులకు వెన్నతో బెట్టిన విద్య. ఏవైనా క్లిష్ట పరిస్థితు లెదురైనప్పుడు ఒక ఉపమాలంకారాన్నో, రూపకాలంకారాన్నో, అతిశయోక్తినో ఇట్టే ప్రయోగించి సమయస్ఫూర్తిగా తప్పుకొనేవారు. “నిప్పులేనిదే పొగరాదు”, “నదులన్నీ చివరకు కలిసేది సాగరంలోనే”, “ఒకే చంద్రబింబం అనేక పాత్రలలోని నీటిలో ప్రతిబింబించినట్లు”, “జ్వాలనుండి ఎగసిన నిప్పుకణం మళ్ళీ అదే జ్వాలలో పడినట్లు” “చేప అదే నీటిలో ఈ ఒడ్డునుండి ఆ ఒడ్డుకు ఈదినట్లు”, “పాము కుబుసం విడిచినట్లు”, “తామరాకుమీది నీటి బొట్టులా అంటీ అంటనట్లు” ఇవి వారిచే వాడబడే కొన్ని అలంకారాలు మాత్రమే. చాలా కాలం క్రితమే మాక్స్ ముల్లర్ వీటిని ప్రత్యేకంగా గమనించాడు. అతడి విధంగా వ్రాశాడు. “ఇవి తరచుగా చెప్పబడేవి. ఉపనిషత్కారులు ప్రత్యేకించి రూపకాలంకారాలను అధికంగా గుప్పించారు. మొదటిసారి ఇవి మనలను భ్రమాన్వితులుగా చేసి చివరకు

అసంతృప్తితో తేలుస్తాయి. ఎందుకంటే అవి కేవలం ఉదాహరణలు, ఉహాజనితాలే కాని ఋజువులు, సాక్ష్యాలు కావు. ఇది సత్యమనడంలో సందేహం ఏమాత్రం లేదు"[12]

ఫ్రాంక్లిన్ ఎడ్గర్టన్ అనే అమెరికన్ ఇండాలజిస్ట్ సాంప్రదాయ వేదాంతుల ధోరణిలో గాక, అన్ని విధాలైన 'ట్రిక్కులను' అధిగమించి బ్రాహ్మణాల్లో వాడిన మంత్రభాగం ప్రాధాన్యతాక్రమంలో కొద్దోగొప్పో, ముందో వెనుకో, ఉపనిషత్తుల్లో ప్రత్యక్షమయ్యాయో 1925లో కేంబ్రిడ్జ్ (మోసాచుసెట్స్) లోని అమెరికన్ ఓరియంటల్ సొసైటీలో ప్రత్యేకించి ఈ అంశానికే ప్రాధాన్యత నిచ్చిన తన అధ్యక్షోపన్యాసంలో వెలువరించాడు. ఆ ఉపన్యాసంలో ఆయన వెలువరించిన . అభిప్రాయాలు సత్యమైనవిగా ఉండి ఏదైనా ఉపనిషత్తును ఖండించి జ్ఞానభాగాన్ని ప్రతిపాదించి నప్పటికీ ఆ ప్రతిపాదన జ్ఞానానికున్న అద్భుత శక్తిగా మాత్రమే ఆయన కొనియాడాడు. సమర్ధవంతమైన, ప్రామాణికమైన ఆయన ఉపన్యాసం తిరిగి స్టడీస్ ఇన్ ది హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ, వాల్యూం-1 లో ముద్రించారు. ఆసక్తి గల చదువరులు దాన్ని తిరిగి చదువుకొనవచ్చు. ఇక్కడ మాత్రం నేను ఆయన ఉద్దేశ్యాలు ప్రముఖంగా ప్రతిబింబించిన కొంత వ్యాసభాగాన్ని ఉటంకిస్తున్నాను. అది ఇలా సాగుతుంది.

> *"మధ్యకాలీన యూరపులోని పరిగణన కెక్కిన సత్యానికి మించి గాని, ఆచరణాత్మకమైన వివిధాలైన ప్రాపంచిక ప్రయోజనాల కంటేగానీ ప్రాచీన హిందువుకు ఏదీ స్వాభావికం గాను, ప్రాకృతికంగాను కనపడదు. అంతా అధి భౌతికంగాను, పరమ సత్యంగాను మాత్రమే గోచరిస్తుంది. విద్యన్నా, జ్ఞానమన్నా సాంప్రదాయిక సంస్కృత భాషల్లో మంత్రమే. అందరు సంస్కృతాధ్యయనపరుల భావనా అదే. ఉపనిషత్తులను తరచినా, బ్రాహ్మణాలను తరచినా అదే భావన. "ఎవరైతే తన్ను తాను తెలుసుకుంటాడో అతడే ఆత్మజ్ఞాని" ఇదే ప్రయోగం అధర్వ వేదంలోని తాత్త్విక సూక్తాల్లోను కానవస్తుంది. ప్రతిచోట ఈ సూక్తాల్లో ఎవరైతే ఈ విధమైన జ్ఞానం కలిగి ఉంటారో వారికి గౌరవాదరాలు లభిస్తాయని చెప్పబడింది. ఈ జ్ఞానం కలిగి ఉండటం వల్ల దీర్ఘాయువు, మృత్యుభయం నుండి విముక్తి, పునర్జన్మల భయంతో తిరిగి పునర్మృత్యు భయం (ప్రతివైదిక హిందువుకు ఈ పునర్జన్మ భయం తప్పనిసరి. పునర్జన్మ తప్పనపుడు పునర్మృత్యు భయమూ తప్పదు) అంతేగాక వివిధ రకాల స్వర్గప్రాప్తి, ఇహలోకంలో జీవితంలో అశేష సంపద, ప్రాపంచిక విషయాలన్నింటిలో విజయం, తన అనుచరుల మీది ఆధిపత్యం, శత్రువునుండి అపజయ భయం లేకపోవడం, ప్రేమాది విషయాలలో విజయం ఇలా అన్నివిధాలైన ప్రాపంచిక ప్రయోజనాలు భ్రమాజనితమైన ఉపనిషద్భావన లాచరించడం మూలంగానో, లేక అధర్వవేదంలో సూచించిన మంత్ర విద్యననుష్ఠించడం మూలంగానో ఒనగూడతాయి. ఈ విధంగా సాగిన అసంఖ్యాక భావనలను గణనలోనికి తీసుకొని వాటి ప్రభావాన్ని అంచనా వేయడం కష్టం. కనుక మనం దీన్ని త్రోసి రాజనవచ్చు.[13]"*

ఈ విధంగా సాగిన ఉపనిషద్భావనలు అంతకు ముందుకాలంలోని భావాలను ఏమాత్రం అడ్డుకొనలేదు. అంటే ఇది కొత్త సీసాల్లో నింపిన పాత సారాయే నన్నమాట.

ఇప్పుడు ఉపనిషత్తుల ఆరంభాన్ని ప్రశ్నిద్దాం. వాటి ఆరంభకులు ఆనాటి రాజులే. వారిలో ఒకడు కాశీకి చెందిన అజాతశత్రువు. రెండవవాడు ప్రవహణ జైవలి, మూడవవాడు కైకేయుడైన. అశ్వపతి, నాల్గవవాడు చిత్రాగాంగేయని. ప్రాచీన ఉపనిషత్తుల్లో వీరందరూ కానవస్తారు. ప్రారంభంలో పురోహితులు ఉపనిషద్

సిద్ధాంతంలో శిక్షణకై రాజుల వద్దకు భయభక్తులతో, గౌరవ ప్రపత్తులతో వెళ్ళారు. ఇందులో పురోహితుల స్వార్థ పూరితమైన చింతన ఏమిటంటే తామొకసారి నేర్చి వదలిన ఉపనిషదాలోచనను తిరిగి నేర్చి ఆ రాజులపై తమ అధిపత్యాన్ని నిరూపించుకోవాలనే. అందుకే వారు తమ రాజ-గురువుల వద్ద నుండి త్వరగా, పూర్తిగా ఆ భావనలను నేర్చుకొన్నారు. కానీ పై వాదం ప్రాధాన్యాన్ని కీత్ సందేహించాడు. ఎందుకంటే పై సాధారణ భావం ప్రాచీన ఉపనిషత్తులకు చెందిందేగాక, అది నిస్సందేహంగా బౌద్ధయుగం ముందునాటిది. అందువలన కీత్ వైఖరి ఇలా ఉంది "ఖచ్చితంగా మనం ఈనాడు కలిగి ఉన్న ఉపనిషత్తులు ఆనాటి యోధుల (రాజులు) సృష్టికాదు. అవి పురోహితులచేత వారికి అప్పగించబడ్డవే.

ఒకవేళ అవి ఆనాటి రాజయోధులచేత ఆరంభించబడ్డవైతే ఆ భావనలు కొనసాగించడంలో వారు వెనుకంజ వేశారని చెప్పవలసి ఉంటుంది."[14] ఇదే సమస్యపై గార్బే కూడా చాలా లోతుగా పరిశోధించాడు. గార్బే ప్రకారం నేను నమ్ముతున్నాను. ఉపనిషదాలోచనా క్రమానికి రాజులే ఆరంభకులు. పురోహితుల కేమాత్రం సంబంధంలేదు. వారిని ప్రాచీన ఉపనిషత్తుల నుండి నిస్సందేహంగా బహిష్కరించవలసిందే. వారు ఆరంభంలో ఉదాసీనతతో ఉపనిషత్తుల ప్రాధాన్యాన్ని గుర్తించక, తరువాయి క్రమంలో పెరుగుతున్న ఉపనిషత్తుల ప్రాధాన్యాన్ని గమనించి వాటిని తమవిగా చేసుకున్నారు. తదుపరి వాటిని తమ స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకున్నారు. ఈ విషయాన్ని గార్బే మాటల్లో చెబితేనే బాగుంటుంది.

తరువాత కాలంలో తాత్త్వికభావం బ్రాహ్మణాల పూర్తి సారంగా నెలకొంది. గత 25 శతాబ్దులనుండి నేటి వరకు పురోహితులచేత మథించబడ్డ బ్రాహ్మణాల సారాంశం బ్రాహ్మణ తత్త్వంగా పరిణమించింది. కాని మారని సత్యమేమంటే ఆనాటి రాజుల స్థాయి ఏమాత్రం తగ్గలేదు. ప్రత్యేకించి ఈ తెగ యోధుల తెగ. వాటిలోని బూటకమైన త్యాగగుణాన్ని, అసంబద్ధతను కేవలం పోలికగా మాత్రమే గుర్తించి క్రొంగొత్త భావాలకు గవాక్షాలు తెరచి ప్రాచీన హిందూ బౌద్ధిక ప్రపంచంలో ఒక సరికొత్త విప్లవానికి నాంది పలికింది. కానీ, పురోహిత వర్గం ఈ క్రొత్త సిద్ధాంతాలను తమవిగా చేసుకొన్నప్పటికీ, తమ క్రతు కర్మకాండలతో ఈ నూతన సిద్ధాంతాలను మథించడం మానలేదు. పురోహితవర్గం ప్రకృతి, ప్రకృతి దత్తమైన జ్ఞానాన్ని, అస్వాభావికాలైన కర్మకాండను సంకరంచేసి వాటి ఫలితంగా ఆవిర్భవించిన సంకర జ్ఞానాన్ని మాత్రం మనం నిర్బంధంగా పొందేలాగూ ప్రాచీన హిందూ సమాజంలో పరిస్థితులను సృష్టించారు. మిగతా ప్రపంచ పరిస్థితి అంతే. బౌద్ధిక వికాసానికి స్వాభావికంగా శత్రువులైన పురోహిత వర్గం ఇక్కడ కూడా దానికి ఎదురే నిలిచింది. అది ప్రజల్లో ఎంతగా ప్రభావం చూపించిందంటే, ఏనాటికీ ప్రజలు దానిని ఎదిరించలేని స్థాయికి అది పాదుకుంది. తరువాత పురోహితవర్గం క్రొత్త క్రొత్త భావనలు ప్రోది చేస్తున్నట్లు తమ స్వాభావికాలైన బూటకపు నటనతో వారిని మరింత మత్తులో ముంచింది. [15] "

అవును నిజమే. ప్రతి జాతిలోను, ప్రతి యుగంలోను బూటకపు నటనలకు, మోసపు ఎత్తులకు పురోహితుడే మూలం, యజమాని. అలాంటి జిత్తులను, ఎత్తులను ఉపయోగించుకుంటూ సమాజంలో తన ప్రాముఖ్యాన్ని కాపాడుకుంటూ భయం, అజ్ఞానం, మూఢనమ్మకాలు, పిడివాదాలు, బానిసత్వం అనే సంకెళ్ళను సమాజంలోని తనతోటి మానవులకు బిగించసాగాడు పురోహితుడు.

కైకారణ్యం

ఇప్పుడు అసలు విషయానికొద్దాం. మొత్తం మీద ఉపనిషత్తులన్నీ కలిపి ఎన్ని? ఖచ్చితంగా ఇన్నేనని ఎవరికీ తెలియదు. రవీంద్రనాథ్ ఠాగోర్ తండ్రి దేవేంద్రనాథ్ ఠాగోర్ ప్రకారం అవి కేవలం పదకొండు. ఆయన ఉపనిషత్తుల విషయం ప్రత్యేకంగా పరిశీలించాడు. ఎందుకంటే బ్రహ్మసమాజ స్థాపకుడైన రామమోహన్ రాయ్ ఉపనిషత్తులను ఒక నూతన విశ్వజనీన మతాన్ని స్థాపించడానికి ఆధారంగా తీసుకున్నాడు. అంతేగాక ఆయన 1832లోనే ఈశ, కేన, కఠ, ముండకోపనిషత్తులకు అనువాదాలు ప్రచురించాడు. వాటిని ఆంగ్లంలోనేగాక హిందీ, బెంగాలీ భాషల్లోకి కూడా తర్జుమా చేశాడు. రామమోహన్ రాయ్ కొనసాగించిన కృషిని అమలు జరుపడానికి బ్రహ్మసమాజ నాయకుడుగా ఆలస్యంగా వచ్చిన దేవేంద్రనాథ్ టాగోర్ ఉపనిషత్తులనుండి అవసరమైన భాగాలను కూర్చి బ్రహ్మసమాజానికి అవసరమైన నియమ నిబంధనలు రూపొందించడానికి శంకరాచార్యుడు కేవలం పదకొండు ఉపనిషత్తులకు మాత్రమే భాష్యం వ్రాశాడు. అందువల్లనే దేవేంద్రనాథ్ టాగోర్ కూడా వాటిని పదకొండుగా మాత్రమే తలచాడు. కాని ఆయన పరిశోధనలో అనూహ్యమైన రీతిలో అవి 147 గా తేలాయి.16 బహుశః అవి వెయ్యిదాకా పాకే దశ కూడా రావచ్చు. ముక్తికోపనిషత్తు ప్రకారం చతుర్వేదాలకు 1180 శాఖలు, తరగతులు వాటికి అనుసంధించి ఒక్కో ఉపనిషత్తు ఉన్నట్లుగా తేలుతుంది. శతాబ్దాల కాలక్రమంలో అవి బహుశః గతించి ఉండవచ్చు. మాక్స్ ముల్లర్ తన జీవితకాలంలో వాటిని 149 గా లెక్క తేల్చాడు. తరువాత మరో 21 వచ్చిచేరి మొత్తం 170 గా తేలాయి. ఆల్బర్ట్ వెబర్ ప్రకారం అవి 235.17 కాని తరువాత ఒకే విధమైన పాఠం కలిగి వివిధ పేర్లతో చెలామణి అయ్యే వాటిని పరిష్కరిస్తే కె. నారాయణస్వామికి అవి 108 గా మాత్రమే తేలాయి.[18]

ఈ 108 లో ఎన్ని ఉపనిషత్తులు అసలు సిసలైనవి? ఈ విషయానికి సంబంధించి ఎవరి ఊహవారిదే! మాక్స్ ముల్లర్ ప్రకారం "నూతన (మత) శాఖల స్థాపకులు ప్రాచీన ఉపనిషత్తులు తమ భావాలకు అనుగుణంగా లేవని తలచినపుడు ఏ మాత్రం జంకూ గొంకూ లేకుండా తమ తమ స్వంత ఉపనిషత్తులను కూర్చుకున్నారు. 19 ఉపనిషత్తులకున్న గౌరవ ప్రపత్తుల దృష్ట్యా చివరకు భారతీయ ముస్లింలు, క్రైస్తవులు కూడా తమ స్వంత ఉపనిషత్తులతో రంగం మీద కొచ్చారు. అక్బరు పరిపాలనా కాలంలో 'అల్లోపనిషత్' కూర్చబడ్డది. " సుమారు రెండు దశాబ్దాల క్రితం నేను ఆంగ్లంలో 'క్రీస్తోపనిషత్' (Christ-Upanishad) అనే దాన్ని చదివాను.[21] ఇలా ఉపనిషత్తులనుత్పత్తి చేయడం అనంతంగా సాగే ప్రక్రియేమో! ఆ ప్రక్రియలో నవ్యంగా పుట్టుకొచ్చిన ఉపనిషత్తు 'సద్గురు ఉపనిషత్తు'. దాని కల్పనాకర్త పురోహిత స్వామి. మాధవస్వామి వ్యాఖ్యానం ఖచ్చితంగా వీటిని గురించి ఏమంటే "ఉపనిషత్తుల్లో వాడబడ్డ సంస్కృత భాష ప్రాచీనమైంది, వ్యాకరణం సులభమైంది. తెలివైన అనుకరణశీలి ఎవరైనా ఒక ప్రాచీన ఉపనిషత్తుననుసరించి మరొకదాన్ని కూర్చవచ్చు.[23]

ఉపనిషత్తుల సంఖ్య దృష్ట్యానే గాక వాటి సంకర స్వభావం దృష్ట్యా కూడా దేవేంద్రనాథ్ టాగోర్ వ్యాకులత చెందాడు. ఆ అనుభవంతోనే ఆయన స్వీయ జీవితచరిత్రలో ఈ విధంగా వ్రాసుకున్నాడు. "ఉపనిషత్తుల మీద ఎప్పుడైతే భక్తి భావన ప్రబలిందో వేదాలు మొదలుకొని అన్ని శాస్త్రాలకు అవే తలమానికంగా నిలిచాయి. ఆ క్రమంలోనే శైవ, వైష్ణవ శాఖలు తమతమ శాఖలకు సంబంధించిన దైవమూర్తులను పరమాత్మ స్థానంలో

ప్రతిష్ఠించడానికి వారి ఆరాధనకు వారివారి స్వంత ఉపనిషత్తులతో బయలుదేరారు. ఆ క్రమంలో కూర్చబడ్డవే ' గోపాల తపని ఉపనిషత్'. అందులో పరమాత్మ స్థానాన్ని శ్రీకృష్ణుడు ఆక్రమించాడు.

ఆ ఉపనిషత్తులో మధురా నగరిని బ్రహ్మలోకంగాను, శ్రీకృష్ణుని పరబ్రహ్మగాను ప్రతిష్ఠించారు. మళ్ళీ ' గోపీ చందన ఉపనిషత్' అంటూ మరొకటి బయలు దేరింది. అందులో కృష్ణుడి నొసట దిద్దే తిలకం ఎలా తయారు చేయాలో, ఎలా దిద్దాలో నిర్దేశించారు. ఇలా వైష్ణవశాఖ తమ దైవమూర్తిని విభిన్న రీతుల్లో కీర్తించారు. దానికి ప్రతిగా శైవం 'స్కందోపనిషత్'లో తమదైవం శివుణ్ణి కీర్తించారు. ఇంకా సుందరీ తపని ఉపనిషత్' 'దేవీ ఉపనిషత్' 'కౌలోపనిషత్' అనేవి కూడా ఉన్నాయి. అందులో శక్తి మహిమలన్నింటినీ కీర్తించారు. చివరకు ఎవరుబడితే వారు, ఏదిబడితే అది ఉపనిషత్తుల పేరున ప్రచురించే స్థాయికి చేరిందీ ప్రక్రియ”.[24]

దేవేంద్రనాథ్ ఠాగోర్ వేదాంత, శైవ, వైష్ణవ, శక్తోపనిషత్తులను మాత్రమే పేర్కొని యోగ, మంత్ర, సన్యాస ఉపనిషత్తులను పేర్కొనడం మరిచాడు. వీటన్నిటికంటే ప్రధానంగా మానవ శరీర నిర్మాణతత్వాన్ని వివరించే శరీరోపనిషత్తు ఉండాలి కదా![25]

ఉపనిషత్తుల విషయం లోతుగా తరచేకొద్దీ సంభ్రమాశ్చర్యాలు కలిగే విషయాలు ఎదురవుతాయి. అతి ప్రాచీనంగానూ, మూలమైనవిగానూ మనం తలచే ఉపనిషత్తులు కూడా గ్రంథ చౌర్యంతో నిండినవే.

తరువాత కూర్చబడ్డవైతే ప్రకరణాలే పూర్వ ఉపనిషత్తులనుండి సంగ్రహించి కూర్చబడ్డాయి. అన్నీ పునరుక్తులే. రాబర్ట్ హ్యూమ్ ఆంగ్లంలోనికి అనువదించిన పదమూడు ఉపనిషత్తుల్లోను 754 పునరుక్తులు కాని, సమానార్థకాలుగాని ఉన్నట్లు సి.ఓ. హాస్ గుర్తించాడు. హాస్ ప్రకారం అవి

1) ఉపాఖ్యానాలు, ప్రకరణాలు

2) ఒకే భావం వ్యక్తపరచే పునరుక్తులు లేదా ఉపమాలంకారాలు

3) ఉదాహరణలు ఇంకా అలాంటివే ఎన్నో. ఇంకా విచిత్రమేమంటే ఒక ఉపనిషత్తులో ఒకే విషయాన్ని విభేదించే పరస్పర విరుద్ధ భావాలు ఉండటం. ఉదాహరణకు ముండకోపనిషత్తులో ఒకచోట తమ కోరికలను సిద్ధింపచేసుకొనడానికి యజ్ఞయాగాదులను అనుసరించమని, మరొకచోట అటువంటి నిష్ఫలమైన కర్మకాండలను వదలవలసిందని పేర్కొన్నారు. అన్నిటికంటే అసంబద్ధమైన విషయమేమంటే బృహదారణ్యకంలో నడచిన యాజ్ఞవల్క్య మైత్రేయిల సంవాద ప్రకరణం (మైత్రేయి బ్రాహ్మణం) రెంటికంటే ఎక్కువసార్లే కూర్చారు. శ్వేతకేతు రాజగురువుతో నడిపిన సంవాదం స్వల్పమైన మార్పులతో బృహదారణ్యకం లోను, కౌషీతకీలోనూ వర్ణించారు. బృహదారణ్యకంలో రాజగురువు ప్రవహణ జైవలి కాగా అదే పాత్ర కౌషీతకీలో చిత్రాగాంగేయుడుగా మారింది. ఇంకొక దోషమేమంటే చిన్నదైనప్పటికీ ఇక్కడ పేర్కొనడం ఉచితమేననుకుంటాను. ఉపనిషత్తులన్నీ దీర్ఘమైనవే. కొన్ని మరీ సుదీర్ఘమైనవిగా ఉండి మనకు భరింపరాని విసుగును కలిగిస్తుండగా మరికొన్ని అతి సంక్షిప్తంగా ఉంటాయి. ఉదాహరణకు హ్యూమ్ అనువాదంలో బృహదారణ్యకం పాద సూచికలతో కలిసి 104 పుటలకు విస్తరించగా, మాండూక్యం మూడు పుటల్లోనే ముగిసి అందులో ఒకపుట పాద సూచికలకే సరిపోయింది. ఇంకా వివరిస్తే ఉపనిషత్తులు కొన్ని పద్యశైలిలో నడిస్తే మరికొన్ని గద్యశైలిలో నడిచి మిగిలినవి పద్య గద్యాలతో సంకరమైవి. ప్రాధమిక ఉపనిషత్తులన్నీ సులభశైలిలో, సంభాషణా రూపంలో నడిస్తే తరువాత కూర్చబడ్డవన్నీ అబద్ధాలతో కూర్చబడి డంబాన్ని ప్రదర్శిస్తాయి. చివరగా తేలేదేమంటే ఉపనిషత్తులు చక్కగా పెంచబడ్డ ఉద్యానవనంకాదు. అది అడ్డదిడ్డంగా పెరిగిన కీకారణ్యం. అతి ప్రాచీనమైనదిగా అతి పెద్దదిగా ఎంచబడి విశేష ప్రాముఖ్యాన్ని సంతరించుకున్న ఉపనిషత్తు పేరు "బృహదారణ్యకం" దానర్థం 'అతిపెద్ద అడవి' అనేకదా!

సరిచూచుకొనడం - ఎన్నుకొనడం

గుప్తుల కాలం నాటికి పాత పురాణాలన్నీ సంక్షిప్తీకరించబడ్డాయి. కొత్తవి కల్పించారు. స్వర్ణయుగంగా పిలిచిన గుప్తుల కాలం నిజానికి మిధ్యావాదాలకు, పురాణాలకు స్వర్ణయుగం. ఆనాటి కల్పితకారులు, 'ఫోర్జరీ' గాళ్ళు అంతటి మంచి కాలాన్ని మరెన్నడూ చూచి ఉండరు. వారు అనంతంగా కల్పిత గాథలను సృష్టించారు. అందుకోసం వారిలో వారు విపరీతంగా పోటీపడ్డారు. అందుకే డి.డి. కోశాంబి ఆ కల్పిత సాహిత్యాన్ని "ఎడతెగని, అసంగతమైన అజ్ఞానపు అసందర్భ చెత్తగా" 27 పేర్కొన్నాడు. ఆయనే మరికొంత ముందుకు సాగి ఆ మధ్యయుగపు సంస్కృత పురాణాలను "అంతులేని నిస్సారమైన చౌంగ (సొల్లు) గా"[28] నిందించాడు. ఇదేమన్నా అతిధోరణి లేక పరుషమైన తీర్పుగా కనబడుతుందా? కొంచెం సరిచూచుకొనడం ఎన్నుకొనడం కూడా కాదు. ఇది ఖచ్చితమైన తప్పు. నిజానికిది చాలా తక్కువ అంచనాగా నేను పరిగణిస్తున్నాను. పురాణాల విషయానికి వస్తే బుద్ధిహీనత కాదనుకున్న అవి పూర్తిగా శైశవావస్థకు సంబంధించిన కుళ్ళిపోయిన కల్పనలే. ఉపనిషత్తులు మొత్తంగా చూచినా ఇదే వరుస. రుద్రాక్ష జాబాలోపనిషత్తు అనేది రుద్రాక్షలకు కూడా కులాలనంటగట్టింది. (తెల్లనివి బ్రాహ్మణ జాతి; ఎర్రనివి క్షత్రియజాతి; పచ్చనివి వైశ్యులు; నలుపువి శూద్రజాతికి చెందుతాయని పేర్కొంటూ క్రమంగా వాటిని ఆయా కులాల వారే ధరించాలని అందుకే అవి అలా నాలుగు జాతులుగా ఏర్పడ్డాయని ఆ ఉపనిషత్తు పేర్కొంది- అను) బృహజ్జాబాలోపనిషత్తు ఎవరైతే త్రిపుండ్రాలను ధరిస్తారో వారిని వేద వేదాంగాలు నేర్చిన ఆచార్యవర్యుడుగాను, వేదవిహిత కర్మలను నిష్ఠురతతో ఆచరించే అత్యంత మహిమాన్వితుడైన నిష్ఠాగరిష్టుడుగాను ఎంచింది. వీటికి మించిన మరొకటి వైష్ణవోపనిషత్తు ఆవు పేడతో అలికిన నేల మీద గాని లేక శరీరం మీదగాని 'గోపాల యంత్రం' రచించుకుంటే వారికి చిరంతనానందం, స్వర్గ సౌఖ్యం కలుగుతాయని హామీ ఇచ్చింది.

గుప్తుల కాలం నాటికి బౌద్ధం క్షీణ దశలో ఉన్నప్పటికీ అదింకా పూర్తిగా తన తాత్త్విక రూపాన్ని కోల్పోలేదు. ఆనాటికది బౌద్ధ తత్వంగా పరిగణించబడనప్పటికీ అందులో నుండి బుద్ధుడి అసలు బోధనల సారం ఇంకా అంతరించలేదు. కోశాంబి మాటల్లో చెప్పాలంటే "అశోకుడి కాలం నాటికి అతడి ముందు కాలం నాటికి పరిగణన పొందిన బౌద్ధంగా మాత్రం అది తన ప్రాభవాన్ని కోల్పోయింది".[29] ఇంకా సరిగా చెప్పాలంటే పూర్తి పరిణతి చెందిన బౌద్ధ తత్త్వానికి మాసిపోయిన గురుతుగా మాత్రమే అది నాటికి నిలచి ఉంది. దీనికి ప్రతిగా ఆదిశంకరాచార్య ఒక హిందూ తత్త్వాన్ని సృష్టించదలిచాడు. అందుకోసం ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతలను ఉపయోగించాడు. వాటి పైన మహాయాన బౌద్ధ భావనలైన మాయావాదం, శూన్యవాదాలను పులిమాడు. నా జ్ఞానపరిధి మేరకు శంకరుడి కాలం నుండే ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత హిందూ మతంలో ధర్మగ్రంథాలుగా - ప్రస్థానత్రయంగా అంగీకరించబడ్డాయి. అతి భయంకరంగా సంకరమై, కలగాపులగంగా మారిన ఉపనిషత్తుల నుండి ఏ భావాన్ని గ్రహించాలన్నా శంకరుడు వాటిని శ్రద్ధతో ఏర్చి కూర్చుకోవలసి వచ్చింది. తన జీవితకాలంలోనే వందలాదిగా లభ్యమైన ఉపనిషత్తుల నుండి శంకరుడు అతిజాగ్రత్తగా కేవలం పదకొండింటిని ఎన్నుకొని వాటి మీద వ్యాఖ్యానం వెలయించాడు. అతడు కేవలం పదునారు ఉపనిషత్తులను ప్రామాణికంగా గ్రహించి మిగిలిన వాటిని కల్పితాలుగానో లేక ఏ మాత్రం విలువ లేనివిగానో తిరస్కరించాడు. ఇది అతడి తెలివితేటలకు, సూక్ష్మబుద్ధికి అతి చక్కని ఉదాహరణ.

మాక్స్ ముల్లర్ ఆలోచన ప్రకారం "శంకరుడు ఉపనిషత్తుల వ్యాఖ్యాన రచనలో ప్రధానంగా తాత్త్విక భావాల చేతనే నడుపబడ్డాడు. ఆ విధంగా చేయటంలో శంకరుడి ప్రధానోద్దేశ్యం ఉపనిషత్తులను వేదాంతానికి పవిత్ర పునాదిగా మలచడమే. అంతేగాక వ్యాఖ్యాన రచనలో అతడు ఉపనిషత్తులను తనకిచ్చ వచ్చిన రీతిగా ఎడా పెడా స్వేచ్ఛగా ఉపయోగించుకున్నాడు".[30]

ఇది సరైన భావనే. ఎందుకంటే శంకరుడు ఏదైనా ఒక విషయాన్ని చెప్పదలచుకుంటే ఎంత సుదీర్ఘంగానైనా వ్యాఖ్యానిస్తాడు. అసలు భావాన్ని అణచివేయడంలోను, తప్పుడు భావాలు ప్రచారం చేయడంలోనూ అతడిది అందెవేసిన చేయి.

ఈ సందర్భంగా నేను కోశాంబి మాటలను ఉల్లేఖించదలచుకున్నాను. అతడు శంకరుడిని గురించి మాత్రమే కాక మన జాతి వ్యక్తిత్వం మీద కూడా నిష్పాక్షిక సత్యాలను వెల్లడిస్తాడు. ఇదిగో అతడు వ్రాసిందిదే.

బ్రాహ్మణులు ముందుకు తెచ్చిన తర్కం అంతా వాస్తవాన్ని తొలగ ద్రోయడానికే. ఒక ప్రమేయాన్ని ఎలా తొలగదోయాలంటే అది "అది కానూ వచ్చు, లేక కాకపోనూ వచ్చు" అన్న వాదనతోనే. అతి గొప్పగా చెప్పుకునే శంకర (క్రీ.శ. 800) తత్త్వానికి అంతిమ ఫలితం ఇదే. గోచర విశ్వాన్నంతా అగోచర ఆధ్యాత్మిక తరగతులుగా వివిధ అంచెల్లో విభజిస్తాడు శంకరుడు. అన్నిటికంటే ఉచ్చస్థితి - బహుశ: అది ఊహే కావచ్చు; శాశ్వత సత్యాలతో ఐక్యం కావడం. ఇందులో భౌతిక వాస్తవికత అనేదే ఉనికిలోకే రాదు. సాధారణ కర్మకాండలు జరుపుకునే గుంపుతో కూడిన తాత్త్వికుడు కూడా ఇందుమూలంగా క్షమార్హుడవుతాడు. మంత్రోచ్చాటన, రక్తబలులతో కూడిన వైదికయజ్ఞంలో కూడా బౌద్ధ ప్రభావం మూలంగా బ్రాహ్మణుడు అనివార్యంగా అహింసను బోధిస్తాడు. శాకాహారం విధి అయినా - అదే సమయంలో స్మృతి సంహిత లాధారంగా వివిధ రకాలైన మాంసాన్ని బ్రాహ్మణ అతిథులకు, పితృదేవతల ఆత్మశాంతి కోసం ఎలా వండి వడ్డించాలో కూడా నిర్దేశించ బడ్డది. ఇలా అన్ని విధాలైన తార్కిక వైరుధ్యాలను స్వాహాచేసే ఈ సమర్ధ ప్రక్రియ చివరకు భారత జాతి వ్యక్తిత్వం మీద ఎలాంటి ముద్రను వేసిందో ఆధునిక పరిశీలకుల కన్నా ముందుగానే అరబ్బులు, గ్రీకులు గుర్తించారు.

శంకర, రామానుజ, మధ్వాచార్యుల నుండి సూచనలందుకున్న తరువాతి వారు ఉపనిషత్తులను అదే విధంగా వ్యాఖ్యానించారు. వారిలో ప్రతి ఒక్కరూ అర్థాన్ని తమ కనుగుణంగా మెలిద్రిప్పి తమ తమ తత్త్వాలకు వెన్నుదన్నుగా వాటిని మలుచుకున్నారు. మరింత నిష్కర్షగా చెప్పాలంటే తమ తమ దైవిక వాదాలను విశ్వ తత్త్వాలుగా కపట ప్రచారం చేసుకున్నారు. ఇంకా గమనించవలసిన విషయమేమంటే వారిలో ఎవరూ లభ్యమైన ఉపనిషత్తులన్నింటినీ పరిగణనలోనికి తీసుకొనలేదు. వారి వారి అవసరాలను బట్టి, అభిమానాలను బట్టి 'సరిచూచుకొనడం, ఎన్నుకొనడం' అనే ఈ ప్రక్రియ ఒక క్రీడలాగా సాగింది. షాజహాన్ పెద్ద కుమారుడు దారా షుకో విషయంలో ఇదే వరుస సాగింది. హిందూ - ఇస్లాంల సమన్వయానికి ఉపనిషత్తులు దోహదపడతాయనే ఉద్దేశ్యంతో 17వ శతాబ్దం మధ్యభాగంలో కాశీ నుండి కొంతమంది పండితులను రావించి సుమారు 50 ఉపనిషత్తులను పర్షియన్ భాషలోనికి అనువాదం చేయించాడు.

దారా షుకో. 32 1657 సంవత్సరానికి కల్లా ఈ పని పూర్తయింది. దాని ఫలితం అతడు సింహాసనాచ్యుతుడు కావడమేగాక తలను (ప్రాణాలను) సైతం కోల్పోవలసి వచ్చింది. అవిశ్వాసిగా ఎంచి అతడి సోదరుడు

ఔరంగజేబు తిరుగుబాటు చేశాడు. వృద్ధుడైన తండ్రిని ఖైదు చేశాడు. దారా షుకోతో సహా ముగ్గురు సోదరులను చంపించాడు. సింహాసనాన్ని ఆక్రమించాడు.[32]

నేను ముందే చెప్పిన విధంగా క్రిందటి శతాబ్దంలో రామమోహన రాయ్, దేవేంద్రనాథ్ఠాగూర్లు వారి బ్రహ్మసమాజ పవిత్ర గ్రంథ రూపకల్పనలో ఉపనిషత్తులను విరివిగా చర్చించారు. వారి కృషి మూలంగా అవి మరింత సంక్షిప్తమయ్యాయి. దైవ ప్రేరణ అని నమ్మే విశ్వాసాని కనుగుణంగా దేవేంద్రనాథ్ ఠాగోర్ ఒక రోజు మూడు గంటల పాటు ఉపనిషత్తుల నుండి సుదీర్ఘంగా వ్యాఖ్యానించగా వారి సహవాసి ఒకరు దాన్ని అక్షరబద్ధం చేయగా, అదే బ్రహ్మ సమాజపు పవిత్ర గ్రంథంగా రూపొందింది.[33]

రోయర్, ద్యుసేన్, మాక్స్ ముల్లర్, హ్యూమ్, రాధాకృష్ణన్ ఇంకా ఇతరులు దైవ ప్రేరణను గురించి పేర్కొనలేదు. తమకు తోచిన రీతిన ఉపనిషత్తుల నెన్నుకొని వాటిని ఆంగ్లంలోనికి అనువదించారు. హ్యూమ్ తన సంపుటికి 'ది థర్టీన్ ప్రిన్సిపల్ ఉపనిషద్స్" అనే పేరుంచడంలో తగు జాగ్రత్త వహించాడు. ద్యుసేన్ అరువది దాకా అనువాదం చేయగా, అరవిందుడు కేవలం ఎనిమిదింటితో సరిపుచ్చాడు.

ఈ విధంగా ఉపనిషత్తులను భాషాంతరీకరణకు ఎన్నుకునే సంఖ్య విషయంలో గాని లేక వ్యాఖ్యానం విషయంలో గాని తగిన ప్రాముఖ్యత నివ్వడంలో ఏ మాత్రం ఏకరూపత కానరాదు. అయినా ప్రజల్లో వాటిని గురించి చర్చ సాగుతూనే ఉంది. చర్చంటే... సామాన్య చర్చ కాదు, ... చాలా పెద్ద చర్చ - ఉపనిషత్తుల తాత్త్వికతను గురించిన చర్చ. అయితే నిజానికటువంటి తత్త్వమేమీ లేదు. ఉండే అవకాశమేమీ లేదు. ఉండే అవకాశమే లేదు.

చీకట్లో నల్ల పిల్లి

అవును నిజమే. నేను ముందే పేర్కొన్న విధంగా ఉపనిషత్తులకు ఒక తత్త్వం అంటూ ఏమీ లేదు. కారణం చాలా తేలిక. అవి ఒక కాలానికో, ప్రాంతానికో లేక ఒక సాంఘిక వ్యవస్థకు చెందినవి కావు, లేక ఒక రచయిత మేధోజనితాలు కావు. అవి అసంబద్ధ పిడివాదాల, విరుద్ధ సిద్ధాంతాల కుప్పలు. శంకరుడు ఎంచుకొన్నట్లుగా ఏ పన్నెండింటినో ఎన్నుకొని పరిశీలించినా వాటిని ఒక గాటన నిలపడం కష్టం. ఎందుకంటే వాటిలో ఉన్నది ఒక క్రమపద్ధతికి చెందిన తత్త్వం కాదు కనుక. మాక్స్ ముల్లర్ మనతో ఏమంటాడంటే "తత్త్వమంటే క్రమబద్ధీకరించబడిన జానమని". ఇతరుల దృష్టిలో కూడా తత్వ మంటే క్రమబద్ధీకరించబడిన జ్ఞానమనే.[36]

మనం ఏవో కొన్ని ఉపనిషత్తులను ఎంచి చూచినా వాటిని ఒక పద్ధతిగా రూపొందించలేం. అటువంటప్పుడు ఉపనిషత్తులకు ఒక తత్వం ఉందని మాత్రం ఎలా చెప్పగలం? మాక్స్ ముల్లర్ తన పరిశీలన మేరకు ఏమి చెబుతాడంటే ఉపనిషత్తులను తత్త్వం క్రింద వర్గీకరించడం కష్టసాధ్యమని. అందుకనే అవి క్రమబద్ధీకరించబడిన గ్రంథంగా కంటే తాత్త్విక అసంబద్ధాలుగానే తోస్తాయి.[34] మాక్స్ ముల్లర్ కంటే ఏడు సంవత్సరాలు ముందుగానే అంటే ఖచ్చితంగా 1882లో కలకత్తా మదర్సాకు ప్రిన్సిపల్ గా పనిచేసిన అర్చిబాల్డ్ ఎడ్వర్డ్ గౌ ఇదే విధమైన పరిశీలన చేశాడు. "ఉపనిషత్తులు సర్వభూతాల్లో దైవత్వాన్ని సందర్శిస్తూ ఆ భావాన్ని కావ్యరూపంలో వ్యక్తీకరించాయి. అదే భావాన్ని ప్రాథమికంగాను, మొరటు రూపంలో ప్రదర్శించాయి".[35] మరి కొంతమంది

పాశ్చాత్య పండితులు సైతం మరింత నిష్కర్షగా విమర్శించారు. అలాంటి ఒక విమర్శను ఆర్.డి. రనడే పేరును ఉదహరించకుండా పేర్కొన్నాడు.

బహుశః ఆ పాపి పేరు పేర్కొని తన కలాన్ని మలిన పరచుకొన దలచు కొనలేదేమో అతడు. సరే, రనడే పేర్కొన్న ఆ తీర్పు ఇదే. "అవి చాలా ప్రాథమిక కాలానికి సంబంధించినవి, క్షీణిస్తున్న తెగలకు, అనాగరిక, అభివృద్ధి నిరోధక జాతులకు చెందిన కర్తృత్వాలు" నిస్సందేహంగా ఇది కొంత కఠినమైన విమర్శే అయినా ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని మనం తిరస్కరించ గలమా? ఆల్బర్ట్ ష్విట్జర్ మృదువుగా, నాగరికంగా "ఉపనిషత్తుల బోధనల సారాంశం ఏమంటే... అవి సజాతీయమైనవి కావు, వేటి పద్ధతులు వాటివే, వాటిలో ఏకరూపత, సమగ్రత్వం పూర్తిగ లోపించింది". మోరిస్ బ్లూమ్ ఫీల్డ్ కూడా ఉపనిషత్తుల గురించి అదే విధంగా చెబుతాడు. "అనంతర హిందూ తత్వానికి ఉపనిషత్తులు ఎదురులేని విధంగా ప్రేరణ నిచ్చినా నిజానికి వాటిలో ఒకే విధమైన భావధార లేదు. జడత్వంతో, అసంబద్ధాలతో, మూర్ఖ వాదనలతో అవి మనకు విసుగుని కలిగిస్తాయి". ఉపనిషత్తుల గురించే ఇంకా చెబుతూ "వైదిక ఆలోచనా ధార మాదిరే, ఉపనిషత్తుల ఆలోచనా ధార కూడా క్రమమైనది కాదు. అది తత్కాలీనమైనది, ఊహాపోహలతో కూడినది, భావోద్వేగ భరితమైనది. వాటి మార్గం అంతా అగమ్యంగా చికాకుగా ఉంటుంది. మరికొన్ని సందర్భాలలో వాటి ఆరంభమే చిక్కుముడులుగా ఉంటుంది. తరువాత తేలిన క్లిష్టమైన ముగింపులన్నీ మనం నేడు పిలుచుకుంటున్న హిందూ తత్త్వంగా రూపొందాయి.[38]

ఈ విమర్శలన్నీ పక్షపాత వైఖరితో కూడిన పాశ్చాత్యులవని, క్రైస్తవ పండితులనీ మనం త్రోసి వేయలేం. కొంతమంది భారతీయ పండితులు సైతం ఉపనిషత్తుల లోనిది క్రమబద్ధమైన తత్త్వంగా పరిగణించలేదు. ఉపనిషత్కారుల హృదయాలు ధైర్యంగా నిరంతరం స్వేచ్ఛాగానం చేశాయని, తాత్విక భరితమైన వారి మేధలు జీవన వాస్తవాలను గుర్తించాయని అతిగా, అసహ్యంగా కీర్తించిన రాధాకృష్ణన్ సైతం ఉపనిషత్తుల్లోనిది క్రమబద్ధమైన తత్త్వం కాదని, వాటిలో నిండి ఉన్నదంతా అసంగతం, అశాస్త్రీయమేనని అంగీకరించాడు.[39] చివరకు వాటిని తలచుకుంటేనే ఆధ్యాత్మిక పారవశ్యానికి లోనౌతానని చెప్పుకునే ఆర్.డి. రనడే సైతం ఉపనిషత్తుల్లో ఏ మాత్రం తాత్త్విక సిద్ధాంతాలు లేవని, వాటిలో అధిక భాగం కేవలం ఏకత్వవాదం, వైయక్తిక ఆదర్శవాదం, బహుళవాదం, ఆత్మరక్షణ వాదంతో నిండి ఉంటాయని పేర్కొన్నాడు.[40]

సాధారణంగా ఉపయోగించే విశ్లేషణాత్మక పద్ధతిలో కాక నిర్మాణాత్మక వైఖరితో ఉపనిషత్తుల్లోని విరుద్ధ సిద్ధాంతాలను ఏకీకృత సిద్ధాంతంగా కల్పించి చూపడానికి అసమాన సాహసంతో రనడే విశ్వప్రయత్నం చేశాడు; కానీ అపజయం పాలయ్యాడు. నా దృష్టిలో అతి దారుణంగా నా ఓడిపోయాడు. అలాంటి ప్రయత్నానికి కావలసిన సరంజామాలన్నీ సమకూర్చుకున్నాడు, మిక్కిలి శ్రమ పడ్డాడు. కానీ బోరగిల పడ్డాడు, మూర్ఛిల్లాడు. అయితే అతడు తాను ఆధ్యాత్మిక ఆనంద పారవశ్యంలో తన్మయుడైనట్లు మనలను నమ్మించ బూనుతాడు. (రనడే గ్రంథంలోని చివరి ప్రకరణానికి శీర్షికానామం Raptures of Mystic Ecstacy అని ఇక్కడ నేను మనవి చేస్తున్నాను)

అందువల్లనే ఉపనిషత్తుల్లో తాత్త్వికతను వెదకబూనడ మంటే చీకటిగదిలో నల్ల పిల్లిని వెదకబూనడమే. నిజానికి అక్కడసలు పిల్లే లేదు కదా!

బ్రహ్మ ప్రవేశం

ఉపనిషత్తులలో క్రమబద్ధమైన ఉపనిషత్తత్వం అంటూ ఏమీ లేనప్పటికీ వాటికి సంబంధించి కొంత భావజాలం మాత్రం ఉంది. ఉపనిషత్తులు వాటికవే సాటి అంటూ పొగిడేవారు; ఆధునిక విజ్ఞానం, తత్త్వజ్ఞానంతో అవి నిండి ఉన్నాయని భావించేవారు; వాటిని విపరీతంగా అభిమానించే వారి వాదనలు మరీ చోద్యంగా ఉంటాయి. ప్రాథమిక ఉపనిషత్తులు వెలువడే కాలానికి వాస్తవానికి గ్రీకు, పర్షియా, చైనా వంటి చాలా ప్రాచీన సమాజాలలో అటువంటి భావజాలమే వ్యక్తమైంది. తెగలు అంతరించి జాతులుగా రూపొందుతున్న కాలమది; ఒక అధినాయకత్వం అవసరమైన సమయ మది; భిన్నత్వంలో ఏకత్వాన్ని అన్వేషిస్తున్న యుగమది. ఆనాటి భారతదేశంలో పొడచూపిన ఆ సాధారణ భావ సముచ్చయం, ఆ కాలంలో వెల్లువెత్తిన భావోద్వేగమే ఉపనిషద్భావజాలంగా ప్రతిఫలించింది.

అలాంటి ఒక భావమే బహు దేవతారాధన నుండి ఏకేశ్వరోపాసనగా పరిణమించడం. పరిణామాన్ని మనం బృహదారణ్యకంలో గమనించవచ్చు (3-9-1). అసలెంతమంది దేవత లంటూ విదగ్ధ శాలక్యుడు రెట్టించి అడగడంతో యాజ్ఞవల్క్యుడు 3306తో ప్రారంభించి ఆ సంఖ్యను కేవలం 33 కు దించాడు, ఆ తరువాత 6 కు కుదించాడు, ఆ తరువాత ముగ్గు రన్నాడు, రెండు, ఒకటిన్నర అంటూ చివరకు దాన్ని ఒకటిగా తేల్చాడు. ఈ సంఖ్యలన్నింటికీ ప్రతి దానికీ అతడు ఏదో కారణాన్ని చూపుతూ వచ్చినా అవి అన్నీ జ్ఞాన శూన్యాలే.

ఇందులో మనం గమనించవలసిన విషయ మేమంటే అతడి పురోహిత నేపథ్యం నుండి అతడు చేసిన సాము ఏమంటే విభిన్న దేవతలకు, వారి కొనసాగవలసిన యజ్ఞ యాగాదులకు, అందుకోసం పురోహితులకు చెల్లించవలసిన దక్షిణలు, రుసుములు గురించి చెప్పిన యాజ్ఞవల్క్యుడు, చివరకు 3306 వైదిక దేవతలు వాస్తవానికి ఒక్కరే అని అంగీకరించడం. ఈ సంవాదం ఆ కాలపు భావోద్వేగాన్ని, దాని అంతరార్థాలను, అనుమానాలను, సందిగ్ధాలను, విపర్యాయాలను, సత్యాన్ని మరుగుపరచే ధోరణులను ప్రతిబింబిస్తుంది.

రెండవ ప్రధాన భావమేమంటే ఒక్కటిగా పరిణమించిన దైవాన్ని నిర్గుణ బ్రహ్మతో సరిపోల్చడం. ఇక మూడవది ఆత్మను బ్రహ్మలో భాగంగా ఉగ్గడించడం. కీల్ విశ్వవిద్యాలయ ఆచార్యుడైన పాల్ డ్యుసేన్, ఆ కాలానికి ఉపనిషత్తుల గురించి ప్రఖ్యాత విద్వాంసుడుగా పేరుగాంచాడు. ఆయన పెద్దవి, చిన్నవి కలిపి 60 కి పైగా ఉపనిషత్తులను జర్మను భాషలోనికి అనువాదం చేశాడు. ఉపనిషత్తుల పైన విస్తారంగా రచనలు చేశాడు, ఉపన్యాసాలిచ్చాడు. 'ది ఫిలాసఫీ ఆఫ్ ది ఉపనిషద్' అనే ఆయన గ్రంథం 1906 లో వెలువడింది. ఆ మరుసటి సంవత్సరమే డ్యుసేన్ 'ఔట్ లైన్స్ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ' అనే చిన్న గ్రంథాన్ని కూడా ప్రచురించాడు. ఆ సంపుటంలో ఆయన ఉపనిషత్తత్వాన్ని సంగ్రహ పరచి ఈ విధంగా రాశాడు -

రెండు పదాలు : బ్రహ్మ, ఆత్మ దాదాపు ఈ రెండు పదాలను గూర్చే ఉపనిషత్తులు చెబుతాయి. అతి తరచుగా అవి సమానార్థకాలుగా వాడబడ్డాయి. ఎక్కడైనా భేదం పొడసూపితే అది తాత్త్వికార్థంలో బ్రహ్మ - విశ్వాత్మగాను; ఆత్మ - జీవాత్మగాను పరిగణించబడ్డాయి. ఈ విధంగా ఏర్పరచబడ్డ, పూర్వ భావనలతో ఉపనిషత్తుల యొక్క మౌలిక స్వభావాన్ని మనం ఈ క్రింది సమీకరణంతో వ్యక్తం చేయవచ్చు.

బ్రహ్మ = ఆత్మ

బ్రహ్మ మంటే అంతే, ఆ శక్తి నుండే ఈ సర్వజగత్తు లావిర్భవిస్తున్నాయి; అందులోనే పరిణమిస్తున్నాయి; చివరకు ఈ జగత్తులన్నీ అందులోనే లయమౌతున్నాయి. ఇదే శాశ్వతం, సర్వవ్యాపితం. అనంత శక్తివంతం అయిన ఈ శక్తే మన ఆత్మ కూడా. మనలో నిండి ఉన్న ఈ శక్తినే మనం జీవాత్మలుగా పరిగణిస్తున్నాం. మన ఉనికికి ఆధార భూతమైన శాశ్వత సత్యసారం ఇదే. ఇదే మన జీవాత్మ. కేవలం ఈ భావనే ఉపనిషత్తులకు ఎనలేని ప్రాముఖ్యాన్ని గడించింది. సర్వదేశాలకు, సర్వకాలాలకు అతీతమైన ప్రాముఖ్యాన్ని చేకూర్చింది. ప్రకృతి గురించి భవిష్యత్కాలంలో ఎవరెన్ని రహస్యాలు కనుగొన్నా, ఈ భావన మాత్రం ఎప్పటికీ తరగని సత్యమై నిలచి ఉంటుంది. ఈ భావన నుండి మానవాళి ఎన్నడూ విడిపోదు. ఒకవేళ ప్రకృతి రహస్యం మనకవగతమైనా దాని కీలకం ఏమంటే - ప్రకృతి జగత్తును అంతర్దృష్టితో అవగాహన చేసుకునే శక్తిని మనకొసగింది. అదే మనలో (ఆత్మల్లో) నిక్షిప్తమై ఉంది.[41]

డ్యుసేన్ పరిశీలన మేరకు ఈ అధ్యాయం అంతులేని పొగడ్తల మయం, అవధులు లేని స్తోత్ర పాఠాల మయం. నిజానికి ఉపనిషత్తులన్నీ అంతే. డ్యుసేన్ గాని ఇంకా ఇతరులు గాని వారికి తెలిసిన పాత నిబంధన గ్రంథంలోని మొరటు కృత్యాలు, క్రూరత్వాలు; కొత్త నిబంధన గ్రంథంలోని మహత్మ్యాలు, మార్మికతలతో పోల్చుకుంటే ఉపనిషత్తుల వైఖరిలో కొంత నవ్యత, వాటి ఆలోచనా ధారలో ధైర్యం గోచరిస్తుంది. అయితే నిదానంగా ఆలోచించినా, విశ్లేషించినా 'బ్రహ్మ = ఆత్మ' అనే సమీకరణానికి ఆధారమేమిటో, అందుకు ఋజువేమిటో మనకు కనుపించదు. డ్యుసేన్ ముందే చెప్పిన విధంగా ఇది కేవలం పూర్వమే ఏర్పరచుకున్న ప్రమేయం. ఆత్మ (జీవాత్మ) విశ్వాత్మ (బ్రహ్మలో) భాగంగా మనకు కనుపిస్తుంది. ప్రతి కాలంలోను, జాతిలోను వీటి ఉనికిని గురించి సంశయించిన చింతనాపరులున్నారు. దానికి తోడు ఏ రెండు ఉపనిషత్తులు బ్రహ్మ అంటే ఏమిటో, ఆత్మ అంటే ఏమిటో ఖచ్చితంగా ఒకే విధమైన వివరణ ఇవ్వలేక పోయాయి. వాస్తవానికి ఒకే ఉపనిషత్తులో బ్రహ్మ, ఆత్మలను గురించిన నిర్వచనాలు విభేదించాయి. ఈ వైరుధ్యాలను అతి జాగ్రత్తగా సంపూర్ణంగా సేకరించి అరుణ్ శౌరీ తన ప్రసిద్ధ గ్రంథం హిందూయిజమ్ : ఎసెన్స్ అండ్ కాన్సీక్వెన్సలో నిక్షిప్తం చేశాడు. పూర్తిగా ఒక అధ్యాయం - 9వ అధ్యాయం అంతా దీనికే కేటాయించాడు. నేను అలాంటి అసంగతాలకు ఆలవాలమైన తప్పుగా నిలచిన ఉపనిషత్తులకు సంబంధించి రెండు మూడు పరిచ్ఛేదాలను లేక అందులోని భాగాలను ప్రత్యేకించి మీ ముందుంచుతాను.

ముందుగా మనం బ్రహ్మతోనే ఆరంభిద్దాం. అతడు శుద్ధ చైతన్యమా లేక సాకారుడా అంగాంగీ స్వభావుడా లేక సగుణ బ్రహ్మమా? మనం ఇంతకు ముందు దాటి వచ్చిన వ్యాసభాగాల్లో బ్రహ్మను నిరాకార నిర్గుణ బ్రహ్మగనే చదివాం. బృహదారణ్యకం ప్రకారం అందులో భిన్నత్వం మటుకు లేదు. "ఒక ఉప్పుగల్లు లోపల బయట అనే భేదం లేకుండా దాని రుచి ఎలాగైనా ఉప్పగనే ఉంటుంది; అలాగునే ఆత్మ కూడా లోపల, బయట అనే భేదం లేక పూర్తి ప్రజాస్వరూపం మాత్రమే" బ్రహ్మలో ఏ మాత్రం ప్రభేదం పొడకట్ట చూచిన ఏ ఉత్సాహి అయినా భయవిహ్వలుడౌతాడని తైత్తిరీయోపనిషత్ హెచ్చరిస్తుంది. బ్రహ్మ అతి భయంకరంగా అతనికి దర్శనమిస్తుంది. ఇంకా అతడు పెక్కుమరణాల పాలవుతాడని కఠోపనిషత్ హెచ్చరిస్తుంది...

ఇంకా ఉపనిషత్తులు ఇలా చెబుతాయి "అతడికి నాలుగు చరణాలుంటాయి, ఎనిమిది గిట్టలు, పదహారు భాగాలుగా ఉంటాయి", పది అవయవాలుంటాయి, ఇంకా వందలాదిగా అతడికి పూన్చి ఉంటాయి, పదులు, వేలు, అనేకములు, అనంతంగా అతడి శరీరం మూడు లోకాలకు చెంది ఉంటుంది. అతడు రెండు రూపాలుగా ఉంటాడు. స్థూలము, సూక్ష్మమూ; మర్త్యమూ, అమరమూ; సాంతమూ, అనంతమూ; నిర్వచనీయమూ, అనిర్వచనీయమూ ఇంకా అతడు మూడు భిన్న రూపాలను కలిగి ఉంటాడు..."

కౌషీతకి ఉపనిషత్తు బ్రహ్మాన్ని గురించి చేసిన చర్చ పూర్తి భిన్నంగా ఉంటుంది. బ్రహ్మకి ఒక శిరస్సు, ఒక గర్భం, అందులో ఋగ్ సామ యజుర్వేదాలు నిక్షిప్తమై ఉంటాయని చెబుతుంది. అతని రూపాన్ని గురించి, వాటి సంఖ్యను గురించి ఒక సమ్మతి లేదు. అలాగే ఆ రూపాలు ఏ విధంగా సంభవిస్తున్నాయో కూడా ఒక సాధారణ ఒడంబడిక లేదు. అతడి అవయవాలను గురించి ఒక సాధారణ అంగీకారం లేదు. ఛాందోగ్యం ఒక్కటే నాలుగు విధాలుగా చెబుతుంది. భూమి, సముద్రం, అంతరిక్షం, దివం, ప్రాణం, చక్షువు, శ్రోత్రం, మనస్సు, అగ్ని, సూర్యుడు, చంద్రుడు, విద్యుత్తు - ఇందులో ప్రతి ఒకటి పదహారు భాగాలుగా అతడిని రూపొందిస్తుందని చెబుతుంది.[42]

త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్ వేరొక పట్టిక ఇస్తుంది. ప్రాణం, విశ్వాసం, ఆకాశం, వాయువు, కాంతి, జలం, భూమి, అవయవాలు, మనస్సు, ఆహారం, వీర్యం, నిష్ట, మంత్రం, కర్మ, ప్రపంచం మరియు నామం.[43]

ఆత్మకు సంబంధించి ఇదే కథ. ఆత్మను గురించి దాని స్వభావం గురించి పరస్పర విరుద్ధమైన సంగతులు ఎన్నో చెప్పబడ్డాయి. అది కర్త కావచ్చు, కాకపోనూ వచ్చు. ఆనంద విషాదాలకు అది బాధ్యత వహిస్తుందా? తిరిగి మరలా కావచ్చు లేక కాకపోనూ వచ్చు. అది కర్మకు లోబడి ఉంటుందా? తిరిగి మరలా ఉండవచ్చు; లేకపోనూ వచ్చు. మనకు ఆగ్రహం కలిగే విధంగా ఎప్పుడూ అనిశ్చయమే; రోత పుట్టేటట్లు తప్పించుకు పోయే జవాబులు. అందుకే డ్యుసేన్ సమీకరణాన్ని మనం ఈ క్రింది విధంగా మార్పు చేద్దాం : బ్రహ్మ/00 = ఆత్మ/00 = 0.

హేతుబుద్ధి కలవారెవరికైనా ఉపనిషత్తులు ఒక పిచ్చి వారి నుంచే గృహంగా తోస్తాయి; కానీ మన వేదాంతులు వాటిని ఉన్నతమైన తత్త్వంగా సంభావిస్తారు. నిజానికి రాధాకృష్ణన్ ఉపనిషత్తులకు చేసిన అనువాద పీఠికలో చెప్పినట్లు ఆధ్యాత్మిక హేతుబద్ధ మనస్కుడికి మాత్రమే సత్యం అవగత మవుతుందంటాడు. అయితే ఆయనకు వినమ్రంగా నే చెప్పేదేమంటే నిజానికీ 'ఆధ్యాత్మిక హేతుబద్ధత' అనేది లేనే లేదు. హేతుబద్ధం కానిది ఏదైనా ఉంటే అది సాధారణంగా, స్వచ్ఛంగా, సంపూర్తిగా అహేతుకమే.

మానవ బహిష్కారం

ఉపనిషత్తుల చింతనాధారలో, నిజానికి మానవజాతి ఆలోచనా క్రమంలో అత్యుత్తమమైనవి, సంక్షిప్తంగా, సత్యప్రకటనలుగా రెండు మహా నీతివాక్యాలుగా చెప్పబడుతున్నవి తత్వమసి "అది నీవై యున్నావు" (ఆ బ్రహ్మము నీవై యున్నావు) (ఛాందోగ్యం 6.8) మరియు అహం బ్రహ్మాస్మి "నేనే బ్రహ్మమును" (బృహదారణ్యకం (1.4.10) ఇది మానవుడి స్థితిని భగవంతుని సరసకు చేర్చడమే. అయితే ఉపనిషత్తులు ఆ విధంగా చేశాయా? లేదు, లేనే లేదు. "మనుష్యుని కాదు కానీ, భౌతిక శరీరం లేని రూపరహితమైన ఆత్మను" మాత్రం వారు ఉద్ధరించారు. అంటూ అరుణ్ శౌరీ సరిగానే సూచిస్తూ దాన్నీ విధంగా విశదం చేశాడు.

ఉనికిలో ఉన్న ఒక ప్రత్యేక గుణవిశేష్యాన్ని మరొక విశేషంతో సమానం చేశారు. అనుభవ జ్ఞాన సంపన్నుడైన మానవుడు దూషించబడ్డాడు, పరిహాస మొనర్చబడ్డాడు. అతని శరీరము దూషించబడ్డది. అతని వాంఛలు నిందించ బడ్డాయి. ఇంద్రియాలు మాయాజాలాలుగా వర్ణించబడ్డాయి. అతని మనస్సు, ఆలోచనా శక్తులు వృక్షాల మీద విచ్చలవిడిగా తిరిగే మర్కటాలుగా, గమ్యం లేకుండా గ్రామ వీధుల్లో తిరుగాడే ఊరకుక్కలుగా వర్ణించబడ్డాయి. ఈ సిద్ధాంతం మాటునే మన రుగ్మతలను బాగుచేసే నెపంతో మనమెరిగిన మానవస్వభావాన్ని హతం చేయటం జరుగుతున్నది.[44]

స్త్రీలు ఇంకా వందల రెట్లుగా దూషించబడ్డారు. ముందటి వ్యాస భాగాల్లో చెప్పిన విషయాన్ని నేను పునశ్చరణ చేస్తున్నాను. ఇంతకు ముందే స్త్రీలను వేదాంతులు ఎలా పరిగణించారనే విషయంలో కీత్ చేసిన ఖండనను నేను ఉల్లేఖించాను. ఆమెను (స్త్రీలను) మాయాజాలంగా, చేపగాలానికి గుచ్చే 'ఎర'లా వర్ణించారు. పురుషుణ్ణి దహించి వేసే జ్వాలగా పేర్కొన్నారు. చివరకు మహిళకు మాతృమూర్తిగా కూడా సముచిత స్థానమొసగలేదు. 'గర్భోపనిషత్తు' అని పిలువబడే ఒక ఉపనిషత్తు మాతృగర్భాన్ని "నరకంలో తుక తుక ఉడుకుతున్న బాన"లా వర్ణించింది. జీవితమొక మాయాజాలం, ఒక బోను, ఒక వేదన, అదొక మరణ పరంపరగా వర్ణించాయి. మనిషి తప్పనిసరిగా జీవించేది కేవలం ఈ జనన మరణ చక్రబంధం నుండి విముక్తుడు కావడం కోసమే. ఆ క్రమంలో అతడన్ని సౌఖ్యాలను విషతుల్యంగా విసర్జించినపుడు, ఈ జగత్తు నొక మిథ్యగా తలపోసినపుడే అది సాధ్యపడుతుంది.

వీటితో ఎంత తక్కువ బంధం కలిగి ఉంటే సంసార దుఃఖాల నుండి విముక్తుడయ్యే అవకాశాలు అతనికి అంతగా విస్తరిస్తాయి. అతడి ఏకైక లక్ష్యం ఆత్మను బ్రహ్మైక్యం గావించడమే. అందువల్లనే శౌరీ తీక్షణమైన అంతర్దృష్టితో ధైర్యంగా ఈ విధంగా విశదీకరించాడు.

మన మొనరించే ప్రాపంచిక కర్మలన్నీ ప్రత్యేకించి మన భౌతిక అస్తిత్వం కాపాడ బడటానికే, మన లక్ష్యాల సాధనను పరిశీలించడానికి, మన శరీరాలు నిలచి ఉండటం కోసమూ అనంతర మన ప్రాపంచిక కర్మలన్నీ గతిస్తాయి. మనం సర్వులము ఈ - ప్రాపంచిక కర్మలలో నిమగ్నులమై ఉంటాం, మనం సరైనదే అనుకున్న దానిని నెరవేర్చడంలో విఫలమైనప్పుడు తగిన శిక్ష పొందడానికి సర్వదా సన్నద్ధులుగా ఉంటాం. అదే నేరమైతే తాను చేసింది తప్పు అనే భావన మనలను అంతర్గతంగా తొలచివేస్తూనే ఉంటుంది.

ఇహంలో పొందే సౌఖ్యానికి మనం చేస్తున్నది ఏమీ లేదు. ప్రతి చర్య చివరకు భోజన శౌచ్యాదులు సైతం ఏవో ఉన్నత ప్రయోజనాల కోసం చేస్తాం. వివాహం సహజీవన సాహచర్యం కోసం కాక సంతానోత్పత్తి కోసం చేసుకుంటాం. సంతానోత్పత్తి కూడా మన చుట్టూ చిన్నారులు తిరుగాడుతుంటే పొందే ఆనందం కోసం కాక మన అంత్యకర్మలు నిర్వహించడానికి పుత్రుడవసరం కాబట్టి, మరణాంతరం ఆత్మ శాంతి కోసమూను; పుత్రిక అయితే ఆమెకు వివాహ మొనరిస్తే మన పుణ్యఫలం పెరుగుతుంది కనుకను. చివరకు ప్రకృతిని కూడా దానిలో దాగి ఉన్న అంతర్గత సౌందర్యం దృష్ట్యా కాక పురుషుడి ప్రత్యుత్పత్తి శక్తికి అది తార్కాణంగా నిలుస్తుంది కనుక దాన్ని ప్రశంసిస్తాం. చివరకు తాంత్రిక సంప్రదాయంలో ఇతర విధాల శాఖల కంటే స్త్రీకి ఉన్నత స్థాన మొసగినప్పటికీ - ఇప్పటికీ స్త్రీని సహచరిగా కాక కేవలం ఆమెను 'పదార్థం' గానే పరిగణిస్తాము. ఎందుకంటే బ్రహ్మైక్యం చెందే లక్ష్యసాధనలో ఆమె ఆటంకం కనుక.

మతపిచ్చి ఎడతెగని, ప్రత్యేకమైన ఏకైక లక్ష్యంగా మన నిత్యజీవితాల్లో ప్రవేశించింది. రాళ్ళు రప్పలు, స్థలాలు, వృక్షాలు, తిథులు రోజులు, అవశేషాలు, పాత్రలు సెమ్మెలు, చిత్తు కాగితాలు, విగ్రహాలు, పటాలు ఇవన్నీ పవిత్రతనందుకున్నాయి. అయితే మతధర్మం వీటన్నింటిని ఉద్ధరించింది అనుకుంటే పొరబాటే... ఇహం ఏ మాత్రం ఉద్ధరించబడలేదు, ఆ పరమే క్రిందకు లాగబడ్డది. పరలోకం (స్వర్గం) కోసం వెదుకులాటలో చివరకు ఇహమే అనుసరించబడ్డది. ఆ పరాన్ని అనుసరించే క్రమం బాహ్యాడంబరాల రొచ్చు గుంటలలో పటాలు, తాయెత్తులు, యాత్రలు, క్రతు కర్మకాండల స్థితిలోనికి దిగజారి పోయింది. పవిత్ర వస్తువులన్నీ వాటికి పవిత్రత నాపాదించే కొలదీ సామాన్య స్థాయికి దిగజారి పోయాయి.

ఆ విధంగా చెప్పబడ్డ లక్ష్యం, ఆధ్యాత్మిక లక్ష్యం, పదే పదే ఘోషించబడ్డ ఆ లక్ష్యం ప్రజలను ఇహపరమైన ప్రవృత్తి నుండి దూరంగా ఉంచలేక పోయింది. అయితే వారేమి చేస్తున్నా ఊసరవెల్లిలా రంగులు మార్చే పద్ధతి దిశగా మాత్రం వారిని బలవంతంగా మరల్చింది. మన అస్తిత్వంలోనే అది ఆత్మవంచనను ప్రవేశ పెట్టింది.

ఎంతటి నిష్ఠుర సత్యం! ఆత్మవంచన మన రెండవ స్వభావంగా మారింది. మన ప్రజలకు అది ఒక గుర్తింపుచిహ్నం, ఒక పతాకం, ఒక కిరీటం. మనంతటి విస్తారంగా నైతిక ఆధ్యాత్మిక విలువలను ప్రవచించే దేశంగాని, జాతిగాని మరొకటి కనరాదు, వినరాదు. అయినప్పటికీ ఆ విలువలను మనం కాలి క్రింద అణగద్రొక్కాం. ఇది హఠాత్తుగా ఊడిపడిన మార్పేమీ కాదు.

జీవితంలో ఉన్నత విలువలను మనం అధఃపాతాళానికి త్రొక్కడం ఈనాటిది కాదు. మన విలువలు పాతాళమార్గం పట్టిన విధం శతాబ్దాల నాటిదే. మనం మొదటిగా శంకరుణ్ణి మన ప్రథమ తత్త్వవేత్తగా అంగీకరించిన కాలం నాటిది. ఇతర భాషల్లో ఉన్నదో లేదో నాకు తెలియదు కాని తెలుగుభాషకు సంబంధించి మటుకు ఒక పాత సామెత ఇలా హెచ్చరిస్తుంది "వేదాంతులొస్తున్నారు! మీ చట్లు, పుట్లు జాగ్రత్త"!

రెండు రాక్షస శిశువులు

క్రిందటి వ్యాసంలో నేను మీ ముందుంచదలచిన రెండు భాగాలను మరిచాను. అవి కర్మ, పునర్జన్మలకు సంబంధించిన రెండు అహేతుక సిద్ధాంతాలు. అవి ఉపనిషత్కాలానికి చెందిన రెండు రాక్షస శిశువులు. ఆ సిద్ధాంతాలకు జనకులెవరో మనం చాలా ఖచ్చితంగానే నిర్ణయించవచ్చు. కర్మ సిద్ధాంతానికి యాజ్ఞవల్క్యుడు కర్త కాగా, పునర్జన్మ సిద్ధాంతానికి ప్రవహణ జైవలి 46 పెంపుడు తండ్రి. నా ఆరోగ్యం అనుమతిస్తే ఈ రెండు సిద్ధాంతాల మీద ప్రత్యేకించి ఒక పరిశోధన పత్రం రాయటానికి నేను ప్రణాళిక వేసుకున్నాను, అయితే ఇక్కడ మాత్రం వాటిని గురించి చాలా సంక్షిప్తంగా రాస్తున్నాను.

కర్మకుగాని, పునర్జన్మకు గాని రుగ్వేదంలో స్థానం లేదు. కర్మ అనే పదం వేదంలో తరచు కనుపించినా అంతకంటే ఎక్కువగా తదనంతర వేద సాహిత్యంలో ప్రత్యేకించి బ్రాహ్మణాల్లో కనుపిస్తుంది. అయితే మత కర్మకాండగానో, ఆచారంగానో, క్రతువుగానో, లేక యజ్ఞ విధి వంటి అర్థాలలోనే అది మన కగపడుతుంది. అయితే దాన్ని మసిపూసి మారేడుకాయ చేసి దానికొక విపరీతార్థాన్ని కల్పించింది యాజ్ఞవల్క్యుడు మాత్రమే. నేను మరి దానికి మరింత చెడును చేర్చబోతున్నానా! ఆ రోజుల్లో దుష్టులు, కపటవర్తనులైన వారు దాన్ని విధివ్రాతగానో, గమ్యం (చెడు గమ్యం) గానో లేక జీవితాన్ని అధమాధమ స్థాయికి తీసుకువెళ్ళే తప్పుగానో వాడేవారు. భారతదేశ ఆలోచనా క్రమం కూడా అలానే ఉండేది.

యాజ్ఞవల్క్యుని మేధోజనిత శిశువైన ఈ కర్మసిద్ధాంత నేపథ్యం గురించి బృహదారణ్యకం[47]" విస్తారంగా విశదీకరిస్తుంది.

విదేహ రాజైన జనకుడొనర్చిన యజ్ఞానికి కురు పాంచాల ప్రాంతాలకు చెందిన ఋషులు అనేకమంది హాజరయ్యారు. అక్కడ సమావేశమైన ఋషుల నుద్దేశించి జనకుడు "మీలో అందరి కంటే జ్ఞానియైన వాడు నేను బహుమానంగా ఒసగుతున్న ఈ సహస్ర గోవులను స్వీకరించ వచ్చునంటూ" పలికాడు. అందుకు ప్రతిగా యాజ్ఞవల్క్యుడు తన శిష్యునితో " . "ప్రియమైన సామశ్రవ! ఈ గోవులను తోలుకు వెళ్ళు" అంటూ పలికాడు. ఆ చర్యను గర్వోన్మత్తతగా తలచిన ఇతర ఋషులు కుపితులైనారు. వారిలో కొందరు యాజ్ఞవల్క్యుని వద్దకు వచ్చి ఆత్మజ్ఞానాన్ని గురించి, యజ్ఞవిధులను గురించి, తత్సంబంధిత విషయాలను గురించి ప్రశ్నించారు. చివరకొచ్చేసరికి జరత్కారవ ఆర్తభాగుడు ఈ విధంగా అడిగాడు. "యాజ్ఞవల్క్యా! మనుష్యుడు మరణించినపుడు అతని వాక్కు అగ్ని యందును, ప్రాణము వాయువు నందును, అతని చక్షువు సూర్యుని యందు, మనస్సు చంద్రునిలోను, శ్రోత్రము దిక్కుల యందును, అతని శరీరము భూమి యందు, అతని ఆత్మ ఆకాశము నందును, అతని శిరోజములు ఓషధుల యందును, అతని కేశములు వృక్షముల యందును, రక్త వీర్యములు జలము నందును లీనమగునని నీవు చెప్పుచున్నావు. మరి తరువాత ఈ పురుషున (జీవున) కాధార మేమి?"

అంతట యాజ్ఞవల్క్యుడు ఈ విధంగా చెప్పాడు "ప్రియమైన ఆర్తభాగా! నా చేతినందుకో, మన మిరువురం మాత్రమే ఈ విషయాన్ని గురించి తెలుసుకొందాం. ఈ జన సమూహములో ఈ విషయాన్ని గురించి మాటలాడటం తగదంటూ" ఇరువురు ఋషులు ఆ జనసమూహం నుండి నిష్క్రమించారు. బహుశ : ఏమైనా రహస్య ఒప్పంద కోసమేమో మరి. కానీ వారిరువురు తిరిగి వచ్చేటప్పుడు మాత్రం కర్మను ప్రశంసిస్తూ ఇలా అనుకుంటున్నారు.

మంచి కర్మలు చేసిన వారు మంచి వారుగా, చెడు కర్మలు చేసిన వారు దుష్టులుగా ఉంటారు. ఆ తరువాత బృహదారణ్యకం ఆర్తభాగుడు శాంతించాడని చెబుతుంది(3-2-5 , 3-2-6).

మంచి కర్మలు చేసిన వాడు మంచివాడుగా, చెడు కర్మలు చేసిన వాడు దుష్టుడుగా రూపొందుతాడనే విషయాన్ని ఎవరు కాదంటారు? కానీ ఇక్కడ మోసమే మంటే నీ మంచి చెడ్డల ఫలితం జన్మ నుంచి జన్మకు సంక్రమిస్తుందనే విషయం. వెబర్ న్యూ వరల్డ్ డిక్షనరీ కర్మను గురించి ఒక సమగ్రమైన నిర్వచనాన్ని ఇచ్చింది. అది ఈ విధంగా ఉంది. హిందూ మతంలోను, బౌద్ధంలోను వ్యక్తి ప్రస్తుత అస్తిత్వపు సంపూర్ణ చర్యల ఫలితం తరువాయి అస్తిత్వపు విధిని నిర్ణయిస్తుంది. తేలికగా చెప్పాలంటే విధి వ్రాత, గమ్యం అనే అర్థంలోనే వాడుక.

దీంతో మన జన్మజన్మలను గురించిన తలపుకు కారణమైంది. ఈ విధమైన దుష్ట సూత్రీకరణను ప్రవేశపెట్టిన వాడు ప్రవహణ జైవలి. నిజానికీ పునర్జన్మ సిద్ధాంతాన్ని అతడు కనుగొనలేదు. నిజాని కాతడు దాన్ని గఫ్ 48 సూచించినట్లు అరువు తెచ్చుకున్నాడు. మన దేశ మూల వాసులైన తెగల నుండి, బహుశః సంతాల్ తెగల నుండి అరువు తెచ్చుకున్నాడు.

అతి క్రూరమైన ఈ రెండు కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలు కలిసి ప్రతి అసమానతను, అన్యాయాన్ని సమర్థించినై. ఎందువల్ల ఒకడు “భూసురుడు" మరొకడు అస్పృశ్యుడయ్యారు? కేవలం వారి గత కర్మల వల్లనే. ఒకరు ధనవంతుడు కాగా మరొకడు పేదవాడుగా, ఆకలితో అలమటిస్తున్నా డెందుకు? వారి గత జన్మ కర్మల వల్లనే. ఒక వ్యక్తి జననం, జీవితంలో అతడి స్థితి, అతడి సంతోషం, దుఃఖం, అతడి గురించిన ప్రతి చిన్న విషయం అతడి గత కర్మల వల్ల ముందుగానే నిర్ణయమవుతుంది. కర్మ అనేది విశ్వ నియామాలంత కఠినమైనది. దేవతలు సైతం దాని బారి నుండి తప్పుకొనలేరు. కర్మ పరిపాకంలో జోక్యం చేసుకొనడమంత తెలివితక్కువ తనం మరొకటి లేదు. అంతేకాక అది అతి పాపం కూడాను. ఏ వ్యక్తి అయినా దారిద్ర్యం చేత, ఆకలి బాధ చేత, రుగ్మతల చేత, వేదన చేత, కన్నీళ్ళ చేత తగిన మూల్యం చెల్లిస్తున్నాడంటే అతడు గత జన్మలోనో, జన్మలలోనో చేసిన పాప ఫలితమే. కరుణ పేరుతోనో, దయ సహానుభూతుల పేరుతోనో జోక్యం కలుగచేసుకొనకుండా అతడి చిట్టాలోని పాపాన్ని తగ్గించుకొన నియ్యాలి మనం. ఇంతటి కాఠిన్యత, అమానుషత్వం గూడు కట్టుకున్న ఈ సమాజంలో మనం ఇంతటి ఆత్మ వంచనతో బ్రతకడం అవసరమా? ఎంతటి సామాజిక ఎంతటి రాజకీయ అణచివేత? ఇవి ఇలానే అసమత? ఎంతటి ఆర్థిక అసమానత? ఉండాలా? ఎంతటి అద్భుతం? ఆ అణగ ద్రొక్కబడిన జన బాహుళ్యం తమ పీడకుల నెందుకు కోపంతో ఎన్నడూ ప్రతిఘటించరు? ఎంతటి అద్భుతం?

అతి హేయమైన, అహేతుకమైన ఈ కర్మ పునర్జన్మ సిద్ధాంతాలు రెండూ మనిషికి మనిషికి మధ్య నెలకొన్న అమానుషత్వాన్ని మాత్రమే సమర్థించడం కాదు, సమాజంలోని పీడితులు, తాడితులు, నిరాధారులు, అణగారిన వారెవ్వరూ తమ బాధల తాలూకూ చిన్న మూలుగునైనా పైకి వినిపించనీయకుండా సముదాయిస్తున్నాయి.

బూకరింపే ప్రధాన ఆయుధం

పిడివాదాలకు బూకరింపే ప్రధాన ఆయుధం. వాటికి బూకరింపు వెన్ను దన్నుగా, బలంగా నిలవకపోతే పిడివాదాలు (అహేతుక సిద్ధాంతాలు) ఈనాటికీ మనలేవు, విజయాన్ని వరించలేవు.

ఏవో అక్కడక్కడ కొన్ని మినహాయింపులు తప్ప ఉపనిషత్కాల ఋషులందరూ బూకరింపుగాళ్ళే. వారందరిలో రెండో మాటకు తావు లేకుండా సర్వ ప్రథముడుగా వచ్చేది యాజ్ఞవల్క్యుడు. అతి గొప్ప ప్రసిద్ధిగాంచిన సేనానాయకులైన అలెగ్జాండరు, హన్నిబాల్ లేక నెపోలియన్ల వలె యాజ్ఞవల్క్యుడు గొప్ప వాక్చాతుర్య వ్యూహరచనా నిపుణుడు, మంచి ఉపాయశాలి. ఎప్పుడు ఎలా వెనుకకు మరలాలి, ఎక్కడ ఆగాలి, మరల ఎలా ఎదురుదెబ్బ తీయాలో కూడా అతనికి తెలుసు. అతడు అకస్మాత్తుగా చేసే దాడిలో అతడి ఆనుపానులు ఎవరికీ ఎప్పుడూ తెలిసేవి కావు. అతడు తనకు కావలసిన సంబారాలన్నీ జాగ్రత్తగా సమకూర్చుకునేవాడు. అతడు తన యుద్ధాన్ని కొనసాగించేవాడు, అది కేవలం 'వాగ్యుద్ధ'మే అయినా, యుద్ధం కంటే ఎక్కువగా ఇవన్నీ చూచుకునేవాడు. ఇందులోనే యాజ్ఞవల్క్యుడు తన నేర్పరితనాన్ని, ఆధిపత్యాన్ని చూపేవాడు.

విదేహరాజైన జనకునితో మొదటిసారి సాగిన సంవాదంలో అగ్ని క్రియ (యజ్ఞం) గురించి యాజ్ఞవల్క్యుడు మహారాజు ప్రశ్నలకు పూర్తిగా, సంతృప్తిగా సమాధానాలు ఇవ్వలేకపోయాడు. ఆ సందర్భంలో అతని సహచరులైన శ్వేతకేతు, సోమాసుస్మి కంటే కొంత మెరుగనిపించినా కేవలం ఒక వంద గోవులను మాత్రమే బహుమానంగా స్వీకరించ గలిగాడు. మహారాజు ప్రశ్న - జవాబుల అంకం నుండి నిష్క్రమించే నాటికి ఆ బ్రాహ్మణ పురోహితు లిద్దరూ పూర్తిగా పరాజితులై మహారాజును తప్పనిసరిగా సంవాదంలోనికి సవాలు చేశారు. ఇక మిగిలిన కథాభాగానికి గాను నేను వింటర్నిట్జు ఉల్లేఖించ దలచుకున్నాను.

యాజ్ఞవల్క్యుడు వారి బుద్ధిని ఎలాగోలా మరల్చి వారితో ఈ విధంగా అంటున్నాడు “మనం బ్రాహ్మణులం, అతడు క్షత్రియుడు. మనం అతనిని జయించినట్లయితే ఎవరిని జయించినట్లు మనం చెప్పుకుంటాం? అతడు గనుక మనలను జయించినట్లయితే ప్రజలు మనలను గురించి ఏమనుకుంటారు? ఒక క్షత్రియుడు బ్రాహ్మణులను జయించినాడని. అటువంటి తలపులు అస లేమాత్రం రానీయవద్దు!" దాంతో ఇద్దరు పురోహితులు అందుకు సమ్మతించారు. అంతటితో యాజ్ఞవల్క్యుడు తనకు ఉపదేశం ఇమ్మని మహారాజు జనకుని ప్రార్థించారు.[49]

అదే యాజ్ఞవల్క్యుడు సంవాదంలో ప్రత్యేకించి తనను ప్రశ్నలడిగే వారిని దబాయించి నిరుత్తరులను చేసే కళలో ఆరితేరిన తరువాత జనకుని శిష్యునిగా తన అవతారం చాలించి గురువుగా అవతరించాడు. ఒకానొక దశలో యాజ్ఞవల్క్యుని ఉపదేశం విన్న జనకుడు వివశత్వంతో తన విదేహ రాజ్యాన్ని సమర్పించుకొనడమేగాక తన్ను తాను సేవకుడిగా, బానిసగా సమర్పించుకున్నాడు. అయితే కోశాగారం నుండి ఎప్పటి కప్పుడు తను కావలసిన ధనం తీసుకునే వీలుండగా కృతజ్ఞతా రహితమైన రాచరికపు పన్నులు వసూలు చేసుకునే అధికారం స్వీకరించడానికి యాజ్ఞవల్క్యుడు తెలివితక్కువ వాడేం కాదు కదా!

ఏ విధమైన ప్రశ్నలకైనా అర్హత లేకుండానే అంతిమ నిర్ణయాధికార స్వరంతో' జవాబు లియ్యడం యాజ్ఞవల్క్యుడు అనుసరించే అతడి కిష్టమైన కిటుకు. ఇదిగో దానికిదే చక్కని తార్కాణం.

మనుష్యులలో సంపద కలిగిన వాడు అదృష్టవంతుడగును. ఇతరుల కధిపతి యగును. సర్వవిధ భోగములు అతనికి చేకూరును. ఆ ఆనందమే మనుష్యుల పరమానందం. ఇటువంటి నూరు రెట్ల (మనుష్య) ఆనందములతో పితృ లోకములను జయించిన ఆనందం కలుగును. అటువంటి పితృ లోకములను జయించిన ఆనందములు నూరు చేరిన గంధర్వలోక ఆనందమగును. నూరు గంధర్వలోక ఆనందములు తమ ఉత్తమ కర్మల చేత దైవత్వం పొందిన దేవతల ఆనంద మగును. అట్టి దేవతల నూరు ఆనందములు (సరాసరి) దేవతగా జన్మించిన వారి ఆనందమునకు సమానము. వేదములు నేర్చిన వాడును, పాపరహితుడు, కామనా రహితుడైన అట్టివానికే ఈ ఆనందం లభించును. అట్లు జన్మ చేతే దైవత్వము పొందిన వాని నూరు ఆనందములు ప్రజాపతి లోకమున కొక యానందమగును. ఇట్టి యానందము వేదము నేర్చిన వాడును, పాపరహితుడు, కామనా రహితుడు అయిన వ్యక్తికిని లభించును. నిజముగా ఇదియే ఉన్నతలోకము. ఓ మహారాజా! ఇదియే బ్రహ్మలోకము. (బృహదారణ్యకం 4-3-30)

యాజ్ఞవల్క్యుడు ఏకరవు పెట్టినన్ని వివిధ లోకాలను ఏ విమాన యాన సంస్థ ప్రతినిధి కూడా చెప్పలేడని నేను నిశ్చయంగా చెప్పగలను. నిజంగా ఇదంతా పనికిరాని అజ్ఞానం. అయితే ఇదంతా కన్ను చెదిరినందు వల్లనో లేక మాటలు తొట్రుపడినందు వల్లనో జరిగినది కాదు. జ్ఞానం వలే అన్ని లోకాల పితృలోకం మొదలు బ్రహ్మలోకం వరకు అతడు అరచేతిలోని పేర్లను ఏకరవు పెట్టాడు.

ఏ సందర్భంలోనైనా అతడు ఎంతటి చిక్కు సమస్యలో ఇరుక్కున్నా అతడు దాని నుండి ఏదో విధంగా బయటపడే వాడు. ఆర్తభాగునితో చేసుకున్న రహస్య ఒప్పందం విషయం మనకు ఇంతకు ముందే తెలుసు కదా. ఇతర విధాలైన పద్ధతులన్నీ విఫలమైనప్పుడు, పట్టినపట్టు విడవకుండా ప్రశ్నిస్తుంటేనూ అతడు తన ప్రత్యర్థిని నోర్మూసుకొమ్మని దబాయిస్తాడు, విపరీత పరిణామాలకు గురి కావలసి వస్తుందని హెచ్చరిస్తాడు. ఆ విధంగా గార్గి కఠినతరమైన ప్రశ్నల పరంపర సంధించినపుడు అతడామెతో ఈ విధంగా అంటున్నాడు.

"గార్గి అతిగా ప్రశ్నించకు. నీ తల నేల రాలుతుంది. నిజానికి నీవు ఇప్పటికే . దైవత్వాన్ని (బ్రహ్మన్ని) గురించి హద్దు మీరి ప్రశ్నించావు, ఇక దాన్ని గురించి ఏమాత్రం ప్రశ్నలు వేయకు గార్గి, అతిగా ప్రశ్నించకు."
అంతటితో గార్గి వాచక్నవి మౌనం దాల్చింది.(బృహదారణ్యకం 3.6)

యాజ్ఞవల్క్యుడు. ఉపనిషత్కాలానికి అనేక విధాల ఉదాహరణలుగా నిలుస్తాడు. ఉపనిషత్ ప్రవర్తకులంతా పిడివాదులే, అహేతుక సిద్ధాంత ప్రవర్తకులే. వారికి చాలా తెలుసునని నటించేవారు, సమస్తం తెలుసునని బుకాయించేవారు. సర్వకాలాలకు చెందిన అసాధారణ ఆలోచనా పరులుగా, జ్ఞాన సంపన్నులుగా వారిని గౌరవించాలని మనలను అడుగుతారు. నిజానికి భగవంతుని దగ్గరకు చేర్చే రాజ మార్గం తమ వద్దనే ఉందని నమ్మించ జూస్తారు.

మోక్ష బేరం

దక్షిణల కోసం పురోహితులు ఏమైనా చేస్తారు. మీ కోసం యజ్ఞాలు నిర్వహిస్తారు, దక్షిణలు స్వీకరించి. మీ తరఫున పూజ లొనరిస్తారు, దక్షిణలు స్వీకరించి, మీకై భగవంతుడి ఆశీర్వచనాల కోసం ప్రార్థిస్తారు, దక్షిణలు స్వీకరించి. మీకు ఉపదేశం చేస్తారు, దక్షిణలు స్వీకరించి. ఉపనిషత్తుల లోని ఋషులందరూ పురోహితులే. మీ కోసం ఏం చేసినా వారు దక్షిణల కోసం పట్టుపడతారు. చివరకు మోక్షమార్గం కూడా మాకే తెలుసునంటూ, దానిని చూపించడానికి దక్షిణల కోసం పట్టుపట్టేవారు.

వారి సేవలన్నీ దక్షిణలు గుంజుకోవడానికని తెలిసికూడా, ఎవరైనా పురోహితుడు ఉపదేశం నిమిత్తం వచ్చాడంటే, అతడేదో మనసైన దక్షిణ కోసం వచ్చాడనే; దాన్ని మహారాజు విధిగా నెరవేర్చాల్సిందే. కాశీ రాజైన అజాత శత్రువు దగ్గరకు గార్గేయుడు వచ్చి "నీకు బ్రహ్మము నుపదేశింతును" అన్న దానికి మహారాజు ప్రత్యుత్తరం ఈ విధంగా ఉంది "ఉపదేశానికి ప్రతిఫలంగా నేను నీకు వెయ్యి గోవులు సమర్పించుకుంటాను". గార్గేయుడి కంటే మహారాజే అధిక జ్ఞాన సంపన్నునిగా ఋజువైనా రెండవ వారు బహుమానం స్వీకరించలేక పోయారు. అయితే అది వేరే కథ.[50]

గార్గేయుడికి భిన్నంగా యాజ్ఞవల్క్యుడు ఒకే రకంగా దక్షిణలు వసూలు చేసేవాడు. ఒకసారి కంటే మరొకసారి ఎక్కువగా వసూలు చేసేవాడు. అతడే మాత్రం విధి నిషేధాలు లేని ఋషి. అతడి కిద్దరు భార్యలు మైత్రేయి మరియు కాత్యాయని. అతడు మంచి ఆహారమంటే ఇష్టపడేవాడు. నిజానికి ఒక సందర్భంలో మీరు పశు మాంసం భుజిస్తారా? అని అడిగిన దానికి అతని ప్రత్యుత్తర మీ విధంగా ఉంది "లేదు, అతి లేతగా ఉంటే తప్ప." చవులూరించే మృదువైన పశు మాంసంతో బాటు ముంతల కొద్దీ వేదకాలం నాటి మద్యమైన సోమరస పానం చేసేవాడు. ఈ విధంగా చెప్పడంలో అతన్నే మాత్రం కించపరచడం లేదు. ప్రసిద్ధి గాంచిన పురోహితుడిగా అతడనేక యజ్ఞాలు నిర్వహించాడు. ముంతల కొద్దీ సోమరస పానం చేయకుండా మీరు వైదిక యజ్ఞాల్ని ఎలా నిర్వహిస్తారు? ముందు వెనుక లాడకుండా ఒక ఉపదేశికుడుగా, సంవాదకుడిగా దక్షిణలు గుంజుకునే యాజ్ఞవల్క్యుడి ఏకైక వైనం గురించి మనం బృహదారణ్యకం ద్వారా తెలుసుకోవచ్చు. అతడు జనక మహారాజు నుండే 6100 పైగా గోవులు స్వీకరించాడు. నిజంగానే మూడవ సందర్భంలో జనకుడిని కలిసినప్పుడు మాత్రం వెయ్యి గోవులు, ఏనుగంత ఎద్దుని స్వీకరించడానికి "ఎవరికిని పూర్తిగా ఉపదేశించక ముందే ఏమియు స్వీకరించరాదని మా తండ్రి తలంపు" అంటూ తిరస్కరించాడు. ఈ తిరస్కారమే తరువాతి సందర్భంలో కేవలం వెయ్యి గోవులు, ఏనుగంత ఎద్దుకు బదులుగా అతనికి ఐదు వేల గోవులను సంపాదించి పెట్టింది.

యాజ్ఞవల్క్యుడి విషయంలో ఏది సత్యమో ఉపనిషత్కాల ఋషులందరి విషయంలోనూ అదే సత్యం. జగన్మిథ్యా వాదాన్ని, ప్రాపంచిక జీవిత నిరర్థకత్వాన్ని గురించి వారెంతగా మాట్లాడినా, యాజ్ఞవల్క్యుడి వలె జీవితం చివరి దశలో తప్ప వారెన్నడూ విరాగులు కారు. ఈ ప్రధాన విషయం ఆల్బర్ట్ ష్విట్జర్ పరిశీలనా దృష్టి నుండి తప్పిపోలేదు. ఋషుల మొదటి దశ జీవనం గురించి అది పూర్తిగా ప్రాపంచికమని వ్యాఖ్యానిస్తూ ఆయనిలా రాశారు.

వారికి ఆశ్రమాలున్నాయి, ఉద్యాన వనాలున్నాయి. వారు కుటుంబాలు ఏర్పరచుకున్నారు. వారికి ఆస్తిపాస్తులు గడించాలన్న విపరీతమైన కాంక్ష ఉంది. వారొనర్చిన యజ్ఞ యాగాదులకు ప్రతిగా విపరీత పరిమాణంలో పశు సంపదను బహుమానాలుగా కోరేవారు. ఎవరైనా రాజు బ్రాహ్మణ సంవాదం ఏర్పాటుచేస్తే, ఆ వాదనలో తన

పాండిత్యంలో ఇతరుల మీద విజయం సాధించిన వానికి బహుకరించడానికి వందల సంఖ్యలో పశువులను బహుమానం కోసం సిద్ధపరచేవాడు. క్రీ.పూ. 800 నుండి 600 మధ్య జీవించిన దయాళుడైన జనక మహారాజు కొమ్ముకు ఒక్కొక్క బంగరు నాణెం చొప్పున రెండు కొమ్ములకు కడుతూ విజేతకు బహుకరించడానికి అదే జనకుడు గొప్ప పురోహితుడిగా వెయ్యి గోవులను సిద్ధం చేసేవరకు వెళ్ళాడు.

పేరుపొందిన యాజ్ఞవల్క్యుడు తన ముందు కొచ్చినప్పుడు అతని కోరిక తత్త్వజ్ఞాన విచారణ కోసమా? లేక గోవుల కోసమా? అని ప్రశ్నించాడు. "రెండింటి కోసమూ, మహారాజా" అన్నది యాజ్ఞవల్క్యుడి ప్రత్యుత్తరం.[51]

ఆనాటి ఋషులు అగ్రవర్ణాల ప్రయోజనం విషయంలో మాత్రం తాము ఆస్తిపాస్తులు సంపాదించాలనే బలీయమైన కాంక్షను ప్రక్కన బెట్టేవారు. తాము సర్వోత్తమ జ్ఞానంగా భావించిన దానిని తమ కులంలోని ఇతర సభ్యులకు బోధించడమే గాక క్షత్రియుల నుండి తగిన రుసుము (దక్షిణ) వసూలు చేసి వారికి కూడా ఉపదేశించేవారు. ఈ సూత్రానికి మాత్రం ఎట్టి మినహాయింపు లేదు. గోవులు విలువైనవే అయినా కుల ప్రయోజనాలు మరింత విలువైనవి. వైదిక కాలం మొత్తంలో ఇలాంటి విషయంలో మనకు కనుపించే ఏకైక మినహాయింపు సత్యకామ జాబాలి విషయంలో మాత్రమే. అది కూడా అతనికే తెలియని అతని తండ్రి ఖచ్చితంగా బ్రాహ్మణుడే అయి ఉంటాడన్న ఊహతో మాత్రమే. అలాకాకపోయినట్లయితే సందేహాస్పదమైన తన వంశాన్ని గురించి అతడంత నిష్కపటంగా అంగీకరించ జాలడు.

ఇక ఇప్పుడు యాజ్ఞవల్క్యుడి జీవితంలో చివరి ఘట్టం ఎంత ఆత్మవంచనతో కూడుకున్నదో చూద్దాం. అతడు సన్యాసాన్ని స్వీకరించి ఆస్తిపాస్తులను ఇరువురు భార్యలకు పంచాడు. నిజానికి అతని కిద్దరు భార్యలున్నా సంతానం మాత్రం శూన్యం. అయినా అతడో గోవును కాని, చివరికో గోవత్సాన్ని గాని తన అనుచరులకో, తన శిష్యులకో ఇవ్వలేదు. పేదల గురించి, ఆర్తుల గురించి, ఆకలిగొన్న వారి గురించి అతడే మాత్రం తలచలేదు. అది కర్మ సిద్ధాంతంలో జోక్యం చేసుకొనడమే అవుతుంది కదా!

యాజ్ఞవల్క్యుడు కేవలం బుకాయింపుదారే కాదు, ఆ కాలం నాటికి అతడో జగడాల మారి, క్రూరుడు కూడా. బ్రహ్మన్ని సరిగ్గా నిర్వచించడంలో అపజయం పొందినందుకు విదగ్ధ శాకల్యుణ్ణి మరణం పొందేటట్లు చేశాడు. నేనీ విషయాన్ని యాజ్ఞవల్క్యుడిని బహుధా ప్రశంసించే డ్యుసేన్ ప్రామాణికత్వం ఆధారంగానే చెబుతున్నాను[52].

ఇతి రహస్యం

ఇప్పటి వరకు ఉపనిషత్తులు వాటి గ్రంథకర్తలకు సంబంధించి ప్రధానమైన బూకరింపు ఏమిటంటే తమ దగ్గర ఉపదేశించడానికేదో రహస్యం ఉన్నదని నటించడం. ఉపనిషద్ అంటే వాచ్యర్థం నిస్సందేహంగా 'ఒకరికి సన్నిహితంగా మరొకరు (ఉపదేశార్థం) కూర్చొని' అని, అయితే ఇది క్రమేణా మార్మిక విద్య అనే అర్థాన్ని సంతరించుకుంది. డ్యుసేన్ పేర్కొన్నట్లు దీనికి ఇంకా రహస్య సంకేతం, రహస్య నామం, రహస్య వివరణ, రహస్య పదం, రహస్య సమీకరణం, రహస్య బోధనలనే అర్థ వివరణ లున్నాయి. ప్రతి ఒక్కరి అర్థం లోనూ 'రహస్యం' చేర్చడమే ఇక్కడ గమనించవలసింది.[53]

అయితే ఆ రహస్యమంతా మానవుడి మేధ మీద ఆధిపత్యం వహించే పురోహితుడి శక్తిలోనే ఉంది. భగవంతుడి వద్దకు చేర్చే రాజమార్గం తన వద్దనే ఉందని అతడు నటించేవాడు. భగవంతుడి హృదయం తనకు మాత్రమే తెలుసు ననేవాడు. దైవసాన్నిధ్యానికి నేను మాత్రమే చేరుస్తాననేవాడు. భగవంతుడీ విశ్వాన్ని సృష్టించిన తీరును, ఇంకా తన కనేక గంభీరమైన రహస్యాలు తెలిసినట్లు తానా విషయంలో సర్వజ్ఞుడనని అహంకరించేవాడు. భగవంతు డనేక స్వర్గ నరకాలను ఎలా సృష్టిచేశాడో, ఎచటెచట వాటిని ఉంచాడో తనకు తెలుసునని, సర్వోన్నతమైన స్వర్గాన్ని మీరు చేరేటట్లయితే మీ కోసం 'ఐదు నక్షత్రాల' హోటల్ సౌకర్యాలన్నీ ఎదురు చూస్తున్నాయని భ్రమింప చేస్తాడు. నేను ఇక్కడ చెబుతున్న దానిలో విమర్శా పాత్ర మయింది ఏదీ లేదు. ఇక్కడ నేను పేర్కొన్న ప్రతిదీ ఉపనిషత్తుల్లోనిదే. అందువల్లనే కొన్ని ఉపనిషత్తులు 'ఇతి రహస్యం' అనే సూత్రాన్ని ఇదీ ఉపనిషత్తు అనే దానికి ప్రత్నామ్నాయంగా పేర్కొన్నాయి.

ఉదాహరణకు ఇక్కడ విశ్వసృష్టి గురించిన రహస్యం పేర్కొనబడింది. ఇది యజ్ఞశ్వంతో ప్రారంభించబడింది. ఉషస్సు అతని శిరము; సూర్యుడు దాని కన్ను; వాయువు అతడి ప్రాణం; అగ్ని అతడి తెరచిన నోరు; అతని ఆత్మయే సంవత్సరం (కాలం); ఆకాశమే అతడి వీపు; అంతరిక్షం అతని ఉదరం,; ఉదర దిగువ భాగమంతయు భూలోకం; ఋతువులే ప్రక్కటెముకలు; మాసములు, పక్షములు అతని కీళ్ళు; దివారాత్రములు పాదములు; అతని రోమములు ఓషధులు, వృక్షములు; అతని మాంసమే మేఘములు; ప్రేవులే నదులు; మూత్ర విసర్జనమే వర్షం. సరే ఈ అజ్ఞానాన్నంత ఏ మాత్రం అసహ్యం లేకుండా చదువుకోదలచినట్లయితే మిగతా రహస్యాల కోసం బృహదారణ్యకంలోని ప్రారంభ అధ్యాయాన్ని పరిశీలించుకోవచ్చు.

బృహదారణ్యకంలోని ఈ వృత్తాంతాన్ని వ్యతిరేకిస్తూ అంతే ప్రాచీనమైన మరో ప్రధానమైన ఉపనిషత్తు ఛాందోగ్యం సృష్టిని గురించి మరో భిన్నమైన కథనం చెబుతుంది. దాని ప్రకారం "ప్రారంభంలో ఈ జగత్తు అంతయు కేవలం అసత్తుగా నుండెను. అది సత్ గా వ్యక్తమయ్యెను. క్రమ పరిణామము చెందజొచ్చెను. అది అండ రూపముగా మార్పు నొందెను. ఆ విధముగా సంవత్సర కాలముండెను. ఆ తరువాత క్రింది విధముగా బ్రద్దలయ్యెను. ఆ రెండు కపాలములలో ఒకటి వెండిదిగా మరొకటి బంగారుదిగా రూపొందెను. వెండిగా మారినది భూమిగా మారెను, బంగారుది ఆకాశమయ్యెను. వెలుపలి పొర పర్వతము లాయెను. లోపలి పొర పొగమంచు మరియు మేఘము లాయెను. ధమనులన్నియు నదులాయెను. అందులోని ద్రవమంతయు సముద్ర మయ్యెను..." (3.19) ఆ విధంగా నాకు విసుగు కలిగి ఆవులింతలు వచ్చే వరకు కథనం కొనసాగుతూనే ఉంటుంది."

ఆ అశ్వాన్ని, దాన్ని మూత్ర వర్షాన్ని; అండాన్ని, కోడిపిల్లను తప్ప అది సృష్టించే సమస్తాన్ని విడిచి ముందుకు సాగి మనం బ్రహ్మను అంటే సృష్టికర్తను అతని లోకాన్ని ఎలా చేరుకుంటామో తెలుసుకుందాం. దహనం చేసిన పిదప మృతులు జ్వాలలోనికి చేర్చబడుదురు. జ్వాలా రూపము నుండి దినరూపము; దిన రూపము నుండి శుక్ల పక్ష రూపము; శుక్ల పక్ష రూపము నుండి ఉత్తరాయణ రూపం; మాసముల నుండి సంవత్సరం; సంవత్సరం నుండి ఆదిత్య (సూర్య) రూపం; ఆదిత్య రూపం నుండి చంద్ర రూపం; చంద్ర రూపం నుండి విద్యుద్రూపం నందును. ఆ తరువాత పురుషుడు అ-మానవ రూపం పొందును. అతడే నిన్ను బ్రహ్మ వద్దకు గొనిపోవును. ఇదియే దేవతల వద్దకు గొనిపోవు మార్గం, (దేవపథం) బ్రహ్మ వద్దకు గొనిపోవు మార్గమూ నిదియే'. (ఛాందోగ్యం 4.15.5&6) చివరకే పథనిర్దేశ పటాలు (రోడ్ మేప్స్) కూడా ఇంత చక్కగా దోవ చూపించలేవు కదా! చూపించగలవా? సరే మీరు బ్రహ్మ లోకానికి చేరారు. మీ కోసం ఎలాంటి స్వాగత సత్కారాలెదురు చూస్తున్నాయో చూచారా! ఐదు వందల మంది దేవకన్యలు పుష్పాలతో, పట్టు వస్త్రాలతో, సుగంధ ద్రవ్యాలతో మీకు స్వాగత మొసగడానికి

సిద్ధంగా ఉన్నారు. ఆ లోకము అద్భుత సౌందర్యంతో, విశాలమైన మందిరాలతో, విస్తారమైన సరస్సులతో, ఘనమైన నదులతో శోభిల్లుతుంది. బ్రహ్మ నగరము సాలజ్యమనే పేరుతో విలసిల్లుతుంది. అందులో ఆయన అపరాజితమనే భవనంలో నివసిస్తుంటాడు.

ఇంద్రుడు, ప్రజాపతి ఆ భవనానికి ద్వారపాలకులై కావలి కాస్తుంటారు. అక్కడ బంగరు సింహాసనంపై ఆశీనుడై బ్రహ్మ మిమ్ములను పరామర్శిస్తాడు. ఆయన మిమ్ములను కొన్ని ప్రశ్నలు వేస్తాడు, వాటికి మీరు ఖచ్చితమైన సమాధానా లివ్వాలి. (ఈ విషయాలను సులభతరం చేయడానికి ఉపనిషత్తులు ప్రశ్నలకు సమాధానాలను మాకు ముందుగానే తెలుపుతుంది) బ్రహ్మను నిర్గుణ బ్రహ్మగా పేర్కొన్న తరువాత తిరిగి ఇదంతా చెప్పడం ఎంత అసంగతంగా ఉంటుందో గమనించండి. ఇది ఎండమావుల్లో వాస్తవాన్ని చూడమని; కటిక చీకటిలో కాంతిని చూడమని; మధ్యలో వాస్తవాన్ని గమనించమని మీ అసమర్థతకు పరీక్ష పెట్టడమే కదా! మిమ్మల్ని మోసం చేయడమే కదా ఇది! సరే బ్రహ్మతో పరీక్ష ముగిసిన పిదప మీ పాప పుణ్యాలన్నీ దులిపి వేయబడతాయి. ఇక మీరెప్పటికీ వృద్ధాప్య మొందరు. (కౌషీతకి 1, 2, 3 , 5) మరొక ఉపనిషత్తు ఏమని చెబుతుంది. మీరు సంతోషించెదరు గాక, రథాలలో విహరించండి, స్త్రీలను అనుభవించండి. (ఛాందోగ్యం 8-11-3)

ఇపుడు పురుషుడు ఎలా సృష్టి అయ్యాడో చూద్దాం. ఈ ప్రశ్నకు బృహదారణ్యకం సమాధానం చెబుతుంది. దీన్ని ఉల్లేఖిస్తున్నందుకు నా మహిళా పాఠకులు నన్ను క్షమింతురు గాక. “స్త్రీ యే అగ్ని, లైంగి కేంద్రియమే సమిధ; వెంద్రుకలే ధూమము; యోనియే జ్వాల; లోపల (పురుషాంగమును) ఉంచుటయే బొగ్గులు; ఫలితంగా కలుగు ఆనందమే నిప్పు రవ్వలు. ఈ యజ్ఞాలలో దేవతలకు రేతస్సును ఆహుతిగా ఇస్తారు. ఈ యజ్ఞం నుండే పురుషు డుదయిస్తాడు”. (6-2-7)

ఈ విధంగా అసంగతాలపై అసంగతాలను, అసభ్యతపై అసభ్యతలను పేర్చుకుంటూ పోయారు. ఈ విధంగా ఉపనిషత్తులు సృష్టిని గురించి, సృష్టికర్తను గురించి అతి గంభీరమైన రహస్యాలను మనకు తెలియ చేస్తాయని మనలను నమ్మించ చూస్తారు. మనలను నమ్మమంటారు.

మేధోహననం

నరులను వానరాల నుండి వేరుచేసేది ఏమిటి? మనుష్యులలో నెల కొని వుండే ఆ మనుష్యత్వం ఏమిటి? అది అతడి మనస్సు. ఆ మనస్సుకు ఆధార పీఠం అతడి మెదడే. రెండు మిలియన్ల సంవత్సరాల క్రితం మానవుడే లేడు. ఒక మిలియను సంవత్సరాల క్రితమే అతడు ధృవించాడు. ఈ రెండు కాలావధుల మధ్య మనిషి కపాలం క్రమక్రమంగా అతడి మెదడు మూడు పౌండ్లకు చేరే వరకు విస్తరించింది. మెదడు పరిమాణం పెరిగే కొద్ది మనస్సు మరింత ఆలోచనాశక్తికి, ఊహాశక్తికి, భవిష్య దర్శనశక్తికి, నిర్ణాయకశక్తికి, ప్రణాళికా రచనా శక్తికి ఆలవాలమవుతూ వికాసం చెందింది. ఈ శక్తులన్నీ క్రమోన్మీలనం చెందుతూ మనిషి - మనుష్యత్వం అవతరించడానికి దోహదం చేశాయి. మరి ఆ మనస్సును లాగివేసినట్లయితే మిగిలేదేమిటి? కేవలం రెండు కాళ్ళ మీద నిలచి అటు నిటు తిరుగాడే ఒరాంగుటాన్ లాంటి జంతువే కదా.

అయినా ఉపనిషత్తు లింకా నీ మనస్సును ఊపిరాడకుండా చేసి అంతమొందించడానికి నిన్ను శాసిస్తూనే ఉన్నాయి. నా మాట నాకు దారుణంగా వినిపించవచ్చు కానీ ఇది నిజం. పచ్చి నిజం, నిజం తప్ప మరొకటి కాదు. నీ మేధను హత్య చేయడం ద్వారా అది తెలియచెప్పేదేమంటే నీవు జంతువుల మట్టానికి దిగిపోవద్దు, భగవంతుని స్థాయికి నీవు చేరుకోవాలని చెప్పడమే. అయితే నిజానికి జీవ పరిణామంలో ఒక అడుగు దిగజారడమంటే ఆధ్యాత్మిక పరిణామంలో ఒక అడుగు పైకి వేశామనే.

ఆ బలమైన ఊహ మీదనే - కాదు ఊహకన్నా మెరుగైనది - నిర్ణయం మీదనే ఉపనిషత్తులు మనస్సును నిర్లక్ష్యంగా తీసివేస్తాయి. అందువల్లనే అవి మనస్సును అనేక రకాల వికృతమైన పేర్లతో పిలిచాయి. ద్వితీయ శ్రేణి ఉపనిషత్తుల నుండి అరుణ్ శౌరీ ఎన్నిక చేసిన అలాంటి కొన్నింటిని మనం గమనిద్దాం. వాటి ప్రకారం మనస్సు “చెట్ల పైన తిరుగాడే కోతి", (మనో మర్కటం) ఒక దయ్యం, గ్రామ వీధుల్లో తిరుగాడే కుక్క (ఊరకుక్క) ఒక రోగం, ఒక తిరుగుబోతు యువతి... బహురూపుల దాల్చిన ముఖాలతో వంకర తలపులతో, క్షణానికో తప్పు త్రోవలో తిరుగాడే యువతిగా మనస్సును ఉపనిషత్తులు వర్ణించాయి.[54]

అయితే ప్రధాన ఉపనిషత్తులు తక్కువగానే నిందించాయి. వాటిని ఉల్లేఖించడం వల్ల పెద్దగా ఉపయోగం లేదు. అయినప్పటికీ ముండకోపనిషత్తు ప్రకారం నేను ఇక్కడ చెప్పేదేమంటే బ్రహ్మం యొక్క ప్రధాన గుణం నిర్గుణం (మనస్సు లేకుండా పోవడం) (2-1-1). ఓ మట్టి ఓ రాతి ముక్కకు మనసుండదు. అందువల్ల మనకు చివరగా తేలేదేమంటే మనం బ్రహ్మం కావాలన్నా, బ్రహ్మైక్యం చెందాలన్నా ముందుగా అతడు రాయోరప్పో కావాలని. ఉపనిషత్తులు ఆ విధంగా చెప్పక పోయినప్పటికీ అవి నిన్ను శాసించేది ఆ దిశగానే, మనోరాహిత్య స్థితిని పొందే దిశగానే. ఇప్పటికి చెలామణిలో ఉన్న ఉపనిషత్తుల్లో 20 దాకా యోగానికి చెందిన ఉపనిషత్తులే. వాటి ప్రధానోద్దేశ్యం మనోరాహిత్య స్థితి దిశగానే. పతంజలి చెప్పిన ప్రకారం యోగమంటే మనో నిశ్చలమే. వాస్తవానికి దాని అర్థమేమంటే మనస్సును కొద్ది కొద్దిగా చంపడమే.

నిస్సందేహంగా యోగం పుట్టుక అనార్యమే. అది హరప్పావాసుల నుండి గ్రహించబడిన దనడానికి బలమైన నిదర్శనాలున్నాయి. హరప్పా ముద్రికల మీద ఉండే అధికార చిహ్నం వృషభాలతో, ఇతర జంతువులతో కూడి ఉండే మహాయోగి. అతడే పశుపతి, నిజాని కాతడు శివుడే. అదెలాగున్నా నేను స్పష్టం చేయదలచుకున్న ప్రధాన విషయం, ఉవ్వెత్తున ఎగసిన హరప్పా నాగరికత చివరకు కేవలం అవశేషంగా ఎందుకు మిగిలింది? ఎందుకు అలానే అంతరించి పోయిందని? సాక్ష్యాధారాలు మరో రకంగా మారితే తప్ప, ఆ నాగరికతలో అనుసరించిన అత్యున్నత దైవభావం, మహాయోగి, వారనుసరించిన అత్యున్నత సాంప్రదాయం, యోగం వల్లనే ఆ నాగరికత నశించిందనే మన ఊహ తప్పుకాదు. ఎప్పుడైతే సమస్త ప్రజలు మనో నిశ్చలత సాధించబూనారో దాని ఫలితం మేధో హననమే కదా! అయితే అలాంటి నాగరికత మొదటి దశలో దండయాత్రల బారిన పడకుండా ఎలా మన గలిగింది? పుర నిర్మాణ రంగంలో సాధించి అనుసరించిన ప్రావీణ్యం వల్ల, ప్రత్యేకించి నీటి పారుదల రంగంలో, నగర ప్రణాళికా రచన వల్ల హరప్పీయులు అభివృద్ధి సాధించారు. ప్రజలు వికాసం సాధించే కొద్దీ వారి మీద నాయకత్వం పురోహితులు హస్తగతం చేసుకున్నారు. వారి ప్రాబల్యాన్ని సుస్థిరం చేసుకునేందుకు యోగాచరణాన్ని బోధించడం ద్వారా ప్రజల మానసిక వికాసాన్ని అడ్డుకున్నారు. అంతిమంగా అది హరప్పా నాగరికత క్షీణతకు, పతనానికి దారి తీసింది. పెద్ద పెద్ద నగరాలు, అద్భుతమైన వ్యవసాయార్థిక విధానాలు, సముద్ర వాణిజ్యాలతో కూడిన హరప్పా నాగరికత సర్వనాశనమై పోయింది.

హరప్పా నాగరికతలో అతి దారుణమైన మరణాంతకమైన రెండు శాసనాలు ఏమంటే ఒకటి పురోహిత వర్గ ఆధిపత్యం, రెండవది యోగం. డి.డి. కోశాంబి ప్రకారం వేదకాలం నాటి ప్రముఖమైన పురోహితుల్లో విశ్వామిత్రు డొక్కడు మాత్రమే ఆర్యజాతి సంభవుడు. మిగిలిన వారి జనన గాథలన్నీ వారు మాతృస్వామ్య వ్యవస్థకు చెందిన అనార్యులేనన్న విషయాన్ని సూచిస్తాయి. కుండ-స్త్రీ గర్భాశయానికి ప్రతీక. అదే తరువాత మాతృదేవతకు చిహ్నంగా మారింది. అగస్త్యుడు, వశిష్ఠుడు ఇంకా ఇతరులంతా కుంభ సంభవులే; ఆ విధంగా వారంతా మాతృస్వామ్య వ్యవస్థకు చెందిన సంతానమని తెలుస్తుంది. వారు పురోహితులుగా మారిన తరువాత ఈ జాతి మతంలో యోగాన్ని ఒక భాగ మొనరించారు. అదే ఈ జాతి జీవనానికి అంతులేని హానిని కలిగించింది; కలిగిస్తుంది. మానసిక వికాసాన్ని అడ్డుకోకుండా మీరు మనో నిశ్చలతను సాధించలేరు. దాంతో ప్రజల సర్వతో ముఖాభివృద్ధిని అడ్డుకోకుండానే అది పునాదులతో సహా వాడిపోతుంది. ఈ విషయంలో చిరకాల పాపులు, దుర్మార్గు లెవరంటే; వారు ఉపనిషత్కర్తలే. వారి వర్గ ప్రయోజనాలు కాపాడుకొనడానికి యోగాన్ని ఒక పద్ధతిగా గ్రహించారు. తమకు మద్దతుగా దాన్ని వాడుకున్నారు. ప్రాచీన భారతీయ మత వాదుల్లో యోగాన్ని తిరస్కరించిన వాడు క్రీ.శ. 8వ శతాబ్దికి చెందిన కుమారిలు డొక్కడే. మిగిలిన వారందరూ ఐక్యంగా మనో నిశ్చలాన్ని బోధించిన వారే, ఆచరించిన వారే. ఎందుకంటే నవ్యమైన, ప్రమాద భరితమైన ఆలోచనలను అణచడంలో ఇది ప్రభావ వంతమైన మార్గం కనుక. అంతేకాక వయసు మీరిన ఆచరణలకు, సాంప్రదాయాలకు, నటనల మీద ఆధారపడ్డ ప్రాచీన విధానానికి కొత్త ఆలోచనా విధానం ప్రమాద భరితమైనదని వారికి పూర్తిగా, విస్తారంగా తెలుసును.

అ౹బకద౹బ

మనో నిశ్చలతను సాధించాలంటే మానసిక వికాసాన్ని అడ్డుకొని దాన్ని హతం చేయాలి. ఉపనిషత్తులు బోధించిన అనేక మార్గాల్లో యోగం ఒకటి. మిగిలిన వాటిలో అంతే ప్రాధాన్య మున్నది ధ్యానం.

నిస్సందేహంగా ధ్యానం యొక్క ప్రాథమిక అర్థం గాఢమైన, తదేకమైన ఆలోచన అనే. అయితే అది ఆలోచనను ఎలా హతం చేస్తుంది? అతి ప్రభావంగా, క్రియాత్మకంగా ఉపనిషత్తుల చేత వృద్ధి చేయబడ్డ ధ్యానం ఈ జీవితం మీదనో, ప్రపంచం మీదనో లేక ఈ రెండింటి వెనుక నున్న శక్తుల మీదనో కాదు లేదా తమ అసమాన సౌందర్యంతో మన జీవితాలను వెంటాడే, మైమరపించే అద్భుత దృశ్యాలు, ఆకారాలు, సువాసనలు, శబ్దాల మీదనో లేక మనలను విస్మయపరచే ప్రకృతి మీదనో కాదు. వీటి మీద ధ్యానం మీ మనస్సును నిశ్చల పరచదు, పైగా మిమ్ములను ఉత్తేజితులను చేస్తుంది, బలోపేతులను చేస్తుంది. మిమ్ములను అత్యద్భుతమైన సృజనాత్మకత లోనికి నడిపిస్తుంది. అందువల్లనే ఉపనిషత్తులు వాటికి వ్యతిరేకంగా మిమ్ములను హెచ్చరిస్తాయి. వాస్తవానికి అంటువ్యాధులు వంటి వాటిని పరిత్యజించమని మిమ్ములను ఆజ్ఞాపిస్తాయి. ఎందుకంటే అవి మిమ్ములను మీ జీవితాల నుండి విముక్తి పరచడానికి బదులు బంధిస్తాయని; మీ జీవితాలపైన ఇంద్రియాల పట్టు సడలించడానికి బదులు మరింతగా బిగిస్తాయని.

అయితే మీ రిప్పుడు దేని మీద ధ్యానం నిలపాలి? 'అ' 'ఉ' 'మ్' ల కలయికతో ఏర్పడ్డ పవిత్రాక్షరం 'ఓం' మీద. ఇది అపారమైన మంత్రశక్తి గల అక్షరం. నిజానికి సమస్త విశ్వమూ ఇదే, బ్రహ్మానికి ప్రతీకగా నిలచేది, అసలు బ్రహ్మమూ ఇదే. ఛాందోగ్యం (1-4-2) నుడివినట్లు మూడు వేదాల కంటే అత్యుత్తమ మైనది, సర్వ దేవతలకు

శరణాగతమైనది, నెలవైనదీ ఇదే. మీరు ఓం ను ఉచ్చరించే కొలదీ; ఆ శబ్దాన్ని, ప్రాధాన్యతను మీరు ధ్యానించే కొలదీ దాని అర్థమూ, సందేశమూ మీకు అవగతమౌతాయి. మీరు పూజించే త్రికములన్నింటిలో ఓం నిబిడీకృతమై ఉంది, ఆత్మలాగ అది అన్నింటిని ఆవరించి ఉంది. ఆ త్రికములు వాటి సంధాన రూపాలను గురించి మైత్రీ ఉపనిషత్తు ఈ విధంగా పేర్కొంది:

స్త్రీ పురుష నపుంసకాలు - లింగ రూపం
అగ్ని, వాయువు, ఆదిత్యుడు - కాంతి రూపం
బ్రహ్మ, విష్ణు, రుద్రులు – దైవరూపాలు
గార్హపత్యాగ్ని, దాక్షిణ్యాగ్ని, ఆవనీయాగ్ని - ఆనన రూపం
ఋగ్యజుస్సామ వేదములు అవగాహనా రూపం (జ్ఞాన రూపం)
భూమి, అంతరిక్షం, స్వర్గం - లోక రూపం
భూత భవిష్యద్వర్తమానములు - కాల రూపం
ప్రాణం, అగ్ని, ఆదిత్యుడు - ఉష్ణ రూపం
ఆహారం, జలం, చంద్రుడు - శక్తి రూపం
బుద్ధి, మనస్సు, అహంకారం - ప్రజ్ఞా రూపం
ప్రాణ, అపాన, వ్యాన వాయువులు - ప్రాణ రూపం

అందువలన వీటిని ఓం తో కలిపి స్తుతించాలి, గౌరవించాలి.

'ఓం' గురించి కఠోపనిషత్తు ఈ విధంగా చెబుతుంది. అన్ని వేదాలు ఘోషించే లోకమూ, అన్ని తపస్సులూ ఉద్ఘాటించే గమ్యమూ అయిన దాన్ని గురించి బ్రహ్మచారులైన నిష్ఠాగరిష్ఠులు ఈ విధంగా నుడువుతున్నారు. ఆ వచనం ఇలా సాగుతుంది -

ఈ అక్షరమే బ్రహ్మం
ఈ అక్షరమే సర్వోత్తమం
నిజంగా ఈ అక్షరాన్ని తెలుసుకున్న వారికి
ఏది కోరితే అది సిద్ధిస్తుంది.

ఇదే ఉత్తమమైన ఆలంబనం
ఇదే సర్వోత్కృష్టమైన ఆలంబనం
ఈ ఆలంబనాన్ని తెలుసుకున్న వాడు
బ్రహ్మ లోకంలో ఆనందం పొందుతాడు (2-20)

అధర్వాశీర ఉపనిషత్తు పేర్కొన్న ప్రకారం ఓం కు మూడు సూక్తాలే కాదు త్రివర్ణాలు కూడా ఉన్నాయి. అవి ఎరుపు, నలుపు, గోధుమ ఛాయలు. మొదటిది బ్రహ్మకు, రెండవది విష్ణువుకు, మూడవది ఈశ్వరుడికి ప్రతీకలు. ఆ విధంగా ఓం మీద, దాన్ని త్రివర్ణాల మీద ధ్యానం నిలపడం ద్వారా, నువ్వు ఒకేసారి మూడు దైవాలను పూజించి నట్లవుతుంది. ఆ విధంగా ఒకేసారి మూడు లాభాలను పొందవచ్చు.

'ఓం' కు అనన్య ప్రాధాన్యతను కట్టబెట్టిన అనేక విధాలైన, పరిపరి విధాలైన ఉదాహరణలను మనం ఉపనిషత్తుల నుండి ఏర్చికూర్చవచ్చు. ఈ ప్రత్యేక విషయంలో మాత్రం వారి విజయం అద్వితీయమైనదే అంగీకరించవలసిందే. ఓం చిహ్నం మీకు ఎక్కడబడితే అక్కడ ప్రత్యక్షమౌతుంది; ఓం శబ్దం ఎప్పుడు పడితే అప్పుడు మీ చెవులకు సోకుతుంది; అది అక్షర క్రమంలో శీర్ష భాగానే ఉంటుంది; పుస్తకాలు మొదటి పుటలలో దర్శన మిస్తుంది. చివరకు చివరి పుటలలో కూడా దర్శనమిస్తుంది;

జన్మదిన ఆహ్వానాలు, వివాహ శుభలేఖల మీద దర్శన మిస్తుంది. అది వసారాల మీదకు, ద్వార మంటపాల మీదకు విస్తరించింది; గడపలను, కిటికీలను అలంకరించింది. సభలు, సమావేశాలు ప్రారంభంలో సుస్వరంగా పలుకబడుతుంది. చావు పుట్టుకలు వివాహాది కార్యకలాపాలకు అనుసంధించిన మత కర్మకాండల్లో గానం చేయబడుతుంది. బ్రహ్మం సర్వవ్యాపకత సాధించిందో లేదో గాని ఓం మాత్రం దాన్ని సాధించింది. దాని సర్వవ్యాపకతలో ఓం మనలను అహేతుక వర్తనులుగా, మూఢవిశ్వాసులుగా, కపట భక్తులుగా, ఆత్మవంచనాపరులుగా తయారు చేసింది. ఉపనిషత్తు లాదేశించిన ప్రకారం ఎవరైనా ఓం ను అదేపనిగా ధ్యానిస్తే అతడికి మతి భ్రమించకుండానే మతిహీనుడు మాత్రం అవుతాడు.

పైన చెప్పబడిన దానికంటే భిన్నంగా 'ఓం' కు అనేకాక్షర పదం 'అబ్రకదబ్ర' వలెనే ప్రత్యేకార్థం కాని, అదిచ్చే సందేశం కాని ఏమీ లేదు. నిర్విరామంగా ఒక అక్షరాన్నో, పదాన్నో లేక ఏదైనా మంత్రాన్నో ఉచ్చరించే కొలదీ అది మొదట మీ మనసును జోల పాడుతుంది, తరువాయి మొద్దు పరుస్తుంది, ఆ తరువాత మెదడులోని నాడులను బలహీన పరుస్తుంది, తరువాత దశల వారీగా మిమ్ములను పిచ్చి లోనికి దించుతుంది. చక్కగా గురువు వద్ద మంత్రోపదేశం పొంది, ఆ మంత్రాన్ని చక్కగా అనుష్టించి చివరకు మూఢులైన అనేకమంది మంచి మనుష్యులను నేను నా జీవితంలో గమనించాను. వారు స్థిరంగా, నిర్విరామంగా ఉచ్చరించింది ఒక అర్థ రహితమైన అక్షరం, పదం లేదా వాక్యమే. అటువంటి వారిని చూస్తే తన ఎదుట ఏమి జరుగుతున్నా పట్టించుకోకుండా చెట్టు నీడన పడుకుని తన మానాన తాను నెమరు వేసుకుంటున్న ఆవే నాకు నిరంతరం గుర్తుకు వచ్చేది.

కాలం గడిచేకొద్దీ అర్థరహితమైన ఓం వంటి అక్షరాల ఉచ్చారణ కన్నా గంజాయి, నల్లమందు, మార్ఫియా, హెరాయిన్, హసీష్ లేక మార్జువానా వంటి మాదక ద్రవ్యాలే ప్రజలకు తక్కువ హాని చేస్తాయనిపిస్తుంది. మన కంటికి కనపడకుండానే అది కలుగజేసే నష్టం కపటమైనది, భయంకరమైనది. అది శారీరక హాని ఏమీ తలపెట్టకుండానే మనసును మాత్రం కుంటు పరుస్తుంది.

నాలుగో దశ

నీవు మేధో హననం గావించగానే నీకు ప్రపంచానికి మధ్య భేదం నశిస్తుంది. నీకు ప్రపంచానికి మధ్య సంవేదనలు హరించబడతాయి. క్రమంగా కాలం గడిచే కొద్దీ నీ కళ్ళు చెదిరి జడత్వం ఆవహిస్తుంది. నీవు మూర్ఛకు లోనవుతావు. దాన్నే ఈ భయానక జనన మరణ సంసార చక్రం నుండి విముక్తి పొందడానికి, తరువాత బ్రహ్మైక్యం పొందడానికి నీవు ఎంచుకున్న సరైన మార్గం గాను, నీవు సాధించిన ఘనతగాను ఈ ఉపనిషత్తులు అతి ముఖ్యంగాను, గంభీరంగాను పేర్కొంటాయి.

మార్గం తప్పకుండా బ్రహ్మం గురించి సరి అయిన పూర్తి జ్ఞానం పొందడానికి, ఆ బ్రహ్మాన్ని చేరుకోవడానికి, ఎదురులేని ఒకే ఒక మార్గం ఉంది. అదే గాఢ నిద్ర (సుషుప్తి) లోనికి జారుకోవడం. అది కూడా కలలు కూడా కనరాని నిద్ర. ఆ స్వప్న విధానాన్ని గురించి ఉపనిషదభిమానులు తెగ చెబుతూ ఉంటారు. ఉపనిషత్తులు దాన్ని గురించే ఊదరగొడుతుంటాయి. వారి మాటల్లోనే మనం చెప్పాలంటే ఆధునిక మనస్తత్వ శాస్త్రజ్ఞులు - మనో విశ్లేషకులు అయిన లీబ్నిజ్, కాంట్, వూంజ్, జేమ్స్, మెక్ డగల్, ఫ్రాయిడ్, యాంగ్, ఆడ్లర్, ఫ్రామ్, ఎరిక్ సన్ లాంటి వారు చేసిన కృషి - ఉపనిషద్రుషుల కృషితో పోల్చినప్పుడు అది కేవలం ఒక మచ్చగా అగపడుతుంది. నిజానికి ఆ ఋషులు సరాసరి దైవ సాన్నిధ్యానికి చేరేందుకు రాజమార్గంగా చెప్పింది స్వప్న విధానాన్ని, దాని శక్తి యుక్తులను గురించే. ఇడ్, ఈగో, దమనాలు, పునరాలోచనలు, స్థిరీకరణాలు, వివిధ భావగ్రంథులు ఇంకా ఇతరాలను గురించి ఆధునిక మనస్తత్వ శాస్త్రజ్ఞులు గోలగా చెబుతున్న వాటిని ఏ మాత్రం అంగీకరించక వాటిని మొత్తంగా హీనంగా తిరస్కరించారు. వాటన్నింటికి ఆత్మ, కేవలం ఆత్మ మాత్రమే ఆధార భూతమైనదిగా ఎంచారు. జనకుడికి యాజ్ఞవల్క్యుడు సవిస్తరంగా చెప్పిన స్వప్న ధర్మం దాని పనితీరు, శక్తియుక్తులు ఇవే.

నిశ్చయంగా ఈ పురుషుడికి రెండే అవస్థలు. ఈ ప్రపంచంలో ఉండే స్థానం (జాగ్రదవస్థ) ఒకటి కాగా, రెండవది మరో ప్రపంచంలో ఉండే స్థానం (సుషుప్తావస్థ) మూడవది మధ్యంతర దశ స్వప్నావస్థ. ఈ మధ్యంతర దశ నుండే ఒకడు పై రెండు స్థానములను అనగా ఈ ప్రపంచం (జాగ్రదవస్థ) మరో ప్రపంచ (సుషుప్తావస్థ) ములను దర్శిస్తుంటాడు. (బృహదారణ్యకం 4-3-8, 9)

ఏ వ్యక్తైనా నిద్రలోనికి జారినపుడు అనేకం జరుగుతాయి. పై విషయాన్నే పొడిగిస్తూ యాజ్ఞవల్క్యుడీ విధంగా చెబుతున్నాడు:

ఒకరు నిద్రలోనికి బోయినపుడు ఈ ప్రపంచమును దాని అంశముల నన్నియు గొనిబోవును. ఆ సూక్ష్మాంశములతో అచ్చట ప్రపంచమును నిర్మించును, నాశనము చేయును. తన ప్రకాశముతోనే స్వప్నమును పొందును. ఈ స్థితిలో పురుషుడు స్వయం ప్రకాశకుడగును.

అక్కడ రథములుండవు, వాహకములుండవు, మార్గములుండవు. కానీ అతడు తనకు తానే రథములను, వాహకములను, మార్గములను రచించును. అచట ఆనందముండదు, సుఖదుఃఖములుండవు. కానీ తనకు తానే ఆనందమును, సుఖ దుఃఖములను రచించును.

అచ్చట సరస్సులుండవు, తామరపూల కొలనులుండవు, సెలయేళ్ళుండవు. కానీ తనకు తానే ఆ సరస్సులను, తామరపూల కొలనులను, సెలయేళ్ళను రచించును. అక్కడ అతడే సృష్టికర్త.(అదే 4-3-9,10)

కనుక గాఢనిద్రను బొంది కలలుకంటూ నీకు నీవు సృష్టికర్తగా రూపాంతరం చెందుతావు. అందువలన నీవు ఆనందం పొందుతావు, మహదానందాన్ని పొందుతావు. పారవశ్యాను భూతి చెందుతావు. అయితే అదంతా తత్కాలీనం. అస్థిరం. దీన్ని యాజ్ఞవల్క్యుడి స్వంత మాటల్లోనే వినండి.

గాఢ నిద్రావస్థ దశలో కలిగిన ఆనందాన్ని అనుభవిస్తూ అక్కడక్కడే తిరిగి తిరిగి మంచి చెడులను కాంచి ఏ మార్గం ద్వారా అక్కడకు చేరినాడో తిరిగి అదే మార్గం ద్వారా వెనుకకు మరలును, జాగ్రదవస్థకు చేరును. స్వప్నంలో కాంచినదంతా అతడి వెంట వెనుకకు రాదు. ఎందువల్లనంటే ఆ పురుషునికి అనుబంధము లుండవు, అతడు అసంగుడు కనుక. (అదే 4-3-16)

పెద్ద చేప నదిలో ఏ దరికి చెందక ఈ దరి నుండి ఆ దరికి ఎట్లు ఈదులాడునో అట్లే పురుషుడు జాగ్రత్ సుషుప్తావస్థలకు వచ్చిపోవు చుండును. (అదే 4-3-18) ఈ రెండు దశలు తాత్కాలికములు మరియు నశ్వరములు. ఇట్లు స్వప్నం గాంచడంలో మరొక అనుకూలత కూడా యున్నది. యాజ్ఞవల్క్యుడు చెప్పిన విధంగా తనపై నెవడో అధికారము చెలాయించుచున్నాడనియు, తన నెవడో చంపుచున్నాడనియు, ఏ మత్తగజమో తనపై దాడిచేసి మర్దించుచున్నదనియూ, తానేదో అగాధములో పడిపోవుచున్నాననియు తలచును. ఆ భయ మంతరించి నంతనే నాతడు మేల్కాంచును. ఇది అంతయు బాపుటకు స్వప్నరహిత స్థితికి పోవలయును. ఈ విధమైన నిద్రనే సాంకేతికముగా సుషుప్తి యందురు. ఈ స్థితికి లోబడుట చతుర్ధ దశ లేక తురీయ మందురు. ఈ రెండింటిలో కడపటి పదము అతి తరచుగా ఉపయోగించబడ్డది. ఈ తురీయావస్థను వర్ణించడంలో యాజ్ఞవల్క్యుడి వాగ్ధరి చాలా ఎత్తులకు చేరింది.

మనుష్యుడు ప్రియమైన తన భార్య ఆలింగనములో బాహ్యాభ్యంతరములను విస్మరించినట్లు పురుషుడు తెలివికల ఆత్మను (ప్రాజ్ఞాత్మ) చేరి బాహ్యాభ్యంతరములను మరచును. నిజముగా ఇదియే అతని కోరిక సంపూర్ణ రూపం. ఆ దశలో ఆత్మయే అతడి కోరిక, ఆ దశలో అతనికి ఏ కోరికలుండవు, దుఃఖము లుండవు. (అదే 4-3-21) అట్టి స్థితిని ఎడనెడ పదాలతో అద్భుతంగా వర్ణించిన పిదప యాజ్ఞ వల్క్యుడి కంఠస్వరం మరింత ఉచ్ఛస్వరంలోనికి హెచ్చింది.

ఇదియే మనుష్యుని పరమగతి. ఇదియే మనుష్యుని అత్యున్నత సాధన. ఇదియే పరమలోకం. ఇదియే పరమానందం. ఈ ఆనందంలోని లేశమాత్ర ఆనందమునే ఇతర జీవులు అనుభవించుచు జీవించుచున్నవి. (అదే 4-3-32)

ఈ ప్రత్యేక వ్యాఖ్యానానికే యాజ్ఞవల్క్యుడు 5000ల గోవులను స్వీకరించాడు. వాటి నంగీకరించడానికి అనాసక్తి కనపరచడంతో తరువాత అతడికి విదేహ రాజ్యం మొత్తం సమర్పించబడటంతో పాటుగా జనకుడు తనను తాను బానిసగా సమర్పించుకున్నాడు.
ఆ విధంగా పంచేంద్రియ జ్ఞానం కోల్పోవడంతో జనకుడు తురీయావస్థ అని చెప్పబడే చతుర్థ దశను కూడా ఒక అడుగు అధిగమించాడని మనం ఊహించవచ్చునా!

చావే మోక్షం

తురీయావస్థను గురించి యాజ్ఞవల్క్యుడెంత అమితంగా పొగిడినా దానిలో ఒక విపరీతమైన చిక్కు ముడి ఉంది. అది స్వప్న రాహిత్యమైన గాఢ నిద్ర కావచ్చు. ఈ భయాల నుండి, భవ బంధాల నుండి విషయాసక్తులను దూరం చేసే నిద్ర కావచ్చు. కానీ దానికి ఒక అంతం ఉంది. ప్రత్యేక సందర్భాలలో తప్పిస్తే కొన్ని పగళ్ళు రాత్రులు నిద్రపోగలం. తిరిగి నీవు జాగ్రదవస్థకు రావలసిందే, దుఃఖమయమైన ఈ ప్రపంచం లోనికి తిరిగి రావలసిందే కదా. దీన్ని నిరోధించట మెట్లా? చిరంతనానందాన్ని పొందడమెట్లా? అందుకోసం తార్కికంగా చెప్పాలంటే మృత్యువును వరించడమే నీవు చేయవలసింది. యాజ్ఞ వల్క్యుడు ఆ విధమైన మార్గాన్ని అనుసరించాడు. ఎవరైనా బ్రహ్మాన్ని చేరాలంటే అతడు తప్పక వాంఛా విముక్తుడు కావాలని సందేహానికి తావులేని విధంగా నిశ్చయమైన పదాలతో యాజ్ఞవల్క్యుడు వ్యాఖ్యానిస్తాడు, అంతేకాక ఎవరైతే వాంఛా పరిపూర్తి సాధిస్తాడో, ఎవడైతే బ్రహ్మం కోసం పలవరించి మరణిస్తాడో కేవలం అతడు మాత్రమే బ్రహ్మైక్యం చెందుతాడు. ఇదిగో ఇవే యాజ్ఞవల్క్యుడి ప్రత్యక్షర పదాలు అతడు మరణ శయ్య నుండి వర్ణించిన విధాలు:

"అతడు ఏకీ భూతుడైనాడు", వారు చెప్పుచున్నారు. "అతడు చూచుట లేదు". "అతడు ఆస్వాదించుట లేదు" "అతడు ఏకీభూతుడైనాడు" వారు చెప్పుచున్నారు, "అతడు మాటలాడుట లేదు" "అతడు వినుట లేదు" "ఏకీ భూతుడైనాడు" వారు చెప్పుచున్నారు. "అతడు ఆలోచించుట లేదు" "ఏకీభూతుడైనాడు". వారు చెప్పుచున్నారు; "అతడు స్పృశించుట లేదు" "ఏకీభూతుడైనాడు". వారు చెప్పుచున్నారు "అతడు తెలుసుకొనుట లేదు" అతని హృదయాగ్ర ప్రదేశం ప్రకాశమగు చున్నది. ఆ జ్యోతితో ఆత్మ అతని నేత్రం డి కాని శిరస్సు నుండి కాని, ఇతర శరీరాంగముల నుండి కాని నిష్క్రమించు చున్నది. ఆత్మ నిష్క్రమించగానే ఆతని ప్రాణములు నిష్క్రమించును. ప్రాణములతో బాటే ఇంద్రియము లన్నియు నిష్క్రమించును. విజ్ఞానముతో కూడియున్న జీవుడు మరణ సమయమున నిష్క్రమించును. విజ్ఞానము వేరగును. జీవుని వెంట తరలును. విద్య, కర్మ, పూర్వ ప్రజ్ఞ ఆత్మ వెంటబోవును. గొంగళి పురుగు గడ్డి పరక అంచునకు చేరి రెండవ గడ్డి పరక ఆధారముగా చేసుకొని తనను దాని పైకి చేర్చుకొనును. అట్లే ఈ ఆత్మయు శరీరమనెడి ఈ గడ్డి పరకను విడిచి, అవిద్యను దాటి మరియొక శరీర రూపమును పొందుటకు యత్నించును.(బృహదారణ్యకం 4-4-2,3)

ఎవడు ఎట్టి కర్మ చేయునో, ఎవడు ఎట్టి ఆచరణ కలవాడగునో అతడట్టి రూపుడగును.(అదే 4-4-5)

ఏ మనుష్యుడైతే కోరికలు కోరడో, ఎవనికైతే కోరికలుండవో, ఎవడైతే కామనల నుండి విముక్తుడగునో, ఎవని కామనలు పరిపూర్తి పొందెనో, ఎవని కామన ఆత్మయే నగునోఅతని ప్రాణములు ఉత్రేమింపవు. అతడే బ్రహ్మ కేవల బ్రహ్మ అయి బ్రహ్మను చేరును.(అదే 4-4-6)

అదిగో అదియే! బ్రహ్మయగుట, శాశ్వతానందమును పొందుట అందుకోసం మృత్యువు బొందుట. సోఫోక్లిస్ తన విషాదాంత రచనలలో నొక దానిలో ఒడిపస్ నోట పలికించినదిదే. 'ఏ మనుషుడు మరణాంతము వరకు ఆనందము బొందలేడు.' ఇక్కడ మాత్రం ఓడిపస్ ప్రవచించిన అత్యంత విషాదమైన, సుదీర్ఘమైన, అద్భుతమైన తత్వాన్ని యాజ్ఞవల్క్యుడి నోటి వెంట నిశ్చయంగా, సప్రమాణంగా "కైవల్యానందాన్ని బొందడానికి,

శాశ్వతానందాన్ని అనుభవించడానికి, నీవు తప్పనిసరిగా మృత్యువును కోరాలి." అంటూ పలికిస్తారు. ఇది కేవలం యాజ్ఞవల్క్యుడి తత్వం మాత్రమే కాదు. ఇది మొత్తంగా ఉపనిషత్తుల తత్త్వ సారం కూడా. వారు మూఢత్వాన్ని భజించే కొద్దీ మనస్సును తిరస్కరిస్తారు. మృత్యువును కీర్తించే కొద్దీ జీవితాన్ని తెగడుతారు. దైవాలను స్తుతించే కొద్దీ మానవులను నిందిస్తారు, మనుష్యజాతిని ప్రేమించే వారిని, ఈ జీవనానందాన్ని ప్రేమించే వారిని నిందిస్తారు. అలా వారు మరీ తెగించి ఈ క్రింద పేర్కొన్న ప్రశ్నలను మైత్రీ ఉపనిషత్తులో సంధించారు.

అనిత్యమైన, అస్థి, చర్మ, మజ్జ, కండరాదుల చేత, రక్త, మాంస, మల మూత్రాదులచేత, శ్లేష్మ, వాత, పిత్త కఫములచేత, ఇంద్రియములచేత దుర్గంధ భూయిష్టమై ఉండచుట్టి కొనబడిన ఈ శరీరము, ఈ సారహీనమైన శరీరము నందు కామాదుల వలన కలుగు ప్రయోజనమేమి?
సమ్మోహము, భయము, విషాదము, భ్రాంతి, చంచలత్వము, అసూయ, ద్వేషము, వియోగము, ఆకలి, దాహము, ముసలితనం, మృత్యువు, వ్యాధులు, దుఃఖాదులచే ప్రభావిత మవుతున్న ఈ శరీరమందు వాసనలు కామనల వలన కలుగు ప్రయోజనమేమి?(1-3)

ఇంకా అసహ్యం కలుగజేసే విధంగా అంటే పరమ అసహ్యం కలుగ చేసే విధంగా మరొక భాగం మైత్రీ ఉపనిషత్తులో ఈ విధంగా కొనసాగుతుంది.

ఈ శరీరము ఇంద్రియ సంపర్కమువలన జనించినది. ఇది వృద్ధి అయ్యే కొద్దీ నరకానికి (మృత్యువు, అంధకారం) చేరువ అవుతుంది. తరువాయి మూత్ర ద్వారం ద్వారా ముందుకు వస్తుంది. అది అస్థిగతమైనది, మాంసాదులచేత, చర్మము చేత కప్పబడినది; మలమూత్ర మేధో మజ్జాదుల చేత, వాతపిత్తకఫ శ్లేష్మాదుల చేత నింపబడినది. ఒక కోశాగారము ధనము చేత నింపబడినట్లు ఈ శరీరము వ్యాధులచే నింపబడినది. (3-4)
"అసహ్యం' అనే పదాన్ని కొన్ని ఉపనిషత్తులు స్త్రీకి పర్యాయపదంగా వాడాయి. అలాంటి వాటితో రెండు భాగాలను నేను ఇక్కడ ఉదహరిస్తున్నాను. మొదటిది యాజ్ఞ వల్క్యోపనిషత్తు నుండి, రెండవది నారద పరివ్రాజకోపనిషత్తు నుండి.

స్త్రీలు అత్యంత సౌందర్యరాసులైనప్పటికీ వారు మోహంతో నిండిన సౌందర్యంతో ఇంధనం వలె మనలను నరకాగ్నికి చేరుస్తారు. ఎంత దూరం నుండైనా సరే కాముడనే కిరాతుడు పక్షులకై పన్నిన వల వలే వారెంత సామాన్యులైనా అవే లక్షణాలతో పురుషుల అంగాంగాలను బంధించగలరు. గాలమునకు తగిల్చిన ఎరవలే స్త్రీలు దుర్వాసన లనబడే గాలములకు గుచ్చిన ఎరలు. జనన మరణ సంసార చక్రమనెడి సరస్సులో నీదులాడుచున్న చేపల వంటి పురుషులను మోహపరుచుదురు, మనసులను భ్రాంతిలో ముంచుదురు, దుర్వాసనలకు లోబరుతురు, ఇంతకన్నా స్త్రీలు ఏమి చేయగలరు. వారెప్పటికీ దుఃఖపు గొలుసులే, అన్ని రకాల దుఃఖాలలోను వారు రత్నము లుంచుకొను బరిణెలాంటివారు.

క్రుళ్ళిపోయిన వ్రణానికి స్త్రీలలో చెప్పబడని ఏ శరీరాంగానికి భేదమే లేదు, ప్రజలు కేవలం పైపై రూపాన్ని చూచి మోసపోతారు. రెండుగా విడిపోయిన చర్మపు ముక్క కోసం, వాసనల చేత చుట్టబడిన దానికై తల వంచి ఎవరు దాని నుండి ఆనందాన్ని పొందుతారు? ఇంతకన్నా భయంకరమైన అనాలోచన ఏమి ఉంటుంది?

పురుషులైన, స్త్రీలైనా మానవ మాత్రులను ఉపనిషత్తులు ఖండించిన విధమిదే. ఇంకా, ఇంకా మీరు ఉపనిషత్తులు ఒక గాఢమైన జీవనతత్త్వాన్ని, జ్ఞానాన్ని, విముక్తిని ప్రసాదించాయని నమ్ముతున్నారా. నిజానికి వారి తత్త్వం, శాశ్వతమైన తత్త్వం ఏమంటే మూఢత్వం ద్వారా శాశ్వతత్త్వం, మృత్యువు ద్వారా దైవత్వం.

హత్యలకు అనుమతులా!

ఉపనిషత్తులు మీకు ఇంకో దిగ్భ్రాంతిని కలుగజేస్తాయి. అది నైతిక వ్యవస్థాపరంగా కలుగ చేసే దిగ్భ్రాంతి. నిజం చెప్పాలంటే నైతికత అనేది పూర్తిగా మృగ్యం కావడమే అసలు దిగ్భ్రాంతి. సాధారణ నైతిక సూత్రాలను ఏకరువు పెట్టడం కాదు. దాన్ని బాగానే చేసినై.
ఉపనిషత్తుల పుటలలో కీత్ ఎత్తి చూపిన విధంగా "నైతిక సూత్రాలను అక్కడక్కడ వివరించవచ్చు. దాని వలన ఒనగూడిన ఫలితమేమీ లేదు. అవి కేవలం ప్రజానురంజనం కోసం చెప్పే నైతిక సూత్రాలు మాత్రమే. " అంటే అతడు చెప్పేదేమంటే ఉపనిషత్తులు ఒక సమగ్ర నైతిక విధానం కోసం చేసిందేమీ లేదు. నిజానికి నీతిశాస్త్రం భారతదేశంలో పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిన ఒక అధ్యయన శాఖ. చరిత్ర, జీవిత చరిత్రల నెంత నిర్లక్ష్యం చేసామో ఇదీ అంతే. క్రీ.శ. 7వ శతాబ్దం నుండి భారతదేశానికి సరైన చరిత్ర లేదు, సరైన జీవితచరిత్ర చిత్రణ లేదు. భారతదేశం ఇంకా ఒక నైతిక ప్రవర్తకుడి ఆగమన కోసం ఎదురు చూస్తూనే ఉంది. ఇందుకు బలమైన కారణాలున్నాయి. అయితే వాటిని వివరించడానికి ఇది సందర్భం కాదు, అయినా నేను ముందుకు సాగే ముందు వాటిని గురించి సంక్షిప్తంగా సూచిస్తాను.

కేవలం కొన్ని నీతిసూత్రాల మాలిక ఒక నైతిక వ్యవస్థను నిర్మించలేదు. నైతిక వ్యవస్థ తప్పనిసరిగా ఒక సమగ్ర దృక్పథంతో ఉండాలి, ఒక రాజకీయ భావజాలానికి సన్నిహితంగా మెలగాలి, ఒక సామాజిక వ్యవస్థకు, క్రమానికి, ఒక ఆర్థిక నియతికి అనుసంధానించి ఉండాలి. అంతేకాక దానికి తప్పని సరిగా ఒక సమగ్ర తాత్త్విక దృక్పథం ఉండాలి. అంతమాత్రం చేత ఒక మతైక నైతిక వ్యవస్థ - మతరహిత నైతిక వ్యవస్థ ఒకే మాదిరిగా ఉంటాయని చెప్పరాదు. అలాగే ఒక రాజరిక వ్యవస్థ మరో ప్రజాస్వామిక వ్యవస్థలోని నైతిక వ్యవస్థలు ఒకటిగా ఉండవు. ఉపనిషత్కర్తలు వ్యవస్థా నిర్మాతలు కారు. అందువల్ల నీకు ఉపనిషత్తుల్లో కనుపించేదంతా కేవల నీతిసూత్ర మాలికలే లేక కేవలం చూచి వ్రాయబద్ధ నీతి సూత్రాలే. ఉదాహరణకు మీరు తైత్తిరీయోపనిషత్తును గమనించండి. ఆచార్యుడు - విద్యను గడించి స్నాతకుడై గృహోన్ముఖుడవుతున్న శిష్యునికి ఇలా బోధిస్తున్నాడు. సత్యమునే పలుకుము, విలువల నాచరింపుము, వేదాధ్యయనం మరువద్దు, నిర్లక్ష్యం చేయవద్దు. అంతేకాక మాతాపితరులను, గురువును, అతిథులను దైవసమానులుగా ఎంచి పూజించమని బోధించబడుతున్నాడు. (1-12-2) చక్కగా పాటించబడిన నియమం తరువాయి తరాల వారికి చక్కగా అంది నిలబడుతుంది. విపరీత భావాలతో కూడిన, ప్రాచీన సామాజిక క్రమాన్ని విచ్ఛిన్నం చేయగల సూత్రాలు నిరాదరించబడతాయి. మిగిలిన సిద్ధాంతాలు బహిష్కరణను అధిగమించి తలెత్తుతాయి. అలాంటి శిష్యుడిని గురువుగారికి ఆమోద యోగ్యమైన బహుమానాన్ని ఒసగమని కోరతాయి. ఫలితంగా అతడి కుటుంబం సర్వసంపదలతో అభివృద్ధి చెందుతుంది, పుత్ర పౌత్రాది పారంపర్యంగా సుఖసౌఖ్యాలతో ఓలలాడుతుంది. బృహదారణ్యకానికి వచ్చేసరికి మీరు ప్రజాపతిని కలుస్తారు. అతడు మూడు ప్రధాన విలువలను 'ద' అనే ఏకాక్షరంలో సంగ్రహంగా మూడు మార్లు ఉచ్చరిస్తాడు. అందులో మొదటి 'ద' దమ్యతకు చిహ్నం (మీ అంతట మీరే నిగ్రహం పాటించండి) రెండవ 'ద' దత్త (దానముచేయుటకు సిద్ధంగా ఉండుట) కు, మూడవ 'ద' దయధ్వమ్ (దయతో నుండుట) కు ప్రతీకలు. పురాణ

వాఙ్మయంలో మొదటి మానవునిగా పరిగణింపబడిన ప్రజాపతి తన సంతానాన్ని కుశలురుగా చేయడానికై వీటిని చిక్కు సమస్యలుగా బోధించాడు, వాటిని మార్మికమయం చేశాడు. వాటిలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించడానికి అలా నుడివాడు.

ఈ అయితే ఈ విధానం ఒక సంపూర్ణమైన, సుశిక్షితమైన, పరహితార్థ నైతిక వ్యవస్థగా ఎందుకు అపజయం చెందింది? ఈ ప్రశ్నకు జవాబు చాలా సులభం. పురోహిత ఉపనిషత్కారుల ప్రకారం ఈ లోకం ఒక భ్రాంతి, జీవితం ఒక బంధనం, మన లోకానుభవమంతా శూన్యం. బ్రహ్మ మొక్కటే సత్యం. దాన్ని తెలుసుకుంటే సమస్తం తెలుసుకున్నట్లే. దానిని అవగాహన పరచుకుంటే సమస్తమూ అవగాహన అయినట్లే. మరింకా ఈ ప్రపంచంలో మన జీవితాని కొక సువ్యవస్థితమైన నైతిక వ్యవస్థను నిర్మించుకోవాలన్న బాదరబందీ ఎందుకు? ప్రపంచంలో స్వల్పకాల నివాసులమైన మనం, మన జీవితాలను క్రమబద్ధమొనర్చుకొనడానికి కేవలం కొద్దిపాటి నైతిక సూత్రాలు చాలుకదా!

సరిగ్గా ఇటువంటి కారణాలతోనే మనకు చరిత్రన్నా, జీవిత చరిత్రలన్నా చిన్నచూపు. మనం వాటిని గురించి ప్రయాస పడటమెందుకు? నువ్వు ప్రయాస పడవలసిందల్లా మార్మిక జ్ఞానాన్ని ఆర్జించడానికి, రహస్య జ్ఞానాన్ని నేర్వడానికి, ఫలితంగా నీ జీవాత్మను పరమాత్మతో అనుసంధించి ఐక్య మొనర్చడానికి. అలా ఆర్జించిన జ్ఞానమే నీకు ఇహంలోను పరంలోను అక్కరకు వస్తుంది. ఈ విషయం మీద నేను కీత్ ను ఉదహరిస్తున్నాను.

ఉపనిషత్తులలోని జ్ఞానమంతా అవశ్యంగా లాభదాయకమే. అయితే అది కేవలం ఆధ్యాత్మికత కోసం మాత్రమే కాదు. ఈ జగత్తు నెవడైతే పాంచభౌతిక ప్రపంచంగా గ్రహిస్తున్నాడో; ఎవరైతే ఇంద్రునికి శత్రువులు ఉండరని, శత్రువులు ఏర్పడరని; జ్ఞానం పొందిన వాడు శత్రువులచేత గాయపరచబడడని; అటు ఉత్తర పర్వత శ్రేణులు ఇటు దక్షిణ పర్వత శ్రేణులు అతనికెదురు నిలవజాలవని; అతడి శత్రుమూకలన్నీ అతని చుట్టు చచ్చిపడి ఉంటాయని చెప్పబడే భావన ఒకటి ఐతరేయ బ్రాహ్మణంలో కనుపిస్తుంది. మన గమనించిన ఫలితం దిశగా అడుగువేయడమే; జ్ఞానం చెడును తుడిచి వేస్తుంది. హంతకుడికి సైతం జ్ఞానం అండగా ఉంటే అలా మారి ఉండేవాడు కాదన్న విషయం మనకు తెలుస్తుంది. జ్ఞాని అయిన మానవుడు తప్పనిసరిగా మంచి వాడై ఉండాలన్న సోక్రటీస్ భావానికి వ్యతిరేకంగా మానవుడు తప్పుచేసినా, ఒప్పుచేసినా జ్ఞానం మానవుణ్ణి బాధల నుండి విముక్తం చేస్తుందని మనం ప్రవచిస్తుంటాము. మనం కైవల్యం సాధించామంటే మన మొనర్చిన మంచి చెడుల ఫలితాన్ని క్రమంగా మన బంధువులు లేదా శత్రువుల పేర మనం బదిలీ చేసి వెడుతున్నామనే.[58]

పై వ్యాఖ్యలకు మద్దతుగా కీత్ ఏదో ఒక ఉపనిషత్తు నుండి ప్రమాణాల నుదహరిస్తూనే ఉంటాడు. ఆయన చూపిన అసలు ఆధారాలను వదలకుండానే నేను తరువాత విషయానికి వస్తున్నాను. ఇప్పుడు ఉపనిషత్తులు చెప్పే మరో నిర్ణయాత్మకమైన, ఎవరినైనా అత్యంత దిగ్భ్రాంతికి గురిచేసే విషయమేమంటే ఎవరయితే మానవ హుందాతనపు సౌశీల్యాలను హతంచేసి, ఉపనిషత్తులు బోధించే అసలు జ్ఞానాన్ని కలిగి ఉంటారో వారు దొంగతనం చేసినా అపవిత్రులు కారు; భ్రూణహత్య చేసినా అపవిత్రులు కారు; మాతృ పితృ హంతకులయినా అపవిత్రులు కారు. వాస్తవంగా మీరు చేసిన కర్మలు హీనాతి హీనమైనా, ఎంతటి రాక్షసకర్మలైనా వాటి ఫలితం ఏ మాత్రం - మీకు ఏ మాత్రం అంటదు. మీరు పాప పుణ్యాల కతీతులుగా ఉంటారు, మీరు నిష్కళంకులుగా ఉంటారు. సరిగా ఇదే పదాలతో కాకపోయినా దేవతల ప్రభువయిన ఇంద్రుడు ప్రతర్థన దైవదానికి బోధించిన జ్ఞానమిదే. (కౌషీతకి, 3.1)

ఈ పరమజ్ఞానం మీరు చేసిన నేరాల నుండి మిమ్ములను ఎలా విముక్తం చేస్తుంది? చాలా తేలికగా మీరు విముక్తం కావచ్చని ఛాందోగ్యం చెబుతుంది. నేను దాన్నే ఉదహరిస్తున్నా. దర్భను అగ్నిలో వేసిన మరుక్షణమే దహింపబడినట్లు అగ్నిహోత్రము చేయువాని పాపములన్నియు నట్లే నశించును (5.24.3)

అసలు ఈ పరమజ్ఞానమంటే ఏమిటి? ఇది విశ్వాత్మ జ్ఞానము పరమపురుష జ్ఞానము. వాచ్యార్థంగా పురుష అంటే గతజన్మల పాపముల నుండి విమోచన పొందినవాడు. అతడిని గురించిన జ్ఞానం పొందినా వంటే జీవాత్మ యొక్క సకల పాపములు దహించబడినట్లే.

ఇదే విషయాన్ని బృహదారణ్యకం కూడా ఈ విధంగా నొక్కి చెబుతుంది. నీవు ఒనర్చిన భయంకర పాపకర్మల నుండి విముక్తుడు కావడమే కాదు, నీవు పరిశుద్ధుడవు, అతి పవిత్రుడవు, వయోరహితుడవు, అమరుడవు కాగలవు. (5.14.8)

నేను చాలా సరళంగా, సున్నితంగా చెప్పవచ్చు. అయితే ఈ మతం యొక్క ఉన్నతమైన నైతిక విలువగా పేర్కొనబడుతున్న ఈ విషయం చెప్పడానికి నేను బిడియపడుతున్నాను. కానీ హత్యలకు కూడా అనుమతి ఇవ్వబడే ఈ విషయం పట్ల నేను ... నేను ... నా అస్తిత్వం మొత్తం తిరగబడుతుంది. ఎవరుచేసినా హత్యహత్యే. ఇది నిజంగా పైశాచిక కృత్యం. దీని నుండి ఎవరూ విముక్తం చెయ్యబడలేరు ... చేయలేరు .... చేయరు.

ఉద్దాలకుడు : యాజ్ఞవల్క్యుడు

ప్రధాన ఉపనిషత్తులలో సుమారొక నూరుమంది ఉపనిషద్గురువులు మిమ్ములను పలుకరిస్తారు. మీకు ఉపదేశం చేసే దేవతలు కాక వీరు వేరు. వీరిలో ప్రధాన దేవతలు స్వర్గాధిపతి ఇంద్రుడు; అతడికి ప్రతిగా నరకాధిపతి యముడు; హిందువుల ఏడమ్ గా పేర్కొన దగ్గ మొదటి మానవుడు ప్రజాపతి. వీరికి తోడు ఎక్కడ బడితే అక్కడ ప్రత్యక్షమయ్యే జీవి, ఒక లోకాన్నుండి మరొక లోకానికి ఎగురుతూ తను వెళ్ళిన చోటల్లా ఒక తగాదాను వదిలే తంపుల మారి నారదుడు. ఉపనిషత్తుల్లో అతని పాత్ర మటుకు పూర్తిగా భిన్నం. ఒకప్పుడు నారదుడు సనత్కుమారుని వద్దకు చేరి వినయంతో "భగవాన్! నాకు ఆత్మను గురించి ఉపదేశం చేయ"మని ప్రార్థిస్తాడు - (ఛాందోగ్యం 7.1) ఇంకా మీరు వృషభాలను, హంసలను, జలచర పక్షులను కలుస్తారు.
అవి మీకు బోధచేయడంలో తమ వంతు పాత్రను నిర్వహిస్తాయి. బ్రహ్మ స్వభావాన్ని మీకు విశదపరుస్తాయి. సత్యకాముడిని హరిద్రుత గౌతముడు శిష్యునిగా అంగీకరించినా, అతడు మాత్రం ప్రథమ పాఠాలను పక్షుల నుండి, జంతువుల నుండే నేర్చుకుంటాడు. ఈ విధంగా ఉపనిషత్ప్రపంచం ఒక విపరీత ప్రపంచం. వాస్తవం - కల్పన ఆ లోకంలో కలగలిసి పోతాయి. అదే విధంగా హేతువు - మూఢ విశ్వాసం; సందేహం - పిడివాదం; తెలివిడి అమాయకత్వం చెట్టా పట్టాలేసుకుంటాయి. ఇంతెందుకు జ్ఞానం - అజ్ఞానం ఒక దానిపై మరొకటి పైబడుతుంటాయి. మిమ్ములను అయోమయంలో పడవేస్తాయి, దిగ్భ్రామకు గురిచేస్తాయి. మిమ్ములను గహనారణ్యంలో దారితప్పేటట్లు చేస్తాయి.

ఉపనిషత్ప్రపంచం ఎలాంటిదంటే చివరకు యాజ్ఞవల్క్య - ఉద్దాలకుల చారిత్రకతను గురించి కూడా తీవ్రమైన సందేహాలు పొడచూపినై. ఉపనిషత్తుల్లో చెప్పబడుతున్న విధంగా వారు జీవించి బోధించి ఉంటే వారికి ఆరోపించబడిన బోధనల్లో నిజంగా వారికి చెందినవి ఏవి? ప్రాథమిక ఉపనిషత్తుల్లోనికి అనంతర కాలంలో ఉద్దేశ్య పూర్వకమైన ప్రక్షిప్తాలు చేర్చిన మాట నిజం. మనకు మత విషయికంగా గాని మతరహితంగా గాని ఒక ప్రామాణిక ప్రాచీన గ్రంథమంటూ ఏదీ లేదు. ఉండి ఉంటే అది కల్పితకారుల, ప్రక్షిప్తకారుల దృష్టిపథం నుండి తప్పుకు పోయే అవకాశం లేదు. సాంప్రదాయం ప్రకారం, అందులోని అధ్యాయాల ప్రకారం బృహదారణ్యకం యాజ్ఞవల్క్య సంపాదితం. కానీ అది మన వద్దకు వచ్చేసరికి యాజ్ఞ వల్క్యుడి సరసన ఇతర ఉపదేశికులను కూడా గమనిస్తాము. ఉద్దాలక అరుణి ఉపదేశాలలో అసంగతాలను చూచినట్లయితే ప్రక్షిప్తకారులు తమ స్వకపోల కల్పనలను అతని కంటగట్టారన్న మన అనుమానం నిజమై తీరుతుంది. ఉద్దాలక నామం ధరించిన ఇతరులు ఇద్దరు ముగ్గురు ఉండవచ్చని తేలుతుంది.

ప్రక్షిప్తాల సంగతి ప్రక్కన పెట్టి ప్రధాన ఉపనిషత్తులను విశాల దృష్టితో పరికించినా మనకవగతమయ్యేది ఉపనిషదుపదేశికులందరిలోకి యాజ్ఞవల్క్యుడే అతి పెద్ద పిడివాది, అంతకన్నా తక్కువ శ్రేణిలో కనపడేవాడు ఉద్దాలకుడు. యాజ్ఞవల్క్యునికి ఏ ప్రశ్న సంధించినా అతడి నాల్క మీద ఏదో ఒక సమాధానం సిద్ధంగా ఉంటుంది. కానీ ఉద్దాలకుడి ధోరణి వేరు. ఏ ప్రశ్నకయినా సమాధానం తెలియనట్లయితే అతడు ఖచ్చితంగా 'నాకు తెలియ' దనే జవాబిస్తాడు. అదే నికార్సయిన తత్త్వవేత్తకు చక్కని ఉదాహరణ. ఒకప్పుడు ఐదుగురు గృహస్థులు ఆత్మజ్ఞానాన్ని బోధించమని ఉద్దాలకుని సమీపించగా అతను వెనుక ముందులాడాడు. అతడీ విధంగా తలపోశాడు - ఈ గృహస్థులు బ్రహ్మజ్ఞానము గురించి బోధించమంటున్నారు. కాని వీరి ప్రశ్నలకు నేను సమగ్రంగా సమాధానమియ్యలేను. కనుక నేను వీరిని మరి యొకరి వద్దకు పంపుదును అంటూ అతడు వారిని కేకయదేశపు రాజు అశ్వపతి వద్దకు పంపటమేగాక, వారితో పాటు తాను రాజు వద్దకు ప్రయాణమయ్యాడు. అతని వినయము అటువంటిది. అది కపట వినయము కాదు.

ఉద్దాలకుడు కేవలం స్వభావంలోనే కాదు, తాత్త్వికంగా కూడా యాజ్ఞవల్క్యుడితో విభేదిస్తాడు. హెర్మన్ జాకోబి అనే జర్మనుదేశపు ఇండాలజిస్ట్ (భారతీయ అధ్యయన వేత్త) సూచన ప్రకారం ఉద్దాలకుడి బోధనల్లో కొన్ని ప్రాథమిక భౌతికవాద ఛాయలున్నాయి. అతడి శిష్యుడు వాల్టెర్ రూబెన్ ఆ సూచనలనే తరువాత ఒక సిద్ధాంతంగా మలిచాడు. అతడీ విషయంపై ప్రకటించిన అనేక వ్యాసాలలో 'ఉద్దాలకుడు మరియు యాజ్ఞవల్క్యుడు : భౌతికవాదం మరియు భావవాదం' అనేది ఒకటి.

దాని ఆంగ్లానువాదం నేను ఇంతకుముందే సూచించిన దేవీప్రసాద్ చటోపాధ్యాయ సంపాదిత గ్రంథం స్టడీస్ ఇన్ ది హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీలో పునర్ముద్రణ పొందింది.[59]

రూబెన్ వాదన ప్రకారం ఉద్దాలకుడు నూటికి నూరుపాళ్ళు భౌతికవాది కాదు. అతడు చేతనా చేతనములలో ప్రాణమున్నదని నమ్మే ఋతవాది - ఆదిమ భౌతికవాది. చాలా సందర్భాలలో అతని బోధనలు థేల్స్ బోధనల్లాగే ఉంటాయి. వారు దైవ అస్తిత్వాన్ని నిరాకరించక పోయినా, మానుష - అతిమానుష స్వభావపు విభేదాన్ని గుర్తించ లేదు. థేల్స్ ఆది మూలం జలమని, దాన్నుండే సమస్తమూ ఉద్భవించిందని వాదించగా, ఉద్దాలకుడు వాయువును

మూలభూతంగా పేర్కొంటాడు. ఇరువురి ఆలోచనా సరళిలోను తార్కికత, శాస్త్రీయత కానవస్తుంది. అయితే థేల్స్ ఈ విషయంలో ప్రత్యేకించి ఉద్దాలకుడి కంటే చాలా ముందున్నాడు.

మనం సాంప్రదాయాన్ని విశ్వసించినట్లయితే యాజ్ఞవల్క్యుడు ఉద్దాలకుడి శిష్యుడే. (బృహదారణ్యకం 6.3.7) అయినా వారిద్దరి మధ్య ఉన్న విభేదాలు విస్తారమైనవి. వాటిని రూబెన్ ఏర్చికూర్చాడు.

తన తత్త్వంలో ఉద్దాలకుడు పునర్జన్మ, శాశ్వతమైన ఆత్మ, కర్మ, మోక్షం వంటి అంశాలను ప్రస్తావించలేదు. పాండితీ పరిశీలనతో, అవగాహనకు అందే ఉదాహరణలతో తన శిష్యుల (ఇక్కడ సూచిస్తుంది ఉద్దాలక పుత్రుడు శ్వేతకేతు గురించి) నతడు తాను బోధించే సర్వభూతాత్మ ఏకాత్మవాదంతో ఏకీభవించేలా చూస్తాడు. ప్రాచీన భారతంలో యాజ్ఞవల్క్యుడిచే బోధించబడ్డ భావవాదానికిది విరుద్ధం. ఆ భావవాదం మార్మిక అంతర్బుద్ధివాదం, మాంత్రిక పురోహితవాదాల మీదుగా ప్రచలితమై అనంతరకాలంలో యోగంగా అభివృద్ధిచెందింది.

రూబెన్ ఉదహరించిన యాజ్ఞవల్క్య ఉద్దాలకులు నేతృత్వం వహించిన తాత్విక రీతులకు డేల్ రీవ్ కూడా తన పూర్తి మద్దతును ప్రకటిస్తాడు. అతడి విధంగా వ్రాస్తున్నాడు.

యాజ్ఞవల్క్యుడీ విధంగా చెప్పుచున్నాడు. విశ్వంలో గల గొప్ప శక్తి ఒక సంగీత వాయిద్యం వంటిది. ఈ జగత్పదార్థమంతయు దాని నుండి వెలువడు శబ్దము వంటిది. ఈ ప్రకృతి శబ్దము వంటిదికనుక మనము దానిని పొందజాలము, మన అవగాహన కది దూరము. కానీ ఉద్దాలకుడి వాదన ఇందుకు భిన్నంగా ఉంటుంది. సత్తు అంతయూ శబ్దమే అయినా, అది కుండ నుండి శబ్దము వెలువడునట్లు భౌతిక పదార్థము నుండే ఉత్పన్నమగు చున్నది. కుండలేనిచో శబ్దమే లేదు. అట్లే పదార్థం లేక అస్తిత్వమే లేదు. లూక్రెటిస్ వలెనే ఉద్దాలకుడు కూడా కేవలం దైవశక్తి మూలంగానైనా శూన్యం నుండి శూన్యం ఉద్భవించదని చెబుతున్నాడు. అస్తిత్వంలో ఉన్నదంతా అతడొకటి గానే భావించాడు. ఆ మాదిరిగానే ఏ భావమయినా, ఆలోచనయినా అస్తిత్వం మీద ఆధారపడే (కుండ మాదిరి భౌతిక అస్తిత్వం) ఉంటుంది. అదీ ఒకటే అయి ఉంటుంది.[60]

అయితే సాంప్రదాయిక ఉపనిషత్ వ్యాఖ్యానకారులు నా వాదనను మూలమట్టంగా త్రోసి వేస్తారని నాకు తెలుసు. అయితే ఉద్దాలకుడు 'తత్త్వమసి' (అది నీవై ఉన్నావు) అని వ్యాఖ్యానించడంలో బలమైన కారణాలున్నాయి. అదే మనిషిలో దాగుండే నిగూఢమైన శక్తే ప్రకృతిలో కూడా ఉందని. ఉద్దాలకుడి భావాలు ఏ విధంగా ప్రచలితమైనా వేదాంతంలో మటుకు అవి శైశవదశలోనే మరణం పాలయ్యాయి. భారతదేశ చరిత్రలోనయినా, బహుశః ఆసియా చరిత్రలోనయినా వాటి స్థానం విభిన్నంగా ఉంటుంది.

అయితే సందర్భవశాత్తు వేదాంతం విజయం పొంది మనలను అపమార్గంలో నడిపింది. ఆనాటి నుండి వేదాంతం మనలను దుఃఖపూరిత నిరాశావాదులుగనో లేక భయంకర దగాకోరులుగనో మనలను మార్చివేస్తూనే ఉంది.

పవిత్ర మానవులు

ఉపనిషత్తులను గురించి ఏమయినా మంచి చెప్పుకోదలిస్తే తొలి నాటి వాటికి కల చారిత్రక ప్రాధాన్యత గురించే. మొట్ట మొదటి భారతీయ ఆలోచనాధార మీద అవి కొంత వెలుగును ప్రసరించాయి. ఆలోచనా ధోరణులను అధ్యయనం చేసే చరిత్రకారుడు వాటిని అధ్యయనం చేయవచ్చు. వాటిని విస్తారంగా అధ్యయనం చేయవచ్చు గాని విమర్శనాత్మకంగా మాత్రం కాదు. ఉపనిషత్తులు రహస్య సందేశాలు, మార్మిక సిద్ధాంతాలు, మార్మిక శాస్త్రాలకు నెలవులని విశ్వసించబడుతున్నాయి. అందుచేత వాటిని భక్తి విశ్వాసాలతో మాత్రమే పఠించాలి. విశ్వాసం గుమ్మంలో నుండి ప్రవేశిస్తే హేతువు కిటికీ గుండా నిష్క్రమిస్తుంది; భక్తి వ్యాపించేచోట విచక్షణ అంతరిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లోను చిన్న అద్భుతం, ఉపనిషత్తుల మీద విమర్శనాత్మకమైన, నిష్పాక్షికమైన గ్రంథం ఉండటం. అది అరుణ్ శౌరీది.

శౌరీ గ్రంథమే కాకుండా నా దగ్గరింకా ప్రత్యేకించి ఉపనిషత్తుల మీద రచించబడిన మిక్కిలి పాండితీ ప్రకర్షతో నిండినవి, అత్యంత వాగాడంబరం ప్రదర్శించేవి, సారహీనమైన పుస్తకాలు ఓ డజనుదాకా ఉన్నాయి. అసలు గ్రంథమెలా ఉండకూడదంటే అది అతిశయోక్తులతో డంబాన్ని ప్రదర్శించరాదు లేదా కేవలం బుద్ధి కుశలతనో, చతురతనో ప్రదర్శించేదిగా మాత్రమే ఉండరాదు,

మొదటి వర్గానికి ఆర్.డి. రనడే, గోవింద గోపాల ముఖోపాధ్యాయ[61], రంగనాధానందల[62] ఈ గ్రంథాలు ఉదాహరణలు కాగా, రెండోవర్గానికి రోహిత్ మెహతా[63], కె.యం. పట్వర్ధన్[64] గ్రంథాలు ఋజువులు. నేను ముందు సందర్భంలో చెప్పిన విధంగా ఉపనిషత్తుల పట్ల రనడే నిర్మాణాత్మక దృక్పథానికి ఫలితం "ఆధ్యాత్మిక ఆనంద పారవశ్యతే". ముఖోపాధ్యాయ ప్రాచ్యపాశ్చాత్య మంతా చుట్టి చుట్టి వచ్చి చివరకు మిమ్మల్నొక ఆశావహ సందేశానికి చేరుస్తాడు. అది "చిరంతనానందాన్ని లేక కైవల్యాన్ని సాధించాలంటే ఈ ప్రపంచాన్ని వీడిపోనవసరం ... లేక ఈ శరీరాన్ని విసర్జించవలసిన అవసరం లేదంటాడు. తరువాత మీరు మెహతా వైపుకు తిరిగితే వివిధ రకాల గూఢప్రశ్నలకు, చిక్కుముళ్ళకు, విపరీత వాక్యాలకు అతడు ఆధ్వర్యం వహిస్తాడు. అతడు "అంతటా వ్యాపించి ఉన్న శూన్యం" పట్ల ఆకర్షితుడవుతాడు. పట్వర్ధన్ సగం తెలివి తేటలతో ఉపనిషత్తుల పుటల నుండి ఆధునిక జీవశాస్త్రసారాన్ని పిండబోతాడు. సరే ఇప్పుడు వాగాడంబర ప్రదర్శనకు బహుమతి నివ్వచూపితే ప్రధమ బహుమతి తప్పకుండా రామకృష్ణ మఠం వారు పోషిస్తున్న స్వామీజీ రంగనాధానందకే దక్కుతుంది. మన మిక్కడ విన్ స్టన్ చర్చిల్ చమత్కారాన్ని అరువు తెచ్చుకుందాం. "అతడెవరికంటే తక్కువేం కాదు, మాటలు మాత్రం కొండంత. అందులో ఆలోచన మాత్రం ఆవగింజంత" అన్న తెలుగు నానుడికి అది సమానం. అతనితో వివాద పడటమంటే, ప్రమాదాన్ని చేతులారా కొని తెచ్చుకోవడమే, మాటల వరదలో నిలువునా మునిగిపోవడమే. సర్ జూలియస్ హనీకి అలాంటి చేదు అనుభవమే ఎదురయింది. స్వామీజీ ఉపనిషత్తుల మీద రచించిన గ్రంథం మీద చేసిన రెండు పుటల విమర్శకు 32 పుటల సమాధానం అందుకోవలసి వచ్చింది. అలాంటి వరదలాంటి ముంపును మళ్ళీ ఎదుర్కొనకుండా హక్స్ నీ తెలివిగా, జాగ్రత్తగా వివాదానికి తావులేని జవాబివ్వవలసి వచ్చింది.

నేను తరువాయి విషయానికి పోబోయే ముందు నా మనస్సులో రహస్యంగా నలుగుడు పడుతున్న ఒక విషయం ప్రస్తావిస్తాను. వేదాంతులు శాస్త్రాన్ని నిందిస్తారు, కానీ వారు వేదాంతాన్ని శాస్త్రీయమని నిరూపించడానికి పడరాని

పాట్లు పడతారు. దీన్ని సౌమ్యంగా చెప్పాలంటే విరుద్ధ దృక్పథాల సంకరం, అదే నిష్కర్షగా చెప్పాలంటే కేవలం ఆత్మవంచన.

యాజ్ఞవల్క్యుడిని మొదటి వేదాంతిగా చెప్పవచ్చు. అతడు చెప్పే ప్రకారం వేదాంతుల ప్రవర్తనంతా ఇతరులను బాధించడానికే. వారు చెప్పేదే నిజం. దాన్ని ప్రశ్నించడమంటే వారిని అవమానించడమే. అయితే త్వరలోనే మీరు మీ తెలివితక్కువ తనాన్ని అంగీకరిస్తారు. లేకపోతే వారే మీ తలకాయ రెండు ప్రయ్యలవుతుందని మిమ్ములను హెచ్చరిస్తారు. మీరింకా అంగీకరించక పోతే మిమ్ములను మంచిగానో, చెడుగానో మౌనం వహించేలా ఎలా చేయాలో వారికి తెలుసు. వారికా గొప్ప శక్తి ఉంది. అలా వారు ఆపాదించుకున్న ఆ పవిత్రతే వారినలా అద్భుతంగా మనగలిగేటట్లు చేస్తున్నదా?

ఆ పవిత్ర మానవులు చక్కగా నిలచి గొప్ప పండితుడైన సురేంద్రనాథ్ దాస్ గుప్త చెప్పే మాటలు సావధానంగా వినగలుగుతారా! అతడీ విధంగా చెబుతున్నాడు.

ఉపనిషత్తులు... వైదిక వాఙ్మయానికి అంతిమంగా చెప్పబడ్డ భాగాలు కావడంతో అవి వేదాంత మని పిలువబడ్డాయి. ప్రపంచమంతటా హిందువులు వేదాల్లో మాత్రమే ఉన్నత సత్యాలు కనుగొనగలమని విశ్వసిస్తున్నారు. సాధారణంగా హేతువును మన కనువైన చోట అనువైన విధంగా ఉపయోగిస్తున్నాము. కాని దాని సరైన వినియోగం వేదాల్లో మనకగుపిస్తున్న విరుద్ధ భావనల అంతరార్థాన్ని గమనించడానికి వివేకంతో హేతువునుపయోగించడంలోనే ఉంది. అంతిమ సత్యాలను, వాస్తవాలను గురించిన ఉన్నత జ్ఞానాన్ని ఉపనిషత్తుల్లో ఆ విధంగానే ఒకేసారి ప్రకటించారు. అనుభవాల సాయంతో హేతువు మాత్రమే ఇలాంటి చిక్కుముడులను విప్పగలదు. నూతన సత్యాలను హేతువు - అనుభవాల సారంతో రోజు రోజుకు కనుగొంటున్నా మన్న సత్యాన్ని, అదే భావన ఆధునిక ప్రపంచాన్ని శాసిస్తున్నదన్న విషయాన్ని, ఆయా సందర్భాలలో పురాతన సత్యాలు మిగిలిపోయినా, అవి తమ రంగూ రూపూ రోజు రోజుకు మార్చుకుంటున్నా యన్న విషయాన్ని ఆ రెండింటి మధ్య ఉండే వ్యత్యాసాన్ని హిందూ తత్త్వశాస్త్ర పాఠకులు గుర్తించాలి. అంతిమ సత్యాలుగా చెప్పబడే విషయాలలో ఎప్పటికీ అంతిమత్వాన్ని చేరలేమని, మన హేతుబుద్ధికి కాలపరిమితికి లోబడిన, మన అనుభవానికి అందికలోకి వచ్చిన జ్ఞానం తోనే మనం తృప్తి పడాలని గుర్తించాలి.'[65]

దాస్ గుప్త ఇంకా ఏమి చెబుతున్నాడంటే "హిందూ తత్వంలోని వివిధ శాఖలవారు వేదాంత శాఖకు తామే అసలుసిసలైన ప్రతినిధులమని దర్పం ప్రదర్శించడానికి ఉపనిషత్తులను వ్యాఖ్యానిస్తారు." పై వ్యాఖ్యచేస్తూనే ఇదంతా 'అత్యంత సిగ్గు మాలిన తనం'గా పేర్కొంటూ వివేకంతో మరి కొంత జోడిస్తాడు.

ఇలాంటి సందర్భాలలో ఆధునిక వ్యాఖ్యాతలు పైవారు తమ హక్కులుగా పేర్కొంటున్న వారి వ్యాఖ్యానాలను అవశ్యంగా పెడచెవిన పెట్టాలి. ఉపనిషత్తులలోనిది క్రమబద్ధమైన సిద్ధాంత జ్ఞానం కాదని, అది కేవలం విరుద్ధ ఆలోచనా ధారలు భద్రపరచిన పేటికలు గానే గుర్తించాలి. అయితే తరువాత వచ్చిన తాత్త్విక భావాలన్నీ అదే మూసలో పడిపోయి ఈ నాటికీ ఇంకా ద్రవస్థితిలోనే ఉన్నాయి.

శంకరుడి అద్వైతం కానివ్వండి, దాని ననుసరించిన ఇతర విధానాలు కానివ్వండి ఉపనిషత్తులకు ఎడంగా విస్తారమైన తాత్పర్యాలు గల గ్రంథాలు వెలయించడంతోనే సరిపోయింది. ఉపనిషత్తులన్నీ ఒక అంతః సూత్రంతో బంధించబడి ఉన్నాయన్న ప్రాచీనుల వాదనను ఆధునిక వ్యాఖ్యాతలు అంగీకరించ వలసిన పనిలేదు. వారు వాటిని స్వతంత్రంగా, విడివిడిగా పరిశీలించి అర్థ వివరణ చేయవచ్చు. వాటి భావం ఎక్కడ, ఎలా ప్రస్ఫుట మౌతుందన్న విషయాన్ని సావధానంగా పరిశీలించవచ్చు. ఈ మార్గంలో మాత్రమే మనం ఉపనిషత్తుల్లో ఇతర భారతీయ ఆలోచనా ధోరణులు ఎలా మొగ్గ తొడిగాయన్న విషయం కనుగొన గలుగుతాము. ఆ విధంగా ఆయా ధోరణులకు చెందిన ప్రాథమిక సాక్ష్యాధారాలు మనకు లభ్యమౌతాయి.[66]

దాస్ గుప్తాను అలక్ష్యం చేయండి. మన పవిత్ర మానవులను ఉపనిషత్తులు భూత భవిష్య వర్తమానాలకు చెందిన ఉన్నత జ్ఞాన భాండాగారాలుగానే పరిగణించి కొనసాగనివ్వండి. అదే వారి విశేషాధికారం. అదే వారి హక్కు అంతేకాక అదే వారి వృత్తి కూడా.

ఈ భాగాన్ని నేను ముగించ బోయే ముందు నేను జాలి పడుతున్నానని, అతిగా జాలిపడుతున్నానని చెప్పనివ్వండి. భారత ప్రభుత్వం విదేశాల్లో వేదాంత ఉపన్యాసాలొనరించడానికి ఆర్థిక సహాయం అందిస్తున్నది. ఈ వేదాంతపు వైరస్ మనలను నిర్వీర్యులుగా, సమాజాన్ని చైతన్య రహితంగా చేస్తుంది. నాగరికతను స్తబ్దతలో ముంచుతుంది. ప్రభుత్వ ఖర్చుతో ఆ వైరసును విదేశాల్లో కూడా వ్యాప్తి చెందించడం అవసరమా?

ఇందు మూలంగా ధ్రువపరిచేదేమంటే...

వేదాంతులు అంతిమంగా ఆలోచించే దేమంటే ఉపనిషద్విమర్శకులను దుంపనాశనం చేయాలని మాత్రమే. ఏ కొద్ది మాత్రం కోపం వచ్చినా వారి ప్రయోగం మాత్రం అదే. వారు అతి తేలికగా ఉపయోగించే ఆయుధం కేవలం కాగితంతో చేయబడ్డది. అది ఉపనిషత్తులను ప్రశంసిస్తూ స్కోపెన్ హోవర్ ఇచ్చిన ధృవపత్రం. ఏ ధృవపత్రమూ అది జారీ చేసిన వ్యక్తి కంటే ఎక్కువ విలువ కలిగిందేమీ కాదు. అందుకే మనం మొదటగా స్కోపెహోవర్‌ను పరిచయం చేసుకొని వ్యక్తిగా, తాత్వికుడిగా అతడి ప్రతిభా వ్యుత్పత్తులను అంచనా వేద్దాం.

1788లో డేంజిలో జన్మించి బ్రహ్మచారిగనే 1860లో ఫ్రాంక్ ఫ లో మరణించిన స్కోపెన్ హోవర్ 72 సంవత్సరాల సుదీర్ఘ జీవితంలో ఎవరిచేత ప్రేమగా చూడబడలేదు, చివరకు తల్లిదండ్రుల చేత కూడా. కాలేజి విద్య ముగిసాక అతను ఉపాధ్యాయ వృత్తిని ఎన్నుకున్నాడు. కానీ దాన్ని వదలి వేయడమే మంచిదయింది. ఎందుకంటే ఆనాటికి బెర్లిన్ విశ్వ విద్యాలయ విద్యార్థులు హెగెల్ ఉపన్యాసాలు వినడానికి ఉత్సాహం చూపుతున్నారు. తల్లి పట్ల అతని ద్వేషం అతడిని స్త్రీ ద్వేషిగా మార్చి వేసింది. సామాన్య ప్రజల పట్ల అలక్ష్యం అతడిని ప్రజాస్వామ్య వ్యతిరేకిగా మార్చింది. యథాతథ స్థితి పట్ల అతని పక్షపాతం అతడిని విప్లవ వ్యతిరేకిగా మార్చింది. అతడు అభిమానించిందల్లా ఆధ్యాత్మికతనే, వేలు పెట్టింది గారడీలోనే. అతడొక బొచ్చుకుక్క పిల్లను పెంచి దానికి 'ఆత్మ' అని పేరు పెట్టాడు. బహుశః వేదాంతానికి అదే సరైన పురస్కారమేమో. అతడు సహోద్యోగుల పట్ల అసూయచెందేవాడు, కీర్తి అంటే అత్యాశతో పడి చచ్చేవాడు, స్వభావరీత్యా నిరాశావాది. ఇదిగో తాత్త్వికుడిగా అతడిని గురించి బెర్ట్రాండ్ రస్సెల్ అంచనా:

కాంట్, హెగెల్ వలె అతడు విశ్వ విద్యాలయాలలో పూర్తిగా విద్యనభ్యసించలేదు పోనీ పూర్తిగా విశ్వ విద్యాలయాల బయట కూడా కాదు. అతడు క్రైస్తవం పట్ల అయిష్టత చూపాడు. భారతదేశ మతాలైన హిందూ బౌద్ధాల పట్ల ఆసక్తి చూపాడు. భిన్న సంస్కృతుల పట్ల అభిమానం ఉందాయనకు. కళలు, నైతికత పట్ల ఆయన మక్కువ చెప్పుకో దగ్గది. అతడు జాతీయత నుండి విడిపోయి స్వేచ్ఛగా ఉండేవాడు. తన ఇంటి వద్ద ఆంగ్ల, ఫ్రెంచి రచయితలతో సహవాసం నెరిపేవాడు, తన స్వదేశానికి చెందిన వారిగానే వారిని మన్నించేవాడు. కవులు, కళాకారులు తమ తమ విశ్వాసాలమేర ఏ తాత్త్వికతల కోసం అన్వేషిస్తున్నారో గమనించేవాడు. తత్త్వవేత్తల పట్ల తక్కువ మక్కువ చూపేవాడు. 19, 20 శతాబ్దాల తత్త్వంలో ఒక లక్షణంగా రూపొందిన 'సంకల్పం' గురించి ఎక్కువగా చెప్పేవాడు. కానీ సంకల్పం అతడికి ఆధ్యాత్మికంగా ప్రాధమికమైనది, నైతికంగా అతనికి అది చెడ్డది. నిజానికి నిరాశావాదికి అన్నీ వ్యతిరిక్తం గానే తోస్తాయి. అతడు తన తత్త్వానికి మూడు ఆధారాలు పేర్కొంటూ కృతజ్ఞతలు వెల్లడిస్తాడు. అవి కాంట్, ప్లేటో, ఉపనిషత్తులు. కానీ నేనలా భావించడం లేదు. అతడేమి ఆలోచించాడో, అతడేమి చేశాడో అంతగా ప్లేటోకు ఋణపడ్డాడు. అతని దృక్పథం, స్వభావాల రీత్యా అతని సన్నిహిత సంబంధమంతా గ్రీకుల కాలానికి సంబంధించి ఉంటుంది. అదే అతడిని కుంగదీసింది, దీర్ఘ రోగిని చేసింది. విజయం కంటే శాంతికే అతడు విలువ ఇచ్చాడు. సంస్కరణల పేర అతడనేక విషయాలను వదలివేశాడు. అదే అతడిని అనివార్యంగా నిష్ప్రయోజకుణ్ణి చేసింది.[67]

అటువంటి వ్యక్తి-తత్త్వవేత్త ఇచ్చే ధృవపత్రాని కుండే విలువ ఏ పాటిది? అతికొద్ది విలువ మాత్రమే. అయితే వేదాంతులు గోరంతలు కొండంతలు చేస్తారు కదా.
ఉపనిషద్విమర్శకులను నలిపి వేయడానికి వారు పదే పదే స్కోపెన్ హోవర్ మంత్రాన్ని జపిస్తారు. “ఉపనిషదధ్యయనమే నా జీవితంలో దుఃఖోపశమనము, నా మరణంలో కూడా అది దుఃఖోపశమనమే కదా!” అన్నదే అది.

ఏ ఆధారంతో స్కోపెన్ హోవర్ ఉపనిషత్తులను ఆ విధంగా సంభావించాడు? ఆధారమేమంటే ఆయన కందిన ఉపనిషత్తులు మూడవ తరగతికి చెందినవి కనుక. అదెలాగంటే ఆయన చదివింది దారా షుకోచే చేయించబడ్డ పర్షియన్ అనువాదాలకు లాటిన్ అనువాదాలు. అవి ప్రసిద్ధ పర్యాటకుడు జెండ్ అవెస్తాను కనుగొన్న అన్వేషకుడు యాంక్విటల్ డూపెరాన్ కృతులు. వాటి సంపాదకత్వం 1801-1802 సంవత్సరాలకు సంబంధించింది. మాక్స్ ముల్లర్ ప్రకారం అని “పూర్తిగా పరమ అస్పష్ట శైలిలో” 68 సాగాయి. ఈ అభిప్రాయాన్ని డ్యుసేన్ కూడా బలపరిచాడు. ఇంకా అతడీ విధంగా వ్రాస్తున్నాడు. "పర్షియన్ నుండి లాటివ్ లోనికి ఖచ్చితంగా అనువాదం చేయాలనే ఆత్రుతతో, మొదటి దానిలో వ్యాకరణానికి భంగం వాటిల్లకుండా డ్యూపెరాన్ మాటకు మాట అనువదించాడు అయితే అలా మక్కికి మక్కీ అనువాదంలో పర్షియన్ అనువాదకులకు సంస్కృత గ్రంథం నుండి అనువాదం చేయడంలో లభించిన స్వేచ్ఛ ఇక్కడ లోపించింది. దాంతో గ్రంథం చదవడానికే ఇబ్బందిగా తయారయింది.”[69]

ఆ విధంగా ఉపనిషత్తుల గురించిన స్కోపెన్ హోవర్ స్తోత్ర పాఠాలు ఒక అస్పష్టమైన అనువాదం మీద ఆధారపడ్డవి. కనుక వాటికి తగిన ప్రాధాన్యత నివ్వవలసిన అవసరం లేదు కదా! హెగెల్తో పోటీ పడి అపజయం పాలై నిరాశపొందిన అతడు ఒక కొత్త మార్గాన్ని ఎన్నుకోవాలనుకున్నాడు. ఆ సమయంలో అతడు ఉపనిషత్తులను చూడటం తటస్థించింది. దాన్ని వరదానంగా భావించాడతడు.

నిరాశావాదంతో నిండిన ఆ గ్రంథాలు అతని స్వభావానికి సరిగా సరిపోతాయి. మార్మికతతో కూడిన గ్రంథాలు అతని స్వభావానికి మరింత సరిపోతాయి. ఉన్నతవర్గాల చేతి నుండి వెలువడినవి కావడంతో అవి మరింత స్వాగత పాత్రమయ్యాయి. బహుశ : అతనికి వాటిలో పవిత్ర ఆర్యజాతి ఉత్సాహం కనుపించి ఉండవచ్చు. అతని స్తోత్ర పాఠాలలో ఒకచోట స్కోపెన్ హోవర్ ఇలా అంటున్నాడు.

ప్రతి వాక్యంలోను గాఢమైన, అర్వాచీనమైన, గంభీరమైన భావాలు తలెత్తుతుంటాయి. ఉన్నతమైన, పవిత్రమైన, మానసిక శక్తితో అలరారుతుంటాయి. భారతీయమైన గాలి మనలనుఆవరించిందంటే అందుకు సంబంధించిన ఆధ్యాత్మిక శక్తులు, ఆలోచనలు మనలను చుట్టు ముడతాయి. ఓహ్! అంతకు ముందు యూదు మత మూఢ విశ్వాసాలతో కొట్టుమిట్టాడుతున్న ఈ మనస్సు ఎంతగా పరిశుద్ధమయినది. ఆయా మతాల మూఢ విశ్వాసాల చేత కుంటి నడక నడుస్తున్న తత్త్వం ఎంత స్వేచ్ఛ పొందింది. అర్వాచీన గ్రంథాలు చదవక పోతే అధ్యయనమే కాదు. అలా చదివితేనే అధ్యయనం అనిపించుకుంటుంది. ఆ అధ్యయనమే మనలను ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది. ఉపనిషదధ్యయనమే నా జీవితానికి దుఃఖోపశమనము, నా మరణంలో కూడా అవి దుఃఖోపశమనమే కదా![70].

స్కోపెన్ హోవర్ కూడా ఆర్య జాతి అహంభావం సోకిన జర్మనుగానే మనకగపడతాడు. జర్మనీలోని నోర్డిక్కులవలే భారతదేశంలో కూడా పై రెండు ఉన్నత కులాలలో తమ రక్తనాళాల్లో పరిశుద్ధమైన ఆర్యజాతి రక్తమే ప్రవహిస్తుందని నమ్ముతారు.

జాత్యహంకారం కేవలం హిట్లర్, నాజీలకు మాత్రమే సంబంధించిన విషయం కాదు. దాని వ్యాప్తి నువ్వెంత అగాధాల వరకు పోయినా అంతవరకు విస్తరిస్తూనే ఉంటుంది. విమర్శకే మాత్రం ఆస్కారం లేకుండా వేదాలను, ఉపనిషత్తులను శ్లాఘించే పాశ్చాత్య గ్రంథకర్తల్లోను, భారత దేశం మీద దండయాత్రలు సలిపిన ఆర్యజాతుల్లోను జాత్యహంకారం కాస్త బలంగానే ఉంటుంది. అశ్లీల దుష్టభావనలను మరుగు పరచి చేసిన పొగడ్తలతో మిన్నకుండిన నాజీ నియంతృత్వవాది కూడా ఆనందించింది భారతదేశంలో వ్యాపించిన జాత్యహంకారం చూచే.

ఈ శతాబ్దంలో ఉపనిషత్తుల గురించి పొగిడిన కవులు, రచయితలలో నాకు తెలిసిన మేరకు ఈట్స్, ఇలియట్, ఆల్డస్ హక్సీ, ఐషర్‌వులు ప్రముఖులు. ఇక్కడ గమనించ వలసింది వారంతా మార్మికులన్న విషయం. మాక్స్ ముల్లర్ సరిగానే వ్యాఖ్యానించాడు. కొంతమంది ముద్రవేసి పేర్కొన్నట్లు “ప్రతిది వారి మార్మిక ఆకాశంలో మబ్బుల వెనుక దాగే ఉంటుంది.” మనిషి మార్మికుడు కావచ్చుగాని దేశం మొత్తం మార్మికం కారాదు. ఒకవేళ అలా జరిగితే అదొక విశాలమైన పిచ్చివాళ్ల రక్షణ గృహమవుతుంది.

ఓ చివరి మాట

"అర్చిబాల్డ్ ఎడ్వర్డ్ గౌ పేర్కొన్నది నిజమే. భారతీయులుగా మనం "మానవ ప్రజ్ఞా పాటవాలకు సంబంధించిన ఉద్యమాలకు పూర్తిగా దూరంగా ఉంటాము." ఎందుకు? ఎందుకంటే మనకు ప్రజ్ఞా పాటవాల్లో విశ్వాసం లేకనే. ఎందుకంటే ప్రజ్ఞా పాటవాలకు ఆలవాలమైన మనసును మనం నిందిస్తాం కనుక. ఎందుకంటే మనం ప్రజ్ఞ కంటే అంతర్ జ్ఞానానికే ఎక్కువ విలువనిస్తాం కనుక. ఎందుకంటే మనం అత్యాశతో సున్న (శూన్యం) తరువాత ఆత్మను సూచిస్తాము, తిరిగి అది అంతకన్నా పెద్ద సున్నతో (శూన్యం) ఐక్యమవుతుందని. ఈ భ్రమలన్నింటికీ మళ్ళీ కారణం వెదకబూనితే అది మళ్ళీ ఉపనిషత్తులకే దారి చూపుతుంది. వారి సృష్టి శాస్త్రం తప్పుల తడక; వారి తత్త్వ విచారం విపరీతం; వారి మోక్ష శాస్త్రం చోద్యమైనది; వారి జ్ఞానతత్త్వ విచారం శైశవమైనది; వారి మనస్తత్వశాస్త్రం నిస్సారమైనది; వారి సమాజ శాస్త్రం ఆదిమమైంది. ఇటువంటి సారహీనమైన విషయాలనుండి మనం ఎలాంటి తాత్త్విక ధోరణిని నిర్మించలేము. ఉపనిషత్తుల తత్త్వమంటూ చెప్పబడుతున్న తత్త్వం నిజానికి అసలు లేనే లేదు.

ప్రాథమిక ఉపనిషత్తుల్లో అక్కడక్కడ కొన్ని అర్వాచీనమైన ఆలోచనా ధోరణులున్నాయని, అవి చక్కటి సౌందర్యంతో మనలను అలరిస్తాయని చెప్పేవాదనలతో నాకు ఎలాంటి వివాదం లేదు. ఎందుకంటే వాటి కర్తలు 2500 సంవత్సరాలకు పూర్వం జీవించిన వారు కనుక. కానీ అది కాలాతీతమైనదనీ, ఉపనిషద్ జ్ఞానం అత్యున్నత శిఖరాలకు చేరిందనే మాట మటుకు పరమచెత్త వ్యాఖ్య. ఉపనిషత్తుల కాలంనుండి చూచుకుంటే జ్ఞాన సరిహద్దులు లక్షలాది రెట్లు విస్తరించాయి. ఈనాడు రెక్కలు రాని ఓ పసివాడికి కూడా ఉపనిషద్రుషులకు మించిన జ్ఞానం ఉంది. చంద్రుడు - సూర్యుని కంటే పై స్థానంలో ఉన్నాడని, పిడుగుపాటు సూర్యచంద్రుల స్థానం కంటే పై నుండి ఉద్భవిస్తుందని చెప్పే ఉపనిషద్రుషుల జ్ఞానం అతడికి లేదు. వేద రుషుల గాఢమైన అజ్ఞానానికిదో మచ్చుతునక మాత్రమే. ఇలాంటి ఉపనిషత్తులను చదవాలనుకుంటే, వాటిని చదవాల్సింది జ్ఞానార్జన కోసం కాదు. చరిత్రలో ఆలోచనా ధోరణుల అడుగుజాడలు ఎంత తాత్కాలికంగా, ఎంత కలగాపులగంగా, ఎంత సందేహాస్పదంగా ప్రారంభ మయ్యాయో తెలుసుకొనడానికే వాటిని చదవాలి.

ఉపనిషత్తులు ప్రాచీన భారతంలోని పై రెండు ఉన్నత కులాల సృష్టేనన్న విషయం మరువరాదు. వారి ప్రయోజనాలు వారికున్నాయి. వాటిని పరిరక్షించడం కోసమే వారు కొన్ని ఆలోచనలను, భావాలను, స్వీయ సిద్ధాంతాలను ముందుకు తెచ్చారు. అవి వర్తమానానికి నిరుపయోగం, పైగా హానికరం కూడా. కనుక వాటి స్థానం చరిత్ర చెత్తకుప్పలోనే. వాటినంటి పెట్టుకొని ఉండటం, వాటి స్తోత్రపాఠాలు గానం చేయడం, వాటి ప్రాపంచిక దృక్పథానికి కట్టుబడి ఉండటమంటే వర్తమానంతో కలసి అడుగులు వేయడానికి నిరాకరించడమే.


ఉపనిషత్ప్రభావమంతా మనిషిని మరుగుజ్జుగా మార్చడంకోసమే. వాటి ఉపదేశాలంటేనే నాకు అసహ్యం వేస్తుంది. వివిధ దౌర్బల్యాల నుండి, తప్పిదాల నుండి, అపజయాల నుండి మానవుడు జీవపరిణామంలో చిరకీర్తిగా నిలిచాడు. అతడిది లక్షలాది సంవత్సరాలు బహుశః అంతకంటే ఎక్కువే సాగిన, సాగుతున్న అనంత యాత్ర. అయితే జీవ పరిణామంతో పోల్చుకుంటే మానవనాగరికత వయస్సు కేవలం ఒక రోజే ఉంటుందేమో. అయితేనేం, ఆ అనతికాలంలోనే అతని మేధ జీవితంలోను, ప్రకృతిలోను ఎన్నో మర్మాలను ఛేదించింది. అంతేకాక అల్పకాలంలోనే అతని మనస్సు క్రొంగొత్త అంతర్దృష్టులను అలవరచుకోగలుగుతుంది; వినూత్న


సత్యాలను అవగతం చేసుకోగలుగుతుంది; సమున్నత లక్ష్యాలను అధిగమించ గల్గుతుంది; సరికొత్త సంఘటనల చిట్టాలకు నాందీవాచకం పలుక గలుగుతుంది.

గతంలోని ప్రతి చిన్న తప్పిదానికి మనిషి మేధను చిన్న బుచ్చడమంటేను, మానవుని ప్రజ్ఞను నిందించడ మంటేనూ అది పూర్తిగా తెలివితక్కువ తనమే. అయితే సరిగ్గా ఉపనిషత్తులు చేసిందిదే. కనుకనే మనం వాటిని త్రోసి రాజనాలి. అంతమాత్రం చేత అది మన వారసత్వాన్ని కాలదన్నుకోవడమవుతుందా? కావచ్చు. కానీ ఈ భారమైన, త్రుప్పుపట్టిన, పురాతన శృంఖలాల నుండి మన మానసాలకు స్వేచ్ఛ ప్రసాదించడం ఆవశ్యకం. స్వేచ్ఛా మానసాలు మాత్రమే మనలను స్వతంత్ర పౌరులుగా మలుస్తాయి. స్వేచ్ఛా మనస్కులు మాత్రమే సృజనాత్మక జాతిగా మనగలుగుతారు; స్వేచ్ఛా మానసం మాత్రమే వినూత్నమైన, అర్థవంతమైన జీవితాల వైపుగా మనలను మేల్కొలుప గలుగుతుంది.

భవిష్యత్తు మనలను వెన్నంటే ఉంటుంది. జీవితం ఓ వెయ్యి సవాళ్ళను విసురుతుంది. సవాళ్ళను మానవికంగా ఎదుర్కొనడంలో పురాతన భావాలు, ఆదిమ భావజాలాలు మనకు అడ్డు తగులుతుంటాయి. మనం చాలాకాలం ఉపనిషత్తులనే చెరసాలల్లో జీవించాం. వాటినిప్పుడు బ్రద్దలు చేద్దాం, ముందుకో గంతువేద్దాం, అది ఎంత విశాలమైనదంటే క్రీ.పూ. 6వ శతాబ్దనుండి - క్రీ.శ. 21వ శతాబ్దం వరకు ఒకే గంతు. మనం గెలవాల్సిన పందేలు ఉన్నతమైనవి. ఆలశ్యం చేయడమంటే అంతా కోల్పోవడమే. సందేహించడమంటే సరికొత్త అపజయాలను, వినాశనాలను ఆహ్వానించడమే. అందుకే అడుగేద్దాం రండి! వినూత్నమైన స్వేచ్ఛామయమైన ప్రపంచంలోనికి! ఆనంద మయమైన, సంపూర్ణ మయమైన జీవనంలోనికి!

NOTES AND REFERENCES





1 ఈట్స్, డబ్ల్యు. బి : ది టెన్ ప్రిన్సిపల్ ఉపనిషడ్స్ అనే గ్రంధానికి పురోహితస్వామితో సంయుక్తంగా వ్రాసిన పరిచయం నుండి, లండన్, 1937 పేజి. నెం. 8.

2 ఫ్రొవాల్నర్, ఎరిక్ : భారతీయ తత్త్వశాస్త్రం - రెండు సంపుటాలు. ప్రధమ సంపుటం, ఢిల్లీ. 1973, పేజీ, 34.

3 ముల్లర్, మాక్స్ : ప్రాచీన గ్రంధాలు సంపుటిలో ఉపనిషపత్తులకు వ్రాసిన పీఠికనుండి పుట XIII (2 భాగాలు) 1వ భాగం, ఆక్స్ఫర్డ్. 1900

4 అదే పుట XX.

* ప్రాచీన భారతీయ చరిత్ర సాహితీ సంస్కృతులమీద అధ్యయనం చేసేవారిని ఇండాలజిని వ్యవహరిస్తారు - అను

5 లేవీ, సిల్వైన్ : బుద్ధిస్ట్ ఇండియా గ్రంధంలో రైస్ డేవిడ్స్ ఉల్లేఖన, 1955, కలకత్తా, పుట 132.

6 హాప్కిన్స్, ఇ డబ్లు : ది రెలిజియన్స్ ఆఫ్ ఇండియా, 1977 న్యూఢిల్లీ, పుట 192.

7 లెబర్, మార్క్స్ : ది రెలిజియన్ ఆఫ్ ఇండియా, ఫ్రీప్రెస్ పేపర్ బాక్, న్యూయార్క్, 1967, పుట - 60.
8 కీత్, అర్దర్ బెర్రిడేల్ : ది రెలిజియన్ అండ్ ఫిలాసఫీ ఆఫ్ వేజ్ అండ్ ది ఉపనిషడ్స్, 2 సంపుటాలు. కేంబ్రిడ్జ్, మసాచుసెట్ 1925 పుట. 475.
9 గార్బే, రిచర్డ్ : ది ఫిలాసఫీ ఆఫ్ ఏనిషెంట్ ఇండియా, పుటలు : 58-62
10 ఆర్.డి. రనడే; ఎ కన్స్ట్రక్టివ్ సర్వే ఆఫ్ ది ఉపనిషదిక్ ఫిలాసఫీ, బాంబే 1968, పుట-3.
11 అదే, పుట - 4
12 ముల్లర్, మార్క్స్; సిక్స్ సిస్టమ్స్ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ, నవ్య ముద్రణ, లండన్ 1919, పుట-195
13 ఎడ్జర్టన్, ఫ్రాంక్లిన్ : స్టడీస్ ఇన్ ది హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ, 3 సంపుటాలు, దేబీ ప్రసాద్ ఛటోపాధ్యాయ సంపాదితం, సంపుటి-1 కలకత్తా 1977, పుటలు 117-118
14 కీత్, 1926, పుటలు 493-494
15 గార్బే పుటలు 78-79
16 ఠాగూర్, దేవేంద్రనాథ్ : ఆటోబయాగ్రఫీ మహర్షి దేవేంద్రనాథ్ ఠాగూర్,1965 పునర్ముద్రణ, లండన్, పు-159
17 ముల్లర్, 1900, పుట - LXVIII
18 అయ్యర్ కె. నారాయణస్వామి : థర్టీ మైనర్ ఉపనిషడ్స్, మద్రాసు, 1914, పుట-1
19 ముల్లర్ మార్క్స్; ఎ హిస్టరీ ఆఫ్ ఏనిషంట్ సాంగ్రిట్ లిటరేచర్, బెనారస్, 1968 పునర్ముద్రణ పు.L VII
20 ముల్లర్, 1900, పుట - L VII
21 ఫకీర్ బాయి, దస్టీబాయి : క్రీస్తోపనిషత్, బెంగుళూరు 1965
22 చూడు : ది టెన్ ప్రిన్సిపల్ ఉపనిషద్ లండన్, 1937కు ఈట్స్ వ్రాసిన ముందుమాట, పుట-7
23 స్వామి మాధవానంద : చూడు ది కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ ఇండియా, సంపుటి 1, కలకత్తా, 1970 పునర్ముద్రణ, పుట-348
24 ఠాగూర్, 1916, పుటలు 159-348
25 అయ్యర్, 1914, పుట-III
26 చూడు : ది థర్టీన్ ప్రిన్సిపల్ ఉపనిషడ్స్, ఆర్.ఇ హ్యూమ్ అనువాదం ఆక్స్ఫర్డ్, 1954, పునర్ముద్రణ, పు: 516-560
27 కోశాంబి, డి.డి : ది కల్చర్ అండ్ సివిలిజేషన్ ఆఫ్ ఏనిషంట్ ఇండియా, లండన్ 1965, పుట 170.
28 అదే : పుట 174
29 అదే : పుట 180
30 ముల్లర్, 1900, పుట LXXI
31 కోశాంబి, 1965 పుట 174
32 ముల్లర్, 1900 పుట - LVIII -
33 ఠాగూర్, 1916 పుటలు : 167-168
34 ముల్లర్, మార్క్స్ : ది సిక్స్ సిస్టమ్స్ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ లండన్, 1919
35 గౌ, అర్చిబాల్డ్ ఎడ్వర్డ్ : ది ఫిలాసఫీ ఆఫ్ ఉపనిషడ్స్, లండన్, థర్డ్ ఎడిషన్, 1903, పుటలు వత్స IV.
36 రనడే, 1968 పుట XIV
37 ష్విట్జర్, ఆల్బర్ట్ : ఇండియన్ థాట్ అండ్ ఇట్స్ డెవలప్ మెంట్, లండన్, 1951, పుట. 55
38 బ్లూమ్ ఫీల్డ్, మారీస్ : ది రెలిజియన్ ఆఫ్ వేద, న్యూయార్క్ 1908 పుటలు 57 , 258.
39 రాధాకృష్ణన్. యస్:ఇండియన్ ఫిలాసఫీ ఇన్ 2 వాల్యూమ్స్, లండన్ 1948 రీప్రింట్, వాల్యూం 1.138-139.
40 రనడే, 1968, పుట XII.
41 డ్యుసేన్ పాల్ : ఔట్ లైన్స్ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ, బెర్లిన్, 1907 పుటలు 22-23.
42 శారీ, అరుణ్ : హిందూయిజమ్ : ఎసెన్స్ అండ్ కాన్సీక్వెన్స్ స్, న్యూఢిల్లీ, 1979, పుటలు 351-317,
43 చూడు : ది ప్రిన్సిపల్ ఉపనిషడ్స్ - పీఠిక : యస్. రాధాకృష్ణన్, లండన్, 1953 పుట : 139.
44 శారీ, 1979 పుట
45 శారీ, 1979 పుట
46 చూడు : మేన్ ఇన్ ది యూనివర్స్. డబ్ల్యు నార్మన్ బ్రౌన్, కలకత్తా 1966 పుట 49.

47 హ్యూమ్స్ అనువాదంలో నేను పేర్కొన్న ప్రకారం.
48 గౌ, 1903 పుట 25.
49 వింటర్ నిట్జ్, మౌరీస్:ఎ హిస్టరీ ఆఫ్ ఇండియన్ లిటరేచర్, వాల్యూం 1, పార్ట్ 1, కలకత్తా, 1962,పుట - 199.
50 గౌ, 1903, పుటలు 144-147.
51 ష్విట్టర్, 1951, పుట. 23.
52 డ్యుసేన్, పాల్ : ది ఫిలాసఫీ ఆఫ్ ది ఉపనిషడ్స్, డోవర్ పేపర్ బాక్, న్యూయార్క్, 1966,పుట - 88.
53 డ్యుసేన్, 1966, పుట
54 శౌరీ, 1979 పుట - 100.
55 కోశాంబి, 1965, పుట - 83. 15.
56 ఇండియన్ ఫిలాసఫీ : ఎ పాపులర్ ఇంట్రడక్షన్ - దేబీ ప్రసాద్ ఛటోపాధ్యాయ, పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్, న్యూఢిల్లీ 1964.
57 కీత్, 1925, పుట 584
58 కీత్,1925, పుట 534
59 రూబెన్, వాల్టర్ : చూడు స్టడీస్ ఇన్ ది హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ, దేవీప్రసాద్ చటోపాధ్యాయ సంపాదితం, కలకత్తా - పార్ట్ -1 పుట 156
60 రీప్, డేల్ : ది నేచురలిస్టిక్ ట్రెడిషన్ ఇన్ ఇండియన్ థాట్, ఢిల్లీ, 1961, పునర్ముద్రణ, పుటలు 30-31.
61 ముఖోపాధ్యాయ, గోవిందగోపాల; స్టడీస్ ఇన్ ఉపనిషడ్స్, కలకతా, 1960 పట్వర్ధన్ కె.ఎ. : ఉపనిషడ్స్ అండ్ మోడర్న్ బయాలజీ, బాంబే, 1957.
62 స్వామి రంగనాధానంద : ది మెసేజ్ ఆఫ్ ది ఉపనిషడ్స్, బాంబే, 1971
63 మెహతా, రోహిత్ : ది కాల్ ఆఫ్ ది ఉపనిషడ్స్, బాంబే, 1970
64 పట్వర్ధన్ కె.ఏ. ఉపనిషత్స్ అండ్ మోడరన్ బయాలజీ, బాంబే, 1957
65 దాస్ గుప్త సురేంద్రనాథ్ : ఎ హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ, 5 సంపుటాలు, కేంబ్రిడ్జ్ 1951, పునర్ముద్రణ, వాల్యూం-1, పుట-41.
66 దాస్ గుప్త : 1951, పుట-42. , 1947, పుట 781.
67 రస్సల్, బెట్రాండ్ : హిస్టరీ ఆఫ్ వెస్టర్న్ ఫిలాసఫీ, లండన్, రెండవ ముద్రణ
68 ముల్లర్ : 1900, పుట - LVIII
69 డ్యుసేన్ : 1966, పుట - 37
70 స్కోపెన్ హోవర్ గురించి మాక్స్ ముల్లర్ ఉల్లేఖన, 1900, పుట-LXI చంద్ర -
71 ముల్లర్, 1900, పుట - LXII -
72 గౌ, 1903 పుట-2 అనువాదం : ప్రఫుల్ల చంద్ర

మతం - 3
ఇదీ గీతా రహస్యం

ఇదీ గీతారహస్యం

వి.ఆర్. నార్ల

నార్ల వెంకటేశ్వరరావు

తెలుగు సేత:

ఇన్నయ్య నరిసెట్టి

హేతువాదాన్ని జీవితంలో ఆచరించిన నవ్యమానవుడు

శ్రీ నర్రా కోటయ్య కు అంకితం

పీఠిక

దేశ విదేశాలలో కొందరు గొప్పవారు భగవద్గీతను గొప్ప మత గ్రంథంగానూ, తత్త్వం నీతి రంగాలలో తిరుగులేని మార్గదర్శిగానూ, సామాజిక విజ్ఞాన రంగాలకు సైతం ఆదర్శవంత మైనదిగానూ భావించారు. వారిపై నేను తీవ్ర విమర్శ చేశాను. అందుకు క్షమాపణ కోరడం లేదు. వారెంత గొప్పవారైనా ఒక్క విషయంలో లోపభూయిష్టులే. వారికి ఆధునిక మనస్తత్వం లేదు.

ఆధునిక మనస్సు అంటే ఏమిటి? అంధవిశ్వాసాన్ని ఈసడించడం, మూఢనమ్మకాన్ని త్రోసిపుచ్చడం, పిడివాదాన్ని గర్హించడం, మాయమాటల్ని కాదనడమే ఆధునిక మనస్సు. వివేచనాత్మకంగా, విజ్ఞాన పూరితంగా ఆలోచించడమే ఆధునిక మనస్సు పని. హేతుబద్ధ కొలతకు నిలవలేని దానిని నిరాకరించడమే ఆధునిక మనస్సు. స్వేచ్ఛగా, సాహసోపేతంగా, కొత్త పరికల్పనలతో, తెలియనిది తెలుసుకుంటూ పోవడమే. భూమి విశ్వంలో ఒక అణువు మాత్రమే. దానిని గురించి, జీవితాన్ని గురించి, విశాలవిశ్వం గురించి తెలుసుకుంటూ పోవడమే ఆధునిక మనస్సు.

ఆధునిక మనస్సుకు కేంద్రం దేవుడు కాదు, మానవుడు. ఆ మనస్సుకు జాతి, మతం, దేశం, వర్గం, కులం అడ్డం రావు. సంకుచితం, తలబిరుసుతనం, అల్పత్వం, స్వార్థం ఆధునిక మనస్సుకు దూరం. ఆధునికుడు ఈ ప్రపంచాన్ని పట్టించుకుంటాడు, మరో లోకాన్ని కాదు. "నేను నీ సృష్టికర్తను" అని ఎవరైనా అంటే, "పోవోయ్, నాకు నేనే సృష్టికర్తను. నేను పరిణితి చెందుతున్నాను. నా బాల్యదశలో భయం, అజ్ఞానం వలన ఎందరో దేవుళ్ళను దేవతలను సృష్టించాను. అలాగే స్వర్గాలను నరకాలను పుట్టించాను. వాటన్నిటినీ కూలగొొడు తున్నాను" అంటాడు.

అలాంటి ఆధునిక మనిషికి గీత చాల మొరటుగానూ, ఆదిమదశగానూ, అర్ధసత్యంగానూ, పరస్పర విరుద్ధాలుగానూ, ఆధారాలు లేని మాటలతోనూ, ఘోరమైన విషయాలతోనూ, కనిపించడం సహజం. డి.డి. కోశాంబి దృష్టిలో "గీత పరస్పర విరుద్ధాలను సమన్వయించే సంస్కృత రచన మాత్రమే. వ్యతిరేక విరుద్ధాలను దిగమింగే ప్రయత్నం జరిగింది". నా రచనలన్నింటిలో ఈ రచన నాకు సంతృప్తినిచ్చింది. స్వాతంత్ర్యం రావడంతో కొత్త జీవితంలోకి ప్రవేశిస్తామని అనుకునేవాడిని. కాని తిరోగమన వాదం ఉప్పెన వలె వచ్చిపడడం చూస్తుంటే విచారంగా ఉంది. 1947కు ముందు కంటే, నేడు మనం మూఢనమ్మకాలతో, ఛాందసంతో, మాయ మాటల గారడీలతో ఉన్నాం. మన స్వాతంత్ర్యం భ్రమగా తయారైంది. మనస్సుకు బంధాలుంటే, స్వేచ్ఛ ఎలా వస్తుంది? ప్రజాస్వామిక సంస్థలున్నప్పటికీ, రాజకీయ స్వేచ్ఛా వ్యవస్థలు కనిపిస్తున్నా, సరైన అర్థంలో మనకు స్వేచ్ఛ లేదు.

ఈ స్థితిని వివరించడం ఎలా? జాతీయోద్యమం తిరోగమనంలో ప్రారంభించి కొనసాగిందని, వెనక్కు తిరిగి పరిశీలిస్తే అవగాహన అవుతుంది. బంకించంద్ర ఛటర్జీ, వివేకానంద, బిపిన్ చంద్రపాల్, లజపతిరాయ్, అరవింద ఘోష్, బాలగంగాధర తిలక్, అనిబిసెంట్, గాంధీ వంటి విభిన్న జాతీయ నాయకులకు ఉత్తేజాన్ని కలిగించింది భగవద్గీత. గాంధీని హత్య చేసిన నాథూరాం గాడ్సెకు సైతం అదే పవిత్ర గ్రంథం. మన స్వాతంత్ర్యానంతరం అంధకారంలోకి ఎలా ప్రవేశించామో దీన్నిబట్టి ఆశ్చర్యపడనక్కరలేదు. జ్యోతిష్యం ప్రకారం స్వాతంత్ర్య ముహూర్తం నిర్ణయించారు. అదంతా చూస్తుంటే గుండె బరువెక్కుతుంది. ఈ తిరోగమన ఉపద్రవాన్ని 76 ఏళ్ళ వయస్సులో తిప్పిగొట్టగలనా? చేయగలననే నా విశ్వాసానికి ఈ పుస్తకమే నిదర్శనం. అదే నాకు సంతృప్తి నిస్తుంది.

ఈ పుస్తక రచనకు తోడ్పడిన వారందరికీ ధన్యవాదాలు చెప్పాలి. డాక్టర్ వై.వెంకటేశ్వరరావు, డాక్టర్ డి.ఆంజనేయులు, డాక్టర్ పి.ఎస్.ఎన్.మూర్తి ఈ రచన చదివి అనేక సూచనలు చేశారు. ఐతే, ఈ రచనలోని అభిప్రాయాలకు వారెవరూ బాధ్యులుకారు. అవి కేవలం నావే.

యువతరానికి ఒక విజ్ఞప్తి. ప్రపంచం అత్యంత వేగంగా మారుతుంది. ప్రతి పదేళ్ళకు ఈ వేగం చాలా ఎక్కువగా ఉంటుంది. గత 80 ఏళ్ళలో చాలా మార్పు వచ్చింది. చాల మంచి జరిగింది. ఇంచుమించు అంతే చెడు కూడా ఉంది. ప్రపంచ ప్రళయం జరగకుండా ఆపే ప్రయత్నాలు జరిగాయి. మార్పుకు అనుగుణంగా, ఉపద్రవాలను అడ్డుకొంటూ, మనం సాగిపోవాలి. ఇందులో యువత బాధ్యత చాలా ఉంది. గీత తెచ్చిపెట్టిన పాత అలవాట్ల నుండి బయట పడాలి. అలాగే ప్రపంచంలో పవిత్రగ్రంథాల పాత బంధాలు కూడా తెంచాలి. కొత్త భావనలు, కొత్త విలువలు రాకుంటే ప్రపంచంలో జీవనరంగం అదృశ్యమౌతుంది. మన ఆశలు, భవిష్యత్తు అన్నీ పోతాయి.

పరిచయం

ఈ పుస్తకాన్ని గీతామిధ్య అంటే సరిగ్గా ఉంటుంది. గీతను గురించి చెప్పేదంతా సందేహాస్పదమే. కురుక్షేత్రంలో నిజంగా పోరాటం సాగిందా? ఒకవేళ అది జరిగి ఉంటే దేశవిదేశాలలోని తెగలన్నీ ఏదోక వైపు కోపు వేసుకున్నాయా? యుద్ధం ఎప్పుడు జరిగింది? అర్జునుడు, రథసారధిగా కృష్ణుడు ఉన్నారా? అనేక యుద్ధాలు గెలిచిన అర్జునుడు దుర్యోధనుడి అపార బలగాన్ని జూచి కలవరపడ్డాడా? బంధు మిత్రులనందరినీ చంపాలనే ఆలోచనతో చలించి పోయిన అర్జునుడు కృష్ణుడి ప్రోత్సాహం వలన భీభత్సకాండ జరిపాడా? కృష్ణార్జునుల సంవాదం సాగుతుండగా ఇరువైపులా సైన్యాలు చూస్తూ నిలబడి పోయాయా?

కురుక్షేత్రంలో కృష్ణుడు చెప్పిన భగవద్గీత మనకెలా వచ్చింది? మహాభారతం ప్రకారం హస్తినాపురంలో ఉన్న ధృతరాష్ట్రుడికి ఏ రోజు కారోజు సంజయుడు నివేదించటంతో గీతకూడా వచ్చింది. కృష్ణుడి నోటినుండి ఊడిపడిన ప్రతిమాటనూ పొల్లు పోకుండా సంజయుడు వృద్ధుడైన, గుడ్డి అయిన ధృతరాష్ట్రుడికి అందించాడు. యుద్ధరంగంలో ఎవరికీ కనిపించకుండా, ఆయుధాల తాకిడికి దెబ్బతినకుండా యధేచ్ఛగా సంజయుడు సంచరించాడు. అతనికి పగటికి - రాత్రికి తేడాలేదు. అలసట లేదు. నిర్విరామ కృషి చేశాడు. అందరి మనస్సుల్లోని ఆలోచనలుగూడా చెప్పగలిగేవాడు.

సంజయుడు ఇదంతా ఎలా చేశాడు? నేటి శాస్త్రీయ సాంకేతికపరమైన రేడియో, టెలివిజన్, వీడియోలు సహితం తలవంచుకునేటట్లు సంజయుడు ఎలా చేశాడు? అది చొప్పదంటు ప్రశ్న అని సాంప్రదాయ వాదులు అంటారు. పూర్వం రుషులకు దివ్యశక్తులుండేవట? వరాలివ్వటంలో వ్యాసుడు అత్యున్నత స్థాయిలో ఉండేవాడు. కురురాజు ధృతరాష్ట్రుడు యుద్ధ విశేషాలను సంజయుడి ద్వారానే తెలుసుకోటానికి వీలుగా అన్నిటినీ వివరించేవరాన్ని ఇవ్వమని కోరగా వ్యాసుడు ప్రసాదించాడు. అది కేవలం యుద్ధ సమయానికే పరిమితమయింది. సంజయుడికి అవి శాపంగానూ మారాయి. యుద్ధం చివరి రోజున సంజయుని పట్టుకొని చంపబోతున్న సాత్యకికి వ్యాసుడు అడ్డుపడ్డాడు. (Sorensen's : An Index to the Names in the Mahabharata, 1963 : Delhi, Pages 6-9)

ధృతరాష్ట్రుడు వ్యాసుని ధర్మసంతానంలో ఒకడు, వ్యాసుడు సహితం సత్యవతి - పరాశరులకు పెళ్ళికి ముందే పుట్టిన వాడు. వ్యాసుడికి అక్రమ సంతానం నలుగురు పుత్రులున్నారు.

మహాభారత కాలంలో తాగుడు, జూదం, పశువులను అపహరించటం, కన్యలను ఎత్తుకు పోవటం సాధారణంగా ఉండేవి. మూకుమ్మడి హత్యలు సాగేవి. సింహాసనాధిపత్యం కోసం, నరక ప్రాప్తి తప్పించుకోటానికి వేరేవారితో నైనా కొడుకుల్ని కనటం ఆమోదించారు. ఆవిధంగానే తల్లిమాటల్ని పాటించి అంబికా, అంబాలికలను వ్యాసుడు గర్భవతుల్ని చేశాడు. వారి భర్త చనిపోయినందున భారతవంశం కొనసాగే అవకాశం లేకుండా పోయింది. ఇలాంటి విధానాలు ఆనాడు చాలా జరిగాయి.

వ్యాసుడు దైవ సమానుడు. అలా భావించిన సంప్రదాయవాదులు అతన్ని పైకెత్తారు. అంబికకు పుట్టిన ధృతరాష్ట్రుడు వ్యాసుని గుడ్డి సంతానం. అంబాలికకు వ్యాసుని ద్వారా పుట్టిన పాండు రాజు రోగిష్టి. మరొక

కుమారుడు విదురుడు వివేకి, ఆరోగ్య వంతుడు కాని, అతడితల్లి శూద్ర యువతి కావటం వలన విదురుడికి సింహాసన హక్కు దక్కలేదు. వ్యాసుణ్ణి ఈసడించుకున్న అంబిక తన సేవకురాలిని అతనికి అప్పగించింది. వ్యాసుడి నాల్గవ సంతానం శుకుడు. వ్యాసుడి రేతస్సు నుండి క్షణికంగా శుకుడు పుట్టాడు. ఇంద్రుని కొలువులో ఒక అప్సరను చూచి రేతస్సు చిందించగా శుకుడి జన్మ జరిగింది.

పాండవులందరూ అక్రమ సంతానమే. కుంతికి పుట్టిన ముగ్గురికీ తండ్రులు ముగ్గురు. మాద్రికి పుట్టిన కవలలకూ అంతే. పెళ్ళికాక ముందు కుంతి కర్ణుడిని కన్నది. సత్యవతి వలెకాక, కనగానే కుంతి కర్ణుని వదిలేసింది. ఇలాంటి చర్యలన్నింటికీ అతిలోక ముసుగు కప్పి మహాభారతం నింపారు.

భరత వంశానికే కాక ఇతర రాచరికాలలోనూ లైంగిక స్వేచ్ఛ బాగా ఉండేది. కంసుడు మధుర రాజు ఉగ్రసేనుడి కొడుకు, కృష్ణుడి మేనమామ. దానవుడు రాణిని చెరచగా కంసుడు పుట్టాడు. పాంచాల రాజు ద్రుపదుడి పుట్టుక అంతే. అతడి సంతానం ద్రౌపది, దృష్టద్యుమ్నుడు. రాజు యజ్ఞం చేస్తూ రాణిని తనతో సంభోగించమంటాడు. ఆవిడ రుతువులో ఉన్నందున ఆగమంటుంది. కాని, యజ్ఞ సమయం ఆగకూడదు. గనుక, యజ్ఞ గుండంలో నుంచి ద్రౌపది, దృష్టద్యుమ్నుడు పెద్దవారు గానే పుడతారు. ద్రౌపది కారు నలుపు. అందువలన ఆమెను కృష్ణ అని పిలిచేవారు. కాని, ఆమె అందగత్తె, పాండవులు ఐదుగురికీ భార్య అయింది.

సంప్రదాయ వాదుల ప్రకారం ఇదంతా యజ్ఞ ఫలం కావచ్చుగాని, ఆనాడు రుషులు యధేచ్ఛగా సెక్స్ ఆచరించిన ఫలితమని చెప్పవచ్చు. అక్రమ సంతానం నాడు విచ్చలవిడిగా ఉండేది. అందుకు ద్రోణకృపాచార్యుల ఉదాహరణ చూపవచ్చు. వైదిక కర్మకాండలో అదొక భాగం. (Max Muller : A History of Ancient Sanskrit Literature, Varanasi, 1968, Page : 40)

మహాభారతాన్ని పంచమ వేదంగా సంప్రదాయవాదులు స్తుతిస్తారు. అది విజ్ఞాన సర్వస్వం అంటారు. అందులోలేనిది ఎందులోనూ లేదంటారు. మహాభారతం వ్యాసుడి విషమ పుత్రిక. కృష్ణుడు గీత పేరిట అర్జునుడికి ఉపదేశించిన దేమిటో చూద్దాం. సంజయుడు యుద్ధ విలేఖరి. ధృతరాష్ట్రుడికి సాయంత్రానికల్లా పూర్తి చిత్రణ యిచ్చేవాడు. వ్యాసుడు అలాంటి అద్భుతాన్ని ప్రసాదించాడు. నాలుగు వేదాలను పరిష్కరించిన వ్యాసుడు మహాభారతాన్నీ, అష్టా దశ పురాణాలను, బ్రహ్మ సూత్రాల్ని, మరెన్నింటినో రాశాడు. ఈ ఉద్గ్రంధాలలో గీత వంటిది అతనికి మంచి నీళ్ళ ప్రాయం. కురుక్షేత్రయుద్ధానంతరం ఎన్నో సంవత్సరాలకుగాని అది రాయలేదు. మహాభారతంతో పాటు గీతను తన కుమారుడికీ, నలుగురు శిష్యులకూ చెప్పాడు. అందులో ఒకరు వైశంపాయనుడు. గురువువలె అతడిదీ బహుముఖ మేధస్సు. అర్జునుడి ముదిమనుమడు జనమేజయుడు నాగవంశాన్ని మట్టుపెట్టడానికి యజ్ఞం తలపెట్టాడు.(ప్రతి యజ్ఞానికీ పురోహితులకు బంగారం, ఆవులూ, ఆడపిల్లలూ దక్కేవారు) యజ్ఞ సమయంలో గీతతో కూడిన మహాభారతాన్ని వైశంపాయనుడు పారాయణం చేశాడు.
అది విన్న సౌతి, ఉగ్రశ్రవుడు మహాభారత గీతను శౌనకాదిమునుల నిమిత్తం నైమిశారణ్యంలో పన్నెండు సంవత్సరాల యజ్ఞకాలంలో చెప్పాడు. ఆ తరువాత ఎవరు పారాయణం చేశారో తెలియదు. గీత చెప్పిన కృష్ణుడికీ, అది పారాయణం చేసిన సౌతుడికీ వందేళ్ళ తేడా ఉన్నది. కురుక్షేత్ర యుద్ధానంతరం యుధిష్టిరుడు 36 ఏళ్ళు పరిపాలించాడు. జనమేజయుడు నాగవంశాన్ని మట్టుపెట్టాలని తలపెట్టటానికి కారణం తనతండ్రి పరీక్షిత్తును వారు చంపటమే. నైమిశారణ్యంలో శౌనకుడు నాగయజ్ఞం ఎప్పుడు తలపెట్టాడో కచ్చితంగా

తెలియదు. (Sitanath Pradhan : Chronology of Ancient India, Calcutta, 1927, Page :71) కృష్ణుడి గీతాబోధనకూ, సౌతుడి పారాయణానికి, ఒక శతాబ్దం తేడా ఉంటే, ఆ తరువాత గీత వ్రాత పూర్వకంగా రావటానికి కొన్ని శతాబ్దాలు గడిచింది. సంప్రదాయవాదుల ప్రకారం అయితే ఇది వేలలో ఉంటుంది. అన్నాళ్ళు కృష్ణుడు చెప్పిన గీత యధాతథంగా ఉందనటానికి వీలులేదు. గీత కంటె ఇంకా ఎక్కువ కాలానికి గాని వేదాలు రాతకు నోచుకోలేదనీ, అయినా, ఉచ్చారణతో సహా యధాతథంగా దిగుబడి అయ్యాయనీ సంప్రదాయ వాదులంటారు. గీత వేదంకాదు. దీని ప్రమాణాన్ని అందరూ అంగీకరించటం లేదు - 8వ శతాబ్దంలో ఉన్న ఆదిశంకరాచార్యుడు గూడా. గీతను ఎవరూ పట్టించుకోలేదు. బౌద్ధాన్ని ధ్వంసం చేయటానికి సాధనంగా గీతపై శంకరుడు వ్యాఖ్యానం రాశాడు. ఆర్య సమాజవాదులూ, బ్రహ్మ సమాజ వాదులూ, గీతకు అట్టే విలువ యివ్వరు. కనుక వేదాలకూ, గీతకూ సామ్యం చూపటం సబబు కాదు. గీత రూపొందిన తీరూ, అది అందించిన వక్రమార్గం గమనిస్తే అదొక మిధ్యగా పేర్కొన వచ్చు. అలెగ్జాండర్ పోప్ వదంతులను గురించి చెప్పిన మాటల్ని గీతకు అన్వయించవచ్చు. నేను కాలేజీ రోజుల్లో తొలుత గీతను చదివాను. ఆ తరువాత దానిపై భాష్యాలెన్నో చూచాను. గీతరచన, కాలం, ప్రదేశం తరతరాలుగా అందించిన తీరు అన్ని కాలాలకు, అందరికీ సరిపడే తత్త్వం అని ప్రచారం చేయటం అంతా బూటకమే. ఆ మాట పుస్తక శీర్షికకు పెట్టవలసింది. గీతభక్తులు చదవకుండానే పుస్తకం మూసివేస్తారని ఆ పని చేయలేదు. వారిని నా వైపు తిప్పుకోవాలనే భ్రమ నాకు లేదు. కొద్ది మందైనా గీత అల్పత్వాన్ని గ్రహిస్తే నా కృషి వృధా కాబోదు.

సందేహాస్పద సమరం

మహాభారతం అనే పదాన్ని పాణిని వాడాడు. ఏదైనా భరతుడికి సంబంధించిన గొప్పతనానికి విశేషణంగా ఈ ప్రయోగం జరిగింది అని హాప్కిన్స్ రాశాడు. (Edward Washburn Hopkins: A Cambridge History of India, Vol. I. Ancient India, ed. by E.J. Rapson, Cambridge, 1935, Page : 252, 253) భరతునికి సంబంధించిన గొప్ప కావ్యంగా మహాభారతాన్ని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఇలియడ్, ఒడెస్సేలకు ఎనిమిదిరెట్లు నేడు భారతం ఉన్నది. (V.S. Suktankar. on the Meaning of Mahabharata. Bombay, 1957, Page.8) భరతుల మధ్య, అంటే కౌరవపాండవుల మధ్య కురుక్షేత్రంలో జరిగిన గొప్ప యుద్ధం కూడా ఇందులో ఉందా? అలాంటి యుద్ధం జరిగిందనటానికి ఆధారాలు లేవు.

1. వేద సాహిత్యంలో కౌరవుల ప్రస్తావన ఉన్నది. పాండవుల ప్రసక్తి లేదు. మహాభారతాన్ని ప్రత్యేకంగా పరిశీలించిన హాప్కిన్స్ ప్రకారం బ్రాహ్మణాలు, సూత్రాలు కూడా పాండవులు ప్రస్తావన తేలేదు. మాక్స్ ముల్లర్ ప్రకారం కౌరవులు, భరతులూ వేదసాహిత్యంలో వున్నారు. పాండవులు లేరు. పాణిని వ్యాకరణంలోనూ, కౌరవ, భరతుల ప్రస్తావన ఉన్నది గాని, పాండవుల పేరు ఎత్తలేదు. (Max Muller: A History of Ancient Sanskrit Literature, 1968 Varanasi Page 40) క్రీ.పూ. 5వ శతాబ్దం మధ్యలో పాణిని జీవితకాలంలో పాండవులెవరో తెలియదు. (V.S. Agravala: India As known to Panini, Luknow, 1953, Page : 455-475)

2. రుగ్వేదంలో భరత రాజు సూదుడికీ, ఇతర తెగలకూ జరిగిన పోరాటాన్ని నేటి రావి నదీ తీరాన (నాటి పరుషణి ఒడ్డున) జరిగినట్లు ప్రస్తావన ఉన్నది. మహాభారత యుద్ధం జరిగి ఉంటే వేద సాహిత్యంలో తప్పని సరిగా పేర్కొనే వారే. వేదాలలో కౌరవ పాండవ యుద్ధం లేదని మాక్స్ ముల్లర్ స్పష్టీకరించాడు.

3. వేద సాహిత్యంలో కురుక్షేత్రాన్ని పవిత్రస్థలంగా పేర్కొన్నారే తప్ప యుద్ధభూమిగా కాదు. (D.C. Sirkar: Mahabharata Myth And Reality, ed. by S.P. Gupta and K.G. Ramachandra. Delhi, 1976 Page.5)

4. వ్యాస, వైశంపాయనులు తైత్తిరీయ, ఆరణ్యకాలలో ప్రస్తావించిన మహాభారత కర్తలు మాత్రం కాదు.

5. కధక సంహితలో కురురాజు ధృతరాష్ట్రుడి ప్రస్తావన ఉన్నది. అతడికీ, పురోహితుడికీ, మధ్య ఒక క్రతువుకు సంబంధించిన వివాదానికి సంబంధించిన విషయంగానే వచ్చింది గాని, కురుక్షేత్ర యుద్ధ ప్రస్తావన లేదు. (A.B. Keith: Cambridge History of India 1935. Vol. I. Page. 119).

6. అధర్వణ వేదంలో సంపన్నరాజుగా పరీక్షిత్ పొగడ్త ఉన్నది. శతపధ బ్రాహ్మణాలలో జనమేజయుడు గొప్ప యాగకర్తగానూ, పురోహితులకు దానం చేసిన వాడుగానూ పేర్కొన్నారు. అర్జునుడి వంశంలోని వాడుగా చెప్పలేదు.

7. మహాభారతంలో అర్జునుడు ఇంద్రుని కొడుకు. శతపధ బ్రాహ్మణంలో అర్జునుడే ఇంద్రుడు. (H.C. Ray Chandhury: An Advanced History of India. London, 1953 Page.94)

8. అక్షౌహిణిలో 21, 870 రధాలు, 21870 ఏనుగులూ, 65, 610 గుర్రాలు, 109, 350 కాల్బలం ఉన్నది. (Dikshitar, V.R. Ramachandra : War in Ancient India, Madras, 1944, Page 198) కురుక్షేత్రంలో కౌరవులకు 11, పాండవులకు 7 అక్షౌహిణులున్నా యన్నారు. నేడు అంతమంది ఒక చోట కూడటం సులభం కాదు. ప్రాచీన కాలంలో అది అసంభవం. యుద్ధ రంగంలో అంతమందిని ఒక చోట చేర్చటం సాధ్యమయ్యే పని కాదు.

9. కురుక్షేత్రంలో 11,80,980 గుర్రాలున్నాయన్నారు. పదాతిదళం 20 లక్షలన్నారు. కాని యుద్ధ ప్రస్తావనలో ముఖాముఖి పోరాటాలే ఆనాటి సంప్రదాయంగా ఉదహరించారు. (H.D. Sankalia : Mahabharata, Myth and Reality. Delhi, 1976, Page. 145)

10. ఎంత ఉదారంగా లెక్క వేసినా 40 లక్షలకు మించి యుద్ధంలో పాల్గొన్నట్లులేదు. కాని మృతుల సంఖ్య 1660 మిలియన్లని చూపారు. అంటే ఒక్కొక్కరూ 4 వందల సార్లు చనిపోయారన్నమాట. (Pratap

Chandra Roy : The Mahabharatha, Calcutta, Vol. 7, Calcutta : Undated, page. 42-43)

11. కురుక్షేత్ర యుద్ధంలో ఆయుధాలు నాటికాలాన్ని బట్టి మోటైనవి. అంతకంటే ఉన్నత నాగరికతలో పెంపొందిన హరప్పావాసులు, రాతి, ఇత్తడి, రాగి పనిముట్లే వాడారు.

12. భారీ యుద్ధానికి కావలసిన ఇనుప ఆయుధాలు కురుక్షేత్ర యుద్ధంలో ప్రధానపాత్ర వహించలేదు. క్రీ.పూ 6వ శతాబ్దంలో గాని ఇండియాలో ఇనుము వాడకంలోకి రాలేదు.

13. మగధ ఆర్యేతర రాజ్యంగా పేర్కొన్నారు. వింధ్యకు దక్షిణాన ఉన్న ప్రాంతమూ అంతే. కురుక్షేత్రంలో వీరెవరూ పాల్గొనిఉండరు.

14. రవాణా రాకపోకలు ఆదిమ దశలో ఉన్నప్పుడు దూర ప్రాంతాలలో ఉన్న భారీ సైన్యాన్ని రప్పించటం చాలా కష్టంతో కూడిన పని.

15. మహాభారతంలో ప్రాగ్ జ్యోతిష (నేటి అస్సాం) రాజు భగదత్తుడు ప్రధానపాత్ర వహించినట్లున్నది. వేద సాహిత్యంలో ఎక్కడా అతడి పేరులేదు. పాణినికి కూడా అతడు తెలియదు.

16. యవనులు, శకులు, పల్లవులు యుద్ధంలో కౌరవుల పక్షాన పోరాడారని చెప్పటం అసందర్భం. భారత చరిత్రలో క్రీ.పూ 5వ శతాబ్దం ముందు వీరి పాత్ర లేదు.
కురుక్షేత్ర యుద్ధంలో 18 అక్షౌహిణులున్నాయన్నారు. సమరం 18 రోజులు సాగిందన్నారు. పాండవులలో మిగిలిన వారు ఆరుగురు, కౌరవులలో ముగ్గురు యుధిష్ఠిరుడు రెండు 18 సంవత్సరాలు పరిపాలించాడు. ఈ యుద్ధానంతరం 36 ఏళ్ళకు కృష్ణుడు చనిపోయాడు. 18 పర్వాలలో మహాభారతం చెప్పారు. గీత కూడా 18 అధ్యాయాలలో ఉన్నది. ఇదంతా అనుకోకుండా జరిగింది కాదు. సంఖ్యాశాస్త్రంలో నమ్మకం ఉన్నవారు అల్లిన పన్నాగమే ఇది.

ఆధునిక భారత చరిత్ర కారులలో గౌరవించదగిన ఆర్.జి. భండార్కర్ నిస్సందేహంగా భారత, రామాయణ పురాణాలు చారిత్రకాలు కావన్నాడు. (Collected Works, Poona, Vol.I, Page: 365) ఆధునిక విద్య వివేచనతో, ప్రశ్నించే తత్త్వంతో మనకు ఎందుకు రావటం లేదని అతను బాధపడ్డాడు.

ఆర్.సి.దత్. మరొక అడుగు ముందుగు వేసి మహాభారత యుద్ధం కట్టుకథ అన్నాడు. పంచ పాండవులు, ద్రౌపది గూడా అల్లినగాథే అన్నాడు. అతడు రుగ్వేదాన్ని బెంగాలీలోకి అనువదించాడు. శూద్రుడు వేదాల జోలికి ఎలా పోతాడని అతడి పట్ల సనాతనులు గొడవ చేశారు? మహాభారతం, రామాయణాన్ని కూడా ఇంగ్లీషులో సంక్షిప్తంగా అనువదించి అందించాడు. (R.C. Dutt : Civilization of Ancient India, in 2 Vols Vol.I, London, 1893, P:122)

రామమోహన రాయ్ మహాభారతంలో వ్యాసుడు ఆ గాథంతా ఊహాజనితంగా పేర్కొన్న విషయం చూపారు. ప్రపంచంలోని ప్రధాన మతాల పవిత్ర గ్రంథాలను పరిశీలించిన రామమోహన్ రాయ్ గీతకు విలువ ఇవ్వలేదు. మతాల పై అతని రచనలలో గీతను పట్టించుకోనేలేదు.

గీత తనకు తల్లివంటిదని, 1889లో తొలుత గీతా పరిచయం ఐనప్పటి నుండీ అలాగే భావించానని గాంధీ అన్నాడు. (M.K. Gandhi, Geetha My Mother, Bombay 1965. P. 1) ఐనప్పటికీ మహాభారత చారిత్రకత పట్ల అతనికి సందేహాలున్నాయి. గీత ప్రస్తావించిన సంఘర్షణ మంచి చెడుల మధ్య ప్రతి వ్యక్తిలో జరిగే పోరాటంగా పేర్కొన్నాడు.

వివేకానందుడు చారిత్రకత విషయమై అర్జునుడు, తదితరుల సంగతి సందేహాస్పదమే అన్నాడు. శతపథ బ్రాహ్మణంలో అశ్వమేధ యజ్ఞం సందర్భంగా అందరి పేర్లూ ప్రస్తావించినా, అర్జునుడు తదితరుల పేర్లు లేవన్నాడు. ఐనా, మహాభారతంలో యుధిష్టిరుడూ, అర్జునుడూ, ఇతరులూ అశ్వమేధ యజ్ఞం చేసినట్లున్నది. (Swami Vivekananda : Thoughts on the Geetha 1977. P. 5) ఐనప్పటికీ మహాభారతం ఇతిహాసంగా విలువను కాపాడుకుంటున్నదనీ, అందులో గీతకు ప్రాధాన్యత ఉన్నదని అన్నాడు. అర్జునుడు కల్పితమైతే, కృష్ణుడు చారిత్రక పురుషుడు కావటానికి వీలులేదు. ఇరువురూ కల్పితమైతే పరస్పరం సంభాషించుకున్నారనటంలో అర్థంలేదు. గీతను ఎవరో అల్లి మహాభారతంలో చొప్పిస్తే, అది దివ్యవాణి ఎలా అవుతుంది? మన సంప్రదాయవాదులు భండార్కర్‌నూ, దత్ నూ పాత కాలపు చరిత్రకారులుగా తోసి పుచ్చవచ్చు. రామమోహన్ రాయ్, వివేకానంద, గాంధీలను చరిత్ర కారులు కాదనవచ్చు. కాని డి.డి. కోశాంబిని కాదనగలరా? శాస్త్రీయ పద్ధతిలో భారతీయ నాణాలను అతడు పరిశీలించాడు. భారత చరిత్రకు మార్క్సిస్ట్ దృక్పథాన్ని అన్వయించాడు. అతడిని ఎంత తోసిపుచ్చినా, చివరకు మార్గగామిగా గుర్తించక తప్పలేదు. అతడి చిత్తశుద్ధిని కాదనలేక పోయారు. రామాయణ, భారతాలలో పేర్కొన్న యుద్ధాలు ఎప్పుడు, ఎక్కడ జరిగాయో మనకున్న చారిత్రకాధారాల ప్రకారం చెప్పటం అసంభవం అన్నాడు. (D.D Kosambi : An Introduction to the Study of Indian History) కురుక్షేత్ర యుద్ధం గొప్ప కల్పితగాథ అని నిస్సందేహంగా పేర్కొన్నారు. డి.సి. సర్కార్, హెచ్.డి.సంకాలియా కూడా కురుక్షేత్ర యుద్ధం జరగలేదని, కేవలం కుటుంబాల మధ్య, తెగల మధ్య కలహాలు మాత్రమేనని రాశారు.

ఈ అధ్యయనం వలన నాకు మనస్తాపం కలిగినది. హిందువుల పై సంప్రదాయ బరువు ఎంత భారంగా పరిణమించిందో అర్థం అవుతున్నది. 41 మంది అధ్యయనం చేసిన వారిలో కనీసం ధైర్యంగా, వివేచనాత్మకంగా, సొంతంగా ఆలోచించిన వారు 6 గురన్నా లేరు. కోట్లాది ప్రజలు వేలాది సంవత్సరాలుగా నమ్ముతున్నదంతా గాథ ఎలా అవుతుందని భావించారు? ఇదే వాదనతో సూర్యచంద్రులకు, రాహుకేతువుల గ్రహణాలు పడుతున్నాయనీ వీరు నమ్మారు.

మన జాతీయ మనస్తత్వంలో మౌలికంగా దోషం ఉన్నదా! గ్రహణంలో ఉపవాసం ఉండి, తరువాత స్నానం చేసి, తద్వారా సూర్య చంద్రులను కాపాడామనే వారే వీరంతా. వారు నమ్మకంలో పుట్టారు, నమ్మకాలతోనే పెరిగారు, అలాగే చనిపోయారు. సందేహించే శక్తి వారికి లేదు. ప్రశ్నించే స్వభావం లేదు. వివేచనా పరిశీలనకు దేనినీ గురిచేయలేదు. పాతనమ్మకాన్ని కాదనటం పాపం. ప్రశ్నిస్తే పాతకం, పరిశీలనకు పెడితే నరక ప్రాప్తి, అలాంటి

వారే మన విశ్వవిద్యాలయాలలో, జాతీయ, పరిశోధనాలయాలలో, సాంకేతిక సంస్థలలో వివిధ ప్రభుత్వస్థాయిలలో ఉన్నారు. మన జాతీయ జీవనంలో కనిపిస్తున్న ఉన్మాద ప్రవృత్తిని బట్టి ఘాటైన విమర్శలు చేయక తప్పటం లేదు.

తప్పుడు సంకేతాలు

భారతదేశ ప్రాచీనచరిత్రలో ఒకే తేదీ నిర్దుష్టంగా చెప్పవచ్చు. క్రీ.పూ. 327-326 లో అలెగ్జాండర్ దండెత్తి వచ్చాడు. మిగిలిన తేదీలు ఖచ్చితంగా చెప్పలేక పోటానికి మనకాలచక్రమే కారణం. ప్రభవ, విభవ అంటూ 60 సంవత్సరాల కొకసారి తిరిగి వచ్చే కాలాన్ని ఏర్పాటు చేసుకోటంలో నిర్దిష్టత పోయింది.
విక్రమయుగం, శాలివాహన లేదా శకయుగాలు ఉన్నాయి. వాటికి కూడా ప్రారంభం ఎప్పుడో తెలియదు. క్రీ.పూ. 58-57 మధ్య విక్రమ యుగం మొదలయిందంటారు. ఎవరీ విక్రముడు? ఏ చారిత్రక సంఘటన, గొప్ప చర్య ఆధారంగా ఈ యుగం ఆరంభమయింది? స్పష్టమైన సమాధానం లేదు. క్రీ.త. 5వ శతాబ్దంలో హూణులపై జయం సాధించిన విక్రమాదిత్యుడు కావటానికి వీలు లేదు. అంతకుముందు 600 ఏళ్ళ క్రితమే ఈ యుగం ఆరంభమయింది. చివరి మౌర్య చక్రవర్తిని చంపి సుంగరాజ్యాన్ని స్థాపించిన పుష్యమిత్రుడూ కాదు. క్రీ.పూ. రెండవ శతాబ్దం చివరలో ఈ సంఘటన జరిగింది. సుప్రసిద్ధ కనిష్కుడు కావటానికి వీలు లేదు. ఒక శతాబ్దం అనంతరం గాని కుషాణ సామ్రాజ్యం స్థాపన కాలేదు. శాతవాహన సామ్రాజ్యానికి చెందిన గౌతమీపుత్ర శాతకర్ణి కాదు. క్రీ.త. 124-125 ప్రాంతాలలో అతడు శకులను అణచి వేశాడు. విక్రమాదిత్య అనేది బిరుదుగానూ పేర్కొనడం లేదు. విక్రమయుగం ఎలా ప్రారంభం అయిందీ చరిత్రకారులకే ఏకాభిప్రాయం లేదు. క్రీ.పూ. 60లో పంజాబ్ సింధు సామ్రాజ్యాలను స్థాపించిన అజన్ తన పేరే ఆ యుగానికి పెట్టుకున్నాడు. ప్రాకృతంలో యుగం అంటే ఆయం అని పిలుస్తున్నారు. విక్రమ యుగం ఎక్కడా ప్రస్తావనలో లేదు. విక్రమ యుగానికి చెందిన చిక్కును తొలగించటానికి చరిత్రకారులు కొందరు కృతయుగం, అనీ, మాళవ యుగమనీ తొలుత ఉండేదంటున్నారు. విక్రమ యుగం పూర్తి అయిన సందర్భంగా ప్రచురించిన సంపుటిలో డి.డి. కోశాంబి యిలా రాశాడు. "1943లో విక్రమయుగం 2 వేల ఏళ్ళు గడిచిన సందర్భంగా, దీనికి సంబంధించిన చిక్కును విడదీయలేక పోయారు. పరస్పర విరుద్ధ వ్యాసాలు కేవలం నమ్మకాన్ని సూచించాయి. (D. Kosambi, An Introduction to the Study of Indian History.Bombay,1975,P. 293)

శాలివాహన లేదా శాకయుగం క్రీ.త. 78లో మొదలయింది. ఇందులోనూ విడదీయరాని చిక్కులున్నాయి. ప్రాచీన భారత తేదీలన్నీ అస్పష్టం అయినప్పుడు రామాయణ, మహాభారతాలలో, పురాణాలలో తేదీలు నిర్ధారించటం వృధా. రామాయణ, మహాభారతాలు కూడా ఒక విధంగా పురాణాలే. వాటికి తేదీలు నిర్ణయించటం అవివేకమే.

కలకత్తా హైకోర్టులో జడ్జిగా పనిచేసిన బ్రిటిష్ ఐ.సి.యస్. ఆఫీసర్ ఎఫ్.ఇ. పర్గీటర్ ఈ తేదీల నిర్ధారణలో తిప్పలు పడ్డాడు. సంస్కృతం చదువుకొని మార్కండేయ పురాణాన్ని ఇంగ్లీషులోకి అనువదించాడు. పురాణాలలో ప్రస్తావించిన రాజ్యాల జాబితా సేకరించి ఇంగ్లీషులోకి అనువదించి పెద్ద పీఠిక రాశాడు. (F.E. Pargiter: The Purana Text of the Dynasties of the Kali-age. Varanasi, 1962) వీటినే తరువాత మరో పుస్తకంలో పేర్కొన్నారు.

(Ancient Indian Historical Tradition) పురాణాల నుండి అతను సేకరించిన చరిత్ర అనేది ఊహ మాత్రమే. చరిత్రకు భిన్నంగా పురాణాలన్నీ గాథలతోనూ, కట్టుకథలతోనూ నిండాయి. విశ్వసృష్టి, ప్రళయం, మళ్ళీ పుట్టటం, మనువు, అతని భార్యలు, సంతతి యిత్యాదుల ప్రస్తావనలున్నాయి. వివిధ రాజుల కాలాలు పేర్కొన్నారు. మధ్యలో మానవుల అసమానతల గొప్పతనాన్నీ, కులాన్నీ సంస్థాగతం చేయడాన్ని యీ గ్రంథాలలో రాశారు. పురోహితులను రాజు కాపాడకపోతే ప్రపంచం నాశనమవుతుందన్నారు. పుట్టుకనుండి చనిపోయే వరకూ, ఆ తరువాత కూడా ఎలా ఉండాలో నియమాలు రాశారు. స్వర్గానికి ఎలా వెళ్ళాలి, అక్కడకు చేరిన తరువాత రంభ, ఊర్వశి, తిలోత్తమ, వరూధినులతో ఎలా అనుభవించాలి అనేవి చిత్రించారు.

అలాంటి వాటి నుండి చరిత్రను ఏమేరకు రాబట్టవచ్చు? ఇంచుమించు ఏమీలేదు. పైగా మన నైతిక ప్రవర్తన పై ఆ రచనలు దెబ్బతీశాయి. అదంతా బాధ్యతారహితమని భావించినా, ఇప్పటికే 2,500 సంవత్సరాలు ఆలశ్యమయింది. మనకు వాల్మీకి, వ్యాసుడు ఎలాగో గ్రీకులకు హోమర్, హీసియాడ్ అలాగ. సోక్రటీస్ నోటితో వారిపై ప్లేటో ధ్వజమెత్తాడు. దేవుళ్ళూ, నాయకులూ తాగుబోతులైతే, జూదరులైతే, అబద్ధాలాడితే, భట్రాజులైతే, శృంగారకేళిలో తేలిపోతే, ద్వేషం, అసూయలతో నిండిపోతే, అలాంటివారిని ఆదర్శగా చూపి జనం కూడా తమ బలహీనతల్ని కప్పి పుచ్చుకోరా, అని ప్లేటో అడిగాడు. మూడవ సంపుటిలో యిది చూడవచ్చు. హోమర్, హీసియాలను ఖండించటంలో ప్లేటో కంటె జెనో ఫేన్ మరొక అడుగు ముందుకు వేశాడు. నాటక రచయిత యూరిపిడస్ కూడా పుక్కిటి పురాణాలను ఖండించాడు. మన దేశంలోని కవులూ, నాటక కర్తలూ, తాత్త్వికులూ, రామాయణ, మహాభారత పురాణాలపట్ల పరవశం చెందుతున్నారు. వీటి వెనుక ఒక పథకం ఉన్నది. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సమానత్వం అనే శక్తులను అడ్డుకోవాలనీ, కులతత్వాన్ని కొనసాగించాలని ప్రయత్నిస్తున్నారు. సి.రాజగోపాలచారి, కె.ఎం. మున్షీ మొదలైన రాజకీయవాదులు స్వతంత్ర భారతదేశంలో హిందూ పురాణాల కోపు వేసుకున్నారు.

నైతికరంగంలో పురాణాలూ, ఇతిహాసాలు నికృష్టమైనవి. చరిత్రకోసం వాటి పై ఆధారపడకూడదు. ఎ.ఎల్.బాషం యిలా అంటాడు: "మహాభారత నాయకులు సమకాలీన ముఠా ప్రభువులు కావచ్చు, కాని చరిత్రకారుడికవి పనికిరావు. క్రీ.పూ. 10వ శతాబ్దంలో చరిత్రను మహాభారతం ఆధారంగా నిర్మించటానికి పూనుకోవటం వృథా"(A.L.Basham: The Wonder That was India. London,1937.p36-39).

పురాణాలలో చరిత్రకారులకు ఎలాంటి చిక్కులు వస్తాయో శీతానాథ్ ప్రధాన్ గుర్తించాడు. "పురాణాలలో ప్రాచీన ఆర్య చరిత్ర లభిస్తుందనుకొంటారు. కాని యిందులో చాలా విరుద్ధ విషయాలున్నాయి. అనేక చోట్ల పురాణాలు భిన్న రీతులుగా చూపుతున్నాయి. ఒక సామ్రాజ్యాన్ని మరొక దానిలో కలిపేశారు. రాజుల జాబితా పెరిగిపోయింది. రాజ్యాల సంక్రమణ మారిపోయింది. సామ్రాజ్యాలకు కాలం పొడిగించేశారు. ఒకొకసారి ఒకే పేరు వలన అనేక చిక్కులు చోటు చేసుకున్నాయి. (Sita Nath Prathan : Chronology of Ancient India. Calcutta, 1927. p XI) అయినప్పటికీ ఈ పురాణాల ఆధారంగానే ప్రాచీన భారత చరిత్ర తేదీలను ప్రధాన్ ప్రస్తావించాడు.

పర్గీటర్ కూడా చరిత్రకారుడుగా పురాణాల్లో అనేక చిక్కులను ఎదుర్కొన్నారు. 80 మంది జనమేజయులూ, 100 మంది నాగులూ, హైహయులూ, ధృతరాష్ట్రులూ, బ్రహ్మదత్తులూ, 200 పైగా భీములూ, భీష్ములూ, 1000కి పైగా

శశబిందువులూ అతనికి ఎదురయ్యారు. ఈ జాబితా పూర్తి కాలేదు. వాటితో పర్గెటర్ వంటి వారు విసుగుచెంది పురాణాలు రాసిన బ్రాహ్మణులకు చరిత్రకు, కట్టుకథకు తేడా తెలియదన్నాడు. చరిత్రకు పురాణాన్నీ, ఇతిహాసాలకు చారిత్రక ముసుగుల్నీ వేశారన్నాడు. బ్రాహ్మణ సాహిత్యంలో చారిత్రక దృక్పథం లేదన్నాడు. పురాణాలు ప్రాచీన భారత చరిత్రకు తప్పుడు సంకేతాలు. వాటి ఆధారంగా కురుక్షేత్ర యుద్ధ తేదీలను నిర్ణయించబూనారు.

తేదీల ఒడిదుడుకులు

కలియుగం అనేది చాలా మోటు భావన. పురావస్తు శాఖ పరిశోధనలకు విరుద్ధమైనది. ఆటవిక, బర్బర, నాగరిక యుగాలు చరిత్రలో సుప్రసిద్ధమైనవి. వీటిలో వివిధ దశలున్నాయి. ఒక దశ కొత్త దశకు స్థానం కల్పిస్తూ మిళితమౌతూ పోతుంది. పక్క పక్కనే వివిధ దశలూ వుండవచ్చు. కృత, త్రేత, ద్వాపర, కలియుగాల్లో క్రమేణ ధర్మం క్షీణిస్తూ, శాంతి సంపదలు కోల్పోతూ ఉంటాయనే భావన ఛాందసమైనది. అయినప్పటికీ, కలియుగం ఎప్పుడు ప్రారంభమయిందీ అనే చర్చ చేస్తూ ఉంటారు.

కలియుగం నిర్ధారితమైతే కురుక్షేత్ర యుద్ధం తేదీలు చెప్పవచ్చుననీ సనాతనుల ఉద్దేశం. వీరి అభిప్రాయంలో 3101 క్రీ.పూ. కలియుగం ప్రారంభమైనప్పటి నుండి 5 వేల సంవత్సరాలు గడిచేసరికి క్రీ.శ. 1899 వచ్చిందని అన్నారు. దీనితో అంగీకరిస్తున్నట్లు వైద్య చెప్పాడు. (C V Vaidya : Mahabharatha : A criticism. Bombay, 1929. p 55-56) సనాతనులు ఎంత ఎలుగెత్తి చాటితే అంత ఖచ్చితంగా నమ్మినట్లు భావిస్తారు. భారతదేశానికి అదొక విషాద పరిణామం. మూఢ నమ్మకాలకూ, వివేచనారాహిత్యానికీ భారత దేశం చాలా సారవంతమయింది.

కృత, కలియుగాలనేవి హిందువుల నిమిత్తం ప్రత్యేకంగా రూపొందించిన దైవ నిర్ణయమని నమ్మారు. ఇవి మిగిలిన ప్రపంచానికి చెందవు. ఇతర ప్రజలకూ, లోకానికి ఎలాంటి పొత్తులేదు. విదేశాలకు పోకుండా హిందువులను వేలాది సంవత్సరాలు ఆపారు. అది నత్త జీవితం వంటిది. కలియుగారంభంలో ఆర్యులు సంచారజాతులు. 1500 సంవత్సరాలు పాటు తిరిగి సింధులోయకు చేరారు. మరో 500 ఏళ్ళకు గంగా యమున ప్రాంతాలకు చేరారు. అలా స్థిరపడిన ఆర్య తెగల మధ్య నేటి ఢిల్లీగా పేర్కొంటున్న ప్రాంతంలో క్రీస్తుపూర్వం 3102-3101 ప్రాంతాలలో పోరాటాలు జరగటం సంభవమా? సప్త సింధు ప్రాంతం ఆర్యుల అసలు ప్రాంతమని అభినాష్ చంద్రదాస్ పేర్కొన్నాడు. అక్కడి నుండి నలువైపులు వెళ్ళి తమ దివ్య సంస్కృతిని ఆర్యులు వెదజల్లారన్నారు. ఈ సిద్ధాంతాలను వివరించటానికి దాస్ రెండు పెద్ద గ్రంథాలు రాశారు. వీటిని నవ్వులాటకైనా చదవాలనిపించదు. (Abinaschandra Das : Rigvedic India, Rigvedic Culture. Calcutta, 1925).

కలియుగం క్రీ.పూ. 3102 లో ఆరంభమైందనటానికి శాసనాలు ఆధారం ఉండదన్నారు. అయిహోలా శాసనం రెండవ పులకేసికి చెందినది. పశ్చిమ చాళుక్య రాజ్యంలోని ఈ శాసనం చాలా ప్రాచీమైనది. (AD Pusalker: History And Culture of the Indian People Vol. I. The Vedic Age) అయితే యిది క్రీ.శ. 634కు చెందినది.

అలాంటప్పుడు 3736 సంవత్స రాల తరువాత వచ్చిన శాసనాన్ని కలియుగానికి సాక్ష్యంగా సనాతనులు మాత్రమే స్వీకరించగలరు! ఆర్యభట్టు అంచనాల ప్రకారం కలియుగం క్రీ.పూ. 3102లో ప్రారంభమైంది.

కాని, ఆర్యభట్టు క్రీస్తు తరువాత వాడు. 3600 సంవత్సరాల తరువాత ఉన్న ఆర్యభట్టు ఖగోళ అంచనాల ఆధారంగా చెపుతున్నాననటం సనాతనులకు నచ్చవచ్చు.

కలియుగారంభాన్ని, రాజరికాల తేదీలను భవిష్యపురాణం అందించగా మత్స్య, వాయు, బ్రహ్మాండ పురాణాలు అనుకరించాయి. ఈ భవిష్య పురాణం నటనకు మారు పేరు. భవిష్యత్తులోకి తొంగిచూచి రాజ్యాలు రావటం, పోవటాన్ని చెప్పగలమన్నారు. వాటి ఆధారంగా కలియుగం ఎప్పుడు మొదలయిందో అంచనాలు వేస్తామన్నారు.

పురాణాలలో రాజ్యాలూ, రాజుల పట్టీల తేడా ఉన్నది. ప్రతి పురాణంలోనూ వివిధ రాజ్యాల కాలాలు అనేక విరుద్ధాలతో కూడి ఉన్నది. 14 నుండి 25 సంవత్సరాల వరకూ ఈ తేడాలు కనిపిస్తున్నవి. పర్గెటర్ అంచనాలలో 18 సంవత్సరాల కాలపరిమితి ఒక్కొక్క రాజ్య పాలనకు ఉన్నది. వైద్య ఈ పరిమితిని 20 సంవత్సరాలన్నారు.

బాషమ్ 19 సంవత్సరాలకు కుదించాడు. టి.టి. శ్రీనివాసయ్యంగార్ 25 సంవత్సరాల వరకూ పెంచాడు. విన్ సెంట్ స్మిత్ 25.2 సంవత్సరాలన్నారు. ఎ.డి. పుసాల్ కర్ 18 సంవత్సరాలకు తగ్గించాడు. పి.ఎల్. భార్గవ 20 సంవత్సరాలన్నాడు. పురాణంలోని రాజ్యాల కాలపరిమితిని ఫ్లీట్, హోర్నెల్ అనేవారు 15 సంవత్సరాలకు పరిమితం చేశారు. ఎ.ఎస్. ఐటేకర్ 16.5 సంవత్సరాలన్నారు. బి.బి.లాల్ 14.5 సంవత్సరాలన్నాడు. ఎస్. యన్. ప్రధాన్ 14 సంవత్స రాలన్నాడు విసుగు పుట్టించే ఈ విషయాన్ని ఇంతటితో ఆపేద్దాం.

ఏ ఇరువురు చరిత్రకారులూ రాజ్యాల పరిమితిని గురించి ఏకాభిప్రాయానికి రాలేక పోయారంటే వారు స్వీకరించిన ఆధారాలు తప్పుడివి కావటమే కారణం. ఈ సామ్రాజ్యాల పట్టిక చాలా పెద్దదయినప్పుడు సగటు సంఖ్య 5కు మించి లెక్కల్లో పెద్ద తేడా వస్తుంది. ఏ రాజు తరువాత ఎవరు వచ్చారనేది తేలకుండా పోతుంది.

చంద్రగుప్త మౌర్యుడు క్రీస్తు పూర్వం 332లో తన రాజ్యాన్ని ప్రారంభించాడు. అదే నందులరాజ్యానికి చివరి దశ. అప్పటి నుండి, అంటే మహాపద్మనంద కాలం నుండీ కురుక్షేత్ర యుద్ధం వరకూ వెనక్కు వెళ్ళాలంటే 24 ఇక్ష్వాకులూ, 27 పాంచాలురూ, 24 కాశీలూ, 28 హైహయులూ, 32 కళింగులూ, 25 అశ్మకులూ, 26 కురులూ, 28 మైధిలులూ, 23 సూరసేనులూ, 20 వీతహోత్రులూ స్వీకరించాలి.

257 సమకాలీన రాజులను పరిగణనలోకి తీసుకుంటే, ఒక్కొక్కరికీ సగటున వంశానికి 26 రాజులను చూపవచ్చు. ఒక్కొక్క రాజుపాలన 18 సంవత్సరాలుగా అంచనా వేస్తే 468 సంవత్సరాలవుతుంది. నంద సామ్రాజ్యం క్రీ.పూ. 850 వరకూ వెనక్కు వెళ్ళవలసి ఉంటుంది. కురుక్షేత్ర యుద్ధానికీ, 10 సామ్రాజ్యాలకూ మధ్య మరికొందరు రాజులున్నారు. వారికొక 100 సంవత్సరాలు కలిపితే కలియుగం క్రీ.పూ. 950లో మొదలయినట్లు చెప్పవచ్చు. సగటు పరిమితి 25 సంవత్సరాలనుకొంటే క్రీ.పూ. 1132లో కలియుగం మొదలైనట్లు చెప్పాలి.

ఈ అంచనాలలో విపరీతమైన ఊహలున్నాయి. రాజులపాలన కాలపరిమితికి నిర్ధారణ లేదు. పురాణాల ప్రకారం నందసామ్రాజ్యం 100 ఏళ్ళున్నది. జైన లెక్కల ప్రకారం 150 సంవత్సరాలు, సిలోన్ అంచనాల ప్రకారం ఇది 22 ఏళ్ళు. మహాపద్మ పాలన 88 ఏళ్ళున్నదని కొందరు, 12 సంవత్సరాలు మాత్రమేనని మరి కొందరు అన్నారు.

వృద్ధగార్గ, వరాహమిహిర అనేవారు క్రీ.త. సుప్రసిద్ధ ఖగోళ శాస్త్రజ్ఞులు. కలియుగం ప్రారంభమైన తరువాత 653 సంవత్సరాలకు కురుక్షేత్ర యుద్ధం జరిగిందని వీరన్నారు. అంటే క్రీ.పూ. 244948లో అన్నమాట. దీనికి కాశ్మీరు చరిత్రకారుడు బి.సి. కల్హణ పూర్తి మద్దతునిచ్చాడు. కె.పి. జైస్వాల్ అనే చరిత్రకారుడు క్రీ.పూ. 1424లో జరిగిందన్నారు.

ఇలాంటి ఆధారాలను పురస్కరించుకొని కురుక్షేత్ర యుద్ధాన్ని నిర్ణయించటం, గీతా పారాయణం చేయటం అలేనిది. అయినా 1500 సంవత్సరాల పాటు యుద్ధకాల నిర్ణయానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. అందులో కొన్ని తేదీలు ఉదహరిస్తాను. ఆర్యభట్ట, భాస్కరాచార్య క్రీ.పూ. 3102 అన్నారు. సి.వి. వైద్య క్రీ.పూ. 3101; వృద్ధగార్గ, వరాహమిహిర, కల్హణ, బి.సి. సేన్ క్రీ.పూ 2444-48, జె.ఎస్. కరండికర్ క్రీ.పూ. 1922, బంకిమ్చంద్ర చటర్జీ, ధీరేంద్రనాధ్ పాల్ క్రీ.పూ. 15వ శతాబ్దం, ఎం. రంగాచార్య క్రీ.పూ 1468, పి.టి. శ్రీనివాసయ్యంగార్ క్రీ.పూ. 1450, హెచ్.టి. కోల్ బ్రూక్, లార్డ్ ఎల్ఫిన్సన్, హెచ్.హెచ్. విల్సన్, బాలగంగాధరతిలక్, శీతానాధ్ తత్వభూషణ్, ఆర్.సి. మజుందార్, హెచ్.సి. రాయ్ చౌదరి, పాల్టు, ఎ.యల్.భాషమ్ క్రీ.పూ. 14వ శతాబ్దం, ఎ.జి శంకర్ క్రీ.పూ 1198, విన్ సెంట్ స్మిత్ క్రీ.పూ. 1000.

ఇంకా ఎక్కువ చర్చ సాగిస్తే తేదీలతో పాటు గందరగోళం కూడా పెరుగుతుంది. ఈ చర్చలో పాల్గొన్న వారిలో వివేచనాపరులు కలియుగం కట్టుకథ అన్నారు. జె.ఎఫ్ ఫ్లీట్ ఈ విషయంలో ఆర్యభట్ట పై నెపం వేశారు. క్రీ.త. 498లో ఆంధ్రరాజ్యం అంతమైనప్పుడు ఇలాంటి ప్రయత్నాలు జరిగాయని కె.పి. జైస్వాల్ అన్నాడు. కలియుగ ఆరంభాన్ని గురించిన అంచనాలు భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞుల కృత్రిమ లెక్కలపై ఆధారపడ్డాయన్నారు. దీనికి కౌరవ, పాండవ సంఘర్షణలు జోడించారు. మొత్తం మీద కలియుగ భావన నమ్మకంతో అల్లిన కథ మాత్రమే.

భ్రమల భయం

పురావస్తు శాస్త్రం మాట్లాడదు. కాని సత్యాన్ని బయట పెడుతుంది. సాహిత్యానికి అలంకరణలు చేసే స్వభావం ఉన్నది. అందులో గాథలూ, ఇతిహాసాలలో ఉపమానాలూ, అలంకారాలూ, గజి బిజిగా అల్లుకొని ఉంటాయి. కనుక, ప్రాచీన చరిత్రల గురించి రాసేటప్పుడు సాహిత్యంలో సాక్ష్యాధారాలను అతి జాగ్రత్తగా స్వీకరించాలి. ఇతర ఆధారాలతో ముఖ్యంగా పురావస్తుశాస్త్రంతో సరితూగుతున్నదో లేదో గమనించి చేబట్టాలి.

సుమేరియా చరిత్రకారులు ఇలాంటి జాగ్రత్త వహించారు. అలాగే ప్రాచీన దేశాలైన బాబిలోనియా, అస్సీరియా, ఈజిప్టు, ఫినీషియా, క్రీట్, మీడియా, ఫైరియా, లిడియా, కార్తేజ్, గ్రీస్, రోమ్, పర్షియా, చైనాకు సంబంధించిన చరిత్రకారులు తగు జాగ్రత్త తీసుకోలేదు. భ్రమలంటే వారు భయపడ్డారా? రెండువేల సంవత్సరాలపాటు పుక్కిటి పురాణాల మధ్య మనం నివశించాం. అదే మనకు ఔషధంగా మారింది. మోతాదు ఎక్కువై భ్రాంతిలో పడ్డాం.

ప్రస్తుతాన్ని పక్కకు నెట్టి, గతాన్ని భజన చేస్తున్నాం. అయోధ్య గొప్పతనాన్నీ, హస్తినాపురం వెలుగుల్నీ చెప్పుకొంటున్నాం. ఇంద్రప్రస్తలోని మయసభను గురించి పొగుడుకుంటున్నాం.

గతాన్ని తవ్వితీసి ఆర్యులను గురించి తెలుసుకుంటే, వాస్తవాలెన్నో బయటపడతాయి. రాముడూ, కృష్ణుడూ పాలించిన స్వర్ణయుగాల భ్రమలు చెదిరిపోతాయి. రామాయణ మహాభారతాలకు చెందిన స్థలాలను తవ్వినప్పుడు అలాంటి సత్యాలు బయటకొస్తున్నాయి. భారతదేశానికి దండయాత్రీకులుగా వచ్చిన ఆర్యుల నాగరికత గురించి పుక్కిటి గాథలు బట్ట బయలు అవుతున్నాయి. దేశంలో ఉన్న ప్రజలు నాగరికులుగా, దాడి చేసిన వారు ఆటవికులుగా చరిత్ర చూపుతున్నది. హరప్పా ఉన్నత నాగరికతను ఆర్యులు ధ్వంసం చేశారు.

ఆ తరువాత వెయ్యేళ్ళకుగాని మగధ సామ్రాజ్యం తలెత్తలేదు. హరప్పా, మొహెంజొదారో వంటి నగారాలు, కాళీ బంగాన్, రంగపూరు వంటి పట్టణాలు, లోతల్ వంటి రేవులు మళ్ళీ రాలేదు. ఆర్యులు మట్టి ఇళ్ళలో ఉంటూ, కుండల్లో వండుకుని, తాగటానికీ, తినటానికీ మట్టిపాత్రలు వాడారు. నగర జీవితానికి, సౌకర్యాలకూ వారు దూరం. వారి సంస్కృతి పేదది. గ్రామాలలో నివశిస్తూ, ఆవుల్ని పెంచుకున్నారు. ఆవులే వారికి సంపద, ప్రతిష్టాకరమైన విలువ ఇచ్చాయి. సోమరసం ఆరగించేవారు. ఆర్యుల సంస్కృతి అల్పస్థాయిలోనే వుండేది.

మెసపొటోమియాలో అమరుల వలె ఆర్యులకు కూడా నగరం అంటే తెలియదని, స్టూవర్ట్ పిగాట్ రాశాడు. (Pre Historic India, by Piggort Stavart 1962. p 265) సర్ మార్టిమర్ వీలర్ గొప్ప పురావస్తు శాస్త్రజ్ఞుడు. ఆర్య సంస్కృతి గుర్తించదగినంత గొప్ప సంఘటనగా విడదీసి చూపటానికి ఆధారాలేవీ కనిపించటం లేదని రాశాడు. (Mortimer Wheeler : Civilization of the Indus Valley. London, 1966. p 97).

రామ, కృష్ణ భక్తులు ఈ విదేశీ శాస్త్రజ్ఞుల రచనలను పరిశీలించి వారు తప్పు అని రుజువు చేయగలిగితే బాగుండును. రామాయణ, మహాభారతాలకు సంబంధించిన స్థలాలను తవ్వి అలా చేస్తే సంతోషించవచ్చు. కాని, చెదురుమదురుగా లభించిన పూసలూ, రంగులు వేసిన కుండలూ, 12 గదులలో కూడిన మట్టియిళ్ళూ చూపి అదే గొప్ప సంస్కృతిగా ఆకాశానికి ఎత్తే ప్రయత్నాలు చేస్తున్నారు. మగధ సామ్రాజ్యం తలెత్తే వరకూ ఆర్యుల సంస్కృతి నిస్సందేహంగా అల్పస్థాయిలో కొనసాగింది.

క్రీ.పూ. 8వ శతాబ్దంలో గంగానది వరదల వలన నాగరికతంతా కొట్టుకుపోయినట్లు పురాణాల్లో రాసిఉందని చెపుతున్నారు. అప్పుడు కౌరవుల రాజధాని కొశాంబీకి మారిందట. హస్తినాపురం వద్ద తవ్వకాలలో యిది బయటపడిందంటున్నారు. హస్తినాపురాన్ని పురాణాల ప్రకారం హస్తినుడు స్థాపించాడు. దుష్యంతుడికీ, అతడి కుమారుడు భరతుడికీ హస్తినాపురం రాజధాని అన్నారు. పురాణాల వంశ పారంపర్య జాబితాలో దుష్యంతుడి తరువాత 5వ వారసుడుగా హస్తినుడు వచ్చాడు. అతడు స్థాపించిన రాజధాని ముత్తాతల రాజధాని ఎలా అవుతుంది? పురాణాలన్నీ యిలాంటి అసంగతాలతోనే ఉన్నాయి. (Amar Chan : Hastinapura. Banares, 1952. p 7, 8).

భారీ కట్టడాల అవశేషాలు భౌతిక సంస్కృతికి చిహ్నాలు. అలాంటివి హస్తినాపురంలో లేవు. ఎ.ఘోష్ ఇలా హెచ్చరించాడు. మహాభారతగాథల గురించి పురావస్తు శాఖ త్రవ్వకాల ద్వారా సాక్ష్యాధారాలు అందించినట్లు

చెపుతారు. అలాంటి నిర్ణయాలకు రావటం తొందరపాటవుతుంది. కౌరవుల రాజధాని హస్తినాపురం భారీ వరదల వలన కొట్టుకుపోయిందని కథలు అల్లారు.
ఇతిహాసాల సంప్రదాయాలను సమర్థించుకోటానికి పురావస్తుశాఖ పరిశోధనలను అడ్డం పెట్టుకోవాలి! (A Ghosh : Ancient India. No. 11-12 New Delhi, 1954-55. p 3).

మన ప్రాచీన గ్రంథాలు ఎంత పెద్దగా ఉంటే వాటి భాష్యాలు, వాటి చరిత్ర కాలక్రమం, భూగోళం అంత చిలవలు పలవలుగా ఉంటుంది. మన సనాతనులు గుడ్డిగా వాటిని అనుసరిస్తారు.

ప్రాచీన భారత చరిత్రలో మహాభారత యుద్ధం ప్రథమ అధికారిక సంఘటనగా సి.వి. వైద్య పేర్కొన్నారు. దీనిని ఎవరూ సందేహించటం లేదన్నారు. (CV Vaidya : The Mahabharata War Bombay, 1929.p55) ఆ సంఘటన మాత్రమే కాదు, అది జరిగిన తేదీలు సహితం ప్రశ్నార్థకంగానే మిగిలాయి. చరిత్రకారుడు విన్సెంట్ స్మిత్ రాస్తూ మౌర్య సామ్రాజ్యం తలెత్తటంతో చరిత్రకారుడు అంధకారంలోంచి వెలుగులోకి వచ్చినట్లయింది. తేదీలు నిర్దుష్టంగా తెలిసాయి. (Vincent Smith : The Oxford History of India. 1958. p 95).

సనాతనులకు అలాంటివి మింగుడు పడవు. సూర్యవంశం నుండి దిగివచ్చిన క్షత్రియులు కేవలం ఆర్యవంశం ప్రాచీన భారతదేశంతోపాటు యావత్తు ప్రపంచాన్నీ పరిపాలించారన్న వారే షట్ చక్రవర్తులు. చంద్రగుప్త మౌర్యులతో ప్రారంభించటం విన్సెంట్ స్మిత్ వంటి యూరోపియన్ల కుట్రమాత్రమే అన్నారు. అలెగ్జాండర్తో సమకాలీనులైన చంద్రగుప్తుడు మౌర్యవంశానికి చెందడనీ, అతడు గుప్తవంశంవాడనీ అన్నారు. క్రీ.పూ. 4 వేల సంవత్సరాల క్రితం గుప్త సామ్రాజ్యం ఉన్నదన్నారు. దీనికి పంచాంగాలూ, పురాణాలూ ఆధారాలన్నారు. ద్వాపర, కలియుగాల మధ్య క్రీ.పూ. 3102లో మహాభారత యుద్ధం జరిగిందన్నారు. దీనివలన ఒక వెయ్యి సంవత్సరాలు అశోకుడిని వెనక్కు నెట్టినట్లయిందని ఎ.ఎ. మెగ్డానెల్ అన్నాడు. (A A Macdonell: India's Part. Varanasi, 1956).

1966లో విల్లర్ ఎఫ్. హెచ్. లిబి అనే రసాయన శాస్త్రజ్ఞుడికి కార్బన్ 14 డేటింగ్ కనుగొన్నందుకు నోబుల్ బహుమానం వచ్చింది. గతాన్ని తెలుసుకోడానికి ఇతని ప్రక్రియ చాలా వరకు ఉపయోగపడుతున్నది. 40 వేల సంవత్సరాల వరకు కనుగొనే అవకాశం లభించింది. (Libbi Willar FH : The Frontiers of Knowledge. Newyork, 1975). ఈ విధానంలో దోషాలు కూడా అనల్పంగానే ఉన్నాయి. అది అంగీకరిస్తే ప్రాచీన భారత చరిత్ర తెలుసుకోటానికి పంచాంగాలూ పక్కన పెట్టాల్సిందే. చరిత్రకారుల ముసుగులో వైద్య వంటి వారెందరో పుక్కిటి గాథల్ని చరిత్ర తొడుగుతో చూపారు. అలాంటి వారిని గమనంలోకి తీసుకోరాదు. వారికి ప్రాధాన్యత యిస్తే, చెత్తాచెదారానికి ప్రాముఖ్యత యిచ్చినట్లే.

అర్థాన్ని మన కార్బన్ 14 డేటింగ్ విధానంలో సర్ విలియం జోన్స్ భారత చరిత్ర కాలాన్ని సరిగ్గా చూపాడు. చంద్రగుప్త, అలెగ్జాండర్ సమకాలీనతను నిర్ధారించాడు. అశోకుని శాసనాలు తెలుసుకోటానికి బ్రహ్మీ, ఖరోష్టి లిపి జేమ్స్ ప్రిన్ సెప్ వెలుగులోకి తెచ్చాడు. ప్రాచీన భారత భౌగోళిక విషయాలను ఏర్చికూర్చిన ఖ్యాతి అలెగ్జాండర్ కానింగ్ హాంకు దక్కింది. ప్రిషాల అంటే శూద్ర అనీ, పాపపంకిలుడనీ నిఘంటువులు పేర్కొన్నట్టు ఎందరికి

తెలుసు? దేవానాం ప్రియ అనే అశోకుని బిరుదు శాసనాల పై ఉన్నది. దానికి ఉన్మత్తుడు అనే ఇతిహాసాలూ, పురాణాలూ అంటగట్టాయని ఎందరికి తెలుసు?

కురుక్షేత్ర యుద్ధం బహుశ పుక్కిటి పురాణమే కావచ్చు. క్రీ.పూ. వెయ్యి సంవత్సరాలలో ఒకవేళ ఇది జరిగే ఉంటే, కేవలం ఆర్య తెగల మధ్య కలహమే తప్ప యుద్ధం మాత్రం కాదు. వేదసాహిత్యంతో దీని ప్రస్తావన లేదు. ఈ కలహం కూడా కురుపాండవులు మధ్య అయి ఉండదు. మహాభారత అధ్యయనపరులు ఇలాంటి భావాలను వెల్లడించారు.

విన్ సెంట్ స్మిత్ మహాభారత యుద్ధాన్ని చారిత్రకేతర కథగా భావించాడు. ఆల్ బ్రెట్ వెబర్ ఆర్య తెగల కలహంగానే భావించాడు. (Albrecht Weber: The History of Indian Literature, London, 1914, p 187) రోమిలా థాపర్ దీన్ని కేవలం స్థానిక ముఠా తగాదాగా చెప్పింది. (A History of India, 1968) బాషమ్ దీన్ని యుద్ధంగా పేర్కొన్నప్పటికీ అతిశయోక్తులే చాలా జోడించారు అన్నాడు. కురుక్షేత్ర యుద్ధం కౌరవులకూ, పాంచాలురకూ మధ్య జరిగిందనీ, దీనికి పాండవులను జోడించడంలో బ్రాహ్మణాసక్తి ఉన్నదనీ క్రిస్టియన్ లాసన్ రాశాడు. (PreMusalman India, Vol-II, Vedic India, part I, Madras, 1937) మహాభారతాన్ని సాంతంగా పరిశీలించిన పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి (పిఠాపురం) కూడా అలాంటి అభిప్రాయానికే వచ్చారు. దీని అంతటిని బట్టి కురుక్షేత్ర యుద్ధానికి సంబంధించిన చరిత్ర, తేదీలు, పాల్గొన్నవారూ అన్నీ సందేహాస్పదాలే. అలాగే కృష్ణుడు, గీత కూడా. మన ప్రాచీన భారత చారిత్రక తేదీలను నిర్ధారించే ప్రయత్నం కొందరు సనాతనులు చేస్తూనే ఉన్నారు. ఎ.డి. పుసల్కర్ పాషండుడూ కాదు. సందేహవాదీ కాదు. అతడు ఇలా అన్నాడు. "మహాభారతానికి సంబంధించి గ్రహనక్షత్రాలను ఆధారంగా తేదీలు నిర్ణయిస్తున్నారు. దీనివలన భిన్న ఫలితాలు వచ్చాయి. పరస్పర విరుద్ధ వాస్తవాలు బయట పడ్డాయి. కనుక అలాంటి వాటిని ఉత్తరోత్తరా ప్రవేశపెట్టినట్లు భావించి నిరాకరించాలి. (A D Pusalkar : History and Culture of the Indian People. Vol-I. Vedic Age. p 269)

పుసల్కర్ చేసిన విమర్శల వంటివి భారతదేశానికే పరిమితం కాలేదు. క్రీ.పూ. 4004 మార్చి 23న బైబుల్ ప్రకారం భగవంతుడు ఆడంను సృష్టించినట్లు బిషప్ ఆషర్ ప్రకటించారు. అతని ప్రేరేపణతో గాబోలు, వెలంది గోపాలయ్యర్ కురుక్షేత్ర యుద్ధం క్రీ.పూ. 1194 అక్టోబరు 14న మొదలయిందన్నాడు. కలియుగం క్రీ.పూ. 312 ఫిబ్రవరిలో ఆరంభమయిందనీ, ఆ తరువాత 36 ఏళ్ళకు కురుక్షేత్ర యుద్ధం జరిగిందనీ, మరొక పండితుడు ప్రకటించాడు. (S B Roy : Ancient India, New Delhi, 1975) అతడి ప్రకారం క్రీ.పూ 3227 వరకూ కృష్ణుడు 125 ఏళ్ళు బ్రతికాడన్నాడు. కృష్ణుడు చనిపోయిననాడే కలియుగం మొదలయిందన్నారు. ఆదాయపు పన్ను అధికారిగా రిటైరయి అతడు ఇలాంటి తేదీల నిర్ణయానికి పూనుకున్నారు. ఇండియా అనే భారతదేశం అలాంటివారితో నిండి ఉన్నది. వారికి నమోవాకాలు.

పెనుభూతం

కిప్లింగ్ కైరోవద్ద పిరమిడ్లను పెనుభూతం వంటిదిగా అభివర్ణించాడు. మహాభారతానికి అదే వర్తించవచ్చు. పిరమిడ్ ఏడు అద్భుతాలలో ఒకటైతే, మహాభారతం 18 పర్వాలలో, లక్ష శ్లోకాలలో ఉన్నది. ఒకప్పటి పిరమిడ్ పవిత్రత కోల్పోయి యాత్రికుల ఆకర్షణ స్థలంగా మారింది. మహాభారతానికి ఇంకా కొనసాగుతున్న పవిత్రత భారతదేశానికి పెద్ద ఉపద్రవం వంటిది. భారతీయుల జీవితాన్నీ, ఆలోచననూ అణచివేసే భారంగా అది తయారయింది.

మహాభారతం శతాబ్దాలుగా నేటి పెనుభూతస్థాయికి ఎలా చేరుకున్నదో గమనించాలి. వ్యాసుడు 8800 శ్లోకాలు చెప్పి జయ అని నామకరణం చేశాడు. వైశంపాయనుడు 24 వేల శ్లోకాలకు పెంచి భారతం అని పేరు పెట్టాడు. సౌతుడు లక్ష శ్లోకాలు పూర్తి చేసి మహాభారతంగా రూపొందించాడు. మధ్యలో మరెందరో జోక్యం చేసుకొని యధాశక్తిని కలిపారు.

ఒక రచయిత కృషిలో జోక్యం చేసుకొని, రూపురేఖలే మార్చేసి, ముఖ్య సందేశాన్ని తారుమారు చేయటం హీనమైన నేరం. ప్రాచీన కాలం నుండి ఈ ఆధ్యాత్మిక దేశంలో అది సాగిపోతూనే వున్నది.

మతగ్రంథాలూ, ధర్మసూత్రాలూ, రాజకీయ, ఆర్థిక రచనలూ, ఇతిహాసం, పురాణం అన్నీ యిలా మార్చేసారు. ఆ విధంగా చేయటంలో ప్రజాశక్తిని పెంపొందించినట్టూ, స్వర్గంలో స్థానం ఏర్పరచుకొన్నట్టూ భావించారు. అచ్చుయంత్రాలు వచ్చినా ఈ విధానం ఆగలేదు.

మహాభారతం ఒక పెద్ద గేయం. సినిమా, రేడియో, టెలివిజన్, డ్రామాలు లేని రోజుల్లో గేయాలు పాడుకుంటూ కాలక్షేపం చేసేవారు. నాయకులూ, దేవుళ్ళూ కథావస్తువులుగా ఉండేవి.

రాజుల కొలువుల్లో సూతులు ఈ రచనలు చేస్తూ పోయారు. యజ్ఞయాగాదులలో వీరి అవసరం ఉండేది. సంవత్సరాల తరబడి యజ్ఞాలు సాగుతుండగా విసుగు పుట్టకుండా గేయాలు పాడేవారు. రాజుల తృప్తి కోసం ఆ గేయాలను మారుస్తుండేవారు. మహాభారతం, రామాయణం పురాణాల కథాకాలక్షేపం అలా సాగేది.

తొలుత ప్రాకృతంలో ఉన్నదంతా తరువాత సంస్కృతంలోకి మార్చారు. సూత్రధారుల స్థానంలో బ్రాహ్మణులు వచ్చారు. స్తోత్ర పాఠాలలో అర్థాన్నీ, సందేశాన్ని మార్చివేశారు. భూసురులుగా తమ స్థానాన్ని భద్రపరుచుకున్నారు. దేవుళ్ళకు మించి తమకు ఉన్నత స్థాయి ఉన్నట్లు భృగులు తిరగరాసుకున్నారు. (Iravati Karve: Yuganta. Poona, 1966, P5) అందులో ఒకరు విష్ణువు వక్షస్థలాన్ని తన్నినట్లు, బ్రహ్మ-శివులను అణచి పెట్టినట్లు పేర్కొన్నారు. (Vemuri Sreenivasa Rao : Purvagatha Lahari. Madras, 1952. p 327-328)

జర్మనీలో హెర్మన్ బర్గ్ బుద్ధుని పై నిశిత పరిశీలనా చరిత్ర ప్రచురించారు. మహాభారతం చిన్న ఇతిహాసంగా ప్రారంభమై, భయానకంగా, గందరగోళంగా మారిందని అన్నాడు. వి.ఎస్.సుక్తాంకర్ ఇతడి ప్రస్తావన చేశాడు.

మహాభారతాన్ని క్రమబద్ధంగా విశ్లేషించిన వాడు హాప్ కిన్స్. ఇతడు ఇలా అన్నాడు. "ఈ ఇతిహాసం మనకెలా చేరింది? ప్రతి అధ్యాయమూ మార్పులకు గురై విస్తరించి ప్రక్షిప్తాలు చోటు చేసుకొని, హద్దూ పద్దూ లేకుండా ప్రతి లేఖకుడూ సొంత రచనలను ప్రవేశపెట్టి కలగా పులగం చేశాడు.(EW Hopkins : The Great Epic of India. Calcutta, 1969. p 400) విన్ సెంట్ స్మిత్ ప్రకారం నేటి లక్ష శ్లోకాలలో 20 వేలు మాత్రమే కురుపాండుల సంఘర్షణకు సంబంధించినవి. మిగిలినదంతా కలిపారు. (Vincent Smith : Oxford History of India. London, 1958. p57).

మహాభారతంలోని మూల అంశం ఎప్పుడు రచించారు? విస్తరణ ఎప్పుడు, ఎలా జరిగింది? ఎప్పుడు ఆగింది? ఈ మార్పులన్నింటికీ కారణం ఏమిటి?

భిన్న పండితులు విభిన్న అభిప్రాయాలు వెల్లడించారు. పాణిని కాలంలో మహాభారతం సంస్కృత ఇతిహాసంగా లేదు. మహాభారతం అనే పదాన్ని పాణిని తన వ్యాకరణంలో విశేషణంగా వాడాడు. వాసుదేవుడిని, అర్జునుడిని దేవుళ్ళుగా ప్రస్తావించారు. యుధిష్ఠిరుని మాట గూడా ఉన్నది. (Max Muller : A History of Sanskrit Literature. Varanasi, 1968). అంటే కృష్ణుడితో పాటు అర్జునుడిని గూడా దేవుడుగా కొలిచారు.

పాణిని వ్యాకరణంలో కుంతి, మాద్రీ ప్రస్తావన పాండురాజు భార్యలుగా కాదు. కుంతల ప్రాంతం నుండి కుంతి, మద్ర ప్రాంతం నుండి మాద్రి వచ్చినట్లున్నది. (Radha Kumud Mukherjee : Hindu Civilization. Bombay, 1950. p 141). భారతం, మహాభారతం అనే ప్రస్తావన తొలుత అశ్వలాయన గృహ్యసూత్రాలలో ఉన్నది. ఇది కూడా మధ్యలో ప్రవేశ పెట్టిందేనని వెబర్ అన్నాడు. (Albrecht Weber: The History of Indian Literature. London, 1914, p 189). ఏమైనా యీ సూత్రం ఎప్పుడు వచ్చిందన్నది కూడా నిర్ధారణ కాలేదు.

పాణిని ముందు సంస్కృత ఇతిహాసంగా మహాభారతం లేదు. ఈ వ్యాకరణ శాస్త్రజ్ఞుడు ఎప్పటి వాడో సరైన కాలనిర్ణయం లేదు. (V Rangacharya : Pre-Musalman India. Vol II. Part I, Vedic India. Madras, 1937.p69,70). క్రీ.పూ. ఐదవ శతాబ్దంలో ఉండవచ్చునని భావిస్తున్నారు.

మహాభారతం పాణిని అనంతరం క్రీ.పూ. 4-3 శతాబ్దాల మధ్య వచ్చి ఉండవచ్చునని రాప్సన్, బార్నెట్, హాప్కిన్స్, మెగ్డోనెల్, వింటర్నిట్జ్ పండితులు భావిస్తున్నారు. వెబర్, వైద్యా అభిప్రాయం ద్వారా చెప్పించారన్నారు. అశ్వమేధపర్వంలో క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందగా, రాధాకుముద్ ముఖర్జీ క్రీ.పూ. 2వ శతాబ్దానికి తెచ్చారు.

మహాభారతం నేటి అవతారం దాల్చింది క్రీ.త, 4,5 శతాబ్దాలలోనే. మార్పులూ, చేర్పులూ అన్నీ 4వ శతాబ్దం వరకూ జరుగుతూ వచ్చాయి. కలియుగంలో మనిషి పతనం ఆరంభం అయిందన్నారు. మహాభారతాన్ని అతి గౌరవంగా చూచే వి.యస్. సుక్తాంకర్ క్రీ.త. వెయ్యి వరకూ అనేక చేర్పులు చేశారంటూ ఒప్పేసుకున్నారు. భండార్కర్ ప్రాచీన పరిశోధనా సంస్థవారు ప్రచురించిన మహాభారతంలో చాలా చేర్పులు జరిగాయన్నారు. విష్ణు అవతార వర్ణన, భీష్ముడి వైష్ణవ ధర్మాల్ని తెచ్చి పెట్టారన్నారు. ఇవి 2500 శ్లోకాల వరకూ ఉన్నాయి. ఇటీవలే

యిలా జరిగినప్పుడు పూర్వకాలం యింకా ఎన్ని జరిగి ఉంటాయో ఊహించాల్సిందే. (V S Suktankar: On the Meaning of Mahabharata. Bombay, 1957. p 22).

అంధ విశ్వాసంతో సనాతనులు ఈ విధంగా యిష్టం వచ్చినట్లు మలుచుకుంటూ పోయారు. వ్యాస మహాభారతంలో లక్ష శ్లోకాలున్నట్టు 5వ శతాబ్దంలో ఒక శాసనం పుట్టించారు. మార్పులేమీ జరగలేదని వాదించారు. ఈ సంఖ్యను అట్టిపెట్టటానికి పాతవాటిని కొన్నిటిని తొలగించటం, కొత్తవాటిని చేర్చటం సునాయసంగా జరిపారు.

వ్యక్తిగత దేవుడనే భావనను పెంపొందించాలనేది ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తున్నది. గౌతమబుద్ధుడు దేవుడున్నాడనీ, లేడనీ చెప్పలేదు. అతని శిష్యులు బుద్ధుడు చనిపోగానే అతడిని దేవుణ్ణి చేశారు. అతని జీవితాన్ని గురించి కథలు అల్లారు. వేద, బ్రాహ్మణవాదాన్ని దెబ్బతీసేటంతగా బౌద్ధం పెరిగిపోయింది. ఇందుకు మారుగా క్రీస్తుపూర్వం 3,4 శతాబ్దాలకు మధుర ప్రాంతంలో గోవుల్ని కాచుకునే తెగల నాయకుడిని అడ్డం పెట్టి దేవుణ్ణి చేశారు. ద్రౌపదీ స్వయంవరంలో హఠాత్తుగా మహాభారత కథలోనికి కృష్ణుడు వచ్చేశాడు. అప్పటి నుండీ కృష్ణుడు పెరిగిపోయి దేవుడయ్యాడు. అంతవరకూ కురురాజులకు అనుకూలంగా ఉన్న కథను పాండురాజుల వైపు తిప్పారు. జనమేజయుడి యజ్ఞంలో ఈ మార్పు జరిగినట్టు పిఠాపురానికి చెందిన పెండ్యాల శాస్త్రి, ప్రాచీన భారతాన్ని అధ్యయనం చేసిన పాశ్చాత్యులు భావించారు. జనమేజయుడు పాండు సంతతి వారు. ఉదారంగా దానాలు చేశారు. అతడికి తృప్తి నిచ్చేటట్లు కథను మార్చారు. ఐనా దోషాలు కనిపిస్తూనే ఉన్నాయి. సామాజిక అంతస్తులలో పురోహిత వర్గాన్నీ, ఉన్నత స్థాయిలో పెట్టటానికి ప్రయత్నించారు. మహాభారతం బ్రాహ్మణుల విజ్ఞాన సర్వస్వమని రప్సిన్ పండితుడు స్పష్టీకరించాడు. బౌద్ధ కాలాన్ని గురించి రాసిన రై డేవిస్ మహాభారతం పురోహితుల చేతుల్లో మార్పుచెందిందన్నారు. బౌద్ధుల వలన దెబ్బతిన్న ప్రతిష్ఠను పునరుద్ధరించడానికి బ్రాహ్మణులు యిలాంటి పనిచేశారు. ప్రజా బాహుళ్యంలో ఉన్న కథల్ని బ్రాహ్మణులు సానుభూతితో స్వీకరిస్తున్నారని చూపడానికి కూడా యిలా చేశారు. వేదసాహిత్యంలో లేనివన్నీ ఇందులో సజీవంగా ప్రవేశపెట్టారు. ఆర్యులకు సంబంధించిన ఈ అంశాలు మహాభారతంలో చోటు చేసుకున్నాయి. (Rhys-Davis : Buddhist India. Calcutta, 1955) ఏమైనా అమానుషంగా ప్రక్షిప్తాలు జరిపారు. గుప్తులకు ముందు మహాభారతాన్ని తిరగరాయటం గమనిస్తే ఆటవిక ఆచారమైన సతీసహగమనం కూడా తిరగదోడారని కోశాంబి అన్నారు. (An Introduction to the Study of Indian History) బ్రిటిష్ వారు శాసన బద్ధంగా నిషేధించిన సతి 150 సంవత్సరాల తరువాత తిరిగి ప్రవేశించింది. అలాగే భారతీయుల జీవితాన్ని ప్రభావితం చేయటంలో మహాభారతం పుస్తకాలను మించి పోయిందని సర్ పెర్సివల్ గ్రీవిల్స్ అన్నారు. పాండురాజు భార్యల మధ్య ఎవరు సతీసహగమనం చేయాలనే అంశంపై వివాదాన్ని మహాభారతంలో ప్రవేశపెట్టారు. దీన్ని తిరగరాసినప్పుడు తిరోగమన ప్రభావం ఘోరంగా పరిణమించింది. కులధర్మంగా చంపేయమని భగవద్గీత బోధించింది కూడా మహాభారతంలో తెచ్చి పెట్టారు.

లోగుట్టు

కోటలోకి ప్రవేశించాలంటే ప్రహరీగోడలు పగులగొట్టాలి. మహాభారతం పై దాడి చేసి, అది అబద్ధాల పుట్టఅనీ, మోసపూరితమనీ చూపితేగాని గీతను ఎదుర్కోలేము. చుట్టూ అల్లిన నాటకాన్ని పొరలు విప్పుకుంటూ పోతే, గీత బండారం బయట పడుతుంది.

మహాభారతం ఎన్ని వంకలు తిరిగినా చివరకు కురుక్షేత్రాన్ని చేరుకుంటుంది. అది యుద్ధరంగమే గాక, ధర్మక్షేత్రంగా పేర్కొన్నారు. ఉభయ సైన్యాలు ఢీకొన్నాయి. గుర్రాలు కదం తొక్కుతున్నాయి. ఏనుగులు ఘీంకరిస్తున్నాయి. రథాలపై పతాకాలు రెపరెపలాడుతున్నాయి. కాల్బలం పోరాటానికి సిద్ధంగా ఉన్నది. చెవులు గింగురుమనే ధ్వనులు వినిపిస్తున్నాయి. అలాంటి భూమికలో తాను ఎదుర్కొనవలసిన వారిని పరిశీలించటానికి గాను రథాన్ని పక్కకు తిప్పమని అర్జునుడు శ్రీకృష్ణుణ్ణి కోరాడు. ఎదుట తండ్రులనూ, తాతలనూ, గురువులనూ, బంధుమిత్రులను తిలకించాడు. అతడికి నోటమాట రాలేదు. నాకు విజయం సాధించాలని లేదు. రథాన్ని వెనక్కుతిప్పమని కోరాడు. కృష్ణుడు నవ్వి గీతాబోధన ప్రారంభించాడు. కురుక్షేత్రం మౌనం దాల్చింది. అందరూ గీతను విన్నారు.
ఈ నాటక రంగాన్ని తొలగిస్తే, గీతలో ఏమి మిగిలింది? నేనే దేవుణ్ణి, సత్యాన్నీ, జీవితాన్నీ, మార్గాన్నీ అంటూ కృష్ణుడు చెప్పాడు. మహాభారతంలోకి గీతను ఎవరు తొలుత చొప్పించారో గాని అతడు గొప్ప మానసికవేత్త. పి.డి. మెహతా వ్యాఖ్యానిస్తూ తాత్త్విక గీతాలాపనకు ఎంపిక చేసుకున్న దృశ్యం చాలా ఆకర్షణీయమైందన్నాడు. (PD Mehta : Early Indian Religious Thought. London, 1956. P246).

మహాభారతాన్ని రాజగోపాలాచారి, మునీ, సుక్తాంకర్ అభినందించినట్లు నేను చేయలేను. గీతవారి దృష్టిలో గొప్పది కాగా, మహాభారతం నీతి కూడలి. కాని, ప్రపంచంలోని ఇతిహాసాల్లో అంత గందరగోళమయింది మరొకటి లేదు. అది కలగాపులగం అని హాప్కిన్స్ అన్నాడు. పురోహితులతో సహా ఎందరో జోక్యం చేసుకున్నారు. సూతులు దీని తొలిరచయితలు, వారు కవులు. సామాన్య ప్రజలను ఆకట్టుకున్నారు. వారి దృష్టిలో ఒక యుధిష్ఠిరుడు, ఒక భీముడూ, ఒక దుర్యోధనుడూ, సంజయుడూ, శకుని ఉన్నారు. వారి దృష్టిలో ద్రౌపది చాలా గొప్పది. మహాభారతానికి తొలి ఆకర్షణ ఆ పాత్రలే.

మహాభారతాన్ని ఉన్నత నీతి గ్రంథంగా పేర్కొనటం ఘోరమైన విషయం. సుక్తాంకర్ వంటివారు అందులో స్వర్ణ సంపదను చూచారు. బాణుని కాలంలో ఇది విద్యాగ్రంథంగా ఉపకరించింది అన్నారు. (V S Suktankar : The Meaning of the Mahabharata) బాణుడు ఏడవ శతాబ్దంలోనివాడు, రాజరికంలో నివసించాడు. ఫ్యూడల్ సాంఘిక ఆర్థిక వ్యవస్థ ఉన్నది. ఐనా, మహాభారతాన్ని నేడు మన పాఠ్యగ్రంథంగా ఉంచాలని సుక్తాంకర్ కోరుకుంటున్నారు. బహుళ ప్రచారం నిమిత్తం రాజగోపాలాచారి వీటిని అనువదించాడు. మునీ తన చివరి దశలో కృష్ణావతారం పేరిట ఏడు సంపుటాలు ప్రచురించాడు. ఇలాంటి వారు మన మధ్య లక్షలాదిగా వున్నారు. వారిది ఫ్యూడల్ మనస్తత్వం. ప్రాచీన సమాజాన్ని అట్టేపెట్టాలన్న స్వార్థచింతన ఉన్నది. మహాభారతాన్ని పాఠ్యగ్రంథంగా, గీతను పవిత్ర గ్రంథంగా కోరుకుంటున్నారు. ప్రపంచ చరిత్రను చదివి పాఠాలు నేర్వటం వారికిష్టం లేదు. జర్మనీ రసాయనిక శాస్త్రజ్ఞుడూ, వైద్యుడూ పరాసిలస్ 15వ శతాబ్దంలో ప్రాగ్లో వైద్యం పై తన

ఉపన్యాసాలు ప్రారంభించే ముందు హిపోక్రిటస్, గాలెన్ పుస్తకాలను తగుల బెట్టాడు. ఆధునిక వైద్యానికి నాందిపలికిన ధోరణి అది. మృతప్రాయమైన మన గతాన్ని అలా వదిలేస్తే గాని, ఆధునిక భారతదేశం ఆనిర్భవించదు. మానవ నాగరికతలో ప్రాచీన గాథలకు స్థానమున్నది. బ్రోనిస్లా మాలినోవిస్కీ స్తూప్రాచీన సంస్కృతిలో గాధలకు స్థానం ఉన్నదనీ, నమ్మకాలను క్రోడీకరిస్తుందనీ చెప్పా. ఆనాటి మానవుడికి మార్గగామి అయిన గాథలు చాలా ముఖ్యదశను చూపుతున్నాయి. అతడు ఆదిమ సమాజాన్ని గురించి ఈ మాటలన్నారు. మన సమాజం.

నేడు ఆదిమస్థితిలో లేదు. అలాంటప్పుడు ప్రాచీన గాథల్ని నేడు యథాతథంగా స్వీకరిస్తే ఎవరో కొందరు ఉన్నతస్థాయిలో కొనసాగటానికి ప్రయత్నించటమే అవుతుంది. (Bronislew Malinowski : Magic, Science and Religion and other Essays. New York, 1954. p101). గాథలు సామాజిక వడిదుడుకులలో, హెచ్చుతగ్గులలో పనిచేస్తాయని కూడా అన్నారు. అలాంటి స్థితి నేడు మన సమాజంలో ఉన్నది. వాటిని తొలగించి సమసమాజాన్ని ఏర్పరచాలంటే పాతవ్యవస్థను పోగొట్టాలి.

కృష్ణుడెవరు?

కృష్ణుడెవరు అని ప్రశ్నించటం అసందర్భం కాదు. హిందూ మత కృతుల్లో, కవితలు, పాటలు, నృత్యాలు, నాటకాలు, శిల్పం, చిత్రాలు రూపకంగా హిందూ జీవన రంగంలో కృష్ణుడి ఆధిపత్యం వ్యాపించింది.
హెర్మన్ ఓల్డెన్బర్గ్ కృష్ణుడు ఎవరు అని ప్రశ్న వేశాడు. కృష్ణుడికి పోటీగా రాముడున్నా, హైందవేతరుల్లో రాముడుకి భక్తులు అట్టేలేరు. క్రీ.పూ. రెండవ శతాబ్దంలోనే వాసుదేవుని పేరిట గ్రీకులు పూజలు చేశారు. (Cambridge History of India, Vol-I) క్రైస్తవులలో సహితం కృష్ణుడి ప్రభావం ఉన్నది. కమ్యూనిస్టు లోకంలోనూ ఇది వ్యాపించింది. భారతదేశం నుండి ఎగుమతి అవుతున్న వాటిల్లో యిది ముఖ్యమైనది. అమెరికాలో కృష్ణచైతన్య పేరిట మాదకద్రవ్య సంస్కృతిలోకి ప్రవేశించింది. సర్వరోగనివారిణిగా ప్రచారంలోకి వచ్చింది. కృష్ణచైతన్యను ప్రచారం చేయటానికి అమెరికాలోని ఫోర్డ్ కుటుంబంవారు కోట్లాది రూపాయ లిచ్చారు.

కృష్ణుడెవరు అని అడగటం సులభమేగాని, సమాధానం అంత సులువు కాదు. బిపిన్ చంద్రపాల్ ప్రయత్నించి ఇంకా ఉచ్చులో బిగుసుకుపోయాడు. (Bipin Chandra Pal : Sree Krishna, 1963). కృష్ణులు చాలా మంది ఉన్నారు. సిసలైన వాడెవరో తేల్చటం కష్టం. వేద కాలంలో ఒక కృష్ణుడు ఆర్యరుషికాగా, మరొకరు ఆర్యేతరులు. రుషిగా ఉన్న కృష్ణుడికి విశ్వకుడు అనే కుమారుడు, విష్ణవుడు అనే మనుమడు ఉన్నారు. ఈ మనవడిని అశ్వనీ దేవతలు పునరుద్ధరించారు. (HH Wilson : Rigveda. Vol I. Bangalore, 1946. p 190). ఇందులో అశ్వనీ దేవతలను ప్రార్థన చేయటమే కృష్ణుడి పని. పౌరాణిక కృష్ణుడు తన గురువు సందీపుని సంతోషంతో సముద్రం అడుగుకు వెళ్ళి అతడి కుమారుడిని కాపాడుతాడు. (Vemuri Sreenivasa Rao : Purvagadha Lahari. Vijayawada, 1952. p 270).

ఆర్యేతర కృష్ణుడిని రుగ్వేదంలో రాక్షసుడిగా చిత్రించాడు. 10 వేల సైన్యం అతనికి ఉండేదట. ఆర్యుల దేవుడు ఇంద్రుడితో అంశుమతి తీరాన పోరాటం జరిపినప్పుడు కృష్ణుడు ఓడిపోయాడు. అది ఆర్యేతర కృష్ణుడికి చాలా

అపఖ్యాతి. పురాణాలలో దీన్ని తిరగదోడి విష్ణుపురాణం పేరిట కృష్ణుడు గెలిచినట్లు, ఇంద్రుడు ఓడినట్లు రాశారు. బృందావన గోపికలు ఇంద్రస్తుతి చేయడాన్ని కృష్ణుడు వ్యతిరేకించాడు. కుంభవృష్టిని కురిపించిన ఇంద్రుడి దాడినుండి తన వారిని సంరక్షించటానికి కృష్ణుడు గోవర్ధన గిరిని చిటికిన వేలుపై 7 రోజులు పాటు గొడుగుపట్టాడు. ఇంద్రుడు మేఘాలను పంపించి వేశాడు. ఇలాంటి కట్టుకథలకు పురాణాలు పెట్టింది పేరు.

ఉపనిషత్తుల్లో కృష్ణుడు దేవకీపుత్రుడుగా ఛాందోగ్యోపనిషత్తులో కనిపిస్తారు. అంగీరస శిష్యుడేనా ఈ కృష్ణుడు? అవునని ఆదిశంకరాచార్యుడంటాడు. (B Majumdar : Krishna in History and Legend. Calcutta, 1969. p 3). సనాతనుల దృష్టిలో శంకరాచార్యుడు చెప్పింది. తిరుగులేనిది. అంగీరసుని వద్ద కృష్ణుడు ఉపనిషత్తులు నేర్చాడు. పురాణాలను బట్టి కృష్ణుడి గురువు సందీప్. ఉపనిషత్తులను ఔపోసనం పట్టిన ఖ్యాతి కృష్ణుడికి దక్కితే, అంగీరసుడితో ముడిపెట్టక తప్పదు. శంకరాచార్యుడు మొదలు హేమచంద్రరాయ్ చౌదరివరకూ ఆ పనే చేశారు. (Hema Chandra Roy Chaudhury : Materials for the History of the Vaishnava Sect. New Delhi, 1975). ఛాందోగ్యంలో, గీతలో కొన్ని పోలికలు ఉన్నాయి. గనుక రాయ్ చౌదరి అలా అభిప్రాయపడ్డాడు.

ఆ విధంగా చూస్తే మరి కొందరు ఉపనిషత్ రుషులకు కూడా కృష్ణుడు శిష్యుడేనని భావించాలి. ఎ.ఎస్.పి. అయ్యర్ ఇలా అంటాడు. "అంగీరసుడికి గుణపాఠం చెప్పాలని భావించిన కృష్ణుడు శిష్యుడిగా వెళ్ళాడు. అతడి గ్రహణ శక్తిని గురించి ఆశ్చర్యపడిన అంగీరసుడు నేను చెప్పదగినదంతా నేర్చుకున్నావు. ఇక వెళ్ళవచ్చును అన్నాడు. అందుకు శ్రీ కృష్ణుడు పెద్ద ఉపన్యాసమే యిచ్చాడు. యాజ్ఞవల్క్యుడు గార్గితో చెప్పిన విషయాన్ని ప్రస్తావించాడు. నిగూఢ సత్యాలను అచ్యుతుడు గ్రహించినట్లు అంగీరసుడు స్తుతించాడు. (A S P Ayyar : Sri Krishna, The Darling of Humanity. Madras, 1952, P26) ఛాందోగ్య ఉపనిషత్తులో ఎంత వెదికినా అయ్యర్ అల్లిన కథ కనిపించకపోవచ్చు. బ్రహ్మసమాజవాదిగా ఉన్న బిపిన్ చంద్రపాల్ వైష్ణవుడిగా మారి కృష్ణుడిని అంగీరసుడికి శిష్యుడిగా చేశాడు. మూడవ కృష్ణుడు మహాభారతంలో, హరివంశంలో కనిపిస్తాడు. ద్వంద్వ వ్యక్తిత్వం గల ఈ కృష్ణుడికి, గీతలోని కృష్ణుడికి పోలికలేదు. మహాభారతంలో దివ్యపురుషుడిగా ఒక వైపున, కురుపాండవుల మధ్య ఎత్తుగడలు, కుట్రలు పన్నిన వ్యక్తిగా మరోవైపునా కనిపిస్తాడు. విష్ణు పురాణంలో కృష్ణుడు గోపికలతో సంచరిస్తాడు. ఇది క్రీ.త. 5వ శతాబ్దంలో రాసింది. కృష్ణుడు నర్మదానదీ తీరాన రాక్షసులను బౌద్ధ జైనులుగా మార్చినట్లు చూపారు. మహామోహ వేషంలో ఆ పనిచేశారన్నాడు. (The Cultural Heritage of India. Calcutta, 1969). ఇలాంటి చిత్రణలు, ఇతిహాసాలూ, పురాణాలలో ముసురుకొని ఉన్నాయి. బుద్ధుడి కంటే కొన్ని శతాబ్దాలు ముందే రాముడు ఉండగా, రామాయణంలో బుద్ధుణ్ణి చోరుడుగా రాముడు పేర్కొంటాడు. (M N Dutt : Ramayana. Calcutta, 1892. p 480).

భాగవత పురాణంలో కృష్ణావతారం కనిపిస్తుంది. విష్ణుపురాణంలో గోపికలతో సరసాలు ఉండగా, భాగవతంలో వాటి రూపం మారింది. రాధ అప్పటికి రాలేదు. క్రీ.త. 9,10. శతాబ్దులలో భాగవత కృష్ణుడు వచ్చాడు. కొందరు క్రీ.శ. 13వ శతాబ్దానికి కూడా ఈ . కృష్ణుడిని నెట్టివేశారు. (Maurice Winter: A History of Indian Literature. Vol.I, Part-II. Calcutta, 1963. p 487). క్రీ.శ. 14, 15 శతాబ్దాలకు చెందిన బ్రహ్మవైవర్త పురాణంలో కృష్ణుడు కనిపిస్తాడు. (Sitanath Tattwabhushan : Krishna And Puranas. Calcutta, 1926. p 68). రాధ శృంగార నాయకిగా కనిపిస్తుంది. వైష్ణవ వాదంలో కృష్ణుడి

తరువాత ఆమెదే పైచేయి. రాధాకృష్ణుల శృంగార లీలను సమర్థించటానికి దివ్యాత్మలూ, వ్యక్తి పరమాత్మలో లీనం కావటం అలాంటివన్నీ తెచ్చి పెట్టారు. కాని, అసలు విషయాన్ని దాచలేకపోయారు.
నారాయణ ఉవాచలో ఇలా ఉంది:

కృష్ణుడు రాధను వివస్త్రను చేసి ఆమె స్తనాలను పట్టుకుంటాడు. నాలుగు రీతులుగా చుంబిస్తాడు. సంభోగంలో రాధ గజ్జెలు తెగిపోతాయి. ముద్దులతో ఆవిడ పెదాలు ఎరుపెక్కుతాయి. స్తనాలపై గంధం చెరిగిపోతుంది. కొప్పు వూడి పోతుంది బొట్టు చెరిగిపోతుంది. నీరద్ సి. చౌదరి బ్రహ్మవైవర్తంలోని ఈ భాగాన్ని అనువదించాడు. ఇందులో జీవి అనంతంలో కలిసిపోయేదేమిటో పిచ్చివాడికి కనిపించవలసిందే.

తరువాత కృష్ణుడి పైకి వచ్చిన రాధ సంభోగిస్తుండగా ఆవిడ కాళ్ళ పారాణి చెరిగిపోతుంది. ఆ ప్రక్రియలో ఆమెకు పారవశ్యం కలుగగా రాత్రింబగళ్ళకు తేడా లేకుండా పోయింది. నఖక్షతాలు, దంతక్షతాలతో కృష్ణుడు 8 భంగిమలలో ఆమెతో సంభోగిస్తాడు. గాజుల, మట్టెల చప్పుళ్ళ మధ్య రాధ ఇక భరించలేక సంభోగం నుండి వైదొలగుతుంది. (CNirad Chaudhari: Hinduism. New Delhi, 1979) నీరద్ చౌదరి పురాణాల లోని ఘోర విషయాలను ప్రస్తావించాడు.

రాధతో నిమగ్నుడైన కృష్ణుడు గోపికలకు అన్యాయం చేస్తున్నట్లు భావించి ఉద్యానవనంలోకి వెళతాడు. 9 లక్షల మంది ఉండగా అంతమంది పురుషులుగానూ కృష్ణుడు మారి సంభోగించగా ఉద్యానవనం ప్రతిధ్వనిస్తుంది. సామూహిక సంభోగ ప్రక్రియ కొనసాగుతుంది.
సంస్కృతం, ఇంగ్లీషు బాగా తెలిసిన నీరద్ చౌదరి ఈ ప్రక్రియను అనువదించి చూపాడు. యోగులందరికీ గురువైన నారాయణుడు అనేక రూపాలు ధరించి సంభోగించాడు. అప్పుడు గాజుల, మెట్టెల, పట్టెల చప్పుడు ఆనందంగా వినిపించింది. వారంతా పారవశ్యంలో స్పృహ తప్పారు. తెలివి వచ్చిన తరువాత గిచ్చుళ్ళతో, కొరుకుళ్ళతో కృష్ణుడు వారి పిరుదలపై ముద్ర వేశాడు. నగ్నంగా వారెంతో సుందర రూపాలతో ఉన్నారు.

అలాంటి కృష్ణుడిని చూచి వల్లభాచార్యుడూ, చైతన్య, ఇతర వైష్ణవ భక్తులు పారవశ్యం చెందారు. ఆ కృష్ణుడిని చూసే అండాళ్, చండీదాస్, జయదేవుడు, మీరాబాయి, సూరదాస్, విద్యాపతి, పోతన, నర్సిమెహతా వంటి కవులూ, కవయిత్రులూ ఆలాపించారు. ఆ కృష్ణుడిని గురించి మాధవుడూ, దైవం లీనమైనట్లు ఆధునిక జీవిత చరిత్రలో రాశారు.
ధీరేంద్రనాథ్ పాల్ ఇలా అన్నారు. ప్రేమరాజ్యం హిమాలయాల నుండి దక్షిణాది వరకూ, ద్వారక నుండి తూర్పు వరకూ వ్యాపించింది. (Dhirendranath Pal: Sri Krishna, His Life and Teachings. Calcutta, 1904, p188). కృష్ణుడిని ఎవరూ అర్థం చేసుకోలేదనీ, అతని మార్మికవాదం గొప్పదనీ పాల్ పొగిడాడు. ఐనా, అతన్ని గురించి మనకు రాస్తూ బృందావన లీల పేరిట మొదటి సంపుటంలో గోపికలతో కృష్ణుడి క్రీడలను రాశాడు. పారవశ్యం చెందినట్లు కృష్ణుని చిత్రించాడు. బృందావన లీల అంతా ప్రేమమయం అన్నాడు. హిందువులకే గాక అందరికీ శ్రీ కృష్ణుడు దేవుడన్నాడు. (Mohan Lal Sen : Lord Sri Krishna, His Lite And Teachings. VoH. Calcutta, 1954.9208),

ప్రతాప్ ఆర్. పరేఖ్ కృష్ణుడి జీవితాన్ని రాస్తూ కృష్ణుడు వాస్తవం అన్నాడు. అతని వంశపారంపర్యతనూ, గ్రహరాసి ఫలితాలను గూడా యిచ్చాడు. బృందావనంలో గోపికలతో, రాధలతో శృంగార లీలను వర్ణించాడు. వీటిని విమర్శించే వారిని గర్హించారు. గొప్ప వారు ధర్మాన్ని మించిపోయి, నియమాలను పాటిస్తారన్నారు. వారికి దోషాలంటవన్నాడు. చట్టాలు బలహీనులకే అన్నారు. (Pratap R Parekh: Sri Krishna, Myth or Reality. 1980. p47)

హనుమాన్ ప్రసాద్ ప్రోద్దార్ కృష్ణుడి గోపికా లీలను 100 పేజీలలో చిత్రించాడు,దివ్యలక్షణాలున్న వారిలో ప్రేమ స్వభావాన్ని బూతుగా చూడరాదన్నాడు. విశ్వాసంగాలేని భార్యకు 3 కారణాలుగా గౌరవాన్ని ఆపాదించాలన్నాడు. 1. ప్రేమికుడిపై నిరంతర ధ్యాస, 2. ప్రేమికుడిని కలవాలనే తీరని వ్యామోహం, 3. ప్రేమికుడి దోషాలను పూర్తిగా విస్మరించటం. అలాంటివి మామూలుగా పెళ్ళిచేసుకున్న భార్యలో ఉండవన్నారు. గోపికలు కృష్ణుడితో ఎడబాటు క్షణం కూడా సహించలేక పోయారన్నమాట. ఎ.ఎన్.పి. అయ్యర్ మరొక అడుగు ముందుకి వేసి శ్రీకృష్ణుడు పురుషులందరికీ తండ్రి అనీ, స్త్రీలందరికీ భర్త అనీ రాశాడు.

కృష్ణ భక్తులు బలహీనులకు ఒక నియమం, బలవంతులకు మరో నియమం చూపుతున్నారు. రెండు విధాలైన నీతి శాస్త్రాలు పేర్కొని ఒకటి దేవుళ్ళకూ, మరొకటి మానవులకూ చెందిందంటున్నారు. భారతీయ జీవనంలో యిదే రెండు నాలుకల విధానం. కృష్ణుడికి చెందిన జీవిత గాథలలో ఇది కన్పిస్తున్నది. బాబా పరమానంద్ భారతి, మోనికా వర్మ అలానే రాశారు. (Manika Varma : Lord Krishna, Love Incarnate. New Delhi, 1978. Bata Paramanand Bharath : Sri Krishna. The Lord of Love. Newyork, 1904. p114

భారతీయ బాబాలు, భగవాన్లు అమెరికా వెళ్ళి డబ్బు గడిస్తున్నారు. కామం ద్వారా ముక్తి సాధించాలనే భగవానుడొకరు అమెరికాలో ప్రచురణలు చేశారు. అతడి పేరు డొనాల్డ్ కనిస్లే కృష్ణుడిని గురించి రాస్తూ రాధాకృష్ణుల ప్రేమ, గోపికలతో కృష్ణుడి శృంగార లీలలు దివ్యానుభూతిని సూచిస్తాయన్నాడు. ఆ దశలో మామూలు బంధాలు తెగిపోతాయన్నాడు.

ఆ శృంగారం నీచమైంది కాదనీ, క్షణికమైంది కాదనీ, అరమరికలు లేనిదనీ, ఆనందభరితమనీ చెప్పాడు. గోపికలు మానవ మాత్రులు. వారు సాధారణ విషయాలను విస్మరించిన దైవమత్తులో స్వేచ్ఛగా శృంగార లీల జరుపుతారన్నాడు. (Donald Kinsley: The Sword And the Flute. Kali and Krishna. New Delhi, 1976. p 55).

ఇలాంటి మాటలు కృష్ణ భక్తులకు ప్రోత్సాహాన్నిస్తాయి. అమెరికా ఆధ్యాత్మికవాది పాదాల వద్ద కూర్చొని బృందావన సందేశాన్ని వినమంటారు. అది అలా ఉంచి ఇందరి కృష్ణులలో అసలు వాడెవరు? అంటే, సంప్రదాయ వాదులు మహాభారతంలో, గీతలో కృష్ణుడిని చూపిస్తారు. అదేమిటో చూద్దాం.

మానవుడిగా కృష్ణుడు

పురాణాల్లోని కృష్ణుడిని మనం ఇష్టపడవచ్చు, పడకపోవచ్చు. అది మన అభిరుచిని బట్టి ఉంటుంది. మహాభారతంలో కృష్ణుడిని గమనిస్తే అయిష్టత ఏర్పడుతుంది. కృష్ణ భక్తులవలె గాక, హేతు దృక్పథంతో చూస్తే అలా అనిపిస్తుంది. భక్తులకు వారి దేవుడే సర్వస్వం. భక్తికి అలాంటి ప్రభావం ఉన్నది. రాముడికీ, కృష్ణుడికీ సమానంగా భక్తిని చూపడాన్ని ఏమనుకోవాలి? ఇరువురూ విష్ణువు అవతారాలే అంటారు. ఐనా, ఎంత తేడా ఉన్నది? రాముడు సత్యం వైపుకు మొగ్గుతాడనీ, కృష్ణుడలా కాదనీ అంటారు. రాముడు ఏకపత్నీవ్రతుడు. కృష్ణుడు కాదు. రెండు మూడు సందర్భాలు మినహాయించితే, రాముడు ధర్మయుద్ధం చేశాడు. కృష్ణుడు చేయలేదు. ఐనా, భక్తులకు తేడా కనిపించడం లేదంటే భక్తి ప్రభావమే కారణం.

భక్తుల సంగతి అలావుంచి, మహాభారతంలో కృష్ణుడిని విదేశీ పండితుల దృష్టిలో చూద్దాం. ఇందులో బ్రిటీష్ వారిని స్వీకరించడం లేదు. దేశాన్ని పరిపాలించిన సామ్రాజ్యవాదులుగా వారికి భారత వ్యతిరేకత, హిందూ వ్యతిరేకత ఉండవచ్చు.

ఇ.డబ్ల్యు. హాప్కిన్స్ భారతీయ శాస్త్రాలను పరిశీలించిన అమెరికన్ పండితుడు (1857-1932). అతడు సంస్కృతం, పహ్లవి, గ్రీస్, లాటిన్ భాషలను అధ్యయనం చేశాడు. హిందువుల కులం, నీతిపై రాశాడు. భాష, కవిత, నీతి దృష్ట్యా మహాభారతాన్ని విశ్లేషించారు. యేల్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసరుగా చాలా ఖ్యాతి పొందారు. కృష్ణుడు పవిత్రమైన మోసకారి అని స్పష్టంగా రాశాడు. (EW Hopkins : The Great Epic of India. Calcutta. p374) గీత చివరిలో ధృతరాష్ట్రునితో సంజయుడు చెప్పిన మాటలను బట్టి, కృష్ణుడి విశ్వరూపాన్ని చూచి ముగ్ధుడైనట్లు పేర్కొన్నారు. కురుక్షేత్ర యుద్ధం చివరలో ఆ కృష్ణుడే మోసగాడని సంజయుడంటారు. 18 రోజుల్లో సంజయుడి అభిప్రాయం మారటానికి తగిన కారణం ఉండి ఉండాలి.

సంజయుడి అభిప్రాయాన్నే హాప్కిన్స్ కూడా సమర్థించాడు. అర్జునుడికి రథసారధిగా ఉన్న కృష్ణుడు తాను పోరాటంలోకి దిగనని చెపుతూనే కురుపాండుల మధ్య వైరం పెంచాడు. కుయుక్తులనూ, విచక్షణ లేని ధోరణినీ కృష్ణుడు ప్రదర్శించాడు.

ఆస్ట్రేలియా పండితుడు మోరిస్ వింటర్నిట్జ్ భాష, తత్వాలను, భారత శాస్త్రాలను అధ్యయనం చేశారు. ఆక్సఫర్డులో ఉన్నప్పుడు రుగ్వేదం ముద్రణకు మాక్స్ ముల్లర్ కు సహాయపడ్డాడు మాక్స్ ముల్లర్ తయారుచేసిన 49 ప్రాచ్య పవిత్ర గ్రంథాలకు పదసూచికలో తోడ్పడ్డారు. ప్రాలో భారతీయ శాస్త్రాలను బోధించాడు. భారతీయ సాహిత్యంపై 16 వందల పేజీలు రాశాడు. 1937లో అతను చనిపోయినప్పుడు రవీంద్రనాధ్ టాగోర్ అతడి సత్యాన్వేషణకు, జోహారులర్పించాడు. కృష్ణుడి పై వింటర్నిట్జ్ రాస్తూ కుట్రలన్నీ అతడి నుంచే వచ్చాయనీ, మోసాలకు ప్రోత్సాహకారి అనీ, పాండవుల ప్రవర్తనను సమర్థిస్తూ పోయాడనీ అన్నారు. పాండవులకు కృష్ణుడు జిత్తులమారి స్నేహితుడుగా రాశారు. (Maurice Winternitz: A History of Indian Literature. Vol-1, Part-II. Calcutta, 1963. p 399).

మాక్స్ వెబర్ (1864-1920) జర్మనీ సామాజిక శాస్త్రజ్ఞుడు. ప్రపంచ మతాలను సామాజిక శాస్త్ర దృష్టితో పరిశీలించటం అతని ప్రత్యేకత. భారతదేశంలో శాస్త్రీయ దృక్పథాన్ని సాగనివ్వకుండా మతం అడ్డుపడుతుందని రాశాడు. కృష్ణుడు మహాభారతంలో అతి ఘోరమైన నేరాలను తనవారితో చేయించాడనీ అన్నాడు. (Max Weber: The Religion of India, New York, 1967. p189).

సుక్తాంకర్ కృష్ణుడిని బాగా అధ్యయనం చేసి రాశాడు. "విరుద్దాల పుట్ట! యుద్ధరంగంలో తాత్త్వికుడు. తన సైన్యాన్ని శత్రువులకు అప్పజెప్పాడు. సర్వశక్తివంతుడైన తాను యుద్ధారంభంలో ఆయుధాలు చేపట్టనని ప్రతిన పూనాడు. నిష్పక్షపాతంగా ఉండవలసిన ఈ దేవుడు కౌరవ సంహారానికీ, పాండవ విజయానికీ, నీతిరీతి లేని రాజకీయవాదిగా రహస్య కుట్రలు పన్నాడు. యుద్ధరంగంలో నిలబడి ఈ అవతార పురుషుడు కింది స్థాయి నీతిని బోధించాడు. జిత్తులమారిగా ప్రవర్తించాడు". (V S Suktankar : On the Meaning of Mahabharata, Bombay, 1957. p 24).

పరస్పరం విరుద్ధాలు అన్నపుడు అందులో వివేచనకూ, వాదనకూ చోటు లేదు. కృష్ణుడు ఈ విరుద్దాల పుట్ట అనీ, చిక్కు సమస్య వంటి వాడనీ సుక్తాంకర్ అన్నాడు. జీవితం గూడా అలాంటిదేకదా అన్నాడు. మనిషి దేవుడుగానూ, దేవుడు మనిషిగానూ కృష్ణుడిలో చూచిన సుక్తాంకర్ రెండు దృక్పథాలనూ సమర్థించే ప్రయత్నం చేశారు.
కృష్ణుడు చెప్పిందాన్నిబట్టి శత్రుగృహంలోకి తప్పుడు త్రోవలో, స్నేహితుడింటిలోనికి సరైన మార్గంలో ప్రవేశించాలన్నాడు. (సభాపర్వం). జరాసంధుడి కోటలోకి అలాగే కృష్ణుడు ప్రవేశించాడు. భీమార్జునులను వెంటబెట్టుకొని బ్రాహ్మణ వేషంలో లోనికి వెళ్ళాడు. బ్రాహ్మణులను సత్కరించటానికి వచ్చిన జరాసంధుడిని భీముడితో చంపించాడు. భీమ జరాసంధుల 14 రోజుల మల్లయుద్ధం అబద్ధమని పిఠాపురం పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి రాశాడు. (Mahabharata Charitramu. 1933. p 166) కంసుని, శిశుపాలుని చంపించటంలో కూడా కృష్ణుడు అలాంటి ఎత్తుగడనే అవలంబించాడు.

భీష్మ, ద్రోణ, కర్ణ, దుర్యోధనులను చంపించటంలో మోసపూరిత ఎత్తుగడలను సుక్తాంకర్ సహితం కాదనలేకపోయాడు. ఐతే, అందుకేవో కుంటిసాకులు చెప్పాడు.

కౌరవులు కూడా అక్రమ మార్గావలంబన చేశారనీ, కాగా వారు తెలివిగా, లోపాయకారీగా చేశారని అన్నాడు. పాండవులు కొన్ని దోషాలు చేశారంటూనే సుక్తాంకర్ మాట తప్పించాడు. పాండవులతో పాటు కౌరవులు గూడా తప్పుచేశారని చెప్పిన సుక్తాంకర్ రెండు దోషాల వలన ఒక మంచి జరిగినట్లయింది. ఐతే ఉభయ పక్షాల మీద నెపం వేసిన సుక్తాంకర్ దోషులలో కృష్ణుని చేర్చకపోవటం గమనార్హం.

మనోరమ జవహరి మహాభారతంలో అక్రమ చావుల్ని గురించి రాసింది. కృష్ణుడి సలహాతో పాండవులు పోరాట నియమాలను ఉల్లంఘించారన్నారు. కృష్ణుడు తరచూ పరోక్ష సలహాలిస్తుండేవాడు. భీముడి తొడలు విరగొట్టమని అర్జునుడి ద్వారా చెప్పించాడు. కృష్ణుడి సోదరుడు బలరాముడు ఈ అక్రమ పోరాటం పట్ల ఆగ్రహించి భీముడిని చంపటానికి ఉద్యమిస్తాడు. బలరాముడు గ్రహించకుండా ఉండేటందుకే అర్జునుడి ద్వారా తన దుస్సలహాలు కృష్ణుడు అందచేస్తాడు. పైగా బలరాముడిని శాంతించమంటాడు. అక్రమ పోరాటాన్ని సమర్థించి అలా అయితేనే దుర్యోధనుణ్ణి చంపగలుగుతామని యుధిష్ఠిరునితో చెపుతాడు.

యుధిష్ఠిరుడు ఈ అక్రమ పోరాటం పట్ల మొసలి కన్నీరు కారుస్తూ భీముడు కింద పడిన దుర్యోధనుడి తల తన్నినందుకు ఆక్షేపిస్తాడు. ఐతే, కృష్ణుడి సలహాను పాటించి భూమిని జయించామంటాడు. ధర్మరాజు తనపట్ల సంతృప్తి వహించినా దేవతలు మాత్రం చనిపోతున్న దుర్యోధనుని పైన పూలవర్షం కురిపిస్తారు. మహాభారతాన్ని (Salya Parva) పరిష్కరించిన సుక్తాంకర్ ఈ సంఘటనలను ఎవరో చేర్చారంటూ వదిలేసాడు.

రాజకీయవేత్త కృష్ణుడు

బంకించంద్ర చటర్జీ దేశభక్తుడు. బ్రిటీష్ వారి హయాంలో ఉద్యోగిగా ఉన్నప్పటికీ జాతీయవాదిగా హిందూ అనుకూల ధోరణులు కనబరిచాడు. మానవవాదిగా ప్రారంభించి మతవాదిగా మారాడు. దేశంలో నవలా ప్రక్రియకు ఆద్యుడు. మహాభారతంలో, కృష్ణుడిలో ప్రేరేపణలు అన్వేషించాడు. కృష్ణుడి దైవత్వంలో నమ్మకం చూపాడు. రాజనీతిజ్ఞుడుగా కృష్ణుడిని గురించి రాశాడు.

ఫ్రెంచి జిజ్ఞాసి కాప్టె ప్రభావంతో బంకించంద్ర కొనసాగాడు. దేశభవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని పునరుజ్జీవనం కోసం కృష్ణుడిని ఆదర్శంగా స్వీకరించాడు.

ఆధునిక భారత సాహిత్యానికి ఆద్యుడైన బంకించంద్ర కృష్ణుడిని స్వీకరించడంలో పొరపాటు పడ్డాడు. పురాణాలూ, గాథల నుండి కృష్ణుడిని వేరుచేసి చూడటం సంభవం కాదు. మహాభారతంలో కృష్ణుడిని కూడా రాజనీతిజ్ఞుడుగా స్వీకరించటంలో చాలా లోపాలున్నాయి.

అదీగాక, దేశాన్ని ముందుకు నడపాలంటే గతంలోనే దృష్టి పెడితే చాలు. కృష్ణుడు గతానికి మాత్రమే చిహ్నం. అతడి కాలం, ఆనాటి చారిత్రక శక్తులూ భిన్నమైనవి. రాముడి విషయమూ అంతే, బంకించంద్ర కృష్ణుడిని, గాంధీ రాముడిని స్వీకరించారు. గాంధీ రామరాజ్యం అంటూ నిత్యం రామధులో ప్రారంభించి ముగించేవాడు. తన రాముడు దశరధుని కుమారుడు కాడనీ, దైవం అనీ అనేవాడు. రామనామం అన్ని రోగాలను నయం చేస్తుందనేవాడు, . . గాంధీ, బంకించంద్ర స్వీకరించిన సంకేతాలు భారతదేశాన్ని బాధిస్తున్నాయి.
బంకించంద్ర తన కృష్ణ చరిత్రలో లోకాతీత విషయాలను పక్కకుబెట్టాడు. పురాణాల్లో కృష్ణుడికి సంబంధించినవన్నీ కొట్టిపారేశాడు. జయదేవుడూ, విద్యాపతి స్వీకరించిన కృష్ణుడిని అతను ఆమోదించలేదు. మహాభారతంలో కృష్ణుడిని సహితం బంకించంద్ర వాస్తవమని అంగీకరించ లేదు. నరకుడితో యుద్ధం, తదనంతరం స్వీకరించిన అనేకమంది కన్యల విషయం మధ్య అన్నాడు. కృష్ణుడి భార్యలు 22 మంది మాత్రమేనని అన్నాడు. కృష్ణుడి భార్యలు 10 మందినే ప్రస్తావించాడు. సత్యభామను సత్యగానూ, జాంబవతిని రోహిణిగానూ చూపాడు. అష్టమహిషీలలో 5 గురిని గురించి తెలియదు గనుక అవి తొలగించాలన్నారు. ఎలుగుబంటి కుమార్తె జాంబవతిని, కృష్ణుడు పెళ్ళాడాడని అనటం అర్థం లేనిదన్నాడు. ఇక మిగిలింది ఇద్దరే భార్యలు. సత్యభామను కాదనలేకపోయినా ఆమెను కూడా విస్మరించి కేవలం రుక్మిణి మాత్రమే అసలు భార్యగా పేర్కొనాలన్నాడు. మొత్తం మీద కృష్ణుడిని ఏకపత్నీవ్రతునిగా చేశాడు. బంకించంద్రుడు కృష్ణుడిలో రాజకీయవేత్తను చూశాడు. దేశ ఐక్యత సాధించేవాడిగా పేర్కొన్నాడు. మజుందార్ కృష్ణచరిత్రపై నిశిత పరిశీలన చేశాడు. అందులో కృష్ణుడు నాయకుడు

కాదనీ, బంకించంద్ర హేతుపద్ధతి మాత్రమే కనిపిస్తుందని అన్నాడు. (Bimanbehari Majumdar: Krishna in History and Legend. Calcutta, 1969. P248, 249)

బంకించంద్రను మించిపోయి కృష్ణుడిని గొప్ప రాజనీతిజ్ఞుడుగా చూపటానికి కె.యం.మున్షీ ప్రయత్నించాడు. దేశాన్ని ఐక్యపరచటానికి యుధిష్ఠిరుని ఆధిపత్యాన గొప్ప జాతి రూపొందించటానికి కృష్ణుడు ప్రయత్నించాడన్నాడు. ఆనాడు భారతదేశంలో బీహారు ప్రాంతంలో వింధ్యకు దక్షిణాన ఉన్న ప్రాంతం అపవిత్రంగా భావించాడు. అలాంటి దేశాన్ని ఐక్యపరచటానికి కృష్ణుడు ప్రయత్నించాడనటం అర్థం లేదు. బుద్ధుని జీవితకాలంలో 16 మహాజనపదాలుండేవి. క్రీ.పూ. 320 నాటికి మౌర్య సామ్రాజ్యం ఏర్పడింది. ఆటవిక పాలకుల స్థానే రాజరికం వచ్చింది. (K. M. Munshi : Krishnavatara, the Magic Flute. Vol-I. Bombay. p III)

మౌర్య సామ్రాజ్యానికి పూర్వం పురాణాలలో చిత్రించిన దిగ్విజయాలన్నీ చరిత్ర కాదు. అవి గాధలూ, కట్టుకథలు మాత్రమే. (DC Sirkar: Mahabharatha, Myth and Reality, Delhi. p 141).

దేశంలో ఐక్యత మాట అలా ఉంచి కృష్ణుడు తన యాదవులనే ఐక్యపరచలేకపోయాడు. ద్వారకలో యాదవులెందరు? మజుందార్ రాస్తూ ద్వారకలో యాదవులు 3 కోట్లని మత్స్య, అగ్నిపురాణాలు చెప్పాయన్నాడు. స్కంధ పురాణంలో వీరి సంఖ్య 56 కోట్లుగా ఉన్నది. కృష్ణుడికి 9 లక్షల స్వర్ణ మందిరాలున్నాయి. భాగవతం ప్రకారం యాదవుల సంఖ్య లెక్కింపరానిది. యాదవ కుమారులలో ఉపాధ్యాయులే 3 కోట్ల పైగా ఉన్నారు. బహుశ స్వర్గం నుండి వీరికి ఆహారం అంది ఉండవచ్చునని మజుందార్ వ్యాఖ్యానించాడు.

యాదవులు మధుర, విదర్భ, అవంతి, మహిష్మతిలలో కూడా ఉన్నారు. కృష్ణుడి నాయకత్వాన్ని వారంగీకరించలేదు. కురుక్షేత్ర యుద్ధంలో అత్యధిక యాదవులు కౌరవుల పక్షాన ఉన్నట్లు పుసల్కర్ రాశాడు. (A D Pusalkar: Vedic Age. The History and Culture of Indian People. Vol-I. London, 1957. P 302). భోజులూ, అంధకులూ, వృషిణులు, యాదవులకు భిన్నమైన జాతి. ద్వారకలోని యాదవులలో పాండవులకు సంబంధించింది కృష్ణుడు మాత్రమే. మిగిలిన వారు కౌరవులతో ఉన్నారు. కృష్ణుడి కేంద్రం 'సంఘముఖ్యం'.
శాంతిపర్వంలో ఈ ప్రస్తావన ఉంది. తనను అర్ధభోక్తగానూ, కృష్ణుడు చెప్పుకున్నాడు. రెండవ సంఘముఖ్యుడు బలరాముడు కావచ్చు. అతడు తటస్థుడు. కృష్ణుడి కుమారులు ప్రద్యుమ్న, సాంబు కూడా తటస్థులే. యాదవులను ఐక్యపరచలేని కృష్ణుడు దేశమంతటినీ ఐక్యపరుస్తారను కోవటం అర్థంలేనిది. కృష్ణుడిని దూరదృష్టిగల రాజనీతిజ్ఞుడిగా భావించడం ఇంగిత జ్ఞానాన్ని కోల్పోయి చెప్పటమే.

దేవుడుగా కృష్ణుడు

మానవుడుగా కృష్ణుడికంటే, రాజనీతిజ్ఞుడుగా కృష్ణుడికంటే, దేవుడుగా కృష్ణుడికి అంత ఖ్యాతి లేదు. మహాభారతంలో మనిషిగా ప్రవేశించి దేవుడుగా నిష్క్రమిస్తాడు. పురాణాలలో ఆద్యంతాలూ దేవుడుగానే ఉంటాడు. కనుక ఇతిహాసాలూ, పురాణాలు కలిపి చూస్తే కాని, దేవుడి విషయం బయటపడదు.

కృష్ణుడి బాల్యదశలో చేష్టలూ, అద్భుతాలూ అంతగా బంకించంద్ర చటర్జీ పట్టించుకోలేదు. కృష్ణుడి దైవత్వంలో మాత్రం నమ్మకం ఉంచాడు. బాల్యదశలో చెప్పినవన్నీ అలంకార ప్రాయాలన్నాడు. పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి ఈ అద్భుతాల గురించి నిర్మొహమాటంగా చెప్పారు. పూతన చిన్న పిల్లల రోగమనీ, రాక్షసి కాదని అన్నాడు. భారతీయ వైద్య గ్రంథాలలో ఆ రోగ ప్రస్తావన ఉంది. ఇప్పటికీ గ్రామాలలో పిల్లల జబ్బుల్ని పోగొట్టటానికి కొన్ని క్రతువులు చేస్తుంటారు. కేసి, సాదేరధ, ఉల్లూక అనే దయ్యాలను కంసుడు కృష్ణుడి పైకి పంపిస్తాడు. రెండు చెట్ల మధ్య కృష్ణుడిని కట్టేసినట్లు చెప్పిన కథలో ఉల్లూక అనేది దోషపూరిత దయ్యం పేరే.

మిగిలిన కృష్ణలీలలు కూడా ఊహించిన మూఢనమ్మకాలే అని పెండ్యాల శాస్త్రి పేర్కొన్నాడు. కౌరవ సభలో ద్రౌపది వస్త్రాపహరణం జరుగుతుండగా ఆమె కృష్ణుడిని ప్రార్థించడం, అతడు దివ్యశక్తులతో ఆమెను కాపాడటం కథగా చెపుతారు. శాస్త్రి ఈ విషయమై రాస్తూ మహాభారతంలో 13 సందర్భాలలో ఈ అవమాన ప్రస్తావన ఉన్నదనీ, 3 సార్లు వివస్త్రను చేయటానికి ప్రయత్నించారనీ, మిగిలినప్పుడు కథలో ఆమెను జుట్టుపట్టుకొని ఈడ్చారనీ ఉంది. రెండు సందర్భాలలో మాత్రం తన అవమానాన్ని గురించి కృష్ణుడికి నివేదించుకున్నది. అందులో తనను వివస్త్ర గావించటానికి చేసిన ప్రయత్నం గురించి గానీ, తను కాపాడినందున కృతజ్ఞతగానీ తెలిపినట్టు లేదు. ఈ ఉదంతం జరిగినప్పుడు కృష్ణుడు ద్వారకలో లేడు. సాళ్వుడితో పోరాటం అంటూ ఏమీ లేదు. తిరిగివచ్చిన తరువాత యుధిష్ఠిరుడి జూదం, దాని తీవ్ర పరిణామాలూ విన్నాడు. కనుక ద్రౌపది మొరబెట్టుకోటం, కృష్ణుడు కాపాడటం ఆధారాలు లేవు. భాసుడూ, భారవీ, క్షేమేంద్రుడూ మహాభారతాన్ని గురించి రాసినప్పుడు ద్రౌపదీ వస్త్రాపహరణం ప్రస్తావన లేదు.

రాజసూయ యాగంలో ముందుగా ఎవరిని గౌరవించాలనే విషయమై పేచీరాగా కృష్ణుడికి వ్యతిరేకంగా ఉన్న శిశుపాలుడు పోరాటానికి సన్నద్ధుడై వెళ్ళిపోతాడు. యుధిష్ఠిరుడతణ్ణి శాంతింపజేసి తీసుకువస్తాడు. ఐనప్పటికీ శిశుపాలుడు తన అభ్యంతరాన్ని కొనసాగిస్తుండగా కృష్ణుడు చక్రంతో అతణ్ణి హతమారుస్తాడు. కృష్ణుని ప్రేరేపణతో భీముడు జరాసంధుడిని చంపుతాడు. జరాసంధుడు అప్రమత్తుడుగా లేనప్పుడు అది జరిగిందని శాస్త్రి రాశాడు.

శీతానాధ్ తత్వభూషణ్ కృష్ణుడి దైవలీలను గురించి తీవ్ర ఆరోపణలు చేశాడు. కంసుణ్ణి చంపిన తీరు ప్రస్తావిస్తూ కంసుడు పురికొల్పినప్పుడు పోరాటంతో కృష్ణుడతణ్ణి చంపలేదనీ, మల్లయుద్ధం పోటీలు తిలకిస్తున్న కంసుణ్ణి హఠాత్తుగా జుట్టుపట్టుకొని వేదిక నుండి కిందికి విసిరేసి చంపాడని అంటాడు. శిశుపాలుడూ, సాల్వుడు, శతధన్వుడు కృష్ణుడి చేతిలో చనిపోయిన తీరు గూడా అతను ప్రస్తావించాడు. పురాణాల రచయితలకు చంపడం దివ్యచర్యగా ఉన్నది. కృష్ణుడు తన దివ్యత్వాన్ని ప్రశ్నించిన పౌండ్రుని చంపాడు. పౌండ్రుడు ద్వారకపై దండెత్తినట్లు కూడా రాశాడు. కృష్ణుడు ధరించిన విష్ణు చిహ్నాలను, శంకుచక్రాలను, పద్మం, పౌండ్రుడు ప్రశ్నించాడు. అందుకే కృష్ణునికి ఆగ్రహం వచ్చింది.(Sitanath Tattwabhushan : Krishna And the Geetha. Calcutta. p 65,67).

కృష్ణుడు అపహరణల్లోనూ ప్రసిద్ధి చెందాడు. శిశుపాలుడితో పెళ్ళాడాల్సిన రుక్మిణిని ఒకరోజు ముందు అపహరించాడు. మిత్రవిందను స్వయంవర సభ నుండి అపహరించాడు. మద్రరాజు కుమార్తె లక్షణను బలవంతంగా ఎత్తుకుపోయి పెళ్ళి చేసుకున్నాడు. నరకుడి కొలువులోని 16వేల మంది స్త్రీలను భార్యలుగా స్వీకరించాడు. భార్యల సంఖ్య 16,008 కాగా, పురాణాల ప్రకారం 16,022 అని బంకించంద్ర చూపాడు.

హరివంశం ప్రకారం కృష్ణుడికి ఆడపిల్లలు లేరు. మగ సంతానం లక్ష 80 వేలు మాత్రమే. భాగవతాన్ని బట్టి కృష్ణుడు 125 ఏళ్ళు బతికాడు. దీని ఆధారంగా బంకించంద్ర లెక్కలు వేసి రోజుకు 4గురు చొప్పున కృష్ణుడు పిల్లలను కన్నాడని చెప్పాడు. కృష్ణుడు 14 ఏళ్ళ వరకూ పిల్లలను కనజాలడనీ, 80వ ఏడు తరువాత పిల్లలు లేరనీ మజుందార్ చూపాడు. మిగిలిన 66 ఏళ్ళలో రోజుకు 7.5 కుమారులు చొప్పున పుట్టారన్నమాట.

కృష్ణుడు ఒక పథకం ప్రకారం ద్వారకా నగరాన్ని రూపొందించాడని పురాణాలు చెపుతున్నాయి. హరివంశం ప్రకారం ద్వారకలో వేలాది మంది స్త్రీలను వ్యభిచారంలో ఉన్నవారిని స్థిరపరిచారు. హరివంశం ప్రకారం ఆ స్త్రీలకు తగ్గట్లే పురుషుల్నీ, వసతి గృహాల్ని తెరిపించాడు. ఆనాడు కృష్ణుడి సోదరుడు బలరాముడే పెద్ద తాగుబోతు. కల్లుముంత లేకుండా అతడు కనిపించేవాడు కాదు. అందుకే హరిప్రియ అని కల్లుకు మారుపేరు వచ్చింది. మజుందార్ ద్వారకను గురించి రాస్తూ హరివంశం ప్రకారం యాదవులు ఈ స్త్రీలను తమ కుటుంబాలతోపాటు సముద్ర తీరాలకు తీసుకువెళ్ళి జలకాలాడుతూ, తాగుతూ, తింటూ అనుభవించేవారన్నాడు. కృష్ణుడి సంతానం, ఇతర కుటుంబీకులూ, బట్టలూ, నగలూ ఒడ్డున పెట్టి జలక్రీడలలో నిమగ్నులయ్యేవారు. యాదవ స్త్రీ పురుషులంతా తాగుడుకు అలవాటు పడ్డవారే.

ద్వారకానగరం పవిత్రమో కాదో గాని, కృష్ణుడి ఆధ్వర్యంలో విలాసవంతంగా మాత్రం ఉన్నది. హరివంశం ప్రకారం అలా ఉన్నదన్నా సనాతనులకాగ్రహం వస్తుంది. సుక్తాంకర్ అదంతా మూర్ఖత్వంగా కొట్టిపారవేయదలిచాడు. కృష్ణుడు తన దైవలీలల్ని అనేక సందర్భాలలో చూపినా, చదువుకున్నవారు సహితం వాటి లోతుపాతుల్ని చూడలేక పోతున్నారన్నాడు.

కృష్ణుడి విషయంలో ఉత్తమ నిర్ణేతలు యాదవులే. వారి దృష్టిలో అతడు దేవుడు కాదు. వారెప్పుడూ అతణ్ణి పూజించలేదు. మజుందార్ ఈ విషయాలను స్పష్టంగా రాశాడు. అక్రూరుడూ, కృతవర్మ కృష్ణుడి పట్ల శమంతకమణి విషయంలో చూపిన ధోరణి, శిశుపాలుడూ, దంతవక్రుడు, దైవాతకుడూ, ప్రభాసుడూ కృష్ణుడిపట్ల గౌరవం చూపలేదు. అతడిని దేవుడుగా చూడకపోవటం యాదవుల దురదృష్టమని భాగవతంలో అన్నారు.

కృష్ణుడి కొడుకులు ప్రద్యుమ్నుడూ, సాంబుడు సహితం తండ్రిని గౌరవించలేదు. పెంపుడు తల్లి మాయాదేవిని ప్రద్యుమ్నుడు పెళ్ళాడాడు. హరివంశ వజ్రనాభుడి కుమార్తె ప్రభావతిని ప్రద్యుమ్నుడు ఆకట్టుకుంటాడు.

కృష్ణుడి 16 వేల మంది భార్యల్నీ అతని కుమారుడు సాంబు వాడుకున్నట్లు, వరాహపురాణం చెపుతున్నది. అందుకు సాంబుడిని కుష్టు రోగిగా ఉండమని కృష్ణుడు శపిస్తాడు. ద్వారకా నగరంలో పురుష జనాభా హరించి పోతుండగా వారిని కాపాడాలని అర్జునుడు ప్రయత్నించి కూడా విఫలు డౌతాడు. హస్తినా పురానికి తీసుకువెళుతున్న ద్వారకా జనాన్ని అర్జునుడు కాపాడలేక పోయాడు. ఆఖరులో వారి పై దండెత్తి చాలామంది స్త్రీలనెత్తుకపోయారు. అందులో ముగ్గురు తప్ప, కృష్ణుడి భార్యలు కూడా ఉన్నారు.

కృష్ణుడి దివ్యత్వాన్ని చాలామంది నమ్మలేదు. హాప్కిన్స్ ఈ విషయం రాస్తూ గీత ప్రకారం కృష్ణుడిని దేవుడుగా గుర్తించి పూజించిన వారు కొద్దిమందే అన్నాడు. (గీత 9వ అధ్యాయం, 11వ శ్లోకం) పతంజలి మహాభాష్యం

కూడా కృష్ణుడిని నాయకుడిగా తప్ప దేవుడుగా గుర్తించలేదు. (EW Hopkins : The Great Epic of Indian Literature. Calcutta, 1960, p 395).

శీతానాధ్ తత్త్వభూషణుడి ప్రకారం కృష్ణుడి కథ అంతా అద్భుత కల్పనలే. మహాభారతం, పురాణాలూ ప్రస్తావించినదాన్ని బట్టి చూస్తే కృష్ణుడు దైవావతారం కానేరదు.

డి.డి. కోశాంబి ధైర్యంగా, నిర్మొహమాటంగా కృష్ణుడిని గురించి రాశాడు. అవకాశవాదానికి ఆయువు పట్టుగా ఉన్న గీతావాదనలు నాటి సమాజంలోని ఆదిమ ఉత్పత్తి దశకూ, మతానికీ ప్రతిబింబంగా ఉన్నవన్నారు. (D D Kosambi: The Culture and Civilization of Ancient India. London, 1965. p 114-115) కోశాంబి లాంటివారే అలా మాడుపగులకొట్టగలిగేట్లు చెప్పగలరు.

గీత ఎవరు రాశారు?

మనకు తేదీలు లేని చరిత్ర ఉన్నట్లే పేరులేని రచయితలున్నారు. అలాంటి వారే గీతను రచించారు. గీత మాట్లాడిందీ కాదు, ఆలాపించింది కాదు. కేవలం రాసిందే. అందుకు గీతలోనే ఆధారాలున్నాయి. "ఈ పవిత్ర సంభాషణను ఎవరు చదివినా" అంటూ కృష్ణుడు చెప్పటమే అందుకు ఆధారం. (18వ అధ్యాయం, 70వ శోకం) తాము చెపుతున్న తాత్త్వికవచనాల్ని సంజయుడు వింటున్నాడని కృష్ణుడికి తెలియదు. వ్యాసుడు తన ఇంద్రియాతీత శక్తులతో సంభాషణంగా పొందుపరుస్తున్నాడని తెలుసా? దేవుడు గనుక వాటన్నిటినీ గ్రహించాడా? కురుక్షేత్రంలో అర్జునుడు కుప్పకూలిపోతాడనీ, అతన్ని ప్రోత్సహించి పోరాడమని చెప్పవలసి వస్తుందనీ కృష్ణుడికి ముందే తెలుసా? ఇది కోడిగుడ్డుకు వెంట్రుకలు పీకటం వంటిది కాదు. రాసిన దాన్నే చదవగలరు. అనూహ్యపరిణామంపై అప్పటికప్పుడు మాట్లాడిన దానిని చదవలేరు. అర్జునుడితో తన సంభాషణను పవిత్రం అనటం సరైనాదేనా? సుక్తాంకర్ దృష్టిలో మన ప్రమాణాలను దేవుళ్ళకు అంటగట్ట కూడదు. గీతను భిన్న సమయాలలో విభిన్న వ్యక్తులు రాశారు. కృష్ణుడి జీవితాన్నీ, కాలాలన్నీ మహాభారతం, పురాణాల దృష్ట్యా చూచినప్పుడు అతడు గీతా రచయిత కాదని తేలిపోతుంది. భాగవతంలో బాల్యచేష్టల పిల్లవాడు తాత్త్వికుడు కాలేడు. హరివంశం చూపినట్లు వ్యభిచార గృహాలను ప్రోత్సహించిన వాడు తాత్త్వికుడు కాలేడు. మహాభారతంలోని జిత్తులమారి తాత్త్వికుడు కాలేడు. నేను కృష్ణ భక్తుడిగా కాక ఆలోచనాజీవిగా చూస్తున్నాను. భక్తుడైతే పారవశ్యంతో మనసు కుంచింప చేసుకుంటాడు. పూనకం ఎక్కువైన కొలదీ దేవుడికి సన్నిహితుడుగా భావిస్తాడు. కృష్ణుడు మకియవెల్లి అవుతాడేమోగాని సోక్రటీస్ కాలేడు. తాత్త్వికుడి స్వభావం అతడికి లేదు.

కృష్ణుడు గీత రచయిత కాదనడానికి కొన్ని కారణాలున్నాయి. అంగీరసుడు శిష్యుడని ఆదిశంకరాచార్యుడు చేసిన ప్రచారం కృష్ణుణ్ణి గురించి కేవలం కల్పితగాథే. పురాణాలను బట్టి వారణాసి వద్ద అవంతిపూర్ లో సందీపుని వద్ద కొద్దికాలం కృష్ణుడు ఉన్నాడు. ఉత్తరోత్తరా అతడికి చదివే అవకాశమే లేదు. అమ్మాయిల మీదున్న ఆసక్తి అధ్యయనం పై లేదు. వేదవేదాంగాల జిజ్ఞాసి అని భీష్ముడు చెప్పిన మాటలను అంతగా పట్టించుకోనక్కరలేదు. యుధిష్ఠిరుడు రాజసూయ యాగంలో ప్రథమ తాంబూలం భీష్ముడికి యివ్వవలసింది. అందుకు మారుగా ఆ గౌరవం ఎవరికి దక్కాలో చెప్పమని భీష్ముడినే అడిగాడు. రాజు పేరు చెపితే చిక్కువస్తుందని అతడు కృష్ణుడు పేరు

చెప్పాడు. భీష్ముడి అనౌచిత్యాన్ని శిశుపాలుడు ప్రశ్నించాడు. కృష్ణుడిని అజ్ఞాని అన్నాడు. విజ్ఞాననిధిగా భీష్ముణ్ణి పొగిడాడు. అంతమాత్రాన అతడే గీతా కారుడంటానికి వీలులేదు. కృష్ణుడు మిధ్య కాదనీ, కురుక్షేత్ర యుద్ధం జరిగిందని అనుకొందాం. యుద్ధ సమయంలో కృష్ణుడి వయసెంత? ద్రౌపదీ స్వయంవరంలో తన వయసు 64. అర్జునుడు సుభద్రను పెళ్ళాడినపుడు కృష్ణుని వయసు 80. కురుక్షేత్ర యుద్ధం నాటికి 94 ఏళ్ళు అన్నారు. కురుక్షేత్ర యుద్ధానంతరం 36 ఏళ్ళకు కృష్ణుడు చనిపోయాడు. సి.వి.వైద్య అంచనా ప్రకారం క్రీ.పూ. 3185 కృష్ణుడు పుడితే మహాభారత యుద్ధం నాటికి 84 ఏళ్ళుండాలన్నాడు. యుద్ధంలో పాల్గొనటానికి అది సరైన వయసు కాదు. ఐతే దక్షిణాఫ్రికాలో బ్రిటిషు సైన్యాల అధిపతిగా లార్డ్ రాబర్ట్స్ ఉన్నట్లు ఫీల్డ్ మార్షల్ చెప్పారు. కనుక 84 ఏళ్ళపుడు కృష్ణుడు రథసారధి కావటంలో తప్పులేదన్నాడు. ఆధునిక యుద్ధాలకూ, ప్రాచీన యుద్ధాలకూ తేడా అతను గమనించినట్లు లేదు. మహాభారత యుద్ధంలో కృష్ణుడు తప్ప రథసారధులందరూ చనిపోయారు. కృష్ణుడికి యుద్ధనియమాలేవీ సోకినట్టు లేదు అని హాప్కిన్స్ రాశాడు. (EW Hopkins : The Social And Military Position of the Ruling Caste in Ancient India. Varanasi, 1972. p 198).

కృష్ణుడు రథసారధిగా వృద్ధాప్యంలో పనిచేయటం, అప్పుడే గీతాలాపన చేయటం అసంబద్ధమైన విషయాలు. శీతానాధ్ తత్త్వభూషణ్ అదే విషయాన్ని చెపుతూ క్రీ.పూ. 12వ శతాబ్దంలో ఉన్న వ్యక్తి గీతను చెప్పి ఉండదని అభిప్రాయ పడ్డాడు. (Krishna And the Geetha) గీతను బయట నుంచి ప్రవేశపెట్టినట్లు 1863లో వెబర్ అభిప్రాయపడ్డాడు. అంతేగాక అది కలగా పులగమైన రచన అన్నాడు. (Quest for The Original Gita, Quoted by G S Khair. Bombay, 1969). 1877లో మోనియర్ విలియమ్స్ రాస్తూ గీత ఒక ఆణిముత్యమనీ, ఐతే అది మహాభారతంలో చొప్పించారని అన్నాడు. బహుశ బ్రాహ్మణుడో, వైష్ణవుడో, తాత్త్వికుడో ఈ పని చేసి ఉండవచ్చువని అన్నాడు. ఆ తాత్త్వికుడు కృష్ణుడు మాత్రం కాదు. గీతను ఒక వైపున పొగుడుతూనే అందులో అసంబద్ధాలున్నాయన్నాడు. (EW Hopkins : Religions of India).

రిచర్డ్ గార్బ్స్ జర్మనీలో గీతను గురించి రాశాడు. దీనిని కె.ఎస్. ఉపాధ్యాయ ఉదహరించాడు. తొలుత గీత సాంఖ్య సారాంశమనీ, ఉత్తరోత్తరా ఓ వేదాంతి దీనిని విస్తరించి ఉండవచ్చుననీ అన్నాడు. గార్బ్ ఉద్దేశంలో తొలిగీతలో 628 శ్లోకాలున్నాయి. (K NUpadhaya : Early Buddhism And Bhagavat Gita)

రుడాల్ఫ్ ఓటో గీతపై తన సిద్ధాంతాలను ప్రకటించాడు. తొలిగీతలో 28 శ్లోకాలే ఉన్నాయంటాడు. తరువాత నెమ్మదిగా చేర్చుకుంటూ వచ్చారంటాడు. (Rudolf Otto : The Original Gita. London, 1936). గీతాకారుడెవరో మనకెంత తెలుసో ఓటొకి అంతే తెలుసు. అది రాసింది మతకర్త కాదనీ, గొప్ప కవి మాత్రమే అలా సృష్టించగలడనీ అన్నారు.

మహాభారతం కంటె గీత ముందురాశారనీ, తరువాత 80 శ్లోకాలలో మహాభారతం ప్రస్తావన తెచ్చారనీ ఎస్.సి.రాయ్ అన్నారు, బౌద్ధం కంటె ముందే గీత ఉన్నదని అన్నారు. (The Bhagavat Gita And Modern Scholarship, Quoted by B Majumdar Krishna in History).

సురేంద్రనాథ్ దాస్ గుప్త బౌద్ధానికి ముందే స్వతంత్ర గ్రంథంగా గీత ఉన్నదనీ, దాన్ని మహాభారతంలోకి తెచ్చారనీ, గీతకున్న పవిత్రత దృష్ట్యా అలా చేశారన్నాడు. గీత పై పరిశోధించిన ఫ్రాంక్లిన్ ఎగ్గటన్ గీతను సమైక్య రచనగా

పేర్కొన్నాడు. భారతంలో ఇది భాగం కాదనీ, తరువాతనే దీన్ని ప్రవేశపెట్టారన్నాడు. గీతను ప్రార్థనా గ్రంథంగా వాడిన గజానన్ శ్రీపతిఖేర్ 26 శతాబ్దాల క్రితం జరిగిన గీతారచన ఇంకా భారతీయుల్లో ప్రతిధ్వనిస్తుందన్నారు. భౌతికవాదానికి దూరంగా, ఆధ్యాత్మిక వాదానికి చేరువగా ఉంచుతుందన్నారు. భగవాన్ కృష్ణుడు గీతను రాయలేదనీ, యుద్ధరంగంలో గద్యంలో జరిగిన సంభాషణంతా తరువాత గీతగా శ్లోకాలలో మలచి జొప్పించారని అన్నాడు. మొత్తం ముగ్గురు రచయితలు గీతను పూర్తిచేశారన్నాడు. (GS Khair: Quest for the Original Gita. Bombay, 1969. p11).

ఈ విధంగా చూస్తే గీత రచనల గురించి అనంతంగా చర్చ సాగుతుది. అందులో ఆలోచనా సమైక్యతే ఉంటే, క్రమబద్ధమైన తత్త్వమే ఉంటే, ఇంత గందరగోళం వచ్చేది కాదు. మహాభారతం ఎంతకలగా పులగమో, గీత కూడా అంతే అని వింటర్ సిట్ అన్నాడు.

ఎప్పుడు రాశారు?

గీత ఎప్పుడు రాసిందీ సరిగా తెలియకపోవటంలో ఆశ్చర్యం లేదు. మనవారికి చారిత్రక జ్ఞానం లేదు. కాలజ్ఞానం లేకపోవుటయే అందుకు కారణం. సంవత్సరం అంటే మన వారికి బొత్తిగా అర్థం లేని విషయమే. దేవుళ్ళ దృష్టిలో అది ఒక రోజు మాత్రమే. ఒక జీవిత కాలానికీ మనవారు ప్రాధాన్యత ఇవ్వలేదు. అనంత గతజన్మలలో, భవిష్యత్తు జన్మలలో ఇది ఒక బిందువు మాత్రమే. ఆత్మ, పరమాత్మలో లీనం కావటం అసలు లక్ష్యం. అది జరిగినప్పుడు కాలం ఆగిపోతుంది. కనుక కపిలుడు ఎప్పుడు అన్నాడు? కణాదుడు ఎప్పుడు బోధించాడు? కనిష్కుడు ఎప్పుడు పాలించాడు? కాళిదాసు ఎప్పుడు రచించాడు? అనేవి పట్టించుకోగూడదు. వారంతా క్షణకాలం వెలిగి కాలగర్భంలో కలిసిపోతారు. మనం కాలాతీతంగా సమయానికి మించిపోయి వాస్తవాన్ని చూడాలి. బ్రహ్మ, విష్ణు, శివుడు, రాముడు, కృష్ణుడు, మత్స్య, . కూర్మావతారాలు మొదలగు వాటి నుండి బయటపడటం ఎలా? కాలాన్నీ, చరిత్రనూ పట్టించుకునేదెప్పుడు? ప్రాచీన భారత చరిత్రను నిర్దుష్టంగా రాసేదెలా? గీతను ఎవరు, ఎప్పుడు రాశారో నిర్ణయించేదెవరు?

మతగ్రంథాలూ, ఇతిహాసాలు, ఆధారం లేని చరిత్రలూ నమ్ముకోవలసి వస్తుంది. బుద్ధుడికి ముందే గీత ఉన్నదని ఊహిస్తున్నారు:
అలా చెప్పే ఎస్.బి.రాయ్, సురేంద్రనాథ్ దాస్ గుప్తాకు ఆధారాలేమిటి? గీతలో బౌద్ధ ప్రస్తావన లేదు. రామాయణ కర్తల కంటే మహాభారతంలో ప్రవేశపెట్టినవారు తెలివైనవారు. బుద్ధుడు చోరుడని రాముడి నోట పలికించారు. బుద్ధుడికి ముందే రాముడున్న విషయం వారు విస్మరించారు.
గీతలో బౌద్ధం ప్రస్తావన లేనప్పటికీ, గీతాశ్లోకాలపై బౌద్ధ ప్రభావం కనిపిస్తుంది. ఆనాడున్న బ్రాహ్మణ వాదాన్ని దెబ్బకొడుతున్నా, బౌద్ధాన్ని తిప్పికొట్టాలనే ప్రయత్నంతో గీతారచన సాగింది.

బుద్ధ, ప్రతిబుద్ధ అనే మాటలు ఇతిహాసంలో తరచు దొర్లాయి. సంస్కృతంలో స్థూప అనే అర్థం గల పదం ఎక్కువసార్లు కనిపించింది. దేశమంతా స్థూపాలతో నిండినట్లు గమనిస్తే బౌద్ధం తరువాతనే మహాభారత రచన సాగినట్లు తెలుస్తుంది.

గీతను ప్రాచీనతకు నెట్టి వేయాలని చూచేవారు గీతలో బ్రహ్మసూత్ర ప్రస్తావనను తెస్తారు. బాదరాయణుడి బ్రహ్మ సూత్రమే గీతలో ఉంటే, బౌద్ధం అనంతరమే భగవద్గీత వచ్చి ఉండాలి. బౌద్ధంలోని క్షణిక వాదాన్నీ, శూన్యవాదాన్ని బ్రహ్మసూత్రం కాదంటుంది. (సూత్రాలు 18-32 Bimanbehari Majumdar: Krishna in History and Legend. Calcutta, 1969. P46).

బ్రహ్మసూత్ర ప్రస్తావన అలా ఉంచి గీతలో వేదాంత ప్రస్తావన కూడా ఉంది. బౌద్ధం అనంతరం, బ్రహ్మసూత్రం అనంతరం గీత వచ్చిందనటానికి ఇదొక (Vedanta Sutram, 15-15) ఆధారం.

కె.యల్. ఉపాధ్యాయ గీతకు సంబంధించిన తేదీలూ, వివిధ పండితుల పరస్పర విరుద్ధ అభిప్రాయాలూ ప్రస్తావించి, అవన్నీ సమస్యా పరిష్కారానికి అవరోధాలే తప్ప సహాయకారి కాదన్నాడు. రాధాకృష్ణన్, బాలగంగాధర తిలక్, ఆర్.జి. భండార్కర్ ప్రభృతుల భిన్నాభిప్రాయాలు చూపాడు. (KLUpadhyaya: Early Buddhismand the Bhagavadgita. Delhi, 1971)

డి.డి. కోశాంబి రాస్తూ గీతలోని సంస్కృతం క్రీ.శ. 3వ శతాబ్దానికి చెందినదనీ, కనుక అంతకుముందు ఉన్నదనటానికి వీలులేదన్నాడు. ఇదంతా పరిశీలిస్తే పతంజలి అనంతరం అనేకమంది రచనగా గీత ఆవిర్భవించి ఉంటుంది.

ఈ అభిప్రాయాలను చూచి వైద్య వంటి వారు మండిపడటం సహజం. 84వ ఏట కృష్ణుడు సుదీర్ఘ తాత్త్విక విషయాన్ని కురుక్షేత్రంలో చెప్పటంలో ఆశ్చర్యం లేదన్నాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో హైండ్ బర్గ్ 70వ ఏట యుద్ధరంగం నుండి చాలా పెద్ద సమాచారాన్ని పంపించలేదా అన్నాడు.
ఎస్.కె. బెల్వాల్కర్ మహాభారతాన్ని ఆధారంగా చర్చిస్తూ, గీత అందులో భాగం కాదని నిదర్శనాలున్నాయన్నాడు. చాలా తెలివిగల వారెవరో గీతను భారతంలో చేర్చి ఉండాలి. (S.K. Belwalkar : The Cultural Heritage of India, Vol-II. Calcutta, 1961, pp 136, 137).

పవిత్ర గ్రంథంగా గీత

గీత వేదమూకాదు, వేదాంగమూ కాదు. దీనికి పవిత్రత తరువాత ఎప్పుడోగాని రాలేదు. ఆదిశంకరాచార్యుడికి ముందు గీతను ఎవరూ తీవ్రంగా పట్టించుకోలేదు. గ్రంథంలో అంతర్గత ప్రతిభనుబట్టి గాక శంకరాచార్యుడు తన కుల, శాఖ ఆసక్తుల దృష్ట్యా శ్రద్ధ వహించారు. వాదంలో అతడు దిట్ట.

ఇబ్బందికరమైన మాటలను తనకనుకూలంగా మార్చేశాడు. ఎదుటివారి వాదనలను వారికిబ్బందికరంగా పరిణమించేటట్లు చేసేవాడు. జుగుప్సాకరమైన స్థితిని సానుకూలం చేసుకునేవాడు. నిస్సందేహంగా అతడు ప్రతిభావంతుడు. పాతేయటానికి వీలుగా సమాజాన్ని నిర్మించడంలో అందెవేసిన చేయి. శంకరుడు ఆలోచనా రంగంలో నాయకత్వం చేపట్టిన తరువాత భారతదేశం వాడిపోయింది. క్రీస్తు తరువాత ఎనిమిదవ శతాబ్దం నుండి శంకరుడి అనంతరం జాతిపతనమైంది. అతడి తరువాత సాహిత్య సృష్టి, విజ్ఞానం వట్టిపోయాయి. శంకరాచార్యుడు గీతను తవ్వితీశాడు. మెరుగు పెట్టాడు. శంకరాచార్యుడి అనంతరం గీతకు ఆధిపత్యం

లభించిందని ఎస్.కె.బెల్వాల్కర్ అన్నాడు. (The Cultural Heritage of India, 1969) కాలాది ఆచార్యుడు మార్గం చూపిన తరువాత రామానుజుడు, మధ్వుడు, వల్లభుడు గీతను తమ ప్రయోగాలకు వాడుకున్నారు. పతంజలి కాలంలో హిందూమతాన్ని మొదటిసారి తిరగదోడగా దక్షిణాది నుండి వచ్చిన నలుగురు ఆచార్యులూ రెండవసారి తిరగదోడారు. శంకరుడు కేరళ నుండీ, రామానుజుడు తమిళనాడు నుండీ, మధ్వుడు కర్నాటక నుండి వల్లభుడు ఆంధ్ర నుండి వచ్చారు. ఈ నలుగురూ దేశంలో అంధకారయుగానికి నిర్మాతలయ్యారు. 8వ శతాబ్దం నుండి 18వ శతాబ్దం వరకూ ఆ దశ కొనసాగింది. స్వాతంత్ర్యానంతరం వారి ప్రభావం పూర్తిగా పోలేదు.

ఆచార్యులు నలుగురూ గీతను తమకనుకూలంగా వాడుకున్నారు. అద్వైత గ్రంథంగా శంకరుడూ, విశిష్టాద్వైత రచనగా రామానుజుడూ, ద్వైతంగా మధ్వుడు, శుద్ధ అద్వైతంగా వల్లభుడూ వాడుకున్నారు. ఈ ఆచార్యుల బాణీలో గీతకు భాష్యాలొచ్చాయి. భాష్యాలపై భాష్యాలొచ్చాయి. చెప్పిందే చెప్పటం హిందూ మత రచనల్లో అనూచానంగా వస్తుంది. ఆలోచనారాహిత్యానికి అది నిదర్శనం. ఈ భాష్యాలను గురించి తెలుసుకోవాలంటే సురేంద్రనాథ్ దాస్ గుప్త రాసిన భారత తత్త్వ చరిత్ర చూడవచ్చు. అతడి జాబితాలో కూడా ప్రాంతీయ భాషలలో వచ్చిన పుస్తకాలు లేవు. మరాఠీలో జ్ఞానేశ్వరి ప్రస్తావన లేదు. తెలుగులో తిక్కన గీతపై ఉన్నతాభిప్రాయాన్ని వెల్లడించలేదు. భీష్మపర్వంలో కేవలం 35 పద్యాలతో సరిపెట్టి, 700 గీతాశ్లోకాలను కుదించివేశాడు.

అందరూ తిక్కనలు కారు. గీతానువాదాలు నిరంతరంగా వెలువడ్డాయి. వివిధ భాషలలో వచ్చాయి. 1785లో గీత ఇంగ్లీషు అనువాదం వెలువడింది. ఛార్లెస్ విల్కిన్స్ ఇంగ్లీషు అనువాదాన్ని బాగా ప్రచారంలో పెట్టాడు. కంపెనీ పాలకులు దీనికి రాజపోషణ చేశారు. గీత ఫ్రెంచి అనువాదం 1787లో వెలువడింది. ఎం.పరాద్ అనువదించాడు. ఐనా, జనంలో గీతా ప్రభావం కనిపించలేదు. ఎడ్విన్ ఆర్నాల్డ్ చేసిన స్వేచ్ఛానువాదం గీతకు చాలా ప్రచారాన్ని తెచ్చి పెట్టింది. దీనికి The Song Celestial అనే పేరు పెట్టాడు.

హెన్రీ డేవిడ్ థోరో గీత అనువాదాలలో ఏది చదివాడో తెలియదుగాని, గీతాస్నానం రోజూ చేస్తానని అన్నాడు. దానిముందు ప్రపంచ సాహిత్యం అంతా మరుగుజ్జు వంటిదన్నాడు. ర్వాల్ఫ్ ఎమర్సన్ గూడా భగవద్గీతను ఆకాశానికెత్తాడు. ఆ విధంగా గీత విదేశాల్లో కూడా ప్రభావాన్ని కనబరిచింది. అనువాదాలూ, భాష్యాలూ, సిద్ధాంతాలూ, స్తుతి పాఠాలూ వస్తూనే ఉన్నాయి.

గీతను రబ్బరువలె సాగదీసి చెప్పటానికి వీలుగా సంస్కృత భాష వాడారు. గాంధీకి, గాడ్సేకి గూడా గీత పవిత్ర గ్రంథమే. ఎటుబడితే అటు వ్యాఖ్యానించటానికి వీలుగా గీత ఉన్నది.
సంస్కృతంలో పదాలకు నానా అర్థాలూ, భిన్న అర్థాలూ ఉండటమే దుకు కారణం. శ్రీ అనే పదానికి సంపద మొదలు విషం వరకు 20 అర్థాలున్న . అలాగే ధర్మం అనే పదానికి మతం మొదలు విల్లంబు వరకు 23 అర్థాలున్నాయి. దీని సంయుక్త పదాలు 150 వరకూ ఉన్నవి. వాటిలో మళ్ళీ అనేక ఛాయాభేదాలున్నాయి. గీతలో వచ్చే ధర్మం, ఖర్మం, యోగం ఎన్నో విధాల చిత్రించే అవకాశం ఉంది. పురోహిత భాషలన్నింటికీ ఈ లక్షణాలున్నాయి. అందులో సంస్కృతానికి ఇంకా ఆధిక్యాలున్నవి. ఈ విషయాన్ని డి.డి. కోశాంబి బాగా వివరించాడు.

గీత ఇంగ్లీషు తెలుగు అనువాదాలు, భాష్యాలతో నా కలాంటి అనుభవం ఉంది. దాదాపు 40 ఇంగ్లీషు అనువాదాలూ, 6 తెలుగు అనువాదాలూ నా సేకరణలో ఉన్నాయి. వీటిలో శంకరుడూ,రామానుజుడూ, మధ్వుడు, శ్రీధరుడూ, విల్కిన్స్, డేవిస్, ఆర్నాల్డ్, తెలాంగ్, బిసెంట్, రాధాకృష్ణన్, ప్రభుపాద, మహేష్ యోగి, చిన్మయానంద, అరవిందో, జహనీర్ వంటి వారున్నారు. చదువుతూ పోతే గందరగోళం కూడా పెరుగుతూ పోతుంది.

గీత పేరిట జరిగిన గ్రంథ చౌర్యాలను ఉపాధ్యాయ వివరించాడు. ప్రధాన భావాలనేగాక, అనేక భాగాలను ఉపనిషత్తుల నుండి గీత స్వీకరించింది. ఈ విషయాన్ని ఉపాధ్యాయ చాలా మర్యాదగా పేర్కొన్నాడు. (Early Buddhism and the Bhagavadgita) ఉపనిషత్తుల నుండి యథాతథంగా స్వీకరించినవి 22 చూపారు. ఇతర చోట్ల నుండి అరువు తెచ్చుకున్న భావాలు 13 వరకు చూపాడు. గీతభక్తులు శ్లాఘించే విషయాలలో ఉపనిషత్తుల నుండి కాపీ కొట్టేసినవి 7 చూపాడు. అందుకే కాబోలు గీతను ఉపనిషత్తుల సారాంశం అంటారు. అన్ని మత గ్రంథాలూ, ఇలాంటి పనులు చేశాయి. గ్రంథ చౌర్యంలో గీతకు ప్రథమ బహుమతి లభించాలి.

గీతకు తత్త్వం ఉందా?

పైథాగరస్ మొట్టమొదట తత్త్వం పద ప్రయోగం చేశాడు. ప్లేటో దీనినొక ప్రత్యేక శాఖగా పెంపొందించాడు. వారికి ముందు తత్త్వం లేదని అర్థం కాదు. అప్పుడూ ఉండేది. మానవుడు ఆశ్చర్యంతో, భయంతో, జిజ్ఞాసతో సూర్యోదయం, అస్తమయం ఎందుకు జరుగుతాయనీ, మేఘాలెలా ఏర్పడతాయనీ, వర్షాలెలా కురుస్తాయనీ, వరదలూ, తుపానులు, పిడుగులూ, మెరుపులూ దైవాగ్రహానికి సూచనలూ అనీ, చావు బ్రతుకుల అన్వేషణ, ప్రశ్నించడం మొదలు పెట్టినప్పటి నుండీ తత్త్వం పట్టింది.

తొలుత తత్త్వంలో అన్ని శాఖలూ ఉండేవి. 18వ శతాబ్దం వరకూ ఈ ధోరణి అమలులో ఉంది. ఫ్రెంచి విజ్ఞాన సర్వస్వంలో అందరినీ తాత్త్వికులని పిలిచారు. తత్త్వంగా ఒక ప్రత్యేక క్రమశిక్షణను తరువాత రూపొందించారు. జ్ఞానం అంతటినీ స్వీకరించి, అర్థాన్ని సమకూర్చి జీవితానికొక గమ్యం, ప్రయోజనం చేకూర్చడాన్ని తత్త్వం ఉద్దేశించింది. జ్ఞానంగాని, అనుభవం గానీ జడప్రాయం కాదు. అవి పెరుగుతూ విస్తరిస్తూ ఉంటాయి. తత్త్వం కూడా అలాగే పెంపొందుతుంది. కాలక్రమేణా మార్పుల కనుగుణంగా తత్త్వం సాగిపోతుంది. తత్త్వం కేవలం ప్రపంచాన్ని విడమరచి చెప్పటమేగాక, మార్చుకుంటూ పోవాలని మార్క్స్ అన్నాడు.

భారతదేశంలో తత్త్వాన్ని దర్శనం అంటున్నారు. ప్రత్యక్షంగా చూడటమని దీని అర్థం. చూడటం అంటే, ఆత్మగూపాన్ని వ్యక్తిగా, పరమాత్మగా చూడటమన్నారు. ఆవిధంగా తత్త్వం దేశంలో గాడి తప్పింది. బాహ్య ప్రపంచాన్ని పరిశీలించకుండా, హేతుబద్ధంగా ఆలోచించకుండా, శాస్త్రీయ పరిశోధనలను గమనించకుండా, మానవుడితో ప్రకృతికి గల సంబంధాన్ని, పదార్థానికీ చైతన్యానికీ, జీవికీ ఆలోచనకూ, మానవుడికీ మానవుడికీ సంబంధాలు చెప్పటం కష్టం.

ప్రపంచమంతా తత్త్వానికి చెందినదని విల్ డ్యూరాంట్ అన్నాడు. (Wil Durant : The Pleasures of Philosophy. p11). విశ్వమంతా భ్రాంతి అనుకుంటే తత్త్వం లేదు. విజ్ఞానం లేని తత్త్వం శక్తిహీనమైనదని

విల్ డ్యూరాంట్ అన్నాడు. భారతీయ తత్త్వం విజ్ఞానాన్ని దూరంగా పెడుతుంది. ఆత్మ ఒకటే, ప్రపంచం అంతా మాయ అంటుంది. కళ్ళుమూసుకొని, చెవులు మూసుకొని, ఊపిరి బిగబట్టి ఇంద్రియాలను పనిచేయనివ్వకుండా, మనసును స్థంభింపచేస్తే, ఆత్మ పరమాత్మలను ప్రత్యక్షంగా చూడవచ్చునంటుంది. వివిధ వేదాంత దర్శనాలు చెప్పేది ఇదే. ఇది నైతిక పతనానికీ, మానసిక రుగ్మతలకూ దారితీస్తుంది.

భగవద్గీతను తత్త్వం అనే కంటే మత ప్రమాణంగా భావించాలని రాధాకృష్ణన్ రాశాడు. (The Bhagavadgita. London, 1956. p 11). గీతలో ఉన్న తత్త్వం ద్వితీయ స్థానానికి చెందినట్లు అతడు సూచించాడు. వాస్తవానికి అలాంటిదేమీ లేదు.

సందేహించడం తత్త్వం కావచ్చుకాని, పిడివాదం కాదు. గీత ఏవిధంగా చూచినా తాత్త్వికం కాదు. అందులో పిడివాదాలూ నిండిపోయి ఉన్నాయి. అది మొండివాదాల నిఘంటువు. ఆధ్యాత్మిక విద్య, మాయ, మంత్రం, యుగధర్మం వంటి పిడివాదనలు అందులో కనిపిస్తాయి. గీత నమ్మకాల పుట్ట అని హాప్కిన్స్ అన్నాడు. నిర్ధారణ లేని ధోరణి, దాటవేసే పద్ధతి గీతలో హాప్కిన్స్ చూశాడు (EW Hopkins : The Bhagavadgita. Madras, 1953).

అరుణ్ శౌరి ఈ విషయంలో హాప్ కిన్స్ అభిప్రాయాలతో ఏకీభవించాడు (Arun Showrie : Hinduism, Essence and Consequence. 1979. pp 191, 192). .

గీతా సంప్రదాయంలో మునిగితేలిన రాధాకృష్ణన్ అయోమయం మధ్య అర్థాన్ని, క్రమత్వాన్నీ చూశాడు. మానవ స్వభావం అంతా సమన్వయీకరణగా గీతలో కనిపిస్తుందన్నారు. రుషికీ, ఆటవికుడికీ మధ్య తాత్త్వికుడు ఎక్కడ యిముడుతాడో ఇంకా రాధాకృష్ణ చెప్పాలి. గీతలో భిన్న రీతుల్ని సమన్వయించిన తీరు మనకు చూపడానికి రాధాకృష్ణ ప్రయత్నించాడు.

డి.ఎస్.శర్మ గీతలో ఎలాంటి సమైక్యతా లేదన్నాడు. క్రమత్వం చూడలేమన్నాడు కాని, గీతను దివ్యకవిత్వ మయంగా చూశాడు. పర్వతాలూ, సముద్రాలూ, అడవులూ ఎలా క్రమం లేనివో, గీత కూడా అంతే అన్నాడు. అది మతం, తత్త్వం కాదనీ, కవితా గానం అనీ పేర్కొన్నాడు. (DS Sharma : Lectures and Essays on the Bhagavadgita. Madras, 1945. p 19). వీరిరువురిలో మనం ఎవరిని స్వీకరించాలి?

గీత అనంత ప్రశ్నలకూ దారితీస్తుంది. అందులోని పిడివాదం అలాంటిది. ఈ విషయాలనే అరవిందశర్మ అనేక ప్రశ్నల రూపంగా చూపాడు. (Aravind Sharma: Thresholds in Hindu Buddhist Studies. Calcutta, 1979. pp 115, 116). నిజమైన గీత ఏదో చూపగలరా? లేదు. ప్రధాన ప్రశ్నలను దాటవేసే తీరులో గీత పయనిస్తుంది. దేవుడు ఒకప్పుడు వ్యక్తిగతమనీ, మరొకప్పుడు కాదని అంటుంది. (అధ్యాయం 9-17, 18) దేవుడు బ్రహ్మ పదార్థం అంటుంది (14వ అధ్యాయం, 27) మానవుడిలో దేవుడికి ఆసక్తి ఉందా? లేక పట్టించుకోడా? అవును, కాదు అంటుంది. (అధ్యాయం 9-22, అధ్యాయం 11-32,33,34) ఒక క్షణంలో ప్రేమ, దయ, క్షమాభిక్ష చూపిన దేవుడు, మరుక్షణంలో పగ సాధిస్తాడు. ప్రపంచం వాస్తవమా? అవును. (అధ్యాయం 7-4) కాదు, అదంతా భ్రమ. (అధ్యాయం 7-14) నీవేమి చేయాలో, చేయగూడదో వేదాలు

నిర్ణయిస్తాయి. (అధ్యాయం 16-24) కాదు, నీవు వేదాధికారం నుండి స్వేచ్ఛగా పయనించాలి. (అధ్యాయం 2-45,46) యజ్ఞాలు కావాలా? అవును. మరోచోట అవసరం లేదు. పూజలు చాలు అంటుంది. ఇలా అనంతంగా పరస్పర వైరుధ్యాలు సాగుతాయి.

గీతాభిమానులు ఈ వైరుధ్యాలను కేవలం పైకి కనిపించేవిగా భావించి వాస్తవం కాదని కొట్టిపారేస్తారు. వారంతా కావాలని కళ్ళు మూసుకుంటున్నారు. ఒకవైపు అహింసను పేర్కొంటూ మరొకవైపు యుద్ధాన్ని పురికొల్పారని డి.డి. కోశాంబి రాశాడు. (DD Kosambi : Myth and Reality. Bombay, 1962. p 17). ఇది కూడా పైకి కన్పించే విరుద్ధత్వమేనా? కె.టి. తెలాంగ్ గీత క్రమం లేని రచన అనీ, ఈ విషయంలో ఇది ప్రాచీన ఉపనిషత్తులకు పోలిందని అన్నారు. (KT Telang: The Bhagavadgita with the Sanastugatiya And Anugita. Oxford, 1908. pp 12, 13).

అప్పుడప్పుడూ వేదాలూ, వేదక్రతువులపై గీతలో అన్న విసురులు చూపి మతంపై తిరుగుబాటుగా కొందరు చూపుతున్నారు. అసలు విషయమేమంటే ఎవరికేది కావాలో అది చెప్పి అందరినీ వలలో వేసుకోటమే గీత చేసిన పని. ఫ్రాంక్లిన్ ఎడ్గర్టన్ అదే రాశాడు.

కలగా పులగం అనేది గీతకు ప్రత్యేక లక్షణం. భిన్న ఆలోచనా స్రవంతులను సరిదిద్ది సమన్వయ పరుస్తున్నదని రాధాకృష్ణ అన్నాడు. అది అడ్డగోలుగా పయనించటమే. గతంలోనూ, నేడూ దేశంలో ఇదే జరుగుతుంది. కలగా పులగంలో సమన్వయం లేదు. భిన్న ఆధారాల నుండి విభిన్న భావాలు స్వీకరించి ఒకే తీరులో సమన్వయీకరించాలనటం కుదిరే పని కాదు. అది ద్వంద్వ మనస్తత్వానికీ, దోషపూరిత జీవితానికి దారితీస్తుంది. భారతీయ చింతనాపరులు . అలాంటి ఊబిలోనే పడ్డారు. గీతలోనూ ఆ లక్షణాలున్నాయి. గీతకు నిర్దిష్టత లేదు. తత్త్వం, మతం, నీతి సమాజ శాస్త్రాలలో గీతస్థానం ఎక్కడ కచ్చితంగా నిలబడదు.

ఒక్క విషయం మాత్రం గీతలో నిర్దిష్టంగా చెప్పవచ్చు. అదే లొంగుబాటు. మనసునూ, ఇచ్ఛనూ, స్వేచ్ఛనూ, అన్నిటినీ పూర్తిగా తనకు లొంగుబాటు చేయమని చెప్పటమే గీత సారాంశం. నేను పోరాడను అని చెప్పిన అర్జునుడు నీవు చెప్పినట్లే చేస్తానని ముగిస్తాడు. అందులోనే గీత సారాంశముంది. తిరుగుబాటు నుండి లొంగుబాటుకూ, స్వేచ్ఛ నుండి బానిసత్వానికి గీత దారిచూపింది.

మనిషి ఎందుకు లొంగుతాడు, లొంగకుండా ఉండటం ఎంత కష్టం అనే విషయాన్ని ఎరిక్ ఫ్రాం చక్కగా వివరించాడు. "రాజ్యానికీ, మతానికీ, ప్రజాభిప్రాయానికీ లొంగి ఉంటే క్షేమం. ఎవరికి లొంగి ఉన్నామనేది ప్రధానం కాదు. ఒత్తిడిని ప్రయోగించే సంస్థ ఏదైనా సర్వశక్తివంతంగా రూపొందుతుంది.
అందులో భాగంగా లొంగిపోయిన వ్యక్తి తానూ శక్తివంతుడినే అనుకుంటాడు. తన కోసం నిర్ణయాలు చేసే సంస్థ బలీయమైంది. కనుక తానే మీ దోషం చేయలేదనుకొంటాడు. (Eric Fromm : A Matter of Life, ed. by Clara Urguhart, Boston, 1963. p 101).

కృష్ణుడు తనను సర్వాంతర్యామిగా, సర్వశక్తివంతుడుగా చెప్పుకొని అర్జునుడితో పాటు అందరినీ తనకు లొంగిపొమ్మన్నాడు. ప్రపంచ మత సాహిత్యంలో అంత ఆడంబరంగా గొప్పలు చెప్పుకున్న ధోరణి మరి ఎక్కడా

కనిపించదు. తన శక్తిని శంకించిన వారినందరినీ ఖండించాడు. అలాంటి తత్త్వం అత్యున్నతమైందని మన నాయకులు పొగిడారు. మన దేశం శతాబ్దాలుగా లొంగిపోయిందంటే ఆశ్చర్యమేముంది? ఇరానియన్లూ, గ్రీకులూ, బాక్ట్రీరియన్లూ, కుషాణులూ, హూణులూ, శాక్యులూ, అరబ్బులూ, తురుష్కులూ, మొగలులూ, ఆఫ్ఘన్లూ, పోర్చుగీస్, ఫ్రెంచి, బ్రిటీష్ వారికి భారత జాతి లొంగిపోయింది. 1962లో చైనావారి తన్నులకు గురైంది. ఇదంతా లొంగుబాటు తత్త్వ సారాంశమే.

భారతదేశం ఏనాడైనా నిశిత పరిశీలనకు పూనుకుంటుందా? వివేచనతో ఆలోచిస్తుందా? మూఢనమ్మకాలూ, సంప్రదాయాలూ, పెత్తందారీ తనాన్ని ప్రశ్నిస్తుందా? గీతభజన చేస్తూ కృష్ణుడిని స్తుతించినంత కాలం ఇది జరగదు.

గీత -నీతి

నీతిశాస్త్రం విశాలమైంది. లోతుపాతులతో కూడినది. విశ్వవ్యాప్తమైనది. ప్రవర్తన నియామావళి కంటే నీతిశాస్త్ర పరిధి పెద్దది. గ్రీస్లో పెంపొందినట్టుగా భారతదేశంలో నీతిశాస్త్రం పెంపొందలేదు. గౌతమ బుద్ధుడు మతానికి నీతి ప్రాతిపదిక అందించాడు. కాని, మహాయాన, తదితర శాఖలు నీతి ప్రాతిపదికను తగ్గించివేశాయి. నీతిశాస్త్రం ప్రధానంగా సమాజపరమైనదని Bloo& pjes engoo. (Bertrand Russell : An Outline of Philosophy. London, 1948. p141). సామాజికంగా పొందిక ఉన్నచోట నీతి విధానం పెంపొందుతుంది. కులాలూ, ఉపకులాల వలన మనకది లేకుండా పోయింది. సామాజిక ప్రవృత్తి కూడా మనకు లోపించింది. ఎప్పుడైనా ఉంటే అది కాస్త కర్మ, పునర్జన్మ వలన బలహీన పడింది. వేదాంతం ఇంకా కుంటుపరచింది. ముక్తి, మోక్షం, నిర్వాణం అంతిమ జన్మల బంధం నుండి విముక్తి చెందాలంటే కుమారుడు, భార్య, కుటుంబం బంధాలు వదలుకోవాలని కృష్ణుడు బోధించాడు. (Sankaracharya, Bhagavadgita with commentary, translated by Alladi Mahadeva sastri. లక్ష్యాలుగా నీతిని చంపేశాయి.

Madras, 1979, 9341) ఈ విషయంలో ఎలాంటి సందేహం మిగల్చకుండా శంకరాచార్య భాష్యం చెప్పాడు. భగవంతుని పట్ల లీనం కావలసిన దశ పొందాలంటే సమాజంలో మనుషులకు దూరంగా ఉండాలన్నాడు. ఈ దారుణ పంథాను గురించి రంగనాధానంద ఇలా చెప్పాడు రెండువేల సంవత్సరాల నుండీ గీతలో కృష్ణుడు బోధించినట్లు హేతుబద్ధమైన విశ్వజనీన ఆధ్యాత్మిక పంథాను అనుసరిస్తే నేటి గందరగోళ పరిస్థితులకు మార్గాంతరంగా ఉంటుంది. గీతాబోధన ప్రపంచ మానవాళికి చిరకాల ప్రయోజనాన్ని అందించాలని కోరుకుందాం.(Swami Ranganadhananda : Studies in the Gita ed. M.D. Paradkar. Bombay, 1970. p53) అయిష్టంగా ఉన్న అర్జునుడిని ఆయుధాలు చేపట్టి చంపమని పురికొల్పిన గీత ప్రపంచశాంతికేమి దోహదం చేస్తుంది? అర్జునుడికి స్వేచ్ఛ లేదనీ, అతడు గురువుతో సహా అందరినీ చంపివేయాలనీ, కృష్ణుడు వారినిముందే చంపేశాడని బోధించిన గీత స్వేచ్ఛను ఎలా పెంపొందజేస్తుంది? అందులోని సత్యాన్ని రంగనాధానంద మాత్రమే గ్రహించగలడు. శుశ్రువ రాసిన గీతావ్యాఖ్యానం నాకు బొత్తిగా అర్థం కాలేదు (Susruva : The Esoteric Gospel of Gita. Madras, 1978. P 51).

గీతలోని నీతిని గురించి జి.డబ్ల్యు. కావీశ్వర్ రాశాడు. మానవాళి ముందు ఆచరణకు ఉపక్రమించ వలసిన లక్ష్యాన్ని గీత చూపినట్లు పేర్కొన్నారు. బహుశ కర్మయోగాన్ని దృష్టిలో పెట్టుకొని ఆయన ఈ మాటలని ఉంటాడు. భాషకూ, మనసుకూ అందని విషయాలను రాయటం మూర్ఖత్వమని కావీశ్వర్ గ్రహించి ఉండవలసింది. శంకరుడు, రామానుజుడు, మధ్వుడు, ఇతర వేదాంతులను పాశ్చాత్య తాత్త్విక ఆచార్యులతో పోలుస్తుంటారు. ఎ.ఎస్. శర్మ బట్లర్ నీతిశాస్త్రం భగవద్గీతలో కార్యాచరణతో పోల్చిరాశాడు. మరొక ఆచార్యుడు బి.యస్.గన్ వాల్ కాంట్ నూ, గీతనూ పోల్చిరాశాడు. బహుశ గీతను చూచి జర్మనీ తత్త్వవేత్త తమ ఆలోచనను రూపొందించుకొని ఉంటాడన్నాడు. (B.S. Ganchkwal : The concept of Perfection in the Teachings of Kant and Gita. Delhi, 1967) కాంట్ 1804లో చనిపోయాడు. జర్మనీలో 1908లో ఫ్రెడరిక్ ష్లీగల్ గీతలోని కొన్ని భాగాలను అనువదించి ప్రస్తావించాడు. అలాంటి గీతాప్రభావం కాంట్ పై ఉన్నదనటం అర్థం లేనిది. అలాగే ఎస్.ఎస్. రాఘవాచార్య గీతను విశిష్టాద్వైత గ్రంథంగా పేర్కొన్నాడు. ప్రతి మానవుడికీ లక్ష్యంగా పరిగణించాలని కాంట్ చెప్పిన తత్త్వం గీతకే మాత్రం పొసగదు. గీతపై ఇలా వివిధ రచనలు వెలువడుతూనే వచ్చాయి. పి.ఎన్. శ్రీనివాసాచారి, హెచ్.వి. దివాతియా గ్రంథాలు రాశారు. బ్రిటీష్ కాలంలోనూ, స్వతంత్ర భారతంలోనూ అనుభవం గల దివాతియా గీతలోని నీతి అవగాహన చేసుకోటానికి వీలులేనిదని రాశాడు. గీతపై ఎవరు ఎలా వ్యాఖ్యానం చేసినా నీతికి సంబంధించి గీత చాలా దూరమనేది స్పష్టం.

అశోకుడి నుండి మార్క్స్, ఏంగెల్స్ వరకూ అనేక నీతి విధానాలు వచ్చాయి. విల్ డ్యూరాంట్ వీటన్నిటినీ మూడు రీతులుగా వర్గీకరించాడు. 1. బుద్ధుడూ, జోసెఫ్ చెప్పినది, 2. మకియవల్లీ, నీషే ప్రవచించినది. 3. సోక్రటీస్, ప్లేటో, ఆరిస్టాటిల్ చెప్పిన తీరు, ఇందులో గీతాకారుడు అనుకొంటున్న కృష్ణుడు నీతిలో మాకియవిల్లీ, నీ షేలను పుణికిపుచ్చుకొన్నాడు. మాకియవెల్లీ నిరంకుశపాలనను కోరాడు. గట్టి రాజ్యపాలన అభిలషించాడు. నీషే సూపర్ మాన్ కావాలన్నాడు. లక్ష్యాన్ని సాధించటానికి మార్గం ఎలాంటిదైనా వారు పట్టించుకోలేదు. బలం గల వారిదే రాజ్యం అనే ధోరణిలో చెప్పారు. కృష్ణుడి ధోరణి కూడా అదే. మహాభారతం, పురాణాలూ చూపుతున్న కృష్ణుడిలో ఆ ధోరణిలో చెప్పారు. కృష్ణుడి ధోరణి కూడా అదే. మహాభారతం, పురాణాలూ చూపుతున్న కృష్ణుడిలో ఆ ధోరణి ఉండవచ్చుకాని, గీతలోని కృష్ణుడిలో అలాంటి లక్షణాలు లేవని కొందరంటారు. నా దృష్టిలో ఆ లక్షణాలు స్పష్టంగా ఉన్నాయి. యదుకుల నాయకుడైన కృష్ణుడు నిరంకుశపాలనలోనే ఉన్నాడు. ప్రజాస్వామ్య శక్తులకు . అతడు మద్దతు ఎందుకు ఇవ్వలేకపోయాడు? సామ్రాజ్యవాదానికి తొలిమెట్టుగా రాజరికాన్నే పురికొల్పాడు. నేనే రాజునని ప్రకటించుకున్నాడు. అతడికున్న పలుకుబడితో పాండవ కౌరవుల మధ్య సామరస్యం సాధించవచ్చు. హస్తినాపురానికి సంధి రాయబారిగా వెళ్ళి అనంగీకార కోర్కెలను ముందు పెట్టాడు. ఐదు ఊళ్ళిస్తే పాండవులు సంధికి ఒప్పుకుంటారని చాలామంది భావించారు. కౌరవులు పరువు గలవారిగా పాండవులతో సంధి నిమిత్తం తన పాలును వదలుకోమని ద్రోణుణ్ణి అడగలేకపోయారు. కృష్ణుడికా విషయం తెలుసు. కౌరవులు గర్విష్టులని చిత్రించారు. ఐనా కృష్ణుడు యుద్ధంలో తటస్థవైఖరి నటించాడు. వాస్తవానికి పోరాటానికి మించిన పాత్ర వహించాడు. అర్జునుడు ఉపసంహరించుకోటానికి అంగీకరిస్తే, యుద్ధం సాగేదికాదు. అర్జునుడిపై అన్ని విధాలైన ఎత్తుగడలూ ప్రయోగించాడు. గెలిస్తే రాజ్యం వస్తుందనీ, విఫలమైతే స్వర్గం లభిస్తుందనీ చెప్పాడు.

అర్జునుడిని అతడి మనస్సాక్షికి వ్యతిరేకంగా ప్రవర్తించమనడం నీతివంతుడి లక్షణం కాదు. పైగా అందరినీ తాను ముందే చంపేసాననీ, నీవు చంపబోతున్నా ననుకోటం అజ్ఞానం అని చెప్పి విశ్వరూపం చూపాడు. అర్జునుడిని

మోహనిద్రలో పడవేశాడు. . అందుకే ప్రేమనాథ్ బజాజ్ గీతను గురించి అదొక హత్యాకాండగా పేర్కొన్నాడు. (Prem Nath Bazaz : the Role of the Bhagavadgita in Indian History. Delhi, 1975). డి.డి. కోశాంబి గీతలోని నీతిని గురించి రాస్తూ, "నాలో విశ్వాసం ఉంటే పాపాలన్నీ క్షమించబడతాయనీ, నీ విధి ప్రకారం సోదరులనైనా చంపేయాలని" గీత బోధించిందన్నాడు.

గీతాభిమానులకు ఇవన్నీ పట్టవు. ఉపనిషత్తుల సారాంశమేగాక వాటిని ప్రపంచంలోకి తెచ్చింది గీత మాత్రమేనంటారు. పోరాడమని గీత బోధించడంలోనూ అందిక పొందిక లేదని అరుణ్ శౌరి రాశాడు. ఈ పోరాటాలు ప్రపంచాన్ని మెరుగుపరచటానికి కాదు. ఆత్మను పరమాత్మలో లీనం చేయటానికి మాత్రమే, నా దృష్టిలో ఆత్మ పరమాత్మలో లీనం అనేది సంకుచితం, స్వార్థపూరితం, నీచం. లీనం కావల్సింది బ్రతుకుతోనూ, మానవాళితోనూ మాత్రమే. నేడు మనమున్న స్థితికి రావటానికి ఎన్నో తరాలవారు పుట్టిగిట్టారు. గత తరాలకు మనం రుణపడి ఉన్నాం. ఈ గత తరాల సంపదను భావి తరాలకు అందించటం మన కర్తవ్యం. ఇందులో చేతనైనంత కృషి చేయాలి. గీతను గమనిస్తే స్వార్ధం లేకుండా చర్యకుపూనుకోవాలనటం జన్నత్యమే కావచ్చు కాని, ఫలితాలు ఎలా ఉంటాయో పట్టించుకోకుండా పనులు చేయటం చాలా తప్పు. చేసిన పని ఫలితంగా దోషాలు రాబోతున్నాయని తెలిస్తే ఆ పని చేపట్టకూడదు. కులవృత్తిగా, ప్రవృత్తిగా పనిచేయటం మందలో ఆలోచనా రహితుడి ధోరణి మాత్రమే. అరమరికలు లేకుండా చంపేయమనీ, అది కుల వృత్తి ధర్మమనీ చెప్పటం కంటె ఘోరం మరొకటి లేదు.

గీత నీతి మాకియవెల్లీ, నీషేలను పోలినది. మాకియవెల్లీ చివరిదశలో పదవికి దూరంగా కారాగారంలో బతికాడు. నీషే పిచ్చాసుపత్రిలో మరణించాడు. కృష్ణుడు ఒక ఆదివాసి విలుకాని చేతిలో హతమయ్యాడు. వీటికి ప్రాధాన్యత లేకపోలేదు.

గీతలో సామాజిక రీతి

సామాజిక శాస్త్రం సమాజాన్ని అధ్యయనం చేసే విధానం. అది ఆత్మజ్ఞానం కాదు. భగవద్గీత - హిందూ సమాజశాస్త్రం అనే పుస్తకాన్ని ఎమ్.కె. శ్రావణ్ రాశాడు. అందులో అట్టమీద తప్ప సమాజ విజ్ఞాన ప్రస్తావన లోపల ఎక్కడా లేదు. సుప్రసిద్ధ సమాజ శాస్త్రజ్ఞుల పేర్లు తెలిసినట్లే లేవు. డ హైమ్, లాల్, బెంథామ్, కామ్రే, మిల్, స్పెన్సర్, మార్క్స్, ఏంగెల్స్ గురించి విన్నట్లే లేదు. సమాజం, సమాజశాస్త్రం అతని పరిధిలోనే లేవు. కుల ప్రస్తావన మినహాయిస్తే, సమాజ విజ్ఞానాన్ని పట్టించుకున్నట్లే లేదు. ఆత్మ బ్రహ్మ, ధర్మ, కర్మ, మాయ, యోగ, వేదాంత - ఎంతసేపూ, అదే గొడవ. గీత భక్తి సారాంశమని రాశాడు (M.K. Shravan : Bhagavadgita And The Hindu Sociology. Delhi, 1977. 241)అలాంటప్పుడు గీతలో సమాజశాస్త్రం ఉంది అని ఎందుకు పేర్కొన్నట్లు?

ఒక పేజీలో చెప్పింది పక్క పేజీలో శ్రావణ్ మర్చిపోతున్నాడు. భీష్ముడూ, కృష్ణుడూ క్షత్రియులైనప్పటికీ, బ్రాహ్మణులు వారిని తమ వర్గంగా, ఉపాధ్యాయులుగా భావించారు.

మరోచోట యుధిష్ఠిరుడు బ్రాహ్మణుల పాదాలు కడిగినట్లు చెప్పాడు. కృష్ణుడు శాంతి సమయంలో వలె యుద్ధంలో కూడా నెమ్మదిగానే ఉండేవాడన్నాడు. రెండు పర్యాయాలు కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణుడు రథం దిగి భీష్మణ్ణి ఎదుర్కోబోగా అర్జునుడు వారించిన విషయం మరిచిపోయి నట్లున్నాడు. శ్రావణ్ కు తెలియకపోయినా గీతకు సొంత సమాజ శాస్త్రం ఉన్నది. గుణాన్నీ, పనిని బట్టి నాలుగు వర్ణాలూ నేను సృష్టించానని చెప్పటంలోనే సారాంశం ఉంది. నాలుగు వర్ణాల బదులు నాలుగు కులాలని అల్లాడి మహాదేవ శాస్త్రి తన అనువాద గ్రంథంలో రాశాడు. (Shankaracharya : The Bhagavadgita with the commentary, tr. by Alladi Mahadeva Sastri. 1979. p 125) జాన్ డేవిడ్ అనువాదం కూడా నాలుగు కులాల్నే సూచిస్తుంది. కృష్ణుడు పేర్కొన్న నాల్గు విధాలైన సృష్టి నాలుగు కులాలకు చెందినది. హిందువు కులంలో పుడతాడు, అందులో నివశిస్తాడు, గతిస్తాడు. బ్రతికుండగా పాటించిన కులధర్మాన్ని బట్టే జన్మాంతరం కూడా ఆధారపడి ఉంటుంది. కులవిధానంలో పైకిపోయే అవకాశం లేదు. అదే, వర్గ సమాజంలో కూలివాడి కుమారుడు ఎంత పెద్ద స్థానానికైనా ఎదగవచ్చు.

కృష్ణుడు కులసమాజసృష్టికి తానే బాధ్యుడనని ఒప్పుకున్నాడు. గతజన్మల పాపపుణ్యాలను బట్టి ఈ జన్మలో కులనిర్ధారణ అవుతుంది. ఇలా చెప్పటంలో కృష్ణుడు మాటల గారడీ చూపాడు.

గీతా భాష్యకారులు కులం, దైవసృష్టి కనుక పవిత్రమయింది అంటున్నారు. దేవుడు స్థాపించిన సాంఘిక వ్యవస్థను కూలద్రోయటమే కులవిమర్శకుల పని అంటున్నారు. ఈ వ్యవస్థ హెచ్చుతగ్గులతో కూడినది. దేవుడు నామమాత్రంగానే ఈ విధానాన్ని సృష్టించినా, పూర్వజన్మల కర్మ ఫలితమే ఇందుకు కారణం. మనిషి స్వాభావిక అభిరుచుల్ని బట్టి కులాన్ని నిర్ధారించటం దేవుడి పని. పుట్టకముందే ఈ స్వభావం ఎలా తెలుస్తున్నదీ అంటే దేవుడు సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి గనుక. తల్లిగర్భంలోకి రాకముందే మానవుడి స్వభావాన్ని నిర్ణయిస్తాడు. కృష్ణుడు అర్జునుడితో నీ గతజన్మలన్నీ నీకు తెలియవు గాని, నాకు తెలుసు అంటాడు.

కులవిధానంలో ఎలాంటి దోషాలున్నా క్షమించే గుణం, ప్రేమ, దయ భగవంతునికున్నాయి. ఈ విషయం శంకరాచార్యుడు చాలా తెలివిగా చెప్పాడు.

నాలో శరణు పొందే వారందరూ ఉన్నత లక్ష్యాన్ని చేరుకుంటారు. స్త్రీలూ, వైశ్యులూ, శూద్రులూ పాపయోనికి పుట్టినప్పటికీ, నావలన విముక్తులవుతారు. భగవద్గీతలోని ఈ శ్లోకాన్ని ఒక పట్టాన విస్మరించటానికి వీలులేదు. శంకరాచార్యుడు అతి తెలివిగా దీనిని దాటవేశాడు. హిందూ సమాజంలో 90 శాతానికి వర్తించే శ్లోకమిది. అందులో 50% స్త్రీలకు చెందినది. వైశ్యులూ, శూద్రులూ కలిపి 40% ఉన్నారు. అంటరానివారి ప్రస్తావన గీతలోలేదు. వీరంతా పాపజన్ములేనా? పాపయోనికి పుట్టారనే మాటను శంకరాచార్యుడు కావాలని దాటేశాడు. పవిత్ర బ్రాహ్మణులంతా, రాజర్షులంతా తనను ఆరాధిస్తారని కృష్ణుడు అన్నాడు. ఆయన దృష్టిలో ఆ కొద్దిమందే పవిత్రులు. తెల్లవారు కానివారంతా తక్కువవారని కిప్లింగ్ అన్నట్లే గీతకూడా చులకన భావం చూపిస్తున్నది.

జీవన రంగంలో ఉన్నత స్థాయికి చేరుకున్న రాజులూ, పురోహితులూ సంపదను అదుపులో పెడుతూ సుఖాలనుభవిస్తున్నారు. ఆత్మ, పరమాత్మల సమ్మేళనానికి ప్రయత్నిస్తూ లోకంలో గడుపుతున్నారు. అణగారి పోయిన ప్రజల ఆగ్రహానికి రాజులూ, బ్రాహ్మణులూ గురికాకుండా ఉండాలని ఇలాంటి మాటలు చెప్పారు.

పాపయోని నుండి పుట్టినవారిలో స్త్రీలూ, వర్తకులూ, శ్రామికులూ ఉండటం, వీరు అత్యధిక సంఖ్యాకులు కావటం గమనిస్తే, గీతాప్రవచనం క్షమించరానిది అని చిన్మయానంద అన్నారు. దేవుడు చెప్పినా సరే అంగీకరించ రాదన్నాడు. (Swami Chinmayananda Bhagavadgita, 1979, Madras Chapters:7, 8, 9, Page:158) ఐనా ఏమో కుంటిసాకులతో చిన్మయానంద తప్పుకుపోయాడు. రాధాకృష్ణ కూడా ఈ మాటలపై వ్యాఖ్యానిస్తూ నాటి కాల పరిస్థితులను బట్టి చూడాలేగాని, స్త్రీలనూ శూద్రులనూ వేదాలకు దూరంచేయాలనే ఉద్దేశ్యం లేదన్నాడు. గీత ప్రేమ సందేశం అందరికీ వర్తిస్తుందన్నారు. జా డేవిడ్ కూడా ఇలాగే జాన్ వ్యాఖ్యానించటం చూస్తే ఆశ్చర్యం వేసింది. జవహర్ లాల్ నెహ్రూకు చిన్నతనంలో ఉపాధ్యాయుడుగా ఉన్న ఎఫ్.టి. బ్రూక్స్ కూడా గీతను ఈ విషయంలో ఏదో విధంగా సమర్ధించాడు. కీబోల్, ఎ.జె. బాన్, శకుంతలారావు, శాస్త్రి, అనిబిసెంట్, భగవాన్ దాస్, పరమానంద, వీరేశ్వరానంద, శివానంద, ఆర్థర్ ఆస్ బోర్నో, జి.వి. కులకర్ణి, నిహాల్ చంద్ వైశ్, పి. లాల్ తమ గీతాభాష్యాలలో ఇంచుమించు శంకరాచార్యుని అనువాదాన్నే పాటించారు. మిగిలిన వారు చాలామంది పాపయోనికి పుట్టినవారిని గురించి అనువాదాన్ని తప్పించటమో, ఏదో ఒక విధంగా పక్కదారులలో పోవటమో చేశారు. శీతానాధ్ తత్త్వభూషణ్ గూడా అలాచేయటం ఆశ్చర్యకరం. ఈ శ్లోకాన్ని చూచి కలవరపడిన దిలీప్ కుమార్ రాయ్ అసలే వదిలేసాడు. ఎడ్విన్ ఆర్నాల్డ్ సూక్ష్మంగా ఏదో చెప్పబోయాడు. ఎ.ఎస్.పి. అయ్యర్ బాధ్యతా రహితంగా ఈ శ్లోకాన్ని అనువదించి భాష్యం చెప్పాడు. పాపయోని అనటానికి బదులు పాపాత్ములైన స్త్రీలకు పుట్టినవారు అన్నాడు.

నీ కులధర్మం నుండి ఎన్నడూ తప్పుకోరాదని గీత బోధిస్తున్నది. కులవృత్తిలో అభిరుచి, లేకపోయినా అంటి పెట్టుకోవాలంటున్నది. నీ స్వభావాన్ని నిర్ణయించటంలో కృష్ణుడి కంటె నీకు ఎక్కువ తెలుసా అంటున్నది. స్వభావాన్ని బట్టి కులం వస్తున్నది గనుక, గత జన్మల చర్యలను బట్టి కులనిర్ధారణ జరుగుతున్నట్లు తెలుసుకోమంటున్నది. ఆకలితో అలమటిస్తుంటే అదీ గత జన్మల పాపఫలితమే అంటున్నది. కులవృత్తిని వదిలేసి సమాజానికి బాగా సేవచేసే అవకాశం ఉన్నప్పటికీ, అది ఉపద్రవానికే దారితీస్తుదంటున్నారు. ఎలాంటి ఉపద్రవం రానున్నదో తెలుసుకునే శక్తి నీకులేదంటున్నది. కనుక మూర్ఖమార్గాలను అవలంబించవద్దంటున్నది. శంకరాచార్యుడు చిన్నరకం భగవంతుడు గనుక, ఈ ఉపద్రవం నరకానికి పోవటమేనని చెప్పాడు.

పాండిచేరి ఆశ్రమంలో సంపన్నుల ఆదరణ పొందిన అరవిందుడు గీతపై మరొక విధంగా వ్యాఖ్యానం చేశాడు. గీత ప్రకారం ఎత్తులు, తమ శక్తియుక్తులు గమనించకుండా వృత్తిని పాటించాలని అనటం లేదన్నాడు. (Sri Aurobindo : Essays on the Gita. American Editions, 1950. P 455) భారతదేశ స్వేచ్ఛా పురోగతిని అడ్డుకున్న వాళ్ళలో ఈ పాండిచేరి ఆశ్రమవాసి కూడా ఒకడు.

గీత కులాన్ని ఎలుగెత్తి చాటుతున్నది. అర్జునుడు వాపోవటంలో కుల కారణాలున్నాయి. యుద్ధవిపత్తు వలన అక్రమం పెరిగి, స్త్రీలు అవినీతిపరులై, కుల విధానంలో గందరగోళం వస్తుందన్నాడు. కులనియమాలు, కుటుంబం నాశనమవు తుందన్నాడు. తమవారిని చంపటం కంటె కులం ధ్వంసం కావటం విచారకరంగా అర్జునుడు భావించాడు. గీత బోధించే సమాజ శాస్త్రమంతా కులపరమైనదే.

గీత - విజ్ఞానం

అనేక శాస్త్రాలతో పాటు గీత ఆధునిక విజ్ఞానాన్ని కూడా బోధించింది. అణుభౌతిక శాస్త్రంలోని పరిశోధనలు సహితం ఊహించింది.

అలాంటి మాటలు వింటే ఆశ్చర్యం వేస్తున్నదా? ఇంకేమైనా అంటే హరీష్ దబాయి విజూభాయి దివాతియా మిమ్మల్ని దుమ్మెత్తి పోస్తాడు జాగ్రత్త. గీత - ఆధునిక విజ్ఞానం అంటూ ఒక అధ్యాయం కూడా తన గ్రంథంలో చేర్చాడు. అన్ని పరిశోధనలూ గీతలో చూడాలనుకోవటం విపరీతమే అవుతుందని కూడా అనుకున్నాడు. (H.V. Divatia : The Art of life in Bhagavatgita. Bombay, 1970. p 131) డార్విన్, హక్సలే, స్పెన్సర్ మొదలైన శాస్త్రజ్ఞులు చూపిన వాదనలను తప్పనిచూపే ప్రయత్నం చేశాడు.

కిందిస్థాయి నుండి ఉన్నత దశకు జీవితం పరిణమిస్తుందని డార్విన్, హక్సలే చెప్పారు. జీవితం కోసం పోరాటం, అర్హులైన వారు మనుగడసాగించటం అనే రెండు భావాలూ వెల్లడించారు. కోతులనుండి క్రమేణా మానవులుగా పరిణమించారు.

ఈ వాదనలన్నీ తప్పని దివాతియా చూపటానికి ప్రయత్నించారు. అందుకుగాను సర్ ఆలివలాడ్జీ, సర్ రిచర్డ్ గ్రిగరీ, సర్. జె.ఎ.వి. బట్లర్ ను సాక్ష్యంగా చూపాడు. ఆధునిక విజ్ఞానంలో వారిదే చివరిమాటగా స్వీకరించ మంటాడు. విశ్వమంతా విశాల జీవరాసి అనీ, ప్రతి జీవి అందులో ఒక భాగమనీ అంటాడు. శక్తి లేదా ఆత్మ అనే సూత్రం ఈ విశ్వంలో వ్యాపించి ప్రకంపన చెందుతుంటుంది. ఈ భావాలు వేదాంతంలో మాయనూ, విశ్వంలోని ఒకే భావం లేదా శక్తి ఉన్నదనే విషయాన్ని సమర్థిస్తున్నది. విశ్వమంతా బ్రహ్మస్వరూపం. మన ఇంద్రియ పరిమితి వలన భిన్నంగా కనిపిస్తూ ఉంటుంది. ఇది దివాతియా చెప్పిన విషయం.

ఆధునిక విజ్ఞానం మనలను మాయ, బ్రహ్మల దగ్గరకు తీసుకెళుతుందన్నమాట. భారతీయ రుషులు ఆధునిక శాస్త్రీయ పదజాలాన్ని వాడకుండా కవితలో, అలంకారాలలో శాశ్వత సత్యాలు చెప్పారని దివాతియా రాశాడు. గీతను జాగ్రత్తగా పరిశీలిస్తే ఆధునిక విజ్ఞానం అందులో ఉన్నట్లు కనుగొనవచ్చునన్నాడు. హెగెల్ వంటి వారు గీత చదివి ఉంటే ఇంకా గొప్ప తాత్త్వికులయ్యేవారని అన్నాడు.

సి. రాజగోపాలాచారి గీతను ప్రచారంలో పెట్టటమే గాక, తన అధికారంలో అందలి సూత్రాలను అమలు పరచటానికి కూడా ప్రయత్నించారు. మద్రాసు ముఖ్యమంత్రిగా గీతలోని స్వధర్మ సూత్రాన్ని ప్రతి విద్యార్థి పాటించాలన్నారు. తండ్రుల వృత్తిని అనుసరించి రోజులో సగభాగం వినియోగిస్తే, నిరుద్యోగ సమస్యకు పరిష్కారమన్నాడు. వర్ణాశ్రమ ధర్మాన్ని దొడ్డిదారిన తెచ్చే ఈ ప్రయత్నాన్ని తమిళనాడు ప్రజలు ప్రతిఘటించటంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. ఎస్.జి. సర్దేశాయి వెల్లడించిన ప్రకారం శంకరాచార్యులలో ఒకరు పూనాలో ప్రకటిస్తూ పాపయోని నుండి పుట్టిన శూద్రులూ, స్త్రీలూ ఈసడించబడాలి. ఇందులో వైశ్యులనొదిలి వేయటానికి కారణం మఠాలకు దానాలివ్వటమే కావచ్చు.

రాజగోపాలాచారి శాస్త్రజ్ఞుడి పాత్ర వహించి ఇలా అన్నాడు. "తండ్రుల భౌతిక లక్షణాలు, మానసిక ధోరణులూ పిల్లలకు సంక్రమిస్తున్నాయి. ఈ వంశపారంపర్యత కర్మసూత్రాన్ని వివరించదు. వంశపారంపర్యతలో దేహాలేగాని ఆత్మలు లేవు. ఆత్మకు తల్లిదండ్రులు లేరు. అది స్వయంభువు. ఏ ఆత్మ అయినా తనకు అర్హమైన శరీరంలోకి ప్రవేశిస్తుంది. పౌరుల అవసరాలను బట్టి ఇంజనీర్లు వివిధ భవనాలు నిర్మించినట్లే ఇది కూడా. కాని, అతడెప్పుడైనా డి.ఎన్.ఎ., ఆర్.ఎన్.ఎ., అనే మాటలు విన్నాడా? వంశపారంపర్య లక్షణాలు నిర్ణయించేది అవే అనీ, కర్మకాదనీ ఎవరూ చెప్పలేదా? అవి కనుగొన్న తరువాత జన్యుశాస్త్రం విప్లవాత్మకంగా మారిందని తెలియదా?

గీతలో విజ్ఞానాన్ని గురించి మాట్లాడే గీతా ప్రచారకులు విజ్ఞాన శాస్త్రజ్ఞులలోనూ లోపాలుంటాయని విస్మరిస్తున్నారు. న్యూటన్లో చాలా మూఢనమ్మకాలున్నాయి. సర్. ఆలివర్ లాడ్జ్, సర్ విలయిం క్రూక్స్, ఆల్ఫ్రెడ్ రసెల్ వాలెస్ శాస్త్రజ్ఞులైనా - మరొకవైపున చనిపోయిన అలెగ్జాండర్, షేక్స్ పియర్, నెపోలియన్లతో మాట్లాడుతున్నామంటూ, దయ్యాల శాస్త్రాన్ని ప్రచారంలో పెట్టారు. (F.E. Planer: Superstition. London, 1980) చాలా మంది శాస్త్రజ్ఞులు తమ పరిధి దాటిన తరువాత సంకుచిత మనస్తత్వంతో మూర్ఖంగా ఉన్నారని వాట్సన్ శాస్త్రజ్ఞుడు రాశాడు. (James DWatson : The Double Helex. London, 1969) మన వద్ద భగవంతం, స్వామినాథన్ ఇలాంటి వారే. గీతాకారులు తమ ఆత్మ, పరమాత్మ, కర్మ, పునర్జన్మ వంటి వేదాంతమాటలను సమర్థించుకునే ముందు, ఐన్ స్టీన్, ఫ్రాన్సిస్ క్రిక్, కార్ల్ సేగన్ వంటి వారి వాదనలు ఎందుకు వినలేదు అనిపిస్తుంది. ఆధునిక విజ్ఞానంలో వేదాంతంలో లేనిదేమీ లేదని అనేవారున్నారు. అంతకుమించిన మూర్ఖత్వం మరొకటి ఉండబోదు. డార్విన్, హక్సలే, ఏమి చెప్పినా, యజ్ఞాల ద్వారానే బ్రహ్మ సృష్టి జరిపాడనీ, ఆ తరువాత యజ్ఞాల ద్వారానే పెంపొందుతారనీ, సకాలంలో వర్షాలొస్తాయనీ నమ్మారు. దేవుళ్ళకు సంతర్పణలర్పిస్తుంటే వారు బదులందిస్తుంటారు.

చంద్రుడిని గొప్ప నక్షత్రంగా భావించారు. మొసలిని మత్స్యంగా స్వీకరించారు. అత్యంత వేగం గలదిగా వాయువును నమ్మారు. హిమాలయాలు అచలాలు అంటే కదలనివి అన్నారు. కొలనులను సముద్రాలుగా భావించారు. మనసును జ్ఞానేంద్రియం అన్నారు. గీత చెప్పిన గొప్ప శాస్త్రీయ సత్యాలు ఇవే. కృష్ణుడి కాలంలో విద్యుత్ ఉన్నదని కూడా చెప్పారు. కృష్ణుడికి విద్యుత్తు, సూర్య - చంద్రుల అవసరం లేదనీ, కావాలనుకుంటే తన మందిరాన్ని విద్యుత్ తో వెలిగించేవాడనీ స్వామి ప్రభుపాద రాశాడు. (Swami Prabhupada : Bhagavadgita, Los Angels. 1972. p229)

గీతలో సైన్స్ అలాంటిది. వేద ఉపనిషత్తుల సారాంశమది. విజ్ఞాన సర్వస్వమది. అలా భావించినంతకాలం భారతదేశంలో సైన్స్ కుంటుతూనే ఉంటుంది.

భారతదేశంలో నోబెల్ ప్రైజు వచ్చిన ముగ్గురిలో ఇరువురు అమెరికాలో కృషి చేసి కనుగొన్నారు. పైగా భారత పౌరసత్వాన్ని వదిలేసుకున్నారు. వేదభూమికి తిరిగి రాలేదు. వేదాంత భూమికలో సరైన శాస్త్రజ్ఞుడు ఆలోచించి పనిచేయటం కష్టం.

గీత ఎందుకు రాశారు?

గౌతమ బుద్ధుడు విప్లవవాది కాడు. బౌద్ధవాదం విప్లవమూ కాదు. ఆక్స్ఫర్డ్ నిఘంటువు నిర్వచించినదానికి దరిదాపుల్లోకి బౌద్ధంరాదు. బౌద్ధం తలపెట్టిన మార్పులు సంపూర్ణం కాదు, మౌలికమూ కాదు. ఉన్నత వ్యవస్థను తిరగవేసి పూర్తి మార్పును తేలేరు. బలవంతంగా ఏ రాజునూ, ప్రభుత్వాన్నీ తొలగించలేదు. బౌద్ధం సమూల సంస్కరణవాదం. అది ఎంత సమూలమైనా, విప్లవం కాజాలదు. పాతనంతా పడద్రోసి మళ్ళీ నిర్మిస్తే విప్లవం అవుతుంది. సంస్కరణ కేవలం మార్పులతో సరిపెట్టుకుంటుంది.

బుద్ధుడికి పూర్వమే వైదిక యజ్ఞయాగాదుల పట్ల, పశువుల్ని భారీ ఎత్తున చంపటం పట్ల నిరసన ఉన్నది. బుద్ధుడూ, మహావీరుడూ, గోశాల, అజిత మొదలైనవారు వేదాల దైవాధికారాన్ని ప్రశ్నించారు. భూదేవుల పేరిట నటిస్తున్న పురోహితులపట్ల నిరసన వ్యక్తం అయింది.

బుద్ధుడూ, తదితరులూ ఈ సాంఘిక మతధోరణులను బలపరిచారు. బిందుసారుడూ, మరి ఇతరుల మద్దతు లభించినందున సాఫల్యత పొందాడు. ఆ తరువాత అశోకుడూ, అతడి వారసులు కూడా బౌద్ధాన్ని సమర్థించారు. వేదాల అధికారాన్ని ప్రశ్నించటం వలన పురోహిత వర్గం బాధపడలేదు. బుద్ధుడికి ముందే ఉపనిషత్తులాపని చేశాయి. బుద్ధుడు కులవ్యవస్థను వ్యతిరేకించినందువలన కూడా అంతగా నొచ్చుకోలేదు. బౌద్ధ సంఘంలో కులానికి గుర్తింపులేదు. బయట కులాన్ని అతడు పట్టించుకోలేదు. పుట్టుక వలన బ్రాహ్మణుడు కాడనీ, క్షత్రియుడు బ్రాహ్మణుని కంటె ఆధిక్యతలో ఉన్నాడని బుద్ధుడు చూపాడు. బౌద్ధాన్ని బాగా అధ్యయనం చేసిన హెర్మన్ ఓల్డెన్ బర్గ్ సాంఘిక సంస్కర్తగానూ బుద్ధుడిని ఒప్పుకోలేదు. బుద్ధుడు కులబంధాలు ఛేదించాడనిగాని, పేదవారికి బౌద్ధంలో ఆధ్యాత్మిక స్థానాన్ని సంపాదించి పెట్టాడని గాని అంటే అది చారిత్రకం కాబోదని కూడా అన్నాడు, (Herman Overberg Buddha HIS 1.14, His Doctrine, His Order. Calcuta, 1927, 2153:154),

తమ ఆర్థిక స్థితిగతులు క్షీణించటంతో పురోహితవర్గం బాధపడింది. పేదయణాలు ఆహారం పురోహితులకు బత్యాలు లేకుండా పోయాయి. రాజుల అనుగ్రహం అంతా బౌడగాలను, రక్కటంతో పురోహితులకు ఆదాయం పోయింది. నగరీకరణం వలన బాగా సంపాటts, వైశ్యులు బౌద్ధం వైపుకు మొగ్గారు. పురోహితవర్గం తమ సామాజిక పునాదులు కదుపోరటం గ్రహించారు. వర్ణాశ్రమధర్మం కూలిపోవటం చూచారు. మనిషి కులంలో పుట్టటం, కులవృత్తిలో మార్పులేకుండా కొనసాగటం వర్ణాశ్రమ ధర్మలక్షణం. అత్యధిక సంఖ్యాక ప్రజానీకం బానిసలుగా బ్రతకటం, వారిపట్ల బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలు ఏమాత్రం బాధ్యత వహించక పోవటం తాటి పరిస్థితి. కుల బానిసత్వం అమానుషం, బాధ్యతా రహితం, పుట్టిన కణంలో, అట్టిపెట్టటం, అదే వృత్తిలో చేరేటట్లు చూడటం ఆచారమైపోయింది. బుద్ధుడు కులంపైనా, కులవృత్తిపైనా తీవ్రంగా దాడి చేయలేదు గాని, ఏ కులంలోని వారైనా సంఘంలో సభ్యుడైతే మిగిలిన వారితో సమానుడౌతాడని చూపాడు. కింది కులాల నుండి బౌద్ధ భిక్షువులుగా వచ్చారనేది వేరే అంశం. వారు చాలా కొద్దిమందేనని ఓర్బర్గ్ రాశాడు.

ఈ విధానం తమ వ్యవస్థను దెబ్బతీస్తున్నట్లు పురోహిత వర్గం పసికట్టింది. శూద్రుడు యజమాని కాబోతున్నాడని వారు భయపడినట్లే జరిగింది. శూద్రవంశం నుండి ప్రప్రథమంగా నందులు అధికారంలోకి వచ్చారు.

ఆ తరువాత మౌర్యులు శూద్రులుగా రాజ్యపాలన చేశారు. (Bhupendranath Dum: Studies in indian Social Polity, Calcuta, Page 188 స్వామి వివేకానంద సోదరుడే ఈ రచయిత) విస్తారమైన మౌర్య సామ్రాజ్యం దేశమంతా పాలించింది. బౌద్ధాన్ని స్వీకరించిన అశోకుడు దండ సమత ప్రవేశపెట్టాడు. (Romila Thopar: Ashoka And the Defined Mauryas. Oxford, 1983, p104) అంటే శిక్షల్లో అందరికీ సమానత్వం, వ్యవహార మమత కూడా అశోకుడు ప్రవేశపెట్టాడు. భూసురులనూ, శూద్రులనూ ఒకే స్థాయిలోకి తెచ్చాడు. చండాలురను కూడా వారి స్థాయిలోనే అట్టిపెట్టాడు. భూసురులు తప్పుడు దేవుళ్లని శాసనంపై చెక్కించాడు. (భూపేంద్రనాథ్ దత్తా; పేజి 189)

వర్ణాశ్రమ ధర్మాన్ని కాపాడటానికి చూద్రపాలన అంతం చేయాలి. దీనికి గాను చంద్రగుప్తుడు అశోకుడి వారసుడైన బృహద్రథులని చంపించారు. అతని వద్ద పుష్యమిత్రుడు అనే బ్రాహ్మణ సైన్యాధహో ఉండేవాడు. రాజు సైన్యాలను పరీక్షిస్తూ ఉండగా ఈ హత్య జరిగింది. పుష్యమిత్రుడ్డి ద్రోహిగా జాకవి పేర్కొన్నాడు. (Jagannathan: A Comprehensive History of India Bombay, 1857,var, Page 4) నిహారంచి మరొక విధంగా భావించాడు. ఇతిహాసాలూ, పురాణాలు మౌర్యులకు అసురులుగా భావించడాన్ని తేలికగా కొట్టి పారవేయరాదన్నాడు.

రచయితలు బ్రాహ్మలుగావటం, మౌర్యులు బౌద్ధులుగావటం ఇందుకు కారణం కాదన్నాడు. (Niharanjan Roy : Maurya And the Post Maurya Art. New Delhi, 1975) నిహరంజన్ రాయ్ భారతదేశంలో అత్యవసర పరిస్థితిని సమర్థించాడు. అలాంటివాడు పుష్యమిత్రుడిని గొప్ప విమోచనకారుడిగా, మౌర్యులు పాలించినప్పుడు సామాన్యులు బాధలకు గురైనట్లుగా చిత్రించాడు.

పుష్యమిత్రుడు, తొలి బ్రాహ్మణ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. బౌద్ధాన్ని విధ్వంసం చేయాలనీ, బ్రాహ్మణీకాన్ని తిరగదోయటాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాడు. బౌద్ధ భిక్షువులను చంపేసి, బౌద్ధ ఆరామాలను ధ్వంసం చేయతలపెట్టాడు. (K.P.Jayaswal: An Imperial History of India) బౌద్ధ భిక్షువులను చంపి, వారి తలలను తనకు బహూకరిస్తే నూరుదీనార్లు చొప్పున ప్రతి తలకూ ఇస్తానని ప్రకటించినట్లు దివ్యవదనుడు తెలిపాడు. (B.C. Sinha : History of Sunga Dynasty. Delhi: 1977) ఐతే, అప్పటికే కాలం మారింది. పాతమూసలో బ్రాహ్మణ విధానాన్ని పోయటానికి వీలులేదు. కొత్త తొడుగులు అవసరమయ్యాయి. కనుక రెండు అశ్వమేధ యాగాలు చేశాడు. పతంజలి రాజపురోహితుడుగా ఉన్నాడు. (P Banerjee : Early Indian Religious. New Delhi, 1973. p 118-119) అగ్నిస్తోమ, రాజసూయ, వాజ్ పేయ యజ్ఞాలను తిరగదోడారు. పుష్యమిత్ర, పతంజలి అంచెలువారిగా సనాతన ప్రతి విప్లవాన్ని తీసుకురావటానికి ప్రయత్నించారు. దీనినే కొత్త బ్రాహ్మణ వాదంగా పి. బెనర్జీ పేర్కొన్నాడు. మౌర్యుల అనంతరం అది కొనసాగింది. విశ్వామిత్రుడు కత్తి పట్టగా, పతంజలి తన తెలివితేటలను వినియోగించాడు. తీరిక ఉన్నప్పుడు వ్యాకరణం రాసినా, పురోహిత వర్గాలను అట్టి పెట్టటమే అతని ప్రధాన లక్ష్యం. 2 వేల సంవత్స రాల క్రితం పతంజలి ఈ విషయంలో ఘన విజయం సాధించాడు.

పాణిని వ్యాకరణంపై భాష్యం రాసిన పతంజలి కృష్ణుడు కంసుని సంహరించటం ప్రస్తావించాడు. వాసుదేవుని పూజించే వాసుదేవకులను కూడా ప్రస్తావించాడు. అంతకుముందు పాణిని వాసుదేవ - అర్జునులు

పూజలందుకున్న తీరు చెప్పారు. పతంజలి కాలం నాటికి కృష్ణుణ్ణి దేవుడుగా కొన్ని చోట్ల కొందరు పూజించారు. ఆ విషయాన్ని పతంజలి చాకచక్యంతో వాడుకున్నాడు. బుద్ధుడిని అతని అనుచరులు తదనంతరం దేవుణ్ణిగా చేసి కొలిచారు. (Folyd H. Ross : Meaning of Life in Hinduism and Buddhism. London, 1952. p 124) అలా దేవుళ్ళను సృష్టించటం ఆనాటి ధోరణిగా ఉన్నది. వేదాలలో వ్యక్తిపరమైన దేవుళ్ళు లేరు.. ఉపనిషత్తులలోనూ లేరు. వేదాల దేవుళ్ళను సంతృప్తి పరచాలంటే అతి వ్యయంతో కూడిన యజ్ఞాలు చేయాలి. ఉపనిషత్తుల దేవుడు తటస్థ బ్రహ్మం కనుక, సంతృప్తి పరిచే ప్రశ్నే లేదు. అలాంటప్పుడు బుద్ధుని దేవుడిగా చేసేటప్పటికి జనం బౌద్ధానికి ఎగబడ్డారు. పతంజలి ఇందుకు బదులుగా, వాసుదేవ, కృష్ణదేవుళ్ళను ఎరగా చూపాడు. విష్ణువు వాసుదేవ దేవుళ్ళ పరిణామం అట్లా జరిగింది. కృష్ణుడిని దేవుడుగా చేసి కొత్త బ్రాహ్మణ వాదాన్ని స్థాపించటంలో పతంజలి తన శిష్యుడు పుష్యమిత్రుడి సహకారంతో దండసమత, వ్యవహార సమతను రద్దు చేశాడు. శిక్షలలో హెచ్చుతగ్గులూ, తరతమ భేదాలు ప్రవేశపెట్టాడు. ఉన్నత కులాలకు స్వల్ప శిక్షలూ, తక్కువ కులాలకు కఠిన శిక్షలూ తిరగదోడారు. శూద్రులు తలెత్తకుండా కొన్ని పాత సూత్రాలూ, మరి కొన్ని కొత్త సూత్రాలూ కలిపి స్మృతులుగా రూపొందించారు. బెనర్జీ ఈ విషయాలు వివరించారు.

ఏ దేవుణ్ణి కొలిచినా, ఏ యోగాన్ని పాటించినా, ఒక విషయం మాత్రం విస్మరించరాదు. అదే కుల ధర్మం. కులవృత్తిని వీడకుండా ఉండాలి. నీవెంత అసమర్ధుడివైనా ఎంత నీచవృత్తిని అనుసరించవలసి వచ్చినా, కులధర్మాన్ని పాటించాల్సిందే. లేకుంటే నరకప్రాప్తి తప్పదు. ఆ హెచ్చరిక చేయటానికే గీతారచన సాగింది.

కొండ దేవర నుండి జాతీయ దేవుడి వరకు

ఏ దేశమైనా ఆదిమ తెగల స్థాయినుండి ఎదుగుతూ పోతుంది. అలాగే దేవుళ్లు కూడా. కృష్ణుడి విషయంలో అంతే జరిగింది. కృష్ణుడు రాజపుత్ తెగల కులదేవతగా తొలుత ఉండేవాడని భారతీయ శాస్త్రాలను అధ్యయనం చేసిన ఫ్రెంచి పండితుడు బార్త్ భావించాడు. (A Barth : Religions of India. New Delhi, 1969.p 168) యాదవులు ఏనాడూ ఏకంగా లేనందునవారు సమైక్య పడలేకపోయారు. యాదవులు రాజపూలయితే సంప్రదాయం ప్రకారం క్షత్రియకులంలో కింది స్థాయికి చెందినవారై ఉండాలి. కృష్ణుడి సామాజిక అంతస్తును మహాభారతంలో ప్రశ్నించక పోలేదు. ద్వారకలో గడిపినపుడు కృష్ణుడికి తన వారి నుండి గౌరవం లభించలేదు. పైగా ఖండన మండనలకు గురి అయ్యాడు. మహాభారతంలో కృష్ణుడు ఒకసారి నారదుడితో ఫిర్యాదు చేస్తూ తానెవరికోసం అయితే శ్రమిస్తున్నాడో వారే పరుష వాక్యాలు పలుకుతున్నారని వాపోయాడు. అందువలన అక్కడ కులదేవతగానో, రాజపూత్ ల సమైక్య జాతులకు దేవుడుగానో ఉండే అవకాశం లేదు.

మధుర, బృందావన్ ప్రజలకు, సూరసేనులకూ కులదేవత అయి ఉండవచ్చు. పశ్చిమ తీరాన ఉన్న ద్వారకకు వెళ్ళిన కృష్ణుడి చర్యలు విని వారి నుండి గౌరవం లభించి ఉండవచ్చు. కృష్ణుడి బాల్యచేష్టలూ, యువకుడిగా శృంగార చేష్టలూ, కథలుగా వ్యాపించటం కూడా ఇందుకు తోడ్పడి ఉండవచ్చు. ద్వారకలో యాదవ కులం తాగితందనాలాడుతూ, అగ్ని మంటలకు ఆహుతి కావటంతో వారిపట్ల సానుభూతి వచ్చింది. మధుర, బృందావన్ ప్రాంతంలో కృష్ణుడు కులదేవత కావటానికి ఇది తోడ్పడి ఉండవచ్చు.

క్రీ.పూ. 4వ శతాబ్దంలో చంద్రగుప్త కొలువులో సెల్యూకస్ కు రాయబారిగా మెగస్థనీస్ వచ్చాడు. క్రీ.పూ. 304-299 మధ్య ఇతడు భారతదేశాన్ని గురించి తాను చూసింది రాశాడు. చరిత్ర క్రమపద్ధతిలో లేని మనకు అతడు రాసిందెంతో ఉపయోగంగా ఉన్నది. ఈ దృష్ట్యా మనం చారిత్రక దృష్టినీ, అవగాహనను పెంపొందించుకోవాలి.

మెగస్థనీస్ తన రాయబారిగా, నివేదికలో ఏరాక్లస్ అనే హిందూ దేవుని గురించి ప్రస్తావించాడు. అతడే కృష్ణుడు, మధురను మెధర్ అన్నాడు. కృష్ణపురాణాన్ని కేసొబొరా అన్నాడు. యమునానదిని అయోబారే అన్నాడు. కనుక మెగస్థనీస్ రాసిన దాన్ని బట్టి కృష్ణుడు ఆదిమవాసి దేవుడుగా క్రీ.పూ. భక్తుల్ని ఆకర్షించాడు. దీనిని బట్టి క్రైస్తవ ప్రభావం కృష్ణుడి పై ఉన్నదని వాదించిన వెబరోలా సెన్, లోరినసర్ రాతలకు ఆధారాలు లేవని అర్థం అవుతున్నది.

కృష్ణుణ్ణి దేవుడుగా ఉన్నత స్థాయికి తీసుకురాటానికి చాలా కాలం పట్టింది. పాణిని కాలంలో అర్జునుడితో పాటే కృష్ణుడు పూజలందుకున్నాడు. తరువాత అర్జునుడిని తొలగించి ఆ స్థానం బలరాముడికి (సంకర్షణకు) ఇచ్చారు. హిందువుల దేవుళ్ళలో ప్రతిమ స్వరూపంగల దేవుడు తొలుత బలరాముడే. ఆ తరువాత తండ్రి మాయలతో పాటు ప్రద్యుమ్నుడు కూడా చేరాడు. ఉత్తరోత్తరా కృష్ణ - జాంబవతి కుమారుడు సాంబు, ప్రద్యుమ్నుడి కుమారుడు అనిరుద్ధుడు దేవుళ్ళ జాబితాలో చేరారు. వీరందరినీ స్థానభ్రష్టుల్ని చేయటానికి కృష్ణుడికెంత కాలం పట్టిందో తెలియదు.

కుటుంబ సభ్యులను అధికారంలో, కీర్తిలో భాగం పంచుకోకుండా ఆపటం కష్టం అని కృష్ణుడికి బాగా తెలుసు. అందుకే వ్యూహాలలో వారిని చేర్చారు. పురాణాలు దశావతారాలు గురించి అనేక రకాలుగా చెప్పాయి. ఒక జాబితా ప్రకారం 22 అవతారాలున్నాయి. భాగవత పురాణాలను బట్టి ఈ జాబితా అనంతం (T.S. Rukmani : A Critical Study of Bhagavata Purana. Varanasi, 1970. pp 210, 211)

వేద సాహిత్యంలో అవతారాలు లేవు. ఎ.పి. కర్మార్కర్ దశావతారాలు ఇతిహాసకాలంలో రాలేదని అన్నారు. మహాభారతంలో ఈ అవతారాలను చేర్చారన్నాడు. (A.K. Karmarkar : Religion And Philosophy of Ethics in the Cultural History of India. Vol. II, p 84, 85) బ్రహ్మసూత్రాలలో అవతారాల ప్రసక్తి లేదు. సుంగుల కాలంలో అవతారాల గురించి ప్రచారం జరిగినట్లు చెప్పవచ్చు. క్రీ.పూ. 2వ శతాబ్దంలో తిరోగమనవాదం వచ్చింది. చంద్రగుప్తుడి వంశీకులైన బృహద్రధుణ్ణి హత్య చేసిన తరువాత ఈ ధోరణి ప్రబలింది. హిందువులలోనే అవతారాల సిద్ధాంతాన్ని గురించి చర్చ జరిగినట్లు తెలుస్తున్నది. ఉపనిషత్తులలో తొలుత నిర్గుణ బ్రహ్మను ప్రతిపాదించగా, తరువాత సగుణ బ్రహ్మ వచ్చింది. ఈ రెండింటికీ రాజీ కుదిర్చిన తరువాత అది గీత రూపం దాల్చింది. గీతలో వైవిధ్యాలను ఆవిధంగా అర్థం చేసుకోవచ్చు. (J.N. Farquhar: The Crown of Hinduism. New Delhi, 1971. p 243)

గీతలో తానే అవతారాన్ననీ, గతంలో భూమి పైకి అనేకమార్లు అవతరించాననీ భవిష్యత్తులో కూడా వస్తానని చెప్పాడు. అప్పుడు అర్జునుడు ఆశ్చర్యపడి ఒక ప్రశ్న వేస్తాడు. వివస్వతుకు (సూర్యుడికి) యోగజ్ఞానాన్ని బోధించానన్నావు. వివస్వతుడు నీకంటె ఎన్నో యుగాల ముందు లేడా? అన్నాడు. (అధ్యాయం 4, శ్లోకం 4).

కృష్ణుడు చిక్కుముడులతో, కథలతో, అర్జునుడిని ఊరుకోబెడతాడు. ఈ పద్ధతిలో దైవాన్ని విడమరచి చెప్పవచ్చునని శంకరాచార్యుడు కూడా అంటాడు. గీతపై భాష్యం రాస్తూ కృష్ణుడు పుట్టాడనీ, పుట్టలేదనీ అంటాడు. ఇదెలా సాధ్యమంటే మాయ ద్వారా అంటాడు. మాయను అడ్డం పెట్టుకుంటే ఇక చర్చ, వివాదం ఉండదు. (Shankarcharya : The Bhagavadgita with Commentary) మాయావాదులు తింటారు, తాగుతారు, ప్రేమిస్తారు, పిల్లలను కంటారు. డబ్బు సంపాదిస్తారు. రాజకీయాధికారం స్వీకరిస్తారు. అధికారంలో ఉన్నవారిని గుప్పిట్లో పెట్టుకుంటారు. విలాస జీవితం గడుపుతారు. అదంతా మాయే. కృష్ణుడు గీతాబోధనలో తనను అవతారంగా చెప్పుకున్నప్పుడు అదంతా మాయగా చూడలేకపోతే, అందుకు గత జన్మలోని పాపపుణ్యాలు అడ్డువస్తున్నాయన్నాడు.

కృష్ణుడు కులదేవతనుండి విష్ణు అవతారంగా ఎదగటానికి శతాబ్దాలు పట్టింది. గీతలో విష్ణువు పేరు 3 సార్లూ, హరి పేరు 2 సార్లు కనిపిస్తుంది. కృష్ణుడు తనను, విష్ణువుగా, ఆదిత్యుడిగా ఒకసారి చెప్పుకుంటాడు. అర్జునుడు రెండుసార్లు కృష్ణుడిని విష్ణువుగా సంబోధిస్తాడు. ఐతే, సూర్యుణ్ణి దృష్టిలో పెట్టుకొని అలా పిలిచాడు. సంజయుడు రెండుసార్లు కృష్ణుడిని హరి అంటాడు. (W. Hill, P. Douglas : The Bhagavadgita, Madras, 1959. p 33) కృష్ణుడు విష్ణువుగా, హరిగా రూపొందటం గీత తరువాత ఎంతో కాలానికి గాని జరగలేదు.

గీతలో కృష్ణుడు తాను భూమి మీదికి అవతరించటానికి ధర్మం పోయి, అధర్మం ప్రకోపించినప్పుడు అవతరిస్తానన్నాడు. అదే గనుక కృష్ణుడి (విష్ణువు) ఉద్దేశం అయితే, స్వర్గంలో యోగనిద్రను అనుభవిస్తూనే ఉండవచ్చు గదా అని అరవిందుడన్నాడు. అరవిందుడు తానే అవతారం అన్నట్లు కొన్ని సందర్భాలలో ప్రవర్తించాడు. అతని రచనల్లోని పులుముడు వాదాన్ని ఆయన భక్తులే వివరించాలి. (Sri Aurobindo Essays on the Gita, New York, 1950. p 133).

గాంధీ ఈ అవతారాలను గురించి పట్టించుకోకపోలేదు. అన్ని మతాలు అవతారాలను నమ్ముతున్నాయన్నాడు. గాంధీ వివరణ ప్రకారం రజనీష్, సాయిబాబాలు తమను అవతారాలుగా చెప్పుకోవచ్చు. కృష్ణుడన్నట్లు అవతారానికి ప్రధాన లక్ష్యం మాయే. అవతార పురుషులు ఈ మాయనే ప్రదర్శిస్తున్నారు. మానవరూపంలో దేవుళ్ళమనే భ్రమ అమాయక జనాలకు కల్పిస్తున్నారు.

భగవాన్ దాస్ తన సొంత వివరణతో కృష్ణుడి విష్ణు అవతారాన్ని గురించి చెప్పాడు. అతడు అనిబిసెంట్ సహచరుడు. భారతరత్న మూఢనమ్మకాలకు హేతుబద్ధత కల్పించదలిచాడు. అతని రచనల శీర్షికలు అలాగే ఉంటాయి. విష్ణువు ఎందుకు అవతరించిందీ వివరిస్తూ సుందోపసుందులు నాశనమైనట్లే, కురుపాండవులు తీవ్రవాదాన్ని అణచటానికి అవతరించాడన్నాడు. (Bhagavandas : Krishna a Study in the Theory of Avataras. Madras, 19938).

ఆర్.కె. పాండే కృష్ణుడి గోపికాలీలల్ని వివరిస్తూ రుషులు కృష్ణుణ్ణి ప్రార్థించారనీ, తమను సన్నిహితంగా ఉండనియ్యమని కోరారనీ కనుక వారందరినీ గోపికలుగా అవతారం ఎత్తమని కృష్ణుడు వారి కోరికను తీర్చాడనీ రాశాడు. గోపికల వస్త్రాలను అపహరించుకు పోవటం పాండె వివరిస్తూ దోషం రూపంలో ఉన్న వివస్త్ర స్నానాన్ని

రూపుమాపాలని అలా చేశాడన్నారు. ఈ వివరణ ఇచ్చిన పాండె తరువాతి జన్మలో గోపికగా జన్మించి కృష్ణుడికి సన్నిహితంగా ఉండవచ్చు. (R.K. Pandey: The Concept of Avataras. Delhi, 1979. P49-50)

కృష్ణుడి పై ఎన్నో గ్రంథాలు వెలువడ్డాయి. వాటన్నిటినీ చదవటం సాధ్యపడే విషయం కాదు. భారతీయ విద్యాభవన్ వాళ్ళు ప్రచురించిన పుస్తకాలను బట్టి భారతదేశాన్ని ఆధునిక యుగంలోకి అడుగు పెట్టకుండా ఉండే ప్రయత్నం కనిపిస్తున్నది.

డార్విన్ సిద్ధాంతం లోతుపాతులు తెలియకుండానే కొందరు అందులో అవతారాలకు సమర్ధన ఉన్నదంటున్నారు. ఆత్మ, దాని ప్రయాణం అనే భ్రమల్ని డార్విన్ సిద్ధాంతం కొట్టిపారేసింది. సృష్టివాదాన్ని పటాపంచలు చేసింది. దేవుడు దిగివచ్చాడనే నమ్మకాన్ని తృణీకరించింది.

జీవితానికి భౌతిక ఆధారాలు చూపింది. జ్ఞానార్జనకు ఇంద్రియాల ప్రాధాన్యతను పేర్కొంది. అర్హత లేని జీవులు నశించినట్లు చూపింది. మానవుడు దిగజారిన దేవతకాదనీ, పైకి ఎదుగుతున్న జంతువని రుజువు పరచింది. క్రైస్తవుల మత సిద్ధాంతాన్ని దెబ్బతీసిన డార్విన్ సిద్ధాంతం హిందూ మతానికి తోడ్పడుతుందనుకోవటం భ్రమ. ఇటీవల జీవశాస్త్రాలలో పరిశోధనల వలన డార్విన్ ప్రతిపాదనలు దేవుడికింకా దూరమై మానవుడి కింకా దగ్గరయ్యాయి. జీవరాశులున్న మేఘాల నుండి మానవుడు ఆవిర్భవించినట్లు ఫ్రెడ్ హోయల్, విక్రమ్ సింఘే సిద్ధాంత ప్రతిపాదన చేశారు. అది మత ప్రాతిపదిక కాదు. మన సంప్రదాయవాదులు పురాణాలలో అది కూడా చెప్పారని చూపగల సమర్థులే. మన ఉపనిషత్తు దార్శనికులు ఈ విషయాలను ఆనాడే తెలుసుకున్నారని కూడా అనగలరు. బ్రహ్మపదార్థం అంటే హోయల్ చెప్పే జీవకణాలని కూడా చెప్పగలరు.(Fred Hoyle, Wickramsinghe : Life Cloud and The Origin of Life in the Universe. New York, 1978. p 157)

దశావతారాలలో మనవాళ్ళు పదవ అవతారం ఇంకా రావాలంటున్నారు. శూద్రులను శిక్షించటానికి అది ఉద్దేశించారట. కల్కి అవతారం క్షత్రియుడంటున్నారు. అవసరమైనప్పుడు విష్ణువు పంది అవతారమైనా ఎత్తుతాడుగాని, వైశ్యుడుగానూ, శూద్రుడుగానూ రాడు. వారు పాపయోనికి పుట్టినవారు గదా! (R. K. Pande : The Concept of Avataras. Delhi, 1979. Pp 49, 50).

ఇద్దరు భగవాన్లు

ఒక ఆటవిక హీరోని జాతీయదేవుడుగా పైకెత్తాలంటే ఒక పవిత్ర గ్రంథాన్ని అతని పేరిట సమకూర్చాలి. కృష్ణుడి విషయంలో వెయ్యేళ్ళు పట్టింది. ఐనప్పటికీ ఆ గ్రంథాన్ని, దాని సందేశాన్ని గురించీ ఏకాభిప్రాయం లేదు. కృష్ణుడి అనంతరం గీత వచ్చిందని నిశిత పరిశీలన చేసే పండితులంతా అంగీకరిస్తున్నారు. అది కూడా దశల వారీగా వచ్చింది. ఆర్.జి. . భండార్కర్ ఈ విషయమై రాస్తూ భగవద్గీత రచించినప్పుడు వాసుదేవుడు లేడనీ, అలాగే బుద్ధుడి ప్రవచనాలు గ్రంథస్తం చేసేటప్పుడు బుద్ధుడు లేడనీ అన్నాడు. ఐనా, ఇరువురినీ భగవంతుడని అన్నారు.

సన్యాసత్వం అనేది ఆర్యేతర భావం. భారతదేశంలో ఆ భావనకు ఆర్యులు విముఖులు. జీవితాన్ని అనుభవించాలనే ఆర్యులు సన్యాసాన్ని అనుమతించలేదు. ఆర్య రుషులు వేదకాలంలో పెద్ద కుటుంబాలలో సుఖజీవితం గడిపారు. యాజ్ఞవల్క్యుడికి ఇద్దరు భార్యలుండేవారు. క్రమేణ హరప్పా ద్రావిడుల నుండి ఆర్యేతర భావంగా సన్యాసాన్ని తెచ్చుకున్నారు. మూడు అగ్రకులాలు మాత్రమే సన్యసత్వాన్ని పుచ్చుకోవచ్చన్నారు.

జీవితం చివరి దశలో ఇది చేపట్టాలన్నారు. శూద్రులూ, ఛండాలురు కూడా సన్యాసులు కావచ్చని బుద్ధుడన్నాడు. తల్లిదండ్రుల అనుమతితో పిల్లలు కూడా చేరవచ్చునన్నారు. బుద్ధుడు ఇదంతా చాలా పరిమితంగానే చేశాడు. కుష్ఠు రోగుల్నీ, రుణగ్రస్తుల్నీ, బానిసల్నీ, సన్యాసులు కావటానికి అంగీకరించలేదు. బుద్ధుడు చేసినదంతా వర్ణాశ్రమ ధర్మాలను దెబ్బతీసినదిగా ఉన్నది. కింది కులాలకు చెందిన మంగలి, మత్స్యకారులూ, పాకీవారూ బుద్ధుని శిష్యులలో ఉన్నారు. కొందరు స్త్రీలను కూడా సన్యాసులు కావటానికి బుద్ధుడు అంగీకరించాడు. వైశాలికి చెందిన ఆమ్రపాలిని సంఘంలో చేర్చుకున్నాడు. ప్రసేనజిత్తురాజు అభ్యంతర పెడుతున్నా ఒక ఛండాల స్త్రీని, శ్రావస్తికి చెందిన బ్రాహ్మణులనూ బుద్ధుడు సంఘంలో చేర్చుకున్నాడు. ఆ విధంగా అరమరికలు లేకుండా చేర్చుకోవటం వలన మితం తప్పింది. లోగడ బానిసగా ఉన్న గోపాలుడు గొప్ప తాత్త్వికుడిగా చెప్పుకున్నాడు.

సన్యాస భావనలు కాదంటే వర్ణాశ్రమ ధర్మాన్ని కాదనడమే అవుతుంది. కనుక రెండవ భగవాన్ గా కృష్ణుడు వచ్చి అర్జునుడికి నిష్కామకర్మ అంటూ బోధచేశాడు. కులధర్మాన్ని పాటించమన్నాడు. అది గీత సారాంశం. రాధాకృష్ణన్ ప్రకారం ఆధునిక మనస్తత్వ శాస్త్రంలో గొప్ప విషయాలు ఇందులో ఉన్నాయి. వాస్తవం ఏమంటే కింది కులాల వారిని వారి వృత్తులలో అట్టి పెట్టి, విద్య, వికాసాలకు దూరంగా ఉంచాలని ప్రయత్నించాడు. చెప్పులు కుట్టేవారు జన్మాంతర విషయాలను దృష్టిలో పెట్టుకొని తన వృత్తిని మార్చకుండా కొనసాగించాలన్నాడు. శంబుకుడు ధైర్యంగా తపసు చేసినందుకు రాముడు అతడి తలనరికేసాడు. ఈ చర్యను కాళిదాసు అభినందించాడు.

మొదటి భగవానుడు సంఘం వెలుపల కుల పద్ధతిని ఆమోదించాడు. ఐతే పుట్టుకను బట్టిగాక, అభిరుచి, గుణగణాలను బట్టి కులం ఉంటుందన్నాడు. మానవుడి వృత్తిని అతడి కులం నిర్ణయిస్తుందనీ, తల్లిదండ్రులను బట్టి కాదని అన్నాడు. (Lord Chalmers : Dialogue of the Buddha. London, Vol-II. 1926. pp 43-46 : C. Kunhan Raja : Dhammapada, Madras, 1956. p 115)

రెండవ భగవానుడు కులాన్ని ఆ విధంగా చూస్తే ప్రమాదమని, తానే సృష్టించినట్లు చెప్పుకున్నాడు. లోగడ జన్మలను బట్టి ఈ కుల నిర్ధారణ జరుగుతుందన్నారు. ఇది మొండివాదన గనుక ఒప్పుకోవాలి, లేక నిరాకరించాలే తప్ప, వాదించేదేమీ లేదు.

మొదటి భగవంతుడు నీతిని అనుసరించమన్నాడు. క్రూరత్వాన్ని ద్వేషించమన్నాడు. జనన, మరణాల బంధం నుండి తప్పించుకోవచ్చునన్నాడు. రెండవ భగవంతుడు కులధర్మం ప్రధానం అన్నాడు. ఎటువంటిదైనాసరే కులవృత్తిని పాటిస్తే వచ్చే జన్మలో సుఖం ఉంటుందన్నారు. కల్పిత బ్యాంక్ పేరిట పోస్టుడేట్ వేసిన చెక్కులాంటిదే కృష్ణుడి హామీ. వీటిని అనుసరించడం కష్టమని కృష్ణుడికి తెలుసు. అందుకనే సహృదయంతో, భక్తితో తనకేది

సమర్పించినా అంగీకరిస్తానన్నాడు. మరణించేముందు తనను తల్చుకుంటే తన వద్దకు చేరుకుంటారన్నాడు. ఎంత అవినీతిపరులైనా కృష్ణుడి నామం జపిస్తే మోక్షం పొందుతారు. అమరత్వానికి అది హామీ పత్రం వంటిది.

బుద్ధుడు నిర్వాణం ఉత్తమ మార్గమన్నాడు. అందుకు అష్టాంగ మార్గాలూ సూచించాడు. సారనాలో తొలి బోధనగా ఈ విషయాలు చెప్పారు. రెండవ భగవానుడు ఇంకా ఉదారంగా భక్తులు ఏ మార్గాన్ని అనుసరించినా తన వద్దకే చేరుకుంటారన్నాడు. ఐతే తనను కొలిచే వారికి స్వర్గంలో ఉత్తమ స్థానం లభిస్తుందన్నాడు.

ఇరువురు భగవాన్లూ శాకాహారులు కాదు. ఆహారం కోసం జంతుబలిని బుద్ధుడు ప్రోత్సహించకపోయినా, భక్తులు మాంసాహారాన్నిచ్చినప్పుడు నిరాకరించలేదు. అడుక్కునే వారికి ఎంపిక చేసే హక్కు లేదన్నాడు. చుండ అనే భక్తుడు ఇచ్చిన పంది మాంసం తిన్న తరువాతనే బుద్ధుడు చనిపోయాడు. ఎవరూ మద్యపానం చేయకూడదన్నాడు.

కృష్ణుడు మాంసాహారి. మద్యం సేవించాడు. మత్తుపానీయాలకు అనుకూల, ప్రతికూల అభిప్రాయాలు గీత వెల్లడించలేదు. క్షత్రియులకు చంపడం కులధర్మం అన్నారు. యుద్ధరంగంలో బంధుప్రీతి లేకుండా క్షత్రియుడు హతమార్చాలి. అతనికి అప్పుడే ఇహపరలోకముక్తి లభిస్తుంది.

బుద్ధుడు చేపలు తప్ప మరే జీవులకూ హాని చేయరాదన్నాడు. (E.H. Brewster : The Life of the Gouthama, The Buddha. London, 1926. p 157) రాజ్యాల మధ్య యుద్ధాన్ని ఖండించలేదు. వ్యక్తులపై హింసను మాత్రమే బుద్ధుడు ఖండించాడు. రాజ్యాల మధ్య పోరాటాలు తప్పవేమో అన్నాడు. వినయ పిటక జాతక కథలలో యుద్ధాలకూ, వ్యూహాలకూ (G.S.P.)

ఆయుధాలకు సంబంధించిన ప్రస్తావన ఉంది. వాటిని ఖండించలేదు కూడా. Mishra : The Age of Vinaya. New Delhi, 1972. pp 216, 217) గీత అహింసను చెప్పలేదు. ఒకచోట మాత్రం ఈ ప్రస్తావన ఉంది. (5వ అధ్యాయం, 5వ శ్లోకం) అహింస, సమానత్వం గీత ప్రయోజనానికి విరుద్ధం. అంచలవారీ అసమానత్వాలకు దారితీసిన కుల విధానంలో సమానత్వం కుదరదు. ఎవరో కావాలని అహింస, సమానత్వ పదాలను ఒకచోట గీతలో చేర్చారు. బుద్ధిజం వ్యాప్తిని అరికట్టడానికి గీతను అల్లారు. మహాభారతం యావత్తునూ బ్రాహ్మణ విజ్ఞాన సర్వస్వం అనవచ్చునని ఎన్.జె.షిండే అన్నాడు. అంగీరసుడు, భృగుడు మహాభారతానికి ప్రస్తుత రూపాన్నిచ్చారన్నాడు. దాన్ని ధర్మశాస్త్రంగా, నీతిశాస్త్రంగా చూపారన్నాడు. (N.J. Shende : The Authorship of Mahabharatha. Vol. XXIV, Annals of the Bhandarkar Research Institute, Poona, 1943. pp 67-82) నా దృష్టిలో గీత బంధాల బైబిల్ మాత్రమే.

ఎవరికి కావలసింది వారికి

రోమన్ దేవుడు జేనసు కు రెండు ముఖాలుంటే, హిందువుల దేవుడు హరికి వెయ్యి ముఖాలున్నాయి. కృష్ణావతారంలో హరి వెయ్యి నాల్కలతో మాట్లాడతాడు. గీత ఇచ్చే వెయ్యి సందేశాలలో ఏది స్వీకరించాలో అది నీ ఇష్టం. నీకు నచ్చే సందేశాలను కలిపి చూచుకోవచ్చు. అలా కలిసినప్పుడు ఎన్నో తత్త్వాల గురించి ఎప్పటికప్పుడు పుష్కలంగా పుస్తకాలు వస్తూనే ఉన్నాయి. ఇక అనువాదాలూ, భాష్యాలూ లెక్కకు మించాయి. క్రీ.శ. 8వ శతాబ్దంలో ఆదిశంకరాచార్యుడు దీనికి శ్రీకారం చుట్టాడు. అది నిర్విఘ్నంగా సాగిపోతూ యజ్ఞాలూ, ప్రసంగాలూ, ప్రవచనాల రూపం దాల్చాయి.

గీత ఆకర్షించడానికి అందులోని గందరగోళమే కారణం. భిన్నత్వం, మరొక అంశంగా చెప్పవచ్చు. ఎవరికేది కావాలో అది గీతలో ఉంది. కేవల అద్వైతం నుండి ద్వైతం వరకు శంకరుడూ, రామానుజుడూ, మధ్వుడూ, వల్లభుడూ గీత నుండి స్వీకరించారు. ముక్తికి భిన్న మార్గాలున్నాయన్నారు.

అన్ని మార్గాలూ తన వద్దకే చేరుస్తాయని కృష్ణుడన్నాడు. శంకరుడు జ్ఞానయోగాన్ని కోరాడు. సన్యాసం కావాలన్నాడు. మిగిలిన ముగ్గురాచార్యులూ భక్తియోగం ఎంపిక చేసుకున్నారు. శంకరుణ్ణి వ్యతిరేకించిన ఈ ముగ్గురూ వారిలో వారు విభేదించారు. ఈ ఆచార్యుల చుట్టూ అనేక భాష్యకారులు బయలుదేరారు. ఇందులో శంకరుడిది చాలా విస్తారమైనది. ధనపతి, హనుమత్, మధుసూదన, శ్రీధర, నీలకంఠ, వెంకటనాధ, శంకరానంద, భాష్యకారులుగా పేర్కొనదగినవారు. శంకరుడిని అనుసరించిన వీరు మధ్యలో సొంతదారులు నిర్మించారు. ఎదుటి పక్షంవారితో చేరిన సందర్భాలూ లేకపోలేదు. రామానుజుడూ, మధ్వుడూ, వల్లభుడూ తమ అనుచరులతో వేర్వేరుగా కొనసాగారు. యమునాచార్యుడూ, వెంకటనాధ చాలా సమర్థులైన రామానుజా చార్యులు ముఠాకు చెందినవారు. పురుషోత్తం వంటి వారు వల్లభుడిని సమర్థించారు. జయతీర్థ, రాఘవేంద్ర వంటి వారు మధ్వుడి కోపు వేసుకున్నారు. వీరందరిలో వ్యక్తిగత తేడాలున్నాయి.

కేశవ, నింబార్కుడు ఏ ముఠాలకూ చెందకుండా గీతకు సొంత వ్యాఖ్యానాలు చేశారు. భాస్కర, అభినవగుప్త, ఆనందవర్ధన, రమాకాంతులు కాశ్మీరు పండితులుగా గీతకు భాష్యం చెప్పారు. బెంగాలులో చైతన్య, మహారాష్ట్రలో రాన్దాస్, ఏకనాధ్, ఇంకా తుకారాం వారి భాష్యాలు వెల్లడించారు.

మహారాష్ట్రలో గీతపై చెప్పే వ్యాఖ్యానానికి బ్రాహ్మణులు జ్ఞానదేవుడిని 13వ శతాబ్దంలో హింసించారు. అతనిని కాపాడిన కొందరు బ్రాహ్మణులు గీతపై వేరే అనువాదం, భాష్యం వెల్లడింపచేశారు. మహారాష్ట్రలో అన్ని కులాల వారికీ అది ప్రేరణ కల్పించింది. (D.D. Kosambi : The Culture and Civilization of Ancient India: A Historical Outline. London, 1965. p 113) అతడి భాష్యంలో మానవవాదం ఉంది. జ్ఞానదేవుని ఆదర్శ పురుషుడు ప్రపంచంలోని ఏ వస్తువును చూచినా దివ్యమైన ప్రేమతో పొంగిపోతాడు. జీవితాదర్శం మోక్షం కాదు. భక్తి మాత్రమే. కర్మకాండలూ, యోగాభ్యాసాలూ నిరుపయోగం. జీవితం పాపపంకిలం కాదు. దైవ ప్రేమానుభూతిని చూపేదే జీవితం. అది గ్రహించడమే జీవిత లక్ష్యం. ఇందుకు కులాలూ, కాల, ప్రదేశాలు అడ్డురాకూడదు. ఇది జ్ఞానదేవుడి సందేశం. (B.P. Bahrat : A Philosophy of

Jnanadeva, Pandharipur, 1956). 13వ శతాబ్దంలో మోక్షం ఆదర్శం కాదని, కులాలను ఖండించటం అసాధారణం. 22వ ఏట చనిపోయిన జ్ఞానదేవుడు మరాఠీ భాషపై, ఆలోచనపై తన ప్రభావాన్ని చూపెట్టాడు.

శంకరుని చాలామంది ప్రమాణంగా స్వీకరించినా మైంకర్కు అతనిపట్ల చాలా స్వల్పమైన అభిప్రాయం ఉంది. గీతకు భక్తియోగం కేంద్రమనీ, శంకరుడు వక్రభాష్యం చేసి తన జ్ఞానయోగాన్ని సమర్థించుకున్నాడనీ అన్నాడు. భగవద్గీత భాష్యకారుడుగా శంకరుడిపై ఆధారపడటానికి వీలులేదన్నాడు. (T.G. Mainkar : A Comparative Study on the Commentaries of Bhagavadgita. Delhi, 1969). గీతపై సంప్రదాయ భాష్యకారు లందరికీ ఈ మాటలు వర్తించవచ్చు.

ఆర్.డి. రణడే పండితుడుగా గీతపై భాష్యం చెప్పాడు. ఎస్. హెచ్. జాబ్వాలా హీనమైన భాష్యం చెప్పాడు. ఐతే, వారు ఆధునిక కాలాన్ని కూడా తమ భాష్యంలో చెప్పారు.

గీతను ఎలా చదవాల్సిందీ వివరిస్తూ త్రిదండిస్వామి బి. హెచ్. బాన్ రాయగా, పేరు లేకుండా మరొకరు గైడు రాశారు. చైతన్య ధోరణిలో గీతను త్రిదండిస్వామి అనువదించాడు. పేరు లేని వ్యక్తి రాధాకృష్ణను ఉదహరిస్తూ కాలాతీతంగా, విశ్వవ్యాప్తంగా గీత పనికి వస్తుందని బోధించాడు.

ఢిల్లీలోని సుందర్ లాల్ అనే హిందువు గీతను ముస్లింలు ఎలా చదవాల్సిందీ రాయగా హైదరాబాదులోని సయ్యద్ అసదుల్లా దానిని అనువదించాడు. గీతను క్రైస్తవులు చదవవలసిన తీరుపై కొన్ని పుస్తకాలున్నాయి. బౌద్ధ, జైన, యూదు, జొరాస్ట్రియన్, షింటో, కన్ఫూసియస్ గైడ్లు కూడా వస్తుండవచ్చు. (Anon : Gita Adarshan as Bhaktiyoga : As A Chaitanya Gita Reads it. Madras, 1968 : Chaiandaswamy, B.H. Bon : The Gita as a Chaitanyait Reads It. Bombay, 1938)

బాలగంగాధర్ తిలక్ గీతను ఆచరణకు పురికొల్పుతున్నట్లు, నిష్కామకర్మగా, ప్రపంచం కోసం ఈ ఆచరణ జరపాల్సినట్లు అభిప్రాయపడ్డాడు. మరాఠీలో రాసిన ఈ పుస్తకాన్ని బర్మాలోని మాండలే జైలులో ఉండగా తిలక్ ఉద్ధంథంగా రూపొందించాడు. దీనిని బాలచంద్ర శీతారాం సుక్తాంకర్ ఇంగ్లీషులోకి అనువదించాడు. గీతా భాష్యాన్ని అరవిందుడు కొట్టిపారేశాడు. . గాంధీ కూడా విభేదించాడు.

అరవిందుడు చురుకుగా రాజకీయాల్లో పాల్గొంటూ, హఠాత్తుగా పాండిచ్చేరి పారిపోయి అది భయపడి తీసుకున్న చర్యకాదనీ, దైవపిలుపును బట్టి తీసుకున్న నిర్ణయం అనీ మనల్ని నమ్మమంటున్నాడు. సంపన్న శిష్యులతో, వారి ఆదరణతో సొంత జీవితాన్ని గడిపాడు.

తిలక్, గాంధీల మధ్య గీతాభాష్యంపై వచ్చిన అభిప్రాయ భేదాలను డి.కె. గోసావీ విడమర్చి చెప్పాడు (DK Gosavi : Tilak, Gandhi and Geetha. Bombay, 1983. Pp 46, 47)

గాంధీ కేవల సత్యం, సంపూర్ణ బ్రహ్మచర్యం, పూర్తి అహింస, తిరుగులేని త్యాగం, కేవల నైతిక విలువలూ కావాలన్నాడు. అలా అంటే చివరకు వ్యక్తిలో కపట ప్రవర్తనకు దారితీసే లక్షణాలు వస్తాయి. నైతికవాది మానవ స్వభావాన్ని విస్మరించే అవకాశం ఉంది. అలాంటప్పుడు నైతికవాదిని మానవ స్వభావం కూడా పక్కనబెడుతుంది. బెట్రాండ్ రస్సెల్ ఇలాంటి హెచ్చరిక చేశాడు. ఐనా, గాంధీ పట్టించుకోలేదు. దాని ఫలితం అనుభవిస్తున్నాం. ప్రజా జీవితం, వ్యక్తిగత జీవితంలో కూడా నైతిక విలువల్ని పాటించకుండా నటనతో కప్పిపుచ్చుతున్నాం. దీనంతటికీ గీతా ప్రభావం చూపవచ్చు. అన్ని అభిప్రాయాలకూ, నమ్మకాలకూ అసమానతలకూ ఆర్థికపరమైన అన్యాయాలకూ గీతను అడ్డం పెట్టుకోవచ్చు. చంపేవాడూ, చంపబడేదీ అనేది లేదని గీత చెపుతుండగా ఇక హత్యలకూ, మూకుమ్మడి హింసలకూ, వ్యతిరేకత ఎలా వస్తుంది? చంపుతున్నారనుకోటం అజ్ఞానం. దేవుడు వారిని ముందే చంపేశాడు అంటుంది గీత. గీతాకారులకు ఆచరణలో స్వేచ్ఛ లేదు. అతడు దేవుని చేతిలో కీలుబొమ్మ. వేదాంతులు దీనినే ఈశ్వరలీల అంటున్నారు.

ఆల్బర్ట్ షూజర్ భగవద్గీతకు స్పింక్స్ వంటి స్వభావం ఉన్నదన్నాడు. అది కేవలం గూఢార్థంతో నవ్వుతుంది. కాని, గీత గూఢార్థంలో మాట్లాడుతుంది, వాదిస్తుంది, బెదిరిస్తుంది, ప్రేరేపిస్తుంది, ఇంకెన్నో చేస్తుంది. నైతిక విలువల్ని పాటించదు. గీత నీతికి దూరమైనది. మనం దానిని చదివి గౌరవిస్తున్నాం. గీతను రాసిన అనామకులకు అది గొప్ప విజయం. భారతదేశానికీ, ప్రపంచానికి అదొక విషాదం.

తుదిమాట

1200 సం.రాల క్రితం శంకరాచార్యుడు దుమ్ముదులిపి గీతను పైకి తీసి తన మేధస్సుతో భాష్యంగా రాసి విమోచన గ్రంథంగా ప్రజల ముందుంచాడు. అప్పటి నుండీ దీని ప్రభావం సర్వత్ర దారుణంగా పరిణమించింది. మానవ అసమానతలకు, బాధలకూ బాధపడకుండా, ఉదాసీనత చూపటానికి గీతే కారణం. మనల్ని కపటవర్తనలోకి గీత నెట్టివేసింది. ఆ విషయాన్ని ప్రేమనాధ్ బజాజ్ రాశాడు.

గీత జాతీయ పవిత్ర గ్రంథంగా ఆవిర్భవించడం, మన మనస్తత్వానికి ఆవరించడం పరస్పర సంబంధం గలవి. ఆ మాట అంటే గీతాభిమానులు దూషిస్తారు. ఈ విషయంలో చర్చ జరగాలి. ఆలోచనల సంఘర్షణ సాగాలి. అప్పుడు కొత్త జీవనానికి నాంది పలుకుతుంది. గీత పేర్కొన్నట్లు కృష్ణుడు మళ్ళీ ఈ భూమి మీదికి ధర్మస్థాపన నిమిత్తం రాకూడదు. లోగడ వచ్చినందుకే తీరని నష్టం జరిగింది. ధర్మం పేరిట మారణకాండ జరిగింది. మహాభారతం ప్రకారం అప్పుడు మిగిలినవారు 9 మందే. ద్వాపరయుగం అంతమై కలియుగ మారంభమైందన్నారు. కృష్ణుడు తనను వజ్రాయుధంగా వర్ణించుకున్నాడు. అలాంటి కృష్ణుడు ఇప్పుడు వస్తే అణ్వాయుధాల కృష్ణుడవుతాడు. భూమిపై మనుషులుండరు.

అర్జునుడు విస్మరించినట్లే మనం గీతను విస్మరించాలి. కృష్ణుడు బోధించిన ఒక ఏడాదిలోనే గీత తన మనసు నుండి తొలిగిపోయిందని అర్జునుడన్నాడు. మన జాతి మనసు నుండి కూడా అలాగే తొలిగిపోవాలి. అంతటితో మన నిద్రావస్థపోయి, భ్రమలు తొలగి సొంత ఆలోచన పెరుగుతుంది. అప్పుడే స్వార్థాన్ని పక్కనబెట్టి మానవజాతి భవిష్యత్తుకు బాటలు వేయగలం. కార్ల్ సేగన్ ఊహించినట్లు మన భూమి వంటివి ఈ విశ్వంలో ఇంకెన్నో ఉండి ఉండవచ్చు. అవి వివిధ సంస్కృతులలో మనల్ని మించిపోయి ఉండవచ్చు. అర్జునుడు గీతను మరచిపోయినట్లే

మనం గీత వైరుధ్యాలనూ, గందరగోళాలనూ ఎత్తుగడలనూ మరచిపోయే రోజు వస్తుందని ఆశిస్తున్నారు. భారతీయులు ఆనందంగా అర్థవంతంగా మనుగడ సాగిస్తారని కోరుకుంటున్నాను. ఆలోచన స్థంభింపజేసే ధోరణి మార్చుకోవాలి. అనంతాకాశంలోకి చూస్తూ, ఆత్మ పరమాత్మతో లీనమయ్యే ఎండమావుల కోసం వెతక్కుండా ఉండాలి. విశ్వంలోని మర్మాలను పొరలు విప్పుకుంటూ మానవుడు పురోగమించాలి. అందుకు తొలిమెట్టుగా కృష్ణుడిని, గీతనూ విసర్జించాలి.

సృజనాత్మక సాహిత్యం
అనగనగా ఒక నార్ల... (పరిచయం)

- రావెల సాంబశివరావు, మాజీ రిజిష్టార్, నాగార్జున యూనివర్శిటీ

నార్ల జగమెరిగిన జర్నలిస్టు. నిర్భయంగా ఆలోచించి, నిష్కర్షగా వ్రాసి తెలుగు పత్రికలకు వినూత్న రీతిలో జవసత్వాలు అందించినవారు. తమ రచనల్లో తెలుగుదనం ఉట్టిపడేట్లు చేసి తెలుగు మెదళ్ళలో గొప్ప కదలిక తెచ్చినవారు. లయబద్ధమైన శబ్దాలతో, సొగసైన భావనలతో ఈయన శైలి అందరినీ ఆకర్షించింది.

ఈయన జర్నలిస్టుగా పెద్ద రహదారినే నిర్మించుకుంటూ పోయినా, కవిత్వంతో, కథలతో, నాటికలతో దానికి చేరిక మార్గాలనూ చేకూర్చకపోలేదు. కవిగా "జగన్నాటకం", తెరతీసి "నవయుగాల బాట"లు నిర్మించి, నాటక రచయితగా "కొత్తగడ్డ"లకు ప్రయాణం కట్టించి "కథలు గాథలు" విన్పిస్తూ కొత్త దారుల వెంట అలుపూ సొలుపూ ఎరుగని ప్రయాణానికి తెలుగువాళ్ళని సంసిద్ధుల్ని గావించిన తీరూ ఎన్నదగినదే. "కొత్తా-పాతా" కలగలుపుకుంటూ "మాటా మంతీ"తో, సాగిన "పిచ్చాపాటీ" సాహిత్యాని కంతటికీ పునాది సంస్కరణ వాదమే. తార్కిక దృష్ట, హేతువాదరీతే. చిన్న చిన్న మాటలతో నవ్విస్తూ, కవ్విస్తూ అన్యాయాలను, అక్రమాలను, గుడ్డి నమ్మకాలను కుళ్ళబొడిచే ఈయన రచనా విధానం కడు విస్మయం కలిగిస్తుంది; కనువిప్పు తెస్తుంది.

బాబాల కోసం వేలంవెర్రిగా విద్యాధికులే పడిగాపులు గాయటం చూచి పకపక నవ్విన నవ్వే "పురాణ వైరాగ్యం" నవలకు పునాదిగా నిలుస్తుంది. "పురాణ వైరాగ్యం" ఈయన అసంపూర్తి నవల. "ఇంతకూ ఈయన నవలాకారుడయ్యే బ్రహ్మలిఖితం లేదు... లేకుంటే ఇన్ని వ్రాసిన వాడు నవలను అలా అసంపూర్తిగా వదలివేయటం ఏమిటంట?" అని తంటాలమారి మాటలు పలికి ప్రయోజనం లేదు. కారణాలను అన్వేషించవలసివుంది. అది వ్యాసం కానివ్వండి, కవిత్వం కానివ్వండి, నాటక రచనే కానివ్వండి - ఈయనకు లఘు రూపాల మీదే మోజు.

చిట్టి పొట్టి వాక్యాలతో చిన్ని చిన్ని వ్యాసాలు; వారలేసే సంపాదకీయాలు ఈయన సొత్తు. ఈయన నాటకాలు చిన్నవి; పీఠికలే పెద్దవి. కవిగా కావ్యాలు వ్రాయలేదు - ముక్తకాలే వ్రాసింది - అవీ ఆటవెలదులు, తేటగీతికలే వ్రాసిన కథలు వేళ్ళమీద లెక్కించేవే అయినా అవీ చిన్నవే. పెద్ద కాన్వాసుపై నవలగా రూపొందవలసిన "పురాణ వైరాగ్యం" అర్ధంతరంగా ఆగిపోయింది. ఇంతకూ తెలుగువాళ్ళు దురదృష్టవంతులు. పురాణవైరాగ్య క్షేత్రంలో నార్ల పండించవలసిన మొలకొలుకుల పూర్తిపంట వాళ్ళ అనుభవంలోకి రాలేదు.

ఆ లోటును పూరిద్దామనే ప్రయత్నాలు జరగకపోలేదు. "ఆహ్వానం" పత్రికా సంపాదకురాలు యస్.యస్.లక్ష్మి గారు పట్టుబట్టి పారితోషికం ప్రకటించి ఆ నవలను పోటీపడి ఇతరులు పూర్తి చేసేందుకు అవకాశాలు గట్టిగానే కల్పించారుగాని ప్రతిస్పందన ఆశించిన మేరకు లేదు. నార్లవారి అసంపూర్తి నవలను పూరించటం మాటలా అనుకున్నవాళ్ళే ఎక్కువ. పూరించేందుకు సాహసించిన వాళ్ళల్లో పైడి చంద్రలతగారిదే పై చేయిగా ఉందని న్యాయనిర్ణేతల తీర్పు.

సుబ్బారాయుడు ఓ పల్లెటూరి రైతు. ప్రతిరోజూ ఆవును పొలం తోలుకువెళ్ళి మేతమేపి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత భద్రంగా కట్టివేసి, కుడితి పెట్టి పురాణం వినడానికి వెళ్ళేవాడు. ఓరోజు పొలాన కొంచెం ఆలస్యమైంది. ఆదరా బదరా రామాలయం మీదగా ఆవును తోలుకొస్తూంటే అప్పటికే అయ్యవార్లంగారు పురాణం ప్రారంభించేశారు. అంతకు ముందు రోజు మంచి రసకందాయంలో కథ ఆగిపోయివుంది. అభిమన్యుడు పద్మవ్యూహంలోకి చొరబడి పోయాడు. చివరికి ఏమయ్యిందో తెలియాలి గదా... కనుక ఆవును ఇంటివైపుకు తోలి రాయుడు పురాణం దగ్గర ఆగిపోయాడు.

ఆవును పితకబోతే దూడ కుడుచుకుపోయినందువల్ల అది తన్నిన తన్నుకు ఇంటావిడ మూతి పగిలింది. రాయుడు పురాణం వినివచ్చి ఇంట్లో అడుగుపెట్టాడో లేదో –

“తగలబడ్డ పురాణం! నిప్పులు పడ్డ పురాణం!! ఇదొకటి దొరికింది. ఇల్లూ వాకిలి గంగలో కలిసిపోయినా పట్టడం లేదు. ఇంటిది ఏమైపోతేనేమి? పురాణానికి మాత్రం నాగాపడ గూడదు”. నార్ల పురాణం మీద నిప్పులు కురిపించేందుకు సిద్ధమైన తీరది!

పాపం సుబ్బారాయుడి బతుకు ముప్పయ్యయిదు సంవత్సరాలపాటు ప్రపంచం సంగతి తెలుసుకోకుండానే వెళ్ళమారింది. నిద్రలో రాముడనీ, భీముడనీ ఇల్లెగిరిపోయేలా ఇంటాయన పలవరిస్తూంటే - "పురాణం కొంపకు చిచ్చు పెడుతున్నది” అని ఆమె ఇంతకుముందే గోల సాగించింది.

“నన్ను తిడితే తిట్టావుగాని పురాణాలను తిడితే చావగొట్టి చెవులు మూస్తాను సుమా” అని రాయుడు అంత సీరియస్ గా మందలిస్తూంటే మనకేమిటి లోలోపల్నుంచి నవ్వు అలా తన్నుకు వస్తుంది?

అదయ్యింతరవాత అలకపాన్పు. రాయుడు తీవ్రంగా ఆలోచిస్తూనే వున్నాడు. ఆమె గుర్రు పెట్టి నిద్రపోతూంది. అది విన్న రాయుడికి పెద్ద ధర్మసందేహం - “దేవతలు గుర్రు పెడతారా?” “ఏమో పెడతారేమో..." నని తనకు తానే సమాధానపడిపోవటం. చివరకు సంసారకూపంలో నుంచి బయటపడి భగవదన్వేషణ కోసం వెళ్ళిపోవాలనే నిర్ణయానికి వస్తాడు. తనకు చదువు లేకపోయినా, జ్ఞానం తక్కువైనా, భక్తి దీక్షలు ఎక్కువగానే ఉన్నాయనీ, బందిపోటు దొంగ అయిన వాల్మీకి గొప్ప మహర్షి కాగా లేంది తాను ఆ పరమేశ్వరుణ్ణి సాక్షాత్కరించుకోలేనా అని తనలో తాను తర్కించుకొని తనకు తానే నమ్మబలుక్కుంటాడు రాయుడు.

ధ్రువుడు సవతి తల్లి మీద అలిగి తపస్సుకు బయల్దేరి వెళ్ళినట్లే రాయుడు భార్య మీద అలిగి సంసార పరిత్యాగం చేసేందుకు సంసిద్ధుడవుతున్నాడు. అంతలోనే మనసు మళ్ళీ ఇంటి విషయాలపైకి మళ్ళుతుంది. అలా మాటిమాటికీ మళ్ళే మనస్సును పట్టువిడవని విక్రమార్కునిలా భగవంతుని వైపుకు మళ్ళిస్తూనే ఉన్నాడు. అంతలో తొలికోడి “కొక్కొరొకో” అని కూస్తుంది, గౌతముని గంగా స్నానానికి త్వరగా పంపేందుకు అర్ధరాత్రి వేళ దేవేంద్రుడు కోడై కూసినట్లే శ్రీ మహావిష్ణువు కూడా సుబ్బారాయుణ్ణి హెచ్చరించేందుకు కోడిపుంజయ్యా డేమోనని ఒకింత అచ్చెరువొందాడు.

“తపస్సు ప్రారంభించటం కంటే ఇంటిపట్టునే ఉండి, భగవంతుడి కృప సంపాయించకూడదా?” అని మళ్ళీ లోపలి పీకుడు. లోపలి పీకుళ్ళ నన్నింటినీ బయటకు బలవంతంగా నెట్టివేస్తూ, పురాణాల సాక్షిగా బలం పుంజుకుంటూ భద్రాచలం అడవుల్లో తపస్సు చేయాలనే ఒక నిర్ణయానికి వస్తాడు. తపస్సు ఎలా చేయాలో చెప్పేందుకు ఆర్యుల టపా బంట్రోతు నారదులవారు తగలకపోతాడా... తగిలితే బెజవాడలోనే తగలవచ్చు కూడా అని రాయుడు సరిపుచ్చుకుంటాడు. నార్లవారికి బెజవాడ మీద ఆ ప్రత్యేకమైన ప్రేమ ఎందుకో?

రాయుడు విజయవాడలో కలుసుకున్న కాషాయాంబరధారిని నారదుల వారనుకున్న సందర్భంగా నార్లవారు ఎంతటి హాస్యాన్ని పండించారో... “వత్సా!” అంటూ కాషాయాంబరధారి రాయుణ్ణి సంబోధిస్తే “ఎక్కడికి వస్తారు స్వామీ” అని రాయుడు అడగటం; నీకేమి సంకటం సంభవించిందని నారదునిగా భావించుకొంటున్న రామయోగి అడగటం, "సంకటమేమిటి? జొన్న సంకటా?” అని రాయుడు వివరణ కోరటం నవ్వెరగని వారిని సైతం నవ్విస్తాయి. అర్జునుని పాశుపతాస్త్రం కాస్తా రాయుడి నోట్లో పాచుపదాస్త్రం అవుతుంది. గగన మార్గాన వెళ్తే తపోశక్తి వృథా అవుతుందని అభినవ నారదులవారు రైళ్ళలో ప్రయాణం చేస్తున్నారట! రైళ్ళు పడిపోవటం మొదలెట్టాక మరి వారు ఏ ప్రయాణ సాధనాన్ని ఎంచుకున్నారో!!

అటువంటి అభినవ నారదుని మాటలు నమ్మి, అతనితో మంత్రోపదేశం చేయించుకొని, జేబులో మిగిలిన పదమూడు రూపాయిలను అతగాడికి సమర్పించుకుని, తపస్సు బెజవాడలోనే కొనసాగించటానికి సిద్ధపడి కృష్ణలో స్నానం చేసి కనకదుర్గమ్మ దర్శనానికై మెట్లెక్కుతూ తిండీతిప్పలు లేని రాయుడు స్పృహ తప్పి ఆ మెట్ల మీద పడిపోతాడు. తరువాత తెప్పరిల్లుకుని ఎంతగా వేడుకున్నా నారద మునీంద్రుడు ప్రత్యక్షం కాడు. రాయుడిచ్చిన డబ్బు పుచ్చుకొని గంజాయి కొట్టుకు చేరిన అభినవ నారదుల వారికి ఆ భక్తుడి కేకలు వినబడే సావకాశమేదీ?

ఇక మెట్లు పైకెక్కలేక కిందికి దిగివచ్చిన రాయుడు ఐదిళ్ళ భిక్షకు ప్రయత్నించి తిట్లు తిని చివరకు హోటలువాడు బిచ్చగాళ్ళ జోలెల్లో పారేసే ఉప్మా, వడలు లాగించటంతో పొట్టలో ఎలుకలు నిద్రపోయాయి. వాటితోపాటు తానూ నిద్రపోయి పొద్దెక్కి లేచిన రాయుడు తానెక్కడ పరున్నదీ చూచి సిగ్గిల్లి కృష్ణానదిలో స్నానం చేసి పది, పదిన్నర ప్రాంతాలకు కనకదుర్గ గుడి చేరుకుని ఆ మహాతల్లి దర్శనం చేసుకున్నాడు.

ఇక్కడ ఆ నవల అసంపూర్తిగా నిలిచిపోయింది. “పురాణ వైరాగ్యం” అనే పదానికి పురాణం వినటం వలన సుబ్బారాయుడికి కలిగిన వైరాగ్యం అని అర్థం చెప్పుకుంటే అది ఒక పెద్ద కథగా అక్కడికి ముగిసినట్లేనని, నార్లకు పురాణాల పట్ల కలిగిన వైరాగ్యం అని అర్థం చెప్పుకుంటే అది నవలగా ఇంకా ముందుకు నడవాల్సివుంది; ఇంకా రాయుడు తపస్సు చేయాల్సివుంది; అప్సరో భామినులు వచ్చి దానిని భగ్నం చేయాల్సివుంది! అసలు నార్లవారి చేతిలో పురాణం ఇంకా ఎన్ని చావుదెబ్బలు తినాల్సివుందో! అలుపు వచ్చో ఏమో నార్లవారే దానిని అలా అసంపూర్తిగా వదలినప్పుడు మనం ఇప్పుడు ఎన్ని అర్థాలు చెప్పుకుని ఏం ప్రయోజనంలే!

నార్లవారు ఆరు కథలు వ్రాశారు. అన్నీ చిన్న చిన్నవి. ఎనిమిది పుటలున్న 'అదృష్టం' అనే కథ తప్ప మిగతా ఐదు కథలూ బాగా చిన్నవి. ఐదూ కలసి పదకొండు పేజీల్లోనే ఇమిడిపోయాయి. కొసమెరుపే ఈ కథలన్నిటికీ ప్రాణం. హాస్యం అన్ని కథల్లోను అంతర్లీనం. ఓ బిచ్చగాడు తాను దొంగగా మారిపోకుండా అలా కుంటివాడవ్వటమే గొప్ప

అదృష్టం అనే ఆలోచన మీద నడిచే కథే "అదృష్టం". ఆ కుంటి బిచ్చగాడు "కాలుపోవటం సుఖం కాదటండీ" అంటూ తన రీజనింగ్ ఆధారంగా ఇలా చాకిరేవు పెట్టి ఎడాపెడా ఉతుకుతాడు :

"నేనెంత చాకిరీ చేసి పెట్టినా, ఎవ్వరికీ చెప్పులేక పోయింది. కడుపునిండా కూడైనా దొరికేది కాదు. చల్లన్నం, మాడు ముక్కలు, తాము తినగా మిగిలిన ఎంగిలీ నా ముఖాన కొట్టేవారు. నెలకు ఐదు రూపాయల జీతమని పేరు. అది నా గుడ్డ గుడుసుకూ సరిగా సరిపోయేది కాదు. పైపెచ్చు కాస్త ఆలస్యంగా తీస్తే తిట్లు; కాస్త పెందరాళే పడుకుంటే తిట్లు; కూర్చుంటే తిట్లు; బండ చాకిరివల్ల మూలపడినా తిట్లే. ఇప్పుడు నన్ను అడిగేవారూ, పెట్టేవారూ లేరు. నాకు నేను యజమాన్ని. ఇప్పుడు నేను కనీసం రూపాయి డబ్బుల్ని కళ్ళజూడని రోజు లేదు. కాలుపోకపోతే ఇంత అదృష్టం పట్టేదంటారా?".

అలా అని అందరూ బిచ్చగాళ్ళుగా మారిపోవాలని కాదు గాని వేతనానికి కుదురుకున్న, వారి దాస్యంలోని వెతలకు కడుపులో చెయ్యి పెట్టి దేవినట్లు లేదూ? ఇదే ఇలా వుంటే ఇక పదో పరకో ఓ తరంలో ఒకళ్ళ చేతిలో పెట్టి తరతరాలుగా వెట్టిచాకిరీకి గురిచేయబడ్డ వాళ్ళ గురించి ఇంక చెప్పేదేముంది?

అవిటితనానికి ముందు అతను ఓ అయ్యరు ఇంట్లో పని చేసేవాడట. అయ్యరు భార్య అతణ్ణి "కోతిముండావాడు" అనేదట. "వెడల్పు నుదురు, తీరైన ముక్కు చిన్న నోరు, చక్కని పలు వరుస, బలమైన కింది దవడ; ఇలాంటి వాడినా ఆ అయ్యరుగారి భార్య కోతివాడనటం!" అని కథకుడు కామెంట్ చేసి చివరకు బిచ్చగాడి పాత్రతోనే ఇలా చెప్పిస్తారు : "అయ్య గారిని అనవలసినమాట ఆయన్ని అనలేక నా మీద పెట్టి అంటున్నారేమోనని సరిపెట్టుకున్నా!" ఇలా కరుణ, హాస్యం పోటీలుపడి ప్రవహిస్తాయి ఈ కథలో.

"నమస్కార బాణం" అనే కథలో రామారావు నమస్కారం ఒకందుకు పెడితే నాగేశ్వరరావు మరొకందుకు అనుకోవటం చివరకు రామారావు నమస్కారం ఎందుకు పెట్టాడో తెలిసి నాగేశ్వరరావు చిల్లుపడిన బెలూన్లో తప్ప అయిపోవటం ఇంతే కథంతా. ఆ కాస్తలోనే జాతీయతాభావంతో విలసిల్లే ఎడిటర్ దర్జాను బొమ్మ కట్టించారు. ఎల్.ఐ.సి. ఏజెంట్ చొరవను రక్తి కట్టించారు.

పరమ లౌక్యుడైన మామను ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్లు ఓ అల్లుడు గుచ్చిన విధమే "గడుసు పిండం" లోని గడుసుదనం. "జర్నలిస్టు జేబుకొడితే నోట దుమ్మే" అని తెలియజేసేదే "వార్నింగ్" అనే కథ. మానవ హృదయ దౌర్బల్య రహస్యాలను బయటపెట్టేదే "ఒక రహస్యం" అనే కథ.

"తాకీదు" కథంతా ఓ ఉత్తరంలో ఇమిడిపోతుంది. అరడజను వ్యాజ్యాలున్న ఏ ఆసామీ కూతుర్ని కట్టుకున్న ఓ అల్లుడు తన భార్యకు ప్రత్యుత్తరం వ్రాస్తూ "ఏ వ్యాజ్యం పైసలైన తరువాత కట్నం పువ్వుల్లో పెట్టి ఇచ్చేది" అనే వెటకారంతో మొదలైన ఆ ఉత్తరం ఎన్నో దెప్పుళ్ళతో సాగి, యన్. కాశీపతి అనే చేవ్రాలు తాజాకలంతో "కాశీపతి"గా మారి మరుక్షణంలోనే మరో తాజా కలంలో "నీ పతి"గా మారి "కట్నం సిగదరిగిరిలే? రేపు ఆదివారం నాటికి తప్పకరా! నేను సెంట్రల్ లో (మద్రాసు సెంట్రల్ స్టేషన్) ఎదురు చూస్తుంటాను. ఆశాభంగం చెయ్యకు" అనటంతో ముగుస్తుంది. ఆ రోజుల్లో ఉత్తరాలతో కథలేం కర్మ నవలలూ నడిపిన వాళ్ళున్నారు.

అదిసరేగాని ఇంతకూ ఆ కథ చదివితే ఎవరి చిత్తములు క్షణ భంగురములని అనిపిస్తాయి! చదివి చూడండి మరి!!

(గమనిక : స్థలాభావం చేత ఈ కథలను ఈ సంపుటంలో చేర్చలేకపోయాము.)

నార్ల తర్జుమాలు కూడ చేశారు అంటే చేశారు. "విదేశ వాఙ్మయ సత్య స్వరూపం హృద్గతం చేసుకున్ననాడు ఎవరి దృక్పథమైనా విశ్వవిశాలం కాక మానదు" అనే విషయాన్ని మనసుకు పట్టించుకున్న వ్యక్తిగా నార్ల రష్యన్ కథలను తెలుగు చేయటం జరిగింది.

అయితే రష్యన్ కథలనే ఎందుకు ఎన్నుకోవలసి వచ్చింది అంటే - రష్యన్ వాఙ్మయం ప్రాచీనమైనది కాకున్నా విశ్వసాహిత్యంలో దానికి గల అత్యుత్తమ స్థానాన్ని నార్ల గ్రహించగలిగారు. "ఇంగ్లీషు ముందు మన తెలుగు భాష ఎంత నీరసంగా కనబడుతుందో, రష్యన్ ముందు ఇంగ్లీషు కూడ అంతేనట" అనేది ఈయనకు వినవచ్చింది. అది నచ్చింది. అందువల్ల 1936 నాటికే రష్యన్ కథల తొలిముద్రణ జరిగింది. 1943 నాటికి మలిముద్రణ వచ్చింది.

పదకొండు మంది కథకుల 14 కథలను పొందుపరిచి "రష్యన్ కథలు" నవయుగ ప్రచురణాలయం, పెదసనగల్లు, కృష్ణాజిల్లా వారు ప్రచురించారు. అందులో కథకుల గూర్చి పదునైన పరిచయాలు బహు క్లుప్తంగా కుదిరాయి. ఓ ఇద్దరి వివరాలు దొరకకుంటే ఆ విషయాన్ని దాటెయ్యకుండా అక్కడ ఆ మాటే చెప్పటం జరిగింది.

మళ్ళీ నేను ఆ కథల పరిచయం జోలికి పోనుగాని ఆ కథలకు శీర్షికలు పెట్టటంలోనూ, శైలీ విన్యాసంలోనూ తొణికిసలాడిన తెలుగుదనం గమనార్హం. "ఏ యెండకా గొడుగు", "కులట", "ప్రవాసి", "నాలుగు రోజులు", "పీపాచక్రం', "కంకరరాయి", "అయిదు లక్షలు" వంటి శీర్షికలు అందులో కొన్ని. అయితే స్థలాభావం వల్లనో ఏమో మనకు ఇందులో ముచ్చటగా మువ్వురు రచయితల మూడు కథలు మాత్రమే చోటు సంపాదించుకో గలిగాయి.

ఇలా ఈ సంపుటిలో మనకు నార్ల నవలాకారునిగా, కథకునిగా, అనువాదకునిగా దర్శనమిస్తారు. జర్నలిస్టుగా, వ్యాసకర్తగా, నాటకకర్తగా ప్రసిద్ధుడైన నార్లలోని ఈ సృజనాత్మక పార్శ్వాన్ని కూడా స్పృశించే చక్కని అవకాశం మనకు ఈ సంపుటి ద్వారా దక్కుతుంది.

రష్యన్ కథలు

విశ్వ సాహిత్యంలో రష్యన్ వాఙ్మయానికి అత్యుత్తమ స్థానం ఉంది. దీన్ని బట్టి రష్యన్ వాఙ్మయం చాలా ప్రాచీనమైనదనే అభిప్రాయం కలగడం కద్దు. కాని, వాస్తవానికి దాని పుట్టుక, అభివృద్ధిఅన్నీ పందొమ్మిదో శతాబ్దిలోనే జరిగాయి. అంటే అంతకు పూర్వం రష్యాకు అసలు వాఙ్మయం బొత్తిగా లేదని కాదు. ఏదో కొంత ఉండేది. అయితే అది గణనీయమైంది కాదు.

రష్యన్ వాఙ్మయానికి ప్రథమోదాహరణలు తొమ్మిది, పది, పదకొండు శతాబ్దాలలో కనబడతాయి. ఆ రోజులలో వీర గాథలు, భక్తుల జీవితాలు మొదలైన రసవత్తర కావ్యాలు కొన్ని ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఇలా మొగ్గతొడగ నారంభించిన రష్యన్ వాఙ్మయానికి టార్టారుల జైత్రయాత్ర మంచుతుపానులా వినాశన కారకమైంది.

పదమూడో శతాబ్దంలో టార్టారులు రష్యాను జయించారు. దీనితో రష్యన్ దేశానికి, రష్యన్ వాఙ్మయానికీ కూడా "అంధయుగం" ప్రారంభమైంది. ఈ యుగంలో రష్యాకు తక్కిన పాశ్చాత్య ప్రపంచంతో పూర్తిగా సంబంధం తెగి పోయింది; రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా, సారస్వత రూపంగా - ఒక్క మాటలో - అన్ని విధాలా అభివృద్ధి కుంటుపడిపోయింది.

మూడువందల సంవత్సరాల పాటు దీక్షగానూ, తీవ్రంగానూ కృషి చేసి, చివరికి పదహారో శతాబ్దంలో రష్యా టార్టారుల దాస్యాన్ని వదల్చుకుంది - ఈ దాస్యవిముక్తితో మరల దేశంలో నవచైతన్యం కనబడసాగింది.
వర్తక వాణిజ్యాల అభివృద్ధి వల్ల మొట్టమొదటి రోమనాఫ్ చక్రవర్తుల పరిపాలన కాలంలో రష్యాకు తిరిగి పాశ్చాత్య ప్రపంచంతో సంబంధం ఏర్పడింది. పీటర్ ది గ్రేట్ తన రాజధానీ నగరాన్ని పీటర్స్ బర్గ్ కు మార్చడంవల్ల ఈ సంబంధం మరింత హెచ్చింది. సర్వతోముఖంగా అభివృద్ధి చెంది ఉన్న పాశ్చాత్య ప్రపంచంతో ఏర్పడ్డ ఈ సన్నిహిత సంబంధం రష్యన్ వాఙ్మయానికి నవీన ప్రాణ ప్రతిష్ఠ చేసింది.

ఫ్రెంచి, జర్మన్ సారస్వతాల మాధుర్యాన్ని చవిచూచి, తన్మూలంగా ఉత్సాహాన్ని పొంది, రష్యన్ కవులు మాతృభాషలో కావ్యసృష్టి చేయసాగారు. ఈ కాలంనాటి రష్యన్ కవులలో లోమానోస్సవ్, డెర్జావిన్, ఫాన్ విజిన్ అనే వారు ప్రసిద్ధులు. వీరు ఉత్తమమైన కావ్యాలనే రచించారు. కాని, వీటిలో అనుకరణం హెచ్చు. పైగా, ఇవి క్లిష్టమైన భాషలో ఉన్నాయి. అంచేత ఆధునిక యుగానికి ఇవి ప్రీతికరంగా ఉండవు; ఉండలేవు.

అందుచేత అభివృద్ధి పదిహేడు, పద్దెనిమిది శతాబ్దాల నాటి రష్యన్ వాఙ్మయం... పైన చెప్పినట్టు... చాలా వరకు విదేశ రచనలకు అనుకరణం. క్రమంగా రష్యన్ ప్రజలకు ఈ అనుకరణ పద్ధతి మీద వెగటు పుట్టింది. ఇలా వెగటు పుట్టడానికి నెపోలియానిక్ యుద్ధాలు కూడా చాలా వరకు కారణమైనాయి. ఈ యుద్ధాల సందర్భంలో రష్యన్ సైనికులు తక్కిన పాశ్చాత్య ప్రపంచాన్ని పరిశీలనగా చూడ్డమూ, తమ దేశానికీ, ఇతర దేశాలకూ ఉన్న భేదాల్ని గమనించడమూ జరిగింది. పరదేశ యుద్ధరంగాలనుంచి స్వదేశానికి తిరిగి వెడుతూ వీరు కొత్త భావాలనూ, కొత్త ఆదర్శాలనూ, కొత్త రుచుల్నీ, కొత్త కోర్కెల్నీ తీసుకువెళ్ళారు. వీటి ప్రభావం వల్ల గడచిన శతాబ్దంలో రష్యన్ జీవితంలో అనేక సంస్కరణాలు జరిగాయి. ఈ సంస్కరణలు సులభంగా జరగలేదు. ఎంతో ప్రాతికూల్యాన్నీ, ఎన్నో ప్రతిబంధకాల్నీ ఎదుర్కొనవలసి వచ్చింది. ఒక్కసారిగా కాక, క్రమక్రమంగా జరిగింది.

ఇంతలో మిగిలిన యూరపియన్ రాజ్యాలలో పూర్వ పద్ధతుల మీద... కృత్రిమ నాగరక పద్ధతుల మీద... ఒక విధమైన విప్లవం బయలుదేరింది. ఈ విప్లవోద్యమాన్ని " రొమాటిక్ రివైవల్ " అని అంటారు. దీని ప్రభావం రష్యా వరకూ ప్రసరించింది. ఈ "రొమాటిక్ రివైవల్" ఉద్యమనాయకులలో ప్రధానులైన సర్ వాల్టర్ స్కాట్, లార్డ్ బైరన్ కవులు రచించిన కావ్యాల నుంచి ఉత్సాహాన్ని పొంది రష్యన్ రచయితలు సాహిత్య సీమలో నూతన మార్గాల్ని అన్వేషించసాగారు. ఇలా అన్వేషించసాగిన రచయిత లందరిలోను పుష్కిన్ గొప్పవాడు. ఈ కవి శేఖరుడు

“రొమాటిక్ రివైవల్” ఉద్యమం నుంచి ఉత్సాహాన్ని, ఆవేశాన్ని పొందినప్పటికీ, తన రచనలలో రష్యన్ జాతీయతను ప్రతిఫలింప జేశాడు.

పుష్కిన్ తర్వాత ఆయనతో సరిసమానుడుగా ఎన్నదగిన రచయిత - గోగల్. ఆంధ్ర వాఙ్మయానికి నన్నయ తిక్కనలు చేసిన సేవను, వీరుభయులు రష్యన్ వాఙ్మయానికి చేశారు. ఈ విధంగా క్రిందటి శతాబ్ద ప్రారంభంలోనే పుష్కిన్, గోగల్ కవిశేఖరులతో ప్రారంభమైన రష్యన్ వాఙ్మయం అతిశీఘ్ర కాలంలో సర్వ ప్రపంచమన్ననలకు పాత్రమైంది. ఇంత త్వరలో రష్యన్ వాఙ్మయం ఇంతటి ఉచ్చస్థానానికి రావడానికి ప్రధానంగా నాలుగైదు కారణాలున్నాయి.
వీటిలో మొట్ట మొదటి కారణం - రష్యన్ భాష. రష్యన్ భాషలో ఉన్న పదజాలం, దానికున్న భావ ప్రకటనశక్తి, దానిలోని నిర్దుష్టత, మార్దవం, లాలిత్యం - ఒక్క పోలిష్ భాషను మినహాయిస్తేమరిదేనికీ లేదు. ఇంగ్లీషు ముందు మన తెలుగు భాష ఎంత నీరసంగా కనబడుతుందో,.

రష్యన్ ముందు ఇంగ్లీషు కూడా అంతేనట. రష్యన్ భాషలోని ఈ పటిమయే రష్యన్ వాఙ్మయ సత్వరాభివృద్ధికి ప్రథమ - ప్రధాన - కారణం!

ప్రాంతాలూ ఉన్నాయి. వివిధమతాలను అనుసరించే వారు, వివిధ జాతులకు చెందినవారు, వివిధ భాషల్ని మాట్లాడే వారు అక్కడున్నారు. అంచేత రష్యాను ఒక దేశం అనడం కంటె, ఒక ఖండం ఒక ప్రపంచం అనడమే ఎక్కువ సమంజసంగా ఉంటుంది. రష్యా దేశం ఇంత సువిశాలంగాను, దాదాపుగా మరో ప్రపంచంగానూ ఉండడంవల్ల రష్యన్ స్వభావానికి ఒక విధమైన గంభీరత వచ్చింది. ఈ గంభీరత రష్యన్ వాఙ్మయంలో కూడా ప్రతిబింబించి, దాన్ని అచిర కాలంలో మహోన్నత స్థానానికి కొనివచ్చింది.

విదేశ భాషల్ని నేర్చుకోవడంలో రష్యా వారికి పెట్టింది పేరు. ఉగ్గుపాలతో స్వభాషను నేర్చినట్టే, విదేశ భాషల్ని కూడా వారు నేర్చుకోగలరు. విద్యావంతుడైన ప్రతి రష్యనకూ కనీసం రెండు విదేశభాషలు (ముఖ్యంగా జర్మన్, ఫ్రెంచి భాషలు) వచ్చి ఉంటాయి. రష్యాలో ఒకప్పుడు రెండున్నర ఏళ్ల పసిబిడ్డ ఆరు భాషలలో నట్టుపడకుండా మాట్లాడ్డం తనెరుగుదనని ఒక అమెరికన్ సాహిత్య విమర్శకుడు వ్రాశాడు. ఇంత సులభంగా - సహజంగా - విదేశ భాషల్ని నేరవ గలగడంవల్ల రష్యనులకు విదేశ వాఙ్మయాన్ని మాతృకలలోనే చదవడానికీ, దాన్ని హృద్గతం చేసుకోటానికి అవకాశం కలుగుతున్నది. విదేశ వాఙ్మయ సత్యస్వరూపం హృద్గతం చేసుకున్ననాడు ఎవరి దృక్పథమైనా విశ్వవిశాలం కాకమానదు. ఈ విశ్వవిశాల దృక్పథమే రష్యన్ వాఙ్మయ మహదభివృద్ధికి మూడో కారణం.

ఇక, ఇందుకు చివరి కారణం ఇది : తక్కిన పాశ్చాత్య దేశాలు వాఙ్మయ పథాలలో బహుదూరం వెళ్లిన తర్వాతగాని రష్యా నిదుర మేల్కొనలేదు. ఇలా ఆలస్యంగా కళ్లు తెరవడం ఒక విధంగా దోషమే అయినప్పటికీ, ఇంకో విధంగా లాభాదాయకమైంది. సాహిత్యసృష్టికి ఆలస్యంగా, పూనుకోవడంవల్ల, తక్కిన దేశాలవారు చేసిన పొరపాట్లను తప్పుకోడానికి, వారి అనుభవాన్ని వినియోగించుకోవడానికి రష్యాకు మంచి అవకాశం చిక్కింది. కష్టసుఖాన్ని వడపోసిన తర్వాత - జీవితం లోతుపాతుల్ని తెలుసుకున్న తర్వాత - ఏ నడివయస్సులోనో “ఇన్స్పిరేషన్” పుట్టి

రచనకు పూనుకునే కావ్యాలలో వుండే ప్రౌఢత్వం రష్యన్ వాఙ్మయం ఏర్పడ్డంలోగాని, అది అతిత్వరలోనే ఏర్పడ్డంలోగాని, ఆశ్చర్యమేమున్నది? -

పుష్కిన్, గోగల్ రచనలతో ప్రారంభమైన రష్యన్ వాఙ్మయానికి - దాని అదృష్టం కొద్దీ - ఒకేసారి టాల్ స్టాయ్, డాస్టావస్కీ టర్జివ్ లాంటి దిగ్గజాలు దొరికారు. వీరి వెనువెనకనే షెకన్, ఆండ్రీన్, గార్కీలుకూడా అవతరించారు. ఒక్క శతాబ్దంలోనే సర్వోత్తములైన ఇలాంటి రచయితలు - ఇంతమంది - మరి ఏ వాఙ్మయానికి సేవచెయ్యడం ఇంతకు పూర్వం జరగలేదు. ఇకముందు కూడా జరగదేమో!
రష్యన్ వాఙ్మయానికి చిన్నకథ ఒక ప్రధానాంగం. తక్కిన పాశ్చాత్య దేశాలలో - కథలను ప్రకటించే పత్రికల అవసరాల్ని బట్టి - కథాస్వరూపంలోనూ, దాని స్వభావంలోనూ కూడా చాలా మార్పులు జరిగాయి. ఈ మార్పులలో కొన్ని చాలా అసహ్యకరమైనవి; కేవలం కళ కుత్తుకను నులిపి పారవేసేవి. రష్యన్ వాఙ్మయ సద్భాగ్యం కొద్దీ దానికి మాత్రం ఈ దుస్థితి తప్పింది. రష్యన్ కథలు పత్రికల అవసరాల్ని బట్టి వికారాలకు లోనుగాకుండా, దేశకాల పాత్రానుసారంగా సక్రమాభివృద్ధిని చెందాయి.

రష్యన్ స్వభావానికి చిన్నకథల రచన బాగా తగిపోయింది. రష్యన్ జాతికి గొప్ప ప్రజ్ఞ వుంది; చక్కటి ప్రతిభవుంది. అయితే, పట్టుదల మాత్రం మృగ్యం. అంచేత పట్టుదలతో కూడిన నవలారచనలోకంటె, కథారచనలోనే ఆ జాతి ప్రజ్ఞావిశేషాలు అధికంగా రాణిస్తవి. తమ స్వభావానికి అనుగుణ్యంగా వుండ బట్టే కాబోలు పుష్కిన్ మొదలు ప్రతి రష్యన్ రచయితకూడ కనీసం ఒకటి, రెండు కథలనైనా వ్రాశాడు. ఇంతే కాదు, గతించిన నలభై, యాభై సంవత్సరాలలో ప్రముఖులనదగిన రష్యన్ రచయితలందరు కథారచనకే అధిక ప్రాధాన్యాన్ని యిచ్చారు! పెక్కుమంది సాహితీపరుల అభిప్రాయంలో ప్రపంచ కథావాఙ్మయానికి సంబంధించినంతవరకు అగ్రతాంబూలం రష్యాకే యివ్వాలి.

రష్యన్ కథల్ని గురించి ఇంత చెప్పినతర్వాత, ఇక రష్యన్ కథకుల్ని గురించి కూడా కొంత చెప్పాలి. అందుకు "రష్యన్ కథకులు" అనే ప్రత్యేక శీర్షికతో ఒక ప్రకరణం చేర్చాము.

రష్యన్ కథకుల పరిచయం

పందొమ్మిదో శతాబ్దం మధ్యభాగం రష్యన్ వాఙ్మయానికి స్వర్ణయుగం. టర్జివ్, డాస్టావస్కీ, టాల్‌స్టాయ్ - ఈ ముగ్గురు కథక చక్రవర్తులు కూడా తమ రచనలలో అధిక భాగాన్ని ప్రకటించింది ఈ సమయంలోనే!

ఐవాన్ టర్జెనీవ్

ఐవాన్ టర్జినీవ్ (1818-88) భూస్వాముల కుటుంబంలో పుట్టాడు. తండ్రి తాగుబోతు; తల్లి గయ్యాళి. అంచేత టర్జివ్ బాల్యం చాలా ఘోరంగా గడిచింది. శ్రీమంతుల కుటుంబాలలో ఆనాడు అమలులో వున్న పద్ధతులప్రకారం టర్జినీవ్ కు జర్మన్, ఫ్రెంచి భాషలలో అక్షరాభ్యాసం చేశారు. మొదట రష్యాలోనూ, తర్వాత జర్మనీలోనూ చదివి, ఆయన చదువు పూర్తిచేసుకున్నాడు. మాతృభాష అయిన రష్యన్ భాషను, ఉర్జినీవ్ - తల్లిదండ్రులకు తెలిస్తే, ఎక్కడ ఆగ్రహపడతారోనని - రహస్యంగా తమ గుర్రపువాళ్ళదగ్గరనుంచి నేర్చుకున్నాడు. గోగల్ మరణానంతరం

ఆయన్ని గురించి ప్రకటించిన వ్యాసానికిగాను టర్జివ్ పైన "మి గ్రామాన్ని కదలిపోవీలులేదు" అని జారిస్ట్ ప్రభుత్వం ఆంక్ష తొలగగానే టర్జివ్ పీటర్స్ బర్గ్ లో నివాసం ఏర్పరుచుకున్నాడు. అటు తర్వాత కొన్ని సంవత్సరాలకు ఫ్రాన్సు వెళ్ళి, జీవితాంతంవరకు అక్కడనే వుండిపోయాడు.

ప్రపంచదృష్టిని ఆకర్షించిన రష్యన్ రచయితలలో టర్జినీవ్ మొట్టమొదటివాడు. వివిధ దృశ్యాల్నీ, వ్యక్తుల్ని వర్ణించడంలో ఆయన ప్రజ్ఞ అపారం. ఆయన కథలలో "యాక్షన్" బొత్తిగా వుండదు, అయితే, ఈ లోపాన్ని మృదుమధురమైన ఆయన భాష కప్పిపుచ్చుతుంది. నాలుగు పంక్తులలో ఒక జగత్తును సృష్టించగలశక్తి, అసాధారణశక్తి, ఆయన లేఖినికుంది. టర్జివ్ రచన లన్నింటిలోనూ "ఫాదర్స్ అండ్ ్సమన్" (తండ్రులు-తనయులు) అనేది ఉత్తమోత్తమమైనదని చెబుతారు.

ఫెడర్ డాస్టో వస్కీ

డాస్టోవస్కీ (1821-87) జననం మాస్కోలో, ఆయన తండ్రి డాక్టరు. 1838లో ఆయన పీటర్స్ బర్గ్ లోని మిలిటరీ ఇంజనీయర్స్ కాలేజీలో చేరాడు. తర్వాత మూడేళ్ళకు - 1841లో - కమిషన్ సంపాయించుకున్నాడు. కాని, ఉద్యోగం అంటే విరక్తిపట్టి, 1844లో దానికి రాజీనామా పెట్టాడు. రాజీనామా పెట్టిన సంవత్సరానికి - 1845 లో - ఆయన తన మొట్టమొదటి . నవలను ప్రకటించాడు. ఈ నవల ప్రాశస్త్యాన్ని సాహితీపరులు వెంటనే గుర్తించారు; దానితో డాస్టావస్కీకి మంచికీర్తి వచ్చింది. అయితే ఆయన అటుతర్వాత ప్రకటించిన రెండు మూడు నవలలు అతి పేలవంగా తయారైనాయి. అంచేత మొదటి నవలతో వచ్చిన కీర్తి అటుపిమ్మట కొంచెం తగ్గింది. ఏదో సోషలిస్టు సంఘంలో చేరినందుకు డాస్టావస్కీని 1848 లో అరెస్టుచేశారు. విచారణలో మరణశిక్ష పడింది. వధ్యస్థలానికి తీసుకువెళ్ళారు; చేతుల్ని విరగదీసి స్తంభానికి కట్టారు. కళ్ళకు నల్లటిగంతను కట్టారు; ఫైరింగ్ స్క్వాడ్ తుపాకుల్ని గురిపెట్టింది. ఇంకొక్కక్షణంగుండు పేలుతుంది. - చచ్చి వేలాడతాడు- ఇంతలో పోలీసువాళ్ళు నురుగులు కక్కుతూవున్న గుర్రాలమీద స్వారిచేసుకుంటూ వచ్చి జార్ చక్రవర్తి దయదలచి మరణశిక్షను రద్దుచేశాడని తెలియజేశారు. ఆ రోజులలో రాజకీయ ఖైదీల విషయంలో జారిప్ ప్రభుత్వం ఈ కపటనాటకాన్ని అంతా జరిపేది. అంచేత మరణశిక్ష తప్పినప్పటికీ, అతి భయంకరమైన ఈ వధ్యస్థలానుభవాన్ని పొందినవారిలో కొందరు పిచ్చివారై ఏ రుగ్మత రాకపోయినా, బ్రతికినంత కాలము పిచ్చి కల ఏ బాధ తప్పేదికాదు. మరణశిక్షను రద్దుచేసిన తర్వాత డాస్టావస్కీని సైబీరియా పంపించారు. అక్కడ నాలుగు సంవత్సరాలపాటు ఖైదులో వున్నతర్వాత, ఆయనను సైన్యంలో 'ప్రైవేట్ సోల్జర్"గా చేరమన్నారు. అయితే, ఈ దాస్యం నుంచి ఆయనకు త్వరలోనే విముక్తి దొరికింది. అటుపైన తొమ్మిది సంవత్సరాలపాటు సైబీరియాలోనే ప్రవాసిగా వుండవలసి వచ్చింది. చివరికి చాలా కష్టంమీద 1859లో డాస్టావస్కీ శిక్షను రద్దుచేయించుకుని, పీటర్స్ బర్గ్ చేరుకున్నాడు. 1862 లో ఆయన తన సైబీరియా అనుభవాల్ని ప్రకటించాడు; ఆ తర్వాత వరసగా ఆయన గొప్ప నవలలన్నీ వెలువడ్డాయి. సైబీరియాలో వుండగా ఒక స్కూల్ మాష్టర్ భార్యమీద డాస్టావస్కీకి ప్రేమకుదిరింది. ఆవిడను పొందాలని చాలా బాధపడి, చివరికి స్కూల్ మాష్టర్ చనిపోయిన తర్వాత ఆయన ఆ అమ్మిని పెళ్ళి చేసుకున్నాడు. కాని వారి దాంపత్యంలో బొత్తిగా సుఖం లేకపోయింది.

ఈ మొదటి భార్య చనిపోతే, డాస్టావస్కీ తిరిగి తన స్టెనోగ్రాఫరునే పెళ్లి చేసుకున్నాడు. ఈవిడ దాస్టావస్కీని చాలా సుఖ పెట్టింది. సైబీరియాలో వుండగా ఆయనకు మూర్ఛరోగం వచ్చింది. దీన్ని కుదుర్చుకోటానికి ఫ్రాన్సు వెళ్ళి,

అక్కడ జూదం వ్యసనం కలిగించుకున్నాడు. ఈ రెండింటివల్ల ఆయన ఎన్నో కష్టాలను పడవలసి వచ్చింది. తిండికి గతిలేక గడియారాన్నీ, పుస్తకాలనూ కూడా అమ్ముకోవడమూ, అమ్ముకోగా వచ్చిన డబ్బును జూదంలో తగలవెయ్యడమూ చాలాసార్లు జరిగింది. మానవ విభిన్నచిత్తవృత్తుల్ని పరిశీలించడంలో డాస్టావస్కీ అపార ప్రజ్ఞావంతుడు, కరుణారసం ఆయన ప్రత్యేకసొత్తు. ఆయన రచనలన్నింటిలోనూ "క్రయిం అండ్ పనిష్మెంట్" (నేరం-శిక్ష) అనేది ఉత్తమ కావ్యమని అంటారు.

లియో టాల్‌స్టాయ్

లియో టాల్‌స్టాయ్ (1828-1920) జమీందారీ కుటుంబానికి చెందినవాడు. పసితనంలోనే ఆయన తల్లిపోయింది; తొమ్మిది సంవత్సరాల వయస్సు వచ్చేసరికి తండ్రి కూడా పోయాడు. తల్లిదండ్రులను కోల్పోయిన టాల్ స్టాయ్ ను మేనత్త పెంచింది. "డిప్లొమాటిక్ సర్వీస్"లో చేరాలని ఆయన మొదట అనుకున్నాడు. ఇందుకు ప్రాచ్యభాషల్నికూడా నేర్చుకున్నాడు.

1844లో కజాన్ విశ్వవిద్యాలయంలో చేరాలని ఆయన ప్రయత్నించాడు. కాని, ప్రవేశపరీక్షలలో తప్పిపోయాడు. ఆ మరుసటి సంవత్సరం ఇంకోసారి ప్రయత్నించి, ఈసారి పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. తర్వాత మూడేళ్ళు పాటు కాబోలు చదివి, 1847లో పట్టభద్రుడయ్యాడు. విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత, ఒకటి రెండు సంవత్సరాలు తమ పల్లెలో నివాసమున్నాడు. ఈ పల్లె జీవితంలో త్వరలోనే విసిగి, తిరిగి పిట్స్బర్గ్ విశ్వవిద్యాలయంలో చేరి న్యాయవాదపట్టాన్ని పొందాడు. 1851 లో కేసు వెళ్ళి, అక్కడ తన అన్నగారితో పాటు మిలిటరీలో పనిచేశాడు. ఆ తర్వాత క్రిమియన్ యుద్ధాలలో కూడా పాల్గొన్నాడు. "చైల్డ్ హుడ్" (శైశవం) అనేది ఆయన ప్రథమరచన. దానిని తన పేరుతో గాక, యల్.యన్.టి. అనే తన నామాక్షరాలతో ప్రకటించాడు.

ఈ గ్రంథ ప్రకటన జరగగానే సాహితీపరు లందరూ రష్యన్ సారస్వతాకాశపథాన మహోజ్వలమైన తార నూతనంగా పొడసూపిందని గ్రహించగలిగారు.

లియో టాల్‌స్టాయ్ జీవితం చాలా విచిత్రమైనది. విభిన్నమైన అనుభవాలతో పదనువారినది. ఆయన మొదట భోగి, తర్వాత విరాగి, సైనికుడిగా పని చేస్తున్న రోజులలో తప్పతాగేవాడు, జూదం ఆడేవాడు: వ్యభిచరించేవాడు. తర్వాత భోగలాలసతను వదలి పెట్టి, గ్రంథరచయితగా ప్రసిద్ధికెక్కాడు. గ్రంథరచనలో వచ్చిన కీర్తివల్ల ఆత్మసంతృప్తి చేకూరకపోవడంవల్ల సాంఘిక సేవ పైకి దృష్టిని మరల్చాడు. ఈ సందర్భంలో ఆయన ఉపాధ్యాయుడుగానూ, న్యాయమూర్తి గానూ, కర్షకుడిగానూ పనిచేశాడు. ఆ తర్వాత క్రమక్రమంగా ఆధ్యాత్మికచింతలో పడిపోయి, చివరికి సర్వసంగపరిత్యాగం చేశాడు. స్వగృహంలో బొత్తిగా మనశ్శాంతి లేకపోవడం వల్ల ఒకనాడు భార్యాబిడ్డల్ని వదలి పెట్టి వెళ్ళిపోయాడు. అప్పుడే వ్యాధిగ్రస్తుడై, ఒక కుగ్రామంలోని రైల్వే స్టేషనులో పరమపదించాడు. ప్రారంభంలో టాల్ స్టాయ్ నవలను మాత్రమే వ్రాశాడు. ఆ తర్వాత తన మత సిద్ధాంతాలను ప్రచారం చెయ్యడానికి చిన్నకథను సాధనం చేసుకున్నాడు. ఈయన ప్రతికథనూ అనుసరించి ఏదో వొక నీతిబోధ వుంటుంది. అయితే, అంతమాత్రాన కథ సౌష్ఠవం చెడదు. కళకు భంగం రాదు. టాల్ స్టాయ్,

టర్జినీవ్, డాస్టావస్కీలలో ఎవరు గొప్పవారో చెప్పశక్యం కాదు; ఒకర్ని మించి మరొకరు గొప్పవారు - మనం చెప్పగలిగింది ఇంతే!

సేవలోడ్ గార్షిన్

సెవలోడ్ గార్షిన్ (1855-1888) జీవితం చాలా విషాదకరమైంది. ముప్పై మూడుయేళ్ళ నడివయస్సులో ఆయన పిచ్చియెత్తి చనిపోయాడు. ఆయన వ్రాసినవి అయిదారు చిన్నకథలు మాత్రమే! అయినప్పటికీ, ఆ కథలలోని కళావైదగ్యంవల్ల రష్యన్ సారస్వతంలో ఉన్నతస్థానం లభించింది! రష్యాకూ, టర్కీకి జరిగిన యుద్ధాలలో గార్షిన్ పాల్గొన్నాడు. ఈ యుద్ధంలోని అనుభవాన్నే "నాలుగు రోజులు" అనే కథలో వర్ణించాడు. తన ఉన్మాదస్థితిని కూడా "రెడ్ ఫ్లవర్" (ఎర్రపువ్వు) అనే కథలో ఆయన చాలా గొప్పగా చిత్రించాడు.

ఆన్ టోన్ షెకవ్

రష్యన్ కథారచయితలలో సర్వోత్తముడు, షెకవ్, (1860-1904). ఈయన తన జీవితంలో అధికభాగాన్ని కథా రచనకే వినియోగించి, రష్యన్ కథావాఙ్మయానికి ప్రపంచప్రాధాన్యం సమకూర్చాడు. షెకవ్ తండ్రి, బానిస. అయితే స్వయంకృషివల్ల స్వాతంత్ర్యాన్ని సంపాయించుకుని, బిడ్డలకు చక్కగా చదువుచెప్పించారు. షెకవ్ మాస్కోనగరంలోని మేడే ఆయన మొదటికథ ఒక మాసపత్రికలో ప్రకటితమైంది. కొంతకాలం వైద్యవృత్తిలో వున్నతర్వాత దాన్ని వదలివేసి, సారస్వత సేవకే తన జీవితశేషాన్ని వినియోగించాడు. షెకవ్ కథలన్నీ మధ్యతరగతి జీవితాన్ని చిత్రిస్తూవుంటాయి. వాటిలో మానవస్వభావ వర్ణనలు అతిరమ్యం గానూ, మహాప్రజ్ఞావంతం గానూ వుంటాయి. వాటిలో కరుణతో కూడిన సున్నితమైన హాస్యం కూడా తొలుకాడుతూ వుంటుంది. ఫ్రెంచి కథకుడు మపాసా కంటే కూడా షెకవ్ కొన్ని విధాల గొప్పవాడు.

అలెగ్జాండర్ కుప్రిన్

అలెగ్జాండర్ కుప్రిన్ జననం 1870లో. 1917 నాటి బోల్షివిక్ విప్లవానికి పూర్వమే రష్యన్ వాఙ్మయ ప్రపంచంలో చిరకీర్తిని గడించుకున్నవారిలో ఇంకను సజీవుడైవున్నవాడు ఆయన వొక్కడు! బోల్షివిక్ విప్లవ సందర్భంలో తప్పని సరిగా జరిగిన దౌర్జన్యానికీ, రక్తపాతానికి కినిసి, ఆయన రష్యాను వదిలి ప్రవాసానికి వెళ్ళిపోయాడు. చివరికి మొన్న స్వదేశాన్ని చూడాలనే కాంక్ష కలిగి, కుప్రిన్ రష్యాకు తిరిగి వెళ్లాడు. అప్పుడు సోవియట్ ప్రభుత్వం ఆయనకు బ్రహ్మాండమైన స్వాగతమిచ్చింది.

కుప్రిన్ మిలిటరీ స్కూల్ లో చదువుకుని, ఆఫీసర్ ఉద్యోగాన్ని సంపాయించుకున్నాడు. నాలుగు సంవత్సరాల తర్వాత దానికి రాజీనామా పెట్టి, సాహిత్య సేవకు జీవితాన్ని అంకితంచేశాడు. రష్యన్ జీవిత విభిన్న సమస్యల్ని గురించి అనేక కథల్నీ, నవలలనూ వ్రాశాడు. అన్నింటిలోనూ వ్యభిచారాన్ని గురించిన "యామా ది పిట్" అనే నవల ఎక్కువ కీర్తిగాంచింది.

మేక్సింగార్కీ

మేక్సిం గార్కీ (1868-1936), అసలు పేరు - అలెక్సీ మాక్సీ మోవిచ్ పెష్ కాఫ్. గార్కీ తండ్రి వడ్రంగి. గార్కీ అయిదోయేట తండ్రి చనిపోయాడు. ఆ తర్వాత తల్లి ఇంకో పెళ్లి చేసుకుంది. తల్లి ఇంకొకరిని కట్టుకున్న తర్వాత

గార్కీ తాతగారి ఇంట్లో పెరిగాడు. తాత అద్దకం పనివాడు. అతని స్థితి చెడిపోవడంవల్ల, గార్కీ తొమ్మిదోయేటనుంచీ తన పొట్టను తాను పోసుకోవలసి వచ్చింది. తొమ్మిదోయేట మొదలు పదిహేనో యేటి వరకు ఆయన అనేక వృత్తుల్ని చేశాడు; అనేక ప్రదేశాన్ని చూచాడు. ఈ కాలం నాటి తన జీవితాన్ని వర్ణిస్తూ, గార్కీ ఇలావ్రాశాడు. "1878లో నేను ఒక మాదిగవాడి దగ్గర పనిచేశాను; 1878లో ఒక వడ్రంగి దగ్గర వున్నాను; 1880లో ఒక ఓడలో అంట్లు తోమేపనికి కుదిరాను; 1883లో రొట్టెల దుకాణంలో వున్నాను; 1884లో పోర్టర్ పని సంపాయించాను; 1885లో స్వయంగా రొట్టెల దుకాణం పెట్టాను; 1886లో టూరింగ్ నాటక సమాజంలో చేరాను; 1887 లో యాపుల్ పళ్లు అమ్ముకు బ్రతికాను; 1888లో ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించాను; 1888లో ఒక లాయర్ ఆఫీస్ లో కాపీయిస్టుగా కుదిరాను; 1891లో రష్యా అంతా కాలినడకను తిరిగాను; 1892లో రైల్వేవర్కు షాపులో కూలీగా పనిచేశాను; ఆ సంవత్సరంలోనే నా మొట్టమొదటి కథను ప్రకటించారు." 1892లో టిఫ్లిలోని రైల్వే వర్కుషాప్ లో పనిచేస్తూ, స్థానిక వార్తాపత్రికలో "మేక్సిం గార్కీ" అనే మారుపేరుతో ఆయన జీవితంలో నవీనాధ్యాయం ప్రారంభమైంది. పొట్టపోసుకోడానికి ప్రయత్నిస్తూ, అష్టకష్టాలతో గడపిన ఆ పదిహేను సంవత్సరాలలో గార్కీ అనేకమంది ఖైదీలను త్రాగుబోతుల్ని, వ్యభిచారుల్ని, పతిత జనుల్ని చూడ్డం తటస్థించింది. వారందరిని తన రచనలలో అద్భుత కళాకౌశలంతో చిత్రించాడు. గార్కీకి మొదటినుంచి రష్యన్ విప్లవోద్యమంతో సంబంధం వుండేది. బోల్షివిక్ విప్లవ దౌర్జన్యాన్ని హర్షించక పోయినా, ఆయన బోల్షివిక్ ప్రభుత్వాన్ని సమర్థించాడు.

లియోనీ ఆంద్రీవ్

(1861-1918) ఓకిలో ఒక విద్యాధిక కుటుంబంలో జన్మించాడు. మాస్కో విశ్వ విద్యాలయంలో చదువుకొని, ప్లీడరు పట్టాను పొందాడు. విద్యార్థిగా వుండగానే కథల్ని వ్రాయనారంభించాడు. కొద్దికాలం ప్లీడర్ వృత్తిలో వుండి తర్వాత దీన్ని వదిలివేశాడు. ఒక్కొక్కసారి వెర్రెత్తినవాడిలా అయి, తాగుతూవుండేవాడు; వ్యభిచరించేవాడు. కాని, ఆ తర్వాత విపరీతంగా పశ్చాత్తాపపడుతూ వుండేవాడు. ఆయన రచనలు ఎగ్గరు ఎలెన్ పో, మాథర్ లింక్ రచనల వలె "సింబాలిక్" గానూ "మిస్టీరియస్"గానూ వుంటాయి.

ఫెదర్ సోలోగబ్

ఫెదర్ సోలోగబ్ (1863-1928) నిజమైన పేరు - ఫెదర్ కజ్ మిచ్ టిటర్ కాఫ్. ఆయన జననం 1863లో. తండ్రి చెప్పులు కుట్టేవాడు; తల్లి దాసీమనిషి. తల్లి యజమాని చేసిన సహాయంతో చదువుకుని సోలోగబ్ బడిపంతులయ్యాడు. చాలా కాలం కష్టపడి పని చేసిన తర్వాత, స్కూల్సు ఇన్స్పెక్టర్ పని అయింది. రచయితగా పేరు సంపాయించుకున్న తర్వాత ఉద్యోగాన్ని చాలించుకున్నాడు. 1905 నాటి విప్లవంలో కొంతవరకు పాల్గొన్నాడు. కొని, ఆ తర్వాత రాజకీయాలనుంచి విరమించుకున్నాడు. ఆయన రచనలలో "సింబాలిజం" హెచ్చు.

మిగిలిన ఇద్దరు

ఈ కథాసంపుటిలో స్థాన వెలెరీ బ్రూసోవ్, పేన్ టలైమన్ రోమ్ నో జీవితాలను గురించి వివరాలు దొరకలేదు.
గమనిక : ఈ సంపుటంలో స్థలాభావం చేత మూడు కథలు మాత్రం ప్రచురిస్తున్నాం.

ప్రవాసి

- లియో టాల్‌స్టాయ్

బ్లడిమిర్ పట్టణంలో ఇవాన్ డిమిట్రిచ్ ఆక్సెనోవ్ అనే వర్తకు డొకడు ఉండేవాడు. అతడికి రెండు షాపులూ, వో సొంతయిల్లూ ఉండేవి.

ఆక్సెనోవ్ పడుచువాడు, అందగాడు కూడా. చక్కని ఉంగరాలు తిరిగిన జుట్టు. మహా సరదా అయిన ఘటం. సంగీతం అంటే చెవి కోసుకునేవాడు. కుర్రతనంలో తప్ప తాగుతూ ఉండేవాడు. మరీ డోస్ యెక్కువ పడితే, వీధినిపడి నానా అల్లరీ చేశేవాడుకూడా. కాని, పెళ్ళయిన మర్నాటి నుంచీ... ఎప్పుడో నూటికి కోటికి కక్కుర్తిపడ్డం తప్పితే... తాగుడు మానేశాడు.

ఒక వేసంగిలో ఆక్సెనోవ్ నిఝనీ సంతకు ప్రయాణమౌతూ ఉండగా అతడి భార్య “ఈనాడు ప్రయాణం కావద్దండీ! మిమ్మల్ని గురించి రాత్రి చాలా పీడకల కన్నానండీ” అని అభ్యంతరం చెప్పింది. ఆక్సెనోవ్ నవ్వుతూ “ఏం, సంతకు వెళ్ళగానే తాగి తందనాలాడతానేమోనని నీ భయమా?" అని వేళాకోళం చేశాడు.

“ఆఁ! మీ వేళాకోళాలకేమిగాని, రాత్రి చాలా చెడ్డ కల వచ్చిందండీ! సంతనుంచి తిరిగివచ్చి మీరు హేట్ తియ్యగానే, మీ జుట్టంతా ముగ్గుబుట్టలా నెరిసివున్నట్టు కనబడిందండీ!” అని ఆవిడ అంది.

ఈ మాటలు విని ఆక్సెనోవ్ నవ్వాడు. “అలాగా! అయితే శుభశకునమే!" అని అన్నాడు. “సరిలే, విచ్చిభయాలు పెట్టుకోవద్దు! సరుకుఅంతా అమ్మి, నీకు సంతనుంచి చక్కని బహుమానాలు తెచ్చిపెడతాలే!"
ఇలా సర్దిచెప్పి, అతడు సంతకు ప్రయాణమై పోయాడు.

సగం దూరంలో అతడికి తెలిసిన వర్తకుడొకడు తటస్థపడ్డాడు. ఆ రాత్రికి వాళ్ళిద్దరూ ఒకే హోటల్ లో బసచేశారు. ఇద్దరూ కలిసే టీ తాగారు. ఆ తర్వాత సరసనేవున్న గదుల్లోనే పడుకుని నిద్రపోయారు.

పొద్దెక్కేవరకూ పడుకునే అలవాటు ఆక్సెనోవ్ కు లేదు. పైగా, పెందరాళే బయల్దేరితే యెండను పడంగదా అని కూడా తోచింది. అంచేత పొద్దు పొడవక ముందే లేచి, బృవాణ్ణి లేపి, గుర్రాల్ని కట్టమని చెప్పాడు.

ఆ తర్వాత హోటల్ వెనకే “కాటేజీ”లో కాపురం ఉంటూవున్న హోటల్ యజమాని దగ్గరికి వెళ్ళి, తన బిల్లు చెల్లించి తిరిగి ప్రయాణాన్ని సాగించాడు. షుమారు పాతిక మైళ్ళు వెళ్ళిన తర్వాత గుర్రాలకు దాణా పెట్టించడానికిగాను ఆగాడు. ముందు కొంత సేపు హోటల్ వాకిట్లో విశ్రమించాడు. ఆ తర్వాత పోర్టికోలోకి వెళ్ళి, టీ ఆర్డర్ చేశాడు. టీ వచ్చేలోపుగా తన సితారు తీసి, పాట ప్రారంభించాడు.

హఠాత్తుగా ఒక “ట్రోయికా” (మూడు గుర్రాలబండి) వచ్చి హోటల్ ముందు ఆగింది. దానిలోనుంచి వో ఆఫీసరూ, ఇద్దరు సోల్జర్లూ దిగారు. ఆఫీసరు ఆక్సెనోవ్ దగ్గరికి వచ్చి “మీ రెవరు? ఎక్కడ నుంచి వస్తున్నారు?” అంటూ ఏవేవో ప్రశ్న లడగ సాగాడు. ఆక్సెనోవ్ అతడి ప్రశ్నల కన్నింటికీ జవాబులు చెప్పి' “కాస్త టీ

పుచ్చుకోరూ?" అని మర్యాద చెయ్యబోయాడు. కాని, ఆఫీసర్ దాన్ని వినిపించుకోకుండానే, "రాత్రి మీ రెక్కడ బస చేశారు? వొంటరిగా దిగారా? లేక, యెవడైనా వర్తకుడితో ఉన్నారా? అతణ్ణి ఈ ఉదయం చూచారా? ఇంత చీకటితో బయలుదేరి వచ్చారేం?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

తనను ఈ ప్రశ్నలన్నీ అడగడ మెందుకు? అని ఆక్సెనోవ్ విస్తుపోయాడు. అయినా జరిగినదంతా చెప్పి, "నే నేదో దొంగనో, తాగుబోతునో అన్నట్టు గుచ్చి గుచ్చి ప్రశ్న లడుగుతున్నా రెందుకు?" అని అడిగాడు.

వెంటవచ్చిన సోల్జర్లను ఇద్దర్నీ దగ్గరికి రమ్మని పిలుస్తూ, ఆఫీసరు ఇలా అన్నాడు. "నేను ఈ జిల్లా పోలీసు అధికారిని. మిమ్మల్ని ఈ ప్రశ్నలన్నీ అడగడ మెందుకంటే, రాత్రి మీతో కలిసి ఆ హోటల్ లో బసచేసిన వర్తకుణ్ణి యెవరో గొంతుకోసి చంపారు. మీ పెట్టెల్ని మేమోసారి సోదా చూడాలి".

అందరూ చేరి, హోటల్ లోకి వెళ్ళారు. పోలీస్ ఆఫీసరూ, సోల్జర్లూ ఆక్సెనోవ్ పెట్టెల్ని విప్పి, సోదా చూడసాగారు. కాసేపటికి ఆఫీసరు చరాలున ఒక పెట్టెలో నుంచి కత్తినొదాన్ని తీసి "ఇదెవరిది?" అని అడిగాడు. తన పెట్టెలోనుంచి రక్తం డాగులున్న కత్తిని తియ్యడం చూచి, ఆక్సెనోవ్ తెల్లబోయాడు.

"ఈ కత్తి మీద రక్తం డాగులున్నాయే?"

ఆక్సెనోవ్ జవాబు చెప్పడానికి ప్రయత్నించాడు. కాని ఒక్కమాటైనా పెగల్లేదు. చివరి కెలానో "నాకు... తెలియదు... నాది కాదు" అని నత్తికొట్టాడు.

అప్పుడు పోలీస్ ఆఫీసరు ఇలా అన్నాడు :

"రాత్రి నీతో పాటు బసచేసిన వర్తకుడు ఈ ఉదయానికి కంఠం తెగి, చచ్చి, పక్కలో పడివున్నాడు. నీవు తప్ప మరెవ్వరూ ఈ పనిచేసి ఉండడానికి వీల్లేదు. హోటల్ తలుపులు లోపల నుంచి గెడవేసి ఉన్నాయి; లోపల మరెవ్వరూ లేరు. నీ పెట్టెలో ఇదుగో ఈ రక్తపు డాగుల కత్తివుంది. పైగా నీ మాటా నీ నడవడీ గుట్టు బయట పెడుతున్నాయి! ఇంకా దాపరికం దేనికి? అతణ్ణి ఎలా చంపావో, ఎంత సొమ్ము దొంగిలించావో చెప్పి వెయ్యి!"

తనకు ఏ పాపం తెలియదనీ, కలిసి టీ తాగిన తర్వాత ఆ వర్తకుణ్ణి తిరిగి తను చూడలేదనీ, తన స్వంతడబ్బు ఎనిమిదివేల రుబుల్సు తప్పితే, తన దగ్గర వేరే పైకం లేదనీ, ఆ కత్తి తనది కాదనీ ఆక్సెనోవ్ ప్రమాణపూర్తిగా చెప్పాడు. కాని, అతడి మాట తడబడింది. అతడి ముఖం వెలవెలబోయింది. నిజంగా నేరం చేసినవాడిలా అతడు గజగజ వణికి పోయాడు.

ఆక్సెనోవ్ కాళ్ళూ చేతులు కట్టి, బండిలో వెయ్యవలసిందిగా పోలీసు ఆఫీసర్ సోల్జర్లకు ఉత్తరువు చేశాడు. వాళ్ళు తన కాళ్ళూ చేతులూ కట్టి, బండిలో వేస్తూవుంటే, ఆక్సెనోవ్ వలవల యేడ్చాడు. తన దేవుణ్ణి ప్రార్థించాడు. అతడి డబ్బును, పెట్టెల్నీ తీసుకుని, అతణ్ణి అక్కడికి సమీపంలోవున్న పట్టణానికి పంపించి ఖైదు చేశారు. అతని నడవడిని గురించి బ్లడిమిర్ లో దర్యాప్తు చేశారు. వర్తకులూ, ఇతర పురవాసులూ పూర్వమొకప్పుడు, అతడు తాగి, అల్లరి

చిల్లరిగా తిరుగుతూ ఉండేవాడుగాని, ఇప్పుడు మాత్రం చాలా పెద్దమనిషని చెప్పారు. ఆ తర్వాత విచారణ ప్రారంభమైంది. ర్యాజాన్ వర్తకుణ్ణి హత్యచేసి, అతడి ఇరవై వేల రుబుల్సును దొంగిలించాడని అతడిమీద కేసు పెట్టారు.

పాపం! అతడి భార్య విచారం ఇంతింతకాదు. ఆవిడకు ఏమి నమ్మాలో, ఏమి నమ్మగూడదో కూడా పాలుపోలేదు. ఆవిడ బిడ్డలందరూ పసికందులు. ఇంకా వొకబిడ్డ పాలైనా విడవలేదు. వాళ్ళందరినీ వెంటబెట్టుకుని, తన భర్త జైల్లో ఉన్న పట్టణం వెళ్లింది. మొట్టమొదట్లోనైతే అతడ్ని చూడ్డానికి వీల్లేదన్నారు. కాని, చాలా బతిమలాడిన మీదట, అధికారులు అనుజ్ఞ నిచ్చారు. దొంగలతోనూ, తాగుబోతులతోనూ కలిసి... జైలుదుస్తుల్లో ... సంకెళ్ళతో ఉన్న భర్తను చూచేసరికి ఆవిడ స్పృహ తప్పి పడిపోయింది. తిరిగి చాలా సేపటికి గాని ఆవిడకు తెలివి రాలేదు. దుఃఖోద్వేగం కొంత తగ్గగానే ఆవిడ బిడ్డల్ని దగ్గరికి తీసుకుని భర్త దగ్గిర కూర్చుంది. ఇంటి దగ్గరి కబుర్లన్నీ చెప్పి "మన ఖర్మం ఇలా వచ్చిందే?" మని అడిగింది. అతడు జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. అంతా విని "ఇప్పుడిక మన మేమి చెయ్యాలీ?" అని ఆవిడ అడిగింది.

"పాపపుణ్య మెరుగనివాణ్ణి; సర్వనాశనం కానియ్యవద్దని జార్ చక్రవర్తికి అర్జీ పెట్టుకోవాలి." తాను అర్జీ పంపించాననీ, దాన్ని తోసివేశారనీ, ఆవిడ చెప్పింది. ఆక్సెనోవ్ మారుమాటాడకుండా తల వంచివేసుకున్నాడు.
అప్పుడతని భార్య ఇలా అంది. "మీ తల నెరిసి పోయినట్టు పీడకల వచ్చిందని ఆనాడు మీతో చెప్పలేదూ? ఇప్పుడు ప్రయాణం మంచిది కాదంటే, నా మాట విన్నారు కారుగా!" తన చేతివేళ్ళను అతడి జుట్టులోనికి పోనిచ్చి, తల నిమురుతూ, "నాతో నిజం చెప్పండి; మీరు కాదూ ఆ పని చేసింది?" అని అడిగింది.

"అయితే, నీవుకూడా నన్ను అనుమానిస్తున్నావన్నమాట!" అని, అక్సెనోవ్ రెండు చేతులతోనూ ముఖాన్ని కప్పుకుని ఆవురుమని యేడ్చాడు. అంతలో వో సోల్జర్ వచ్చి, ఇక ఆ భార్యాబిడ్డలూ కదిలి పోవాలని తొందర పెట్టసాగాడు. ఆక్సెనోవ్ తన కుటుంబాన్ని కడసారి చూడ్డం అదే!

వాళ్ళు వెళ్ళిపోగానే, జరిగిన సంభాషణ జ్ఞాపకం తెచ్చుకున్నాడు. చివరికి తన భార్యకు కూడా తనమీద అనుమానం ఉన్నదని తలపుకు రాగానే, అతడిలా అనుకున్నాడు; "సత్యాన్ని గ్రహించగలిగింది ఆ పరమేశ్వరుడొక్కడే! మనం అతడినే నమ్ముకోవాలి. అతడే మనల్ని దయచూడాలి." అంతే! ఆ నాటినుంచి ఆక్సెనోవ్ అర్జీలు పెట్టుకోవడం మానేశాడు. అధికారులు దయ జూస్తారనే ఆశ వదిలేశాడు. కేవలం పరమాత్ముణ్ణి ప్రార్థించ సాగాడు.

ముందు కొరడాతో బాది, ఆ తర్వాత సైబీరియా గనులలోకి ఖైదీగా పంపించమని శిక్ష వేశారు. ఆ శిక్ష ప్రకారం ముందుగా అతణ్ణి కొరడాతో మోదారు. కొరడా దెబ్బలవల్ల పడ్డ గాయాలు మానగానే, తక్కిన ఖైదీలతో పాటు సైబీరియాకు పంపించేశారు.

ఇరవైఆరు సంవత్సరాలపాటు ఆక్సెనోవ్ సైబీరియాలో ఖైదీగా ఉన్నాడు. అతడి తల పూర్తిగా పండిపోయింది.

పొడుగ్గా, పలచగా పెరిగిన అతడి గడ్డంకూడా నెరసి పోయింది. అతడి హుషార్ అంతా చచ్చిపోయింది. బాగా గూని వచ్చేసింది. అడుగులు లెబ్బ పెడుతూ ఉన్నట్టు నడుస్తూ ఉండేవాడు. సాధారణంగా ఎవ్వరితోనూ మాటాడేవాడు కాదు. ఎన్నడూ నవ్వేవాడు కాదు. కాని, తరచు ప్రార్థన చేసుకుంటూ ఉండేవాడు.
జైల్లో ఆక్సెనోవ్ బూట్లు కుట్టడం నేర్చుకున్నాడు, ఈ విద్యతో కాస్త డబ్బు కూడబెట్టి, "ఋషి సత్తముల జీవితచరిత్ర" అనే గ్రంథాన్ని కొనుక్కున్నాడు. జైల్లో వెలుతురుగా ఉన్నంతవరకూ అతడు ఈ గ్రంథాన్ని పారాయణ చేస్తూ ఉండేవాడు. ఆదివారాలనాడు విజన్ చర్చికి వెళ్లి, అక్కడ బైబుల్ పారాయణ చేసేవాడు. కంఠం ఇంకా శ్రావ్యంగానే ఉండడంవల్ల అతడు తక్కిన వారితో కలిసి ప్రార్థనగీతాలుకూడా చదువుతూ ఉండేవాడు.

నెమ్మదిగలవాడని జైలధికారులు ఆక్సెనోవ్ ను ఇష్టంగా చూచేవారు. ఇహ, తోటి ఖైదీలకు అతడంటే చాలా గౌరవం! వాళ్లు అతణ్ణి "తాత" అనీ, "స్వామీజీ" అని పిలుస్తూ ఉండేవారు. జైలధికారులతో యేమైనా మొరపెట్టుకోవలసి ఉంటే, వాళ్లు ఆక్సెనోవ్ నే తమ పెద్దగా యెన్నుకునే వారు. తమలో తమకు పోట్లాటలు వస్తే, మధ్యవర్తిత్వం చెయ్యమని అతడి దగ్గరికే వచ్చేవారు; ఆక్సెనోవ్ కు ఇంటి కబుర్లు తెలిసేవేకావు. భార్యాబిడ్డలూ ఇంకా జీవించి ఉన్నదీ, లేనిది

అయినా అతడికి తెలియదు. "మీ దేవూరు?" అని ఎవరో అడిగారు.

ఇలా ఉండగా ఒకనాడు కొత్త ఖైదీల ముఠావొకటి జైలుకు వచ్చింది. ఆ సాయంత్రం పూట పాతఖైదీలందరూ కొత్త వాళ్ల చుట్టూ చేరి, మీరు ఏయే వూళ్ళ నుంచి వచ్చారనీ, ఎందుకుగాను మీరు శిక్షపడ్డారనీ వాళ్ళ నడిగారు. ఆక్సెనోవ్ కూడా కొత్త ఖైదీలకు దగ్గరగా కూర్చుని, వంచినతల యెత్తకుండా, వాళ్ళ సంభాషణ వింటున్నాడు.
కొత్త ఖైదీలలో వొకడు సన్నగానూ, బలంగానూ ఉన్నాడు. అతడి వయస్సు అరవై సంవత్సరాలై ఉంటుంది. గడ్డం బాగా అంటకత్తిరించి ఉంది. అది అప్పుడే కొంచెంకొంచెంగా నెరుస్తూ ఉంది. అతగాడు తను యెందుకు అరెస్టు అయ్యింది ఇతరులకు చెబుతున్నాడు.

"అబ్బే! నే నేమీ నేరం చెయ్యలేదు. ఉత్తిపుణ్యానికి శిక్షవేశారు. స్లెడ్జికి కట్టి ఉన్న గుర్రాన్ని విప్పాను. అంతమాత్రానికే అరెస్టు చేసి, దొంగతనాన్ని చేశానని చార్జి పెట్టారు. తొందరగా ఇంటికి వెడదామని గుర్రాన్ని విప్పాననీ, ఇల్లు చేరగానే దాన్ని తిరిగి వదిలివేద్దామని అనుకున్నాననీ, పైగా ఆ స్లెడ్జి ఆసామి నా జతగాడనీ, నే నేమీ నేరం చేసి ఉండలేదనీ ఎంత దూరం చెప్పినా, ససేమిరా, నా మాట విన్నారు కాదు. పోనీ, నేను గుర్రాన్ని' యెలా దొంగిలించానో, ఎక్కడ దొంగిలించానో చెప్పగలిగారా అంటే అదీ లేదు. ఒకప్పుడు నేను నిజంగానే నేరం చేశాను. న్యాయానికి యెప్పుడో నే నిక్కడికి రావలసింది. కానీ, ఆసారి నేను పట్టు పడలేదు. ఇప్పుడేమీ నేరం చెయ్యకపోయినా, ఇక్కడికి రావలసి వచ్చింది. ఆం! అన్నట్టు, నే నిక్కడికి మునుపోసారి వచ్చాను. అయితే, అప్పుడిక్కడ చాలా రోజులపాటు ఉండలేదు."

"వ్లాడిమిర్. మా తాతముత్తాతల నాటి నుంచి మావూరు అదే. నా పేరు మాకర్. నన్ను సిమెనిచ్ అని కూడా అంటారు."
ఆక్సెనోవ్ తలయెత్తి ఇలా అడిగాడు :

“అయితే, సిమెనిచి! బ్లడిమి లో ఆక్సెనోవ్ అనే వర్తక కుటుంబం సమాచారం నీ కేమైనా తెలుసా? ఆ కుటుంబం ఇకా వుందా?" “తెలియకేం? భేషక్ గా తెలుసు! వో! వాళ్ళపని మహాజోరుగా ఉంది. అయితే, వాళ్ళ నాన్న మన మాదిరిగానే యేదో తప్పుడు పనిచేసి సైబీరియాలో ఖైదీగా ఉంటున్నాడట! దానికేంగాని తాతా! నీ విక్కడి కెలా వచ్చావ్?" తన దురదృష్టాన్ని గురించి ముచ్చటించడం అంటే ఆక్సెనోవ్ కి తలనొప్పి. అంచేత అతిముక్త సరిగా “చేసిన పాపఫలంగా ఇరవై ఆరు సంవత్సరాల నుంచీ కారాగారవాసం అనుభవిస్తున్నాను” అన్నాడు.

ఏమిటా పాపం?" అని మాకర్ సిమెనిచ్ అడిగాడు.
ఇందుకు ఆక్సెనోవ్ “ఏదో పోనిద్దూ! భగవంతుడెంత రాసిపెట్టాడో, అంతా అనుభవిస్తున్నాను” అని అన్నాడు. ఇంతకు మించి అతడింకొక్క పిసరైనా బయట పెట్టేవాడు కాదు. కాని, తక్కిన పాత ఖైదీలు మాత్రం ఆక్సెనోవ్ కథ నంతా ఆ క్రొత్తవాడికి చెప్పారు.

కథనంతా వినగానే మాకర్ సిమెనిచ్ ఆక్సెనోవ్ వంక చూచి, తన తొడ చరుచుకుని - “ఆఁ! అలాగేం! భేష్! అయితే, తాతా! చాలా ముసిలాడవైపోయావ్!” అన్నాడు. “ఇక్కడ మే మిద్దరం కలుసుకోడం గొప్ప విశేషమే!” అని మాత్రం అతడన్నాడు.

ఇంత ఆశ్చర్యపడుతున్నావెందుకనీ, ఇంతకు పూర్వం ఆక్సెనోవ్ ను యెరుగున్నావా అనీ తక్కినవాళ్ళు అడిగారు. కాని, మాకర్ సిమెనిచ్ ఇందుకు జవాబు చెప్పలేదు.

ఈ మాటల్ని వినేసరికి “ఆ వర్తకుణ్ణి చంపినదెవరో ఇతడికి తెలుసునా యేం?” అని ఆక్సెనోము ఆలోచన పోయింది. అంచేత -

“సిమెనిచ్! బహుశా, నీవు ఈ విషయం వినే ఉంటావు. మనం ఇంతకు ముందు యెక్కడైనా కలుసుకున్నాం కూడానా?” అని అడిగాడు.

“లోకమంతా కోడై కూస్తే, వినకుండా ఉంటానూ? కాని, అబ్బో! ఏనాటి మాట! అప్పుడు విన్న దేమిటో ఇప్పటిదాకా గుర్తుండి యేడుస్తుందీ!”

“వర్తకుణ్ణి చంపిన వాడెవడని చెప్పుకున్నారు?” అని ఆక్సెనోవ్ ప్రశ్నించాడు.

“ఆఁ! యెవడేమిటి? కత్తి యెవడి పెట్టిలో కనబడిందో, వాడే!” అని మాకర్ సిమెనిచ్ నవ్వుతూ జవాబిచ్చాడు. “మరెవడో కత్తిని అక్కడ దాచాడన్నా... ఏదో సామెత చెప్పినట్టు... దొరికేవరకూ.

వాడు దొంగ కాడు. పెట్టి నీ తలకింద ఉండగా దానిలో పరాయివాడు కత్తినెలా పెట్టాడు? పరాయివాడే పెట్టి ఉంటే, నీకు నిద్ర మెళుకువ వచ్చేది కాదూ?” ఈ మాటల్ని వినగానే వర్తకుణ్ణి చంపింది ఇతడేనని ఆక్సెనోవ్ నిశ్చయ పరుచుకున్నాడు. వెంటనే లేచి, అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా ఆక్సెనోవ్ కు కంటిమీద కునుకేలేదు. అతడి మనస్సు చాలా వ్యాకులపడింది. ఎన్నో దృశ్యాలు అతడి కళ్ళకు కట్టినట్టు అగుపించాయి. సంతకు ప్రయాణమై వెడుతూ తను తన ఇల్లాలి దగ్గర సెలవు పుచ్చుకోవడం ఒక దృశ్యం. సాక్షాత్తు తన ఎదటికి వచ్చి నిలబడినట్టుగా ఆవిడ రూపమంతా కనబడింది. ఆవిడ ముఖమూ, ఆవిడ కళ్ళు అతడి మనోవీధిలో ఒక్కసారి మెరిసాయి. ఆవిడ మాటలూ, ఆవిడ నవ్వూ అతడి చెవుల్లో కేవలం ప్రతిధ్వనిల్లినాయి. ఆ తర్వాత అతడికి...తను ఖైదు పడ్డప్పుడు యెలా ఉన్నారో సరిగ్గా ఆ రూపంలోనే... తన చిన్న బిడ్డలు అగుపించారు. కుడితినీ తొడుక్కుని తప్పటడుగులు వేస్తూ ఉన్న బిడ్డ ఒకడు. తల్లిపాలు కుడుస్తూ ఉన్న బిడ్డ ఇంకొకడూ! ఆ పిమ్మట అప్పటిలో తను ఎలా ఉన్నదీ కూడా జ్ఞాపకం వచ్చింది - ఏమి ఆ యవ్వనం! ఏం ఆ హుషారు! అరెస్టు అవడానికి ముందు తను ఆ పోర్టికోలో కూచోవడం, చీకూ చింతా లేకుండా పాట పాడుకుంటూ ఉండడం కూడా అతడికి గుర్తు వచ్చింది. తను కొరడా దెబ్బలు పడ్డ చోటు, తనను కొరడా దెబ్బలు కొట్టిన ఆసామీ, దీన్ని చూస్తూ చుట్టూ నిలబడిన జనమూ, సంకెళ్లూ, ఖైదీలూ, ఇరవై ఆరేళ్ల కారాగారవాసం, అకాలంగా వచ్చిన ముదిమీ - ఇవన్నీ అతడి మనో నేత్రం యెదుట గిర్రున తిరిగి పోయాయి. ఒక్కసారిగా ఇదంతా తలుపుకు వచ్చేసరికి అతనికి కడుపులో చెయ్యి పెట్టి కలిచివేసినట్టు అయ్యింది! ఆ క్షణంలో ప్రాణం తీసివేసుకోవాలని కూడా అనిపించింది. "ఇదంతా ఆ దొంగ వెధవ పని!" అని ఆక్సెనోవ్ తలపోశాడు. మాకర్ సిమెనిచ్ మీద అతడికి చెప్పరానంత ఆగ్రహం కలిగింది. తను ఆ ప్రయత్నంలో నాశనమై పోయినా సరే, అతడి మీద పగసాధించాలని తహతహ పుట్టింది.

ఆ రాత్రంతా అతడు తన ఇష్టదైవాన్ని ప్రార్థిస్తూనే ఉన్నాడు. అయినా, అతడికి ఈషణ్మాత్రమైనా శాంతి లభించలేదు.
ఆ మర్నాడు అతడు మాకర్ సిమెనిచ్ దరిదాపులకు వెళ్ళలేదు. చివరికి అతణ్ణి కన్నెత్తయినా చూడలేదు.

ఈ విధంగా ఒక పక్షం గడిచింది. ఆక్సెనోవ్ కు రాత్రిళ్లు నిద్రపట్టేది కాదు. రకరకాల ఆలోచనలతో అతడికి వెర్రెత్తినట్టు అయిపోయింది.

ఒకనాటి రాత్రి జైల్లో పచారుచేస్తూ ఉండగా ఖైదీలు పడుకుంటూ ఉండే అరుగులలో ఒకదాని కింది నుంచి మట్టి పైకి ఉబుకుతూ ఉన్నట్టు అతడికి కనబడింది.

ఏమిటి చెప్మా? అని ఆశ్చర్య పడుతూ, అతడక్కడ నిలబడిపోయాడు. ఇంతలో హఠాత్తుగా మాకర్ సిమెనిచ్ అరుగుకింది నుంచి పైకి పాకి వచ్చి బెదురు మొహంతో ఆక్సెనోవ్ వంక చూచాడు.

అతణ్ణి చూడనట్టుగానే తన దారిని తను పోవాలని ఆక్సెనోవ్ ప్రయత్నించాడు. కాని, మాకర్ అతడి చెయ్యి పట్టుకుని నిలవేసి, జైలు గోడకింద తను కన్నం పెడుతున్నాననీ, కన్నం తవ్వగా వచ్చిన మట్టిని ఏ రోజు కారోజు తన హైబూట్సులోకి యెక్కించి, పనికంటూ బయటికి వెళ్లినప్పుడు రోడ్డు మీద పారబోసి వస్తున్నానని చెప్పాడు.
"గప్ చిప్ గా వూరుకున్నావంటే, నీవు కూడా నాతోపాటు ఉడాయించ వచ్చు. నా మాట వినక నీవు ఏమాత్రం వాగినా వాళ్లు నన్ను చావగొట్టేస్తారు. కాని, చచ్చేముందు నీ గొంతు పిసికేస్తాను సుమా!"

తన విరోధి ముఖాముఖిగా నిలబడేసరికి, పట్టరాని కోపం వచ్చి, ఆక్సెనోవ్ నఖశిఖపర్యంతం కంపించాడు.

“పారిపోవాలని నా కేమీ కోర్కెలేదు. నీవు నన్ను ముందెప్పుడో చంపడమేమిటి? ఆపని యేనాడో చేసివేశావ్! ఇహ నీవు చేస్తున్న పని బయట పెట్టడం మాట అంటావ్? భగవదాజ్ఞ ప్రకారం చెబితే చెబుతాను; లేకపోతే లేదు” అంటూ అతడు చెయ్యి విదిలించుకు వెళ్లిపోయాడు.

మర్నాడు పనికోసం ఖైదీలను బయటికి తీసుకెళ్ళినప్పుడు యెవడో వొకడు తన బూట్సులో నుంచి మట్టి గుమ్మరించాడని వార్డర్లు కనిపెట్టారు.

వెంటనే జైలును సోదా చూడగా కన్నం కనబడింది. సూపరింటెండెంటు ఖైదీలందరి దగ్గరికి వచ్చి, కన్నం యెవరు పెట్టిందీ బయట పెట్టమని అడిగాడు. ఎవడిమట్టుకు వాడు తనకేమీ తెలియదన్నాడు. నిజం తెలిస్తే మాకర్ సిమెనిచ్ ని చావగొట్టేస్తారని రహస్యం తెలిసినవాళ్లు కూడా కిమిన్నాస్తిగా వూరుకున్నారు. చివరకు సూపరింటెండెంట్ ఆక్సెనోవ్ వైపుకు తిరిగి ఇలా అన్నాడు.

“నీవు నిజాయితీ ఉన్న ముసలాడివి; దేవుడి ముఖం చూచి, కన్నం యెవడు పెట్టాడో చెప్పు!” తన కేమీ పట్టనట్టుగా మాకర్ సిమెనిచ్ సూపరెంటెండెంటు వంకే చూస్తూ నిలబడ్డాడు. ఆక్సెనోవ్ చేతులూ, పెదవులు వణికిపోయాయి, చాలా సేపటి వరకు అతడి నోటివెంట మాట పెగల్లేదు.

“నా జీవితాన్ని ధ్వంసం చేసిన వీడ్ని నేను దాచడం దేనికి? నేను పడ్డ బాధలన్నింటికీ వీడికి తగిన శాస్తి జరగవలసిందే? కాని, తీరా చెప్పివేస్తే వెధవను చావగొట్టేస్తారేమో! పైగా, వీడి పైన నేను అనవసరంగా అనుమాన పడుతున్నానేమో! ఇంతకూ, వీడ్ని గొడితే, నాకు వొరిగేదేముంది?” ఇలా ఆక్సెనోవ్ మనస్సు పరిపరి విధాల పోయింది.

“ఏం, ముసలాడా? మాటాడవేం? నిజం చెప్పు' కన్నం పెట్టిన వాడెవడు?” అని సూపరింటెండెంటు మళ్లీ అడిగాడు.

మాకర్ సిమెనిచ్ వంక వోరగా చూచి, ఆక్సెనోవ్ “చెప్పను, స్వామీ! ఇది చెప్పవద్దని భగవదాజ్ఞ. తమ ఆధీనంలో ఉన్నాను. తమ ఇష్టం! నన్నేమి చేసినా సరే!” అన్నాడు.

సూపరింటెండెంటు యెంత తన్నుకులాడినా, ఆక్సెనోవ్ బయటపడనే లేదు. అంచేత, వ్యవహారాన్ని అంతటితో వదిలివెయ్యక తప్పింది కాదు.

ఆ రాత్రి ఆక్సెనోవ్ కొంచెం కునుకు పడుతూ ఉండగా ఎవరో నెమ్మదిగా వచ్చి అతడి పక్కమీద కూర్చున్నారు. చీకటి గుండా పొడుచుకు చూడగా, ఆ వచ్చిన వ్యక్తి మాకర్ అని తేలింది.

“ఎందు కిలా వచ్చావ్? మళ్లీ నా కేమి తిప్పలు తెచ్చి పెడదామని?” అంటూ ఆక్సెనోవ్ అడిగాడు. మాకర్ సిమెనిచ్ స్తబ్ధుగా వూరుకున్నాడు. అంచేత ఆక్సెనోవ్ లేచి కూర్చుని, “ఎందుకొచ్చావ్? పోతావా, పహరా జవాన్ను పిలవనా?” అని బెదిరించాడు.

మాకర్ సిమెనిచ్, ఆక్సెనోవ్ కు దగ్గరగా జరిగి “ఇవాన్ డిమిట్రిచ్! నా తప్పు కాయి!” అని నెమ్మదిగా అన్నాడు.
“ఏం తప్పు?”

“వర్తకుణ్ణి చంపి, కత్తిని నీ పెట్టెలో దాచింది నేనే! నిన్ను కూడా చంపాలనుకున్నాను. కాని, నీ బయట ఏదో చప్పుడు వినబడేసరికి, కత్తిని నీ పెట్టిలో దాచేసి, కిటికీ గుండా పారిపోయాను.” ఏమి అనాలో తోచక, ఆక్సెనోవ్ మాటాడకుండా ఊరుకున్నాడు. మాకర్ సిమెనిచ్ పక్కమీద నుంచి లేచి, నేల మీద మోకరిల్లి -

“ఇవాన్ డిమిట్రిచ్! నా తప్పు కాయి! నన్ను దయచూడు! వర్తకుణ్ణి చంపింది నేనేనని చెప్పి వేస్తాను. నిన్ను వదిలేస్తారు. నీవు ఇంటికి పోవచ్చు” అని అన్నాడు.

“నీకేం, ఇప్పుడేమైనా అంటావు!” అని ఆక్సెనోవ్ అందుకున్నాడు. కాని, ఈ ఇరవై ఆరు సంవత్సరాలూ నీ కోసం నేనీ బాధలన్నీ పడ్డాను. ఇప్పుడు నే నెక్కడికి పోను.... నా భార్య చచ్చిపోయింది. నా బిడ్డలు నన్ను మరచి పోయారు, ఎక్కడికి వెళ్లడానికి నాకు దిక్కు లేదు...” మోకరిల్లిన చోటునుంచి లేవకుండా, తల నేలకు వేసికొట్టుకుని “ఇవాన్ డిమిట్రిచ్! నా తప్పు కాయి!” అంటూ మాకర్ సిమెనిచ్ మొర పెట్టుకున్నాడు. “వాళ్లు కొరడా పెట్టి బాదినప్పుడైనా ఇంతటి బాధ అనిపించ లేదు... అయినా, నీవు నాపై దయతలచి, నన్ను దాచావు. ఏమైనా సరే. నా తప్పుకాయి!” ఇలా అంటూ అతడు వెక్కి వెక్కి యేద్వసాగాడు. అతడు యేడవడం చూచి, ఆక్సెనోవ్ కూడా కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు.

“ఆ పరమాత్ముడే నిన్ను క్షమిస్తాడు. ఏమో, ఎవరికి తెలుసు? నీ కంటె నేనే వెయ్యిరెట్లు పాపాత్ముడనేమో?” అని అతడన్నాడు.

ఈ మాట లన్నాడో లేదో, అతడి గుండెమీదినుంచి పెద్ద బరువు దించినట్టు అనిపించింది, ఇంటి మీద బెంగ కూడా ఒక్కసారిగా మాయమైపోయింది.

జైలు వదిలి, బయటికి పోదామనే ఆశే మాని, అతడు అవసానకాలం కోసం యెదురు చూడసాగాడు.
ఆక్సెనోవ్ వద్దని యెంతచెప్పినా వినక, మాకర్ సిమెనెచ్ తన నేరం వొప్పుకున్నాడు. అయితే విడుదల ఉత్తరువు రాకముందే ఆక్సెనోవ్ స్వర్గస్థు డయ్యాడు.

ఈస్టర్ విందు

- అలెగ్జాండర్ కుప్రిన్

ఇది జరిగింది... ఎప్పుడు చెప్మా? ...ఆఁ? అప్పుడే దాదాపు ముప్ఫయ్ సంవత్సరాలై ఉండాలి. అప్పటికీ ఇప్పటికీ మధ్య ... అబ్బో! ... సంఘటనలు, పరిచయాలు, పట్టణాలు, విజయాలు, పరాజయాలు, సంతోషాలు, విషాదాలు... ఎన్నో! ఆ రోజుల్లో నేను కైవ్ లో ఉంటూ ఉండేవాణ్ణి. పడోవావీధి మొగలోనే నా గది. మా ఇంటి ఖామందు ఏదో వోడలో వంటవాడుగా ఉంటూవుండేవాడట. తప్పదాగి గలభా చేస్తున్నాడని అతన్ని ఆ పనిలోనుంచి తొలిగించారట. అతడి భార్య పేరు ఆనా పెట్రోవ్నా, మోసానికి, దురాశకూ, ఓర్వలేనితనానికీ ఆ అమ్మి పెట్టింది పేరు.

ఆ ఇంట్లో తియ్యకుండా మేము ఆరుగురం ఉంటూవుండే వాళ్ళం. మేము ఆరుగురమూ బ్రహ్మచారులమే. మొదటి నెంబరు గదిలో ఉంటూవుండే ఆసామి మా అందరిలోనూ పెద్దవాడు. ఒకప్పుడతడు వ్యాపారస్థుడు. లేసులు వగైరాల షాపు ఉండేది. జూదం వ్యసనం కావడం వల్ల వ్యాపారం సున్నాచుట్టింది. ఆ తర్వాత అత డెక్కడో కొన్నాళ్ళపాటు గుమాస్తాగా పనిచేశాడు. అయితే, చీట్లాటమీది మోజువల్ల ఆ ఉద్యోగం కాస్తా ఊడింది. ఇక ఇప్పు డతడికి బ్రతుకు తెరువేమిటో అతడ్ని పట్టించిన ఆ దేవుడికే తెలియాలి. పగలంతా నిద్రపోతూ ఉండేవాడు. కనుచీకటి పడుతూ ఉండగా చల్లగా ఏదైనా జూదం కొంపకు చేరుకునేవాడు. అక్కడ ఇలాంటి కొంపలకు కొరతేమిలేదు. డినీపర్ నదిగట్టుమీద ఆ పెద్ద ఓడరేవు సమీపంలో అన్నీ అవే! లాభం కోసం కాకుండా సరదా కోసం ఆడే అందరి జూదగాళ్ళలా అతడు కూడా పెద్ద అంతస్తుగలవాడు. కలుపుగొట్టు మనిషి. ఎవరినైనాసరే ఇట్టే ఆకర్షించివేసేవాడు. మూడోనెంబరు గదిలో బిట్ కావస్కీ అనే ఇంజనీయర్ ఉండేవాడు. తాను ఫారెస్ ట్రీ, మైనింగ్, సివిల్ ఇంజనీరింగ్ చదువుకున్నాననీ ఈ చదువు కోసం విదేశాలకు కూడా వెళ్ళాననీ చెబుతూ ఉండేవాడు. ఇది నిజమో వట్టికోతో తెలియదు. అయితే "జనరల్ నాలెడ్జి"లో అతడు చాలా గట్టివాడనే చెప్పాలి. ఈ విషయంలో అతగాడ్ని పెద్ద ప్రయాణం కోసం ఆదరాబాదరా సర్దుకున్న ట్రంకుతో పోల్చవచ్చు. ఏముంది, - అలాంటప్పుడు చేతి కందిన ప్రతిదాన్ని ట్రంకులో కుక్కుతాము; తీరా మూతవెయ్యబోతే అది ఒక పట్టాన పడదు; చివరికి పెట్టెను తియ్యగానే లోపలి వస్తువులు బొళుక్కుమంటూ బయటికి గెంతుతాయి. అడగా పెట్టనక్కర లేకుండానే అతగాడు వైమానిక విద్య, వృక్షశాస్త్రం, రాజకీయాలు, ఖగోళశాస్త్రం, దుర్గ నిర్మాణం, పక్షుల్ని పెంచడం, కూరగాయల్ని పండించడం, వాస్తుశాస్త్రం మొదలైన రకరకాల విషయాల్ని గురించి గుక్కతిప్పుకోకుండా లెక్చర్లు కొట్టేవాడు. నెలకొకసారి తప్ప తాగుతూ ఉండేవాడు. అప్పుడు మూడు రోజుల పాటు ఈ లోకం స్పృహలోనే ఉండేవాడు కాదు. మూడు రోజులు ఫ్రెంచిలోనే తప్ప మాటాడేవాడు కాదు! తన పూర్వమిత్రు లందరికీ డబ్బుకోసం ఫ్రెంచిలోనే ఉత్తరాలు దంచుతూ ఉండేవాడు కూడా. ఆ తర్వాత మరో అయిదు రోజులపాటు చెమటలు కక్కుకుంటూ కదలకుండా మెదలకుండా పడుకునే వాడు. అన్ని పత్రికలకూ అడ్డమైన విషయాల్నీ గురించి ఉత్తరాలు రాయడమే అతడి పని. బంజరు భూముల్ని బాగుచెయ్యడాన్ని గురించి, ఎవడైనా కొత్త నక్షత్రాన్ని కనిబెడితే దాన్ని గురించి, ఆర్టెజాన్ నూతుల్ని తవ్వడాన్ని గురించీ, - ఒక్కటేమిటీ, అన్నింటిని గురించీ రాస్తూ ఉండేవాడు. దగ్గర ఏమైనా డబ్బుంటే దాన్ని తన పుస్తకాల్లో అక్కడక్కడ దాచేవాడు. అవసరమైనప్పుడు వెతుక్కుని, ఊరికే దొరికినట్టే సంతోషించేవాడు. తరచు అతడు నత్తినత్తి కొడుతూ అంటూ ఉండే ఈ మాటలు నా కింకా బాగా జ్ఞాపకం:

"అయితే, తమ్ముడూ! రెండో అరలో నాల్గో పుస్తకం... ఆఁ! అదే! ఆ ఎలిజా హల్కా! అందులో రెండు, మూడువందల పేజీల మధ్య అయిదు రుబుల్సునోటు ఉండాలి చూడు. దాన్ని నీ బాకీ కింద జమవేసుకో!" అతడిది బట్టతల. తెల్లటి గడ్డమూ, బుగ్గమీసాలూ ఉండేవి.

నా మకాం ఎనిమిదో నంబర్ గదిలో. ఏడో నంబర్ గదిలో కాలేజీ కుర్రవాడొక డుండేవాడు. అతడిది గుండ్రటి మొహం. కొంచెం నత్తి కూడా ఉండేది. అత డిప్పుడు పేరుమోగిన పబ్లిక్ ప్రాసిక్యూటర్. ఆరోనంబర్ గదిలో కార్ల్ అనే జర్మన్ దేశస్థుడు ఉండేవాడు. రోడ్లు వెయ్యడం విషయంలో అతడు స్పెషలిస్ట్. బీర్ తాగడంలో కూడా అతగాడు స్పెషలిస్టనే చెప్పాలి. అయిదో నంబర్ గదిలో జోయా అనే అమ్మి ఉండేది. మా ఇంటి ఖామందురాలి దృష్టిలో మే మందరమూ వోయెత్తు; ఈ అమ్మివొక్కతే వోయెత్తు. ఈ గౌరవానికి చాలా కారణా లున్నాయి. మే మిచ్చే అద్దెకంటే ఈ అమ్మి ఏమాత్రమో యెక్కువ యివ్వడమే కాకుండా, దాన్ని ప్రతినెలా ఖరాఖండిగా చెల్లించేది. కావాలంటే, నెల నిండక ముందే పారవేసేది కూడా! పైగా ఏ రవ్వా రట్టూ లేకుండా తన బ్రతుకు తాను బ్రతికేది. ఎవర్నీ గదిలో చేర్చేది కాదు. అంతగా చేర్చినా, వయస్సు మళ్ళినవాళ్ళనూ, మర్యాదస్థుల్నీ మాత్రమే! సామాన్యంగా రాత్రిళ్ళన్నీ మారుమూల హోటల్సులో గడిపేది.

మాకు పరస్పరం పరిచయం ఉండేదా అంటే, ఉందనీ, లేదని కూడా చెప్పాలి. మే మొకరిద్యం నుంచి వొకరం టీ, బొగ్గులు, పత్తి, వేన్నీళ్ళు, న్యూస్ పేపర్లు, సిరా, కాగితాలు వగైరా బదులు పుచ్చుకుంటూ ఉండేవాళ్ళం.
ఆ ఇంట్లో మొత్తం తొమ్మిది గదులుండేవి. తక్కిన మూడు గదుల్నీ ఏ వారం పది రోజులకోసమో "ఇస్తోకులకు" అద్దె కిస్తూ ఉండేవాళ్ళు. ఇది కూడదని మేమభ్యంతరం చెప్పేవాళ్ళం కాదు. సమస్తానికీ మేమలవాటు పడిపోయాం.

ఆ సంవత్సరం వసంతం త్వరగా ప్రవేశించింది. డినీపర్ నదిమీద మంచు కరిగిపోయింది. నది బాగా పొంగింది: కొంచెం పల్లంగావున్న యెడమ గట్టు తలవరకూ నీరు తన్నింది. రాత్రిళ్ళు చలి తగ్గింది. ఉండివుండి దబాటు జల్లు పడుతూవుంది. ఓవాటి ఉదయం చెట్లను లేచిగురైనా లేదు... ఆ మర్నాటి ఉదయానికీ కొమ్మకొమ్మకు కొత్త చిగుళ్ళు, రెమ్మలూ, మామూలు అందంతో, ఆనందంతో ఈస్టర్ పండగకూడా వచ్చింది. పండగ గదా సంతోషంగా పరామర్శించి వద్దామన్నా, ఆవూళ్ళో నాకు నా అన్నవాళ్ళెవరూ లేరు. అంచేత ఉబుసుపోక కోసం వొంటరిగాడ్డే వీధులవెంట పచారుచేశారు. చర్చిలోకి వెళ్ళాను. ఊరేగింపుల్నీ దీపాల్నీ చూస్తూ నిలుచున్నాను; పాటల్నీ, పద్యాల్నీ విన్నాను, దీపాల వెలుగులో మహా సొగసుగా కనబడుతున్న ఆడవాళ్ళనూ, పిల్లల్నీ చూచి ఆనందించాను. మధురాతి మధురమైన విషాదచ్ఛారు లేవో నా హృదయాన్ని - కమ్మివేశాయి. బాల్యంలోవుండే ఆ నిర్మలతా, ఆ ముగ్ధత్వము పోయిందిగదా అనే నాకు పరితాపం కలిగిందా? ఏమో, కావచ్చు.

ఇంటికి తిరిగిరాగానే వాకిట్లో మా పోస్టర్ కుర్రవాడు యెదురుపడ్డాడు. వాడిపేరు, వాస్కా వాడిది చొట్టముక్కు వట్టి దొంగవెధవ. మేము పరస్పరం ఈక్టర్ గ్రీటింగ్సు (అభివందనాలు) తెలుపుకున్నాం. మొహమంతా నోరుచేసుకుని, పళ్ళూ, చిగుళ్ళూ కనబడేటట్టు నవ్వుతూ వాడు నాతో ఇలా అన్నాడు.

"అయిదో నంబర్ గది అమ్మి మిమ్మల్ని వోసారి వచ్చి పొమ్మంది, అయ్యగారు." ఆ అమ్మాయితో నాకు రవ్వంతకూడా పూర్వపరిచయం లేనందువల్ల, ఈ మాట విని నేను విస్తుపోయాను.

“ఆ అమ్మాయి మీకు ఉత్తరం పంపించింది, బాబుగోరు. అదిగో! అదే, మీ టేబుల్ మీద " అంటూ వాస్కామళ్లీ అందుకున్నాడు.

ఏదో నోట్ బుక్కులో నుంచి చించిన రూళ్ల కాగితం కనబడింది. దానిమీద నగదు వోచరు” అనే అచ్చు అక్షరాల కింద ఈ మాటలు రాసివున్నాయి. "డియర్ నంబర్ 8.

మాకు పరస్పరం పరిచయం ఉండేదా అంటే, ఉందనీ, లేదని కూడా చెప్పాలి. మే మొకరిదగ్గరి నుంచి వొకరం టీ, బొగ్గులు, పత్తి, వేన్నీళ్ళు, న్యూస్ పేపర్లు, సిరా, కాగితాలు వగైరా బదులు పుచ్చుకుంటూ ఉండేవాళ్ళం.
ఆ ఇంట్లో మొత్తం తొమ్మిది గదులుండేవి. తక్కిన మూడు గదుల్నీ ఏ వారం పది రోజులకోసమో “ఇస్తోకులకు" అద్దె కిస్తూ ఉండేవాళ్ళు. ఇది కూడదని మేమభ్యంతరం చెప్పేవాళ్ళం కాదు. సమస్తానికీ మేమలవాటు పడిపోయాం.

ఆ సంవత్సరం వసంతం త్వరగా ప్రవేశించింది. డినీపర్ నదిమీద మంచు కరిగిపోయింది. నది బాగా పొంగింది: కొంచెం పల్లంగావున్న యెడమ గట్టు తలవరకూ నీరు తన్నింది. రాత్రిళ్ళు చలి తగ్గింది. ఉండివుండి దబాటు జల్లు పడుతూవుంది. ఓనాటి ఉదయం చెట్లను లేచిగురైనా లేదు... ఆ మర్నాటి ఉదయానికీ కొమ్మకొమ్మకూ కొత్త చిగుళ్ళు, రెమ్మలూ!

మామూలు అందంతో, ఆనందంతో ఈస్టర్ పండగకూడా వచ్చింది. పండగ గదా సంతోషంగా పరామర్శించి వద్దామన్నా, ఆవూళ్ళో నాకు నా అన్నవా ళ్ళెవరూ లేరు. అంచేత ఉబుసుపోక కోసం వొంటరిగాడ్దే వీధులవెంట పచారుచేశాను. చర్చిలోకి వెళ్ళాను. ఊరేగింపుల్నీ, దీపాల్నీ చూస్తూ నిలుచున్నాను; పాటల్నీ, పద్యాల్నీ విన్నాను; దీపాల వెలుగులో మహా సొగసుగా కనబడుతున్న ఆడవాళ్ళనూ, పిల్లల్నీ చూచి ఆనందించాను. మధురాతి మధురమైన విషాదచ్ఛాయ లేవో నా హృదయాన్ని - కమ్మివేశాయి. బాల్యంలోవుండే ఆ నిర్మలతా, ఆ ముగ్ధత్వమూ పోయిందిగదా అనే నాకు పరితాపం కలిగిందా? ఏమో, కావచ్చు.

ఇంటికి తిరిగిరాగానే వాకిట్లో మా పోర్టర్ కుర్రవాడు యెదురుపడ్డాడు. వాడి పేరు, వాస్కా వాడిది చొట్టముక్కు వట్టి దొంగ వెధవ. మేము పరస్పరం ఈస్టర్ గ్రీటింగ్సు (అభివందనాలు) తెలుపుకున్నాం. మొహమంతా నోరుచేసుకుని, పళ్ళూ, చిగుళ్ళూ కనబడేటట్టు నవ్వుతూ వాడు నాతో ఇలా అన్నాడు.

“అయిదో నంబర్ గది అమ్మి మిమ్మల్ని వోసారి వచ్చి పొమ్మంది, అయ్యగోరు!”

ఆ అమ్మాయితో నాకు రవ్వంత కూడా పూర్వపరిచయం లేనందువల్ల, ఈ మాట విని నేను విస్తుపోయాను.
“ఆ అమ్మాయి మీకు ఉత్తరం పంపించింది, బాబుగోరు! అదిగో! అదే, మీ టేబుల్ మీద!" అంటూ వాస్కా మళ్లీ అందుకున్నాడు.

ఏదో నోట్ బుక్కులో నుంచి చించిన రూళ్ల కాగితం కనబడింది. దానిమీద "నగదు వోచరు" అనే అచ్చు అక్షరాల కింద ఈ మాటలు రాసివున్నాయి. "డియర్ నంబర్ 8 మీకు తీరుబడివుంటేనూ, అభ్యంతరం ఏమీ లేక పోతేనూ, నా గదికి వచ్చి ఈస్టర్ విందులో పాల్గొనండి. మీ పరిచితురాలైన - జోయా క్రామరెన్ కోల్."

సలహా అడుగుదామని ఇంజనీయర్ గదికి వెళ్ళాను. అతడు అద్దం ముందు నిలబడి, ఎన్నడూ సంస్కారం యెరుగని తన బిరుసు రాగిజుట్టును... వేళ్ళతో చిక్కుతీసి... సరిచెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు. నిగనిగలాడుతూ ఉన్న ఫ్రాక్ కోటు అతడు వేసుకున్నాడు. అది అతడికి కొంత దర్జానిచ్చింది. బాగా బిరుసుగావున్న పాతకాలర్ మీద తెల్లటి నెక్ టై కట్టుకున్నాడు. అతడికి కూడా ఆహ్వానం వచ్చింది. అంచేత మేమిద్దరం కలిసే విందుకు వెళ్ళాం.

సిగ్గుపడుతూ, బిడియపడుతూ జోయా మాకు వాకిట్లోకి యెదురు వచ్చింది. ఆవిడ మొహం సామాన్యమైన తక్కిన అందరు రష్యన్ వేశ్యల మొహాల మాదిరిగానే ఉంది. తీరూఊరూలేని మెత్తటి పెదవులు, కొంచెం వెడల్పు ముక్కు ఉండీవుండనట్టుగా ఉన్న కనుబొమలు, ఏ మాత్రమో పైకి వుబికిన ఊదాకళ్లూ. కాని, ఆవిడ చిరునవ్వు... ఇప్పటి చిరునవ్వు... ఎంతో సంసారపక్షంగా, సహజంగా, వినమ్రంగా, కోమలంగా, స్త్రీత్వం వొలికేటట్టుగా ఉండి, జోయా వదనానికి తాత్కాలికంగా అపూర్వమైన సౌందర్య గరిమను తెచ్చి పెట్టింది.

కారల్, జూదగొండీ అప్పటికే అక్కడికి చేరుకున్నారు. ఒక్క కాలేజీ స్టూడెంటు వినా ఆ వుంటూ వున్న వాళ్ళందరూ అక్కడ సమావేశమయ్యారు.

యింట్లో తియ్యకుండా ఆవిడ గది సరిగ్గా నేను వూహ చేసినట్టే వుంది. డ్రాయర్ మీద ఖాళీ చాక్ లెట్ పెట్టెలూ, అవకతవక పటాలూ, ఫేస్ పౌడరూ, దువ్వెనలూ పడివున్నాయి. గోడల నిండా ఉంగరాల జుట్టు మంగళ్ళు, తలతరిగిన యాక్టర్లు, విచ్చుకత్తులో కరవొచ్చినట్టు చూస్తున్న సోల్జర్లు మొదలైన వాళ్ళ పటాలు బారులు తీర్చి ఉన్నాయి. పరుపు మీద కొండగుట్టలా దిళ్ళు; వాటికి లేస్ గలేబులు. పోతే, గది మధ్యలోని టేబుల్ మాత్రం దివ్యంగా ఉందనే చెప్పాలి. దానిమీద లేస్ మాదిరిగా పువ్వులూ, తీగలూ కత్తిరించివున్న కాగితం పరిచివుంది. ఆ కాగితం మీద ఈస్టర్ కేకూ, రోల్సూ, కోడిగుడ్లు, ఓ తొడమాంసమూ, రెండు వైన్ సీసాలూ అమర్చివున్నాయి. గ్రీటింగ్సును అందజేసి ఆ తర్వాత లాంఛనం ప్రకారం ఆవిడకు ముందుగా మేము మా ఈస్టర్ ఆవిణ్ణి రెండు చెంపలమీద ముద్దు పెట్టుకుని, అటుపైన విందుకు కూర్చున్నాం. ఆ క్షణంలో మేమందరమూ చేరి మహావింతగా కనబడి ఉంటాం. ఆకలితో అలమటించి, దురదృష్టంతో కుంగిపోయి, జీవితంలో అంత్యదశను చేరుకున్న నలుగురు మగవాళ్ళం మేమూ; మా సరసను యవ్వనం పోయిన వో రష్యన్ వేశ్య! అంటే, ప్రపంచంలో అంతటికీ బొత్తిగా తెలివిమాలిందీ, వట్టి అమాయకురాలూ, ఏమీ నడవడి యెరగందీ, అపారమైన దయగలదీ అయిన స్త్రీ అన్నమాట! మరి, మే మైదుగురం చేరి, వింతగా కనబడ్డంలో ఆశ్చర్య మేముంది?

కాని, ఆవిడ ఎంత చక్కగా మర్యాద చేసింది! ఏమి వినమ్రంగా ఆతిథ్యం ఇచ్చింది! ఎంత ఆప్యాయంగా అందరి క్షేమాన్ని విచారించింది!!

ఇదుగో! దీన్ని తీసుకోండి!" అని మాలో వొకడికి ఫలహారం ప్లేట్ అందిస్తూ అంది. "ఇది చాలా రుచిగావుంది. కాస్త, తిని చూడండి. ఆరో నంబర్ వారికి బీర్ చాలా ఇష్టమట; వాసాను కనుక్కుంటే చెప్పాడు, మీ దగ్గర్నే టేబుల్ కింద వో బీర్ సీసా ఉంది; తీసుకోండి. తక్కినవారి కోసం వైన్ ఉంది. ఇది చాలా చక్కని వైన్, - టెనిరిఫీలో తయారైంది. నే నెరుగున్న వో నావికుడు దీన్నే పసందు చేస్తాడు".

మేము నలుగురమూ జీవితాన్ని కాసి వడపోసినవాళ్ళం; ఈ ఈస్టర్ విందు ఖర్చు యెక్కడిదో ఈ మాకు తెలియంది కాదు. వైన్ యెలా వచ్చిందో కూడా మాకు తెలుసు. ఇలా అన్ని సంగతి సందర్భాలూ తెలిసివున్నా, మాకేమీ సంకోచం అనిపించలేదు; తలవంపులుగా అసలే తోచలేదు.

ఆ రాత్రి తాను చూచివచ్చిన దృశ్యాల్ని జోయా మాకు వర్ణించింది. బ్రాడ్ స్ట్రీలోని చర్చికి తను వెళ్ళిందట. దానిలో జనం కిక్కిరిసి ఉన్నారట. అదృష్టవశాత్తూ తనకు చక్కని సీటే దొరికిందట. ఎకాడమీ క్వాయిర్ (భజన సమాజం) వారు చక్కగా పాడారట. విద్యార్థులే స్వయంగా "ఎవాన్ జెల్" అన్ని భాషలలోనూ చదివారట. ఫ్రెంచి, జర్మనీ, గ్రీక్, ఆరబిక్... ఇదీ అదీ అనేమిటి?... అన్ని భాషల్లోనూ. ఈస్టర్ కేకు నివేదన చేస్తూవుండగా, పెద్ద తొక్కిసలాట అయిపోయిందట. ఆ గలభాలో ఒకరి కేక్ ఒకరికి మారిపోయిందటకూడా.

ఆ తర్వాత జోయా ధోరణిలో కొంచెం దైన్యం ప్రవేశించింది. ఆవిడ గట్టిగా నిట్టూర్చి, తమవూళ్ళో తాము ఈస్టర్ పండగను యెలా చేసుకునే వారో చెప్పసాగింది

'మా వూళ్ళో చిన్ని నీలిపూవులేవో ఉండేవి. వాటిని మేము 'నిద్ర' పువ్వులని అంటూ వుండే వాళ్ళం. తొలకరించడం ఆలస్యం; ముందుగా అవే విచ్చేవి. ఈస్టర్ పండక్కు వాటిని కోసుకొచ్చి మా కోడిగుడ్లకు వాటి నీలిరంగును పట్టించేవాళ్ళం.

"పచ్చరంగు కావాలంటే, కోడిగుడ్లను ఉల్లిపాయ పొరలో చుట్టి, ఉడకబెట్టేవాళ్ళం. ఆ తర్వాత ఆ రకరకాల రంగుల్ని కూడా అద్దేవాళ్ళం. దాదాపు వారం రోజులు ఊరంతా తిరిగి, కోడిగుడ్లతో పందాలు వేసేవాళ్ళం, గుడ్డును గుడ్డుకు వేసికొట్టడం; ఎవరిగుడ్డు ముందు పగులుతుందో వారు వోడిపోయినట్టు లెఖ్ఖ ఓ కుర్రవెధవ ఎక్కణ్ణుంచో గాని ఇనుముతో చేసిన గుడ్డును పట్టుకొచ్చాడు. ఇహనేముందీ, వాడితో పందెంవేసి అందరూ వోడిపోయిన వాళ్ళే! కాని, చివరికి వాడిమోసం కనిపెట్టారు; వాడు గెలుచుకున్న గుడ్ల నన్నింటినీ లాక్కోవడమే కాకుండా, వాణ్ణి మెత్తగా నలగబొడిచారు కూడా.

"ఇంతేకాకుండా ఆ వారం రోజులూ మేము వుయ్యాలలూగేవాళ్ళం. ఊరు ఉమ్మడి ఉయ్యాలలు నడివీధిలో కొన్ని ఉండేవి. ఇవి కాకుండా, ఇంటింటికీ వేరే ఉయ్యాలకూడా ఉండేది. వారం వారమంతా ఆడపిల్లలూ మగపిల్లలూ కలిసి ఉయ్యాలలూగుతూనే ఉండేవాళ్ళు. వూగుతూ, చక్కని పాటల్ని పాడుతూ ఉండేవాళ్ళు. పల్లెటూళ్లో ఎంచక్కగా ఉంటుంది!" నిశ్శబ్దంగా మేము ఆవిడ మాటల్ని వింటూ కూర్చున్నాం. చిరకాలంగా విధి మమ్మల్ని క్రూరంగా చూస్తూ ఉండడంవల్ల మేము చిన్నతనం నాటి ఆటపాటల్నీ, సాంసారిక జీవితాన్నీ, కన్నతల్లినీ, పూర్వపు ఈస్టర్ పండగల్నీ చెప్పగా మరిచిపోయాం.

ఈలోపుగా కిటికీలకు కట్టివున్న క్యాలికోకర్టెన్సు తొలిరేకలు సోకడం వల్ల నీలంగా మారాయి; ఆ తర్వాత అవి కొంచెం పసుపురంగు తేలాయి; అటుపైన హఠాత్తుగా అరుణారుణమైనాయి.

"మీకు అభ్యంతరం లేకపోతే, కిటికీని తెరుస్తాను" అని జోయా అంది. మేమూ లేచి, కిటికీ దగ్గరికి వెళ్లాం. కర్టెన్ ను చుట్టివేసి, ఆవిడ తలుపును బార్లాతీసింది. అది మహానిర్మలమూ, ప్రశాంతమూ, ప్రకాశవంతమూ అయిన ప్రభాతం. ఎవరో పరిశుభ్రంగా కడిగి, ఆ యా వస్తువుల్ని వాటి వాటి స్థానంలో పెట్టినట్లుగా వుంది. ఆ నీలాకాశం, ఆ తెల్లమబ్బు, ఆ పొడుగుపాటి పోప్లర్ చెట్లు, రెపరెప కొట్టుకుంటూవున్న ఆ పచ్చటి చిగురుటాకులూ! డినీపర్ నది అనంతంగా కనబడుతూవున్న భూగర్భంపైన ప్రవహించుకుపోతూ ఉంది. గట్ల దగ్గర సుళ్ళుపడుతూవున్న వడీ, నీలిరంగూనూ! దూరాన ధావళ్యమూ, మందగమనమూ! అన్ని చర్చిలగంటలూ గణగణ మోగుతున్నాయి.

ఇంతలో హఠాత్తుగా మేమందరం వెనక్కు తిరిగి చూచాం. ఇంజనీయర్ వెక్కి వెక్కి యేడుస్తున్నాడు. కిటికీ తలుపు పట్టుకుని, తలను దానికి ఆన్చి నిలుచున్న అతడు ఆపాదమస్తకం దుఃఖోద్వేగంతో కంపించి పోతున్నాడు!

పాపం! ఆ దీనుడి హృదయంలో ఏమి కలవరం పుట్టిందో ఆ పరమాత్ముడికే తెలియాలి. చెదురుగా విన్న మాటలు తప్పితే అతడి పూర్వ జీవితాన్ని గురించి నాకు వివరంగా తెలియదు.

మనసు కుదరని సంబంధం, గుణం లేని ఇల్లాలు, గవర్నమెంటు డబ్బును కాజెయ్యడం, పెళ్ళాం రంకుమొగుణ్ణి రివాల్వర్ తో కాల్చడం, తమ తల్లితో పాటుండిపోయిన బిడ్డల మీద బెంగ, - ఇవీ నేను చూచాయగా విన్న మాటలు.

జోయా జాలిగా నిట్టూర్చి, ఇంజనీయర్ ను తన చేతుల్లోకి తీసుకొని, అతడి బట్టతలను తన రొమ్ము మీద పెట్టుకుని, నెమ్మదిగా అతడి భుజాలనూ, చెక్కిళ్ళనూ నిమరసాగింది.

"అయ్యో! నా తండ్రీ!" అంది ఆవిడ బుజ్జగింపుగా. "మీ కందరికీ జీవితమెంత భారంగా ఉందో నాకు మాత్రం తెలియదూ? పాపం? అందరూ దారంతెగిన గాలిపటాలలా అయిపోయారు... పెద్దతనం. పైగా, ఆలనాపాలనా లేకపోవడం... కాని, ఫరవాలేదు... వోపిక పట్టాలిగాని, మన కష్టాల్ని ఆలకించడానికి ఆ పరమేశ్వరుడు లేడూ!... ఊరుకో, నా తండ్రీ," అని కష్టం మీద ఇంజనీయర్ తిరిగి తెప్పరిల్లాడు; అతడికళ్ళు యెర్రబడ్డాయి ముక్కు బాగా కందింది.

"డామ్ ఇట్! డామ్ ఇట్!" అని కోపంగా అన్నాడతడు, గోడవైపుకు తిరుగుతూ, అతడిమాటలో మామూలు బండతనం కనబడింది. "లుచ్చా!"

కంఠధ్వనిని బట్టి... పాపం!... అతడు కన్నీళ్ళను ఆపుకోడానికి ప్రయత్నిస్తున్నాడని తేలిపోయింది. అయిదు నిమిషాల తర్వాత జోయా చేతిని గౌరవపూర్వకంగా ముద్దు పెట్టుకుని మేము సెలవు పుచ్చుకున్నాం. అందరికంటే వెనక కదిలింది, నేనూ ఇంజనీయరూ.

మే మిద్దరం గడపలోకి వచ్చేసరికి కాకతాళీయంగా మాకు అప్పుడే ఏదో పార్టీ నుంచి తిరిగి వస్తున్న కాలేజీ స్టూడెంటు ఎదురుపడ్డాడు.

“ఓహో!” అన్నా డతడు కనుబొమ్మల్ని అర్థయుక్తంగా యెగరవేస్తూ. “ఇక్కడ చేరారన్నమాట!... సరి, సరి!... జలసా జరిపినట్టున్నారే!" అతడి మాటలో మామూలు బండతనం కనపడింది.
ఇంజనీయర్ అతణ్ణి నఖశిఖపర్యంతం పరికించి ఒక క్షణం ఆగి, చెప్పనలవిగానంత అసహ్యంతో ఇలా అన్నాడు: ‘లుచ్చా’

ప్రేమలేఖలు

- మేక్సిం గార్కీ

ఓనాడు నా స్నేహితు డొకడు ఈ కథ చెప్పాడు :

నేను మాస్కోలో చదువుకునే రోజుల్లో మా ఇంటి పొరుగున వో వింత అమ్మి వుండేది. ఆవిడ పోలెండు దేశస్థురాలు. పేరు టెరిజా. మంచి వొడ్డూ పొడుగైన మనిషి. చాయనచాయ. గుబురైన కనుబొమలు; బండమొహం; కాంతిలేని కళ్ళు; కీచుగొంతు. ఇహ, ఆవిడ నడవడిమాట చెప్పనఖరలేదు. పహిల్వాన్ను మరిపించేది. కండలు తేలిన వొంటితో పిప్పళ్ళ బస్తాలా ఉండేదేమో, చూస్తేనే జడుపు పుట్టేది.

ఒకే మేడ మీద మేము యెదురుబొదురు గదుల్లో ఉండేవాళ్ళం. ఆవిడ ఇంట్లో ఉన్నంత సేపు నేను నా గదితలుపు తీసేవాణ్ణి కాదు. ఖర్మంచాలక నే నెప్పుడైనా మేడ మెట్లమీదో, దొడ్లోనో యెదురుపడితే, వెకిలిగా చిరునవ్వు నవ్వేది. తరచుగా ఆవిడ నిప్పులలాంటి కళ్ళతోనూ, చింపితలతోనూ ఇంటికి తిరిగివస్తూ ఉండేది. అప్పుడు నే నెదురుపడితే, ధిక్కారంగా నా వంకచూస్తూ “ఏమయ్యా! బాగున్నావా!” అని పలకరించేది.

పలకరించి, ఫక్కున నవ్వేదికూడా! ఆ వెధవనవ్వుకు వొళ్లు గరపొడిచేది. ఈ బాధ పడలేక గది మార్చివేద్దామని చాలాసార్లు అనుకున్నాను. కాని, అది చాలా చక్కనిది; మేడమీద నిలబడితే బస్తీఅంతా కనబడేది, వీధిలో రవ్వారట్టూ ఉండేది కాదు. అంచేత అక్కడ్నే ఉంటూ వచ్చాను.

ఒకనాటి ఉదయం వీధిలోకి వెడదామని బట్టల్ని వేసుకుని, మళ్ళీ కాస్త బద్ధకించి, మంచం మీద వాలాను. అంతలో హఠాత్తుగా గదితలుపు తెరచిన చప్పుడైంది. తలయెత్తి చూద్దునుగదా! వాకిట్లో టెరిజా ప్రత్యక్షం!

“ఏం బాబూ! బాగున్నారా?” అని తన కీచుగొంతుతో అడిగింది.
ఎందుకిలా వచ్చావ్?” నే నిలా కసురుకునే సరికి ఆవిడ మొహంలో... అదివరకెన్నడూ లేని... తడబాటూ, సిగ్గూ కనబడ్డాయి. “బాబూ! నావల్ల వో సాయం కోరి వచ్చాను. మాట తీసివెయ్యొద్దు!” అని అంది. “ఇదేదో దొంగవేషంరా!" అని అనుకుంటూ, పడుకున్న వాణ్ణి కదలలేదు; జవాబైనా చెప్పలేదు. “ఇంటికి ఉత్తరం

రాయాలనుకుంటున్నాను, బాబూ!" అంటూ ఆవిడ మళ్ళీ అందుకుంది. "బోలిస్ లాఫ్ కాష్ పుట్ పేర. వార్సా రైలురోడ్డుమీద స్పైన్ జియాదాలో మకాం," "సరే, ఇహ చెప్పు గబగబా!"

"ఏమిటి, ఈ వెధవ వేషం?" అనుకుంటూ, మంచం మీది నుంచి కింది కురికి, టేబుల్ దగ్గర కుర్చీలో చతికిలబడి, కాగితం కలం తీసి, "ఇలారా! ఇక్కడ కూర్చుని, ఏమి రాయాలో చెప్పు!" అన్నాను. ఆవిడ లోపలికి వచ్చి, కుర్చీలో నింపాదిగా కూర్చుని, నా కళ్ళలోకి గుచ్చి చూచింది. "సరే, ఉత్తర మెవరిపేర?" అన్నాను.

"నా ప్రియమైన బోలిస్!... నా అందాలరాశీ?... నా ప్రేమ నిధానమా!... నా జీవన సర్వస్వమా! నీ టెరిజాకు ఇన్నాళ్ళుగా ఉత్తరం రాయలేదేం? నీ దగ్గరనుంచి ఉత్తరం రాకపోవడం చూచి, నీ ఈ చిన్ని గువ్వపిట్ట ఎంత విచారపడుతున్నదో నీకు తెలుసా?"

దీన్ని విని నవ్వు ఆపుకోలేక పోయాను. దాదాపు ఆరడుగులమనిషి - దుక్కలావుంది పహిల్మాన్ జబ్బలు తా నో చిన్ని పెట్టట! ఎలాగో నవ్వు ఆపుకుని "ఎవరీ బోలిస్ లాఫ్" అని అడిగాను. బోలిస్ లాఫ్ పేరు విననివాళ్ళు కూడా ఉన్నారా అన్నట్టు నావంక చూచి, "బోలిస్... బోలిస్... నా ప్రియుడు... నా చిన్నవాడు" అంది.
"చిన్నవాడా!"

"ఎందుకు మీ కింత ఆశ్చర్యం? ఏం నాలాంటి చిన్నదానికి వో చిన్నవాడు ఉండగూడదూ?" తను "చిన్న"దట! ఇది చాలా మంచి తమాషాయే అనుకుని "ఓ! తప్పకుండా! ప్రపంచంలో అసాధ్యమంటూ ఏమీలేదు. అయితే, మీ ఇద్దరికీ ఎన్నాళ్ళనుంచి పరిచయం?" అని అడిగాను. "పదేళ్ళనుంచి!".

మరి మాటాడకుండా, ఆవిడకు ఉత్తరం రాసి పెట్టాను. ఆ ఉత్తరంలోని ప్రేమా, మార్దవమూ ఇంతింతకాదు. టెరిజా దగ్గర నుంచి కాకుండా మరి యెవతెదగ్గరనుంచైనా అలాంటి ఉత్తరం వస్తుందని తెలిస్తే, నేనే బోలిస్ ను అయివుండనందుకు తప్పకుండా విచారించి ఉండేవాణ్ణి.

"చాలా సహాయం చేశారు, బాబూ! నమస్కారాలు!" అంది టెరిజా కృతజ్ఞతతో. ఆవిడ హృదయం నిండినట్టు కనబడింది. "నా కేమైనా పనివుంటే చెప్పండి; చేసి పెడతాను." "అబ్బే! అఖ్ఖర్లేదు.'

"చినిగిన చొక్కాలూ, గుడ్డలూవుంటే నా కివ్వండి; కుట్టి పెడతాను" అని అడిగింది. "ఏం బాబుగారూ? పనితొందర ఏమీలేదు కదా?" అంటూ టెరిజా ప్రవేశించింది. . "లేదు గాని, ఎందుకు?" "సరే, మళ్ళీ బోల్కినా!"

ఈ మాటలకు లోపల కొంచెం విసుక్కుని, నాకు ఆవిడ ఏమీ పనిచేసి పెట్టనబ్బర్లేదని నిక్కచ్చిగా చెప్పి పంపించివేశాను.

రెండు వారాలు గడిచాయి. ఒకనాటి సాయంత్రం ఈలవేస్తూ కిటికీ దగ్గర కూర్చుని; ఉబుసుపోకకు ఏమిచేద్దామా అని ఆలోచిస్తున్నాను. బయట తుంపర పడుతున్నది; చలిగాలి వీస్తున్నది. ఇంతలో హఠాత్తుగా గదితలుపు తెరుచుకుంది. "వాళ్ళ పుణ్యమా అంటూ ఎవరో వస్తున్నా'రని సంతోషించాను.

"మళ్ళీ ఇదెక్కడ దాపురించిందిరా!" అని అనుకున్నాను
"దయవుంచి ఇంకో ఉత్తరం రాసిపెట్టండి, బాబూ!"

"కాదు, ఈసారి అతడి దగ్గర్నుంచి జవాబు కావాలి."

"ఏమి టది?" అన్నాను విస్తుపోతూ.
" క్షమించండి, బాబుగారూ! ఏదో తెలివి తక్కువ ముండను, - మనస్సులోవున్న మాటను సరిగా చెప్పలేను. ఈ ఉత్తరం నాకోసం కాదు ఓ నాస్నేహితుడి కోసం - అంటే, అంత పెద్ద స్నేహితుడు కాదు లెండి - కొంచెం పరిచయస్థుడు. అతడికి... పాపం... రాతకోతలు చేతరావు. నాకు వో బోలిస్ ఉన్నట్టుగానే, అతడికి వో టెరిజా వుంది..."

ఆవిడకేసి చూచాను. సిగ్గుపడుతున్నట్టు కనబడింది. చేతులు గజగజ వణుకుతున్నాయి; చాలా తడబడి పోతున్నది; ఆవిడ రహస్యం తెలుసుకున్నాననుకున్నాను.

"ఏయ్! అమ్మా! ఇలా విను! నేననీ, బోలీస్ అని ఎందుకు ఈ కాకమ్మ కథలు చెబుతావ్. ఈ అబద్ధాలు దేనికి? నా గదిలోకి రావడానికి ఇది కేవలం వంక కాదూ? ఇహ నీ మొహం చూడ్డానికైనా నా కిష్టం లేదు. దయచెయ్యి!" అని గదిమాను.

నా మాటలకు ఆవిడ బెదిరిపోయింది. సిగ్గుతో చస్తూ, మళ్ళీ యెలాగైనా సంభాషణ సాగించాలని గట్టిగా ప్రయత్నించ సాగింది. ఆవిడ ఈ వైఖర్ని చూచి, ఒకవేళ నేను పొరబడ్డానేమోనని మథనపడ్డాను. ఇంతకూ నన్ను వలలో వేసుకోవాలనీ, తప్పుదారికి దించాలనీ, ఆవిడ వచ్చివుండదు గదా! అయితే మరి ఆవిడ ఉద్దేశమేమిటి?
"బాబుగారూ -" అంటూ ఏదో చెప్పబోయి, మళ్ళీ, అంతలోనే ఆగి, చరాలున వెనక్కు తిరిగి, బైటికి వెళ్లిపోయింది. దీన్ని చూచి నేను తెల్లబోయాను. మనస్సు అదో మోస్తరుగా అయిపోయింది. ఆవిడ సరాసరి తన గదిలోకి వెళ్ళి రపీమని తలుపు వేసుకోవడం వినిపించింది. పాపం; చాలా కోపం వచ్చింది. కాసేపు అంతా పర్యాలోచన చేసి, ఆవిడ్ని వెనక్కు పిలుద్దామని నిశ్చయించుకున్నాను. ఆవిడంటే ఏమోగాని చాలా జాలి కలిగింది.

ఆవిడ గదిలోకి వెళ్లాను. మోచేతుల్ని టేబుల్మీద ఆన్చి, ముఖాన్ని చేతులతో కప్పుకుని కూర్చునివుంది.
"ఇదుగో! అమ్మి -" అంటూ పలకరించాను.

ఎప్పుడు నే నీ కథ చెప్పడం మొదలు పెట్టినా, ఈ ఘట్టం దగ్గరికి వచ్చేసరికి అదేమోగాని నాగుండె నీరౌతుంది, సరే, విను! ఆవిడ చరాలున కుర్చీలో నుంచి లేచి, సరాసరి నా దగ్గరికి వచ్చి, మెరుస్తూవున్న కళ్లతో నా భుజాలమీద తన రెండు చేతుల్నీ వేసి, గుండె పగులుతుందా అన్నట్టు వెక్కి వెక్కి యేడ్వసాగింది.

“ఈ... ఈ... ప్రశ్నలన్నీ... ఎందుకు... బాబూ... మీ కెందుకు?... వెర్రిముండాదాన్ని... అడిగానుగదా అని... నాలుగు ముక్కలు... రాసిపెట్టగూడదూ?... చూడ్డానికి... మంచిఅబ్బాయిలా... కనబడ్డారు... నిజమే బోలిసూ లేదు... టెరిజానులేదు... నేనే... ఒక్కర్తైనే... వున్నాను” అని అంది.

"అయితే, బోలీస్ అంటూ... బోలిస్ లేదూ?"

"లేదు"

"టెరిజా కూడా లేదూ?"

“లేదు... అంటే... నేను టెరిజాను”

నాకు అంతా అయోమయంగా కనబడింది. ఆవిడవంక ఆశ్చర్యంగా చూచాను. ఇప్పుడు పిచ్చెత్తింది యెవరికి? నాకా? ఈవిడకా?” అనే ప్రశ్న ఉదయించింది. ఇంతలో ఆవిడ మళ్లీ టేబుల్ దగ్గరికి వెళ్ళి, డ్రాయర్ను కాసేపు వెదికి, వో కాగితాన్ని తీసింది.

“ఇదుగో, బాబూ!” అంది తిరిగి నాదగ్గరికి వచ్చి, “మీరు నాకు రాసిపెట్టిన ఉత్తరం. నా కెందు కిది? మీరే పట్టుకుపొండి! రెండో ఉత్తరం రాసి పెట్టమంటే, రాయనంటున్నారుగా? అంతా మీలానే ఉంటారా? దయగల బాబు ఉండకపోతాడా?”

ఆవిడ చేతిలోవున్న కాగితం, - బోలిస్ లాఫ్ పేర నేను రాసి పెట్టిన ఉత్తరమే! ఈ గొడవంతా ఏమిటి చెప్మా అని వెలవెలబోయాను.

“టెరిజా! నామాట విను! ఏమి టీ గొడవ? ఏనాడో రాసి పెట్టిన ఈ ఉత్తరాన్నే పోష్టు చెయ్యలేదుగదా, మళ్లీ కొత్తవుత్తరం రాయమని యెందుకు వేధిస్తావ్?”

“ఎవరికి పోస్టు చెయ్యను?” “ఎవరికేం? అతడికి - నీ బోలిస్ కి!” “కాని... అటువంటి మనిషే లేదుగా?”
ఈ గొడవేమిటో ఇహ నాకర్థం కాదని, వెనక్కు తిరిగి వెళ్ళిపోబోయాను. ఇంతలో ఆవిడ తిరిగి అందుకుంది.
“నిజమే, బాబూ! బోలిస్ లాఫ్ అంటూ ఎవ్వడూలేడు. కాని, నాకుమాత్రం అలాంటివాడు ఉండాలనేవుంది. నేను అందరిలాంటిదాన్ని కానని నాకూ తెలుసు. కాని, నే నతడికి ఉత్తరాలు రాయడంవల్ల యెవరికేం నష్టం?"

“అబ్బ! చంపక కాస్త స్తిమితంగా మాటాడుదూ? అతడంటే, ఎవడు?” “ఎవడేమిటి! బోలిస్ లాఫ్!”
“మళ్లీ మొదలా?” అంటూ నేను విసుక్కున్నాను. “ఇప్పుడేగా అలాంటి వ్యక్తి యెవ్వడు లేడని చెప్పావ్?”

“అబ్బబ్బ!... నిజమే, బాబూ! అలాంటివా డెవడూ లేడు. లేకపోతేనేం? బోలిస్ లాఫ్ అంటూ వొక డున్నాడని నేను వూహ చేసుకుంటాను. అతడు నిజమైన వ్యక్తే అన్నట్టుగా అతడికి ఉత్తరం రాస్తాను. అతడు నా ఉత్తరానికి జవాబు రాస్తాడు. నేను మళ్ళీ రాస్తాను; అతడు మళ్ళీ జవాబిస్తాడు - ”

చివరకు నాకు సర్వం బోధపడింది. ఏదో పెద్ద నేరం చేసినవాడిలా సిగ్గులో కుంగిపోయాను. నా పొరుగునే, ఒక్క బారెడు దూరంలో ఒక మానవజీవి... ఏకాకినిగా... ప్రేమతో పలకరించేవారైనా లేకుండా... బ్రతుకుతూ తన

దిక్కుమాలిన స్థితిని విస్మరించడానికి తన ఊహాప్రపంచంలో ఒక వ్యక్తిని సృష్టించుకుని, అతడు తనకు ప్రియుడూ, తాను అతడికి ప్రేయసి అని ఉవ్విళ్ళూరుతూవుంటే, ఆమాత్రం రహస్యాన్ని ఇంతకాలంగా గ్రహించలేక పోయినందుకు నన్ను నేనే నిందించుకున్నాను!

ఆగకుండా, ఆవిడ తన కీచుగొంతుతో ఇంకా ఏమో చెబుతూనే ఉంది. "బోలిస్ పేర మీరు ఓ ఉత్తరం రాసిచ్చారా.... దాన్ని నేను ఇంకొకరి కిచ్చి చదివించుకున్నాను. దాన్ని వింటూ, నిజంగా బోలిస్ లాఫ్ అంటూ ఒక దున్నాడనే సంతోషించాను. తర్వాత బోలిస్ దగ్గరి నుంచి టెరిజాకు జవాబు కావా లన్నాను. టెరిజా అంటే, నేను. బోలిస్ ఎక్కడో వోచోట... నాకైతే తిన్నగా తెలియదు గాని... ఉన్నాడనే నా నమ్మకం. ఈ నమ్మకం లేకపోతే నా బ్రతుకు మరీ భారం కాదూ? ఇలా ఒక దున్నాడని అనుకుంటే, అంత కష్టంగానూ, అంత ఘోరంగానూ, అంత ఒంటరితనంగానూ అనిపించదు!"

సరి, ఇహ నే నప్పటినుంచి తప్పకుండా వారానికి రెండుసార్లు టెరిజానుంచి బోల్కి, బోలిస్ నుంచి టెరిజాకూ ఉత్తరాలు రాస్తూవుండేవాణ్ణి. ఆ ఉత్తరాలు చాలా అద్భుతంగా ఉండేవికూడా! ముఖ్యంగా బోలిస్ నుంచి టెరిజాకు వచ్చే ఉత్తరాలు! ఇహ ఆవిడ... నే నా ఉత్తరాలను చదువుతూ వుంటే, ఏడ్చేది, నవ్వేది, ఆనందించేది. ఇందుకు ప్రత్యుపకారంగా చిరిగిపోయిన నా స్టాకింగ్సూ, చొక్కాలూ అన్నీ కుట్టి బాగు జేసేది.

ఈ కథ ఇలా మూడు నెలలవరకూ జరిగింది. ఆ తర్వాత ఆవిణ్ణి ఎందుకోగాని అరెస్టు చేశారు. అంతే, మళ్ళీ ఆవిడ నా కెక్కడా కనబడలేదు. ఈ పాటికి ఏ జైలులోనో నిశ్చయంగా చచ్చిపోయే ఉండాలి.

పురాణ వైరాగ్యం (నవలిక)

సుబ్బారాయుడి కళ్ళకు నిద్ర దూరమైంది. ఒక వైపున అప్పుడే రగులుతున్న ఆకలి మంటలు, ఇంకో వైపున అప్పటికే రగిలి ఉన్న కోపం మంటలు ఇక నిద్ర ఎలా పడుతుంది?

చిర్రున దుప్పటి ముసుగు పెట్టాడు. అంతా కారు చీకటి. ఐనా ఆ చీకటిలో లోకం మరుగైపోలేదు. ఆ సంజవేళ జరిగిన ఘట్టాలు అతడి కళ్ల ముందర ఫిలింలోని దృశ్యాల మాదిరిగా గిరగిర తిరిగి పోతున్నవి.

ఆనాడు జరిగిన దానిలో తన తప్పు ఏమి ఉన్నది? దూడ కుడుచుకు పోయిన తర్వాత పాలు పితకబోతే ఆవు తన్నదూ? ప్రతి రోజూ తాను ఆవుతోపాటు ఇంటికి వస్తూనే ఉన్నాడు. దాన్ని భద్రంగా కట్టివేసి కుడితి పెట్టి, గడ్డి గాదర వేసి ఆ పైన పురాణం వినడానికి వెడుతున్నాడు. ఇవ్వాళ మాత్రం పొలాన కొంచెం ఆలస్యమైంది. అదరా బదరా రామాలయం మీదగా ఆవును తోలుకువస్తూ ఉంటే, అప్పటికప్పుడే అయ్యవార్లంగారు పురాణం ప్రారంభించేశారు. నిన్నటి రోజున మంచి రసకందాయంలో కథని వదలిపెట్టారు. అభిమన్యుడు పద్మవ్యూహంలో ప్రవేశించడం జరిగింది. రాత్రంతా కూడా పాపం! ఆ పసివాడు ఏమైపోయాడో అనే బెంగతో తనకు సరిగా నిద్రపట్టలేదు. అందుచేత ఇవ్వాలిటి కథ ఎక్కడ దాటిపోతుందో అని, ఆవును ఇంటివైపుకు తోలి, తాను పురాణం దగ్గర ఆగిపోయాడు. ఆసామి లేకుండా ఆవు.

ఇంటికి వచ్చిందిగదా అని, దాన్ని కాస్త కట్టివేసుకోవద్దూ? అంతమాత్రం శ్రద్ధ లేనప్పుడు, తనమీద అములు చెయ్యడం దేనికి? ఆవు తన్నుకి మూతి పగిలిన మాట వాస్తవం. కాని తెలివి తక్కువతనం దగ్గిర పెట్టుకొని ఇతరుల మీద దుమ్మెత్తిపోయడం తగునా?

అభిమన్యుడు అన్యాయమైపోయినందుకు పుట్టెడు విచారంతో తాను ఇంటికి వచ్చాడు. ఇంకా వాకిట్లో అడుగు పెట్టాడో లేదో -
"తగలబడ్డ పురాణం! నిప్పులుపడ్డ పురాణం!! - ఇదొకటి దొరికింది. ఇల్లూ వాకిలి గంగలో కలిసిపోయినా పట్టడంలేదు. ఇంటిది ఏమైపోతేనేమి, పురాణానికి మాత్రం నాగా పడగూడదు."అంటూ కరవ వచ్చింది.

పురాణం వినడం, ఏమిపాపమా? పురాణం విన్నవాడికి ఇహపర సుఖాలు రెండు దక్కుతాయని అయ్యవార్లంగారు చెప్పలేదూ? ఇల్లు వాకిలి, సంసారం అనే దేవుళ్ళాట కాసేపుమాని నాలుగు మంచి ముక్కల్ని చెవుల్లో వేసుకోవటం తప్పా?

ముప్పయి అయిదు సంవత్సరాల పాటు ప్రపంచం సంగతి తెలుసుకోకుండానే తన బ్రతుకు వెళ్ళమారింది. ఆరు నెలలనాడు సాయంత్రం పూట వీధిగుండా చుట్టకాల్చుకుంటూ పోతూ ఉంటే అయ్యవార్లంగారు పురాణం చెప్పడం కంటపడింది. "ఏమిటోలే గొడవ మనకెందుకు? మన దారిన మనం పోదాం" అని మొదట అనుకున్నాడు. ఆయన తలతిప్పడం కళ్ళెగర వేయడం, బారలు చాచడం చూడగా గమ్మత్తు అనిపించింది. దాన్ని చూస్తూ రెండు నిమిషాలు నిలబడేసరికి, ఆయన కంఠం హాయిగా ఉన్నట్టుతోచింది. ఆ హాయిని అనుభవిస్తూ మరి అయిదారు నిమిషాలు అక్కడే ఆగేసరికి వామనమూర్తి రావడం, బలిచక్రవర్తిని మూడడుగుల నేల కోరడం శుక్రాచార్యుడు ఈ దానమివ్వనీకుండా చేయడానికి చెంబులో దూరడం కథ చెవిన బడింది అంతే? ఇక భాగవతం పూర్తిగా వినాలని ఆసక్తి పుట్టింది. ఆ తర్వాత శ్రీ మహాభారతం ప్రారంభించారు. ఈ పురాణాల శ్రవణంవల్ల తనకు కనువిప్పు అయింది.

పెళ్ళాంబిడ్డలు, ఇల్లూవాకిలి, పొలం పుట్ర, గొడ్డూ గోద సర్వప్రపంచం ఇదేనని ఇంతకు పూర్వం తాను భ్రమపడ్డాడు. ఇప్పుడు ఏడులోకాలలో ఇది ఒక క్షుద్ర లోకమని, నాలుగు యుగాలలో ఇది చిట్ట చివరి పాడుయుగమని, దేవ దానవ, గంధర్వ, కిన్నెర, కింపురుషాది జాతులలో తనది నీరసమైన నరజాతి అని అతడు తెలుసుకున్నాడు.

ఇంతకు పూర్వం తాను అజ్ఞానంగా ఉన్న రోజులలో ఈ ఏడు పంట ఎంత రాలుతుంది? ధర ఎలా పలుకుతుంది? - శిస్తు చెల్లగా ఏమి మిగులుతుంది? - షాహుకారు అప్పు క్రింద ఎంత వసూలు పెట్టడం? కర్రి గిత్త జతకు మరొక దూడను కొనుక్కుంటే, నాలుగు ఎకరాల కొంద్రను కట్టుబడి చెయ్యవచ్చు గదా? - గొడ్లను మళ్ళవెయ్యడానికి వచ్చే ఏర్వాక పున్నానికైనా ఒక బుడ్డవాన్ని పెట్టుకుంటే బాగుంటుంది ఆలోచనలు అన్నీ కూడా ఈ ధోరణిలో నడిచేవి. ఇక, ఇప్పుడో? కళ్ళు మూసుకున్నా, తెరిచి ఉంచినా - రాజులు, రాణులు, అశ్వమేధ యాగాలు, హోరాహోరి యుద్ధాలు - మునులు, ఋషులు, తపస్సులు, వరాలు, శాపాలు -ఇంద్రుడు,

రంభ, వసంతుడు, మన్మధుడు, సురాపానం - యాగాలు, యజ్ఞాలు, రాక్షసులు, వారి సంహారం ఇలాంటి దృశ్యాలు కనబడుతున్నాయి.

ఇలాగని తాను పొలం పాటు తగ్గించాడా? అబ్బే! లేదు ఎప్పటిలా రెక్కలు విరుచుక పనిచేస్తూనే ఉన్నాడు. పని పాటలన్నీ చూచుకొని, దీపాలు పెట్టకముందే నాలుగు మెతుకులు తిని, రెండో రైలు వెళ్ళేవరకూ పురాణం విని వస్తున్నాడు. విని వచ్చిన విషయాలను గూర్చి నిద్ర కూరుకువచ్చే వరకూ ఆలోచించుకుంటున్నాడు. తీరా నిద్రపట్టిన తర్వాత వాటిని గురించి కలలు కంటున్నాడు. “నిద్రలో రాముడనీ భీముడనీ, ఇల్లు ఎగిరి పోయ్యేల ఏమో పలవరిస్తున్నావు. పురాణం కొంపకు చిచ్చు పెడుతున్నది” అని ఇంటిది ఇదివరకే గోల సాగించింది. అంతా విడ్డూరం గానీ, తాను అంత గట్టిగా పలవరిస్తూ ఉంటే తనకు రవ్వంతైనా వినబడకుండా ఉంటుందా?

ఇంటి దాని గోల చూస్తే, ఇది వరకే చీకాకుగా ఉంది. ఇక ఇవ్వాళ అరికాలి మంట నెత్తికి వెళ్ళింది. “నన్ను తిడితే తిట్టావుగాని పురాణాలను తిడితే చావగొట్టి చెవులు మూస్తాను సుమా! అని ముందుగానే తాను మందలించాడు. దానితో సర్దుకుపోవచ్చుగదా! అబ్బే! సర్దుకుపోవడమే! నీ పురాణాలు బుగ్గికాను! నీ పురాణాలు నాశనం గాను! అని నోటికి వచ్చినట్లు చదివింది ఇక సహించలేక, తాను కొంచెం చెయ్యి చేసుకున్నాడు. అప్పటికైనా నోరు మూసుకుంటే తాను తమాయించుకొనే వాడే! కానీ ఇంకా నాలుగు శాపనార్థాలు పెట్టి “ఇక నేను ఈ ఇంటిలో అన్నం కూడా ముట్ట” నని శపించి పడుకున్నది, ముట్టకపోతే పోయింది, తనకైనా కూడు పెట్టిందా? లేదు. భర్త కొట్టినా, తన్నినా, జుట్టు పట్టుకు ఈడ్చినా, సీత గాని, సావిత్రి గాని, దమయంతి గాని ఇలా చేసేదా? ఇంతకూ ఇది కలికాలం. ధర్మం ఒంటికాలి మీద నడుస్తున్నది. ఈనాటి భార్యలకు పూర్వ కాలపు ఈ పతివ్రతల శాంతి, సహనం ఎలా వస్తుంది?

“సరే, కానివ్వు! అని పళ్ళు పట పట కొరుకుతూ తాను కూడా తన మంచం వాల్చుకొని పడుకున్నాడు. ఎంత తన్నుకున్నా నిద్ర పట్టదు గదా?

తనలానే ఇంటిది కూడా కొంచెం సేపు ఇటూ అటూ మసిలినట్టు కనబడింది. కాని, గంటయినా కాక ముందే ముసుగులోనుంచి గుర్రు ప్రారంభమయింది. ఆ గుర్రు వింటున్న కొద్దీ మరింత రేచిక్కగా ఉంది. తనను ఇంత క్షోభపెట్టి, పైగా గుర్రు పెట్టి నిద్రపోవడం ఇది ఈ పాడు కాలానికే తగిపోయింది. అన్నట్టు, దేవతలు గుర్రు పెడతారా? అని అంతలోనే ఒక ధర్మ సందేహం తోచింది... ఏమో, పెడతారేమో!

ఆ! పెట్టరు. వాళ్ళు అసలు నిద్ర పోనే పోరుగదా, ఇక గుర్రు పెట్టడం ఎలా జరుగుతుంది?

ఆకలి దంచివేస్తూ ఉంది. తానే లేచి, నాలుగు మెతుకులు పెట్టుకు తింటే అది బెట్టు తక్కువ పని. కడుపున పుట్టిన ఒక్క కూతురు ఇంటి దగ్గరైనా ఉంటే, “నానా! లే! కాళ్ళు కడుక్కో” అని బ్రతిమలాడేది. కాని, దానికి నిరుడే పెళ్ళిచేసి, అత్తవారింటికి పంపించేశారు.

ఆకలికేమి గాని, అసలు ఇంటిది చేసిన గోల మనస్సును కలత పెట్టి వేస్తూ ఉంది. అది కూసిన కారు కూతల్ని తలుచుకున్న కొద్దీ... “పాపం! అభిమన్యుడు అన్యాయంగా చనిపోయాడు పద్మవ్యూహంలోకి పోవడమేగాని,

బయటికి రావడం తెలియక పోయింది. అయినా, ఆ పాపిష్టి సైంధవుడు అడ్డుపడి ఉండకపోతే, కృష్ణ భగవానుడు మాయ మాటల్ని చెప్పి అర్జునుడిని... ఆరిదీని తస్సదియ్యా! ఏమి గురకరా ఇది?!

“ఎంత సుఖంగా లేకపోతే, ఇది ఇంత గురక పెడుతూ, వొళ్ళు మరిచి నిద్రపోతూంది! నేను ఆకలితో మాడుతున్న సంగతి దీనికి పడితేగా! ఇంతకూ, నేను ఇంటికి రాకముందే మెక్కి కూర్చున్నదేమో?"

ఇలా ఆలోచనలు పోయిన కొద్దీ సుబ్బారాయుడికి తల దిమ్మెత్తి పోయింది. మంచం మీద ఇటూ అటూ మసలుతున్నాడు ఎటు తిరిగినా పడక కుదరక, లేచి కూర్చుంటున్నాడు బాధగా ఉన్నట్టు వాళ్లు విరుచుకుంటున్నాడు. ఏమి తోచక మళ్ళా పడుకుంటూ ఉన్నాడు. ఎన్ని తిప్పలు పడినా కునుకు మాత్రం పట్టడం లేదు. ఈ స్థితిలో తొలకరి మెరుపులా అతడికి ఒక ఆలోచన తోచింది. నిస్సారమైన ఈ సంసారంలో ఉండి, పురాణాల మహిమను తెలుసుకోలేని ఈ భార్యతో లేనిపోని కష్టాలన్నీ అనుభవించడంకంటే భగవదన్వేషణం కోసం వెళ్ళిపోతేనో?

ఈ ఆలోచన తట్టగానే ఏదో దివ్య జ్యోతి దొరికినట్టూ, జీవిత పథం వెలుగైపోయినట్టూ, అతడికి తోచింది. కాని అంతలోనే మళ్ళీ అన్ని వైపుల నుంచీ కారు చీకట్లు కమ్ముకపోయాయి. గుండె బరువు తగ్గడమూ, తిరిగి అది రెట్టింపు బరువు ఎక్కడమూ అంతా ఒక్క క్షణంలో జరిగింది.

సంసార కూపంలో నుంచి బయట పడి, భగవదన్వేషణం కోసం వెళ్ళిపోవడం బాగానే ఉంటుంది గానీ, చదువు సంధ్యలు లేని తాను ఆ పరమేశ్వరుణ్ణి సాక్షాత్కరించుకోగలడా? దానికి ఎంతభక్తి, ఎంత జ్ఞానం, ఎంత మహత్తు కావాలి? అది తన శక్తికి మించినపని. కాని, తన కంటే కూడా మొద్దు కేవలం బందిపోటు దొంగ అయిన వాల్మీకి గొప్ప మహర్షి కాలేదూ? తాను రామాయణ, భాగవత, భారతాలను విన్నాడు. కొంత వరకు మంచి చెడ్డల్ని తెలుసుకున్నాడు. ఇక వాల్మీకి రామ' అనే మాటనైనా నోట బట్టడం చేత గాకపోయె. అలాంటి వాడే కేవలం మొండి పట్టుదలవల్లా చివరికి దివ్యి అయిపోగా లేనిది తాను మాత్రం ఆ కార్యాన్ని సాధించలేకపోతాడా? తనకు చదువు లేకపోవచ్చును. జ్ఞానం తక్కువ కావచ్చును. అయినప్పటికీ భక్తి ఉన్నది. దీక్ష ఉన్నది. గజేంద్రుడి మొరనే విన్న దయామయుడు తనను మాత్రం కరుణించక పోతాడా?

మొదటి సందేహం తీరిందో, లేదో, ఇంకొకటి కలిగింది. భార్య మీద అలిగి, తాను సంసార పరిత్యాగం చెయ్యాలని అనుకున్నాడు. ఇందుకు భగవంతుడికి కోపం వస్తుందేమో? ఔను, రావచ్చును కాని... కాని... ధ్రువుడు సవతి తల్లిమీద అలిగేకదా తపస్సుకు బయల్దేరి వెళ్ళింది? విశ్వామిత్రుడికి వసిష్ట మహర్షి మీద కోపం వల్లనే గదా బ్రహ్మర్షి కావాలనే పట్టుదల కలిగింది. అంచేత తన విషయంలో గూడా పెళ్ళాం మీద అలగడం పెద్ద అడ్డంకీ కాకూడదు.

అయినా, అలిగి లేచిపోవడంకంటే, ఇంటి దానితో చెప్పి, దాన్ని ఒప్పించి, వెళ్ళిపోతేనో? అమ్మ, బాబోయ్? దానికి చెప్పడమూ వొప్పించడమూ కూడానా! దూర్వాసుడి భార్య చండిక వంటి గయ్యాళిది. మాట జారడమే తడవు, - ఊరూ నాడూ ఏకం చెయ్యదూ? అంచేత చెప్పకుండా వెళ్ళిపోవడమే మంచిది.

అయితే మరి వెళ్ళిపోవడమెప్పుడు? ఎప్పుడో ఏమిటి? ఇప్పుడే - ఉన్న పాడు ఉన్నట్లుగా ప్రయాణం కట్టవలసిందే కాని, కూతురిని, అల్లుణ్ణి ఒక్కసారి చూచుకొని తరువాత బయలు దేరితేనో? క్రిందటిసారి అమ్మాయిగారి ఇంటికి వెళ్ళి రెండు పూటలుండి తిరిగి వస్తూ "అమ్మాయి వెళ్లోస్తాను" అనేసరికి "మంచిది నాన్నా" అంటూ కంటతడి బెట్టింది. దానిని చూస్తే తనకు గూడా కళ్లను గిర్రున నీళ్లు తిరిగాయి. మొగుడుతో లక్షణంగా కాపురం చేసుకుంటున్నది. రవంతైనా కష్టం యెరుగదు. ఐనా "వెళ్ళివస్తానమ్మా" అనే సరికి అంత విచారం వచ్చింది ఎందుకు? ఎందుకేమిటి? కన్న వారిని వదలి ఉండడమంటే కూతురుకు కష్టమనిపించదూ? తనకైనా అది ఒక్కతే బిడ్డ గనుక అల్లుడు వచ్చి తన ఇంట్లోనే కాపురం బెడితే బావుండును కాని, "అత్తవారి పంచకు చేరతానా"! అని అడిగి తెగ నీలుగు... అయ్యో? ఇదేమిటి ఆలోచనలన్నీ గూడా మళ్ళీ సంసారం వైపుకు పోతున్నాయి. కూతుర్ని తలచుకొన్నందుకే ఇంత బేలైపోయాడుగదా! ఇక దాన్ని చూచి వస్తే తపస్సుకు వెళ్ళడం నిర్వాకమైనట్టే!

దాని కాపురం అది హాయిగా చేసుకుంటున్నది. ఇప్పుడు కూతురు చింత తనకు దేనికి? తన దారిన తాను పోయి భగవంతుడిని ప్రత్యక్షం చేసుకోవాలి. తక్కిన తర్క వితర్కాలన్నీ అనవసరం.

ఇలా అనుకుంటూ సుబ్బారాయుడు మంచంమీద లేచి కూర్చున్నాడు. అంతలో తొలికోడి "కొక్కొరొకో?" అని కూసింది. ఆ కూత వినగానే 'లే! బయలుదేరు' అని శ్రీమన్నారాయుడే హెచ్చరించినట్టు తోచింది. అన్నట్టు దేవతలు అప్పుడప్పుడూ కోడిపుంజు అవతారం యెత్తడం ఉన్నది కూడాగా! గౌతముడు గంగా స్నానానికి త్వరగా లేచి వెళ్లడానికి దేవేంద్రుడు అర్ధరాత్రివేళ కోడై కుయ్యలేదూ? అలాగే ఇప్పుడు శ్రీ మహావిష్ణువు గూడా తన భక్తుణ్ణి హెచ్చరించడానికి కోడిపుంజైనాడేమో!

అంతకు ముందు ఏమైనా సంకోచం అంటూ ఉంటే, అది కాస్తా ఈ వూహతో మాయమైపోయింది. అంచేత సుబ్బారాయుడు మంచంమీద నుంచి లేచి నిలబడ్డాడు. ఇంతలో ఇంటిది ఖంగు ఖంగున దగ్గుతూ, ఒకవైపు నుంచి ఇంకోవైపున వొత్తిగిలింది. ఆమె కదలడం చూచి అతడు చప్పున మళ్ళీ మంచం మీద చతికిలబడ్డాడు. కొంపదీసి ఇప్పుడిది నిద్ర లేవదుగదా! అని భయం వేసింది. లేవగూడదు, లేవగూడదు అని ఒక వైపున అనిపిస్తూ ఉన్నా లేచి, 'అదేమిటి? అలా కూచున్నావు? నిద్రపోలేదా? పాపిష్టిదాన్ని! పస్తుంచాను!' అని అంటే ఎంచక్కగా ఉంటుంది అని ఇంకో వైపున పీకుతూ ఉంది.

రెండు, మూడు నిమిషాలు దేనికోసమో యెదురు చూచినట్లు చూచాడు. అంతలో రెండు పిల్లులు హఠాత్తుగా పోట్లాట సాగించినట్టు గురక ప్రారంభమైంది. దానితో సుబ్బారాయుడు కూలిపోయాడు.

ఆరి! దీని తస్సదియ్యా! మళ్ళీ గురక మొదలెట్టింది" అని తిట్టుకున్నాడు. ఎప్పుడూ ఇంత గురక పెడుతున్నదా? లేక ఇవ్వాళనేనా? అని అతడికి అనుమానం కలిగింది. ఇన్ని ఏళ్ళ నుంచి కలిసి కాపురం చేస్తున్నా పెళ్లాం ఇంతగా గురక పెడుతుందని అతడికి తెలియనే తెలియదు.

"ఈ బండ మొద్దుతో నాకెందుకు? నా దారి నేను చూచుకొంటాను" అని అతడు మళ్లి లేవబోయాడు. అప్పుడు ఇంకొక కొత్త సందేహం వచ్చింది. ఉత్తి చేతులతో వెళ్ళిపోవడమా? లేక మూడు నాలుగు వరహాల్ని వెంటతీసుకువెళ్ళడమా? పూర్వం తపస్సుకు వెళ్ళిన వాళ్ళు వెంట డబ్బు పట్టుకెళ్ళినట్లు, అయ్యవార్లంగారు ఎక్కడా

చెప్పలే. మరి తాను పట్టుకు వెళ్ళడం తగునా, తగదా? తపస్సు కోసం వెళ్లేవాడికి డబ్బుతో పనేముంటుంది... ఆ అన్నట్టు తపస్సుకైనా కొంత హంగామా కావాలి గదా? దండం కావాలి. కమండలం ఉండాలి, అక్షయపాత్ర కూడా అవసరం. మెడలో రుద్రాక్ష మాల ఒకటి కట్టుకోవాలి ఇక, జపమాల లేనిదే బండి సాగదు. ఇదిగాక, కాషాయ గుడ్డలు కూడా కావాలేమో ... కాషాయ గుడ్డలు బాబాజీలే కాని, మునీశ్వరులు వేసుకుంటారా ఏమో, తనకు తిన్నగా తెలియదు మామూలు పంచి కట్టుకోవడంకంటె గోచి పెట్టుకోవడం మంచిది కావచ్చు ... ఏమైనా ఈ హంగామా కోసం కొంత దగ్గర ఉంచుకోవడమే మంచిది. అమ్మాయి నోములకు అర నవర్సు కొందామని పదిహేను రూపాయలు కూడాబెట్టి ఉంచాడు. దాన్ని అడ్డం వేసుకోవచ్చు. అన్నట్టు తాను మాయమైపోయాక విచారంతో కుర్రది నోములు మానివేస్తుంది కాబోలు! “అమ్మా! ఇంటికి ఎప్పుడు వస్తావు అని మొన్న తానడిగితే “నోములు దగ్గరికి వస్తున్నాయి నాన్నా” అని యెంతో సంబరపడుతూ అంది ... అయ్యయో! ఇదేమిటి? మళ్లీ ఈ మమకారం “కొక్కొరోకో!”

అదిగో? మళ్ళీ శ్రీ మహావిష్ణువు హెచ్చరిస్తున్నాడు. ఇక ఆగడం తప్పు. ఇలా అనుకొని ... ...సుబ్బారాయుడు గబగబ లేచి, మొలత్రాడుకు వ్రేలాడుతున్న తాళపు చెవితీసి, సందువా పెట్టి తెరిచి, పదిరూపాయల కాగితం, ఐదురూపాయల కాగితం, బొడ్డున పెట్టుకొని, వెనక్కి తిరిగి చూస్తే ఎక్కడ తన మనస్సు తిరిగిపోతుందో అనే భయంకొద్దీ, చప్పున గడప దాటాడు.

గడప దాటి రెండడుగులు వేశాడో లేదో, పక్కనున్న చావడిలో నుంచి ఆవు “అంబా” అని అరచింది. దాన్ని వినగానే “నేను వెళ్ళిపోతున్నానని - పాపం - ఇది ఏడుస్తున్నది. దీనికున్నంత ప్రేమ చేసుకున్న పెళ్ళానికైనా లేకపోయిందే?" అని అనుకున్నాడు.

ఇంతలోనే “మర్చిపోయా! ఎగదన్ని గదా అని ఇవ్వాళ దీనికి ఇంటిది మేతైనా వెయ్యలేదు కాబోలు! కడుపు కాలి, ఎంత మాడుతున్నావో?” అని అతడికి అనిపించింది. ఇలా అనిపించడమే తడవు, చప్పున చావిడిలోకి వెళ్ళి వాటెడు మేత, రెండు జనప కట్టలు వేశాడు. ఆసామి రావడాన్ని చూచి ఆవు మెడ ఆడించింది. మేత వెయ్యగానే చప్పున లేచి నిలబడి, ఇంత జనపకట్టను కరిచి పట్టుకొని, దాన్ని ఇటూ అటూ కదుపుతూ నమలసాగింది. రెండు నిమిషాలపాటు ఆవు వంక రెప్ప వెయ్యకుండా చూచి తరువాత, కాసేపు దాని మెడ దువ్వి, ముఖాన్ని ముద్దు పెట్టుకొని, సుబ్బారాయుడు చావిడి బయటికి వచ్చాడు. వెళ్ళిపోతున్న యజమానివంక ఆవు తలెత్తి చూచింది. అప్పుడు దాని కళ్ళు ధగధగ మెరిశాయి. అవి తడి కట్టునట్లు కూడా ఉన్నాయి. దీన్ని చూచి, గుడ్లనీళ్ళు గుడ్లకుక్కుకుంటూ సుబ్బారాయుడు దారిని పడ్డాడు.

మూడు అంగలలో అతడు తమ వీధి చివరికి చేరుకున్నాడు, కాని వీధిమూల తిరిగబోయేసరికి అడుగు పడలేదు. అప్రయత్నంగా వెనక్కు తిరిగడమూ రెప్పవెయ్యకుండా తమ ఇంటివైపు చూడ్డమూ జరిగింది.

ఇంటి గోడలు ఇటుకవే. కాని జమ్ము కప్పు వెనకా, ముందూ వసారా. మధ్య ఒక పెద్ద చావడి, దక్షిణపు వైపుకు పడక గది. ముందు వసారలో ఉత్తరపు వైపున చిన్న వడ్లకొట్టు, మిగతా పెద్ద అరుగు వెనక వసార అంతా వంటకూ, భోజనాలకూ, ఆ రాతి గోడల్ని లేపే సరికే వంద రూపాయలు అప్పు అయింది. అంచేత పెంకుటి

కప్పువేసే ప్రయత్నం పెట్టుకోక, నాలుగైదు బళ్ల జమ్ము తెచ్చి సరిపెట్టాడు. చేసిన అప్పుతీరి, ఏ మూడు నాలుగు వందలో వెనకబడితే, అప్పుడు కప్పు కొరత గూడా తీర్చుదామని అనుకున్నాడు.

దక్షిణపు గది కిటికీలో నుంచి లోపలి దీపం బుడ్డి గుడ్డి వెలుతురు వీధిలోకి పడుతున్నది. దాన్ని చూస్తూ ఐదారు నిమిషాలపాటు సుబ్బారాయుడు వీధి మూలనే నిలబడిపోయాడు. అప్పుడు అతని మనస్సులో ఎన్నో ఊహలు రేగాయి. తన తాత ముత్తాతలు అందరూ ఈ గడ్డమీదనే పుట్టారు, దీని మీదనే కళ్లుమూశారు. ఒకరి జోలికి పోకుండా, "కృష్ణా రామా" అనుకుంటూ తమ బ్రతుకు వెళ్ళబుచ్చారు. ఇతర వ్యాసంగం ఏదీ లేకుండా నిరంతరం హరిభజన చేసే నారద మునీంద్రుడి కంటెగూడా! సంసార సాగరంలో పడి కొట్టుకుంటున్నప్పటికీ భగవంతుడి మాట మరిచిపోకుండా "శ్రీరామా" అని గాని, "శ్రీకృష్ణా" అనిగాని ఉదయాన్నే నిద్రలేస్తూ, రాత్రివేళ నిద్రపోబోతూ భగవస్మరణ చేసేవాడే గొప్ప భక్తుడని అయ్యవార్లంగారు చెప్పారు. తాను పరమ భాగవతోత్తముడనని నారదుడికి గర్వం బలిసినప్పుడు, శ్రీహరి అతడికి ఈ విషయాన్ని నిరూపించి, గర్వభంగం చేశాడటగూడా, అలాంటప్పుడు తాను లేనిపోని సాహసానికిపోయి, తపస్సును ప్రారంభించడం కంటె ఇంటిపట్టునే ఉండి, భగవంతుడి కృప సంపాయించకూడదా?

నిజమే! అలా చేస్తే బాగానే ఉంటుంది. ఇప్పుడే గనక ఇంటికి తిరిగి వెడితే, తాను అసలు తపస్సుకు బయల్దేరిన సంగతి గూడా ఎవ్వరికీ తెలియదు. ఏ రద్దీ లేకుండా మళ్ళీ తన బ్రతుకు తాను బ్రతక వచ్చును. యేకాదశి ఉపవాసం చేస్తూ, శనివారాలనాడు ఒంటిపూట చేస్తూ రోజు కాసేపు ఏ పురాణ కాలక్షేపమో చేస్తూ...

ఆ! ఎక్కడి మాటలివి? ఆ రాక్షసి తనను పుణ్య కథలను విననిస్తుందా? ఆ పరమాత్ముడి కృపను సంపాయించనిస్తుందా? ఇవ్వాళ అది పెట్టిన గుర్రు పెడుతూ, హాయిగా నిద్రపోతున్నది. చివరికి తాను ఇల్లు వదలి లేచి వచ్చిన సంగతికూడా కానకపోయె! దానికి తన సంగతి రవ్వంత కూడా పట్టకపోయినప్పుడు, దాని సంగతి తనకు మాత్రం దేనికి? ఇంతకూ మాయలో పడి భార్యా భర్త అని దేవుళ్ళాడ్డంగాని, ఎవరికర్మ వారు అనుభవించక తప్పుతుందా? భక్త రామదాసును బొందితో స్వర్గానికి తీసుకు వెళ్ళడానికి దేవవిమానం వస్తే, గుమ్మడికాయ కూరకోసం కక్కుర్తిపడి, అతని భార్య వెనక ఉండి పోయిందట. అంతటి భక్తి శిఖామణికే అలాంటి భార్య దాపురిస్తే, ఇక తన సంగతి చెప్పాలా? పూర్వ జన్మంలో ఎవరికి ఎవరు ఋణపడి ఉండబట్టి ఈ జన్మలో తాము భార్యా భర్తలైనారు. ఆ ఋణానుబంధం తీరింది, ఇక తన, దారిని తానుపోయి జన్మరాహిత్యాన్ని ప్రసాదించగల ముక్తిని సాధించాలి.

సుబ్బారాయుడు ఇలా అనుకుంటూ ఉండగానే, ఒక గాలితెర వచ్చింది. దానికి వాళ్ళ దక్షిణపు గదిలోని దీపపు బుడ్డి ఆరిపోయింది. తన యిల్లూ, తన వాకిలీ, తన సంసారం అనేవి తన నుంచి మరుగునపడి పోవడానికి శ్రీ మహావిష్ణువే వాయుదేవుణ్ణి పంపించి ఇలా చేయించాడని సుబ్బారాయుడికి తోచింది. ఇక, క్షణలేశమైనా ఆగకుండా అతడు వీధి మూల తిరిగి, చెరువుగట్టు ఎక్కాడు.

మొదటైతే సుబ్బారాయుడు గమనించలేదుగానీ, పది బారలు గట్టు వెంట నడిచేసరికి అవతల ఒడ్డున యేదో అలికిడి అవుతున్నట్టు తోచింది. కొంచెం నిదానించి చూడగా, దొంగతనంగా చేపలు పట్టుకొని, వలలతోను, బుంగలతోనూ ఐదారుగురు ఒడ్డుకు ఎక్కుతూ ఉండడం కనపడింది. ఏయేటి కాయేదు చెరువులో చేపల్ని పాట

పెట్టి ఏ పెత్తందారు పేరనో పాట కొట్టి వేయించడమూ, పాట మొత్తానికి సరిపడేలా గ్రామస్థులందరూ తలకొక రూపాయ, అర్థ, పావలా వాటాలు వేసుకొని చేపల్ని పంచుకోవడమూ మామూలు. ఈ ఏడు సుబ్బారాయుడు అర్థరూపాయి వాటా ఉన్నాడు. "అయ్యో ఈ దొంగ ముండావాళ్ళు చేపల్ని పట్టుకుపోతున్నారు. వెంటపడి వాళ్ళను పట్టుకోవలసిందే!" అని వాళ్ళను చూచి చూడ్డంతోటే అతడికి తోచింది. "ఎవరది? దొంగ..." అంటూ నాలుగడుగులు చకచకా వేశాడుగూడ! అంతటిలోకే తపస్సుకు పోతున్న నాకు ఈ చేపల గొడవ దేనికని అనిపించింది. వెంటనే వెనక్కు తగ్గాడు, ఇంతేకాదు. తన కేకకు యెవరైనా లేస్తారేమోనని, తన ప్రయాణానికి అడ్డు తగులుతుందేమోనని భయంవేసింది. అంచేత చప్పున చెరువుగట్టు దిగి, పక్కనే ఉన్న తుమ్మల దొడ్డిగుండాపోయి, జనరల్ రోడ్డుకువెళ్ళే డొంక చేరుకున్నాడు.

ఆ డొంక ఒక మాలపల్లి మధ్యగుండా పోతుంది. సుబ్బారాయుడు ఆ మాలపల్లిని దాటి వెడుతూ ఉండగా "బొయి" మంటూ నాలుగు వైపుల నుంచీ నాలుగు కుక్కలు అతడిమీద పడబోయినాయి. వాటిని అదిలించడానికి, చేతిలో కర్రలేదేమో? భయపడిపోయి అతడు కాలికొద్దీ పరుగెత్తాడు. కొంత దూరం తరిమి, కుక్కలు ఆగిపోయాయి. పైనపడి అవి యెక్కడ వీకుతాయో అని భయం పుట్టినప్పుడు, సుబ్బారాయుడు కాలికి బుద్ధి చెప్పాడు కాని, తర్వాత అతడికి ఒక ధర్మ సందేహం తోచింది. తాను బయల్దేరింది తపస్సు కోసం. ఏ కీకారణ్యంలోకో వెళ్ళి తపస్సు చెయ్యాలి. అక్కడ పులులు సింహాలు మొదలైన క్రూర మృగాలు అనేకం ఉంటాయి. వాటికి కూడా భయపడకుండా, తను తపోదీక్షను సాగించాలి. అలాంటప్పుడు ఊర కుక్కల్ని చూచే, తాను బెదరడం తప్పుకాదా? ఆ పసికాయ, ధ్రువుడు తపస్సుకు బయల్దేరి వెడుతూ ఉంటే సింహాలు, శార్దూలాలు, విషసర్పాలు కరవవచ్చాయట, కాని అతడు బెదరనేలేదట. అతడి మహత్తును గ్రహించి, అవి సాధువులైపోయినవట. ఇక తానో? పాడు ఊరకుక్కలు పైబడినంత మాత్రాన పరుగు తీశాడు. ఛీ! యెంత సిగ్గుచేటుపని! తిరిగి వెనక్కు వెళ్ళవలసిందే! తాను తపస్సుకు వెళుతున్న సంగతి తన మహత్తు వాటికి తెలియజెయ్యవలసిందే!

ఇలా అనుకుని సుబ్బారాయుడు మళ్ళీ వెనక్కు నడిచాడు. వంద గజాల వెనక్కు వచ్చాడో లేదో తిరిగి కుక్కలు రయ్యిమంటూ పైకి వచ్చాయి. ఒక్క క్షణం ధైర్యంగా నిలబడి, అంతలో గుండె చెదరి, అతడు వచ్చిన దారినే మళ్ళీ పరుగెత్తాడు.

కుక్కలు ఆగిపోవడాన్ని చూచి, సుబ్బారాయుడు కూడా పరుగు తగ్గించాడు. తన పిరికితనానికి అతడికప్పుడు చాలా సిగ్గు వేసింది. అయితే, మనస్సులో కొంత తర్క వితర్కం చేసుకొన్న మీదట, తాను చేసిన పనిలో తప్పేమీ లేదని తోచింది. ధ్రువుడు సింహాలు, శార్దూలాలు, విషసర్పాలు మొదలైన వాటిని లక్ష్యపెట్టలేదని అయ్యవార్లంగారు చెప్పారుగాని, ఊర కుక్కలకు సాపత్యమా? ధ్రువుడు తపస్సుకు వెడుతున్న సంగతిని అవి గనకనే తెలుసుకున్నాయి. ఈ పాడు ఊరకుక్కలకు మంచీ చెడ్డా తెలియదు. ఇవి ధ్రువుడే కాదు, ఆ శ్రీ మహావిష్ణువే చీకటిలో కనబడినా వెంటపడి తరుముతాయి. అంచేత, వాటికి తన మహత్తును తెలపటానికి ప్రయత్నించడం వృధా. ఇక తనకు పులులు, సింహాలూ, ఇలాంటి ఇతర క్రూర జంతువులు అడ్డు తగిలితే తానుమాత్రం బెదురుతాడా? అది ఎన్నటికీ జరగదు.

జనరల్ రోడ్డు ఎక్కిన తర్వాతగాని, ఎక్కడికి వెళ్ళి తపస్సు చెయ్యడమనే ప్రశ్న సుబ్బారాయుడికి తట్టలేదు. తమ వూరు నుంచి భద్రాచలం అడవి మాట విన్నాడు. అది చాలా పెద్ద అడివట. కాకి దూరడానికైనా ఒక్కొక్కచోట

సందు వుండదట. సింహాలు, పెద్ద పులులు విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటాయట. ఇక పాములకు లెక్కలేదట. అంచేత తపస్సు చేయటానికి అది దివ్యమైన ప్రదేశం. పైగా, సీతారాములు అక్కడ అరణ్యవాసం చేశారు కూడా. ఆ పురాణదంపతులు పర్ణశాల కట్టుకున్న స్థలం ఇప్పటికీ కనబడుతుందట. సీతమ్మ వారు జలకాలాడిన ఉష్ణ గుండాలు ఇప్పటికీ ఉన్నాయట. శ్రీమహావిష్ణువు శ్రీమహాలక్ష్మి పాదస్పర్శ చేత పవిత్రమైన, క్షేత్రం అది. తపస్సుకు ఇంతకంటె తగిన స్థలం మరి ఉండదు. అంచేత ఎక్కడికి వెళ్ళాలి అనే విషయాన్ని నిర్ణయించుకోవడం సుబ్బారాయుడికి కష్టం అనిపించలేదు. పోతే, ఎలా వెళ్ళాలి అనేదే పెద్ద సమస్య అయింది.

భద్రాచలం ఎటువెళ్ళాలన్నా దారిలో ముందు బెజవాడ తగులుతుంది. తమ వూరికి బెజవాడకూ మధ్య దారిలో కూతురుగారి గ్రామం ఉన్నది. ఆ గ్రామంగుండా, వెడుతూ ఉంటే, అల్లుడు తగులుతాడేమో? కనబడగానే, "ఇదేనా రావడం? ఇంటిదగ్గర అందరూ క్షేమమా?" అని మర్యాద చేసి, ఇంటికి వెంటబెట్టుకు వెడుతాడు, వెళ్ళి "ఏమే! ఇదుగో! కాళ్లకు నీళ్ళివ్వు! మీ నాన్న వచ్చాడు." అని కేకవేస్తాడు. ఇంట్లో పనిచేసుకుంటున్న తన కూతురు ఈ మాట వినగానే, ఇంతమొహం చేసుకొని, ముసిముసినవ్వు నవ్వుకుంటూ చెంబుతో నీళ్లు తెచ్చి, "అమ్మ బాగుందా" అని అడుగుతుంది. అప్పుడిక తాను అక్కడ కనీసం రెండు మూడు పూటలైనా ఉండక తప్పదు.

ఆ తర్వాత కన్న కూతుర్ని వదలిపెట్టి తపస్సుకు వెళ్ళడం, తనకు సాధ్యమా? ఈ లోగ తాను కూతురుగారి ఇంట్లో ఉన్న సంగతి స్వగ్రామంలో తెలిస్తే "అలిగి అల్లుడు ఇంటికి చేరాడు" అని చెప్పుకుంటారు. ఇది సిగ్గుచేటుపని. లోకులు కాకులు వాళ్లమాటకేమిగాని, ఒకసారి తాను కూతుర్ని చూచిన తర్వాత కాలు కదిపి కీకారణ్యాలకు వెళ్ళగలడా? అప్పుడు తిరిగి సంసారం అనే మాయలో పడిపోక తప్పదు. అంచేత కూతురుగారి ఊరిమీదగా వెళ్ళగూడదు. కాని, అల్లుడు తప్పక తగులుతాడనే మాటేమిటి? నిజమే? అయితే, ఆ వూళ్లో తనను ఎరగని వాళ్ళెవరు? అంతా బీరకాయ పీచే! లాభంలేదు ఆ వూరి చాయలకైనా పోరాదు.

మరి మార్గమేమిటి? అన్నట్లు పామర్రు నుంచి గుడివాడ వెళ్ళి, అక్కడి నుంచి బెజవాడ రోడ్డు పుచ్చుకుంటే సరి. బాగానే ఉంది. కాని, నడచి వెడితే ఎప్పటికి తెములుతుంది. ప్రయాణం? పైగా ఏడెనిమిది ఆమళ్ళదూరం నడచివెళ్లడం మాటలా? ఒకటి, రెండు మజిలీలు చేస్తే, ఇదంత కష్టమైన పని కాదు. కాని, ఒకసారి తపస్సుకు బయల్దేరిన తర్వాత, ఒక్క బిగిని వెళ్ళి పోవాలిగాని, దారిలో మకాములు చేయడం కూడదు. అలా చేస్తే భగవంతుని సాక్షాత్కరించుకోవడాన్ని గురించి తగినంత దీక్ష లేదన్నమాట! ఈ స్థితిలో పామర్రు నుంచి గుడివాడకు బస్సులో వెళ్ళి, అక్కడ నుంచి బెజవాడకు రైలెక్కి వెడితేనేమి? ఒక విధంగా ఇది బాగానే ఉంది. అయితే, పూర్వం తపస్సుకు వెళ్లినవారెవ్వరూ బస్సులోనూ, రైలులోనూ వెళ్లలేదు. అన్నట్టు ఆ కాలంలో ఈ బస్సులూ, రైళ్లూ లేవుగా? శ్రీరామచంద్రుడు అరణ్యవాసానికి వెడుతూ సరయూ నదీతీరం వరకూ రథం మీదనే వెళ్ళాడట. రథం వాహనాలే! అంచేత వీటిమీద తపస్సుకు వెళ్లడంలో దోషం కనబడదు.

ఇలా తర్కాలు చేసుకొని, సుబ్బారాయుడు పామర్రులో బస్సు అందుకొని, బెజవాడ చేరాడు. బెజవాడలో దిగి, కృష్ణా స్నానంచేసి, ఒక్కమాటు శ్రీ కనకదుర్గ దర్శనం చేసుకొని, ఆ తర్వాత నైజాం బండిలో భద్రాచలం చేరుకోవాలని అతడు అనుకొన్నాడు.

బస్సులో కూర్చున్న తర్వాత సుబ్బారాయుడికి ఒక పెద్ద బెంగ పట్టుకుంది. సాహసం చేసి తాను తపస్సు కోసం బయల్దేరాడు. తపస్సు యెలా ప్రారంభించాలో, ఎలా సాగించాలో తనకు తెలియదు.... "అలవాటులేని ఔపోసనం పడితే మూతి మీసాలు కాలినవని అయ్యంవారుంగారు చెప్పారు. అలాగే మంచి చెడ్డల్ని తెలుసుకోకుండా తపస్సు ప్రారంభిస్తే, ఏమి కీడు మూడుతుందో? ధ్రువుడు తపస్సు కోసం వెడుతూ ఉంటే నారద మునీంద్రుడు దారిలో ఎదురుపడి తారక మంత్రాన్ని ఉపదేశించాడు. ప్రహ్లాదుడు ఇంత కంటే కూడ అదృష్టవంతుడు. అతడు ఇంకా తల్లి కడుపులో ఉండగానే నారద మునీంద్రుడు భక్తి మార్గాన్ని చూపించాడు. చివరికి కిరాతకుడైన వాల్మీకికి కూడా ఎవరో మునీశ్వరులు హితోపదేశాన్ని చేశారు. కాని, తనకు కాస్త సలహా చెప్పే వారెవ్వరూ కనబడరు. అయ్యవార్లంగారిని విచారిస్తే, బాగా ఉండేది. అన్ని పురాణాల్ని క్షుణ్ణంగా చదువుకున్నవాడు, మహా పండితుడు ఆయనకు తెలియని విషయమే లేదు. హఠాత్తుగా బయల్దేరి రావడంలో ఆయన్ని కలుసుకోడానికి వీలులేకపోయింది. ఇప్పుడు మరి దిక్కేమిటి? అని! అంతా లేనిపోని భయంకాని భారమంతా ఆ పరమాత్ముడి మీద వేసిన తర్వాత సర్వం వాడే చూచుకుంటాడు. పైగా దివ్యదృష్టి ఉన్న ఆ నారద మునీంద్రుడు "పాపం! సుబ్బారాయుడు తపస్సు చేయవలసిన విధానం తెలియక బాధపడుతున్నాడు." అనే విషయాన్ని ఇట్టే చూచి తంబుర భుజాన వేసుకొని పరుగెత్తుకు రాడూ? భద్రాచలం అడవుల్ని చేరే ఈ లోపల మహానుభావుడు తప్పక కనబడుతాడు. అసలు తగిలితే బెజవాడలోనే తగలవచ్చు కూడా?

సుబ్బారాయుడు ఇలా అనుకుంటూ ఉండగానే బెజవాడ వచ్చింది. బస్సుదిగి, కృష్ణానది వైపుకు నాలుగు అడుగులు వేశాడో లేదో, రోడ్డు ప్రక్కనే ఉన్న ఒక చిన్న రావిచెట్టు క్రింద తంబుర మీటుతూ హరినామ సంకీర్తనం చేస్తున్న ఒక కాషాయాంబరధారి కనబడ్డాడు. అతడి వయస్సు నలభై అయిదు ప్రాంతాల ఉంటుంది. సన్నగా బారుగా ఉన్నాడు. కాయలాంటి శరీరం. చామనచాయ. నోరు బాగా వెడల్పుగా ఉంది. పెద్దకళ్ళు. ఆ కళ్ళలో ఏదో కొంత ఆకర్షణ ఉంది. బుర్ర నున్నగా చెక్కించాడు. మీసాలు, గడ్డాలు లేవు. మెడనిండా రుద్రాక్ష మాలలు ఉన్నాయి. పక్కను చిన్నసంచీ, తెల్లగా తోమి ఉన్న ఇత్తడి కమండలం ఉన్నాయి. అర్ధనిమీలిత నేత్రాలతో

రఘుపతి రాఘవ రాజారాం
పతిత పావన సీతారాం
అని కొంత సేపూ. ..
హరే కృష్ణ హరే కృష్ణ
కృష్ణ కృష్ణ హరే హరే

అని కొంత సేపూ పాడుతున్నాడు

అతడిని చూడగానే "ఇదుగో! నారద మునీంద్రుడు" అని సుబ్బారాయుడు అనుకున్నాడు. కాని, నారద మునీంద్రుడు నెరిసిన గడ్డాలతోనూ, మీసాలతోనూ ఉంటాడని తాను ఇదివరకు అనుకుంటున్నాడు. ఇతడికి అవి లేవు. ఇదిగాక ఇతడికి దారిని పోయేవారు ధర్మంచేసి వెడుతున్నట్టున్నారు. నారద మునీంద్రుడు ఇలా ధర్మం అడుగుతాడా? ఈ సందేహాలలో పడి, ఎటూ తేల్చుకోలేక, సుబ్బారాయుడు ఆ కాషాయాంబరధారి దగ్గరకు వెళ్ళి "అయ్యా! తాము నారద మునీంద్రులవారా?" అని అడిగాడు.

ఈ ప్రశ్న విననట్లే అతడు "హరేకృష్ణ! హరే కృష్ణ" అని పాట సాగించాడు. అంతట భయపడుతూ, భయపడుతూ, "అయ్యా! దాసుణ్ణి! తాము నారద మునీంద్రుల వారా?" అని సుబ్బారాయుడు మళ్ళీ అడిగాడు. అప్పటికి అతడు కళ్ళు తెఱచి, సుబ్బారాయుడు వంక ఎగాదిగ చూచి

అవును వత్సా అన్నారు.

“ఎక్కడికి వస్తారు స్వామీ!” అని సుబ్బారాయుడు ఎక్కడలేని సంతోషంతో తడబడుతూ తూలాడు. ఇందుకు కాషాయాంబరధారి లోలోపల నవ్వుకుంటూ -

"నే నన్నది వస్తానని కాదు. “వత్సా” అంటే 'నాయనా' అని అర్థం! పిచ్చివాడవు! అంతమాత్రం తెలుసుకోలేక పోయావు” అన్నాడు.

“చదువుకున్న వాడిని కాను. దాసుడి తప్పు కాయండి” అని సుబ్బారాయుడు దీనంగా వేడుకొన్నాడు.
“దీనిలో తప్పేమున్నది? సరేగాని, నీకేమి కావాలి” అని అతడడిగాడు.

సాక్షాత్తు నారద మునీంద్రుడు కనబడినందుకు సుబ్బారాయుడు పొంగిపోయాడు. మీసాలు గడ్డాలు లేకపోవడం వింతగా కనబడింది. అంచేత తనను వేసిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా - "స్వామీ! దాసుడి తప్పుకాయాలి. కాని, ఒక్క సందేహం కలుగుతున్నది. తమకు మీసాలు - గడ్డాలు లేవెందువల్ల?" అని సుబ్బారాయుడు అడిగాడు.

“ఎండలకు చికాకుగా ఉంటే, తీసివేయించాను” అని అతడు జవాబు చెప్పాడు. ఇంత వరకూ సుబ్బారాయుడు నిలబడే ఉన్నాడు. “నిలబడ్డావు దేనికి? ఇటురా! ఇక్కడ కూర్చో!” అని ఆ కాషాయాంబరధారి అన్నాడు.
“వద్దు స్వామీ! దాసుణ్ణి” అని ముందు అని, కాదంటే మునీంద్రుడికి కోపం వస్తుందేమో అని అంతలోనే బెదిరి సుబ్బారాయుడు భక్తి పూర్వకంగా వంగి వెళ్ళి అతడి పాదాల సమీపంలో కూచున్నాడు. కూర్చుని –

“స్వామీ! తాము వయస్సుకు చాలా పెద్దవారని -”

“అదేనా నీ సందేహం? ఈ మధ్యనే కాయకల్ప చికిత్స చేయించుకున్నాను."

“ఇంకొక్క మాట అడుగుతాను. స్వాములవారు కోపం చెయ్యకపోతే! తమరు పట్టుబట్టల్ని కట్టుకుంటారని మా అయ్యవార్లంగారు చెప్పారు. కాని, చిరిగిన నూలు గుడ్డల్ని కట్టుకున్నారేమి?"

“పట్టుగుడ్డల్ని కట్టుకుంటే రైళ్ళలో టిక్కెట్టు లేకుండా ప్రయాణం చెయ్యనివ్వరు” అని అనివేసి, అంతలోనే అతడు నాలుక కరచుకొన్నాడు.
“స్వామీ! తలచుకున్నంత మాత్రాన ఆకాశమార్గాన ప్రయాణం చెయ్యగల తమరికి రైళ్ళ ప్రయాణం దేనికి?” అని సుబ్బారాయుడు అడిగాడు.

“గగన మార్గాన సంచరించాలంటే మా మహత్తర తపోశక్తిని ఖర్చు పెట్టవలసి వస్తుంది. ఈ కాలంలో రైళ్ళ సౌకర్యం చవగ్గా ఉండగా, మా తపోశక్తిని వృధాపరచడం దేనికని మేమిప్పుడు రైళ్ళ మీదనే ప్రయాణం చేస్తూ ఉన్నాము” అని ఆ కపట వేషధారి చప్పున సర్దుకున్నాడు.

ఇంత వరకూ సందేహాలు పడినందుకే ఎంతో భయపడిపోతున్న సుబ్బారాయుడు ఒక్కసారిగా లేచి "దాసుణ్ణి కటాక్షించాలి" అని సాష్టాంగ దండ ప్రణామం చేశాడు.

"అభీష్ట సిద్ధిరస్తు" అంటూ ఆ కాషాయంబరధారి సుబ్బారాయుడిని ఆశీర్వదించాడు. పూర్వాశ్రమంలో ఆ కాషాయాంబరధారి పేరు, - రామయ్య. చదువుకోసం అంటూ తల్లి దండ్రులు బస్తీకి పంపిస్తే చదువు అబ్బకపోగా, చిన్నతనంలోనే ఓట్లాట, తాగుడు అలవాటైనై.

ఫిఫ్త్ ఫారం మూడుసార్లు తప్పి ఆ తర్వాత అతడు చల్లగా ఇల్లు చేరుకున్నాడు. తండ్రి భయంకొద్దీ నాలుగైదేళ్ళు అణగిమణిగి ఉన్నాడు గాని, ఆయన ఘటం చాలించగానే అన్నదమ్ములలో నుంచి పంచుకొని మరీ హద్దు మీరిపోయాడు. ఒక సంవత్సరమైనా తిరగకముందే తన వాటా ఆస్తినంతటినీ తగలవేసి, ఎర్రటి ఏగానియైనా చేతిలో ఆడని స్థితికి వచ్చేసరికి, హఠాత్తుగా భక్తుడై పోయాడు. అయితే, తన పుట్టు పూర్వోత్తరాలు పూర్తిగా యెరిగిన స్వగ్రామస్థుల మధ్య ఈ కపట భక్తినాటకం రక్తికట్టలేదు. అంచేత పెళ్ళాన్ని, ముగ్గురు బిడ్డల్ని, వదలి పెట్టి పరారీ అయ్యాడు. దానితో పూర్వాశ్రమపు రామయ్య మాయమైపోయి ప్రస్తుతాశ్రమపు "రామయోగి" తయారయ్యాడు.

"లెమ్ము! వత్సా లెమ్ము!" అని రామయోగి సుబ్బారాయుడి తల నిమిరాడు.
"నన్ను రక్షిస్తానని అంటేగాని తమ పాదాల్ని వదిలిపెట్టను. స్వామి" అని సుబ్బారాయుడు ప్రార్థనా పూర్వకంగా అన్నాడు.

"అటులనే! లెమ్ము, వత్సా" అని రామయోగి అభయమిచ్చాడు. దీనితో సుబ్బారాయుడికి మేరువు పర్వతం దొరికినంతటి సంతోషం కలిగింది. సాగిలబడి ఉన్నవాడు లేచి, భక్తిపూర్వకంగా చేతులు కట్టుకొని తిరిగి రామయోగి పాదాల దగ్గిర కూచున్నాడు.

"నీకేమి సంకటం సంభవించింది, వత్సా?" అని రామయోగి అడిగాడు.
"సంకటమేమిటి స్వామీ? జొన్న సంకటా...?"
"ఎంత అమాయకుడవోయి! నీకేమి కష్టం కలిగిందని నేను అడిగాను."
"తమకు సర్వం తెలుసు. నన్ను అడగటం దేనికి స్వామీ?"

"దివ్య దృష్టి వల్ల సర్వం నేను ఇంతకు ముందే గ్రహించాను. కాని, భక్తుని నోట వినవలెనని కుతూహల పడుచున్నాను." అని రామయోగి విద్యార్థిని పరీక్షచేస్తున్న ఉపాధ్యాయునిలా ముఖం పెట్టి చిరునవ్వు నవ్వాడు.
"సంసారం అంటే విరక్తి పుట్టింది. శ్రీమన్నారాయణమూర్తి దర్శనం చేసుకోవాలి. జన్మ తరింపజేసు కోవాలి. తపస్సు యెలాచెయ్యాలో చెప్పి, నన్ను కటాక్షించాలి స్వామీ.

"నీ కోర్కెను ఎప్పుడో గ్రహించాను. కాని "
"ధ్రువుడికి దారి చూపించిన నారద మునీంద్రులవారు నాకు మాత్రం సాయపడక పోతారా? అని నేను మొదటినుంచీ అనుకుంటూనే ఉన్నాను. స్వామీ! తమరు "

"సరిగానీ, తపస్సు చెయ్యడమంటే మాటలుగాదు, దీనికి ఎంతో దీక్ష, ఎంతో శక్తి కావాలి. దీన్ని యోచించితివా?"
"నేను దేన్నీ యోచించలేదు స్వామీ!" అని సుబ్బారాయుడు కొంచెం తెల్లబోయాడు.

పొంగి పొర్లి రాబోయిన నవ్వును ఆపుకొని "అది కాదోయి పిచ్చివాడా! తపస్సు చెయ్యడంలో గల కష్టాల్ని పారజూచుకొన్నావా?" అని రామయోగి అడిగాడు.

"తమ దయ ఉండాలిగాని, కష్టాలు ఒక లెఖ్ఖా?"
"నీ ధైర్యానికి సంతోషిస్తున్నాను వత్సా!" అని ఏదో దీర్ఘాలోచనలో పడిపోయినట్టు రామయోగి కొన్ని క్షణాలపాటు ప్రశాంతంగా ఉండి, తర్వాత అర్ధ నిమీలిత నేత్రుడై గంభీరంగా" హరేరామా! హరేకృష్ణ! హరిఓం!" అని ఉచ్చైస్వరంతో అన్నారు.

ఈ కిటుకు సుబ్బారాయుడి మీద బాగా పనిచేసింది. నారద మునీంద్రుడు ఈ లోకాన్నే మరిచిపోయి, తిరిగి శ్రీహరి భజనలో నిమగ్నుడైపోయాడని అనుకున్నారు. హస్తాల్ని ముకుళించి ముమ్మారు నమస్కరించారు. తర్వాత ఐదారు నిమిషాల పాటు నారదమునీంద్రుని ధ్యాన భంగాన్ని చెయ్యడానికి సాహసించలేక నిశ్శబ్దంగా కూర్చున్నాడు. ఆ పైన రామయోగి కళ్ళు తిప్పుతున్నట్టు కనబడేసరికి, “స్వామీ ఎక్కడికి వెళ్ళి తపస్సు చెయ్యమని ఉత్తరువు! నేనైతే భద్రాచలం అడవులకు వెడదామని అనుకున్నాను” అని అన్నాడు.

రామయోగి తల పంకించాడు. దీన్ని చూచి, “సరే అక్కడికే వెళ్ళు!" అని అంటున్నాడనుకొని "రైలులో వెళ్ళవచ్చునా స్వామీ?” అంటూ సుబ్బారాయుడు ప్రశ్నించాడు.

ఇంతవరకూ “వీడెవడో పిచ్చి పుల్లాయి! వీడిని కాసేపు ఆడించుదాము” అని తప్పితే రామయోగికి మరో ఉద్దేశం లేదు. కాని, భద్రాచలానికి రైలు మీద ప్రయాణం అని సుబ్బారాయుడు అనేసరికి “వీడివద్ద డబ్బున్నట్టున్నది దీన్ని కాజెయ్యాలి” అని దుర్బుద్ధి పుట్టింది.

“ఇది కలికాలం. ఈ కాలంలో తపస్సుకు వెళ్ళే వాళ్ళు రైలుమీద వెళ్ళడంలో దోషం లేదు. కాని, అంతదూరం వెళ్ళ వలసిన పనిలేదు” అని రామయోగి దీర్ఘ సమాధిలో ఉన్నవాడు మాట్లాడుతూ ఉన్నట్లుగా గంభీరంగా అన్నాడు.”
“అయితే మరి ఎక్కడికి వెళ్ళమని సెలవు?”

“ఎక్కడికి వెళ్ళనక్కరలేదు. ఇక్కడనే ఈ విజయవాడ క్షేత్రంలో కృష్ణానదీ పుణ్య తీరాన తపస్సు ప్రారంభించు. అర్జునుడు ఇక్కడనే గద ఈ కనకదుర్గ కొండమీద తపస్సు చేశాడు.

“ఔనట. స్వామీ! మా అయ్యవార్లంగారు కూడా అలాగే చెప్పారు. అక్కడ అర్జునుడు చేసిన తపస్సుకు మెచ్చి, శివుడు పాచుపదాస్త్రం ఇచ్చాడట."

“పాచు పదాస్త్రం కాదు. పాశుపతాస్త్రం” అని చిరునవ్వుతో రామయోగి తప్పు దిద్దాడు. “నీవు కూడా ఈ కొండమీదనే కూర్చుని శివుణ్ణి గురించే తపస్సు చెయ్యి శ్రీహరిని మెప్పించడం కష్టం. శివుడు అల్ప సంతోషి భక్తులకు సులభంగా సాక్షాత్కరిస్తాడు”.

“తమరు ఎలా సెలవిస్తే అలాగే, స్వామీ! మరి తపస్సు చెయ్యవలసిన పద్ధతి కూడా దయచేసి చెప్పరా?”

“రోజుకు మూడుసార్లు కృష్ణానదిలో స్నానం చెయ్యాలి. ఒక్క అయిదు ఇళ్ళ దగ్గర మాత్రం భిక్ష అడిగి, అక్కడ లభించే దాన్ని భుజిస్తూ ఉండాలి. క్రమంగా జలభక్షణలోకి దిగాలి. తర్వాత కేవలం వాయుభక్షణతో తపస్సు సాగించాలి. ఎండ వానలకు, ఉష్ణ శీతలాలకు భయపడరాదు. ఒంటి కాలి మీద నిలబడి తపస్సుచేస్తే, మరింత మంచిది. ఇన్ని కష్టాల్ని నీవు పడగలవా?”

“తమ దయవుంటే ఇవి ఒక లెక్కా? కాని, స్వామి నాకు మంత్రోపదేశాన్ని చేశారుకాదు”

“దీక్షను ఇవ్వడానికి ముందు, భక్తుని శక్తిని పరీక్షించాలి. నీవు తపస్సును సాగించగలవనీ, భగవత్సాక్షాత్కారాన్ని పొందగలవనీ నాకు నమ్మకం కుదిరింది. నీకు తప్పక తారక మంత్రోపదేశమును చేస్తాను. ఇటు రమ్ము వత్సా.”

సుబ్బారాయుడు దగ్గరికి జరిగాడు. అతడి చెవిలో రామయోగి "శంభో శంకర మహదేవా!” అని చెప్పి “ఈ మహా మంత్రమును జపించాలి. వత్సా!” అని బిగ్గరగా అన్నాడు. “నీవు కృతార్ధుడవు కాగలవు” అంటూ వీపు తట్టాడు కూడా!

"మీ ఋణాన్ని తీర్చుకోలేను. స్వామీ" అని తడిగట్టిన కళ్ళతో సుబ్బారాయుడు నమస్కరించాడు. "నీకు చేసిన దేమియులేదు వత్సా? అంతయు శ్రీహరి కార్యం! పొమ్ము! ఆ పరాత్పరుని కనుగొమ్ము" అని హెచ్చరించి, రామయోగి “రామ హరే! కృష్ణహరే” అని తిరిగి హరినామ సంకీర్తన ప్రారంభించాడు.

నారద మునీంద్రుల వారి ఆజ్ఞ అయింది. సుబ్బారాయుడు పునః సాష్టాంగ దండ ప్రమాణం చేసి, కృష్ణానది వైపుకు బయల్దేరాడు. అతడు పదిబారలు వెళ్ళాడో లేదో, “వత్సా! అని రామయోగి కేక వినపడింది. చప్పున వెనక్కు తిరిగివచ్చి "ఏమి స్వామీ! ఏమి సెలవు?” అని సుబ్బారాయుడు అడిగాడు.

“నీ దగ్గర ధనమున్నది గదా?”
దొంగతనం చేస్తూ ఉండగా పట్టుబడినవాడిలా బెదురుతూ “ఔను స్వామీ” అని సుబ్బారాయుడు గజగజలాడాడు. "సాక్షాత్తు ఆ బ్రహ్మదేవుడి కొడుకు కాబట్టే, నా దగ్గర డబ్బు ఉన్న సంగతి కనిపెట్ట గలిగాడు. వారికి తెలియనిది ఏముంటుంది? అని లోలోపల అనుకున్నాడు కూడా... “కమండలం రుద్రాక్షమాలలు వగైరా కొనుక్కోడానికి పదమూడు రూపాయలు చిల్లర దగ్గర ఉంచుకొన్నాను” అని తడబడుతూ అన్నాడు.

ఇంతవరకూ కొంచెం తీక్షణంగా చూస్తున్న రామయోగి చూపుల తీవ్రత తగ్గించి, “తెలియక తప్పు చేసితివి, దానికేమి? సరే! ఆ పైకమును నాకిమ్ము! పేద సాదకు దానముచేసి వైచెదను” అని అన్నాడు. మారు

మాట్లాడకుండా సుబ్బారాయుడా బొడ్డున ఉన్న పైకాన్ని తీసి, రామయోగి ముష్టి వేయించుకోటానికి ఎదుట పెట్టుకొన్న ఇత్తడి పళ్లెంలో పడవేశాడు. సమయంలో తన పళ్లెమూ, దానిలో ఉన్న డబ్బులూ, వీటి సంగతి గుర్తుకువచ్చి "నా నిజ స్వరూపమును గుర్తించలేని భక్తులు నేను మామూలు బైరాగి ననుకొని ధర్మం వేసి వెడుతూ ఉంటారు. వాటిని నేను పేదవారికి పంచిపెడుతూ ఉంటాను" అని రామయోగి చిరునవ్వుతో అన్నాడు.

"చిత్తం స్వామీ" అని సుబ్బారాయుడు అర్థం లేకుండా అని, అర్థం లేకుండానే ఇంకొకసారి నమస్కరించాడు. "మంచిది ఇక నీవు తపస్సుకు పొమ్ము! నీకు కమండలము కావలెను గదా? దీనిని తీసుకొనుము ఇదుగో రుద్రాక్షమాల" అంటూ చొట్టలు పోయిన ఒక రేకు చెంబూ, ఒక రుద్రాక్షమాల ఇచ్చాడు. "మహా ప్రసాదం" అని భక్తితో అంటూ వాటిని తీసుకొని, కళ్ళకు అద్దుకొని సుబ్బారాయుడు పోతూ రెండు మూడుసార్లు వెనక్కు తిరిగి చూచి, ఎంతో భక్తితో రామయోగికి నమస్కరించాడు. ఇంతకు పూర్వం రెండు మూడుసార్లు బెజవాడ చూచినవాడే సుబ్బారాయుడు. "మా అబ్బాయి పెళ్ళికి పసుపు గుడ్డలతో వచ్చి కాన్కవేస్తాము. దుర్గమ్మ తల్లి!" అని వాళ్ళమ్మ ఎప్పుడో మొక్కుకుంది. ఆ బస్తీని చూడ్డం గూడా. - ఆ మొక్కు చెల్లించడానికి పెళ్ళి అయిన వెంటనే సుబ్బారాయుడు పెళ్ళాన్ని వెంటబెట్టుకొని బెజవాడ వెళ్ళాడు. అదే మొదటిసారి బెజవాడ ప్రయాణం. అదే మొదటిసారి అవి బందరు - బెజవాడ రైలుపడ్డ కొత్త రోజులు. ఇప్పుడంటే పాతబడిపోయింది గానీ అప్పుడు రైలు చూడ్డమన్నా, రైలు ఎక్కడమన్నా, వింతగా ఉండేది. రైలుని చూడ్డానికి ఆ రోజులలో జనం పట్టాల పక్కన గుంపులు గుంపులుగా చేరేవారు, జనాన్ని చూచి అల్లరికి ఇంజను నడిపేవాడు కూత వేయించేవాడు. ఆ కూతకు జడిసి, జనం ఒకరిపై ఒకరు విరుగబడుతూ వెనక్కు తగ్గేవారు. మొదటిసారి రైలెక్కినప్పుడు - అబ్బ! - ఎంత చోద్యమనిపించింది. కిటికీ గుండా బయటికి చూస్తే, గట్లూ, చెట్లూ, పొలాలు పరుగెత్తుకుపోతూ ఉన్నట్లే కనబడింది. కిందికి చూస్తే రైలుకట్ట కంకరరాళ్ళు పరుగెత్తుకు పోతున్న రాతిచప్టాలా అగుపించాయి. "ఇదిగో టెలిగ్రాఫ్ స్తంభం" అని అనుకుంటూ ఉండగానే, అది పారిపోవడమూ, ఇంకొకటి మొదటికి రావడమూ జరిగింది. ఇక జరజర జరిగి వెడుతున్న టెలిగ్రాం తీగల నుంచి చూపు మరల్చుకోవడమంటే కష్టమయ్యేది. "కదులుతున్నది రైలుగానీ ఇవి అన్నీ కాదు" అని ఆ కొత్తలో నమ్మశక్యం కాకుండా ఉండేది. ఇప్పుడు రైలు అందరికీ పాత అయిపోయింది. మరీ బస్సులు వచ్చిన తర్వాత దాని ముఖం చూచేవారే లేరు. "కొత్త ఒక వింత, పాత ఒక రోత" అని ఊరికే చెప్పారూ? పెద్దముండా వాళ్ళు!

ఏటి అవతల కావలసిన బంధువుల ఇంట పెళ్ళి అవుతూ ఉంటే, అక్కడికి బెజవాడ గుండానే భట్టిప్రోలు వరకూ ప్రయాణం చేశాడు సుబ్బారాయుడు. ఇది రెండోసారి బెజవాడను చూడ్డం. అయితే, ఈసారి ఊళ్ళోకి వెళ్ళలేదు. మొదటిసారి చూచినప్పుడు, బెజవాడ స్టేషన్ చాలా చిన్నది. రెండోసారికి ఎంతో పెంచివేశారు. ఈ మూలనుండి ఆ మూలకు చచ్చుగా చూచినా మైలు ఉంటుంది! దాన్ని చూడని కళ్ళు దేనికి?

మూడోసారి బెజవాడ వెళ్ళింది కూతురు పెళ్ళికి. బందరులో కంటే బెజవాడలో పెళ్ళి బట్టలు, కాళ్ళు కడుగు సామాను చౌకగా దొరుకుతాయని అంటే, పెత్తందారు కామయ్యను వెంటబెట్టుకొని తానక్కడికి వెళ్ళాడు. అప్పుడు బజారు పనులు ఒక్కరోజులో తెమలలేదు. ఆ రాత్రికి తాము పూర్ణానందం సత్రంలో బసచేశారు. ఎంత పెద్ద సత్రమది! ఒక చిన్న ఊరంత ఉన్నది. వచ్చే జనానికి, పోయే జనానికి తెరిపి లేదు. "దొంగలుంటారు జాగ్రత్త సుమా?" అని కామయ్య బావ ముందే చెప్పాడు. ఈ మాట వినగానే, ఎందుకైనా మంచిదని దస్త్రంలో ఉన్న డబ్బును తీసి తాను బొడ్డున పదిలపరచాడు. అక్కడికీ తనకు కంటిమీద కునుకు పడలేదు. ఇంత జాగ్రత్తగా

ఉండబట్టి సరిపోయింది గాని, లేకపోతే పెళ్ళి ఖర్చులకు పట్టుకు వెళ్ళిన నాలుగు వందల చిల్లరకూ చేతులు కడుక్కోవలసి వచ్చేదే! నిద్ర పట్టీపట్టని స్థితిలో తాను కళ్ళు మూసుకొని ఉండగా, ఒక దొంగ వెధవ వచ్చి, ముల్లుకర్రతో అరికాలిలో పొడిచాడు. తేలు కుట్టినట్టు చురుక్కుమనేసరికి "అబ్బా!" అంటూ తాను లేచి కూర్చున్నాడు. ఇంకా తిన్నగా లేచి కూర్చున్నాడో లేదో, తల దగ్గర పొంచి ఉన్న రెండో దొంగవెధవ దిండుగా తాను పెట్టుకొన్న దస్త్రాన్ని కొట్టివేశాడు. కాలి బాధ తగ్గిన తర్వాత వెనక్కు తిరిగి చూచుకుంటే, ఏముందీ దస్త్రం గల్లంతు! అయితే ఆ దొంగ వెధవలకి దక్కిందల్లా రెండు అంగ వస్త్రాలు, బజారుకొట్టు సరుకుల కోసం రాసిపెట్టుకున్న పద్దు పుస్తకమూ.

ఇలా సుబ్బారాయుడు బెజవాడను రెండు మూడుసార్లు చూచినవాడే గానీ, ఆ వీధులు ఎవరికి గుర్తు? పైగా ఇవ్వాళ చూచిన వీధి రేపటికి మారిపోతుంది. పడగొట్టే ఇళ్ళను పడగొట్టుతూ ఉంటే కొత్త వాటిని కడుతూ ఉంటారు. కూతురు పెళ్ళికి వచ్చినప్పుడు తను చూచిన బెజవాడకూ, ఇప్పటి బెజవాడకూ సాపత్యమే లేదు.

2

దారి అడిగి తెలుసుకుంటూ సుబ్బారాయుడు కృష్ణ ఒడ్డుకు చేరుకున్నాడు. అప్పటికి సాయంత్రం మూడు గంటలైంది. ఆ క్రితం రోజు పైటేళ చేసిందే భోజనం. ఆ తర్వాత పచ్చి మంచినీళ్లైనా ఎరగడు. కాని అతడికి ఆ ధ్యాస లేదు. ఎప్పుడు కృష్ణలో స్నానం చెయ్యడమా! ఎప్పుడు కొండ పైకి వెళ్ళడమా! ఎప్పుడు కనకదుర్గమ్మ దర్శనం చేసుకోవడమా! ఎప్పుడు తపస్సు కోసం కూర్చోవడమా ఇదే అతని తొందర. మధ్యాహ్నం మూడు గంటల ళ కృష్ణ ఒడ్డున ఎవ్వరూ లేరు. ఔను, మరి, ఆ వేళ కాని వేళ ఎవరుంటారు?

నీళ్ళ ఒడ్డుకు వెళ్ళేసరికి ఒంటరి గాడు సుబ్బారాయుడికి కొంత భయం వేసింది. కొండ, ఇటు కొండ, రెండు కొండల నడుమ ఆనకట్ట అటు వైపున - ఆనకట్ట పైన పెళ్ళికూతురులా నడుస్తున్నది. ఇటువైపున - ఆనకట్టదిగువ - కోడెతాచులా పరుగెత్తుతున్నది. పడగవిప్పుతున్నది, బుసల కొట్టుతున్నది. అటువైపున సూర్య కిరణాలు నీళ్ళ పైన జోదుతూ ఉన్నాయి. ఇటు వైపున కేవలం త్రుళ్ళింతలాడుతూ ఉన్నాయి. అటువైపున శాంత గంభీర ముద్ర, ఇటు వైపున ప్రళయ భైరవ నృత్యం నామార్గాన్ని క్షుద్ర మానవుడిలా నిరోధిస్తాడా అని కాబోలు ఈ ఆగ్రహం, ఈ ఆవేశం. అయితే ఈ ఆలోచన సుబ్బారాయుడికి తోచలేదు. అసలు ఈ విషయాల్ని అతడు శ్రద్ధగా పరిశీలించనైనా లేదు కాని, అతడి మనస్సు వ్యగ్రత చెందింది. అతనికి తెలియకుండానే అతని మనస్థితి పరిసరాలకు అనుగుణంగా పరివర్తనాన్ని పొందింది. మొదట కొంత సేపు అపూర్వమైన నిశ్చలత్వం అతణ్ణి ఆవరించింది. తర్వాత అనిర్వచనీయమైన ఆందోళన బయల్దేరింది. ఐదు నిమిషాలకు ముందు చూచిన దృశ్యాలు, ఐదేళ్ళ క్రితం జరిగిన సంఘటనలు, కూతురుపూసు, రామయోగి మాటలు, ఆవు తన వంకచూచిన చూపు, అప్పులవాడు తిడుతూ ఉండగ తనను చూసిన కొందరు, చేపలకూర అంటే తనకున్న ఇష్టం, అయ్యవార్లంగారు పురాణం చెప్పే ధోరణి - ఇలాగే ఒక దానితో ఒకటి సంబంధం లేని భావాలు ఎన్నో అతడి మనస్సులో పెనవేసుకొని, యుద్ధ విమానాల వేగంతో పరుగులెత్తాయి. దాదాపు పావుగంట సేపు నీళ్ళ అంచున అతడు ప్రతిమలా అటు నది నిలబడిపోయాడు. అంతలో అతడికి తపస్సును ప్రారంభించడంలో విలంబన జరుగుతున్న సంగతి స్పృహకు వచ్చింది. చప్పున నీళ్ళలోనికి దిగి మూడు బుటకలు వేశాడు. చల్లని నీళ్ళలోనికి దిగి తలరా స్నానం చేసేసరికి ఆ క్రితం నుంచీ

వేడెక్కి ఉన్న బుర్ర కొంచెం చల్లబడింది. కొంత శాంతి కొంత తృప్తి కలిగింది. దీనితో పాటు తపస్సు విషయమై అతని నిశ్చయం మరింత ధృవపడింది. మోకాటిలోతు నీళ్ళలోనికి వచ్చి, ఉత్తరీయాన్ని తడిపి, గట్టిగా పిండి, దానితో వొళ్ళు తుడుచుకున్నాడు. దాన్ని మళ్ళీ తడిపి, రపీ రపీ మంటూ నీళ్ళమీద నాలుగైదు సార్లు బాది, గట్టిగా పిండి, మొలకు చుట్టుకున్నాడు. ఆ తర్వాత కట్టుపంచెను గుంజుకొని, దాన్ని ఆరవేసుకుంటూ గట్టున ఒక అరగంట గడిపాడు. కొంచెం ఆరగానే దాన్ని కట్టుకొని, ఉత్తరీయాన్ని కప్పుకొని చెంబుతో ఇంత తీర్థాన్ని తీసుకొని కనకదుర్గ కొండవైపుకు బయల్దేరాడు. అతడు కొండమెట్లు దగ్గరికి చేరుకొనేసరికి అయిదు కొట్టారు.

వంద, వందంబాతిక మెట్లు గబగబ ఎక్కాడు గాని, ఆ తర్వాత సుబ్బారాయుడికి అడుగుతీసి అడుగు పెట్టటమే కష్టమైపోయింది. పాదం పైకి ఎత్తుతూ ఉంటే, సీసంముద్ద ఎత్తుతూ ఉన్నట్టుగా అనిపించింది. ఎక్కడలేని వగర్పు వచ్చింది. వొళ్ళంతా ముచ్చెమటలు పోశాయి. కళ్ళు కూడా కొంచెం బైర్లుకమ్మడం ప్రారంభించాయి. ఇక అడుగు పడదని నిస్పృహతోచగానే అతడు మెట్లపైనే ఒక ప్రక్కకు ఒదిగి చతికిలబడిపోయాడు. కిందటిసారి ఎక్కినప్పుడు మూడు అంగలైనా కాలేదు, ఈ సారి తల ప్రాణం తోకకు వస్తున్నది. ఎందువల్లనా? అని ముందు అతడు విస్తుపోయాడు. కాని, అంతలోనే ఆ క్రితంరోజు నుంచి తిండీ తిప్పలు లేకుండా ఉన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. కాళ్ళూ చేతులు ఈ విధంగా తోడుకుపోవడానికి, కళ్లు ఇలా తిరగటానికి, ఇంత సొలి పుట్టడానికి ఇదే కారణమై ఉండాలి అని అతడప్పుడు అనుకున్నాడు. పూర్వపు యుగాలలో వాళ్ళకు ఏనుగంతటి శక్తి ఉండేది. ఆ భీముణ్ణి చూడరాదో! బండెడు అన్నం ఒక్క ముద్దుచేసి నోట్లో పడవేసుకొనేవాడు. ఈ పాడు కలికాలంలో ఏముంది? తవ్వెడు బియ్యం ఇగరబోస్తే ఇంటెల్లపాదికీ ఎక్కా తక్కీ తన సంగతి చూడరాదూ? మూడు పూటలు తిండి మానేసరికి, గుడ్లు వెళ్ళుకు వచ్చాయి. ఇంక తానేమిటి? తపస్సేమిటి? వచ్చిన దారినే చల్లగా ఇంటికి వెళ్ళడం మంచిది.

ఛీ! ఛీ! ఇంతలోనే ఇంత భయపడి పోవడమా? నారద మునీంద్రుడు అననే అన్నారు. “తపస్సు అంటే మాటలు కాదు. నీవు చెయ్యగలవా?” అని. “తమ దయ ఉంటే, అదెంతపని” అని ఆయనతో కోతలు కోసి, ఇప్పుడు ఈ కాస్త భాగ్యానికే బెదిరి ఇంటిదారి పట్టటమా? అది తగనిపని.

కాసేపు విశ్రాంతి తీసుకొని, ఆ తర్వాత నెమ్మదిగా ఎక్కిపోతే, ఏడెనిమిది గంటలకు ఎలాగో కనకదుర్గమ్మ సాన్నిధ్యానికి చేరుకోవచ్చును. ఒక్కసారి అక్కడికి వెళ్ళిన తర్వాత అంతా ఆ తల్లిదే భారం. ఇలా అనుకుని పావుగంట సేపుకు పైగా సుబ్బారాయుడు సేద దీర్చుకొన్నాడు.

ఆ తర్వాత మళ్ళీ పదిమెట్లు ఎక్కేసరికి, తిరిగి వగర్పు ప్రారంభమైంది. పళ్ళు బిగించి, మరి నాలుగు మెట్లు ఎక్కేసరికి, ముందుకు తూలి, బొక్కబోర్లగా పడిపోయాడు.

మరి ఎక్కడానికి ప్రయత్నించి లాభం లేదని గ్రహించి "రామయ్య తండ్రి" అంటూ సుబ్బారాయుడు చతికిలబడిపోయాడు. కేవలం అర్ధంతరం అయిపోయింది తన పని. అటు కొండదిగువునూ ఉన్నట్టు కాదు, ఇటు కొండపైకి వెళ్ళినట్టుకాదు. ఇప్పుడు ఏమిటి చెయ్యడం? ఈ రాత్రికి ఇక్కడనే పండుకొని, తెల్లవారు ఝామునలేచి పైకి వెళ్ళితేనో? కాని, నిరాహారంవల్ల ఇప్పటికే ప్రాణం సోషిల్లిపోయింది. ఈ రాత్రి తెల్లవార్లూ ఇంకా ఉపవాసం చేస్తే, చప్పగా ఎత్తుబడి పోవడమే అవుతుంది. పోతే ఆకలితో ప్రాణంపోయినా పోవచ్చు కానీ, ఆ పరాత్పరుడు -

ఆశ్రితజన పక్షపాతి - అంత ఘోరాన్ని జరుగనిస్తాడా? ఎన్నటికీ జరగనివ్వడు. గుండె ధైర్యం చాలక, తను ఈ పిచ్చి భయాలు పడ్డంగాని, ఏమైనా సరే ఇక్కడ నుంచి ఒక్క మెట్టు అయినా కిందకు దిగను అని మొండికేసి కూర్చుంటే గొల్లవాడి వేషంలో ఆ గోపాల కృష్ణుడు వచ్చి ఒక ముంతడు పాలు చేతికిచ్చి వెళ్ళడా? లేకపోతే? ఏ దేవతో పేదరాశి పెద్దమ్మ వేషంతో వచ్చి, పంచ భక్ష్య పరమాన్నాలతో భోజనం పెట్టి వెళ్ళదా? పురాణకాలంలో ఇలా ఎన్నిసార్లు జరగలేదు? అప్పుడు జరిగిన మాట వాస్తవమే గాని ఇప్పుడు జరుగుతుందా? అది సత్యకాలం, ఇది పాడు కలికాలం. ఆనాటి మహత్తు ఈనాడు కనబడమంటే ఎలా కనబడుతుంది?

అబ్బే, లాభంలేదు. ఏ దేవ, గంధర్వయక్ష కిన్నెరకింపురుషులో వచ్చి భక్తుడికి ఇప్పుడు షడ్రసోపేతంగా భోజనం పెట్టి వెళ్ళతారనడం కలలో వార్త. కాని, ఇప్పుడైనా నారద మునీంద్రుడు ప్రత్యక్షం కాలేదా? ఎంత కలికాలమైనా ఆ శ్రీమన్నారాయణుడి మహత్తు ఇంతో అంతో కనబడుతూనే ఉంటుంది. లేకపోతే, అసలు ప్రపంచం నిలుస్తుందా? నిజానికి ఇదంతా వాడి నాటకమే. అసలు ఆ సర్వేశ్వరుడు కలిగించుకోవడం వరకూ ఎందుకు? నారదమహర్షి గట్టిగా తలచుకోవాలి గానీ ఆయన ప్రత్యక్షమై తనను దరి జేర్చడూ?

ఈ ఆలోచన తట్టిన వెంటనే సుబ్బారాయుడు నారద మహర్షి స్మరణ ప్రారంభించాడు. "నన్ను ఆశీర్వదించి తపస్సుకు పంపించావు. అర్థాంతరంగా నేను ఇక్కడ ఈ విధంగా చిక్కుపడిపోయాను. దిక్కులేని నన్ను రక్షించ వలసిన భారం నీదే సుమా." అతడు మొరపెట్టుకో సాగాడు. ఎక్కడైనా సరే కాస్త అలికిడైతేచాలు "అదిగో నారద మునీంద్రుడు వచ్చాడు." అంటూ కళ్ళు విప్పి చూడనారంభించాడు. రెండు మూడు సార్లు ఆశాభంగం అయిన తర్వాత, లోలోపల స్మరణచేస్తే, ఆ తాపసోత్తమునికి వినబడ్డంలేదేమో అనే అనుమానంతోచి బిగ్గరగా మొరపెట్టుకొన్నాడు కాని, ఎంత బిగ్గరగా అరిచినా, ఆ క్షణంలో గంజాయి కొట్టు దగ్గర ఉన్న నారద మునీంద్రుడికి ఈ మొర వినబడనే లేదు.

ఎంతగానో వేడుకొన్నప్పటికీ నారద మునీంద్రుడు రాకపోవడం చూచిన తర్వాత, సుబ్బారాయుడికీ గుండె చెదిరిపోయింది. కానీ, ఆ స్థితిలో ఏమిచేయాలో అతనికి ఎంతకూ పాలుపోలేదు.

రకరకాల ఆలోచనలు చేస్తూ అక్కడే కూర్చుండి పోయాడు. అంతలో సూర్యుడు అస్తమించాడు. సంజ చీకట్లు అలుముకోసాగాయి. నిన్న సాయంత్రం ఈ వేళకు తాను ఆదరాబాదరా ఆవును ఇంటి వైపుకు మళ్ళవేసి పురాణం దగ్గర కూర్చోబోతున్నాడు. ఇవ్వాళ ఇక్కడ ఇలా దిక్కుమాలిన స్థితిలో ఉన్నాడు. ఒక్క రోజులో ఎంత పని జరిగింది. ఇంతకూ ఇల్లాలు మంచిదైతే తనకు ఈ కనిపెట్టుకొనే ఉండేవాడు.

తిప్పలు ఎందుకు వచ్చేవి? "కృష్ణా రామా" అనుకుంటూ తాను ఇల్లు కూతురు కడుపు పండి, మనుమలతో మనమరాళ్ళతో ఇల్లు కలకలలాడుతూ ఉంటే... అదిగో, మళ్ళీ సంసార మమకారం, అబ్బబ్బ, ఎంత వదిలించుకోవాలన్నా ఈ సంసారం లంపటం తప్పదుగదా? ఇల్లూ, వాకిలీ, పెళ్ళామూ బిడ్డలూ అంటే ఇంత పడిచస్తూ ఉండబట్టే ఎంత తలుచుకున్నా ఆ నారద మునీంద్రుడు సాక్షాత్కరించలేదు. మనం లోపల దాచిపెట్టుకున్నా, కిందా మీదపడగా ఆ మహాత్ముడికి ఎవరి మనస్సులో ఏమున్నదో ఇట్టే తెలియదూ? సుబ్బారాయుడికి చివరికి ఒక ఆలోచన తోచింది. కొండపైకి ఎక్కి వెళ్ళాలని ఇక ప్రయత్నించి ఎలాగూ లాభంలేదు గనుక, చల్లగా కిందికి దిగివెళ్ళి, నారద మునీంద్రుడు చెప్పినట్టు అయిదిళ్ళకు వెళ్ళి భిక్షాటన చేసి, ఈ రాత్రికి

ఆకలి చిచ్చు చల్లార్చుకోవాలి. కిందనే ఏ పంచనో ఈ రాత్రికి కాలక్షేపం చెయ్యాలి. తెల్లవారి ఝాముకు తప్పక కొంత ఓపిక చేరుకుంటుంది. తొలి కోడితోపాటు లేచి, కొండ ఎక్కడం ప్రారంభిస్తే, సూర్యోదయం వేళకు పైకి చేరుకొని, తపస్సు ప్రారంభించవచ్చు. ఈ నిశ్చయానికి వచ్చిన వెంటనే సుబ్బారాయుడు లేచి నెమ్మదిగా కిందికి దిగనారంభించాడు. చీకటిలో ఎలా దిగి వెళ్ళడమా అని అనుకుంటూ ఉండగానే ఎలక్ట్రిక్ దీపాలు వెలిగాయి. వాటిని చూచి చూడ్డంతోటే "ఇది తెల్లవాడి మాయగదా" అని అతడు అనుకున్నాడు. ఇలా మిల మిల మెరిసే దీపాలు ఉంటాయా అని అతనికి ఒక సందేహం తోచింది. తనదంతా పిచ్చిగాని, దేవలోకంలో ఈలాంటి దీపాలు కరువా? అసలు స్వర్గంలో సూర్యుడినీ, నక్షత్రాల్ని కట్టివేసు కొన్నారుకాదూ? అసలు అక్కడ ఎప్పుడు వెన్నెలేగానీ, ఎండ ఉండనే ఉండదని అయ్యవార్లంగారు చెప్పినట్టు కూడా జ్ఞాపకం. పిండి ఆరబోసినట్టుగా ఉన్న వెన్నెలలో ఇంద్రసుతుడు, అర్జునుడు కూర్చొని ఉండగానే గదా, ఊర్వశి మోహించి రావడమూ, "నీవు నాకు తల్లివిగదా, నా పొందు కోరడం పాపం కాదా?" అని పాండవ మధ్యముడు అనడమూ, అందుకు ఆ దేవాంగన కోపించి "నీవు నపుంసకుడవు అయిపోదువుగాక" అని శపించడమూ జరిగిందని పురాణంలో చెప్పారు. వెధవ ఎండ కాయడమూ, తెక తెకలాడి పోవడమూ లేకుండా, అక్కడ ఎప్పుడూ వెన్నెల కాస్తూ ఉంటుంది. పైగా, చంద్రుడు ఆ లోకంలోనే ఉండడం వల్లా అక్కడ మరీ వెన్నెల కాస్తూ ఉంటుంది కూడా. ఎక్కడం ఎంతో కష్టం అనిపించింది కాని, దిగి రావడానికి క్షణం పట్టలేదు. తీరా కిందికి వచ్చిన తర్వాత భిక్షాటనం ఎలా చెయ్యడమా అని సుబ్బారాయుడికి పెద్ద చింత పట్టుకొన్నది. ఎన్నడూ ఒక ఇంటికి వెళ్ళి "దేహి" అని అడిగినవాడు కాదు. మానాభిమానాలు ఒక్కసారిగా చంపుకొని బిచ్చమడగడం మాటలా? తాను తపస్సు కోసం బయల్దేరిన సంగతి, గ్రహించ లేక మామూలు బిచ్చగాడు అనుకొని, ఏ ఇల్లాలైనా "దుక్కలా ఉన్నావు. నీకు మాయరోగమా కూలీ నాలీ చేసుకోలేవూ? అని అంటేనో? అంత మాటపడిన తర్వాత తలకొట్టుకోవలసిందే గానీ ఇంకా బ్రతకడమా? నిజమే కాని తపస్వి కాదలచుకొన్నవారు ఇలాంటి అభిమానాల్ని చంపుకోవాలి. దూషణ భూషణలు శరీరానికి గాని, ఆత్మకు అంటవని అయ్యవార్లంగారు చెప్పలేదా? తిట్టినా, తన్నినా తామరాకుపై నీటి బొట్టులా మెలగడం నేర్చుకొన్ననాడేగాని, మోక్షం సిద్ధించదు. అంచేత ఏమైనా కానీ, అయిదిళ్ళ దగ్గర తిరిపెం ఎత్త వలసిందే.

ఇలా అనుకొని సుబ్బారాయుడు ముందు ఒక గడప దగ్గరకి వెళ్ళాడు. ఇంటి తలుపులు బార్ల తీసి ఉన్నాయి. చావడిలో దీపం కాగడాలా వెలుగుతూ ఉన్నది. ఇంట్లో ఎక్కడా ఏమి అలికిడిలేదు. ఒక్క చిన్న పిల్ల మాత్రం లోపల ఎక్కడో ఏడుస్తున్న శబ్దం వినబడుతున్నది. నాలుగైదు నిమిషాలు కేకవేసి అడగనా వద్దా అని సుబ్బారాయుడు తటపటాయించాడు. కేకవేస్తే, ఏమని కేక వేయాలి అని కూడా మీమాంస చేశాడు. చివరికి "మాదా కవళం అమ్మా" అని అందామని అనుకున్నాడు. కాని తీరా అనబోయేసరికి ఆ మాట పెగలలేదు, "సరిలే ఇంటి ఇల్లాలు బయటికివస్తే అడుగుదాము" అని అనుకొంటూ ఉండగానే "వస్తున్నానమ్మా వస్తున్నా, ఏడవకు నా చిట్టి తల్లి" అంటూ ఆమె చక్కా వచ్చింది. చావడిగ గదిలోకి వెళ్ళుతూ ఉండగా సుబ్బారాయుడు "మాదా...." అని అనబోయాడు గానీ మాట సగంపైకి వచ్చి సగం గొంతులోనే ఆగిపోయింది. ఆ క్షణంలోనే ఎవరోగానీ ఆ దారినే వస్తూ, సుబ్బారాయుడిని చూచి, అడుగు ఆగి వేశాడు. దీన్ని చూసేసరికి ఒక వేళ తన్ను యెరిగున్న వాడెవడైనానేమో అని అనిపించి సుబ్బారాయుడు గజగజ లాడిపోయాడు. చప్పున అక్కడినుంచి బయల్దేరి "ఇక్కడ అన్నీ అపశకునాలుగా ఉన్నాయి. ఇంకో వీధిని తిరిపెమెత్తుదాము" అనుకున్నాడు. ఇంకోవీధి ఇంకోవీధి అనుకొంటూ సుబ్బారాయుడు ఏడెనిమిది వీధులు దాటి వెళ్ళాడు అంత కంతకు పొద్దుపోతున్నది. అప్పటికే చాలమంది నాలుగు మెతుకుల్ని నోట్లో వేసుకొని, కుండా చట్టి సర్దుకుని, తలవాకిళ్లు తలుపులు మూసి వేసుకున్నారు. మరి ఇలాగే కొంత ఆలస్యం చేస్తే, ఊరుకూడా మాటు మణుగుతుంది. చొరవచేసి వెంటనే

ఐదుగురు ఇల్లాళ్ళను దేహి అని అడగాలి. లేకపోతే ఈ రాత్రికి కూడా పస్తు తప్పదు. ఇదిగో! ఈ ఇంటి దగ్గరకు వెళ్ళి అడుగుదాము! అని నిశ్చయించుకొని, తీరా గుమ్మంలోకి వెళ్లేసరికి, సుబ్బారాయిడికి జిహ్వ పడిపోయింది. "సరిలే! ఇక్కడ కాదు, పై ఇంటి దగ్గర అడుగుదాము!" అనుకొని మళ్ళీ ముందుకు సాగడం, అక్కడ కూడా తిరిగి ఇదే వరస! ఒక ఇంటి దగ్గర కుక్క భౌ! భౌ! అంటూ పైకి ఉరికింది. ఇంకో ఇంటి గుమ్మం ముందు ఆగేసరికి, ఇంటి యజమాని బయటికి వచ్చాడు. సాటి మగవాడిని చూచే సరికి సుబ్బారాయుడికి ఎంచేతనో చెడ్డ అభిమానం అనిపించింది. మూడోచోట ఒక భాగ్యశాలిని కబోదిపక్షినమ్మా! కవళం అని కేకలువేస్తున్న గుడ్డివాణ్ణి పిలిచి ముద్ద వేస్తున్నది. తానుకూడా ఆవిణ్ణి భిక్షం అడుగుదామని సుబ్బారాయుడు ముందైతే అనుకున్నాడుగాని, గుడ్డి బిచ్చగాడితో ఒకటి కావడం మనస్కరించలేదు. ఇలా మరి ఒకటి, రెండు వీధుల వెంట తిరిగి చివరికి అతడు ఒక చిన్న ఇంటి గుమ్మంముందు ఆగాడు. పెద్ద ఎత్తు ఇంటికి వెళ్ళితే, వారికి భేషజం హెచ్చుగా ఉంటుంది. ఇది సంసారపక్షం ఇల్లుగా ఉంది. అడగగానే ఇల్లాలు ఒక ముద్దవేసి పంపుతుంది, అని అతడు అనుకున్నాడు. వాకిట్లో గాని, చావడిలోగాని, మగవాళ్ళు ఎవరూ కనబడ్డంలేదు. చావడిలో ఒక మూల పూజ అరుగుకూడా ఉంది. దాని మీద సీతారామాంజనేయులు పటం, దానికి పొగడ పూలదండ దాని యెదట దీపారాధన, ఇల్లాలు మంచి భక్తిపరులు లాగా కూడా ఉంది. భక్తుల పిలుపు వినగానే సాక్షాత్తు అన్నపూర్ణలాగా వచ్చి షడ్రసోపేతంగా భోజనంగూడా వడ్డిస్తుంది. అని మనస్సులో ధృఢపరచుకొన్నాడు సుబ్బారాయుడు. మాదా కవళం! అని ముందు ఒక కేక వేశాడు! దానికి జవాబులేదు. మరికొంచెం బిగ్గరగా మళ్ళి కేక వేశాడు. రెండో కేకకు కూడా జవాబులేదుగానీ, లోపటినుంచి కదలిక చప్పుడు వినబడింది. మరింత ధైర్యం తెచ్చుకొని ఈ సారి గట్టిగానే కవళం! తల్లీ! అని కేకవేశాడు సుబ్బారాయుడు. ఈ కేకకు ఇంటిలో నుంచి ఒక విధవరాలువచ్చి, నీ కోసం వండి వార్చామనుకున్నావట్రా, వెధవా! వేళా పాళా లేదు. ఫో! ఫో! అని అదిలించింది. ఈ మాటకు నిలువునా నీరైపోయాడు. ముందైతే అడుగులు తడబడ్డాయి కాని, చప్పున తెప్పరిల్లి, చకచకా సాగిపోయాడు. ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటివెనక చచ్చినట్లు అయింది నా పని! ఛీ! ఛీ! ఏమైనా ఇక తిరిపెం యెత్తను, ఇక్కడికి ఈ అవమానంచాలు అని అతడనుకున్నాడు. కాని, ఈ ఆకలి మంటల్ని చల్లార్చుకోవడం ఎలా? పట్టెడు మెతుకులు తినకపోతే, తెల్లవారే వరకైనా ప్రాణాలు నిలిచేలా లేవు.

పోతే పోయింది పాడు ప్రాణం! ఇంతమాట పడిన తర్వాత బ్రతకడం కంటే, ఏ నూతిలోనో, గోతిలోనోపడి చావడం మేలు. అన్నట్టు ఎలాగూ చస్తూ పాడు నూతినో, గోతినో వెదకడం దేనికి. దగ్గరనే కృష్ణమ్మ తల్లి ఉన్నది. ఆ మాత గర్భంలో కలిసిపోవడం మంచిది. ఎంతెంత దూరం నుంచో వచ్చి గంగా, సింధు, యమున, కృష్ణా గోదావరి నదుల ఒడ్డున ప్రాణాలు వదలి స్వర్గానికి వెడుతూ ఉంటారు. తానుకూడా ఆ పుణ్యజలంలో పడి "హరీ" అంటే జన్మ రాహిత్యం అవుతుంది. "పిరికివాడు ప్రాణాల్ని తీసుకోవడం కాశీలో గోవును చంపినంత పాపం" అని అయ్యవార్లంగారు కూడా అన్నారు మరి, ఇంత పాపానికి చూస్తూ చూస్తూ ఒడిగట్టడమా? కాని, తాను ఒకరికి భయపడి చావడం లేదుగదా? ఆ శ్రీమహావిష్ణువు సాన్నిధ్యాన్ని చేరాలని కృష్ణమ్మ తల్లి గర్భాన చేరబోతున్నాడు. అంచేత తాను తప్పక వైకుంఠానికి వెళ్ళవలసిందే! అయితే, సుబ్బారాయుడికి అంతలోనే ఇంకొక సందేహం తోచింది. వైకుంఠానికి ఏ పుణ్యనదిలోనో పడిపోవడం అనే అంతటి సులభ మార్గం ఉంటే, మరి ఈ కఠోర తపస్సు దేనికి? అందరూ ఈ సులభ మార్గాన్ని అనుసరించే వారుకారా ? అబ్బే! లాభంలేదు. ఆత్మహత్య చేసుకొన్నవాడు నరకకూపాన పడిపోతాడు!

ఇప్పుడు మరి గత్యంతరం? అంతా అయోమయం అనిపించింది. సుబ్బారాయుడు పిచ్చి వాడిలా వీధులవెంట తిరగసాగాడు. పోగా పోగా కాళ్ళు మరీ తడబడిపోయాయి. కళ్ళు బైర్లుకమ్మిపోయాయి. ముఖానికి గూడా దెబ్బతగలవలసిందే కాని, చేతులమీద ఆపుకొన్నాడు. అతడు తూలిపడిపోవడం చూచి దారినిపోతున్న వారు కొందరు అల్లరిగా నవ్వుతూ "గుర్రం ఎక్కినట్టున్నాడు" అని హేళనకు సుబ్బారాయుడికి పట్టరాని కోపంవచ్చింది. కాని, ఏమిలాభం? నిలబెట్టి నాలుగు దులిపే ఓపికకూడా లేదు. ఈ నిస్సహాయ స్థితికి అతడికి ఒక పెట్టున పెద్ద ఏడుపు వచ్చింది. రావడంలో కట్టలు తెంచుకుంటూ పెద్ద వరదలా వచ్చింది "పాడు! ఇదేమిటి చిన్న పిల్లవాడిలా ఏడవడం" అని లోలోపల కొంత సిగ్గుగా వున్నప్పటికీ ఆ ప్రవాహం ఆగలేదు. మెట్ట పల్లాల్ని అన్నింటినీ అతిక్రమించిపోయే వరదపొంగులా అది అతణ్ణి ముంచెత్తింది. ఆ క్షణంలో తాను ఎక్కడ వున్నది గూడా సుబ్బారాయుడికి తెలియదు. తుపానుకు చుక్కాను విరిగి కొట్టుకుపోతున్న పడవలా వున్నది అతని స్థితి. పరకాయించి చూస్తే ఏదో కాలవగట్టున వున్నట్టు అతడికి కనబడింది. ఆ గట్టుమీద ఒక పెద్ద చెట్టువుంది. దాని మీద నడుం వాల్చాడు. తనను తాను తిట్టుకుంటూ, తనలో తాను ఏడ్చుకుంటూ, తనను తానే ఓదార్చుకుంటూ, ఒక గంట గడిసేసరికి, అతడికి చెడ్డ నిద్ర వచ్చింది. అమావాస్యనాటి రాత్రి చీకటిలోకాన్ని ఆవరించినట్టుగా నిద్ర అతణ్ణి ఆవరించింది. గంజాయి తాగినవాడు మరిచినట్టుగా అతడు ఒళ్ళు మరిచి నిద్రపోయాడు. ఆ నిద్రలో ఆకలిబాధ అవమానబాధ ఎక్కడికి పోయిందో తెలియదు.

గాఢమైన ఈ నిద్రలో సుబ్బారాయుడికి ఒక కల వచ్చింది. ఆ కలలో నారద మునీంద్రుడు ప్రత్యక్షమైనాడు. ఆయన వాత్సల్యపూర్వకంగా చిరునవ్వు నవ్వుతున్నాడు. మోయలేని బరువు ఎత్తుకోడానికి ప్రయత్నంచేసి, భంగపడిన కుర్రవాణ్ణి చూచి, ముసలి తాత నవ్వినట్టుగావుంది నారద మునీంద్రుడి చిరునవ్వు. పడివున్న సుబ్బారాయుడు దగ్గరకు వచ్చి, ఆయన చేతితో అతడి శరీరాన్ని మృదువుగా నిమిరాడు "తపస్సు అంటే మాటలు కాదు, నాయానా! అని ముందుగానే నేను చెప్పలేదా ?" అని జాలితో నిండిన కంఠంతో అన్నాడు. నారద మౌని మృదుహస్తస్పర్శ తగలేసరికి సుబ్బారాయుడికి అమృతవాహినిలో జలకమాడినట్టు తోచింది. ఒంటి నొప్పులన్నీ ఆ క్షణంలో మటుమాయమై పోయినై. ఎక్కడలేని బలంతో ఒక్కసారిగా లేచి, ఆ మౌనీంద్రుడికి సాష్టాంగా పడ్డాడు. "తపస్సు అంటే మాటలుగాదని నాకు తెలుసుస్వామి! కష్టాలు ఎన్నివచ్చినా సహించగలను. కాని అవమానాన్ని సహించలేను" అన్నాడు. ఇందుకు తాపసోత్తముడు చిరునవ్వు నవ్వుతూ "మానావమానాలు ఈ శరీరానికేగాని, ఆత్మకుగాదు. నాయనా! కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాల్ని జయించినవాడే ఆ శ్రీమహావిష్ణువుని సాక్షాత్కరించుకో గల్గుతాడు. భూషణకు నీవు పొంగిపోరాదు, దూషణకు క్రుంగిపోరాదు. అంతటి శక్తి, అంతటి సంస్కరణ నీకులేదు. నీవు తాపసివి కాలేవు. ఇంటికి వెళ్ళి కృష్ణా రామా! అంటూ భక్తి మార్గాన కాలం గడుపుకో! అది మాత్రం ఆ పరాత్పరుడికి ప్రీతికరం కాదా? అని హితోపదేశం చేశాడు.

"నీకు తపస్సు వద్దు! నీకు అంతశక్తి లేదు" అని నారద మునీంద్రుడు ఎంత గట్టిగా అంటే, సుబ్బారాయుడికి అంత పట్టుదల హెచ్చింది. "లేదు! స్వామీ! అజ్ఞానుణ్ణి గనుక అవమానాన్ని సహించలేకపోయాను. ఇప్పుడు మీరు జ్ఞానబోధ చేశారు తిరిగి తప్పు జరగనివ్వను, మీ ఆశీర్వాదబలం వుండాలిగాని, నేను ఆ పరాత్పరుడి దయకు పాత్రుణ్ణి కాకపోతానా!" అన్నాడు మంచిది వత్సా! నా ఆశీర్వాదం ఎప్పుడూ వుండనే వున్నది" అంటూ నారద మౌని అంతర్ధానమైపోయాడు.

వెంటనే సుబ్బారాయుడికి మెలుకువ వచ్చింది. పెద్ద బరువుదించినట్టుగా ఒళ్ళు చాలా తేలికపడినట్టు అనిపించింది. మంచు తెఱవిచ్చినట్టు మనస్సులోని వికలత్వం పోయింది. “బుద్ధి గడ్డితిన్నది. స్వల్ప అవమానానికి తబ్బిబ్బుపడి పోయాను. ఆయన పుణ్యమా అంటూ నారద మునీంద్రుడు తిరిగి తిన్నని దారి చూపించాడు. ఇక ముందు చూపేగాని వెనక్కి తిరిగి చూడరాదు” అని అతడు దృఢపరుచుకున్నాడు. ఈ సారి ఎవరు ఏమన్నా సరే, వరసగా అయిదిళ్ళకువెళ్ళి, భిక్షం అడుగుతాను. వేస్తే వేస్తారు. లేకపోతే రేపు ఉదయం తిండి తిప్పలు సంగతి చూచుకోవచ్చునని అనుకున్నాడు. వెంటనే లేచి ఒక వీధి వెంట పడ్డాడు. ఎంతదూరం వెళ్ళినా ఒక యింటి తలుపులయినా తీసిలేవు. “అప్పుడే అందరు నిద్రపోయారు. ఊరుకూడా మాటు మణగింది. ఎంత ప్రొద్దుపోయిందేమిటి చెప్మా? అని విస్తుపోయాడు. నక్షత్రాల వంకచూస్తే అప్పటికప్పుడే పది పదకొండు గంటలయినట్టు తెలిసింది. “అబ్బ! ఎంత సేపు నిద్రపోయాను!”అని అనుకుంటూ, ఇక ఆ రాత్రికి భిక్షాటనకే మరి వీలులేదనుకొన్నాడు. ఇక, తెల్లవారే వరకు ఎక్కడ కెళ్ళతీయడమా అని ఆలోచిస్తూ దారివెంటపడిపోతూ వుండగా, ఒకచోట ఒక కాఫీ హోటల్ కనబడింది. దానిముందు ఆ నాటికి కొట్టు కట్టివేస్తూ, తెల్లవారితే పాచిపోయి, మరి పనికిరాకుండాపోయే, వడలు, ఉప్మా మొదలైన వాటిని దారినిపోతున్న బిచ్చగాళ్ళని పిలిచి, వాళ్లకు పారవేస్తున్నాడు. సుబ్బారాయుడు కూడా కొట్టుదగ్గరికి వెళ్ళి నిలబడేసరికి, “ఏదిరా ఒడిపట్టు” అని నాలుగు వడలు, ఇంత ఉప్మా పెట్టాడు. కేవలం ఆ నారద మునీంద్రుడి మహత్తు కాకపోతే, ఇక రాత్రికి నిరాహారమే అని అనుకున్న తర్వాత అయాచితంగా యింత ప్రసాదం దొరుకుతుందా! అని సుబ్బారాయుడు సంతోషించాడు. అయ్యర్ వేసిన ఉప్మానూ, వడల్ని పూజా ప్రసాదంలా అందుకుని, అతడికి నమస్కారం చేశాడు. అక్కడినుంచి వచ్చిన దారినే వెనక్కు వెళ్ళి తాను ఇంతకుముందు నిద్రపోయిన చెట్టుమొదటికి తిరిగి చేరాడు. కాల్వలోని ఇన్ని నీళ్ళు చెంబుతో ముంచి తెచ్చుకొని కడుపునిండా ఫలహారంచేసి “శంభోశంకర” అని నారద మునీంద్రుడు ఉపదేశించిన తారకమంత్రాన్ని జపించుకుంటూ నిద్రపోయాడు.

వొళ్లు మరిచి నిద్రపోయాడు సుబ్బారాయుడు. నిజానికి అది నిద్రకాదు. మైకం, నీళ్ళమీద కొట్టుకొని, కొట్టుకొని అలసిపోయి, నీళ్ళ అడుగుకి మునిగిపోయేలా, చెడ్డ ఆకలితోనో, పెద్దవిచారంతోనో, విరామంలేని పని సరి కళ్ళలోకి పొడిచే సరికి, అతడు తిరిగి చప్పున వాటిని మూసుకున్నాడు. పాటలతోనో, పూర్తిగా అలసిపోయినవారు ఇలాంటి నిద్ర మైకంలో పడి, పోతారు. ఇలాంటి వారికి ముందు కొంత సేపు నిద్రపట్టదు. కనురెప్పలు సీసంకంటే బరువుగా వుంటాయి. ఒక పట్టున పడక కుదరదు. కష్టంమీద కళ్ళుమూస్తే పిచ్చి పిచ్చి ఊహలు వస్తాయి. లేకపోతే, “మరి ఏమిచెయ్యాలి ?" అనే ఆందోళన కలుగుతుంది. నిజానికి "మరి చేయవలసిందేమీ వుండదు. కాని, ప్రతిక్షణమూ ఈ ప్రశ్న అంతకంతకూ బిగ్గఱగా, తొందరగా, జవాబు కోసం వేధిస్తుంది. ఇదీ కాకపోతే, అతి విపరీతమైన దృశ్యాలు కనబడతాయి. తలగాని, కాలుగాని, చెయ్యిగాని చూస్తూ చూస్తూ వుండగానే వుబ్బిపోయి కొండంత అయినట్టుగా కనిపిస్తుంది. అప్పుడు చప్పున కళ్ళు తెరవాలి, తనకు తానే పరిశీలించుకొని, ముచ్చెమటలు పోస్తవి. ఒకసారి “అబ్బే! ఏమిలేదు” అని దృఢపరచుకొని, మళ్ళీ కళ్ళు మూసినా తిరిగి ఇలాంటి దృశ్యాలు కనబడ్డం కద్దు. అప్పుడిక కన్ను ముయ్యడం అంటేనే భయం పుడుతుంది. ఇలా కొంత సేపు బాధపడిన తర్వాత, ఎప్పుడో తమకు తెలియకుండానే నిద్రపట్టిపోతుంది. ఇక ఆ నిద్రలో ఏనుగుల్ని పెట్టి తొక్కించినా మెలకువ రాదనటం ఏమంత అతిశయోక్తి కాదు. అయితే నిద్ర విషయంలో సుబ్బారాయుడు ఇంత బాధపడలేదు. "శంభో శంకర” అంటూ తారక మంత్రాన్ని జపిస్తూ వుంటే, ఒకసారి గురకపెట్టి నిద్ర పెడుతూవున్న తన భార్య ఇంకొకసారి కాపరానికి వెడుతూ వెనక్కి తిరిగిచూచి, కన్నీళ్ళు పెట్టిన కూతురు మరోసారి “తదనంతరము పాండవాగ్రజుడు...”అంటూ దీర్ఘాలు తీసే అయ్యవార్లంగారు తెర తొలగించుకువచ్చినట్టుగా తొంగిచూచారు.

వాళ్ళని తెర వెనక్కి తరిమివేయడానికా అన్నట్టు సుబ్బారాయుడు మరింత బిగ్గరగా "శంభోశంకర" అంటూ మననం చేసుకోనారంభించాడు. ఇలా చేస్తూ వుండగానే ఎప్పుడోగాని నిద్రపట్టిపోయింది.

పొద్దు రెండుబారలు ఎక్కేవరకు తిరిగి సుబ్బారాయుడుకి మెలకువ రానేలేదు. అసలు అప్పుడైనా మెలకువ వచ్చేదోలేదో! ఎండ కళ్ళలో పొడిచి, అతడికి మెలకువ తెప్పించింది. నెమ్మదిగా కనురెప్పల్ని విప్పి, ఎండ సరా ఆ తరువాత నాలుగైదు సార్లు ఆర్పి... చల్లగా లేచి కూచున్నాడు. ఒక్క క్షణంపాటు "ఇదేమిరా ఇక్కడున్నాను! కాల్వగట్టున ఆ చెట్టుక్రింద ఇదేమిటి ?" అని విస్తుపోయాడు. అంతలోనే గత వృత్తాంతమంతా జ్ఞాపకం వచ్చింది. చీకటితో లేచి, కృష్ణాస్నానంచేసి, కొండకు వెడతామని అనుకున్నాను. కాని, ఇంత ప్రొద్దెక్కేవరకు నిద్ర మెలకువే రాలేదు. ఈ చెట్టు క్రింద ఇలా పడుకుంటే జనం ఏమనుకున్నారో ఏమిటో? పాడు నిద్ర! ఎంత పని చేసింది అని లోలోపల కొంత సిగ్గుపడ్డాడు కూడా! పిచ్చివాడో! బిచ్చగాడో చెట్టుక్రింద పడివున్నాడని తనను ఎవరైనా చూస్తున్నారేమోనని, నాలుగు దిక్కులకూ పరకాయించి చూచాడు. ముందు ఎవ్వరూ కనబడలేదుగానీ మరికొంత జాగ్రత్తగా చూచేసరికి జిల్లేడు చెట్ల చాటున కొందరు, పొలాలలో కొందరు, ఏమి అడ్డుచేసుకోకుండా బహిరంగంగానే కొందరూ మొత్తం పది పదిహేను మంది ఆ చుట్టుపక్కల బహిర్దేశానికి కూర్చుంటూ కనబడ్డారు. "ఛీ! ఛీ వచ్చి ఈ పాడుచోట పడుకున్నాను. ఇక్కడ రాత్రి చేశాను గూడా! కుళ్లు నీళ్ళు! నా ఖర్మ కాలితే వాటిని ముంచుకు తాగాను! బాగా బతికినవాడికి ఎంత గతిపట్టింది?" అని సుబ్బారాయుడు జుగుప్స పడ్డాడు. కాని, అంతలోనే తపస్సుకోసం బయల్దేరిన వాడు ఇలాంటి అభిమానాల్ని చంపుకోవాలి గదా అని తోచింది. ఈ భావాన్ని సమర్ధించటానకి ఇంకొక ఆలోచనకూడా తట్టింది. కేవలం బహిర్భూమిలో తాను రాత్రంతా గడిపినప్పటికీ తనకు పాడుకంపు కాస్తయినా కొట్టలేదు. ఇది కేవలం ఆ పరాత్పరుడి మహిమ అయి వుండాలి. చీకటిలో కన్ను గానక నా భక్తుడొకడు ఇలాంటి చోటికి వచ్చాడు. ఇక్కడ వున్న దుర్వాసన నుంచి ఇతనిని రక్షించాలి అని ఆ దేవదేవుడు అనుకొని వుండాలి లేకపోతే తాను క్షణమైనా అక్కడే నిలబడి వుండగలిగేవాడా?

ఈ ఆలోచన సుబ్బారాయుడికి తపస్సును గురించి వున్న పట్టుదలను మరింత గట్టిపరచింది. "అడుగడుక్కి ఆ సర్వేశ్వరుడు తన మహిమ చూపుతున్నాడు. ఇక నాకు కావలసింది ఏముంది? త్వరలోనే ఆయన సాక్షత్కార భాగ్యంగూడా నాకు లభిస్తుంది." అనుకుంటూ అతడు కృష్ణకు వెళ్ళి, స్నానం చేసుకొని, ఆ పుణ్యజలాన్ని చెంబునిండా పట్టుకొని కొండ పైకి ఎక్కి వెళ్ళాడు. ఎండను పడ్డంవల్లా కొండ ఎక్కడం కొంత శ్రమ అయినప్పటికి పది-పదిన్నర ప్రాంతాలకు అతడు కనకదుర్గగుడి చేరుకొని ఆ మహాతల్లి దర్శనం చేసుకొన్నాడు. (అసంపూర్ణం)

*(ఈ నవలిక తొలుత న్యూ హ్యూమనిస్టు పత్రిక ఆగష్టు, సెప్టెంబరు, అక్టోబరు **1993** సంచికలో ప్రచురణ జరిగింది)*

పురాణ వైరాగ్యం - (నవలిక) పూరణ

(నార్లవారు అసంపూర్తిగా మిగిల్చిన నవలికను శ్రీమతి పైడి చంద్రలత పూరించారు.)

సుబ్బారాయుడు ఆ మహా తల్లిని మరోసారి కనులారా చూసుకున్నాడు. ఎందుకోగాని, సింహాన్ని, దాని కోరల్ని చూస్తే మాత్రం సుబ్బారాయుడికి కొంచెం జంకు కలిగింది. గబుక్కున వెనక్కు తిరిగి మల్లేశ్వరుని మందిరానికి దారితీసాడు.

మల్లేశ్వరుడు సాక్షాత్తు పరబ్రహ్మ తపోఫలమైన జ్యోతిర్లింగమట. బ్రహ్మ మల్లికదంబక పుష్పాలచే అర్చన చేయడం వల్లనే ఆయన మల్లికేశుడయ్యాడట. అంతటి మహత్తు కలిగినా, ఆ దేవదేవుడు కాలవశాన అంతర్హితమయ్యాడట. పూజారి ఘంటారావంతో సుబ్బారాయుడి ఆలోచనలకు అడ్డుపడింది. సుబ్బారాయుడి హృదయం బరువెక్కి మళ్ళీ ఆనందంతో తేలికయ్యింది. శరీరం కూడా తేలికగా, గాలిలో తేలినట్లనిపించింది.

సుబ్బారాయుడు పూజారి అందించిన హారతి కళ్ళకు అద్దుకున్నాడు. పళ్ళెంలోని విభూతి ముఖాన దిద్దుకున్నాడు. కొత్త ఉత్తేజం ఆవహించినట్లయింది. ఆ ఉత్సాహంతో అప్రయత్నంగా."శంభోశంకర మహాదేవ" అంటూ ఆలయం కప్పు ఎగిరేలా ఓ కేక పెట్టాడు. హారతి పళ్ళెం చేతిలో పట్టుకొని, సుబ్బారాయుడినే చూస్తూవున్న పూజారి, ఉలిక్కిపడి వెనక్కి జరిగాడు.

పరబ్రహ్మ అర్జునుడు తపస్సు చేసిన పుణ్యస్థలాన తపస్సు చేయబోతున్నానన్న ఆలోచనే సుబ్బారాయుడికి వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చింది. ఇంకోసారి ఆ దివ్యమంగళమూర్తి ఎదుట సాగిలపడి, ఆ ఊపుతోనే బయటకు వచ్చాడు.

అప్పటికే ప్రతాపం చూపుతోన్న ఎండ వల్ల చురుక్కుమంటోన్న కొండరాళ్ళ మీదుగా, సుబ్బారాయుడు కూర్చోవడానికి అనువుగా వున్న ఓ చెట్టు కిందికి చేరాడు. చెత్తా చెదారాన్ని కాస్త పక్కకు నెట్టి, ఉత్తరీయాన్ని పరుచుకొని చతికిల పడ్డాడు.
అలా కూర్చున్నాడో లేదో సుబ్బారాయుడికి ఓ సందేహం వచ్చింది. అయ్యావార్లంగారు కొందరు ముక్కు మూసుకొని, కొందరు చెట్లకు వేళ్ళాడుతూ, ఇంకొందరు ఒంటికాలిమీద, మరికొందరు తలకిందులుగా తపస్సు చేస్తారని చెప్పారు గానీ, కూర్చుని ఎవరైనా తపస్సు చేసినట్లు చెప్పారా? ఆ... చెప్పే వుంటార్లే !

తనే విని వుండడు. లేకపోతే, మేనక వచ్చి విశ్వామిత్రుడి వళ్ళో వాలిందంటే, అతను కూర్చునే వుండి వుండాలిగా. నారద మునీంద్రుల వారు ఒంటి కాలి మీద తపస్సు చేస్తే మంచిదన్నారు. నిల్చుంటేనే కళ్ళు గిరగిరా తిరుగుతున్నాయి. భగవద్దర్శనము కాస్త ఆలస్యమైనా కూర్చుంటేనే మేలు.

సుబ్బారాయుడికి ఇంకో ఆలోచన తట్టింది. తను తపస్సు చేస్తే కూడా రంభ, ఊర్వశి, మేనకలు వస్తారా?ఏమో! రావచ్చును కూడా. ఆ ఇంద్రుడికి భూలోకంలో ఎవరు తపస్సు చేస్తున్నారన్నా భయమట! పాపం! గభాల్న ఆ ఆడకూతుర్ని వాళ్ల మీదికి వదుల్తాడంట! తను వద్దకు కూడా ఎవరినైనా పంపితే కాస్త మెళుకువగా వ్యవహరించాలి. సుబ్బారాయుడు గుండెల నిండా గాలి పీల్చుకొని వదిలాడు. బాసింపట్టు వేసుక్కూర్చున్నాడు. కళ్ళు మూసుకొని, నారదమునీంద్రుడు ప్రసాదించిన రుద్రాక్షమాలలోని రుద్రాక్షలను లెక్కిస్తూ "శంభోశంకర మహదేవ" అని జపించడం మొదలు పెట్టాడు.

కనకదుర్గమ్మ, సింహము, మల్లేశ్వరుడు - ఇంద్రుడు, రంభ అప్సరసలు - సుబ్బారాయుడి మనోపథంపై ఒకరి తరువాత ఒకరు పరుగులు తీసారు. అప్సరసల వెనగ్గా లీలగా ఓ ఆకారం కన్పించింది. ఆ ఆకారం కొరకొరా చూస్తున్న ఇంటావిడది కదూ? నిద్రలో రాముడని, భీముడని కలవరించేవాడివి. ఇప్పుడు రంభని, మేనకని పలవరిస్తున్నావా? అన్నట్టుగా లేదా చూపు ! ఇంటిది తపస్సు కూడా ప్రశాంతంగా చేసుకోనీదు కాబోలు ! అప్సరసలు వస్తారని అసూయేమో? నిజం చెప్పాలంటే, వాళ్ళని చూడాలని తనకూ కుతూహలంగా వుంది.

అయ్యవార్లంగారు వర్ణించి చెప్పినట్లుగా వుంటారా అన్న ఆసక్తి తప్ప ఇంకే ఆలోచనా లేదు. తన ఆలోచనలు తపస్సు నుండి పక్కదారి పడుతున్నాయేమిటి? ఇందులో ఇంద్రుడి హస్తమేమయినా వుండి వుంటుందా? ఏమైనా తను నిబ్బరంగా వ్యవహరించక పోతే, తపస్సు పురిట్లోనే సంధి కొట్టినట్లవుతుంది.

సుబ్బారాయుడు క్రితం రాత్రి తిన్నదే (ఇడ్లీలు, వడలే) కాని, పొద్దుటి నుంచి కడుపులోకి ఓ మెతుకు కూడా పడలేదు. ఆకలి మంట చురచురా మంటూ కడుపును కార్చిచ్చులా కాల్చేస్తుంది. కాసేపటికే ఆ మంటలు చల్లారాయి. శరీరంలోని ఒక్కోభాగం తిమ్మిరి ఎక్కి నట్లయ్యింది. చెవులు దిబ్బళ్లు పడ్డాయి. సుబ్బారాయుడు కూర్చుని వున్నాడే కానీ, తెలిసి తెలియని అపస్మారక స్థితిలో వున్నాడు. చుట్టూ పెరిగిన ఎండ వేడిమి కానీ, లోలోపల దహిస్తోన్న ఆకలి వేడి కానీ సుబ్బారాయుడిని కదిలించలేదు. కోరిన దొరికిన తారక మంత్రస్మరణలో తనను తానే మరిచాడు. ఇక వాటి సంగతి వాటికే ఎరుక !

పట్టుమని పదినిమిషాలు తారకమంత్రం జపించాడో లేదో, పాదాల మీద ఒక్కసారిగా సూదులు దిగబడినట్లయింది. దాంతో అంతటి ధ్యానంలో నుంచి సుబ్బారాయుడు స్పృహ లోకి వచ్చాడు. ఈసారి ఇది ఖచ్చితంగా ఇంద్రుడి పనే! ఏమైనా సరే తన దీక్షను వదిలేది లేదు. ఈ విషయాన్ని జాగురూకతతో చక్కబెట్టాలి. సుబ్బారాయుడు కళ్ళు గట్టిగా మూసుకుని, తన మంత్రం ఇంకా వేగంగా జపించసాగాడు.

సుబ్బారాయుడి పాదాల మీద నుంచి మోకాళ్ళ దాకా సూదులు పోట్లు ఎక్కువయ్యాయి. తిమ్మిరి ఎక్కిన కాళ్ళ మీద సూదుల పోట్లు శూలాల పోట్లులాగా అన్పించాయి సుబ్బారాయుడికి. అరె ! ఇంత తొందరగా తను తపస్సు చేస్తున్న వార్త స్వర్గానికి చేరి వుంటుందా? సీత బాధలు సీతవయితే పీత బాధలు పీతవట. ఇక్కడ ఎవరైనా తపస్సు చేస్తుంటే అక్కడ తన పదవికి ముప్పని ఇంద్రుడికి భయమట. ఏంటో పాపం ! ఆ ఇంద్రుడు స్వర్గాన్ని ఏలుతున్నాడన్న మాటే కాని సుఖమెక్కడ ఏడిచింది? ఈ భూలోకం మీద ఎప్పుడూ ఓ కన్నేసి వుంచాలయ్యే ! తన వెర్రి కానీ, ఒక్క కన్నేం ఖర్మ !అయ్యవార్లంగారు ఇంద్రుడికి వళ్ళంతా కళ్ళని చెప్పలేదూ? రెండు కళ్ళతో అప్సరసల నృత్యం చూస్తూన్నా, మిగిలిన కళ్ళు ఇలాంటి పనులు చేస్తూ వుంటాయోమో? ఏమైతే ఏమి కాని, ఇంద్రుడి దృష్టి తనమీద ఇంత తొందరగా పడడం, తన అదృష్టం కాదు మరి? ఇంద్రుడి కన్ను ఎలాగూ పడింది. ఇంకా సేపు ఓపిక పడితే ఆ మహేశ్వరుడి దృష్టి కూడా తన మీదికి మరలుతుందేమో?

మరోమారు నారద మునీంద్రుల వారి ఉపదేశాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని, సుబ్బారాయుడు తపస్సు కొనసాగించాడు. సుబ్బారాయుడు "శంభో" అనగానే చుర్రు మంటూ శూలాలు గుచ్చుకుంటున్నాయి. వీటికి తోడు సుబ్బారాయుడి బుర్రమీద దబ్బున ఏదో పడింది. మూలిగే నక్క మీద తాటిపండు పడినట్లయింది. దిమ్మ తిరిగి పోయి, సుబ్బారాయుడు కళ్ళు తెరిచాడు. మొత్తానికి ఇంద్రుడు భలేవాడే! పిడుగులు కురిపిస్తున్న ట్లున్నాడు.

సుబ్బారాయుడు బుర్ర తడుముకున్నాడు. బొప్పికట్టింది. సుబ్బారాయుడి దృష్టి తన కాళ్ళ మీద పిడింది. బెల్లం ముక్కను పట్టుకున్నంత ఆనందంగా సుబ్బారాయుడి కాళ్ళను పట్టుకొని వున్నాయి, చీమలు. సుబ్బారాయుడు గెంతులేస్తూ, వాటిని దులుపుకున్నాడు. కాళ్ళు దద్దుర్లతో ఎర్రగా కమిలి పోయి వున్నాయి. చెంబులోని నీటిని దద్దుర్ల మీద చిలకరించాడు. ప్రాణం కాస్త కుదుట పడింది.

శివుడాజ్ఞ లేనిదే చీమయైనా కుట్టదంటారు. ఆ మహాదేవుడు ఒక్కసారిగా ఇన్నింటికి ఆజ్ఞ ఇచ్చేసాడేమో! సుబ్బారాయుడికి ఆ సర్వేశ్వరుడి ఆగ్రహానికి కారణం తోచలేదు. అప్సరసల మీదికి ఆలోచనలు మళ్ళడం వల్లనా? అయివుండ వచ్చును. సుబ్బారాయుడు గట్టిగా లెంపలు వేసుకొన్నాడు. మనోచిత్రం పై ఇంటిది ప్రత్యక్షమై ముసిముసి నవ్వులు నవ్వింది. సుబ్బారాయుడు మల్లికేశ్వరుని ఆలయ శిఖరం చూసి, క్షమాపణలు చెప్పకుందామని తల పైకెత్తాడు. పైనున్న చెట్ల కొమ్మల మాటునుండి ఓ కోతిపిల్ల తొంగి చూసి, కిచకిచమని నవ్వింది. ఆంజనేయస్వామి వారు కూడా సమయానికి వేంచేయడం సుబ్బారాయుడికి శుభప్రదంగా తోచింది. సుబ్బారాయుడు కళ్ళు మూసుకొని, హనుమంతులవారిని ధ్యానించాడు. ఆ కోతిపిల్ల ఇంకోసారి ఇకిలించి, చేతిలోని కొబ్బరి చిప్పను ఆటూఇటూ తిప్పిచూసి, సూటిగా సుబ్బారాయుడి నెత్తిన పడేసింది. ఇందాక నెత్తిన విరుచుకు పడిన పిడుగేమిటో సుబ్బారాయుడికి అర్థమయింది. అప్పటికే నిరాహారంతో కళ్ళు బైర్లు కమ్ముతోన్న సుబ్బారాయుడు ఆ కొద్దిపాటి దెబ్బకు తట్టుకోలేక, కింద కూలబడ్డాడు. కోతిపిల్ల చెంగు చెంగున గెంతుతూ మాయమయింది. సుబ్బారాయుడు తేరుకొని చుట్టూ చూసాడు. కొబ్బరి చిప్ప వెక్కిరిస్తూ చూస్తోంది. సుబ్బారాయుడు విదలగొట్టిన చీమలు, అప్పటికే బారులు తీరి, మొదటి చిప్ప మీద దాడి చేసేసాయి. రెండో చిప్ప వైపు వేగంగా వస్తున్నాయి. ఎంతయినా హనుమంతుల వారి ప్రసాదం ! సుబ్బారాయుడు వాటికన్నా వేగంగా కదిలి, చిప్పను చేతిలోకి తీసుకొన్నాడు. తేలిపోతున్న కాళ్ళను స్వాధీనంలోకి తెచ్చుకొని, చెంబును, ఉత్తరీయాన్ని తీసుకొని, కాస్త పక్కగా వెళ్ళి, చతికిల పడ్డాడు.

ఏ మాట కా మాటే చెప్పుకోవాలి గానీ, తన ఇంటిది తను ఆకలికి తాళలేనని, సమయానికన్నా ముందే అన్నీ సిద్ధం చేసి వుంచేది. మైవేళ భోజనంతో పాటు, కాస్త పొద్దెక్కాక తినడానికి వీలుగా తపాల చెక్కలు, ఖజ్జికాయలు, జంతికలు, బూరెలు ఏవో ఒకటి పొలానికి పంపేది. ఆ రోజు రాత్రి కూడా తాను చేయి చేసుకోబట్టి కానీ, లేకపోతే అన్నం పెట్టకుండా వుండేదా ! అప్పుడేదో కోపంలో అలిగి ముసుగెట్టింది. తెల్లారి లేచి ఊరంతా ఏకంచేసి వుండదూ ! ఆ ! దానికి అంత వివరమయితే తనిలా కొండలు కోనలు పట్టేవాడా? చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవ అని చేసుకున్న దానికి ఇన్నాళ్ళు అనుభవించాడు. మళ్ళీ ఆ సంసారజాలంలో బుద్దెరిగి చిక్కడు. ఆజన్మబ్రహ్మచారి ఆంజనేయస్వామియే తన పక్కన వున్నాడు. సుబ్బారాయుడు కొబ్బరి చిప్పను ప్రసాదించిన హనుమంతప్పను మరోసారి ధ్యానించి, తపస్సు మొదలుపెట్టాడు.

సుబ్బారాయుడు తపస్సు తిరిగి మొదలు పెట్టాడన్న మాటేకాని, మనసు లగ్నం కాలేదు. 'నిన్న నారద మునీంద్రుల వారు తారకమంత్రాన్ని ఉపదేశించడం, ఈ రోజు హనుమంతులవారు మహాప్రసాదాన్ని అందించడం - అన్నీ మంచి శకునాలే! తన తపస్సు ఫలించే తరుణం సమీపించినట్లుగా ఉంది. ఆ మహాదేవుడు సాక్షాత్కరిస్తే ఏమి కోరాలి? ఎలా ప్రస్తావించాలి? కుంభకర్ణుడు ఘోరాతిఘోరంగా తపస్సు చేసినా, చివరి నిమిషాన సరస్వతీదేవి ఆయన నాలుక మీద ఏదో గీసేసి, తిండిని, నిద్రని కోరుకునేలా చేసిందట. ఆయన రాక్షసుడు కాబట్టి దేవతలంతా కలిసి, అలా చేశారనుకోవచ్చు. ఏమైనాగానీ, ఏం అడగాలో ముందే నిర్ణయించుకోవడం మంచిదనిపిస్తోంది.

తన పొలాన్ని ఆనుకొనివున్న మాగాణిని ఎన్నాళ్లగానో కొనాలనుకొంటున్నాడు. కూతురి పెళ్ళి చేయాల్సిరావడంతో ఆ ఆలోచనను వాయిదా వేశాడు. ఆ పొలం ఇప్పించమని కోరితే? పొలాన్ని చూసైనా అల్లుడు తన ఇంటికి వస్తాడేమో? ఆయనగారు శత మొండి! తిక్కరేగితే భగవంతుడ్నే ధిక్కరించగలడు.

ఇంటిది ఇంట్లో మనమలు మనుమరాళ్ళు తిరగాలని ముచ్చట పడుతోంది. కూతురి కడుపు పండాలని కోరితే? అల్లుడు రాకపోతే మానే పిల్లల్నైనా తమ దగ్గరికి పంపేట్టు బుద్ధి పుట్టించమని వేడుకొంటాను. అయ్యో, మళ్ళీ ఆ సంసారపు ఆలోచనలే వస్తున్నాయే! అదృష్టం అందల మెక్కిస్తానంటే బుద్ధి బురదలోకి లాగిందట. అసలు భగవంతుని సాక్షాత్కార భాగ్యం ఉండద్దూ? తరువాతే ఆయన కటాక్ష వీక్షణం!

సుబ్బారాయుడు తర్జనభర్జనలు చేసుకొని, ఎటూ తేల్చుకోలేక మళ్ళీ తపస్సు మొదలు పెట్టాడు. పది నిమిషాలు అటూ ఇటూ ఊగిసలాడినా, కాసేటికే ధ్యానంలో మునిగిపోయాడు. ఇంతలో ఓ కాకి నీళ్ళను వెదుక్కుంటూ వచ్చిందో ఏమో, తిన్నగా సుబ్బారాయుడి చెంబు దగ్గర వాలింది. నీళ్ళు తాగడానికి ప్రయత్నించింది. అది అందకపోవడంతో, కాళ్ళతో విసురుగా చెంబును తన్ని ఒక్కసారిగా ఎగిరింది. ఆ చెంబు కొండరాళ్ళ మీదుగా దడదడ లాడించుకొంటూ కిందికి పడింది. సుబ్బారాయుడి చెవిన ఈ శబ్దం పడగానే ఎక్కడలేని ఆనందం కలిగింది. 'ఆ ఇంద్రుడు కొండరాళ్ళు దొర్లిస్తున్నాడేమో? తను నిగ్రహంగా ఉండాలి'. సుబ్బారాయుడు నిటారుగా కూర్చుని, చెవులు రిక్కించాడు. శబ్దం మళ్ళీ రాలేదు.

కాకి కిందకు దొర్లిన నీటిని ఆనందంగా తాగింది. సుబ్బారాయుడు కూర్చునివున్న చెట్టు కొమ్మ మీద వాలి, ఊయలలూగడం మొదలుపెట్టింది.

సుబ్బారాయుడు ఆ మల్లికేశ్వరుని మనసులో నిలుపుకొని ధ్యానం కొనసాగించాడు. నారద మునీంద్రుల వారు చిరునవ్వుతో అభినందించారు. సుబ్బారాయుడు రెట్టింపు ఉత్సాహంతో తపస్సులో మునిగాడు. కాసేపటికి, సుబ్బారాయుడి తల మీద ఏదో చల్లనిది జల్లులా పడింది.

సుబ్బారాయుడికి అయ్యంవారం గారు తపస్సు ఫలించే ముందు దేవతలు పూల వర్షం కురిపిస్తారని చెప్పడం జ్ఞాపకం వచ్చింది. నందనవనంలో పూలు మంచులో తడిసినట్లున్నాయి. సుబ్బారాయుడికి చల్లగా తగిలాయి. ఈ విరులు ఆ భగవంతుని ఆగమనానికి శుభసూచనలు, సుబ్బారాయుడు సంబరపడిపోయాడు. కొద్దిసేపటికి, ఆ పూరేకులు సుబ్బారాయుడి తలపై నుండి ముఖం పైకి జారాయి. ఏదో ఒక విధమైన వాసన సుబ్బారాయుడి ముక్కుల్ని తాకింది. గబుక్కున కళ్ళు తెరిచి, చేత్తో ముఖం తుడుచుకున్నాడు. కాకి రెట్ట!

సుబ్బారాయుడు తల పైకెత్తి చూశాడు. ఆ కాకి చిద్విలాసంగా జయలలు ఊగుతోంది. "చీచీ పాడు కాకి! పాపిష్టిది! తపస్సు చేసుకొంటున్నానన్న ఇంగితజ్ఞానం లేకుండా... ఛీ! ఛీ! అప్సరసలు వచ్చేముందు నెమళ్ళు నాట్యం చేస్తాయట. కోయిలలు పాటలు పాడుతాయట. కానీ ఈ ఛండాలపు కాకి ఎక్కడ నుంచి దాపురించింది? అవశకున పక్షిలా!' చిన్న మట్టి పెళ్ళ తీసి, కోపంగా కాకి మీదకి విసిరాడు సుబ్బారాయుడు. ఆ కాకి కావ్ కావ్ మంటూ గొంతు చించుకుని అరుస్తూ, ఎగిరిపోయింది.

సుబ్బారాయుడి మనసంతా వికలమైంది. 'ఆ కాకి తన తపస్సు భంగం చేయడానికి వచ్చిన కాకాసురుడేమో! కాకాసురుడు అంటే ఎవరో, ఎలా ఉంటాడో, అసలు సురుడో, అసురుడో తనకు జ్ఞాపకం లేదు. ఆ గుర్తుకు వచ్చింది. అయ్యవార్లంగారు కృష్ణవేణీ మహత్మ్యం గూర్చి చెప్పేటప్పుడు, కాకిని గూర్చి గూడా చెప్పారుగా! సాక్షాత్తు ఆ గంగాదేవి కాకి రూపం పొంది, తన పాపక్షయార్థం ప్రతిదినం కృష్ణవేణీ నది కేతించి, స్నానము చేసి,

శుద్ధురాలై హంస రూపాన స్వస్థానం చేరుతుందట? ఎంత మూర్ఖుణ్ణి! ఆ గంగమ్మ తల్లిని పట్టుకొని ఊరకాకి అని భ్రమపడి, నానా తిట్లు తిట్టాను కదా. అపరభక్తుడు రామదాసు కూడా రాముడికి తన మొరను నేరుగా కాక సీతమ్మ ద్వారా వినిపించాడు. నేనెంత తెలివితక్కువ వాణ్ణి! ఆ ఈశ్వరుని ధర్మపత్నిని పాడు కాకిగా భావించాను. నా ఈ పాపానికి ప్రాయశ్చిత్తం ఉండదేమో! మహేశ్వరుడికి అనవసరంగా కోపం తెప్పించాను. పొద్దుట్నించీ చేసిన తపస్సు సంగతి . అటుంచీ, ముందు ఆ రుద్రుడ్ని ప్రసన్నం చేసుకోవాలి.

సుబ్బారాయుడు తెగబారెడు నిట్టూర్పు విడిచాడు. అప్పటి వరకు లేని నీరసం ఒక్కసారిగా ఆవహించింది. శోష వచ్చినట్లయి, కింద పడిపోయాడు. ఎంత సేపలా పడివున్నాడో అతనికే తెలియదు. చాలాసేపటి తరువాత, సుబ్బారాయుడికి ఎవరో తనను పిలుస్తున్నట్లుగా తోచింది. నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.
ఎవరో కాషాయాంబరధారి. ఆజానుబాహుడు. ఒక చేతిలో త్రిశూలం. ఇంకో భుజం నుంచి జోలె వేళ్ళాడుతూ ఉంది. భుజాల మీదుగా మోచేతుల్ని దాటిన జటాఝూటం. ఫాలభాగం నిండేటు అడ్డంగా విభూతి రేఖలు. మధ్యన మెరుస్తోన్న కుంకుమ. మెడలో రుద్రాక్షల పేర్లు, అతని వస్త్రాలు ఎండకు ప్రజ్వలించి, అతని చుట్టూ దేదీప్యమానమైన తేజస్సు అగుపిస్తుంది.

సుబ్బారాయుడి నోట మాట రాలేదు. ఆ భోళాశంకరుడు, ఆ భక్తజనపరాయణుడు, ఆ దేవదేవుడు ఇలా తన ముందు... ఇంత దగ్గరగా... నిలబడడంతో... ఏం చేయాలో, ఏమని సంబోధించాలో తెలియక... మూగవానివలె చేతులు జోడించి, ఆ మహాదేవుని చరణాల మీద బోర్లాపడ్డాడు. సుబ్బారాయుడు ఆనందబాష్పాలతో ఆ మహేశ్వరుడికి పాదపూజ చేశాడు. "ఏయ్! ఏంటిదీ? కాళ్ళు పట్టి లాగి కింద పడేస్తావా ఏమిటి? ముందక్కణ్ణించి లే!" విదిలించినట్లుగా అన్నాడతను.

ఆశీర్వదించాల్సిన వాడు ఛీత్కరించడంతో సుబ్బారాయుడు విస్తుబోయాడు. 'ఆ... అయినా ఆయన గరళకంఠుడు. ఆయన మాటలపై ఆ మాత్రం విషఛాయలు పడవు? మాట కటువైతేనేమి మనసు వెన్నట'. సుబ్బారాయుడు స్వామివారిని తేరిపార జూశాడు. చేతులు జోడించి ప్రాధేయపూర్వకంగా అన్నాడు - "దాసుడి తప్పు కాయండి. తెలియక ఏమైనా నేరం చేసివుంటే మన్నించండి".

"ఏంటీ? తెలియక చేశావా? ఇంకోళ్ళ స్థలంలో కూర్చోకూడదని తెలీదూ? ఇవాళ కనకదుర్గా లయంలో లక్ష కుంకుమార్చనలు చేసుకోవడానికి ఆడ జనాలు తండోపతండాలుగా వస్తారని తెలీదూ? ఇదుగో.. నా దగ్గర నీ ఆటలు సాగవు. తిన్నగా లేచి ఇంకో చోటు చూచుకో పో!" కటువుగా పలికింది అతని కంఠం.
"ఆగ్రహించకండి స్వామీ! అనుగ్రహించండి!".

"నా కడుపు కొట్టడానికి శనిగ్రహంలా దాపురించి అనుగ్రహించమంటున్నావా? ఏం నాయనా? వళ్ళు ఎలా ఉంది?" అతను తన్నడానికి మీదికి వచ్చాడు.

సుబ్బారాయుడి పై ప్రాణాలు పైనే పోయాయి. అతని వైపు అయోమయంగా చూశాడు. "ఈయన అలా విరుచుకుపడుతున్నా డేమిటి? నారద మునీంద్రులవారు భోళాశంకరుడు తేలిగ్గా కరుణిస్తాడని చెప్పారుగా! ఈ స్వామివారు అలా చిందులు తొక్కుతున్నారే? బహుశా ఇదే తాండవ నృత్యవిన్యాసమేమో? తన జన్మ తరించింది.

అయినా, అయ్యవార్లంగారు చెప్పినట్లు పులి చర్మం లేదు. మెడలో నాగరాజు లేదు. తలపై నెలవంక లేదు. కానీ, ఈ ఇంద్రకీలాద్రిపైనే అర్జునుడికి పాచుపదాస్త్రం ప్రసాదించేముందు, ఆ మహేశ్వరుడు కిరాతకుడిగా ప్రత్యక్షమై పరీక్షించాడు కదా? తనను ఈ రూపంలో పరీక్షిస్తున్నట్లున్నాడు. జాగురూకతతో వ్యవహరించాలి. సుబ్బారాయుడు గొంతు సవరించుకొని ఆయన్నే చూస్తూ అన్నాడు "అయ్యా! కోపగించకండి. దాసుణ్ణి కరుణించండి. మీరు పులి చర్మధారులని విన్నాను. మరి తమరేమో...?"

"నా గురించి ఇంతకు మునుపే విన్నావా?" అతను కాస్త మెత్తబడి, ఆశ్చర్యంగా అడిగాడు.
"అవును స్వామీ! మా అయ్యవార్లంగారు పురాణ కాలక్షేపాలలో చెప్పారు. మీరు పులి చర్మాలు ధరిస్తారనీ, త్రిశూలధారులనీ... కానీ మీరిలా కాషాయ వస్త్రాలు ధరించారేమి ప్రభూ?" సుబ్బారాయుడు వాటిపై నుండి దృష్టి మరల్చకుండా అడిగాడు.

"ఇప్పటి కాలంలో పులి చర్మా లెక్కడివి? నిజం చెప్పాలంటే, పోయిన శీతాకాలంలో నైజాం బండిలో నాకు దొరికిన గొర్రెబొచ్చు గొంగళిని ఎరుగుదును. పులి చర్మాలు కానీ, కనీసం చెవుల పిల్లి చర్మాలు కానీ నేను పుట్టి, బుద్దెరిగాక ఎరగను" సుబ్బారాయుడి సందేహానికి ఆశ్చర్యపోతూ అన్నాడతను.

సుబ్బారాయుడికి స్వామి వారి కోపం తగ్గుముఖం పట్టడం ఆనందాన్ని కలిగించింది. కానీ, ఇంకా తనను ఆటలు పట్టించడం ఎందుకో అర్థం కాలేదు. సుబ్బారాయుడి పరిస్థితి పిల్లాడి ముందు తాయిలం పెట్టి, అందించకుండా ఊరించినట్లుగా ఉంది.

"స్వామీ, ఇంకా ఈ తెలివితక్కువ వాణ్ణి పరీక్షిస్తున్నారా? పొద్దుట్నుంచి పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టకుండా, తమ దర్శన భాగ్యం కోసం వేచివున్నానే! నాపై మీకింకా కనికరం కలగలేదా?" సుబ్బారాయుడి కంఠం దీనంగా పలికింది.

"నా కోసం అన్ని తిప్పలెందుకు? ఇందాక కాస్త పనుంటే అలా వెళ్ళాను కానీ, లేకపోతే ఎప్పుడూ ఈ మెట్ల మీదే పడివుంటాగా?" విస్మయంతో అన్నాడతను.
మహేశ్వరుడి భోళాతనానికి సుబ్బారాయుడు ప్రసన్నుడయ్యాడు. అయ్యవార్లంగారు చెప్పినట్లుగా, నారద మునీంద్రుల వారు సెలవిచ్చినట్లుగా ఆ భక్తపరాయణుడు, ఆదరాన్ని చూపించడంతో తబ్బిబ్బైపోయాడు సుబ్బారాయుడు.

"విధాతను తరింపజేసిన మీరు, విజయునికి పాచుపదాస్త్రం... కాదు... కాదు... పాశుపతాస్త్రం ప్రసాదించిన మీరు ఈ మందమతికి దర్శనభాగ్యం కలగజేయడం, నా పూర్వజన్మ సుకృతమే స్వామీ!" అన్నాడు సుబ్బారాయుడు తడిగట్టిన కళ్ళతో.

సుబ్బారాయుడి కంఠంలో తొణికిన ఆర్ద్రతకు అతడు సంతుష్టుడైనా, కాస్త అయోమయంలో పడ్డాడు. ఏమాత్రం దాచుకోకుండా అడిగాడు, "ఈ విధాత, విజయుడు ఎవరు? మీ ఊరి వాళ్ళా? వాళ్ళని నే నెరగనే? నీవే ఎవరివో తెలీక నేను చస్తుంటే ఎవరెవరి గురించో మాట్లాడుతున్నావే? అయినా, నీళ్ళల్లో నాచు తెల్సు కానీ, ఈ పాచు...

పాచుపతాస్త్రం ఏమిటి?" "స్వామీ, ఈ భక్తుణ్ణి ఇంకా పరీక్షిస్తున్నారా? మీరు భక్తులు ఓ యనగానే కో అంటూ ప్రత్యక్షమై, కోరుకోగానే కోటివరా లొసిగే మల్లికేశ్వరుల వారు కదా?"

"నా పేరు మల్లికేశ్వరుడు కాదయ్య. వెంకటాచలపతి. నువ్వు నన్నెవరనుకొంటున్నావో ఏమో?" తేల్చి చెప్పేసాడతను.

సుబ్బారాయుడు తనను ఎవరో అనుకొని పొరపాటు పడ్డాడని అతనికి అర్థమైంది. ఇందాకటి నుంచి సుబ్బారాయుడు కలిగించిన గందరగోళం స్పష్టమయ్యింది. అతను మళ్ళీ అన్నాడు - "నేనిక్కడే కూర్చుని కొండ మీదికి వచ్చే పోయే వాళ్ళను దానమడుగుతుంటాను".

"అల్పాత్ముల పాపాలను దానమడిగి, వారికి దండిగా పుణ్యాలను ప్రసాదించడం మీ అలవాటని అయ్యవార్లంగారు సెలవిచ్చారు లెండి" సుబ్బారాయుడు వినయంగా అన్నాడు.

"వీడెవడయ్యా మధ్యలో నా ప్రాణం మీదికి తెచ్చాడు. నేను మల్లికేశుడ్ని కాదంటే వినవే?" "అయ్యోయ్యో! అంత మాటనకండి, మీ నిజరూపాన్ని దాచాలన్నా దాచలేరు. మీ చేతిలోని త్రిశూలమే మీరెవరో తెలియజేస్తోంది" సుబ్బారాయుడు చలపతి చేతిలోని త్రిశూలాన్ని చూపుతూ అన్నాడు.

చలపతి కాస్త అయోమయంగా చూసి, తన చేతిలో వున్న సదరు త్రిశూలాన్ని చూసుకున్నాడు. చలపతి పగలబడి నవ్వుతూ, "దీన్నేనా నువ్వు త్రిశూలం అనేది? నా ఈ వేషం చూసి వెంటబడే ఊరకుక్కల్ని తరమడానికి, అప్పుడప్పుడు కోతుల్నుంచి కొబ్బరిచిప్పల్ని లాక్కోవడానికి పనికొస్తుందని ఇనుప చువ్వల దుకాణం నుండి ఎత్తుకొచ్చాను. కావాలంటే నువ్వు తీసుకో!" సుబ్బారాయుడి చేతికి అందిస్తూ అన్నాడు.

సుబ్బారాయుడు దాన్ని అందుకోడానికి భయపడ్డాడు. చలపతి మాట్లాడింది ఎంతో సేపటికి కానీ సుబ్బారాయుడికి అర్థమవ్వలేదు. ఐనా, ఇంకా అనుమానం తీరక అడిగాడు.

"ఐతే మీరు రుద్ర దేవులు కారా?"

"మళ్ళీ ఈయన ఎవరయ్యా బాబూ? నేను చలపతిని! వెంకటాచలపతిని!" నుదుటి మీద అరచేత్తో కొట్టుకుంటూ అన్నాడు చలపతి.

సుబ్బారాయుడు అప్పటి వరకు జోడించి వున్న చేతుల్ని, వళ్ళో పెట్టుకొని నిటారుగా కూర్చున్నాడు. చలపతి వంకే అర్థం లేకుండా చూస్తూ, అర్థం లేకుండానే అడిగాడు "మరి ఆ దేవదేవుడు, శ్రీమన్నారాయణుడు ఎక్కడ కనిపిస్తాడు?"
నీడను చూసి నిజమని భ్రమపడుతోన్న పసివాడిని చూసినట్లుగా చలపతి సుబ్బారాయుడి వంక చూశాడు.
"నీ దగ్గర పావలా ఉందా?" సుబ్బారాయుడి వైపు చేయి చాస్తూ అన్నాడు చలపతి,

"ఊహుఁ" చలపతి అసందర్భమైన ప్రశ్నకు సుబ్బారాయుడు ఆశ్చర్యపోయి, అడ్డదిడ్డంగా తలూపాడు.
"నా దగ్గిర ఉందిలే! నీవు శ్రీమన్నారాయణుణ్ణి చూస్తావా?".
"అంతకన్నా భాగ్యమా? ఎలా చూపిస్తావు? ఎక్కడ చూపిస్తావు?" సుబ్బారాయుడు గబగబ అడిగాడు.
"దుర్గ కళామందిర్".

"ఈ కనకదుర్గ మందిరం కాక ఈ ఊళ్ళో దుర్గమ్మకు ఇంకో మందిరం ఉందా? అక్కడ సులువుగా దేవుడు సాక్షాత్కరిస్తాడా?" ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారాయుడు.

"ఆ... పావలా ఇచ్చామంటే, మూడు గంటలపాటు దేవుణ్ణి కనులారా చూడొచ్చు".
సుబ్బారాయుడికి మతి పోయింది. బెజవాడ వాళ్ళు ఎంత తెలివిగల వాళ్ళు! తను అమాయకపు పల్లెటూరి మొద్దు కాబట్టి నానా తంటాలు పడుతూ కాలం వృధా చేశాడు. పావలా ఇస్తే తేలిగ్గా అయిపోయే దానికి రెండు రోజులు అనవసరపు శ్రమ పడ్డాడు. కాలయాపన చేశాడు. అయినా ఇలాంటి అవకాశం ఉన్నట్లు అయ్యవార్లంగారు మాటమాత్రం అనలేదే. ఆ... అయినా ఆయనీ మధ్య తమ వూళ్ళోనే పడి ఉంటున్నాడుగా! బెజవాడ సంగతులు పూర్తిగా తెలిసి ఉండవు. సుబ్బారాయుడికి చలపతి మీద నమ్మకం కుదిరింది. 'ఆ శ్రీమన్నారాయణుడు తనకు మోక్షాన్ని ప్రసాదించడానికి ఇతన్ని దూతగా పంపినట్లున్నాడు.
"ఎప్పుడెళ్దాం?" సుబ్బారాయుడు సంబరంగా అడిగాడు.
"మొదటి ఆటకి"?
"అంటే?"
"ఏముందీ? దుర్గ కళామందిర్లో 'భక్తప్రహ్లాద వేసేది ఈ రోజు మొదటి ఆటతోనేగా మరి! మధ్యాహ్నం ఆట సత్యహరిశ్చంద్ర వేశారు. అంతా ఏడుపేననుకో!"
ఆటలేమిటి? శ్రీమన్నారాయణుణ్ణి చూపిస్తానని ఆట మాటెత్తావే?"

ఆట అంటే లక్కపిడతల ఆటో, తోలుబొమ్మల ఆటో అనుకున్నావా ఏంటి? బెజవాడలో ఆట అంటే ఆషామాషీ కాదు. ఫిలిం ఆట. నీకెందుకు చెబుతున్నానంటే, నువ్వడుగుతున్న వాళ్ళు ఉండేది అక్కడే! మొన్నో ఫిలింలో రంభ, ఊర్వశి పోటీపడి నృత్యం చేశారు. కళ్ళు తిప్పుకోలేక పోయామనుకో! నేను మూడుసార్లు వెళ్ళానా ఆటకి!" ఊహల్లోకి జారిపోతూ అన్నాడు చలపతి.

"అయ్యవార్లంగారు కానీ, నారద మునీంద్రులవారు గానీ దేవతలు స్వర్గంలోనో, వైకుంఠంలోనో, కైలాసంలోనో ఉంటారని కదా అన్నారు. మరి ఇతనేమిటి ఫిలింలోనే ఉంటారంటున్నాడు? ఈయన వేషభాషలు చూస్తే తపోసంపన్నుడిలా ఉన్నాడు. ఈయన అబద్ధం చెప్తాడా?" సుబ్బారాయుడు గొంతు పెగల్చుకొని అన్నాడు.
"మా అయ్యవార్లంగారేమో తపస్సు చేస్తే భగవంతుని దర్శనం అవుతుందన్నారు. నారద మునీంద్రులవారు కూడా అదే అని తారకమంత్రం ఉపదేశించారు. ధ్రువుడు, మార్కండేయుడు ఇంకా ఎందరెందరో అలాగే దర్శన భాగ్యం పొందారు. మరి తమరేమిటి అలా సెలవిస్తున్నారు?"

"వాళ్ళెవరో కానీ నిన్ను పిచ్చిపుల్లాయిని చేసి, తాటాకులు కట్టినట్లున్నారు. మనం చిన్నప్పుడు చెప్పుకొనే కాకమ్మ కథల్లో జంతువులు మాట్లాడుతాయి. నిజంగా అవి మాట్లాడుకోవడం ఎప్పుడైనా విన్నామా? కన్నామా?

ఆయనెవరో చెప్పిన కథల్లోనివన్నీ సత్యాలుగా నమ్మి ఇలా వీధిన పడ్డావా?" సుబ్బారాయుడ్ని జాలిగా చూస్తూ అన్నాడు చలపతి.

సుబ్బారాయుడికి చలపతి మాటలు నమ్మాలో, నమ్మకూడదో అర్థం కాలేదు. మెల్లిగా అడిగాడు. జుట్టు అట్టలుకట్టిపోయి, తపోసంపన్నులకు ఉన్నట్లే ఉందే?"

"ఓ అదా! వళ్ళలవకుండా ముప్పొద్దులా నోట్లోకి ఐదు వేళ్ళూ వెళ్ళాలంటే ఏదో వేషం కట్టద్దూ? అయినా నీలాంటి వాళ్ళున్నంతకాలం మా బాగోగులకు దిగుల్లేదులే! అయినా, కోటి విద్యలు కూటి కొరకే నన్నది జగమెరిగిన సత్యమేగా!"

సుబ్బారాయుడికి చలపతి పట్ల భక్తి ముందే పోయింది. భయం ఇప్పుడు పోయింది. చలపతిని పైనుంచి కిందికి చూశాడు. అతడి శరీరపు నిగారింపు గమనించాక, అతను చెప్పేది నిజమనిపించింది. వండుకు తిన్నమ్మది ఒక్కకూరే అయితే, అడుక్కుతిన్నమ్మది ఐదు కూరలు అని ఊరికే అన్నారా? పెద్ద ముండావాళ్ళు! చక్రపొంగలి, దధోజనాలు, పులిహోర్లు తిని నునుపు తేలినట్లున్నాడు. ఏమైనా గానీ, చలపతి నిజాయితీ పట్ల సుబ్బారాయుడికి మరింత నమ్మకం పెరిగింది.
"నువ్వు నన్ను మాటల్లో పెట్టి నా స్థలం ఆక్రమించాలని చూస్తున్నట్లున్నావు. అసలే ఇది అచ్చొచ్చిన స్థలం. ఆడ జనాలు వచ్చే సమయం అవుతోంది. మర్యాదగా నువ్విక్కడ నుంచి కదిలితే సంతోషిస్తాను" చలపతి కటువుగా అన్నాడు.

సుబ్బారాయుడు ఏమీ మాట్లాడకుండా అలాగే కూర్చుండిపోయాడు. చలపతి చేతిలోని ఇనుప చువ్వని అటూ ఇటూ ఆడిస్తూ సుబ్బారాయుడి వంక కోపంగా చూశాడు. "అమ్మ బాబయ్య, ఇంకాసేపుంటే ఇతను ఏం చేస్తాడో ఏమో?" సుబ్బారాయుడు ఇనుపచువ్వ వంకే చూస్తూ లేచి నిల్చున్నాడు. ఉత్తరీయాన్ని దులిపి, మడతపెట్టాడు. నారద మునీంద్రుడిచ్చిన కమండలం కన్పించలేదు. అటూ ఇటూ వెతికాడు.

"ఏంటీ వెతుకుతున్నావు?"
"కమండలం ఉండాలి".
" "చెంబు లాంటిది..." "అదేదో కానీ, ఓ చొట్టలు పడిన రేకు చెంబును మాత్రం చూశాను".
"ఎక్కడ?" . "ఏంటీ?" తీవ్రంగా అన్నాడు చలపతి.
"మెట్ల మీదే. నేను పైకెక్కి వస్తుంటే, అది దడదడ లాడించుకొంటూ దొర్లింది. ఎప్పుడైనా ఇళ్ళ పక్క వెళితే సాంబారు పోయించుకోను బాగుంటుందని నేను తీసుకొన్నాను" చలపతి జోలెలోంచి ఆ చెంబును తీశాడు.
"ఐతే ఇంద్రుడు కొండరాళ్ళను దొర్లించలేదన్నమాట!" అన్నాడు సుబ్బారాయుడు

"అబ్బే, ఏమీ లేదు. వెళుతున్నాను" సుబ్బారాయుడు ఆ చెంబును తీసుకొని అక్కడ నుంచి బయలుదేరాడు. చలపతి దృఢకాయం వంకా, చేతిలోని త్రిశూలం వంకా చూస్తూ మెట్ల దగ్గరికి వచ్చాడు.

సుబ్బారాయుడికి భోజనం వేళ కూడా మించిపోయిందని అప్పటికి జ్ఞాపకం వచ్చింది. అప్రయత్నంగా చూపు చేతిలోని కొబ్బరిచిప్ప మీద పడింది. చలపతితో మాటలలో పడి చేతిలో ఉన్న దీని సంగతే మరచిపోయాడు. నీరసంతో కళ్ళు తేలిపోతూంటే, మెట్ల మీద ఒక పక్కగా చతికిల పడ్డాడు. ఆకలి రుచెరుగదు అన్నట్లుగా ఆ కోతిపిల్ల గీకి, నాకి, కొరికి వదిలేసిన ఆ చిప్పలోని కొబ్బరిని ఆబగా తిన్నాడు.

కొబ్బరి తింటూ వుంటే సుబ్బారాయుడికి ఓ ఆలోచన తట్టింది. “ఇంద్రకీలాద్రి పర్వతశ్రేణి మంగళగిరిదాకా వ్యాపించి ఉన్నదని అయ్యవార్లంగారు చెప్పారుగా. అందులోనూ, ఇటు సీతానగరంలో స్వయాన శ్రీ హనుమంతులవారు విరాజిల్లి ఉన్నారు. ఆంజనేయుడు శివుని అంశే కదా! ఇక్కడ తపస్సు సాగడం లేదని తండ్రి ఈ భక్తపరమాణువును అక్కడికి రప్పించాలని సంకల్పించారేమో? మధ్యాహ్నం మహాప్రసాదాన్ని కోతిదూతతో పంపింది అందుకేనేమో? తానే మందబుద్ధియై దానిలోని అంతరార్థం ఆలస్యంగా గ్రహించానేమో”. మనసులోనే ఆ ఆ శంకరుడికి, అంజనీ పుత్రుడికి వందనాలర్పించాడు సుబ్బారాయుడు. నెమ్మదిగా లేచి, మెట్లు దిగడం ప్రారంభించాడు.

కాస్త దూరం దిగాక, సుబ్బారాయుడికి సీతానగరం ఎలా వెళ్ళడమా అని సందేహం వచ్చింది. “తన దగ్గర ఎర్ర ఏగానీ లేదు. కృష్ణ దాటాలంటే ఆ పడవ వానికి బేడనో, అణానో ముట్టజెప్పాలి. ఎండాకాలంలోనైతే ఆనకట్ట చివరి మెట్టు మీద ఎడ్ల బండ్లు కూడా వెళ్తాయట. ఓసారి తమ ఊళ్ళో పెదకామందుగారు ఏటి కవతలకి సవారి కట్టుకెళ్ళారట. వాళ్ళ కుర్రాడు బండిని పరిగెత్తించబోయి గాడి తప్పించాడట కూడాను. పోనీ ఈది వెళ్దామా అంటే, తన పొలానికి పక్కన పారుతున్న పంటకాలువ దాటడానికే, తాటి దుంగ వేసుకున్నాడు. ఎప్పుడైనా దిగువన దాటాల్సి వచ్చినా, నీళ్ళు నడుం దాకా కూడా రావు. ఇక ఈ పొంగి పొర్లుతున్న నదిని ఈదడం తన తరమా?

వసుదేవుడు చిన్నికృష్ణయ్యను ఎత్తుకొని, యశోదమ్మ దగ్గరికి వెళ్తుంటే యమున చీలి దారిచ్చిందట. ఆ అంతర్యామి తనను స్వయంగా రప్పించుకొంటున్నాడుగా? మరి తనకు ఈ కృష్ణ మాత్రం దారినీయదూ? సుబ్బారాయుడికి తన ఆలోచన మీద తనకే సిగ్గేసింది. ఎక్కడి ఆ కృష్ణపరమాత్మ? ఎక్కడి తను? సాపత్యం కోరుకోవడం తన పైత్యప్రకోపం కాక ఇంకేమిటి? రైలువంతెన మీదుగా రెండు వైపులా కాలి బాట ఉందని విన్నాడు. తానెప్పుడు ఎక్కలేదు. పైన నడుస్తున్నప్పుడు రైలు వస్తే భలేగా ఉంటుందట. క్రింద కృష్ణమ్మ, మధ్య దడదడ లాడిస్తూ రైలుబండి. పైన ఆ వేగానికి ఊగిసలాడుతూ నడవడమంటే ఓ గమ్మత్తైన అనుభవం కదూ? కానీ, పిల్లల్ని ఎత్తుకొని నడవడం చాలా కష్టమట. ఆ దారిగుండా వెళితేనే సబబు. నయా పైసా ఖర్చు లేకుండా తిన్నగా సీతానగరం చేరుకోవచ్చు. సుబ్బరాయుడు తన ఆలోచనలలో తానుండగానే క్రిందికి చేరుకున్నాడు.
సుబ్బారాయుడు కృష్ణకు దారితీసే రోడ్డు పట్టాడు. పట్టుమని పది బారలు నడిచాడో లేదో, రోడ్డు పక్కగా గుమిగూడి ఉండడం కనిపించింది. సుబ్బారాయుడు కుతూహలంగా అటు వెళ్ళాడు. చిన్నగా సందు చేసుకొని, గుంపు లోపలికి చూశాడు. ఎవరో వ్యక్తిని వంగదీసి, దభీదభీ బాదుతున్నాడు ఓ పోలీసాయన.

సుబ్బారాయుడు పోలీసువాళ్ళని బజారు కూడలిలో నిలబడి ఉండటం చాలామార్లు చూశాడు. వాళ్ళు చేతులు అటూ ఇటూ ఊపుతూ, ఈలలు వేస్తూ సృష్టించే హడావుడి గమ్మత్తుగా అన్పించి, చాలాసేపు చూస్తూ నిల్చున్నాడు. ఇలా మనుషుల్ని వంగదీసి, చావబాదడం ఇదే మొదటిసారిగా చూస్తున్నాడు. సుబ్బారాయుడి ఆసక్తి మరింత పెరిగింది. ధైర్యం చేసి మెల్లిగా పక్కమనిషిని అడిగాడు - "అతడిని ఎందుకు కొడుతున్నారు?”.

“ఏముందీ? గుర్రమెక్కి గురువుగారి జేబు సవరించాడట. గురువుగారు ఆయన వళ్ళు సవరిస్తున్నారు!” అల్లరిగా నవ్వుతూ అన్నాడతను.

సుబ్బారాయుడికి అర్థం కావడానికి కాసేపు పట్టింది. సుబ్బారాయుడు అక్కడే నిలుచుండి పోయాడు. 'ఎవరోగానీ ఎంత పని చేశాడూ? పట్టపగలు నడిబజార్లో పోలీసాయన జేబే కొట్టేయడమా? దేహశుద్ధి బాగానే చేస్తున్నారులే. ఇటువంటి దొంగ వెధవలకి ఇంకోసారి చెయ్యాడించకుండా ఇలాగే తిక్క కుదర్చాలి'. కాసేపటికి ఎవరిపాటికి వాళ్ళు వెళ్ళిపోయారు. పోలీసాయన కూడా వెళ్ళి రోడ్డు మధ్యలో నిలబడి, చెయ్యి అటూ ఇటూ ఆడిస్తున్నాడు. సుబ్బారాయుడు ముందుకు కదిలాడు.

దెబ్బలు తిన్న వ్యక్తి లేచి నిల్చున్నాడు. అతన్ని చూచి సుబ్బారాయుడు విస్తుపోయాడు. ఆయన సాక్షాత్తు నారద మునీంద్రులవారు!
“స్వామీ” అంటూ సుబ్బారాయుడు గబుక్కున అతని దగ్గరకు వెళ్ళాడు. దెబ్బలు ఎక్కువగా తగిలాయేమో నిలబడలేక తూలిపడ్డాడు రామయోగి. సుబ్బారాయుడు చేయూతనిచ్చి, ఓ పక్కగా కూర్చోబెట్టాడు.

"స్వామీ! ఏమిటిదంతా?" ఆందోళనగా అడిగాడు సుబ్బారాయుడు. రామయోగి సుబ్బారాయుడి మాటలు పట్టించుకోకుండా పోలీసు వైపు చూశాడు. పోలీసాయన తీక్షణంగా చూస్తూ, లాఠీ ఊపాడు.
“నారద మునీంద్రా!” సుబ్బారాయుడు మళ్ళీ గట్టిగా పిలిచాడు.

"గట్టిగా అరవమాకురా నాయనా!" ఇప్పటికే వొళ్ళు హూనం అయ్యింది. అంత డబ్బు ఒక్కసారిగా చేతిలో పడడంతో గంజాయి కొట్టు దగ్గర కాస్త కక్కుర్తి పడ్డాను. ఇదుగో ఈ రూపాయి పావలా మిగిలింది. తీసుకొని నన్నొదిలేసి వెళ్ళు!" రొంటిన దోపుకుని వున్న డబ్బు తీసి సుబ్బారాయుడి చేతికిచ్చాడు రామయోగి.

సుబ్బారాయుడు చేతిలో డబ్బును ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు, “ఎందుకు స్వామీ ఇది నాకు? సీతానగరం తపస్సు చేసుకోవడానికి వెళుతున్నాను. తపస్సు చేసుకొనే వాడికి ధనమోహం ఉండకూడదని చెప్పారుగా స్వామీ? అయినా మనలో మాట, మీకు సురాపానం కొత్తేమీ కాదుగా. మరి ఈ వైపరిత్యమేమిటి మునీంద్రా?”
"బాబ్బాబు నీకు పుణ్యముంటుంది. ఇంకోసారి అలా పిలవమాకురా. బుద్ధి గడ్డితిని నాలుక చివర్నించి నాలుగు మాటలు జార్చాను. ఇప్పటికి నాకు జరిగిన శాస్తి చాలుకానీ, ముందు నువ్వు నన్నొదిలేసి ఇక్కడ్నించి వెళ్ళిపో! ఆ పోలీసు వెధవ మళ్ళీ వచ్చాడంటే లేనిపోని గొడవ” రామయోగి ముక్కుతూ, మూలుగుతూ అన్నాడు.

సుబ్బారాయుడు మాట్లాడకుండా నిల్చున్నాడు. సుబ్బారాయుడు కదలకపోవడం గమనించి, రామయోగి ఓపిక తెచ్చుకొని, తానే అక్కణ్ణించి కదిలాడు. సుబ్బారాయుడు వెళ్తున్న రామయోగినే చూస్తూ నిల్చుండిపోయాడు.
ఇటు సీతానగరం. అటు రైల్వేస్టేషను. ఎటు వెళ్ళాలో తేల్చుకోలేక, అక్కడే వుండిపాయాడు సుబ్బారాయుడు. చలపతి మాటలు, రామయోగి మాటలు అతడిని అయోమయంలో పడేసాయి. ఆయన పరమేశ్వరుడు కాడు. ఈయన నారద మునీంద్రుడు కాడు. ఇద్దరూ తనను వెర్రి వెంగళాయి కింద జమకట్టారా? అయ్యవార్లంగారు మాటలు నమ్మి గొడ్డుగోదను, పొలంపుట్రను వదిలివచ్చాడు. నాలుగెకరాల కొండ్రను కట్టుబడి చెయ్యాలి. విరాట్టు పున్నానికి బుడ్డవాడిని పెట్టుకుందామను కున్నాడు. ఇంటిది పాడి విషయం తప్ప వ్యవసాయం మాటే ఎరుగదు.

అల్లుడు ఇక్కడికి వచ్చి వుండేవాడు కాదు. ఇంటి దానికి అతని కన్నా బెట్టు. బంగారం లాంటి పొలం. మొనగాడి పొలం. తన కష్టార్జితం. ఏ మగతా వాళ్ళ చేతిలోనో పడితే..? తిరిగి ఇంటికి ఏమని వెళ్ళ గలడు? అయినా, అయ్యవార్లంగారు చెప్పిన పురాణాలన్ని, ఆ చలపతి కాకమ్మ కథలన్నాడు. నమ్మశక్యం కావట్లేదు. రామయోగి సంగతి అటుంచితే, ఈ చలపతి తనను తప్పుదోవ పట్టిస్తున్నాడేమో? అయినా ఆయనకా అవసరం ఏముంది?" సుబ్బారాయుడి ఆలోచనలను ఎంతకి తెగడం లేదు.

సుబ్బారాయుడి భుజం మీద ఎవరో బలంగా చరిచారు. సుబ్బారాయుడు ఉలిక్కిపడి, వెనక్కి తిరిగాడు. కోటయ్య బావ.

"సుబ్బారాయుడు బావా, ఇక్కడున్నావేమిటి?" సుబ్బారాయుడు సమధానమిచ్చేలోగా అతనే అన్నాడు.
“నువ్వు మొన్ననగా అమ్మాయి నోములకి బట్టలు తెస్తానని గుడివాడ వచ్చావటగా! ఏదో కాస్త కినిసి పడుకున్నందుకు చెప్పాపెట్టకుండా వచ్చేసావని అక్కయ్య మనసు కష్టపెట్టుకుంది. అయినా, నీవు గుడివాడ నుంచి బెజవాడ ఎప్పుడు వచ్చావు?

“నేను గుడివాడ వచ్చానని నీకెవరు చెప్పారు?" ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారాయుడు. ముందుకు దారితీస్తూ అన్నాడు కోటయ్య. “చెరువులో చేపల్ని ఎవరో దొంగతనంగా పట్టుకెళ్తున్నారని తెలిసి, మనకుర్రాళ్ళని కొందరిని కాపలా పెట్టారుగా, నీకు తెలిదూ?"
ఎలా తెలుస్తుంది? ఈ మధ్యన పొలం నుంచి రాగానే తిన్నగా పురాణం వింటానికి వెళ్తున్నాడుగా! ఇలా వూర్లో మంచి చెడూ పట్టించుకున్నది ఎక్కడ? గొణుక్కున్నాడు సుబ్బారాయుడు.

“ఆ కుర్రాళ్ళు నిన్ను చూసారట. మాలపల్లి గుండా వెళ్ళి జనరల్ రోడ్డులో బస్సెక్కావటగా? నిన్ను పోల్చుకొని వాళ్ళు వెనక్కి తగ్గారట. మర్నాడు ఉదయం సందువా పెట్టేలో డబ్బు కూడా లేకపోవడం చూసిందట అక్కయ్య. నీవు అమ్మాయి నోములకు అర నవర్సు బంగారము, బట్టలు కొనాలని అనుకుంటున్నావటగా? అవి తీసుకురాను మొదటి బస్సుకు వెళ్లావేమో అనుకుంటున్నాం.”

'ఇంకా నయం. దొంగననుకొని బాదలేదు. ఆ కుర్రాళ్ళు మాలపల్లిలో ఊరకుక్కలు మీద పడబోతే తను కాలికి బుద్ధి చెప్పడం చూసే వుంటారుగా? పిరికి పందననుకొన్నారేమో? ఆ.. చూస్తే చూసార్లే!
తనను గుర్తుపట్టి వాళ్ళు వెనక్కు తగ్గడం ఒకందుకు మంచిదే అయింది. లేకపోతే, ఇంత బతుకు బతికి, ఇంటెనక చచ్చినట్లు, తమ ఊరి కుర్రనాయాళ్ళ చేతికి దొంగపీనుగులా పట్టుబడేవాడు.' సుబ్బారాయుడు పైకి మౌనంగా వున్నాడు.

కోటయ్య మాట్టాడుతూనే కాఫీ హోటలుకు దారి తీసాడు. కాఫీ హోటలు యజమానిని చూసి సుబ్బారాయుడు వెనకడుగు వేసాడు. రాత్రి ఈ అయ్యరే మిగిలిన ఉప్మాను, వడలను బిచ్చగాళ్ళకు వేస్తుంటే, తనూ వారితో పాటు ఒడిపట్టడం జ్ఞాపకం వచ్చింది. అయ్యరు ముందుగా హోటలులోకి వెళ్ళడానికి సిగ్గుపడ్డాడు. రాత్రి ఈ అభిమానమంతా ఎటు పోయిందో కాని, ఇప్పుడు కాలు ముందుకు పడడం లేదు.

"ఏం బావా? అక్కడే ఆగావు? ఓ చుక్క కాఫీ పడితే కాని బండి కదలదు. ససేమిరా అంటోంది. త్వరగా రా!" కోటయ్య సుబ్బారాయుడి జబ్బపట్టి లాక్కెళ్ళాడు. హోటలు లోంచి వస్తున్న కమ్మని వాసనలు సుబ్బారాయుడి సంశయాన్ని పక్కకు నెట్టేసాయి. లోపలకి వెళ్ళి స్థలం చూసుకుని కూర్చున్నారు.

రకరాకాల టిఫిన్లు, కాఫీల గుబాళింపులను కలబోసిన ఒక వింతైన వాసన హోటలంతా వ్యాపించి వుంది. సుబ్బారాయుడి ఆకలి పొద్దుట్నించి ఎటు పోయిందో కాని, అకస్మాత్తుగా ప్రత్యక్షమై సుబ్బారాయుడిని తొందర చేస్తోంది. 'చేతిలో వున్న రూపాయి పావలాతో కడుపు నింపు కుంటే ఊరు చేరడం కల్ల.'

సుబ్బారాయుడి తటపటాయింపు గమనించి కోటయ్య అన్నాడు, "ఏంటి బావా మాట్లాడవు? ఏవేం తినాలనుందో చెప్పు. ఎప్పుడు తిన్నావో ఏమో? ముఖం చూడు ఎలా పీక్కు పోయిందో? నా దగ్గర కూడా అంత మొహమాటమయితే ఎట్లా బావా?"

సుబ్బారాయుడు మౌనంగా కూర్చున్నాడు. అయ్యరు వచ్చి ఏవేవో వడ్డించి వెళ్ళాడు, సుబ్బారాయుడు చుట్టు పక్కల చూడకుండా ప్లేటు మీద పడ్డాడు. సుబ్బారాయుడు ఏనాడు స్వర్గం ఎరగక పోయినా, ఈ రోజు అమృతాన్ని రుచి చూసాడు.

*ఆ రోజు తెల్లారగట్టే మీ అల్లుడు వచ్చాడు. మీ అమ్మాయికి మూడో నెలట. విషయం నీతో చెప్పి, పొద్దెక్కక ముందే వాళ్ళూరికి తిరిగి వెళదామని చూసాడు. అదుగో, అప్పుడే ఆ కుర్రాళ్ళు కలిసి నీ సంగతి చెప్పారుట."
మీ అమ్మాయికి మూడోనెలట... ఆ తరువాత కోటయ్య మాటలేవీ సుబ్బారాయుడి చెవిన పడలేదు. సుబ్బారాయుడి ముఖం విప్పారింది. 'తను తాతయ్య కాబోతున్నాడు. అమ్మాయికి నూడిదలు, శ్రీమంతాలు, పురుళ్ళు, బారసాలలు. ఇక ఇల్లంతా సందడే సందడి! పసివాడి కేరింతలతో ఇల్లు కళకళ లాడి పోదూ? మాగాణిలో మాసూలు అవగానే, మనవడికి వెండి ఉగ్గుగిన్నె కొనాలి.' అంతలోనే సుబ్బారాయుడి ముఖం ముడుచుకు పోయింది. 'ఏ ముఖం పెట్టుకొని కూతురికి ముచ్చట్లు చేయగలడు? తగుదునమ్మా అని అర్ధరాత్రి ఇల్లొదిలి బయలుదేరాడు. ఇంటిది 'తీరిందా బులపాటం' అని విరుచుకు పడదూ?'

"ఏంటి బావా? తినడం మానేసి ఆలోచిస్తున్నావు? పెసరట్టు ఇంకోటి తెప్పించమంటావా?" "వద్దు, వద్దు, ముందు వీటన్నిటి సంగతి అవనీ. మీ అక్కయ్య ఏమంటోంది?" ఏమంటుంది? పాతికేళ్ళ కాపురంలో ఇట్లా చెప్పా పెట్టకుండా ఏ పని చెయ్యలేదు. అసలు ఆ తగలబడ్డ పురాణాలు వింటున్నప్పటి నుంచే మనిషి ఇల్లూ వాకిలి పట్టించు కోకుండా, అదో మాదిరిగా అయిపోయాడు అంది."
"ఊ" సుబ్బారాయుడు ప్లేట్లోని ఇడ్లిని నోట్లో పెట్టుకున్నాడు.

"రేపు తిరిగొచ్చాక నిలదీస్తే ఆ నలుడు దమయంతిని సగం చీరతో, అర్ధరాత్రి అడవిలో వదిలి వెళ్ళలా? హరిశ్చంద్రుడు చంద్రమతిని నడిబజార్లో ఓ అగంతకునికి అమ్మి వెళ్ళలా? నిండుచూలాలైన సీతమ్మను ధర్మ ప్రభువు నట్టడవిలో వదిలి పెట్టించ లేదూ? ఆ పతివ్రతా శిరోమణులందరి ముందు నీవెంతటి దానివి. అంటాడు," అంది.

సుబ్బారాయుడి గొంతులో ఇడ్లిముక్క అడ్డం పడింది. కళ్ళల్లోకి నీళ్ళూరాయి. సుబ్బారాయుడికి కాస్త నెమ్మదించాక కోటయ్య కొనసాగించాడు.

"మీ అల్లుడు తనతో రమ్మంటే ఏమనిందో తెలుసా?"
"ఏమనింది?"
"మీ మామయ్య మన గోడు పట్టించుకోకుండా, ఆ అయ్యవార్లంగారు చెప్పే కట్టుకథల్ని గట్టిగా పట్టుకుని వేళ్లాడుతున్నాడు. ఎప్పుడో ఆ పుక్కిటి పురాణాల మీద మోజు పుటుక్కున తెగితే కాని, మనుషుల్లో పడడు. మన ధోరణిలోకి రాడు. అప్పటి దాకా ఈ గొడ్డు గోదా, పొలము పుట్ర గాలికి, ధూళికి వదిలేసి ఎలా రమ్మంటావు? ఎవరో ఒకరం చూసుకోవాలిగా? నా వంట్లో ఓపికున్నంత వరకు ఫరవాలేదు. ఆ తరువాత ఆలోచిద్దాంలే అని తేల్చి చెప్పేసింది."
"ఇంటిది అంత మాత్రపుదే, అసాధ్యురాలు." మనసులోనే అనుకొన్నాడు సుబ్బారాయుడు.

"అన్నట్టు బావా, మీ దాయాదులంతా ఆ రోజు మునిమాపు వేళకి మీ ఇంటికి చేరారు. అందరూ అక్కయ్యను అల్లుడితో వెళ్ళమని వత్తిడి చేసారు. అక్కయ్య ససేమిరా వెళ్ళనందనుకో. ఆ కృష్ణారాయుడు ఏమన్నాడో తెలుసా?

"ఏవన్నాడేమిటి?" ప్రశ్నించాడు సుబ్బారాయుడు.
"మన చుట్టు పక్కల పల్లెల్లో నీ వయసువాళ్ళే కొంత మంది, ఈ పురాణాలు విని విని, సంసారం పై వైరాగ్యం పట్టి దేశం పట్టి పోయారట. నీవూ అలాగే వెళ్ళంటావు. ఇక తిరిగి వస్తావని నమ్మకం పెట్టుకోవద్దని అన్నాడు."

"ఆరి వీడి తస్సాదియ్యా? అంతమాటన్నాడూ?" అప్రయత్నంగా అన్నాడు సుబ్బారాయుడు. కాని అంతలోనే తాను చేయబోయిన ఘనకార్యం అదేనని జ్ఞాపకం వచ్చింది. మౌనంగా వుండి పోయాడు. కోటయ్య కొనసాగించాడు.
"అక్కయ్య మాత్రం వూరుకుందా ఏమిటి? ఆ పుట్టే వైరాగ్యమేదో ఆ నిప్పులు బడ్డ పురాణం మీద పట్టి చావచ్చుగా? కొంపలు కొల్లేరు చేసుకొని ఏం ఉద్ధరిద్దామని? అంటూ విరుచుకు పడింది."

సుబ్బారాయుడు కాఫీని ఒక్క గుక్కలో తాగాడు. కోటయ్య జేబులోంచి డబ్బులు తీసి జాగ్రత్తగా లెక్కబెట్టి అయ్యరు చేతికిచ్చాడు. అయ్యరు తనను చూస్తాడన్న బిడియం సుబ్బారాయుడిలో మాయమయింది. కోటయ్య వెనకే బయటకు నడిచాడు.

"ఆ కృష్ణారాయుడు ఇంకేమన్నాడు?" "అన్నట్టు బావా, నీకీ సంగతి తెలుసా?" "ఏ సంగతి?"

"మీ నాలుగెకరాలు మాగాణిని తను సాగు చేసుకొంటానన్నాడు. 'ఎప్పుడైనా డబ్బుసాయం కావాలంటే చేస్తాలే! ఎలాగు అమ్మాయి పెళ్ళి అయిపోయింది. అల్లుడా ఈ ఊరికి వచ్చి వ్యవసాయం సంగతి పట్టించుకొనే వాడుకాడు. ఆడదానివి నీకెందుకు వదినా కష్టం? కూతురింట్లో మనవళ్ళని, మనవరాళ్ళని చూసుకుంటూ, హాయిగా, కృష్ణారామా అనుకోక?" అన్నాడు."

“ఎన్నాళ్ళుగా కన్నువేసాడో దొంగపీనుగ! అయినా ఊరికే అన్నారా, అన్నదమ్ములు చావుకోరితే, బావమరిది బతుకు కోరతాడని! తనున్నప్పుడు కన్నెత్తి చూడనివాడు, ఇప్పుడు ఏకంగా పొలం సాగు చేసుకోను తయారయ్యాడు?" సుబ్బారాయుడికి చిర్రెత్తు కొచ్చింది.

“ఆ... అక్కయ్య ఎడా పెడా వాయించిందిలే! అమ్మాయికి పెళ్ళయితే నేమి? పురుళ్ళకు, పుణ్యాలకు పుట్టిల్లనేది వుండదూ? అయినా మీ అన్నయ్య అంత తెలివితక్కువగా దేశం పట్టి పోతాడా? నా మీద అలిగో, ఇంకెందుకో నాల్రోజులు. అలా వెళ్ళాడనుకో. అంతమాత్రానికే తిరిగిరాడని ఎలా చెప్తావు? వెళ్ళిన వాడు రాకపోతాడా? అని నిలదీసింది.”
సుబ్బారాయుడు భుజాలు తడుము కున్నాడు. కోటయ్య మాట్లాడుతూనే ముందుకు దారి తీసాడు. సుబ్బారాయుడు మంత్రముగ్ధుడిలా అతడిని అనుసరించాడు.

“అదే, మన పెదకామందుగారి ఆఖరి అమ్మాయి లేదు?”

“మా అమ్మాయి వయసుదే కదూ? పెళ్లయి ఇంకా కాపురానికి కూడా వెళ్ళినట్లు లేదు. అప్పుడుప్పుడు పురాణానికి వచ్చేదిలే. ఏంటి విషయం?”
“అలవాటు ప్రకారం ఆ అమ్మాయి పురాణం వినడానికి వెళ్ళిందట. అయ్యవార్లంగారు పురాణం అయ్యాక ప్రసాదం, పట్టుకెళ్తువు వుండమన్నాడట. సర్లెమ్మని ఆగిందట. అందర్ని కాస్త కనుమరుగవ్వ నిచ్చి ఆ అమ్మాయి చేయిపట్టుకున్నాడట.".
"ఆర్నీ.... వాడికి అదేం పొయ్యేకాలం?" సుబ్బారాయుడు కళ్ళు వెడల్పు చేసి అన్నాడు.

"ఆ అమ్మాయి అరిచి గగ్గోలు పెడుతోంటే, ముందెళ్తున్న వాళ్లు వెనక్కి తిరిగారట. పెద్ద మనిషివై వుండి ఏంటయ్యా ఈపని? అని నిలదీసారట. సాక్షాత్తు ఆ స్వర్గాధిపతిభర్తలేని సమయంలో అహల్యను కూడలేదా?
నేను చేయాలనుకొంటే తప్పెలా అయ్యింది? అని ఎదురు ప్రశ్నించాడట. మా ఇంటిది కూడా వెళ్ళిందిలే. ఈ విషయాలన్ని తనే చెప్పింది.”
సుబ్బారాయుడు నివ్వెర పోయాడు. నోరు ఆశ్చర్యంతో కొద్దిగా తెరుచుకుంది.

“ఆడపిల్ల చేయి పట్టుకుంది కాక కాకమ్మ కబుర్లు చెప్తావంటరా అని నలుగురూ నాలుగు బాదబోయే సరికి, 'నేను శాపం వేసానంటే ఒక్కడికి పుట్ట గతులు ఉండవు జాగ్రత్త' అని బెదిరించాడట”.

“అమ్మో” సుబ్బారాయుడి చేతులు అప్రయత్నంగా గుండెల మీదికి వెళ్ళాయి.

“కాని, పెదకామందుగారి మనుషులు ఊరుకుంటారా? అయ్యవార్లంగారి వంటి మీద కర్రలు తిరగేసారు.”
సుబ్బారాయుడి మనసులో అయ్యవార్లంగారు పురాణాలు చెప్పేటప్పుడు గమ్మత్తుగా కళ్ళు ఎగరవేయడం, తలతిప్పడం, బారలు చాచడం మెదిలింది.

"మరప్పుడు అయ్యవార్లంగారు శపించలేదూ?" సుబ్బారాయుడు ఆత్రంగా ప్రశ్నించాడు.

"శాపమా? గాడిదగుడ్డా? పై పెచ్చు, ఇట్లాంటి పాడు పనులు ఇంకోసారి చెయ్యను మహా ప్రభో అంటూ గట్టిగా లెంపలేసుకొని, పెదకామందుగారి కాళ్ళ మీద పడ్డాడు. మూటా ముల్లె సర్దుకుని, తెల్లారే పాటికి పెళ్ళాం బిడ్డలతో ఊరొదిలి పారి పోయాడు."

సుబ్బారాయుడు ఆలోచనలో మునిగిపోయాడు. అయ్యవార్లంగారు, నారద మునీంద్రుడు, చలపతి ఒకరి తరువాత ఒకరు మనసులో మెదిలారు. ఇంటిది, అమ్మాయి, కోటయ్య వారిని మరుగు పరిచారు. తను చెమటోడ్చి సంపాదించుకున్న నాలుగెకరాల భూమి కళ్ళ ముందు కదలాడింది. కృష్ణారాయుడు వంకర నవ్వు నవ్వినట్లనిపించింది. బిగించిన గుప్పిట్లో రూపాయి పావలా గట్టిగా తగిలింది. సుబ్బారాయుడు నిశ్చితంగా నిట్టూర్చాడు. కోటయ్య వైపు తిరిగి అన్నాడు.

"బావా, మన వూరికి వెళ్ళే బస్సు ఎన్ని గంటలకి?" వీధుల్లోని ఎలక్ట్రిక్ దీపాలు ఒక్కసారిగ వెలిగాయి. కోటయ్య చిరునవ్వు నవ్వాడు.

సుబ్బారాయుడు, కోటయ్య దేదీప్యమానమైన రోడ్డు మీదుగా ముందుకు సాగారు.

(న్యూహ్యూమనిస్టు జనవరి, ఫిబ్రవరి, ఆగష్టు 1994 సంచికలలో ప్రచురణ.)